

॥ ఓం శ్రీ పరమాత్మనే నమః ॥ 2148

శ్రీ గురు చరిత్ర

(ఓవీ ఛందోబద్ధమైన మరాఠీ మూలమునకు
విధేయాత్మకమగు తెలుగు భావానువాదము)

श्री गुरुचरित्र (तेलुगु)

गीताप्रेस गोरखपुर
GITA PRESS, GORAKHPUR [SINCE 1923]

॥ ఓం శ్రీ పరమాత్మనే నమః ॥

2148

శ్రీ గురు చరిత్ర

(ఓవీ ఛందోబద్ధమైన మరాఠీ మూలమునకు విధేయాత్మకమగు తెలుగు భావానువాదము)

श्री गुरुचरित्र (तेलुगु)

(ओवी छन्दोबद्ध मराठी मूलका विधेयात्मक तेलुगु भाषाका भावानुवाद)

మరాఠీ మూలము

శ్రీగంగాధర సరస్వతి

అనువక్త

మదునూరి వేంకటరామశర్మ

ప్రకాశకులు
గీతాప్రెస్ - గోరఖ్‌పూర్

Books are also available at—

1. Gita Press, Gorakhpur Ki Pustak-Dukan,
   Dukan No. 41, 4-4-1, Dilshada Plaza,
   Sultan Bazar, Hyderabad ✆ (040) 24758311
   Mob. 9291205498, 9573650611
2. Secunderabad, Railway Station, Platform No. 1
   Mob. 9849276712

Sixth Reprint 2024 3,500
Total 19,000

❖ **Price : ₹ 250**
(Two Hundred and Fifty Rupees only)

कूरियर/डाकसे मँगवानेके लिये
गीताप्रेस, गोरखपुर—273005
www.gitapress.org
gitapressbookshop.in

Printed & Published by **:**

Gita Press, Gorakhpur
(a unit of Gobind Bhavan-Karyalaya, Kolkata)
Mob. No. : **+91-8188054403, 8188054408**
web : **gitapress.org** e-mail : **booksales@gitapress.org**

॥ శ్రీ దత్తాత్రేయాయ నమః ॥

ప్రకాశకుల విన్నపము

మహారాష్ట్ర ప్రాంతంలో ప్రత్యేకమైన గ్రంథరాజములతో కూడిన మూడు విధములైన సంప్రదాయములు గలవు. అందులో – వార్కరీ సంప్రదాయమునకు 'జ్ఞానేశ్వరీ' గ్రంథము, సమర్థ సంప్రదాయమునకు 'దాసబోధ' గ్రంథము, అట్లే దత్త సంప్రదాయమునకు 'శ్రీగురుచరిత్ర' నిత్య పారాయణ గ్రంథములుగా ఆదరింపబడుటయే గాక, అనుష్ఠింపబడుచున్నవి. ఈ మూడు గ్రంథములు మరాఠీభాషలోనే రచింపబడినవి. అవి కూడా ఓవీ అను ఛందోబద్ధములుగా వెలసినవి. అయితే, ఈ గ్రంథములు మొట్టమొదట లిఖితప్రతులుగా వుండేవి. పరంపరానుగతంగా ఎవరికివారు తమ స్వంత చేతులతో వ్రాసుకొని, పారాయణము చేసెడివారు. ఈవిధంగా వెలసిన వ్రాతప్రతుల వలన అనేక పాఠభేదములు చోటుచేసుకున్నవి. తత్ఫలితముగా మూలగ్రంథకర్తల ఆశయాలకు విఘాతము కలిగే ప్రమాదము కూడా ఏర్పడింది. ఇదేవిధంగా జ్ఞానేశ్వరి అనే గ్రంథంలో అనేక అపపాఠాలు చోటుచేసుకున్నవట. అయితే, శ్రీ జ్ఞానదేవమహారాజుగారు ఒకసారి శ్రీ ఏకనాథస్వామివారి స్వప్నంలో కనిపించి – "జ్ఞానేశ్వరిలో ఏర్పడిన అపపాఠాలన్నింటినీ తొలగించి, శుద్ధపాఠము సిద్ధము చేసి, భక్తులకు అందజేయవలసినది"ని కోరినారట. అందుకు సంతసించిన శ్రీ ఏకనాథులవారు జ్ఞానేశ్వరి యొక్క శుద్ధప్రతిని సిద్ధపరచి లోకానికి అందించినారు. ఇదేవిధంగా దత్త భక్తులందరికీ పరమ ఆదరణీయంగా వున్న 'గురుచరిత్ర'లో కూడా అనేక పాఠభేదములు ఏర్పడినవి. ఇందుకుగాను గురుభక్తపరాయణులైన శ్రీరామచంద్ర కృష్ణకామత్ గారికి గురువు యొక్క ఆదేశము లభించుటచే వారు అనేక గురుచరిత్ర లిఖిత ప్రతులను సంపాదించి, అవన్నింటినీ బాగుగా పరిశీలించి, పరిశోధించి ఒక శుద్ధప్రతిని సిద్ధపరచినారు. ప్రస్తుతం శ్రీకామత్ గారి ప్రతియే సర్వజనామోదంగా నిలిచి, దత్తభక్తులందరిచేత పరమప్రామాణికముగా ఆదరింపబడుచున్నది.

భారతదేశాన్ని యవనులు ఆక్రమించి పరిపాలిస్తున్న గడ్డుకాలమది. పరమతపాలనలో స్వధర్మానికి హాని కలుగుతున్న తరుణమది. ఇట్టి సంకట పరిస్థితులలో **'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం'** అని గీతలో చెప్పినట్లుగా అపర దత్తావతార వరిష్ఠులుగా శ్రీపాద శ్రీవల్లభులుగా ముందు అవతరించి తదనంతరం శ్రీనృసింహ సరస్వతీ స్వామివారుగా అవతరించినారు. శ్రీస్వాములవారు దేశమంతటా పర్యటించి, గురుతత్త్వాన్ని, గురుమహిమను, గురువైభవాన్ని ప్రత్యక్షంగా నిరూపించారు. ఈ గ్రంథంలో ముఖ్యంగా శ్రీపాదశ్రీవల్లభుల వారి చరిత్ర సంక్షిప్తంగా ఉల్లేఖింపబడియున్నది. ప్రధానంగా శ్రీనృసింహసరస్వతీ స్వామివారి చరిత్రము విస్తారంగా పేర్కొనబడియున్నది. అయితే, శ్రీనృసింహ సరస్వతీ స్వామివారే స్వయంగా శ్రీపాదవల్లభుల గురించిన చరిత్రను తమ ముఖ్య శిష్యులకు తెలిపినారని, ఆ వివరాలను వారు వ్రాసిపెట్టుటవలన శ్రీపాదవల్లభుల చరిత్ర ప్రస్తుత గురుచరిత్ర గ్రంథంలో సంక్షిప్తంగా పేర్కొనబడినదని కొందరు పండితుల, చరిత్రకారుల అభిప్రాయంగా తెలియుచున్నది.

బహమనీ వంశానికి చెందిన యవనరాజులు పరిపాలించిన 15వ శతాబ్ది కాలంలోనే శ్రీ గురునాథులు నృసింహసరస్వతీ స్వాములవారు అవతరించారు. వారి అవతార కార్యములన్నీ కృష్ణానదీ తీరము వెంబడి విస్తరించియున్నవి. బహమనీ, ఆదిల్షాహీ, కుతుబ్‌షాహీ వంటి కొందరు ముసల్మాను రాజులు శ్రీ గురునాథుని ఆదరించినారు. వారి శరణు గోరినారు. శ్రీగురుమూర్తి అనుగ్రహంచేత ఆ రాజులు తమ బాధలనుండి, దుఃఖాలనుండి విముక్తి పొందియున్నారని చారిత్రక దృష్టాంతములు ఋజువు చేయుచున్నవి.

సిద్ధముని నామధారక సంవాదరూపంగా శ్రీగురుచరిత్ర రచింపబడినది. ఈ సిద్ధముని శ్రీనృసింహసరస్వతీ స్వామివారికి మిక్కిలి సన్నిహిత శిష్యుడని గురుచరిత్ర గ్రంథంవల్లనే తేటపడుచున్నది. అయితే శ్రీగురుచరిత్రమును మొట్టమొదట సిద్ధమునీశ్వరునిచేత రచింపబడినదనీ, దానినే నామధారకునికి సిద్ధముని చూపించినట్లుగా గురుచరిత్ర మూడవ అధ్యాయంలోని, 38వ ఓవీలో గ్రంథకర్త స్వయంగా తెలిపినారు. అంతేగాక, క్రీ.శ. 1460 ప్రాంతంలో ఈ గురుచరిత్ర మొట్టమొదట సిద్ధముని ద్వారా సంక్షిప్తంగా సంస్కృతభాషలో వ్రాయబడినదని, 'మరాఠీ సారస్వతము' అనే గ్రంథంలో శ్రీవినాయక లక్ష్మణభావే గారు పేర్కొన్న మాటలు ఇచట గమనార్హములు. ఆ తరువాత "నామధారకుడు" అని తన పాత్రను ప్రకటించుకొన్న సరస్వతి- గంగాధర లేదా సరస్వతి అనే పేరుగల సాఖరే వంశమునకు చెందిన వ్యక్తి 7491 ఓవీలతో, మరాఠీభాషలో సుమారు క్రీ.శ. 1556 ప్రాంతంలో గురుచరిత్రను రచించి యుండవచ్చునని చరిత్రకారులు పేర్కొన్నారు.

శ్రీగురునాథునికి ముఖ్య శిష్యుడైన, సాఖరే వంశమునకు చెందిన సాయందేవుని వంశపరంపరలోని ఐదవ తరానికి చెందిన వాడే ఈ సరస్వతీ గంగాధరుడు. వీరు కన్నడ దేశస్థులు. సాయందేవుడు స్వయంగా శ్రీనృసింహ సరస్వతీ స్వామివారికి సేవా శుశ్రూషలు అందించిన అదృష్టవంతుడు. అతని కుమారుడే నాగనాథుడు. ఇతని పుత్రుడు దేవరావు. ఈతని కొడుకు గంగాధరుడు. ఈ గంగాధరుని కుమారుడే సరస్వతి. ఇతడే గంగాధరాత్మజుడనని, గంగాధర సరస్వతి యని తన పేరును చెప్పుకుని గురువాజ్ఞను తలదాల్చి మరాఠీభాషలో అమోఘమైన గురుచరిత్రమును రచించెను. నామధారకుడు అను పేరుతో ఒక జిజ్ఞాసువైన ఉత్తమ శిష్యునిగా పాత్రపోషణ చేసి గురుమూర్తికి ప్రత్యక్ష శిష్యుడైన సిద్ధమునీశ్వరునిచే శ్రీగురుచరిత్రమును శ్రవణము చేస్తూ, తన రచన సాగించెను. దానినే లోకమునకు వినిపించెను. సాయందేవుడు స్వయంగా గురుశుశ్రూష జేసి, గురుపరీక్షలో నెగ్గిన శిష్యుడిగా చరిత్రలో మనకు స్పష్టంగా తెలుస్తోంది. వంశపరంపరగా వీరందరు శ్రీగురునాథుని సేవించినవారే అగుటవలన శ్రీ స్వామివారి చరిత్ర అంశములు, అనేక ఘట్టములు, ఈ గంగాధర సరస్వతికి బోధపడినవని, గురుచరిత్ర ద్వారా మనకు స్పష్టంగా విదితమగుచున్నది. గొప్పనైన ఈ గ్రంథములో భగవత్తత్త్వము, గురుమహిమ, సనాతన వైదిక ధర్మములు, ఆచారములు అనేక శాస్త్ర విషయములు బహుచక్కగా వర్ణింపబడినవి. అయినప్పటికినీ ఈ గ్రంథకర్త తనకేమీ తెలియదని, మరాఠీ భాష కూడా రాదని, **'విద్యా దదాతి వినయం'** అన్నట్లు వినయపూర్వకమైన నిరహంకార భావమును ప్రకటించుట గమనించదగినది. (1వ అధ్యాయం 38వ ఓవీలో చూడుడు)

:: ప్రకాశకుల విన్నపము ::

శ్రీ రామచంద్ర కృష్ణ కామత్‌గారి ద్వారా సిద్ధపరచబడిన ప్రామాణిక పాఠమునే స్వీకరించి, మరాఠీ భాషలో ఓవీ ఛందోబద్ధమైన మూలగ్రంథము గీతాప్రెస్ ద్వారా ఇంతకుముందే ముద్రింపబడి, మరాఠీ భాషా పాఠకులకు అందించబడినది. అనంతరం తెలుగు భాషలో గీతాప్రెస్ ద్వారా శ్రీగురుచరిత్ర గ్రంథము రావలయునని దత్తభక్తులగు తెలుగు పాఠకులు ఎందరో కోరినారు. ఇంతవరకు తెలుగుభాషలో మేము వెలువరించిన మా గ్రంథములపట్ల సహృదయులగు తెలుగు పాఠకులు చూపుతున్న ఆదరాభిమానములకు మా ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు.

మేము కోరినదే తడవుగా మా మాటను మన్నించి, తమ అమూల్య సమయాన్ని కేటాయించి, ఇరువది రెండు సంవత్సరములుగా నిరంతరం గీతాప్రెస్‌కు తమ సేవలను అందిస్తున్న మా ఆత్మీయ బంధువగు **మదునూరి వెంకటరామశర్మ గారు** మాచే ప్రకటించబడిన మరాఠీ మూల గ్రంథమునే స్వీకరించి, విధేయాత్మకంగా సరళమైన తెలుగు భాషలో, భావ భక్తి బంధురముగా మధురమైన భావానువాదమును సిద్ధపరచి అందించినారు. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఇందులో వివిధ పారాయణ పద్ధతులు, నియమాలు, పూజాపద్ధతి, ప్రదక్షిణా విధానము, అవసరమైన ఇతర అంశములు అన్నింటినీ సంప్రదాయబద్ధముగా చేర్చబడినవి. అంతేగాక, గురుచరిత్ర పారాయణము ముగిసిన పిమ్మట పఠించవలసిన అవధూతోపాఖ్యానము, దత్తాత్రేయ, అవధూత ఉపనిషత్తులు, గురుగీత మూల శ్లోకములను కూడా పరిశిష్టమునందు చేర్చి ఈ గురుచరిత్ర గ్రంథమును బహుళప్రయోజనకారిగా తీర్చిదిద్దినందులకు శ్రీ శర్మగారికి మా ప్రత్యేక అభినందనలు. ఈ గ్రంథము తయారు చేయుటకు సహకరించిన వారందరికీ పేరుపేరున మా ప్రత్యేక ధన్యవాదములు.

మా విన్నపాన్ని మన్నించి (93 ఏండ్ల) వయోవృద్ధులు, జ్ఞానవృద్ధులు, పౌరాణిక సార్వభౌములుగా తెలుగునాట సుప్రసిద్ధులైన పూజ్యులు **బ్ర.శ్రీ. మల్లాది చంద్రశేఖరశాస్త్రి గారు** ఈ గురుచరిత్ర అనువాద గ్రంథాన్ని ఆసాంతం శ్రవణము చేసి ఆశీర్వాదపూర్వకంగా 'ఆముఖము'ను అనుగ్రహించినందున వారికి మా కృతజ్ఞతాపూర్వక అనేక నమస్కృతులు.

మా ప్రార్థన మన్నించి ఈ గ్రంథమును పూర్తిగా చదివి, తమ అమూల్యమైన 'స్వాదువాక్కు'లను ప్రసాదించిన వాగ్దేవీ వరపుత్రులు, సమన్వయ సరస్వతిగా వాసిగాంచిన **బ్ర.శ్రీ. సామవేదం షణ్ముఖశర్మగారికి** కృతజ్ఞతాభివందనములు.

చివరగా శ్రీదత్తాత్రేయ స్వామివారి స్వరూపాత్మకమైన గురుచరిత్ర గ్రంథమును శ్రీగురుకృపచే సర్వాంగ సుందరముగా సిద్ధపరచి, తెలుగు పాఠకలోకమునకు అందించనైనది.అభీష్టసిద్ధిని ప్రసాదించి, శ్రీదత్తభగవానుని కృపాపాత్రులను చేయగలిగే దివ్యమైన, అమోఘమైన ఈ గురుచరిత్ర గ్రంథరాజమును శ్రద్ధాభక్తులతో మీరు చదవండి. పదిమందితో చదివించండి. తద్వారా శ్రీదత్త కృపకు పాత్రులు కాగలరని మా ఆకాంక్ష....! శేషము భగవత్కృప.

జయ గురుదత్త! శ్రీ గురుదత్త!!

ప్రకాశకులు
గీతాప్రెస్, గోరఖ్‌పూర్

॥ శ్రీగురుశ్శరణం ॥

ఆముఖము

శ్లో॥ సర్వదేవ నమస్కారః సర్వయజ్ఞాః ప్రకీర్తితాః । ఏతత్సర్వం కృతం తేన 'దత్త' ఇత్యక్షరద్వయమ్ ॥

శ్రీదత్తాత్రేయ స్వామి త్రిమూర్త్యాత్మకుడు, సనాతనుడు. కలియుగంలో జీవులను ఉద్ధరించడానికి శ్రీపాదశ్రీవల్లభులుగా, శ్రీనరసింహ సరస్వతి స్వామి వారిగా అవతరించి భక్తులపాలిట కల్పతరువై అనేక దివ్యలీలలను ప్రదర్శించారు. శ్రీదత్తమూర్తి ప్రధానంగా జ్ఞానప్రదాత. జ్ఞానము, వైరాగ్యము కోరేవారు శ్రీదత్తప్రభువును ఉపాసిస్తారు. ఆయా పురాణ గ్రంథాలలో కార్తవీర్యార్జునుడు, ప్రహ్లాదుడు, అలర్కుడు, మదాలస మొదలగు ఎందరో భక్తులు శ్రీదత్తాత్రేయ స్వామి ద్వారా జ్ఞానబోధ పొంది తరించిన కథలు మనకు తెలియగలవు. ఈ కలియుగంలో జీవులను అనుగ్రహించి, ఉద్ధరించి వారి కామనలు నెరవేర్చడానికి స్వయంగా శ్రీదత్తప్రభువే శ్రీపాదశ్రీవల్లభులుగా, శ్రీనరసింహసరస్వతి స్వామిగా అవతరించి అనేకానేక లీలలు ప్రదర్శించి భక్తుల ఆర్తిని తొలగించి రక్షించారు. అట్టి స్వామి లీలలను సవిస్తరంగా వివరించిన పరమకథాకల్పతరువే 'శ్రీగురుచరిత్ర'. మరాఠీభాషలో శ్రీగంగాధర సరస్వతీ స్వామి వారు ఓవీ ఛందస్సులో జ్ఞాన–కర్మ–భక్తి అనే మూడు కాండలతో 52 అధ్యాయాలలో సర్వసమగ్రంగా శ్రీదత్తాత్రేయ గురులీలామృతాన్ని రచించారు. ఈ పరమపవిత్ర గ్రంథం మహామహిమాన్వితం. జగత్ప్రసిద్ధం. మా పెదనాయనగారు బ్ర.శ్రీ. మల్లాది వీరరాఘవ శాస్త్రి సోమయాజులుగారు చాలా ఏండ్ల క్రితం తెలుగు భాషలో మొట్టమొదటిసారిగా 1953లో 'శ్రీగురుగీతాసారము' అనే పేరుతో పారాయణ గ్రంథాన్ని శ్రీగురుదత్తుని ప్రేరణతో రచించి, తెలుగునాట శ్రీదత్తసంప్రదాయ ప్రవర్తకులైనారు. వారే అనంతరకాలంలో చిన్న పిల్లలు కూడా చదువుకొనుటకు వీలుగా 'లఘు గురుచరిత్ర'ను కూడా రచించినారు.

ప్రస్తుతం చిరంజీవి బ్ర.శ్రీ. **మదునూరి వేంకటరామశర్మగారు** మరాఠీలో శ్రీగంగాధరసరస్వతీ స్వామి రచించిన ఓవీ ఛందోబద్ధ శ్రీగురుచరిత్రను మూలవిధేయంగా తెలుగులోనికి భావానువాద రూపకంగా రచించియున్నారు. సాధారణంగా శ్రీగురుదత్తాత్రేయ స్వామిపై భక్తి కలుగుటయే పూర్వజన్మ సుకృత విశేషం. పైగా 'శ్రీగురుకథామృత కల్పతరువు' అనదగు మహిమాన్వితమైన శ్రీగురుచరిత్రను పారాయణయోగ్యంగా యథామాతృకంగా తెలుగులోనికి అనువాదం చేయగలగడం శ్రీ శర్మగారి పురాకృత విశేషపుణ్యఫలం. వీరి రచనాశైలి రమణీయమై, చదువుచున్న కొద్దీ ఆసక్తిని పెంచేవిధంగా వున్నది. ఎక్కడ కూడా భావగాంభీర్యత చెడకుండా, పూర్తిగా మూలభావ విధేయమై, గురుభక్తి ప్రేరకమై, గురుకటాక్ష సిద్ధికి సోపానసదృశంగా వున్నది. విశేషించి గ్రంథాదిలో 'శ్రీగురుచరిత్ర పారాయణ పద్ధతి' అనే శీర్షిక క్రింద పొందుపరచిన వివిధ పారాయణ పద్ధతులు,

పాటించవలసిన నియమాలు, పూజావిధానము, మున్నగునవి సమగ్రంగాను, సాధికారికంగాను వున్నవి. ఇది సాధకులకు చింతామణి వంటిది. ఈ వివరాలు ఈ గ్రంథ స్థాయిని మరింతగా పెంచినవి. ఈ విశేష వివరణ వీరి పరిశ్రమకు చక్కని ఉదాహరణగా చెప్పవచ్చును. ఈ గురుచరిత్ర అనువాద గ్రంథము విశేషించి గురుభక్తిని, సదాచార విధానాన్ని శ్రీదత్తాత్రేయ సమగ్ర స్వరూపాన్ని సాధికారికంగా వివరించినది. చదువరులను విశేషంగా ఆకట్టుకొని దత్తభక్తి ప్రోత్సాహకముగా శాశ్వతకీర్తి పొందుగాక అని ఆశీర్వదిస్తున్నాను.

'గీతాప్రెస్' తెలుగు ప్రచురణల ద్వారా మదునూరి వేంకటరామశర్మ గారు తెలుగు గ్రంథ అనువాదకులుగా, సంపాదకులుగా సుప్రసిద్ధులు.

కాగా, పరమపవిత్రమైన, గురుకటాక్షసిద్ధిదాయకమైన గురుచరిత్రను వీరి చేత అనువదింపజేసి, తెలుగు పాఠకులకు అందిస్తున్న గీతాప్రెస్ వారికి మా హృదయపూర్వక అభినందనలు....!

అంతేగాక, జ్ఞాన, కర్మ, భక్తి, వైరాగ్య ప్రబోధకములు, నిత్యపారాయణాత్మకములు అయిన అనేకానేక ఆర్ష గ్రంథములను తమ ప్రచురణలద్వారా తెలుగు పాఠకలోకానికి అందజేయుచున్న గీతాప్రెస్, గోరఖ్‌పూర్‌వారి సేవలు అమూల్యములు, అమోఘములు, అత్యంత శ్లాఘనీయములు.

జయ గురుదత్త! శ్రీ గురుదత్త!!

హేవళంబి మహాశివరాత్రి.
13.02.2018, మంగళవారము.

శ్రీ దత్తసేవలో....

బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి

అభినవవ్యాస, పౌరాణికసార్వభౌమ - సవ్యసాచి, మహామహోపాధ్యాయ,
శ్రీ శృంగేరి జగద్గురు మహాసంస్థానం మరియు
తిరుమల తిరుపతి దేవస్థానముల ఆస్థాన విద్వాంసులు.

◆ ◆ ◆

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

॥ శ్రీ దత్తాత్రేయాయ నమః ॥

స్వాదు వాక్కులు

శ్రీ దత్తాత్రేయ చరిత్ర బ్రహ్మాండ పురాణాంతర్గతంగా ప్రసిద్ధి చెంది 'దత్తపురాణం'గా పేరు పొందింది. ఆ దత్తతత్త్వం బ్రహ్మవిద్యా ప్రతిష్ఠకై శ్రీపాదవల్లభునిగా వ్యక్తమయింది. శ్రీదత్తారాధనా సంప్రదాయంలో 'గురుచరిత్ర' పారాయణం ప్రధానంగా ఉంది. వివిధ విధాలుగా ఈ గ్రంథాలు లభిస్తున్నా - సదాచార సత్సంప్రదాయ విరుద్ధంకాని, విశిష్ట గ్రంథాలు కొన్ని ఉన్నాయి. అలాంటి విశిష్ట గ్రంథమిది. మహారాష్ట్రలో దత్తానుష్ఠాన పరంపర శిష్ట సంప్రదాయపద్ధతిలో ప్రకృష్టంగా వ్యాప్తమై ఉంది. ఈ సంస్కృతిలో గొప్ప యోగుల, దత్తానుభవం కలిగినవారున్నారు. అటువంటివారు శ్రీ గంగాధర సరస్వతి. ఈ గ్రంథం జ్ఞాన, కర్మ, భక్తి కాండములనే విభాగంతో 52 అధ్యాయాలతో గ్రథితమైనది. మరాఠా భాషాగతమైన 'ఓవీ' ఛందస్సులో రచింపబడినది.

మహిమలో అద్భుతమైన ఈ గ్రంథరాజం - దత్తవైభవ విలసితం. పఠిత దత్తానుగ్రహం ద్వారా అభీష్టసిద్ధిని పొందడమేగాక, ఎంతో సనాతన ధర్మజ్ఞానాన్ని దీని ద్వారా పొందవచ్చు. వేదధర్ముల - దీపకుల గాథ ద్వారా గురుభక్త మహిమ వ్యక్తమౌతోంది. త్రిగుణాతీతుడైన బ్రహ్మజ్ఞుడు అత్రి, అసూయాది దోషరహితమైన బ్రహ్మవిద్యా రూపిణీ అనసూయ ద్వారా పొందిన (సంతానం) ఫలం శ్రీదత్తస్వామి. **"దత్తో మయాహమితి యద్భగవాన్ స దత్తః"** (భాగవతం) బ్రహ్మవిద్యాయుతుడైన, త్రిగుణాతీతునికే పరతత్త్వం తనంత తాను 'దత్త'మౌతుంది.

త్రిమూర్త్యాత్మక పరబ్రహ్మ స్వరూపుడు దత్తుడు. వారి స్వరూపమే శ్రీపాదశ్రీవల్లభులు. మరియు శ్రీనృసింహ సరస్వతీ స్వామివారు. వీరి గాథల ద్వారా భగవన్మహిమ తెలియడమే కాక, సాధకోపకారకమైన ఎన్నో విషయాలు ఇందులో పొందుపరచబడ్డాయి.

కాశీ - గోకర్ణాది తీర్థ మహిమలు; తీర్థయాత్రాది విధులు; ఏకాదశి, శివరాత్రి వంటి మహాపర్వాల విశిష్టతలు; కర్మవిపాక విజ్ఞానం; భస్మరుద్రాక్షల విశేషాలు; సదాచార నిరూపణం; రుద్రాధ్యాయ మహిమ; అనంతపద్మనాభ వ్రతం; అశ్వత్థ ఔదుంబరాది వృక్ష మాహాత్మ్యాలు.... ఇంకా ఎన్నెన్నో ఇలాంటి విలువైన అంశాలు ఈ సద్గ్రంథం ద్వారా లభిస్తున్నాయి.

పారాయణ-పూజా విధానాలతోపాటు అనుబంధంగా అందించిన గురుగీత, దత్తాత్రేయోపనిషత్, అవధూతోపాఖ్యానం, దత్తస్తవాలు - ఉపయుక్తమైనవి. **శ్రీమదునూరి వేంకటరామశర్మ** గారి తెలుగు మధురానువాదంతో అందిస్తున్న గీతాప్రెస్ వారికి వందనాలు.

తేది: 18-12-2017

వాగ్దేవీ వరపుత్ర, సమన్వయ సరస్వతి
బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ
వ్యవస్థాపక అధ్యక్షులు - మేనేజింగ్ ట్రస్టీ, ఋషిపీఠం చారిటబుల్ ట్రస్ట్,
సికింద్రాబాదు - తెలంగాణ రాష్ట్రం.

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

విషయానుక్రమణిక

క్రమ సం.	విషయము	పుట సంఖ్య
1.	ప్రకాశకుల విన్నపము	3
2.	ఆముఖము	6
3.	స్వాదువాక్కులు	8
4.	శ్రీ గురుచరిత్ర - పారాయణ పద్ధతి	13
5.	శ్రీ గురుచరిత్ర - పూజా విధి	18
6.	ఔదుంబర పాదుకా స్తోత్రమ్	27
7.	శ్రీ దత్తాత్రేయ ఆరతీ	28
8.	శ్రీ నృసింహ సరస్వతీ స్వామి హారతి	28
9.	నిత్య సంకల్ప విధానము	29
10.	పారాయణ ప్రారంభ శ్లోకములు	29
11.	శ్రీ దత్తాత్రేయ ఘోరకష్టోద్ధరణ స్తోత్రము	30
12.	నిత్యసమాప్తి సమయ సంకల్పము	31
13.	పారాయణ సమాపన శ్లోకములు	31
14.	శ్రీ దత్తాత్రేయ అపరాధ క్షమాపణ స్తోత్రము	32
15.	మాధూకరి విధానము	33
16.	శ్రీ దత్త ప్రదక్షిణా విధానము	34
17.	ప్రత్యేక కార్యసిద్ధికి అమోఘ శ్లోక మంత్రములు	36
18.	శ్రీ దత్తాభయ మంత్రమ్	38
19	శ్రీ పాదరాజాష్టకమ్	38
20.	శ్రీ నృసింహ సరస్వతీ అష్టకమ్	38
21.	శ్రీనరసింహ సరస్వతీ స్తోత్రమ్	40

అధ్యా. సం.	విషయము	పుట సంఖ్య

జ్ఞానకాండము

అధ్యా. సం.	విషయము	పుట సంఖ్య
1.	మంగళాచరణము - గ్రంథమాహాత్మ్యము-నామధారకుడు శ్రీగురు దర్శనార్థమై వెడలుట	41
2.	నామధారకునకు సిద్ధముని దర్శనమొసగుట - సిద్ధముని, నామధారక సంవాదము ప్రారంభమగుట-శ్రీగురుమహిమా వర్ణనము-నాలుగు యుగాలస్వరూపములు-వేదధర్ముడు - దీపకుడు అను గురుశిష్యుల ఆఖ్యానము	52
3.	సిద్ధముని వెంట నామధారకుడు గాణగాపురమును చేరుకొనుట - అంబరీషుని ఏకాదశీ వ్రత నిరూపణము	73
4.	సృష్టి పరిచయము - అనసూయ పాతివ్రత్యమహిమ - త్రిమూర్త్యవతారమగు శ్రీదత్తాత్రేయులు అవతరించుట	80
5.	భక్తురాలగు సుమతి కథ-శ్రీపాదశ్రీవల్లభులు అవతరించుట - తీర్థయాత్రాగమనము	88
6.	రావణుడు మహాదేవుని మెప్పించి ఆత్మలింగమునుపొందుట గోకర్ణమునందు మహాబలేశ్వర స్థాపనము - గోకర్ణక్షేత్ర మాహాత్మ్యము	96
7.	గోకర్ణ మహిమ - మిత్రసహుడను రాజుయొక్క బ్రహ్మహత్యా పాప నివృత్తి - శివరాత్రి మాహాత్మ్యము	111

★ దిగంబర దిగంబర శ్రీపాదవల్లభ దిగంబరా ★

అధ్యా. సం.	విషయము	పుట సంఖ్య
8.	శనిప్రదోషవ్రత మాహాత్మ్యము - మూర్ఖబ్రాహ్మణుని యెడల శ్రీగురుకృపా ప్రభావము	127
9.	రజక వరప్రదానము - శ్రీపాదశ్రీవల్లభుల నిజానందగమనము	138
10.	కురువపుర మహిమ - గురుభక్తి వర్ణనము - దుష్టశిక్షణ, శిష్ట రక్షణ	143
11.	నరహరి జననము - బాల్యలీలలు - ఉపనయనము- మూగ నరహరి చతుర్వేదములను పఠించుట	148
12.	బాలనరహరి తల్లి అనుమతితో కాశీక్షేత్రమున కేగుట- సన్న్యాసమును స్వీకరించుట - శ్రీనృసింహ సరస్వతిగా విరాజిల్లుట - గురు సంప్రదాయ నిరూపణము	158
13.	శ్రీగురుమూర్తి కారంజనగరమునకు చేరుకొనుట-గోదావరి ఉత్పత్తి కథనము - మాధవారణ్యునకు నృసింహరూపమున దర్శనమొసగుట - ఒక విప్రుని ఉదరశూల నిర్మూలనము	170
14.	క్రూరయవన శాసనము-సాయందేవునకు అభయదానము	185
15.	తీర్థయాత్రా నిరూపణము-శ్రీనృసింహ సరస్వతీస్వామివారు వైద్యనాథమునందు గుప్తముగ నుండుట	190
16.	శ్రీగురుసేవా మహత్త్వము - ధౌమ్యమునీశ్వరుని కథ - భిల్లవటీ గ్రామమునకు శ్రీగురునాథుల ఆగమనము	200
17.	భిల్లవటీ స్థాన మహిమా వర్ణనము - మందమతి యగు బ్రాహ్మణ బాలునకు విద్యాదానము	214
18.	నరసింహవాడి స్థాన మహిమ - అమరపురమునగల ఒక బ్రాహ్మణుని దారిద్ర్యబాధ హరింపబడుట	221
19.	ఔదుంబర మాహాత్మ్యము-యోగినీదేవతలు శ్రీగురుమూర్తిని సేవించుట-ఒక నావికునకు త్రిస్థలీ దర్శనము లభించుట- శ్రీగురునాథుడు గాణగాపురమునకు బయలుదేరుట	227
20.	ఔదుంబరపూజా ఫలితముగా విప్రవనితకు బ్రహ్మహత్యా పాపము నివృత్తి యగుట - ఆమెకు సంతానము కలుగుట - ఆకస్మికముగా ఒక పుత్రుడు మరణించుట- కన్నతల్లి శోకించుట	237
21.	పుత్రశోకమున మునిగిన కన్నతల్లికి తత్త్వోపదేశము చేయుట - మృతపుత్రుని జీవింప చేయుట- కలికల్పద్రుమమగు ఔదుంబరము మరియు శ్రీగురుపాదుకా మహిమా నిరూపణము	247
22.	గురుకృపవలన గొడ్డు బఱ్ఱె పాలను ఇచ్చుట - బ్రాహ్మణ దంపతుల దారిద్ర్యము నశించుట	255
23.	శ్రీగురుమూర్తి గాణగాపురమునందు ప్రవేశించుట-బ్రహ్మ రాక్షసుని ఉద్ధారము - మఠ నిర్మాణము	262
24.	గురునింద చేయుచున్న త్రివిక్రమభారతికి విశ్వరూప దర్శనము చేయించుట - అతని అహంకారమును హరించుట-త్రివిక్రమ భారతి శ్రీగురుమూర్తిని స్తుతించుట	*270*

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

కర్మకాండము

అధ్యా. సం.	విషయము	పుట సంఖ్య
25.	ధనాశతో ఇరువురు దుష్టవిప్రులు యవనరాజు ముందు వేదమును పఠించి సత్కారమును పొందుట - వారు త్రివిక్రమ భారతిని చేరి శాస్త్రార్థమును చేయుమని నిర్బంధించుట - త్రివిక్రమముని వారిని శ్రీగురునాథుని వద్దకు చేర్చుట	276
26.	శ్రీగురు నృసింహ సరస్వతీ స్వామివారి ద్వారా వేదవిస్తార కథనము	283
27.	శ్రీగురుడు మాతంగుడను వ్యక్తికి పూర్వజన్మ స్మృతిని ప్రసాదించుట - దుష్టవిప్రులను శపించుట - శాపవిముక్తిని అనుగ్రహించుట	296
28.	కర్మవిపాక నిరూపణము - జ్ఞానిగా మారిన పతితుడు పూర్వస్వరూపమును పొందుట	301
29.	భస్మధారణ మాహాత్మ్యము - వామదేవుని వలన బ్రహ్మరాక్షసుని ఉద్ధారము	316
30.	శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి మహిమా ప్రాభవము- భర్త మృతిపట్ల పతివ్రతా స్త్రీ శోకించుట - ఒక సాధువు ఆమెను ఓదార్చి, తత్త్వోపదేశము చేయుట	333
31.	లోకరక్షణకై దేవేంద్రుడు కాశీలోగల అగస్త్యమహర్షిని చేరుట- పతివ్రతా శిరోమణియగు లోపాముద్రను గూర్చి దేవగురువు ప్రస్తుతించుట - పతివ్రతా ధర్మములను వివరించుట	346
32.	వితంతు ధర్మములు - విప్రవనిత సహగమనమునకు సిద్ధపడుట - యోగీశ్వరుడు రుద్రాక్షలను ప్రసాదించుట - మృతుడయిన ఆమె భర్తను శ్రీగురుమూర్తి బ్రతికించుట	356
33.	రుద్రాక్ష మాహాత్మ్యము - భద్రసేనుడను రాజుగారి కథ - పతివ్రతయగు వేశ్య ఉద్ధారము	370
34.	రుద్రాధ్యాయ మహిమ - రుద్రాభిషేక ప్రభావము వలన అల్పాయుష్కులైన రాజకుమారులు దీర్ఘాయుష్మంతులగుట	380
35.	స్త్రీలకు మంత్రోపదేశముకూడదని గురుమూర్తివివరించుట- కచుడు శుక్రాచార్యుల నుండి మృతసంజీవనీ విద్యను అపహరించుట - కచదేవయానుల కథ - సోమవారవ్రత మాహాత్మ్యము - సీమంతినీ చంద్రాంగదుల ఆఖ్యానము	390
36.	సదాచార నిరూపణము - పరాన్నమును భుజించుటచే దుఃఖితుడైన ఒక సదాచార బ్రాహ్మణునకు శ్రీగురునాథుడు సదాచారమును గూర్చి ఉపదేశించుట	414
37.	వైదిక సదాచార ధర్మకర్మలను గూర్చి శ్రీగురుమూర్తి సవిస్తరముగ ఉపదేశించుట	449

భక్తికాండము

అధ్యా. సం.	విషయము	పుట సంఖ్య
38.	భాస్కరుడను ఒక నిరుపేద బ్రాహ్మణుడు గురుభిక్షతో పాటు మహాసమారాధనము నిర్వహించుట	466
39.	శ్రీగురుకృపా ప్రభావమున వృద్ధ వంధ్యురాలు సంతానవతి యగుట - అశ్వత్థ వృక్షము యొక్క మహిమాను వర్ణనము	475

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

అధ్యా. సం.	విషయము	పుట సంఖ్య
40.	ఎండిన మేడికట్టె చిగురించుట - నరహరి కుష్ఠవ్యాధి నివారణమగుట - శ్రీనృసింహ సరస్వతీ అష్టకము - శబరుని గురుభక్తి కథానిక	486
41.	సాయందేవుని గురుభక్తి పరీక్ష-కాశీయాత్రా నిరూపణము-త్వష్ట పుత్రునకు వరప్రాప్తి-సాయందేవుడుచేసిన గురుస్తుతి	499
42.	శ్రీఅనంతపద్మనాభ వ్రతమాహాత్మ్యము	532
43.	శ్రీగురుకృపవలన ఒక సాలెవాడు తృటికాలములో శ్రీశైలక్షేత్రమును దర్శించుట-శ్రీశైల క్షేత్రము, శివరాత్రి మాహాత్మ్యము	545
44.	నందియను బ్రాహ్మణుని శ్వేతకుష్ఠ నివారణము - అతనికి శ్రీగురుమూర్తి కవిత్వ సామర్థ్యమును ప్రసాదించుట	554
45.	కవీశ్వరుడగు నరహరి తాను పూజించే కల్లేశ్వరుని యందు శ్రీగురుమూర్తిని దర్శించుట - నరహరి శిష్యత్వమును స్వీకరించుట	564
46.	దీపావళినాడు శ్రీగురునాథుడు ఏకకాలంలో ఎనిమిదిచోట్ల ఎనిమిది రూపములతో దర్శనమొసగుట	569
47.	పర్వతేశ్వరుడను శూద్రభక్తుని కథ - శ్రీగురుమహిమా ప్రాభవము	574
48.	గాణగాపురము, అమరజా సంగమ మాహాత్మ్యము - రత్నాబాయి కుష్ఠవ్యాధి నివారణము	580
49.	శ్రీగురుగీత - సిద్ధముని నామధారకునకు శ్రీగురుగీతను వినిపించుట	589
50.	శ్రీగురుదేవుడు మ్లేచ్ఛరాజుపై కృపచూపుట - రాజుగారి రాచపుండు మటుమాయమగుట - పింగళి వేశ్య కథ - దుష్కాలము దాపురించినదని అవతార పరిసమాప్తియోచన	608
51.	శ్రీగురునాథుడు శ్రీశైలమున కేగుట-గాణగాపురమునందు సర్వదా కొలువుదీరి యుందునని భక్తులకు అభయదాన మిచ్చుట - పుష్పాసనమును అలంకరించి శ్రీగురుదేవులు నిజధామమునకేగుట-శ్రీగురుప్రసాదప్రాప్తి	627
52.	శ్రీగురుచరిత్ర శ్రోతయగు నామధారకుని సమాధిస్థితి వర్ణనము - శ్రీగురుచరిత్ర అవతరణిక	634

పరిశిష్టము

1.	శ్రీ గురుగీత (మూలము)	644
2.	అవధూతోపాఖ్యానము	654
3.	దత్తాత్రేయోపనిషత్తు	669
4.	అవధూతోపనిషత్తు	675
5.	శ్రీ దత్తాత్రేయ షోడశావతారములు	680
6.	విశేష కార్యసిద్ధికై పఠించవలసిన శ్రీ గురుచరిత్ర అధ్యాయములు - వాటి ఫలశ్రుతి	682
7.	శ్రీ దత్తాత్రేయ ప్రాతస్స్మరణ స్తోత్రమ్	685
8.	శ్రీ దత్తస్తవ స్తోత్రమ్	685
9.	శ్రీ దత్తాత్రేయ కవచమ్	686
10.	జయలాభాదికర శ్రీదత్తాత్రేయ స్తవమ్	686
11.	శ్రీదత్తాత్రేయ ఉత్తరమాలా	687
12.	శ్రీదత్తదశనామ స్తోత్రమ్	687
13.	శ్రీదత్తాత్రేయ ద్వాదశనామస్తోత్రమ్	688
14.	చిత్త స్థిరీకరణ శ్రీదత్తాత్రేయ స్తోత్రమ్	688

॥ జయ గురుదత్త - శ్రీగురుదత్త ॥

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

॥ శ్రీ దత్తాత్రేయాయ నమః ॥

శ్రీ గురుచరిత్ర - పారాయణ పద్ధతి

శ్రీ గురుచరిత్ర ఒక విశిష్టమైన పారాయణ గ్రంథరాజము. దీనిని శ్రీదత్తాత్రేయ స్వామివారి అనుగ్రహపాత్రుడైన శ్రీగంగాధర సరస్వతి అను పేరుగల మహాత్ముడు మహారాష్ట్ర భాషలో 'ఓవీ' అను ఛందోబద్ధముగా రచించెను.

ఈ గురుచరితామృతమును దత్తభక్తులెందరో నిత్యపారాయణము చేయుచుందురు. కొందరు ప్రవచనము కూడా చేయుదురు. దీనిని శ్రీదత్తాత్రేయ స్వరూపముగా భావించుదురు. ఇది భగవదనుగ్రహాత్మకమైన గ్రంథము. కావున, ఇది శ్రీగురుస్వరూపమును, గురుకృపను, గుర్వనుగ్రహమును, గురుమాహాత్మ్యమును స్పష్టముగా అనుభవింపజేయునని చెప్పుట ఎంతమాత్రము అతిశయోక్తి కాబోదు.

ఈ గ్రంథము నాలుగు విధములుగా పారాయణము చేయబడుచున్నది. 1. నిత్యపారాయణము 2. సప్తాహ పారాయణము 3. త్రిదివస పారాయణము. 4. ఏకాహ పారాయణము.

1. నిత్యపారాయణ పద్ధతి : మామూలుగా ఉదయము స్నానాది నిత్యకృత్యములు, నిత్యకర్మానుష్ఠానము, దేవతార్చనము మున్నగు వాటిని ముగించవలెను. ఆ తర్వాత శ్రీగురుచరిత్ర గ్రంథమును గంధ, పుష్ప, అక్షతాదులచే పూజించవలెను. అనంతరము ఒకటిగానీ, రెండుగానీ తమ వీలునుబట్టి అంతకన్నా ఎక్కువగానీ అధ్యాయములను పఠింపవచ్చును. పారాయణము ముగించిన పిమ్మట గ్రంథమును ఒక పట్టుబట్టతో చుట్టి దైవమందిరములో ఉంచి, పుష్పాక్షతలతో పూజించి, నమస్కరింపవలెను. నిత్యపారాయణము చేయువారు ప్రత్యేక నియమములు పాటించవలసిన పనిలేదు.

2. సప్తాహ పారాయణ పద్ధతి : కామ్యము అనగా ఏదో ఒక అభీష్టసిద్ధికొరకు లేదా, నిష్కామ్యముగ – శ్రీదత్తదేవుని అనుగ్రహ ప్రాప్తి నిమిత్తముగా సప్తాహ దీక్షతో అనగా ఏడు దివసములు పారాయణము చేయబడును. దీని క్రమము రెండు విధములుగా ఆచరింపబడుచున్నది. ఒకటి గురుచరిత్రలోని 52వ, అధ్యాయమునందు నామధారకుడు ప్రశ్నించగా సిద్ధమునీశ్వరుడు వివరించిన సప్తాహ క్రమపద్ధతి. ఇక, రెండవది ఇతర గ్రంథములలో పేర్కొనబడియున్నది. ఆ రెండు పద్ధతులు ఇచట పేర్కొనబడినవని గమనింపగలరు.

★ దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా ★

సప్తాహ పారాయణ పద్ధతి - 1

(ఇది గురుచరిత్ర 52వ, అధ్యాయంలో వివరింపబడినది)

దినము	ప్రారంభము	ముగింపు	అధ్యాయముల మొత్తము సంఖ్య
	నుండి	వరకు	
1వ	1వ అధ్యాయం	7వ అధ్యాయం	(07) ఏడు
2వ	8వ అధ్యాయం	18వ అధ్యాయం	(11) పదకొండు
3వ	19వ అధ్యాయం	28వ అధ్యాయం	(10) పది
4వ	29వ అధ్యాయం	34వ అధ్యాయం	(06) ఆరు
5వ	35వ అధ్యాయం	37వ అధ్యాయం	(03) మూడు
6వ	38వ అధ్యాయం	43వ అధ్యాయం	(06) ఆరు
7వ	44వ అధ్యాయం	52వ అధ్యాయం	(09) తొమ్మిది

సప్తాహ పారాయణ పద్ధతి - 2

దినము	ప్రారంభము	ముగింపు	అధ్యాయముల మొత్తము సంఖ్య
	నుండి	వరకు	
1వ	1వ అధ్యాయం	9వ అధ్యాయం	(09) తొమ్మిది
2వ	10వ అధ్యాయం	21వ అధ్యాయం	(12) పన్నెండు
3వ	22వ అధ్యాయం	29వ అధ్యాయం	(08) ఎనిమిది
4వ	30వ అధ్యాయం	35వ అధ్యాయం	(06) ఆరు
5వ	36వ అధ్యాయం	38వ అధ్యాయం	(03) మూడు
6వ	39వ అధ్యాయం	43వ అధ్యాయం	(05) ఐదు
7వ	44వ అధ్యాయం	52వ అధ్యాయం	(09) తొమ్మిది

3. త్రిదివస పారాయణ పద్ధతి : దీక్షగా మూడు దివసముల పరిమితంగా గ్రంథ పారాయణమును పూర్తి చేయుటనే "త్రిదివస పారాయణ పద్ధతి" అందురు. దీని క్రమము కూడా రెండు రకములుగా కన్పట్టుచున్నది. కావున, ఆ రెండు పద్ధతులు దిగువన పేర్కొనబడినవని గమనింపగలరు.

త్రి దివస పారాయణ పద్ధతి - 1

దినము	ప్రారంభము	ముగింపు	అధ్యాయముల మొత్తము సంఖ్య
	నుండి	వరకు	
1వ	1వ అధ్యాయం	22వ అధ్యాయం	(22) ఇరవై రెండు
2వ	23వ అధ్యాయం	33వ అధ్యాయం	(11) పదకొండు
3వ	34వ అధ్యాయం	52వ అధ్యాయం	(19) పంతొమ్మిది

త్రి దివస పారాయణ పద్ధతి - 2

దినము	ప్రారంభము	ముగింపు	అధ్యాయముల మొత్తము సంఖ్య
	నుండి	వరకు	
1వ	1వ అధ్యాయం	24వ అధ్యాయం	(24) ఇరవైనాల్గు
2వ	25వ అధ్యాయం	36వ అధ్యాయం	(12) పన్నెండు
3వ	37వ అధ్యాయం	52వ అధ్యాయం	(16) పదహారు

4. ఏకాహ పారాయణ పద్ధతి : ఒకే ఒక్క దివసము పూర్తి గ్రంథమును పారాయణము చేయుటనే 'ఏకాహ పారాయణ పద్ధతి' అందురు. జ్ఞాన, కర్మ, భక్తి అను మూడు కాండములలో ఎక్కువ

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

సమయం ఒకే ఆసనంపై కూర్చుండలేనివారు - అశక్తులు, ఒక కాండము పారాయణము పూర్తి చేసిన పిమ్మట, ఆసనము నుండి లేచి స్వల్పవిశ్రాంతి తీసికొనవచ్చును. అప్పుడు పాలు లేక ఏదేని ద్రవాహారము వంటి పదార్థములను స్వీకరింపవచ్చును. తదుపరి, పారాయణము ప్రారంభించుటకు ముందు మరల ఆచమనము, ప్రాణాయామము చేయవలయును. ఈవిధంగా ఒక్కొక్క కాండము వద్ద స్వల్పవిరామము తీసికొని ఏకాహ పారాయణమును సంపూర్ణము చేయవచ్చును. ఈ పద్ధతి ద్వారా శ్రీదత్తాత్రేయ భగవానుని కృపను అతిశీఘ్రముగ పొందవచ్చును.

పాటించవలసిన నియమములు :

1. కామ్యంగా అనగా ఆపద, సంపదలకు చెందిన ఏదేని కోరిక నెరవేరు నిమిత్తంగా గానీ లేదా, భగవత్ ప్రీత్యర్థంగా, నిష్కామ్యంగా గానీ సప్తాహ నియమంతో లేక, త్రిదివస పరిమితంగా, ఏకాహంగా ఒక దీక్షతో శ్రీగురుచరిత్రను పారాయణము చేయుచున్నప్పుడు, దిగువ చెప్పబడిన నియమములను పాటించవలయును.
2. సూర్యోదయమునకు ముందే లేచి స్నానాది నిత్యకృత్యములను, సంధ్యాది పూజా విధులను పూర్తి చేసిన పిమ్మట పారాయణము చేయవలయును. ఈ కాలము నందు పారాయణము చేయు ప్రదేశము యొక్క సరిహద్దును దాటివెళ్ళకూడదు.
3. సాత్త్వికాహారమును భుజింపవలెను.
4. పరాన్నమును స్వీకరింపకూడదు.
5. వీలున్న యెడల చేయగలిగినచో, ఉదయము ప్రభాతకాలమునందు కాకడహారతి, సుప్రభాతసేవను చేయవలెను.
6. సాయంత్రము సాయంకాలపూజ, నీరాజనము (శేజారతి), పవళింపు సేవ చేయవలెను.
7. త్రిసంధ్యలు అనగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడువేళల యందు ఆరతి - నీరాజనసేవ, పుష్పాంజలి సమర్పించి స్తోత్రములను చదివి, కొద్దిసమయము భజన - సంకీర్తనము చేయవలయును.
8. ఏకభుక్తమును చేయుట ఉత్తమము. హవిష్యాన్నమును భుజించుట ఎంతో శ్రేష్ఠం. రాత్రికి ఉపాహారము, పాలు, పండ్లు తీసికొనవచ్చును. హవిష్యాన్నమనగా - బియ్యము, పెసరపప్పు, జీలకర్ర, నెయ్యి, సైంధవ లవణము కొద్దిగా పసుపు వేసి వార్చకుండా వండిన అన్నమునే హవిష్యాన్నము అందురు. బెల్లము, నెయ్యి వేసి వండినది కూడా తినవచ్చును.
9. నేలమీద చాప వేసికొని, లేదా తెల్ల గొంగడిపై నిదురించవలెను. స్త్రీలు మాత్రము నేలమీద చాపవేసికొని నిద్రించవలెను.
10. మనోవాక్కాయ కర్మలతో బ్రహ్మచర్యమును పాటించవలెను. శుచిగా ఉండవలెను.
11. అనవసరమైన ప్రసంగములు చేయకుండా దినమంతయును మానసికముగా దత్తనామమును స్మరింపవలెను.

12. మాధూకరిని స్వీకరించి స్వామికి నివేదించి ఆహారమును భుజించు సంప్రదాయము గలవారు మాధూకరిని స్వీకరించవలెను. మాధూకరిని స్వీకరించు పద్ధతిని గూర్చి పుటసంఖ్య (33)లో గమనించగలరు.

13. అశౌచమునందు గానీ, స్త్రీ బహిష్ఠ సమయమునందుగానీ పారాయణము చేయుట పనికిరాదు.

పారాయణ సమయంలో పాటించవలసిన నియమాలు :

1. యేనాటి పారాయణమును ఆనాడే – ఆ రోజుననే ఒకే ఆసనమున కూర్చొని పూర్తి చేయుట ఉత్తమం.
2. ఏకాసనంలో సాధ్యంకానివారు రెండు పూటలు చేయవచ్చును.
3. పారాయణమునకు ముందు మొదటిరోజు పీఠమును ఏర్పరచుకొని పూజాదులను నిర్వహింపవలెను. 1. శ్రీదత్తాత్రేయ స్వామివారి చిత్రపటము 2. శ్రీగురుచరిత్ర గ్రంథము 3. దత్త పాదుకలు (వెండి, రాగి, ఇత్తడి లేదా మేడి చెక్కతో చేసినవి) 4. దీపము 5. పంచపాళి, 6. ఆచమన పాత్ర 7. పూజాద్రవ్యములు 8. పూలు, పండ్లు మొ॥

   గమనిక: 7 రోజులుగాని, 3 రోజులుగాని పూర్తియగునంతవరకు పీఠమును కదిలించకూడదు.
4. శ్రీగురుచరిత్ర గ్రంథమును దత్తాత్రేయస్వామి స్వరూపంగా భావించి విశ్వసించి త్రికరణశుద్ధిగా పూజించాలి.
5. నుదుట తిలకముగాని, త్రిపుండ్రముగాని, ఊర్ధ్వపుండ్రముగాని ధరించాలి.
6. మడి వస్త్రమును ఒకటి పంచకచ్ఛలతో కట్టుకోవాలి. మరొకటి పైన కప్పుకోవాలి.
7. పారాయణ కర్త కూర్చొనుటకు స్థిరంగా, సుఖంగా ఉండే ఆసనమును ఏర్పరచుకోవాలి. దర్భచాప, తెల్లగొంగడి, కృష్ణాజినము వంటి ఉత్తమ ఆసనమును సిద్ధపరచుకోవాలి. స్త్రీలు సుఖంగా కూర్చుండగలిగే ఆసనమును ఏర్పరచుకోవాలి.
8. కూర్మాసనమును ఏర్పరచుకొనుట అత్యంత శ్రేష్ఠమైనది. తద్వారా విశేష ఫలము లభించును. ఒక వెడల్పైన సమచతురశ్రముగా నుండే తెల్లని వస్త్రాన్ని తీసికోవాలి. దిగువన చూపబడిన విధంగా కేసరి (కాషాయ) రంగుతో యంత్రమును వ్రాయవలెను. ఆరిన తర్వాత యంత్రమును వ్రాసిన వస్త్రమును దర్భాసనము లేదా గొంగడి వంటి



ఆసనము మీద వేయాలి. దానిపైన ఆచ్ఛాదనముగా మరొక తెల్లని వస్త్రమును వేసి పైన కూర్చుండవలయును. దీనినే 'కూర్మాసనము' అందురు. దీనిని సంధ్యా జప పూజా పారాయణాదుల వంటి విశేష అనుష్ఠానాదులలో ఉపయోగించుటవలన శీఘ్రముగ ఆసనసిద్ధి లభింపగలదు.

9. ఒక ప్రత్యేక జలపాత్ర (నీళ్ళ చెంబు), ఆచమనాదులకు రెండు పాత్రలు, రెండు ఉద్ధరిణెలు, మధ్యలో హరివాణము అనగా నీళ్ళు విడుచుటకుగాను ఒక పళ్ళెము ఉండవలెను.
10. మెడలో తులసి, రుద్రాక్ష మొ॥ ఏదేని మాలను ధరింపవచ్చును.
11. పారాయణము చేయుచున్నప్పుడు తుమ్ము, ఆవలింత, త్రేన్పు వచ్చినచో వెంటనే ఆచమనము చేయవలెను. లేదా, చేతులతో చెవులను మూసి 'విష్ణవే నమః' అను విష్ణు నామమును ఉచ్చరింపవలెను.
12. మలమూత్ర విసర్జనములు అనివార్యమగుచో అధ్యాయమును ముగించి వెళ్ళవలెను. అనంతరము స్నానము చేసి మడి వస్త్రమును ధరించి వచ్చి కూర్చొని, పునః ఆచమనము చేసిన తర్వాతనే పారాయణము ప్రారంభింపవలెను.
13. పారాయణం మధ్యలో ఉపాహారం, చాయ, కాఫీలను స్వీకరింపకూడదు. మధ్యలో మాట్లాడకుండా మౌనంగా ఉండటం చాలా మంచిది.
14. పారాయణము ప్రారంభించుటకు ముందు పఠించవలసిన శ్లోకములు, ఘోరకష్టోద్ధరణ స్తోత్రమును తప్పక పఠింపవలెను. పారాయణము పూర్తియైన పిమ్మట ముగింపు శ్లోకములు, అపరాధ క్షమాపణ స్తోత్రమును పఠించవలెను. పుటసంఖ్య (29–31)లో చూడుము.
15. పారాయణము ముగించునప్పుడు తదుపరి ప్రారంభించెడు అధ్యాయము నందలి మొదటి 2,3 వాక్యములను చదివిన పిమ్మట ముగించవలెను.
16. స్వయంగా పారాయణము చేయలేనివారు, శ్రద్ధగా శ్రవణము చేసి తత్ఫలమును పొందవచ్చును. శ్రవణము చేయువారు కూడా నియమములను పాటించుటవలన విశేష ఫలితమును పొందవచ్చును.
17. పారాయణము ప్రారంభించినప్పుడు తమ తల్లిదండ్రులకు, గురుజనులకు, పెద్దలకు, కులదేవతకు, ఇష్టదేవతకు, గురువునకు నమస్కరించాలి. వారి ఆశీస్సులను, అనుగ్రహమును పొంది పారాయణమును ప్రారంభించాలి.
18. నేతి దీపమును వెలిగించి పారాయణము పూర్తియగు వరకు వెలుగునట్లుగా జాగ్రత్తపడాలి.
19. పారాయణం ముగించిన పిమ్మట గ్రంథముతో పాటుగా దేవతామూర్తికి నైవేద్యం, నీరాజనం సమర్పించాలి.
20. గురుచరిత్ర గ్రంథమును ఒక పట్టువస్త్రంతో చుట్టి పీఠముపై లేదా పూజామందిరంలో ఉంచవలయును.
21. పారాయణ దీక్ష ముగింపు రోజున మహానైవేద్యమును పెట్టాలి. బ్రాహ్మణ దంపతులనుగానీ, ఒక సువాసినిని గానీ ఆహ్వానించవలెను. వారిని పూజించి, భోజన తాంబూల దక్షిణాదులను సమర్పించి సత్కరించ వలయును.

పూజా విధానము ప్రత్యేకంగా ఈయబడినది. పుట (18)లో చూడగలరు.

❖ ❖ ❖

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

॥ శ్రీ దత్తశ్శరణం మమ ॥

శ్రీ గురుచరిత్ర - పూజా విధి

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోప శాంతయే ॥

శ్రీ మహాగణాధిపతయే నమః । శ్రీసరస్వత్యై నమః । శ్రీగురుభ్యో నమః ॥

దీపం ప్రజ్వాల్య ॥

భో! దీప! బ్రహ్మరూపేణ సర్వేషాం హృది సంస్థితః ।
అతస్త్వాం స్థాపయామ్యద్య మదజ్ఞాన మపాకురు ॥

దీపజ్యోతి పరబ్రహ్మణే నమః - పుష్పాక్షతై రభ్యర్చ్య - నమస్కృత్య॥

ఆగమార్థం తు దేవానాం గమనార్థం తు రక్షసామ్ ।
కురు ఘంటారవం తత్ర దేవతాహ్వాన లాంఛనమ్ ॥

ఇతి ఘంటానాదం కృత్వా - నాదబ్రహ్మణే నమః - పుష్పాక్షతైరభ్యర్చ్య - నమస్కృత్య ॥

అపసర్పంతు యే భూతా యే భూతా భూమి సంస్థితాః ।
యే భూతా విఘ్న కర్తారః తే నశ్యంతు శివాజ్ఞయా ॥

(భూతములను వెడలగొట్టుచున్నట్లుగా భావించవలెను.)

పృథ్వి త్వయా ధృతా లోకా దేవి త్వం విష్ణునాధృతా ।
త్వం చ ధారయ మాం దేవి పవిత్రం కురు చాసనమ్ ॥

(భూమాతకు నమస్కరింపవలెను)

ఆచమ్య - ప్రాణానాయమ్య ॥

ఆచమనము :

ఓం కేశవాయ స్వాహా .... శ్రీకృష్ణాయ నమః ॥

ఆసనము :

ఓం పృథివ్యాః-మేరు పృష్ఠ ఋషిః-కూర్మో దేవతా-సుతలం ఛందః - ఆసనే వినియోగః ॥ అనంతాసనాయ నమః ॥

ప్రాణాయామము

ప్రణవస్య పరబ్రహ్మ ఋషిః - పరమాత్మ దేవతా - దైవీ గాయత్రీ ఛందః - ప్రాణాయామే వినియోగః ॥

ఓం భూః - ఓం భువః - ఓం స్వః - ఓం మహః - ఓం జనః - ఓం తపః - ఓం సత్యం - ఓం తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి-ధియో యో నః ప్రచోదయాత్ ॥

ఓమాపో జ్యోతీ రసోమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్ ॥

దేశ కాల పూర్వక సంకల్పము :

శుభాభ్యుదయార్థం చ శుభే శోభనే మంగళే ముహూర్తే అత్ర పృథివ్యాం జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరోః దక్షిణ దిగ్భాగే, శ్రీశైలస్య (వాయవ్య/ఆగ్నేయ) ప్రదేశే, శ్రీకృష్ణావేణ్యాం గోదావర్యోర్మధ్యదేశే (శ్రీకృష్ణా కావేర్యోర్మధ్యదేశే), శ్రీలక్ష్మీ నివాస గృహే (స్వగృహే) సమస్త దేవతా గో బ్రాహ్మణ హరిహర గురుచరణ సన్నిధౌ ॥ అద్యబ్రహ్మణః, ద్వితీయ పరార్థే, శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్ఠి సంవత్సరాణాం మధ్యే స్వస్తి శ్రీ .... నామ సంవత్సరే .... అయనే ....

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

ఋతౌ .... మాసే .... పక్షే ..... తిథౌ .... వాసరే .... శుభవాసరే ...... శుభనక్షత్రే ...... శుభయోగే...... శుభకరణే ఏవంగుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ ॥ ...... వంశోద్భవమ్.... గోత్రోహం.... నామధేయోహం .... ధర్మపత్నీ సమేతోహం .... అస్మాకం సకుటుంబానాం(1) (శ్రీమాన్ .... వంశోద్భవస్య .... గోత్రస్య .... నామధేయస్య .... ధర్మపత్నీ నామ్న్యాః సహకుటుంబస్య)(2) మమ ఉపాత్త సమస్త దురితక్షయద్వారా - అస్మాకం సకుటుంబానాం - క్షేమ - స్థైర్య - ధైర్య- విజయ - అభయ- ఆయురారోగ్య- ఐశ్వర్యాభివృద్ధ్యర్థం - ఆధిభౌతిక - ఆధిదైవిక - ఆధ్యాత్మిక- త్రివిధ తాప శమనార్థం - ధర్మార్థ కామమోక్ష చతుర్విధ పురుషార్థ ఫల సిద్ధ్యర్థం- పుత్రపౌత్రాది సత్సంతానాభివృద్ధ్యర్థం- శ్రుతి స్మృతి పురాణోక్త ఫల ప్రాప్త్యర్థం-

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకస్య - దేవ దేవాత్మకస్య - జగత్కుటుంబినః - జగద్రక్షణార్థం అవతీర్ణస్య - బ్రహ్మా - విష్ణు - శివ త్రిమూర్త్యాత్మక పరబ్రహ్మ స్వరూప శ్రీగురుదత్తాత్రేయ స్వరూపాత్మక - శ్రీపాద శ్రీవల్లభ - శ్రీనృసింహ సరస్వతీ స్వామి సంపూర్ణ అనుగ్రహ ప్రాప్త్యర్థం -

శ్రీగురుచరిత్రాత్మక స్వరూప శ్రీగురు దత్తాత్రేయ స్వామిన ముద్దిశ్య - శ్రీగురు చరిత్రాత్మక స్వరూప శ్రీగురు దత్తాత్రేయ స్వామి ప్రీత్యర్థం - అద్యారభ్య సప్తదివస పర్యంతం (త్రిదివస పర్యంతం) ప్రతిదినం నియత సంఖ్యాఽధ్యాయ పఠనపూర్వకం శ్రీగురు దత్తాత్రేయ స్వామి స్వరూపాత్మక శ్రీగురుచరిత్ర సప్తాహ (త్రిదివస) దీక్షాపూర్వక ప్రథమదివస(1) పారాయణాఖ్యం కర్మ కరిష్యే ॥ *(పూర్వసంకల్పిత శ్రీ గురుచరిత్ర సప్తాహ (త్రిదివస) దీక్షాపూర్వక పారాయణాంగత్వేన అద్య..... ద్వితీయ - తృతీయ-చతుర్థ - పంచమ - షష్ఠ - సప్తమ దివస నియత సంఖ్యాధ్యాయ పారాయణమహం కరిష్యే ॥)*(2) తదంగత్వేన షోడశోపచార పూర్వక శ్రీగురుస్వరూప గ్రంథపూజనం కరిష్యే ॥ ఆదౌ నిర్విఘ్నేన పరిసమాప్త్యర్థం కలశ, గణాధిపతి పూజాం కరిష్యే ॥ తదాదౌ కలశారాధనం చ కరిష్యే ॥

కలశ పూజా

కలశం గంధపుష్పాక్షతైరభ్యర్చ్య -

శ్లో॥ కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్రః సమాశ్రితః ।
మూలే తత్ర స్థితో బ్రహ్మా మధ్యే మాతృగణాః స్మృతాః ॥
కుక్షౌతు సాగరా స్సర్వే సప్తద్వీపా వసుంధరా ।
ఋగ్వేదోఽథ యజుర్వేదః సామవేదోహ్యథర్వణః ॥
అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబు సమాశ్రితాః ।
అత్ర గాయత్రి సావిత్రి శాంతిః పుష్టికరీ తథా ।
ఆయాంతు దేవపూజార్థం దురితక్షయ కారికాః ॥
శ్లో॥ గంగే! చ యమునే! కృష్ణే! గోదావరి! సరస్వతి!
నర్మదే! సింధుకావేరీ! జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥

కలశోదకేన పూజాద్రవ్యాణి సంప్రోక్ష్య - దేవం సంప్రోక్ష్య - ఆత్మానం చ సంప్రోక్ష్య ॥ ఇతి కలశపూజా ॥

---

1. తామే స్వయంగా సంకల్పం చెప్పుకొన్నప్పుడు ఈవిధంగా తమ గోత్ర నామాదులను చేర్చి చెప్పుకొనవలెను.
2. ఒకవేళ తమ గురించిన సంకల్పాదిపూజను వేరొకరు చెప్పినచో, కుండలీకరణములో చేర్చిన విధముగా కర్తయొక్క గోత్రనామాదులను చేర్చి చెప్పవలెను.

1. మొదటిరోజు చెప్పవలసిన సంకల్పము
2. రెండవరోజు నుండి వరుసగా ఏ రోజుకారోజున చెప్పవలసిన సంకల్పము.

శ్రీ మహాగణాధిపతిపూజా

ధ్యానమ్

శ్లో॥ వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ ।
నిర్విఘ్నం కురుమే దేవ సర్వకార్యేషు సర్వదా ॥

శ్రీమహాగణాధిపతయే నమః - ధ్యాయామి ॥

శ్రీమహాగణాధిపతయే నమః - ఆవాహయామి ఆసనం సమర్పయామి, పాదయోః పాద్యం సమర్పయామి, హస్తయోః అర్ఘ్యం సమర్పయామి, ముఖే ఆచమనం సమర్పయామి. శ్రీమహాగణాధిపతయే నమః - ఉపచారిక స్నానం సమర్పయామి - పంచామృతస్నానం సమర్పయామి- శుద్ధోదక స్నానం సమర్పయామి ॥ స్నానాంతే ఆచమనీయం సమర్పయామి ॥

శ్రీమహాగణాధిపతయే నమః - వస్త్రయుగ్మం సమర్పయామి - యజ్ఞోపవీతం సమర్పయామి - శ్రీగంధం సమర్పయామి. అక్షతాన్ సమర్పయామి - కుంకుమవిలేపనం సమర్పయామి - శ్రీమహాగణాధిపతయే నమః - పుష్పైః పూజయామి ॥

1. ఓం సుముఖాయ నమః
2. ఓం ఏకదంతాయ నమః
3. ఓం కపిలాయ నమః
4. ఓం గజకర్ణికాయ నమః
5. ఓం లంబోదరాయ నమః
6. ఓం వికటాయ నమః
7. ఓం విఘ్నరాజాయ నమః
8. ఓం గణాధిపాయ నమః
9. ఓం ధూమకేతవే నమః
10. ఓం గణాధ్యక్షాయ నమః
11. ఓం ఫాలచంద్రాయ నమః
12. ఓం గజాననాయ నమః
13. ఓం వక్రతుండాయ నమః
14. ఓం శూర్పకర్ణాయ నమః
15. ఓం హేరంబాయ నమః
16. ఓం స్కందపూర్వజాయ నమః

ఓం సర్వసిద్ధి ప్రదాయకాయ నమః - షోడశనామ పూజాస్సమర్పయామి ॥ శ్రీ మహాగణాధిపతయే నమః - నానావిధ పరిమళ పత్రపుష్పాణి సమర్పయామి ॥

శ్రీమహాగణాధిపతయే నమః - ధూపమాఘ్రాపయామి-దీపం దర్శయామి - అనంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి.

నైవేద్యం - శ్రీమహాగణాధిపతయే నమః - అమృతోపహార నైవేద్యం సమర్పయామి - మధ్యే మధ్యే ఉదకపానీయం సమర్పయామి -ఉత్తరాపోశనం సమర్పయామి - హస్త, పాదౌ ప్రక్షాళయామి - శుద్ధ ఆచమనీయం సమర్పయామి ॥ శ్రీమహాగణాధిపతయే నమః - తాంబూల- దక్షిణాదీన్ సమర్పయామి

కర్పూర నీరాజనమ్

శ్లో॥ మంగళం గణనాథాయ - మంగళం హర సూనవే ।
మంగళం విఘ్నరాజాయ - విఘ్నహర్త్రేస్తు మంగళమ్ ॥

కర్పూర మంగళ నీరాజనం సమర్పయామి - ఆచమనీయం సమర్పయామి ॥ - ఓం తత్పురుషాయ విద్మహే - వక్రతుండాయ ధీమహి- తన్నో దంతిః ప్రచోదయాత్ ॥ శ్రీ మహాగణాధిపతయే నమః - మంత్రపుష్పాంజలిం సమర్పయామి ॥ ఆత్మప్రదక్షిణత్రయ నమస్కారాన్ సమర్పయామి ॥ పునః పూజాం చ కరిష్యే ॥

ఛత్రమాచ్ఛాదయామి - చామరేణ వీజయామి - దర్పణం దర్శయామి - నృత్యం దర్శయామి - గీతం శ్రావయామి - వాద్యాన్ ఘోషయామి - ఆందోళికం సమర్పయామి - అశ్వారోహణం కల్పయామి - గజారోహణం కల్పయామి - మూషికారోహణం కల్పయామి - సమస్త రాజోపచార శక్త్యోపచార భక్త్యోపచార పూజా సమర్పయామి ॥

శ్లో॥ మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం గణాధిప ।
యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తు తే ॥

అనయా ధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజయా చ భగవాన్ సర్వాత్మకః శ్రీమహాగణాధిపతిః సుప్రీత స్సుప్రసన్నో వరదో భవతు ॥

ఉత్తరే శుభకర్మణ్యఽవిఘ్నమస్త్వితి భవంతో బ్రువంతు – ఉత్తరే శుభ కర్మణ్యఽవిఘ్నమస్తు ॥

శ్రీమహాగణాధిపతి ప్రసాదం (యజమానస్య శిరసా గృహ్ణీయాత్ ॥) శిరసా గృహ్ణామి ॥ శ్రీమన్మహాగణాధిపతి ప్రసాద సిద్ధిరస్తు ॥

ఉద్వాసనమ్

గచ్ఛ గచ్ఛ సురశ్రేష్ఠ స్వస్థాన పరమేశ్వర ।
ఇష్టకామ్యార్థ సిద్ధ్యర్థం పునరాగమనాయ చ ॥
శ్రీమహాగణాధిపతిం యథాస్థానం ప్రవేశయామి –
శోభనార్థం పునరాగమనాయ చ ॥

॥ ఇతి శ్రీ మహాగణాధిపతి పూజా ॥

(అనంతరం శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయస్వామి పూజను చేయవలెను.)

అథ ధ్యానమ్

(పుష్పాంజలిం గృహీత్వా – శ్రీగురుం ధ్యాత్వా)

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః – గురుర్దేవో మహేశ్వరః ।
గురు స్సాక్షాత్ పరంబ్రహ్మా – తస్మైశ్రీ గురవే నమః ॥

శ్లో॥ వేదాంతవేద్యం వరయోగిరూపం – జగత్ప్రకాశం సురలోకపూజ్యమ్।
ఇష్టార్థసిద్ధిం కరుణాకటాక్షం – శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥
(శ్రీ శ్రీపాద శ్రీవల్లభాయ నమః)

శ్లో॥ మాయాతమోఽర్కం విగుణం గుణాఢ్యం –
శ్రీవల్లభం స్వీకృత – భిక్షువేషమ్ ।
సద్భక్తసేవ్యం వరదం వరిష్ఠం –
వందే నృసింహేశ్వర పాహి మాం త్వమ్ ॥
(శ్రీనృసింహ సరస్వత్యై నమః)

శ్లో॥ మాలాకమండలురధః కరపద్మయుగ్మే
మధ్యస్థ పాణియుగళే డమరు త్రిశూలే ।
యస్యస్థ ఊర్ధ్వకరయోః శుభశంఖచక్రే
వందే త మత్రి వరదం భుజషట్కయుక్తమ్ ॥
(శ్రీగురు దత్తాత్రేయాయ నమః)

శ్లో॥ దత్తాత్రేయం గురుం శాంతం – అవధూతం దిగంబరమ్ ।
భక్తాభీష్ట ప్రదం వందే గ్రంథరూపేణ సంస్థితమ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీపాదశ్రీవల్లభ – శ్రీనృసింహ సరస్వతీ –
శ్రీగురుదత్తాత్రేయ స్వామినే నమః – ధ్యాయామి ॥

ఆవాహనమ్

దత్తాత్రేయాహ్వయామ్యత్ర పరివారై స్సహార్చనే ।
శ్రద్ధా భక్త్యేశ్వరాగచ్ఛ ధ్యాత ధామ్నాంజసా విభో ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః – ఆవాహనం సమర్పయామి॥

ఆసనమ్

సౌవర్ణం రత్నజడితం కల్పితం దేవతామయమ్ ।
రమ్యం సింహాసనం దత్త! స్వీకురుష్వ దయానిధే ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః –
నవరత్నఖచిత హేమసింహాసనం సమర్పయామి ॥

పాద్యమ్

పాద్యం గృహాణ దేవేశ! సర్వక్షేమ సమర్థ భో! ।
భక్త్యా సమర్పితం దేవ! దత్తాత్రేయ! నమోఽస్తు తే ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
పాదయోః పాద్యం సమర్పయామి॥

అర్ఘ్యమ్

అత్రినందన యోగీశ - అనసూయాత్మ సంభవ ।
అవధూత సదానంద - అర్ఘ్యం త్వ మురరీకురు ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః-
హస్తయోః అర్ఘ్యం సమర్పయామి॥

ఆచమనీయమ్

సుస్వాద్యాచమనీయాంబు హైమపాత్రేణ కల్పితమ్ ।
తుభ్య మాచమ్యతాం దత్త! దేవదేవ! గృహాణ భో ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
ముఖే ఆచమనీయం సమర్పయామి ॥

మధుపర్కమ్

మధ్వాజ్య దధిసంయుక్తం స్వర్ణపాత్రే ప్రతిష్ఠితమ్ ।
మధుపర్కం గృహాణ త్వం దత్తాత్రేయ నమోఽస్తు తే ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - మధుపర్కం సమర్పయామి॥

స్నానమ్

వేదాదిరూప వేదజ్ఞ వేదపర్వత వాసక ।
వేగేన స్నాపయామ్యద్భిః వేదమంత్రాభి మంత్రితైః ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - స్నానం సమర్పయామి॥

పంచామృతస్నానమ్

పయో దధి ఘృతం చైవ మధు చ శర్కరాఽన్వితమ్ ।
పంచామృతం మయాఽనీతం స్నానార్థం ప్రతిగృహ్యతామ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
పంచామృతస్నానం సమర్పయామి॥
అనంతరం నారికేళ ఫలోదక స్నానం సమర్పయామి ॥

శుద్ధోదక స్నానమ్

శుద్ధం యత్ సలిలం దివ్యం గంగాజల సమం స్మృతమ్ ।
సమర్పితం మయా భక్త్యా శుద్ధస్నానాయ గృహ్యతామ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
శుద్ధోదక స్నానం సమర్పయామి ॥
(పురుషసూక్తాదులచే అభిషేకించవలెను.)

శుద్ధాచమనమ్

విశ్వరూప స్వరూపాయ పునరాచమనీయకమ్ ।
దాస్యా మ్యాచమ్యతాం దేవ! ప్రసీద పరమేశ్వర ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
స్నానానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి ॥

వస్త్రమ్

ద్యుతిమన్ మృదులం దివ్యం దుకూలం కాంచనావృతమ్ ।
తుభ్యం మయార్పితం దేవ పరిధారయ రక్షమామ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
వస్త్రయుగ్మం సమర్పయామి ॥
వస్త్రయుగ్మానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి ॥

యజ్ఞోపవీతమ్

దేవదేవ! నమస్తేఽస్తు త్రాహి మాం భవసాగరాత్ ।
బ్రహ్మసూత్రం సోత్తరీయం గృహాణ పురుషోత్తమ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
యజ్ఞోపవీతం సమర్పయామి ॥
యజ్ఞోపవీతానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి ॥

గంధమ్

శ్రీఖండం చందనం దివ్యం గంధాఽఢ్యం సుమనోహరమ్ ।
విలేపనం సురశ్రేష్ఠ చందనం ప్రతిగృహ్యతామ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - శ్రీగంధం సమర్పయామి॥

అక్షతాన్

అక్షతాస్తండులాః శుభ్రాః కుంకుమేన విరాజితాః ।
మయా నివేదితా భక్త్యా గృహాణ పరమేశ్వర ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - అక్షతాన్ సమర్పయామి॥

పుష్పమ్

చామంతికా వకుళ చంపక పాటలాబ్జ
పున్నాగ జాజి కరవీర రసాల పుష్పైః ।
బిల్వ ప్రవాళ తులసీదళ మల్లికాదిభిః
త్వాం పూజయామి జగదీశ్వర! దత్తదేవ! ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - పుష్పైః పూజయామి ॥

అథ అంగపూజ

1. ఓం శ్రీ యోగిరాజాయ నమః - పాదౌ పూజయామి ।
2. ఓం అత్రివరదాయ నమః - జంఘే పూజయామి ।
3. ఓం దత్తాత్రేయాయ నమః - ఊరూ పూజయామి ।
4. ఓం కాలాగ్నిశమనాయ నమః - కటిం పూజయామి ।
5. ఓం యోగిజనవల్లభాయ నమః - నాభిం పూజయామి ।
6. ఓం లీలా విశ్వంభరాయ నమః - హృదయం పూజయామి ।
7. ఓం సిద్ధరాజాయ నమః - బాహూన్ పూజయామి ।
8. ఓం జ్ఞానసాగరాయ నమః - హస్తాన్ పూజయామి ।
9. ఓం విశ్వంభరాయ నమః - కంఠాన్ పూజయామి ।
10. ఓం మాయాముక్తావధూతాయ నమః - ముఖం పూజయామి ।
11. ఓం మాయా యుక్తావధూతాయ నమః - నాసికాం పూజయామి ।
12. ఓం ఆదిగురవే నమః - నేత్రాణి పూజయామి ।
13. ఓం శివరూపాయ నమః - శ్రోత్రాణి పూజయామి ।
14. ఓం దేవదేవాయ నమః - లలాటం పూజయామి ।
15. ఓం దిగంబరాయ నమః - శిరః పూజయామి ।
16. ఓం కృష్ణశ్యామ కమలనయనాయ నమః-
    సర్వాణ్యంగాని పూజయామి ॥

శ్రీ దత్త దశనామావళిః

1. ఓం దత్తాత్రేయాయ నమః ।
2. ఓం హరయే నమః
3. ఓం కృష్ణాయ నమః ।
4. ఓం ఉన్మాదాయ నమః ।
5. ఓం నందదాయ నమః ।
6. ఓం మునయే నమః ।
7. ఓం దిగంబరాయ నమః ।
8. ఓం బాలాయ నమః ।
9. ఓం పిశాచాయ నమః ।
10. ఓం జ్ఞానసాగరాయ నమః ॥

(వీలును బట్టి అష్టోత్తర శతనామావళితో పూజింపవచ్చును. పుట సంఖ్య (26)లో చూడుము.

ధూపమ్

వనస్పతి రసైర్దివ్యైః నానాగంధైస్సు సంయుతమ్ ।
ఆఘ్రేయ స్సర్వ దేవానాం ధూపోఽయం ప్రతిగృహ్యతామ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - ధూపమాఘ్రాపయామి ॥

దీపమ్

స్వర్ణపాత్రే గోఘృతాక్తవర్తి ప్రజ్వలితం హృదా ।
దీపం దత్త సకర్పూరం గృహాణ స్వప్రకాశక ॥
సుప్రకాశో మహాదీప స్సర్వత్ర తిమిరాపహో ।
సబాహ్యాంభ్యంతరం జ్యోతిః దీపోఽయం ప్రతిగృహ్యతామ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - దీపం దర్శయామి ॥
ధూపదీపానంతరం శుద్ధాచమనం సమర్పయామి ॥

నైవేద్యమ్

సౌవర్ణస్థాలిమధ్యే మణిగణఖచితే గోఘృతాక్తాన్ సుపక్వాన్ ।
భక్ష్యాన్ భోజ్యాంశ్చ లేహ్యానపరిమితరసాన్ చోష్యమన్నం నిధాయ ॥
నానాశాకైరుపేతం దధిమధుసగుడ క్షీర పానీయ యుక్తం ।
తాంబూలం చాపి విష్ణో! ప్రతిదివసమహం మానసే కల్పయామి ॥

గాయత్ర్యా ప్రోక్ష్య - ఓం భూర్భువస్సువః .... యాత్ - సత్యంత్వర్తేన పరిషించామి । అమృతమస్తు అమృతోపస్తరణమసి । శ్రీగురుదత్తాత్రేయ స్వామినే నమః - ఓం ప్రాణాయ స్వాహా । ఓం అపానాయ స్వాహా । ఓం వ్యానాయ స్వాహా । ఓం ఉదానాయ స్వాహా । ఓం సమానాయ స్వాహా ॥ యథా సుఖం జుషధ్వమ్ ॥ శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - అమృతనైవేద్యం సమర్పయామి ॥
మధ్యే మధ్యే పానీయం సమర్పయామి । ఉత్తరాపోశనం సమర్పయామి ॥
హస్తౌ ప్రక్షాళయామి। పాదౌ ప్రక్షాళయామి। శుద్ధాచమనీయం సమర్పయామి॥

తాంబూలమ్

కస్తూరీ మోదితం పూగం స కర్పూరం సచూర్ణకమ్ ।
నాగవల్లీ దళోపేతం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
తాంబూలం సమర్పయామి ॥

ఫలమ్

ఇదం ఫలం మయా దేవ! స్థాపితం పురతస్తవ ।
తేన మే సఫలావాప్తిర్ భవేజ్జన్మని జన్మని ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
ఫలం సమర్పయామి ॥

దక్షిణా

హిరణ్యగర్భ గర్భస్థం హేమబీజం విభావసోః ।
అనంతపుణ్యఫలదమతః శాంతిం ప్రయచ్ఛ మే ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః -
సువర్ణ పుష్పయుక్త దక్షిణాదీన్ సమర్పయామి ॥

నీరాజనమ్

కదళీగర్భసంభూతం కర్పూరం తు ప్రదీపితమ్ ।
ఆరార్తికమహం కుర్వే పశ్య మాం వరదో భవ ॥
మంగళం దేశికేంద్రాయ, అనసూయాత్రి సూనవే ।
యోగవిద్యా నిధానాయ, దత్తాత్రేయాయ మంగళమ్ ॥

శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః - ఆనందకర్పూర నీరాజనం సమర్పయామి ॥ నీరాజనానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి ॥
(పాడుకోవడానికై హారతిగీతాన్ని పుట సంఖ్య (28)లో చూడుము.

మంత్రపుష్పమ్

శ్రద్ధయా సిక్తయా భక్త్యా హార్దప్రేమ్ణా సమర్పితః ।
మంత్రపుష్పాంజలిశ్చాయం కృపయా ప్రతిగృహ్యతామ్ ॥
(దిగంబరాయ విద్మహే । అవధూతాయ ధీమహి । తన్నో దత్తః ప్రచోదయాత్॥)
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః –
సువర్ణదివ్య మంత్రపుష్పం సమర్పయామి ॥

ప్రదక్షిణ నమస్కారాన్

శ్లో॥ పదే పదే యత్పరిపూజకేభ్యః సద్యోఽశ్వమేధాది ఫలం దదాతి ।
తాన్ సర్వపాపక్షయ హేతు భూతాన్ ప్రదక్షిణాన్తే పరితః కరోమి ॥
శ్లో॥ యాని కాని చ పాపాని జన్మాంతర కృతాని చ ।
తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే ॥
పాపోఽహం పాపకర్మాఽహం పాపాత్మా పాపసంభవః ।
త్రాహి మాం కృపయా దేవ శరణాగత వత్సల ॥
అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ।
తస్మాత్ కారుణ్యభావేన రక్ష రక్ష జనార్దన (దత్తదేవ) ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః –
ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి ॥

గురవే కుసుమాంజలి

కరుణాశక్తి కల్లోల కరుణాకలితాత్మనే ।
పరానుగ్రహరూపాయ గురవే కుసుమాంజలిః ॥
శ్రీగురుచరిత్రాత్మక –శ్రీపాదశ్రీవల్లభ – శ్రీనృసింహ సరస్వతీ – శ్రీగురు దత్తాత్రేయ స్వామినే నమః – ఇతి శ్రీ గురుపాదకమలే కుసుమాంజలిం దత్వా ॥

అపరాధ - క్షమా యాచన

ఆవాహనం న జానామి న జానామి తవార్చనమ్ ।
పూజాం చైవ న జానామి క్షమస్వ పరమేశ్వర ॥
అపరాధ సహస్రాణి క్రియంతేఽహర్నిశం మయా ।
దాసోఽయమితి మాం మత్వా క్షమస్వ శ్రీ దత్తదేవ ॥
శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః –
అపరాధ క్షమాపణం సమర్పయామి ॥

పునః పూజా - ఛత్రాది సమర్పణమ్

శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తాత్రేయ స్వామినే నమః – ఛత్రం సమర్పయామి చామరం వీజయామి । గీతం శ్రావయామి । దర్పణం దర్శయామి । నృత్యం సమర్పయామి । నాట్యం సమర్పయామి । ఆందోళికాది సమస్త రాజోపచారాన్, సకల దేవోపచారాన్, సమస్త శక్త్యోపచారాన్ భక్త్యోపచారాన్ సమర్పయామి ॥

పూజా సమర్పణమ్

యస్య స్మృత్యా చ నామోక్త్యా తపః పూజా క్రియాదిషు ।
న్యూనం సంపూర్ణతాం యాతి సద్యోవందే తమచ్యుతమ్ ॥
మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం జనార్దన ।
యత్పూజితం మయా దేవ! పరిపూర్ణం తదస్తు తే ॥
అనేన మయా యథాజ్ఞానేన యథా మిలితోపచార ద్రవ్యైః
భక్త్యాకృత ధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజనేన
శ్రీగురుచరిత్రాత్మక శ్రీ శ్రీపాదశ్రీవల్లభ – శ్రీనృసింహ సరస్వతీ –
శ్రీగురుదత్తాత్రేయ స్వామి సుప్రీత స్సుప్రసన్నో వరదో భవంతు ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

ఉద్వాసనమ్

గచ్ఛ గచ్ఛ దత్తదేవ స్వస్థానం పరమేశ్వర ।
యత్ర బ్రహ్మాదయో దేవా న విదుః పరమం పదమ్ ॥

ఇతి ఉద్వాసనమ్ సమర్పయామి ॥

తదుపరి హృదయంపై చెయ్యి పెట్టి ఈవిధంగా చెప్పాలి -

తిష్ఠ తిష్ఠ పరస్థానే స్వస్థానే వదతాం వర ।
యత్ర బ్రహ్మాదయ స్సర్వే సురాస్తిష్ఠంతు మే హృది ॥

(అని చెప్పి శ్రీస్వామివారిని తమ హృదయస్థానంలో నిల్పుకొని, తమలో ఐక్యమొందినట్లుగా అనుభవించాలి.)

దేవనాథ గురో స్వామిన్ దేశిక స్వాత్మ నాయక ।
త్రాహి త్రాహి కృపాసింధో పూజాం పూర్ణతరాం కురు ॥
న గురోరధికం న గురోరధికం న గురోరధికం న గురోరధికమ్ ॥
శివశాసనత శ్శివశాసనత శ్శివశాసనత శ్శివశాసనతః ॥

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

॥ సర్వం శ్రీ గురుదత్తాత్రేయ స్వామి
దివ్య శ్రీచరణారవిందార్పణ మస్తు ॥

(ముఖ్య గమనిక : పూజ పూర్తి చేసిన పిమ్మట పారాయణము చేయుటకు ఏర్పాటు చేసికొనిన ఆసనమునందు కూర్చొని, ఎదురుగా శ్రీగురుచరిత్ర గ్రంథమును పీఠముపై అలంకరింప చేయవలెను. అనంతరము నిత్యసంకల్పమును చెప్పవలెను. పారాయణమునకు ముందు ధ్యానశ్లోకములను ఘోరకష్టోద్ధరణ స్తోత్రమును పఠించవలయును. తదుపరి పారాయణమును ప్రారంభించవలెను.)

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

శ్రీ దత్తాత్రేయ అష్టోత్తర శతనామావళిః

(ప్రతి నామమునకు ముందు "ఓం", అని, చివరగా "నమః" చేర్చి చదువగలరు.)

ఓం అనసూయాసుతాయ నమః
దత్తాయ
అత్రిపుత్రాయ
మహామునయే
యోగేంద్రాయ
పుణ్యపురుషాయ
దేవేశాయ
జగదీశ్వరాయ
పరమాత్మనే
పరబ్రహ్మణే 10
సదానందాయ
జగద్గురవే
నిత్యతృప్తాయ
నిర్వికారాయ
నిర్వికల్పాయ
నిరంజనాయ
గుణాత్మకాయ
గుణాతీతాయ
బ్రహ్మవిష్ణు శివాత్మకాయ
నానారూపధరాయ 20
నిత్యాయ
శాంతాయ
ఓం దాంతాయ
కృపానిధయే
భక్తప్రియాయ
భవహరాయ
భగవతే
భయనాశనాయ
ఆదిదేవాయ
మహాదేవాయ 30
సర్వేశాయ
భువనేశ్వరాయ
వేదాంతవేద్యాయ
వరదాయ
విశ్వరూపాయ
అవ్యయాయ
హరయే
సచ్చిదానందాయ
సర్వేశాయ
యోగేశాయ 40
భక్తవత్సలాయ
దిగంబరాయ
దివ్యమూర్తయే
దివ్యభూతివిభూషణాయ

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

ఓం అనాదిసిద్ధాయ నమః
సులభాయ
భక్తవాంఛితదాయకాయ
ఏకస్మై
అనేకాయ
అద్వితీయాయ 50
నిగమాగమవందితాయ
భుక్తిముక్తిప్రదాయ
కార్తవీర్యవరప్రదాయ
శాశ్వతాంగాయ
విశుద్ధాత్మనే
విశ్వాత్మనే
విశ్వతోముఖాయ
సర్వేశ్వరాయ
సదాతుష్టాయ
సర్వమంగళదాయకాయ 60
నిష్కళంకాయ
నిరాభాసాయ
నిర్వికల్పాయ
నిరాశ్రయాయ
పురుషోత్తమాయ
లోకనాథాయ
పురాణపురుషాయ
అనఘాయ
అపారమహిమ్నే
అనంతాయ 70
ఆద్యంతరహితాకృతయే

ఓం సంసారవనదావాగ్నయే నమః
భవసాగరతారకాయ
శ్రీనివాసాయ
విశాలాక్షాయ
క్షీరాబ్ధిశయనాయ
అచ్యుతాయ
సర్వపాపక్షయకరాయ
తాపత్రయనివారణాయ
లోకేశాయ 80
సర్వభూతేశాయ
వ్యాపకాయ
కరుణామయాయ
బ్రహ్మాదివందితపదాయ
మునివంద్యాయ
స్తుతిప్రియాయ
నామరూపక్రియాతీతాయ
నిస్పృహాయ
నిర్మలాత్మకాయ
మాయాధీశాయ 90
మహాత్మనే
మహాదేవాయ
మహేశ్వరాయ
వ్యాఘ్రచర్మాంబరధరాయ
నాగకుండల భూషణాయ
సర్వలక్షణ సంపూర్ణాయ
సర్వసిద్ధి ప్రదాయకాయ
సర్వజ్ఞాయ

ఓం కరుణాసింధవే నమః
సర్వహారాయ 100
సదాశివాయ
సహ్యాద్రివాసాయ
సర్వాత్మనే

ఓం భవబంధవిమోచనాయ నమః
విశ్వంభరాయ
విశ్వనాథాయ
జగన్నాథాయ
జగత్ప్రభవే 108

ఓం ద్రాం శ్రీ దత్తాత్రేయాయ నమః

॥ ఇతి శ్రీ దత్తాత్రేయ అష్టోత్తర శత నామావళిః ॥

ఔదుంబర పాదుకా స్తోత్రమ్

వందే వాఙ్మనసాతీతం నిర్గుణం సగుణం గురుం ।
దత్తమాత్రేయ మానందకందం భక్తేష్టపూరకమ్ ॥
నమామి సతతం దత్త మౌదుంబర నివాసినం ।
యతీంద్రరూపం చ సదా నిజానంద ప్రబోధకమ్ ॥
కృష్ణా యదగ్రే భువనేశానీ విద్యానిధి స్తథా ।
ఔదుంబరాః కల్పవృక్షాః సర్వతః సుఖదాః సదా ॥
భక్తబృందాన్ దర్శనతః పురుషార్థ చతుష్టయం ।
దదాతి భగవాన్ భూమా సచ్చిదానంద విగ్రహః ॥
జాగర్తి గుప్తరూపేణ గోప్తా ధ్యాన సమాధితః ।
బ్రహ్మబృందం బ్రహ్మసుఖం దదాతి సమదృష్టితః ॥
కృష్ణా తృష్ణహరా యత్ర సుఖదా భువనేశ్వరీ ।
యత్ర మోక్ష ధరాడ్ దత్త పాదుకా తాం నమామ్యహమ్ ॥
నమామి గురుమూర్తిం తం తాపత్రయ హరం హరిం ।
ఆనందమయ మాత్మానం నవభక్త్యా సుఖప్రదమ్ ॥
కరవీరస్థ విబుధ మూఢపుత్రం వినందితం ।
ఛిన్న జిహ్వాం బుధం చక్రే తద్వన్మయి కృపాం కురు ॥

॥ ఇతి శ్రీ ప.ప. శ్రీవాసుదేవానంద సరస్వతీస్వామి విరచిత
ఔదుంబర పాదుకాస్తోత్రమ్ సంపూర్ణమ్ ॥

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

శ్రీ దత్తాత్రేయ ఆరతీ

పల్లవి : జయదేవ జయదేవ జయశ్రీ గురుదత్తా
ఆరతీ ఓవాళితా హరలీ భవచింతా - ॥ జయ ॥

చ.1 త్రిగుణాత్మకత్రైమూర్తీ దత్త హా జాణా ।
త్రిగుణీ అవతార త్రైలోక్యరాణా ।
నేతి నేతి శబ్దే న యే అనుమానా ।
సురవరమునిజన యోగీ సమాధి న యే ధ్యానా ॥ జయ ॥

2. సబాహ్యా అభ్యంతరీ తూ ఏక దత్తా ।
అభాగ్యాసీ కైంచీ కళేల హీ మాత ।
పరాహి పరతలీ తేథే కైంచా హేత ।
జన్మమరణాచా పురలాసే అంత ॥ జయ ॥

3. దత్త యేఊనియా ఉభా ఠాకలా ।
సద్భావేఁ సాష్టాంగే ప్రణిపాత కేలా ।
ప్రసన్న హోఊని ఆశీర్వాద దిధలా ।
జన్మమరణాచా ఫేరా చుకవిలా ॥ జయ ॥

4. దత్త దత్త ఐసే లాగలే ధ్యాన ।
హారపలేఁ మన ఝాలేఁ ఉన్మన ।
మీ-తూ-పణాచీ ఝాలీ బోళవణ ।
ఏకా జనార్దనీఁ శ్రీదత్త ధ్యానా ॥ ॥ జయ ॥

❖ ❖ ❖

శ్రీ నృసింహ సరస్వతీ స్వామి హారతి

పల్లవి : జయదేవ జయదేవ జయసద్గురు దత్తా
నరసింహ సరస్వతీ జయ విశ్వంభరితా ॥ జయ ॥

చ.1 కృష్ణా పంచగంగా సంగమ నిజస్థాన ।
చరిత్ర దావుని కేలేఁ గాణగాపురగమన ।
తేథేం భక్తశ్రేష్ఠ త్రివిక్రమయతి జాణ ।
విశ్వరూపే తయా దిధలే దర్శన ॥ జయ ॥

2. వంధ్యా సాఠీ వర్షే పుత్రనిధాన ।
మృత బ్రాహ్మణ ఉఠవిలా తీర్థ శింపూన ।
వాంఝ మహిషీ కాఢవీ దుగ్ధ దోహూన ।
అంత్యజాచే వదనీం నిగమ సంపూర్ణ ॥ జయ ॥

3. శుష్క కాష్ఠీ పల్లవ దావుని లవలాహీఁ ।
కుష్ఠీ బ్రాహ్మణ కేలా శుద్ధ నిజదేహీఁ ।
అభినవ లీలా త్యాంచీ వర్ణూ మీ కాయీ ।
మ్లేచ్ఛ రాజా యేఉని వందీ శ్రీపాయీ ॥ జయ ॥

4. దీపావళిచే దివశీ భక్త యేఊని ।
ఆరహి జణ శేవిటీ మస్తక శ్రీచరణీ ।
ఆరహీ గ్రామీ భిక్షా కేలీ తే దినీఁ ।
నిమిషమాత్రే తంతుక నేలా శివస్థానీఁ ॥ జయ ॥

5. ఐసే చరిత్ర దావుని జడముఢ ఉద్ధరిలే ।
భక్తవత్సల బ్రీద అపులే మిరవీలే ।
అగాధ మహిమా హ్మాణవుని వేదశ్రుతి బోలే ।
గంగాధర తనయ వందీ పాఊలే ॥జయ ॥

❖ ❖ ❖

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

నిత్య సంకల్ప విధానము

సప్తాహము లేదా త్రిదివసములు దీక్షగా గురుచరిత్ర పారాయణము చేయునప్పుడు మొదటిరోజున "పూజాపద్ధతి"లో వివరించిన విధంగా సంకల్పమును, పూజను పూర్తి చేయవలెను. అనంతరం పారాయణం ప్రారంభించుటకు ముందు దిగువ విధంగా నిత్యసంకల్పం చెప్పుకొనవలెను.

నిత్య ప్రారంభసమయ సంకల్పము

ఆచమ్య ॥ ... శుభతిథౌ .... గోత్రోహం ..... నామధేయోహం .... ధర్మపత్నీ సమేతోహం ॥ శ్రీపాదశ్రీవల్లభ – శ్రీనృసింహ సరస్వతీ– శ్రీగురు దత్తాత్రేయ స్వామి ప్రీత్యర్థం ॥

పూర్వసంకల్పిత శ్రీగురుచరిత్ర సప్తాహ (త్రిదివస) దీక్షాపూర్వక పారాయణాంగత్వేన అద్య ప్రథమ దివస శ్రీగురుచరిత్ర పఠనాఖ్యం కర్మ కరిష్యే॥ (పై సంకల్పములో ప్రథమ... అనుచోట ద్వితీయ – తృతీయ – చతుర్థ – పంచమ – షష్ఠ – సప్తమ – అను మాటను ఏ రోజుకారోజు చేర్చుకొనవలయును.)

సూచన : వీలు లేనప్పుడు రెండవ రోజునుండి శ్రీమహాగణపతి పూజను సంక్షిప్తంగా చేయవచ్చును. అందుకుగాను క్రింది విధంగా సంకల్పం చెప్పుకోవాలి.

ఆదౌ నిర్విఘ్నేన పరిసమాప్త్యర్థం శ్రీమహాగణాధిపతి స్మరణ పూర్వక ధ్యానం కరిష్యే ॥

శ్లో॥ వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభా ।
నిర్విఘ్నం కురుమే దేవ! సర్వకార్యేషు సర్వదా ॥

శ్రీమహాగణాధిపతయే నమః – పుష్పాక్షతైః సమర్ప్య – నమస్కృత్వా – శ్రీమహాగణాధిపతి సుప్రీణాతు । (అని పుష్పాక్షతలు సమర్పించి శ్రీమహాగణపతికి నమస్కరించవలెను.)

❖ ❖ ❖

పారాయణ ప్రారంభ శ్లోకములు

(శ్రీగురుచరిత్ర పారాయణము ప్రారంభించుటకు ముందు పఠించవలసిన ధ్యానశ్లోకములు, ఘోరకష్టోద్ధరణ స్తోత్రము)

శ్లో॥ గజాననం భూతగణాధి సేవితం, కపిత్థ జంబూఫలచారు భక్షణమ్ ।
ఉమాసుతం శోకవినాశకారకం, నమామి విఘ్నేశ్వర పాదపంకజమ్ ॥

శ్లో॥ శారదా శారదాంభోజ, వదనా వదనాంబుజే ।
సర్వదా సర్వదాస్మాకం, సన్నిధిః సన్నిధిం క్రియాత్ ॥

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః ।
గురుఃసాక్షాత్ పరబ్రహ్మా, తస్మై శ్రీ గురవే నమః ॥

శ్లో॥ అఖండ మండలాకారం, వ్యాప్తం యేన చరాచరమ్ ।
తత్పదం దర్శితం యేన, తస్మై శ్రీ గురవే నమః ॥

శ్లో॥ అచింత్యా వ్యక్తరూపాయ నిర్గుణాయ గుణాత్మనే ।
సమస్త జగదాధార, మూర్తయే బ్రహ్మణే నమః ॥

శ్లో॥ మాలాకమండలురధః కరపద్మయుగ్మే
మధ్యస్థ పాణియుగళే డమరు త్రిశూలే ।
యస్యస్థ ఊర్ధ్వకరయోః శుభశంఖచక్రే
వందే తమత్రివరదం భుజషట్క యుక్తమ్ ॥

శ్లో॥ అనసూయాత్రి సంభూతో దత్తాత్రేయో దిగంబరః ।
స్మర్తృగామీ స్వభక్తానాం ఉద్ధర్తా భవ(యు) సంకటాత్ ॥

శ్లో॥ కృష్ణానదీతీరే వసతి ప్రసిద్ధం, శ్రీపాదశ్రీవల్లభయోగిమూర్తిమ్ ॥
సర్వైర్జనైః చింతిత కల్పవృక్షం, శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

శ్లో॥ భక్తానాం తరణార్థ సర్వజగతాం దీక్షాదదన్ యోగినాం ।
సుక్షేత్రం పురగాణగస్థిత ప్రభో! దత్వా చతుష్కామదమ్ ॥
స్తుత్వా భక్త సరస్వతీ గురుపదం జిత్వాద్యదోషాదికం ।
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥

శ్లో॥ నమస్తే యోగిరాజేంద్ర దత్తాత్రేయ దయానిధే ।
స్మృతిం తే దేహి మాం రక్ష భక్తిం తే దేహి మే దృఢామ్ ॥

శ్లో॥ అనసూయా సుతం దేవం భోగమోక్షాదిదాయకమ్ ।
భక్తానామిష్టదాతారం దత్తాత్రేయ గురుం భజే ॥

॥అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

❖ ❖ ❖

శ్రీ దత్తాత్రేయ ఘోరకష్టోద్ధరణ స్తోత్రము

శ్రీపాదశ్రీవల్లభ త్వం సదైవ,
శ్రీదత్తాస్మాన్ పాహి దేవాధిదేవ ।
భావగ్రాహ్య క్లేశ హారిన్ సుకీర్తే,
ఘోరాత్ కష్టా దుద్ధరాస్మా న్నమస్తే ॥ 1
త్వం నో మాతా త్వం పితాఽఽప్తోఽధిపస్త్వం,
త్రాతా యోగక్షేమ కృత్ సద్గురుస్త్వమ్ ।
త్వం సర్వస్వం నో ప్రభో విశ్వమూర్తే,
ఘోరాత్ కష్టా దుద్ధరాస్మా న్నమస్తే ॥ 2
పాపం తాపం వ్యాధిమాధిం చ దైన్యం,
భీతిం క్లేశం త్వం హరాశు త్వదన్యమ్ ।
త్రాతారం నో వీక్ష ఈశాస్తజూర్తే,
ఘోరాత్ కష్టా దుద్ధరాస్మా న్నమస్తే ॥ 3
నాన్యస్త్రాతా నాపి దాతా న భర్తా,
త్వత్తో దేవ త్వం శరణ్యోఽకహర్తా ।
కుర్వాత్రేయానుగ్రహం పూర్ణరాతే,
ఘోరాత్ కష్టా దుద్ధరాస్మా న్నమస్తే ॥ 4
ధర్మే ప్రీతిం సన్మతిం దేవ భక్తిం,
సత్సంగాప్తిం దేహి భుక్తిం చ ముక్తిమ్ ।
భావాసక్తిం చాఖిలానందమూర్తే,
ఘోరాత్ కష్టా దుద్ధరాస్మా న్నమస్తే ॥ 5
శ్లోకపంచకమేతద్యో, లోకమంగళ వర్ధనమ్ ।
ప్రపఠేన్నియతో భక్త్యా, స శ్రీదత్తప్రియో భవేత్ ॥ 6

॥ ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీవాసుదేవానంద సరస్వతీ
విరచితం శ్రీదత్తాత్రేయ ఘోరకష్టోద్ధరణ స్తోత్రమ్ ॥
॥ శ్రీ శ్రీపాద శ్రీవల్లభ - శ్రీనృసింహ సరస్వతీ
శ్రీగురుదత్తాత్రేయాయ నమో నమః ॥

॥ జయ గురుదత్త - శ్రీగురుదత్త ॥

(ఇప్పుడు పారాయణము ప్రారంభింపవలయును)

❖ ❖ ❖

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

నిత్యసమాప్తి సమయ సంకల్పము

పారాయణము పూర్తిచేసిన పిమ్మట శ్రీగురుచరిత్ర గ్రంథమును గంధపుష్పాక్షతలతో పూజించవలెను. లేదా, క్రింది విధముగా పంచోపచార పూజను చేయవచ్చును.

లం- పృథివీ తత్త్వాత్మనే - గంధం పరికల్పయామి నమః ॥
హం- ఆకాశ తత్త్వాత్మనే - పుష్పం పరికల్పయామి నమః ॥
యం- వాయుతత్త్వాత్మనే - ధూపం పరికల్పయామి నమః ॥
రం- వహ్ని తత్త్వాత్మనే - దీపం పరికల్పయామి నమః ॥
వం- అమృత తత్త్వాత్మనే - అమృత నైవేద్యం పరికల్పయామి నమః ॥
సం - సర్వతత్త్వాత్మనే - సర్వోపచారపూజాం పరికల్పయామి నమః ॥

చివరగా కర్పూర ఆరతినిచ్చి, పుష్పాక్షతలను సమర్పించవలెను. అనంతరము ముగింపు శ్లోకములు, అపరాధ క్షమాపణ స్తోత్రమును పఠించవలెను. తదుపరి కర్మ సమర్పణము చేయాలి.

అనేన ప్రథమ దివస - శ్రీగురుచరిత్ర పారాయణాఖ్యేన - కర్మణా - శ్రీపాద శ్రీవల్లభ - శ్రీనృసింహ సరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయ దేవతా సుప్రీతాః - సుప్రసన్నాః - వరదా భవంతు ॥ తత్సత్ పరబ్రహ్మార్పణమస్తు ॥ ఓం విష్ణవే నమః - విష్ణవే నమః - విష్ణవే నమః ॥

(సూచన : పైన ప్రథమదివస అనుచోట - ద్వితీయ - తృతీయ - చతుర్థ- పంచమ - షష్ఠ - సప్తమదివస - అని ఏ రోజుకారోజు మార్చుకొని చెప్పుకొనవలెను.)

పారాయణ సమాపన శ్లోకములు

(పారాయణము ముగించిన పిమ్మట పఠించవలసిన మంగళ శ్లోకములు)

శ్లో॥ స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం లోకాస్సమస్తాః సుఖినో భవంతు ॥

శ్లో॥ కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ ।
దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః ॥

శ్లో॥ అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః ।
అధనాస్సధనాస్సంతు జీవంతు శరదాం శతమ్ ॥

శ్లో॥ నమస్తే భగవన్ దేవ దత్తాత్రేయ జగత్ప్రభో! ।
సర్వ బాధాప్రశమనం కురు శాంతిం ప్రయచ్ఛమే ॥

శ్లో॥ దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్తవత్సలమ్ ।
ప్రపన్నార్తి హరం వందే స్మర్తృగామీ సమోఽవతు ॥

శ్లో॥ అపరాధ సహస్రాణి క్రియంతేఽహర్నిశం మయా ।
దాసోఽయమితి మాం మత్వా క్షమస్వ పరమేశ్వర ॥

శ్లో॥ యదక్షర పదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్ ।
తత్సర్వం క్షమ్యతాం దేవ! దత్తాత్రేయ! నమోఽస్తు తే ॥

శ్లో॥ మంగళం ఆదినాథాయ గురూణాం చక్రవర్తినే ।
బోధరూపాయ వేద్యాయ దత్తాత్రేయాయ మంగళమ్ ॥

శ్లో॥ శ్రీపాద శ్రీవల్లభాఖ్య శ్రీనృసింహ సరస్వతీ ।
సద్గురు సార్వభౌమాయ దత్తాత్రేయాయ మంగళమ్ ॥

శ్లో॥ త్వమేవ మాతా చ పితా త్వమేవ, త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ ।
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ ॥

శ్లో॥ కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్ ।
కరోమి యద్యత్ సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి ॥

॥ హరి నారాయణాయేతి సమర్పయామి ॥
॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

◆ ◆ ◆

శ్రీ దత్తాత్రేయ అపరాధ క్షమాపణ స్తోత్రము

రసజ్ఞా వశా తారకం స్వాదు లభ్యం గృహీతం కదాచిన్న తే నామ దత్త ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 1

వియోన్యంతరే దైవదార్ధ్యాద్విభో ప్రాగ్ గృహీతం కదాచిన్న తే నామ దత్త ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 2

మయా మాతృగర్భస్థితి ప్రాప్త కష్టాద్ గృహీతం కదాచిన్న తే నామ దత్త ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 3

మయా జాతమాత్రేణ సంమోహితేన గృహీతం కదాచిన్న తే నామ దత్త ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 4

మయా క్రీడనాసక్తచిత్తేన బాల్యే గృహీతం కదాచిన్న తే నామ దత్త ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 5

మయా యౌవనేఽజ్ఞానతో భోగతోషాద్ గృహీతం కదాచిన్న తే నామ దత్త ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 6

మయాస్థావిరేఽనిఘ్న సర్వేంద్రియేణ గృహీతం కదాచిన్న తే నామ దత్త ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 7

హృషీకేశ! మే వాఙ్మనః కాయజాతం హరే జ్ఞానతోఽజ్ఞానతో విశ్వసాక్షిన్ ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 8

స్మృతో ధ్యాత ఆవాహితోఽస్వర్చితో వా న గీతః స్తుతో వందితో వా న జప్తః ।
క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం క్షమస్వాపరాధం ప్రభో! క్లిన్నచిత్త ॥ 9

దయాబ్ధిర్ భవాదృఙ్న సాగాశ్చ మాదృగ్ భవత్యాప్త మంతోర్భవాన్మే శరణ్యః ।
యథాలంబనం భూర్హి భూనిః స్మృతాంఘ్రేరితి ప్రార్థితం దత్త శిష్యేణ సారమ్ ॥ 10

॥ ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీవాసుదేవానంద
సరస్వతీ విరచితం శ్రీదత్తాత్రేయ అపరాధక్షమాపణ స్తోత్రమ్ ॥

(అని చెప్పి శ్రీస్వామివారికి సాష్టాంగ వందనము చేయవలెను. స్త్రీలు మాత్రము తమ రెండు మోకాళ్ళు నేలపై నిల్పి వక్షఃస్థలము నేలకు తగలకుండా శిరసువంచి అర్ధ సాష్టాంగ వందనమును చేయవలెను.)

(ఈ క్రింద పేర్కొనబడిన శ్రీదత్త నామావళిని కనీసం ఐదారు నిముషాలు సంకీర్తనం చేసి, ఆనాటి పారాయణమును సంపూర్ణము చేయవలెను.)

దిగంబరా! దిగంబరా! శ్రీపాదవల్లభ దిగంబరా!!
దత్తగురో! దత్తగురో! దత్తాత్రేయ అవధూత గురో!!

జయ గురుదత్త! శ్రీగురుదత్త! శ్రీగురుదత్త! జయ గురుదత్త!!
దత్త! దత్త! జయ గురుదత్త!! దత్త! దత్త! శ్రీ గురుదత్త!!

॥ అవధూత చింతన శ్రీ గురుదేవదత్త ॥
శ్రీ శ్రీపాదశ్రీవల్లభ – శ్రీ నృసింహ సరస్వతీ –
శ్రీగురు దత్తాత్రేయాయ నమో నమః ॥
॥ హరయే నమః ॥

◆ ◆ ◆

మాధూకరి విధానము

మాధూకరము అనగా మధుకరవృత్తి అని తాత్పర్యము. తుమ్మెదలు పూలమొక్కలపై ఎగురుతూ వికసించిన పూలనుండి మకరందమును అనగా పూ తేనెను గ్రహించి గ్రోలినట్లుగా, దత్తదీక్షను స్వీకరించిన సాధకులు గృహస్థుల ఇండ్లకు వెళ్ళి "భవతి భిక్షాం దేహి" అని యాచన ద్వారా ఆహారమును భిక్షగా స్వీకరించుట అని గమనింపవలెను.

సప్తాహదీక్షను లేదా, మరొక విధమైన దీక్షను స్వీకరించి, శ్రీగురుచరిత్రను పారాయణము చేయునపుడు మాధుకరముగా భిక్షను స్వీకరించుట ఉత్తమ పద్ధతిగా చెప్పబడినది. శ్రీ సమర్థ రామదాసుగారి సంప్రదాయంలో మాధుకరిని స్వీకరించుట తప్పనిసరిగా ఆచరింపబడుచున్నది. మరికొందరు కూడా మాధుకరి భిక్షను స్వీకరించుచున్నారు. అంతేగాదు, ప్రధానంగా శ్రీదత్తాత్రేయ స్వామివారు ప్రత్యక్షంగా కొలువుదీరియున్న పవిత్రమైన గాణగాపురమునందు మాధూకరి – భిక్షను స్వయంగా తాము స్వీకరించుటయే గాక, తాము మరొకరికి మాధూకరిగా ఏదో ఒక ఆహార పదార్థమును ఇచ్చు సంప్రదాయము ఆచరింపబడుటను మనము ఇప్పుడు కూడా గమనింప వచ్చును. **'ఆహారశుద్ధౌ – సత్త్వశుద్ధిః'** అని కదా శాస్త్రవచనం.

కావున, మాధూకరిని స్వీకరించు విధానమును గూర్చి ఈ దిగువన పేర్కొనబడినది. అయిననూ, తమ, తమ సంప్రదాయమును అనుసరించి ఆచరింపగలరు.

శేషము భగవత్కృప. జయ గురుదత్త!

ముఖ్యసూచన : మధ్యాహ్న సమయంలో తమ గృహము నందు కూడా మాధూకరిని స్వీకరింపవచ్చును లేదా, ఇతర గృహములకు వెళ్ళి స్వీకరింపవచ్చును. అయితే, మూడు, ఐదు, ఏడు గృహములకు మించి వెళ్ళకూడదు.

మాధూకరము స్వీకరించు పద్ధతి :

సాధకుడు ముందుగా ఒక శుభ్రవస్త్రమును కక్షపాల అనగా జోలెగా సిద్ధము చేసికొని కుడిభుజమునందు వ్రేలాడునట్లుగా ధరించవలెను. మధ్యాహ్న సమయంలో మాధూకరిని యాచించునప్పుడు ముందుగా ఈ క్రింద ఉదహరించిన శ్లోకమంత్రములను పఠించవలెను.

జయ జయ రఘువీర సమర్థ! శ్రీగురుదత్త! జయ గురుదత్త!!

1. **గణాధీశ జో ఈశ సర్వాం గుణాంచా ।**
మూళారంభ ఆరంభ తో నిర్గుణాచా ॥
నమూం శారదా మూళ చత్వార వాచా ।
గమూం పంథ ఆనంత యా రాఘవాచా ॥ (మనాచే శ్లోక్ – 01)

2. తుఝా భిక్ష కూ దాతయా రామచంద్రా ।
సదా స్వస్థచింతీ తసే గా మహేంద్రా ॥
రాజాధీశ దేశా ఉర పూర్ణ ధ్యావేc ।
భవదైన్య హేc దేశధూడీ కరావేc ॥
3. శుకా సారిఖేc పూర్ణ వైరాగ్య జ్యావేc ।
వశిష్ఠా పరే జ్ఞాన యోగేశ్వరాచేc ॥
కవీ వాల్మికా సారిఖామాన్య ఐసా ।
నమస్కార మాఝా సద్గురూ రామదాసా ॥

(పైవిధంగా పఠించుచూ మాధూకరిని “భిక్షాం దేహి’అని యాచించవలెను. మాధూకరీ భిక్షను స్వీకరించిన పిమ్మట ఆహారం తీసికోవడానికి ముందు ప్రార్థన పూర్వకంగా పఠించవలసిన శ్లోక మంత్రములు)

1. మనాచీం శతేం ఐకతాం దోష జాతీ ।
మతీ మంద తే సాధనా యోగ్య హోతీ ॥
చఢే జ్ఞాన వైరాగ్య సామర్థ్య అంగీc ।
మ్హణే దాస విశ్వాసతాం ముక్తి భోగీc ॥ (మనాచే శ్లోక్ - 205)
2. బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్ బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా ॥ (గీత. 4/24)
3. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ (గీత. 15/14)
4. అన్నపూర్ణే సదా పూర్ణే! శంకర ప్రాణవల్లభే!
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి!!
నమః పార్వతీ పతయే! హర! హర! మహాదేవ!! హర!!

అని ప్రార్థించిన తర్వాత ఆహారమును సభక్తికముగా శ్రీదత్తదేవునికి నివేదించవలయును. అందులో నుండి ఒక పిడికెడు ఆహారమును తీసికొని బయట నీళ్ళతో స్థలశుద్ధి చేసి, శ్వానబలిని పెట్టవలెను. ఈ సమయంలో ఒకవేళ దైవికంగా ఎవరేని భిక్షుకుడు వచ్చి చేయి చాచిన యెడల, దత్తునిగా భావించి వెంటనే అతనికి ఒక పిడికెడు ఆహారమును తీసి భిక్షగా ఇవ్వవలెను. తదుపరి మిగిలిన ఆహారమునే భగవత్ప్రసాదముగా స్వీకరించి భుజించవలయును. ఇతి శివమ్.

॥ అవధూత చింతన శ్రీగురుదేవత్త ॥
॥ సర్వం శ్రీ గురు దత్తాత్రేయ స్వామి చరణారవిందార్పణమస్తు ॥
(మాధూకరి విధానము సమాప్తము)

◆ ◆ ◆

॥ శ్రీదత్త ప్రసన్న ॥

శ్రీ దత్త ప్రదక్షిణా విధానము

శ్రీగురుచరిత్రాత్మక శ్రీదత్తప్రదక్షిణ విధానము అనాదిగా ఆచరింపబడుచున్నది. ఇది అత్యంత శ్రేష్ఠమైనది. అభీష్టసిద్ధికి అమోఘమైనది.

బ్రాహ్మీముహూర్తంలో నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొనిన మీదట ప్రదక్షిణమునకు సిద్ధపడవలెను. ప్రదక్షిణము చేయుటకు అనువైనచోటు ఎంపిక చేసికొనవలెను. పట్టు లేదా శుచి వస్త్రములను ధరించవలెను. నేలను ఊడ్చి, అలికి శుద్ధి చేసిన మీదట చక్కని రంగవల్లులతో అలంకరించాలి. కడిగి తుడిచిన ఒక ఎత్తైన చెక్కపీటను పసుపు కుంకుమలతో అలంకరించి ఉంచవలెను. పీటపై బియ్యపు పిండితో

అష్టదళ పద్మమును వేసి, దానిమీద శ్రీదత్తాత్రేయ స్వామివారి చిత్రపటమును, దాని ముందు "శ్రీగురుచరిత్ర" గ్రంథమును పట్టుగుడ్డలో చుట్టి ఉంచవలెను. దానిముందు దీపారాధన చేసి, అగరువత్తులను వెలిగించవలెను. పుష్పాక్షతలతో పూజించవలెను. ప్రదక్షిణములు పూర్తి అయ్యే వరకు దీపము అఖండంగా వెలుగుచుండునట్లుగా జాగ్రత్త పడవలెను. అంతా సిద్ధమైన తర్వాత ఈ క్రింద తెలిపిన విధానముగా ప్రదక్షిణ – నమస్కారములను చేయువలయును.

నమస్తే యోగిరాజేంద్ర దత్తాత్రేయ దయానిధే ।
స్మృతిం తే దేహి మాం రక్ష భక్తిం తే దేహి మే దృఢామ్ ॥

"దత్తాత్రేయ ప్రభూ! నీవు యోగులకు రాజువు. యోగులలో శ్రేష్ఠుడవు. ఓ దయానిధీ! నీకు నమస్కారము. నేను ఎల్లప్పుడు నిన్ను మరువకుండునట్లుగా, నిన్నే జ్ఞప్తియందు ఉంచుకొనునట్లుగా చేయుము. నీపైన మెండైన భక్తిని కలిగియుండునట్లుగా అనుగ్రహించి నన్ను రక్షించుము" అని ఈ శ్లోక భావము.

శ్రీ దత్తాత్రేయ స్వామి షోడశ నామాలు :

1. ఓం శ్రీ వరదాయ నమః ।
2. ఓం శ్రీ కార్తవీర్యాది రాజరాజ్యప్రదాయ నమః ।
3. ఓం శ్రీ అనఘాయ నమః ।
4. ఓం శ్రీ విశ్వశ్లాఘ్యాయ నమః ।
5. ఓం శ్రీ అమితాచారాయ నమః ।
6. ఓం శ్రీ దత్తాత్రేయాయ నమః ।
7. ఓం శ్రీ మునీశ్వరాయ నమః ।
8. ఓం శ్రీ పరాశక్తి పదాశ్లిష్టాయ నమః ।
9. ఓం శ్రీ యోగానందాయ నమః ।
10. ఓం శ్రీ సదోన్మదాయ నమః ।
11. ఓం శ్రీ సమస్త వైరితేజోహృతే నమః ।
12. ఓం శ్రీ పరమామృత సాగరాయ నమః ।
13. ఓం శ్రీ అనసూయాగర్భరత్నాయ నమః ।
14. ఓం శ్రీ భోగమోక్షసుఖప్రదాయ నమః ।
15. ఓం శ్రీ శ్రీపాద శ్రీవల్లభాయ నమః ।
16. ఓం శ్రీ శ్రీ నృసింహ సరస్వతీ స్వామి సద్గురు పాదుకాభ్యాం నమః ॥

భావయుక్తముగా శ్లోకమును చదువుచూ పీఠము చుట్టూరా ప్రదక్షిణము చేయవలెను. మొదటి ప్రదక్షిణము పూర్తి కాగానే క్రింద పేర్కొనబడిన నామాలలో గల మొదటి నామము – **"ఓం శ్రీ వరదాయ నమః"** అని చెప్పి సాష్టాంగ వందనము చేయవలెను. తిరిగి "నమస్తే యోగిరాజేంద్ర...." అను శ్లోకమును చదువుచూ ప్రదక్షిణము చేసి రెండవ నామమును చెప్పి మరల సాష్టాంగ నమస్కారము చేయాలి. ఈవిధంగా శ్లోకముతో ప్రదక్షిణము చేసి, నామమును పఠించి నమస్కరించాలి. పదహారు (16) నామాలతో పదహారు ప్రదక్షిణములు (16) పదహారుసార్లు సాష్టాంగ నమస్కారమును చేయుటవలన ఒక ఆవర్తి పూర్తియగును. ఇదే రీతిగా పదహారేసి సంఖ్య చొప్పున ఏడు (7) ఆవర్తనలు పూర్తి చేయవలెను. తద్వారా (7×16=112) మొత్తము నూట పన్నెండు ప్రదక్షిణలు పూర్తి యగును.

పురుషులు మాత్రమే సంపూర్ణ సాష్టాంగ వందనమును చేయాలి. కాని, స్త్రీలు మాత్రము తమ రెండు మోకాళ్ళను నేలపై నిల్పి, వక్షస్థలమును నేలను తాకకుండా శిరసు వంచి అర్ధ సాష్టాంగ నమస్కారమును మాత్రమే చేయవలెను.

ఈ ప్రకారంగా 112 ప్రదక్షిణములు పూర్తియైన పిదప శ్రీస్వామివారి యెదుట ప్రశాంతంగా కూర్చొని ఈ దిగువన గల శ్లోక మంత్రములను మూడింటిని కలిపి నూట ఎన్మిది (108) సార్లు ధ్యానపూర్వకంగా జపించవలెను. చేసిన జపసంఖ్యను శ్రీ స్వామివారికి అర్పించవలెను.

శ్రీ దత్తమంత్రాత్మక శ్లోకములు

1. **వరదః కార్తవీర్యాది రాజరాజ్యప్రదోఽనఘ ।**
   విశ్వశ్లాఘ్యోఽమితాచారో దత్తాత్రేయో మునీశ్వరః ॥
2. **పరాశక్తిపదాశ్లిష్టో యోగానందః సదోన్మదః ।**
   సమస్త వైరితేజోహృత్ పరమామృత సాగరః ॥
3. **అనసూయా గర్భరత్నం భోగమోక్ష సుఖప్రదః ।**
   శ్రీపాదవల్లభః పాతు శ్రీ నృసింహ సరస్వతీ ॥

॥ సర్వం శ్రీ దత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

(ఇంతటితో ఉదయకాల ప్రదక్షిణా కార్యక్రమము ముగిసినది.)

సాయంకాల ప్రదక్షిణ విధానము

సాయంత్రం పైన ఉదయం చెప్పిన విధంగా స్నానం చేసి శుచియై శుద్ధ - మడి వస్త్రమును ధరించాలి. శ్రీజగన్మాత చిత్రపటమును లేదా చిన్న విగ్రహమును పీఠముపై ప్రతిష్ఠించి పంచోపచార పూజను చేయవలెను. తదుపరి పీఠము ముందు నిలువబడి చివర పేర్కొనబడిన మొదటి (1) శ్లోక మంత్రమును పఠించి ప్రదక్షిణము చేయవలెను. ప్రదక్షిణము చివర పీఠము ముందు నిలిచి రెండవ (2) శ్లోకమును చదివి, సాష్టాంగ నమస్కారమును చేయాలి. ఈ రీతిగా (108) నూట ఎనిమిది ప్రదక్షిణములను పూర్తి చేయవలెను. అనంతరము పీఠం ముందు సుఖంగా కూర్చొని క్రింద పేర్కొనబడిన మూడవ (3) శ్లోకమంత్రమును (108) నూట ఎనిమిది మార్లు ధ్యాన పూర్వకంగా జపించవలెను.

1. ప్రదక్షిణము చేయునప్పుడు పఠించవలసిన శ్లోక మంత్రము :
   సర్వమంగళ మాంగళ్యే శివే! సర్వార్థసాధికే ।
   శరణ్యే త్ర్యంబకే గౌరీ! నారాయణీ! నమోఽస్తు తే ॥
2. సాష్టాంగ నమస్కారమునకు పఠించే శ్లోక మంత్రము :
   శరణాగత దీనార్త పరిత్రాణపరాయణే ।
   సర్వస్యార్తి హరే దేవి! నారాయణి నమోఽస్తు తే ॥
3. కూర్చొని జపించవలసిన శ్లోక మంత్రము :
   నమస్తే భగవన్ దేవ! దత్తాత్రేయ జగత్ప్రభో! ।
   సర్వబాధా ప్రశమనం కురు శాంతిం ప్రయచ్ఛమే ॥

॥ శ్రీగురుచరిత్ర ప్రదక్షిణా విధానము సంపూర్ణము ॥

◆ ◆ ◆

ప్రత్యేక కార్యసిద్ధికి అమోఘ శ్లోక మంత్రములు

భక్తులు తమ తమ కోర్కెలను నెరవేర్చుకొనుటకై శ్రీ దత్తప్రభువును ప్రార్థించి, వారి అనుగ్రహమును పొంది సఫల మనోరథులగుటకు ఈ ప్రదక్షిణ విధానము శ్రీరామబాణము వంటిది. అయితే, శ్రీదత్తావతార మూర్తులైన శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామివారు అనుగ్రహించిన "మంత్రగర్భిత శ్రీదత్తధ్యాన శ్లోకములను" ఎవరికి వారు తమ తమ అభీష్టమునకు సంబంధించిన

శ్లోక మంత్రమును ప్రతిదినము అష్టోత్తరశతము (108) సంఖ్యగా జపించినచో తమ కోరిక తప్పక నెరవేరును. శీఘ్రకార్యసిద్ధికై సహస్రము- ఒక వేయి సంఖ్యగా జపించుట ఉత్తమము.

ఏ కోరిక నెరవేరుటకు ఏ శ్లోక మంత్రమును జపించవలయునో, వాటి వివరములు స్పష్టముగా ఈ దిగువన పేర్కొనబడినవి -

1. సకల బాధా - గ్రహపీడా నివారణమునకు -

నమస్తే భగవన్ దేవ! దత్తాత్రేయ జగత్ ప్రభో! ।
సర్వబాధా ప్రశమనం కురు శాంతిం ప్రయచ్ఛమే ॥

2. సమస్త కోరికలు నెరవేరుటకు -

నమస్తే భగవన్ దేవ! దత్తాత్రేయ జగత్ప్రభో ।
అభీష్టసిద్ధిం మే దేహి కురు శాంతిం ప్రయచ్ఛమే ॥

3. భయ - సంకటముల నివారణమునకు :

అనసూయాత్రి సంభూతో దత్తాత్రేయో దిగంబరః ।
స్మర్తృగామీ స్వభక్తానాం ఉద్ధర్తా భవ సంకటాత్ ॥

4. రోగ నివారణమునకు :

నమస్తే భగవన్ దేవ! దత్తాత్రేయ జగత్ప్రభో! ।
సర్వరోగ ప్రశమనం కురు శాంతిం ప్రయచ్ఛమే ॥

5. దారిద్ర్య నివారణమునకు :

దరిద్ర విప్రగేహే యః శాకం భుక్త్వోత్తమశ్రియమ్ ।
దదౌ శ్రీదత్తదేవః స దారిద్ర్యాత్ శ్రీప్రదోఽవతు ॥

6. సంతానము కలుగుటకు :

దూరీకృత్య పిశాచార్తిం జీవయిత్వా మృతం సుతమ్ ।
యోఽభూ దభీష్టదః పాతు స నః సంతానవృద్ధికృత్ ॥

7. స్త్రీలకు అఖండ సౌభాగ్యము కొరకు :

జీవయామాస భర్తారం మృతం సత్యాహి మృత్యుహా ।
మృత్యుంజయః స యోగీంద్రః సౌభాగ్యం మే ప్రయచ్ఛతు ॥

8. ఋణ విముక్తి కొరకు :

అత్రేరాత్మ ప్రదానేన యో ముక్తో భగవానృణాత్ ।
దత్తాత్రేయం తమీశానం నమామి ఋణముక్తయే ॥

9. సకల పాప నివారణార్థము :

అత్రిపుత్రో మహాతేజా దత్తాత్రేయో మహామునిః ।
తస్య స్మరణ మాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే ॥

10. దత్తాత్రేయ స్వామి అనుగ్రహ ప్రాప్త్యర్థం :

అనసూయాసుత శ్రీశ జనపాతకనాశన ।
దిగంబర నమో నిత్యం తుభ్యం మే వరదో భవ ॥

11. సమస్త విద్యా ప్రాప్తి కొరకు :

నమస్తే శారదే దేవి! సరస్వతి! మతి ప్రదే ।
వసత్వం మమ జిహ్వాగ్రే సర్వవిద్యాప్రదా భవ ॥

12. సకల కార్య సమస్త విఘ్న నివారణార్థం :

నమస్తే భగవన్ దేవ! దత్తాత్రేయ జగత్ప్రభో! ।
సర్వవిఘ్న ప్రశమనం కురు శాంతిం ప్రయచ్ఛమే ॥

॥ అవధూత చింతన శ్రీ గురుదేవదత్త ॥

❖ ❖ ❖

శ్రీ దత్తాభయ మంత్రమ్

నమో నమః పదం దేవ ఇష్టకామఫలప్రదా ।
దత్తాత్రేయ సదా పాతు నమస్కారం దినే దినే ।
ప్రత్యక్ష దర్శనం దివ్యం దత్తాత్రేయ నమోఽస్తు తే ॥
స్వప్నే భావ్యమయం తేజం సర్వాభీష్టవరప్రదే ।
సర్వత్ర సర్వసౌఖ్యం చ నమస్కారం యథాక్రమమ్ ।
లక్ష్మీప్రాప్తి కరం దేవం దత్తాత్రేయ నమోఽస్తు తే ॥

(మేడిచెట్టు క్రింద కూర్చొని పై మంత్రమును (12000) పన్నెండువేల మార్లు నిష్ఠగా జపించినచో, క్షిప్రముగా శ్రీదత్తాత్రేయ స్వామివారి అనుగ్రహము కలుగును. ఇది ఒక మహాత్ముడు శ్రీరామచంద్ర సాతార్‌కర్ బాబాగారి అనుగ్రహ ప్రసాదం.)

◆ ◆ ◆

శ్రీపాదరాజాష్టకమ్

శ్లో॥ వేదాంతవేద్యం వరయోగిరూపం - జగత్ ప్రకాశం సురలోకపూజ్యమ్ ।
ఇష్టార్థసిద్ధిం కరుణాకరేశం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 1
శ్లో॥ యోగీశరూపం పరమాత్మవేషం - సదానురాగం సహకార్యరూపమ్ ।
వరప్రసాదం విభుదైకసేవ్యం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 2
శ్లో॥ కాషాయవస్త్రం కరదండధారిణం - కమండలుం పద్మకరేణ శంఖమ్ ।
చక్రంగదా భూషిత భూషణాఢ్యం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 3
శ్లో॥ భూలోకసారం భువనైకనాథం - నాథాదినాథం నరలోకనాథమ్ ।
కృష్ణావతారం కరుణాకటాక్షం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 4
శ్లో॥ లోకాభిరామం గుణభూషణాఢ్యం - తేజోమునిశ్రేష్ఠ మునిర్వరేణ్యమ్ ।
సమస్తదుఃఖాని భయాని శాంతం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 5
శ్లో॥ కృష్ణాసుతీరే వసతి ప్రసిద్ధం - శ్రీపాదశ్రీవల్లభ యోగిమూర్తిమ్ ।
సర్వైర్జనైః చింతిత కల్పవృక్షం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 6
శ్లో॥ మంత్రాబ్ధిరాజం యతిరాజపూజ్యం - త్రైలోక్యనాథం జనసేవ్యనాథమ్ ।
ఆనందచిత్తం అఖిలాత్మతేజం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 7
శ్లో॥ మంత్రానుగమ్యం మహానిర్వితేజం - మహత్ ప్రకాశం మహాశాంతమూర్తిమ్ ।
త్రైలోక్యచిత్తం అఖిలాత్మతేజం - శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥ 8
శ్లో॥ శ్రీపాదాష్టకమిదం పుణ్యం - ప్రాతరుత్థాయ యః పఠేత్ ।
కోటిజన్మకృతం పాపం - స్మరణేన వినశ్యతి ॥

॥ ఇతి శ్రీ శ్రీపాదరాజాష్టకమ్ ॥

◆ ◆ ◆

శ్రీ నరహరి అను శిష్యుడు రచించిన

శ్రీ నృసింహ సరస్వతీ అష్టకమ్

1. ఇందుకోటితేజ కరుణసింధు భక్తవత్సలం
నందనాత్రిసూను దత్త ఇందిరాక్ష శ్రీగురుమ్ ।
గంధమాల్య అక్షతాది బృంద దేవవందితం
వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥

2. మాయపాశ అంధకార ఛాయదూరభాస్కరం
ఆయతాక్ష పాహి శ్రియావల్లభేశ నాయకమ్ ।

దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా

సేవ్యభక్తవృందవరద భూయ భూయ నమామ్యహం
వందయామి నారసింహా - సరస్వతీశ పాహి మామ్ ॥

3. చిత్తజాది వర్గషట్క మత్తవారణాంకుశం
తత్త్వసార శోభితాత్మ దత్త శ్రియావల్లభమ్ ।
ఉత్తమావతార భూత-కర్తృ భక్తవత్సలం
వందయామి నారసింహా - సరస్వతీశ పాహి మామ్ ॥

4. వ్యోమరాపవాయుతేజ భూమికర్తృమీశ్వరం
కామక్రోధమోహరహిత సోమసూర్యలోచనమ్ ।
కామితార్థదాతృభక్త కామధేను శ్రీగురుం
వందయామి నారసింహా - సరస్వతీశ పాహి మామ్ ॥

5. పుండరీక-ఆయతాక్ష కుండలేందుతేజసం
చండదురితఖండనార్థ దండధారి శ్రీగురుమ్ ।
మండలీక మౌళి మార్తాండభాసితాననం
వందయామి నారసింహా - సరస్వతీశ పాహి మామ్ ॥

6. వేదశాస్త్రస్తుత్యపాద ఆదిమూర్తి శ్రీగురుం
నాద బిందు కళాతీత కల్పపాదసేవ్యయమ్ ।
సేవ్యభక్తవృందవరద భూయ భూయ నమామ్యహం
వందయామి నారసింహా - సరస్వతీశ పాహి మామ్ ॥

7. అష్టయోగతత్త్వనిష్ఠ తుష్ట జ్ఞానవారిధిం
కృష్ణవేణీతీరవాస - పంచనదీ - సంగమమ్ ।
కష్టదైన్యదూర భక్త - తుష్టకామ్యదాయకం
వందయామి నారసింహా - సరస్వతీశ పాహి మామ్ ॥

8. నారసింహా సరస్వతీశ - నామ అష్టమౌక్తికం
హారకృత శారదేన గంగాధర - ఆత్మజమ్ ।
ధారణీక - దేవదీక్ష గురుమూర్తి తోషితం
పరమాత్మానంద శ్రియా పుత్ర పౌత్ర దాయకమ్ ॥

9. నారసింహాసరస్వతీయ అష్టకం చ యః పఠేత్
ఘోరసంసారసింధు తారణాఖ్య సాధనమ్ ।
సారజ్ఞాన దీర్ఘ ఆయురారోగ్యాది సంపదమ్
చారువర్గకామ్యలాభ వారంవారం యజ్జపేత్ ॥

(తాత్పర్యము కొరకు 40వ అధ్యాయంలో చూడుము)

❖ ❖ ❖

దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

శ్రీ సాయందేవ కృత

శ్రీ నరసింహ సరస్వతీ స్తోత్రమ్

శ్లో॥ ఆదౌ బ్రహ్మా త్వమేవ సర్వజగతాం, వేదాత్మమూర్తిం విభుం,
పశ్చాత్ క్షోణీజదా వినాశ దితిజాం, కృత్వాఽవతారం ప్రభో! ।
హత్వాదైత్యమనేకధర్మచరితం భూత్వాఽత్మజోఽత్రేర్గృహే,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 1

శ్లో॥ భూదేవాఖిలమానుషం విదుజనా బాధాయమానం కలిం,
వేదాదుష్యమనేకవర్ణమనుజా భేదాది భూతోన్నతమ్ ।
భేదఃకర్మ తమాంధకారహరణం శ్రీపాదసూర్యోదయే,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 2

శ్లో॥ ధాతస్త్వం హరి శంకర ప్రతి గురో జాతాగ్రజన్మం విభో,
హేతుః సర్వవిదోజనాయ తరణం జ్యోతిస్స్వరూపం జగత్ ।
చాతుర్థాశ్రమస్థాపితం క్షితితలే పాతుస్సదా సేవ్యయం,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 3

శ్లో॥ చరితం చిత్రమనేకకీర్తిమతులం పరిభూతభూమండలే,
మూకం వాక్యం దివాంధకస్య నయనం, వంధ్యా చ పుత్రం దదౌ ।
సౌభాగ్యం విధవా చ దాయక శ్రియం దత్వా చ భక్తం జనం,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 4

శ్లో॥ దురితం ఘోర దరిద్రదావతిమిరం హరణం జగజ్జ్యోతిషం,
స్వర్ధేనుం సురపాదపూజితజనా కరుణాబ్ధిం భక్తార్తితః ।
నరసింహేంద్ర సరస్వతీశ్వర విభో! శరణాగతం రక్షకం,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 5

శ్లో॥ గురుమూర్తిశ్చరణారవింద యుగళం స్మరణం కృతం నిత్యసా,
చరితం క్షేత్రమనేక తీర్థసఫలం సరితాది భాగీరథీ ।
తురగామేధ సహస్రగోవిదుజనాః సమ్యక్ దదన్ తత్ఫలం,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 6

శ్లో॥ నో శక్యం తవ నామమంగళస్తువం వేదాగమాగోచరం,
పాదద్వం హృదయాబ్జమంతరదలం నిర్ధార మీమాంసతః ।
భూయో భూయః స్మరన్నమామి మనసా, శ్రీమద్గురుం పాహిమాం,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 7

శ్లో॥ భక్తానాం తరణార్థ సర్వజగతాం దీక్షా దదన్ యోగినాం,
సుక్షేత్రం పురగాణగ స్థిత ప్రభో! దత్వా చతుష్కామదమ్ ।
స్తుత్వా భక్తసరస్వతీ గురుపదం, జిత్వాద్యదోషాదికం,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 8

శ్లో॥ ఏవం శ్రీగురునాథ మష్టకమిదం స్తోత్రం పఠే న్నిత్యసో,
తేజో వర్చ బలోన్నతం శ్రియకరం ఆనందవర్ధం వపుః ।
పుత్రాపత్యమనేక సంపద శుభా దీర్ఘాయుమారోగ్యతాం,
వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ 9

(తాత్పర్యం కోసం 41వ అధ్యాయంలో చూడుము)

◆ ◆ ◆

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

శ్రీ గురు చరిత్ర

జ్ఞానకాండము

మొదటి అధ్యాయము

మంగళాచరణము - గ్రంథమాహాత్మ్యము - నామధారకుడు అను భక్తుడు శ్రీగురుమూర్తిని దర్శింపబోవుట - అతడు నిందాస్తుతి పూర్వకముగ గురువును స్తుతించుట - శ్రీగురునాథుడు అతనికి దర్శనమొసగుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ-శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

: అథ ధ్యానమ్ :

**శ్లో ॥ మాలా కమండలురధఃకరపద్మయుగ్మే - మధ్యస్థ పాణియుగళే డమరుత్రిశూలే ।
యస్యస్థ ఊర్ధ్వకరయోః శుభశంఖచక్రే - వందే తమత్రి వరదం భుజషట్కయుక్తమ్ ॥**

అనగా బ్రహ్మ విష్ణు మహేశ్వరుల - త్రిమూర్త్యాత్మకమగు ఏకావతారమై వెలుగొందుచు దిగువనగల ఉభయ కరకమలముల యందు జపమాలను, కమండలమును గలిగి, మధ్యన గల రెండు చేతులలో డమరుకమును, త్రిశూలమును పట్టుకొని, పై కరసరోజయుగ్మము నందు శుభమును ప్రసాదించెడు శంఖమును, చక్రమును ధరించి, ఆరు చేతులతో విరాజిల్లుతూ వరాల జల్లును కురిపించెడు, అనసూయా అత్రినందనుడైన శ్రీ దత్తాత్రేయస్వామి వారికి వందనములు సమర్పించెదను.

శ్లో ॥ నమస్తే యోగిరాజేంద్ర దత్తాత్రేయ దయానిధే । స్మృతిం తే దేహి మాం రక్ష భక్తిం తే దేహి మే దృఢామ్ ॥

అనగా యోగిరాజులకు రారాజువైన దత్తప్రభూ! నిరంతరము నీ తలంపే నాలో నిలిచియుండునట్లుగా, నీ యందే దృఢమైన భక్తిని నేను కలిగియుండునట్లుగా నన్ననుగ్రహించి యెల్లప్పుడు నన్ను కాపాడుచుండుమని దయానిధియగు శ్రీ దత్తాత్రేయ భగవానునకు నమస్కరించెదను.

శ్రీ గణేశ ప్రార్థన

ఓం నమో జీ విఘ్నహరా । గజాననా గిరిజాకుమారా । జయ జయ లంబోదరా । ఏకదంతా శూర్పకర్ణా ॥ (1)

సమస్త విఘ్నములను తొలగించునట్టి విఘ్నేశ్వరా! నీకు నమస్కారము. గజవదనా! గిరిజా కుమారా! లంబోదరా! ఏకదంతా! శూర్పకర్ణా! నీకు జయము. జయము. ఝంఝూ మారుతము వీచుటచే మేఘములు పారిపోయినట్లు, చేటల వంటి నీ చెవులను కదల్చుట వలన వీచే గాలి తాకిడికి భక్తజనుల విఘ్నము లన్నియును పలాయనము చిత్తగించును. అందుకే నిన్ను విఘ్న వినాశకుడని అందురు. మేలిమి బంగారము వంటి కాంతిని గలిగి ఉదయించిన సూర్యబింబము వలె నీ ముఖము విరాజిల్లుచుండును. విపినమువలె వ్యాపించిన విఘ్నములను ఛేదించుటకై ఒక చేత పరశువును (గొడ్డలిని) ధరించితివి. నడుమునకు నాగబంధమును కలిగి సర్ప యజ్ఞోపవీతమును ధరించియుంటివి. విశాలమైన కన్నులు గలిగిన వినాయకా! అందమైన చతుర్భుజములను కలిగి, ఈ విశాలమైన విశ్వమును నిర్విఘ్నముగా పరిపాలించెదవు. నిన్ను చింతన చేసిన వారిని ఎట్టి విఘాతములు బాధింపజాలవు. అంతేకాదు, వారి మనోరథములన్నియు వెనువెంటనే నెరవేరగలవు. కావుననే, సమస్త శుభకార్యములను ఆరంభించుటకు ముందు జనులందరు మొట్టమొదట నీకే వందనము చేయుదురు. ఓ బొజ్జ గణపయ్యా! చతుర్దశ విద్యలకు ఒజ్జవు నీవేనయ్యా! వేద శాస్త్ర పురాణములన్నింటినీ వ్రాసినది నీవేకదా! అవన్నియునూ నీ స్వరూపమునే బోధించుచున్నవి. కనుకనే, బ్రహ్మాది దేవతలు సైతము నిన్నే స్తుతించెదరు. త్రిపురాసురుని సంహరించుటకై సాక్షాత్తు పరమేశ్వరుడే ముందుగా నిన్ను పూజించి స్తుతించెను. ఆ మీదటనే ఆయన దైత్య సంహారము చేయుటకు సమర్థుడయ్యెను. హరిహర బ్రహ్మాదులందరునూ తమ, తమ కార్యారంభములకు ముందుగా గణపతివైన నీకే వందనమును ఆచరించెదరు. తద్వారా నీ అనుగ్రహమును పొంది, సమస్త అభీష్టములను సాధించుకొందురు. (1–10)

కృపానిధీ! గణనాథా! ఓంకారా! విఘ్నహర్తా! వినాయకా! అభయప్రదాతా! నా బుద్ధిని ప్రకాశింప చేయుము. స్వామీ! నీవు సమస్త గణములకు నాయకుడవు. నీకు నమస్కరించుటచే సమస్త కార్యములు సులభముగా నెరవేరగలవు. గౌరీకుమారా! నాలో జ్ఞానోదయము కలిగించి, నా మనోవాంఛను ఫలవంతము చేయుము. గజాననా! నీకు సాష్టాంగవందనమొనర్తును. విద్యానిధీ! నీవు చతుర్దశ విద్యలకు నిధివి. నేనొక బుద్ధిహీనుడను. అజ్ఞానిని. నీవు శరణాగత భక్తులకు వరప్రదాతవు. ఇక నీ చరణములే నాకు దిక్కు. స్వామీ! దయతో నీవు నా అంతఃకరణమునందు నిలిచి గురుచరిత్రమును చెప్పగలిగే సామర్థ్యమును ప్రసాదించుము. పరిపూర్ణమైన నీ కృపార్ద్ర దృష్టిని నా వైపు సారించి ఈ గ్రంథమును సంపూర్తిగా నేను రచియించునట్లు నన్ను అనుగ్రహింపుము. (11–16)

శ్రీ సరస్వతీ దేవి ప్రార్థన

శ్రీ సరస్వతీమాతా! వాగ్దేవతా! వీణాపుస్తకధారిణీ! హంసవాహనీ! నీ పాదపద్మములకు వందనములు. అమ్మా! వేదశాస్త్ర స్వరూపిణివైన నీవు సకల విద్యా ప్రదాయినివి. శారదామాతా! నీ అడుగుకెందామరలకు కైమోడ్పులు అర్పించువాడు సమస్త వేదశాస్త్ర విజ్ఞానమును పొంది తుదకు జ్ఞానియగుట తథ్యము. కావున, నీ చరణసరోజములకు నమస్కరించెదను. తల్లీ! నా యెడల ప్రసన్నురాలవై, నా వాక్కున నిలిచి, పవిత్రమైన గురుచరిత్ర గ్రంథమును నాచే చక్కగా వక్కాణింపజేయుమమ్మా! నా విన్నపమును మన్నించి గురుచరిత్రను వివరించుటకుగాను నా బుద్ధిని చక్కగా ప్రచోదనము చేయుము. (17-20)

జగన్మాతా! జయము, జయము. విశ్వవాగ్దేవతవైన నీవే ఈ సమస్త విశ్వమును వ్యవహరింపజేయుదువు. నీ వాక్కు నుండియే సమస్త వేదశాస్త్ర పురాణములు ఉత్పన్నమైనవి. అట్టి వేదవాక్కులకే నీ స్వరూపమును వర్ణించుటకు అలవిగానప్పుడు, అల్పజ్ఞుడనైన నేను నిన్నెట్లు స్తుతింపగలను. మా గురుదేవులైన "శ్రీనృసింహసరస్వతి" గారి నామధేయమునందు నీ పేరు అలరారుచున్నది. శ్రీ గురువు అనుగ్రహమును పొందిన నాపేరు (గంగాధర సరస్వతి)లో కూడా నీవే నిలిచియున్నందున నామీద నీకు మెండైన ప్రీతిగలదని నా నమ్మకము. ఆడించేవానికి అనుకూలముగా స్వాతంత్ర్యము తెలియని తోలుబొమ్మలు ఎట్లు కదలాడునో, అదేవిధముగా మా జివ్హలును వాగీశ్వరివైన నీచే ప్రేరేపింపబడి నర్తించును. చదువులతల్లీ! కృపానిధీ! నీ చరణారవిందములకు ప్రణమిల్లెదను. అబోధబాలకుడనైన నా విజ్ఞప్తిని మన్నించి, నా యెడల ప్రసన్నురాలవై, నాకు తగిన విద్యను వరముగా ప్రసాదించుము. తల్లీ! నీవు ఈ గ్రంథమునందు ప్రవేశించి, నాచే గ్రంథారంభము చేయించి, కృపతో అది పూర్తియగు వరకు చక్కగా కొనసాగింపజేయుమమ్మా! (21-26)

దేవ - ఋషి వందనము

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు నా వందనములు. ఓ త్రిమూర్తులారా! నాకు తగిన విద్యను ప్రసాదింపుడు. నాలుగు ముఖములను కలిగి, నాలుగు వేదములను వల్లిస్తూ సృష్టి రచన చేయునట్టి చతుర్ముఖ బ్రహ్మదేవుని పాదపద్మములకు నమస్కరించెదను. హృషీకేశా! అహర్నిశలు లక్ష్మీదేవితో కలసి క్షీర సాగరమునందు శేషశయనుడవై సమస్త విశ్వమును పరిపాలించెదవు. చతుర్బాహువులను కలిగి శంఖ చక్ర గదా పద్మములను ధరించి వెలుగొందుచుందువు. మెడలో వ్రేలాడుచున్న వైజయంతీ వనమాలతో శోభిల్లెడు వర పీతాంబరధారీ! నీవు శరణాగత

రక్షకుడవు. భక్తజనుల మనోభీష్టములను నెరవేర్చువాడవు. కృపాసింధూ! నీకు వందనములు. గంగాధరా! అర్ధనారీశ్వరా! పంచముఖములను కలిగి దశభుజములతో వెలుగొందెడు పరమేశ్వరా! నీకు ప్రణామములు. చరాచర సృష్టినంతటినీ లయము చేయునట్టి శ్మశానవాసీ! నీ చరణ సరోజములకు ప్రణామములు. వ్యాఘ్రచర్మాంబరధారీ! నాగాభరణా! ఉమారమణా! శ్రీ శంభుదేవా! నీ పాదపద్మములకు సాష్టాంగ నమస్కారములు

సమస్త సురవరులకు, సిద్ధులకు, సాధ్యులకు, విద్యాధరులకు, గంధర్వులకు, యక్ష, కిన్నర, కింపురుషాది సమస్త దేవతానీకమునకు నమస్కారములు. సమస్త ఋషిమండలమునకు, కవికులమునకు నా నమస్సులు. పరాశర, వ్యాస, వాల్మీకాదులందరుకును నా వినయపూర్వక నమస్సుమాంజలులు. కవిత్వమంటే ఏమిటో నాకు తెలియదు. గ్రంథ రచన కూడా తెలియదు. శాస్త్ర జ్ఞానహీనుడను. మహారాష్ట్ర భాష అసలే తెలియదు. నేను మీ దాసుడను. నాకు తగిన శాస్త్ర జ్ఞానమును ప్రసాదించుమని సవినయముగా వేడుకొనుచున్నాను. కవికులవతంసులారా! మీరందరు కృపతో శబ్దోత్పత్తి జ్ఞానహీనుడనైన నన్ను రక్షించి, నా వాక్కునకు గ్రంథ రచన చేయుటకు తగిన శక్తిని అనుగ్రహించుమని పదే పదే ప్రార్థించుచున్నాను. ఈ రీతిగా కవిపుంగవులకు నమస్కరించిన పిమ్మట, నా మాతాపితృవర్గమునకు చెందిన పూర్వీకులను మరియు మహానుభావులైన జననీజనకులను మనఃపూర్వకముగా ధ్యానించెదను.(27-40)

మాతాపితృ గురు వందనము - వంశ ఋషులకు వందనము

ఆపస్తంబశాఖకు చెందిన కౌండిన్యస గోత్రము నందు 'సాఖరే' అను వంశీయుల ఇంట 'సాయందేవుడు' అను బ్రాహ్మణోత్తముడు ఉండెను. అతనికి 'నాగనాథు'డను పేరుగల కుమారుడు జన్మించెను. ఈ నాగనాథునకు 'దేవరావు' అను పుత్రుడు కలిగెను. దేవరావునకు శ్రీ గురుభక్తి పరాయణుడగు 'గంగాధరు'డను పేరుగల నా తండ్రి జన్మించెను. నా పితృదేవుల పాదపద్మములకు నమస్కరించెదను. నా తండ్రి చరణములకు ప్రణమిల్లిన వెంటనే మాతామహాదులు గుర్తుకు వచ్చిరి. ఆశ్వలాయన శాఖకు చెందిన కాశ్యపస గోత్రమునందు నా మాతామహుడు జన్మించెను. ఆయన పేరు 'చౌండేశ్వరుడు'. ఆయన గంగామతల్లికి తండ్రియైన జహ్ను మహర్షిని పోలినవాడు. అట్టి చౌండేశ్వరుని కన్నకూతురే నాకు జన్మనిచ్చిన తల్లి. సాక్షాత్తు భవానీదేవిని తలపింపజేసే ఆమె నామధేయము 'చంపా'. మహాసాధ్వియగు నా మాతృదేవత చరణసరోజములకు భక్తి పూర్వకముగా ప్రణమిల్లెదను. జననీ జనకులకు వందన మాచరించిన వెంటనే, శ్రీ గురుమూర్తిని స్మరించుటకు, శ్రీ గురు చరణములకు నమస్కరించుటకు గాను నా బుద్ధి వికసించినది. (41-46)

సద్గురు శ్రీచరణ సరోజములకు శిర స్సాష్టాంగ వందనములు అర్పించెదను. సదా సర్వదా అనన్య భక్తి భావముతో సద్గురువును స్మరించుచు, వారి పాదపద్మములనే భజించునట్టి గంగాధరుని సుతుడను. 'సరస్వతీ- గంగాధరుడు' అను పేరుతో నేను విఖ్యాతుడను. ముందుగా సజ్జనులకు- సత్పురుషులకు నమస్కరించెదను. వేదవేత్తలు, సన్న్యాసులు, యతులు, యోగీశ్వరులు, తాపసులు అందరు సదా శ్రీగురువునే భజించెదరు కదా! వారెల్లరకు నేను పాదాభివందనము చేయుదును. అల్పజ్ఞుడనైన నేను చెప్పునట్టి ముద్దు, ముద్దు మాటలను మీరందరు పెద్ద మనసుతో అంగీకరింతురుగాక! నా బుద్ధి అత్యల్పమైనది. కావ్య రచన చేయు శక్తిలేనిది. అయినను శ్రీగురు ప్రేరణ వల్లనే ఈ రచనకు పూనుకొంటిని. శ్రీగురుడు చెప్పించిన విధముగా నేను చెప్పెదను. బాలుడనైన నన్ను శ్రోతలందరు క్షమింతురు గాక! యని పదేపదే వినమ్రుడనై ప్రార్థించెదను. (47-51)

పూర్వము నుండి మా వంశపెద్దలందరు శ్రీగురుదత్తదేవుని అనుగ్రహమునకు పాత్రులైయుండిరి. మా వంశము యెడల అత్యంత ప్రసన్నులై యున్న శ్రీగురుదేవుడు తన చరిత్రను రచించుమని నన్ను ఈవిధముగ ప్రేరేపించెను. "నాయనా! అమృత కలశము వంటి నా చరిత్రను నీకు అనుగ్రహించితిని. దానిని స్వీకరించి నా చరిత్రమును సవిస్తరముగా వ్రాయుము. నీ వంశపరంపరలోని వారందరికి ధర్మార్థకామ మోక్షములనెడు చతుర్విధ పురుషార్థములు లభించగలవని" ఆదేశించెను. అమోఘమైన శ్రీ గుర్వాజ్ఞ కామధేనువు వంటిది కదా! ఇందులో నా కెలాంటి అనుమానము లేదు. శ్రీ నృసింహ సరస్వతీ స్వామివారి దివ్యానుగ్రహమువలన నేను కార్యసిద్ధిని పొంది కృతకృత్యుడనయ్యెదను. శ్రీ గురుమూర్తి కృపతో మాకు కావలసినంత శ్రేయస్సు చేకూరును. త్రిమూర్త్యాత్మకుడైన శ్రీ దత్తాత్రేయుల వారే మానవరూపముతో శ్రీనృసింహ సరస్వతిగా అవతరించిరి. అట్టి అవతారమూర్తి తత్త్వమును తెలియుటకెవరి తరమగును? అనంతమైన వారి చరిత్రను ఎవరు వర్ణించగలరు? అమోఘమైన శ్రీగురువు యొక్క చరిత్రను వర్ణించగల శక్తి(నా) వాక్కునకు ఎక్కడిది? 'నా చరిత్రను వ్రాయవలసినదని' నన్ను స్వయముగా శ్రీగురుమూర్తియే ఆజ్ఞాపించెను. అందుచే పూర్తిగా అసమర్థుడనైన నేను కేవలము నిర్హేతుకమైన శ్రీగురుకృపతో మాత్రమే ఈ గ్రంథమును వ్రాయబూనితిని. (52-56)

గ్రంథ మాహాత్మ్యము

ఎవరికి ఈ కథాశ్రవణము అతి మధురముగ రుచించునో, వారికి పుత్రపౌత్రాది సత్సంతానము అభివృద్ధి చెందును. వారి ఇండ్లలో

లక్ష్మీదేవి అఖండముగ తాండవించుచుండును. ఎవరి ఇంట ఈ కథ నిత్యము పఠించబడుచుండునో, వారి ఇల్లు అఖండ ఐశ్వర్యముతో ఎల్లప్పుడు కళకళలాడుచుండును. గురుకృప వలన ఎటువంటి రోగ బాధలుండవు. వారెల్లరు సర్వదా సుఖసంతోషములతో ఉందురు. సప్తాహదీక్షతో ఈ కథను ఏడురోజులు శ్రవణమొనర్చువారికి సమస్త కష్టములు సమసిపోవును. ఎట్టి ప్రయాస లేకుండగనే వెంటనే ఫలమును ప్రసాదించగల పుణ్యప్రదమైన పావనమగు (శ్రీగురు) కథను వివరించి చెప్పెదను. తామెల్లరు సావధానముగ శ్రవణము చేయగలరని నా విన్నపము.(57-60)

అనాయాసముగా గుప్తనిధి లభించుచుండగా అనవసరమైన శ్రమ యెందులకు? శ్రోతలారా! సునాయాసముగ శ్రవణ ఫలమును పొందుడు. **శ్రీ గురుస్మరణ వలన అందరికి యెనలేని గొప్ప అనుభవము లభించును. నేను స్వయముగా అనుభవించి విన్నవించుచున్న విషయముగాన, తాము సంశయింపవలసిన పనిలేదు. తృప్తిగా భోజనము చేసినవాడు ఆకలితీరి కమ్మని త్రేన్పులు తీసినట్లుగా, శ్రీగురు చరితామృతమును శ్రద్ధగా శ్రవణము చేసిన వారికి గొప్ప అనుభవము కలుగుట తథ్యము. అప్పుడిక వారందరు శ్రీగురుమాహాత్మ్యమును గూర్చి ప్రశంసించకుండ ఉండలేరు.**(1) మామూలు ఈగనోటి నుండి కమ్మని తేనె స్రవించుట సాధ్యమా? అని సంశయించి సామాన్యుడనైన నా మాటలను పెడచెవిన పెట్టవద్దు సుమా! అల్పమైన ఆల్చిప్పలోనికి అమూల్యమైన ముత్యము చేరినట్లు, మెట్ట తామర నుండి కమ్మని కర్పూరము వెలువడినట్లు, తుచ్ఛమైన కాకిరెట్ట నుండి పవిత్రమైన అశ్వత్థవృక్షము మొలచినట్లు, వంకర టింకర కలిగిన చెరుకుగడ నుండి తీయని అమృతము వంటి రుచికరమైన రసము వెడలినట్లుగా, సామాన్యుడైన ఈ గ్రంథకర్తను పట్టించుకొనకుండా దివ్యమైన శ్రీగురు చరిత్ర యందు మీ దృష్టిని నిలుపగలరు. గురుస్మరణపై ఎవరికి గురి వుండునో, వారే నా మాటలను ఏకచిత్తముతో విశ్వసించెదరు. తద్వారా, ఈ కథామృతమును ఆస్వాదించెదరు. గురుచరిత్ర కామధేనువు వంటిది. అది కోరిన వారి కోర్కెలను ఈడేర్చును. విన్నవారికి గొప్ప జ్ఞానమును ప్రసాదించును. శ్రోతలారా! నేనేదో వ్యర్థ ప్రలాపములాడుట లేదు. సమాహిత చిత్తులై శ్రవణము చేయుదురు గాక! తామెల్లరు కృతార్థులగుదురుగాక! అని ప్రార్థించెదను. (61-69)

---

1) **భజ గురుదేవం భజ గురుదేవం - పరమమంత్రమిది మూఢమతీ! గురుభజన మొందె యవసానమందు - గాపాడగలదు యో మందమతీ!!**

(శతకరత్నావళి - 3వ కూర్పు - 1922 ముద్రణ నుండి సేకరింపబడినది.)

శ్రీగురు నృసింహ సరస్వతీ స్వామివారు గాణగాపురము (గంధర్వనగరము)లో నివసించినప్పుడు వారి మహిమ ఈ లోకమునందు మిగుల ప్రసిద్ధి గాంచెను. అపారమైన వారి మహిమను గూర్చి వివరించెదను. సావధాన చిత్తముతో వినుడు. శ్రీగురుడు ఆ గ్రామమున నివసించియున్నప్పుడు వారి మహిమను గూర్చి తెలిసిన అన్ని జాతులకు చెందిన జనులు పలు ప్రాంతముల నుండి అసంఖ్యాకముగా యేతెంచుచుండిరి. అక్కడ వారిని ఆరాధించిన వారందరికి వెంటనే తగిన ఫలితము లభించెడిది. భార్యాబిడ్డలు, ధనసంపదలు మున్నగు వాటిలో జనులు ఏవి కోరితే, అవి శీఘ్రముగా లభించుచుండెను. శ్రీగురుని అనుగ్రహముతో పొందిన సంతానమునకు వారి నామాక్షర యుక్తమైన పేరు పెట్టుకొనుచుండిరి. వారి దర్శనార్థముగా మిగుల ప్రసన్నచిత్తులై వచ్చిన భక్తజనులు వారిని సేవించి చతుర్విధ పురుషార్థఫలములను యథేచ్ఛగా పొందుచుండిరి. తత్కారణమున వారి నిర్మలమైన ఖ్యాతి దిగ్దిగంతములకు యెగబ్రాకి జగద్విఖ్యాతి నొందెను. (70-73)

నామధారకుడు శ్రీగురుదర్శనార్థము వెడలుట

ఇట్లుండగా, శ్రీగురు మహిమను గూర్చి వినిన నామధారకుడు అను ఒక భక్తుడు నిరంతరము శ్రీగురుమూర్తిని ధ్యానించుచుండెను. శ్రీ గురుదేవుల సాక్షాత్కారము తనకెట్లు లభించునా! యను విచారముతో మిక్కిలి వ్యాకులచిత్తుడై వ్యథపడుచుండెను. అంతట ఒకనాడు శ్రీగురు దర్శనార్థమునకై వెళ్ళవలయునని దృఢముగా నిశ్చయించుకొని గాణగాపురమునకు బయలుదేరెను. శ్రీగురు పాదపద్మములయందు చిత్తమును నిలిపి, గొప్ప దీక్షతో శిష్యభావమును కలిగి, ఆకలిదప్పులను సరకు చేయక వెళ్ళుచుండెను. దారిలో ఇట్లు తలపోయసాగెను. "శ్రీగురుమూర్తి సాక్షాత్కారము లభించనిచో, జడమగు ఈ శరీరముతో నాకేమి ప్రయోజనము? దీనిని త్యజించి వేయుదును. ఎవరి నామమును స్మరించి నంతలోనే మిక్కిలి దైన్య దశ హరించి పోవునో, అట్టి గురునామ చింతనకే అంకితమైన నేను వ్యర్థమైన విచారము నందు మునుగుటయేల? పరుసవేది సోకినంత మాత్రముననే ఇనుము బంగారమగును గదా? అటులనే, శ్రీగురు చరణములను హృదయము నందు నిల్పి ఎంతగా భజించినను నా భాగ్యము మార్పు చెందకుండుట యేల? గురువుయొక్క పవిత్ర నామమును నా చిత్తము నందు దృఢముగ నిలిపియున్న నాకు మిగుల కష్టము కలిగిన యెడల అది ఎవరికి సిగ్గుచేటు? గురువును సాక్షాత్తు సదాశివుడనియు, కృపామూర్తియనియు అందరు చెప్పుచుందురు గదా! అట్టి గుర్వనుగ్రహము నా యందు మాత్రము యేల ప్రసరింపకుండును? అని గురుమూర్తిని పొందవలెనన్న బలమైన ఇచ్ఛతో అత్యంత వ్యాకుల చిత్తుడైన గురుభక్తుడగు నామధారకుడు మిక్కిలి ఖేదమునకు గురియై ఈ విధముగా శ్రీగురువును గూర్చి నిందాస్తుతి పూర్వకమైన స్తోత్రమును చేయసాగెను.(74-82)

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

"పార్వతీ పుత్రా! విఘ్నవినాయకా! నీకు వందనము. శారదాంభోజ యగు శారదాదేవికి వందనము. బ్రహ్మావిష్ణుమహేశ్వర యుక్తమగు త్రిమూర్త్యాత్మక స్వరూపమే గురు స్వరూపమని వేదములు వర్ణించుచున్నవి. ఈ కలియుగము నందు భక్తులను ఉద్ధరించుట కొరకు శ్రీ నృసింహ సరస్వతీ స్వరూపంతో అవతరించిన దత్త గురుడవే నీవని శాస్త్రములు సమర్థించుచున్నవి. స్వామీ! నీవు కృపాసింధుడవు. త్రిమూర్తుల గుణగణాలకు ఆశ్రయస్థానమైన నీవు ఆశ్రిత భక్త రక్షకుడవు కావా! దయానిధీ! యతీశ్వరా! శ్రీపతీ! నా విన్నపమును వినుము. స్వామీ! నా అంతఃకరణము శుద్ధముగా లేదు. భావభక్తి యన నేమియో?నాకెంతమాత్రము తెలియదు. పరిపరి విధములుగ పరుగెత్తెడు నా మనస్సు స్థిరముగ నిలిచియుండుటలేదు. శ్రీగురుదేవా! నా అపరాధములను మన్నించి, నా పాపములను పరిహరించి, నా హృదయము నందు సాక్షాత్కరింపుము. దేవా! దయాపయోనిధీ! ఆలసింపకుము. వేవేగరమ్ము. నాలో నిలువుము. నరహరీ! అనంతా! తల్లి తన బిడ్డను విడిచి దూరదేశమున యెట్లుండగలుగును?(83-90)

నీవే తల్లివి, నీవే తండ్రివి. నీవే నా సఖుడవు. నీవే నా సోదరుడవు. నీవు మా కులదైవము. మాకు సర్వస్వమూ నీవే. మా వంశపరంపరగా నిన్నే పూజించుచుంటిమి. నరహరీ! సరస్వతీ యతీంద్రా! సంతతము నేను నిన్నే భజించుచుంటిని. అయిననూ, మిగుల దీనుడనై నిరంతరము దుఃఖపడుచుంటిని. నా చిత్తమునకు యెల్లప్పుడు చింతయే దిక్కగునా? నీవు భక్తుల పాలిటి కృపాసింధుడవని అందురుగదా! మరి, నాకు దుఃఖమునే ప్రసాదించుట తగునా? త్రిమూర్తీ! కృపాళూ! అనంతా! నీవు సమస్త విశ్వమును పరిపాలించువాడవు. దేవతలను కూడా రక్షించుటకు సమర్థుడవు. వారికి దాతవు కూడా నీవే కదా! అయినచో, నేను నిన్నుగాక వేరెవరిని అడగను? విశ్వపోషణ కర్తవు నీవే, భర్తవు నీవే. ఇంతేగాదు, సర్వసాక్షివి నీవేననీ, సమస్తము తెలిసిన సర్వజ్ఞుడవు నీవొక్కడవేనని, వేద పురాణశాస్త్రములన్నియునూ ఘోషించుచున్నవి. అయినచో, నా మనోభావమును నీవు తెలిసికొనలేవా? తల్లిదండ్రుల దయ ఎట్లుండునో, ఎప్పుడు కలుగునో, పసిపిల్లవాడికి ఎంతమాత్రము తెలియదు కదా! నేను పాపాత్ముడనే అగుదునుగాక! పుత్రుడు తల్లిమీదపడి కొట్టి, జుట్టు పట్టి పీకుచున్ననూ ఆ తల్లి ఇంచుకైన ఆగ్రహించక నవ్వుచూ యెత్తుకొని ముద్దాడి ముచ్చటగా క్షమించును కదా! అటులనే నా తప్పులను క్షమించి నన్ను రక్షింపలేవా! గురుమూర్తీ! నేను నీకేమీ ఈయలేదని భావించి, నాకు నీవు ఏమీ ఈయగూడదని తలంచితివా! అట్లయినచో, సమస్త భూమండలమును నీకు ధారపోసిన బలిచక్రవర్తిని సుతలలోకానికి పంపితివి కదా! అంతేగాదు, విభీషణుడు నీకేమిచ్చెనని, అతనికి బంగారు లంకా రాజ్యమునే కట్టబెట్టితివి. అంతెందులకు?

ధృవకుమారుడు నీకు ఏమిచ్చెనని, అతనికి ధృవ పదవిని ప్రసాదించితివి. పరశురాముడవై గండ్ర గొడ్డలిని చేబూని పృథివి యందలి దుష్ట క్షత్రియుల నందరిని సంహరించి, భూమండలము నంతయు విప్రులకు దానమిచ్చితివి కదా! వారెవరైన నీకేమైన ఇచ్చిరా? (91-107)

దేవా! నీ వొక్కడవే ఈ చరాచర సృష్టిని పోషించెదవుగదా! అల్పమైన ఒక మశకము(దోమ) వంటివాడనగు నేను నీకేమివ్వగలను, ప్రభూ! నరహరీ! నీవు శ్రీమంతుడవు, శ్రీపతివి. నీ ఇంటిలో శ్రీమహాలక్ష్మి స్వయముగా నడయాడుచుండును కదా! సర్వసమృద్ధి గలిగినవాడవు నీవు. అత్యంత దీనుడను నేను. దీనావనుడవు నీవు. అట్టి నీవు నా నుండి ఏమి ఆకాంక్షించెదవు? నీకు నేనేమి యివ్వగలను? తల్లి తన శిశువును ఒడిలోనికి తీసికొని స్తన్యమును ఇచ్చుచుండునే గాని, అందుకు బదులుగా ఆ శిశువు నుండి ఏదేని కోరుకొనునా? ఒకరి నుండి ఏదో ఒకటి తీసుకొని, అందుకు బదులుగా వేరొకటి ఇచ్చువాడు దాత కానే కాడు కదా! అప్పుడు నిన్ను దయానిధిగా కొనియాడుట హాస్యాస్పదమే యగును. ఒకవేళ నీవు శక్తిహీనుడవని అనుకొందునన్నచో, చతుర్దశ భువనములు నీ యధీనములే కదా! అందరికి దాతవు నీవే. అట్టి నీకు నేను ఏమివ్వగలను. సేవను గైకొని ప్రతిఫలము నిచ్చుట సామాన్యులు చేయుపని కదా! దానిని దాతృత్వమని ఎవరందురు? నీవు విశ్వదాతవు కాదా! ఆకాశమునందు గల మేఘములు లోకుల నుండి ఏమిగోరి సకాలమున వర్షించుచున్నవి. అవి చక్కగా వర్షించి నదీనదములను, తటాకములను, బావులను నీటితో నింపుచున్నవిగదా! మేఘములు తమ సహజమైన ఈ సేవను విడనాడినచో, భూమండలమునకు కావలసిన నీటిని యెవరు అందించగలరు?ఇది యెంతటి సహజమో, దయాసింధువను బిరుదము కలిగిన నీకును మమ్ములను రక్షించుట అంతే సహజధర్మము గదా! ఇచ్చిన దానమునకు బదులు కోరుకొనే దాతకు దుర్దశయే దాపురించును సుమా! అట్టివాడిని దయాసముద్రుడని కొనియాడుట ఎంతవరకు సమంజసము. దీనజన శరణ్యుడవైన నీవు నన్ను సంరక్షింపలేవా? నా మనసు నిలకడగా లేదు. సేవించుట యనునది నాకు తెలియనే తెలియదు.(108-120)

మా వంశము నందలి పూర్వీకులందరు తమ జీవితకాల మంతయు నీ చరణసేవతోనే గడిపిరి. మా వంశ పెద్దలు సంపాదించిన సేవా సంపద వలన ఇప్పుడు నీవే మాకు ఋణపడి యుంటివి. కావున, కృపాసింధూ! ఈ దీనుని రక్షించి, ఆ ఋణమునకు బదులు తీర్చుకొనవచ్చునుకదా! తండ్రి చేసిన సేవకు పుత్రులు అతడిని సంరక్షించుట పరిపాటి, అదేవిధముగా నన్ను మీరు సంరక్షించవచ్చును గదా! నా యెడల ఇంతటి కాఠిన్యమేల? నిన్నే విశ్వసించి, నిరంతరము నిన్నే స్మరించుచూ, నీ కొరకై విలపించే ఈ బాలునిపై యేల దయకలుగుట లేదు. ప్రభూ! నీవు

నా మాటలను మన్నించని ఎడల నేను ఇప్పుడే సాధు-సత్పురుషులతో విన్నవించుకొని, నాకు కావలసిన దానిని నేను రాబట్టు కొందును, లేదా నీపై వ్యవహారము చేసి వ్యాజ్యమును పెట్టి సాధించుకొందును. గురునాథా! అంకిత భావముతో దాసుడనైన నాపట్ల నీకింతటి పంతమేలనో? నాకు బోధపడుటలేదు. మీతో సరితూగు వారిపట్ల ఎంతటి కాఠిన్యతను వహించినను చెల్లునేగాని, నావంటి అల్పుడగు దాసుని యెడల కినుక వహించుట తగునా? గురుదేవా! నన్ను మన్నించి నీ దివ్య దర్శనమును అనుగ్రహింపుము. నరహరీ! దైత్యులపట్ల నీవు కఠినముగా వ్యవహరించి వారిని శిక్షించితివి. మంచిదే! కాని, అదే దైత్యవంశము నందు జన్మించిన భక్తుడగు ప్రహ్లాదుని రక్షించలేదా? మరి, నీ సేవకుల సంతానమైన నా యెడల ఇంతటి నిష్ఠురమును ప్రదర్శించుట యెందులకు? గురునాథా! నేను అపరాధినని తలంచి నాపట్ల అలుకబూనితివా? లేక, వీడు దుడుకని, దుష్టగుణములు కలవాడని యెంచి దూరముంచితివా? అయినను, లోకములో కన్నతల్లి దుర్మార్గురాలగునా? పసివాడు తల్లిని కసురుకొనిననూ, ఒకవేళ కొట్టిననూ, తల్లి కోపగించకుండా వాత్సల్యము పెల్లుబుకుచుండగా కౌగిలించుకొనును. ఒకచో తల్లి కోపగించుకొనిన, తండ్రి చేరదీసి కొడుకును ఓదార్చును. లేదా, తండ్రి కోపగించినచో తల్లి దగ్గరకు దీసి, ప్రేమతో వాడిని బుజ్జగించును కదా! ఇక నాకు మాత్రము తండ్రివి నీవే, తల్లివి నీవే, నాకు సర్వస్వము నీవే కదా! గురునాథా! ఇక నీవు కోపగించినచో, నా గతి యేమిటి? నేను ఎవరితో చెప్పుకొనగలను, ఇక నాకు దిక్కెవ్వరు? దాసుడనైన నన్ను దొడ్డ మనసుతో కనికరించుము ప్రభూ!

సమస్త జగత్తునకు మీరే ప్రభువులని - స్వామియని ప్రసిద్ధిగలదు.దాసుడు ఎవరయినను, ఎట్లున్నను, అతడిని సంరక్షించు బాధ్యత స్వామిదేకదా! లోకులు నిన్ను అనాథ నాథుడవని, అరక్షిత రక్షకుడవని కొనియాడుచుందురు. నీ బిడ్డనైన నన్ను చేరదీసి కాపాడుము, తండ్రీ! నీవు అత్యంత కృపాళుడవని, దయామూర్తివని సమస్త పురాణములు మాటిమాటికి ఘోషించుచున్నవి కాని, యేది మీ కరుణ? అదియెట్లుండునో? నాకు తెలియుట లేదు, స్వామీ! నామాటలు నీ చెవిని చేరటము లేదా ఏమి? నా మొరను ఆలకించవా! గురురాజా! నా ఈ కరుణా పూరిత వాక్కులకు కఠినమైన శిలలు కూడా కరిగిపోవునేమో! కాని, నీగుండె కరుగదాయెను గదా! భక్తులందరు నిన్ను కరుణా సాగరుడని కీర్తించెదరు. కాని, నా యెడల రవ్వంతనైన కరుణకలుగుట లేదెందులకు? నీ కోసమై వేచివేచి నా కన్నులు ఎరుపెక్కుచున్నవి. తుదకు నా బ్రతుకు నాకు భారమై వ్యర్థమని అనిపించుచున్నది. గురుదేవా! నన్ను క్షమియించి, ఇకనైన తరలి రావయ్యా! స్వామీ! పాహి మామ్! ప్రభూ! రక్షమామ్! మాం రక్ష! రక్ష!!" అని పరిపరి విధముల ప్రార్థించెను. తుదకు ఖిన్నుడై ఒక చెట్టు క్రింద కూర్చొని యెలుగెత్తి ఆక్రందించుచు శ్రీ గురు ధ్యానములో మునిగి పరవశుడై మూర్ఛితుడయ్యెను. ఇంతలో అతడొక దివ్యమైన స్వప్నమును గాంచెను.

నామధారకుని దీనమైన ఆర్తనాదము కృపామూర్తియగు శ్రీగురుమూర్తి ఆసనమును కదలించివైచెను. ఇక ఆలస్యమెక్కడిది? 'అంబా' అంటూ అరచిన దూడ పిలుపు విన్న గోవు వలె, ఒక్క ఉదుటున శ్రీగురుడు పరుగెత్తుకొని వచ్చి అతని ముందు నిలిచెను. అంతే! ఆ నామధారకుడు స్వప్నావస్థలోనే నతమస్తకుడై శ్రీగురుపాదపద్మములపై వాలిపోయెను. తన శిరోజములను విప్పి శ్రీగురుని చరణధూళిని తుడిచి, ఆ జలజనయనుని శ్రీచరణ సరోజములను ఆనందబాష్పధారలతో అభిషేకించెను. ప్రేమోన్మత్తుడై షోడశోపచారవిధిగా ఆరాధించెను. తద్వారా అతని హృదయము శాంతించెను. తత్ఫలితముగా అతని మనోమందిరమున శ్రీగురునాథుని స్వరూపము స్థిరముగ నిలచిపోయెను. అంతట నామధారకుడు మహదానంద భరితుడయ్యెను. నిజభక్తుల హృదయ కమలములయందు శ్రీగురునాథుడు తప్పక నిలచియుండును అనుమాట గంగాధర నందనుడగు సరస్వతికి ఎంతో ముదావహమయ్యెను. (121-149)

ఇది శ్రీ గంగాధర-సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "మంగళాచరణము" అను మొదటి అధ్యాయము ॥ (1)

॥ **జయ గురుదత్త - శ్రీగురుదత్త** ॥ (ఓవీలు : 149)

◆ ◆ ◆

శ్రీసమంచిత మవ్యయం పరమప్రకాశ మగోచరం,
భేదవర్జిత మప్రమేయ మనంత మాద్య మకల్మషమ్ ।
నిర్మలం నిగమాంత మద్వయ మప్రతర్క్య మబోధకం,
ప్రాతరేవ హి మానసాంతర భావయే ద్గురుపాదుకామ్ ॥

(శ్రీ ఆదిశంకర భగవత్పాద విరచిత శ్రీగురుపాదుకాస్తవం - శ్లో. 1)

శ్రీ గురు చరిత్ర

రెండవ అధ్యాయము

నామధారకునకు సిద్ధమునీశ్వరుడు దర్శనమొసగుట - సిద్ధముని - నామధారక సంవాదము ప్రారంభమగుట - శ్రీగురుమహిమా వర్ణనము - సృష్టిరచన - నాలుగు యుగముల స్వరూపము - కలి బ్రహ్మల సంవాదము -వేదధర్ముడు - దీపకుడు అను గురుశిష్యుల ఆఖ్యానము

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

ఓవీ ॥ త్రైమూర్తిరాజా గురు తూంచి మాఝా । కృష్ణాతీరీం వాస కరోని వోజా ।
సుభక్త తేథేం కరితీ ఆనందా । తే సుర స్వర్గీ పహాతీ వినోదా (1)

అనగా త్రిమూర్త్యాత్మక స్వరూపా! మీరే నా గురువులు. కృష్ణానదీ తీరమున తాము నివసించితిరి. అక్కడి భక్తులందరినీ చక్కగా ఆనందభరితులను చేసితిరి. అట్టి పవిత్రమైన దృశ్యమును దేవతలందరు స్వర్గలోకమునుండి వేడుకగా తిలకించిరి. (1)

(గత అధ్యాయమునందలి అనంతరకథను గూర్చి శ్రీగంగాధర సరస్వతి యిట్లు చెప్పుచుండెను-)

ఆ విధంగా నిరంతరము శ్రీగురుచరణములనే ధ్యానించుచున్న నామధారకుడను భక్తుడు కలలో మెరుపువలె కనిపించి, తృటిలో కనుమరుగైన శ్రీగురుమూర్తిని స్వయంగా దర్శించుకొను తపనతో తిరిగి గాణగాపురమునకు నడక సాగించి, కొంత దూరము వెళ్ళెను. ఇంతలో అలసట చెంది ఒక చెట్టు నీడన విశ్రమించెను. మనసులో గురువును చింతించుచు బడలిక నొందిన ఆ నామధారకునకు చల్లని నీడవలన కునుకుపట్టెను. అంతలో అతనికొక స్వప్నము కలిగెను. ఆ స్వప్నమున జటాధారియై, భస్మభూషితుడై, వ్యాఘ్రచర్మమును ధరించిన ఒక యోగీశ్వరుడు దర్శనమిచ్చెను. దగ్గరగా వచ్చి ఆతనిని ఓదార్చి, నుదుటిపై భస్మరేఖను దిద్ది, శిరసుపై తన దివ్యహస్తమును ఉంచి, అభయమును ఇచ్చి ఆ మునీశ్వరుడు అదృశ్యుడయ్యెను. కల చెదిరిన నామధారకుడు నిద్రనుండి మేల్కొని నలువైపుల కలయచూచెను. కాని, అతనికి ఎవరూ కన్పట్టలేదు. వెంటనే లేచి కలలో కన్పించిన మూర్తినే గుర్తుకు తెచ్చుకొనుచు ముందుకు నడక సాగించెను. కొంతదూరము

వెళ్ళిన పిమ్మట అతనికి ఆకస్మికముగా తాను స్వప్నమున తిలకించిన ఋషీశ్వరుడే తన యెదుట ప్రత్యక్షమయ్యెను. నామధారకుడు ఆ యోగిని చూసి ఆశ్చర్యపడి వారిని సమీపించి సాష్టాంగ వందనము చేసెను. దయాదృష్టి ఉట్టిపడుతున్న ఆ యోగీశ్వరుని ముఖారవిందమును గాంచి, మిగుల ఆనందభరితుడై, చేతులు జోడించి దీనవదనముతో – "స్వామీ! నన్ను రక్షింపుము. నన్ను అనుగ్రహింపుము" అని బిగ్గరగా యాచించెను. **పిదప నామధారకుడు ఆ యోగిని ఇట్లు ప్రార్థించెను** – (2-8)

"యోగాధీశ్వరా! మీకు జయము, జయము. అజ్ఞానమనే అంధకారమును తృటిలో నశింపచేసే కృపానిధులు మీరు. సిద్ధమునీంద్రా! మీరే జ్యోతిప్రకాశకులు. మీ దర్శనమువలననే నా పాపరాశి సమస్తము పటాపంచలాయెను. మీరే నన్ను తరింపజేయగల సమర్థులు. అందుకే నేను మీ ముందు నిలిచితిని. స్వామీ! దీనులైన భక్తజనులను ఉద్ధరించుటకై యేతెంచినట్లుగా మిమ్ములను భావించుచున్నాను. మీ నివాస మెక్కడ? మీ పేరేమిటి? మీరెచటి నుండి వచ్చుచుంటిరి?" అని ప్రశ్నించెను. **పిమ్మట ఆ సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పసాగెను** – "నేనొక సిద్ధుడను. యోగిని. యెల్లప్పుడు తీర్థయాత్రలను చేయుచుండెదను. అనేక పుణ్యక్షేత్రములను దర్శించుచుండెదను. నా గురువు పేరు శ్రీనృసింహ సరస్వతీస్వామి. వారు జగత్ప్రసిద్ధులు. త్రిమూర్త్యాత్మక స్వరూపులు. భీమా, అమరజా అను రెండు నదుల సంగమస్థలము నందు వెలసిన గాణగాపురమునందు వారు నివసించుచున్నారు. బ్రహ్మవిష్ణుమహేశ్వరులనెడు త్రిమూర్తి స్వరూపులైన శ్రీదత్తాత్రేయులవారే సదా అభ్యాస యోగముతో తమను ధ్యానించెడు భక్తజనులను భవసాగరము నుండి తరింపజేయుటకై ఈ జగత్తునందు నృసింహ సరస్వతీ స్వామిగా అవతరించెను. కృపాసింధువగు శ్రీగురుడు తనను ఆరాధించెడు భక్తులకు సకల సంపదలను, అంతులేని ఆనందమును, సమస్త సౌఖ్యములను ప్రసాదించెదరు. అట్టి గురుమూర్తి సాన్నిధ్యమున నేను నివసింతును. శ్రీగురుదేవులను ధ్యానించువారికి దైన్యము లేదు. వారి భక్తులు అఖండలక్ష్మీ సంపన్నులై యుందురు. ధనధాన్యములతో, గోధనముతో తులతూగెదరు. అష్టైశ్వర్యములను సమృద్ధిగా గలిగి నిత్యానందభరితులై యుందురు" అని సిద్ధముని చెప్పిన మాటలు వినిన **నామధారకుడు యిట్లనెను** – "సిద్ధమునీ! బాగు, బాగు, మీరు శ్రీగురుని మహిమలను, ఖ్యాతిని గూర్చి గొప్పగా వర్ణించి చెప్పుచుంటిరి. అయితే, నేను మీరు చెప్పిన ఆ గురునాథునే నిరంతరము ధ్యానించెదను, స్మరించెదను. నేనే కాదు, మా వంశములోని పూర్వీకులందరు తరతరాలనుండి వారినే సేవించిరి. కాని, మాకు కలిగే కష్టాలకు కొదువలేదు. మీరు చెప్పిన ఫలాలు మాకు ఏవీ అందలేదు. కారణము తెలియదు. ఇదంతయు నాకు అతి విచిత్రముగా తోచుచున్నది. స్వామీ! ఇక మమ్ములను తరింపజేయగల సమర్థులు మీరే సుమా! అందుకే కాబోలు, శ్రీ గురుమూర్తిని దర్శించుటకు వెళ్ళుచున్న నాకు దారిమధ్యలోనే

దయతో మీరు దర్శనమిచ్చితిరి. ఆహా! నేను ధన్యుడను. మునీశ్వరా! నా సందేహములను దీర్చివేసి, వారిని గూర్చిన మరిన్ని వివరాలను తెలుపగలరని" నామధారకుడు ప్రార్థించెను. (9-19)

అందుకు సిద్ధముని ఇట్లు చెప్పసాగెను – "శిష్యరత్నమా! తారతమ్యము లేకుండా గురుకృప అందరియెడల ఏకరీతిగా ప్రసరించుచుండును. ఆయన భక్తవత్సలుడు. గురుమహిమ వర్ణనాతీతము. గురుకృపకు ఎవరు పాత్రులగుదురో, వారికి దైన్యము ఉండనే ఉండదు. కలిదోషములు వారిని అంటజాలవు. దేవతలందరు వారికి వశులై యుందురు. అట్టి పరబ్రహ్మ తత్త్వమును పూజించి కూడా నీవు దైన్యమును గూర్చి ప్రస్తావించుట వింతగా ఉన్నది. నీ మనస్సునందు దృఢమైన విశ్వాసము లేదు. అందుకే నీవు కష్టముల పాలగుచుంటివి. శ్రీగురుడు త్రిమూర్తి స్వరూపుడని నిర్ధారించుకొనుము. ఆయనను అనన్యభక్తితో ఎవరు పూజించెదరో, వారికి శ్రీగురువు అభీష్టవరములను ప్రసాదించును. ఒకవేళ హరిహరులు ఆగ్రహించినచో, తన భక్తులను శ్రీగురుమూర్తి నిశ్చయముగ రక్షింపగలడు. కాని, ఆ గురువే కోపగించినచో, (లేదా గురువును ధిక్కరించినవాడిని) హరిహరాదులలో ఎవరునూ రక్షింప సమర్థులు కారు".(1) అని చెప్పిన సిద్ధముని మాటలు వినిన నామధారకుడు వారి పాదములకు నమస్కరించి, చేతులు జోడించి వినయభావముతో **నతమస్తకుడై ఇట్లు ప్రశ్నింపసాగెను –** "మహానుభావా! మీరు చెప్పినదంతయు బాగున్నది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనే త్రిమూర్తులు గురువుగా ఎందుకు అవతరించిరి? హరిహరులు కోపగించినను శ్రీగురువు రక్షించుటకు సమర్థుడు. కాని, గురువు కోపించినచో వేరెవరును రక్షింప సమర్థులు కారు అని మీరు చెప్పితిరి కదా! ఈ మాటను యెవరనిరి? ఏ వేదశాస్త్రములలో చెప్పబడియున్నది? అని నా సందేహము. కావున, శ్రీగురు మాహాత్మ్యమును గూర్చి విశదముగ బోధించి, నా సందేహమును నివృత్తిచేసి నన్ను కృతార్థుని చేయగలరు. తద్వారా గురుభక్తి నా మనసులో మరింత దృఢపడగలదని" నామధారకుడు కోరెను. అప్పుడు కృపానిధియైన సిద్ధముని శిష్యుడు అడిగిన ప్రశ్నకు మిగుల సంతసించెను. **అందుకు సమాధానముగా అతడిట్లు చెప్పసాగెను–** "నామధారకా! వేదశాస్త్రములయందు అత్యంత రహస్యముగ ప్రతిపాదింపబడిన గురుమహిమను గూర్చి ప్రమాణపూర్వకముగ చెప్పవలయునని నీవు నన్ను ప్రశ్నించితివి. అట్టి విషయమును గూర్చి ఇప్పుడు వివరించుచున్నాను. నీవు ఏకాగ్రచిత్తుడవై వినుము. చతుర్ముఖుడైన బ్రహ్మదేవుని నాలుగు ముఖముల నుండి నాలుగు వేదములు ఆవిర్భవించినవి. ఆ వేదములలో గల విషయములు సమస్త జనులకు సులభముగా తెలియుటకుగాను

---

1. **శివే రుష్టే గురుస్త్రాతా గురౌ రుష్టే న కశ్చన । లబ్ధ్వా కులగురుం సమ్యగ్గురుమేవ సమాశ్రయేత్ ॥** (గురుగీత 1-44) అనగా, శివుడు కోపగిస్తే గురువు రక్షించును. గురువే ఆగ్రహించినచో, ఇక రక్షించువారెవరుందురు? కావున, కులగురువును లేదా ఒక ఉత్తమ గురువును చక్కగా ఆశ్రయించి, అన్ని విధముల వారినే సేవించవలెను.

ద్వాపరయుగాంతమునందు శ్రీనారాయణ మూర్తియే వ్యాసమహర్షిగా అవతరించి, అష్టాదశ పురాణములను రచించెను. అనంతరము వ్యాసులవారి శిష్యులు పురాణములలోని వివిధ విషయములను వారి, వారి శిష్యులకు పరంపరగా బోధించుచుండిరి. అష్టాదశ పురాణములలో ఒకటైన బ్రహ్మవైవర్తపురాణమునందు వర్ణింపబడిన ఒక వృత్తాంతమును గూర్చి ఇప్పుడు నీకు వివరించెదను. (20-35) **శ్రద్ధగా వినుము -**

పూర్వము ఒకప్పుడు కలిపురుషుడు స్వయముగా చతుర్ముఖ బ్రహ్మదేవుని చేరి గురుమహిమను గూర్చి ప్రశ్నించెను. అందుకు సంతసించిన బ్రహ్మ, కలిపురుషునితో గురుమాహాత్మ్యమును సవిస్తరముగ చెప్పెనని సిద్ధమునీంద్రుడు నుడివెను. **వెంటనే నామధారకుడు భక్తిభావముతో చేతులు జోడించి ప్రణమిల్లి ఇట్లు విన్నవించెను -** "సిద్ధ యోగీశ్వరా! మీరు అజ్ఞానమనెడు అంధకారమును పారద్రోలెడు జ్ఞానభాస్కరులు. భవసాగరము నుండి నన్ను తరింపజేయుట కొరకే మిక్కిలి దయతో నాకు మీ దర్శనభాగ్యమును ప్రసాదించితిరి. పరమపవిత్రమైన మీ సాంగత్యము అమోఘమైనది. బ్రహ్మవైవర్త పురాణమునందు బ్రహ్మదేవునితో కలియుగమునకు జరిగిన సంవాదమును సవివరముగా వినిపించి నన్ను కృతకృత్యునిగా చేయుము స్వామీ!" అని కోరెను. (36-39)

శిష్యోత్తమా! జాగ్రత్తగా వినుమని సిద్ధముని చెప్పసాగెను - "సృష్టికి పూర్వము ప్రళయము సంభవించి లోకమంతా జలమయమై యుండెను. అప్పుడు ఆదినారాయణుడు వటపత్రశాయిగా ఒక మర్రి ఆకుమీద యోగనిద్రలో మునిగి నిశ్చింతగా ఉండెను. సృష్టి కాలము సమీపించినందున యోగనిద్రలో యున్న అవ్యక్తమూర్తి యగు నారాయణునకు సృష్టిని రచించవలెనను ప్రేరణ కలిగెను. అంతట ఆదిపురుషుడు యోగనిద్ర నుండి మేల్కొనెను. అప్పుడు ఆయన మనసులో సృష్టిని చేయవలయునని సంకల్పము ఉదయించెను. వెంటనే శ్రీనారాయణుని నాభినుండి ఒక త్రిలోకాత్మకమగు దివ్యమైన కమలము ఉత్పన్నమయ్యెను. ఆ కమలమునందు సృష్టికర్తయగు బ్రహ్మ ఉద్భవించెను. అతడు నాలుగు దిక్కుల పరికించి చూడగా నాలుగు ముఖముల వాడయ్యెను. అప్పుడు బ్రహ్మ 'అందరికంటే నేనే గొప్ప బలవంతుడను. నన్ను మించిన గొప్పవారెవరు లేరు' అని తనలో తాను భావించుకొనెను. అందుకు నారాయణుడు "తపస్సు చేయుము" అని గంభీరముగా పలికిన పలుకులు బ్రహ్మకు వినిపించెను. కాని, ఎటు చూచినను ఎవరూ కనిపించనందున బహుకాలము మౌనముగా తపస్సు చేసెను. బ్రహ్మదేవుని తపమునకు మెచ్చిన శ్రీమహావిష్ణువు ఒకనాడు ఆతని ముందు ప్రత్యక్ష మయ్యెను. శ్రీమహావిష్ణువును దర్శించిన బ్రహ్మదేవుడు ఆనందాతిరేకముతో నమస్కరించి ఆయనను ఎన్నోవిధములుగ స్తుతించెను. ఆతని స్తోత్రమునకు మిగుల ఆనందించిన నారాయణమూర్తి సృష్టిని రచించుమని బ్రహ్మను ఆదేశించెను. "దేవా! సృష్టిని ఎట్లు రచించవలయునో, నాకు తెలియదు. కావున, దాని రచనా విధానము యెట్లుండునో, దాని

క్రమము ఎట్టిదో? తనకు తెలియజేయుమని" శ్రీమహావిష్ణువును బ్రహ్మదేవుడు ప్రార్థించెను. **అప్పుడు శ్రీనారాయణమూర్తి ఇట్లు చెప్పెను -** "సృష్టి రచనా విధానము, దాని క్రమము అంతయును వేదములయందు వర్ణింపబడియున్నది. వేదములు అనాదిసిద్ధములు. సృష్టి లక్షణము కూడా అదియే. కావున, వేదములయందు ప్రతిపాదింపబడిన రీతిగా సృష్టిక్రమమును తెలిసికొని, వేదమార్గమును అనుసరించియే సృష్టిని రచించుము" అని ఆనతిచ్చి "ఇవిగో వేదములు, వీటిని గ్రహించుము" అని వాటిని అతనికిచ్చి అంతర్ధానమయ్యెను. హృషీకేశుని ఆజ్ఞను శిరసా వహించి, బ్రహ్మదేవుడు సృష్టిని రచించెను. వేదప్రతిపాదిత విధముగా పంచభూతములను, చతుర్దశ భువనములను, స్థావర జంగమాత్మకమగు నిఖిల ప్రపంచమును - స్వేదజములు, అండజములు, ఉద్భిజములు, జరాయుజములు[1] అను చతుర్విధ జీవజాలమును సృష్టించెను. తదుపరి ఆయన స్వర్గలోకము, మర్త్య (మృత్యు) లోకము, పాతాళలోకము అనే మూడు లోకములను కూడా రచించెను. ఈవిధముగ సృష్టిక్రమము యేర్పడినది. ఇట్టి సృష్టి రచనా విధానము నంతయునూ సర్వజనులకు విదితమగుటకొరకై వేదవ్యాసమహర్షి అష్టాదశ పురాణములను రచించెను. వాటిని అన్నింటిని వ్యాసులవారి శిష్యుడైన సూతుడు నైమిశారణ్యమునందు శౌనకాది మహర్షులకు విశదముగా వినిపించెను. అష్టాదశ పురాణములలో ఒకటైన బ్రహ్మవైవర్త పురాణము నందు చెప్పబడిన ఒక ఆఖ్యానమును గూర్చి శౌనకాది ఋషులకు సూతుడు వివరించిన విధముగా నేను నీకు చెప్పెదను.[2] **సావధానచిత్తముతో వినవలసినదని సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పసాగెను** - "నామధారకా! బ్రహ్మదేవుడు రచించిన సృష్టిక్రమమున జ్ఞానమార్గ ప్రవర్తకులగు సనకాది ఋషులను మానసికముగా సృష్టించెను. అటులే కర్మమార్గ ప్రవర్తకులైన మరీచ్యాది ప్రజాపతులను ఉత్పన్నము చేసెను. అనంతరము దేవతలను, దైత్యులను సృష్టించెను. ఆ తర్వాత కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము అను నాల్గు యుగములను ఉత్పన్నము చేసి, ఒక్కొక్క యుగమును భూలోకమునకు వెళ్ళి, అచట వ్యవహరించుమని ఆజ్ఞాపించెను. ఈ నాలుగు యుగములు దేవతారూపములను ధరించి, బ్రహ్మముందు నిలిచెను. ముందుగా కృత (సత్య) యుగదేవతను పిలిచి - 'నీవు భూలోకమునకు వెళ్ళి, నీ ప్రభావమును అక్కడ ప్రకాశింపచేయుమని' బ్రహ్మ ఆజ్ఞాపించెను. బ్రహ్మదేవుని ఆనతిని శిరసావహించిన ఆ కృతయుగ దేవత తన నోటితో ఎప్పుడూ అసత్యము పలుకని స్వభావమును గలిగి

---

1. **స్వేదజములు అనగా** - చెమట నుండి పుట్టినవి. ఉదా: నల్లి, పేను మొదలగునవి. **2. అండజములు** = గ్రుడ్డునుండి ఉత్పన్నమయ్యేవి. పక్షులు, పాములు మొ॥ **3. ఉద్భిజములు** = వనస్పతులు, వృక్షములు మొ॥ **4. జరాయుజములు** = గర్భాశయము - మావినుండి పుట్టినవి - మనుషులు, పశువులు మున్నగునవి.
2. ఈ కథ బ్రహ్మాండపురాణమునందు శ్రీదత్తమాహాత్మ్యము నందలి ఐదవ అధ్యాయములో గలదు.

సహజ వైరాగ్యభావముతో జ్ఞానమూర్తియై ప్రకాశించుచుండెను. మెడలో రుద్రాక్షమాలను, చేతులకు కంకణములను, యజ్ఞోపవీతమును ధరించి తాపసి రూపముతో **బ్రహ్మ ముందుకు వచ్చి నమస్కరించి ఇట్లనెను** – “దేవా! భూలోకమునకు వెళ్ళవలసినదని నన్ను ఆజ్ఞాపించితిరి. కాని, నేను ఏ రీతిగా వెళ్ళవలెను? భూలోకవాసులు ఎల్లప్పుడు అసత్యమునే పలికెదరు. నిందాపవాదములు చేయుచుందురు. నేను దానిని సహించలేను. నేను అచట ఎట్లు ప్రవర్తించవలెను ప్రభూ!” అని కోరెను. **అందుకు బ్రహ్మ ఇట్లు చెప్పెను** – “నీవు సత్త్వగుణమును కలిగి ప్రవర్తించుము. అచట నీవు ఉండవలసిన కాలము అల్పమైనదే. నీపై అనవసరమైన భారమును మోపను. త్రేతాయుగము సమీపించువరకు నీవు అచట ఉండవలసినది. భూలోకమునందు నీవు ప్రవర్తించునప్పుడు అసత్యముగాని, అధర్మముగాని జగత్తులో ఉండనే ఉండదు. జనులు చక్కని జ్ఞాననిష్ఠులై వైరాగ్యభావమును కలిగి తపస్సును ఆచరించుచుండెదరు” అని సమాధానపరచి, నీవు సావధానముగా ఉండుమని చెప్పి భూలోకమునకు సత్యయుగమును పంపించెను. (40–67)

అనంతరము సత్యయుగ కాలపరిమితి సమీపించుచుండగా బ్రహ్మదేవుడు వివేకవంతమైన త్రేతాయుగమును స్వాగతించి, భూలోకమునకు వెళ్ళవలసినదిగా ఆనతిచ్చెను. శిష్యోత్తమా! త్రేతాయుగ లక్షణము చెప్పెదను వినుము. బ్రహ్మ పిలుపును వినిన త్రేతాయుగ దేవత స్థూలదేహమును ధరించి, చేతిలో యజ్ఞసామగ్రులను పట్టుకొని యుండెను. అందువలన త్రేతాయుగమునందలి జనులందరు యజ్ఞములను చేసెదరు. ధర్మశాస్త్రములను అనుసరించి ప్రవర్తించెదరు. బ్రాహ్మణులు కర్మమార్గమున వ్యవహరించెదరు. ఆ యుగదేవత వేరొక చేతిలో వృషభమును ధరించియుండెను. తద్వారా లోకులు ఎల్లప్పుడు ధర్మప్రవర్తకులై యుండెదరు. ఈవిధమైన రూపస్వభావములను కలిగిన త్రేతాయుగము బ్రహ్మయొక్క ఆజ్ఞను శిరసావహించి భూమిమీదకు వెళ్ళెను. (68–71)

అనంతరము బ్రహ్మ ద్వాపరయుగమును ఆహ్వానించెను. ఒక చేతిలో ఖడ్గమును, ఖట్వాంగమును, రెండవ చేతిలో ధనుర్బాణములను ధరించి, ఒకవైపు ఉగ్రము, శాంతి, మరొకవైపు కాఠిన్యము, దయాభావములు ఉట్టి పడుచుండగా, ద్వాపరయుగ దేవత ప్రత్యక్షమాయెను. **అంతట బ్రహ్మదేవుడు ఇట్లనెను** – “నీవు వెంటనే వెళ్ళి, కలియుగము వచ్చువరకు భూలోకమున ఉండగలవు. నీవు అచట ఉన్నంతవరకు పుణ్యపాపములు సమానముగా ఉండగలవని చెప్పెను. అటుపిమ్మట ద్వాపరయుగ కాలపరిమితి సమీపించగనే బ్రహ్మదేవుడు కలియుగమును స్మరించెను. కఠినమైన మనస్సును కలిగి, పిశాచము వంటి ముఖముతో, వైరాగ్యశూన్యమైన ముసలిరూపముతో, ముఖమును వ్రేలాడవేసికొని, అడుగడుగున తూలిపడుతూ, క్రూరమైన వైఖరితో కలహమును, ద్వేషమును సహజముగా గలిగి, ఎడమచేతితో గుహ్యేంద్రియమును,

కుడిచేతితో నాలుకను లాగిపట్టుకొని వికృతరూపముతో కలిపురుషుడు వికటముగ నృత్యము చేయుచు, దోషాస్పదమైన మాటలను వల్లించుచు బ్రహ్మదేవుని ముందుకు వచ్చెను. పుణ్యపాప సమ్మిశ్రితమైన వైఖరితో, పిచ్చిపిచ్చిగా నవ్వుచూ, ఏడ్చుచూ, నాలుకతో వెక్కిరించుచు 'ఏమి ఆజ్ఞ స్వామీ!' అంటూ ఆతడు బ్రహ్మముందు నిలిచెను. అతని స్వరూప, స్వభావ లక్షణములను తిలకించిన బ్రహ్మ గుంభనముగా నవ్వి వినోదపూర్వకముగ **ఇట్లనెను**– "ఓ కలియుగస్వరూపమా! నీవు జిహ్వను, శిశ్నమును ఎందుకు పట్టుకొనినట్లు?" అనగా, **కలి బ్రహ్మతో ఇట్లు చెప్పెను** – "ప్రభూ! ఈ రెండింటితో నేను జనులనందరిని మోహింపజేసి జయించెదను. అందుకే మర్మాంగమును, రసనాంగమును పట్టుకొని స్వేచ్ఛగా నర్తించుచుందును. కాని, దేవా! ఈ రెండింటిని దీక్షగా రక్షించుకొనువారి చేతిలో నేను పతనము కాక తప్పదు. అయితే, నేను ఎక్కడికి వెళ్ళినా, ఎవరికీ ఎంతమాత్రము భయపడను" అని పలికెను. **అంతట బ్రహ్మ ఇట్లనెను** – "కలిపురుషా! నీవు వెంటనే భూలోకమునకు వెళ్ళి అచట నీ యొక్క గుణస్వభావములను ప్రవర్తింపజేయుమని" ఆదేశించెను. **అప్పుడు కలి బ్రహ్మతో ఇట్లనెను** – "స్వామీ! మీ ఆజ్ఞను శిరసావహించి భూమండలమునకు వెళ్లెదను. నా గుణస్వభావాదులను అనుసరించి, నేను వ్యవహరించు తీరును మీకు విన్నవించెదను. దయతో ఆలకింపుడు. నేను నిరంకుశముగా ధర్మమును నశింపజేసెదను. నిద్ర, కలహము అనేవి రెండు నా ప్రాణములు. పరద్రవ్యమును అపహరించువారు, పరస్త్రీలను అనుభవించువారు నాకు సహోదరులు. పక్షపాతము, మత్సరము (ఈర్ష్య), దంభము (కపటము, మోసము) మున్నగునవి నా ప్రాణస్నేహితులు. కొంగ (బకధ్యానము) వలె జనులను మోసగించి కడుపు నింపుకొనెడు కపటసన్యాసులు నాకు ప్రాణప్రియులు. పుణ్యజనులు నాకు పరమశత్రువులు" అని బ్రహ్మతో విన్నవించెను. (72–89)

అంతట బ్రహ్మ ఇట్లు పలికెను – "కలిపురుషుడా! నీ యుగలక్షణములను గూర్చి నీకు విపులముగా ఉపదేశించెదను. వాటిని శ్రద్ధగా వినుము– "కలియుగము నందలి మానవుల ఆయువు అత్యల్పముగ అనగా ఒక వంద సంవత్సరములు మాత్రమే ఉండును. అయితే, నీకన్న ముందు యుగములలో గల మానవుల ఆయుష్యము మరీ ఎక్కువగా నుండును. కావున, వారు జప, తపములవంటి కఠినమైన అనుష్ఠానములను యేండ్ల తరబడిగా అనుష్ఠించినగాని, వారికి ఉత్తమగతి సిద్ధింపలేదు. కాని, కలియుగమునందలి మనుష్యులు స్వల్పాయుష్కులు గాన, వారు అనుష్ఠించెడు జప, తపములు స్వల్పకాలముననే సిద్ధించును. నీవు భూలోకమునకు వెళ్ళి బ్రహ్మజ్ఞానులను, పుణ్యాత్ములను బాధింపకుండా, వారికి సాయపడుచు యథేచ్ఛగా విహరింపుము" అని చెప్పెను. **కలి బ్రహ్మకు నమస్కరించి మరల యిట్లనెను** – "స్వామీ! మీరు సాయపడుమని చెప్పిన పుణ్యాత్ములే నాకు ప్రబల శత్రువులు. వారు ఉండుచోటునకు నేనెట్లు ప్రవేశించగలను. ఆ మాట వినినంతనే నా యొడలు

జలదరించుచుండెను. ఇక, వారుండుచోటునకు వెళ్ళుటెట్లు? వారిని చూచుటెట్లు? మొత్తము భూమండలము యొక్క వైశాల్యము ఏబదికోట్ల యోజనములు అని చెప్పబడుచున్నది. అంతటి భూమండలమునందలి భరతఖండమున పుణ్యము అధికము. అట్టి భరతఖండమును చూచినంత మాత్రముననే నాకు మరణము కలుగుట నిశ్చయము. అట్టి లోకమునకు నేనెట్లు వెళ్ళగలను?" అని పలికెను. (90-97)

కలిమాటలు వినిన బ్రహ్మ నవ్వుచూ యిట్లనెను - "కలీ! నీవు భూమిమీదకు వెళ్ళుము. అప్పటి కాలమును అనుసరించి అచట చరించుచుండుము. కలికాలము తన స్వగుణము చేత అందరిలోనున్న ధర్మవాసనను నశింపచేయును. పుణ్యాత్ములే అయినను వారి బుద్ధి పాపకార్యములు చేయుటయందే ఉత్సహించుచుండును. కనుక, నీవు వెళ్ళవలసినది" **అని చెప్పిన బ్రహ్మతో కలి యిట్లు పలికెను** - "స్వామీ! భూమండలమున నాకు శత్రువులు ఎందరో గలరు. వారిని గురించి మీకు వివరించెదను. దయతో వినగలరు. నన్ను లెక్కచేయకుండా ఎవరైతే హరిహరులను ధ్యానింతురో, వారినే ఆరాధింతురో, ఎవరు నిరంతరము ధర్మమును ఆచరింతురో, వారే నాకు సహజశత్రువులు. పవిత్రమైన గంగాతీరమునందు, విశేషించి కాశీక్షేత్రమునందు నివసించి, దానధర్మములను చేయువారునూ నాకు శత్రువులు. ఇంకనూ, తీర్థయాత్రలయందు ప్రీతి కలవారు, విశేషించి కాలినడకన పుణ్యక్షేత్రములను దర్శించువారు, పురాణ శ్రవణము చేయువారు, విసుగు లేకుండా యెల్లప్పుడు దానాదులను నిర్వహించువారు, మానసికమైన ప్రశాంతతను కలిగి హాయిగా ఉండువారు వీరందరు నాకు ప్రబలవైరులే. దంభము లేకుండా, లోకులకు తెలియకుండా ధర్మమును ఆచరించువారంటేనే నాకు మిక్కిలి భయం. నాసాగ్రమునందు దృష్టిని నిలిపి జపధ్యానాదులను అనుష్ఠించే వారిని చూచినంతనే నాకు ప్రాణాంతకమగును. మాయామోహమునందు మునిగి తమ భార్యాబిడ్డలయందు వ్యామోహచిత్తులై వ్యవహరించెడు వారన్నచో నాకు పరమప్రీతి. వేదశాస్త్రములను తిరస్కరించి, హరిహరులయందు భేదబుద్ధిని కలిగి శివుని, విష్ణువును దూషించెడివారు నాకు ఎంతో ఆప్తులు. ఇంద్రియములను జయించినవారు, సదా శివకేశవులను భజించువారు, రాగద్వేషరహితులైన ధీరులు మున్నగు వారిని చూచినచో, నాకు మెండైన భీతి కలుగును. ఇట్టి నేను ఎట్లు భూమి మీదికి పోవుదును" **అనగా బ్రహ్మదేవుడు యిట్లు బదులు పలికెను** - "కలిపురుషా! నీవు భూమిమీదకు వెళ్ళి అనేకవిధములుగా ప్రవర్తించుము. అచట నీ ప్రభావమే బలముగా ఉండగలదు. నీవు ప్రవేశించినంతనే జనులందరును నీ యిచ్ఛ ప్రకారముగనే వ్యవహరించెదరు. వారి మధ్యన పుణ్యాత్ముల సంఖ్య బహు స్వల్పముగా ఉండును. అందువలన వారికెంతమాత్రము ఎటువంటి విఘ్నములను తలపెట్టకుండా, నీవు వారికి సాయపడుతూ ప్రవర్తించుము" అనెను. **కలిపురుషుడు చేతులు జోడించి సవినయముగా బ్రహ్మను యిట్లు ప్రశ్నించెను**- "అయ్యా! దుష్టమైన స్వభావమును కలిగిన నేను ధర్మమునకు ఎట్లు

సాయపడగలను? అచటికి వెళ్ళి నేనెట్లు వ్యవహరించవలెను? స్వామీ! ఇందుకు తగిన ఉపాయమును యెరిగింపుము” అనగా బ్రహ్మ చిరునవ్వును చిందించి, **కలి మసలుకొనుటకు తగిన ఉపాయమును యిట్లు వివరించి చెప్పెను** – “కాలము – మలము అను రెండు నీకు సాయపడగలవు. అవియే నీకు తగిన దారిని చూపగలవు. నాయనా! చింతించకుము. కాలస్వభావమును బట్టి దుర్మార్గులే హెచ్చుగా ఉందురు. పవిత్రులైనవారు నీకు వైరులు. మలమూత్రాదులచే చుట్టబడిన సదాచారహీనులు నీకు వశమయ్యెదరు. వారే నీకు సహాయపడగలరు. అందుచే పాపపుణ్యములకు విరోధముండును. పుణ్యరాశి అధికమైన వారిదే జయము. కాని, నీ కాలమునందు పుణ్యవంతులు బహుస్వల్ప సంఖ్యలో ఉందురు. అయితే, వారు మాత్రము నిన్ను నిశ్చయముగా జయించెదరు సుమా! ఈ పుణ్యాత్ములలో గూడ చాలామంది నీకు వశము కాగలరు. ఎక్కడో కొద్ది వివేకవంతులు మాత్రమే నీవు కలిగించెడు ఉపద్రవములను పూర్తిగా సహించెదరు. నీ దారుణకృత్యములకు తట్టుకోలేనివారు, కాలమహిమకు తలను వంచి నీకు వశులయ్యెదరు. ఏ కొద్ది జనులో నిజమైన సాధువులుగా నిలిచి, శుద్ధమైన అంతఃకరణము గలవారై, లోభరహితులుగా ఉండెదరు. అట్టివారే నీ క్రూరత్వమును సహించి, ఈశ్వరునిలో ఐక్యమయ్యెదరు. వారిని మాత్రము నీవు బాధింపకుము” అని బ్రహ్మ చెప్పగా, **ఆశ్చర్యముతో కలి మరల యిట్లు ప్రశ్నించెను** – “సాధువులు అనగా ఎవరు? వారి అంతఃకరణము ఎట్లుండును? వారు ఎట్టి లక్షణములను కలిగియుందురు?” “ఓయీ! కలిపురుషా! సావధానముగా వినుము” అని బ్రహ్మ పలికిన మాటలను నీకు తెలిపెదను. **“జాగ్రత్తగా వినుము, నాయనా!”** అని సిద్ధముని తన **శిష్యునితో** చెప్పుచున్న విధమును శ్రోతలందరూ వినగలరు. **“అంతఃకరణమునందు ధైర్యమును కలిగి నిర్మలమైన బుద్ధితో ప్రవర్తించే జనులకు, అట్లే లోభమును త్యజించిన మనుష్యులకు నీ దోషము అంటనే అంటదు. ఎవరు హరిహరులను భేదభావము లేక భజించెదరో, ఎవరు కాశీక్షేత్రమునందు నివసించెదరో, ఎవరు నిరంతరము గురుసేవను చేయుచుందురో, వారికి నీ దోషములు అంటజాలవు. తల్లిదండ్రులను చక్కగా సేవించువారికి, బ్రాహ్మణులను పూజించువారికి, గాయత్రిని అనుష్ఠించువారికి, కపిలగోవును పోషించువారికి నీ కల్మషము ఏమీ చేయజాలదు. అచ్చమైన దైవభక్తులను, నిత్యము తులసిపూజ చేయువారిని, నీవు ఎంతమాత్రము బాధించవద్దు సుమా! పురాణ, శాస్త్రములను పారాయణము, శ్రవణమును చేయు పుణ్యవంతులగు వారిని, వంశపరంపరగా గురుసేవా పరాయణులగు వారిని, వివేకవంతులై ధర్మమును అనుష్ఠించువారిని నీవు ఎంతమాత్రము బాధించవద్దని ఆదేశించెను”.**

అంతట కలి బ్రహ్మతో ఇట్లనెను – "మహానుభావా! గురువు అనగా యెవరు? గురు శబ్దము ఎట్లు వచ్చినది? గురు స్వరూపము, గురు మహిమ ఎట్లుండును? నాకు స్పష్టముగా వివరించుమని, వినయముతో కోరెను. **అందుకు బ్రహ్మ ఇట్లు చెప్పసాగెను** –'గురు' శబ్దము నందలి 'గ' కారము సిద్ధిని ప్రసాదించును. రేఫము అనగా 'ర' కారము పాపములను దహించివేయును. 'ఉ' కారము విష్ణువాచకము. అవ్యక్తమైన బ్రహ్మ, విష్ణు, రుద్రుల స్వరూపమే గురువు. నిజమునకు 'శ్రీగురుడు' 'త్రిమూర్త్యాత్మకుడు' అని కలితో బ్రహ్మ చెప్పెను. (98–130)

శ్లో॥ గణేశో వాఽగ్నినా యుక్తో విష్ణునా చ సమన్వితః । వర్ణ ద్వయాత్మకో మంత్రశ్చతుర్వర్గ ఫలప్రదః ॥ (131)

తాత్పర్యం: 'గ'కారమునకు అర్థము గణపతి. 'ర'కారము అగ్నినామ వాచకము. (అగ్ని బీజము కూడా 'ర' కారమే.) 'ఉ' కారము విష్ణువాచకము. ఈ 'ఉ'కారము అను అచ్చును 'గ, ర' అను రెండు హల్లు అక్షరములకు జోడించుటవలన **'గురు'** అనే రెండక్షరముల మంత్రము తయారగును. ఇది ధర్మ, అర్థ, కామ, మోక్షములనెడు చతుర్విధ పురుషార్థములను ప్రసాదించును. అటులే గణేశుని, అగ్నిని, విష్ణువును గురు శబ్దముతో బోధింపవచ్చును. (132)

శ్లో॥ గురుఃపితా గురుర్మాతా గురురేవ పరః శివః । శివే రుష్టే గురుస్త్రాతా గురౌ రుష్టే న కశ్చన ॥ (133)

అనగా – గురువే తండ్రి, గురువే తల్లి, పరశివుడు కూడా గురువే. శివుడు కోపగించినచో గురువు తప్పక రక్షించును. కాని, గురువే కోపగించిన యెడల మరెవరునూ రక్షింప సమర్థులు కారు. (134–135)

శ్లో॥ గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః । గురురేవ పరం తత్త్వం తస్మాద్ గురుముపాశ్రయేత్ ॥

అనగా – గురువే బ్రహ్మ, గురువే విష్ణువు. గురువే మహేశ్వరుడు. గురువే పరతత్త్వ స్వరూపుడు. కావున, గురువును తప్పక ఆశ్రయింపవలెను.(136–137)

శ్లో॥ హరౌ ప్రసన్నేఽపి చ వైష్ణవా జనాః, సంప్రార్థయంతే గురుభక్తి మవ్యయామ్ ।
గురౌ ప్రసన్నే జగతామధీశ్వరః, జనార్దన స్తుష్యతి సర్వసిద్ధిదః ॥ (138)

అనగా – హరి ప్రసన్నుడైనప్పుడు విష్ణుభక్తులు తమకు స్థిరమైన గురుభక్తిని ప్రసాదించుమని ప్రార్థించెదరు. గురువు ప్రసన్నుడైనచో జగదీశ్వరుడైన శ్రీహరి తనంతట తానే మిగుల సంతసించి సకలసిద్ధులను ప్రసాదించును. (139)

శ్లో॥ గురుం భజన్ శాస్త్రమార్గాన్ ప్రవేత్తి, తీర్థం వ్రతం యోగతపాది ధర్మాన్ ।
అచారవర్ణాది వివేక యజ్ఞాన్, జ్ఞానం పరం భక్తివిరాగయుక్తమ్ ॥ (140)

అనగా - శాస్త్రమార్గమును అనుసరించి శ్రీగురువును సేవించవలెను. ఈవిధంగా గురువును సేవించిన వారికి తీర్థము, వ్రతము, యోగము, తపస్సు మున్నగు ధార్మిక కర్తవ్యములు, వర్ణాశ్రమ ధర్మములు, ఆచారధర్మములు, సదసద్వివేక జ్ఞానయజ్ఞమును అటులే, భక్తి, వైరాగ్యయుక్తములైన ఆత్మజ్ఞానము గురుకృపవలన అత్యంత సులభముగా సిద్ధించును. (141-142)

అని బ్రహ్మ చెప్పగా విని కలి చేతులు జోడించి - "గురువు సర్వదేవతా సమానుదు అని యెట్లు తెలిసికొనగలము?" అని మరల ప్రశ్నించెను. అంతట బ్రహ్మ కలితో ఇట్లనెను - "నీకు సవిస్తరముగ వివరించెదను. సావధానచిత్తముతో వినుము. గురువు తప్ప మానవులను తరింపచేయువారు మరొకరు లేనేలేరు.(143-144)

శ్లో॥ గురుం వినా న శ్రవణం భవేత్కస్యాపి కస్యచిత్ । వినా కర్ణేన శాస్త్రస్య శ్రవణం తత్ కుతో భవేత్ ॥ (145)

అనగా - శ్రోత్రేంద్రియము అనగా చెవులు లేకుండా వినడము కుదరదు కదా! అట్లే, గురువు లేకుండా శాస్త్రశ్రవణము కుదురుట యెట్లు? శ్రవణం అంటే వినడం కదా! అది లేకుండా జ్ఞానం లభింపదు. జ్ఞానం కలుగకుండా తరించుట అసంభవము. (146)

శాస్త్రశ్రవణము వలన సంసారబంధముల నుండి విడివడగలము. అందుచే, ఆత్మను ప్రకాశింపచేసే జ్యోతిస్వరూపమే గురువని గుర్తెరుగుము. గురువును సేవించువారికి సమస్త సిద్ధులు సమకూరును. అంతులేని ఐశ్వర్యము లభించును. గురుశిష్యులకు సంబంధించిన పురాతనమైన ఒక అపూర్వమగు కథను నీకు చెప్పెదను. సావధానచిత్తముతో వినుము.

పూర్వము గోదావరీ తీరమునందు ఆంగీరసమహాముని ఆశ్రమము ఉండెను. అది అనేకరకములైన పెద్ద, చిన్న వృక్షములతో, లతలతో, వివిధ మృగములతో అలరారుచుండెను. ముఖ్యంగా నాభియందు కస్తూరిని ధరించియుండే కస్తూరి మృగములతో గూడి పుణ్యారణ్యమై విరాజిల్లుచుండెను. ఇంకను బ్రహ్మర్షులు, మునీశ్వరులు మొదలగు తాపసులు ఎందరో అచట తపస్సును చేయుచుండెడివారు. అందులో పైల(1) మహర్షి కుమారుడైన వేదధర్ముడను పేరుగల ఒక బ్రాహ్మణుడు ఉండెను. ఆయనకు అనేకమంది శిష్యులు ఉండిరి. వారందరు

---

1. పైలుడు వ్యాసమహర్షి శిష్యుడు, వ్యాసుడు వేదములను విభజించిన పిమ్మట అందులోగల ఋగ్వేదమును పైలుడు అధ్యయనము చేసెను. ఈ పైలుని కుమారుని పేరే వేదధర్ముడు.

వేదధర్ముని వద్ద వేదశాస్త్రపురాణములను అభ్యసించుచుండిరి. వారిలో 'దీపకుడు' అను పేరుగల ఒక ముఖ్య శిష్యుడు ఉండెను. అతడు మిక్కిలి గురుసేవా పరాయణుడై యుండెను. నిరంతరము అత్యంతభక్తిశ్రద్ధలతో అతడు గురుశుశ్రూషను చేయుచుండెను. ఆ ప్రకారముగా అతడు వేదశాస్త్రపురాణములను అభ్యసించి గొప్ప నైపుణ్యమును సంపాదించెను. **ఒకనాడు వేదధర్ముడు తన శిష్యులందరిని పిలిచి ఇట్లు చెప్పెను–**

"చిరంజీవులారా! నా యందు మిగుల ప్రీతిగలిగిన మీరందరు నా మాటలను చక్కగా ఆలకింపుడు. ఇప్పుడు మీలో నా ఆజ్ఞకు బద్ధులై, నేను చెప్పినట్లుగా నా మాటలను శిరసా వహించి ఆచరింపగల సమర్థులు ఎవరు?" అని ప్రశ్నించెను. **అప్పుడు శిష్యులు గురువుతో ఇట్లనిరి–**

"గురుదేవా! మీరిచ్చెడు ఆజ్ఞలను మేము తప్పక శిరసా వహించెదము. మమ్ములను తరింపజేయువారు మీరేకదా! గురువాక్యమును వినని వారు ఘోరమైన రౌరవనరకములో పడిపోవుదురు. అవిద్య అనెడు మాయాసాగరములో మునిగిపోవుదురు. అప్పుడు వారి గతి నరకమునందు యెట్లుండుననగా – యమకింకరులు అక్కడ సలసల కాగే నూనెలో వారిని నిర్దాక్షిణ్యముగా పడద్రోసి తుకతుక యనునట్లుగా ఉడకబెట్టుదురు. అట్టివారికి సద్గతి ఉండనే ఉండదు. నిజమునకు గురువే తరింపజేయగలవాడని సమస్త వేదశాస్త్ర పురాణములు ఘోషించుచున్నవి. ఈ ప్రమాణవాక్యమును పెక్కుమార్లు మీరు చెప్పగా మేము వినియుంటిమి. కావున, మీ ఆజ్ఞలను శిరసా వహించి ఆచరించెదము. కావున, తాము మీ ఆజ్ఞను సెలవీయగలరని" ప్రార్థించిరి. శిష్యుల మాటలు వినిన వేదధర్ముడు మిక్కిలి సంతసించెను. **తిరిగి ఇట్లు చెప్పసాగెను –**

"ప్రియశిష్యులారా! శ్రద్ధగా వినుడు – నేను నా పూర్వజన్మములలో వేలాది తపములను ఆచరించితిని. ఈ జన్మలో చేసిన జపతప అనుష్ఠానాదుల ద్వారా నా పాపరాశి చాలావరకు నశించిపోయినది. మిగిలిన భాగము ఈ దేహముతో అనుభవించకుండా ప్రక్షాళనము కానేరదు. ఒకవేళ తపస్సును ఉపేక్షించినచో, ఆ పాతకము మోక్షమునకు అడ్డుకట్ట వేయును. కావున, ఘోరమైన జన్మాంతర పాపరాశిని నశింపచేయవలెను. అనగా, ఈ దేహముతో అనుభవించకుండా బలీయమైన ప్రారబ్ధము సమసిపోదు. ఇట్టి పాపరాశి యొక్క నిష్కృతి కోసమై నేను కాశీక్షేత్రమునకు వెళ్ళదలచితిని. అచట నా పాతకము వెంటనే ప్రక్షాళన మగును. ఇది శాస్త్రసమ్మతమైన వచనము. కావున, నన్ను కాశీక్షేత్రమునకు తీసికొని వెళ్ళి, అచట నేను నా ప్రారబ్ధకర్మను అనుభవించుకాలమునందు నా వెంట ఉండి నాకు శుశ్రూష చేయగల సమర్థులు ఎవరో ముందుకు రావలసినద"ని కోరెను.

అంతట శిష్యులందరు మౌనమును వహించి, తలలు దించి నేలపై కాలివ్రేళ్ళతో గీతలు గీయుచుండిరి. వారిలో మిక్కిలి గురుభక్తిని కలిగిన దీపకుడను పేరుగల ముఖ్య శిష్యుడు ముందుకు వచ్చెను. ఎంతో వివేకవంతుడైన ఆ శిష్యుడు వినయపూర్వకముగా **గురువుగారికి**

నమస్కరించి యిట్లు బదులు పలికెను– "అయ్యా! పూర్వజన్మ పాపము ఈ జన్మలోని దేహమును వ్యాధిరూపముగ బాధించును. దుఃఖమును ప్రోగు చేయకూడదు. కావున, వెంటనే అందుకు తగిన పరిహారమును చేయుము" అనెను. అప్పుడు వేదధర్ముడను **ఆ గురువు శిష్యుడగు దీపకునితో ఇట్లనెను** – "మానవులు తమ శరీరము ఆరోగ్యవంతమై దృఢముగా ఉన్నప్పుడే పాపములను ప్రక్షాళనము చేసుకోవలెను. లేనిచో, అవి విషమువలె పెరిగిపోవును. కావున, పుణ్యతీర్థముల ద్వారా ప్రాయశ్చిత్తమును చేసికొని, తమ దేహముతో పాపరాశిని పూర్తిగా అనుభవించినప్పుడే అది నశించిపోవును. అప్పుడుగాని మానవులకు ముక్తి లభింపదు. అంతేకాదు, దేవతలు లేదా ఋషీశ్వరులు, మానవులు, జంతువులు మున్నగు ప్రాణులన్నియునూ తమ, తమ పాపములను తాము అనుభవించకుండా అవి నశింపజాలవు" అని వివరించెను.(147–170)

అందుకు వెంటనే దీపకుడు చేతులు జోడించి ఇట్లనెను – "గురుదేవా! నాకు అనుజ్ఞను ప్రసాదింపుము. నా శక్తి కొలది మీకు సేవ చేసెదను. ఎంతమాత్రము శంకించకుండా నేను ఏమి చేయవలయునో, తాము సెలవీయవలసినదని" ప్రార్థించెను. **అందుకు గురువు ఇట్లనెను**– "ప్రియశిష్యుడా! వినుము. ఈ దేహమునందు కుష్ఠరోగము వ్యాపించును. తద్వారా నేను అంగహీనుడనగుదును. గ్రుడ్డివాడిగా, కుంటివాడిగా అగుదును. నా ప్రారబ్ధ విశేషమువలన నేను ఇరువది ఒక్క సంవత్సరములపాటు కుష్ఠవ్యాధిని అనుభవించవలసి యున్నది. అప్పుడు నన్ను ఎంతో సహనము వహించి నాకు సేవలు అందించవలసి యుండును. నన్ను ఎంతయో జాగ్రత్తగా సంరక్షించవలసివచ్చును. ఇందుకు తగిన దృఢనిశ్చయమును కలిగియుండినచో, నీవు అంగీకరించుము" అని చెప్పెను. **వెంటనే దీపకుడు ఇట్లనెను** – "మీ కుష్ఠరోగమును నేనే స్వీకరించి మిక్కిలి సంతోషముతో అనుభవించెదను. ఇరువది ఒక్క యేండ్లు అంధుడనై హాయిగా నిలిచి పాపనిష్కృతి చేసివేయుదును. స్వామీ! మీ పాపములన్నింటికీ నేనే పరిహారము చెల్లించగలను. సంశయించకుండా వెంటనే అనుమతినీయుము" అని శ్రీగురుదేవుల శ్రీచరణములపై వాలిపోయెను. శిష్యుని మాటలు విని మిగుల సంతోషించిన **వేదధర్ముడు పాపలక్షణములను ఇట్లు వివరించెను** – "చిరంజీవీ! ఎవరి పాపమును వారే అనుభవింపవలెను. అంతేగాని, పుత్రునిద్వారాగానీ, శిష్యునిద్వారా గానీ, తన పాపకర్మను అనుభవింప చేయుటకు శాస్త్రము ఎంతమాత్రము అంగీకరింపదు. తన దేహముతో తాను అనుభవించుట వల్లనే పాపపరిహారము కాగలదు. కనుక, నా పాపతాపములను నేనే ఈ (నా) దేహము ద్వారా అనుభవించెదను. దీపకా! ఇరువది ఒక్క సంవత్సరముల పాటు నీవు నన్ను కనిపెట్టుకొనియుండుము. రోగముతో పీడింపబడే వారికంటే, వారికి సేవలందించువారికే కష్టమెక్కువగా ఉండును. నాయనా! నేను అనుభవించబోవు ప్రారబ్ధము ఎంతో కఠినమైనది. అట్టి స్థితిలో నాకు శుశ్రూష చేయుటవలన నీకు ఎన్నియో కష్టములు ఎదురగును. వాటిని సహించుటకు చాలా ఓర్పు – నేర్పు

అవసరము. బాగుగా నిశ్చయించుకొని మాత్రమే ఇందుకు సిద్ధపడుము. శిష్యోత్తమా! నీవు నన్ను కాశీనగరమునకు తీసికొనివెళ్ళినిశ్చలమైన భక్తితో శుశ్రూష చేయుము. కాశీక్షేత్రమునందు పాపములు పారిపోవును. తద్వారా నీవు శాశ్వత పదవిని పొందగలవు" అని వేదధర్ముడు చెప్పెను. **వెంటనే దీపకుడు ఇట్లనెను** – "మహానుభావా! నేను మిమ్ములను శీఘ్రముగా కాశీనగరమునకు తీసికొనివెళ్లెదను. అచట మిమ్ములను సాక్షాత్తు విశ్వనాథునిగా భావించి, మీకు తగిన సేవలను అందించి హాయిగా ఇరువది ఒక్క సంవత్సరములు మీతోపాటుగా గడిపెదను. ఇందుకుగాను, తాము దయతో ఈ దీనుని అనుగ్రహింపుడ"ని వేడుకొనెను. అందుకు గురువు తన అంగీకారమును తెలిపెను. **అంతట బ్రహ్మ కలితో ఇట్లనెను** – "ఓ కలీ! గురువు సేవా నిమిత్తమై స్వార్థమును పూర్తిగా విడనాడి అతికష్టమైన శుశ్రూషకు అంగీకరించిన శిష్యుడు ఎంత గొప్పవాడో గ్రహింపుము. గురువునకు భయంకరమైన కుష్ఠువ్యాధి సంక్రమించినప్పుడు, అతడిని కాశీక్షేత్రమునకు చేర్చి విసుగు, విరామము లేకుండా కడు భక్తితో గొప్ప సేవలను అందించిన దీపకుడొక్కడే ఉత్తమ శిష్యునిగా వాసిగాంచెను" అని ప్రస్తుతించెను. అనంతరము గురుశిష్యులు ఇద్దరు బయలుదేరి కాశీక్షేత్రమును చేరుకొనిరి. అచట మణికర్ణికా ఘట్టమునకు ఉత్తర దిక్కునగల కంబళేశ్వరస్వామి సన్నిధిలో వారిరువురు నివసించిరి. మణికర్ణికలో స్నానము చేసి విశ్వనాథుని పూజించి, ఆ గురువు తాను అనుభవింపనున్న ప్రారబ్ధమును అనుభవించుటకు సిద్ధమయ్యెను.

అంతట వేదధర్ముని దేహము అంతయును కుష్ఠువ్యాధితో నిండుకొనెను. కళ్ళు కనిపించుటలేదు. పూర్తిగా అంధుడయ్యెను. ఎంతయో దుఃఖమును అనుభవించుచుండెను. అట్టి స్థితిలో దీపకుడు గురువుగారిని అత్యంత భక్తిశ్రద్ధలతో సేవించుచుండెను. రానురాను కుష్ఠురోగము మరింతగా విజృంభించెను. వ్రణములనుండి చీము, నెత్తురు కారుచుండెను. అచ్చటచ్చట పురుగులు యేర్పడి చూచుటకు అసహ్యముగా ఉండెను. అప్పుడప్పుడు అపస్మారకస్థితి కలుగుచుండెను. అయినప్పటికినీ దీపకుడు నిర్మలమనస్కుడై గురువుగారికి నిత్యము స్నానము చేయించి, మెత్తటి గుడ్డతో నెమ్మది, నెమ్మదిగా అద్దుతూ, వారికి ఎంతమాత్రము ఆయాసము కలుగకుండా బహుజాగ్రత్తగా ఓర్పుతో నేర్పుతో శుశ్రూష చేయుచుండెను. దీపకుడు నిత్యము మాధూకరము (భిక్షాన్నము) తెచ్చి గురువునకు తినిపించుచుండెను. ఆయనను సాక్షాత్తు విశ్వనాథునిగా భావించి నిశ్చలమైన చిత్తముతో ఆరాధించుచుండెను. (171-188)

ప్రబలమైన వ్యాధితో పీడింపబడుచున్నప్పుడు సాధుజనులు కూడా క్రూరస్వభావమునకు లోనగుట సహజము. కావున, వేదధర్ముడను ఈ గురువు కూడా రోగపీడవలన శిష్యుడగు దీపకుని యెడల క్రూరస్వభావమును ప్రదర్శించుచుండెను. ఒకరోజున శిష్యుడు భిక్ష తెచ్చి

ఈయగానే అది చూచిన శ్రీగురుడు - 'ఇంత కొద్దిగ తెచ్చితివేమి?' అని కోపముతో ఉగ్రుడై దానిని తినకుండా విసురుగా నేలపై చిమ్మివేసెడివాడు. మరొకరోజున భిక్షను ఎక్కువగా తెచ్చినప్పుడు పక్వాన్నములు ఎందుకు తేలేదని కోపగించి విసిరికొట్టెడివాడు. వేరొకరోజున రకరకముల పిండివంటలు, కమ్మని కూరలు ఎందుకు తేవడము లేదని మిక్కిలి కోపగించి 'పో, పొమ్మురా!' అని గద్దించి అతడిని చేయెత్తి కొట్టబోయెడివాడు. ఒక్కొక్కసారి తెచ్చిన మాధుకరమును పూర్తిగా పారబోసి కినుక వహించి నానా దుర్భాషలాడెడివాడు. మరొకసారి శిష్యుని దగ్గరగా రమ్మని- "నాయనా! శిష్యోత్తమా! నీవు జ్ఞానరాశివి, శిఖామణివి. నా కొరకు నీవు ఎంతయో కష్టపడుచుంటివి గదా!" అని ఆప్యాయముగ పలికెడివాడు. వెంటనే కనులెఱ్ఱజేసి ఉగ్రుడై - "ఓరీ! మహాపాపీ! క్రూరుడా! నన్ను ఎంతగానో బాధపెట్టుచుంటివిగదరా! నా మలమూత్రాదులను తొలగించి నీవు సరిగా శుభ్రము చేయుటలేదు. నాపైన ఈగలు, దోమలు వాలి నన్ను బాధించుచున్నవి. దీపకా! వాటిని తొలగించకుండా నిలబడియున్నావేమిరా?" అని గద్దించును. విసనకఱ్ఱతో విసురుతూ సేవచేయుచున్నప్పుడు, ఇంకనూ భిక్షకు వెళ్ళకుండా, కూర్చునియున్నావేమిరా? అని తీవ్రముగ నిందించును. శిష్యుడగు దీపకుడు మాత్రము గురువుయొక్క గుణదోషములను ఎంతమాత్రము యెంచకుండా గుర్వాజ్ఞయే తన ఏకైక లక్ష్యముగా కలిగి గురుశుశ్రూషను చేయుచుండెను. గురువు తన ఉచ్ఛిష్టమును ప్రసాదించినపుడే, దానిని మహాప్రసాదముగా భావించి, భుజించుచు కాలము గడుపుచుండెను. (189-196)

ఈవిధముగ పాపఫలమువలన సంప్రాప్తమైన భయంకరమగు రోగముచే పీడింపబడుచు అప్పుడప్పుడు ఆ గురువు యిట్లనును - "**ఇది పాపగతి. నాయనా! పాపగుణము అతిక్రూరముగా, కఠినముగా ఉండును. పాపగుణమువలన నిష్ఠురోక్తులను పలుకుట అనగా తిట్టరాని తిట్లను తిట్టుచుండుట జరుగును. పాపము అధికముగా ఉన్నచోట దీనత్వము, దారిద్ర్యము, మత్సరము (ఈర్ష్య), దుష్టత్వము ఉండితీరును. పాపియైనవాడు శుభాశుభములను లెక్కింపడు. ఎవరైతే అత్యంతదైన్యముచే, అమితమైన దుఃఖముచే పీడింపబడుచుందురో, వారు పాపరూపులని గ్రహించవలెను. అట్టివారలు నిష్ఠురముగనే మాటలాడుదురు. అది పాపఫలమైన ఉన్మత్తత అనియే గ్రహింపవలెను. ఇందెంత మాత్రము సందేహము అక్కరలేదు. బలమైన ఇతర వ్యాధులు ఎన్ని ఉన్నప్పటికినీ, అవి ఒక కుష్ఠువ్యాధిముందు పదహారవ వంతునకు కూడా సరిపోలజాలవు**" అని అన్యాపదేశముగ శిష్యునకు ఉపదేశించుచుండెను. ఈవిధముగ వేదధర్ముడు మిక్కిలి కష్టములను అనుభవించుచుండెను. (197-200)

గురువునే ఈశ్వరునిగా భావించి ఆయన గుణదోషముల యెడ దృష్టి సారించకుండా ఆ శిష్యుడు నిర్మలమైన మనస్సుతో తన గురువును సేవించెను. గురువును శివకేశవులతో సమానుడని దృఢముగా నిశ్చయించుకొని, ఆయన కోరిన విధముగ పలువిధముల ఆహారపదార్థములను భిక్షాటనము ద్వారా సంపాదించి గురువు ముందు సమర్పించుచుండెను. కాశీవంటి గొప్ప పుణ్యక్షేత్రమునందు ఉన్ననూ గురుసేవా పరాయణుడైన ఆ దీపకుడు స్థానికముగా నున్న పుణ్యస్థలములను దర్శింపలేదు. తుదకు కాశీ విశ్వనాథుని దర్శించుటకు కూడా గురుసేవను విడిచి అతడు యేనాడునూ వెళ్ళలేదు. (201-203)

శ్లో॥ న తీర్థయాత్రా న చ దేవయాత్రా న దేహయాత్రా న చ లోకయాత్రా ।
అహర్నిశం బ్రహ్మహరీశ బుద్ధ్యా గురుం ప్రపన్నో న హి సేవ్యమన్యత్ ॥ (204)

అనగా – తీర్థయాత్రనుగానీ, దేవయాత్రనుగానీ, శరీరసంరక్షణతో కూడిన దేహయాత్రనుగానీ, లౌకిక వ్యవహారాదులతో కూడుకొన్న లోకయాత్రను గానీ ఎంతమాత్రము లెక్కించకుండా, వాటిని సంపూర్ణముగా త్యజించి, కేవలము గురువునే బ్రహ్మ విష్ణు మహేశ్వరులనెడు త్రిమూర్త్యాత్మక స్వరూపునిగా తలంచి ఆ గురువునే శరణుజొచ్చి దివారాత్రములు సేవింపవలయును కానీ, ఇతరులను ఎవరినీ సేవింపరాదు. (205)

శిష్యాగ్రేసరుడైన దీపకుడు తన దేహసంరక్షణను గూర్చి ఎంతమాత్రము పట్టించుకొనువాడు కాదు. నిరంతరము శ్రీగురు చరణములయందే మనసును లగ్నము చేసి మౌనముగా ఉండువాడు. శ్రీగురుమూర్తినే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని త్రికరణశుద్ధిగా భావించి, అహోరాత్రములు అలుపెరుగకుండా గురువును సేవించుచుండెను. గురువు ఎంతటి నిష్ఠురములైన మాటలను పలికినా సరే! తాను మాత్రము చలించకుండా ప్రసన్న హృదయముతో గురువుయొక్క మనోభావమును అనుసరించి వ్యవహరించుచుండెను. (206-207)

ఇట్లుండగా ఒకరోజున దీపకుని గురుభక్తికి మెచ్చిన పినాకపాణియగు శంకరుడు ప్రసన్నవదనుడై **ఆతని యెదుట ప్రత్యక్షమై ఇట్లనెను**– “దీపకా! నీ వంటి గురుభక్తుడు ఎచటనూ కానరాడు. నీవు కులదీపకుడవు! మహాజ్ఞానివి! నీ గురుభక్తికి మెచ్చితిని. నీ యెడల ప్రసన్నుడనైతిని. నీవు యేదేని వరమును కోరుకొనుమ”ని అనెను. అంతట దీపకుడు – “మృత్యుంజయా! వ్యోమకేశా! నా గురువు అనుమతి లేకుండా నేనేమియు కోరను” అని ఈశ్వరునితో చెప్పెను. వెంటనే అతడు గురువును సమీపించి – “స్వామీ! విశ్వనాథుడు నా యెడల ప్రసన్నుడై వచ్చి వరము కోరుకొమ్మనుచున్నాడు. గురుదేవా! మీరు అనుమతించినచో, మీ వ్యాధి నివృత్తి యగునట్లుగా వరము కోరెదను. సదాశివుని వరముతో మీరు ఆరోగ్యవంతులయ్యెదరు” అని విన్నవించెను. శిష్యుని మాటలు వినిన గురువు మిక్కిలి కోపోద్రిక్తుడై ఇట్లు పలికెను – **“ఓరీ! నా వ్యాధి**

కోసమై ఈశ్వరుని ప్రార్థించవద్దు. నాకు శుశ్రూష చేయుటకు నీకు కష్టముగ తోచినయెడల నన్ను వదలిపెట్టి వెళ్ళి పొమ్ము. నా ప్రారబ్ధమును నేను పూర్తిగా అనుభవించవలసినదే. ఎవరికైననూ సరే! ఈ జన్మలో అనుభవించకుండా ప్రారబ్ధము నివృత్తి కానేరదు. గత జన్మలోని సంచితమే, ఈ జన్మలో ప్రారబ్ధముగా మారి బాధించుచుండును. ప్రాయశ్చిత్తము చేతగాని, వరముల ద్వారాగాని ఎవరైనను తన ప్రారబ్ధమును నివృత్తి చేసికొనినచో, అది తాత్కాలికముగ నివృత్తి యగును. కాని, సంపూర్తిగా నివారింపబడదు. శేషమును మరుజన్మలో తప్పక అనుభవింపవలసినదేనని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. ముక్తిని కోరుకొనువారు ప్రారబ్ధమును ఈ జన్మతో అనుభవించి నివృత్తి చేసుకొనవలసినదే! **ఒకవేళ మిగిలిపోయినచో, అది ముక్తికి విఘ్నమును కలిగించును"** అని చెప్పిన గురువాక్యములను వినిన శిష్యుడు తిరిగి పరమేశ్వరుని సమీపించి – "ఈశ్వరా! నాకు మీ వరము అక్కరలేదు. నేను కోరదలచిన వరము మా గురువునకు అంగీకారముగ లేదు. గుర్వాజ్ఞ లేనిదే నాకు వరము కోరుకొను అధికారము లేదు. కావున, దయతో నన్ను మన్నించి తమరు వెళ్ళవలసినది" అని చెప్పెను. దీపకుని మాటలకు మిక్కిలి విస్మయము నొందిన వ్యోమకేశుడగు శంకరుడు వెంటనే కాశీక్షేత్రమునందుగల నిర్వాణమంటపమునకు చేరుకొనెను. అచటికి దేవతలనందరిని ఆహ్వానించి, విష్ణుదేవుని సమక్షమున ఈ వృత్తాంతమును సాంతముగా **వారందరికి యిట్లు వివరింపసాగెను –**

"నేను ఈ రోజు ఒక అపూర్వమైన వింతను చూచితిని. గోదావరి తీరవాసియగు 'వేదధర్ముడ'ను ఒక మునీశ్వరునకు, అతని శిష్యుడగు 'దీపకుడు' అత్యంత భయభక్తులతో దృఢచిత్తముతో అహర్నిశములు సేవలు చేయుచున్నాడు. కనివిని ఎరుగనంతటి కఠోరమైన భక్తిభావముతో గురుశుశ్రూష చేయుచున్నాడు. ఆ శిష్యుని గురుభక్తి సాటిలేనిది. అతడిని చూచి నాకెంతయో ప్రీతి కలిగినది. విష్ణుదేవా! అతనికి వరమీయదలచి, ఎంతో ఉబలాటముతో నేను అచటికి వెళ్ళితిని. కాని, తన గురువు అనుమతింపలేదని అతడు నేనీయదలచిన వరమును స్వీకరింపలేదు. ఎందరో ఋషీశ్వరులు అడవులలో కూర్చొని వేలాది దివ్యవర్షముల(1) పర్యంతము కఠినాతికఠినమైన దీక్షతో దివ్యవరములను పొందవలెనను తపనతో ఘోరమైన తపస్సు చేయుచుందురు. అట్టి తాపసులకు, ఋషులకు వెంటనే వరమును ఇచ్చుటకు మనసు అంగీకరింపదు. కాని, ఇప్పుడు నేనే స్వయముగ వెళ్లి "నీకు కోరిన వరము నిచ్చెదనని" ఎంత బలవంతపెట్టిననూ అతడు 'ససేమిరా' యని వరమును స్వీకరింపలేదు. **తనయొక్క తను, మనములను సంపూర్ణముగా సమర్పించి, గురువే తనకు సర్వస్వము అను దృఢమైన నిశ్చయమును కలిగియున్నాడు. తనకు తల్లీ, తండ్రీ, సమస్త దేవతానీకము, సర్వమూ గురువేనని భావించి, తుదకు గురువే పరమాత్మ, పరబ్రహ్మము కూడా గురువే అను స్థిరమైన**

---

1. ఒక దివ్యవర్షము అనగా వేయి సంవత్సరములు

నిర్ణయముతో ఉన్నాడు. ఆహా! అతని గురుభక్తి నిరుపమానమైనది. ఎంతని వర్ణించను? ఏమని చెప్పగలను? దీపకుడు - సందీపకుడు అను సార్థకనామధేయమును కలిగినవాడు. అవిద్య అనే అంధకారమునకు ఆతడే దీపము. కులదీపకుడన్న పేరు అతనిపట్ల సార్థకమై ఒప్పారుచున్నది. ధర్మము, జ్ఞానము, సర్వమూ ఒక్క గురువే తప్ప ఇతరమేదియు లేదను అనన్యమైన భక్తిభావముతో, ఆత్మసమర్పణబుద్ధితో, దృఢమైన దీక్షతో శ్రీగురుచరణ సరోజములను సేవించుచున్నాడు" అని ఈశ్వరుడు చెప్పెను. పరమేశ్వరుడు వివరించిన ఉదంతమును వినిన విష్ణుమూర్తి వెంటనే ఆ గురుశిష్యులను చూచుటకై మిక్కిలి కుతూహలముతో వారి నివాసమునకు చేరెను. దీపకుని గురుసేవను తన కనులతో తానే స్వయముగా తిలకించెను.

విశ్వనాథుడు వివరించిన దానికంటే ఇతని గురుభక్తి మిక్కిలి అధికముగా ఉన్నదని శ్రీమహావిష్ణువు గ్రహించి మిగుల సంతసించెను. ఆ శిష్యుని తన చెంతకు రమ్మని పిలిచి **హృషీకేశుడు ఇట్లనెను** - "నాయనా! నీ గురుభక్తికి సంతసించితిని. నీ యెడల నేను ప్రసన్నుడనైతిని. వత్సా! ఏదేని వరమును కోరుకొమ్మని" పలికెను. **అప్పుడు దీపకుడు విష్ణువుతో ఇట్లనెను** - "ప్రభూ! నేను ఏమి చేసితిని? నాలోగల భక్తి ఏపాటిది? ఎందుకు మీరు వరమీయదలచితిరో, నాకెంతమాత్రము అంతుపట్టుటలేదు. నాకు మిగుల ఆశ్చర్యమగుచున్నది. శ్రీమన్నారాయణమూర్తీ! నాదొక మనవి. దట్టమైన అడవులలో పచ్చి మంచినీరు కూడా ముట్టకుండా దివ్యసహస్ర - కోటి సంవత్సరములపాటు తీవ్రమైన కఠోరమగు తపస్సు చేసిన వారిని ఉపేక్షించెదరు. వారికి వెంటనే వరమును ఇచ్చుటకు తలంపరు. కాని, నేను మాత్రము మిమ్ములను యెప్పుడునూ పూజింపలేదు. మిమ్ములను ప్రార్థింపలేదు. మీ నామమును సైతము స్మరింపలేదు కదా! మరి, మీరే స్వయముగా వచ్చి వరమిచ్చెదమని, కోరుకొమ్మని నన్నెందులకు బలవంతపెట్టుచుంటిరో? నాకేమియు తోచుటలేదు. ఇదంతయు వింతగా దోచి, నాకు మిక్కిలి ఆశ్చర్యము గొల్పుచున్నది" అని విన్నవించిన దీపకుని మాటలు వినిన శ్రీమహావిష్ణువునకు అంతులేని సంతృప్తి కలిగినది. పుత్రవాత్సల్యము పెల్లుబికినది. **అప్పుడు దీపకునితో విష్ణుమూర్తి ఇట్లనెను** - "వత్సా! నీవు దృఢమైన గురుభక్తిని కలిగి, నిశ్చయాత్మకబుద్ధితో గురుసేవను ఆచరించుచున్నందున మిగుల సంతోషించితిని. నేను నీ యెడల మిక్కిలి ప్రసన్నుడనైతిని. నీవు చేయుచున్న గురుసేవ అంతయునూ నాకే చెందును. గురువు ఎవరో కాదు? ఆ గురుస్వరూపమును నేనే. అచ్చమైన గురుభక్తులు నాకు ప్రాణసములు. నేను వారికి వశమయ్యెదను. వారు కోరిన వాటినన్నింటిని ఇచ్చివేయుదును. తల్లిదండ్రులకు చేయు సేవయు నాకే చెందును. స్త్రీలు చేయునట్టి పతిసేవ కూడా నాకే చెందును. ఎవరైననూ ఒక

సద్బ్రాహ్మణునకుగాని, యతీశ్వరునకు గాని, యోగీశ్వరునకు గాని, తాపసికి గాని కదు భక్తిభావముతో నమస్కరించినచో, అది కూడా నాకే చెందునని నిశ్చయముగా తెలిసికొనుము" అని చెప్పెను. (208-240).

విష్ణుమూర్తి మాటలు వినిన దీపకుడు వినయముగా నమస్కరించి మరల ఇట్లు విన్నవించెనని సిద్ధముని నామధారకునితో చెప్పుచున్నాడు- **"విష్ణుదేవా! హృషీకేశా! వేదశాస్త్రాదుల నన్నింటిని మాకు గురుదేవుడే ప్రసాదించగలడని నా మనోనిశ్చయమైన మాట. గురువు అనుగ్రహించెడు జ్ఞానముతో త్రిమూర్తులు సైతము మాకు స్వాధీనులయ్యెదరు. మా గురుదేవుడే మాకు దేవుడు. మరొకదేవుడు లేనే లేదు. సకలదేవతలు, సమస్త తీర్థములు మాకు మా గురుదేవుడే సుమా! ఇది నిక్కము. వేయేల! మా పరమార్థమంతయూ ఆయనతోడనే, ఆయనవలననే! సమస్త యోగులకు, సిద్ధజనులకు గురువు లేకుండా జ్ఞానము లభింపదు. యథార్థజ్ఞానము లభించిన మీదట పరమేశ్వరుడు మాకు దూరముగ ఎట్లుండగలడు? మీరు నాకు ఇవ్వజూపెడు వరములన్నింటిని నాకు మా గురువే ఈయగలడు. ఇందులో ఆశ్చర్యమేమున్నది? అందువలన నేను శ్రీగురురాజునే సేవించెదను. పూజించెదను"** అని దీపకుడు విష్ణుభగవానునితో పలికెను. **అందులకు శ్రీమహావిష్ణువు మిగుల సంతసించి ఇట్లనెను –** "ఓయీ! శిష్యరత్నమా! నీవు ధన్యుడవు. నీ జన్మము ధన్యము. నీవు కృతకృత్యుడవు. నాకు ప్రాణసముడవు. అచ్చమైన మచ్చలేని భక్తుడవు. శిష్యశిరోమణివి నీవే! నాయనా! ఒక్కమాట! ఇప్పుడైనా ఏదేని వరము కోరుకొమ్ము. నిన్ను, నీ గురుభక్తిని చూచుటకై ముందుగా విశ్వనాథుడు వచ్చెను. తదుపరి నేను స్వయముగా వచ్చితిని. కావున, ఇప్పటికైనను నీవు నీ మనసారా ఒక వరమును కోరుకొనుము. అందుకు నా మనసు ప్రసన్నమై ప్రఫుల్లము నొందగలదు. వత్సా! నేను నీకు పూర్తిగా వశమైతిని. నీవు కోరినదానిని కాదనకుండా ఈయగలను" అని నిర్బంధించి పలికెను. అందుకు **దీపకుడు విష్ణువుతో వినయభావము ఉట్టిపడుచుండగా ఇట్లనెను –** "స్వామీ! మీరొకవేళ తప్పనిసరిగా నాకు వరమీయదలచిన యెడల నేను ఒకే ఒక కోర్కెను కోరెదను. నాకు మునుపటికంటే గురుభక్తి మరింత అధికముగా వృద్ధి పొందునట్లుగా, అది నిరంతరము నాలో నిశ్చలముగ ఉండునట్లుగా అనుగ్రహింపుడు. ఇట్టి జ్ఞానము రెట్టింపుగా పెరిగి, శ్రీగురుస్వరూపము, గురుతత్త్వమును నేను గుర్తించగలుగునట్లుగా వరమునుప్రసాదింపుము. ఇది తప్ప నేను ఇంకేమియును కోరను. నన్ను దయతో క్షమించుము. ప్రభూ!" అంటూ శ్రీహరి పాదపద్మములపై శిరము నుంచి సాష్టాంగప్రణామము చేసెను. అత్యంత ప్రసన్నవదనముతో చిరునవ్వును చిందించుచూ **శ్రీమహావిష్ణువు తిరిగి ఇట్లు పలికెను–** "శిష్యశిఖామణీ! దీపకా! నీవు నా ప్రాణసఖుడవు. గురువును నీవు దేహబుద్ధితో చూడకుండా ఆయనను పరబ్రహ్మ దృష్టితో చూడగలిగితివి. గురువును పరబ్రహ్మగా గుర్తించితివి. నీ గురుభక్తిని గూర్చి విని, స్వయముగా వచ్చి చూచిన మాకు మిక్కిలి

సంతోషమయ్యెను. నీ కోరిక ఫలించును. నీకు బ్రహ్మజ్ఞానము సిద్ధించును. నీవు ధన్యుడవు. నీ జన్మము ధన్యమైనది. ఇంకనూ నీవు ఏదేని అడుగదలచినచో, నేను కొన్నిమాటలను చెప్పెదను. శ్రద్ధగా ఆలకించుము -

"నాయనా! లౌకిక వ్యవహారమును అనుసరించి మంచి బుద్ధిమంతుడవైన నీవు ధర్మాధర్మములను చక్కగా విచారించి ఉత్తమ విధానముతో మసలుకొనుము. నిరంతరము ఉత్కృష్టమైన రీతిగా శ్రీగురుదేవుని స్తుతించుచుండుము. శ్రీగురుని నీవు ఎప్పుడెప్పుడు భక్తిభావముతో స్తుతించెదవో, అప్పుడు ఆ స్తోత్రమును విని నేను మిక్కిలి సంతసించెదను. అదియే నా స్తుతి యగునని తెలిసికొనుము. భక్తితో అహర్నిశలు వేదములను అధ్యయనము చేయుచు, వేదాంతభాష్యమును చక్కగా అధ్యయన మననాదులను చేయు వారలు మమ్ములను నిశ్చయముగా చేరుకొందురు. **గురువును పరబ్రహ్మగా గుర్తించి, తగు నిష్ఠతో గురుదేవుని పూజించి, సేవించే వారికి సమస్త దేవతలు వశమయ్యెదరు. 'గురు' అనే రెండక్షరములు అమృతపూరితమహాసాగరములు. అందులో మునకలు వేసినవారికి ఇక తాపత్రయములు యెట్లుండును. శిష్యులు సర్వదా గురువు యొక్క ఉపదేశామృతపానమును చేసి అమరులయ్యెదరు. ఎవరి హృదయము నందు నిరంతరము శ్రీగురుస్మరణ నిలిచియుండునో, వారెల్లరు ముల్లోకముల యందు పూజ్యులయ్యెదరు.** (241-259).

శ్లో॥ యదా మమ శివస్యాపి బ్రహ్మణో బ్రాహ్మణస్య హి । అనుగ్రహో భవే న్నృణాం సేవ్యతే సద్గురుస్తదా ॥ (260)

అనగా - నేను - విష్ణువుగాని, శివుడుగాని, బ్రహ్మగాని లేక, బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన బ్రాహ్మణుడుగాని, ఎవరిని అనుగ్రహింతురో, వారికే సద్గురుసేవ లభించును. నేను అనగా విష్ణువుగానీ, ఈశ్వరుడుగానీ, బ్రహ్మగానీ మాలో యే ఒక్కరు వరమును అనుగ్రహించిననూ, తత్ ఫలితముగా గురువు లభించును. అందుకే గురువు త్రిమూర్త్యాత్మక స్వరూపుడని చెప్పబడెను" అని దీపకునికి ఉపదేశించి, అతడు కోరిన రీతిగా వరమును ప్రసాదించి విష్ణుమూర్తి అంతర్ధానమయ్యెను" అని బ్రహ్మ కలిపురుషునితో చెప్పెను.

విష్ణుదేవుడు వెడలిపోయిన పిమ్మట దీపకుడు గురువువద్దకు చేరెను. **అప్పుడు ఆ గురువు తన శిష్యుని చూచి ఇట్లడిగెను** - "నాయనా! కులదీపకా! విష్ణుమూర్తిని నీవు ఏమి వరములను కోరితివి. అతడు నీకు ఏమని వరమిచ్చెను. వివరముగా చెప్పుమని" కోరెను. "మహాత్మా! మా గురుదేవుల చరణారవిందములయందు దృఢమైన భక్తిని ప్రసాదింపుమని ప్రార్థించితిని. నిశ్చలమైన మనస్సుతో తత్పరతను వహించి నిరంతరము గురుసేవను చేయగల మహద్భాగ్యమును అనుగ్రహించుమని కోరితిని" అని దీపకుడు చెప్పగా, విని వేదధర్ముడు మిగుల ఆనందభరితుడై, అత్యంత ప్రసన్నుడై వెంటనే తన నిజస్వరూపముతో సాక్షాత్కరించెను. "శిష్యరత్నమా! నీవు చిరంజీవుడవై ఈ కాశీక్షేత్రమునందే

స్థిరముగా నివసించెదవు. నీ నోట పలికిన మాటలు సత్యములై సిద్ధించును. నీ ఇంటిలో నవనిధులు నిలయమై యుండగలవు. సాక్షాత్తుగా విశ్వనాథుడే నీకు స్వాధీనమాయెను" అని చెప్పి, **గురువు మరల ఇట్లనెను** - "వత్సా! దీపకా! నిన్నెవరు స్మరించెదరో వారికి గల కష్టములు అన్నీ తొలగిపోవును. నీ స్మరణమాత్రముతో వారు సిరిసంపదలతో తులతూగెదరు" అని ఈ రీతిగా గురువు వేదధర్ముడు తన శిష్యుడగు దీపకుని యెడల మిగుల ప్రసన్నుడై దివ్యానుగ్రహమును ప్రసాదించెను. వెంటనే ఆయన దివ్యదేహుడయ్యెను. అతని శరీరమునందు గల కుష్ఠువ్యాధియును, అంధత్వమును చిటికెలో అదృశ్యమాయెను. ఒక శిష్యుని పరీక్షించి, అతనిని ఉత్తమాధికారిగా నిలబెట్టుటకే వేదధర్ముడు క్లిష్టమైన కుష్ఠురోగిగా మారెను. అంతియే కాని, ఋషిశ్రేష్ఠుడైన ఆ తపస్వికి పాపము ఎట్లుండును? లోకమునకు మేలు కలిగించుట కొరకే ఆ మహానుభావుడు కాశీయాత్రను చేసెను. కాశీలో నివసించి కాశీక్షేత్రమహిమను లోకమునకు వెల్లడించెను. అయితే, **కాశీక్షేత్ర మహిమ ఎంతటి గొప్పదనగా అచట నివసించినంత మాత్రముననే మానవుల వేలాది పూర్వజన్మల పాపరాశి నశించిపోవును. పవిత్రమైన కాశీక్షేత్రమునందు ధర్మపరులుగానీ, అధర్మపరులుగానీ, ఎవరైననూ సరే, కొద్దికాలము నివసించిన చాలును! వారికి పునర్జన్మ ఉండదు.** ఈవిధముగ శిష్యుడగు దీపకుని ఆఖ్యానమును సూతుడు శౌనకాది ఋషీశ్వరులతో చెప్పగా, బ్రహ్మ కలిపురుషునితో చెప్పెను. **అనంతరము సిద్ధముని నామధారకునితో ఇట్లనెను** - "గురుభక్తి యందు దృఢమైన నిష్ఠను గలిగి, నిశ్చలమైన చిత్తముతో శ్రీగురువును విశ్వసించి, సేవించవలెను. అప్పుడే మానవులు ఈ సంసారసాగరమును గురుభక్తి మహిమతో తరించుటకు సమర్థులయ్యెదరు. (261-275)

శ్లో॥ యత్ర యత్ర దృఢా భక్తిర్యదా యస్య మహాత్మనః । తత్ర తత్ర మహాదేవః ప్రకాశముపగచ్ఛతి ॥ (276)

అనగా - ఎచ్చటెచ్చట ఏయే మహాత్ములు తమ గురువునందు త్రికరణశుద్ధిగా దృఢమైన భక్తిని కలిగియుందురో, అచ్చటచ్చట శ్రీమహాదేవుడు ప్రత్యక్షమై వారికి వశము కాగలడు. గంగాధరనందనుడు శ్రోతలందరికి నమస్కరించి, నేను చెప్పిన అమాయికమైన నా బుడి, బుడి మాటలను న్యూనాతిరిక్తములుగ తలపవద్దని సవినయముగ కోరుచున్నాడు. (277-278)

ఇది శ్రీ గంగాధర-సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "శిష్యదీపకాఖ్యానము" అను రెండవ అధ్యాయము ॥ (2)

॥ జయ గురుదత్త - శ్రీగురుదత్త ॥

(ఓవీలు - 278; మొత్తము సంఖ్య - 149+278 = 427 ఓవీలు).

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

మూడవ అధ్యాయము

సిద్ధముని వెంట నామధారకుడు గాణగాపురమునకు చేరుకొనుట - శ్రీ గురుభక్తి ఔన్నత్యమును, శ్రీగురుచరిత్ర మహిమను గూర్చి వర్ణించుట - భగవదవతారకారణము - అంబరీషుని ఏకాదశీవ్రత నిరూపణము.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని చెప్పిన వాక్యములను విన్నట్టి నామధారకుడు మిగుల హర్షించి వినయముతో మరల ఇట్లనెను – "సిద్ధమునీశ్వరా! మీకు జయము, జయము. నా మనసున కలిగిన సంశయమును తొలగించితిరి. ఈ సంసార సాగరమునుండి నన్ను తరింపజేయగల సమర్థులు మీరే. తమరు దయతో శ్రీగురువు యొక్క అపారమైన మహిమను గూర్చి నిస్సంశయముగ వివరించి చెప్పుటవలన నేను ఆనందజలధిలో హాయిగా మునకలు వేసితిని. స్వామీ! నన్ను అనుగ్రహించుటకు తమరు ఎచటినుండి వచ్చితిరి? మీ నివాస మెక్కడ? మీరు స్వీకరించు ఆహారమేమిటి? నేను మీ దాసుడను. శరణాగతుడను. నన్ను దయతో ఉద్ధరించగలరని" కోరుతూ ఆ సిద్ధముని చరణములపై తన శిరమును ఉంచి, వినయముతో సాష్టాంగ వందనమును ఆచరించెను. అంతట కృపానిధియగు సిద్ధముని ఆ శిష్యుని లేవనెత్తి ఆప్యాయముగ ఆలింగనము చేసికొని ఆశీర్వదించి తన వృత్తాంతమును ఇట్లు వినిపించెను – "ఎక్కడెక్కడ శ్రీగురువు ఉండునో అక్కడక్కడ మహత్త్వ భావముతో నేను ఉండెదను. శ్రీగురుచరణముల ఆశ్రయమే నా నివాసస్థానము. నీ ఆహారము ఏమిటని అడిగితివి కదా? శ్రీగురుస్మరణమే నాకు ఆహారము. శ్రీగురుచరిత్ర పఠనము, శ్రీగురుమహిమా గానము నాకు అమృతపానము. దానినే నేను ఎల్లప్పుడూ సేవించుచుండెదను" అని చెప్పి ఒక గురుచరిత్ర గ్రంథమును చూపించి, ఇట్లు పలికెను - నామధారకా! ఈ గ్రంథమును పఠించుట వలన ఇహపరలోకములకు చెందిన భుక్తి-ముక్తులు రెండునూ లభించును. ఆర్తభక్తులు శ్రీగురుచరిత్రమును శ్రద్ధగా వినుటవలన వారి వారి సమస్త మనోభీష్టములు వెనువెంటనే నెరవేరగలవు. ధనము కోరువారికి అక్షయధనము లభించును. సంతానము కోరువారికి పుత్రపౌత్రాభివృద్ధి కలుగును. ఈ గ్రంథ శ్రవణము వలన శీఘ్రముగ గోధనము లభించి జ్ఞానము సిద్ధించును". (1-10)

"సప్తాహదీక్షను వహించి, కదు భక్తిశ్రద్ధలతో శ్రీగురుచరిత్రమును చదివినవారికి, వినినవారికి కోరిన కోరికలు వెనువెంటనే నెరవేరగలవు. పుత్రులు లేని వారికి పుత్రులు కలిగెదరు. గ్రహపీడలు విరగడైపోవును. సమస్త వ్యాధులు సమసిపోవును. సంకటములలో చిక్కుకొనిన మానవులు సులభముగా వాటినుండి విడివడిపోవుదురు. బ్రహ్మహత్యాది పాపములు నశించిపోవును. ఏకాగ్రచిత్తముతో శ్రవణము చేయువారికి తత్త్వజ్ఞానము సిద్ధించును. వారు శతాయుష్మంతులయ్యెదరు" అని సిద్ధముని చెప్పెను. **నామధారకుడు నమస్కరించి ఇట్లు పలికెను** – "స్వామీ! దయానిధీ! సిద్ధమునీంద్రా! నన్ను తరింపజేయుము. గురుస్వరూపముతో నా ముందు సాక్షాత్కరించిన మీరు సాక్షాత్తు జగజ్జ్యోతి స్వరూపాత్మకమయిన పరబ్రహ్మ స్వరూపులే కాని, వేరుకాదు. నాకు మీ ద్వారా గురుచరిత్రమును సాంగముగ వినవలయునను కౌతుకము యేర్పడినది. దాహముతో పీడించబడుతూ దారిన వెడుతున్న వానికి అమృతభాండము లభించినట్లుగా నాకు మీ కలయిక లభించినది. మహానుభావా! గురు మహిమను వినిపించి నా కర్ణపుటములను సార్థకము చేయుము. అజ్ఞాన అంధకారములో మునిగి కొట్టుమిట్టాడుచున్న ఈ దీనునియందు దయదలంచి జ్ఞానప్రకాశమును అనుగ్రహించి కృతార్థుని జేయగలరని" పదేపదే ప్రార్థించెను. (11–17)

తనయొక్క శరణుజొచ్చిన నామధారకుని యెడల ప్రసన్నచిత్తుడైన సిద్ధముని అతనికి అభయమిచ్చెను. వెంటనే అతని కుడిచేతిని పట్టుకొని తన స్వస్థానమునకు తీసికొనివెళ్ళెను. అది అమరజా భీమా నదుల సంగమతీరము. అచట జ్ఞానమార్గమునకు సోపానము వంటిది, సాక్షాత్తుగా కల్పభూరుహమే అయిన ఒక దివ్యమైన అశ్వత్థవృక్షము కలదు. దాని క్రింద కూర్చుండజేసి **నామధారకునితో సిద్ధముని ఈవిధముగ జ్ఞానోపదేశము చేసెను** – "నామధారకా! ఈ అశ్వత్థవృక్షము జ్ఞానప్రదమైనది. దీని సమీపమున చేసిన జ్ఞానవిచారము వెనువెంటనే సిద్ధించగలదు. ఓయీ! శిష్యుడా! సావధానముగా వినుము. నీవు గురుసేవా రహస్యమును గుర్తించవైతివి. అందువల్లనే నీకు ఈతిబాధలు, చీకూ చింత కలుగుచున్నవి. గురుమూర్తిని గుర్తించుట కష్టసాధ్యము. అటులే గురుదాస్యము కూడా సులభసాధ్యము కాదు. అందులకు మన ఆచరణ నిష్కపటముగ నుండవలెను. దృఢమైన భక్తిని కలిగియుండవలెనని" చెప్పెను. (18–21)

సిద్ధముని మాటలు వినిన నామధారకుడు మిగుల సంతసించి పదేపదే నమస్కరించి, **దీనవదనుడై యిట్లు ప్రార్థించెను** – "నేను సంసార సాగరములో మునిగియుంటిని. తాపత్రయములనెడు బురదలో చిక్కుకొంటిని. కామక్రోధాదులనెడు జలచరములు నన్ను కొరికి, కొరికి భక్షించుచున్నవి. అజ్ఞానమనెడు వలలో చిక్కుకొని బాధపడుచుంటిని. స్వామీ! దయతో నన్ను మీరు జ్ఞానమనెడు నావలో ఎక్కించుకొని, కృప

యనెడు వాయువుతో నెట్టి నన్ను తరింపజేయుము" అని కరుణరసము ఉప్పొంగునట్లుగా విన్నవించి నామధారకుడు తన శిరమును సిద్ధముని చరణములపై నిలిపి నమస్కరించెను. యిట్లు శరణుగోరిన తన శిష్యుని లేవనెత్తి **వాత్సల్యపూరిత వాక్కులతో మునీశ్వరుడిట్లు పలికెను -** "నాయనా! చింతింపకుము. ధైర్యమును వహింపుము. పిరికితనము పనికిరాదు. ఇంతవరకు దృఢమైన భక్తి లేనందున నీవు నానావిధ కష్టములను అనుభవించితివి. ఎవరికి దృఢభక్తి యుండదో, వారే నిరంతరము దైన్యముతో నానా అగచాట్లను అనుభవించెదరు. అవిద్య అనే మాయతో చుట్టబడి శ్రీగురువును దూషించెదరు. సంశయముతో గురువును సేవించువాడు, గురువుద్వారా దేనిని పొందగలడు? పైగా గురుకృపకు పాత్రుడెట్లగును? సంశయాత్ముడు నిత్యము అనేక విధముల ఆలోచనలతో సతమతమై, వ్యాకులమును చెంది చిత్తక్షోభకు గురియగును. తద్వారా, మానసిక శాంతి కరువగును. ఫలితముగా అతని జీవితము దుఃఖమయమగును.(1) **కావున, సంశయమును పూర్తిగా వదలిపెట్టి, త్రికరణశుద్ధిగా సేవించువారిని కృపాసాగరుడైన శ్రీగురుమూర్తి అపారముగా అనుగ్రహించును. శ్రీగురుడు సహజమైన కరుణాసింధువు. నీ అంతఃకరణమున శ్రీగురుపాద ద్వంద్వమును నిశ్చలముగ నిలిపినచో, ఆ గురువు నీకు సర్వస్వమును ప్రసాదించును. అఖిల విశ్వమునకే ఆయన స్వామి. ప్రభువు. జగద్గురువు. దాత. జ్ఞాన ప్రదాత.**(2)

గురువు మేఘము వంటివాడు. మేఘము అన్నిచోట్ల సమానముగనే వర్షించును. కాని, ఎత్తైన ప్రదేశము నందు నీరు నిలువదు. పల్లపుచోట్ల యందు మాత్రమే నీరు నిలుచును కదా! అటులే నిశ్చలమైన భక్తి గలిగిన వారి హృదయము పల్లపుచోటు వంటిది. ఇక, దాంభిక భక్తి గలిగినవారి హృదయము ఎత్తైన ప్రదేశము వంటిది. కావున, అచట కురిసిన శ్రీగురుబోధామృతవర్షము నిలువజాలదు. నిజమైన భక్తి దృఢముగా నుండుటచే పల్లపు ప్రదేశమువలె శ్రీగురుబోధామృత వర్షము నిల్వగా నిలచును. **అట్టివానిని గురుమూర్తి గుర్తించి తన**

---

1. **శ్లో॥ అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి । నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥** (గీత. 4-40)

తా॥ వివేకహీనుడు, శ్రద్ధలేనివాడు, నిత్యశంకితుడు, సందేహాగ్రస్తుడు అయిన వ్యక్తి భ్రష్టుడై నశించును. అంతేగాక, సంశయాత్ముడైన వానికి ఈ లోకంలోగానీ, పరలోకంలోగానీ సుఖము ఉండదు. ఇంకనూ, స్వయంగా అతనికి సుఖముండదు. అతనివలన ఇతరులకు కూడా సుఖముండదు.

2. **తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా । ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః ॥** (గీత. 4/34)

తా॥ తత్త్వజ్ఞానమును సంపాదించు కోరికగల సాధకులు అట్టి తత్త్వమును దర్శించిన జ్ఞానుల వద్దకు వెళ్ళవలయును. వారిని సమీపించి వినయముతో అభివాదనమును ఆచరించవలెను. త్రికరణశుద్ధిగా సేవల నొనర్చవలెను. కపటము లేకుండా భక్తిశ్రద్ధలతో సముచితరీతిగా ప్రశ్నించవలెను. తద్వారా, పరమాత్మతత్త్వమును చక్కగా తెలిసిన జ్ఞానులు సంప్రీతులై నీకు అచ్చమైన పరమాత్మ తత్త్వజ్ఞానమును చక్కగా ఉపదేశించెదరు.

హస్తమస్తకసంయోగముచే అనుగ్రహించినంత మాత్రముననే అతనికి ఈ ప్రపంచమంతయును పరబ్రహ్మమై కన్పట్టెను.[1] **గురువును మరియొక దానితో సరిపోల్చలేము. ఎందుకనగా – కల్పతరువు, కామధేనువు కోరినవాటిని మాత్రమే ప్రసాదించగలవు. కాని, శ్రీగురుదేవుడు ఆశ్రయించిన వారందరికి కావలసిన సమస్తమును ప్రసాదించుటకు సర్వసమర్థుడు. శ్రుతిస్మృతులన్నియును శ్రీగురుడు పరబ్రహ్మమూర్తియని వర్ణించి, ఆతని మహిమను మిగుల విస్తరించి ప్రతిపాదించినవి. కావున, సందేహములను వదలివేసి, దృఢచిత్తముతో శ్రీగురుపాదపద్మములను ధ్యానించి కృతార్థుడవు అగుమని”** ఉపదేశించెను. (22-36)

అనంతరము నామధారకుడు ముకుళితహస్తుడై సిద్ధునకు నమస్కరించి **వినయముతో ఇట్లు పలికెను** – “శ్రీగురు సిద్ధయోగీశ్వరా! కృపాసాగరా! నేను మీ చరణసేవకుడను. మీరే నాకు స్వామి. మీ ఉపదేశామృతము వలన నా మనసు నిర్మలమైనది. నా విన్నపమును వినుడు. శ్రీగురుచరిత్రను వినవలయుననెడి కోరిక నాలో బలీయమై నా మనసు ఎంతయో ఉబలాటపడుచున్నది. శ్రీగురుడు త్రిమూర్తి స్వరూపుడని వింటిని. అయితే, ఆ దత్తదేవుడు మనుష్యయోనిలో ఎందుకు అవతరించెను? అందుకుగల కారణమేమిటి? విశదముగా వివరించి చెప్పగలరని ఆతని పాదములను గట్టిగా పట్టుకొనెను. (37-40)

అప్పుడా యోగీంద్రుడు ఇట్లు చెప్పసాగెను – “వత్సా! నీవు నా బోధామృతసాగరమునకు పూర్ణచంద్రుని వంటివాడవు. మనసునకు ఎంతో గొప్ప ఆహ్లాదమును కలిగించుచుంటివి. నీ గురుదాస్యత్వము ఫలించి నీకు మహాసుఖము లభించునుగాక! నీవు గురుచరిత్రను గూర్చి ప్రశ్నించితివి. నేను లోకమంతటా తిరిగి చూచితిని కాని, గురుచరిత్రను గూర్చి చెప్పుమని కోరినవారు ఇంతవరకు ఎవరునూ నాకు ఎదురు పడలేదు. అట్టి జిజ్ఞాసను కలిగిన వ్యక్తిగా నిన్ను మాత్రమే నేను చూడగలిగితిని. నీ వలన పవిత్రమైన శ్రీగురుచరిత్రను స్మరించి చెప్పగలిగెడు భాగ్యము నాకు లభించినది. తద్వారా, నీవు త్వరలోనే బ్రహ్మానుభవమును పొందగలవు. ఎవరైతే ఇహపరముల యందు సౌఖ్యమును పొందగలుగు సమర్థులో, వారికే శ్రీగురుచరిత్రను వినగలిగే భాగ్యము ఘటింపగలదు. ఇక, త్రికరణములను అనగా మనోవాక్కాయకర్మలను దృఢపరచుకొని, నిశ్చలచిత్తముతో శ్రవణము చేయుము. నీవు కేవలము గురుభక్తుడవు. అందుకే నీ బుద్ధి ఉత్తమమైయున్నది. నీ గురుభక్తికి

---

1. దోహా ॥ గురు గోవింద్ దోఊ ఖడే, కాకే లాగూఁ పాయ్ । బలిహారీ గురూ ఆప్‌నే, గోవింద్ దియో బతాయ్ ॥
కం॥ గురువును గోవిందుడు నా । దరినిలువగ నెవరి గొల్వతగుననగా, నే పరమాత్ము చెంత జేర్చిన గురువున కాత్మార్పణమ్ము కూరిమిజేతున్ ॥

మెచ్చితిని. నా మాటలను విశ్వసించి వినువారలకు చతుర్విధ పురుషార్థములు సులభముగ లభింపగలవు. ఇంతేకాదు, ధనధాన్యాది సంపదలు, పుత్రపౌత్రాది సంతానము, ధైర్యము, స్మరణశక్తి, ఇహలోక సౌఖ్యములు, శతాయుష్యము, చివరకు ఉత్తమగతి లభించి తీరును. గురుచరిత్ర కామధేనువు వంటిది. ఇది వేదశాస్త్ర సమ్మతమైనది. త్రిమూర్తులు మానవవేషమును ధరించి కలియుగమునందు అవతరించిరి. భూభారమును తగ్గించి, భక్తజనులను తరింపజేయు నిమిత్తముగ హరిహరాదులు దివినుండి భువికి దిగివచ్చిరని" సిద్ధుడు చెప్పగా **నామధారకుడు విని ఇట్లు ప్రశ్నించెను–** "మహాత్మా! త్రిమూర్తులకు ఎందుచేత మానవదేహమును ధరింపవలసి వచ్చినదో! వివరింపవలసినదని కోరెను. అందుకు సమాధానముగా సిద్ధముని ఇట్లు చెప్పెను –

"నిజమునకు ఉన్నది పరబ్రహ్మము ఒకటే. అయితే ఈ ఒక్కటే, సృష్టి నిమిత్తముగా త్రివిధగుణములతో త్రిమూర్తులుగా అయ్యెను. అందులో రజోగుణముతో బ్రహ్మయై సృష్టిని రచించును. సత్త్వగుణముతో విష్ణువై విశ్వమును పోషించి పాలించును. తమోగుణముతో రుద్రమూర్తియై సంహరించును. వీరు ఒకరిని విడిచి మరొకరు వేరు–వేరుగా ఉండరు. ఈ త్రిమూర్తులే భూభారమును తగ్గించుటకై కార్యకారణములను పురస్కరించుకొని అప్పుడప్పుడు భూలోకమునందు అవతరించుచుండెదరని పురాణశాస్త్రములు స్పష్టముగ చెప్పుచున్నవి. ఇందుకు ఉదాహరణముగా విష్ణుమూర్తి తన భక్తుడగు అంబరీషుని రక్షించిన గాథను నీకిప్పుడు విశదముగా చెప్పెదను. **సావధానముగా వినుము –**

పూర్వము అంబరీషుడు అను ఒక రాజర్షి ఉండెను. అతడు అత్యంత నియమనిష్ఠలతో ఏకాదశీ వ్రతమును ఆచరించుచుండెను. సకాలమునకు ద్వాదశి పారణము చేయుచుండెను. సర్వకాల, సర్వావస్థలయందు శ్రీహరి చింతన చేయుచుండెను. అతిథి–అభ్యాగతులను భక్తిభావముతో చక్కగా పూజించుచుండెను. ఆ కారణమున లోకమునందు అంబరీషుని కీర్తిప్రతిష్ఠలు ఇనుమడించినవి. అంబరీషుని వ్రతనిష్ఠను అతని భక్తిని పరీక్షింప దలచిన దుర్వాసమహాముని ఒక ద్వాదశి తిథినాడు అతిథిగా అతని నివాసమునకు యేతెంచెను. ఆనాడు సూర్యోదయానంతరము ద్వాదశి తిథి ఒక్క ఘడియ మాత్రమే మిగిలియుండెను. ఆ లోపున పారణము పూర్తిచేసి వ్రతదీక్షను ముగించుటకై అంబరీషుడు త్వరపడుచుండెను. అప్పుడే దుర్వాసుడు పనిగట్టుకొని అతిథిగా వచ్చినందులకు యేమి కానున్నదోనని అతడు లోలోపలే భయావహుడయ్యెను. అయినను, శ్రీహరిపై భారమువేసి దుర్వాసమహర్షికి ఎదురేగి స్వాగతమును పలికి ఉన్నతాసనమున కూర్చుండజేసి, అతనికి అర్ఘ్యపాద్యాదులను ఇచ్చి పూజించెను. **అనంతరము అంబరీషుడు అత్యంత వినయముతో చేతులు జోడించి ఋషీశ్వరునితో ఇట్లు**

ప్రార్థించెను – "మహానుభావా! ద్వాదశి ఘడియలు సమీపించుచున్నవి. వెంటనే స్నాన, అనుష్ఠానాదులను ముగించుకొని త్వరగా భోజనమునకు దయచేయుడని" కోరెను. "సరే" నని పలికి ఋషీశ్వరుడు గంగకు వెళ్ళి స్నానము చేసి తీరమునందు కూర్చొని నెమ్మదిగా అనుష్ఠానమును చేయుచుండెను. అతిథి మర్యాదకై అనేకవిధములగు పక్వాన్నములను సిద్ధము చేయించి ద్వాదశి పారణ నిమిత్తముగ అంబరీషుడు మునీశ్వరుని రాక కొరకు ప్రతీక్షించుచుండెను. ఇంతలో పారణము చేయు ఘడియ ముగియవచ్చెను. వ్రతభంగ మగునను భీతితో ఆ రాజర్షి గురుజనుల అనుమతితో దైవతీర్థమును మాత్రమే స్వీకరించి ద్వాదశి పారణమును ముగించెను. ఇంతలోనే గంగనుండి తిరిగి వచ్చిన దుర్వాస మహర్షి అంబరీషుని ముఖమును తేరిపారచూచి ఆగ్రహోదగ్రుడై– "ఓరీ! దురాత్మా! వచ్చిన అతిథిని వదలిపెట్టి పారణము చేసితివా యేమి?" అంటూ అతనిని శపించబోయెను. భీతిల్లిన ఆ రాజర్షి వెంటనే తన ఇష్టదైవమగు శ్రీహరిని స్మరించెను. 'అంబా' అంటూ అరచిన దూడ కోసమై పరుగెత్తుకొని వచ్చెడు గోవువలె, శరణాగత త్రాణ బిరుదాంకితుడైన భక్తవత్సలుడగు నారాయణుడు తన భక్తుని రక్షించు నిమిత్తముగ ప్రత్యక్షమై అటు అంబరీషుని, ఇటు దుర్వాసుని మధ్యలో నిలిచెను. అంతలోనే ఆ మహర్షి "నీవు అన్ని యోనులలోనూ జన్మింతువుగాక!" అని రాజర్షియగు అంబరీషుని శపించెను. అంబరీషుడు అప్పుడే వచ్చి తన ముందు నిలిచిన భక్తపరాధీనుడైన భగవానుని చరణకమలములను సాగిలపడి పట్టుకొనెను. అప్పుడు విష్ణుమూర్తి దుర్వాసునితో – "మహర్షీ! శాంతించుము. నీవు నా భక్తుని మన్నించి, రక్షించుము. నీవు ఆతనికి ఇచ్చిన శాపమును నేను స్వీకరించి అనుభవించెదను. అందుకు సమ్మతింపుమని" కోరెను.(41–69)

మహాజ్ఞానియైన దుర్వాసమహర్షి కూడ భగవదవతారస్వరూపుడే. కావున, విష్ణుమూర్తి మాటలను వినిన పిమ్మట ఆ మహర్షి తనలో తాను ఈవిధముగా యోచించెను. 'భూలోకమునందు యుగాల తరబడి తపస్సు చేసిననూ శ్రీహరి చరణములు లభించుటలేదు. లోకులకు అవి దుర్లభముగా ఉన్నవి. కావున, భూభారమును హరించి భక్తజనులను తరింపజేయుటకు గాను లక్ష్మీసమేతుడైన నారాయణమూర్తి అవతరించి, ఈ ధరాతలముపై నడయాడుటకు నా శాపము కారణము కాగలదని, నిశ్చయించుకొనెను. **అటు పిమ్మట దుర్వాసుడు శ్రీవిష్ణుమూర్తిని ఉద్దేశించి ఇట్లనెను** – "విష్ణుదేవా! భూలోకమునందలి పలుప్రదేశముల యందు పదిమార్లు ప్రసిద్ధమైన దశావతారములను స్వీకరించి అవతరించుము. పూర్ణబ్రహ్మవైన నీవు సహజముగనే విశ్వామిత్రుడవు. అనగా విశ్వమునకు మిత్రుడవు. స్థూలమునందు స్థూలముగను, సూక్ష్మము నందు సూక్ష్మముగను నీవే అలరారుచుందువు" అని పలికెను. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొరకై దుర్వాసుని శాపమును జగత్పితయైన శ్రీనారాయణమూర్తి అంగీకరించి అంతర్ధానమొందెను. (70–76)

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

నామధారకా! ఈ కారణమును పురస్కరించుకొని శ్రీమహావిష్ణువు మత్స్య, కూర్మ, వరాహాది నానావిధ యోనులకు సంబంధించిన దశావతారములను యెత్తవలసి వచ్చెను. అనంతరూపములు గల నారాయణుడు కార్యకారణములను స్వీకరించి భక్తజనులను ఉద్ధరించు నిమిత్తముగ దశావతారములే కాదు, అనంత అవతారములను యెత్తుచుండును. ఇట్టి అవతారములను గూర్చి మహాభాగవతమునందు విస్తారముగా వర్ణింపబడియున్నది.(1) అందులో కొన్ని గుప్తములుగా ఉండును. మరికొన్ని ప్రకటములుగా నుండి ప్రసిద్ధములగును. ఇట్టి అవతారరహస్యములను బ్రహ్మజ్ఞానులు మాత్రమే తెలిసి కొనగలుగుదురు. కాని, మూఢజనులు ఎంతమాత్రమును గ్రహింపజాలరైరి.

నామధారకా! ఇప్పుడు నీకొక వినోదమును కలిగించెడు విచిత్రమైన భగవంతుని అవతారకథను చెప్పెదను. అత్రి అను మహర్షికి అనసూయ అను పేరు గలిగిన పతివ్రతా శిరోమణి భార్యగా ఉండెను. త్రిమూర్తులు ఒకనాడు కపటవేషములను ధరించి వారి ఇంటికి అతిథులుగా వచ్చి ఆమెకు పుత్రులుగా మారినారని" సిద్ధముని చెప్పెను. (77–80)

సిద్ధముని మాటలకు అచ్చెరువొందిన నామధారకుడు ఇట్లు ప్రశ్నించెను – "మహాత్మా! అట్టి వినోదాత్మకమైన కథను పూర్తిగా వివరించి చెప్పగలరు. త్రిమూర్తులు కపటవేషముతో వారి ఇంటికి ఏల వచ్చిరి? వారు ఆమె పుత్రులుగా మారుటకు గల కారణమేమి? అత్రిమహర్షి ఎవరు? ఆయన ఎవరివలన జన్మించెను? ఇందుకు సంబంధించిన పూర్తి కథా వృత్తాంతమును సవిస్తరముగ చెప్పవలసినదని" ప్రార్థించెను. తరువాతి కథ శ్రవణము చేయుటకు అత్యంత మనోహరముగా ఉండును. చదివినవారు, వినినవారు సమస్త మనోభీష్టములను పొందెదరు అని సరస్వతీ గంగాధరుడు శ్రీగురుచరిత్రమును లోకమునకు ప్రకాశింపచేసెను. (81–83)

ఇది శ్రీ గంగాధర–సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "అంబరీష వ్రత నిరూపణము" అను మూడవ అధ్యాయము ॥ (3)

॥ జయ గురుదత్త – శ్రీగురుదత్త ॥

(ఓవీలు – 83; మొత్తము సంఖ్య – 427+83 = 510 ఓవీలు).

◆ ◆ ◆

---

1. **శ్లో॥ జన్మ కర్మ చ విశ్వాత్మన్నజస్యా కర్తురాత్మనః । తిర్యఙ్ నృషిషు యాదస్సు తదత్యంతవిడంబనమ్ ॥** (శ్రీభాగవతం 1-8/30)

(ప్రభూ! నీవు విశ్వాత్ముడవు. విశ్వరూపుడవు. జన్మరహితుడవు. నీకు ఎట్టి కర్తవ్యమూ లేదు. అయినను, పశుపక్ష్యాదులు, మనుష్యులు, ఋషులు, జలచరములు మొదలగు రూపములను దాల్చి అనేక లీలలు జరుపుచుందువు. ఆయా రూపములకు అనుగుణముగా దివ్యకర్మలను చేయుచుందువు. ఇది అంతయునూ నీ దివ్యలీలయే సుమా!

శ్రీ గురు చరిత్ర

నాలుగవ అధ్యాయము

సృష్టి పరిచయము - సప్త ఋషుల జననము - అనసూయాసతి పాతివ్రత్య మహిమా వర్ణనము - త్రిమూర్త్యవతారమగు శ్రీదత్తాత్రేయులు అవతరించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యుడగు నామధారకుని విన్నపమును ఆలకించిన సిద్ధయోగి మిక్కిలి ప్రసన్నుడై ఇట్లు చెప్పుచున్నాడు - "శిష్యచూడామణీ! నీవు ధన్యుడవు. నీ వాక్కు ధన్యమైనది. గురుచరణములయందు నీకు కలిగిన భక్తి ఎంతో ప్రశంసనీయమైనది. నీవు ప్రశ్నించిన తీరు ఎంతయో యెన్నదగినది. జిజ్ఞాసతో నీవడిగిన వెంటనే అందుకు తగిన వృత్తాంతమంతయూ ఆదినుండి అంత్యము వరకు నా మదిలో కదలాడినది. ఉత్తమ ప్రశ్నను అడిగితివి. అందుకుగాను, సృష్ట్యాది మొదలుకొని అత్రిమహర్షి పూర్వీకుల పరంపరను గూర్చి పూర్తిగా చెప్పుచున్నాను". సావధాన చిత్తముతో వినుము. (1-3)

"సృష్టికి పూర్వము అంతట జలమయముగా ఉండెను. అందుకే "ఆపోనారాయణ" అని శ్రుతివాక్యము. ఆపో నారాయణుడు సర్వవ్యాపకుడు. సర్వత్ర పరిపూర్ణుడై యుండును. సృష్టికాలము సమీపించుటచే ఆయనకు సృష్టిరచన చేయవలెనను సంకల్పము కలిగెను. వెంటనే హిరణ్మయవర్ణము అనగా బంగారు రంగుతో మెరయుచున్న అండము యేర్పడెను. ఈ అండమే 'బ్రహ్మాండము' అను పేరును పొందెను. ఇట్టి హిరణ్మయమగు బ్రహ్మాండపిండము ఒక దేవతా సంవత్సర కాలపర్యంతము(1) జలమునందే ఉండెను. అనంతరము అది రెండు ముక్కలుగా పగిలి ఒకటి ఆకాశముగను, మరొకటి భూమిగను యేర్పడినవి. అందులో నుండి చతుర్ముఖములు కలిగిన బ్రహ్మదేవుడు రజోగుణముతో ఉద్భవించి

---

1. మానవుల యొక్క ఒక సంవత్సరము దేవతలకు ఒక దినముతో సమానము. కావున, మానవుల 360 సంవత్సరముల కాలము దేవతలకు ఒక సంవత్సరమగును. దీనినే దేవతా సంవత్సరమని అందురు.

'హిరణ్యగర్భుడు' అను పేరుతో వ్యవహరింపబడెను. అటు పిమ్మట, బ్రహ్మదేవుడు రజోగుణ కార్యముతో పదునాలుగు భువనములను, పదిదిక్కులను, మనస్సును, వాక్కును, కాలమును, కామక్రోధాదులను రచించెను. తదుపరి, సృష్టిని విస్తరించుటకుగాను బ్రహ్మదేవుడు తన మానసిక సంకల్పముతో ఏడుగురు కుమారులను సృష్టించెను. అందులో 1. మరీచి 2. అత్రి 3. ఆంగిరస 4. పులస్త్య 5. పులహా 6. క్రతు 7. వసిష్ఠుడు అను వారు బ్రహ్మ మానసపుత్రులుగా ఉద్భవించి, సప్తఋషులుగా వాసి గాంచిరి". (4-10)

"నామధారకా! బ్రహ్మయొక్క మరీచ్యాది సప్తకుమారులలో రెండవవాడగు అత్రిమహర్షి యొక్క వంశవృక్షమూలము నుండియే ప్రపంచమునందు గురుపరంపర యేర్పడెను. ఓయీ! భాగ్యవంతుడా! నామధారకా! జగత్తునందేర్పడిన గురుపరంపరను గూర్చి చెప్పుచున్నాను శ్రద్ధగా వినుము - అత్రి మహర్షికి అనసూయ అను పేరుగల భార్యగలదు. ఆమె సాటిలేనిపతివ్రతా శిరోమణి. అంతేగాదు, ఆమె సాక్షాత్తు జగదంబికయే. తెల్లని చంద్రునికి తల్లియైన ఆమె యొక్క అపురూపమైన సౌందర్యలక్షణములను గూర్చి వర్ణించి చెప్పుటకు యెవ్వరి తరముగాదు. ఆమె యొక్క పతి సేవా పరాయణత్వమును గాంచి దేవేంద్రాది సురవరులందరును భయపడుచుండిరి. ఆమె తమ యొక్క స్వర్గలోక ఐశ్వర్యములను కొల్లగొట్టునేమోయని చింతించుచుండిరి. అందువలన, ఇంద్రాది దేవతలందరు కలిసి త్రిమూర్తుల వద్దకు వెళ్ళిరి. అనసూయ అత్రి ఋషిదంపతులను గూర్చి **దేవేంద్రుడు వారికి ఇట్లు విన్నవించెను.** (11-15)

"త్రిమూర్తులారా! అత్రిమహర్షి ధర్మపత్నియగు సతీ అనసూయ ఆచరించెడు సదాచారము, పతిసేవ, అతిథిపూజ వర్ణనాతీతము. అమోఘము, అగమ్యము. ఆమెను గూర్చి వివరించి చెప్పుటకు నేను అశక్తుడను. ఆమె తన మనోవాక్కాయ కర్మలను పూర్తిగా సమర్పించి, నిరంతరము అత్యంత భక్తిశ్రద్ధలతో తన భర్తను సేవించుచుండును. ఆమె అతిథిసేవ అత్యద్భుతము. తమ ఇంటికి అతిథిగా ఎవరు వచ్చిననూ, యెప్పుడు వచ్చిననూ వారిని ఆమె మిక్కిలి హర్షముతో చక్కగా పూజించుచుండును. ఇప్పటి వరకు వారి ఇంటికి యేతెంచిన ఏ ఒక్క అతిథి గూడా పూజింపబడక అనాదరమునకు గురియై మరలిపోలేదు. ఆమె ఆచారములకు, అతిథిపూజలకు, పాతివ్రత్య ప్రభావమునకు భయపడిన సూర్యుడు తనయొక్క వాడికిరణముల వేడి తగులుటచే ఒకవేళ ఆమె నొచ్చుకొనునేమో యని భావించి, ఆమె మీద తన కిరణముల వేడిని మందమందముగనే ప్రసరింప చేయుచుండును. అగ్ని కూడా ఎంతయో భీతి నొంది ఆమె సన్నిధియందు తన తీవ్రతను తగ్గించుకొని చల్లబడుచుండును. ఇక వాయువు కూడా భయచకితుడై ఆమె సమీపమున తన వేగమును తగ్గించుకొని నెమ్మది నెమ్మదిగ వీచుచుండును.

భూమి కూడా ఆమె అడుగులు వేయు ప్రతిచోట తన కఠిన స్పర్శకు బాధ నొంది, తన నెక్కడ శపించునేమో యని వెరచి మెత్తగా మారి మృదుస్పర్శను అందించుచుండును. అయ్యా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులారా! ఆమె తన పాతివ్రత్య ప్రభావము వలన యే దేవతాస్థానమును కైవసము చేసికొనునో, మా స్వర్గలోకమునే జయించునేమో యెవరికినీ తెలియదు. మేమందరము ఆమెను చూచి భయపడుచుంటిమి. ఇందుకు యేదేని ఉపాయమును మీరే యోచించవలెను. మాకెల్లరకు సర్వరక్షకులు మీరే సుమా! ఒకవేళ మీరేమియును చేయక మిన్నకుండినచో, మేమందరము మిమ్ములను వదలిపెట్టి రాత్రింబవళ్ళు ఆమెకు సేవచేయు నిమిత్తముగ వారి ఇంటిముందే చేతులు కట్టుకొని నిలబడి యుండవలసి వచ్చును" అని దేవతలందరు తమ యొక్క మనోబాధను వెల్లడించుకొనిరి. దేవతల మాటలను వినిన త్రిమూర్తులు కనులెఱ్ఱజేసి మహాక్రోధమును వహించి వణికిపోయిరి. **వెంటనే వారిట్లు పలికిరి**–"ఆమె పాతివ్రత్యమహిమ ఏపాటిదో, యెంతటి గొప్పదో, నేడే వెళ్ళి పరీక్షించెదముగాక! ఆమెయొక్క వ్రతమును భంగపరచి ఆమెను మర్త్యలోకమునందు ఉంచుటయో లేక, యమలోకమునకు పంపుటయో నేడు నిశ్చయింపవలయునని" ఆ ముగ్గురు మూర్తులు బయలుదేరిరి. (16-23)

సతీ అనసూయను పరీక్షించుటకై బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముువ్వురు భిక్షుకుల వేషములను ధరించి అత్రిమహర్షి ఆశ్రమమునకు చేరుకొనిరి. అప్పుడే అత్రి మహర్షి నిత్యకర్మానుష్ఠానమును నిర్వహించుకొనుటకై గంగకు వెళ్ళియుండెను. అంతట మారువేషములో నున్న త్రిమూర్తులు ఆశ్రమ ద్వారమునందు నిలిచి – "అమ్మా! మేము అతిథులము వచ్చితిమ"ని యెలుగెత్తి పలికిరి. 'అమ్మా' యను పిలుపును వినిన అనసూయ బయటకు వచ్చి చూచెను. "మాతా! ఆకలితో అలమటించుచున్న బ్రాహ్మణులము. మీ ఇంటికి అతిథులుగా వచ్చితిమి. మీ ఆశ్రమము నందు నిరంతరము అతిథులకు తగిన సత్కారము, సంతర్పణ విసుగు లేకుండా జరుగుచుండునను మీ కీర్తిని గూర్చి లోకమునందంతట వేనోళ్ళ కొనియాడుచుండుటను విని నేడు మీ వద్దకు వచ్చితిమి. కోరిన భోజనమును కమ్మగా పెట్టెదవని "ఇచ్ఛాభోజనము" ను కోరుటకై మేము యేతెంచితిమి. సాధ్వీ! ఆలస్యము చేయకుండా మాకు ఆహారమును వడ్డించుము. లేనిచో, మేము వేరొకచోటునకు వెళ్ళెదమ"ని పలికిరి. (24-30)

వారి మాటలను వినిన అనసూయ మిక్కిలి వినయముతో వారికి నమస్కరించి లోపలికి దయచేయుమని ఆహ్వానించెను. ఉచితాసనముల యందు ఆ ముగ్గురిని కూర్చుండచేసి అత్యంత ఆదరముతో అర్ఘ్యపాద్యాదులను సమర్పించి, వారి పాదపద్మములను కడిగెను. గంధపుష్పాక్షతలతో

పూజించిన మీదట ముకుళితహస్తయై – "ఆర్యులారా! తమరు స్నానాదులను త్వరగా ముగించుకొని రావలసినది. నేను శీఘ్రముగ వంట చేసెదను. ఇంతలో మా ఋషివర్యులు కూడా యేతెంచెదరని" ఆమె విన్నవించెను. అందుకు ఆ అతిథులు – "తల్లీ! మేము స్నానాదులను ముగించుకొనియే వచ్చితిమి. నీ భర్త ఎప్పటికి వచ్చునో? యేమో? తెలియదు కదా! మాకు ఆకలిగా ఉన్నది. వెంటనే భోజనమును పెట్టుమని" కోరిరి. వచ్చిన అతిథుల మాటలను విని "సరే" నని ఆ పతివ్రతామతల్లి వంట గదిని చేరి త్వరితగతిన వంటను సిద్ధము చేసి, అతిథుల కోసమై ఆసనములను ఏర్పరచి భోజనమును స్వీకరించుటకుగాను వారినిరమ్మని కోరెను. ముగ్గురు మూర్తులను పీటలమీద వేరువేరుగ కూర్చుండజేసెను. ముందర స్థలశుద్ధి చేసి విస్తళ్ళను అమర్చెను. ముందుగా నెయ్యిని తెచ్చి పాత్రలను అభిఘరించెను. తదుపరి వడ్డించుటకై ఆ పతివ్రతా శిరోమణి శాకపాకములను తెచ్చెను. **ఇంతలో అతిథులు ముువ్వురు ఆమెను గాంచి ఇట్లనిరి** – "మగువా! మాదొక మాటను వినుము. మేము చాలా దూరము నుండి మీ అతిథి సత్కారమును అందుకొనుటకై ఇచటికి వచ్చితిమి. కాని, అపురూపమైన నీ సౌందర్యమును గాంచిన మా మనసులలో ఒక బలీయమైన వాంఛ కలిగినది. అదేమన, నీవు నగ్నరూపమును ధరించి మాకు అన్నమును వడ్డించవలయునని మా ఆకాంక్ష. అందుకు నీవు అంగీకరించని యెడల, మేము నీ ఆతిథ్యమును నిరాకరించి వెళ్ళిపోయెదము" అని పలికిరి. అతిథుల మాటలకు అనసూయ నిశ్చేష్టురాలైనది. ఇంతలో తేరుకొని తనలో తాను యిట్లు తలపోయసాగెను – "ఈ ముువ్వురు సామాన్యమైన మనుష్యులు కారు. నా మనోభావమును పరీక్షించు నెపముతో వచ్చిన దేవతలో, అవతార పురుషులో అయి యుండవచ్చును. లేనిచో, ఇట్టి విపరీతమైన కోరికను కోరియుండరు. వచ్చిన అతిథులు విముఖులై వెడలిపోయిన యెడల మన తపస్సునకు హాని యేర్పడునని పలికిన పతి ఆజ్ఞను ఉల్లంఘించినట్లగుటయే గాక, అతిథి పూజకు తీవ్రమైన భంగము వాటిల్లును. కావున, నా మనస్సు పవిత్రమై నిర్మలమై యుండగా దుష్టుడైన మన్మథుడు నన్నేమి చేయగలడు? నా పతిదేవుని తపఃఫలమే నన్ను తప్పక రక్షింపగలదు" అని కృతనిశ్చయమునకు వచ్చిన ఆ ఋషిపత్ని వారిని సమీపించి 'తథాస్తు' అని పలికి "నాయనా! మీరు కోరిన విధముగనే అన్నమును వడ్డించెదను. మీరు స్వస్థచిత్తులై కడుపార హాయిగా భోజనమును స్వీకరింపుడని" చెప్పెను. (31-41)

అనంతరము, ఆమె వంటశాలలోనికి ప్రవేశించెను. ఋషివర్యుడైన తన భర్త చరణములను దృఢముగా ధ్యానించి – "ఈ వచ్చిన అతిథులు నా బిడ్డలుగా మారిపోవుదురుగాక!" అని సంకల్పించెను. తదుపరి వివస్త్రయై నగ్నరూపముతో అన్నోదకములను తీసికొని

వడ్డించుటకై భోజనశాలకు చేరెను. అచట అత్యద్భుతమైన దృశ్యము ప్రత్యక్షమయ్యెను. భోజనము చేయుటకై విస్తళ్ళ ముందు పీటలమీద కూర్చొని యున్న అతిథులగు త్రిమూర్తులు పసిపిల్లలుగా మారి పీటలముందు "కేరుకేరు" మని యేడ్చుచు దోగాడుచుండిరి. ఆ శిశువులను చూసి అద్భుత ఆశ్చర్యచకితయైన సతీ అనసూయ తిరిగి వంటశాలను ప్రవేశించి త్వరగా వస్త్రములను ధరించి పసిపిల్లల సమీపమునకు వచ్చెను. ముగ్గురు పిల్లలు ఏడ్పులతో, కేరింతలతో నేలమీద అటునిటు ప్రాకుచుండిరి. వారిని చూచిన ఆమె యొక్క మాతృహృదయము వాత్సల్యభావముతో పొంగిపోయెను. వెంటనే పసిపిల్లలుగ మారిన ఆ ముగ్గురిని తన ఒడిలోనికి తీసికొని ఆప్యాయముగా తన యెదకు హత్తుకొని ముద్దాడుచుండగా ఆ మహాతల్లికి స్తన్యము పొంగారి స్రవింపసాగెను. "నాయనా! బాబూ! వత్సా! ఆకలి వేసినదా!! యేడవకు బిడ్డా!!" అని అంటూ వారిని బుజ్జగించుచు హర్షాతిరేకముతో వారికి స్తన్యమిచ్చినది. ఆవిధముగా ఒకరి తరువాత మరొకరికి కడుపారగా తన చనుబాలు త్రావించిన సతీ అనసూయ మూడు లోకములకు అధిపతులైన ఆ త్రిమూర్తుల ఆకలిని తీర్చి తృప్తిపరచినది.

నామధారకా! చూడుము. ఎంత గొప్ప చిత్రమైన విచిత్రము ఘటించినదో కదా! ఈ చరాచరసృష్టిని రచించి, పోషించి, సంహరించ గలిగెడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులే పతివ్రతా శిరోమణియగు అనసూయమాత యొక్క అతులితమైన పాతివ్రత్య తపోప్రభావముచే పసిపాపలుగా మారిపోయిరి. ఎవరి బొజ్జలో చతుర్దశభువనములు, సప్తసముద్రములు, సముద్ర గర్భమున గల బడబాగ్ని సైతము ఉండునో, అట్టి లోకేశ్వరుల క్షుద్బాధ ఒక పతివ్రతామతల్లియొక్క స్తన్యపాన మాత్రముచేత నివారింపబడినది కదా! ఆహా! ఆమె పాతివ్రత్య ప్రభావమును మనము ఏమని పొగడగలము? అది యెవరికి సాధ్యము? చతుర్ముఖములుగల బ్రహ్మదేవుడు అలుపెరుగకుండా అహర్నిశలు సృష్టిని రచించుచునే యుండును. అంతటి మహానుభావుని ఆకలి ఒక స్త్రీ మూర్తి యొక్క స్తన్యపానముచే యెట్లు తీరవచ్చును? ఫాలభాగమున మూడవ నేత్రమును ధరించిన ముక్కంటికి పంచముఖుడైన కాలాగ్ని రుద్రునకు అసూయ నెరుగని అనసూయమాత తన స్తన్యము నిచ్చి తృప్తి పరచినది కదా! అమోఘమైన అత్యద్భుతమగు పాతివ్రత్య ప్రభావముచేత త్రిమూర్తులను సైతము పసిపాపలనుగా మార్చివేసిన అనసూయాసతిని తన అర్ధాంగిగా చేపట్టిన అఖండ తపస్వియగు అత్రిమహర్షి ఇంకెంతటి ఘనుడో కదా! (42-50).

అనసూయామాత ఆ ముగ్గురు శిశువులను తన ఒడిలో యెత్తుకొని బుజ్జగించినది. చక్కగా ఆడించినది. ఊయలలో పరుండజేసి జోలపాటలు పాడసాగినది. ఉపనిషత్తులలోని రహస్యార్థములను బోధించగలిగెడు చక్కని పాటలను సప్తస్వరములను మేళవించి, అత్యంత

ఉల్లాసముతో పాడుతూ ఆ త్రిమూర్తులను జోకొట్టి నిదురబుచ్చినది. ఇదంతా జరిగిన మీదట మధ్యాహ్న కాలము సమీపించినందున అతిథుల ఆగమనమునకు వేళయైనదని తలంచి నిర్మలమైన మనస్సుతో అత్రిమహర్షి తమ ఆశ్రమమునకు చేరుకొనెను. ఆశ్రమమునందు అడుగుపెట్టిన మహర్షికి విస్మయావహమైన సన్నివేశము గోచరించెను. పసిపాపలతో కూడిన ఊయలను ఊపుచూ జోలపాటలు పాడుచున్న తన భార్య గోచరించినది. వెంటనే – "ఈ పిల్లలెవరు? వీరిని నీవు నిద్రబుచ్చుటేమిటి? ఇదంతా ఆశ్చర్యకరముగా కన్పట్టుచున్నదే!" అని తన భార్యను అత్రిమహర్షి ప్రశ్నించెను. జరిగిన వృత్తాంతము నంతయును ఆమె తన భర్తతో వివరించి చెప్పెను. వెంటనే ఋషీశ్వరుడు తన జ్ఞాననేత్రములతో యథార్థ విషయమును గమనించి – "వీరు యెవరో అనామకులు కాదు, అనసూయా! వీరు సాక్షాత్తుగా త్రిమూర్తులే సుమా!" అని పలికి ఆయన వారికి నమస్కరించెను. అంతట ఆ త్రిమూర్తులు వారి యెడల ప్రసన్నులైరి. ఊయలలో గల శిశురూపములను వీడి నిజరూపములతో **వారి యెదుట సాక్షాత్కరించి ఇట్లు పలికిరి –**

"అనసూయా! అత్రిమహర్షీ! మీరు ధన్యులు. మీ భక్తికి మెచ్చితిమి. మహర్షీ! నీ భార్యయగు అనసూయ వంటి పతివ్రతా శిరోమణిని ముల్లోకముల యందెచ్చటనూ చూడలేము. మీ కొక వరమును ఇచ్చెదము. కావున, మీకు అభీష్టమైన వరమును కోరుకొనుడని" పలికిరి. అత్రిమహర్షి తన సతిని చూచి – "నీకేమి కావలయునో, దానిని కోరుమని" చెప్పెను. అంతట అనసూయ సాధ్వి తన భర్తతో – "స్వామీ! మీరే నా ప్రాణేశ్వరులు. మీ భక్తికి పరవశించియే ఈ దేవతలు దిగివచ్చిరి. కావున, ఈ ముగ్గురూ మన ఇంటిలో కుమారులుగా అవతరించి, త్రిమూర్తి స్వరూపులు యేకరూపులై ఉండవలయునని" తన మనోభీష్టమును వెల్లడించెను. అత్రిమహర్షి అట్టి వరము నీయుమని త్రిమూర్తులను కోరెను. "తథాస్తు" అని మీరు కోరినట్లుగా మీ గృహమునందు మేము పుత్రులమై యుండెదమని వరమును ప్రసాదించి వారలు వెంటనే తమ తమ లోకములకు వెళ్ళిరి. (51-62)

కొంతకాలమునకు అనసూయ గర్భమున ముగ్గురు కుమారులు జన్మించిరి. చతుర్ముఖ బ్రహ్మ చంద్రుడై జన్మించెను. విష్ణువు దత్తాత్రేయునిగా అవతరించెను. శంకరుడు దూర్వాసునిగా జనియించెను. అపురూపమైన అందచందములతో జన్మించిన మువ్వురు కుమారులను గాంచి ఆ ఋషి దంపతులు తమ మహద్భాగ్యమునకు తామే మురిసిపోవుచూ అంతులేని మహదానందమును అనుభవించిరి. ఓయీ! నామధారకా!

బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ఈ త్రిమూర్తులకు అత్రిమహర్షి భార్యయైన పతివ్రతా శిరోమణియగు అనసూయ తప్ప ఇంతకుముందు మరెవరునూ తల్లియైనట్లుగా వినలేదు కదా! ఆహా! మహాసాధ్వియగు అనసూయ యొక్క సౌభాగ్యమును మనము యేమని కొనియాడగలము. త్రిమూర్తులకు మాతృమూర్తియైన ఆమె యొక్క ఘనతరమైన కీర్తి త్రిభువనముల యందు వ్యాపించి, శాశ్వతముగ నిలచి పోయెను.

అనంతరము ఈ ముగ్గురిలో దూర్వాసుడు, చంద్రుడు తమ తల్లి యెదుట నిలబడి - “అమ్మా! మేము తాపసులము. తపస్సుకొరకై మేము మా నిజస్థానములకు వెళ్లెదము. అందుకు మాకు అనుజ్ఞ నీయుమని” అత్యంత ప్రీతితో అడిగిరి. ముందుగా దుర్వాసుడు లేచి నిలబడి తల్లికి నమస్కరించి - “మాతా! నేను ఋషీశ్వరుడను, అనుష్ఠానమునకై తీర్థక్షేత్రములకు వెళ్లెదను. నాకు అనుమతి నీయుమని” వినయముతో ప్రార్థించెను. పిమ్మట చంద్రుడు సమీపించి తల్లికి ప్రణమిల్లి - “జననీ! నా నివాసస్థానము చంద్రమండలము. అచటి నుండియే నిత్యము నీ దివ్యచరణములను దర్శించుకొందును. నాకు వెంటనే అనుజ్ఞ నీయుమని” కోరెను. ఇక మూడవవాడు దత్తుడు. అతడే విష్ణుమూర్తి. అంతేగాదు, త్రిమూర్తి స్వరూపుడే ఈ దత్తాత్రేయుడని నీ మనసులో నిశ్చయమును కలిగియుండుము. ఇతడు మాత్రము మీ వద్ద, మీ గృహమునందే ఉండును. **“సర్వం విష్ణుమయం జగత్”** అను శ్రుతివాక్యమును అనుసరించి ఈ దత్తాత్రేయుడు శ్రీవిష్ణుమూర్తి యొక్క పూర్ణావతారము. మీ తపఃఫలము వలన త్రిమూర్తులు ఏకమై మీ గృహమునందు దత్తాత్రేయులుగా అవతరించిరి.(1) ఈతడు మీ ఇంటనే ఉండగలడు. ఇది నిశ్చయమని” చెప్పి దూర్వాసుడు, చంద్రుడు సెలవు తీసికొని తమ తల్లిదండ్రులకు నమస్కరించి తమ తమ స్థానములకు వెళ్ళిపోయిరి. (63-70)

“అనసూయా అత్రి దంపతుల ముద్దుబిడ్డడైన శ్రీదత్తాత్రేయులవారే గురుపరంపరగా యేర్పడిన మూలపీఠముగా తెలిసికొనుము” అని ఈ ప్రకారముగ సిద్ధముని నామధారకునికి వివరించి చెప్పగా ఆతడు మిగుల సంతసించెను. **పిమ్మట నామధారకుడు గురువైన సిద్ధమునిని**

---

1. **శ్లో॥ అత్రేరపత్యమభికాంక్షత ఆహ తుష్టో దత్తో మయాహమితి యద్భగవాన్ స దత్తః। యత్పాదపంకజ పరాగపవిత్రదేహా యోగర్ధిమాపురుభయీం యదుహైహయాద్యాః ।**

(శ్రీమద్భాగవతం. 2-7-04)

భగవంతుడు తనకు పుత్రుడై జన్మించవలెనని అత్రిమహర్షి అభిలషించెను. అందులకు పరమాత్మ ప్రసన్నుడై **‘మయా అహం దత్తః’** అనగా “నన్ను నేను నీకు సమర్పించుకొంటిని” అని పలికెను. అందువలన భగవంతునియొక్క ఈ అవతారమునకు ‘దత్తుడు’ (దత్తాత్రేయుడు) అను పేరు కలిగెను. ఆ ప్రభువుయొక్క పాదపద్మపరాగముల స్పర్శచేత, తనువులను పునీతమొనర్చుకొని, యదుమహారాజు, కార్తవీర్యార్జునుడు మొదలగువారు యోగముద్వారా ‘భోగము, మోక్షము’ లను రెండు సిద్ధులను పొందిరి.

మిక్కిలి స్తుతించుచు ఇట్లు పలికెను - "కృపాసింధూ! జ్ఞానమూర్తీ! భక్తజనమనోహరా! సిద్ధయోగీశ్వరా! మీకు జయము! జయము!! దయతో నా విన్నపమును వినుడు. మీ అనుగ్రహమువల్లనే నాలో జ్ఞానోదయమయ్యెను. మీరు నన్ను తరింపజేయుటకే వచ్చితిరి. శ్రీదత్తాత్రేయులవారి జన్మవృత్తాంతమునకు సంబంధించిన పూర్వాపర కథను విస్తరించి మీరు చెప్పగా నేను చక్కగా వినగలిగితిని. అనసూయాసతి కారణమున అవతరించిన యోగిరాజగు శ్రీదత్తాత్రేయులు మమ్ములను తరింపచేయగలడు. ఆ తరువాత శ్రీగురుమూర్తి దత్తాత్రేయులు యేయే అవతారములను ధరించెను. ఇందుకు సంబంధించిన కథాకథనమును క్రమముగా ఈ బాలునిపై దయదలంచి విస్తరించి చెప్పగలరని ప్రార్థించెను. ఇట్టి నామధారక-సిద్ధముని సంవాదముతో కూడిన మనోహరమైన ఈ కథను శ్రద్ధగా వినువారికి సకల అభీష్టములు నెరవేరగలవని శ్రీగంగాధరనందనుడగు సరస్వతి లోకమునకు ప్రకటింపచేసెను. (71-77)

ఇది శ్రీ గంగాధర-సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "త్రిమూర్తి అవతార కథనము" అను నాలుగవ అధ్యాయము ॥ (4)

॥ జయ గురుదత్త - శ్రీగురుదత్త ॥

(ఓవీలు - 77; మొత్తము సంఖ్య - 510+77 = 587 ఓవీలు).

◆ ◆ ◆

అనసూయాపతీ దుగ్ధా స్వాదా యేవ త్రిరూపత: ।
అవాతర దజో యోపి శ్రీదత్త శ్శరణం మమ ॥

(శ్రీవాసుదేవానంద సరస్వతీ విరచితం -
"శ్రీదత్తభావ సుధారసమ్" అను స్తోత్రము శ్లో - 56)

శ్రీ గురు చరిత్ర

ఐదవ అధ్యాయము

సిద్ధముని భగవదవతారములను గూర్చి వివరించుట - భక్తురాలగు సుమతి కథ - శ్రీదత్తాత్రేయుల వరదానం - శ్రీపాదశ్రీవల్లభులు అవతరించుట - తల్లిదండ్రులకు వరములనిచ్చి శ్రీపాదులు తీర్థయాత్రల కేగుట - తుదకు గోకర్ణక్షేత్రమును చేరుకొనుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

భక్తజనులను తరింపచేయుట కొరకే శ్రీగురుమూర్తి **'దైవం మానుష రూపేణ'** అన్నట్లుగా మానవరూపముతో అవతరించినారని భక్తుడగు నామధారకునితో సిద్ధముని వివరించి చెప్పెను. ఆ మాటలు విని జిజ్ఞాసతో నామధారకుడు అడిగిన ప్రశ్నకు సిద్ధమునీశ్వరుడు **యిట్లు సమాధానమును చెప్పసాగెను–** "భక్తా! నామధారకా! వినుము. భక్తవత్సలుడైన భగవానుడు తన నిజభక్తుడయిన అంబరీషుని కొరకు దుర్వాసముని శాపమును తానే స్వీకరించెను. అందువలన ఆయన మానవలోకమునందు అవతరించి అనేక అవతారములను ధరింపవలసివచ్చిన విషయమును గూర్చి గత అధ్యాయమునందే నీకు వివరించితిని. అట్టి కారణమున శ్రీమహావిష్ణువు లోకకళ్యాణ నిమిత్తము మర్త్యలోకమునందు మత్స్య, కూర్మ, వరాహ, నృసింహముల వంటి నానావిధ రూపములతో అవతరించెను. అనగా మత్స్యావతారమును ధరించి వేదములను ఉద్ధరించెను. కూర్మావతారమును యెత్తి అమృతముకొరకు సముద్రమును మథించినప్పుడు దేవతలకు సహకరించెను. వరాహ అవతారమునందు ఆదివరాహుడై హిరణ్యాక్షుడను రక్కసుని సంహరించి, పాతాళమునుండి భూమండలమును పైకి తెచ్చి కాపాడెను. ఆ తర్వాత నరసింహ స్వరూపమును ధరించి హిరణ్యకశిపుడను రాక్షసుని వధించి తన భక్తుడగు ప్రహ్లాదుని రక్షించెను. వామనావతారమున బ్రాహ్మణ ధర్మముతో భిక్షుకుడై బలిచక్రవర్తిని మూడు అడుగుల భూమిని యాచించెను. వెంటనే విరాడ్రూపుడై మూడు లోకములను ఆక్రమించి, దానిని దేవేంద్రునకు యిచ్చి దేవతలను కాపాడెను. బ్రాహ్మణరూపముతో పరశురామునిగా జన్మించి, దుర్మార్గులైన క్షత్రియులను దునుమాడి, భూమండలమును

బ్రాహ్మణులకు దానమిచ్చెను. దశరథుని పుత్రునిగా జన్మించి శ్రీరఘురామునిగా ప్రఖ్యాతి నొందెను. అంతట రావణకుంభకర్ణాది దుష్టరాక్షసులను సంహరించి, శిష్టజనులను రక్షించెను. ఆ తర్వాత క్షత్రియునిగా జన్మించి యాదవులను చేరి శ్రీకృష్ణుడై గోవులను, గోపికలను, గోపాలురను ఉద్ధరించెను. అప్పుడాయన అనేక అద్భుత లీలలు ప్రదర్శించెను. కంసశిశుపాలాది రక్కసులను సంహరించి, భూభారమును తగ్గించెను. ధర్మమును స్థాపించి లోకమును కాపాడెను. దిగంబరుడై బుద్ధునిగా అవతరించి లోకమునందు బౌద్ధధర్మమును నిలిపెను. ఇక మీదట భవిష్యత్తులో కల్కిరూపమును ధరించును. ఆయన అశ్వమును అధిరోహించును. ఖడ్గమును చేబూని కలియుగసమాప్తి యందు దుష్టరాజులను సంహరించును. శిష్టజనులను కాపాడును. లోకమున ధర్మమును నిలబెట్టును. ఈవిధముగ శ్రీహృషీకేశుడు నానావిధములుగా, నానారీతుల వేషములతో అవతరించెను. దుష్టజనులను దునుమాడి, సాధుసత్పురుషులను ఉద్ధరించెను. (1-6)

అంతట ద్వాపరయుగము పరిసమాప్తము కాగా, కలియుగము ప్రవేశించెను. కలియుగ ప్రభావమువలన బ్రాహ్మణాది చతుర్వర్ణములకు చెందిన జనులందరునూ అజ్ఞానవశులై ఆచారహీనులగుచుండిరి. అధర్మవర్తనులై లోకమునందు చరించుచుండిరి. ఘోరమైన కలియుగ దుష్ప్రభావమునుండి భక్తజనులను రక్షించుటకొరకు శ్రీగురునాథుడు స్వయముగా అవతరింపదలచెను. ఇంతలో సగరుల నిమిత్తముగ అల భగీరథుడు దివి నుండి భువికి గంగను తెచ్చుటకై తీవ్రమైన తపస్సును చేసినట్లుగా, ఒక విప్రవనిత సంతానమును ఆశించి శ్రీవిష్ణుదత్తుని దృఢమైన దీక్షతో ఆరాధించెను. ఆమె దీక్షకు మెచ్చిన శ్రీదత్తాత్రేయులు ఆమె గర్భవాసమునందు ఆవిర్భవించెను. నామధారకా! అత్యంతాశ్చర్యమును గొలిపెడు ఇట్టి కథను సవిస్తరముగ నీకు వినిపించెదను. **శ్రద్ధగా వినుమని సిద్ధమునీంద్రుడిట్లు చెప్పసాగెను.** (7-9)

తూర్పు దేశమునందుగల 'పిఠాపురము'(1) అను గ్రామమునందు ఆపస్తంబీయ శాఖకు చెందిన ఉత్తమవంశమునందు జన్మించిన ఒక బ్రాహ్మణుడు వుండెను. అతనిపేరు 'ఆపళరాజు'. అతని భార్యపేరు 'సుమతి'. పేరుకు తగినట్లుగా ఆమె మంచి బుద్ధిమంతురాలు, పతినే దైవముగా భావించి విష్ణుభక్తితో సేవించు పతివ్రతారత్నము. నిత్యము అత్యంత భక్తిశ్రద్ధలతో అతిథిఅభ్యాగతులను పూజించెడు ఉత్తమ ఇల్లాలు. ఇట్లుండగా శ్రీగురుదత్తాత్రేయుల వారే ఆ బ్రాహ్మణ దంపతుల సదాచార సంపత్తికి, వారు చేసే తపస్సునకు మెచ్చి ఒకనాడు మధ్యాహ్న కాలమున అతిథిగా భిక్షకై వారి ఇంటికి వచ్చెను. **'మాతః భిక్షాం దేహి' – 'అమ్మా! భిక్షము పెట్టు'**మని కోరెను. ఆనాడు అమావాస్య

---

1. ఆంధ్రప్రదేశమునందలి గోదావరి జిల్లాలో 'పిఠాపురము' గలదు.

తిథి అయినందున ఆ బ్రాహ్మణుని ఇంటిలో శ్రాద్ధము జరుగుచుండెను. అప్పటికి భోక్తలు ఇంకనూ భోజనము చేయకుండిరి. అయినప్పటికినీ "అమ్మా! భిక్షము పెట్టుమా!" అను పిలుపును విని ఆ ఇల్లాలు వెనకముందులు ఆలోచించకుండా యెంతమాత్రము ఆలస్యము చేయకుండా వెంటనే తమ ఇంటిముందు నిలిచిన భిక్షుకునకు ఆహారమును తీసికొనివెళ్ళి భిక్ష యిచ్చెను. త్రికరణశుద్ధిగా భగవద్బుద్ధితో సమర్పించిన భిక్షను స్వీకరించిన శ్రీదత్తాత్రేయుడు ఆమె యెడల అత్యంత ప్రసన్నుడై తన నిజస్వరూపముతో సాక్షాత్కరించెను. ఆ విప్రవనిత భావశుద్ధికి సంతసించి శ్రీవారు తనయొక్క దివ్యమైన త్రిమూర్త్యాత్మక స్వరూపమును ఆమెకు దర్శింపజేసెను. శ్రీదత్తుని దివ్యమంగళ విగ్రహమగు నిజస్వరూపమును దర్శించిన ఆ పతివ్రత అత్యంత అద్భుత ఆశ్చర్యమునకు లోనయ్యెను. ఆమె మేను పులకరించి పోవుచుండెను. నిర్మలమైన ఆమె హృదయమునందు భక్తిభావము మిక్కుటమై పొంగిపోవుచుండెను. కనుల వెంబడి ప్రేమపూరిత బాష్పధారలు యేరులై పారుచుండెను. అంతట ఆమె శ్రీస్వామివారి దివ్యచరణకమలములను పట్టుకొని మనస్ఫూర్తిగా వంగి ప్రణమిల్లెను. అంతట దత్తాత్రేయులవారు ఆమెను అనుగ్రహించి – "మాతా! నీ భక్తికి మెచ్చితిని. నీకేమి కావలయునో కోరుకొనుము. నీ మనసులోగల కోరికలన్నింటిని నీవు శీఘ్రముగనే పొందగలవని" పలికెను. శ్రీస్వామివారి మాటలను వినిన సుమతియను ఆ విప్రవనిత పట్టరాని సంతోషమును పొంది, చేతులను జోడించి, తలను వంచి మిక్కిలి వినయముతో అనేకవిధములుగా **శ్రీస్వామి వారిని ఇట్లు స్తోత్రము చేసెను.** (10–17)

"జగన్నాథా! మీకు జయము, జయము. విశ్వకర్తవైన నీవే సమస్త విశ్వమును తరింపచేయుటకు సమర్థుడవు. అట్టి దేవదేవుడవైన నిన్ను నేను చూడగలిగితిని. దేవరాయా! నా మనసులోగల ఆర్తిని మీరే తీర్చగలరు. నీవు సకల ప్రాణులయెడల సమవర్తిగా అపారకృపను వర్షింపుచుందువని వేదపురాణములు వర్ణించుచున్నవి. భక్తవత్సలా! కృపానిధీ! నీ కీర్తిని ఎవరు, ఎంతని వర్ణించగలరు? నీ మాటలు యెప్పుడునూ వ్యర్థములు కాజాలవు. యేలనన, ధృవునకు శాశ్వతమైన పదవిని కట్టబెట్టితివి. విభీషణునకు లంకారాజ్యమును ప్రసాదించి, పట్టాభిషిక్తుని చేసితివి. సమస్త భక్తజనులకు ఆధారభూతుడవైన నీవు వారి రక్షణార్థమై అనేక అవతారములను ధరించితివి. ఈ రీతిగా "శరణాగతులనేలు బిరుదము ధరించిన దొరవు నీవే" యను అఖండమైన నీ కీర్తి పతాకము ఉవ్వెత్తున లేచి చతుర్దశ భువనములలో రెపరెపలాడుచున్నది. దయాపయోనిధీ! దేవదేవా! నాకొక వరమును ప్రసాదింపుము. నాలోగల కోరికను వ్యర్థపుచ్చవద్దు. అనాథతారకా! త్రైలోక్య జనకా! నారాయణా! నా మనోభీష్టమును మీరే నెరవేర్చవలెను" అని ఆయన పాదపద్మములను పట్టుకొనెను. ఆ స్త్రీ మూర్తి యొక్క కరుణారసపూరితమైన దైన్యవచనములను వినిన గురుమూర్తి ఎంతయో సంతసించెను. ఆమె చేతిని పట్టుకొని ప్రేమతో ఓదార్చెను. మిగుల

ఆశ్వాసమును కల్పించెను. అంతట ప్రసన్నవదనుడై – "అమ్మా! నీకేమి కావలయునో కోరుకొమ్మనెను" అంతట ఆ పతివ్రత – "స్వామీ! తమరు భిక్షకు వచ్చి "అమ్మా!" యని నన్ను నోరార పిలచి యాచించితిరి కదా! ఆ మాటనే సార్థకము చేయుమని నేను నిన్ను యాచించుచుంటినని" ఆమె ప్రార్థించెను. అందుకు శ్రీదత్తాత్రేయులు సంతసించి "తల్లీ!" యని సంబోధించెను. అప్పుడామె సంతోషాతిరేకముతో ఉక్కిరిబిక్కిరియై – "మహానుభావా! నన్ను సంబోధించిన ఈ పిలుపును నీవు మరచిపోవద్దు. నా సంతోషమును మట్టిపాలు చేయవద్దు సుమా! తమవంటి బిడ్డకు తల్లినయ్యే భాగ్యమును ప్రసాదింపుము. ప్రభూ! ఇంతకుముసుపు నాకెందరో పుత్రులు జన్మించిరి. కాని, వారెవ్వరూ జీవించి యుండలేదు. ఇప్పుడు జీవించియున్నవారు ఇద్దరు మాత్రమే. వారిలో ఒకడు గ్రుడ్డివాడు, మరొకడు కుంటివాడు. అట్టి అంగహీనులగు పుత్రులు ఉండి యున్ననూ వారు లేనట్లే కదా! అయోగ్యులైన పుత్రుల వలన ఏమి ప్రయోజనము? సత్పుత్రుడు లేని తల్లి జన్మ వ్యర్థమే కదా? మహాత్మా! ఇప్పుడు నాకు జ్ఞానవంతుడు, పరమపురుషుడు, జగద్వంద్యుడు, దైవసమానుడు అయిన నీవంటి కుమారుడు కలుగవలయునని నా ఆకాంక్ష. ఇట్టి నా కోరిక నెరవేరునట్లుగా అనుగ్రహించుమ"ని పదే, పదే ప్రార్థించెను. ఆమె మాటలకు ప్రసన్నుడై అతిథిగా వచ్చి **ఆమె ఇంటి ముంగిట నిలచిన దత్తుడిట్లు మారు పలికెను** – "అమ్మా! నీ కోరిక అతి శీఘ్రకాలముననే నెరవేరగలదు. భక్తజనులకు దీక్షను ప్రసాదించి, వారిని తరింపజేయు నిమిత్తముగ నీ గర్భమునందు నేనొక మునిపుత్రునిగా జన్మించెదను. అతని వలన మీ వంశము ఉద్ధరింపబడగలదు. అతడు ఈ కలియుగమునందు అఖండ కీర్తిమంతుడగును. కాని, నీవు ఆతని మాటను వినవలసి వచ్చును. అతడు మీ గృహమునందు మాత్రము ఉండడు సుమా! అయితే, ఆతడు జ్ఞానమార్గమునందు అత్యంత శ్రేష్ఠుడగును. ఇకమీదట మీకు దైన్యముండదు" అని చెప్పి భిక్షుకునిగా వచ్చిన ఆ దివ్య అతిథి అంతర్ధానము నొందెను. అంతట ఆ బ్రాహ్మణ స్త్రీ అత్యంత విస్మయమునకు లోనయ్యెను. ఆ ఇల్లాలు వెంటనే ఇంటిలోనికి వెళ్ళి జరిగిన వృత్తాంతము నంతయును మిగుల అబ్బురముతో తన భర్తకు వివరించెను. ఆ పుణ్యదంపతులు మిక్కిలి హర్షముతో పులకించిపోయి వచ్చినవారు తప్పక దత్తాత్రేయులే అయి ఉంటారని భావించి మిక్కిలి సంతృప్తిని పొందిరి. తదుపరి మహదానందభరితుడైన **ఆపళరాజు తన భార్యతో ఇట్లు పలికెను** – "మధ్యాహ్నకాలమే అతిథులు వచ్చెడు వేళ కదా! అందులోనూ దత్తాత్రేయులవారు మధ్యాహ్న సమయమునందే అనేక ప్రచ్ఛన్న రూపములతో భక్తులను పరీక్షించు నెపమున భిక్షకొరకై ప్రసన్నవదనులై వచ్చుచుండెదరు. అప్పుడు వచ్చిన అతిథులను వట్టి చేతులతో త్రిప్పి పంపించకూడదు. వారిని పరీక్షింపకూడదు. వారి నామగోత్రములను కూడ ప్రశ్నించకుండా వారికి తప్పక భిక్షమీయవలెను. శ్రీదత్తాత్రేయస్వామివారు యెల్లప్పుడు మాహూరక్షేత్రమునందు, కరవీరమను క్షేత్రమునందు

మరియు పాంచాలేశ్వర నగరమునందు నివసించుచుండెదరు. కావున, నా అనుమతి కోసమై వేచిచూడకుండా మధ్యాహ్నవేళ వచ్చిన అతిథులకు కాదులేదనకుండా కదు భక్తిభావముతో భిక్షను ఈయవలయునని" చెప్పెను. **అంతట ఆ విప్ర స్త్రీ తన భర్తను చూచి ఇట్లనెను-** "స్వామీ! ఈనాడు నేను మీ ఆజ్ఞను ఉల్లంఘించితిని. శ్రాద్ధభోక్తలు భోజనము స్వీకరింపకముందే మన ఇంటి ముందుకు వచ్చిన అతిథికి భిక్షమిచ్చితినని" చెప్పెను. తన భార్య చెప్పిన మాటలు వినిన విప్రుడు మిగుల సంతసించి – "సాధ్వీ! మంచిపని చేసితివి. నీవిచ్చిన భిక్షవలన నేడు మన పితృదేవతలందరును ఎంతయో తృప్తి చెందిరి. పితరులపేరిట శ్రాద్ధకర్మను ఆచరించుచు విష్ణువునకే సమర్పించవలయును. అందుకొరకే విష్ణు క్షణమునిచ్చి ఒక బ్రాహ్మణుని విష్ణుస్వరూపునిగా భావించి శ్రాద్ధకర్మయందు అర్చించెదము. అట్టి సందర్భమున సాక్షాత్తుగా శ్రీమహావిష్ణు స్వరూపులైన శ్రీదత్తాత్రేయస్వామివారే మన ఇంటికి భిక్షురూపమున వచ్చిరి. నిస్సంకోచముగ నీవు వారికి భిక్షను ఇచ్చి ఎంతో గొప్ప పని చేసితివి. తద్వారా, మన పితృదేవతలందరు తరించిరి. నిశ్చయముగ వారు స్వర్గలోకమును పొందిరి. నేడు మనము కృతార్థులమైతిమి. ముఖ్యముగా నీ తల్లిదండ్రులు ధన్యులు. నీవు ధన్యురాలవు. శ్రీదత్తాత్రేయులవారి నిజస్వరూపమును దర్శించిన నీ భాగ్యమును నేనేమని కొనియాడగలను? ఇప్పుడు నీకు లభించిన వరముతో నిస్సందేహముగా మనకొక ఉత్తమ పుత్రుడు కలుగును. నీవిక చింతించవలసిన పనిలేదు" అని పలికెను. (18–41)

అనంతరము ఆ భార్యాభర్తలు తమకు లభించిన భాగ్యమునకు మురిసిపోవుచూ ఆనందసముద్రములో తేలియాడుచుండిరి. కొంతకాలము గడిచినది. అంతట సుమతి యను ఆ విప్రవనిత గర్భమును ధరించెను. క్రమముగా నవమాసములు నిండగా ఒక శుభదినమునందలి శుభముహూర్తము నందు ఆమె ఒక పుత్రరత్నమును ప్రసవించెను. కుమారుని జన్మవార్త వినిన బ్రాహ్మణుడు వెంటనే స్నానము చేసి జాతకర్మయను సంస్కారమును ఆచరించెను. జ్యోతిష్కులను ఆహ్వానించెను. "దైవజ్ఞులారా! నవజాతపుత్రుని జన్మలగ్నకుండలిని సిద్ధపరచి భావిఫలితములను చెప్పుడని" వారిని ప్రార్థించెను. **జన్మలగ్నమును పరిశీలించిన దైవజ్ఞులగు జ్యోతిష్కులు ఇట్లు చెప్పిరి** – "ఈ బాలుడు గొప్ప తపస్వి కాగలడు. జగద్గురువై జనులకు దీక్షను ప్రసాదించి వారిని తరింపజేయగలడని" వారు జాతకఫలమును వివరించిరి. వారి మాటలు వినిన తల్లిదండ్రులు మిగుల సంతసించి మా వంశమును ఉద్ధరించుటకై మీ ఇంట జన్మింతునని దత్తుడే మనకు వరమిచ్చెను కదా! యని ఆ బాలునకు ఆ పేరునే పెట్టిరి. భక్తజనులను తరింపచేయుట కొరకే స్వయముగా త్రిమూర్తి స్వరూపుడై అవతరించెనని, ఆతని పాదముల యందు శంఖచక్రాది శుభ చిహ్నములను గాంచి తమ కుమారునకు 'శ్రీపాదుడు' అని ఆ విప్రుడు నామకరణ మొనర్చెను. ఆ బాలుడు వారి

ఇంటిలో క్రమక్రమముగా దినదినాభివృద్ధి నొంది ఏడేండ్ల వాడయ్యెను. గర్భాష్టమ సంవత్సరము వచ్చినదని తలిదండ్రులు ఆ బాలకునకు ఉపనయనము జేసిరి. వెంటనే అతనికి తండ్రి వేదాధ్యయనము ప్రారంభించెను. ఆశ్చర్యమేమనగా – తండ్రి చెప్పకముందే బ్రహ్మవర్చస్సు ఉట్టిపడుచున్న ఆ బ్రహ్మచారి చతుర్వేదములను, షట్‌శాస్త్రములను కమ్మని కంఠస్వరముతో బహు చక్కగా పఠింపసాగెను. ఇట్టి విశేషవార్తను విని నగరవాసులందరు విస్మయమును చెంది ఈ బాలుడు కారణజన్ముడే కాని, మామూలు బాలకుడు కాదని అబ్బురపడుచుండిరి. అతడు ఆచార– వ్యవహార– ప్రాయశ్చిత్తాదులను గూర్చి ద్విజవరులందరికి సవిస్తరముగ వివరించుచుండెను. వేదాంతభాష్యమును, వేదార్థమును గూర్చి ఎవరేమని ప్రశ్నించిననూ అందుకు తగిన సమాధానమును సావధానముగ చెప్పుచుండెను. ఇట్టి అద్భుతములను గూర్చి వినిన నగరవాసులెల్లరు ఆ బ్రహ్మచారిని చూచుటకు ఎంతో ముచ్చటపడి వచ్చి శ్రీపాదుని దర్శించి మహదానందభరితులై వెళ్ళుచుండిరి. (42–50)

ఈవిధముగ అతడు పదహారేళ్ళ ప్రాయమునకు యెదిగెను. పుత్రునకు యుక్తవయస్సు వచ్చినదని తలంచి తలిదండ్రులు అతనికి వివాహము చేయవలెనని తలంచిరి. అందుచే వారు తమ కుమారుని సమీపించి – “నాయనా! నీకు వివాహము చేయుటకు సంకల్పించితిమని” పలికిరి. **వెంటనే శ్రీపాదుడు నిశ్చలచిత్తముతో ఇట్లనెను** – “పూజ్యులైన తలిదండ్రులారా! మీ పాదములకు నమస్కరించి నాలోగల కోరికను విన్నవించెదను. నాకు మీరు వివాహము చేయుదుమని యంటిరి. మంచిదే. ఇందుకు నేను ముందే ఒక స్త్రీని వరించితిని. ఆమె పేరు ‘విరాగిణి’. నేను ఆమెనే కోరుకొందును. ఆమెను తప్ప ఇతర స్త్రీలనందరిని నేను మాతృమూర్తులుగనే చూచెదను. ఒకవేళ మీరు ఆ సుందరీమణిని తెచ్చినచో, ఆమెను నేను తప్పక పెళ్ళాడెదనని తన మనోభీష్టమును వెల్లడించెను. అంతేగాదు, నేను అఖండ బ్రహ్మచారిని. పైగా తాపసిని. ‘యోగశ్రీ’ అను పేరుగల నారీరత్నమును తప్ప, ఈ ధరణియందుగల యే మగువయు నాకు అక్కరలేదు. నా పేరు ‘శ్రియావల్లభుడు’ అని యందురు. ఈ లోకమునందు నన్ను ఇట్టి నామముతోడనే పిలువవలయునని నిర్ధారింపబడినది. ఈవిధముగనే త్రిమూర్త్యాత్మకునకు **‘శ్రీపాద–శ్రీవల్లభుడు’** అను నామము యేర్పడినది. నా ఈ మాటలను నిశ్చయముగ గుర్తుంచుకొనుడు అని చెప్పి ఇక నేను ఉత్తరదిశగా వెళ్ళిపోయెద”నని తలిదండ్రులతో శ్రీపాదుడు పలికెను. పుత్రుని మాటలు విన్న ఆ తల్లికి ఇంతకుముందు గుణాతీతుడగు భిక్షుకుడు చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చెను. అప్పుడు ఆయన చెప్పిన మాటలన్నియునూ ఇప్పుడు సత్యములగుచున్నవని ఆ తలిదండ్రులు భావించిరి. నిజమునకు ఈతడు కారణజన్ముడు కాని, సామాన్య మానవుడు కాదనుకొని, అతని మాటలను మనము పెడచెవిని పెట్టినచో, మనకు తప్పక ముప్పు వాటిల్లగలదని నిర్ణయించుకొనిరి. కావున, ఇతనిని మన పుత్రుడని భావించుట యుక్తము కాదు. ఇతడొక అవతార

పురుషుడు, గొప్ప తపస్వియని దృఢముగా విశ్వసించిరి. తుదకు శ్రీపాదుని మనోనిశ్చయమును అనుసరించియే మనము నడచుకొనవలయునని కృతనిశ్చయమునకు వచ్చిరి. అప్పుడా తలిదండ్రులు తమ పుత్రునివైపు చూచి – "నాయనా! నీవే మాకు దిక్కై ఆధారముగా నిలచి, మమ్ములను పోషించెదవని గట్టి ఆశాబద్ధులమై యుంటిమని" అనిరి. ఇంతలో ఆ కన్నతల్లి యెదలో చెలరేగిన పుత్రవాత్సల్య పూరిత ప్రేమ మిక్కుటమై పుత్రవియోగబాధ కలచి వేయగా అందుకు తట్టుకొనలేక ఆ మాతృమూర్తి కనులనుండి కన్నీరు యేరుగా మారి పారుచుండగా స్పృహ తప్పి మూర్ఛిల్లెను. తీవ్రమైన తల్లి దుఃఖబాధను చూసిన ఆ పరమపురుషుడు తన కరకమలములచే లేవనెత్తి తన ఒడిలో నుంచుకొని శీతలోపచారమును సల్పి ఆమె అశ్రుధారలను తుడిచెను. **ఆ తర్వాత తల్లిని ఓదార్చుచు చల్లని మాటలతో ఇట్లనెను** – "అమ్మా! నీవు చింతించవద్దు. నీ దుఃఖమును తీర్చుటకే నేను నీ పుత్రునిగా జన్మించితిని. నీవు కోరినవి, నీకు కావలసినవి అన్నింటినీ ఇచ్చెదను. చిత్తమును దృఢపరచుకొని సుఖముగా నుండుము, తల్లీ!" అని పలికెను. అందుకా తల్లి – "కుమారా! నిన్ను చూచుకొని నేను అంతులేని ఆనందమును అనుభవించితిని. వృద్ధాప్య దశలో నీవే మమ్ములను రక్షించెదవని దృఢముగా నమ్మితిని. నీ వల్లనే నాలోగల మానసిక బాధను మరచిపోయితిని. మిగిలిన పిల్లలు ఇద్దరునూ కుంటివాడు, గ్రుడ్డివాడు గదా! వారిని నేనెట్లు పోషించగలను? మమ్ములను రక్షించువారెవరు? నాయనా! నీవే దిక్కని నమ్మి జీవించుచున్న మమ్ములను దిక్కులేని వారిగా చేసి పోయెదవా?" అని ఆమె మిగుల దుఃఖించుచుండెను. మాతృమూర్తియొక్క దుఃఖపూరితమైన వాక్కులను వినిన శ్రీపాదులు ప్రసన్న వదనులై కుంటీ, గ్రుడ్డియైన తన ఇరువురు సోదరులను ఒక్కసారి తన అమృతమయమైన దివ్యదృష్టితో చూచెను. అంతే! నమ్మశక్యము గాని అద్భుతము సంభవించినది. కుంటివానికి కాళ్ళు వచ్చెను. గ్రుడ్డివానికి చక్కని చూపు వచ్చెను. ఆ పుత్రులిరువురు దివ్యరూపములతో వెలుగొందిరి. చింతామణి స్పర్శతో ఇనుము బంగారముగ మారిపోయినట్లు, మహాత్ముని సుధారసపూర్ణ దృష్టి సోకినంతలోనే అయోగ్యులైన వారికి తగు యోగ్యత లభించెను. వెంటనే వారు వేదశాస్త్ర వ్యాకరణాది సమస్త శాస్త్ర పారంగతులైరి. "మేము కృతార్థులమైతిమి" అని సోదరులిద్దరునూ పరుగెత్తుకొని వచ్చి శ్రీపాదశ్రీవల్లభుల పాదపద్మములపై వాలిపోయిరి. వెంటనే, సహోదరులను లేవనెత్తి ఆప్యాయముగా కౌగలించుకొని వారిని ఓదార్చి తగు మాటలతో వారికి గట్టి ధైర్యముతో గూడిన **వచనములను యిట్లు పల్కెను** – "సోదరులారా! మీరు తలిదండ్రులను అత్యంత శ్రద్ధతో పూజ్యభావముతో సేవించవలయును. తలిదండ్రుల సేవాఫలముగా మీరు మహాజ్ఞానులయ్యెదరు. ఇహమునందు గొప్ప సౌఖ్యములను అనుభవించెదరు. పుత్రపౌత్రాభివృద్ధి కలిగి అఖండ ఐశ్వర్యముతో తులతూగెదరు. అంత్యమున ముక్తిని గూడ పొందగలరు" అని వారిని ఆశీఃపూర్వకముగ అనుగ్రహించెను. **అనంతరము**

తల్లితో ఇట్లనెను – "అమ్మా! నీవు చింతించవలదు. నీ ఈ కుమారులిద్దరు శతాయుష్మంతులయ్యెదరు. మీకు సమస్త సౌఖ్యములను గూర్చెదరు. వీరికి స్త్రీ పురుష సంతానము కూడా కలుగును. వారందరిని నీవు నీ కనులార గాంచెదవు. వంశపరంపరగా వచ్చేవారందరు అఖండ కీర్తివంతులుగను, వేదశాస్త్ర పారంగతులుగను అయ్యెదరు. అంతేగాదు, వారందరి ఇండ్లలో అఖండలక్ష్మి శాశ్వతముగ తాండవించును. అమ్మా! నా మాటలను కాదనకుండా విశ్వసించుము. అవన్నియును సత్యములగును. తలిదండ్రులను వదలిపెట్టి పోవుచున్నాడని మీరెంతమాత్రము కలత చెందవద్దు. మాతా! ఇక నాకు అనుమతినీయుము. సాధుజనులకు దీక్షనిచ్చుటకై నేను ఉత్తర మార్గముగుండా వెళ్ళవలసి యున్నదని" తలిదండ్రులకు చెప్పి, చేతులెత్తి వారికి నమస్కరించి అంతర్ధానము నొందెను. అక్కడినుండి నేరుగా కాశీక్షేత్రమునకు చేరి అచట గుప్తముగా ఉండిపోయెను. (51–75)

అచటి నుండి బయలుదేరి హిమాలయములలోగల బదరికాశ్రమమునకు చేరుకొని బదరీనారాయణుని దర్శించెను. నిజమునకు శ్రీపాదశ్రీవల్లభులు ఏదో ఒక గొప్ప ప్రయోజనమును సాధించు నిమిత్తము ఈ లోకమునందు మానవదేహమును ధరించి అవతరించెను. కావున, బదరికావనమునుండి బయలుదేరి సాధుజనులకు దీక్షను ప్రసాదించి, వారిని తరింపచేయు నిమిత్తముగ అనేక తీర్థస్థానములను పర్యటించిరి. అనంతరము, యోగమాయా ప్రభావముతో ఒకనాటి శుభముహూర్తమున మనోవేగముతో గోకర్ణ క్షేత్రమునకు శ్రీపాదశ్రీవల్లభుల వారు చేరుకొనిరను వృత్తాంతమును సిద్ధముని నామధారకునకు చెప్పిన విధమును శ్రోతలందరు చక్కగా విని తరించగలరని గంగాధర సరస్వతి లోకమునకు విన్నవించెను. (76–78)

ఇది శ్రీ గంగాధర-సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి
శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "దత్తాత్రేయ శ్రీపాద అవతారకథనము" అను
ఐదవ అధ్యాయము ॥ (5)

॥ జయ గురుదత్త – శ్రీగురుదత్త ॥

(ఓవీలు – 78; మొత్తము సంఖ్య – 587+78 = 665 ఓవీలు).

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ఆరవ అధ్యాయము

గోకర్ణక్షేత్రమాహాత్మ్యము - రావణుడు తన తల్లి పూజకొరకు కైలాసమును తెచ్చుటకై వెళ్ళుట - మహాదేవుని మెప్పించి ఆత్మలింగమును పొందుట - దేవతలు ఆందోళన చెందుట - దశకంఠుని చేతిలోగల ప్రాణలింగమును విష్ణుమూర్తి ఉపాయముతో నారద గణేశుల సాయముతో దానిని దారిమధ్యలోనే భూమిమీద స్థాపింపచేయుట - ఆ లింగమును పెకలించుటకు మహాబలుడగు రావణుడు ప్రయత్నించి విఫలుడగుట - అది మహాబలేశ్వర లింగముగ ప్రసిద్ధి గాంచుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునితో ఇట్లనెను - "స్వామీ! మీరు అంధకారమును తొలగించెడు జ్యోతిస్వరూపులు. నాలో నెలకొనియున్న అజ్ఞానమనెడు అంధకారమును రూపుమాపుటకై మీరు జ్ఞానజ్యోతిని వెలిగించితిరి. శ్రీగురుపీఠమును గూర్చిన ఆద్యంతములను తెలియపరచితిరి. అది విని నేను ధన్యుడనైతిని. అయితే, మహానుభావా! త్రిమూర్త్యాత్మకస్వరూపుడై శ్రీదత్తాత్రేయస్వామి వారే శ్రీపాదశ్రీవల్లభులుగా అవతరించిరి కదా! అట్టివారు తీర్థయాత్రలు చేయుటకు గల కారణమేమి? దేశమునందు అనేక తీర్థస్థానములుండగా ప్రత్యేకముగ గోకర్ణ క్షేత్రమునకే యెందుకు వెళ్ళిరి? గోకర్ణము యెడల వారికి అంతటి ప్రీతి కలుగుటయేల? అక్కడి విశేషమేమిటి? దాని ప్రభావము యెంతటిది? అని ప్రశ్నించి, కృపతో తగు సమాధానమును నాకు వివరించి చెప్పగలరని కోరుతూ నామధారకుడు సిద్ధముని పాదపద్మములను పట్టుకొని కైమోడ్పులర్పించెను. **నామధారకుని మాటలకు మిక్కిలి సంతసించిన సిద్ధుడు శ్రీగురుచరిత్రను వివరముగా చెప్పుచుండెను.** (1-5)

"శిష్యశిఖామణీ! వినుము. నీవు అడిగిన పరిప్రశ్నలకు నేనెంతయో సంతోషించితిని. నీ మూలమున నాకు గురుచరిత్రను వర్ణించి చెప్పగలిగే అపరిమితమగు లాభము ఘటించినది. మరింతగా విస్తరించి చెప్పవలెనను ఉత్కంఠ గలిగి నా మనసు ఇతోధికముగ ఉబలాటపడుచున్నది. త్రిమూర్తి అవతారమైన శ్రీపాదశ్రీవల్లభులు తీర్థయాత్రలను ఎందుకు చేసిరి? వారు గోకర్ణమునకే ఎందుకు వెళ్ళిరి? అచటగల విశేషమేమి? యని నీవు ప్రశ్నించితివి. వారు కేవలము భక్తజనుల హితార్థముగా ఉపదేశ దీక్షలను ప్రసాదించుట కొరకే

దేశాటనము చేసిరి. అంతేగాని, అందుకు వేరొక కారణము లేనేలేదు. సమస్త క్షేత్రములలో గోకర్ణము ఉత్తమోత్తమమైనది. అచట శంకరుడు తన స్వస్వరూపముతో అలరారుచుండును. కావుననే, శ్రీగురుమూర్తి ఆ క్షేత్రమునకు వెళ్ళియుండిరి. గోకర్ణ క్షేత్రమాహాత్మ్యము సాటిలేనిది. అమోఘమైనది. ఆ తీర్థమును గూర్చిన విశేషమైన వివరములను అన్నింటినీ సంపూర్ణముగ నీకిపుడు చెప్పుచుంటిని. శిష్యా! నామధారకా! మనసును ఏకాగ్రమొనర్చి శ్రద్ధగా వినుము. ఆ పవిత్ర క్షేత్రమునందు స్వయంభువుడగు పరమేశ్వరుడే లింగరూపమున వెలిసెను. అదియే 'మహాబలేశ్వర లింగము'గా ప్రసిద్ధి నొందినది. లంబోదరుడగు శ్రీగణపతి కరకమలములతో స్థాపించబడిన ఆ లింగమును గూర్చిన ఒక ఆసక్తికరమైన విశేషమగు ఆఖ్యానము గలదనెను. వెంటనే శిష్యుడు సిద్ధుని చూచి – "మునీంద్రా! విఘ్నేశ్వరుడే ఆ లింగమును యేల? యెందుకు ప్రతిష్ఠించెను? అట్టి తీర్థమహిమను వివరించి చెప్పవలసినదని" ప్రార్థించెను. మిక్కిలి జిజ్ఞాసతో శిష్యుడు ప్రశ్నించినతోడనే సిద్ధముని అత్యంత ఆనందభరితుడై మహాబలేశ్వర లింగము యొక్క చరిత్రను గూర్చిన **ఆద్యంతమును వివరించి చెప్పసాగెను** – (6-15)

బ్రహ్మదేవుని మానసపుత్రుడు పులస్త్యబ్రహ్మ(1). ఇతని కుమారుడు పౌలస్త్యుడు. ఇతనికే 'విశ్రవసుడు' అను మరోపేరు గలదు. ఈ విశ్రవసుని భార్యపేరు కైకసి. ఈమె గొప్ప శివభక్తురాలు. ఈ కైకసి రావణకుంభకర్ణాదుల కన్న తల్లి. ఈమె ప్రతినిత్యము అత్యంత భక్తిప్రపత్తులతో నియమముగా శివపూజను చేయుచుండెను. శివపూజను పూర్తి చేయకుండా ఆమె అన్నపానాదులను స్వీకరించునది కాదు. ఇట్లుండగా, ఒకనాడు పూజానిమిత్తముగ ఆమెకు శివలింగము లభింపలేదు. వ్రతభంగమగునని భావించి మృత్తికతో ఒక లింగమును నిర్మించి మిక్కిలి సంతోషముతో ఆమె శివపూజను చేయుచుండెను. అట్టి సమయమున అత్యంత క్రూరస్వభావము కలిగిన ఆమె కుమారుడగు దశకంఠుడు తన తల్లిని దర్శించి నమస్కరించుటకై అచటికి వచ్చెను. మాతృమూర్తి చరణములకు ప్రణమిల్లిన తర్వాత **ఆమె చేయు పూజను చూచి ఇట్లనెను** – "తల్లీ! ఈ మట్టిలింగమును యేల పూజించుచుంటివో? నాకు వివరముగా తెలుపుము. అంతేగాదు, నాకు నీవు తల్లివై యుండి ఈ మట్టిలింగమును పూజించుటయా? దీనిని చూచిన లోకులు మనలను అభాగ్యులని భావించి పరిహాసించెదరు. దీనిని పూజించుటవలన

---

1. బ్రహ్మదేవుని మానసపుత్రుడు పులస్త్యుడు. గొప్ప తపస్వి. (శ్రీమద్రామాయణం – ఉ.కాం. 2/3-6) ఈ పులస్త్యునకు రాజర్షి తృణబిందువుయొక్క కుమార్తె భార్యగా నుండెను. వీరికి కలిగిన కుమారుని పేరు విశ్రవసుడు. ఇతనినే పౌలస్త్యబ్రహ్మ అని అందురు. ఈ పౌలస్త్యబ్రహ్మయగు విశ్రవసుని భార్యపేరు కైకసి. ఈమె సుమాలి అను రాక్షసుని కూతురు. ఈ కైకసి విశ్రవసుల సంతానమే రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు మరియు శూర్పణఖ. వీరిది బ్రహ్మదేవుని వంశము.
(శ్రీమద్రామాయణము- ఉత్త.కాం.సర్గ-2/30-32 మరియు సర్గ 9లో శ్లో.11,12,20-36).

ప్రయోజనమేమిటో?" తెలుపుమని కోరెను. అందుకు తల్లి కైకసి – "వత్సా! శివపూజవలన కైలాసపదమును పొందగలము" అని చెప్పెను. **అంతట రావణుడు తల్లితో ఇట్లనెను** – "అమ్మా! కైలాసమును పొందుటకొరకా నీవు ఈ పూజను నిత్యము చేయుచుంటివి? ఎంతో శ్రమనొంది ఎందుకు చేయుచుంటివి? ఇది మనకు తగని పని. ఎందులకమ్మా! నీ కింత శ్రమ. ఆ కైలాసమునే తెచ్చి నీకిచ్చినచో యెట్లుండును?" అని పలికి, తిరిగి రావణుడు గంభీరముద్రను వహించి తల్లి ముందు ఇట్లని ప్రతిజ్ఞ చేసెను – "ఇప్పుడే కైలాసమునకు వెళ్ళి తృటిలో తిరిగి లంకను చేరెదను. ఈ మృత్తికాలింగ మెందులకు? సాక్షాత్తుగా ఆ పరమశివుడినే నీవు నేరుగా పూజించెదవు గాక! నీవు స్వస్థచిత్తురాలవై యుండుము" అని చెప్పి మనోవేగముతో ఆ నిశాచరుడు కైలాసమునకు పయనమయ్యెను. అతి శీఘ్రముగ అతడు కైలాస పర్వతమును చేరెను. అత్యంత సుందరమైన ఆ పర్వతమును దశాననుడు తన యొక్క ఇరువది బాహువులతో పెకలించి, దానిని లేవనెత్తుటకు అత్యధిక భుజబలమును ప్రయోగించెను. అంతట కైలాసభువనమంతయు కదలాడసాగెను. తన పది తలలతో పైకి లేపవలెనని తలంచి, తనకున్న పది శిరములను పర్వతమునకు ఆనించి బలమునంతయును ఉపయోగించి సమధికోత్సాహముతో దానిని లేపజొచ్చెను. కరములను ఊరువులపై గట్టిగా దట్టించి, నెమ్మదిగా కదలుచున్నకైలాసమునకు శిరస్సులను మోపి ఒక్క ఉదుటున మిక్కిలి వేగముతో లేవనెత్తినప్పుడు పాతాళాది సప్తలోకములు ఆందోళితములయ్యెను. శేషుని పడగతప్పెను. కూర్మము భయముతో వణకసాగెను. సమస్త దేవగణములు భయావహులైరి. ఇంద్రుని అమరావతి నగరము ఊగిపోయెను. స్వర్గలోకము కంపించెను. అటు వైకుంఠము, ఇటు సత్యలోకము ఊగిసలాడజొచ్చెను. మేరుపర్వత శిఖరము భయంకర ధ్వనులతో ఊగిపడిపోవుచుండెను. అప్పుడు పదునాల్గు లోకముల యందలి జనులెల్లరు భయకంపితులైరి. యేదో ఒక అకాల ప్రళయము సంభవించునేమో యని భీతిల్లి, గుండెలను గుప్పిటలో పెట్టుకొని అందరునూ గడ గడ వణకిపోవుచుండిరి. కైలాసమునందలి ప్రమథగణములు సైతము భయమునకు లోనై దిక్కుతోచక అటు ఇటు పరుగులిడుచుండిరి. ఇంతలో గిరిజాదేవి కూడ అకాలమున కైలాసము చలించుటకు కారణము తోచక, **భయావహురాలై పరమశివుని సమీపించి ఇట్లనెను** – "స్వామీ! ప్రాణనాథా! మీరు స్వస్థచిత్తముతో హాయిగా ధ్యానముద్రలో కూర్చుని యుంటిరి. లోకములన్నీ నిష్కారణముగా కంపించి పోవుచున్నవి. జనుల హాహాకారములు మిన్నుముట్టుచున్నవి. కైలాసమునకు ఏమైనది? ఎందుకు అటు ఇటు ఊగిసలాడుచున్నది. తప్పక పడిపోవునేమోయని తోచుచున్నది. దీనిని నివారించుటకు ప్రయత్నించగలరని" శ్రీవారి శ్రీచరణ కమలములను పట్టుకొని ప్రార్థించెను. **అంతట ఈశ్వరుడు పార్వతితో ఇట్లనెను** – "దేవీ! నీవేమీ

చింతించవలదు. నా భక్తుడగు రావణుడు విలాసముగ కైలాస పర్వతముతో ఆడుకొనుచున్నాడు. అంతే! దానివలన ప్రమాదమేమియూ లేదు" అని చెప్పెను. శివుని మాటలు విని శైలతనయ తన పతిదేవుని పాదపద్మములకు ప్రణమిల్లి – "స్వామీ! శూలపాణీ! అదుగో! కైలాసము మిక్కిలి కంపించుచున్నది. రక్షించుము. సమస్త ప్రమథగణములను రక్షించుము. ప్రభూ! రక్షించుమని" ఆర్తితో విన్నవించెను. ఉమాదేవి ఆర్తిని విని పరమేశ్వరుడు లీలావిలాసముగ నవ్వుతూ యెడమచేతితో పర్వతభూమిని నెమ్మదిగా ఒకసారి నొక్కెను.⁽¹⁾ అంతే! ఇంకేమున్నది! దశముఖుడు వెంటనే తన పదితలలతో, ఇరువది చేతులతో సహా పర్వతము క్రింద చిక్కుకొని పోయి విలవిలలాడజొచ్చెను.⁽²⁾ ఆ పర్వతము క్రిందపడి నలిగిపోతూ, కొట్టుమిట్టాడుచు, బయటకు వచ్చు శక్తిలేక తీవ్ర ప్రమాదమునకు గురియగుచున్న తరుణమున, మనసులో ఎంతగానో చింతించెను. ఇక, గత్యంతరము లేక 'శివ!శివ!' యని గట్టిగా ఉచ్చరించుచు 'పాహి మాం ప్రభూ! కైలాసవాసా! శరణాగతుడను, రక్షించుము' అని పరమేశ్వరుని ప్రార్థించెను. **యెలుగెత్తి యిట్లు స్తుతించెను.** "హే! జగద్రక్షక శిరోమణీ! పరమేశ్వరా! త్రాహి! త్రాహి! పినాకపాణీ! నీ చరణములే నాకు శరణము. ఇక నీవే నాకు దిక్కు ప్రభూ! నీ భక్తులకు మరణము సంభవమా? దేవా! రక్ష మాం! పాహి మాం!! అని రావణాసురుడు మొరపెట్టగా అమాయక చక్రవర్తియగు శంకరుడు తన భక్తుని మొరను విని, కరిగిపోయిన హృదయముతో కనికరించి, భూమిని అదిమిపెట్టిన వామహస్తమును పైకి లేపెను. 'బ్రతుకుజీవుడా' అని బయటపడిన లంకేశ్వరుడు వెంటనే పరమేశ్వరుని గూర్చి స్తుతించుటకై తన శిరస్సులను ఖండించి ఒక చేతితో పట్టుకొనెను. దేహమునందలి నాడులను, పొట్టలోని ప్రేవులను బయటకు లాగి తీగలుగా చేసి సమస్త వేదములను ఒక్కపెట్టున వర్ణక్రమానుసారముగా విస్తరించి, సకలరాగములను మేళవించి సామవేదమును గానము చేయుచు **అఖండ స్తోత్రమును చేయసాగెను.** (16-41)

---

1. **పాదాంగుష్ఠేన తం శైలం పీడయామాస లీలయా ।** (ఆ పరమేశ్వరుడు తన కాలిబొటనవ్రేలితో ఆ శైలమును లీలగా అదిమెను.)
(శ్రీమద్రామా. ఉ.కాం. సర్గ 16- శ్లో.27)

2. **ప్రీతోఽస్మి తవ వీర్యస్య శౌండీర్యాచ్చ దశానన । శైలాక్రాంతేన యో ముక్తః త్వయా రావః సుదారుణః ॥**
యస్మాల్లోకత్రయం చైతత్ రావితం భయమాగతమ్ । తస్మాత్ త్వం రావణోనామ నామ్నా రాజన్ భవిష్యసి ॥ (శ్రీమద్రామాయణం. ఉత్త.కాం.సర్గ17. శ్లో.37,38)
తా॥ దశాననా! నీ శౌర్యపరాక్రమములకు మెచ్చితిని. శైలము యొక్క ఒత్తిడికి నలిగిన నీవు దారుణముగా పొలికేక పెట్టితివి. నీవు చేసిన (సుదారుణః రావః) భీకరధ్వనికి ముల్లోకములు గడగడలాడినవి. అందువలన, రాక్షసరాజా! ఇకముందు నీవు 'రావణుడు' అను పేరుతో ప్రసిద్ధుడవయ్యెదవు అని పరమేశ్వరుడు దశగ్రీవునితో అనెను.

"నామధారకా! అంతట లంకానాథుడు గణ-రస-స్వర యుక్తముగ శివస్తోత్రమును గానము చేసెను. అనగా - అవి ఎనిమిది గణములు, నవరసములు, సప్తస్వరములు. వాటి నామములు సుప్రసిద్ధములు. వాటిని గూర్చి నీకు విస్తృతముగా పరిచయము చేసెదను. శ్రద్ధగా వినుము. ముందుగా లంకేశ్వరుడు ప్రఖ్యాతమైన ఎనిమిది గణములను విస్తరించి ఉచ్చైస్వరముతో ఎంతో చక్కగా పాడెను. వాటిలో ఒక్కొక్క గణము ఒక జాతి స్వరూపమునకు చెందినవిగా గలవు. 'మ' గణము బ్రాహ్మణ జాతికి, 'న' గణము క్షత్రియ జాతికి, **'భ'** గణము వైశ్యజాతికి, **'య'** గణము శూద్రజాతికి, **'జ'** గణము దైత్యజాతికి, 'ర' గణము ప్రేతజాతికి, **'త'** గణము రాక్షసజాతికి, 'స' గణము తురంగజాతికి చెందిన రూపములు గలవి. ఇక అతడు నవరసభరితముగ తన గానమును పోషించెను. వాటిలో ముందుగా శాంత-భయానక - అద్భుతము లనెడు రసములను, పిమ్మట శృంగార, హాస్య, కరుణ రసములను, ఆ తర్వాత రౌద్ర-వీర-బీభత్సరసములను పోషించి అత్యంత ఉల్లాసభరితుడై గానము చేసెను. నవరసపోషణతో పాటు వీణావాయిద్యముపై సప్తస్వరములను మేళవించి ధ్యానపూర్వకముగ కైలాసనాథుని స్తోత్రమును గానమొనర్చెను. ఇప్పుడు ఆ సప్తస్వరములను గూర్చిన వివరములను వినుము - (42-47)

మొట్టమొదటి స్వరమునకు **'షడ్జమం'** అని పేరు. ఇది జంబూద్వీపమునందు జనియించెను. ఈ స్వరము యొక్క ఉత్పత్తి కంఠస్థానం. ఆలాపన మయూర స్వరం. ఇది ఉత్తమజాతికి, గీర్వాణకులమునకు, బ్రహ్మ వంశమునకు చెందినది. పద్మపత్రవర్ణములో ఉండును. దీని దేవత- వహ్ని (అగ్ని). రసము శృంగారం. రెండవ స్వరం పేరు - **'ఋషభం'** దీని జననం ప్లక్షద్వీపము. ఉత్పత్తి హృదయస్థానము. చాషస్వరము (చాస్ అనేది ఒక పక్షి పేరు). ఋషికులము, క్షత్రియవంశమునకు చెందినది. విరాజ (పింజర) వర్ణము గలది. దీని దేవత యముడు. రసం - అద్భుతం. రావణుడు ఈ స్వరముతో వీణావాయిద్యముపై గానము చేయుచూ నృత్యమొనరించెను. కుశద్వీపంలో జన్మించిన మూడవ స్వరమునకు **'గాంధారం'** అని పేరు. ఇది నాసికా స్థానమునందు ఉత్పన్నమగును. అజ (మేక) స్వరముతో దీనిని ఆలపించెదరు. గీర్వాణ కులమునకు, వైశ్యవంశమునకు చెందినది. సువర్ణ వర్ణము, చంద్రుడు దేవత. అద్భుత రసం. ఈ స్వరముతో లంకాధీశుడు వినసొంపుగా పాడెను. **'మధ్యమం'** నాలుగవ స్వరం పేరు. ఇది క్రౌంచద్వీపంలో వెలిసినది. దీని ఉత్పత్తి వక్షఃస్థలం. ఆలాపన క్రౌంచ (పక్షి) స్వరం. గీర్వాణ కులం, బ్రహ్మ వంశమునకు చెందినది. కుందవర్ణంతో సురసరూపమును కలిగియుండును. దీని దేవత - లక్ష్మి. కరుణ రసం. 'పంచమం' అయిదవ స్వరం. దీని జన్మం శ్వేతద్వీపం. నాదోత్పత్తి స్థానం లలాటం. దీని ఆలాపన కోకిల స్వనమును

పోలి యుండును. పితృవంశమునకు చెందిన ఈ స్వరమునకు దేవత గణనాథుడు. కృష్ణవర్ణములో ఉండెడు ఈ స్వరము హాస్యరసమును పోషించును. ఆరవ స్వరమునకు **'ధైవతం'** అని పేరు. దీని జన్మస్థానం శ్వేతద్వీపం. నాదోత్పత్తికి స్థానం లలాటం. ఆలాపన దుర్దర స్వరం. ఋషికులం, ఉత్తమ వంశమునకు చెందినది. దీని రూపం పీతవర్ణం. నారదుడు – గణేశుడు ఈ స్వరమునకు దేవతలు. దీని రసం – బీభత్సం. ఇట్టి ధైవతమను స్వరముతో లంకేశ్వరుడు బీభత్సరసమును పోషించి అత్యంత ఉల్లాసము ఉట్టిపడుచుండగా తీవ్రమగు భక్తిభావముతో శంకరుని మెప్పుకోసము గానము చేసెను. **'నిషాదం'** అను పేరు గలది ఏడవ స్వరము. ఇది పుష్కర ద్వీపంలో పుట్టినది. దీనికి ఉత్పత్తి స్థానం తాలవ్య సంధి ప్రదేశం. హస్తి స్వరంలో గానం. అసురవంశము, వైశ్యకులమునకు చెందినది. దీని రూపము పాటల (గులాబీ) వర్ణము. తుంబురుడు, సూర్యుడు దేవతలు. భయానకరసంతో కూడి వ్యాకుల చిత్తముతో గట్టిగా అరచినట్లుగా ఉండును. ఈవిధముగా దశకంఠుడు సప్తస్వరములతో మహాదేవుని మెప్పించుటకై అద్భుతమైన స్తోత్రము చేసెను. (48-63)

అనంతరము, దశముఖుడు వసంత శ్రీరాగాది రాగరాగిణుల సమేతంగా సామవేదమును గానము చేసెను. భైరవాది పంచమరాగములను, నటనారాయణ, మేఘరాగములను సంగీతము యొక్క అభ్యాస యోగయుక్తుడైన లంకాధిపతి శివప్రీతికై గానము చేసెను. ఆ తరువాత గౌడీ, కోల్హాళీ, ఆంధాళీ, ద్రావిడ, కౌశికమాలీ, దేవగాంధార, ఆనందలీల, ధనాశ్రియ, వరాడీ, రామక్రియా, మంజరీ, గౌడక్రీ, దేశాక్షీ, హరీ, భైరవీ, గుర్జరీ, వేళావళి, లలిత, కర్ణాట, హంసయుక్త, త్రోటకీ, మోటకీ, టంకాక్షీ, సుధా, నాటికా, సైంధవీ, మాళవీ, బంగాలీ, సోరటీ, కామబోధ, మధుమాధవీ, దేవక్రి, భూపాలీ, వల్లభ, మాధురీ, రాహ్వేరీ, హర్షీ విహంగదాత్రీ, చండీ, వసవీజ ఇత్యాది రాగములను తన యొక్క కొన్ని తలలను ఊపుతూ, మరికొన్నింటిని ఖండించి తంబురలాగ చేసి నరములను తీగలుగ మలచి తన కరములతో మీటుతూ రావణేశ్వరుడు స్వయముగా పాడసాగెను. ఆయా సమయములందు ఆలపించవలసిన వివిధ రాగములను ఎంపిక చేసి దశముఖుడు పాడసాగెను. ఈ క్రమంలో ప్రభాతవేళలో మధ్యమ, వేళావళి, దేశాఖ్య, భైరవీ, భూపాలీ, మల్హార, ధనాశ్రీ, బంగాలీ అను అష్టవిధరాగములను అతడు బహుచక్కగా ఆలపించెను. ఇక మధ్యాహ్నవేళ – బరాడీ, లలితా, గుర్జరీ, గౌడక్రీ, ఆహీరీ, కౌశికేసి – రాగములను రావణుడు పాడెను. అపరాహ్ణమునందు కురంజీ, తోడి, మాలాశ్రీ, దేశాఖ్య, పంచమం వంటి రాగములను ఆలపించి హర్షాతిరేకముతో ఈశ్వరుని గూర్చి గానము చేసెను. చతుర్థ ప్రహరము అనగా సాయాహ్నమున గౌడీయ, రామకలీ, శ్రీరాగము, దేవక్రి, పటమంజరి, వసంతరాగము వంటి ఋతుకాలములకు

చెందిన రాగములు ఇట్టివే ముప్పది ఆరు రాగములతో సామవేదమును గానము చేయుచూ కఠోరదీక్షతో చంద్రమౌళీశ్వరుని పైన గల తన భక్తిని ప్రకటించెను. అంతట రావణుని భక్తిప్రపత్తులకు మెచ్చిన ఈశ్వరుడు అత్యంత ప్రసన్నవదనుడై ఆతని ముందు నిజరూపముతో సాక్షాత్కరించెను. అయిదు ముఖములు, మూడు కన్నులు, పది భుజములు కలిగిన దివ్యస్వరూపముతో మిక్కిలి హర్షమును ప్రకటించుచున్న మృత్యుంజయుడు రావణుని భక్తికి మిగుల సంతసించి – 'నాయనా! నీకిష్టమైన వరమును కోరుకొమ్మ'ని పలికెను. (64–80)

అంతట రావణుడు మహేశ్వరుని చూచి ఇట్లనెను – "నిన్ను నేనేమి కోరుదును?" నా గృహమునందు స్వయముగా లక్ష్మీదేవియే దాసిగా నుండెను. అష్టవిధ నిధులు మా ఇంటి గుమ్మం ముందు నిలచి ఉన్నవి. చతుర్ముఖ బ్రహ్మదేవుడు నాకు జ్యోతిష్కుడు. అతడు నిత్యము నాకు పంచాంగమును వినిపించును. సూర్యుడు, చంద్రుడు, వరుణుడు, వాయువు మున్నగు ముప్పది మూడు కోట్ల మంది దేవతలు మిగుల ప్రసన్నవదనులై నన్ను నిత్యము సేవించెదరు. అగ్నిదేవుడు నేను ధరించే వస్త్రములను ఎప్పటికప్పుడు అతి చాకచక్యముతో శుభ్రము చేయుచుండును. ఇక మృత్యుదేవత యముడు నా ఆజ్ఞకు బద్ధుడు. నా అనుమతి లేకుండా ఆతడు ఎవరినీ కన్నెత్తి కూడా చూడలేడు. దేవేంద్రుని పరాభవించిన మేటియగు ఇంద్రజిత్తు నా కుమారుడు. అతడు ముల్లోకములలో సాటిలేని వీరుడు. కుంభకర్ణుడు నా సోదరుడు. కామధేనువు మా ఇంటి ముంగిట నిలచియుండును. అగాధమైన సముద్రము నడిబొడ్డున నా నివాసము. ఆరుకోట్ల సంవత్సరములు నా ఆయుష్యము. నాతో సరిసమానముగ సాటిరాగలవాడు, ఈ మూడు లోకములందు వేరొకడు లేనేలేడు. మహాదేవా! మీ కైలాసమును మా లంకా నగరమునకు తీసికొని వెళ్ళుటకై నేను వచ్చితిని. మా అమ్మ నియమ నిష్ఠలతో ప్రతినిత్యము నిన్ను పూజించుచుండును. కావున, స్వామీ! కృపామూర్తీ! నా మనోభీష్టమును పూర్తి చేయుము" అని పలికెను. **అప్పుడు మహాదేవుడు రావణుని జూచి ఇట్లనెను** – "పూజ చేయవలెనను కోరిక యున్నచో, కైలాసముతో పని యేమిటి? వత్సా! నీకు నా ప్రాణలింగమునే ఇచ్చెదను. నీ మనసులోగల కోరికలను అన్నింటినీ నెరవేర్చెదను. ఈ లింగము నా ప్రాణమే సుమా!" అని చెప్పి తన ప్రాణలింగమును తీసి రావణునకు ఇచ్చెను. "చూడు, రావణా! నిశ్చలమైన చిత్తమును కలిగి ప్రతిదినము మూడువేళలయందు నూట ఎనిమిది మార్లు జపమును చేసిన మీదట రుద్రాభిషేచనముతో దీనిని పూజించవలెను. ఈవిధముగా నీవు మూడు సంవత్సరములు అఖండముగ పూజించిన యెడల నీవు నేనుగా అయ్యెదవు. నీ మనసులో కోరుకొన్న సమస్తమును నీవు పొందగలవు. ఈ లింగము యెవరి వద్ద యుండునో, వారికి మృత్యువు ఉండనే ఉండదు. దీని దర్శనమాత్రము చేతనే నిత్యపాపములన్నియు

వెంటనే నశించిపోవును. కాని, దారిలో ఈ లింగమును నేలమీద పెట్టవద్దు సుమా! నీ నగరమును చేరిన పిదప దీనిని మూడు సంవత్సరముల పాటు చక్కగా పూజించుము. అప్పుడు నీవే ఈశ్వరుడవు అగుదువు" అని మహేశ్వరుడు అమోఘమైన వరమును అనుగ్రహించెను. వెంటనే రావణుడు పరమశివుని పాదపద్మములకు శిరస్సాష్టాంగ వందనము చేసెను. మహాదేవుని అనుమతి గైకొని ఆత్మలింగమును తీసికొని త్వరితగతిన లంకాపురమును చేరుకొనుటకు రావణుడు బయలుదేరెను. (81-93)

ఇంతలో నారదమహర్షి దివ్యదృష్టితో ఈ విషయమునంతయు గ్రహించి వెంటనే అత్యంత ఆత్రముతో బయలుదేరి అమరావతిలోగల ఇంద్రభవనమును చేరెను. నారదమునీంద్రుడు ఇంద్రుని సమీపించి - "ఏమిటీ దేవేంద్రా! స్వస్థచిత్తుడవై హాయిగా స్వర్గలోకమునందు కూర్చుంటివేమి? రావణునకు మహాదేవుడు అమరత్వమును ప్రసాదించెను. ఇంకేమున్నది? అతడు నీ యొక్క సకలసంపదలను ఈనాడే కొల్లగొట్టుకొని పోవుచుండెను. రావణుడు కైలాసమునకు చేరి కడుభక్తితో కర్పూర గౌరుడగు శివుని మెప్పించి, అతని ప్రాణలింగమునే సంపాదించెను. తద్వారా లంకేశ్వరుడు చిరంజీవిగా మారెను. అంతేకాదు, నీవే ఈశ్వరుడవు కాగలవని మరొక వరమును కూడా ఆ మహాదేవుడు ప్రసాదించెను. మూడేండ్లు వరుసగా దీనిని నీవు పూజించిన చాలును! నీవు నేనుగా మారెదవు. నీ నగరమే కైలాసమగును. ఇక నీకు యేనాడూ మృత్యువుండదు" అని చెప్పి తన ప్రాణలింగమును ఇచ్చెను. ఆవిధముగా గొప్ప వరమును పొందిన రావణుడు అంతులేని సంతోషముతో లంకకు పోవుచుండెను. ఆ లింగము సురక్షితముగ లంకాపురిని చేరినచో, నీవుగానీ, ముప్పది మూడుకోట్ల దేవతలుగానీ, ఆతని చెరనుండి విడిపింపబడుటకు ఎవరి తరము గాదు. ఇంతేగాదు, దేవేంద్రా! నీకునూ ఆ లంకానాథుని ఊడిగము చేయు గతి పట్టును. మీ దేవసభను మురిపింపజేయు ఊర్వశి, రంభ, మేనకలను తీసుకొనివెళ్ళి ఆతనికి కానుకగా ఈయవలసివచ్చును" అని హెచ్చరికగా పలికెను. నారదుని మాటలు వినిన ఇంద్రుడు భయముతో కంపించి పోయెను. దిక్కుతోచక చేతులు జోడించి దేవేంద్రుడు నారదునితో - "మహర్షీ! ఇప్పుడు నేను ఏమి చేయవలయునో, చెప్పుమని" ప్రార్థించెను. అందుకు నారదుడు - "ఏదో ఒక ఉపాయమును ఆలోచించవలయును. దేవేంద్రా! మనము ఇప్పుడే బయలుదేరి బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళెదము. ఆయన ఏదో ఒక ఉపాయమును తెలుపగలడని" అనగా వారిరువురు కలిసి బ్రహ్మలోకమును చేరిరి. ఇంద్రుడు వినయముగా జరిగిన వృత్తాంతమును బ్రహ్మతో చెప్పెను. **అంతట బ్రహ్మదేవుడిట్లనెను** -"నేను చేయునదేమియు లేదు. దుష్టశిక్షకుడు, దైత్యసంహారకుడు విష్ణువే. కావున, మనము వెంటనే వైకుంఠమునకు వెళ్ళుదము. ఆయనే ఏదో ఒక

ఉపాయమును నిశ్చయముగా చెప్పగలడనెను". వారు ముప్పురూ కలిసి అతి శీఘ్రముగా వైకుంఠలోకమును చేరి, స్తుతింపగా, సర్వవ్యాపకుడగు విష్ణువు ప్రత్యక్షమాయెను. రావణుని గూర్చిన వృత్తాంతమంతయును బ్రహ్మదేవుడు విష్ణువునకు విన్నవించెను. తదుపరి **విష్ణువుతో విరించి ఇట్లనెను** – "ఇందుకు వెంటనే తగు ప్రతీకారమును చేయవలెను. యేలనన, నీవు రామావతారమును యెత్తవలసి యున్నది. ముప్పదిమూడు కోట్లమంది దేవతలు రావణుని చెరలో బంధింపబడియున్నారు. వారిని విడిపించుటకై అవతరించవలసినసంగతి నీకు ముందే తెలియును. కాని, ఇప్పుడా దైత్యుడు ఈశ్వరుని ప్రాణలింగమునే తీసికొని పోయెను. ఒకవేళ ఆ లింగము లంకకు చేరిన యెడల వాడు మృత్యురహితుడై మనకు అజేయుడు కాగలడు. ఇకమీదట వాడే ఈశ్వరుడైపోవును. కావున, శీఘ్రముగ తగిన ఉపాయమును ఆలోచించి అతని కార్యమును భంగమొనర్పవలయును. లేనిచో, ఈ రాక్షస సంహారమునకై త్వరలో నీవే అవతరింపవలసి యున్నందున, నీకే మరింత పెనుభారము కాగలదు సుమా!" అని చతుర్ముఖుడు విన్నవించెను. అప్పుడు శ్రీవిష్ణువు కినుక వహించి **"చెడి చింతించిన కార్యహాని కదా!"** అని వ్యగ్రుడై కైలాసమునకు వెళ్ళెను. (94–109)

శ్రీవిష్ణుమూర్తి పరమేశ్వరునిచేరి – "శంకరా! ఎంతపని జేసితివి? రావణునకు ప్రాణలింగమును యేల ఇచ్చితివి? రావణుడు గొప్ప రాక్షసుడు. మహాక్రూర స్వభావము గలవాడు. ఇప్పుడు దేవతలందరు అతని దాసులు. అందరి కందరు అతని కారాగృహ బంధితులు. అచట వారు నానా అగచాట్లు అనుభవించుచుండిరి. వారిని విడిపించుటెట్లు? ఇక మీదట అతడు స్వర్గమును కూడ ఆక్రమించును. అంతటి దురాచారపరునకు నీవేల వరము లిచ్చితివి?" అని పలికెను.

అంతట విష్ణువుతో ఈశ్వరుడిట్లు మారు పలికెను – "లక్ష్మీపతీ! రావణుని భక్తికి సంతుష్టి చెంది, నన్ను నేను మరచితిని. మిగుల సంతసించి పరవశుడనై ప్రాణలింగమును ఇచ్చితిని. అతడు తన శిరమును ఖండించి, వీణగా చేసి స్వహస్తములతో సప్తస్వరయుక్తముగా సకలవేదములను భక్తితో గానము చేసెను. ఒకవేళ అతడు పార్వతినే అడిగినచో, ఇచ్చివేయుదునేమో! అతని తీవ్రమైన భక్తికి పరవశించితిని. లెక్కసేయకుండా నా ఆత్మలింగమునే ఇచ్చివేసితిని" అని చెప్పి తన భక్తపరాధీనతను పరమశివుడు ప్రకటము చేసెను. **ఉమాకాంతునితో శ్రీవల్లభుడిట్లనెను** – "శివా! నీవు ఇట్టి వరములను ఇచ్చుటవలన దైత్యులు ఉన్మత్తు లయ్యెదరు. ఇక, నీవా అల్పసంతోషివి. భోళాశంకరుడవు. అమాయక చక్రవర్తివి. దుష్టులకు అసాధ్యములైన వరములను ప్రసాదించి మాకెంతో శ్రమను కలిగించుచుంటివి. రాక్షసులు మిమ్ములను

మెప్పించి, తిరుగులేని వరములను పొంది దేవతలను, ద్విజులను పీడించెదరు. అందువలన, నేను పెక్కు అవతారములను ధరింపవలసి వచ్చును. సరే! ఈశ్వరా! అతనికి ఆత్మలింగమునిచ్చి యెంత కాలమైనది? అతడు దానిని ఇప్పటికే లంకకు చేర్చియుండవచ్చునా?" అని అడుగగా - మహేశ్వరుడు - "లేదు. లేదు" అయిదు ఘడియలు మాత్రమే అయినది. ఇంకనూ అతడు దారిలోనే ఉండునని" విష్ణువుతో చెప్పెను. (110-118)

శివుని మాటలు విని నారాయణుడు వెంటనే ఒక ఉపాయమును ఆలోచించెను. సూర్యగమనమును అడ్డగించుటకు తన సుదర్శన చక్రమును పంపెను. **తదుపరి నారదునితో యిట్లనెను** - "నారదా! రావణుడు లంకాపురికి వెళ్లుచున్నాడు. నీవు త్వరగా వెళ్ళుము. అతడు వెళ్ళే దారికి ఎదురుగా వెళ్ళి లంకకు వెళ్లనీయకుండ అడ్డుపడి ఏదో ఒకటి మాటలాడుచు కాలయాపన మొనర్చుము. సూర్యుడు అగుపడకుండగా చక్రమును ప్రయోగించితిని. సకాలమునకు స్నానసంధ్యాదులను ముగించుట రావణుని దృఢమైన నియమము. దానిని అతడు ఎప్పుడూ ఉల్లంఘింపనేరడు. కనుక, నీవు వెళ్ళి అతనికి ఆలస్యమగునట్లుగా ప్రయత్నింపుము" అని చెప్పెను. విష్ణుదేవుని మాటలు విని నారదమహాముని మనోవేగముతో వెళ్ళి లంకానాథుని మార్గమునకు ఎదురుగా చేరుకొనెను. (119-123)

నారదుని పంపించిన మీదట విష్ణువు తన మనసులో యిట్లు తలపోసెను. 'రావణునకు విఘ్నములు కలిగించుటకొరకు విఘ్నేశ్వరుని పంపవలెనని, భావించి వెంటనే విష్ణువు గణేశుని స్మరించెను. అంతట వినాయకుడు వచ్చి నారాయణుని ముందు నిలిచెను. **అప్పుడు కేశవుడు గణపతిని చూచి వినయముతో ఇట్లనెను**- "విఘ్నేశ్వరా! ఏదేని కార్యమును ప్రారంభించుటకు ముందు దేవతలందరు నిన్ను పూజించెదరు. నీకు వందనము చేయుదురు. వారి మనోరథములను నీవు నెరవేర్చెదవు. అట్టి నిన్ను ఉపేక్షించిన వారికి విఘ్నములు యేర్పడుట నిశ్చయము. అయితే, రావణుడు మాత్రము నిన్నెప్పుడూ ఉపేక్షించుచునే యుండును. నీకు తెలియకుండా లంకేశ్వరుడు నీ తండ్రిని మోసగించి ఆతని ప్రాణలింగమును తీసికొని వెళ్ళుచుండెను. ఇప్పుడు నీవు ఉపేక్షించుట యుక్తము కాదు. వెంటనే నీవొక ముఖ్యమైన కార్యమును నిర్వహింపవలెను. అందుకు నీవే సమర్థుడవు. కనుక, అతి శీఘ్రముగ నీవు కపటరూపముతో ఒక పొట్టి బాలకుని వేషమును ధరించి వెళ్ళుము. దారిలో సూర్యాస్తమయమగును. రావణుడు సకాల సంధ్యావందన మాచరించు నియమము గలవాడు. అతనికి కాలవిలంబనము చేయుటకు నారదుడు వెళ్ళెను. ఈ ప్రాణలింగమును మార్గమధ్యమున ఎట్టి పరిస్థితిలోనూ నేలమీద పెట్టవద్దని శివుడు రావణుని ఆదేశించెను.

శౌచాచమన సమయమున అతడు దానిని తన వద్ద ఉంచుకొనలేదు. అందుచే నీవు బాలబ్రహ్మచారిగా వెళ్ళుము. శిష్యభావముతో అమాయికమైన పసిబాలుని మాటలను పలికి అతనికి నచ్చునట్లుగా నీపై నమ్మకము కలుగునట్లుగా ప్రవర్తించి నీ చేతికి ఆ ప్రాణలింగమును తీసికొనుము. రావణుడు నిన్ను విశ్వసించి సంధ్యావందన సమయమున నీ చేతికి తప్పక లింగము నిచ్చును. అట్టి సమయమున నీవు ఏదో ఒక ఉపాయమును ఆలోచించి ఆ లింగమును నేలమీద నిలుపుము. అది అక్కడనే నిలచిపోవును. అంతటితో మన పని తీరిపోవును" అని విష్ణుమూర్తి మిక్కిలి సంతోషముతో చెప్పెను. "సరే" నని సమ్మతించి హర్షాతిరేకముతో లేచి నిలబడిన బొజ్జగణపయ్య రెండు చేతులను చాచి తనకు కమ్మని తిను పదార్థములు కావలయునని తన బొజ్జను చూపెను. "విష్ణుదేవా! అయిదు విధముల లడ్లు, నువ్వుల లడ్లు, చెరుకు గడలు, కొబ్బరి, దానిమ్మ, చక్కెర, నెయ్యి, అప్పుడే పితికిన కమ్మని పాలు, వేయించిన శనగలు, అటుకులు, బెల్లము మొదలగునవి నేను తినుటకై త్వరగా ఇవ్వు"మని కోరెను. విఘ్నేశ్వరుడు కోరిన వాటినన్నింటినీ శ్రీవిష్ణువు ఈయగానే అతడు కడుపు నిండుగా భుజించెను. వెంటనే, కపట బాలబ్రహ్మచారి వేషమును ధరించి, రావణుడు ఉన్నచోటునకు వేగిరముగ వెళ్ళెను. (124–136)

నారదుడు అంతకుముందే వెళ్లియుండెను. ఆ దేవర్షి దశముఖుని ముందు నిలచి "రావణా! నీవు ఎక్కడినుండి వచ్చుచుంటివని" అడిగెను. **రావణుడు నారదునితో ఇట్లనెను**– "నేను కైలాసమునకు వెళ్ళి గొప్ప తపమును చేసితిని. అందుకు చంద్రమౌళీశ్వరుడు సంతసించెను. నా యెడల మిగుల ప్రసన్నుడై నాకొక లింగమును ఇచ్చెను. దాని మహిమ అపారమైనదని కూడా మహాదేవుడు తెలిపెనని" చెప్పెను. అందుకు నారదముని– "లంకానాథా! ఇప్పుడు నీవు దైవానుగ్రహమును పొందితివి. మృత్యుహరమైన అమృతమువంటి లింగము నీకు లభించినది. నాకు ఆ లింగమును గురించి, దాని గుర్తులను గూర్చి బాగుగా తెలియును. ఆ లింగమెట్లున్నదో, నాకొకసారి చూపించుము. లింగలక్షణములను పూర్తిగా నీకు తెలిపెదను. అది సరియైన ప్రాణలింగమగునో, కాదో, చూచి చెప్పెదను. ఒకవేళ సరియైన ప్రాణలింగమే అయినచో, నీవు గొప్ప అదృష్టవంతుడవే యగుదువు. దాని మహిమ అపారము. ఏదీ ఒకమారు దానిని చూపుము" అని లంకేశునితో పలికెను. కాని, అతడు నారదుని మాటలు నమ్మక దూరమునుండియే తన అరచేతిని తెరచి లింగమును చూపించెను. **అప్పుడు నారదుడు రావణునితో ఇట్లు చెప్పసాగెను** – "లంకేశ్వరా! అపారమైన లింగమహిమను ప్రకటించే ఒక కథను చెప్పెదను వినుము. లింగోద్భవమును గురించిన ఆద్యంతమంతయు నేను బాగుగా యెరుగుదును. దానిని గూర్చిన ఒక అపూర్వమైన కథను నీకు చెప్పెదను. శ్రద్ధగా వినుము. *(137–144)*

పూర్వకాలమునందు ఒకానొకప్పుడు కాలాగ్ని వంటి భయంకరరూపము గలిగిన ఒక మృగము ఉండెను. అది బ్రహ్మాండ ఖండమును కలయ తిరుగుచు లోకములను గగ్గోలు పరచుచుండెను. అరణ్యములన్నింటిలో చొరబడి మహిషాది జంతువులను వేటాడి తనకు ఆహారముగా చేసికొని సంచరించుచుండెను. ఘోరమైన ఆ మృగమునకు వెరచి లోకములు అల్లకల్లోలములగుచుండెను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు వేట నిమిత్తముగ అడవిలో ప్రవేశించి ఆ మృగమును వధించిరి. దానికి మూడు కొమ్ములు గలవు. వాటి క్రింద మూడు లింగములు ఉండెను. అవి మామూలు లింగములు కావు. అవి మూడునూ ప్రాణలింగములే సుమా! అయితే ఆ ముగ్గురు మూడు లింగములను స్వీకరించిరి. అవి వారికి ప్రాణసమానములు. అట్టి లింగమహిమను వినుము.ఎవడు దీనిని మూడు సంవత్సరములు నిర్విఘ్నముగ పూజించునో, వారు స్వయముగ వరదమూర్తి యగు ఈశ్వరుడేకాగలడు. ఆ లింగము ఎక్కడ యుండునో, ఆ ప్రదేశము కైలాసముగా మారిపోవును. అందుచేతనే బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు ఇంతటి ప్రాభవము కలిగినది. వీటికి మరింత అమోఘమైన మహిమ గలదు. దానిని వివరించెదను. శ్రద్ధగా విను"మనెను. అంతట రావణుడు లేచి "నాకు అత్యవసరమగు పని గలదు. అతి శీఘ్రముగ నేను లంకకు చేరవలెను. నారదా! ఇక సెలవు" అని పలికి మహాబలుడగు దశకంఠుడు బయలుదేరెను. **ఇంతలో నారదుడిట్లనెను-** "రావణా! అటు చూడుము. సూర్యాస్తమయము కానున్నది. సంధ్యాకాలమైనది. బ్రాహ్మణుడు విధిగా సంధ్యోపాసనము చేయవలెను. నీవు సమస్త వేదములను పఠించినవాడవు.నీవిప్పుడు నిలువకుండా ప్రయాణము సాగించిన యెడల దారిమధ్యలోనే సంధ్యాకాలము ముగిసి, చీకటి పడక తప్పదు. అప్పుడు నీకు సకాల సంధ్యావందనము లోపించును. ఆసన్నమైన సకాలమును అతిక్రమించి నీవంటివాడు సంధ్యాలోపమును చేయుట తగునా? అయినను, నీతో నాకేమిపని. నేను మాత్రము సంధ్యోపాసనము నిర్వహించుకొనుటకై ప్రస్తుతము నా ప్రయాణమును నిలిపి వేయుదునని" చెప్పి నారదమునిపుంగవుడు సమీపమునగల నదివైపునకు వెళ్ళెను.(145-153)

ఇంతలో బాలవటువు వేషమును ధరించిన విఘ్నేశ్వరుడు అటువైపుగా వచ్చెను. దారిలో సమిధలను త్రుంచుతూ అమాయికమైన చూపులతో రావణుని దృష్టిని ఆకర్షించునట్లు, అతని ముందునుండి పాదచారియై నెమ్మదిగా నడువసాగెను. అంతట రావణుడు తన మనసులో ఇట్లు చింతింపసాగెను - 'నేను ఇప్పటివరకు ప్రతినిత్యము త్రికాలములయందు సకాల సంధ్యావందనమును ఆచరించు నియమమును పాటించుచుంటిని కదా! మరి, నాకు ఈనాడు నియమభంగమగునేమో యని శంక కలుగుచున్నది. ఈ లింగమును యే పరిస్థితిలోను భూమిమీద పెట్టవద్దని ఈశ్వరుడు గట్టిగా చెప్పెను కదా! ఇప్పుడేమి చేయుదును. ఒక ప్రక్క సంధ్యవేళ మితిమీరుచున్నది.

చేయుటకేమి తోచుటలేదని అనుకొనుచున్న సమయమున చూడముచ్చట గొలుపుచున్న అత్యంత అందమైన ఒక బాలబ్రహ్మచారి నదీతీరమున తిరుగాడుచుండుటను రావణుడు గమనించెను. మరొకమారు నేరుగా చూచి ఇట్లు తలపోసెను. "ఈ బ్రహ్మచారి చూచుటకు అమాయకునివలె, కపటము లేనట్లుగ కన్పట్టుచున్నాడు. ఈ బాలకుడు నా యెడల విశ్వాస ఘాతుకము చేయకపోవచ్చును. ఇతడు నిశ్చయముగా పసిబాలుడే! యే పాపము యెరుగనివాడే యని తోచుచున్నది. ఈ లింగమును అతని చేతిలో పెట్టినను ప్రమాదము ఉండబోదు. మోసము చేయబూనడని నా మనసుకు తోచుచున్నది. కావున, నేను స్వస్థచిత్తుడనై త్వరగా సంధ్యావందనము పూర్తి చేయుదును" అని యోచించి రావణుడు కృతనిశ్చయమునకు వచ్చెను. వెంటనే ఆ బాలబ్రహ్మచారిని సమీపించెను. రావణుని పది తలలను చూచి భయపడినవానివలె లంబోదరుడు వెనుకకు తిరిగి చూచుచూ పరుగెత్తసాగెను. "భయపడవద్దు, నాయనా! నిలువుము" అంటూ బ్రాహ్మణరూపముతో వేగముగ ఆ బ్రహ్మచారి వద్దకు చేరెను. (154-160)

ఆ బాలకుని చేతిని పట్టుకొని నా వలన నీకేమీ భయము లేదని అభయము నిచ్చి దశముఖుడు అతనితో – "కుమారా! నీవెవరవు? నీ పేరేమి? నీ తలిదండ్రులెవరు? ఏ కులమునందు నీవు జన్మించితివి?" అని ప్రేమతో ప్రశ్నించెను. బ్రహ్మచారి రావణునితో – "నా గురించి నీవు ఎందుకు ప్రశ్నించుచుంటివి? మా తండ్రిగారు నీకేమైన ఋణపడియుండెనా, యేమి? నీకేమి ఈయవలసి యున్నదో తెల్పుము" అని పలికెను. ఆ బాలుని మాటలకు లంకేశ్వరుడు నవ్వి ఆప్యాయముగా అతని చేతిని నిమురుచు బుజ్జగించి – "నీవు ఎవరి కుమారుడవని తెలిసికొనుటకు మాత్రమే ప్రేమతో అడుగుచుంటిని, బాబూ! చెప్పుము. నాయనా!" అనెను. **అంతట ఆ బ్రహ్మచారి రావణునితో ఇట్లు చెప్పెను–** "మా తండ్రిని గూర్చి నీవేల అడుగుచుంటివి? 'సరే!' వినుము – "మా నాయన జటాధారి. ఒంటినిండుగ భస్మమును ధరించి, మెడలో రుద్రాక్షమాలను కలిగియుండును. ఆయన పేరు శంకరుడు. దివారాత్రములు భిక్షమెత్తుచుండును. ఇక, మా నాయనగారికి ఒక ఎద్దు వాహనముగా గలదు. ఆయన ఉమాసహితముగ దానిపైనెక్కి తిరుగుచుండును. మా జనని పేరు జగన్మాత. అయితే, మా గురించి నీవు ఇంతగా ఎందులకు అడుగుచుంటివి? నిన్ను చూచి నాకెందుకో భయము కలుగుచుండెను. నా చేతిని వదలుము. నేను వెళ్ళిపోయెదను" అని పలికెను. వెంటనే రావణుడు బ్రహ్మచారిని చూచి – "ఓయీ! బాల బ్రహ్మచారీ! నీ తండ్రి బిచ్చమెత్తుకొని జీవించే దరిద్రుడంటివి కదా! అతడు నిన్నేమి పోషించగలడు. అచట నీకెంతమాత్రము సౌఖ్యముండదు. మాది లంకాపట్టణము. అచటి ఇండ్లన్నీ రత్నఖచితములై యుండును. కుమారా! నీవు నాతోపాటుగా రమ్ము. అచట దైవపూజను చేయుచు హాయిగా ఉండవచ్చును. నీవు కోరిన వాటినన్నింటినీ నీకిచ్చెదను. సుఖసంతోషములతో ఉండవచ్చును. నాతో రమ్మని" రావణుడు బ్రతిమాలుచూ పలికెను. *(161-169)*

అప్పుడు బ్రహ్మచారి ఇట్లనెను – "అయ్యా! నేను మీ లంకాపురికి రాను. మీ లంకలో అనేకమంది రాక్షసులు ఉందురట. నేను అడవిలో ఉండే బాలుడను. వారు నన్నచట తినివేయుదురు. నేను నీతో రాలేను బాబూ! నన్ను వదలుము. మా ఇంటికి వెళ్ళిపోవుదును. నాకు ఆకలి వేయుచున్నదని" చెప్పి తన వద్దగల తినుబండారములను తినసాగెను. ఇదంతయు వినిన లంకానాథుడు ఆ బాలుని బ్రతిమాలుచూ – "బాలకా! నాకు సంధ్యావందన సమయమైనది. ఈ లింగమును నీవు పట్టుకొనుము. నేను తొందరగా సంధ్య ముగించి వత్తుననెను" అందుకు బాలుడు వినయముతో – "ఏమయ్యా! నేను అరణ్యవాసిని. పైగా బ్రహ్మచారిని. నేనీ లింగమును పట్టుకొనలేను. నన్ను లేనిపోని ఉపద్రవములో ముంచవద్దు బాబూ! నీ లింగము యెంత బరువుగా నున్నదో! యేమో! నేనా అర్భకుడను. ఈ లింగమును మోయలేను. నేను వెళ్ళిపోయెదను. నన్ను వదలిపెట్టుము. నీకెంతో పుణ్యముండునని" పలికెను. అనేకవిధములుగ నచ్చచెప్పి, బ్రతిమాలి లంకేశ్వరుడు ఆ లింగమును బ్రహ్మచారి చేతిలో పెట్టి, సంధ్యావందనమును ఆచరించుటకై త్వరగా సముద్రతీరమును చేరెను. **లింగమును చేతపట్టుకొనిన ఆ కపటబాల బ్రహ్మచారి వినయముతో ఇట్లు పలికెను** – "అబ్బో! ఈ లింగము నా చేతికి బరువుగా నున్నది. నేను మోయలేనంత బరువుగా తోచినప్పుడు వెంటనే దీనిని భూమిమీద పెట్టెదను. తొందరగా రావలయును. మూడుమార్లు నిన్ను గట్టిగా పిలిచెదను. అప్పటికి కూడా నీవు రాని యెడల ఈ లింగమును నేలమీద పెట్టివైచెదను" అని ఖచ్చితముగా చెప్పి గణేశుడు లింగమును పట్టుకొని నిలబడెను. దేవతలందరు ఆకసమున నిలచి విమానములయందుండి "ఏమి జరుగునో" యను కౌతుకముతో చూడసాగిరి. (170–178)

రావణుడు సంధ్య నిమిత్తము సముద్రతీరమును చేరి హస్త పాదప్రక్షాళనమొనర్చి అర్ఘ్యప్రదానము చేయుచుండగా "లింగమును మోయజాలను. వెంటనే వచ్చి లింగమును తీసికొనుము" అని గణేశుడు పిలిచెను. అనంతరము న్యాసపూర్వకముగ గాయత్రీ ధ్యానము చేయుచుండగా రెండవసారి రమ్మని పిలిచినప్పుడు, వివేకవంతుడైన రావణుడు – "బాలకా! వచ్చుచున్నాను. నిలువుమని" చేతితో సైగచేసెను.

మరొక్క క్షణమాగి 'అయ్యో! నేను మోయజాలను బాబూ! త్వరగా రమ్మని' గణేశుడు రెండుసార్లు పిలిచెను. కాని, ధ్యానము నందున్న రావణుడు అతని పిలుపును వినలేదు. గణేశుడు అటులే గట్టిగా రావణుని రమ్మని కేక వేయుచూ సమస్త దేవతల సాక్షిగా దానిని భూమిమీద నిలిపెను. అంతేగాదు, శ్రీవిష్ణువును స్మరించి గణేశుడు శివుడిచ్చిన ప్రాణలింగమును భూమిమీద ప్రతిష్ఠించెను. ఆకసమునందు నిలిచిన దేవతలు మిగుల సంతోషముతో పుష్పవర్షమును కురిపించిరి. సంధ్యను పూర్తిచేసికొని లంకేశ్వరుడు అతివేగముతో తిరిగివచ్చెను. అతడు వచ్చువరకే అక్కడ నేలమీద లింగము స్థాపించి యుండుటను గాంచి తీవ్రమగు వ్యథకు లోనయ్యెను. వెంటనే రావణుడు మిక్కిలి క్రోధోద్రిక్తుడై

ఆవేశముతో గణనాథుని మొట్టికాయలతో గట్టిగా మొత్తెను. గణేశుడు హాస్యవదనముతో రోదనము చేయుచూ నేలపై దొర్లసాగెను. "పసివాడను నన్నెందుకు కొట్టెదవు? ఇప్పుడే మా తండ్రితో చెప్పెదను. చూడుమని" గట్టిగా అరచి, ఏడ్చుచూ విఘ్నేశ్వరుడు తప్పించుకొని పారిపోయెను. (179-186)

అంతట రావణుడు ఖేదపడి లింగమును పెకలించి లంకకు తీసికొనిపోవుటకై తనయొక్క ఇరవై చేతులతో దృఢముగా పట్టుకొని లేపుటకు ప్రయత్నించెను. ఎన్నియో విధములుగ దానిని పెకలించి యెత్తుటకు యత్నింపగా భూమి కదలినది కాని, ఆ లింగము మాత్రము కదలలేదు. రావణుడు తన మహాబలము నంతయు కూడదీసికొని లింగము నెత్తబోయినప్పటికినీ, అది కదలలేదు. చేతికి చిక్కలేదు. ఆ మహాబలుడు అలసిసొలసి తన తలను ఆ లింగమునకేసి కొట్టుకొనెను. అందులకే దానిని "మహాబలేశ్వర లింగము" అని అందురు. రావణుడు ఆ లింగమును చేతులతో గట్టిగా మెలిత్రిప్పుతూ పెకలించుటకు ప్రయత్నించుటచే చేతుల రాపిడి వలన లింగము గోకర్ణాకారముగ మారెను. అందుచే అది "గోకర్ణక్షేత్రము" గా ప్రసిద్ధి నొందెను. ఇక లాభము లేదని తలంచి లంకానాథుడగు రావణుడు తన ప్రయత్నమును విరమించుకొని తిరిగి తపస్సు చేయు నిమిత్తముగ వెళ్ళిపోయెను.

ఇట్టి గోకర్ణక్షేత్రము యొక్క మహిమ అపారమైనది. అది స్కాందపురాణమునందు వర్ణింపబడి యున్నది. త్రిభువనములయందు ఘనతరకీర్తి వహించిన సాటిలేని ఈ క్షేత్రమాహాత్మ్యమును గూర్చి మరింత వివరించి చెప్పెదనని సిద్ధమునీంద్రుడనగా శిష్యుడగు నామధారకుడు మిగుల సంతుష్టాంతరంగుడై శ్రీగురుచరణ కమలములను పట్టుకొని సాగిలపడి మ్రొక్కెను. ఆ ఉభయుల సంవాదమును గంగాధర సరస్వతి లోకకళ్యాణనిమిత్తముగ గ్రంథరూపమున వ్యక్తపరచెను. (187-192)

ఇది శ్రీ గంగాధర-సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "గోకర్ణమహిమ-మహాబలేశ్వర లింగస్థాపనము" అను ఆరవ అధ్యాయము ॥(6)

॥ జయ గురుదత్త - శ్రీగురుదత్త ॥

(ఓవీలు - 192; మొత్తము సంఖ్య - 665+192 = 857 ఓవీలు).

◆ ◆ ◆

★ ది గం బ రా ది గం బ రా శ్రీ పా ద వ ల్ల భ ది గం బ రా ★

శ్రీ గురు చరిత్ర

ఏడవ అధ్యాయము

గోకర్ణ క్షేత్ర మహిమను వర్ణించుట - మిత్ర సహుడను రాజు యొక్క బ్రహ్మహత్యాపాప నివృత్తి - గౌతమఋషికి శివదూతలు పాపాత్మురాలగు సౌదామిని కథను వివరించుట - శివరాత్రి మాహాత్మ్య నిరూపణము

శ్రీ గణేశాయ నమః ।। శ్రీ సరస్వత్యై నమః ।। శ్రీ గురుభ్యో నమః ।। శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ।।

నామధారకుడు సిద్ధమునీశ్వరుని పాదపద్మములకు ప్రణమిల్లి ఇట్లనెను – “జ్ఞానజ్యోతి స్వరూపా! కృపామూర్తి! సిద్ధరాజా! శ్రీపాదులవారు సమస్త క్షేత్రములను వదలిపెట్టి గోకర్ణ క్షేత్రమునకే ఎందుకు వెళ్ళిరి? అంతకు పూర్వము ఎవరైనను అచటికి వెళ్ళి విశేష ఫలమును అనుభవించి యుండిరా? గురువునకు ప్రీతిపాత్రమైన గోకర్ణక్షేత్రమహిమను వినవలయునని నా మనసు మిక్కిలి ఉబలాటపడుచున్నది. కావున, గొప్పదైన గోకర్ణక్షేత్ర మాహాత్మ్యమును గూర్చి విశేషమైన శ్రవణము చేయించి, నన్ను పునీతుని గావింపుమని” పదే పదే ప్రార్థించెను. **అందుకు సిద్ధముని కరుణించి ఇట్లు చెప్పసాగెను** – “నామధారకా! నీకు అద్భుతమైన గోకర్ణక్షేత్ర మాహాత్మ్యమును వివరముగా చెప్పుచున్నాను. ఏకచిత్తుడవై శ్రద్ధగా వినుము”. (1-4)

“పూర్వకాలమునందు ఇక్ష్వాకువంశమునకు చెందిన మిత్రసహుడనే రాజు ఉండెను. అతడు పరాక్రమవంతుడైన ఉత్తమ క్షత్రియుడు. స్వధర్మనిరతుడు. సమస్త శాస్త్రజ్ఞాన సంపన్నుడు. వివేకవంతుడు. బలాఢ్యుడు, శూరుడు, దయానిధి, నిత్యోద్యమశీలి. అయితే ఇట్టి మిత్రసహుడనే రాజు ఒకనాడు వినోదార్థముగ వేట నిమిత్తమయి భయంకరమైన ఒక అడవిలో ప్రవేశించెను. నిర్మానుష్యమైన ఆ అరణ్యములో సింహశార్దూలాది క్రూరమృగములను వేటాడి సంహరించుచుండగా అక్కడ భయంకరమైన ఒక రాక్షసుడు ఆ రాజునకు ఎదురయ్యెను. రాజు అతడిని చూసి కోపముతో అతనిపై బాణవర్షమును కురిపించెను. బాణముల ధాటికి తట్టుకొనలేక ఆ రక్కసుడు మూర్ఛిల్లి పడిపోయెను. అతడు క్రింద పడిపోవుచున్నప్పుడు ఆ రాక్షసుని సోదరుడు సమీపమునందే యుండెను. తన సోదరుని జూచిన ఆ రక్కసుడు ఎంతయో ఆక్రోశించి, అసువులను కోలుపోవుచూ “సోదరా! నీవు నా సోదరుడివే అయినచో, నా వధకు తగిన ప్రతీకారమును తీర్చుకొమ్మని” చెప్పి ఆ నిశాచరుడు

★ ద త్త గు రో ద త్త గు రో ద త్తా త్రే య అ వ ధూ త గు రో ★

మరణించెను. సోదరుని మరణమునకు మిగుల శోకించిన ఆ రాక్షసుడు రాజుతో తలపడి యుద్ధము చేయు సామర్థ్యము లేనివాడు. కాని, అతడొక గొప్ప మాయావి. కనుక, యేదేని మాయోపాయముతో రాజుపట్ల ప్రతీకారము తీర్చుకొనవచ్చునని యోచించి మానవరూపమును ధరించెను. **అతి వినయముతో రాజు వద్దకు చేరి నమస్కరించి ఇట్లనెను** – “రాజా! నేను తమకు సేవకునిగా ఉండెదను. అందుకు తాము అంగీకరింపగలరు. తమ సేవచేసి నేను ధన్యుడనయ్యెదను” అని మానవరూపధారియగు రాక్షసుడు ప్రార్థించెను. అందుకు రాజుఅంగీకరించెను. వేటనుండి తిరిగి నగరమునకు చేరిన మీదట రాజుగారు ఈ కపట సేవకునకు పాకశాలలో అవసరమగు పదార్థములను సమకూర్చు సేవను అప్పగించెను. నాటినుండి అతడు యజమాని మెప్పును పొందునట్లుగా పలువిధములుగ సేవించుచుండెను. ప్రతీకారమును తీర్చుకొనుటకై తగు అదనుకొరకు ప్రతీక్షించుచు వాడు కపటసేవను చేయుచుండెను. ఇంతలో రాజు మరొకమారు మృగయా నిమిత్తము ఆ కపటసేవకునితోపాటుగా అరణ్యమునకు వెళ్ళి క్రూరమృగములను వేటాడి తిరిగి నగరమునకు వచ్చెను.

కొంతకాలమునకు రాజుగారి గృహమున పితృశ్రాద్ధము చేయవలసిన దినము సంప్రాప్తమయ్యెను. అందుకు రాజుగారు వసిష్ఠాది మహర్షులను భోక్తలుగా నిమంత్రించెను. ఆ రోజు నియమముగా చక్కని వంటకములను తయారుచేయించుమని, వంట చేయువారికి కావలసిన పదార్థములను లేదనకుండా అందించుమని, ఆ రాజు తన కపట సేవకునికి పూర్తి బాధ్యతను కట్టబెట్టెను. ‘సరే’ నని అత్యంత హర్షముతో తలను ఊపిన ఆ కపట సేవకుడు పగదీర్చుకొనుటకు ఇదియే తనకు లభించిన మంచి తరుణమని భావించెను. రహస్యముగ నరమాంసమును తెచ్చి, దానితో వంటకమును తయారు చేయించెను. శ్రాద్ధకాలమునందు భోక్తలగు ఋషీశ్వరులముందు విస్తరాకులు వేసి మొదట నరమాంస వంటకమును వడ్డింపజేసెను. వసిష్ఠ మహర్షి తన దివ్యదృష్టితో జరిగిన మోసమును గమనించి రాజుగారి మీద ఉగ్రుడై “రాజా! నీవు మాకు నరమాంసమును వడ్డించితివి. కావున, వెంటనే నీవు బ్రహ్మరాక్షసుడవు అగుదువుగాక!” అని శపించెను. (5–21)

తనను శపించినందులకు మిక్కిలి కోపగించిన రాజు – “నిరపరాధులమైన మమ్ముల నేల శపించితిరి? మహర్షీ! నిజమునకు ఆ మాంసమును ఎవరు వండిరో, నాకు తెలియనే తెలియదు. అట్లు చేయుమని నేనెవరిని ఆదేశించనూలేదు. యే పాపము యెరుగని నన్ను తొందరపడి వృథగా శపించితిరి. కావున, నేను మీకు ప్రతిశాపమునిచ్చెదనని” చేతిలోనికి జలమును తీసికొని శపించుటకు సిద్ధపడెను. వెంటనే ఆ రాజుగారి భార్య మదయంతి యను పేరుగల పతివ్రత భర్తను సమీపించి అతని చేతిని పట్టుకొని అట్లు చేయవద్దని భర్తను నివారించెను. (22–24)

భర్తతో ఆమె ఇట్లనెను – "నాథా! గురువు మనకు పూజ్యుడు. వారి పాదపద్మములకు నమస్కరించినంతలోనే మనము భవసాగరమునుండి తరించిపోవుదుము కదా! అట్టి గురువును శపించుట మనకు ధర్మము గాదు, అది మహా దోషభూయిష్ఠమగునని" చెప్పగా ఆమె హితవాక్యములను విని ఆ రాజు గురువును శపించుటను మానుకొనెను. పిమ్మట చేతిలోగల సంకల్పిత కల్మషజలమును వేరొకచోట పోసినచో, ఇతర ప్రాణులను హింసించిన వాడనగుదునని తలంచి, ఆ ఉదకమును తన పాదములపైననే పోసికొనెను. తత్ఫలితముగా ఆనాటి నుండి అతడు **'కల్మాషపాదుడు'** అను పేరుతో పిలువబడెను. వెంటనే ఆ రాజు వసిష్ఠ మహర్షిగారి శాపప్రభావమున బ్రహ్మరాక్షసుడుగా మారిపోయెను. రాజుగారి పట్టపురాణియగు మదయంతి వసిష్ఠులవారి చరణములమీద పడి నమస్కరించి దుఃఖపూరితయై – "స్వామీ! మేము మీ పిల్లలము కదా! మా పైన ఇంతటి కోపమేల? గురుదేవా! నాకు పతిభిక్షను పెట్టి, మమ్ములను ఉద్ధరించుము" అని వేడుకొనెను. ఆమె పలికిన దీనవచనములకు శాంతించిన మహర్షి ప్రసన్నుడై – "మహారాణీ! వినుము. పన్నెండు సంవత్సరములు గడిచిన మీదట నీ భర్త తిరిగి రాజు కాగలడని" శాపవిముక్తిని ప్రసాదించి వసిష్ఠమహర్షి తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. మిత్రసహుడను ఆ రాజు బ్రహ్మరాక్షసుడై వనాంతరములకు వెళ్ళిపోయెను. (25–30)

ఆనాటినుండి కల్మాషపాదుడనే ఆ బ్రహ్మరాక్షసుడు నిర్మానుష్యమైన కీకారణ్యమునందు తిరుగాడుచు పశుపక్ష్యాదులను, మానవులను పట్టుకొని భక్షించుచుండెను. ఇట్లుండగా కొంతకాలమునకు ఒకనాడు ఆ అడవియందు దారిలో నడచి వెళ్ళుచున్న బ్రాహ్మణ దంపతులను ఈ భయంకరుడగు బ్రహ్మరాక్షసుడు చూచెను. అంతే! అకస్మాత్తుగా పశువుమీదికి పులి దాడిచేసినట్లుగా ఆ రక్కసుడు తన భార్యతో కలిసి ఆనందముగ వెళ్ళుచున్న ఆ బ్రాహ్మణుని పట్టుకొని భక్షించుటకై ప్రక్కకు తీసుకొని వెళ్ళెను. తృటిలో జరిగిన దుర్ఘటనకు నివ్వెరపోయిన ఆ బ్రాహ్మణ స్త్రీ అపరిమితముగ రోదించుచు వేగముగ వెళ్ళి బ్రహ్మరాక్షసుని పాదములమీద పడెను – "అయ్యో! నా ప్రాణేశ్వరుని చంపవద్దు. నా సౌభాగ్యమును రక్షింపుము. నాయనా! అతని భార్యనైన నన్ను ప్రీతితో హాయిగా భుజింపుము. భర్తలేని భార్య జీవితము బండరాయివలె వ్యర్థము. తరుణ వయస్సులోగల అత్యంత సౌందర్యవంతుడు, సమస్త వేదశాస్త్ర పారంగతుడు అయిన నా స్వామి ప్రాణములను కాపాడుము. అందుచే ఈ విశాల విశ్వమును రక్షించిన అనంతపుణ్యఫలము నీకు లభించును. మాపై కృప జూపుము. నీ కూతురునై పుట్టెదను. నాకు పుత్రుడు పుట్టినచో అతనికి నీ పేరే పెట్టుకొందును"అని అనేకవిధములుగ హృదయవిదారకముగా ఆ విప్రవనిత ఎంతగానో ప్రార్థించెను. కాని, క్రూరుడు, నిర్దయుడైన ఆ రక్కసుడు ఆమె మాటలను అంగీకరించకుండా ఆ బ్రాహ్మణుని తినివేసెను. తన యెదుట భర్తను భక్షించుటను

చూచిన ఆ బ్రాహ్మణపత్ని ఉగ్రురాలై – "ఓరీ! రాక్షసుడా! నా శాపమును జాగ్రత్తగా వినుము. నీవు సూర్యవంశపు రాజువై యుండి శాపవశాత్తున బ్రహ్మరాక్షసుడవైతివి. పన్నెండు సంవత్సరములు గడిచిన పిదప నీకు శాపవిముక్తి లభించును. అప్పుడు నీవు నీ భార్యతో రమించిన యెడల, వెంటనే నీకు మరణము తప్పదు. దురాత్ముడవైన రక్కసుడా! దుష్టభావముతో నిర్దయుడవై అనాథలను భక్షించుచుంటివి. మా దంపతులను యెడబాపిన మహాపాపమును నీవు అనుభవింపక తప్పదు" అని తీవ్రముగ శపించెను. పిదప, తన భర్తయొక్క యెముకలను ప్రోగుచేసి, కట్టెలను పేర్చి అగ్ని రగిల్చెను. వెంటనే అగ్నిప్రవేశము చేసి, ఆమె తన ప్రాణములను అగ్నికి ఆహుతి చేసెను. (31-43)

అనంతరము గిర్రున పన్నెండు సంవత్సరముల కాలము గడిచిపోయెను. శాపవిముక్తుడైన కల్మాషపాదుడు తిరిగి నగరమునకు వచ్చి రాజుగా అయ్యెను. అడవిలో జరిగిన వృత్తాంతమును తన భార్యయగు మదయంతికి వివరించి, విప్రవనిత విధించిన శాపమును గూర్చి తెలియచెప్పెను. భర్త మాటలు వినిన మదయంతి మిగుల దుఃఖించి, ఇక జీవించి ప్రయోజనము లేదని లోలోన బాధపడి తుదకు తన ప్రాణములను త్యజించుటకు సిద్ధపడెను. **అంతట మదయంతి రాజుతో నుడివెను** – "ప్రభూ! ఇంతవరకు మనకు సంతానము కలుగలేదు. పన్నెండు సంవత్సరముల పర్యంతము ఎన్నియో కష్టనష్టములను అనుభవించినప్పటికినీ దుష్టప్రారబ్ధము నుండి మనము తప్పించుకొనలేక పోయితిమి కదా! అయ్యో! హతవిధీ!!" అని అత్యంత శోకసంతప్తురాలైన భార్య పలికిన మాటలను విని ఆ రాజు అంతులేని దుఃఖమునకు లోనయ్యెను. అతని కనులవెంబడి కన్నీరు కట్టలు త్రెంచుకొని ప్రవహింపసాగెను. బ్రహ్మరాక్షసిగా నుండుకాలమున చేసిన బ్రహ్మహత్యా పాతకము రాజును వెంటాడి బాధింపసాగెను. "ఇప్పుడేమి చేయుదును" అని మంత్రులను కోరగా, వారు రాజుతో బ్రహ్మహత్యా దోషమును పోగొట్టుకొనుమని చెప్పిరి. "అందుకుగాను, మీరు సమస్త తీర్థములను దర్శించినచో బ్రహ్మహత్యాది పాపమునుండి ముక్తులై పునీతులయ్యెదరని" రాజుగారి వృద్ధపురోహితులు, మంత్రివర్యులు అందరును కలిసి ఏకాభిప్రాయమును వెల్లడించిరి. వారి సలహామేరకు ఆ రాజు తీర్థాటనకు బయలుదేరి విధిపూర్వకముగ సమస్తయాత్రలను పూర్తి చేసెను. (44-51)

తాను వెళ్ళిన ప్రతి పుణ్యక్షేత్రమునందు ఆ రాజు యజ్ఞములను నిర్వహించెను. బ్రాహ్మణులకు, పేదలకు అన్నదానము చేసెను. మరెన్నియో శాస్త్రవిహిత దానములను ఇచ్చెను. ఈవిధముగ అనేక పుణ్యకార్యములను ఆచరించెను. అయితే, మిత్రసహుడను ఆ రాజు ఏ తీర్థమునకు వెళ్ళినను అతనిచేత జరిగిన బ్రహ్మహత్యా పాతకము ఎవరికంటికి కనిపించకుండా భయంకర స్వరూపముతో అతనిని వెంబడించి

వచ్చుచునే యుండెను. ఆ రాజు మిక్కిలి భయపడుచు ఏమి చేయుటకు దిక్కుతోచక చింతాక్రాంతుడై నిరాశకు లోనగుచుండెను. ఇట్టి పరిస్థితిలో మానసికముగ బలహీనపడిన ఆ రాజునకు ఒకనాడు దైవయోగము ఘటించెను. తద్వారా, మిథిలాపురము యొక్క బాహ్యప్రదేశము నందుగల ఒక సుందర ఉద్యానవనము అతని మనసును ఆకర్షించెను. వెంటనే ఆ ఉద్యానవనమునందు ప్రవేశించిన రాజు ఒక చెట్టునీడన నిరుత్సాహవదనముతో కూర్చొని యుండెను. ఇంతలో అపర రుద్రునివలె ప్రకాశించుచున్న గౌతమ ఋషీశ్వరుడు రాజుగారి సమీపమునకు చేరెను. గౌతమ మహర్షిని గాంచిన రాజు అమితానందభరితుడై దిగ్గున లేచి మిక్కిలి హర్షముతో మహర్షి చరణములపై తన శిరమునుంచి వినమ్రుడై శిరస్సాష్టాంగ వందనము నాచరించెను. అనంతరము, నిరాశా నిస్పృహలకు లోనైన ఆ రాజును గమనించిన ఋషివర్యుడు ప్రశాంత వదనముతో అభయముద్రను చూపించి, అతిశయించిన కరుణార్ద్ర హృదయుడై రాజును చూచి, **అతని యోగక్షేమములను గూర్చి యిట్లు ప్రశ్నించెను**– "రాజా! నీ రాజ్యము ఏమైనది? రాజ్యమును వదలి యిట్లు వచ్చుటకుగల కారణమేమి? అరణ్యవాసిగా యేల మారితివి? నీ ముఖము వ్యాకులము నొంది వెలవెల బోయినది యెందులకు? ఏమి ఆపద సంభవించినది? రాజా! దాపరికము లేకుండగ నీ మనోవ్యథను స్పష్టముగా వివరించుమని" కోరెను. **అందుకు రాజు గౌతమ ఋషితో ఇట్లు విన్నవించెను** – "గౌతమమునీంద్రా! నాకు బ్రహ్మాహత్యాదోషము పట్టుకొనెను. పెద్దలు, హితైషులు చెప్పిన విధముగ సర్వప్రాయశ్చిత్తాదులను ఆచరించితిని. యజ్ఞాది సర్వధర్మములను నిర్వహించితిని. సమస్త తీర్థములను పర్యటించితిని. ఎన్నియో వ్రతములను చేసితిని. అనేక దానముల నొనర్చితిని. కాని, బ్రహ్మాహత్యా దోషము నన్ను వీడిపోవుటలేదు. అది భయంకరమైన రూపమును ధరించి నన్ను వెంబడించుచునేయున్నది. అదృష్టవశమున నేడు మీ దివ్య చరణదర్శనము లభించినది. నేటికి నా జన్మ ధన్యమైనది. ఇక నా కష్టములు తీరిపోయినవి. మహానుభావా! నన్ను బ్రహ్మాహత్యాదోషము నుండి రక్షింపుము. మీ శరణు గోరితిని. నన్ను దయతో అనుగ్రహింపుము" అని మహర్షి పాదపద్మములను పట్టుకొనెను. (52–63)

రాజు మాటలు విని దయార్ద్ర హృదయుడగు గౌతముడు ఇట్లనెను – 'రాజా! నీవు భయమును వదలిపెట్టుము. ఇక నీవు నిశ్చింతగా నుండుము. మృత్యుంజయుడగు మహాదేవుడు నిన్ను తప్పక తరింపచేయును. నీ పాపములను నశింపచేయగల ఒక గొప్పతీర్థమును గూర్చి చెప్పెదను వినుము. సమస్త మహాపాతకములను నశింపజేయగలిగెడు విశేషమైన ఒక పవిత్ర క్షేత్రము గలదు. దాని పేరు **'గోకర్ణము'**. అట్టి గోకర్ణమును స్మరించిన చాలును, బ్రహ్మాహత్యాది పాపములు సమసిపోగలవు. అచట మృత్యుంజయుడు, సదాశివుడు నిత్యము నివసించును.

కైలాస శిఖరమునందు లేదా, మందర పర్వతశిఖరమునందు కర్పూర గౌరుడగు శంకరుడు సర్వదా నివసించినట్లుగా, గోకర్ణ క్షేత్రమునందు ఆయన ఎల్లప్పుడు నిత్యసన్నిహితుడై విరాజిల్లుచుండును. అంధకారమును తొలగించి లోకమును ప్రకాశింపజేయుటకు ఒక్క సూర్యునకే సాధ్యము. కాని, ఆ పని అగ్నికి గానీ, చంద్రునకు గానీ సాధ్యము కాదుకదా! అటులే. అన్ని తీర్థములతో పాపములన్నీ నశించి పోజాలవు. సూర్యుడు ఉదయించుటతోడనే చీకటి హరించిపోయినట్లుగా, గోకర్ణక్షేత్రమును దర్శించినంత మాత్రమున పాపములన్నియును పటాపంచలగును. ఒకవేళ సహస్ర బ్రహ్మహత్యాదోషములు గలవారైననూ, గోకర్ణక్షేత్రమునందు ప్రవేశించినంతలోనే వారు శుద్ధాత్ములయ్యెదరు. (64-70)

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు ఇత్యాది దేవతలు సహితము ఇచట తపము నాచరించి కామ్యసిద్ధిని పొందిరి. భక్తిశ్రద్ధలతో ఈ క్షేత్రమునందు జరుపబడు వ్రతములు, జపములు, లక్ష పాళ్ళు అధికముగ ఫలవంతమగునని చెప్పుట కెంతమాత్రము సంశయింపవలసిన పనిలేదు. అది ఎంతో మహత్తరమైన పుణ్యక్షేత్రము. యే చోటనైతే బ్రహ్మాది దేవతలందరు స్వయముగా తపస్సు చేయుదురో, అట్టి పుణ్యక్షేత్రమును గూర్చి ఇంతకంటె అధికముగ ఏమని చెప్పగలను? విష్ణుమూర్తి పనుపును అనుసరించి విఘ్నేశ్వరుడు స్వయముగ ఈ గోకర్ణేశ్వరుని ప్రతిష్ఠించెను. ఈశ్వరుడే గాక, ఈ క్షేత్రమునందు దేవతలందరును వారివారి అంశలతో నిత్యము నివసించెదరు. కావున, భువికి దిగివచ్చిన అపర కైలాసమే ఈ గోకర్ణక్షేత్రము అని నిశ్చయముగ విశ్వసించుము. ఇంకనూ ఈ క్షేత్రమునకు నాలుగు దిక్కుల యందుగల నాలుగు ద్వారముల యందు, ఇతరత్ర గల దిశలందు, ఆయా ప్రదేశములందు యేయే దేవతలు నిత్యము నివసించుచుండెదరో,నీకిపుడు వివరముగ వర్ణించి చెప్పెదను. రాజా! వినుము. బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, విశ్వేదేవతలు, మరుద్గణములు, సూర్యచంద్రులు, అష్టవసువులు తూర్పు ద్వారమునందు ప్రీతితో నివసించి గోకర్ణేశ్వరుని ఆరాధింతురు. అగ్ని, యముడు, చిత్రగుప్తుడు, ఏకాదశరుద్రులు దక్షిణద్వారమునందు వసించి గంగాధరుని అర్చించెదరు. వరుణుడు, గంగాది సర్వ తీర్థములు పశ్చిమ ద్వారమునందు నిలిచి అత్యంత సంతోషముతో సర్వదా చంద్రమౌళీశ్వరుని సేవించుచుందురు. కుబేరుడు, వాయుదేవుడు, భద్రకాళి, అష్టమాతృకలు మున్నగువారందరు ఉత్తరద్వారమునందుండి త్రికాలములందు మహాబలేశ్వరుని పూజించుచుందురు. చిత్రరథుడు, విశ్వావసువు, చిత్రసేనుడు మొదలగు గంధర్వులు నిత్యము ఇక్కడనే నిలచి పరమశివుని సేవించెదరు.(71-80)

ఘృతాచి, రంభా, మేనక, తిలోత్తమ, ఊర్వశి మున్నగు అప్సరసలు మహాబలేశ్వరుని కెదురుగా మహదానందభరితలై నిత్యము నృత్యము చేయుదురు. వసిష్ఠుడు, కశ్యపుడు, కణ్వుడు, విశ్వామిత్రుడు, భరద్వాజుడు, జైమిని, జాబాలి మొదలగు మహాతపస్సంపన్నులగు ఋషీశ్వరులు

అందరు నందివాహనుని నిత్యము కడు భక్తితో పూజించెదరు. బ్రహ్మమానస పుత్రుడు క్రతువు, అంగిరసుడు మున్నగు బ్రహ్మర్షులు గోకర్ణక్షేత్రము నందుండి అతిభక్తితో మహాబలేశ్వరుని పూజించి తపస్సును ఆచరించెదరు. మరీచి, నారదుడు, అత్రి మొదలగు మహామునీంద్రులు, దక్షాది ప్రజాపతులు, నిత్యజ్ఞాన స్వరూపులయిన సనకసనందనాది ఋషివర్యులెందరో ఇచట ఈశ్వరుని ఉపాసించెదరు. సిద్ధులు, సాధ్యులు, మృగ-వ్యాఘ్ర చర్మాంబర ధారులగు యోగీశ్వరులు, దండధారులగు సన్యాసులు, నిర్గుణ బ్రహ్మచారులు ఇంకెందరో త్వక్ - అస్థి - మాత్ర శరీరులై మిక్కిలి భక్తితో ఇచటి చంద్రమౌళీశ్వరుని అర్చించి తీవ్రమైన తపస్సును అనుష్ఠించెదరు. గంధర్వులు, పితరులు, విద్యాధరులు, కింపురుషులు, స్వర్గలోకవాసులగు గుహ్యకులు, కిన్నరులు, శేషుడు, తక్షకుడు మొదలగు నాగులు, పిశాచములు, భేతాళులు ఇంకను ఎందరెందరో నిత్యము ఇచటికి వచ్చి మహాదేవుని పూజించి పోవుచుందురు. పలువిధములైన శృంగారములతో అనేక దివ్యమైన ఆభరణములతో బహు చక్కగా అలంకరించుకొనిన దేవతాగణము సూర్యునివలె ప్రకాశించునట్టి దివ్యవిమానములనెక్కి నిత్యము ఇచటికి చేరుకొందురు. వారందరు మహాబలేశ్వరుని కడు ప్రీతితో ఆరాధించి నమస్కరించి అనేక స్తోత్రములను గానము చేయుదురు. నృత్యములను ఒనర్చెదరు. ఎవరెవరు ఏయే కోరికలను కోరుకొందురో, వారందరును తమ తమ మనోభీష్టములను తప్పక పొందెదరు. రాజా! ఈ బ్రహ్మాండ గోళమునందు గోకర్ణక్షేత్రమువంటి వేరొక క్షేత్రము లేనేలేదు. (81-91)

అగస్త్యాదిమహర్షులు, సనత్కుమారులు, ప్రియవ్రతాది రాజకుమారులు, అగ్నిదేవుడు, మన్మథుడు అక్కడ తపస్సు చేసి వరములను పొందిరి. మణినాగమను పేరుగల నాగుడు ఈ మహాబలేశ్వరుని దర్శించుటచే అతనిని గరుత్మంతుడు కన్నెత్తి చూచుటకు కూడా సాహసింపడు. రావణుడు, కుంభకర్ణుడు మొదలగు రాక్షసులందరు ఈ క్షేత్రమునందే తపస్సును చేసి అభీష్టవరములను సాధించిరి. దేవదానవులందరును ఇచట తపస్సును ఒనరించి, తమతమ పేరిట లింగములను ప్రతిష్ఠించిరి. బ్రహ్మ, విష్ణు, వినాయకులు తమ పేరుతో లింగములను ప్రతిష్ఠించిరి. ధర్మక్షేత్రపాలకులు, దుర్గాది శక్తిదేవతా బృందము ఈ క్షేత్రమునందు లింగప్రతిష్ఠను గావించిరి. కార్తవీర్యుడును ఒక లింగమును ప్రతిష్ఠించెను. గోకర్ణక్షేత్ర మహిమ అతి గహనమైనది. దానిని పూర్తిగా తెలియుట అసాధ్యము. ఇచట అసంఖ్యాకమైన లింగములు, తీర్థములు ఎన్నియో గలవు. ఏమని చెప్పగలను? ఈ పవిత్ర క్షేత్రమునందుగల రాళ్ళన్నీ లింగములే. ఇచటి జలమంతయునూ తీర్థమే.

కృతయుగమునందు మహాబలేశ్వరుడు శ్వేతవర్ణమును గలిగియుండును. అటులే త్రేతాయుగమునందు లోహితము అనగా ఎరుపు వర్ణమును, ద్వాపర యుగమున పీతవర్ణము అనగా సువర్ణచ్ఛాయను, కలియుగమునందు కృష్ణవర్ణము అనగా నలుపురంగును గలిగి మిక్కిలి

తేజోవంతుడై ప్రకాశించుచుండును. పాతాళాది సప్తలోక పర్యంతము నుండి పైకి నిటారుగా నిలువబడియున్న మహాబలేశ్వర లింగము కలియుగమున మృదువుగా అయి సూక్ష్మరూపమును చెంది గోచరించుచున్నది. (92-102)

అత్యంత మహిమాన్వితమైన గోకర్ణక్షేత్రము పశ్చిమ సముద్ర తీరమునందుగలదు. అది బ్రహ్మహత్యాది పాపములనే కాదు; దుశ్శీల, దురాచార, పరస్త్రీ, పరపురుష గమనాది పంచమహాపాతకములను సైతము దర్శనమాత్రముచేతనే నశింపచేయును. గోకర్ణ లింగేశ్వరుని దర్శనముతో మానవులు సమస్త కోరికలను సిద్ధింపచేసికొందురు. వారి జన్మములు పునీతములు అగును. అంతిమ కాలమున వారికి ఉత్తమగతి ప్రాప్తించును. పుణ్యదివసము నందు ఎవరైతే అచటికి వెళ్ళి అత్యంత భక్తిభావముతో పరమేశ్వరుని అర్చించెదరో, వారికి రుద్రవంశము సిద్ధించును. ఏదో ఒక సమయమునందు ఆ క్షేత్రమునకు వెళ్ళి చక్కని భక్తిప్రపత్తులతో సదాశివుని పూజించిన వారికి బ్రహ్మపదము లభించును. ఆది, సోమ, బుధవారములయందు, అమావాస్యాది పర్వకాలములయందు సముద్రస్నానమును చేసి దానధర్మములను ఆచరింపవలయును. శివపూజావ్రతములు, హోమహవనాదులు, జపతపములు, బ్రాహ్మణ సంతర్పణము వంటి పవిత్ర కార్యములను ఎంత స్వల్పముగ జేసిననూ అనంతపుణ్యరాశి లభింపగలదు. వ్యతీపాతాది యోగములందు, సూర్యసంక్రమణములందు, త్రయోదశినాటి ప్రదోషములందు పూజించువారికి అపారమైన పుణ్యఫలము లభించితీరును. అచటి మహిమ వర్ణనాతీతము. అమాయక చక్రవర్తియగు ఆ మహాదేవుడు అల్పమైన పుణ్యకార్యమునకే అత్యంత సంతృప్తిని చెంది మిక్కిలి ప్రసన్నుడై కావలసిన వరములన్నింటిని ప్రసాదించును. మాఘమాసము కృష్ణపక్షము నందలి చతుర్దశినాడు సంఘటించెడు "మహాశివరాత్రి" పర్వదివసమునందు ఒక్క బిల్వదళమును సమర్పించి పూజించినవారికి లభించెడు పుణ్యముతో సమానమైన పుణ్యము ముల్లోకములందు ఎందుననూ కడు దుర్లభము. ఇంతటి అనుపమానమైన పవిత్ర క్షేత్రముండగా, అది తెలిసికూడా మూర్ఖజనులు అచటికి పోజాలకున్నారు. శివరాత్రులందు, శివతిథులయందు ఈ క్షేత్రమహిమ అత్యధికముగ నుండును. గోకర్ణలింగ సన్నిధిలో ఉపవాస జాగరణాదులను చేయువారికి స్వర్గసోపానములను నిర్మించుకొనినట్లే యగును. అయితే, చెవిటివానిముందు శంఖమూదినట్లుగా మూఢులు, మూర్ఖులు, పాపప్రతిబంధకముగల జనులకు మాత్రము ఇంతటి మహిమాన్వితమైన క్షేత్రమాహాత్మ్యమును వినగల భాగ్యము యెంతమాత్రము ఘటింపదు. ఇట్టి గోకర్ణక్షేత్రమునకు యాత్ర చేయు సంకల్పము గలిగిన వారికి, యాత్రను పూర్తి చేసినవారికి చతుర్విధ పురుషార్థములు ప్రాప్తించుకొను యోగ్యత లభించును. ఇట్టి క్షేత్రమునకు వెళ్ళి అక్కడగల సమస్త

తీర్థములందు స్నానములను జేసి, మహాబలేశ్వరలింగమును త్రికరణశుద్ధిగా పూజించువారికి సమస్త పాతకములు వెంటనే నశించితీరును" అని గౌతమమహర్షి చెప్పెను. గౌతముని మాటలను మిక్కిలి ప్రేమభక్తి పురస్సరముగా వినిన **కల్మాషపాదుడను రాజు తిరిగి యిట్లు ప్రశ్నించెను** – "మహానుభావా! గౌతమ మునీంద్రా! ఇంతవరకు గోకర్ణక్షేత్ర మహిమను ఎంతో గొప్పగా వివరించి చెప్పితిరి. దానిని శ్రవణము జేసిన నేను కృతకృత్యుడనైతిని. తద్వారా మీ అనుగ్రహ పాత్రుడను కాగలిగితిని. అయ్యా! మీరు సెలవిచ్చినట్లుగా ఇంతకు పూర్వము ఈ అపూర్వ క్షేత్రమునకు వెళ్ళి తాము చేసిన పాతకములను పరిహరింప చేసికొని తరించినవారు ఎవరైన గలరా? ఉంటే వారికి ఎట్టి అనుభవము లభించెను? అట్టి విషయమును సాంగముగ తమరివలన తెలిసికొని, నేను కూడా గోకర్ణమునకు వెళ్ళి, తరించెదను. కావున, స్వామీ! కరుణించి నాకు విశదముగా వివరించుమని ప్రాధేయపూర్వకముగా గౌతముని చరణసరోజములను వినమ్రుడై పట్టుకొనెను. **అంతట గౌతమ మునీశ్వరుడు ఇట్లు చెప్పసాగెను** – (103-119)

"రాజా! గోకర్ణక్షేత్రమును, అందలి మహాబలేశ్వరుని నేనెంతో కాలము నుండి బాగుగా యెరుగుదును. అచట నాకు విచిత్రములగు దర్శనములు అపారముగ గోచరించినవి. అయితే చాలా కాలము క్రితము ఒకసారి నేనే స్వయముగ గోకర్ణమునకు యాత్రగా వెళ్ళితిని. అప్పుడు నేను అచట నా కళ్ళతో స్వయముగా దర్శించిన ఒక విశేష సంఘటన గూర్చి నీకు తెలియజేసెదను. నీవు సమాధానచిత్తుడవై శ్రద్ధగా వినుము–

ఒకనాటి మధ్యాహ్నవేళ విశ్రాంతిగ నేనొక చెట్టు నీడలో కూర్చొని యుంటిని. దూరమునుండి ఒక చండాల స్త్రీ వచ్చుచుండుటను గమనించితిని. ఆమె వృద్ధురాలు పైగా అంధురాలు. ఇంకనూ రోగగ్రస్తురాలు. అదిగాక, కుష్ఠువ్యాధి కూడా కలిగియున్నది. ఆ వ్యాధి శరీరమంతటా వ్యాపించి, భయంకరముగ చీము, నెత్తురు కారుచున్నవి. కట్టుకొనుటకు నిండైన వస్త్రము కూడా లేని హీనస్థితిలో ఉన్నది. తినుటకు ఆహారము లేక ఆకలిబాధచే శుష్కించిన శరీరమును కలిగి, పాలిపోయిన ముఖముతో తూలిపడుచున్నది, కాని, కర్రసాయముతో, నిలదొక్కుకొని నెమ్మది నెమ్మదిగా అడుగులు వేయుచు, ఆ వృద్ధురాలు ముందునకు వచ్చుచుండెను. ఆమె ఒక వైపు కుష్ఠురోగముతో బాధపడుతూ మరొకవైపు గండమాల (వ్యాధి) పెరిగి గొంతు కఫముతో నిండిపోయి, దంతములు ఊడిపోయిన బోసినోటితో మాటలు రాని నిస్సహాయ స్థితిలో యుండెను. ప్రచండ సూర్యకిరణముల తాకిడికి మిగుల తాపము నొంది ఆమె ప్రాణములు అల్లాడిపోవుచుండెను. తీవ్రమైన

అతిసారవ్యాధి సోకి దాని బాధను భరించలేక దేహమంతటా వ్యాపించిన తీవ్రమైన నొప్పులతో తాళలేక ఆ ముదుసలి స్త్రీ చెప్పనలవిగాని దుఃఖమును అనుభవించుచుండెను. వితంతువగుటచే శిరమున కేశములు లేకుండెను. మరణోన్ముఖురాలైనట్లుగా కన్పట్టుచుండెను. క్రింద పడుచూ, లేచుచూ ఆ చండాల వనిత నెమ్మదిగా ఒక చెట్టునీడను చేరినది. అంతే! మరణకాలము ఆసన్నమైనందున కఫము ప్రకోపించి మృత్యుబాధకు గురియై నిలువలేక నేను కూర్చొనియున్న చోటునకు కొలదిదూరమున నేలమీద పడిపోయి ప్రాణములను వదలెను. ఆమె మృతి నొందిన తత్క్షణమే ఆకాశమునుండి దివ్యమైన ఒక విమానము వచ్చి దిగినది. అందులో నుండి నలుగురు శివదూతలు తమ చేతులలో త్రిశూలములను, ఖట్వాంగములను, శిరమున చంద్రవంకతో కూడిన కిరీటములను, కర్ణకుండలములను ధరించి సూర్యసమతేజోభాసమానమగు విమానము నుండి దిగివచ్చి, ఆమెను సమీపించిరి. అప్పుడొక అపూర్వమైన సన్నివేశము జరిగెను. రాజా! దానిని వినుము– (120–130)

ఆ శివదూతలను జూచి నేను అత్యంత ఆశ్చర్యమునకు లోనైతిని. వెంటనే వారిని సమీపించి – “మహానుభావులారా! మీరు ఏ కారణమున ఇచటికి వచ్చితిరి?” అని ప్రశ్నించితిని. అందుకు ఆ శివదూతలు – “ఈ చండాల స్త్రీని తీసికొని పోవుటకే మేము వచ్చితిమి” అని చెప్పిరి. వారి మాటలు వినిన నా మనసు అత్యంత విస్మయమునొందెను. నాకు దిగ్భ్రాంతి కలిగెను. మిక్కిలి ఆశ్చర్యముతో తిరిగి వారినిట్లు ప్రశ్నించితిని –

“ఏమేమి? ఈ నీచమైన చండాల స్త్రీకి, ఈ పాపరాశికి విమానమును యెక్కు యోగ్యతయా? బాగు, బాగు – శునకమును కనకపు సింహాసనమున కూర్చుండబెట్ట తగునా? ఇదేమి చోద్యము. ఈమె పుట్టిన నాటినుండి ఘోరపాతకములను మూటకట్టుకొనిన దురాచారిణి, పరమ పాపాత్మురాలు. నిరంతరము దుర్వృత్తిని గలిగిన ఇంతటి చండాల స్త్రీని కైలాసమునకు ఎట్లు తీసుకొని వెళ్ళగలరు? ఈమెకు శివుడంటే ఎవరో తెలియదు. జ్ఞానహీనురాలు. తపోసాధనలేవీ చేయలేదు. దయ, సత్యములను గూర్చిన పరిచయము సున్న. ఇట్టి ఈమెను మీరెట్లు తీసికొనిపోవుదురు? ఈమెకు పశుమాంసమే ఆహారము. నిరంతరము జీవహింసను చేయుటయే వృత్తిగా గలిగిన దుష్టురాలు. కుష్ఠురోగ బాధితురాలు. ఇట్టి ఈమెకు స్వర్గలోకము యెట్లు సిద్ధించును? ఈమెకు శివపూజ తెలియదు. పంచాక్షరీజపము యెరుగదు. శివ–శివయని యేనాడూ శివనామస్మరణము కూడా చేయలేదు గదా! అట్టి ఈమెను మీరు తీసికొనిపోవుటెట్లు? శివరాత్రినాడు ఉపవాసము గానీ, ఒక్క దానమునుగానీ, యజ్ఞమునుగానీ ఏనాడూ చేయలేదు గదా! ఈమెకు సద్గతి కలుగుటెట్లు? ఏ తీర్థమునందుగాని, ఏ పర్వకాలమునందుగాని,

ఈమె యెన్నడునూ స్నానము చేయుట యెరుగదు. ఏ వ్రతమును ఆచరింపలేదు గదా! తీర్థయాత్ర అంటే ఏమిటో తెలియని ఈ పాపికి సద్గతి లభించుటయా? ఈమె దేహమంతటా కుష్ఠువ్యాధి వ్యాపించి చీము, రక్తము కారుతూ దుర్గంధభూయిష్ఠమై జుగుప్సాకరముగ నున్నది. ఇక జన్మాంతర సుకృతమేమైన నున్నదియా? అని చెప్పుట కెంతమాత్రము వీలులేదుగదా!" **"జన్మాంతర కృతం పాపం వ్యాధిరూపేణ బాధతే"** అను శాస్త్రవచనమును అనుసరించి, ఈమెకు పూర్వజన్మార్జిత పాతకము వలననే గదా! ఈ దుస్థితి దాపురించినది. ఈ జన్మలో జన్మించినది మొదలుకొని తుది శ్వాస విడుచువరకు సర్వాంగములు కుష్ఠురోగముతో అలుముకొని, పురుగులు పడి చీము నెత్తురు స్రవించుచుండ ప్రబలమైన దుఃఖబాధను అనుభవించుచుండెను. పై శాస్త్ర వాక్యమునకు బలమైన సాక్ష్యముగ ఈమె జీవితమే కన్పట్టుచున్నది గదా! ఎట్టి యోగ్యతయు కనిపించని నీచురాలగు ఈ పాపాత్మురాలిని మీరు విమానమునందు కూర్చుండపెట్టుట యెట్లు? కైలాసమునకు తీసికొనిపోవుటెట్లు? ఇట్టి స్థితిలో ఈమె వద్దకు మీరేల వచ్చితిరో? నాకు బోధపడుటలేదని" నేను వారిని ప్రశ్నించితిని. అందుకు ఆ శివదూతలు ఆ చండాల స్త్రీని గురించిన పూర్వాపరములన్నియును పూర్తిగా వివరించిరి. రాజా! మిక్కిలి ఆశ్చర్యమును గొల్పునట్టి విచిత్రమైన ఆ కథను వారి మాటలలోనే నీకు వినిపించెదనని ఇట్లు చెప్పసాగెను - (131-144)

శివదూతలు గౌతమఋషితో ఇట్లు చెప్పిరి - "గౌతమఋషీశ్వరా! ఈమె పూర్వవృత్తాంతమును చెప్పుచుంటిమి. తాము వినగలరు. పూర్వజన్మమునందు ఈమె ఒక బ్రాహ్మణ కుటుంబమున కన్యగా జన్మించెను. ఆమెకు తల్లిదండ్రులు "సౌదామిని" అని నామకరణమొనర్చిరి. ఆమె పూర్ణచంద్ర బింబమువంటి ముఖమును గలిగి, అపురూపమైన అందచందములను కలబోసి తీర్చిదిద్దిన పుత్తడిబొమ్మవలె యుండెను. పెరిగి పెద్దదియగుచుండెను. ఇంతలో యుక్తవయస్సు వచ్చినదని తమ కూతురుకు వివాహము చేయుటకు ఆమె తల్లిదండ్రులు సంకల్పించిరి. తగిన వరునికొరకై వెదకసాగిరి. కాని, ఆమెకు సరియైన వరుడు లభింపకపోయెను. వెదకి వెదకి వేసారి ఏమి చేయుదమని చింతింపసాగిరి. ఇంతలో ఆ కన్యకు పది సంవత్సరముల వయసు దాటిపోవుచున్నదని ఒక బ్రాహ్మణ కుమారునకు ఇచ్చి వివాహము చేసిరి. పిమ్మట భర్తతో పాటుగా వెళ్ళి అత్తవారింటిలో ఆ అమ్మాయి కాపురము ఉండసాగెను. కొంతకాలము గడచిన మీదట ప్రారబ్ధవశమున ఆమె భర్త వ్యాధిగ్రస్తుడై మరణించెను.(145-149)

అనంతరము తల్లిదండ్రులు కూతురును ఓదార్చి తమ ఇంటికి తెచ్చి పోషించుచుండిరి. భర్త మరణమునకు సౌదామిని ఎంతయో వ్యధ చెంది మిగుల దుఃఖించుచుండెను. తల్లిదండ్రుల సాంత్వన వాక్యములను విని కొంత ఊరట చెంది ధైర్యమును వహించి ఆమె కాలము గడుపుచుండెను. నిండు యౌవనములో అడుగిడిన సౌదామిని మనసులో మదనుడు ప్రవేశించి మనోవికారములను కలిగించుచుండెను. పరపురుషులను చూచి ఆమె మనస్సు చంచలమగుచుండెను. మన్మథుని బాధకు తాళలేక పరపురుషులను కామించి కడు గుప్తముగ వ్యభిచరింపసాగెను. కాని, కొంతకాలమునకు ఆమె గోప్యముగ సాగించుచున్న మహాపాపము బహిర్గత మయ్యెను. యౌవన ప్రాయములో నున్న అందాలరాశియగు ఆ వితంతు స్త్రీ యొక్క మనస్సు కామాతురయై అతి చాంచల్యమునకు గురియైనది. **"కామాతురాణాం న భయం న లజ్జా"** అను రీతిగా ఆమె వ్యభిచారము మితిమీరిపోయెను. అది తెలిసిన సౌదామిని తల్లిదండ్రులు, బంధువులందరునూ కులటగా భావించి ఆమెను తమ గృహమునుండి బహిష్కరించిరి. అనంతరము ఆమెవలన కలిగిన పాపమును పరిహరించుకొనుటకై ప్రాయశ్చిత్తాదులను చేసికొని శుద్ధులైరి. మొదట సందేహించినప్పటికినీ బంధువులు బహిష్కరించిన పిమ్మట, ఆమె నిర్భయముగ సిగ్గు విడిచి నగరములో తిరుగుచు బాహాటముగనే రమింపసాగెను. ఆ తర్వాత ఆ నగరమునందే గల అందగాడైన ఒక శూద్ర యువకుని చూచి మోహించి అతనికి ఉంపుడుగత్తెగా ఉండసాగెను. ఈవిధముగ ఆ శూద్రుని ఇంట నివసించుచుండెను. మద్యమాంసములను భక్షించుచుండెను. వేశ్యగ మారిన దురాచారిణి, మహాపాపిని యగు ఆ విప్రవనిత తమ వంశమునకు చెందిన నలుబది రెండు తరముల వారిని భ్రష్టపరచిన కులవైరిగా మారెను. (150-158)

శ్లో॥ స్త్రియః కామేన నశ్యంతి బ్రాహ్మణా హీనసేవయా । రాజానో బ్రహ్మదండేన యతయో భోగసంగ్రహాత్ ॥ (159)

అనగా – స్త్రీలు కామముతో నశించెదరు. బ్రాహ్మణులు నీచులను సేవించుటచే భ్రష్టులయ్యెదరు. రాజులు బ్రాహ్మణులను దండించుటవలన సమసిపోయెదరు. యతులు – సన్యాసులు విషయవాంఛవలన – సుఖసామగ్రిని ప్రోగుచేయుటవలన దుర్గతిపాలయ్యెదరు. (160)

ఇక ఆ సౌదామిని యను కులట శూద్రుని ఇంటిలో అత్యంత ఆనందముతో నివసించుచు అహోరాత్రములు అతనితో రమించుచుండెను. అతని వలన ఆమెకొక పుత్రుడు కూడ జన్మించెను. ప్రతినిత్యము మాంసాహారమును భుజించుచు, మద్యపానమును సేవించి ఉన్మత్తురాలగుచుండెను. ఒకనాటి సాయంకాలము ఆమె బాగుగా మద్యమును సేవించి, మిగుల మదించి యుండెను. ఆహారము నిమిత్తముగ చీకటిలో పశువుల

పాకలో ప్రవేశించెను. మత్తులో పడిన ఆమె మేక అను భ్రాంతితో ఆవుదూడ తలను నరికి దాని మాంసమును ఆహారముగా వంట చేసెను. అయితే, ఆ దూడ తలను మాత్రము మరునాడు భుజింపవచ్చునని ఒక ఉట్టియందు భద్రపరచెను.

తెల్లవారగనే నిదురనుండి మేల్కొనిన ఆమెకు మైకము తగ్గెను. వెంటనే, పాలు పితుకుటకై ఆవును సమీపించి దూడకోసము వెదకగా, మేక కనిపించెను. కాని, లేగ కనిపించలేదు. పశువుల దొడ్డినంతటా, ఇంటిలో, బయట యెంత వెదకిననూ దూడ జాడ కన్పట్టలేదు. ఎంతయో కలత చెందిన ఆమెకు రాత్రి తలను దాచిపెట్టిన సంగతి గుర్తుకు వచ్చెను. వెంటనే వేగిరముగ వెళ్ళి ఉట్టియందు చూడగా, అది లేగతల యని స్పష్టమయ్యెను. సహజముగనే హృదయము ద్రవించి కన్నీరు కార్చుచు పశ్చాత్తాపమును చెంది "శివ-శివ-చంద్రమౌళీ" నేనెంత పని చేసితిని. నా అజ్ఞానము వలన ఎంతటి పాపకృత్యము జరిగిపోయెనో కదా!" అని ఆ దుష్టాత్మురాలు మిగుల దుఃఖించెను. భర్త చూచి కోపగించునని భావించి ఆ దూడ తలను, యెముకలను నేలను త్రవ్వి పాతిపెట్టెను. "అయ్యో! రాత్రి పులి వచ్చి దూడను తినివేసినదని" ఇరుగుపొరుగు వారికి వినిపించునట్లుగా బిగ్గరగా అరిచి రోదింపసాగెను. అటులే భర్తముందు కూడా రోదించెను. అందరునూ నిజమనుకొని నమ్మి ఆమెను ఓదార్చిరి. మరికొంతకాలము శూద్రుని ఇంటిలోనే ఉండి ఒకనాడు ఆయువు దీరి ఆమె చనిపోయెను. వెంటనే యమదూతలు వచ్చి ఆమెను తీసికొనివెళ్ళి రౌరవాది నరకములందు త్రోసివేసిరి. భయంకరమైన నరకయాతనలు అనుభవించిన మీదట, తిరిగి ఆమె చండాల జాతిలో స్త్రీగా జన్మించెను.(161-171)

ఆమె కాటుకవంటి నల్లని రంగును గలిగి కబోది (పుట్టు గ్రుడ్డి) గా పుట్టెను. మాయామోహముతో తల్లిదండ్రులు కొంతకాలము ఆమెను కష్టముతో పెంచి పోషించిరి. దివారాత్రములు యెంగిలి అన్నమును, మాంసాహారమును ఆమెకు తినిపించెడివారు. ఆవిధమైన పోషణతో పసితనమునందే ఆమె దేహము పూర్తిగా అస్తవ్యస్తమై పోయెను. ఇట్లుండగా, కొలది కాలమునకు ఆమె శరీరము కుష్ఠువ్యాధిగ్రస్తమాయెను. అనంతరము తలిదండ్రులు మరణించిరి. కురూపియై కుష్ఠురోగము సోకిన ఆమెను అసహ్యముతో సోదరులు, బంధువులు అందరును త్యజించివేసిరి. నిరాశ్రయురాలై, ఆహారము లభింపక అంధత్వముతో అలమటించుచుండెను. గత్యంతరము లేక బిచ్చమెత్తుకొనుచు ఎవరేమి యిచ్చినను దానినే స్వీకరించి భుజించుచుండెను. కాని, కడుపునిండ ఒక్కనాడైన ఆహారము లభింపక ఆకలితో నకనకలాడుచు, కట్టుకొనుటకు సరియగు గుడ్డయును లేక కడు కష్టముతో జీవించుచుండెను. రానురాను వ్యాధి అధికమయ్యెను. తద్వారా చీము, నెత్తురు స్రవించి ఆమె శరీరమంతయు దుర్గంధభూయిష్ఠమయ్యెను. ఇంతలో ఆమెను వృద్ధత్వము ఆవహించెను. (172-179)

ఇట్లుండగా ఒకమారు మాఘమాసము వచ్చెను. జనులందరు తమ భార్యాబిడ్డలతో, బంధుమిత్రులతో కలిసి మహాశివరాత్రి పర్వమున మహాబలేశ్వరుని దర్శించి తరించు నిమిత్తము గోకర్ణమహాక్షేత్రమునకు యాత్రగా పోవుచుండిరి. దేశదేశములనుండి నాలుగు వర్ణములకు చెందిన భక్తజనులు అసంఖ్యాకముగ వచ్చుచుండిరి. భూమండలము నందలి అనేక దేశములకు చెందిన రాజులు గుర్రముల, ఏనుగుల రథముల నెక్కి మహాబలేశ్వర లింగదర్శనమునకై చేరుచుండిరి. సమస్త ప్రజలు శివరాత్రికి గోకర్ణేశ్వరుని దర్శించుటకై బయలుదేరి మహోత్సాహముతో వివిధ వాయిద్యములతో పెద్దగా శివనామ సంకీర్తన మొనర్చుచూ, నృత్యము సల్పుచు భక్తిభావముతో పరవశించి, ఆనందకేళిగా యాత్రను చేయుచుండిరి. కొందరు భిక్షుకులు కూడా మహాజనసందోహముతో కలిసి వెళ్ళినచో మార్గమున గానీ, క్షేత్రమునందుగానీ మంచి భిక్ష లభించునను ఆశతో వారిని అనుసరించి పోవుచుండిరి. ఈ చండాల స్త్రీకి కూడా పూర్వజన్మమునందు శివనామస్మరణ మొనర్చిన సుకృతమునకు తగిన ఫలవంతమైన కాలము ఆసన్నమయ్యెను. అందుచేత తాను కూడా భిక్షార్థమై గోకర్ణ క్షేత్రమునకు వెళ్ళవలయునను తలంపు కలిగెను. కావున, భక్తజనుల, తోటి భిక్షుకుల వెంట ఆమె అనాయాసముగ గోకర్ణక్షేత్రమును చేరుకొనెను. దారిలో జనులను ఆహారమునకై యాచించుచు, నడువలేక క్రింద పడిపోయినప్పుడు దీనముగ రెండు చేతులను చాచి "అయ్యలారా! అమ్మలారా! తమ చేతి సాయమును అందించి దయతో లేపమని" ప్రార్థించుచుండెను.

గోకర్ణక్షేత్రమును ప్రవేశించిన పిమ్మట యాత్రికులు వెళ్ళుమార్గమున కూర్చొని కళ్ళు లేక, కాళ్ళతో నడచుటకు అసమర్థురాలై, తన దుర్దశను తలపోయుచు **ఈవిధముగా ఆక్రందించుచుండెను** – "పుణ్యాత్ములైన యాత్రికులారా! పాపాత్మురాలను, గత జన్మలో నేను చేసికొనిన పాపమే నన్ను ఈవిధముగా పట్టి పీడించుచున్నది. ఆకలి బాధించుచున్నది. ఏదేని భిక్షము వేయుడు. కట్టుకొనుటకు గుడ్డలు లేక దుమ్ములో పడియుంటిని. ఒక వస్త్రమును దయచేయుడు. కనులు లేని కబోదిని. దేహమంతటా కుష్ఠు వ్యాపించి తీవ్రబాధను అనుభవించుచుంటిని. జఠరాగ్ని మండుచున్నది. ఆకలిబాధచే అలమటించి ప్రాణములు పైపైనే పోవునట్లున్నవి. గడచిన వందజన్మల నుండి ఏ పుణ్యకార్యమును చేయనట్లున్నది! అందుకే ఇంతటి ఘోరమైన పీడను అనుభవించుచుంటిని. అయ్యా! భక్తజనులారా! పుణ్యాత్ములారా! ధర్మము చేయుడు. దానము నీయుడు" అని తన ఘోరమైన దుర్దశను ప్రకటించుచు దీనముగ ఆక్రోశించుచూ దారిన వెళ్ళే జనమును యాచించుచుండెను. ఆ రోజు శివరాత్రి యగుటవలన ఎవరు ఏమియూ భిక్షము వేయరైరి. ఆమె అటులే ఆకలికొరకు భిక్ష వేయుమని మొరపెట్టుచుండెను. కొందరు

నవ్వుచూ "ఈ రోజు ఉపవాసము కనుక అన్నమెట్లు లభించును?" అని వెళ్ళిపోవుచుండిరి. ఇంతలో ఒక వ్యక్తి మాత్రము పూజకొరకై తీసికొనిపోవుచున్న కొన్ని బిల్వదళములను ఆమె చేతిలో వేసెను. వాటిని చేతితో తడిమి, వాసన చూచి "ఇది తినుపదార్థము కాదే" యని కోపగించి విసిరి పారవేసెను. ఆ బిల్వదళములు దైవయోగమున ఆమె దరిదాపునగల ఒక శివలింగము మీద పడెను. తద్వారా ఆమెకు ఆనాటి రాత్రి ఊహాకందని చందమున శివపూజ ఘటించెను. ఎవ్వరూ భిక్షము వేయనందున ఆమెకు ఆనాడు ఉపవాసము చేయుట తటస్థించెను. ఆకలితో నిద్రపట్టనందున జాగరణము చేసిన పుణ్యఫలము దక్కెను. ఈ కారణమున దయాసాగరుడైన పరమేశ్వరుడు ఆమె యెడల మిగుల ప్రసన్నుడయి ఆమెను భవసాగరమునుండి తరింపచేయుటకు అనుగ్రహించెను. (180-198)

ముందురోజు ఉపవసించుటవలన మరునాడు ఉదయమే భిక్షను యాచించుటకై తాను ఉన్నచోటు నుండి లేచుటకు ప్రయత్నించెను. ముందే గ్రుడ్డిది. అందులో భయంకర కుష్ఠురోగి. ఆహారము లభింపక వృద్ధాప్యదశలో మగ్గుచున్న ఆ స్త్రీ శక్తిహీనురాలై లేవలేక, నడవలేక చేతికర్ర సాయముతో నెమ్మది నెమ్మదిగా అడుగులు వేయసాగెను. సూర్యకిరణముల తాపముచే ఆమెకు దుర్భరమైన దుఃఖము కలిగెను. పూర్వార్జిత కర్మలు ఈ రీతిగనే యుండునని" **ఆ దూతలు గౌతమునితో చెప్పి మరల వారు ఇట్లనిరి** - "ఈ చండాల వృద్ధ వనిత అతికష్టముగ లేచి పడుచు దైవకృపచే మీరున్న చెట్టు సమీపమునకు వచ్చి ప్రాణములను వదలిపెట్టెను. వెంటనే, ఈమెను తీసికొనివెళ్ళుటకై పరమేశ్వరుని అనుజ్ఞవలన మేము వచ్చితిమి. దైవయోగముచేత నేటి శివరాత్రియందు ఈమెకు అన్నము లభింపక ఉపవాసము ఘటించెను. తెలియక వేసిన బిల్వపత్రములతో శివపూజ సిద్ధించెను. రాత్రి జాగరణము కూడ తటస్థించెను. ఈ ప్రకారముగా ఈమె పుణ్యమును సంపాదించినదాయెను. ఇట్టి పుణ్యమువలన ఈమె యొక్క శతజన్మార్జిత పాపరాశి భస్మీకృతమయ్యెను. వెంటనే భోళాశంకరుడు కనికరించి మమ్ములను పంపెను" అని పలికిన ఆ శివదూతలు ఆమెమీద అమృతమును ప్రోక్షించిరి. తద్వారా, ఆమెయు దివ్యదేహమును ధరించెను. అంతట, ఆ దూతలు ఆమెను విమానమునందు అధిష్ఠింపచేసి శివలోకమునకు తీసికొనివెళ్ళిరి. రాజా! ఇదంతయును నేను నా కళ్ళారా చూసిన విషయమును నీకు సవిస్తరముగ వివరించితినని" గౌతముడు పలికి, **వెంటనే ఇట్లనెను** - "ఓ రాజా! నీవు వెంటనే గోకర్ణమునకు పొమ్ము. అచటికి చేరిన వెంటనే నీ బ్రహ్మహత్యాపాపము తప్పక నశించిపోవును. అనంతరము ఇహపర సౌఖ్యములను పొందెదవు. నా మాటలు విశ్వసింపుము. ఇక ఎంతమాత్రము సంశయింపవలసిన పనిలేదు" అని గౌతముడు రాజుతో విశ్వసనీయముగ పలికెను. (199-207)

గౌతమమునీశ్వరుని మాటలు విని రాజు మిగుల సంతోషమును పొంది, మహర్షి పాదములకు వందనము చేసి వెంటనే బయలుదేరి గోకర్ణక్షేత్రమును చేరెను. అచట కడుభక్తిభావముతో మహాబలేశ్వరుని పూజించెను. వెంటనే అతని బ్రహ్మాహత్యాపాతకము అదృశ్యమయ్యెను. ఇతర పాపములన్నియును ఈశ్వరుని కృపచేత పటాపంచలయ్యెను.

కావుననే, గోకర్ణక్షేత్రము ఇంతటి మహామహిమాన్వితమైనదిగను, పరమపవిత్రమైనదిగను మిక్కిలి వాసిగాంచెను. అందుచేత శ్రీపాదశ్రీవల్లభుల వారు ఇచట కొంతకాలము గోప్యముగ నివసించిరని ఈ వృత్తాంతమునంతయును సిద్ధముని నామధారకునితో చెప్పెను. ఇట్టి సిద్ధ–నామధారకుల సంవాదమును, శ్రోతలు నిశ్చలచిత్తముతో చదివి, విని తరించగలరని సరస్వతీ గంగాధరుడు శ్రీగురుచరిత్రమును విస్తృతముగ వివరించి గ్రంథరూపమున లోకమునకు అందించెను. (208–210)

ఇది శ్రీ గంగాధర–సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "గోకర్ణ మహిమా వర్ణనము" అను ఏడవ అధ్యాయము ॥ (7)

॥ జయ గురుదత్త – శ్రీగురుదత్త ॥

(ఓవీలు – 210; మొత్తము సంఖ్య – 857+210 = 1067 ఓవీలు).

-::: (సప్తాహపారాయణ క్రమము (1) మొదటిరోజు విరామము) :::-

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

॥సర్వం శ్రీ శ్రీపాద శ్రీవల్లభ – శ్రీనృసింహ సరస్వతీ – శ్రీగురుదత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

॥ హరయే నమః ॥

◆ ◆ ◆

నమో నమస్తే జగదేకనాథ – నమో నమస్తే సుపవిత్రగాథ ।
నమో నమస్తే గతా మధీశ – నమో నమస్తేఽస్తు పరావరేశ ॥

(శ్రీవాసుదేవానంద సరస్వతీ కృతం – శ్రీదత్త ప్రార్థనా తారావళి – శ్లో.2)

శ్రీ గురు చరిత్ర

ఎనిమిదవ అధ్యాయము

శని ప్రదోషవ్రత మాహాత్మ్యము - శ్రీపాదశ్రీవల్లభులు కురువపురమును చేరుకొనుట - ఒక మూర్ఖ బ్రాహ్మణుని యెడల శ్రీగురుకృపా ప్రభావము.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునీంద్రునకు నమస్కరించి ఇట్లనెను - "గురువర్యా! మీరు ఇంతవరకు గోకర్ణ మహిమను చక్కగా వివరించి చెప్పితిరి. అచట శ్రీపాదశ్రీవల్లభులు ఎంతకాలము ఉండిరి. ఆ తర్వాత ఏమి జరిగినది. దానిని గురించి వివరించగలరని ప్రార్థన. గురుమూర్తీ! కృపాసింధూ! మీరు విపులముగా శ్రవణము చేయించుచున్న గురుచరిత్రను వినిన నాకు ఎంతో మహదానందము కలుగుచున్నది. తదుపరి ఏమి జరుగును? గురుమహిమ ఇంకెంత గొప్పగా ఉండును? అను జిజ్ఞాసతో అంతకంతకు నాలో ఉత్కంఠ పెరుగుచున్నది. కావున, తాము దయతో తదుపరి గురుచరిత్రము నందలి కథా వృత్తాంతమును వినిపించవలసినదని ప్రార్థించుచున్నాను" అని పలికిన శిష్యుడైన నామధారకుని మాటలను వినిన సిద్ధముని మిగుల సంతసించి అనంతర కథను ఈవిధముగా చెప్పుచుండెను. (1-3).

శ్రీపాదశ్రీవల్లభుల వారు గోకర్ణ క్షేత్రమునందు మూడు సంవత్సరములు గుప్తముగా నివసించిరి. అనంతరము అక్కడినుండి బయలుదేరి లోకానుగ్రహార్థమై శ్రీశైల పర్వతమునకు చేరుకొనిరి. వారి శ్రీచరణకమలముల దర్శనము సమస్త పవిత్ర తీర్థములతో సమానము. అందుకే **'చరణం పవిత్రం వితతం పురాణం'.....**[1] అని వేదమునందు చెప్పబడియున్నది. శ్రీ గురుచరణములయందు సమస్త తీర్థములు వుండును కదా! ఇక వారు తీర్థాటనము చేయుట ఎందుకు? అనగా, లోకానుగ్రహము కొరకే గాని, వేరు కాదు అని గ్రహింపవలెను.[2] అక్కడ

---

1. **చరణం పవిత్రం వితతం పురాణం, యేన పూతస్తరతి దుష్కృతాని । తేన పవిత్రేణ శుద్ధేన పూతాతి పాప్మాన మరాతింతరేమ ॥**
2. **శ్లో॥ కర్మణైవ హి సంసిద్ధిమ్ ఆస్థితా జనకాదయః । లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి ॥**
తా॥ జనకుడు మున్నగు జ్ఞానులుకూడ ఆసక్తిరహితముగా కర్మలను ఆచరించుట వల్లనే పరమసిద్ధిని పొందిరి. కావున, లోకహితమును దృష్టియందుంచుకొని కర్మలను ఆచరించుటయే సముచితమైనది. (గీత. 3/20)

శ్రీపాదులవారు నాలుగు మాసముల కాలము గడిపి అచటినుండి 'నివృత్తి సంగమం' అను పేరుతో ప్రసిద్ధి పొందిన కురువపురమునకు విచ్చేసిరి. కురువపురము ఒక గొప్ప మహాక్షేత్రము. అది కృష్ణానదీ తీరమున ఉన్నది. దాని మహిమ అపారమైనది. భూమండలమునందు అట్టి క్షేత్రము లభించుట కడు దుర్లభము. ఆ క్షేత్రమహిమను విశదముగా చెప్పినచో ఒక గొప్ప ఉద్గ్రంథమే కాగలదు. కావున, అచటి మహిమను గూర్చి సంక్షేపముగా నీకు చెప్పెదను, స్థిరచిత్తుడవై వినుము. (4-9)

శ్రీపాదులవారు కురువపురములో ఉండిన కాలమునందు వారియొక్క మహిమాప్రభావము మరింతగా పెరిగిపోయి లోకమంతట వ్యాపించినది. వారి మహిమా ప్రభావమును చెప్పుట అత్యంత కష్టసాధ్యము. ఎవరైతే వారిని భక్తితో పూజించుచుండిరో, వారు అనాయాసముగనే సుఖసౌఖ్యములను పొందుచుండిరి. వారిని పూజించు వారికి ధనము, సంతానము, మొదలగువాటిలో ఏవి కోరిననూ అవి సులభముగా లభించుచుండెను. నామధారకా! అట్టి శ్రీపాదులవారి మహిమను నీకిప్పుడు క్లుప్తముగా వివరించెదను. ఆ తర్వాత నృసింహసరస్వతి ఏవిధముగ అవతరించిరో, దానిని కూడా వివరించెదను. అయితే, కార్యకారణములను పురస్కరించుకొని శ్రీపాదులవారు కురువపురమునకు ఏతెంచి అచట కొద్దికాలము నివసించియుండిరి. ఆయన అవతారమును ధరించుటకు కారణమైన పూర్వగాథను ముందుగా వివరించెదను. సావధానముగ వినుము.

ఆ కురువపురమునందు వేదశాస్త్రజ్ఞాన సంపన్నుడైన ఒక బ్రాహ్మణుడు ఉండెను. అతని భార్య పేరు అంబిక. ఆమె గొప్ప సౌశీల్యవతి. పతిసేవా పరాయణురాలు, మహాపుణ్యాత్మురాలు. పూర్వజన్మలో సంచితమైన కర్మలకు ఫలితముగా ప్రారబ్ధవశమున ఆమెకు సంతానము కలిగి వెంట వెంటనే మరణించుచుండిరి. అందుకు ఆ తల్లి మిగుల దుఃఖించి, అనేక తీర్థములను పర్యటించినది. అసంఖ్యాకమైన వ్రతములను ఆచరించినది. పెక్కు దానధర్మములను చేసినది. తత్ఫలితముగా కొంతకాలమునకు ఆమెకు ఒక పుత్రుడు కలిగెను. కానీ, అతడు మందబుద్ధి గలవాడు. జీవించిన కొడుకు ఒక్కడే అగుటవలన ఆ తల్లి మిగుల ప్రీతితో అతనిని పెంచి పోషించుచుండెను. ఉపనయనము చేయవలసిన వయస్సు వచ్చినందున తల్లిదండ్రులు వేదాభ్యాసము చేయించవలెనని ఆశించి తమ కుమారునకు ఉపనయనసంస్కారమును పూర్తి చేసిరి. కానీ, పిల్లవాడు మందబుద్ధి కలిగి, పైగా చెవిటివాడగుటచే మిక్కిలి అజ్ఞానిగా ఉండుటవలన అతనికి ఒక్క అక్షరం ముక్కకూడ రాదయ్యెను. నా కుమారుడు ఇంతటి బుద్ధిహీనుడు ఎందుకయ్యెనని ఆ బ్రాహ్మణుడు మిగుల చింతించుచుండెను. ఎంతో ప్రయాసపడి

అనేకమంది దేవతలను ఆరాధించినమీదట ఈ పుత్రుడు జన్మించెను. కానీ, మనలను దుష్టప్రారబ్ధము వదలిపెట్టుటలేదని అహోరాత్రములు ఆ బ్రాహ్మణదంపతులు మిగుల చింతించుచుండిరి. (10-20)

తమ కుమారునకు ఎంత బోధించినను వేదవిద్య ఒంటబట్టుటలేదని, తండ్రి వానికి ఎన్నోవిధములుగా నచ్చచెప్పెను. విద్యరాని వానిని వింతపశువని లోకము నిందించునని, అనేకవిధములుగ తండ్రి తన కుమారునకు హితవు చెప్పి చూచెను. గట్టిగా మందలించెను. విద్య రావటము లేదని ఆగ్రహించిన తండ్రి ఒక్కొక్కసారి బెత్తముతో కుమారుని కొట్టుచుండెను. అప్పుడు తల్లి దుఃఖించుచూ కొట్టవద్దని భర్తను నివారించుచుండెను. **అంతట భర్తతో, ఆమె ఇట్లనుచుండును-** "సంతానము కలుగుటలేదని ఎన్నో విధములుగా పూజలు, వ్రతములు చేసి సంతానమును పొందితిమి. అందులోనూ, పుట్టిన సంతానము నష్టమైపోవుచుండగా అనేక దానధర్మములు, తీర్థపర్యటనలు చేసిన పుణ్యఫలమువలన ఈ ఒక్కగానొక్క పిల్లవాడు జీవించియుండెను కదా! వారసునిగా మనకొక్క సంతానము మిగిలియున్నదని వీనిని పోషించుచుంటిమి. వీడికి విద్య రాలేదని, వేదవిద్య ఒంటపట్టుటలేదని మీరు మందలించి, కొట్టి, ఎందుకు కష్టపెట్టుచుంటిరి. మీరిట్లు కొట్టినచో, వానికి విద్యరాదు. కాని, వాడు ఒకవేళ చచ్చిపోయిచో, మనకు మాత్రము ఎంతో పాపము చుట్టుకొనును. వాని ప్రారబ్ధము ఎట్లుండునో, అట్లే కాగలదు. ప్రారబ్ధవశమున వాడొక మూర్ఖుడై పుట్టెను. ఇప్పుడు వాడిని ఎంత కొట్టిననూ, ఏమీ ప్రయోజనము లేదని నా అభిప్రాయము. ఇకమీదట మీరు నా కుమారుని బెత్తముతో కొట్టినచో, నేను వెంటనే నా ప్రాణములను విడిచెదను" అని గట్టిగా ఆ తల్లి హెచ్చరించినది. భార్య మాటలు విని ఆ బ్రాహ్మణుడు మౌనము వహించెను. ఆవిధముగా కొంతకాలము గడిచిన పిమ్మట ఆ బ్రాహ్మణుడు గ్రామాంతరమునకు వెళ్లెను. కొద్దిరోజులు గడిచినవి. ఆ విప్రుని మనసులో దుఃఖబాధ పెరిగిపోయెను. అనంతరము ప్రారబ్ధవశమున అతడు మరణించెను. (21-26)

తదుపరి కుమారునితోపాటుగా భర్త మరణించిన ఆ వితంతు స్త్రీ కురువపురములోనే ఉండిపోయినది. ఇరుగుపొరుగు ఇండ్లకు వెళ్లి భిక్షమెత్తి తన కుమారునికి పెట్టి, మిగిలిన ఆహారము తాను తింటూ జీవనము గడుపసాగినది. ఆ బ్రాహ్మణ స్త్రీ కుమారునికి వివాహవయస్సు సమీపించెను. వీడు మందమతి అని, బుద్ధిహీనుడని లోకులందరూ నిందించుచుండెడివారు. ఆ కారణమున అతనికెవ్వరూ తమ కన్యను ఇచ్చుటకు ముందుకు రాలేదు. పైగా అతడిని చూచి ఈవిధముగా పరిహసించెడివారు. "ఎండుకట్టెకు నీళ్లు పోసినట్లుగా నీవు కడుపు నింపుకొనుచుంటివి. నీవొక వ్యర్థమైన జన్మను పొందితివి. "ఓరీ! మూర్ఖుడా! నీవు కులనాశకుడవు. నీ వంశమునకు మచ్చ తెచ్చితివి. నీ

తండ్రి గొప్ప ఆచారవంతుడు. వేదశాస్త్ర మర్మజ్ఞుడు అని మన చుట్టుప్రక్కలగల నాలుగు రాష్ట్రములలో ఎంతో కీర్తిని సంపాదించెను. అటువంటి వాడి కడుపున నీవు జన్మించితివి. నీవెంతో ప్రయోజకుడవై, వంశకీర్తిని పెంచెదవని నీ తండ్రి ఆశించెను. దానికి బదులు నీ తండ్రికి నీవు గొప్ప మాయనిమచ్చను తెచ్చితివి. నీ వంశపెద్దలను అధోగతి పాలు జేసితివి. భిక్షమెత్తి కడుపు నింపుకొనుటకు నీకు సిగ్గు వేయుటలేదా? లజ్జ కలుగుటలేదా? ఇతరుల ముందు చేయి చాచుటకు ఎట్లు సాహసించుచుంటివి? ఈ లోకములో బ్రాహ్మణ వంశములో మానవజన్మనెత్తి పశువు వలె జీవించుచుంటివి. నీ జన్మ వ్యర్థమైనది. హీనముగా జీవించుటకంటె, లోకులముందు అపహాస్యమునకు గురియగుట కంటే గంగలో దూకి చావటమే మేలు" అని తరచుగా ఆ వీధిలోని బ్రాహ్మణులు, ఇతర జనులందరూ ఆ పిల్లవాడిని దూషించెడువారు. వారి మాటలను విని ఆ బ్రహ్మచారి మిగుల దుఃఖించెడివాడు. కానీ, బుద్ధి మారుటకు మాత్రము ఎట్టి ప్రయత్నము చేయువాడు కాదు. (27-33)

ఒకరోజున విపరీతమైన బాధకు గురియై మిక్కిలి దుఃఖించి తల్లి వద్దకు వచ్చి – "అమ్మా! లోకమంతా నన్ను తిరస్కరించుచున్నది. నేను అందరి ఏవగింపునకు గురియగుచుంటిని. నేను జీవించి ప్రయోజనము లేదనుమాట నిజమే! కావున, నేను ఇక ప్రాణములను వదలివేసెదను" అని తల్లితో అనెను. "అంతేగాదు, అమ్మా! ఈ దేహమువలన ప్రయోజనమేమిటి? నేను నిన్ను పోషించలేని దౌర్భాగ్యుడను. కావున, ఏ అరణ్యవాసమునకో వెళ్ళిపోయెదను. లేదా గంగలో పడి మరణించెదను" అని దుఃఖించుచు తల్లితో చెప్పెను. కొడుకు మాటలను విని, ఆ తల్లి ఎంతయో చింతించినది. లెక్కకు మిక్కిలి రోదించినది. తల్లి, పుత్రులు ఆవిధముగా దుఃఖించుచూ "నీవు మరణించిన పిదప నేను మాత్రము జీవించి ప్రయోజనమేమి నాయనా! నీతోపాటు నేను కూడా గంగలో దూకెదనని" ఆ తల్లి, కుమారులు ఇద్దరూ కలిసి గంగవైపునకు వెళ్ళిరి. వారిద్దరూ ఒకవైపు ఏడ్చుచూ, బాధపడుచూ గంగాప్రవాహములోనికి దిగి, మొల లోతులోనికి వెళ్ళిరి. ఇంతలో అక్కడే ఒక ప్రక్కన విశ్వవ్యాపకుడు, లోకోద్ధారకుడు అయిన, శ్రీపాదులవారు స్నానము చేయుటను గమనించిరి. వెంటనే, ఆ ఇరువురు పరుగు పరుగున వెళ్ళి శ్రీపాదులవారి శ్రీచరణములపై పడిపోయిరి. చేతులు జోడించి మిగుల దుఃఖించుచూ, "స్వామీ! ఇక మీరే మాకు గతి. మీ శరణుజొచ్చితిమి. గంగలో దూకి చనిపోవలయునని మా కోరిక. కానీ, ఓ కృపాసింధూ! ఆత్మహత్య మహాదోషమని కూడా మేమెరుగుదుము. అందువలన మాకు సద్గతి కలుగునట్లుగా మీరు మమ్ములను అనుగ్రహించుడు" అని దీనముగా దుఃఖించుచు మొరపెట్టుకొనిరి. ఆ బ్రాహ్మణ స్త్రీయొక్క రోదనమును చూచి దీనమైన ఆమె మాటలను విని, దయార్ద్రహృదయుడైన శ్రీపాదశ్రీవల్లభుల హృదయము ద్రవించినది. వెంటనే అతిశయించిన

కృపతో "అమ్మా! మీకు ఎటువంటి కష్టము వచ్చెను. మీరు ఎందుకు చనిపోవలయునని భావించితిరి. మీరు గంగలో దూకి మరణించుటకు ఎందుకు నిశ్చయించుకొంటిరి" అని ప్రశ్నించెను. (34-40)

అప్పుడు ఆ విప్ర స్త్రీ తన మానసిక బాధనంతయూ స్వామి ముందు విన్నవించుకొనెను. అనంతరము "స్వామీ! భక్తవత్సలా! నా బిడ్డను తరింపచేయుము. ఈ మందమతిని అనుగ్రహింపుము. పుత్రులు లేక నేనెన్నియో విధముల కష్టములను అనుభవించితిని. పాదచారినై అనేక తీర్థములను తిరిగితిని. లెక్కలేని వ్రతములను, పూజలను, దానములను చేసితిని. సమస్త దేవతలను ఆరాధించితిని. అనేక వ్రతోపవాసములు ఆచరించితిని. తత్ఫలితముననో, నా ప్రారబ్ధవశముననో, తెలియదు. కానీ, నాకు మందమతియైన ఈ కుమారుడు కలిగెను. వీడిని చూసి వేదవిద్య అబ్బుటలేదని, తండ్రి మందలించి, కొట్టి, విసిగి, వేసారిపోయెను. కాని, వీని బుద్ధి వికసించుటలేదు. ఆ బాధతో వేదశాస్త్ర సంపన్నుడైన నా భర్త పరలోకగతుడాయెను. లోకమంతా నా కుమారుని, నన్ను చూచి నీ భర్త వేదశాస్త్ర మర్మజ్ఞుడైన, సదాచార సంపన్నుడైన బ్రాహ్మణుడు, ఆయన కడుపున ఇంతటి హీనుడు, మందమతియైన మూర్ఖుడు ఎట్లు పుట్టెనో అని నిరంతరము తిరస్కరించుచుండిరి. ఇందుకు విసిగి వేసారి, ప్రాణత్యాగము చేయుటకంటే వేరొక ఉపాయము లేదని నిశ్చయమునకు వచ్చి, ఇరువురమూ కలిసి గంగలో మునిగి, మరణించుటకుగాను నీటిలోనికి దిగితిమి. కాని, దైవయోగమున పవిత్రాత్ములు లోకోద్ధారకులైన మీ దర్శనము కలుగుట మా భాగ్యముగా భావించి మీ శరణుజొచ్చితిమి. శ్రీపాద యతీశ్వరా! మాయందు కృప జూపుడు. ఇంతటి మందమతులైన కుమారులు జన్మజన్మలకు ఎవరికీ కలుగవద్దు. నాకేకాదు, మరెవరికీ కలుగవద్దు. ఇందుకు ఏదైనా ఒక ఉపాయమును చెప్పి మమ్ము తరింపచేయుము. కృపాసాగరా! మా దుఃఖమును హరింపచేయుము. మీరే మాకు దిక్కు వేరే గతి లేదు" అని పరిపరివిధముల మొరబెట్టుకొనుచు ప్రార్థించుచూ, మిక్కిలి వినయముతో స్వామిని శరణుజొచ్చి శ్రీపాదులవారి **శ్రీచరణములను పట్టుకొని మరల ఇట్లు వేడుకొనెను** – "శరణాగతులను రక్షించెదవని నీ శరణు కోరితిని స్వామీ! ఈ జగత్తులో జన్మించి అనేకవిధముల బాధలను అనుభవించితిని. ఆవంతయైన సుఖమును రుచి చూచి ఎరుగను. పుట్టిన సంతానమునందు ఏ ఒక్కడూ నిలువలేదు. జీవించినవాడు వీడొక్కడే. అదికూడా అజాగళస్తనము వలె పనికిరాని సంతానము. ఏమి చేయుదును. దేవా! ముందు భవిష్యత్తులో నాకు ఒకవేళ మానవజన్మ కలిగినచో ముల్లోకములలో పూజ్యుడైనట్టి నీ వంటి ఒక పుత్రుని నాకు ప్రసాదించుము. లోకులందరూ అతనికి వందనము చేయునట్లుగా, ఆ కుమారుని లోకమంతా పూజించునట్లుగా, మీవంటి పూజ్యుడైన ఒక

పుత్రుడు నాకు కలుగునట్లుగా అనుగ్రహించుము. స్వామీ! శ్రీపాదయతీశ్వరా! రక్షించుము" అంటూ దీనముగా ఆ తల్లి మొరపెట్టుకొనెను. **తిరిగి మరల ఆమె ఇట్లనెను** – "మహానుభావా! నాకు కలిగిన కుమారునివలన నా జన్మ ఉద్ధరింపబడునట్లుగా తిరిగి పునర్జన్మ రాకుండునట్లుగా నాకు సువర్ణావకాశముగా మరొక మానవజన్మను అనుగ్రహించుము స్వామీ! మా వంశమునకు చెందిన పితృదేవతలందరికీ స్వర్గప్రాప్తి కలుగునట్లుగా, బ్రహ్మజ్ఞాని వంటి కుమారుడు కలగాలని నా మనసులో దృఢమైన కోరిక గలదు. పసితనమునుండే అతడందరికీ పూజ్యుడై, వందనీయుడై ఉండునట్లుగా, అది నా కళ్ళతో నేను చూచే మహద్భాగ్యమును నాకు ప్రసాదింపుమని" ఆ తల్లి పదే పదే శ్రీపాదులవారి దివ్యమైన శ్రీచరణములను గట్టిగా పట్టుకొని వేడుకొనెను.

ఆ బ్రాహ్మణ స్త్రీయొక్క ఆవేదనకు ప్రసన్నులై ఆమెను అనుగ్రహించి, **శ్రీపాదులవారు ఇట్లనిరి** – "అమ్మా! కడు భక్తిశ్రద్ధలతో నేటినుండి ఈశ్వరుని ఆరాధించుము. నీకు తప్పక శ్రీహరి వంటి పుత్రుడు కలుగును. ఒక గొల్ల వనిత ఈశ్వరుని ఆరాధించుటవలన ఆ గొల్లవారి ఇంటిలో భగవంతుడే అవతారపురుషుడై శ్రీకృష్ణునిగా జన్మించెను. ఆవిధముగా నీవు ఈశ్వరుని ఆరాధించుచుండుము. నిశ్చయముగా నీకు పుత్రుడు కలుగును. నీ మనసులో గల అభీష్టము తప్పక నెరవేరును" అని శ్రీపాదశ్రీవల్లభులు అనుగ్రహించిరి. అప్పుడా బ్రాహ్మణ స్త్రీ "ప్రభూ! ఆ గొల్ల వనిత పరమేశ్వరుని ఎట్లు పూజించెను? తద్విధమును వివరముగా దయతో నాకు సెలవీయగలరు. అట్టి వ్రతమును నేను ఎంతటి కష్టమైననూ చేసి తీరెదనని" తిరిగి స్వామివారి చరణములను పట్టుకొనగా, **కరుణాసింధువైన శ్రీగురుడు ఇట్లు చెప్పసాగెను.** (41-57)

"శనిప్రదోష సమయమునందు నీవు ఈశ్వరుని పూజించుము. అందుకు శనివారమే విశేషమైనది. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆయనను పూజించుము. ఆ గొల్లవనిత చేసిన పూజావివరములన్నియూ స్కాందపురాణమునందు చక్కగా వర్ణింపబడియున్నవి. అది నీకు నేనిప్పుడు వివరించెదను వినుమని" శ్రీగురుడు పలికెను. గురుని మాటలను విని ఆ విప్రవనిత మిగుల సంతసించి స్వామివారి ముందు చేతులు జోడించి, నమస్కరించి, **నతమస్తకురాలై ఇట్లు విన్నవించెను.** "ప్రదోషసమయంలో ఈశ్వరుని ఆరాధించుటవలన కృష్ణుని వంటి కుమారుడు కలుగునని అత్యంత ఆనందము, అద్భుతము, ఆశ్చర్యకరమగు విషయమును తెలిపితిరి. స్వామీ! నేను కూడా ఒకవేళ అదేవిధముగా పూజను చేసినచో నిశ్చయముగా అట్టి ఫలమును పొందగలనా! ఇంతకు పూర్వము ఎవరైనా ఇట్టి ఫలితమును పొందియుండిరా? వారెట్లు ఈశ్వరుని ఆరాధించిరి? మొదలగు విషయములన్నింటినీ వివరముగా నాకు తెలియజేయగలరని" ఆ స్వామిని ప్రార్థించెను. **అందుకు సంతసించిన శ్రీపాదులవారు ఆమెతో ఇట్లు చెప్పుచుండిరి.** "అమ్మా! కడు జాగ్రత్తగా వినుము.

పూర్వము ఉజ్జయిని నగరమునందు ఒక విచిత్రమైన సంఘటన జరిగెను. ఆ నగరమును పరిపాలించు రాజు పేరు చంద్రసేనుడు. అతడు గొప్ప ధర్మజ్ఞుడు. అతని ప్రాణసఖుని పేరు మణిభద్రుడు. చంద్రసేన మహారాజు సదా, సర్వదా ఈశ్వరభక్తిని కలిగి అపారమైన పూజలను అనేకవిధములుగా ఆచరించెను. అందుకు భోళాశంకరుడు, ఆ మహాదేవుడు, అత్యంత ప్రసన్నుడై ఆ మహారాజునకు చింతామణిని ప్రసాదించెను. అంతేకాదు, కోటిసూర్యుల ప్రకాశముతో వెలిగిపోవుచున్న ఆ మణిని పరమేశ్వరుడే స్వయముగా అత్యంత హర్షముతో చంద్రసేనుని మెడలో అలంకరింపచేసెను.⁽¹⁾ ఆ మణి పేరు చింతామణి. అద్భుతమైన దాని లక్షణమేమనగా, ఆ మణి ఇనుమును బంగారముగా మార్చివేయగలదు. కేవలము దాని తేజస్సు సోకితే చాలును, ఆ వస్తువు బంగారముగా మారిపోవును. దానిని స్మరించినంతమాత్రమున మనోరథములన్నియూ చిటికెలో నెరవేరగలవు. అంతటి మహిమాన్వితమైనది ఆ మణి. అది చంద్రసేనునిచేతికి చిక్కెను. ఈ చింతామణియొక్క మహిమను తెలిసిన పిమ్మట చుట్టుప్రక్కల గల రాజులందరికీ ఆ చింతామణిని చంద్రసేనుని నుండి బలవంతముగనైననూ సంపాదించవలెనను దురాశ కలిగెను. ముందుగా సోదరరాజులందరూ ప్రేమతో, స్నేహపూర్వకముగా "మహారాజా! నీవద్దగల ఆ మణిని మాకు ఇవ్వవలెనని" కోరిరి. కొందరు బలప్రయోగము చేసి స్వాధీనపరచుకొనుటకు ప్రయత్నించిరి. మరికొందరు దానికి బదులుగా నీకు కావలసినంత ధనమును ఇచ్చెదము. ఆ మణిని మాకు ఇవ్వవలసినదని నచ్చపలికిరి. కానీ, ఎవరెంత కోరిననూ చంద్రసేనమహారాజు ఆ మణిని ఇచ్చుటకు సమ్మతించలేదు. అప్పుడు ఇతర రాజులందరు కలిసికట్టుగా తమ తమ సైన్యములను సమాయత్తపరచుకొని యుద్ధముద్వారా ఆ మణిని స్వాధీనపరచుకొనుటకై ఉజ్జయిని నగరమును ముట్టడించిరి. అయితే ఆ రోజు శనివారము. త్రయోదశి తిథి. ఉదయము నుండి ఉపవాసదీక్షలో ఉన్న ఆ మహారాజు ప్రదోష సమయమునందు ఈశ్వరుని అర్చించుటకై శివాలయములో ఏకాసనమునందు కూర్చొని త్రికరణశుద్ధిగా ఎట్టి ఆలోచన లేకుండా, ఏకాగ్రచిత్తముతో పరమేశ్వరుని ఆరాధనలో లీనమయ్యెను. ఆవిధముగా చంద్రసేనమహారాజు మహాకాలేశ్వర లింగమును పూజించుచుండెను. అదే సమయమున కొందరు గొల్లపిల్లలు ఆట నిమిత్తముగా అటువైపు వచ్చిరి. దైవసంకల్ప బలమున వారు ఆ శివాలయమునందు ప్రవేశించిరి. అచట రాజుగారు చేయుచున్న శివపూజను చూసిరి. **ఆ గొల్లపిల్లలు వెంటనే పరుగెత్తుకొని తమ ఇండ్లకు వెళ్లి తల్లులతో ఇట్లు చెప్పిరి.** "అక్కడ ఒక గమ్మత్తైన ఆట జరుగుచున్నది. మేము కూడా అదేవిధమైన

---

1. శ్రీశంకరుని పార్షదగణములలో 'మణిభద్రుడు' అను ఒక ముఖ్యపార్షదుడు చంద్రసేన మహారాజునకు ప్రాణమిత్రుడయ్యెను. అతడు చంద్రసేనుని పట్ల ప్రసన్నుడై ఒక చింతామణిని కానుకగా ఇచ్చెను. ఆ మణిని స్వీకరించిన చంద్రసేనుడు మిగుల సంతోషాంతరంగుడై తన మెడలో కంఠహారముగ ధరించెను అని ప్రాచీన గురుచరిత్ర మూలగ్రంథాలలో పేర్కొనబడియున్నది.

ఒక శివలింగమును చేసి పూజించెదమని పలికిరి. మరికొంతమందితో కలిసి తమ ఇంటిముందుగల ఖాళీ స్థలమునందు వారు వినోదముతో, రాళ్లను పేర్చి ఒక చిన్న శివాలయమును నిర్మించిరి. మరొక గుండ్రని పాషాణమును లింగస్వరూపముగా భావన చేసి ఆ ఆలయము మధ్యలో పెట్టిరి. తర్వాత రకరకాల ఆకులను, పూలను పూజకోసము సంపాదించిరి. వెంటనే షోడశోపచార పూజను సంకల్పించి ఉదకమును నైవేద్యముగా సమర్పించి ఆ గోపకుమారులు అమాయికమైన భక్తితో ఆసక్తిగా ఒక ఆటవలె శివపూజ చేసి ఆడసాగిరి. పిల్లవాండ్ర తల్లులు ఎంతకూ పిల్లలు భోజనమునకు రావటములేదని గమనించి వచ్చి తమ కుమారులను భోజనము చేయుటకు రమ్మని పిలిచిరి. అప్పుడు పిల్లలందరూ వెళ్ళిపోయిరి, కానీ, అందులో గల ఒక గొల్ల పిల్లవాడు మాత్రము లింగమును వదలి ఇంటికి పోవుటకు ఇష్టపడలేదు. అతని తల్లి రమ్మని గట్టిగా కోరినది. కానీ, “ససేమిరా! నేను ఈ లింగమును వదలిపెట్టి భోజనమునకై ఇంటికి రానని” అతడు గట్టిగా మొరాయించెను. ఎంత చెప్పిననూ వినని కుమారుని తల్లి ఆగ్రహించి బెత్తముతో కొట్టెను. “కుమారా! చాలా రాత్రి గడిచిపోయినది. భోజనమునకై ఇంటికి వెళ్లుదము” అని కోరినది. కొట్టినా, మందలించినా, ఎంత చెప్పినా ఆ గోపకుమారుడు తల్లి మాటను పట్టించుకొనలేదు. శివలింగమును విడిచిపెట్టి లేవలేదు. తన మాటను వినక మూర్ఖము చేయుచున్న కుమారుని చూచి ఆ గొల్ల వనిత ఆగ్రహించి రాళ్ళను శివలింగమును తొలగించి దూరముగా విసరివేసినది. అక్కడి పూజనంతా పాడు చేసినది. అదే కోపముతో రుసరుసగా ఇంటికి వెళ్ళిపోయినది. పూజనంతయు చిందరవందర యగుటను గాంచి ఆ గొల్ల పిల్లవాడు అనేకవిధములుగా బాధపడి ఏడ్చెను. తీవ్రమైన తాపమునకు గురియైన ఆ పిల్లవాడు సొమ్మసిల్లి ఒక్క క్షణముపాటు మూర్ఛిల్లి భూమిపై పడిపోయెను. ప్రాణములను వదలివేసి తాను లింగములో లయమైపోవుచుండుటను ఆ గొల్లపిల్లవాడు ప్రత్యక్షముగ గమనించెను. అంతట ఆ గోపీసుతుని పట్ల అత్యంత ప్రసన్నుడైన శివుడు సూర్యసమభాసమానుడై సాక్షాత్కరించెను. శివునియొక్క ప్రసన్నతవలన శివసంకల్పముచే ఆ శివాలయము ఒక రత్నఖచితమైన ఆలయముగా రూపుదిద్దుకొనెను. వెంటనే శివలింగము కూడా కోటిసూర్య రత్నప్రభలతో రత్నలింగముగ మారిపోయెను. అకస్మాత్తుగా అచట వ్యాపించిన అఖండమైన ప్రకాశమునకు ఆ బాలుడు మేల్కొనెను. శివుడు తన నిజరూపమును ధరించి పిల్లవాని భుజము తట్టి, “నాయనా! వత్సా! కుమారా! నేను నీ భక్తికి మిగుల సంతసించితిని. నీ యెడల ప్రసన్నుడనైతిని. నీకు కావలసిన వరమును కోరుకొమ్ము. ఇప్పుడే ఇచ్చెదను” అని ప్రియముగా పలికెను. అప్పుడు ఆ గొల్లపిల్లవాడు ఈశ్వరుని చరణములపై తన శిరమునుంచి సాష్టాంగవందనము చేసి, లేచి నిలబడి, రెండు చేతులు జోడించి, వినయముతో “శివా! మహాదేవా! ప్రదోషసమయమునందలి పూజ చెడిపోయినది. నన్ను క్షమించుము స్వామీ! ఈ పూజను చిందర వందర చేసిన మా అమ్మపై

కోపగించకుము ప్రభూ!" అని వేడుకొనెను. భోళాశంకరుడగు ఆ పరమేశ్వరుడు ఆ పసిపిల్లవాని మాటలకు మిగుల సంతసించి, ప్రీతితో ఇట్టి వరమును ప్రసాదించెను. "కుమారా! నీ తల్లి ధన్యురాలు. ప్రదోష సమయములో ముందుగా శనిప్రదోష పూజను చూసి, తదుపరి చిందర వందర చేసినది కనుక, ఆమె పాపములన్నియునూ నశించిపోయినవి. అనంతరము నీ తల్లియైన ఆ గొల్ల వనిత దేవజననిగా జన్మించును. తిరిగి ఆమె గర్భమున నీవే కుమారుడవై జన్మించెదవు. ఆ కుమారుడే ప్రసిద్ధమైన విష్ణు అవతారముగా ప్రసిద్ధికెక్కును. పుత్రుని పూజ చేయవద్దని వారించినప్పటికినీ నిన్నే తన పుత్రునిగా పొంది పోషించగలదు. నాయనా! నీవు నీ మనసులో కోరినవన్నీ వెంటనే సిద్ధించును. గుర్తుంచుకొమ్ము. నీ వంశమునందు అఖిలసుఖసౌఖ్యములు సర్వదా వృద్ధినొందుచుండును. నీకు పుత్ర, పౌత్ర, ప్రవృద్ధి కలుగును" అని అమోఘమైన వరములను ప్రసాదించెను. ఆ బాలుని పరిపూర్ణముగా అనుగ్రహించి, కృపతో శివుడు ప్రసన్నుడై తిరిగి లింగములో చేరి అదృశ్యమైపోయెను. అయితే ఆ గొల్లవనిత ఇంటిముందు రాళ్ల చేత నిర్మించిన శివాలయము ఏవిధముగ శివుని కృపచేత ఏర్పడినదో, ఆ లింగము, ఆ శివాలయము యథాతథముగా అట్లే నిలచిపోయినది. (58-90)

కోటిసూర్యుల ప్రకాశముతో వెలిగిపోవుచున్నటువంటి శోభాయమానమైన, మహాద్భుతమైన, అతివిచిత్రమైన ఆ శివాలయమును చూచి చుట్టుప్రక్కల వారందరు వచ్చి ఏమి ప్రకాశమది! ఏమి చోద్యము! అకాలమునందు సూర్యుడు ఉదయించెనా! అని విస్మయము నొందుచుండిరి. అదను చూచుకొని రాజుపై దాడిచేయుటకు ఉజ్జయినీ నగరము చుట్టుప్రక్కల నిలిచియున్నటువంటి శత్రురాజులందరు "తాము యుద్ధమును విరమించుకొంటిమని" తమ సైన్యాధిపతులకు వర్తమానము పంపించిరి. తమ శత్రుభావమునకు స్వస్తిచెప్పి ఆ రాజును దర్శించి వెళ్ళుటకై నగరద్వారమువద్దకు చేరుకొనిరి. ఉజ్జయినీ నగరము యొక్క వింత శోభను గాంచి వారందరు విస్తుపోయిరి. ఏమిటి ఈ వింత. పవిత్రమైన ఈ నగరంలో సూర్యుడు ఉదయించినట్లుండెను. ఈ రాజు ఎంతటి పుణ్యాత్ముడో కదా! అటువంటి వ్యక్తితో విరోధమును కలిగియుండుట వలన మనకు ముప్పు వాటిల్లక తప్పదు. కావున, వారితో మనమంతా కలసిమెలసి యుండుటయే మేలని తలంచిరి. వెంటనే తమ సేవకులతో, చంద్రసేన మహారాజునకు తాము స్నేహహస్తమును చాచిన సమాచారమును పంపించిరి.

వెంటనే రాజుగారు తన మంత్రి సేనాపతులను పంపి నగరము వెలుపల గల రాజులందరినీ తమ నగరములోనికి స్వాగతించి, రాజభవనమునకు ఆహ్వానించెను. రాజును సమీపించినటువంటి వివిధ రాజులందరూ ప్రేమతో "మహారాజా! ఇంతటి చీకటివేళ ఈ అంధకారములో మీ నగరమునందు సూర్యుడు ఎట్లు ఉదయించెను" అని ఆశ్చర్యకరముగా ప్రశ్నించిరి. చంద్రసేనమహారాజుగారిని

దర్శించుటకై ఆ రాజులు నగరములో నుండి రాజభవనమునకు వెళ్ళుచుండగా అనుపమానమైన నవరత్నఖచితమైన శివాలయము అతి చోద్యముగా వారికి కనిపించెను. అదేవిధముగా ఈ శివాలయము కలిగిన గొల్లవారి ఇల్లు కూడ ఎంతో అద్భుతముగా శోభిల్లుచుండెను. అప్పుడు రాజులందరూ కలిసి ఆ గొల్ల పిల్లవాడిని పిలిచి, జరిగిన విషయమేమిటని ప్రశ్నించిరి. అందుకు ఆ గొల్ల పిల్లవాడు జరిగిన వృత్తాంతమంతయూ వివరించి చెప్పెను. రాజులందరూ మిగుల సంతసించి, నీవు గొల్లలందరికీ రాజువు కాగలవని వారి దేశమునకు సంబంధించిన సంపదనంతయును అతనికి ప్రసాదించిరి. అనంతరము రాజులందరు తిరిగి తమ తమ దేశములకు వెళ్లిపోయిరి. పిమ్మట చంద్రసేనమహారాజు నిర్మలముగా, ప్రశాంతచిత్తముతో ఈశ్వరభక్తితో ఉండిపోయెను. శనిప్రదోష పూజా ఫలము లభించిన వారికి భయము అనేది ఎప్పుడూ కలుగనేరదు. ఆ గొల్లపిల్లవాడు ఇంటికి వెళ్ళి తల్లితో జరిగిన వృత్తాంతమంతయును వివరించి చెప్పెను.

తదుపరి అతడిట్లనెను – "అమ్మా! ఆ తర్వాత నేనే నీ కడుపున నారాయణుని అవతారముగా పుట్టెదనట అని ఈవిధముగా ఈశ్వరుడే నాకు వరమునిచ్చెను. కావున, నీవెంతమాత్రము సందేహింపకుము. నా ప్రదోష పూజను చూచి శంకరుడు అత్యంత ప్రసన్నుడయ్యెను. ప్రదోషపూజను నీవు పాడు చేసినందులకు నిన్ను క్షమించుమని నేను పరమశివుని ప్రార్థించితిని" అని జరిగిన వృత్తాంతమునంతయూ ఉన్నదున్నట్లుగా తల్లికి వివరించి చెప్పెను. ఆవిధముగా ప్రదోషపూజ యెడల ఈశ్వరుడు అత్యంత ప్రసన్నుడయ్యెనని' ప్రదోషపూజ వలన ఎటువంటి ఫలము లభించునో? తత్ఫలితము ఎట్లుండునో? దానిని గూర్చి శ్రీపాదులవారు ఆ బ్రాహ్మణ స్త్రీకి వివరించి చెప్పెను. (91–103)

తల్లీ! నీ మనసులో నా వంటి పుత్రుడు కావలయునని కోరిక ఉన్నయెడల సంశయమును వహించకుండా శనిప్రదోష కాలమునందు నిశ్చయముగా శివుని ఆరాధించుచుండుము అని చెప్పి తద్వారా పరమశివుడు నిన్ను అనుగ్రహించునని అభయమునిచ్చి శ్రీపాదులవారు ఆ బ్రాహ్మణ వనిత యెడల అత్యంత కృప చూపెను. వెంటనే మందబుద్ధియైన ఆమె కుమారుని పిలిచి తన చేతిని ఆతని తలపై ఉంచెను. శ్రీపాదులవారి దివ్యహస్తము అతని మస్తకముతో సంయోగము చెందిన వెంటనే అతనికి పరిపూర్ణమైన జ్ఞానోదయము కలిగెను. వెంటనే ఆ పిల్లవాడు మూడు వేదములను చదివిన మహావేదపండితుడయ్యెను. వెనువెంటనే వాడు వేద, తర్క వ్యాకరణాది శాస్త్రములను అలవోకగా పఠించుచుండెను. అందుకు స్వామివారి వెంట గల విప్రులు, ఆ బాలుని తల్లి, అత్యంత విస్మయమునకు లోనయిరి. శ్రీపాదులవారి కృప అపారమైనది. ఈయన నిశ్చయముగా పరమేశ్వరుడే. కారణజన్ముడు. అవతారపురుషుడు. నర దేహమును ధరించి నడచివచ్చిన భగవంతుడే అని అందరూ జేజేలు పలికిరి. పూర్వజన్మలో ఆర్జించిన పుణ్యము తోడయినందున ఇంతటి ప్రభావశాలియైన శ్రీ గురుమూర్తిని నేడు మేము

దర్శింపగలిగితిమని తమ అదృష్టమును భావించుకొనుచూ, తమ భాగ్యమునకు లోలోపల మురిసిపోవుచూ, శ్రీపాదశ్రీవల్లభుల శ్రీచరణసరోజములకు ఆ బ్రాహ్మణ వనిత పదేపదే నమస్కరించెను. “స్వామీ! ఈశ్వరుడు వేరెవ్వరో కాదు. మీరే ఈశ్వరస్వరూపులు. మీ మాటలెప్పుడూ అసత్యములు కానేరవు. నేను తప్పక ప్రదోషపూజను నిర్వహించెదను. మీవంటి పుత్రుని మాకు రాబోవు జన్మలో ప్రసాదింపుము ప్రభూ!” అని స్వామిని పదేపదే ప్రార్థించినది. ఆమె తన మనసులో నిశ్చయము చేసికొనిన నాటినుండి ఆ బ్రాహ్మణ వనిత ప్రతినిత్యము స్వయముగా శ్రీపాదులవారికి ప్రదోషపూజను ఆచరించెను.

ఆమె పుత్రుడు కూడా అందరికంటే అత్యధికమైన మహాప్రజ్ఞాశాలియై వేదశాస్త్రమర్మజ్ఞుడై సర్వులకూ పూజనీయుడయ్యెను. వందనీయుడయ్యెను. అప్పుడతనికి నేను నా కూతురినిచ్చెదను, అంటే నేను నా కూతురినిచ్చెదను అని బంధువులు పోటీపడిరి. చివరకు ఒక అమ్మాయితో అతడికి వివాహము జరిపించిరి. అనంతరము పుత్రపౌత్రులతో ఆ మందమతియైన బ్రాహ్మణ పుత్రుడు అత్యంత సుఖసౌఖ్యములతో అనంతర జీవితమునందు వర్థిల్లెను.

శ్రీగురుమూర్తియొక్క కృపను పొందినవారికి ఎప్పుడైననూ, ఏనాడైననూ ఇటులనే జరిగితీరును. శిష్యా! నామధారకా! గురుమూర్తియొక్క కృపాప్రభావము ఎంతటి మహిమాన్వితమైనదో వింటివి కదా! దయామయుడైన శ్రీగురుడు శ్రీపాదశ్రీవల్లభులు ఎందరో భక్తజనులను వారివారి ఘోరమైన కష్టముల నుండి ఉద్ధరించినారని, ఇదేవిధముగ ఆశ్రితభక్తకోటిని సర్వకాలముల యందు తప్పక రక్షించితీరును” అని శిష్యుడగు నామధారకునకు సిద్ధమునీశ్వరుడు వివరముగా చెప్పెను. ఇట్టి గురుప్రభావాన్వితమైన కథను భక్తులందరూ వినవలసినదని సరస్వతీ గంగాధరుడు లోకమునకు గురుచరిత్రగా వ్యక్తపరచెను. (104-115)

ఇది శ్రీ గంగాధర-సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథా కల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు “శనిప్రదోష మాహాత్మ్య కథనము” అను ఎనిమిదవ అధ్యాయము ॥ (8)

॥ జయ గురుదత్త - శ్రీగురుదత్త ॥

(ఓవీలు - 115; మొత్తము సంఖ్య - 1067+115 = 1182 ఓవీలు).

◆ ◆ ◆

దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా

శ్రీ గురు చరిత్ర

తొమ్మిదవ అధ్యాయము

కురువపుర క్షేత్ర మహిమను వర్ణించుట - శ్రీపాదులు తమ సేవకుడైన రజకుని అనుగ్రహించి గొప్ప వరమును ఇచ్చుట- శ్రీపాదశ్రీవల్లభుల నిజానందగమనము

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధముని మాటలను ఆలకించిన పిమ్మట తిరిగి చేతులు జోడించి, వినయపూర్వకముగా వందనమాచరించి పలికెను- “ఓ గురువర్యా! శ్రీపాదులవారు కురువపురములో ఉండగా జరిగినటువంటి తరువాతి కథా వృత్తాంతమును దయతో సెలవీయవలసినది” అని కోరెను. అప్పుడు భక్తవత్సలుడైన శ్రీగురువు శిష్యుని అభిప్రాయమును గుర్తించి, అతని భక్తికి ప్రసన్నుడై “నామధారకా! అపూర్వమైన శ్రీపాదశ్రీవల్లభులవారి గురించిన దివ్యమైన శ్రీగురుచరిత్రమును చెప్పుచున్నాను. శ్రద్ధగా వినవలసినదని ఇట్లు చెప్పసాగెను -

ఒకసారి కురువపురమునందు ఒక అపూర్వమైన సంఘటన జరిగెను. అదేమనగా - కురువపురమునందు ఒక రజకుడు ఉండెను. అతడు శ్రీగురుమూర్తికి అత్యంత ప్రీతిపూర్వకమైన సేవకుడాయెను. ప్రతినిత్యము శ్రీపాదులవారు గంగకు వచ్చి, విధిపూర్వకముగా స్నానము చేసెడివారు. త్రిమూర్త్యాత్మకుడైన శ్రీపాదులవారు లౌకికవ్యవహారమును అనుసరించి నిత్యకర్మలన్నింటినీ చక్కగా పూర్తి చేసెడివారు. ఎవరి దర్శనమాత్రముచేత గంగాస్నాన ఫలము ఘటించునో, అట్టి మహనీయమూర్తి లోకమును ఉద్ధరించుటకొరకే, లోకానుగ్రహముకొరకే వారు స్నానము చేయుచుందురు, నిత్యకర్మలను నెరవేర్చుచుందురు. అయితే, నిత్యము వారు స్నానము చేయుటకు వచ్చులోపే ఆ చాకలి గంగకు చేరుకొనువాడు. తదుపరి శ్రీవారి వస్త్రములను శుభ్రముగా, చక్కగా ఉతికి సిద్ధపరచేవాడు. ఒకరోజు శ్రీపాదులవారు స్నానమునకై కృష్ణానదికి విచ్చేసిరి. చక్కగా, నిర్మలంగా, నిండుగా ప్రవహిస్తున్న కృష్ణానది జలములో శ్రీవారు ప్రవేశించిరి. ఎప్పటివలెనే నదీతీరమునందు వస్త్రములు శుభ్రపరచుటకై రజకుడు కూడా వచ్చెను. అతడు ప్రతినిత్యము మూడువేళలా శ్రీవారికి త్రికరణశుద్ధిగా సాష్టాంగ వందనము చేయువాడు.

దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో

అదేవిధముగా ఈ రోజున కూడా రజకుడు వచ్చి శ్రీపాదులవారి శ్రీచరణములకు సాష్టాంగవందనము చేసెను. శ్రీపాదులవారు అతని భక్తికి సంతసించి, ఆ రజకునితో వారన్నమాటలను జాగ్రత్తగా వినుము – శ్రీపాదులవారు రజకునివైపు ప్రసన్నవదనముతో చూచి, "ఏమిరా! నాయనా! ప్రతినిత్యము ఎంతో కష్టపడుచుంటివి. నీ భక్తికి నేనెంతయో సంతసించితిని. సుఖముగా రాజ్యమును ఏలుకొనుము" అని పలికిరి. శ్రీగురుని మాటలు విని, శుభశకునముగా భావించిన ఆ రజకుడు వారి మాటను మరచిపోకుండా గట్టిగా నమ్మి, గుర్తుపెట్టుకొనుటకై తన ధోవతియొక్క కొంగుచివరను ముడివేసికొనెను. వెంటనే చేతులు జోడించి, శ్రీవారి సత్యసంకల్పము నెరవేరునట్లుగా అనుగ్రహించుమని మనసులో భావించుచూ వారికి నమస్కరించెను. నాటినుండి ఆ రజకుడు తన సంసార చింతను వదలివేసి, శ్రీపాదులవారికి అనన్యభక్తుడాయెను. ప్రతినిత్యము వేకువనే లేచి శ్రీవారి మఠమునకు వెళ్ళెడివాడు. మఠప్రాంగణమును, పరిసరములను చక్కగా ఊడ్చి, చిమ్మి శుభ్రము చేయువాడు. ప్రతినిత్యము వారి వస్త్రములను ఉతికి, శుభ్రపరచి, జాగ్రత్త పరచువాడు. ఈ విధముగా శ్రీస్వామివారి పరిచర్యలన్నింటిని అత్యంతభక్తిప్రపత్తులతో ఆచరించుచుండెను. ఇక మూడువేళల వారు గంగకు వెళ్ళుచున్నప్పుడు, స్నానము చేసి తిరిగి వచ్చుచున్నప్పుడు ప్రతి పర్యాయము ఆ రజకుడు శ్రీపాదులవారి శ్రీచరణ సరోజములకు సాష్టాంగ వందనము చేయుచుండెడివాడు. ఈవిధముగా ఆ రజకుడు ఎంతోకాలము శ్రీవారికి సేవ చేసెను. (1-14)

అది వైశాఖమాసము, వసంతఋతువు. అట్టి సమయమున ఒకనాడు కృష్ణానదిలో హాయిగా జలకములాడి క్రీడించుటకొరకై ఒక మ్లేచ్ఛరాజు వచ్చెను. సర్వాభరణములతో, సాలంకృతలైన తన భార్యలతో కలిసి నావలో కూర్చొని, గంగలో విహరించదానికి, హాయిగా క్రీడించడానికి అతడు వచ్చెను. ఇక నదీతీరమున కోట్లకొలది ధనము విలువను కలిగినటువంటి ఆభరణములతో అలంకరించబడిన వైభవోపేతమైన అసంఖ్యాకమైన ఏనుగులు, గుఱ్ఱములు, రథములు కలిగిన సైన్యము నిలిచియుండెను. ఆ మహారాజు తన భార్యలతో సహా గంగాప్రవాహంలో క్రీడించుటకై దిగివచ్చెను. వారు నడచుచుండగా అనేకరకముల వాయిద్యములు మ్రోగించబడుచుండెను. అనేక రాగతాళములతో కూడిన సంగీతమును వింటూ హాయిగా నదీతీరమునందలి జలమునందు ప్రవేశించిరి. గంగను సమీపిస్తున్న శ్రీపాదులవారికి నమస్కరిస్తున్న రజకుని మనసు ఆ వాయిద్యముల ఘోషవైపు, సంగీత రాగములవైపు మరలెను. రాజుయొక్క ఉత్సవపూర్వకమైన శోభను, అతని వైభవమును చూచి, వాని మేను పులకరించిపోయెను. మనస్సు పారవశ్యము నొందెను. అప్పుడు అతని మనసులో ఆశాపూర్వకమైన ఒక సంకల్పము

కలిగెను. ఈ లోకమునందు మానవజన్మ ఎత్తిననాటినుండి సుఖము అనునది ఏమిటో నేనెంతమాత్రము ఎరుగనైతిని. ఏమి లాభము. ఈ నా దేహము పశువుతో సమానము. ఆహా! ఈ రాజు జీవితము ఎంతటి ధన్యమైనది. అనేక వస్త్రాభరణములతో, సౌందర్యవంతమైన అపురూపమైన, రూపవతులైన భార్యలతో మహత్తరమైన సౌఖ్యమును అనుభవించడానికి పూర్వజన్మలో ఇతడు ఎన్ని పూజలు చేసెనో, అతని పూర్వజన్మలో చేసిన కర్మఫలము ఎంత గొప్పదో కదా! అతడు ఏ దేవుణ్ణి పూజించెనో, ఏ గురువుయొక్క కృపను పొందెనో. ఇంత గొప్ప పదవిని పొందుటకు అతడు ఏమి చేసెనో తెలియదు. కానీ, ఈ మహారాజు ఎంతటి భాగ్యశాలియో కదా!' అని తన మనసులో ఆశాన్వితమైన ఉత్సాహమును ఆపుకొనలేక, చింతించుచూ, శ్రీపాద శ్రీవల్లభులవారి పాదపద్మములకు సాష్టాంగవందనము చేసెను. అపారమైన కృపామయుడగు శ్రీగురుపాదులు ఆతని మనసులో కలిగిన మనోరథమును గుర్తించెను. భక్తవత్సలుడైన శ్రీగురుమూర్తి అతని స్థితిని గుర్తించి, దగ్గరగా పిలిచి, "నాయనా! ఏమి ఆలోచించుచుంటివి" అని ప్రశ్నించెను. వెంటనే రజకుడు చేతులు జోడించి, స్వామివారితో వినయముగా ఇట్లు చెప్పెను - "గురుదేవా! ఆ రాజును చూచినప్పుడు శ్రీగురుదేవుల దాసుడైన ఈ దాసుని మనసునకు అంతులేని సంతోషము కలిగినది. ఏ దేవుని ఆరాధించుటవలన ఎంత గొప్ప తపస్సు చేయుటవలన ఇంతటి వైభవోపేతమైన స్థితిని ఈ రాజు పొందినాడో కదా!" అని నా మనసులో చింతించుచుంటిని. "కృపామూర్తీ! క్షమించుము. అజ్ఞానమువలన ఇంద్రియములకు అనేకవిధములైన వాసనలు రేకెత్తుచుండును. కానీ, భోగములపై నాకెంతమాత్రము ఇచ్ఛ లేదు. మీ చరణకమలముల సేవయే నాకు ఇహపర సౌఖ్యదాయకము" అని విన్నవించెను.

అందులకు శ్రీపాదులవారు అనుగ్రహించి, ఆ రజకునితో ఇట్లనెను - "నిజమే! నీవు జన్మించిన నాటినుండి కష్టపడుటయే తెలియును. అయితే, తమోగుణప్రభావమువలన రాచరికముమీద, రాజ్యపదవిమీద సుఖభోగముల కాంక్ష నీలో పొటమరించెను. మంచిదే. ఇంద్రియములను తృప్తిపరచాలి. అట్లు కానిచో మనసు పవిత్రము కాజాలదు. ఆంతరికమైన మనసునకు పవిత్రత చేకూరదు. అనంతరజన్మలో బహుబాధలు అనుభవింపవలసి వచ్చును. ఇంద్రియములను తృప్తిపరచుటకొరకై నీవు మ్లేచ్ఛవంశములో జన్మించుము. నీ మనసునకు ఇష్టమైనచో, ఇప్పుడే ఆ రాజ్యభోగములనుకూడా అనుభవింపవచ్చునని" అనెను. (15-30)

శ్రీపాదులవారి మాటలు విని భక్తిపూర్వకముగా రజకుడు చేతులు జోడించి, వినయముతో ఇట్లనెను - "కృపాసాగరా! శ్రీగురుమూర్తీ! నన్ను ఉపేక్షించవద్దు. అప్పుడు నేనొకవేళ మీ చరణ దాస్యమునకు దూరమైనచో, అది నేను సహింపలేను. కనుక, మీ చరణదర్శనమునకు

దూరము కాకుండా నాకు పునర్దర్శనమును ప్రసాదించుము. స్వామీ! మీ అనుగ్రహముతో నాకు జ్ఞానమును ప్రసాదించుము. ఏ జన్మను ప్రసాదించినను ఆ జన్మలో మీ అనుగ్రహము నాపై ఉండునట్లుగా, మిమ్ము మరువకుండునట్లుగా నన్ను అనుగ్రహింపుము" అని ఆ రజకుడు వేడుకొనెను. **అంతట మిగుల సంతసించిన శ్రీ గురుమూర్తి రజకునితో ఇట్లనెను** – "వైదురానగరములోగల మ్లేచ్ఛ వంశములో నీవు జన్మించెదవు. అచటికి నేనొకమారు కార్యాంతరమున తప్పక వచ్చెదను. అంతిమసమయములో అప్పుడు నీవు వచ్చి నన్ను దర్శించెదవు. మా దర్శనము కలిగిన వెంటనే నీకు జ్ఞానోదయమగును. ఎంతమాత్రము చింతింపవలసిన పనిలేదు. మా దర్శనమును అనుగ్రహించి నిన్నుద్ధరించుటకు నేను నీ వద్దకు వచ్చెదను. కానీ, మేము అప్పుడు సన్న్యాసివేషములో వచ్చి దర్శనమును ఇచ్చెదము. అప్పుడు వేరొక అవతారమున అవతరించి, నృసింహసరస్వతి అను పేరుతో ఉన్న గురుమూర్తిగా నీకు దర్శనమును ప్రసాదించెదను" అని ఆ రజకునికి నచ్చజెప్పి "ఇక వెళ్ళుము నాయనా!" అని అనుమతినిచ్చెను.

వెంటనే ఆ రజకుడు అత్యంత భక్తిప్రపత్తులతో శ్రీపాదులవారి చరణసరోజములకు సాష్టాంగవందనమును ఆచరించెను. కృపామూర్తియగు శ్రీగురుమూర్తి ఆ రజకుని తిరిగి తన వద్దకు పిలిచి, "నాయనా! నీవు కోరుకొనెడు రాజ్యభోగములు ఈ జన్మలోనే కావలయునా? లేక, రాబోయే జన్మలో కావలయునా? కోరుకొనుము" అని పలికిరి. **అంతట ఆ రజకుడు శ్రీపాదులవారి ముందు వినయముతో చేతులు జోడించి ఇట్లు పలికెను**– "గురుమూర్తీ! ఇప్పుడు నేను వృద్ధుడనైతిని. రాజ్యభోగములు పసితనమునుండి తరుణదశ వరకు అత్యంత మధురముగా అనుభవమునకు వచ్చును" అని రజకుడు పలికిన మాటలను విని శ్రీపాదులవారు, "మంచిది నాయనా! త్వరగా వెళ్ళిరా. వచ్చే జన్మలోనే నీవు కావలసిన భోగభాగ్యములను అనుభవించెదవు గాక" అని ఆ రజకునికి వరమును ప్రసాదించెను. ఆవిధముగా శ్రీగురుమూర్తి అనుజ్ఞను పొందిన అనంతరము ఆ రజకుడు ప్రారబ్ధవశముగా గురుమూర్తి అనుగ్రహముతో తన ప్రాణములను వదలివేసి, వైదురానగరములో గల మ్లేచ్ఛ వంశమునందు జన్మించెను. (ఈ రజకుని గురించిన కథను ఆ తరువాత నేను పూర్తిగా వివరించి చెప్పెదను అని సిద్ధుడు నామధారకునితో పలికెను.) (31-41)

నాయనా! నామధారకా! తదుపరి కథను వినుము – శ్రీపాదులవారు కురువపురములో నివసించిన సమయమున వారి అపార మహిమా విశేషములవలన వారి కీర్తి లోకమునందు అత్యంత విస్తీర్ణమయ్యెను. అట్టి మహిమలను గూర్చి చెప్పినచో ఏనాటికీ ఈ కథ ముగియునది

కాదు. అనంతరము వచ్చిన, ప్రసిద్ధమైన శ్రీవారి అవతారములను గూర్చి చెప్పవలసి యున్నది. అయినప్పటికీ శ్రీ గురుమహిమను వివరించి చెప్పుటకు నా వాక్కులకు అంతటి శక్తి ఎక్కడిది. అది కేవలము వారి అమృతమయమగు దృష్టి ప్రసారమాత్రముచేతనే కొన్ని విశేషములను నేను వివరింపగలుగుచుంటిని. శ్రీవారు నివసించిన చోటు అపారమహిమాన్వితమైనది. శ్రీపాదులవారి నివాసమువల్లనే కురువపురమనే గ్రామము లోకప్రసిద్ధి నొందెను. అచటి స్థానమహిమ అత్యంత విశేషమైనది. భక్తజనులెందరో నలువైపులనుండి కురువపురమునకు విచ్చేసి, శ్రీపాదులవారిని సేవించి, సఫల మనోరథులగుచుండిరి. ఆవిధముగా శ్రీపాదులవారు కురువపురములో చాలాకాలము నివసించిరి. పిమ్మట, మఱియొక అవతారమును ధరింపవలసిన అవసరమును దృష్టియందుంచుకొని వారు అచటినుండి అదృశ్యమైపోయిరి. ఆశ్వీయుజ మాసము, శరదృతువు, కృష్ణపక్షము, ద్వాదశి తిథి, మఖ నక్షత్రము, సింహరాశి యగు శుభసమయమున శ్రీపాదశ్రీవల్లభులవారు నిజానందస్థితిలో లయమై కృష్ణవేణీగంగలో ప్రవేశించి అదృశ్యమైపోయిరి. లోకమునకు అదృశ్యులైనట్లు కనిపించినప్పటికినీ త్రిమూర్త్యాత్మక స్వరూపులైన శ్రీపాదులవారు నిజమునకు నిర్గుణరూపముతో సర్వవ్యాపకులై కురువపురమునందు నిత్యసన్నిహితులై ఉండిరి. ఇప్పటికి కూడా కురువపురములో నిత్యసన్నిహితులై ఉండెదరు. నిర్మలమైన భక్తి కలిగినవారికి వారు తప్పక దర్శనమును ఇచ్చెదరు. కురువపురము గొప్ప మహిమాన్వితమైన క్షేత్రముగా ఈ లోకమునందు శ్రీవారి మహిమాప్రభావముచేత ప్రఖ్యాతి నొందినది. ఆ క్షేత్రమునందు శ్రీపాదులవారు భక్తులకు నిజరూపమున దర్శనమును ఇచ్చుచుండెదరు. అందుకు తగిన ఉదాహరణములు కూడా ఆ తరువాత నేను వివరించెదనని సిద్ధముని నామధారకునితో చెప్పిన అదే కథను గంగాధరుని ఆత్మజుడనైన సరస్వతీ అను నామమును కలిగిన నేను, మీ అందరికీ మరింతగా విస్తరించి చెప్పెదనని గ్రంథరూపమున వ్యక్తపరచెను. (42-53)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు
శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు
"రజకవరప్రదానము మరియు శ్రీపాద నిజానందగమనము" అను తొమ్మిదవ అధ్యాయము ॥ 9 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 53; మొత్తము సంఖ్య : 1182 + 53 = 1235 ఓవీలు)

◆ ◆ ◆

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

శ్రీ గురు చరిత్ర

పదవ అధ్యాయము

కురువపురమహిమను, గురుభక్తిని గూర్చి వర్ణించుట - వల్లభేశుడను భక్తుని దొంగలబారినుండి కాపాడి బ్రతికించుట - దుష్టశిక్షణ, శిష్టరక్షణ

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునికి నమస్కరించి ఇట్లనెను - "మహానుభావా! శ్రీపాదులవారు కురువపురము నందు నిత్యసన్నిహితులై ఉందురు. అట్లే, వేరొక అవతారమును ధరించుటకై శ్రీపాదులు తన అవతారమును చాలించి, అదృశ్యులైనారు. లోకమునందు బాహ్యదృష్టితో అవతారమును ఉపసంహరించినప్పటికినీ కారణాంతరమున వారు తిరిగి దర్శనమిచ్చిరని మీరు సెలవిచ్చితిరి కదా! అంతటి మహిమాన్వితమైన కురువపుర క్షేత్రముయొక్క మాహాత్మ్యమును మరింతగా వివరించి చెప్పగలరని" ప్రార్థించెను. అంతట, నామధారకుని జిజ్ఞాసను, గురుమహిమను తెలిసుకొనవలయుననెడి ఉత్కంఠను గమనించి, **సిద్ధుడు ఇట్లు చెప్పసాగెను** - "నామధారకా! శ్రీగురుమహిమను గూర్చి నీవు ఏమని అడిగెదవు? నేను ఏమని చెప్పుదును? విశ్వవ్యాపకుడైన ఆ పరమేశ్వరునియొక్క మహిమను వర్ణించి చెప్పుటకు ఎవడు సమర్థుడగును? శ్రీపాదులవారు కురువపురములో గోప్యముగా ఉండి, ఒక కార్యాంతరమున తిరిగి అవతరించిరి. మరొక్కమాట, వారు ఇప్పటికినీ కురువపుర క్షేత్రమునందు సమస్త భక్తులకు తోడునీడై వారిని రక్షించుచునే యుందురు. విశ్వవ్యాపకుడైన పరమాత్మ ఒక్కడే అనంతరూపములతో విశ్వరూపుడై వెలుగుచున్నాడు. నాయనా! నామధారకా! నారాయణుడు ఒక్కడే సుమా! తాను ఒకే ఒక స్వరూపుడై ఉండికూడనూ "పరిత్రాణాయ" అని చెప్పినట్లుగా భక్తులను రక్షించుటకొరకై ఏకకాలమునందు గానీ, వేర్వేరు కాలములయందు గానీ అనేక విధములైన అవతారములను ధరించుటకు ఆయన సమర్థుడని గ్రహించుము.(1) పరశురాముడై ఇప్పటికీ జీవించియున్నాడు. తానే ఆ తరువాత శ్రీరామాది అవతారములను

---

1. **పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ । ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** (గీత. 4/8)
సత్పురుషులను రక్షించుటకు, దుష్టులను శిక్షించుటకు, ధర్మమును చక్కగా కాపాడుటకొరకు నేను యుగ, యుగముల యందు అవతరించుచుందును.

ధరించెను. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి కొనసాగుచున్నదని నీవు స్పష్టముగా గ్రహించుము. దుర్వాసమహర్షి శాపమును నిమిత్తముగా చేసికొని, భక్తులను ఉద్ధరించుటకొరకై ఆ హృషీకేశుడు త్రిమూర్త్యాత్మకస్వరూపుడై అవతరించెను. త్రిమూర్తులకు ఉత్పత్తి, స్థితి, లయములు అనే మూడు గుణములు, సామర్థ్యములు ఒకే విధముగా ఉండియుండును. త్రిమూర్తుల అవతారములయొక్క అంతరార్థమును ఎవరు గ్రహింపగలరు? ఎందుకనగా, త్రిమూర్తిస్వరూపులైన శ్రీపాదశ్రీవల్లభులవారు భక్తులను అనుగ్రహించుటకై తన అవతారమును తిరోధానము చేసి, నృసింహసరస్వతియై అవతరించినప్పటికినీ, వారు పూర్వస్వరూపముతో కురువపురమునందు భక్తజనమునకు మిక్కిలి చేరువగా ఉందురు. ఇది నిశ్చయము. శ్రీగురుమూర్తి ఆ ప్రదేశమున కొంతకాలము నివసించుటచే భక్తులకు కామధేనువుగా మారెను. అంతేకాదు, శ్రీగురుడు నిలిచిన ప్రతిచోటు భక్తజనులకు కల్పవృక్షమే యగును. శ్రీగురుచరణ దర్శనభాగ్యముతో భక్తులందరి మనోరథములు తప్పక ఈడేరగలవు. అంతటి అపారమహిమాన్వితమైన శ్రీపాదశ్రీవల్లభుల స్థానముయొక్క మాహాత్మ్యమును వర్ణించుటకు ఒక పామరుడైన నేను ఎంతటివాడను. అంతులేని అట్టి మాహాత్మ్యమును చెప్పుటకు నేను అశక్తుడను. ఆయన ఎంతమాత్రము కఠినమైన హృదయము కలిగినవారు కాదు. నిత్యము భక్తజనులకొరకై నిరీక్షించుచుందురు. మనసులో దృఢమైన విశ్వాసమును గలిగి, అత్యంత భక్తిభావముతో ధైర్యమును వహించి, ఎవరు వారిని సేవించెదరో, అట్టివారు సర్వాభీష్టములను తప్పక పొందెదరు. అంతేకాదు, అట్టివారే సంసారసాగరమునుండి ఆవలితీరమునకు హాయిగా చేరుకొందురు. ఇహపరసౌఖ్యములను కొదువలేకుండా పొందగలుగుదురు. గురుభక్తి ఎన్నడునూ వ్యర్థము కాదని నీవు గట్టిగా నిశ్చయించుకొనుము. అందువలన గురుభక్తి మహిమను నిరూపించు నిమిత్తముగా బలమైన దృష్టాంతముగా, నీకు ఒక చిత్రమైన కథను చెప్పెదను **జాగ్రత్తగా వినుము** – (1-12)

కురువపురమునకు కొలదిదూరమునందు ఒక గ్రామము ఉండెను. అచట కాశ్యపస గోత్రమునందు జన్మించిన వల్లభేశుడను పేరుగల ఒక బ్రాహ్మణుడుండెను. అతడు సదాచారసంపత్తి గలవాడు, సౌశీల్యవంతుడు. అయితే, అతడు వ్యాపారమును వృత్తిగా చేసుకొని కుటుంబమును పోషించుకొనుచూ జీవనము గడుపుచుండెను. ప్రతి సంవత్సరము శ్రీపాదక్షేత్రమైన కురువపురమునకు ఆతడు యాత్రగా వెళ్లుచుండెను. ఇట్లు వ్యాపారమును చేయుచూ, కొంతకాలమునకు అతడు గొప్ప ధనవంతుడయ్యెను. ఒక సంవత్సరము పాటు వ్యాపారనిమిత్తముగా బయలుదేరుటకు ముందు శ్రీపాదశ్రీవల్లభుల వారిని మనసారా ధ్యానించి, "గురువర్యా! ఈ సంవత్సరము వ్యాపారమునందు నాకు ఎక్కువ లాభము

లభించినచో, కురువపురమునకు వచ్చి, సహస్రబ్రాహ్మణసమారాధనమును నిర్వహించెదను. వారందరికి మృష్టాన్నభోజనమును పెట్టెదను" అని సంకల్పించుకొనెను.

అనంతరము వ్యాపారమునకై బయలుదేరి నిరంతరము తన మనసులో శ్రీపాదశ్రీవల్లభుల శ్రీచరణములనే ధ్యానిస్తూ, గురునామమునే స్మరిస్తూ, ఆ బ్రాహ్మణుడు పరదేశమునకు వెళ్ళి వ్యాపారమును చేయుచుండెను. అతడు ఎక్కడెక్కడికి వెళ్లుచుండెనో, అక్కడక్కడ అత్యంత సులభముగా వ్యాపారము జరిగి రెట్టింపు లాభమును పొంది సంతోషమును అనుభవించుచుండెను. ఈవిధముగా ఆ యేడాది తాను చేసిన వ్యాపారమువలన వందరెట్లు అధికముగా ధనమును సంపాదించగలిగెను. మిక్కిలి పరమానందభరితుడై, ఆతడు తిరిగి ఇంటికి చేరుకొనెను. తాను పూర్వము సంకల్పించిన ప్రకారముగా బ్రాహ్మణ సంతర్పణ చేయుటకై శ్రీపాదులవారి శ్రీచరణములయందు మనస్సును లగ్నము చేసి తగిన ద్రవ్యమును వెంట తీసికొని కురువపురక్షేత్ర యాత్రకు బయలుదేరెను. ఆ ద్విజవర్యుడు ద్రవ్యమును మూటగట్టుకొని బయలుదేరుటను కొందరు దొంగలు చూచిరి. వారు కపటరూపమును ధరించి, ఆ బ్రాహ్మణుని వద్దకు వచ్చి, "అయ్యా! మేము కూడా మీతోపాటుగా కురువపురమునకు వచ్చెదము. మీకు తోడుగా ఉండెదము అని మాయమాటలను" చెప్పి అతనివెంట బయలుదేరిరి. (13-20)

ప్రయాణమునందు రెండుమూడురోజులు ఆ దొంగలు ఆతనికి తోడుగా ఉండిరి. ఒకరోజు రాత్రి త్రోవలో నడచుచూ ఆ దొంగలు బ్రాహ్మణునితో "మేము ప్రతి సంవత్సరము ఒక నియమముతో శ్రీపాదశ్రీవల్లభుల దర్శనార్థమై కురువపురమునకు వెళ్లుచుందుము అని మంచిమాటలను చెప్పుచూ", అదనుచూసి మార్గమధ్యమున ఆ బ్రాహ్మణుని చంపివేసి, అతని ద్రవ్యమును దోచుకొనిరి. అతనివద్ద గల ద్రవ్యమునంతయు మూటగట్టుకొని వెళ్లుటకు సమాయత్తమైరి. ఇంతలో ఆశ్రితభక్తజనరక్షకులైన శ్రీపాదశ్రీవల్లభులు జడలను విరబోసుకొని సర్వాంగములకు భస్మవిలేపనముతో శోభిల్లుచూ, మారువేషముతో కురువపురమునుండి బయలుదేరి, తన భక్తుడు చంపబడి, దొంగలు పలాయనము చిత్తగించు సమయమున ప్రత్యక్షమైరి. ఒక చేతిలో త్రిశూలమును ధరించి మరొకచేతిలో ఖడ్గమును పట్టుకొని, దొంగలముందు ప్రత్యక్షమై, హుంకరించి వెంటనే వారిని తన త్రిశూలముతో వధించిరి. ఆ దొంగలను వధించుచున్నప్పుడు వారిలోగల ఒకడు పరుగెత్తుకొని వచ్చి శ్రీపాదులవారి చరణములపై పడి, "కృపాళూ! జగన్నాథా! నేను నిరపరాధిని. వీళ్ళు దొంగలని, ఈ బ్రాహ్మణుని వధించెదరని నాకు తెలియక వీరితో కలిసి వచ్చితిని. మీరు సర్వాంతర్యాములు. అందరిహృదయములను తెలిసినవారు. కావున, నా మనవిని ఆలించి, దయతో నన్ను రక్షింపుము" అని వేడుకొనెను.

ఆ వ్యక్తి నిస్సంకోచముగా. కపటము లేకుండా విన్నవించిన సత్యమైన మాటలను వినిన శ్రీపాదులవారు అతనియందు దయదలంచి, తన సమీపమునకు రమ్మని పిలిచి, అతని చేతిలో విభూతిని పెట్టి, చనిపోయిన విప్రుని శరీరముమీద చల్లుమని చెప్పిరి. "నాయనా! ఆ బ్రాహ్మణుని తెగిన మస్తకమును తెచ్చి అతని మెడకు ఆనించి పెట్టి, ముఖమునకు తాను మంత్రించి ఇచ్చిన విభూతిని ధరింపచేయుమని" ఆదేశించిరి. అతడట్లే చేసెను. తత్క్షణమే వల్లభేశుడనే ఆ బ్రాహ్మణుడు నిద్రనుండి లేచినవానివలె సజీవుడయ్యెను. ఇదంతయూ జరుగుసరికి సూర్యోదయమయ్యెను. వెంటనే శ్రీపాదులవారు అంతర్ధానమునొందిరి. బ్రతికియుండిన దొంగ ఆ విప్రునివద్దనే ఉండిపోయెను. (21-30)

ఆ బ్రాహ్మణుడు లేచి కూర్చొని, తన ప్రక్కనగల వ్యక్తిని "నీవు ఎవరవు? నన్నెందుకు పట్టుకొని నా ప్రక్కన కూర్చునియుంటివి. ఈ మనుషులను ఎవరు వధించిరి" అని అడిగెను. **అప్పుడా వ్యక్తి బ్రాహ్మణునితో ఇట్లు పలికెను** - "అయ్యా! త్రుటిలో ఒక అద్భుతము జరిగిపోయినది. భస్మమును ధరించి, త్రిశూలమును పట్టుకొని ఒక తాపసి వచ్చి, నిన్ను చంపిన ఈ దొంగలను తన త్రిశూలముతో వధించివేసెను. నన్ను రక్షించెను. తాను మంత్రించిన విభూతిని కడు ప్రీతితో నీకు ధరింపచేసి మిమ్ములను బ్రతికించెను. ఆ తాపసి ఇచ్చిన విభూతిని ధరింపచేసిన వెంటనే నీ దేహములో జీవము వచ్చెను. ఇప్పుడే నీ సమీపమున నిలబడియున్న ఆ మునీశ్వరుడు వెంటనే అదృశ్యమైపోయెను. నీ ప్రాణములను రక్షించిన ఆ మునీశ్వరుడు ఎవరో నాకు మాత్రము తెలియదు. బహుశః ఆయన సాక్షాత్తుగా ఈశ్వరుడే అయ్యుండవచ్చును. దేహమంతా భస్మలేపనము చేసుకొని జటాధారియై, త్రిశూలమును ధరించిన ఆ స్వామికి నీవు భక్తుడవై యుండవచ్చును. వెంటనే వచ్చి నీ ప్రాణమును సంరక్షించిరి" అని ఆ దొంగ వ్యక్తి చెప్పిన మాటలను విని విశ్వసించిన ఆ విప్రుడు అపహరింపబడిన తన ద్రవ్యమును ఆ వ్యక్తి చేతినుండి తీసికొని వెంటనే కురువపురమునకు బయలుదేరెను. (31-36)

అచట సహస్రబ్రాహ్మణ సమారాధన చేయుదునని ముందుగా మ్రొక్కుకొనెను. కానీ, శ్రీపాదులవారు కృపాసింధువై దొంగలబారినుండి తన ప్రాణములను రక్షించి, మరణించిన నన్ను సజీవుని చేసినందున ఒక్క సహస్రము కాదని, నాలుగువేల మంది బ్రాహ్మణులకు, ఇతర భక్తజనులకు సమారాధనము గావించెను. అత్యంత భక్తితో శ్రీపాదులవారి గురుపాదుకలను అర్చించెను. భక్తజనబృందమును గురుస్వరూపముగా భావించి, వారికి మృష్టాన్నభోజనమును పెట్టి, తాను సంతృప్తుడయ్యెను. ఈవిధముగా అనేకవేలాదిమంది భక్తులు అత్యంత ప్రసిద్ధినొందిన మహిమాన్వితమైన కురువపురక్షేత్ర యాత్రకు విచ్చేసి శ్రీపాదశ్రీవల్లభుల శ్రీచరణములను పూజించి, తమయొక్క మనోరథములను సఫలముగా

పొందెదరు. ఈ క్షేత్రము యొక్క మహిమ అపారమైనది" అని సిద్ధుడు నామధారకునితో చెప్పి, "నాయనా! శ్రీపాదులవారు కురువపురములో గుప్తరూపమున ఉండెదరు. ఈ విషయమునందు ఎంతమాత్రము సంశయింపవలసిన పనిలేదు. వారు ఆ తరువాత నృసింహసరస్వతి అనే మరొక అవతారమును ధరించవలెనను ఉద్దేశ్యముతో ఎవరికీ కనిపించకుండా అంతర్ధానము నొందిరి.(37-39)

"అనంతరూపనారాయణుడు సర్వవ్యాపకుడై పరిపూర్ణముగా అన్నిప్రదేశములయందు, అన్నిచోట్ల యందు పరివ్యాప్తిని చెంది వెలుగొందుచుండును. లౌకికదృష్టికి శ్రీపాదశ్రీవల్లభులు అదృశ్యులైపోయినప్పటికీనీ పారమార్థిక దృష్టికి, నిర్గుణ, నిరాకారులై కురువపురమునందు భక్తజనులకు అత్యంత సన్నిహితులై ఉందురు, ఉండెదరు, ఉన్నారు. ఇంతేకాదు, అనంతరము శ్రీనరసింహ సరస్వతిగా అవతరించి అంతులేని ఖ్యాతినొందిరి. ఇది ముమ్మాటికీ సత్యము" అని నామధారకునితో సిద్ధమునీంద్రుడు కురువపురక్షేత్ర మహిమను స్పష్టముగా వివరించెను. ఈ కథను భక్తితో పఠనము, శ్రవణము చేయువారు సమస్తమనోభీష్టములను పొందగలరని" నామధారకునకు సిద్ధముని చెప్పిన విధమును గంగాధరసరస్వతి గురుచరిత్ర రూపమున శ్రోతలందరకు వెల్లడించెను. (40-42)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు
శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు
"కురువపురక్షేత్ర మహిమా వర్ణనము" అను పదవ అధ్యాయము ॥ 10 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 42; మొత్తము సంఖ్య : 1235 + 42 = 1277 ఓవీలు)

◆ ◆ ◆

లోకాభిరామం గుణభూషణాఢ్యం, తేజో మునిశ్రేష్ఠ మునిర్వరేణ్యమ్ ।
సమస్త దుఃఖాని భయాని శాంతం, శ్రీపాదరాజం శరణం ప్రపద్యే ॥
(శ్రీపాదరాజాష్టకము - శ్లో-5.)

శ్రీ గురు చరిత్ర

పదకొండవ అధ్యాయము

శ్రీగురుకృపతో వరమును పొందిన స్త్రీమూర్తి మరుజన్మలో అంబాభవానిగా జన్మించుట - శ్రీపాదులు తిరిగి ఆమె గర్భవాసమున నరహరిగా అవతరించుట - బాల నరహరి అద్భుతలీలలు ప్రదర్శించుట - మూగవానిగా తలంచిన నరహరి ఉపనయనమునందు చతుర్వేదములను పఠించుట - లోకులు అబ్బురపడుట - సన్న్యాసము స్వీకరించుటకై బ్రహ్మచారినరహరి తల్లి అనుమతిని కోరుట - అందుకు ఆమె నిరాకరించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధమునికి నమస్కరించి, చేతులు జోడించి నామధారకుడు ఇట్లనెను - "స్వామీ! కృపామూర్తీ! శ్రీపాదశ్రీవల్లభులవారు ఆ తరువాత అవతరించిన కథను వివరించి చెప్పవలసినదని" ప్రార్థించెను. అప్పుడు సిద్ధముని సంతోషించి, **నామధారకునితో ఇట్లు చెప్పదొడగెను.** "నాయనా! వినుము. శ్రీపాదులవారు అవతరించిన విషయమును గురించి, మరియు వారినే తనకు పుత్రునిగా కాగలిగే వరమును ప్రసాదింపుమని ప్రార్థించిన బ్రాహ్మణ స్త్రీ వృత్తాంతమును గూర్చి క్రిందటి ఎనిమిదవ అధ్యాయమునందు నీకు వివరించి చెప్పితిని. అయితే, శనిప్రదోషవ్రతమును ఆచరింపుమని ఆదేశించిన బ్రాహ్మణ స్త్రీ గర్భమున తాను అవతరింపదలచి శ్రీపాదులవారు తన అవతారమును తిరోధానము చేసినారని, క్రిందటి అధ్యాయమునందు నీకు చెప్పియుంటిని. ఆ తరువాత జరిగిన కథను ఇప్పుడు నీకు వివరించెదను శ్రద్ధగా వినుము. (1-2)

గురూపదేశమును అనుసరించి ఒక శనిత్రయోదశినాడు ప్రదోషకాలమునందు ఆ బ్రాహ్మణ స్త్రీ పరమేశ్వరుని అత్యంత భక్తిభావముతో పూజించుచుండెను. ఇంతలో ఆమెకు ఆయువు తీరి తన దేహమును చాలించెను. ఆమెయే మరుజన్మలో ఉత్తరదేశమునందుగల కారంజనగరమునందు వాజసనేయ శాఖకు చెందిన ఒక బ్రాహ్మణ దంపతుల గర్భవాసమున కూతురుగా జన్మించెను. కూతురు జన్మించిన సంతోషముతో ఆ తండ్రి జ్యోతిష్కులను పిలిపించి, ఆమె జాతకమును పరిశీలింపుమని కోరెను. అప్పుడు వారు నవజాత శిశువుయొక్క

జాతకమును పరిశీలించి "ఈమె సాక్షాత్తు భవానీదేవియే. మీరెంతమాత్రము సందేహింపవలదు. కనుక, ఈమెకు 'అంబా-భవాని!' అనే పేరును పెట్టుమని చెప్పిరి. జ్యోతిష్కులు చెప్పినమాటను శిరసావహించి ఆ అమ్మాయికి తల్లిదండ్రులు 'అంబా భవాని' అని నామకరణము చేసిరి. ఆమెను మిక్కిలి గారాబముతో పెంచి పోషించుచుండిరి. యుక్తవయస్సు వచ్చినమీదట ఆ అమ్మాయికి వివాహము చేయదలంచిన ఆమె తల్లిదండ్రులు అదే గ్రామమునందు గల పరమశివభక్తుడైనట్టి 'మాధవుడు' అను పేరు గలిగిన ఒక ఉత్తమబ్రాహ్మణ కుమారునకు అత్యంత ప్రీతితో ఇచ్చి, శాస్త్రవిధానముననుసరించి కన్యాదానమును చేసిరి. అనంతరము 'అంబా భవాని' అత్తవారింటికి వెళ్ళి భర్తయైన మాధవుని ఇంటిలో చక్కని ఆచారములను పాటించుచుండెను. పూర్వజన్మసంస్కారమువలన ఆ దంపతులు ఇద్దరూ పరమేశ్వరుని పూజించుచుండిరి. అంతేగాక, ఆ భార్యాభర్తలు ఇద్దరూ మనస్ఫూర్తిగా 'శనిత్రయోదశి' నందు ప్రదోష సమయంలో, కడు భక్తిశ్రద్ధలతో, విశేషమైన విధానముతో ఈశ్వరుని పూజించుచుండిరి. ఈవిధముగా 'అంబా భవాని'కి పదహారేండ్ల ప్రాయము వచ్చెను. ఇంతలో ఆమెయందు గర్భవతి లక్షణములు గోచరించెను. అది చూసిన ఇంటి పెద్దలు, భర్తతో పాటుగా అందరూ సంతసించి, శాస్త్రప్రకారముగా మూడవమాసములో పుంసవనము, ఐదవ మాసమునందు సీమంతము అను గర్భధారణ సంస్కారములను చక్కగా నిర్వహించిరి. అంతేగాక, ఆ అంబా భవాని మిక్కిలి ఆనందోత్సాహములతో ఉంటూ బ్రహ్మజ్ఞానమును గురించి ముచ్చటించుచుండెడిది. ఏడవ మాసము సంప్రాప్తము కాగానే, గర్భవతి అయిన అంబా భవానికి బ్రాహ్మణులను, బ్రాహ్మణ దంపతులను ఆహ్వానించి, చక్కగా శాస్త్రీయవిధానముగా సీమంతోన్నయనమును చేసిరి. అక్షయ వాయన దానములను ఇచ్చిరి. ముత్తైదువులందరు కలిసి ఆ గర్భవతికి ఆనందదాయకముగా హారతులనిచ్చి, చక్కని పుత్రుడు కలగాలని నిండుమనసుతో ఆశీర్వదించిరి. అనంతరము ఆమెకు దృష్టిదోషమును కూడా తీసివేసిరి. (3-12)

ఇట్లు క్రమముగా నవమాసములు పూర్తియైన ఒక శుభముహూర్తమున ఆ పరమపతివ్రతయైన, అచ్చమైన బ్రహ్మజ్ఞానము కలిగిన, 'అంబా భవాని' చక్కని పుత్రుని ప్రసవించెను. పుత్రోదయమైన వెంటనే తల్లిదండ్రులకు అంతులేని ఆనందము కలిగెను. అయితే, పుట్టిన వెంటనే ఆ బాలుడు గొప్పగా 'ఓం'కార శబ్దమును ఉచ్చరించెను. అక్కడ చేరిన వారందరు, అలౌకికమైన ఈ సంఘటనను గాంచి, నవజాతశిశువు నోటినుండి ప్రణవశబ్దము ఉచ్చరింపబడుటను విని, అత్యంత అద్భుత, ఆశ్చర్యమునకు లోనైరి. తదుపరి మాధవుడను ఆ బ్రాహ్మణుడు ఇంటికి వచ్చిన బ్రాహ్మణులకు అపరిమిత దక్షిణలు, దానములనిచ్చి జాతకర్మసంస్కారమును చేయించెను. జ్యోతిశ్శాస్త్రవేత్తలు అతడు జన్మించిన శుభసమయ లగ్నమును బాగుగా పరిశీలించి, "ఆహా! ఈ జాతకము అత్యద్భుతమైనది. సులక్షణరీతిగా ఉన్నదని" నుడివిరి.

జ్యోతిశ్శాస్త్రవేత్తలు బాలుని తండ్రితో ఇట్లు పలికిరి- ఈ పిల్లవాడు జన్మించిన ముహూర్తము అత్యంత విశేషమైనది. నీ కుమారుడు అవతారపురుషునిగా ప్రసిద్ధి నొందగలడు. పిన్నవయసునుండియే అందరికీ వందనీయుడు కాగలడు. అనంతరము గొప్ప సద్గురువుగా మారగలడు. లోకములోని జనులను ఉద్ధరింపగలడు. అంతేకాదు, ఇతని అనుగ్రహమును పొందినవారు కూడా లోకమునందు వందనీయులు కాగలరు. ఈ కుమారుని మాటలు ఇనుమును బంగారుగా మార్చగల పరుసవేదివలె వుండును. ఇతని చూపులు అత్యంత అనుగ్రహసంపన్నమై తనను చేరవచ్చినవారిని తరింపచేయు కరుణాకటాక్షములను కలిగియుండును. ఇతని శ్రీచరణములు చింతామణి వంటివి. ఇతని ఇంటిద్వారమునందు అష్టసిద్ధులు సదా నిలబడి సేవించుచుండును.

ద్విజోత్తమా! అతని ఇంటియందు నిరంతరము నవనిధులు నివసించియుండును. కానీ, భార్యాబిడ్డలు లేని ఈ బాలకుడు త్రిభువనములయందు అత్యంత పూజ్యుడగును. ఇతని దర్శనమాత్రముననే పతితులందరు పవిత్రులయ్యెదరు. ఇతడొక గొప్ప అవతారపురుషుడు కాగలడని, ఈ జాతకము మాకు నిశ్చయముగా ప్రకటించుచున్నది. ఈ విషయములో నీవు ఎంతమాత్రము సందేహింపవలసిన పనిలేదని, దృఢముగా జ్యోతిశ్శాస్త్రవేత్తలు ఆ కుమారుని తండ్రికి, తల్లికి వివరించి చెప్పిరి. అంతట, ఆ బాలకుని తండ్రి జ్యోతిశ్శాస్త్రవేత్తలకు నమస్కరించెను. తిరిగి **ఆ జ్యోతిశ్శాస్త్రవేత్తలు మరొకమాట చెప్పిరి.** "బ్రాహ్మణోత్తమా! మీ కుమారునకు కలికాలదోషము ఎంతమాత్రము అంటబోదు. నీ మనసులో ఉన్న మనోరథములన్నియు వెంటనే నెరవేరిపోవును. మహానిధియే నీ ఇంటికి వచ్చి చేరినది. దానిని చక్కగా కాపాడుకోవలసిన బాధ్యత నీదే సుమా!" అని ఆ జాతకమును చక్కగా పరిశీలించి ఆ జ్యోతిష్యపండితులు, తలిదండ్రులకు స్పష్టముగా చెప్పిరి. జాతకఫలితమును విన్న తలిదండ్రులు ఎంతయో ఆనందించి, వారు మహదానందభరితులైరి. వెంటనే ఆ తలిదండ్రులు ఇద్దరూ, అత్యంత సంతోషాంతరంగులై జ్యోతిషశ్శాస్త్రవేత్తలకు జాతకర్మ సంస్కారమును నిర్వహించిన బ్రాహ్మణులకు, అమూల్యమైన వస్త్రాభరణములనిచ్చి, సంతృప్తి కలిగే భూరి దక్షిణలను సమర్పించి, వారికి నమస్కరించి వీడ్కోలు పలికిరి. (13-23)

అనంతరము తలిదండ్రులు అత్యంతప్రేమతో తమ కుమారునకు దృష్టిదోషము తగులునేమోనని గాభరాపడి ఉప్పు, ఆవాలు మొదలగు ద్రవ్యములతో అతనికి దృష్టిదోషమును తీసివేసిరి. ఈ వార్త కారంజ నగరమంతటా గుప్పుమని ప్రాకిపోయినది. "అప్పుడే పుట్టిన పిల్లవాడట. పుట్టగానే 'ఓం'కారమును ఉచ్చరించినాడట" అని ఒకరికొకరు గుసగుసలు చెప్పుకొనుచూ, పట్టరాని ఉత్సాహమును నిలుపుకోలేక అత్యంత ఆశ్చర్యచకితులై ఆ నవజాతశిశువును చూచుటకై తండోపతండాలుగా వచ్చి, ఆ బాలుని చూచి, సంతసించుచుండిరి. అతని గురించి

ఆశ్చర్యకరముగా ఒకరికొకరు గొప్పగా చెప్పుకొనుచుండిరి. తమ నగరములోగల ఆప్తమిత్రులు, బంధుజనులు, ఇతరులందరూ ఈ విచిత్రమును చూచుటకై తండోపతండములుగా వచ్చిపోవుచుండిరి. తల్లి మాత్రము తన కుమారునికి ఎక్కడ దృష్టిదోషము తగులునో, వీడేమగునో అనే వ్యామోహపూరితమైన అజ్ఞానముతో ఆమె అందరికి తన బిడ్డను చూపించకుండెను. కానీ, వచ్చినవారందరూ బ్రతిమాలి, ఒక్కమారు మాత్రమే చూచిపోయెదమమ్మా! అని కోరి, కోరి ఆ బాలుని దర్శించి పోవుచుండిరి. మాయామోహముతో ఆ తలిదండ్రులు పసివాడికి దృష్టిదోషము తగులుననని విభూతిని ధరింపచేసేవారు. మంత్రించిన రక్షరేకులు, నల్లదారముతో గుచ్చి, అతని మెడలో కట్టిరి. కానీ, నిజమునకు పరమాత్మయే అవతారపురుషుడై జన్మించిన ఆ పిల్లవాడికి దృష్టిదోషము ఎట్లు తగులును? కానీ, లౌకికధర్మమును అనుసరించి, మోహమమకారములతో ఆ తల్లిదండ్రులు అతడిని బహుజాగ్రత్తగా సంరక్షించుచుండిరి. పిల్లవాడు జన్మించి పది రోజులు గడచిన పిమ్మట అతని తండ్రియైన మాధవుడను ద్విజోత్తముడు నామకరణము చేయదలంచెను.

తమ కుమారునకు నామకరణ మహోత్సవమును నిర్వహింప తలచిన ఆ తల్లిదండ్రులు బ్రాహ్మణులను, బంధుమిత్రులను తమ ఇంటికి ఆహ్వానించిరి. నామకరణ సంస్కారమును వైదిక ధర్మమును అనుసరించి పూర్తిచేసిన పిమ్మట, ఆ బాలునకు 'సాలగ్రామదేవా' అను జన్మనామమును పెట్టిరి. తదుపరి వ్యవహారనామముగా 'నరహరి' అనిపేరు పెట్టిరి. అనంతరము లోకమునందు అందరు 'నరహరి' అనే నామముతో ఆ బాలుడిని పిలిచేవారు. ఈ బాలుడు పెరిగి పెద్దయైన పిమ్మట, నరహరి అనే నామముతోనే లోకమునందు ప్రసిద్ధినొందెను. (14-30)

ఆ తలిదండ్రులు తమ కుమారుని కడు ప్రీతితో, మిక్కిలి గారాబముతో పెంచి పోషించుచుండిరి. ఇట్లుండగా ఒకనాడు తల్లి బిడ్డకు సరిపోవునంతటి స్తన్యము తన వద్ద లేనందున మిక్కిలి విచారపడి **భర్తతో ఇట్లు చెప్పెను** – "నా పాలు బిడ్డకు సరిపోవడములేదు. వాడి ఆకలిని తీర్చుటకు నా స్తన్యము సరిపోవుటలేదు. అందువలన పిల్లవాడికి పాలు ఇచ్చుటకొరకు ఒక దాదిని మాట్లాడినచో బాగుండునని తోచుచున్నది. లేదా, ఒక పాడి ఆవును గానీ, మేకనుగానీ తెచ్చి, దాని పాలతో పోషించినచో బాలుడు వృద్ధి చెందగలడని" ఆమె కోరెను. ఇంతలో ఆమె స్తన్యము తన ఆకలిని ఉపశమింపచేయుట లేదని తల్లి చెప్పిన మాటలను విని, ఒడిలో ఉన్న బాలుడు నవ్వెను. వెంటనే, తన కుడిచేతితో తల్లి వక్షస్థలమును స్పృశించెను. తల్లి వక్షస్థలమునకు ఆ బాలుని చేతి స్పర్శ తగిలిన వెంటనే ఆమె స్తనములయందు పాలు నిండారి ముప్పదిరెండు ధారలతో స్రవించి, ఆమె ధరించిన వస్త్రములను తడిపివేసి విచిత్రముగా పొంగి నేలమీద ప్రవహింపసాగెను. ఆ అద్భుతమును చూచిన తలిదండ్రులకు మేరలేని విస్మయము కలిగెను. వారు అత్యంత ఆశ్చర్యమునకు లోనైరి. తమ అజ్ఞానమునకు తామే వగచిరి. అయితే,

పిల్లవాడి మహిమ లోకమునకు తెలిసి దృష్టిదోషము తగులునేమోనను భయముతో ఈ విషయమును ఎవరికీ చెప్పకుండా గోప్యముగా ఉంచిరి. అట్టి మహిమాన్వితమైన ప్రభావశాలియగు తన కుమారుని చూచి, ఒక దినమున ఆ తల్లి తన పిల్లవాడిని ఆడించుచూ, అతని చరణములకు నమస్కరించినది. పిల్లవాడిని ఊయలలో పడుకోబెట్టి అత్యంత ఆనందముతో జోలపాట పాడటం ప్రారంభించినది. కానీ, పిల్లవాడు మాత్రము ఊయలలో ఊగక ఎల్లప్పుడూ నేలమీదనే ఆడుకొనువాడు. ఈవిధంగా ఆ పసిబాలుడు తల్లిదండ్రుల మమకారముతో పెరుగుతూ ఒక సంవత్సర ప్రాయము కలిగిన వాడాయెను. కాని, అతని నోట ఒక్క మాట కూడా రాదయ్యెను. అతడొక్క మాట కూడా మాట్లాడుటలేదు. తల్లి కుమారుని చూచి, 'నాయనా! ఒక్క మాటైనా పలుకు తండ్రీ!' అని తల్లి కోరగానే ఆ పసివాడు 'ఓం'కారమును ఉచ్చరించేవాడు. వేరొక మాటను పలుకువాడు కాదు. "అయ్యో! ఇతడు మూగవాడా! ఏమిటి?" అని ఆ తల్లి లోలోన చింతింపసాగెను. ఇతనికి మాటలు వచ్చే అవకాశము లేదా అని వారు జ్యోతిశ్శాస్త్ర పండితులనడిగిరి. మాటలు వచ్చుటకు ఏదైనా ఉపాయము కలదా? అని పదేపదే ప్రశ్నింపసాగిరి. అందుకు ఆ జ్యోతిష్కులు ఆదివారమునాడు మూడువేళల కులదేవతలను ఆరాధించి, రావి ఆకుల విస్తళ్లలో భోజనమును పెట్టించి, నివేదించుమని చెప్పిరి. మరికొందరు ఇతడు మూగవాడే కదా! అతనికి చక్కగా విద్య నేర్పించుడు. తద్వారా పిల్లవాడు మాటలాడుటను నేర్చుకొనగలడని వ్యంగ్యముగా పలుకుచుండెడివారు. ఎవరేది మాట్లాడిననూ, ఆ పసివాడుమాత్రము నవ్వుచూ ఓంకారమును ఉచ్చరించెడివాడు. ఆ ప్రణవశబ్దమును విని, పిల్లవాడికి మరొకమాట రావటములేదని జనులందరూ విస్మయమును పొందుచుండిరి. కొందరు ఇది చాల విచిత్రముగా ఉన్నది. కానీ, చూచుటకు ఇతనిలో ఎంతో జ్ఞానము, వివేకమున్నదని తోచుచున్నది. మనము చెప్పే మాటలను అతడు తన చెవులతో చక్కగా వినగలుగుచుండెను. నిజమునకు ఇతనికి మాటలు వచ్చును. కానీ, ఇతడు ఏదో ఒక బలీయమైన కారణమువలన మాటలాడకపోవుచున్నాడు అని మరికొందరనుచుండిరి.

ఈవిధముగా 'నరహరి' అనే ఆ బాలునకు ఏడు సంవత్సరముల ప్రాయము వచ్చెను. గర్భాష్టమ వయస్సునందు ఉపనయన సంస్కారము చేయుట వైదిక ధర్మము కాని, దురదృష్టవశాత్తు ఈ బాలుడు మూగవాడయ్యెను కదా! ఏమి చేసినను కుమారుడు మాట్లాడుట లేదని తలిదండ్రులకు, గొప్ప మనశ్చింత పట్టుకొనెను. ఏది ఏమైననూ కుమారునకు ఉపనయన సంస్కారము చేయదగిన వయసు వచ్చినందున ఉపనయనము చేయవలయునని తలిదండ్రులు నిశ్చయించుకొనసాగిరి. అప్పుడు విప్రులందరూ బ్రాహ్మణ ఆచారపద్ధతి ప్రకారముగా ఎనిమిది సంవత్సరములు పూర్తికాకముందే ఉపనయనమును చేయవలయునని చెప్పిరి. కానీ, ఇతడు మూగవాడన్నమాట నిశ్చయము. మరి

ఇట్టి బాలునకు ఉపదేశము చేయుట ఎట్లు? ఎంతటి గొప్ప దురదృష్టము మనకు పట్టుకొన్నదని" ఆ తల్లిదండ్రులు కలత చెందుచుండిరి. అయ్యో! మనము గౌరీశంకరులను ఆరాధించితిమి. శనిత్రయోదశి పర్వదివసమున, ప్రదోషకాలమున చిత్తశుద్ధితో శివునిపూజించితిమి. అవన్నీ వ్యర్థమైపోయెనా? ఏమైపోయెను? మనకింతటి దురదృష్టము ఎట్లు వాటిల్లెను. ఈశ్వరుడు ఇచ్చిన వరమువల్లనే సులక్షణయుక్తుడైన కుమారుడు జన్మించెను. కానీ, ఇప్పుడితడు మాటలాడుటలేదు. ఏమి చేయుదమని నిరంతరము ఆ పరమశివుని ధ్యానింపసాగిరి. మన కడుపున ఒకే ఒక బాలుడు జన్మించెను. కలలో కూడా మరొకరిని గురించి చింతించలేదు. ఇతడు మనలను రక్షించునని యెంతయో ఆశపడితిమి కదా! మన మనోరథము పూర్తిగా నెరవేరలేకుండెను. శనిత్రయోదశి ప్రదోషమునందు పరమేశ్వరుని ఎంత గొప్పగా పూజించినప్పటికినీ కరుణామయుడైన ఆ పరమాత్ముడు ఇట్టి వరమును మనకు ఎందుకు ప్రసాదించెనో కదా! అని ఆ తల్లి అనేక విధములుగా భావించుకొనుచు నిరంతరము దుఃఖించుచుండెను. తల్లి మనోవ్యథను ఆమె దుఃఖమును చూచిన ఆ పిల్లవాడు తల్లి దగ్గరకు వచ్చి ఆమెను చక్కగా ఓదార్చెను. ఇంతలో ఇంటిలోనికి వెళ్ళి ఒక పెద్ద ఇనుప వస్తువును తన చేతితో పట్టుకొని తెచ్చి తల్లికి చూపెను. ఆ పిల్లవాడు ఇనుమును చేత ధరించిన వెంటనే అది అత్యంత శుద్ధమైన పదహారు వన్నెలు కలిగిన మేలిమి బంగారముగ మారిపోయెను. దానిని చూచి ఆ తల్లి మిగుల ఆశ్చర్యమునకు లోనైనది. అంతులేని విస్మయమును పొంది వెంటనే భర్తను పిలిచి దానిని అతనికి చూపించినది. అతడు మరింత నిశ్చయమును చెందుటకై మరికొన్ని ఇనుప వస్తువులను తెచ్చి అతనిచేతికి ఇచ్చి స్పృశింపచేసెను. ఏ ఇనుప వస్తువును అతడు చేతితో తాకెనో, అది వెంటనే బంగారముగ మారిపోవుచుండెను. తమ కుమారుని బాల్యలీలలను చూచి తల్లిదండ్రులు విస్తుపోయిరి. వెంటనే పిల్లవానిని ఇంటిలోనికి తీసుకొనివెళ్ళి ఈ విషయమును ఇతరులకు తెలియనీయకుండా అత్యంత గుప్తముగా దాచిపెట్టిరి. స్వామి తన యొక్క అమృతమయమైన దృష్టితో చూచినంత మాత్రముననే ఇల్లంతయు బంగారముగ మారిపోయెను. తమ పిల్లవాడు కారణజన్ముడే కాని, మరి వేరు కాదని, గట్టి విశ్వాసమేర్పడెను. అప్పుడు **వెంటనే తమ పుత్రుని గాఢముగ ఆలింగనము చేసికొని ఆ జననీజనకులు అతనితో ఇట్లనిరి–** "నాయనా! వత్సా! నీవు లోకమును తరింపచేయగల శిరోమణివి. మా కులదీపకుడవు. అవతారపురుషుడవు. ఇందెంతమాత్రమూ సందేహము లేదని" కొనియాడుతూ మిక్కిలి సంతసించిరి. కాని, నీవు నీ నోటితో మాటలు మాటలాడకపోవుటవలన నీ మాటలను మేము మా చెవులతో వినకపోవుటవలన అజ్ఞాన ఆవరణతో కూరుకొనిపోయిన చిత్తముతో మాయతో కప్పబడిన మేము నీవు మూగవాడివని భావించుచుంటిమి. కానీ, నీవల్లనే ఈ సర్వస్వము

లభించినది కదా! కుమారా! నీ ముద్దుమాటలను ఒక్కసారి మేము వినగోరుచుంటిమి పుత్రా! మా మనోరథమును నీవే నెరవేర్చవలయును. మా ప్రార్థనను విని వెంటనే మాతో ముద్దులొలికే నీ ముద్దుమాటలను ఒకటి, రెండైనా పలుకుమని వేడుకొనిరి. (31-59)

అంతట నరహరి అను ఆ పిల్లవాడు బిగ్గరగా నవ్వి, మెడలో యజ్ఞోపవీతమును వేయుమని, నడుమునకు మేఖలను ధరింపచేయుమని, చేతితో సంజ్ఞను చేసి తెలిపెను. పిల్లవాడు తన తల్లితో నవ్వుచూ, తనకు ఉపనయనము చేసిన వెంటనే మాటలు రాగలవని సైగ చేసి తెలియచెప్పెను. దానితో మిగుల సంతసించిన ఆ తలిదండ్రులు వెంటనే జ్యోతిశ్శాస్త్రపండితులను తమ ఇంటికి ఆహ్వానించిరి. వారితో మా అబ్బాయికి చక్కని ఉపనయనసుముహూర్తమును నిశ్చయించుమని ప్రార్థించిరి. వారిచేత ముహూర్తము నిర్ణయించిన పిమ్మట ఉపనయనమునకు కావలసిన సామగ్రినంతయు సిద్ధము చేసికొనిరి. ఒక్కగానొక్క మహిమాన్వితుడైన తమ కుమారునకు గొప్పగా ఉపనయన సంస్కారమును జరుపవలయునను కోరికతో అనేక విధములైన నవరత్నఖచిత ఆభరణములను, ఇతర సామగ్రిని కావలసినంతగా సిద్ధము చేసికొనిరి. చతుర్వేద పండితులను ఆహ్వానించిరి. శాఖాపరమైన విద్వాంసులను పిలిచిరి. ఆప్తులు, సోదరులు, దాయాదులు, సగోత్రీకులు, ఆత్మీయులు, మిత్రులు, ఇతర బంధువులందరూ ఉపనయనమహోత్సవమునందు పాల్గొనుటకై వారి ఇంటికి విచ్చేసిరి. అపారమైన ద్రవ్యమును వెచ్చించి అనేకవిధములుగా అలంకరించిన మండపములను నిర్మించిరి. (60-65)

"అయ్యో! వృథగా ఇంత ధనమును వెచ్చించుచున్నారు. పిల్లవాడు మూగవాడు. ఇతనికి ఉపనయనము చేయుటయే తప్పనగా, ఇంత ధనమును వెచ్చించి గొప్ప ఏర్పాట్లు ఎందుకు చేయుచుండిరి. ఈ బ్రాహ్మణునకు పిచ్చి పట్టినదా ఏమిటి?" అని నగరవాసులందరూ వాపోవుచుండిరి. ఇంతగా ఖర్చుపెట్టి కొడుకునకు ఉపనయనమును చేయుచున్నాడు. ఈ పిల్లవాడిచే గాయత్రీ మంత్రమును ఎట్లు ఉచ్చరింపచేయునని" మరికొందరు ప్రశ్నించుచుండిరి. "ఏది ఎట్లయితే మనకెందులకు? మనకు మాత్రము కమ్మని మృష్టాన్నము లభించును కదా! తగినంత దక్షిణ, బంగారము, మేలిమి వస్త్రములు మనకు లభించును కదా! అతని మంత్రములతో, వాడి మూగతనముతో మనకేమి పని?" అని మరికొందరనుచుండిరి. ఈవిధముగా జనులు నానావిధములుగా భావించుచుండిరి. కానీ, తలిదండ్రులు మాత్రము కదు సంతోషముతో ఉపనయన మహోత్సవమును ప్రారంభించిరి. కులదేవతా ప్రతిష్ఠ గావించిరి. ఉపనయన సంస్కారమునకు ముందు చేయవలసిన చౌలకర్మను, దానికి సరిపోవు భోజనమును, తలంటుస్నానమును ఇత్యాది ఉపనయన సంస్కార కార్యక్రమములను ఒకటి వెనుక ఒకటి జరుపుచుండిరి. బ్రాహ్మణులు మంత్రపూర్వకముగా అతనిచే యజ్ఞోపవీతమును ధరింపచేసి, తల్లితో కలిసి భోజనము చేయించుటకొరకు

ఇంటిలోనికి తీసికొనివెళ్ళిరి. తల్లితో కలిసి భోజనము చేసి, ఆమె వద్ద సెలవు తీసుకొని మౌంజీబంధన నిమిత్తముగా అనన్యభావముతో ఆ నూతన వటువు తన తండ్రి వద్దకు చేరెను. గృహ్యసూత్రమునందు చెప్పబడిన విధముగా ఆ వటువునకు ఉపవీతమును ధరింపచేసి, తండ్రి గాయత్రీ మంత్రోపదేశము చేసెను. అట్టి గాయత్రీ మంత్రమును ఆ పిల్లవాడు మానసికముగనే ఉచ్చరించెను. కుమారునకు గాయత్రీ మంత్రము ఉపదేశించిన పిమ్మట మాతృభిక్షను తీసికొనుట ఆచారము. తదనుసారముగ తల్లి కుమారునికి భిక్షను ఇచ్చుటకొరకై రత్నఖచిత ఆభరణములను, అమూల్యమైన వస్త్రములను సిద్ధపరచెను. వాటినే మొదటి భిక్షగా తీసికొనివచ్చి తల్లి కుమారునకు ప్రసాదించెను. తల్లి చేతితో మొదటి భిక్షను ఆ బాలుడు స్వీకరించెను. వెంటనే ఆ తల్లి నూతన వటువును మనఃపూర్వకముగా ఆశీర్వదించెను. తత్క్షణమే ఆ బాలుడు **'అగ్నిమీళే పురోహితం...'** అను మంత్రముతో ప్రారంభించి ఋగ్వేదమంత్రములను నిరాఘాటముగా పఠింపసాగెను. అప్పుడు అందరునూ ఆశ్చర్యచకితులైరి. ఆ తర్వాత తల్లి రెండవ భిక్షను ఇవ్వగానే యజుర్వేదములోని **'ఇషే త్వోర్జేత్వా....'** అనే మంత్రముతో ప్రారంభించి యజుర్వేద మంత్రములను పఠింపసాగెను. అప్పుడది చూసి అక్కడ కూర్చున్న బ్రాహ్మణులు, వేదవిదులందరూ తలలూపి భేష్...భేష్ అని ప్రశంసించుచుండిరి. తదుపరి ఆ తల్లి మూడవ భిక్షను ఇచ్చుటతోడనే **'అగ్న ఆయా హి...'** అనే సామవేద మంత్రపఠనమును బహురమ్యముగా, వినసొంపుగా గానము చేసెను. అక్కడున్న వారందరూ విస్మితులై మేరలేని ఆనందమును పొందుచూ, అబ్బురముగా ఆ పిల్లవాడివైపు చూడసాగిరి. ఇంతవరకు మూగవాడుగా ఉన్న ఈ పిల్లవాని నోట ఒకటి వెంట ఒకటి వరుసగా వేదములు పఠింపబడుట ఎంతటి ఆశ్చర్యమో! ఇతడు మామూలు మానవుడు కాదు. అవతారపురుషుడే. కారణజన్ముడే అని అందరూ అనుకొనసాగిరి.

ఇక, ఈ పిల్లవాడిని మానవుడని అనకూడదు. ఆ దృష్టితో చూడకూడదు. ఇతడు దేవుని అవతారమే. కాదు.. కాదు... జగద్గురువే అంటూ అందరూ చేతులెత్తి నమస్కరింపసాగిరి. **ఇంతలో ఆ పిల్లవాడు తల్లితో ఇట్లనెను** - "అమ్మా! భిక్ష అడుగుమని కోరుతూ నీవు ఉపదేశము చేసితివి. నన్ను ఆశీర్వదించితివి. నీ మాటలు, నీ ఆశీస్సులు ఎంతమాత్రము మిథ్య కాబోవు. అవి నా చిత్తమునందు దృఢముగా నిలిచిపోయెను. నేను వెంటనే తీర్థాటనకు వెళ్లవలసియున్నది. నాకు త్వరగా సెలవునీయుము. నేను ఇంటింటా భిక్షాటన చేయుచూ, బ్రహ్మచర్య దీక్షతో చరించెదను. చాల గొప్పగా వేదాధ్యయనము చేసెదను" అని చెప్పిన కుమారుని మాటలను విని ఆ తల్లికి అపరిమితమైన దుఃఖము కలిగెను. కంటినుండి అశ్రుధారలు కారుచుండెను. మనోవ్యథకు లోనై మిక్కిలి బాధపడి, స్పృహ తప్పి పడిపోయెను. ఒక్క క్షణము నిర్జీవముగా అయి, 'హా! పుత్రా! నీవే నా రక్షకుడవని' అంటూ మహా శోకతప్తహృదయముతో అనేకవిధములుగా వాపోవుచుండెను. మమ్ములను రక్షించెదవని

మనసులో ధృఢముగ నిశ్చయించుకొని వుంటిమి. నీవొక్కడవే కుమారుడవు. నీపైననే మాకు అంతులేని ఆశలు ఉండెను. మూగవాడివిగా నీవింత వరకు ఒక్కమాటైన మాతో మాటలాడలేకపోయితివి కదా! నీ మాటలను ఎన్నడూ మా చెవులతో వినలేకపోయితిమి కదా! ఇప్పుడట్టి మాటలను నీ నోట వింటూ వుండగా, మిగుల ఆనందము కలుగుచుండెను. పరమేశ్వరుని పూజించినందులకు గొప్ప ఫలితము లభించినదని మాకు గట్టి నమ్మకము కుదురుచుండెను' అని ఈవిధముగా ఆ తల్లి పుత్రుని దగ్గరకు తీసుకొని నానావిధములుగా ప్రేమతో చెప్పి, కుమారుని గాఢముగా ఆలింగనము చేసుకొనెను. అప్పుడామె అతని కృపను యాచింపసాగెను. తల్లి మాటలు విని ఆ బాలుడు ఆమెకు బ్రహ్మజ్ఞానము బోధింపసాగెను. "అమ్మా! మేము ఒక కారణమున జన్మించితిమి. ఈవిధముగనే మేము చేయవలసియుండును. అందులకు నీ మనస్సులో ఖేదము పెట్టుకొనవద్దు. తల్లీ! నీకు ఇంకను నలుగురు పుత్రులు నిశ్చయముగా కలిగెదరు. వారు మిమ్ములను మనఃపూర్వకముగా చక్కని సేవాభావముతో నిండుప్రేమతో సేవించెదరు. నీవు గత జన్మలో శంకరుని ఆరాధించిన మాట తథ్యము అంటూ ఆమె తలమీద ఒకమారు తన చేయిని పెట్టిన వెంటనే, ఆ తల్లికి గతజన్మను గురించిన స్ఫురణ కలిగెను. వెంటనే ఆ నూతన వటువైన పిల్లవాడు పూర్వజన్మ వృత్తాంతమును గుర్తు చేయగా, ఆమెకు ఆనాటి శ్రీపాదశ్రీవల్లభుల స్వరూపముతో ఈ పిల్లవాడు కనిపించగానే, అత్యంత విస్మయమునకు లోనయ్యెను. అప్పుడది గాంచిన ఆ తల్లి, పెద్ద హృదయముతో ఆతని చరణకమలములకు నమస్కరించెను. శ్రీపాదులు వెంటనే ఆమెను లేవనెత్తి, **అతడు ఒక గొప్ప రహస్యమైన మాటను పలికెను** – "అమ్మా! నీవు గొప్ప జ్ఞానవంతురాలివి. నా మాటలను గుప్తముగా ఉంచుకొనుము. నేను సంసారమునకు అంటకుండా కమలమునందలి నీటిబొట్టువు వలె వుండు సన్యాసిని, యతీశ్వరుడను. కావున, నేనిప్పుడే సమస్త తీర్థములను దర్శించుటకు వెళ్లెదను. అందుకు అనేక కారణములున్నవి. గతజన్మలో నీవు శంకరుని ఆరాధించిన ఫలితముగా నీ గర్భమున పుత్రుడనై జన్మించెదనని ఇచ్చిన వరదానమును ఫలింప చేయుటకుగాను నీకు పుత్రుడనై జన్మించితిని. ఇక మీరు నాకు ప్రేమతో సెలవీయవలసినది. మనస్ఫూర్తిగా నాకు అనుమతిని ప్రసాదించు"మని తల్లిని ఆ బాలుడు వేడుకొనెను.

ఈవిధముగా తల్లితో ఆ గురుమూర్తి అత్యంత వినయముగ పలికెను. **ఆమె తిరిగి తన కుమారుని చూచి ఇట్లనెను** – "ఎంతో గారాబముగా పెంచుకొన్న నా కుమారుడవైన నీవు వెళ్లిపోయినచో ఇక నిన్నెన్నడూ చూడలేను కదా! ఇంతటి మహిమాన్వితుడవై నిన్ను చూడకుండా నేనెట్లు జీవించగలను తండ్రీ! పసితనములో నీవు చూపిన తాపసిక ధర్మము ఎట్లు తృప్తిని కలిగించును. చతుర్విధ ఆశ్రమములను చక్కగా పాటింపవలయునని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి కదా! ముందుగా పన్నెండు సంవత్సరముల వరకు బ్రహ్మచర్యమును, ఆ తదుపరి

పన్నెండు సంవత్సరముల వరకు గృహస్థధర్మమును ఆచరించవలెను. అనంతరము వానప్రస్థమును ఆచరించినచో అంతులేని పుణ్యము లభించును అని శాస్త్రములు చెప్పుచున్నవి. అంతేకాదు, ముఖ్యంగా గృహస్థాశ్రమ ధర్మము ఆచరించుటయే గొప్పది, తద్వారా అత్యంత సామర్థ్యము లభించును. అనంతరము సన్న్యాసమును స్వీకరింపవలెనని ధర్మశాస్త్రము చెప్పుచున్నది కదా! బ్రహ్మచర్యమునందు వేదాదికములను పఠించవలెను. అనంతరము వివాహము చేసికొని, గార్హస్థ్యధర్మమును నిర్వహించుచూ, వంశోద్ధారకులైన పుత్రాదికులను పొందవలెను. యజ్ఞాదికర్మలను అనుష్ఠించిన పిమ్మట సన్న్యాసమును స్వీకరింపవలెను. ఈ క్రమ పద్ధతిలో సన్న్యాసము ముఖ్యమైనది. కానీ, పసితనమునందే సన్న్యాసమును స్వీకరింపరాదు. సన్న్యాసమును స్వీకరించుటకు ముందు సకల ఇంద్రియములను సంతృప్తిపరచాలి. మనసులోని కోరికలను తీర్చాలి. ఆ తర్వాతనే తపస్సునకు వెళ్ళి జితేంద్రియుడు కావాలి" అని తల్లి చెప్పిన మాటలను అన్నింటినీ శ్రీగురుమూర్తి శ్రద్ధగా వినెను. అనంతరము ఆమెకు తగిన తత్త్వజ్ఞానమును బోధించెను.

'నామధారకా! గురుమూర్తి తల్లికి ఉపదేశించిన ఈ తత్త్వజ్ఞానము తర్వాత అధ్యాయమునందు నీకు చెప్పబడును' అని సిద్ధముని చెప్పెను. గంగాధరుని కుమారుడు అయిన సరస్వతి నమస్కరించి, శ్రోతలు అత్యంత విస్తారమైన శ్రీగురుచరిత్రమును చక్కగా శ్రవణము చేయవలయునని విన్నవించెను. ఆ తర్వాత జరిగిన అపూర్వమైన వృత్తాంతమును నామధారకునితో సిద్ధమునీంద్రుడు చెప్పిన దానిని చక్కగా మీరందరు వినవలయునని, మహారాష్ట్రభాషలో గురుచరిత్రమును రచించుచూ, గంగాధర సరస్వతి జిజ్ఞాసువులైన శ్రోతలకు తెలియజేయుచుండెను.(96-107)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
జ్ఞానకాండమునందు "శ్రీగురు నరహరి బాలచరిత్ర లీలావర్ణనము" అను పదకొండవ అధ్యాయము ॥ 11 ॥
॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥
(ఓవీలు - 107; మొత్తము సంఖ్య : 1277 + 107 = 1384 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

పన్నెండవ అధ్యాయము

శ్రీగురు బాల నరహరి తల్లికి తత్త్వజ్ఞానమును ఉపదేశించుట - శ్రీగురుమూర్తి కృపతో తల్లిదండ్రులకు తగిన సంతానమును, సంపదను అనుగ్రహించుట - తల్లి ఆజ్ఞను గైకొని ఇల్లు విడిచి తీర్థయాత్రకేగుట - కాశీక్షేత్రమునందు నరహరి సన్న్యాసదీక్షను స్వీకరించుట - శ్రీనృసింహ సరస్వతిగా విరాజిల్లుట - గురుపరంపరను గూర్చి సిద్ధముని నామధారకునకు వివరించుట - శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి తీర్థపర్యటన

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శ్రీగురుడైన నరహరి తన తల్లితో 'అమ్మా!' అని సంబోధించి, **ఈవిధముగా తత్త్వమును ఉపదేశింపసాగెను**– "అమ్మా! ఈ శరీరము అనిత్యమని నీకు తెలియును. క్షణభంగురమైన ఈ జీవితమును ఏమని విశ్వసించగలము? కావున – **శ్లో॥ అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః । నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః ॥** అనగా – ఈ శరీరములు అనిత్యములు. ఈ సంపదలు, ఈ వైభవములు ఏవియూ శాశ్వతముగా ఉండునవి కావు. నశ్వరమైనవి. పైగా నీటిబుడగల వంటివి. ఇంకనూ **"తోడనే ఉండు మృత్యువు నీడవోలె"** అన్నట్లుగా మృత్యువు ఎల్లప్పుడూ మనకు సమీపముగా, మన తోడనే ఉండును. కావున, చక్కగా ధర్మమును ఆచరించుటయే ముఖ్యకర్తవ్యము కావలయును. శరీరము స్థిరముగా ఉన్నంతలోనే మానవులు ధర్మమును ఆచరించుట ఉచితము. ఒకవేళ ఎవరైనా మృత్యువును జయించి చిరంజీవిగా ఉన్నచో, అతనికి నీవు చెప్పిన విధముగా, క్రమానుగతముగా కొంతకాలము బ్రహ్మచర్యమును, మరికొంతకాలము గృహస్థాశ్రమమును, ఆ తర్వాత వానప్రస్థము, చివరగా తురీయ ఆశ్రమమైన సన్న్యాసమును గ్రహింపవచ్చును. కానీ, నశ్వరమైనటువంటి, క్షణికమైనటువంటి ఈ దేహము ఎంతమాత్రము స్థిరమైనది కాదు. మృత్యువును గూర్చి భయపడేవాడు బాల్యమునుండియే మోక్షధర్మమును గురించి ఆచరించుట యుక్తము. శరీరము యౌవనంలో ఉన్నప్పుడే, ఆరోగ్యవంతముగా ఉన్నప్పుడే ధర్మమును ఆచరించి, పుణ్యమును మూటకట్టుకొనవలయును. మృత్యువును జయించినవారు మాత్రమే వృద్ధాప్యము వచ్చిన తరువాత ధర్మమును ఆచరించగలరేమో! అది నాకెంత మాత్రము తెలియదు.

ఆయువు అహోరాత్రములు, క్షణక్షణము క్షీణించిపోవుచునే యుండును.(1) అందుకే చిన్ననాటినుండియే ధర్మమును ఆచరింపవలెను. అల్పాయుష్కులైన మానవుల జీవితము కొద్దిగా నీరు నిలచిన గుంటలో చిక్కువడిన చేపల జీవితము వంటిదే అని గ్రహించవలెను. కనుక, ప్రాణమున్నంతవరకు నిష్ఠగా, పరిపూర్తిగా ధర్మమును ఆచరించి తీరవలెను. సూర్యునియొక్క సంచారమువలన రాత్రి, పగలు ఏర్పడుచున్నవి. ఏడు గుఱ్ఱములను కలిగిన రథమును అధిరోహించిన సూర్యుడు ఎక్కడా నిలచియుండకుండా అత్యంత వేగముతో ఒక్క నిముషమునకు ఇరువది రెండువేల (22,000) యోజనముల దూరము పరుగెత్తుకొని పోవుచూ, దివారాత్రములు చక్రమువలె తిరుగుచున్నాడు. అనగా, అంత భాగము మన ఆయుష్యమునందు క్షీణించిపోవుచున్నదని గుర్తుంచుకొనవలెను. క్షణక్షణమునకు ఆయువు నశించిపోవుచున్నది కానీ, పెరుగుటలేదు. ఆయుష్యము క్షీణించుచున్నది అనగా మృత్యువు సమీపించుచున్నదని బాగుగా గ్రహించవలెను. వర్షము కురిసినపుడు వృక్షములమీద పడిన నీరు కొమ్మల మీద నుండి ప్రవహించగా, ఒక జలబిందువు ఒక ఆకు చివరన నిలచును. కాని, ఆ నీటి బిందువు అక్కడ స్థిరముగా ఉండక, వెంటనే నేలమీద పడిపోయినట్లుగా, ఈ శరీరము కూడా స్థిరముగా ఉండదు. ఇది నీటిబుగ్గ వంటిది. జీవులకు మరణము తథ్యము. యౌవనము దాటి వృద్ధాప్యము వచ్చే వరకో, ఆ తర్వాతనో, అంతకుముందో ఈ శరీరము నశించిపోవుట ఖాయము. అమ్మా! అందుకే ఈ దేహమును ఎప్పుడూ విశ్వసించకూడదు. మృత్యువు దేహమును అంటిపెట్టుకొనియే యుండును. పండుటాకు వృక్షమునుండి రాలిపోయినట్లుగా ఈ శరీరమును ఎప్పుడూ నమ్మకూడదు. అది ఎప్పుడు రాలిపోవునో ఎవరికి తెలియును? ఎవరికైననూ జరామరణములు తప్పవు. వృద్ధాప్యమునందు శరీరము కృశించుటచే ధర్మాచరణము అసంభవము, కష్టతరము అగును. యౌవనమును నిత్యము అని విశ్వసించకుండా శీఘ్రముగా మోక్షధర్మమును ఆచరించవలయును. అప్పు ఇచ్చినవాడు రోజులు గడిచినకొద్ది ఆ రోజులను లెక్కపెడుతూ ఎప్పటికప్పుడు ఏవిధంగా వడ్డీని లెక్కించునో, బాకీని చెల్లించవలసినదని గుర్తు చేయుచుండునో, అదేవిధంగా యముడు దివారాత్రములు గడిచిపోయినకొద్దీ తన లెక్కలో ప్రతి జీవుని ఆయుష్యముయొక్క వ్యయమును లెక్కించిపెట్టును. సముద్రమునందలి నీరు ఆవిరై పైకెగసి, మేఘములుగా మారి, వర్షించి ఏర్పడిన సమస్త నదులన్నీ సముద్రమువైపే ప్రవహించి, సముద్రములో కలసిపోవును. కానీ, అవి ఎప్పుడునూ వెనుకకు తిరిగిరాజాలవు. అటులే, మన ఆయుష్యము కూడా దివారాత్రముల ద్వారా తరిగిపోవుచున్నదే కానీ, తిరిగి కూడబెట్టుట అనునది

---

1. కాలక్షేపో న కర్తవ్యః - క్షీణమాయుర్దినేదినే । దేహస్య పతనం వీక్ష్య - కర్తవ్యం హరి కీర్తనమ్ ॥

ఎట్టి వారికినీ శక్యము కాని పని కదా! గడచిన రాత్రింబవళ్ళు తిరిగి రావు. ఇది నిశ్చయము. ఇట్టి జీవితమునందు పుణ్యమును సంపాదింపని నరులు పశువులతో సమానులు. ఏ రోజైనా, ఏ కొంచెమైనా ధర్మమును లేదా, పుణ్యమును ఆచరించకుండా గడచిపోయినదో, ఆ రోజు వ్యర్థముగా గడచిపోయినదని పశ్చాత్తాపమును చెందవలెను. యముణ్ణి ఎంతగా ప్రార్థించినను, మనయందు దయచూపక ఆయువు ముగిసిన ఉత్తరక్షణముననే తీసికొనిపోవును. **'యమస్య కరుణానాస్తి కర్తవ్యో ధర్మ సంగ్రహః'** అని శాస్త్రము చెప్పుచున్నది. యమునికి దయలేదు. వెంటనే పుణ్యమును సంపాదించాలి. ధర్మమును ఆచరించాలి. భార్యాపుత్రులు, ధనము, పశుసంపద, ఆయుష్యము, దేహము, గేహము ఇవన్నియును శాశ్వతము అని ఎవరు భావించెదరో, వాడు పశువే గాని, వేరుగాదు. మానవులను, ఇతర ప్రాణులను భక్షించే మొసలివలె ఈ శరీరమును వృద్ధాప్యము భక్షించివేయును. అందుకే, యౌవనదశలోనే విద్వజ్జనులు పుణ్యమును ఆచరించాలి. కావున, "అమ్మా! నేను కోరిన పని చేయవద్దని, నన్ను ఎందుకు నిలువరించుచుంటివి? ఇది ఎంతమాత్రము సరియైనది కాదు సుమా! ఎవరైతే మూర్ఖులుగా, సోమరులుగా దివారాత్రములను గడుపుదురో, వారందరు యమధర్మరాజుకు ముద్దుబిడ్డలు అయ్యెదరు. అమరత్వమును, అమృతత్వమును సంపాదించుకొను కోర్కెగల యోధులందరు తప్పక ధర్మమును ఆచరించవలెను. ఈ సంసారము ఒక స్వప్నము వంటిది. మల్లెపూవు ఉదయమున వికసించి, సాయంత్రమునకు ఎట్లు వాడిపోవునో, శరీరము కూడా అట్లే వాడిపోవుట తథ్యము. తళుక్కున మెరిసిన వెంటనే అదృశ్యమైపోయెడు మెరుపువలె దేహము కూడా ఎప్పుడో, ఏ క్షణముననో, అదృశ్యమైపోవునే కాని, స్థిరముగ ఉండజాలదు. నేను వృద్ధాప్యము వచ్చిన తరువాతనే ధర్మమును సంపాదించెదను, పుణ్యకార్యము చేసెదను అని తలంచువాడు అసమర్థుడు, అజ్ఞాని, మూర్ఖుడు అని పిలువబడును" అని ఈవిధముగా ఎనిమిదేండ్ల ప్రాయము కలిగిన ఆ బాలుడు, అనేకవిధములుగా తల్లిదండ్రులకు తత్త్వజ్ఞానోపదేశమును చేయుచుండెను. (1-23)

అక్కడున్న వారందరూ, 'అబ్బా! ఈ పిల్లవాడేమిటి? ఇంత గొప్ప సత్యమైన తత్త్వమును బోధించుటేమిటి?' అని విస్మయపడుచుండిరి. 'ఇదేమి చోద్యమో, ఎప్పుడూ వినలేదు, కనలేదు, అని కొందరు ముక్కుమీద వేలేసుకుని స్థాణువులవలె ఆశ్చర్యపడి తిలకించుచుండిరి. **కుమారుని మాటలు విని ఆతని తల్లి ఇట్లనెను** – "దేవా! కుమారా! నీవు మాకు చక్కని జ్ఞానబోధ చేసితివి. ఇదంతయూ సత్యమే. కానీ, నేను అజ్ఞానురాలను. నా విన్నపమును వినుము" అని ఆతనికి చేతులెత్తి నమస్కరించి, **తిరిగి ఇట్లనుచుండెను** – "పుత్రా! నీవు మా కులదేవతవు. నాకు నలుగురు పుత్రులు కలుగుదురని ముందే నాకు బోధ చేసితివి. అయితే, మాకెంతమాత్రము విశ్వాసము కలుగుటలేదు. కావున, మాకు

ఒక పుత్రుడు కలుగునంతవరకు నీవు మా వద్దనే, మా ఇంటనే ఉండవలెను. అప్పటివరకు నీవు ఇంటిని విడిచివెళ్లుటకు నేను అనుమతినివ్వను. ఇది నిశ్చయమని విన్నవించినది. ఒకవేళ నా మాటను ధిక్కరించి నీవు వెళ్లిపోయినచో, నేను వెంటనే నా ప్రాణములను వదలివేసెదను. ఇది ముమ్మాటికీ నిజము. నీవు మాత్రము మా పుత్రుడవు కాదు. మాకు కులదేవతవు. నా మాటలు తప్పక నిజము చేసెదవని, నమ్మికగా ఒక మాటను చెప్పుము నాయనా!" అని దీనముగా ఆ తల్లి కోరెను. **తల్లి మాటలను వినిన బాలుడైన నరహరి చిరునవ్వు నవ్వి, ఇట్లనెను** – అమ్మా! తప్పక నీ మాటలను పాటించెదను. నా మాట నిజము. నీవు చెప్పిన మాటలను తప్పక నిజము చేయుదును. అమ్మా! వినుము. ముందుగా మీకు ఇద్దరు పుత్రులు కలిగెదరు. వారు కలిగిన వెంటనే నేను వెళ్ళిపోవుదును. అప్పుడు నన్ను నిర్బంధించవద్దు. మీరు సంతోషముతో నాకు సెలవును ప్రసాదించవలెను. (24–30)

అంతేకాదు, "అమ్మా! నీవు కలత చెందవలదు. తల్లీ! దుఃఖపడవద్దు. తప్పక నీ కోరికను నెరవేర్చెదను. ఒక సంవత్సరము వరకు నీకు ఇద్దరు పుత్రులు జన్మించెదరు. అంతవరకు మీతోడనే, మీ ఇంటనే నిశ్చయముగా నివసింతును. కానీ, అనంతరము వెంటనే నేను వెళ్ళిపోవుటకు మీరు సంతోషముతో అనుమతిని ఈయవలెను" అని ఆ నరహరి దేవుడు అత్యంత ప్రేమతో నిశ్చయపూర్వకముగా చెప్పి, తల్లికి నమ్మకమును కలిగించి ఓదార్చెను. నాటినుండి సంవత్సరకాలము ఇంటిలోనే ఉండి, అనేకమంది శిష్యులతో కూడి వేదశాస్త్రములను అధ్యయనము గావించుచూ, తలిదండ్రులకు ఆనందమును కలిగించుచుండెను. (31–32)

నగరవాసులందరూ విస్మితులై ఇది ఎంత ఆశ్చర్యము. గొప్ప విశేషము. కేవలము ఏడు సంవత్సరములు నిండిన పిల్లవాడు చతుర్వేదములను నిరాఘాటముగా చెప్పుచున్నాడని కొందరనుకొనుచుండిరి. మరికొందరు ఆశ్చర్యపడుచూ, విద్వాంసులకే విద్వాంసులైన విద్వజ్జనులే ఇతనికి విద్యార్థులై మూడు వేదములను పఠించుచున్నారు. ఇదేమి చోద్యము. గొప్ప గొప్ప శాస్త్రపండితులు అని పేరుపొందినవారు కూడా శాస్త్రమును అభ్యసించుటకై ఇతని వద్దకు వచ్చి చేరుచున్నారు అని అనేకమంది జనులు ఆ నరహరి అనే బాలుని చూచి, ఇతడు బాలుడు కాదు, మానవుడు కాదు. కారణజన్ముడే. అవతారపురుషుడే. మనందరికీ గురువే. గురుమూర్తియే అని ఒకరితో ఒకరు అత్యద్భుతముగా చెప్పుకొనసాగిరి. ఈవిధముగా ఒక సంవత్సరము పాటు ఆ బాల నరహరి వారి ఇంటిలో ఉండిపోయెను. ఇంతలో తల్లి గర్భవతియై మహదానందమును అనుభవించెను. ఇతడు మన వంశోద్ధారకుడు. మన కులదేవత. అసామాన్యమైన ప్రతిభావంతుడు అనే భావముతో ఆమె తన కుమారుని

నిత్యము ఆరాధించెను. ఒకానొక గుప్తనిధి దొరుకుటవలన మానవుడు ఎంతటి అఖండమైన ఆనందమును, సంతోషమును పొందగలడో, అంతులేని దానిని గూర్చి మనము ఏమని చెప్పగలము. అదేవిధముగా ఆ తల్లి తన కుమారుని చూచి, తన కుమారుని యొక్క వైభవమును లోకులనోట విని, అత్యంత ఆనందభరితురాలగు చుండెను. గర్భవతియైన తల్లికి నవమాసములు నిండి సుఖప్రసవమాయెను. అత్యంత సుందరముగా ఉన్న ఇద్దరు మగబిడ్డలు కవలలుగా జన్మించిరి. పుత్రులు జన్మించినందులకు తలిదండ్రులు మేరలేని సంతోషమును పొందిరి. శ్రీగురుని ఆశీస్సులకు మురిసిపోయిరి. కృతజ్ఞతను చాటుకొనిరి. గురుమూర్తి మాటలు అసత్యములెట్లగును. అందుకే విద్వజ్జనులందరు గురువచనమును సత్యమని భావించవలెనని, గట్టి నమ్మికతో వుండవలయునని, అదియే సత్యమగునని చెప్పుచుండెదరు. ఈ ప్రకారముగా జన్మించిన కవల పిల్లలకు ఒక ఏడాది ప్రాయము వచ్చి, ఆపైన మూడు నెలలు గడచినవి. అప్పుడు ఒకరోజు తల్లి పిల్లలను బుజ్జగించుచూ, ఆడించుచూ, చంటిబిడ్డలను చూచి మురిసిపోవుచున్న సమయమున **శ్రీగురుడైన నరహరి తల్లివద్దకు వచ్చి ఇట్లనెను.** "అమ్మా! ఇక నేను వెళ్లెదను. నాకు అనుజ్ఞ నొసగవలసినది. నీవెంతమాత్రమూ విచారపడకుము. మాతా! నా మాటలను వినుము. నీ మనోరథములన్నియూ తప్పక నెరవేరును. నీకు పుత్రులరూపములో గొప్ప నిధి దొరికెను. మీరు పూర్ణ ఆయుష్మంతులయ్యెదరు. మరికొంతకాలమునకు నీకు మరి ఇద్దరు కుమారులు కలిగెదరు. ఆ తదుపరి ఒక కుమార్తెయును కలుగును. నీ మనోకామనలన్నియూ నెరవేరును. మీరందరూ అత్యంత సుఖసౌఖ్యములతో నుండెదరు. ఇప్పుడు నాకు అనుమతినీయగలవు. నా స్వభావమును అనుసరించి నేను వెడలిపోయెదను. నీవు ప్రసన్నురాలవై వుందువుగాక!" అని వినయముతో తల్లియొక్క అనుమతిని కోరుతూ, నరహరి పలికెను. (33-43)

అంతట తల్లిదండ్రులు మిగుల సంతసించి, ఆతని చరణములపై తలనుంచిరి. తదుపరి వారిట్లనిరి– "కుమారా! నీవు మా కులదేవతవు. నీతో మాట్లాడుట మాకు అశక్యమగుచున్నది. స్వామీ! మాయాప్రపంచములో పడి దరిగానక బాధపడుచున్నాము. మేము జ్ఞానహీనులము. మాకు నిజస్వరూపజ్ఞానము కలుగుటలేదు. నీ స్వరూపమును ఎంతమాత్రమును తెలియలేకున్నాము. మాయామోహితులమై, స్వార్థపరతవలన నీ గొప్పతనమును తెలిసికొనలేకపోయితిమి. స్వామీ! మాయామోహముచేత లేదా అజ్ఞానమువలన నీవు మా కుమారుడవే అని భావించి తెలియక మేము చేసిన అపరాధములను క్షమించి, మమ్ములను ఉద్ధరింపగలవు. కేవలము పుత్రునిగా, పసివాడిగా భావించి అప్పుడప్పుడు ఎంతో నిష్ఠురముగ మాటలాడితిమి. అందుకు మమ్ములను క్షమింపగలవు. సహభోజన సమయమునందు, శయనించునపుడు,

కూర్చొనియున్నపుడు, నిన్ను నిద్రలేకుండగను, ఆకలితోనూ, విసిగించియుండి ఉందుము. వెంటనే నిన్ను ప్రేమతో ఎత్తుకొనకుండా లాలించి, పాలించకుండా, ఒకింత బాధించియుందుము. దేవా! అందుకు మమ్ములను క్షమించుము నాయనా! తండ్రీ! మా వంశమును తరింపచేయుటకొరకే నీవు మా యింట అవతరించితివి. శనిత్రయోదశి నాటి ప్రదోషసమయమునందు ఈశ్వరుని ఆరాధించిన దానికి తగు ఫలితము దొరుకుటచేత నేను నీకు తల్లినయ్యే భాగ్యమును పొందగలిగితిని. ఇక ఇప్పుడు మా గతి ఏమిటి? కృపామూర్తీ! నీవే చెప్పవలెను. జననమరణములనే కష్టాలనుండి దూరము చేసి, మమ్ము తరింపచేయుము తండ్రీ! భగీరథుని ద్వారా తేబడిన గంగాప్రవాహము సగరచక్రవర్తియొక్క వంశమును తరింపచేసిన చందమున మీరు నా గర్భమున జన్మించుటచేత మా ఉభయ వంశములు తరించినవి. మమ్ములను ఈ భయంకరమైన సంసారసాగరమునందు ఎందుకు నెట్టితివి. పుత్రా! నీవు మా ప్రాణసమానుడవు. నీ దర్శనము లేకుండ మేమెట్లు జీవింతుము" అని పలికిరి.(44-51)

అంతట దుఃఖపూరితులైన తలిదండ్రుల మాటలను విని శ్రీగురుడు ఇట్లనెను – "అమ్మా! దుఃఖింపవలదు. నన్ను మీరు మనసారా ఎప్పుడు స్మరించెదరో, అప్పుడు వెంటనే ఎంతమాత్రము ఆలస్యము చేయకుండా మీ ఎదుట ప్రత్యక్షమయ్యెదను" అని పదేపదే చెప్పి కలత చెందవద్దని తల్లికి ధైర్యము చెప్పి, వాగ్దానము చేసెను. తదుపరి "భవానీమాతా! మీకింకనూ ఇద్దరు పుత్రులు, మరియొక కుమార్తెయు కలుగుదురు. మీ ఇంటిలో దైన్యబాధ ఉండదు. సకలసంపదలు నిండియుండును. గతజన్మలో నీవు ప్రదోషసమయమునందు పరమేశ్వరుని పూజించితివి. దాని మహిమ వలన నీవు ప్రతిజన్మలోనూ ఐశ్వర్యముతో తులతూగుచుండెదవు. పినాకపాణియగు మహాదేవుని పూజించుటచే ఇహలోకములో సర్వసౌఖ్యములు లభించుటయేగాక, దేహము చాలించిన పిదప పరలోక సౌఖ్యము కూడా లభించును. ఇకమీదట నీకు పునర్జన్మ ఉండదు. నీవు పరమేశ్వరుని పూజించినందులకే నేను నీ గర్భవాసమున అవతరించితిని. నీ ఇచ్ఛను నెరవేర్చితిని. కావున, నాకు ఇప్పుడు అనుమతినీయవలసినది. తిరిగి ముప్పది సంవత్సరముల అనంతరము నీకు నా పునర్దర్శనము ప్రాప్తించును. నేను బదరీ వనమునకు వెళుచుంటిని" అని పలికి, వెంటనే ఆతడు బయలుదేరెను. తలిదండ్రుల వద్ద సంతోషపూర్వకమైన అనుమతి తీసికొని శ్రీగురుడు సహజలీలతో బయలుదేరెను. ఈ వార్తను తెలిసిన నగరవాసులందరూ వచ్చిరి. అందరికందరూ వీడ్కోలు పలుకుచుండిరి. తలిదండ్రులు కూడా వీడ్కోలు పలికిరి. నగరములోని స్త్రీలందరూ "ఈ బ్రహ్మచారి తపస్సునకు బయలుదేరెను. ఇతడు మానవదేహముతో కనిపించుచున్నాడు. కానీ,

నిజమునకు ఇతడు పూర్ణ అవతారపురుషుడే" అని భావించుచుండిరి. మరికొందరు "ఈ విశేషమును చూడుడు. ఈ పిల్లవాడు తపస్సు చేసుకొనుటకై బయలుదేరిపోవుచుండగా తలిదండ్రులు అత్యంత సంతోషముతో మిగుల ప్రీతితో అతనికి అనుమతినిచ్చుచుండిరి. వీరి గుండె ఎంతటి బండరాయో కదా! మనస్సును కఠోరము చేసికొని, కర్కశ హృదయముతో పంపివేయుచున్నారని" భావించుచుండిరి. మరికొందరు ఇతడు పిల్లవాడు కాదు. కేవలము త్రిమూర్తుల అవతారమే. ఇది నిశ్చయము. ఇందులో ఎంతమాత్రము అనుమానములేదు సుమా! లేనిచో ఏడేండ్ల ప్రాయములోనే నిరాఘాటముగా వేదములను ఎట్లు పఠించగలడు అని అనుకొనిరి. అంతేకాదు, ఉపనయనము జరుగుచున్న సమయములోనే సమస్త వేదములను శాఖలతో సహా కంఠస్థముగా, కంఠోపాఠముగా పలికినవాడు మానవమాత్రుడు కాదు సుమా! అని సాధుజనులందరూ ప్రశంసించుచుండిరి. అట్లు సాధుజనులందరు ఆయనకు సాష్టాంగప్రణామములు చేయుచుండిరి. వివిధములైనటువంటి స్తోత్రములతో ఆతనిని స్తుతించుచుండిరి. జనులందరు నమస్కరించి వీడ్కోలు పలుకుచూ, తిరిగి తమతమ ఇండ్లకు వెళ్ళిపోయిరి. కానీ, తలిదండ్రులు మాత్రము కుమారుని వెంటనే వదలలేక, వెనుకకు తిరిగిపోలేక వీడ్కోలు పలుకుటకై పుత్రునితోపాటుగా మరికొంతదూరము ముందుకు నడచుచుండిరి. వారు తనవెంటనే వచ్చుచుండుటను గాంచి, తలిదండ్రుల యొక్క మోహమును నివృత్తి చేయుటకు కాబోలు, ఆ స్వామి తన నిజస్వరూపమును సాక్షాత్కరింపచేసెను. అప్పుడు వెంటనే తలిదండ్రులు సాక్షాత్తుగా శ్రీపాదశ్రీవల్లభ – దత్తాత్రేయులను తమ కనులతో దర్శించిరి. (52-67)

త్రిమూర్త్యాత్మకుడైన దత్తాత్రేయుడు నరహరిగా మానవరూపమున అవతరించెను. కర్పూరమువంటి ధవళకాంతితో ఉన్నట్టి తన నిజస్వరూపమును ఆయన చూపినపుడు ఆశ్చర్యపడిన తలిదండ్రులు **వెంటనే శ్రీవారి శ్రీచరణసరోజములకు నమస్కరించి స్తుతింపసాగిరి.** "జయము! జయము! జగద్గురూ! త్రిమూర్త్యాత్మక స్వరూపా! సద్గురూ! శ్రీపాదశ్రీవల్లభా! మీకు మా నమోవాకములు. మేము సంపాదించిన పుణ్యరాశి ఎంతో గొప్పది. అందుకే మీ దివ్యచరణములను మేము దర్శించగలుగుచుంటిమి. మిమ్ములను విశ్వసించినవారిని తరింపచేసే మీరు, మమ్ములను గొప్పగా ఉద్ధరించితిరి. మాకు తిరిగి తప్పక పునర్దర్శన మీయవలెనని మాటిమాటికి కోరుకొనుచుండిరి". ఆవిధముగా తలిదండ్రులు ప్రార్థించుచు తమ శిరస్సులను ఆయన చరణములపై పెట్టి నమస్కరించిరి. వెంటనే లేచి శ్రీగురునాథుని స్నేహపూర్వకముగా ఆలింగనము చేసికొనిరి. వారియెడల అత్యంత సంతుష్టాంతరంగులైన **శ్రీగురుమూర్తి ఇట్లనెను** – "మీరు చింతపడవద్దు. మీకు నిశ్చయముగ

మరల దర్శనమిచ్చెదనని" అత్యంతప్రీతిపూర్వకముగా వారికి వాగ్దానమొనర్చెను. ఆవిధముగా తలిదండ్రులకు నచ్చచెప్పి, ఓదార్చి, వారిని తృప్తులను చేసి వెంటనే సెలవు తీసికొని వెళ్ళిపోయెను. తలిదండ్రులు మిగుల సంతసముతో తిరిగి తమ ఇంటికి చేరుకొనిరి. (68-73)

వరదమూర్తియగు శ్రీనరహరి గురురాజు నేరుగా బదరీవనమునకు వెళ్ళి, అచట సిద్ధులను దర్శించి, నరనారాయణులను ఆరాధించి, వెంటనే అచటినుండి తిరిగి ఆనందకాననముగా ప్రసిద్ధినొందిన కాశీక్షేత్రమును చేరుకొనిరి. అవిముక్త క్షేత్రమైన వారాణసీపురము ఈ చరాచరజగత్తులో పుణ్యప్రదమైన మహాక్షేత్రము. అచట సాక్షాత్తుగా విశ్వేశ్వరుడు భక్తజనులకు నిత్యసన్నిహితులై నిలిచియుండుటవలన అది ముల్లోకములలో నిరుపమానమైన క్షేత్రముగా వాసిగాంచినది. అట్టి కాశీపురమునందు శ్రీగురునాథుడు నివసించి విశ్వేశ్వరుని దర్శనము చేసికొని, ఆత్మారాముని పూజించుచూ అనుష్ఠానము చేసికొనసాగిరి. ఆ రకముగా కాశీ పట్టణమునందు శ్రీగురుమూర్తి కొంతకాలము అష్టాంగయోగసాధనలతో తపస్సు చేసెను. కాశీనగరమునందు గల అనేక మంది తాపసులు, సన్న్యాసులు, యతులు, అవధూతలు, ఎందరో సాధకులు, కఠినమైన తపస్సును ఆచరించుచుండెదరు. వారు యోగాభ్యాస దురంధరులు, నైష్ఠిక బ్రహ్మచారి అయిన శ్రీగురుడు చేయుచున్న తపస్సును చూచి తమలోతాము విస్తుపోవుచుండిరి. "అనేకవిధములుగా కఠినమైన తపస్సును ఆచరించుచున్న ఈ బ్రహ్మచారిని చూడుడు! అద్భుతమైన వర్చస్సును కలిగి, నిర్మలమైన ఈతని మనస్సులో ఎంతటి దృఢమైన వైరాగ్యమున్నదో, ఆహా! వీరిని దర్శించిన మనమెంతటి ధన్యులమోగదా! యని భావించుచుండిరి. ఇతనికి శరీరముయెడల స్వార్థమెంతమాత్రము లేదు. మూడువేళల మణికర్ణికా తీర్థమునందు స్నానము చేయుచుండును. నిజమునకు ఇతడు సన్న్యాసాశ్రమమును స్వీకరించుటకు అర్హమైన యోగ్యత కలిగినవాడు" అని ఈవిధముగా కాశీ పట్టణమునందుగల ఎందరో నిత్యము ఆతనిని స్తుతించుచుండిరి. ప్రశంసించుచుండిరి. అప్పుడు అచటగల సన్న్యాసులందరిలో అత్యంత వృద్ధుడైన ఒక యతి ఉండెను. ఆయన పేరు కృష్ణసరస్వతి. అతడు గొప్ప బ్రహ్మజ్ఞాని. గొప్ప తపస్సంపన్నుడైన ఆ కృష్ణసరస్వతి నరహరిని అత్యంత స్నేహభావముతో చూచుచుండెను. ఆయన ఇతర సమస్త యతీశ్వరులతో, **బ్రహ్మచారులతో ఈవిధముగా చెప్పుచుండెను.** "ఈ నరహరి అనే బాలుని చూడుడు. ఈతడు అవతారపురుషుడు. విశ్వవంద్యుడు సుమా! ఇతనిని నరుడని కేవలము బ్రహ్మచారియని అనకూడదు. అత్యంతము గొప్పదైన తపస్సును ఆచరించే ఇతడు అసామాన్యుడు. వయస్సులో చిన్నవాడని మీరందరు ఇతనికి నమస్కరించరేమో! కానీ, ఇతడు త్రిభువనములయందు శ్రేష్ఠుడు. మనందరికీ నిత్యవంద్యుడు. వృద్ధులమైన మనము ఇతనికి నమస్కరించుటచే, అందులోనూ

విశేషించి మనము సన్న్యాసులము గనుక, మూర్ఖులు, అది చూచి మనలను నిందించెదరు. అందువలన మనము ఇతనిని ప్రార్థించి పరోపకారముగ, విశ్వశ్రేయోపకారమునకై అతనిచే సన్న్యాసము స్వీకరింప చేసినచో, మన మనస్సులు తృప్తి చెందును. స్థిరమగును. లోకానుగ్రహ నిమిత్తముగా ఇతడు సమర్థసద్గురువులుగా అయ్యెదరు. వీరి దర్శనమాత్రముచేతనే జనులందరూ పునీతులయ్యెదరు. ఇతడు సన్న్యాసమునకు సరియైన యోగ్యత కలిగినవాడు. ఈ మహాత్మునకు లోకానుగ్రహార్థము సన్న్యాసమును ఇవ్వవలయునని నాకు కౌతుకముగానున్నది" అని పలికెను. **అనంతరము కృష్ణసరస్వతి తనతోబాటుగా వున్న సన్న్యాసులతో కలసి శ్రీగురుమూర్తి వద్దకు వచ్చి ఇట్లనిరి** – "ఓ మునీశ్వరా! తపస్సంపన్నులలో మీరత్యంత శ్రేష్ఠులు. కావున, మా విన్నపమును మీరు స్వీకరింపగలరు" అని ఇట్లు చెప్పసాగిరి. (74–90)

లోకమును ఉద్ధరించుటకొరకే మీరు ఇప్పుడు సన్న్యాసమును స్వీకరింపగలరు. అప్పుడు మా పూజలను మీరు స్వీకరించి, మమ్ములను ఉద్ధరింపవలయును. ఈ కలియుగమునందు సన్న్యాసధర్మమును జనులందరూ నిందించుచుండిరి. దానిని పునరుద్ధరించువారు భూమిమీద మరెవ్వరూ కనిపించుటలేదు. అయితే, (91–92)

శ్లో॥ అగ్నిహోత్రం గవాలంభం సన్న్యాసం పలపైతృకం । దేవరాచ్చ సుతోత్పత్తిం కలౌ పంచ వివర్జయేత్ ॥ (93)

అనగా – అగ్నిహోత్రమును అనుష్ఠించుట అనగా యజ్ఞయాగాదులను చేయుట, పశుహింస చేయుట, సన్న్యాసమును స్వీకరించుట, శ్రాద్ధాదులయందు మాంసమును ఉపయోగించుట, భర్త మరణానంతరం మఱిదిద్వారా సంతానమును పొందుట అనే ఐదింటిని కలికాలమునందు చేయకూడని పనులు అని చెప్పబడినది. కలియుగమునందు సన్న్యాసము పనికిరాదని, నిషేధింపబడినదని జనులందరూ చెప్పుచుండిరి. కానీ, శ్రీఆదిశంకరభగవత్పాదులవారు అవతరించి ఉత్తమ అధికారి సన్న్యాసమును స్వీకరింపవచ్చునని, కలియుగమునందు సన్న్యాసము పూర్తిగా నిషేధము కాదని, వారు సన్న్యాసధర్మమును పునరుద్ధరించిరి. నాటినుండి నేటివరకు కలియుగమునందు సన్న్యాసధర్మము ఆచరింపబడుచున్నది. అయితే, కలిప్రభావముచేత జనులు తిరిగి ఈ సన్న్యాసమును నిందించుచుండిరి. కావున, కృపాసాగరా! ఈ ఆశ్రమమును ఉద్ధరించి లోకులందరికీ ఉపకారము చేయవలసినదని మునిజనులందరు ఆ నరహరి బ్రహ్మచారిని వేడుకొనిరి. మహావైరాగ్యనిధియైన ఈ మహాత్మునకు లోకానుగ్రహార్థముగా తప్పక సన్న్యాసమును నేను ఇచ్చెదనని కృష్ణసరస్వతి అచ్చటగల యతులతో ప్రస్తావించెను. వారందరి విన్నపమును ఆలించి శ్రీగురుమూర్తియైన నరహరి, వృద్ధయతియైన కృష్ణసరస్వతిని తనకు గురువుగా స్వీకరించి, ఆయననుండి సన్న్యాసాశ్రమమును స్వీకరించెను" అని **సిద్ధమునీంద్రుడు చెప్పగానే నామధారకుడు సందేహించి ఇట్లు ప్రశ్నించెను.** *(94–100)*

"అయ్యా! కృపానిధీ! మునిరాయా! మీ మాటలు వినిన మీదట నా మనసులో ఒక సందేహము జనియించినది. అదేమన, శ్రీగురుడే జగద్గురువని ఇంతకుముందు అనేక పర్యాయాలు మీరే చెప్పియుంటిరి. అట్టివారికి మరొకరు ఎట్లు గురువయ్యెదరు? త్రిమూర్త్యాత్మకుడి అవతారమును అది గౌణము చేసినట్లుగా గోచరించుచున్నదే!" అని సందేహపూర్వకమైన ప్రశ్నను విన్నవించెను. **అందుకు సదుత్తరముగా సిద్ధమహాముని తన శిష్యుని సందేహమును నివారింపజేయుచూ ఇట్లు చెప్పసాగెను –** "నామధారకా! వినుము. పూర్వము శ్రీరామచంద్రుడు అవతరించినపుడు వసిష్ఠమహర్షి వద్ద శిష్యత్వము చేయలేదా? ఎనిమిదవ అవతారమూర్తిగా శ్రీకృష్ణభగవానుడు అవతరించినపుడు సాందీపని మహామునిని గురువుగా స్వీకరింపలేదా? అటులనే మానవ అవతారమును ధరించి, మర్త్యలోకమునకు వచ్చినపుడు, లోకసంగ్రహార్థముగా గురువును శ్రీగురుమూర్తి స్వీకరించెను. స్వయముగా భగవంతుడే మానవదేహముతో అవతరించినపుడు మానవలోకధర్మమును అనుసరించి తీరవలెను. అందువల్లనే శ్రీగురుమూర్తి వృద్ధుడై, పరిపూర్ణమైన వైరాగ్యనిధిగా ఉన్నటువంటి కృష్ణసరస్వతి అనే యతిని తనకు గురువుగా స్వీకరించెను" అని వివరించి చెప్పగా **తిరిగి నామధారకుడు ఇట్లు ప్రశ్నించెను –**

"మునీశ్వరా! ఈ కృష్ణసరస్వతి గతములో ఎవరు? యతీశ్వరులందరిలోనూ ఆయనను గొప్పవారుగా భావించిరి కదా! ఆయనకు గురువెవరు? వారి మూలపీఠము ఏది? ఏ గురుసంప్రదాయమునకు చెందినవారు? వారి గురుపీఠముయొక్క మూలచరిత్రమును నాకు వివరించి చెప్పగలరని ప్రార్థించెను. **అందుకు మిక్కిలి హర్షముతో సిద్ధమునీశ్వరుడు, నామధారకునితో గురుపీఠసంప్రదాయమును గూర్చి ఇట్లు వివరించసాగెను –** (101–108)

గురుసంప్రదాయము కలిగిన మూలగురుపీఠమునకు ఆదిగురువు లేక మూలపురుషుడు 'శంకరుడు'. ఆ తరువాత గురువు 'విష్ణువు'. అతని పిమ్మట గురువు 'చతుర్ముఖ బ్రహ్మ'. ఇట్టి మూలపీఠమును గురించి మరింత వివరముగా చెప్పెదను వినుము. ఆ తరువాత గురువు 'వసిష్ఠుడు'. వసిష్ఠుని తర్వాత వరుసలో 'శక్తి'. ఆ తర్వాత 'పరాశరుడు'. పరాశరుని తదుపరి అతనికి శిష్యుడు సాక్షాత్తు విష్ణుమూర్తి అవతారమైన 'వ్యాసుడు' గురువయ్యెను. వ్యాసుని తదుపరి గురుపీఠమునకు 'శుకుడు' గురువయ్యెను. ఆ పిమ్మట 'గౌడపాదాచార్యులు'. అతని తరువాత 'గోవిందాచార్యుల'కు గురుపీఠము దక్కినది. గోవిందాచార్యుల నుండి 'శంకరాచార్యులు' గురువైనారు. శంకరాచార్యులవారి వరుసలో 'విశ్వరూపాచార్యులు', 'జ్ఞానబోధ గిరి', గురువు కాగా అతనికి 'సింహగిరి' శిష్యుడయ్యెను. వారి తరువాత 'ఈశ్వరతీర్థులు' ఈ

పీఠమునకు గురువైరి. తదనంతరము గురువు 'నృసింహతీర్థులు'. వారి శిష్యులు 'విద్యాతీర్థులు' గురువైరి. అనంతరము గురుపరంపరలోని వారు వరుసగా 'శివతీర్థులు', 'భారతీతీర్థులు', వారి తరువాత 'విద్యారణ్యులు'. ఆ తదుపరి 'శ్రీపాదమునికి' గురుపీఠము లభించినది. వారి తదుపరి 'విద్యాతీర్థులు' ఈ పీఠమునకు గురువులైరి. ఆయన శిష్యులు 'మలయానందులు'. వారి శిష్యులు 'దేవతీర్థసరస్వతి'. వారి నుండి 'యాదవేంద్రసరస్వతికి' గురుపీఠము సంక్రమించినది. యాదవేంద్ర సరస్వతి అనువారలందరు ఈ గురుపీఠ సంప్రదాయమునకు ప్రవక్తలుగా నుండిరి. అట్టి యాదవేంద్ర సరస్వతికి శిష్యులే ఈ 'కృష్ణసరస్వతి' స్వాములవారు. వీరు ఎంతోకాలము నుండి సన్న్యాసిగా విశేషమైన గౌరవమును పొందుచుండిరి. సన్న్యాస ఆశ్రమ సంప్రదాయమును రక్షించుటకొరకే శ్రీపాదశ్రీవల్లభుల అపరఅవతారమైన ఈ నరహరి అను బ్రహ్మచారికి కృష్ణసరస్వతి స్వాములవారు సన్న్యాసాశ్రమమును స్వీకరింపచేసి, **'నృసింహసరస్వతి'** అను దీక్షానామమును ఇచ్చిరి. నాటినుండి శ్రీగురునాథులు నృసింహసరస్వతిగా వాసిగాంచెను. వారు కాశీపట్టణమునందు వేదమునకు భాష్యమును చెప్పుచుండెడివారు. అందుచే వారు కాశీక్షేత్రమునందు సర్వులకు వందనీయులయ్యారు. వారణాశి పురమునందు గొప్ప ఖ్యాతిని గడించిరి. యతులందరునూ వచ్చి శ్రీగురుడికి సేవలు చేయుచుండిరి. అప్పుడు ఆయన అనేకమంది శిష్యులతో కలసి ఉత్తర తీర్థమైన బదరికాశ్రమమునకు వెళ్ళి అనంతతీర్థములను దర్శించుటకై బయలుదేరిరి. (109-120)

మేరుపర్వతమునందు కుడివైపున నవఖండమునందు గల అనేక తీర్థక్షేత్రములను పర్యటించిరి. "శిష్యా! నామధారకా! వారు పర్యటించిన క్షేత్రములన్నింటిని వివరముగా చెప్పవలెనన్నచో, ఒక పెద్ద విస్తారమైన చరిత్ర గ్రంథముగా రూపుదిద్దుకొనును. కావున, తమవెంట కొందరు సన్న్యాస శిష్యులను తీసికొని అన్ని తీర్థములను పర్యటించుచూ, భూప్రదక్షిణము చేయుచూ, కలకత్తా సమీపమునగల గంగా-సాగర సంగమమునకు చేరుకొనిరి.

ఈవిధముగా వారి పర్యటన గురించి క్లుప్తముగా నీకు వివరించితిని. త్రిమూర్త్యాత్మకుడైన శ్రీగురుని చరిత్ర అనంత మహిమాన్వితమైనది. వారి మహిమనంతటిని వివరించి చెప్పగల శక్తి నాకెక్కడున్నది. గురుదేవుడు గంగాసాగరమునుండి తటాకయాత్ర (గంగా ప్రదక్షిణము) చేయుచూ, ప్రయాగకు చేరుకొనిరి. శ్రీగురుమూర్తి ప్రయాగక్షేత్రమునందు నివసించిన సమయమున 'మాధవుడు' అను పేరుగల ఒక ద్విజుడు వచ్చి వారిని దర్శించెను. మాధవుడను ఆ బ్రాహ్మణుని యెడల శ్రీవారు అత్యంత ప్రసన్నుడై ప్రేమతో ఆతనికి బ్రహ్మజ్ఞానమును ఉపదేశించి,

సన్న్యాసాశ్రమమును అనుగ్రహించిరి. ఆయనకు 'మాధవ సరస్వతి' అను సన్న్యాసదీక్షా నామమును ప్రసాదించిరి. శిష్యులందరిలోనూ ఈ మాధవ సరస్వతి అనిన, నృసింహాసరస్వతి కెంతయో ప్రీతిగా నుండెను. ఈవిధముగా గురుమూర్తికి అనేకమంది శిష్యులు ఏర్పడిరి. వారందరి పేర్లు నీకు వివరించి చెప్పెదను, ఏకాగ్రచిత్తుడవై వినుచుండుము" అని నామధారకునకు సిద్ధమునీశ్వరుడు చెప్పుచున్న సంవాదమును, గంగాధరాత్మజుడైన సరస్వతి వివరించుచున్న కామధేనువు వంటి గురుచరిత్రను చదివినవారు, విన్నవారు మహాజ్ఞానసంపన్నులయ్యెదరు. వారికి చతుర్విధపురుషార్థ ఫలములు వెంటనే సిద్ధించును. (121-130)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు
శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు
"శ్రీగురుచతుర్థాశ్రమ గ్రహణము - గురుపరంపరా కథనము" అను పన్నెండవ అధ్యాయము ॥ 12 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 130; మొత్తము సంఖ్య : 1384 + 130 = 1514 ఓవీలు)

◆ ◆ ◆

బ్రహ్మా శ్రీశ హర స్వరూప మఖిలం లింగం జగద్వ్యాపకం
సత్యం జ్ఞాన మనంత మక్షర మజం శాంతం బహిర్వ్యాపకమ్ ।
స్వచ్ఛందం సగుణాశ్రితం సదమలం సర్వేశ్వరం శాశ్వతం
వందేఽహం గురుపూర్ణబోధ మనిశం శ్రీదత్తయోగీశ్వరమ్ ॥

(శ్రీ శంకరాచార్య కృతం శ్రీదత్తయోగీశ్వర స్తోత్రం, శ్లో.1)

శ్రీ గురు చరిత్ర

పదమూడవ అధ్యాయము

శ్రీగురుమూర్తి ప్రయాగకు చేరి శిష్యులకు సన్న్యాసదీక్షను ప్రసాదించుట - కారంజనగరమునకు తిరిగివెళ్ళుట - అచట తల్లిదండ్రులను, సోదరీసోదరులను అనుగ్రహించుట - గోదావరి ఉత్పత్తి కథనము - గౌతమీతీర తటాకయాత్ర - మాధవారణ్యునకు నృసింహరూపమున దర్శనమొసగుట - ఒక విప్రుని ఉదరశూలను నిర్మూలించుట - సాయందేవుని గృహమునందు శ్రీగురుదేవులు భిక్షను స్వీకరించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ – శ్రీనృసింహసరస్వతీ – శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యశ్రేష్ఠుడగు నామధారకుడు సిద్ధమునీంద్రుని చరణారవిందములయందు శిరసు వంచి, సాష్టాంగవందనమును ఆచరించి, లేచి, అంజలి ఘటించి, **మిగుల వినయముతో ఇట్లని స్తుతించెను** – "సద్గురుమూర్తీ! సిద్ధమునీశ్వరా! మీకు జయము జయము. ఈ భవార్ణవమునుండి మమ్ములను తరింపచేయుటకు మీరే కడు సమర్థులు. నాలో జ్ఞానజ్యోతిని వెలిగించి, నా చిత్తవృత్తిని స్థిరమొనర్చితిరి. శ్రీగురు కథామృతమును సేవించినకొలది నాలోని శ్రవణతృష్ణ మరింతగా పెరిగిపోవుచుండెను. కృపానిధీ! నా శ్రవణాపేక్షను శమింపచేయగల సమర్థులు మీరొక్కరే సుమా! కామధేనువువంటి గురుచరిత్రమును మీరు విస్తరించి చెప్పినకొలది, నా మనస్సునకు మరింతగా వినవలయునను కోరిక అంతకంతకు పెరుగుచున్నది. ఆకలితో నకనకలాడుచున్న ఒక గోవు పచ్చనిగడ్డితో నిండిన ప్రదేశమునకు చేరినపుడు దానికి పట్టరానంత సంతోషము కలిగి, తిరిగి అచటినుండి వెళ్లిపోవుటకు ఎంతప్రయత్నించిననూ అది ఆ చోటునుండి కదలనే కదలదు. కలలోనైనా ఒక మజ్జిగచుక్కను కూడ చూడనివాడికి కమ్మని పాలతో నిండిన ఒక భాండమును చేతికందించినపుడు కడుపారగా ఆ పాలను త్రాగాలని ఆతనికెంతటి ఉబలాటము కలుగునో కదా! అట్లే ఆ పాలను మొత్తము తాగకుండా ఆ భాండమును వాడు వదలిపెట్టునా? అదేవిధముగా అల్పజ్ఞానినైన నేను గురువుయొక్క నిజస్వరూపమును ఎంతమాత్రము గ్రహింపజాలనైతిని. అవిద్యా మాయతో చుట్టబడి మిగుల బాధను అనుభవించుచుంటిని. స్వామీ! అజ్ఞానాంధకారమును పారద్రోలెడు జ్యోతిస్వరూపులు మీరు. నాలోని చీకటిని నశింపచేసి, జ్యోతిస్వరూపమును వెలిగించి,

శ్రీగురువుయొక్క నిజస్వరూపమును దర్శింపచేయించితిరి. అట్టి మీ ఉపకారమునకు ప్రత్యుపకారమును ఎట్లు చేయగలను. ప్రత్యుపకారమును చేయగల సామర్థ్యము నాకెంతమాత్రమును లేదు. కల్పవృక్షమును ఆశ్రయించి సఫల మనోరథులైనవారు దానికి ఏమిచ్చి ఋణము తీర్చుకోగలరు. కృపామూర్తీ! సిద్ధరాయా! చింతామణి ఇచ్చినవారికి ప్రత్యుపకారము చేయగల సమర్థుడు ఈ లోకమునందు కలడని ఎప్పుడయినా వినియుంటిమా! అటులనే, కామధేనువు ప్రసాదించిన సమస్త సౌఖ్యములకు తిరిగి ప్రత్యుపకారము చేయగల సమర్థుడు ఈ లోకములో ఎవడైనా కలడా? అదేవిధముగా తాము నాయెడల కృపజూపి నన్ను కృతార్థునిగా చేసిన ఉపకారమునకు ప్రత్యుపకారమును ఎన్ని జన్మలెత్తిననూ తీర్చుకొనలేను. కల్పవృక్షము, కామధేనువు, చింతామణి వంటి అమూల్యమైన వాటిని ఎవరు ఆశ్రయించెదరో, వారి మనోభీష్టములను అవి సిద్ధింపచేయును. అట్లే మీరును నావంటి దీనులను ఈ సంసారమహార్ణవమునుండి తరింపచేయుటకు కారణజన్ములై విచ్చేసిన మహాత్ములే కాని, వేరు కాదు. స్వామీ! మీరు ధర్మార్థములను నిరూపించుచుండుటవలన నాలో నిజస్వరూపముయొక్క స్వార్థము వృద్ధి పొందుచుండెను. శ్రీగురుచరణములను సదా సర్వదా భజించాలనెడు పారమార్థిక లౌఖ్యము (చింతనము) అత్యధికమగుచుండెను. శ్రీగురుమూర్తి ప్రయాగలో ఉన్నప్పుడు మాధవసరస్వతి అనువారికి సన్న్యాసదీక్షను అనుగ్రహించిరని చెప్పితిరి గదా! తదనంతర కథను దయతో నాకు వివరించి చెప్పగలరని" నామధారకుడు ప్రార్థించెను. (1-13)

శిష్యుని మాటలను విని సిద్ధముని మిగుల సంతసించి, **నామధారకుని మస్తకమున తన హస్తమును ఉంచి ఆశీర్వదించెను.** "శిష్యశిరోమణీ! నీవు ధన్యుడవు. నీకు శ్రీగురుచరణముల యందు దృఢమైన భక్తి కలిగినది. ఈ లోకమున సంసారసాగరమును తరించిపోగలవాడవు నీవొక్కడవే. నీవు శ్రీగురుప్రాప్తిచే కలిగెడు లాభమును చక్కగా గుర్తింపగలిగితివి. అందుకే ఇంతటి భక్తిభావముతో గురువుయొక్క చరిత్రమును గూర్చి మరింతగా ప్రశ్నించుచుంటివి. నీవు ప్రశ్నించుటవలన నాకు అపారమైన సంతోషము కలుగుచున్నది. అత్యంత ప్రఖ్యాతి గాంచిన శ్రీగురుచరిత్రమును నీకు చక్కగా విస్తరించి చెప్పెదను. నాయనా! ఏకాగ్రచిత్తముతో వినవలసినది".

మాధవునకు సన్న్యాసదీక్షను ఇచ్చిన పిదప గురుమూర్తి ప్రయాగక్షేత్రమునందే కొంతకాలము నివసించెను. ఆ క్షేత్రమునందు వారు వసించిన కాలమున నృసింహసరస్వతి స్వామి వారి మహిమ మరింతగా విస్తరించెను. అంతేగాక, తన శిష్యుడైన మాధవసరస్వతికి ప్రతినిత్యము తత్త్వోపదేశము చేయుచుండిరి. తద్వారా వారికి అనేకమంది శిష్యులు ఏర్పడిరి. వారిలో ముఖ్యుడు మాధవసరస్వతి. అయితే,

వారికి ఏర్పడిన శిష్యులందరి పేర్లను గూర్చి వివరించినచో, ఈ కథ మరింత విస్తారమగును. కావున, ముఖ్యముగా మిగుల ప్రసిద్ధినొందిన ఏడుగురు శిష్యుల నామములను నీకు తెలియచేసెదను శ్రద్ధగా వినుము - (14-19)

“బాల సరస్వతి, కృష్ణ సరస్వతి, ఉపేంద్ర సరస్వతి, మాధవ సరస్వతి, సదానంద సరస్వతి, జ్ఞానజ్యోతి సరస్వతి మరియు ఏడవవాడగు శిష్యుడు సిద్ధసరస్వతి అనగా - సిద్ధుడనే పేరుగల నేనే ఆ వ్యక్తిని. నాయనా! ఈవిధముగా శ్రీనృసింహసరస్వతి స్వాములవారికి ఏడుగురు ప్రధానమైన శిష్యులు ఏర్పడిరి. అంతేగాదు, అసంఖ్యాకమైన శిష్యులు వారికి ఏర్పడినారు. వారందరూ ఒకరికంటే మరొకరు అత్యంత శ్రేష్ఠులు అని గమనించవలయును. ఆ శిష్యులతో కలిసి శ్రీగురుమూర్తి ప్రయాగక్షేత్రమునకు దక్షిణ దిశగా నున్నటువంటి మధ్యప్రాంతమునగల సమస్త క్షేత్రములను పవిత్రము చేస్తూ, పర్యటిస్తూ, తిరిగి తమ జన్మస్థానమగు కారంజనగరమునకు చేరుకొనిరి. (20-22)

కారంజనగరములో గల తమ తల్లిదండ్రులను శ్రీవారు దర్శించిరి. అప్పుడు వారి జననీజనకులు మరియు నలుగురు సోదరులు, ఒక సోదరీమణి వారి సమీపమునకు చేరి, వారిని దర్శించి, అత్యంత వినయముతో నమస్కరించి వారిని చక్కగా పూజించిరి. తమ జన్మస్థానమైన కారంజనగరములోని ఇంటింటికీ తిరిగి శ్రీ గురుడు భిక్షను యాచించెను. అనేకరూపములను ధరించి ఏకకాలములో ప్రతి ఇంటనూ పూజలను స్వీకరించెను. ఒక యతి వేషధారిగా కనిపించినప్పటికినీ ఈయన మాత్రము నిశ్చయముగా శ్రీమహావిష్ణు అవతారమే కానీ, వేరు కాదు. ఈయన సాక్షాత్తుగా పరమాత్మయే అని వారిని దర్శించిన జనులందరూ విస్మయమును పొందుచుండిరి. వీరిని ఒకవేళ ఎవడేని నరుడు అని భావించినచో, వాడు తప్పక నరకలోకమునకే పోవును. అనేక నరకయాతనలను అనుభవించును. బహుశా బ్రహ్మా, విష్ణు, మహేశ్వరులే ఏదో ఒక కార్యనిమిత్తముగా ఇట్లవతరించిరని పండితులు, ప్రజలు అందరికందరు అనుకొనుచుండిరి. తల్లిదండ్రులు భక్తిభావముతో ఆయనను ఒక గురుమూర్తిగా ఉన్నతాసనమున కూర్చుండజేసి పూజించిరి. అప్పుడు వారు తన తల్లిని అనుగ్రహించి ప్రేమతో శ్రీపాదశ్రీవల్లభులుగా మారి ఆమెయొక్క పూర్వజన్మమును గుర్తుకు తెచ్చెను. అప్పుడా తల్లి సత్యసంకల్పుడైన పరమేశ్వరునికి ప్రదోష సమయమునందు చేసిన పూజాఫలితముగా ఇంతటి మహత్తరమైన ఫలితము లభించినదని తన శిరస్సును వారి చరణకమలములపై నిలిపి నమస్కరించెను. “విశ్వవంద్యుడైన ఒక పుత్రుని పొందాలని నేను, ఆ మహాదేవుని ఆరాధించితిని అని తన పూర్వజన్మ చరిత్రమునంతయునూ ఆమె తన భర్తకు తెలియజేసెను. మనోవాక్కాయములతో శ్రీపాదశ్రీవల్లభులను ఆరాధించితిని. కనుకనే, అవతారపురుషులైన ఈ మహానుభావుడు మనకు

పుత్రునిగా జన్మించి, మన జన్మలను సఫలమొనర్చిరి" అని అనుచు వారిరువురూ వందనముచేసి తిరిగి లేచి నిలబడి చేతులు జోడించి, "జగన్నాథా! యతిరాజా! ఈ సంసారసాగరమునుండి మమ్ములను తరింపచేయుమని" వేడుకొనిరి. **అంతట శ్రీగురుమూర్తి వారితో ఇట్లనెను**- "ఒక వంశమునందలి ఒక తరములోని ఒక కుమారుడు సన్న్యసించుటవలన ఆ వంశములోని నలుబది రెండు తరముల వారు ఉద్ధరింపబడెదరు. వారికి బ్రహ్మలోకమునందు శాశ్వతమైన పదవి ప్రాప్తించును. ఆ వంశమునందు భవిష్యత్తులో జన్మించిన వారందరు కూడా బ్రహ్మపదవిని పొందెదరు. వారి పితరులకు, సంతతికి, ఎంతమాత్రము యముని భయము ఉండదు. ఒకవేళ వారి పూర్వీకులు నరకమునందు ఉండియున్నచో, వారు సహితము నరకమునుండి విడుదల పొంది శాశ్వతమైన బ్రహ్మపదవిని పొందెదరు. అందుకే, నేను సన్న్యాసాశ్రమమును స్వీకరించితిని. మీకెంతమాత్రమూ భయము వలదు. ఈ విషయమును గూర్చి మీరు విచారపడవద్దు. మీకు నిశ్చయముగా బ్రహ్మపదము లభించును. మీరు, మీ కుమారులు శతాయుష్మంతులై జీవించెదరు. అష్టైశ్వర్యములతో తులతూగెదరు. వారి పుత్రపౌత్రులు సౌఖ్యముగా ఉండుటను కూడా మీరు మీ కనులతో స్పష్టముగా చూడగలరు. ఇక అంత్యకాలమున మీరు కాశీ క్షేత్రమునకు క్షేమముగా చేరుకొందురు. ముక్తికి స్థానమైన, వేదశాస్త్రములకు ప్రఖ్యాతినొందిన అవిముక్త క్షేత్రమునందు నివసించి విశ్వనాథుని అనుగ్రహమునకు పాత్రులయ్యెదరు. మీరిక దేనినిగూర్చి రవంతకూడా చింతపడవలదు" అని వారికి నిశ్చయముగా నచ్చచెప్పెను. ఇంతలో వారి సోదరియైన రత్నాబాయి శ్రీగురుమూర్తికి వినయముతో నమస్కరించి, చేతులు జోడించి, ఇట్లు విన్నవించెను.(23-40)

"స్వామీ! నన్ను తరింపచేయుడు. నేను భవసాగరములో పడి మునిగిపోవుచుంటిని. ఈ మాయామోహము నన్ను చుట్టి పీడించుచున్నది. మహానుభావా! నన్ను ఉద్ధరించుము. సంసారమాయలో బడి నేను కుములుచుంటిని. సాంసారిక తాపత్రయాలతో నాకు మిక్కిలి భీతి కలుగుచున్నది. నన్ను వాటికి తగులుకొనకుండా అనుగ్రహించుము. నేను కూడా తమరివలె తాపసినై నిర్లిప్తంగా తపస్సు చేయుచు జీవితమును గడుపవలెనని కోరుకొనుచుంటిని" అని ఆమె ప్రార్థించెను. **వెంటనే శ్రీగురుమూర్తి ఇట్లనెను** - "అమ్మా! స్త్రీలకు పతి సేవను చేయుటయే తపస్సు. దానితో వారు సులభముగా సంసారసాగరముయొక్క ఆవలితీరమును చేరుకొందురు. ఎవరి భావము ఎట్లుండునో, వారికి అటులనే జరుగును. భర్తనే శివునిగా తలంచి దృఢమైన భావనతో ఏ స్త్రీ పూజించునో, ఆ స్త్రీ తప్పక భవసాగరమును దాటిపోవును. ఇందెంతమాత్రము సందేహము లేదు. పతిసేవా పరాయణత్వముతో స్త్రీలు ఉద్ధరింపబడెదరని వేదశాస్త్ర పురాణములు స్పష్టముగా చెప్పుచున్నవి.

కావున, నీవు చింతించవలదు. తప్పక నీకు ఉత్తమగతి లభించును" అని చెప్పెను. **శ్రీగురుని మాటలు విని ఆమె చేతులు జోడించి, తిరిగి ఇట్లనెను** – "శ్రీగురుమూర్తీ! మీరు అవతారపురుషులు. నాకు బ్రహ్మజ్ఞానమును బోధించగలరు. ఇంకనూ మీరు భవిష్యత్తులో జరుగబోవునవి తెలిసినవారని వింటిని. అంతేగాదు, అవతారపురుషులైనవారికి భూతభవిష్యద్వర్తమానములన్నియూ తెలిసియుండును. కావున, భవిష్యత్తులో నా ప్రారబ్ధానుభవము ఎట్లుండునో దయయుంచి నాకు వివరించి చెప్పగలరని" ఆమె ప్రార్థించెను. పదే పదే ఆమె మిక్కిలిగా ప్రార్థించుటవలన **శ్రీ గురుమూర్తి ఆమెతో ఇట్లు చెప్పెను**– "అమ్మా! నీవు తాపసిగా కావాలని, తపమాచరింపవలయుననే కోరిక కలదని అంటివి. సరే! మంచిదే. కానీ, ఎవరి సంచితకర్మను వారు అనుభవింపక తప్పదు. నీకు కొంత పూర్వసంచితపాపకర్మ అనుభవించవలసిన అవసరమున్నది. పూర్వజన్మలో నీవు ఒక గోవును నీ కాలితో తన్నితివి. అంతేగాక, మీ పొరుగున వున్న భార్యాభర్తలకు మధ్య కలహమును కల్పించి, వారికి ఎడబాటు కల్పించితివి. ఆ దోషమువలన నీకు అనేకరకముల బాధలు కలుగును. గోవును కాలితో తన్నినందువలన నీకు కుష్ఠురోగము ప్రాప్తించును. భార్యాభర్తలను ఎడబాపినందువలన నీ భర్త నిన్ను వదలిపెట్టి తపస్సును ఆచరించుటకు వెళ్లిపోవును. నీయొక్క పూర్వసంచిత కర్మలప్రారబ్ధము అట్లున్నది" అని చెప్పెను. ఈ మాటలను వినిన రత్నాబాయి ఎంతయో తీవ్రముగా విలపించెను. వెంటనే శ్రీగురుమూర్తి చరణములపై పడి దొర్లుతూ రెండు చేతులు జోడించి, "గురునాథా! నన్ను శీఘ్రముగా ఉద్ధరింపచేయుము" అంటూ ఆయన పాదకమలములను ఆశ్రయించెను. అందుకు కరుణించిన శ్రీగురుడు, "అమ్మా! కొలదికాలము మీరు బాగుగనే ఉండెదరు. నీకు వృద్ధాప్యము సంక్రమించిన పిదపనే నీ భర్త సన్న్యాసమును స్వీకరించును. ఆ మీదట నీ దేహమునకు కుష్ఠురోగము సంక్రమించును. తరుణవయస్సును అనుభవించిన పిమ్మటనే నీకట్టి గతి ప్రాప్తించును. నీ దేహము తీవ్రముగా కృశించి, బాధపడుచున్న సమయమున నీవు మా వద్దకు చేరెదవు. అంతట నీ పాపము దహింపబడును. ఏ క్షేత్రమునకు వెళ్లుటవలన నీ పాపము పరిహరింపబడి నీకు క్షేమము కలుగునో, దాని గురించిన ఉపాయమును చెప్పుదును. ఎప్పుడైతే నీ శరీరము ద్వారా మిక్కిలి దురవస్థను నీవు అనుభవించుచుండెదవో, అప్పుడు దృఢమైన విశ్వాసముతో దక్షిణదేశమునందుగల భీమానదీ తీరమున ఉన్న పాపనాశన తీర్థమునకు వెళ్లుము. ఈ భూమండలమునందు ప్రసిద్ధమైన అమరజా నదీ సంగమము వద్దగల అత్యంత సమర్థవంతమైన, మహిమాన్వితమైన గాణగాపురమనే క్షేత్రము కలదు. అచటికి నీవు వెళ్ళి ఆ పాపవినాశన తీర్థమునందు స్నానమొనర్చుటవలన నీ కుష్ఠువ్యాధి సమసిపోవును. విచారపడకుము. దుఃఖింపవలదు. నా మాటను విశ్వసించుము" అని

సోదరి రత్నాబాయిని ఓదార్చి దృఢవిశ్వాసమును కలిగించి శ్రీగురుమూర్తి గౌతమీనది ఉద్భవించిన దక్షిణదేశమునందలి త్ర్యంబకక్షేత్రమునకు బయలుదేరెను. శ్రీగురుదేవులు శిష్యసమేతులై నాసికా త్ర్యంబకక్షేత్రమును చేరుకొనిరి. ఆ తీర్థము మహామహిమాన్వితమైనదని అనేక పురాణములు దాని ప్రభావమును, ఖ్యాతిని గురించి వర్ణించినవి. అట్టి తీర్థమహిమను గురించి చెప్పవలెనన్నచో, ఈ కథ మరింతగా విస్తరించిపోవును. కనుక, దానిని గూర్చి **నీకిపుడు క్లుప్తముగా చెప్పెదను వినుము.** (41-61)

ఆ గౌతమీనదియొక్క మహిమ అపారమైనది. అది ఈ బ్రహ్మాండమునంతటినీ గొప్పగా చుట్టియున్నటువంటి ఉదకము. ఈశ్వరుడు తన జటామకుటమునందు శ్రేష్ఠమైన ఈ గంగను ప్రీతితో ధరించెను. అప్పుడు సమస్త మునీశ్వరులందరూ కలిసి ఆలోచించినటువంటి **ఉపాయమును నీకు వివరించెదను వినుము–** "నామధారకా! బ్రహ్మర్షి గౌతముడు ఒక విశిష్టమైన తపస్సంపన్నుడు. ఆయన తన తపఃప్రభావముచేత, మరియు తన అనుష్ఠాన మహిమచేత పొలమునందు ధాన్యమును వెదజల్లి పంటను పండించువాడు. అనగా ఉదయము పొలమునందు ధాన్యమును వెదజల్లి, అనుష్ఠానమునందు కూర్చొని, మధ్యాహ్నము వరకు చల్లిన విత్తనములు అంకురించి, పెరిగి ఫలించేవి. పూర్వకాలమునందు మహర్షులు, బ్రహ్మర్షులందరూ ఈవిధముగ నిత్యము ఆహారమును పండించుకొనెడువారు. మహామంత్రబల సంపన్నులైనటువంటి పుణ్యపురుషులు వారు. నిత్యమూ తన తపోవనమునకు విచ్చేయు మునులందరకూ ఎప్పటికప్పుడు ధాన్యమును పండించి, దానిని పక్వము చేసి, అందరికి భోజనమునకై వడ్డించి, కడుపార భుజింపచేసిన పిమ్మటనే గౌతమమహర్షి తాను ఆహారమును స్వీకరించువాడు. అప్పుడు ఈ ఋషిమునులందరూ కలిసి తమలోతాము ఇట్లు ఆలోచించుచుండిరి. ఈ గౌతమమహర్షి సర్వేశ్వరునకు అత్యంత ప్రీతిపాత్రుడు. అంతేగాక, గొప్ప మహామహిమాన్వితుడు. అందువలన అతనికి ఏదైన ఒక గొప్ప సంకటమును కల్పించినచో, అతడు వెంటనే గంగను తన అవసరము కొరకు తప్పక భూమికి రప్పించగలడు. తద్వారా లోకమునందు దుర్భిక్షము నశించును. భూమండలమునందు మనందరితోపాటు జనులందరికీ గంగాస్నానఫలము ప్రాప్తించును. అప్పుడు మనమందరము మన గృహములకు వెళ్ళవచ్చును. గంగ భూలోకమునందు విహరించుటవలన సమస్తజనులకు సద్గతి ప్రాప్తింపగలదు.(62-67)

శ్లో॥ యా గతిర్యోగ యుక్తానాం మునీనాం ఊర్ధ్వరేతసామ్ । సా గతిః సర్వజంతూనాం గౌతమీ తీరవాసినామ్ ॥ (68)

అనగా – ఎల్లప్పుడూ యోగాభ్యాసమును చేయునట్టి ఊర్ధ్వరేతస్కులైన తాపసులకు ఎట్టి సద్గతి లభించునో, అట్టి సద్గతి గౌతమీ – గోదావరి తీరవాసులందరకూ లభించును. (69)

ఊర్ధ్వరేతస్సులైన అనగా ఆజన్మబ్రహ్మచర్యవ్రతముతో ఉండునటువంటి మునీశ్వరులు కోటి సంవత్సరముల పర్యంతము తపస్సు చేసినచో, అట్టి తాపసికులకు ఎట్టి ఉత్తమగతి ప్రాప్తించునో, అది కేవలము గౌతమీ స్నానము వలన సంప్రాప్తించును. అందువలన ప్రయత్నపూర్వకముగా గౌతమిని భూమిమీదకు రప్పించవలెను. అది కేవలము గౌతమమహర్షికి తీవ్రసంకటమును కలిగించుటవల్ల మాత్రమే మనందరికి లాభము కలిగించునట్టి గంగను ఆతడు తీసికొనిరాగలడు అని ఈ ఋషిమునీశ్వరులందరూ నిశ్చయించుకొనిరి. (70)

అనంతరము వారందరూ ఒక మాయను రచించిరి. ఆ మాయతో ఒక ఆవును, ఒక దూడను, గడ్డితో సిద్ధపరచి మాయద్వారా చైతన్యమును కల్పించి, గౌతముని పొలములోని పైరుమీదకు మేయుటకై పంపిరి. ఆ ఋషి అనుష్ఠానమును చేసికొనుచుండగా ఈ మాయతో చేసిన దూడ, గోవు వెళ్ళి పొలమునందు పైరును మేయుచుండెను. అప్పుడు ఆ గౌతముడు తన దివ్యదృష్టితో ఆ గోవును చూచెను. వెంటనే దానిని బయటకు పంపుటకై ఒక దర్భ పవిత్రను చేసి దానిమీదకు విసిరెను. అప్పుడా దర్భ పవిత్రయే వజ్రాయుధముతో సమానమైన శస్త్రముగా మారి పైరును మేయుచున్న ఆ మాయా గోవును సంహరించెను. వెంటనే ఆ ఋషిమునీశ్వరులందరూ "గౌతముడు గోహత్య చేసెను. ఇతనికి గోహత్యాపాతకము చుట్టుకొనెను. కావున, తగు ప్రాయశ్చిత్తమును చేసికొని శుద్ధుడు కావలయును" అని పలికిరి. అందుకు గాను ఋషీశ్వరులందరూ కలిసి **గౌతమమహర్షితో ప్రాయశ్చిత్తమును గూర్చి ఇట్లు పలికిరి.** "మహర్షీ! నీవు గంగను భూమండలమునకు తెచ్చినచో గోహత్యాపాతకము పరిహరింపబడును. అప్పుడే నీకు ప్రాయశ్చిత్తము సిద్ధించి, నీవు శుద్ధుడవు కాగలవు. ఇందుకు వేరొక కారణము లేనేలేదు" అని పలికిరి. అందుకొరకై గౌతమమహర్షి కృతనిశ్చయుడై, పట్టుదలతో ఒక వేయి సంవత్సరముల కాలము తపస్సు చేసెను. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమై వరమును కోరుకొమ్మని చెప్పెను. **అంతట గౌతముడిట్లనెను–** "సర్వేశ్వరా! నాకొక వరమును ప్రసాదించుము స్వామీ! ఈ చరాచరాత్మకమైన ప్రపంచమును ఉద్ధరించు నిమిత్తముగా గంగను ఈ పృథ్వీమీదికి ప్రవహింపజేయుము. స్వామీ! ఇదియే నా కోరిక" అని ప్రార్థించెను. గౌతముని విన్నపమును విని పరమేశ్వరుడు సంతసించి తన జటాజూటమునందుగల గంగమ్మకు అనుమతినిచ్చెను.

వెంటనే మానవుల పాపములను ప్రక్షాళన చేయుటకొరకై ఆమెను పుడమిపైకి పంపించెను. అంతట ఈశ్వరుడు ఈ బ్రహ్మాండమునకు బహిర్గతమైన గంగను భూలోకమునకు ప్రసాదించెను. అట్టి గంగా – భాగీరథిని వర్ణించగల సామర్థ్యము ఎవరికి కలదు. నామధారకా!

వినుము. అందువలననే శ్రీగురుమూర్తి గౌతమి ఉత్పత్తిని పొందిన స్థలమునకు విచ్చేసెను. ఈవిధముగా శ్రీగురుమూర్తి గౌతమీతటాక యాత్రను పూర్తిచేసెను. అనంతరము భక్తజనులను అనుగ్రహించుటకొరకై తాము దేశమునందలి పలుప్రాంతములను పర్యటించసాగిరి. (71-79)

గోదావరీతీర పర్యటన చేయుచూ శ్రీగురుడు 'మంజరీక'మనే పేరుగల పట్టణమును చేరుకొనెను. అచట 'మాధవారణ్యుడు' అను ఒక ముని శ్రీ గురుమూర్తికి తారసిల్లెను. అతడు నిరంతరము నరసింహస్వామికి మానసిక పూజను చేయుచుండెను. ధ్యానమునందు ఈనాడు తన మానసమూర్తియైన శ్రీగురుని అతడు దర్శించగలిగెను. మనమునందు అత్యంత విస్మయమునొంది, శ్రీగురుమూర్తికి పాదాభివందనము చేసెను. కడు భక్తిపూర్వకముగా ఆ గురుమూర్తిని అనేకవిధములుగా స్తుతించెను. (80-82)

శ్లో॥ యద్దివ్య పాదద్వయమేవ సాక్షాత్ అధిష్ఠితం దేవనదీ సమీపే । యదుత్తరే తీరనివాసి రామో లక్ష్మీపతిస్త్వం నివసన్ స నిత్యమ్ ॥ (83)

అనగా - దేవనది సమీపమున ఈ దివ్యమైన పాదద్వంద్వము ఏనాటినుండియో ప్రతిష్ఠితమై యున్నది. దీనికి ఉత్తర తీరనివాసియగు శ్రీరామచంద్రుడు లక్ష్మీసమేతుడై నిత్యము ఇచ్చోటనే నివసించును కదా! (84) కనుకనే ఆ దివ్యమంగళప్రదమైన పాదారవిందయుగళమును నేను ఈనాడు స్పష్టముగా దర్శించగలిగితినని శ్రీగురుమూర్తితో ఆ మాధవారణ్యమునీంద్రుడు కడు హర్షముతో విన్నవించెను. అప్పుడు శ్రీగురుడు మిక్కిలి సంతసించి మాధవారణ్యులతో ఇట్లనెను -

శ్లో॥ అత్యంతమార్గస్థితిమార్గరూపం అత్యంత యోగాదధికారతత్త్వమ్ । మార్గం చ మార్గం విచిన్వతో మే మార్గోదయం మాధవ దర్శయే తే ॥(85)

అనగా - "మాధవా! యోగమునందలి సంహితామార్గము, సృష్టిమార్గము, స్థితిమార్గములలో చివరిదైన స్థితిమార్గమునందు తద్రూపముతో అధికారతత్త్వమును అత్యంత గొప్ప ఉపాయముతో శోధించే నీకు నేను నిజమైన అభ్యుదయకరమైన మార్గమును చూపించెదను" అని శ్రీగురుడు అతనికి చక్కని ఆశ్వాసమును కల్పించి మిగుల హర్షముతో తన నిజస్వరూపమును సాక్షాత్కరింపచేసెను.

చిరకాలమునుండి తన మానసమునందు ఏ రూపమును భజించుచుండెనో, అట్టి రూపముతో తనకెదురుగా ప్రత్యక్షమైనటువంటి శ్రీగురుమూర్తిని గాంచిన మాధవారణ్యులు అంతులేని మహదానందమును పొంది సాష్టాంగవందనమును ఆచరించెను. మహదైశ్వర్యసంపన్నమైన శ్రీగురుమూర్తి స్వరూపమును దర్శించిన **ఆ మాధవారణ్యముని దోసిలొగ్గి అతి భక్తితో ఇట్లు స్తుతింపసాగెను** - "జగద్గురూ! మీకు జయము! జయము! నేటివరకు నేను మానసికముగ హృదయమునందు మాత్రమే ధ్యానించుచున్న తమ దివ్యశ్రీ చరణకమలములను నేటికి ప్రత్యక్షముగ

చూడగలిగితిని. ధన్యుడనైతిని. లోకులకు మానవునివలె కన్పించుచున్న మీరు త్రిమూర్త్యాత్మక స్వరూపులే. జగజ్జ్యోతి స్వరూపా! మీరు పరమపురుషులు. విశ్వమును తరింపచేయుటకే భూలోకమున మీరు అవతరించితిరి. మమ్ములను కృతార్థులను చేయుటకొరకే మీ దివ్య శ్రీ చరణములను దర్శింపచేసితిరి" అని అనేకవిధములుగా ఆ మాధవారణ్యుడు శ్రీగురుమూర్తిని స్తుతించెను. **శ్రీస్వామివారు మిగుల హర్షముతో చక్కని ఓదార్పు మాటలను ఇట్లు చెప్పెను** – "నాయనా! నీకు మంత్రసిద్ధి కలిగినది. నిశ్చయముగా నీకు సద్గతి లభించును. నీవు నిత్యము ఏ నృసింహస్వామిని ధ్యానించుచూ, మానసిక పూజ చేయుచుంటివో, ఆ మూర్తినే ఇప్పుడు నీముందు ప్రత్యక్షముగా సాక్షాత్కరింపచేసికొంటివి. ఇందెంతమాత్రమూ అతిశయము లేదు అని" ఆ మాధవారణ్యుని అనుగ్రహించెను. వెనువెంటనే శ్రీగురుడు శిష్యసమేతుడై బయలుదేరి గోదావరీతీరమునందుగల వాసర అనే బ్రహ్మేశ్వరక్షేత్రమును చేరుకొనిరి. (86–93)

ఈ గంగాతటాక యాత్రయందు శ్రీగురుడు సమస్తశిష్యులతో కలిసి గంగాస్నానము చేయుచుండగా అచటికి ఒక బ్రాహ్మణుడు వచ్చెను. ఆ బ్రాహ్మణుడు ఉదరశూలతో తీవ్రముగ బాధపడుచుండెను. నదీతీరమున అటూ ఇటూ దొర్లుతూ హాహాకారములు చేయుచుండెను. మిగుల దుఃఖించుచుండెను, అంతేగాదు, ఆ విప్రుడు హా! దైవమా! ఇక నేను జీవించి ప్రయోజనము లేదు, ఈ నదిలో దూకి నా ప్రాణములను వదలివేయుదును" అని ఆత్మహత్య చేసికొనుటకు ప్రయత్నించుచుండెను. అపరిమితమైన ఉదరశూలతో ఆ బ్రాహ్మణుడు నిత్యము ఉపవాసములు చేయుచుండెను. ఒకవేళ ఏనాడైనా భోజనమును చేసినచో, అది అతనికి ప్రాణాంతకమే యగుచుండెను. అందువలన, ఉదరశూలకు భీతిల్లి ఆ బ్రాహ్మణుడు ఎల్లప్పుడూ ఫలాహారమును మాత్రమే భుజింపసాగెను. అన్నముతో అతనికి ద్వేషము ఏర్పడినది. అన్నమును భుజించుటకంటే ప్రాణములను వదలివేయడమే మంచిదని అతడు తలంచెను. ఒక మాసమునకో, ఒక పక్షమునకో ఏదో ఒకసారి ఇతరుల బలిమిచేతనో, తన ఇచ్ఛచేతనో, అన్నమును భుజించినప్పుడు వెంటనే ఉదరశూల ప్రారంభమగుచుండెడిది. ఈవిధముగా అతడు ఎంతోకాలమునుండి తీవ్రమైన పీడకు గురియగుచుండెను. అప్పుడే ఆ ఊరిలో నవరాత్రోత్సవములు జరిగినవి. చివరి మహానవమిరోజున కమ్మని భోజనము వడ్డించిరి. అయితే, అప్పటికి అతడు భోజనము చేయక ఒక మాసము గడచిపోయినది. భోజనము చేసినచో అతనికి ఉదరశూల వచ్చుట తథ్యము. అది తెలిసికూడా మృష్టాన్నమును ఎదురుగా చూచి ఆవురావురుమని కడుపార భుజించెను. తత్ఫలితముగ తీవ్రమైన ఉదరశూల ప్రారంభమయ్యెను. ఆ బాధను భరించలేక అతడు అటు ఇటు దొర్లుచు, మెలికలు తిరుగుచుండెను. నొప్పికి తాళలేక ఆ బ్రాహ్మణుడు వెంటనే గంగలో దూకి ప్రాణములు త్యజించుటకు సిద్ధపడెను. (94–100)

ఆ బ్రాహ్మణుడు బిగ్గరగా దుఃఖించుచూ "గంగలో దూకి నా ప్రాణములను వదలివేయుదును. మహాపాపినైనందున అన్నద్వేషము కలిగినదేమో! ఇక నాకు ఈ సంసారము వద్దు. జీవులకు అన్నమే ప్రాణము. అన్నమే జీవనాధారము. అన్నము లేకుండ ఎవడునూ బ్రతకలేడు. అట్టి అన్నమే నాకు శత్రువై కూర్చున్నది. ఇక నాకు మరణమే గతి" అని తనలోతాను దృఢముగ నిశ్చయించుకొని గంగలో ప్రవేశించి మునిగిపోవుటకై తన పొట్టకు ఒక బండరాయిని కట్టుకొని గంగాప్రవాహములోనికి ప్రవేశింపసాగెను. అప్పుడు మానసికముగ భగవంతుని ఇట్లు స్మరించుకొనెను. "భగవంతుడా! నేను ఈ భూమికి భారమైతిని. నేనేనాడూ పరోపకారము చేయలేదు. అన్నదానాదులను కూడా చేసి ఎరుగను. ఈ జన్మలో పుణ్యము చేయలేదు. గత జన్మలో చేసిన కర్మఫలముతో ఇప్పుడు ఇన్ని కష్టములను అనుభవించుచుంటిని. బ్రాహ్మణుల నోటిముందు, కపిలగోవు నోటిముందు గల గ్రాసమును లేదా ఆహారమును లాగివేసితినేమో, లేదా దృఢముగ ఈశ్వరుని విశ్వసించినవారికి అనవసరమైన విఘాతమును కలిగించితినేమో అందువల్లనే, ఇట్టి దుష్టప్రారబ్ధమును అనుభవింపవలసి వచ్చినట్లున్నది. లేక, ఈశ్వరునిపూజను అసంపూర్తిగ వదలివేసితినేమో, గురుజనులను నిందించితినేమో, తలిదండ్రులను అవమానించితినేమో, తత్ఫలితముగా ఈ జన్మలో ఇట్టి కష్టములను అనుభవించుచుంటిని. లేదా పూర్వజన్మమునందు ద్విజులను ధిక్కరించితినేమో, వైశ్వదేవ సమయమున వచ్చిన అతిథులకు భోజనమును పెట్టలేదేమో, నూతన వధూవరులను వధించితినేమో, వనమునకు నిప్పు పెట్టితినేమో, భార్యతో కలిసి సుఖింపుచూ, తలిదండ్రులను దూరము చేసి, సుఖముగా మృష్టాన్నమును భుజించితినేమో, పూర్వజన్మలో చేసిన ఏ పాపకర్మవలననో, ఇప్పుడు ఈ తీవ్రమైన కష్టములకు గురియగుచుంటిని. "హా! హతవిధీ! ఇట్టి పాపిని నేను జీవించుటకంటే మరణించుటయే మేలు కదా" అని తన పాపములను గుర్తు తెచ్చుకొనుచూ ఆ బ్రాహ్మణుడు గంగలోనికి ప్రవేశించుచుండగా, అదే తీరమునకు విచ్చేసిన శ్రీగురునాథుడు అది చూసి, తన శిష్యులను వెంటనే వెళ్ళి ఆ బ్రాహ్మణుని పిలువనంపెను.

"ఆ బ్రాహ్మణుని ఇటు తీసికొని రండు. ఇంత సులభముగా తన అమూల్యమైన ప్రాణములను వదలివేయుచుండెనేమిటి? ఆత్మహత్య మహాదోషము కదా! ఎందుకట్లు చేయుచున్నాడో విచారించెదమని" పలికెను. శ్రీగురుని మాటలు వినిన శిష్యులు వెంటనే పరుగెత్తుకొని వెళ్ళి, ఆ బ్రాహ్మణునికి నచ్చజెప్పి, తీసికొనివచ్చి శ్రీవారి సమ్ముఖమున నిలిపిరి. **అనాథనాథుడు, దిక్కులేని దీనులకు కల్పతరువు. దుఃఖజీవులపాలిట కృపాసాగరుడు అయిన శ్రీగురుమూర్తి ఆ దుఃఖితుడైన బ్రాహ్మణుని ఇట్లు ప్రశ్నించెను.** "నాయనా! ప్రాణములను ఎందుకు వదలివేయవలయునని తలంచితివి. ఆత్మహత్య మహాపాపము కదా! అసలు విషయమేమిటో నాకు వివరించి చెప్పు"మని పలికిరి.

అప్పుడా బ్రాహ్మణుడు చేతులు జోడించి ఇట్లనెను – “యతిరాజా! నన్నిట్లు అడిగి మీరేమి చేయగలరు? నా జన్మ వ్యర్థమైనది. నేనేమని చెప్పుదును. ఈ భూమికి నేను భారముగా మారితిని. మాసమునకో, పక్షమునకో ఒకసారి భోజనము చేసినచో, వెంటనే ఉదరశూల ప్రారంభమై మిక్కిలి బాధపడుచుంటిని. ఏమని చెప్పుమందువు. స్వామీ! ఆ బాధను భరించలేక ప్రాణములను వదలివేయుటకు నిశ్చయించుకొంటిని. “హే! జగద్గురూ! శరీరము అన్నగతమైనది కదా! అట్టి అన్నమే నాకు శత్రువైనది. గురురాజా! ఎటుల బ్రతకమందురు?” అనెను. **అంతట శ్రీగురుడు అనుగ్రహించి ఆ బ్రాహ్మణునితో ఇట్లనెను** – “ఓ బ్రాహ్మణుడా! ఆత్మహత్య మహాపాతకము కదా! నేటితో నీ వ్యథ తీరిపోయెను. నా వద్ద ఒక దివ్యౌషధము కలదు. అదేమిటో నీకిప్పుడే చెప్పెదను. నీ మనసులో ఇక ఎట్టి సంశయము పెట్టుకొనవలదు. భయపడవలదు. నీ వ్యాధి సమసిపోవును. ఇకమీదట నీవు సుఖముగా భోజనము చేయగలవు” అని శ్రీగురుమూర్తి పలికెను. (101–120)

శ్రీగురుమూర్తి మాటలు వినిన ఆ బ్రాహ్మణుని మనోభయము నశించిపోయి, చిత్తము స్థిరమయ్యెను. వెంటనే స్వామిని సమీపించి, తన శిరస్సును శ్రీగురుమూర్తి చరణకమలములయందు నిలిపి సాగిలపడి మ్రొక్కెను. తదుపరి స్వామికి ఒక ప్రక్కన కూర్చొనియుండెను. ఇంతలో ఆ గ్రామాధికారియగు ఒక బ్రాహ్మణుడు గంగాస్నానము చేయుటకొరకై అచటికి చేరుకొనెను. అదే గంగాతీరమున శ్రీగురుమూర్తిని చూసిన ఆ బ్రాహ్మణుడు వెంటనే స్వామివారిని సమీపించి, వారి పాదారవిందములను తాకి, సాష్టాంగవందనమును ఆచరించి, అత్యంతభక్తిభావముతో, త్రికరణశుద్ధిగా చేతులు జోడించి నిలబడెను. **అప్పుడు శ్రీగురుమూర్తి అతనిని చూసి అభయమును ఇచ్చుచూ ఇట్లడిగెను**– “ఓ బ్రాహ్మణుడా! నీ పేరేమి? నీవు ఎవరవు? నీ నివాసమెచ్చట? వివరముగా తెలియజేయుము.

అప్పుడా బ్రాహ్మణుడు అత్యంత వినయభావముతో ఇట్లనెను – “స్వామీ! నా పేరు ‘సాయందేవుడు’. నాది కౌండిన్యస గోత్రము. ఆపస్తంబశాఖకు చెందినవాడను. కడగంచి అనే సమీపగ్రామమున నేను ఒక సంవత్సరము నుండి నివసించుచూ, ఉదరపోషణ నిమిత్తమై తురుష్కుల సేవలు చేయుచుంటిని. స్వామీ! ఈ గ్రామమునందు గ్రామాధికారిగా ఒక సంవత్సర కాలము నుండి నివసించుచుంటిని. అత్యంత దయామూర్తులై అప్రయత్నముగా లభించిన నేటి మీ దర్శనభాగ్యముతో నేను ధన్యుడనైతిని. సమస్త విశ్వమును తరింపచేయగల అవతారపురుషులు నాకు దర్శనము అనుగ్రహించుట ఎన్నో జన్మల పుణ్యఫలము. తద్వారా నేను కృతార్థుడనైతిని. గతజన్మల దోషములన్నియూ నశించిపోయినవి. స్వామీ! మీ అనుగ్రహమువలన ఈ భవార్ణవమునుండి తరించగలిగితిని. (121–129)

శ్లో॥ గంగాపాపం శశీతాపం దైన్యం కల్పతరుస్తథా । పాపం తాపం చ దైన్యం చ హరేచ్ఛ్రీగురుదర్శనమ్ ॥ (130)

అనగా - గంగను దర్శించుట వలన పాపములు తొలగిపోవును. చంద్రుని దర్శనము వలన తాపములు నశించిపోవును. కల్పవృక్షమును చేరుకొనుటవలన దైన్యము అనగా దరిద్రము సమసిపోవును. ఇక శ్రీగురుదర్శనము వలన పాపము, తాపము, దైన్యములనే మూడునూ నశించిపోవును గదా! కావున, శ్రీస్వామివారి పాదపద్మముల దర్శనమువలన నాకు చతుర్విధ పురుషార్థఫలము సిద్ధించెను" అని ఈవిధముగా శ్రీగురుమూర్తిని స్తోత్రము చేసి, తిరిగి శ్రీస్వామివారి పాదపద్మములకు నమస్కరించెను. జగద్గురువులు అప్పుడు ఆతనికి అభయమును ప్రసాదించిరి. **తదుపరి ఇట్లనిరి** - "నాయనా! సాయందేవా! నా మాటలను వినుము. ఈ బ్రాహ్మణుడు ఉదరశూల వ్యాధితో మిక్కిలి బాధపడుచున్నాడు. అంతేగాక, మా కనులతో మేము చూచుచుండగా ప్రాణత్యాగము చేయుటకు సిద్ధపడినాడు. అతని ఉదరవ్యాధికి ఉపశమనముగా నేనొక దివ్యౌధమును ఇచ్చెదనని ఇతనికి అభయమును ఇచ్చితిని. కావున, నేను చెప్పినట్లుగా నీవు చేయవలయును. నీ ఇంటికి ఈ విప్రుని తీసుకొనివెళ్లుము. ఇతడు మిక్కిలి ఆకలిగొనియున్నాడు. షడ్రసోపేతమైన మృష్టాన్నమును ఇతనికి భుజింపచేయుము. ఇదియే ఔషధము. దానివలన ఇంతకాలము నుండి అతనిని వేధించుచున్న ఉదరశూలవ్యాధి నశించిపోవును" అని శ్రీగురుమూర్తి ఆదేశించగా, ఆ సాయందేవుడను బ్రాహ్మణుడు వెంటనే ఒక విధమైన భయమును ప్రకటింపుచూ, **చేతులు జోడించి ఇట్లనెను** - "స్వామీ! ఈ బ్రాహ్మణుని నేనెరుగుదును. ఇతడు నాకు బాగుగా తెలిసినవాడు. ఒకవేళ ఇతనికి మృష్టాన్నభోజనమును పెట్టినచో, ఇతనికి ప్రాణఘాతుకమేర్పడును. తద్ద్వారా, నాకు బ్రహ్మహత్యాపాతకము సిద్ధించును. ఎప్పుడైనను ఇతడు అన్నమును భుజించిన వెంటనే ప్రాణాంతకమైన బాధను అనుభవించుచూ, విపరీతముగ రోదించుచూ, ప్రాణత్యాగము చేయుటకు సిద్ధపడుచుండును. కానీ, ఈ రోజు మీరు షడ్రసోపేతమైన మృష్టాన్నమును తినిపించుమని ఆదేశించుచుంటిరి. తత్ఫలితముగా అనుకోని ప్రమాదమేర్పడినచో, నాకు బ్రహ్మహత్యాదోషము చుట్టుకొనును గదా! స్వామీ! ఎట్లు చేయుదును" అని భీతితో ఆ సాయందేవుడు విన్నవించెను. (131-138)

అంతట శ్రీగురుడు సాయందేవునితో ఇట్లనెను - "నాయనా! చింతింపవలసిన పనిలేదు. భయపడవలదు. చక్కని కమ్మని మినపగారెలు, క్షీరములతో సిద్ధము చేసిన పరమాన్నమును మేము ఇతనికి దివ్యౌషధముగా చెప్పుచుంటిమి. ఇతరమైనటువంటి కమ్మనైనటువంటి భోజనమును ఏర్పాటు చేసి ఈ రెండు పదార్థములను అతనికి కడుపారగా భుజింపచేయుము. వాటిని భుజించిన వెంటనే అతని వ్యాధి సమసిపోవును.

ఇందు ఎంతమాత్రము సంశయింపవలదు. మేము అభయమునిచ్చుచుంటిమి. భయమును విడనాడి వెంటనే ఈ బ్రాహ్మణుని ఇంటికి తీసుకొని వెళ్ళుము" అని స్వామి ఆదేశించెను.

అంతట స్వామి మాటలకు నిశ్చయమును చెందిన **సాయందేవుడు స్వామివారి శ్రీచరణసరోజములకు నమస్కరించి పలికెను**– "స్వామీ! నాయొక్క మనవిని ఆలకింపుడు. దయతో మీరు కూడా మా ఇంటికి విచ్చేసి మా భిక్షను స్వీకరింపగలరని" దీనముగా ప్రార్థించెను. అందుకు శ్రీగురునాథుడు వెంటనే అంగీకరించెను. కుంతీవాని ఇంటిముందుకు గంగాదేవి పరుగెత్తుకొని వచ్చినట్లుగా, ఈ దీనుని మనవినాలించి "తమ ఇంటికి వచ్చి భిక్షను స్వీకరింతునని" అనుగ్రహించిన శ్రీవారి కరుణకు ఉబ్బిపోయి అత్యంత ఆనందభరితుడైన సాయందేవుడు వెంటనే ఇంటికి పరుగెత్తుకొని వెళ్లెను.

అనంతరము తన శిష్యులందరితో సహా ఉదరశూలవ్యాధి కలిగిన బ్రాహ్మణుని కూడా వెంట తీసికొని శ్రీస్వామివారే స్వయముగా సాయందేవుని ఇంటికి భిక్షకై వెళ్ళిరి. నామధారకా! అదృష్టవశాత్తుగా శ్రీగురుమూర్తి వెంట అప్పుడు నేను కూడా ఉండియుంటిని. అతని ఇంటిలో ఒక అద్భుతమైన విచిత్రము జరిగెను. దానిని నేను కనులారా దర్శించితిని. ఆ దంపతులకు గురుమూర్తి యెడల గల భక్తిప్రపత్తులను చూచి నేను పరవశించిపోయితిని. 'జాఖాఈ' అను పేరుగలిగిన ఆ సాయందేవుని భార్య ఉత్తమ ఇల్లాలు. మహాపతివ్రత. స్వామివారు వారి ఇంటిలో తన పాదములు మోపిన తక్షణమే ఆమె పరుగెత్తుకొని వచ్చి ముంగాళ్లతో వంగి నమస్కరించి, శ్రీవారిని తన ఇంటిలోనికి ఆదరపూర్వకముగా స్వాగతించెను. వారిని ఉచిత ఆసనముపై కూర్చుండజేసి అన్నివిధములుగా స్వామివారిని పూజించెను. పంచామృతములతో, శుద్ధమైన ఉదకముతో, రుద్రసూక్త మంత్రములను పఠించుచూ ఆ దంపతులు శ్రీస్వామివారి చరణారవిందములను అభిషేకించిరి. శ్రీగురుమూర్తికి షోడశోపచారవిధానముగా పూజించిరి. అదేవిధముగా శ్రీవారి శిష్యులందరిని వరుసగా కూర్చుండజేసి, వందనము చేసి, మమ్ములందరినీ కూడా పూజించిరి. శ్రీగురుని పూజను అత్యంత భక్తిప్రపత్తులతో, పవిత్రమైన ప్రేమభావము ఉప్పొంగిపోవుచుండగా ఆ సాధ్వీమతల్లి కదు వినయముతో ఉపచారములను సమర్పిస్తూ, పరవశత్వమును చెందుచూ మిక్కిలి ప్రేమతో పూజించెను.

తదుపరి అందరికి ఉచితమైన ఆసనములను కల్పించి, వారిముందు ఉదకముతో మండలములను చేసి, ఆ సాయందేవుని పత్నియైన జాఖాయి అష్టదళపద్మములతో అనేకవిధముల రంగవల్లులను పంచరంగుల చిత్రమాలికలుగా రచించినది. అదేవిధముగా శ్రీగురుమూర్తి

ముందర గంధపుష్పాక్షతలతో మండలమును అర్చించినది. విధిపూర్వకముగా భిక్షకొరకై సంకల్పమును చెప్పి, అష్టాంగనమస్కారమును చేసి, శ్రీస్వామివారి చరణసరోజములను పంచామృతములతో అభిషేకించిరి. పిమ్మట, రుద్రసూక్త పూర్వక పంచసూక్తములను పఠించుచూ శుద్ధ గంగాజలముతో సభక్తికముగా అభిషేకము చేసిరి. ఆ తర్వాత షోడశోపచారములతో శ్రీవారిని పూజించిరి. అటుపిమ్మట ఆ దంపతులు శిరము వంచి శ్రీవారి శ్రీపాదపద్మములకు మిగుల వినయముతో నమస్కరించిరి. తదుపరి శ్రీస్వామివారి చరణతీర్థమును ఆ దంపతులు, వారి కుటుంబసభ్యులందరును స్వీకరించిరి. (139-151)

అనంతరము శ్రీవారి చరణముల పూజలో భాగముగా అత్యంత ఆనందముతో, గీతవాయిద్యములను మోగించుచూ మంగళ నీరాజన సేవ చేసిరి. ఇదేవిధముగా స్వామివారి శిష్యులమైన మా అందరినీ షోడశోపచారములతో సభక్తికముగా పూజించిరి. శ్రీగురువుగారికి అక్షయవాయనములనిచ్చి, అష్టోత్తర శత జ్యోతులతో నివాళులను సమర్పించి, వైదికమంత్రఘోషతో, అత్యంత భక్తిభరితముగా మంత్రపుష్పాంజలిని సమర్పించిరి. అనేకవిధములుగా స్తోత్రములను గానము చేసిరి. తదుపరి దంపతులిరువురూ శ్రీ స్వామివారికి చక్కగా వందనములు సమర్పించిరి. వారి పూజావిధానములకు, వారి భక్తిప్రపత్తులకు శ్రీగురుమూర్తి మిగుల సంతసించి, ప్రసన్నవదనులై వారియెడల **కరుణాకటాక్షవీక్షణ పరంపరలను ప్రసారము చేయుచూ ఇట్లనెను** - “నాయనా! నీ వంశపరంపరలోగల సంతతి గురుభక్తి విషయములో మిగుల ప్రసిద్ధిని పొందగలరు”ని అత్యంత ప్రీతితో మహత్తరమైన వరమును ప్రసాదించిరి. నీవు గురువుయొక్క మనోగతమును గ్రహింపగలిగితివి. నీ వంశము పుత్ర పౌత్ర ప్రపౌత్రముగా అంచెలంచెలుగా, నిరాటంకముగా, నిరంతరవృద్ధి చెందును. మీ వంశములోని ఒక్కొక్క తరమునకు చెందిన ప్రతి కుటుంబము సుఖసౌఖ్యములతో తులతూగును. అందరిలోనూ ఈవిధమైన గురుభక్తి నిండి నిబిడీకృతమగును” అని ఆ బ్రాహ్మణదంపతులను అత్యంతదయాంతరంగులై శ్రీ స్వామివారు ఆశీర్వదించిరి.

అప్పుడు వారు గురుమూర్తికి తిరిగి నమస్కరించి విస్తళ్లను అమర్చిరి. నానావిధములైన పిండివంటలను, మినపగారెలను, క్షీరములతో చేసిన మధురాన్నమును, చక్కని పాయసమును, ఎనిమిది రకముల పరమాన్నమును, అనేకవిధములైన శాకములను, పచ్చళ్లను, చక్కగా, శాస్త్రీయముగా అణకువతో వడ్డించిరి. శ్రీగురుమూర్తి ప్రీతితో వాటిని ఆరగించుచుండెను. (152-161)

ఇక ఉదరశూలవ్యాధితో బాధపడుచున్న బ్రాహ్మణుడు అంతటి షడ్రసోపేతమైన మృష్టాన్నమును తన ముందు చూసి నోరూరగా, గురువాక్యమందు దృఢమైన విశ్వాసమును నిలిపి, కడుపు నిండుగా భోజనము చేసి, కమ్మని త్రేన్పులు తీసెను. శ్రీగురుమూర్తియొక్క

అపారమైన కృపామయదృష్టితో ఆనాటి ఆహారమే ఒక దివ్యౌషధముగా మారి, ఆతని వ్యాధి నశించిపోయెను. లోహమునకు పరుసవేది తగిలిన వెంటనే అది బంగారముగా మారును కదా! అట్లే, శ్రీగురుమూర్తియొక్క దర్శనమైన పిమ్మట ఆధివ్యాధులు ఎట్లు నిలిచియుండగలవు. ఆశ్రితజనరక్షకులైన గురుమూర్తి శరణాగతులను కరుణామయదృష్టితో రక్షించును. సూర్యుడు ఉదయించగనే అంధకారము నశించినట్లుగా ఎవరికి శ్రీగురుమూర్తి యొక్క కృప లభించునో, వారి గృహమునందు దైన్యము ఎట్లు నిలువగలుగును. అట్లే, శ్రీగురునాథుడు శిష్యులందరితో కలిసి భోజనము చేసి, సాయందేవుడనే బ్రాహ్మణ దంపతులను, వారి పరివారమును తరింపచేసెను.ఆనాడు ఆ గృహమునందు ఆనందమే శివమయంగా మారి, తాండవము చేసెను అని చెప్పుట గొప్ప కాదు. చూచినవారందరు విస్మితులైరి. ఆశ్చర్యమునకు లోనైరి. అచట ఘటించిన అద్భుతమును నివ్వెరపోయి చూచుచుండిరి. జనులందరునూ అత్యాశ్చర్యమునకు లోనై, బ్రాహ్మణునకు విషముగా మారి శత్రువుగా బాధించుచున్న ఆ అన్నమే గురుమూర్తియొక్క కృపవలన దివ్యౌషధముగా మారి అతని వ్యాధిని నశింపచేసెను కదా! అని అత్యద్భుతముగా చెప్పుకొనుచుండిరి. **సిద్ధుడు నామధారకునితో పలికెను –** "ఎవరియందు శ్రీగురుని కృప కలుగునో, వారియొక్క జన్మజన్మాంతర పాపరాశి సమస్తము నశించిపోవును. వారి దేహమునందు వ్యాధులనేవి ఎంతమాత్రము ఉండక, ఆరోగ్యవంతమైన శరీరము సిద్ధించును" **గంగాధర నందనుడైన సరస్వతి విస్తరించి చెప్పుచున్న కామధేనువువంటి గురుచరిత్రమును శ్రోతలందరు ఏకాగ్రచిత్తముతో వినగలరు. ఎవరు దీనిని అత్యంతభక్తిభావముతో వినెదరో, పఠించెదరో, వారి ఇంటిలో, వారి ఒంటిలో ఎట్టి వ్యాధులు ఉండనేరవు. వారందరూ సర్వసౌఖ్యములను అనుభవించెదరు. ఇది సత్యము. సత్యము. ముమ్మాటికీ పరమసత్యము.**(162–169)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు
శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు
"కరంజనగరాభిగమనము మరియు విప్రోదరవ్యథా నిరసనము" అను పదమూడవ అధ్యాయము ॥ 13 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 169; మొత్తము సంఖ్య : 1514 + 169 = 1683 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

పదునాలుగవ అధ్యాయము

క్రూర యవన శాసనము - సాయందేవుడు ప్రాణభిక్షను పెట్టుమని శ్రీగురునాథుని ప్రార్థించుట - గురుదేవుల అభయదానము - శ్రీగురుమూర్తి నరసింహసరస్వతీ స్వామివారు దక్షిణదేశపర్యటన నిమిత్తముగా బయలుదేరి వైద్యనాథక్షేత్రమునకు చేరుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యుడైన నామధారకుడు సిద్ధమునీశ్వరుని చరణములకు నమస్కరించి అత్యంత భక్తితో వినమ్రుడై ఇట్లు ప్రశ్నించెను– "యోగీశ్వరా! మీకు జయము, జయము. సిద్ధమూర్తీ! జ్ఞానసాగరా! అనంతరకథను వినవలయునని కుతూహలపడుచుంటిని. శ్రీగురుమూర్తి నరసింహ సరస్వతీ స్వామివారు ఒక బ్రాహ్మణునిపై ప్రసన్నులై ఆతని ఉదరశూల వ్యాధిని నిర్మూలించిన దివ్యచరిత్రను తమ వలన విని కృతార్థుడనైతిని. ఆ తదుపరి జరిగిన కథావృత్తాంతమును దయతో నాకు ఉపదేశించి నన్ను కృతకృత్యుని చేయవలసినదని" ప్రార్థించెను. **ఎంతో అణకువతో ప్రశ్నించిన శిష్యుని మాటలు విని సంతసించిన సిద్ధమునీంద్రుడు నామధారకునితో ఇట్లనెను –** "శిష్యశిఖామణీ! నామధారకా! శ్రీగురుచరిత్రము భక్తుల పాలిట కామధేనువు అనియే నీవు గ్రహించుము. అట్టి దివ్యమైన శ్రీగురుచరిత్రమును చెప్పుచున్నాడను వినుము. శ్రీగురుమూర్తి సాయందేవుని గృహమునందు భిక్ష చేసిన పిమ్మట మిగుల సంతసించి ఆ దంపతులపట్ల ఎంతయో ప్రసన్నులైరి. వారి భక్తికి మిక్కిలి సంతసించిరి. ఆ బ్రాహ్మణుడు గురుభక్తి విధానమును పరిపూర్ణముగా తెలిసినవాడు. అతడు భక్తిభావముతో పరవశుడై ఎంతో చక్కగా గురుమూర్తిని పూజించెను.

అంతట శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణుని చూచి ఇట్లనెను – "నాయనా! నీ యెడల నాకు మిగుల ప్రీతి కలిగెను. మీ వంశపరంపరగా అందరికందరూ నా అనుగ్రహమునకు పాత్రులయ్యెదరు. అన్ని తరములకు చెందినవారు అందరునూ నా భక్తులయ్యెదరు అనగా, సాయందేవ

బ్రాహ్మణుడు స్వామివారికి నమస్కరించి శ్రీవారి శ్రీచరణములను తన శిరస్సున నిలిపి మరల, మరల నమస్కరించుచూ మిక్కిలి వినయముతో **శ్రీగురుమూర్తిని ఇట్లు ప్రస్తుతింపసాగెను.** (1-8)

"జగద్గురూ! మీకు జయము, జయము. మీరు త్రిమూర్త్యాత్మక స్వరూపులే. అజ్ఞానులమైన మావంటివారికి మీరు మానవమాత్రులుగా కనిపించెదరు. కాని, మీ మహిమ వేదములకు కూడా అగోచరమైనది. మీరు విశ్వవ్యాపకులు. సర్వవ్యాపకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే గురుమూర్తి స్వరూపమును ధరించి భక్తులను తరింపజేయుటకుగాను మానవవేషమున అవతరించి, ఈ ధరిత్రిపై తిరుగుచున్నారు. అట్టి మీ మహిమను వర్ణింపగల శక్తి అల్పజ్ఞులమైన మా కెక్కడిది? ప్రభూ! మేము, మా వంశములోని వారందరము పుత్రపౌత్ర పరంపరగా తమకు పరమభక్తులై యుండెదమనీ, అంతేగాక, ఇహలోకమున సకలసౌఖ్యములునూ, పరలోకమున సద్గతులునూ లభింపగలవని నిర్హేతుకమైన కృపతో మమ్ములను ఆశీర్వదించితిరి. బాగు. బాగు. దేవా! నాదొక విన్నపమును వినగలరని ప్రార్థించెదను. స్వామీ! గురుదేవా! మా గ్రామమునందు మహా శూరుడు, బహు క్రూరుడు అయిన ఒక యవనుని వద్ద నేను సేవ చేయుచున్నాను. అతడు ఏడాదికొకమారు కొందరు బ్రాహ్మణులను సంహరించును. ఈనాడు అదే పనిమీద తన వద్దకు నన్ను రమ్మనమని కబురు పంపెను. నేనతనివద్దకు వెళ్లవలసియున్నది. నిశ్చయముగా అతడు నా ప్రాణములను తీయును. కాని, నేడు తమయొక్క దివ్య శ్రీచరణ కమలములను దర్శించితిని. అమోఘమైన మీ ఆశీర్వచనమును పొందితిని. ఇక నాకు మరణము ఎట్లు సిద్ధింపగలదు? ఇట్టి ప్రాణాపాయ సంకటస్థితినుండి తమరే నన్ను రక్షింపవలసినది. మహాత్మా! ఇక మీరే మాకు దిక్కు" అని అంటూ శ్రీస్వామివారి పాదపద్మములను పట్టుకొని, "మీ శరణుజొచ్చితిని. నన్ను రక్షింపుడు" అని ఆ బ్రాహ్మణుడు మిగుల భయభీతుడై దుఃఖించుచు శ్రీవారి శ్రీచరణములకు నమస్కరింపసాగెను. ఆవిధముగా దీనుడై తనను శరణుజొచ్చిన ఆ బ్రాహ్మణుని శ్రీగురుమూర్తి దయతో లేవనెత్తెను. **అమృతమయమైన తమ దివ్యహస్తమును సాయందేవుడను ఆ బ్రాహ్మణుని మస్తకమున ఉంచి అభయమును ప్రసాదించి ఇట్లు చెప్పెను-**

"నాయనా! భయపడకుము. ఎట్టి విచారమును లేక, ధైర్యముతో మిగుల సంతోషముతో, నీవు ఆ క్రూర యవనుని గృహమునకు వెళ్లుము. ఎంతటి క్రూరుడైనను ఆ యవనుడు ఇప్పుడు నిన్నేమియు చేయజాలడు. పైగా నిన్ను ప్రేమతో గౌరవించి తిరిగి నా వద్దకు పంపించును. నీవు తిరిగివచ్చు వరకు మేము ఇచటనే ఉండెదము. నీవు వెళ్లి, తిరిగి వచ్చి అచట జరిగిన విషయమును నాతో చెప్పవలసినది.

నీకు ఎట్టి ఆపదయు ఘటింపదు. నీవు మా నిజభక్తుడవు. మీరు వంశపరంపరగా నా భక్తులై ఉందురు. మీకు సకల అభీష్టములు సిద్ధింపగలవు. మీ వంశములోని వారందరూ పుత్ర, పౌత్ర, ప్రపౌత్ర సమేతముగా వృద్ధిని పొందెదరు. అందరి గృహములలో లక్ష్మీదేవి అఖండముగా నిలయమై ఉండును. అందరికందరు ఆరోగ్యవంతులై, దీర్ఘాయుష్మంతులుగా ఉండెదరు" అని దివ్యమైన వరములను ప్రసాదించెను. అప్పుడు సాయందేవుడు శ్రీ గురుమూర్తి చరణములకు సాష్టాంగవందనము చేసి, స్వామి అనుమతిని పొంది యవనుని గృహమునకు నిర్భయముగ బయలుదేరి వేగముగా వెళ్లిపోయెను. (9-21)

దుష్టాత్ముడైన ఆ యవనుడు కాలాంతకుడగు యమునివలె కన్పట్టుచుండెను. బ్రాహ్మణులను చూచి, చూచుటతోడనే ఆ యవనుడు మిగుల కోపముతో మండిపడుచుండెడివాడు. కానీ, ఈనాడు సాయందేవుడను ఈ బ్రాహ్మణుని చూచినవెంటనే తన ముఖమును ప్రక్కకు త్రిప్పుకొని ఆ యవనుడు అతి శీఘ్రముగా ఇంటిలోనికి వెళ్లిపోయెను. అది గమనించిన సాయందేవుడు మిక్కిలి భయభ్రాంతుడై శ్రీగురుమూర్తిని ధ్యానింపసాగెను. శ్రీగురుకృపకు పాత్రుడైన వ్యక్తిని ఆ యవనుడు ఏమి చేయగలడు. ఏలనన, చెదపురుగునకు ఎంతటి కోపము కలిగినప్పటికినీ, అది మండుచున్న అగ్నిని ఎట్లు తాకగలదు. గరుడుని పిల్లలను సర్పము ఏవిధముగా మ్రింగగలదు. ఏనుగు ఎంత పెద్ద జంతువైనప్పటికిని ఒక సింహమును మ్రింగగలదా? అటులనే **గురుకృపను పరిపూర్ణముగా పొందిన వ్యక్తిని ఎంతటి క్రూరుడైనను, దుష్టుడైనను అతడేమియూ చేయజాలదు. ఎవరి యెడల గురుకృప పరిపూర్ణముగా ఉండునో, వారికి కలికాలమును గురించిన భయము ఎంతమాత్రమూ అక్కరయే లేదు. ఎవరి హృదయమునందు నిరంతరము గురుస్మరణ జరుగుచుండునో, వారికి దారుణమైన భయము ఎట్లు కలుగును? మహామృత్యువు కూడా వారిని బాధింపలేనప్పుడు ఇక, అపమృత్యువు ఏమి చేయగలుగును?** ఎవరికైతే మృత్యువును గురించిన భయమే ఉండదో, వారికి యవనుడు అనగా ఎంతపాటి. శ్రీగురుకృపాపాత్రులైన వారికి యముని గురించిన భయము ఉండనే ఉండదు. ఆవిధముగా గృహములోనికి ప్రవేశించిన బ్రాహ్మణుని చూచిన వెంటనే ఆ యవనుడు అంతఃపురములోనికి పరుగెత్తుకొని వెళ్లి ఒకవిధమైన భ్రాంతిలో పడిపోయి, ఒక భ్రమను చెంది, శరీరధ్యాస లేకుండా స్పృహతప్పి పడిపోయెను. అతని గుండె దడదడలాడిపోవుచుండెను. ఒక విప్రుడు తనను అస్త్రశస్త్రములతో గాయములను చేసి, అవయవములను ఛేదించుచున్నట్లుగా అతనికి తోచుచుండెను. విపరీతమైన భీతికిలోనై శరీరము వణకుచు, అంగములు స్వాధీనము తప్పిపోవుచున్నట్లుండగా ఆ యవనునికి అకస్మాత్తుగా స్మృతి కలిగెను. మూర్ఛనుండి తేరుకొనిన ఆ యవనుడు గృహములోపలినుండి

పరుగెత్తుకొని వచ్చి బ్రాహ్మణుని సమీపించి, అతని పాదములపై పడి దొర్లుతూ, "నన్ను క్షమించుము. ఓ మహాత్మా! నన్ను చంపవద్దు. రక్షింపుము. నీవే నా స్వామివి. నీ సేవ చేసెదను. మిమ్ములను ఇచటికి రమ్మని ఎవరు కబురు పెట్టిరి? మీరు ఇచట ఉండవలదు. నేను మీ సేవకుడను" అని భయముతో ప్రార్థించెను. వెంటనే ఆ బ్రాహ్మణుని అత్యంత గౌరవప్రదముగా ఒక ఉన్నతాసనమునందు కూర్చుండజేసి అమూల్యమైన అనేక వస్త్రాభరణములను బహూకరించి వెంటనే మీరు మీ ఇంటికి వెళ్లిపొండు" అని ప్రార్థించి పంపెను. అప్పుడా సాయందేవుడు మిగుల సంతసించి గురుమూర్తి కృపాకటాక్షమును, గురుమహిమను మనసులో మననము చేయుచూ త్వరత్వరగా గంగాతీరమునగల శ్రీగురుమూర్తిని సమీపించి, వారి పాదపద్మములకు శిరసాష్టాంగ వందనమును ఆచరించెను. స్వామివారిని అనేకవిధములుగా స్తోత్రము చేసిన పిమ్మట, తాను వెళ్ళిన చోట జరిగిన వృత్తాంతమునంతయూ విన్నవించెను. ఆ బ్రాహ్మణునియొక్క భక్తిభావము ముప్పిరిగొని ఉప్పొంగుచుండగా కనులవెంబడి బాష్పధారలు కారుచుండగా, తన కన్నీటితో గురుమూర్తి పాదపద్మములను అభిషేకించుచూ, గద్గదకంఠుడై తదేకముగా శ్రీగురుమూర్తియొక్క దివ్యముఖారవిందమును దర్శించుచూ, చేతులు జోడించి వినయముగా నిలబడియుండెను. శ్రీస్వామివారు మిగుల సంతసించి, ఆ బ్రాహ్మణుని ప్రేమతో ఓదార్చి, "నాయనా! నేను దక్షిణదేశ పర్యటనకు వెళ్ళి వచ్చెదను" అని చెప్పగా, ఆ బ్రాహ్మణుడు యవనుడు ఇచ్చిన వస్త్రాభరణములను, ద్రవ్యమును స్వామివారి వెంట ఉన్న బ్రాహ్మణులందరకు కానుకలుగా సమర్పించి వారిని సంతోషపెట్టెను. **అనంతరము చేతులు జోడించి పలికెను–** "మహానుభావా! కృపాసింధూ! మిమ్ములను వదలి ఒక్క క్షణమైనను నేనుండజాలను. నేను కూడా మీ వెంట వచ్చెదను. దయతో నాకు అనుమతిని ప్రసాదించుడు. ఈ సంసారసాగరమునుండి తరింపజేసే కృపాసింధుమూర్తియైన మిమ్ములను విడచి నేను జీవింపజాలను. సగరుని ఉద్ధరించుటకై భగీరథుడు గంగమ్మను దివినుండి భువికి తెచ్చినవిధముగా ఓ మహాత్మా! నేడు మీరు మా ఇంటికి విచ్చేసి మీ దివ్యదర్శనమును ప్రసాదించి, మమ్ములను అనుగ్రహించిన తీరును ఏమని కొనియాడుదును. నా నోట మాటలు రావటము లేదు. భక్తవత్సలురైన మీరు మమ్ములను వదలిపెట్టి వెళ్లుట ధర్మమా? మీతోపాటుగా నిశ్చయముగా నేను వచ్చెదను" అని తిరిగి శ్రీవారి శ్రీచరణములను పట్టుకొని విలపించుచూ ప్రార్థింపసాగెను. (22-40)

ఈవిధముగా గురుమూర్తి ఎదుట అత్యంత దీనవదనముతో భోరున విలపించుచూ, ప్రార్థించుచున్న ఆ బ్రాహ్మణుని చూచి, ఓదార్చి, ఆశ్వాసింపచేసి **మిక్కిలి కృపతో శ్రీగురుడు ఇట్లనెను–** "వత్సా! దక్షిణదేశ తీర్థయాత్రకు మేమొక పనిమీద వెళ్లుచుంటిమి. మా వెంబడి నీవు

వచ్చుటకు వీలు పడదు. తిరిగి పదిహేను సంవత్సరముల అనంతరము మేము నీకు దర్శనము నిచ్చెదము. అంతేకాదు, మీ గ్రామసమీపమునందు నివసించెదము. అప్పుడు నీవు నీ భార్యాపుత్రులతో, సోదరులతో, బంధువులతో, ఆప్తులతో, గ్రామస్తులతో వచ్చి నన్ను సేవించెదవు. కావున, నీవు చింతించవలదు. ఎంతమాత్రము విచారపడవద్దు. ఇకమీదట నీకు సర్వారిష్టములు తొలగిపోవును. సమస్త దుఃఖములు సమసిపోవును. హాయిగా సుఖసంతోషములతో ఉండగలుగుదురు" అని తన దివ్యమైన హస్తమును ఆతని మస్తకముపై పెట్టి అభయప్రదానము చేసెను. ఈ ప్రకారముగా ప్రసన్నవదనులైన శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణుని యెడల వరదమూర్తియై అచటినుండి బయలుదేరి ఆరోగ్యభవాని కొలువై యున్న వైద్యనాథము అను సుప్రసిద్ధ దేవీక్షేత్రమునకు బయలుదేరిరి. శిష్యులందరితో కలిసి శ్రీగురుమూర్తి లోకప్రఖ్యాతినొందిన వైద్యనాథ తీర్థమును దర్శించుటకై విచ్చేసి, అచట కొంతకాలము గుప్తరూపమున నివసించిరి. ఆ ప్రసిద్ధ క్షేత్రమున 'అంబాభవానీ' అను పేరుతో శ్రీదేవి నిత్యసాన్నిధ్యమును కలిగియుండును" అని సిద్ధముని చెప్పిన మీదట అత్యంత శ్రద్ధగా వినుచున్న నామధారకుడు తిరిగి సిద్ధమునిని చూచి ఇట్లు ప్రశ్నించెను.

"గురుదేవా! శ్రీగురుమూర్తి అచట గుప్తముగా ఉండుటకు గల కారణమేమిటి? ఆయనను ఎందరో శిష్యులు వెంబడించి వుండిరి కదా? మరి వారిని ఎక్కడ ఉంచిరి?" అని అడిగెను.

ప్రస్తుతము సిద్ధముని నామధారకునికి విస్తరించి చెప్పిన కామధేనువు వంటి శ్రీగురుచరిత్రమును గంగాధరనందనుడైన సరస్వతి చక్కగా వ్యక్తీకరించుచుండెను. దీని తదుపరి రాబోవు కథ అతి విచిత్రముగా ఉండును. దానిని విపులముగా వినిపించెదను. ఏకాగ్రచిత్తముతో వినవలయును అని గంగాధర సరస్వతి గురుచరిత్రను లోకమునకు ప్రకాశింప చేసెను. (41-49)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "క్రూరయవన శాసనము మరియు సాయందేవ వరప్రదానము" అను పదునాలుగవ అధ్యాయము ॥ 14 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 49; మొత్తము సంఖ్య : 1683 + 49 = 1732 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

పదిహేనవ అధ్యాయము

శ్రీగురునాథులు శిష్యులందరిని తీర్థయాత్రకు వెళ్ళుమని ఆదేశించుట - సమస్త తీర్థవిశేషములను గూర్చి వారికి వివరించుట - అనంతరము శ్రీనృసింహ సరస్వతీ స్వామివారు వైద్యనాథ క్షేత్రమునందు గుప్తముగ నుండుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధమునీశ్వరుడు శిష్యుడైన నామధారకునితో ఇట్లు పలికెను - “శిష్యా! నామధారకా! నీ జన్మ ధన్యము. నీ వాక్కు మరింత ధన్యమైనది. శ్రీ గురుపాదాబ్జములయందు నీ మనస్సు లయమయ్యెను. నీవు ప్రశ్నించుచుండగా నా మనస్సునకు ఎంతయో సంతోషమగుచుండెను. నీవు ప్రశ్నించు విధము మిగుల ప్రశంసనీయమైనది. అయితే, శ్రీగురుమూర్తి వైద్యనాథ క్షేత్రమున గుప్తముగా ఉండుటకు కారణమేమిటి? అని నీవు అడిగియుంటివి. అందుకు సమాధానమును చెప్పెదను. సావధానచిత్తుడవై వినుము. తమ యొక్క మహిమ లోకమునకు విరివిగా ప్రకటమైన యెడల శ్రీవారిని సేవించుటకై, తమయొక్క మనోరథములను ఈడేర్చుకొనుటకై శ్రీగురుదర్శనమును చేసికొనవలయుననే ఉబలాటముతో అసంఖ్యాకముగా జనులు విచ్చేయుదురు. అందులో సజ్జనులు ఉండెదరు. దుర్జనులు ఉండెదరు. ఇంక ధూర్తులు కూడా ఉండెదరు. వారందరూ శ్రీగురునాథుని సేవించుటకై వచ్చి మమ్ములను తమ శిష్యులుగా, భక్తులుగా స్వీకరింపుడని ప్రార్థించెదరు. అయితే, ప్రస్తుత కలియుగమునందు అందరూ అత్యంత ప్రసిద్ధినొందిన గురువులను ఎంచుకొని, వారికి శిష్యులము కావలయునని కోరుకొందురు. అనంతరము “అముక (ఫలానా) గురువుగారి, అముక (ఫలానా) మహాత్ములయొక్క శిష్యుడను నేను” అని లోకమున తమ గొప్పలు చెప్పుకొందురు.(1-4)

ఏలనన, పూర్వము శ్రీ పరశురాములవారు అవతరించి, ఈ భూమండలమునందు దుష్టక్షత్రియులను సంహారమొనరించెను. తదుపరి ఈ భూమినంతయూ బ్రాహ్మణులకు దానముగా ఇచ్చెను. అనంతరము తాను పశ్చిమసముద్రమునకు వెళ్ళి అచట గుప్తముగా తపస్సు చేసికొనుచుండెను. అయితే, ఆశలు ఉడుగని బ్రాహ్మణులు తిరిగి వారివద్దకు వెళ్ళి, వారు ప్రస్తుతము ఏ ప్రదేశమున కలరో, దానినికూడా

తమకు దానముగా ఇవ్వవలయునని కోరుటకు వెళ్ళిరి. అందుకు విసిగిపోయిన పరశురాములవారు బాహ్యముగా అందరికి ప్రకటమై ఉండుటవలన నన్ను వేధించి మరింకేమి అడుగుదురో, మానవుల ఆశకు, దురాశకు అంతు ఉండదు అని భావించి ఆ సముద్రము మధ్యలో లోపలికి వెళ్ళి, గుప్తముగా ఉండిపోయిరి. అదేవిధముగా శ్రీగురునాథులవారు నానాజాతి సంజాతులైన ప్రజలందరూ పరుగెత్తుకొని వచ్చి, వారివారికి అవసరమైన వరములను అడిగి విసిగించెదరను కారణమువలన, వారు వైద్యనాథమునందు కొంతకాలము గుప్తముగా ఉండిపోయిరి. గురునాథులు విశ్వవ్యాపకులైన జగదీశ్వరులు. ఆయన వరములను ఈయకపోవుటేమిటి? అని శంకించవలదు. వ్యక్తిలోగల విశ్వాసమును గమనించి, ఆతని మానసిక భక్తిని పరిశీలించి, అతని పాత్రత, యోగ్యతలను అనుసరించి, వారియెడల ప్రసన్నులగుటకు వ్యక్తిగత అంశములను పరిశీలించుట ఎంతో అవసరము. అందువలన శిష్యులందరిని తీర్థయాత్రా నెపమున దూరదేశములకు పంపించి, వారు ఆ క్షేత్రమునందే అత్యంత గోప్యముగా ఉండిపోయిరి. (5-10)

ఒకనాడు తమ శిష్యులందరిని పిలిపించి, **వారందరినీ ఉద్దేశించి, శ్రీనరసింహసరస్వతి గురుదేవులు ఇట్లనిరి** - "మీరందరును దేశమునందలి ప్రముఖ తీర్థములన్నింటిని పర్యటించుడు. చివరగా మీరు శ్రీశైలమునకు చేరుకొనిన పిమ్మట, అచట మా దర్శనమును పొందగలరని" వారికి సెలవిచ్చిరి. శ్రీగురుమూర్తి యొక్క ఈ మాటలను వినిన శిష్యులందరూ ఒకవిధమైన భీతికి లోనై, శ్రీవారి చరణసరోజముల యందు వందనమును ఆచరించిరి. **పిమ్మట వారు ఇట్లనిరి** - "శ్రీగురురాజా! కృపామూర్తీ! మేము మీ శరణుజొచ్చినవారము. మీరు తప్ప మాకు వేరెవ్వరూ దిక్కు లేరు. మమ్ములను ఎందుకు ఇట్లు ఉపేక్షించుచుంటిరి. మీ దర్శనమాత్రముచేతనే మేము సర్వతీర్థములను దర్శించినట్లుగా భావించుచుంటిమి. మీ దివ్యచరణములయందే సమస్తతీర్థములు ఉన్నవి కదా! అట్టి శ్రీగురుచరణాబ్జములను వదలివేసి మేము మరెక్కడికి వెళ్లెదము? ఎందుకు వెళ్ళెదము. స్వామీ! సమస్త తీర్థములు శ్రీగురునాథుని చరణారవిందములయందే యుండునని వేదశాస్త్రములు ఘోషించుచున్నవి. సమీపములో గుప్తనిధిని ఉంచుకొని అడవులను, అరణ్యములను తిరుగుటెందుకు? దేవరాజా! మీ వియోగమును మేము సహింపజాలము. కల్పభూజము అత్యంత సమీపమున సిద్ధించుచుండగా దానిని వదలిపెట్టి కీకారణ్యములకు ఎవరు వెళ్ళెదరు? ఎందుకు వెళ్ళెదరు? కనుక, దేవా! మేము మిమ్ములను విడిచి జీవింపజాలము. మమ్ములను ఉపేక్షింపవలదు. మమ్మనుగ్రహింపుము" అని శిష్యులందరు ముక్తకంఠముగ ప్రార్థించిరి. **అప్పుడు శ్రీగురుమూర్తి యగు నరసింహసరస్వతి గారు శిష్యులతో ఇట్లనిరి** - "సన్న్యాసదీక్షను స్వీకరించిన పిదప కొంతకాలము తీర్థాటనము చేసినగాని చిత్తము ఏకాగ్రత చెందదు. ఒక సన్న్యాసి ఒకేచోట మూడు నుండి ఐదు

రాత్రులకు మించి నివసింపగూడదని శాస్త్రము శాసించెను. తురీయాశ్రమము స్వీకరించినవారు తప్పనిసరిగా భూమండలమునందలి సమస్త తీర్థక్షేత్రములను దర్శించవలెను. దానివలన నేత్రశుద్ధి, దేహశుద్ధి కలుగును. మనస్సు స్థిరమగును. అప్పుడు వారు, ఏదో ఒక స్థానమునందు నివసింపవచ్చును. మీకొక ముఖ్యమైన మాటను చెప్పెదను. ఈ ధర్మమును మీరు తప్పక అంగీకరింతురుగాక! మీరందరూ ఇచటినుండి బయలుదేరి సర్వతీర్థములను పర్యటించి, తిరిగి నా దర్శనమునకు రావచ్చును. నేను బహుధాన్య నామ సంవత్సరమునందు శ్రీశైలమునకు చేరెదను. అప్పుడు మీరందరు అచట నా దర్శనమును చేయవచ్చును" అని శిష్యులకు ఉపదేశించిరి. "శిష్యా! నామధారకా! వెంటనే శిష్యులందరు శ్రీస్వాములవారి దివ్యచరణములను పట్టుకొనిరి". ఆ శిష్యులందరునూ శ్రీగురుమూర్తితో ఇట్లు విన్నవించుకొనిరి. "గురుదేవా! తమ ఆజ్ఞయే మాకు శిరోధార్యము. మీ మాటలు మాకు పరుసవేది వంటివి. మీ ఆజ్ఞకు బద్ధులమై ఇప్పుడే భూమండలమున గల తీర్థములను పర్యటించి వచ్చెదము. గురువాక్యమును పాలించనివాడు ఘోరమైన రౌరవాది నరకములో పడిపోవును. వారి నివాసములు యమపురితో సమానము. కావున, గురునాథా! మేము బయలుదేరి ఏయే తీర్థములను సేవించవలయునో, దయతో తాము సెలవీయగలరు. మా హితమును గోరి మీరు ఆదేశించిన ఉపదేశవాక్యములను మా చిత్తములో స్థిరముగా నిలుపుకొని మాటిమాటికి స్మరించుకొనుచు మేము పర్యటించెదము. అయితే, ఏయే తీర్థములను దర్శింపవలయునో, ఏయే క్షేత్రములను చూడవలయునో మీరు అనుమతించిన తీరుగనే మేము వెళ్ళెదము. మహానుభావా! మీ వాక్కులే మాకు బ్రహ్మవాక్కులు. అందుకు మేము త్రికరణములతో బద్ధులమై ఉండువారము" అని శ్రీగురుదేవులను శిష్యులందరు ప్రార్థించిరి. అంతఃకరణశుద్ధితో తమ శిష్యులు చెప్పిన మాటలను వినిన శ్రీగురుదేవులు ప్రసన్నవదనముతో వారందరికి తీర్థయాత్రకోసము అనుమతిని ప్రసాదించిరి. అభయప్రదానము చేసిరి. మీరు నిశ్చింతగా పర్యటింపవచ్చును. మీ పర్యటనలో ఎట్టి విఘ్నములు, ఆటంకములు ఏర్పడవు అని వారికి చక్కని విశ్వాసమును కల్పించిరి. అనంతరము లోకమునందలి వివిధ తీర్థములను గూర్చి ఈ విధముగా వివరించి చెప్పిరి. (11-25)

ఈ బ్రహ్మాండమునందలి సమస్త క్షేత్రములలోకెల్లా కాశీక్షేత్రము ప్రధానమైనది. మీరందరు ఇచటినుండి నేరుగా అవిముక్తక్షేత్రమగు కాశీక్షేత్రమునకు చేరుకొని గంగా భాగీరథిని సేవించుడు. పవిత్రమైన గంగానదీ తటాకయాత్ర[1] అనగా గంగా ప్రదక్షిణము అరవై (60)

---

[1] తటాక యాత్ర అనగా - నది పుట్టిన ప్రదేశము నుండి మొదలుకొని సముద్రములో కలిసేచోటు వరకు వెళ్ళి తిరిగి ఉద్గమస్థానము వరకు ప్రదక్షిణముగా చేయు యాత్రనే తటాకయాత్ర అని చెప్పబడినది.

యోజనముల దూరముతో కూడియుండును. ఈ గంగాప్రదక్షిణము చేయుటవలన అరవై (60) కృచ్ఛ్రవ్రతములు చేసిన ఫలము లభించును.(1) ఇక తదుపరి ప్రయాగయాత్ర ప్రధానమైనది. అచట గంగ, యమున, సరస్వతి త్రివేణీ సంగమముండును. ఈ త్రివేణీ సంగమ స్నానము బహుపుణ్యప్రదము. అచట గంగ ద్విగుణీకృతప్రవాహమును అందుకొనును. ఇక, యమునానది ప్రదక్షిణము ఇరవై క్రోసుల దూరమును కలిగియుండును. దీనియొక్క ప్రదక్షిణము వలన ఇరవై కృచ్ఛ్రవ్రతముల ఫలము లభించి తీరును. అంతర్వాహినియైన సరస్వతి అంటే గంగయే అని గ్రహించుము. ఈ నేలమీద అది ఎంతో పవిత్రమైనది. ఇది ఇరవై నాలుగు క్రోసుల దూరముతో కూడియుండును. దీనివలన ఇరవై నాలుగు కృచ్ఛ్రవ్రతముల ఫలము లభించును. అంతేగాదు, ఈ త్రివేణీ సంగమస్నానము వలన యజ్ఞము చేసినంతటి ఫలము లభించును. శాశ్వతముగా మానవులు బ్రహ్మలోకమునందు నివసింతురు. పితృలోకమునందు గల తమ పితృదేవతలు ఆనందముతో యుండెదరు. ఇది గంగ, యమున, సరస్వతి అనే త్రివిధ నదుల తటాకయాత్ర అనగా ప్రదక్షిణము చేసిన దానియొక్క ఫలముగా భావించవలెను. (26-30)

వరుణానది, కుశావర్తి, శతద్రు, విపాశకా, వితస్తా, శరావతి అను ఈ నదులు అత్యంత మనోహరములుగా ఉండి మిక్కిలి ప్రసిద్ధినొందినవి. తదుపరి గొప్పనైన మరుద్వృధానది, అసిక్నీ, మధుమతి, పయస్వి, ఘృతవతి తదుపరి, దేవనది ఇవన్నియు అత్యంత ప్రసిద్ధములు, పుణ్యప్రదములైన నదులు. ఈ నదులయొక్క తటాకయాత్రను మీరు చేయవలెను. వీటిలో దేవనది తటాకయాత్రను తప్పనిసరిగా చేయవలెను. ఇది పదిహేను క్రోసుల దూరముతో చుట్టబడిన ప్రదక్షిణమును కలిగినటువంటిది. దూరము ఎంతగా ఉండునో, అంతే కృచ్ఛ్రఫలము లభించును. వీటిలో స్నానమాత్రము చేతనే పవిత్రులయ్యెదరు. బ్రహ్మహత్యాది పాతకములు నశించిపోవును. నిశ్చలమైన మనోభావముతో ఈ నదులలో స్నానము చేయవలెను. ప్రదక్షిణ యాత్రను పూర్తి చేయవలెను. అది మనస్ఫూర్తిగా చేసినప్పుడు మాత్రమే తత్ఫలితములు పూర్తిగా పొందగలుగుదురు.

---

1. కృచ్ఛ్రము అనగా సాంతపనాది వ్రతమని తాత్పర్యము. కృన్తతి పాపమితి కృచ్ఛ్రం - కృతీ ఛేదనే = పాపమును పోగొట్టునది అని అర్థము; సంతపనే భవం సాంతపనం= సంతాపము వలన ఐనది గనుక సాంతపనము అనబడును. చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తముగా చేసే వ్రతము. కృచ్ఛ్రము పన్నెండు (12) దినములు ఆచరింపబడే ప్రాయశ్చిత్తముగా చెప్పబడినది. మొదటి మూడు దినములు పగలు మాత్రమే భోజనం చేయాలి. మరి మూడు దినములు రాత్రులయందే భుజించాలి. తర్వాత మూడు దినములు అడుగకుండా లభించిన పదార్థమునే భుజించాలి. చివరి మూడు దినములు పూర్తిగా భోజనము వదలిపెట్టి ఉండాలి. దీనినే కృచ్ఛ్రవ్రతం, సాంతపనవ్రతం అంటారు.

ఇక చంద్రభాగ, రేవతి, సరయూ, గోమతి, వేదికా, కౌశికీ, నిత్యజలా, మందాకిని ఇవి నిత్యము ప్రవాహజలముతో నిండియుండును. తదుపరి సహస్రవక్త్రా నది, పూర్ణానది, పుణ్యనది, బాహుదా నది, అరుణా నది. వీటి తటాకయాత్ర పదహారు (16) క్రోసుల దూరమును కలిగియుండును. ఎచ్చటెచ్చట ఈ నదులకు సంగమస్థలములుగలవో, అవన్నియు అత్యంత పవిత్రములు, పుణ్యప్రదములుగా భావించి, మనస్ఫూర్తిగా భక్తిభావముతో ఆయా ప్రదేశములయందు స్నానములు చేయవలెను. తద్వారా అపరిమితమైన పుణ్యము లభించును. ప్రతి సంగమ స్థలమునందు స్నానము చేయుటవలన ప్రయాగయందలి త్రివేణీసంగమ స్నాన ఫలము లభించితీరును. (31-37)

ఇక పుష్కర తీర్థము, వైరోచనీనది, సన్నిహితా నది, సగుణీనది, అట్లాగే గయా తీర్థము ఇవన్నీ చక్కని తీర్థములు. వాటియందు స్నానము చేయవలెను. ఇక రామేశ్వరమునందలి సేతుబంధము, శ్రీరంగము, అచటి అనంత పద్మనాభుడు పురుషోత్తముడు అత్యంత మనోహరుడు. అట్లే నైమిశారణ్య తీర్థము. నారాయణుడు కొలువుదీరియున్న బదరీ క్షేత్రము. కురుక్షేత్రము. ఈ చోట్లలో గల పుణ్యనదులయందు స్నానమును ఆచరించి దైవదర్శనమును చేయవలయును. అనంతరము శ్రీశైలయాత్రను చేయుడు. మహాలయ తీర్థమును దర్శించుడు. అచట పితృదేవులకు సభక్తికముగా తర్పణములను విడువుడు. దానివలన నలుబదిరెండు తరములవారు తరించిపోవుదురు. నలుబదిరెండు తరములకు చెందిన వంశపెద్దలందరు నేరుగా స్వర్గలోకమునకు వెళ్ళెదరు. ఇక కేదారతీర్థము, పుష్కరతీర్థము, కోటిరుద్ర, నర్మదా తీర్థములు, మాతృకేశ్వర, కుబ్జ తీర్థములు, కోకాముఖీ అనే తీర్థప్రదేశములు శ్రేష్ఠములు. ప్రసాద తీర్థము, విజయతీర్థము, పూరీచంద్రనదీ తీర్థము, గోకర్ణ, శంఖకర్ణ తీర్థములయందు స్నానము చేయుట అత్యంత ఉత్తమము. అయోధ్యా, మధుర, కాంచీ, ద్వారవతీ, గయ, సాలగ్రామ తీర్థము, శబలగ్రామము, ముక్తిక్షేత్రముల యందు గల తీర్థములయందు స్నానము చేసి, అచటి పవిత్రమైన, పుణ్యవంతములైన దైవక్షేత్రములను దర్శించుట అత్యంత ఉత్తమము.

అనంతరము గోదావరీ తటాకయాత్రను చేయవలెను. అది ఆరు యోజనముల దూరముతో కూడియుండును. దానిమహిమ చెప్పనలవికానిది. గోదావరీ తటాకయాత్రను చేసినవారికి, అందులో స్నానమాడిన వారికి వాజపేయ యజ్ఞమును చేసినంతటి మహాపుణ్యము సులభముగా లభించితీరును. సవ్య, అపసవ్య వేళలయందు, తటాకయాత్రను చేయునప్పుడు నిష్ఠతో, మనోనిశ్చలముతో స్నానము చేయుటవలన జ్ఞానులయ్యెదరు. మహాపాతకులు కూడా పవిత్రులయ్యెదరు. ప్రయాగతో సమానమైన ప్రసిద్ధి చెందిన తీర్థములు మరి రెండు కలవు. వాటిలో ఒకటి భీమేశ్వర తీర్థము, రెండవది వంజరా సంగమము అనునవి ప్రఖ్యాతమైనవి.

ఇక కుశ తర్పణ తీర్థము చాలా గొప్పది. దాని తటాక యాత్ర (12) పన్నెండు క్రోసులతో కూడుకొనియుండును. గోదావరి సముద్ర సంగమస్థలము వరకు చేసే తటాక యాత్రవలన (36) ముప్పది ఆరు కృచ్ఛ్ర వ్రతముల ఫలము లభించును. పూర్ణా నదికి నాలుగు క్రోసుల దూరము కలిగిన తటాక యాత్రను పూర్తి చేయవలెను. కృష్ణవేణీ తీరము యొక్క ప్రదక్షిణము పదిహేను క్రోసులతో కూడియుండును. ఈ తటాకయాత్రను తప్పనిసరిగా చేయవలెను. తుంగభద్రా నదీ తటాకయాత్ర (20) ఇరవై క్రోసుల దూరమును కలిగియుండును. పంపాసరోవరము సహజముగనే అనంతమహిమను గలిగియుండును. దీనియందు పవిత్రస్నానమును చేయవలెను. అచట ప్రసిద్ధమైన హరిహరక్షేత్రము గలదు. దాని దర్శనమువలన సమస్తదోషములు పరిహరింపబడును. అటులే భీమరథీ తటాకయాత్ర (10) పది క్రోసుల దూరమును కలిగియుండును. దీని తీరమున గల పాండురంగ, మాతులింగ క్షేత్రములు చాలా గొప్పనైనవి. (38-52)

ఆ తర్వాత గాణగాపురమునందు చక్కటి అత్యంత మనోహరములైన, పవిత్రమైన అష్టతీర్థములు కలవు. అమరజా సంగమమునందు కోటీ తీర్థములు ఉండునని పురాణములు చెప్పుచున్నవి. అక్కడగల అశ్వత్థ వృక్షము కల్పవృక్షమేనని విశ్వసించవలెను. ఆ అశ్వత్థ వృక్షమునకు ఎదురుగా నృసింహతీర్థము కలదు. దానికి ఉత్తరభాగమునందు వారాణసీ తీర్థము కలదు. దానికి తూర్పుదిక్కున పాపవినాశన తీర్థము ఉన్నది. ఆ తరువాత కోటీ తీర్థము గలదు. దానికెదురుగా రుద్రపాద తీర్థము గలదు. చక్రతీర్థము, కేశవ, దేవనాయక తీర్థములు, చూచుటకు అవి ప్రత్యక్షముగ ద్వారావతి వంటివి. వానికి ఎదుట మన్మథతీర్థము కలదు. గాణగాపురమునందు కల్లేశ్వరుడు గలదు. అది నిరుపమానమైన ప్రదేశము. గంధర్వలోకము వంటిది. గాణగాపురమును గాంధర్వపురమని పిలిచెదరు. అది సిద్ధక్షేత్రము. అసంఖ్యాకమైన సిద్ధులకు నిలయమైన చోటు. అచట అనుష్ఠానము చేయువారి ఇష్టార్థములు వెనువెంటనే నెరవేరగలవు. కల్పవృక్షమువంటి అశ్వత్థ వృక్షమును ఆశ్రయించిన యెడల నెరవేరని కోరికలు అంటూ వుండనేవుండవు. శ్రేష్ఠమైన కాకినీ సంగమము, భీమానదీ తీరక్షేత్రము వలన అనంతపుణ్యఫలము లభించును. ఇది ప్రయాగతో సమానమని గుర్తుంచుకొనుడు. తుంగభద్ర, వరదానదీ సంగమస్థానములు తపోనిధులు. మలాపహారి సంగమము నందు స్నానము చేయుటవలన (100) శత జన్మల మహాపాపములు నశించిపోవును. (52-60)

నివృత్తిసంగమము ఎంతో ఖ్యాతి వహించినది. అచట స్నానము చేయుటవలన బ్రహ్మహత్యాపాతకము నశించిపోవును. అచటికి మీరు అతిశీఘ్రముగా చేరుకొనుడు అని శ్రీగురుమూర్తి శిష్యులతో చెప్పెను. సింహరాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు సమస్త తీర్థములు భాగీరథీ (గంగ)లో చేరి ఐక్యమగును. కన్యారాశి యందు గురువు చేరినప్పుడు గంగాది సకలతీర్థములు త్వరితగతిన వచ్చి కృష్ణవేణిలో

ఏకమగును. తులారాశిలోనికి బృహస్పతి వచ్చినప్పుడు సురనదితోపాటు సర్వనదులు తుంగభద్రలో చేరిపోవును. సూర్యుడు కర్కాటకరాశిలో ప్రవేశించినప్పుడు మలప్రభా తీర్థము కృష్ణతో మమేకమగును. అప్పుడు జనులందరూ పవిత్రస్నానములు చేయుదురు. దానివలన బ్రహ్మహత్యాపాతకము నశించును. భీమా, కృష్ణానదీ సంగమస్థలమునందు స్నానము చేయు మానవులకు అరవై జన్మములపాటు ఉత్తమ బ్రాహ్మణ జన్మయే లభించితీరును. తుంగభద్రా సంగమంలో స్నానమొనర్చువారికి మూడురెట్లు అధిక ఫలము లభించును. అట్లే నివృత్తి సంగమంలో స్నానము జేయువారికి నాలుగు రెట్లు అధికఫలము ప్రాప్తించును. ఇక శ్రీశైలమునందలి పాతాళగంగలో స్నానము చేసి, మల్లికార్జునస్వామిని సందర్శించువారికి షడ్గుణ (ఆరురెట్లు) పుణ్యఫలము లభించును. అంతేగాక, వారికి పునర్జన్మ ఉండదు. లింగాలయమునందు ద్విగుణీకృతమైన పుణ్యము లభించును. సముద్రమునందు కృష్ణానది సంగమించినచోట స్నానము చేసినచో అనంతఫలము ప్రాప్తించును. కావేరీ సంగమ స్నానము వలన పదిహేను రెట్లు అధికఫలము లభించును. తామ్రపర్ణి స్నానమువలన అసంఖ్యాకమైన స్నానములు చేసిన ఫలము లభించును. కృతమాలా నది స్నానము సమస్త పాపములను నశింపచేయును. పయస్వినీ నది అత్యంత విశేషమైనది. అది సంసారసాగరమును దాటింపచేయును. సముద్రస్కంధ దర్శనము సమస్తపాపములను హరించివేయును. శేషాద్రిక్షేత్రము, శ్రీరంగనాథుని దర్శనము, శ్రీమదనంతపద్మనాభస్వామి దర్శనము వెంటనే చేయవలెను. త్రిణామల్ల అనగా తిరువణ్ణామలై క్షేత్రమునకు వెళ్లుడు. అచటి నుండి సమస్తతీర్థములతో సమానమైనటువంటి కుంభకోణమునకు వెళ్లవలయును. కన్యాకుమారి దర్శనము చేసికొని మత్స్యతీర్థమునందు స్నానము చేయగలరు. రామేశ్వరమునందు ధనుష్కోటి పేరుతో గల పక్షితీర్థము అత్యంత శ్రేష్ఠమైనది. కావేరీ తీర్థమునందలి రంగనాథుని సన్నిధి ఉత్తమోత్తమమైనది. చంద్రకుండము నందలి పురుషోత్తముని దర్శించి, మహాలక్ష్మి కొలువుదీరిన కొల్హాపురమును, కోటితీర్థమును, దక్షిణ కాశిగా పిలువబడే కరవీర స్థానమును దర్శించి అచటి తీర్థములయందు స్నానములొనర్చి అచటి దేవతలను ఆరాధించుడు. (61-74)

ఇక మహాబలేశ్వర తీర్థము. అచ్చటగల కృష్ణానదీ ఉద్గమస్థానమును దర్శించాలి. అచట బహే అను పేరుగల పట్టణమునందుగల(1)

---

1. 'బహే' అను పేరు గల గ్రామం సతారా జిల్లాలో వాలవే తాలూకా - మహరాష్ట్రలోగల కృష్ణానదీ తీరంలో ఉన్నది. అక్కడగల నదీస్థానంలో స్వయంభూ రామేశ్వరుని పవిత్ర ప్రదేశమున్నది. శ్రీసమర్థరామదాసుగారు ఇచట వీరహనుమంతుని స్థాపించినారు. దీనిని బహే-బోరగాం అని కూడా పిలిచెదరు.

రామేశ్వర పుణ్యక్షేత్రమును దర్శించుడు. నృసింహదేవుడు కొలువుదీరిన కోల్హా గ్రామమున(1) సదాశివపరమాత్ముడు ప్రత్యక్షదైవముగా నిలిచియుండును. కృష్ణా తీరమునందు గల భిల్లవటిలో, భువనేశ్వరీ శక్తి క్షేత్రము విరాజిల్లుచున్నది. అచట తపస్సు చేసినవారు ఆ పరమేశ్వరిలో తప్పక ఐక్యమునొందగలరు. ఇక వరుణాసంగమము శ్రేష్ఠమైనది. అచట మీరు అత్యంత భక్తిభావముతో స్నానము చేయుటవలన మార్కండేయుడు సంపాదించినటువంటి ఉన్నతస్థానము లభించును. అచట సంగమేశ్వరుని పూజించవలెను. ఉత్తమమైన కృష్ణాతీరమునందు అనేక ఋషి వాటికలు కలవు. అచట స్నానము చేసి వాటిని దర్శించవలెను. ఆ ఋషివాటికలకు ఎదురుగా గల కృష్ణాతీరమునందు స్నానము చేసిన యెడల శ్రేష్ఠమైన జ్ఞానము లభించును. కృష్ణాప్రవాహ తీరమున అమరాపురము అనే ప్రసిద్ధమైన క్షేత్రము కలదు. అది పంచగంగా సంగమముతో కూడినది. అచట స్నానము చేయుటవలన ప్రయాగతీర్థరాజమునందు చేసిన పుణ్యము లభించును. సమస్త తీర్థప్రదేశములయందు అనేకమంది ఋషి, మునులు తపస్సు చేసియున్నారు. నదీతీరములయందు తపస్సు చేయుటవలన శ్రేష్ఠమైన తత్త్వజ్ఞానము లభించును. ఇవన్నియూ సాటిలేని క్షేత్రములు. ఈ ప్రదేశములన్నియూ అనేకవిధములుగా అత్యంత ప్రసిద్ధినొందినవి. ఆయా ప్రదేశములయందు మూడు రాత్రులు నివసించి, చిత్తశుద్ధితో ఏదేని అనుష్ఠానము చేసినయెడల సమస్తమనోభీష్టములు నెరవేరగలవు. అనంతరము పరమాత్మప్రాప్తి సిద్ధించును. ఇక జుగాలయ తీర్థము శ్రేష్ఠమైనది.(2) దానియందు చూపు పడితే చాలు, వారు ముక్తులయ్యేదరు. అట్లాగే శూర్పాలయ అనే తీర్థము శ్రేష్ఠమైనది. విశ్వామిత్ర ఋషి ఛాయా, భగవతి అనే తీర్థస్థానములయందు తపస్సు చేసెను. అచటనే గల మలప్రహారి సంగమమునందు స్నానము చేసినచో సమస్తదోషములు సమసిపోవును. విష్ణుమూర్తి అవతారమైన కపిలమహర్షికి గాయత్రిదేవి ప్రసన్నమైన శ్వేతశృంగి అను క్షేత్రము అత్యంత ప్రసిద్ధమైనది. ఇచట కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహించును. అచట స్నానము చేయుటవలన కాశీస్నానము చేసిన దానికంటే వందరెట్లు – శతగుణితముగా ఫలము లభించును. అచట ఏదేని ఒక మంత్రమును అనుష్ఠించినచో, కోటి గుణితముల ఫలము సిద్ధించును. కేదారేశ్వర తీర్థము అనే పేరుగల మరొక శ్రేష్ఠమైన తీర్థము గలదు. పీఠాపురమునందు దత్తాత్రేయస్వామివారు అనాదిగా నివసించుచుండెను. మణిగిరి అనే పేరుగల మరొక ప్రసిద్ధమైన తీర్థము గలదు. అచట సప్త ఋషులు చాలాకాలము తపస్సు

---

1. 'కోలే నరసింహ' అనే పేరుగల ఒక ఊరున్నది. అక్కడ ఒక సొరంగంలో పదహారు చేతులను గలిగిన ఒక నృసింహస్వామి వారి విగ్రహమున్నది. అది గొప్ప జాగృతిగల స్థానమని ప్రసిద్ధి గలదు.
2. 'జుగాలయ' లేక 'జుగుళ' అనే గ్రామం బెల్గాం జిల్లాలో అథనీ తాలూకాలో కృష్ణాతీరంలో గలదు. ఇది నరసోబావాడికి ఆరుమైళ్ళ దూరంలో ఉన్నది.

చేసిరి. కళ్యాణనగరమునందు వృషభాద్రిలో ఎన్నియో తీర్థములు గలవు. అచట జననమరణములకు తావుండదు. అట్టి పవిత్రక్షేత్రములయందు పర్యటించవలయును. అహోబిలమును దర్శించవలెను. తద్వారా (60) అరవై యజ్ఞములు చేసిన ఫలము లభించును. శ్రీరంగదర్శనము వలన పునర్జన్మ వుండదు. (75-90)

ఈ భూమండలమునందుగల సమస్త తీర్థములలో మీరు పర్యటించవలెను. ఈ నదులు రజోదర్శన యుక్తమైయున్నప్పుడు స్నానము చేయుట దోషాస్పదమగును. కర్కాటక సంక్రాంతి మొదలుకొని రెండు మాసముల కాలము నదులకు రజస్వలాదోషముండును. కనుక, అప్పుడు నదీ స్నానము చేయకూడదు. అయితే నదీతీరవాసులకు మాత్రము ఈ దోషము వర్తించదు. ఇచట గమనించదగిన విశేషమేమనగా, మహానదులు రజోదర్శనయుక్తమై యున్నప్పుడు మూడు దినములు వాటిలో స్నానము చేయకూడదు. భాగీరథి, గౌతమి, చంద్రభాగా, సింధు, నర్మద, సరయూ అనే నదులను ఈ రజస్వలాదోషయుక్తమైన మూడు దినములు స్నానము చేయకుండా త్యజింపవలెను. గ్రీష్మకాలమునందు నదులన్నియునూ పదిరోజుల పాటు రజస్వలాయుక్తములుగా ఉండును. వాపీ, కూప, తటాకములు మొదలగువాటినన్నింటిని ఒక రాత్రి స్నానము చేయకుండా వదలిపెట్టవలెను. కొత్తగా వర్షపునీరు వచ్చినరోజును రజోదర్శనయుక్తమైన రోజుగా గుర్తించవలెను. అప్పుడు స్నానము చేయుటవలన మహాదోషము అంటుకొనును. కనుక, అట్టి సమయమునందు స్నానమును వదలిపెట్టవలెను. ఈవిధముగా మీ అందరికొరకు ఈ ధరాతలమునందు నిలయమైయున్న తీర్థములను, పుణ్యక్షేత్రములను గురించి సంగ్రహముగా చెప్పితిని. కంటిచూపుకు కనిపించిన సమస్తనదులలో విధివిధానముగా తప్పక స్నానమును ఆచరించవలెను అని ప్రసన్నవదనులై ఈ వివరముల నన్నింటినీ సంక్షిప్తముగా ఆదేశపూర్వకముగా శ్రీగురుమూర్తి తమ శిష్యులకు వివరించి చెప్పెను. శ్రీగురుదేవుల ఆదేశపూర్వకమైన వాక్యములను విని శిష్యులందరూ వారిమాటలను శిరసావహించి వరుసక్రమంలో ఒక్కొక్కరుగా వచ్చి గురుమూర్తికి పాదాభివందనము చేసి, అనుమతిని పొంది, తీర్థాటనకై బయలుదేరిరి. అని ఈవిధముగా సిద్ధముని నామధారకునితో చెప్పి శ్రీగురుమూర్తి వద్ద సెలవుగైకొని శిష్యులందరు కలిసి యాత్రకు బయలుదేరివెళ్ళిన పిదప శ్రీగురునాథుడు అచటనే గోప్యముగా వుండిపోయిరని ముగించెను.

తరువాతి కథను సరస్వతీగంగాధరుడు మనకు చక్కగా వివరించెను. మనోహరమైన ఆ కథను వినుటవలన సకలాభీష్టములు నెరవేరును. కామధేనువు వంటి శ్రీగురుచరిత్రమును సావధానచిత్తముతో శ్రవణము చేసిన భక్తజనులందరు చతుర్విధపురుషార్థ ఫలములను అవలీలగా

పొందగలరు. బ్రహ్మపదార్థము యొక్క రసము, మాధుర్యమును పదే పదే సేవించుటవలన ఎవరికి ఎక్కువ మక్కువ జనించునో, వారు మాత్రమే పరమార్థమును సాధించి తురీయస్థానమును చేరుకొని, పవిత్రమైన మానవజన్మమునందు ఉత్తీర్ణులు కాగలరు అని గంగాధరాత్మజుడైన సరస్వతి శ్రీగురుచరిత్రమును అందరికి ప్రకాశింపచేసెను. (100–102)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "తీర్థయాత్రా నిరూపణము" అను పదిహేనవ అధ్యాయము ॥ 15 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 102; మొత్తము సంఖ్య : 1732 + 102 = 1834 ఓవీలు)

◆ ◆ ◆

ప్రేరయ త్తీర్థయాత్రాయై తీర్థరూపోఽపి యః స్వకాన్ ।
సమ్యక్ ధర్మ ముపాదిశ్య శ్రీదత్తః శరణం మమ ॥
(శ్రీవాసుదేవానంద సరస్వతీకృతం శ్రీదత్తభావసుధారసము - 68)

శ్రీ గురు చరిత్ర

పదహారవ అధ్యాయము

శ్రీగురు సేవా మహత్త్వము - వైద్యనాథమునందు ఒక బ్రాహ్మణుడు శరణుగోరి శ్రీనృసింహ సరస్వతీ స్వామి వారి వద్దకేతెంచుట- గురువులను మార్చుట కూడదని, అది ఆత్మహత్యా సదృశమని శ్రీగురుమూర్తి హెచ్చరించుట - ధౌమ్యమునీశ్వరుని కథను వర్ణించి గురుశుశ్రూషా ఫలమును నిరూపించుట - భిల్లవటీ గ్రామమునకు శ్రీగురునాథుల ఆగమనము

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు అను శిష్యుడు వినయముగా చేతులు జోడించి, శిరసువంచి సిద్ధమునికి నమస్కరించి ఇట్లు ప్రశ్నించెను – "స్వామీ! అనంతర గురుచరిత్రమును వినిపించగలరు. శిష్యులందరు తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు శ్రీగురుమూర్తి వద్ద ఎవరు ఉండిరి? ఆ తదుపరి జరిగిన కథ ఏమిటి? వివరింపగలరని" కోరెను. **శిష్యుని మాటలకు మిగుల సంతుష్టుడైన సిద్ధముని ఇట్లనెను** – "శిష్యశిరోమణీ! నామధారకా! గురుభక్త చూడామణీ! నీవు ధన్యుడవు. అచ్చమైన గురుభక్తుడవు నీవే. నీ జన్మము ధన్యము. కొంతకాలము నుండి గురువును గూర్చిన చర్చ లేనందున అవిద్యా అనబడే మాయచే నా చిత్తమునకు నిద్రమత్తు ఆవరించెను. నీ మూలముగ, నీవు చేయు పరిప్రశ్నము వలన ఇప్పుడు అది జాగృతమయ్యెను. తద్వారా, నాలో జ్ఞానజ్యోతి ఉదయించెను. కావున, నీవు నా ప్రాణమిత్రుడవు. నామధారకా! నీవు సచ్ఛిష్యుడవు. నీ సాంగత్యము వలన శ్రీగురుచరిత్రము నా స్మృతిపథమున ప్రకాశించెను. తత్కారణమున నాలో అంతులేని సుఖము కలుగుచుండెను. జీవితయాత్ర కొనసాగుచుండగా అజ్ఞానాంధకారమనెడు తాపముతో పీడింపబడి కష్టాల కడలిలో మునిగియుంటిని. అట్టి నేను గురుచరితామృతసాగరమున మునకలు వేయుటకు నీవు కారణభూతుడవైతివి. నీవు చేసిన ఈ అత్యుత్తమ ఉపకృతి వలన నా మనము అనంతమైన తుష్టిని, పుష్టిని పొందెను. నాయనా! నీ వంశము పుత్రపౌత్రాదులచే వర్ధిల్లుగాక! ఇక మీ గృహమున దారిద్ర్యమునకు తావుండదు. వత్సా! నీవు గుర్వనుగ్రహమునకు పాత్రుడవైతివి. తత్ఫలితముగా ఈ లోకమునందు నీవు గొప్పగా గౌరవింపబడెదవు. నీ కీర్తి ప్రతిష్ఠలు

ఇనుమడించును. అష్టైశ్వర్యములతో తులతూగెదవు. సౌఖ్యవంతమైన జీవితమును గడిపెదవు. నా మాటలను విశ్వసించుము. ఎంతమాత్రము శంకింపవలదు. కామధేనువైన గురుచరిత్రమును నీకు విశదముగా వివరించెదను. సావధానముగా వినుము. శ్రీగురుమూర్తి తమ శిష్యులందరిని తీర్థపర్యటన నిమిత్తమై పంపివేసెను. వారు మాత్రము ఈ వైద్యనాథేశ్వర క్షేత్రమునందే ఒక సంవత్సరముపాటు గుప్తముగా ఉండిపోయిరి. అప్పుడు నేను మాత్రము శ్రీగురుమూర్తి వద్దనే యుండి వారికి శుశ్రూష చేయుచుంటిని. వైద్యనాథ క్షేత్రమునందు **'ఆరోగ్యభవాని'** అను పేరిట జగదంబిక వెలసిన పవిత్రమైన ప్రదేశము గలదు. అది చూడముచ్చటగా అత్యంత మనోహరముగా ఉండును. ఆ క్షేత్రమునందు జగదంబిక నిత్యసన్నిహితయై ఉండును. ఆ క్షేత్రము అన్ని క్షేత్రములకన్న మిక్కిలి మనోహరముగా ఉన్నందున శ్రీగురుమూర్తి అచట నివసించిరి. (1-11)

శ్రీగురుమూర్తి ఆ క్షేత్రమునందు ఉన్న సమయమున ఒకానొక బ్రాహ్మణ ముని ఒకనాడు వారివద్దకు వచ్చెను. ఆయన శ్రీగురునాథుని దర్శించి అత్యంత భక్తిభావముతో నమస్కరించెను. చేతులు జోడించి వారి శ్రీచరణములపై శిరస్సునుంచి అనేకవిధములుగా స్తుతించెను. **పిదప ఇట్లు మనవి చేసెను.** "స్వామీ! అజ్ఞానసముద్రములో మునిగిపోయిన నన్ను దయతో తరింపచేయుడు. ఎంతోకాలమునుండి తపస్సు చేయుచుంటిని. కానీ, నా మనస్సు ఇంకనూ స్థిరపడలేదు. నాకు దిక్కుతోచకున్నది. దయతో జ్ఞానమును ప్రసాదింపుడు. జ్ఞానములేని తపస్సు వృథయే కదా! మిమ్ము దర్శించుచుండగా, మీ సన్నిధానమున నిలబడియుండగా నేడు నా మనస్సు హర్షపులకాంకితమై కుదుటపడుచున్నది. శ్రమకోర్చి ఎక్కువకాలము నేను గురుసేవను చేయలేను. స్వామీ! అందువల్లనే నా మనస్సు స్థిరపడలేదని నేను భావించుచుంటిని. నా మనసుకు అంతటి స్థైర్యము లేదు. మిమ్ములను చూచిన వెంటనే నాకు మీ వలన తరింపగలనన్న విశ్వాసము నాలో కుదిరెను. మీరు జగద్గురువులు. మహాత్మా! నాకు వెంటనే జ్ఞానము కలుగునట్లుగా ఉపదేశింపగలరని" అతడు ప్రార్థించెను. (12-17)

ఆ బ్రాహ్మణ ముని మాటలను విని శ్రీగురుడు మందహాసము చేసి, "నాయనా! గురువు లేని నీవు మునిగా ఎట్లు కాగలిగితివి? ముందుగా ఆ మాటను నాకు తెలియజేయుము" అని ప్రశ్నించెను. వెంటనే ఆ బ్రాహ్మణుని కనులనుండి జలజలా కన్నీరు కారసాగెను. అతడు మితిమీరిన దుఃఖముతో కృంగిపోయెను. కంఠము రుద్ధమాయెను. కొంతతడవు మౌనము వహించి తననుతాను సంబాళించుకొని **గురుమూర్తి ముందు చేతులు జోడించి ఇట్లు చెప్పెను** - "గురురాయా! మహానుభావా! నాకు కూడా ఒక గురువు ఉండెను. ఆయన మాటలు అత్యంత కఠినములుగా ఉండెడివి. నన్ను ఆయన బాధించెడివాడు. చేయలేని, చేయుటకు అయోగ్యమైన సేవలను నాచేత చేయించెడివాడు. ఇంకనూ నీ అంతఃకరణము

శుద్ధి కాలేదని, నీ చిత్తము చంచలముగా ఉన్నదని నాకు వేదశాస్త్రములను ఉపదేశింపలేదు. తర్కభాష్యవ్యాకరణాలు ఏవియూ చెప్పలేదు. నీ మనస్సు స్థిరముగ లేక అతి చాంచల్యముతో కూడియున్నది. చపలచిత్తుడవైన నీకు ఉపదేశమును పొందే యోగ్యత లేదని, ఇంకనూ ఇటువంటి మాటలే ఏవేవో వారు అనేవారు. నేను వారి మాటలకు తలవంచకుండా, వారు చెప్పిన ప్రతిమాటను వ్యతిరేకించితిని. ఆ కారణమున నేను వారికి దూరముండుటచే వారు నాపై మిగుల కోపగించిరి. ఈవిధముగ కొంతకాలము ఆ గురువువద్దనే ఉంటిని. కాని, ఒకనాడు అతి కర్కశముగ మాట్లాడుటవలన వెంటనే వారిని వదలివేసి నేను బయటకు వచ్చితిని" అని ఆ బ్రాహ్మణముని చెప్పెను. అతడు చెప్పిన మాటలను విని **శ్రీగురుమూర్తి హాస్యవదనముతో అతనిని చూచి ఇట్లనెను** – "ఓరీ! నీవు ఎటువంటి బ్రాహ్మణుడవు. ఆత్మఘాతుకమునకు తలపడితివి కదా! గొప్ప మూర్ఖుడవు కావుననే, గురువునందు దోషములను అన్వేషించితివి. నీ మాటలను విని నిన్ను చూడగా అతి చోద్యముగా కన్పట్టుచుంటివి. ఎవడో మూర్ఖుడొకడు తన గృహమునందలి దైవమందిరములో మలవిసర్జనము చేసి, అటుల అపవిత్రము చేసినందులకు ఆక్షేపించిన వారినందరితో అది నా ప్రారబ్ధము ఏమి చేయుదును? అని చెప్పినట్లుగా ఉన్నది. ఇతరులకు అపశకునముగా ఉండుటకొరకై తన ముక్కును తానే కోసివేసికొని, దారిలో వచ్చిపోయెడివారికి ఎదురైనట్లుగా ఉన్నది నీ సంగతి. నిజమునకు నీవు గురుద్రోహివి. అల్పబుద్ధి కలవాడివి. నీ గురించి నీవు ఎంతమాత్రము చింతించుటలేదు. నిన్ను నీవు శుద్ధి చేసికొనలేక గురుద్రోహమొనర్చితివి. ఇక నీకు జ్ఞానమెట్లబ్బును? నిరంతరము నీ గురువు యందలి గుణదోషములనే అత్యంత హర్షముతో విమర్శించుచుంటివి. ఇక నీ చిత్తమునకు స్థిరత్వమెట్లు ఏర్పడును? జ్ఞానము కలుగుట కాదు కదా! అది మరింత శూన్యమగుట నిశ్చయము. ద్రవ్యనిధిని సమీపమునందుంచుకొని, కట్టెలకోసం అరణ్యాలవెంట తిరుగుట ఏల? కామధేనువు వంటి గురువు వుండగా ఆయనను వంచించి, మా వద్దకు వచ్చితివా? గురుద్రోహికి ఇహపరములు రెండూ ఉండనే ఉండవు. గుడ్లగూబ తన కంటికి దోషమున్నదని గుర్తింపలేక సూర్యుడు ప్రకాశించుటలేదని ఆక్షేపించినట్లుగా, అల్పజ్ఞుడు తన దోషమును గురువునందు ఆరోపించినట్లున్నది నీ సంగతి. ఎవడైతే గురువుయొక్క మహత్త్వమును గుర్తించి అతనియందే దృఢనిశ్చయమును చెందునో, తద్వారా వారి సేవలో నిమగ్నమగునో, వాడు అత్యంత శీఘ్రముగా వేదశాస్త్ర జ్ఞానసంపన్నుడై, పూర్ణజ్ఞాని కాగలడు. గురువు పరిపూర్ణమైన సంతుష్టి చెందితే చాలు! శిష్యునికి వేదశాస్త్రములన్నియునూ కరతలామలకములగును. గురుమూర్తిని సంతృప్తిపరచుటవలన అష్టసిద్ధులు అరచేతిలో తాండవించును. అట్టివానికి సకల వేదశాస్త్ర పరిపూర్ణ ప్రజ్ఞను సాధించుటకు ఒకే ఒక్క క్షణకాలము కూడా పట్టదు"

అని పలికిన శ్రీగురునాథుని మాటలు విని ఆ బ్రాహ్మణుని అంతఃకరణములో ప్రకంపనలు ప్రారంభమయ్యెను. వెంటనే, అతడు తన శిరమును గురుమూర్తియొక్క శ్రీచరణములపై నుంచి, చేతులు జోడించి, **మిక్కిలి దయనీయముగా ఇట్లు ప్రార్థించెను.** (18–33)

"జగద్గురూ! మీకు జయము. జయము. నిర్గుణులు, నిర్వికారులైన మీరు అపార జ్ఞానసాగర సంపన్నులు. దయతో నన్నుద్ధరింపుడు స్వామీ! మాయాజనిత అజ్ఞానముతో చుట్టబడి, గురుస్వరూపమును గుర్తించలేకపోయిన మూర్ఖుడను. స్వామీ! నాకు జ్ఞానము కలిగేవిధముగా ప్రబోధించుము. గురువును ఎట్లు గుర్తించవలెను. వారిని ఏవిధముగ సేవించవలెను. విశ్వవంద్యుడవైన ఓ గురుమూర్తీ! నాకు గుర్వనుగ్రహమును ప్రసాదించుము. నా మనసును స్థిరపరచుకొని, నేను గురుస్వరూపమును గుర్తించగలుగునట్లుగా నన్ననుగ్రహించుము. నన్ను తరింపచేయుము" అని ఆతడు శ్రీవారి చరణములను పట్టుకొని శరణు కోరెను. అత్యంత దయనీయమైన ఆ బ్రాహ్మణుని మాటలను విని **శ్రీ గురునాథులు మిక్కిలి దయదలంచి గురుసేవా విధానమును గూర్చి సవిస్తరముగా చెప్పసాగిరి –**

"బ్రాహ్మణమునీ! వినుము. గురువులు అంటే జననీజనకులే అనగా, తలిదండ్రులే ప్రథమగురువులు. మనకు తెలియని తత్త్వమును బోధించువారు అందరూ గురువులే. వారిని శ్రేష్ఠగురువులుగా భావించవలెను. బ్రహ్మదేవుడు, శంకరుడు, నారాయణుడు వీరందరూ గురుస్వరూపులే. అనగా, శిష్యుడు తమ గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా గుర్తించవలెను. సాక్షాత్తు నారాయణమూర్తిగా భావించి, సేవింపవలెను. పరబ్రహ్మమూర్తియే నా గురువు అని నిశ్చయమైన, దృఢమైన భక్తిప్రపత్తులతో, నిర్మలచిత్తముతో గురువును సేవించవలెను. ఇందుకు సంబంధించిన ఒక కథను నీకు వివరించి చెప్పెదను. మహాభారతమునందలి ఆదిపర్వమునందు చక్కని భక్తిభావముతో గురుసేవ చేసి అనంతమైన ఫలమును పొందిన ఒక కథ చెప్పబడి ఉన్నది. దానినే నీకిప్పుడు వివరించి చెప్పెదను. **సావధానచిత్తముతో వినుము".**(34–41)

ద్వాపరయుగాంతమున 'ధౌమ్యుడు' అను పేరుగల ఒక ఋషీశ్వరుడుండెను. అతనివద్ద వేదాభ్యాసము చేయుటకై ముగ్గురు శిష్యులు ఉండిరి. వారిలో మొదటి శిష్యుని పేరు 'ఆరుణిపాంచాలుడు'. ఇక రెండవ వాడి పేరు 'బైదుడు'. మూడవవాడు 'ఉపమన్యుడు' అను పేరుగల బాలుడు. ఇతడు పై ఇద్దరికంటే వయస్సులో చిన్నవాడు. ఈ ముగ్గురూ వేదాధ్యయనమును కోరి తమ గురువుకు శుశ్రూష చేయుచుండిరి. అయితే, పూర్వకాలమునందు ఒక శిష్యుడు విద్యనిమిత్తమై గురువువద్దకు ఏతెంచిన మీదట అతనికి తగిన శుశ్రూష చేయుటకు ఏదో ఒక పనిని అప్పగించెడివారు. అట్లు కొంతకాలము పరీక్షించి, శిష్యుని శుశ్రూషను గమనించి, గురువు అతని అంతఃకరణమును చివరివరకు

పరిశీలించెడివాడు. అట్టి శిష్యుని సేవాభావమును, నిర్మలమైన అంతఃకరణమునందలి అనన్యభక్తిభావమును చూసి గురువు సంతుష్టినొందిన తక్షణమే వారియెడల కృపను చూపి, వారి మనోభీష్టములను నెరవేర్చెడివాడు. అట్టి శిష్యులకు అనాయాసముగా అతనికి కావలసిన విద్యలన్నియూ అబ్బుచుండెడివి. ఈ ధౌమ్యుడను మహర్షి కూడా అట్టి సంప్రదాయమును కలిగినవాడే. కావున. ఓయీ, బ్రాహ్మణుడా! ధౌమ్యమునీశ్వరుని కథను వినుము.

ఒకరోజున మొదటి శిష్యుడైన ఆరుణి పాంచాలుడను వానిని తన దగ్గరకు పిలిచి **ధౌమ్యుడు ఇట్లు ఆదేశించెను.** "నాయనా! నేటినుండి నీవు మన ఋషివాటికకు దూరముగా నున్న మా పొలమునకు వెళ్ళి అచటి పైరునకు సరిపోవునట్లుగా చెరువునుండి వచ్చే కాలువనీటిని ప్రవహింపచేయవలెను. ఆవిధముగా పొలమునందలి పైరు పంటకు వచ్చి, ధాన్యము ఇంటికి చేరువరకు పొలమునందలి పైరుకు తగినంత నీటిని ప్రవహింపచేయుచుండుము. ఇదియే నీ కర్తవ్యము. ఇక వెళ్ళిరమ్ము" అని శిష్యుని ఆదేశించెను.

గుర్వాజ్ఞను శిరసావహించిన ఆరుణిపాంచాలుడు నేరుగా గురువుగారి పొలమును చేరుకొనెను. అచ్చట చెరువునుండి వచ్చుచున్న కాలువ పెద్దగా ప్రవహించుచు కనిపించెను. ఒక పెద్ద కాలువనుండి తిరిగి చిన్న చిన్నకాలువల ద్వారా ఆయా క్షేత్రములకు నీరు ప్రవహించగలిగే ఏర్పాటు కలదు. ఆతడు వచ్చిన సమయమున కాలువకు గండిపడి ఉధృతముగా నీరు ప్రవహించుచుండెను. అయితే, గురువుగారి పొలము కాలువకు కొంత ఎత్తుగా, మెరకగా ఉండెను. కావున, వేగముగా కాలువ ద్వారా ప్రవహించే నీరు పల్లపుభూమి వైపునకే ప్రవహించుచుండెను. అయితే, గురువుగారి క్షేత్రము కొంత మెరక ప్రదేశమున ఉన్నందున అచటికి ఈ నీరు చేరుట ఎట్లు? దీనికి తగిన ఉపాయమేమిటి? అని ఆరుణి ఆలోచించసాగెను. ఇప్పుడేమి చేయుదును? పొలమునకు నీరు పెట్టనిచో శ్రీగురువు నాపై కోపగించును. నీరు వేగముగా ప్రవహించుచున్నది. దాని వేగమును ఆపగలిగినపుడే కొంత మెరకగా ఉన్న గురువుగారి పొలమునకు నీరు చేరగలదు అని చింతించి, పెద్ద పెద్ద బండరాళ్లను దొర్లించి తెచ్చి, ప్రవహించుచున్న నీటికి అడ్డముగా పెట్టసాగెను. కాని, అడ్డముగా పెట్టిన రాళ్ళను త్రోసుకొనుచూ పెద్ద శబ్దముతో నీరు ప్రవహింపసాగెను. ప్రవాహమును నిలుపుటకై వివిధ ఉపాయములతో ఆ శిష్యుడు అనేకవిధములుగా తంటాలు పడెను. మట్టి తెచ్చి పోసినా, రాళ్ళను అడ్డముగా పెట్టినా ప్రవాహ వేగమును నిలుపలేక గురువుగారి పొలమునకు నీరు చేర్చలేక తన ప్రయత్నములో అంతకంతకూ అతడు విఫలుడు కాజొచ్చెను.

"శ్రీహరీ! దేవదేవా! ఇక నేనేమి చేయుదును" అని వగచి విచారించుచుండెను. గురువుగారి పొలములోనికి నీరు ప్రవహింపచేయవలెను. అట్టి పని నిమిత్తముగా "నేను ప్రాణములను సైతము విడిచిపెట్టెదను" అని కృతనిశ్చయుడై అంతరంగమున తన గురువును దృఢముగా ధ్యానించి కైమోడ్పులర్పించి, దీనికి తగు ఉపాయము నాలో తట్టుటకు 'గురుదేవా! నీవే కరుణించుము' అని సంకల్పించుకొనెను. వెంటనే ఒక పెద్ద బండరాయిని తీసికొని, ఆ నీటి ప్రవాహమునకు అడ్డముగా వేసెను. కాని, ప్రవాహవేగమువలన ఆ రాయి కూడా కొట్టుకొనిపోయెను. దీనికి బదులుగా తానే ఆ ప్రవాహ వేగమునకు అడ్డుగా పడుకొనినచో నిశ్చయముగా నీరు గురువుగారి పొలమునకు ప్రవహించునని నిశ్చయించుకొనెను. వెంటనే తన రెండు చేతులతో ప్రక్కనున్న తీరమును గట్టిగా పట్టుకొని రెండవవైపు తన పాదములను గట్టిగా నొక్కిపెట్టి నీటి ప్రవాహమునకు అడ్డముగా పడుకొని, కళ్లు మూసుకొని శ్రీగురుదేవుని దృఢముగా ధ్యానింపసాగెను. ఆ ప్రకారము శిష్యశిరోమణియైన ఆరుణిపాంచాలుడు తన మనమున తుది నిశ్చయమును చేసికొనిన మరుక్షణమే ప్రవాహములోని సగము నీరు అతనిపై నుండి పొంగి పొలమువైపునకు ప్రవహింపసాగెను. శిష్యుడు నిశ్చలముగా నీటికి అడ్డముగా, బురదలో పడుకొని ఉండెను. ఆ ప్రకారముగ కాలువగుండా ప్రవహించే నీటితో గురువుగారి పొలము పూర్తిగా పైరుకు సరిపోవునట్లుగా నీటిని ప్రవహింపచేసెను. ఇంతలో సూర్యాస్తమయ కాలము సమీపించెను. సూర్యుడు అస్తమించి చీకటి పడుచుండెను. చీకటి పడిననూ శిష్యుడు రానందులకు ధౌమ్యుడు విచారించి, తానే స్వయముగ పొలమువైపుగా వెళ్ళెను. అచట నీరు బాగుగా నిండి ప్రవహించుచుండెను. అందుకు తన పొలము నీటితో పూర్తిగా తడిసియున్నందులకు అతడు మిక్కిలి సంతోషించెను. కానీ, శిష్యుడు మాత్రము కానరాలేదు. అయ్యో! శిష్యునకు ఏమయ్యెనో? అడవిలో పులులుగానీ, సర్పములుగానీ భక్షించియుండునా! అని భయపడి, నీటికోసం ఎంతగా కష్టపడెనో కదా! పాపం వీడెక్కడున్నాడో అని బాధపడుచూ ఒకసారి ఉచ్చైస్వరముతో అత్యంత ప్రేమభావముతో, "నాయనా! శిష్యా! ఆరుణీ! ఎక్కడుంటివి?" అని గట్టిగా పిలిచెను. ప్రేమపూరిత కరుణారసార్ద్ర వాక్కులతో ధౌమ్యమునీశ్వరుడు పిలిచినతోడనే ఆ ధ్వని శిష్యుని చెవికి సోకి అతడక్కడినుండియే 'గురుదేవా! నేను ఇక్కడనే ఉన్నాను' అని ఒకచేయిని చాచి చూపి నెమ్మదిగా లేచి వచ్చి, గురువు పాదములకు నమస్కరించెను. శిష్యుని సాహసమునకు ఆశ్చర్యపడి అతడి భక్తికి మెచ్చుకొని, దగ్గరకు తీసుకొని గాఢాలింగనమొనర్చెను. అతని ధైర్యమునకు ఆశ్చర్యపడి ప్రశంసించి, వెంటనే పరిపూర్ణమైన అనుగ్రహముతో శిష్యుని మస్తకముపై గురువు తన హస్తమును ఉంచెను. అంతే, గుర్వనుగ్రహము వలన తత్‌క్షణమే అతడు వేదశాస్త్రాది సకలవిద్యాపారంగతు డయ్యెను.

"శిష్యశిఖామణీ! నీకు వేదశాస్త్రాది విద్యలన్నియునూ సంప్రాప్తమయ్యెను" అని గురువు పల్కెను. వెంటనే కడు భక్తిభావముతో అతడు శ్రీగురుచరణారవిందములకు సాష్టాంగవందనము చేసెను. కృపానిధియైన ధౌమ్యమహర్షి ఆ బాలుని ఆప్యాయముగా తన ఆశ్రమమునకు తీసుకొనివెళ్ళి అతనిని శుభ్రపరచి, నూతన వస్త్రములనిచ్చి, **కడుపార ఆహారమును తినిపించి నుడివెను-** "నాయనా! మీ ఇంటికి వెళ్ళి వివాహమాడుము. సమస్త సుఖములను అనుభవించుము" అని ఆశీర్వదించి, తలిదండ్రుల వద్దకు తిరిగివెళ్లుటకు అనుమతినిచ్చెను. శిష్యుడు గురువుగారి అనుజ్ఞనుపొంది, వారికి సాష్టాంగ వందనమునాచరించి, గురువువద్ద సెలవు గైకొని తన ఇంటికి వెళ్ళిపోయెను. ఇంకనూ మిగిలిన ఇద్దరు శిష్యులు గురువువద్దనే ఉండిపోయిరి. (42-70)

ఈ ప్రకారముగా ధౌమ్యమహర్షి మొదటి శిష్యుడైన ఆరుణిపాంచాలుడనువానిని కృతార్థుని చేసెను. బైదుడు అను పేరుగలవాడు గురు శుశ్రూష చేయుచున్నప్పుడు అతని అంతఃకరణమును పరీక్షించ నెంచి గురువగు **ధౌమ్యమునీశ్వరుడు అతనితో ఇట్లు పలికెను** – "నాయనా! నీకు ఒక పనిని అప్పగించెదను. నీవు మన పొలమునకు వెళ్ళి అచట పెరుగుచున్న పైరును రాత్రింబవళ్లు రక్షించవలెను. పంట చేనును జాగ్రత్తగా రక్షించి, ధాన్యమును ఇంటికి చేర్చవలెను. ఇది నీ బాధ్యత అని చెప్పగా, అతడు అత్యంత హర్షముతో, గురుదేవా! మీ ఆజ్ఞను నిర్వహించెదనని, గురువు పాదములకు వందనము చేసి మిగుల సంతోషముతో గురువుగారి పొలమువైపునకు వెళ్లెను. పంటచేను పక్వమయ్యేంతవరకు దివారాత్రములు కష్టపడి, రక్షించెను. తదుపరి పంటచేనును కోసి ధాన్యమును సిద్ధపరచి, ఒక రాశిగా చేసి తన గురువును సమీపించెను. శ్రీగురుదేవునకు నమస్కరించి, "గురుదేవా! ధాన్యమును చక్కగా సిద్ధపరచి, రాశిగా చేసి పోసితిని. ఇక ఆ ధాన్యమును ఇంటికి చేర్చవలెను. అందుకు సెలవీయవలసినదని ప్రార్థించెను. అప్పుడు ధౌమ్యమునీశ్వరుడు తన శిష్యుని మరింతగా పరీక్షింపనెంచి "శిష్యశిరోమణీ! సరే, మంచిది! పొలములో చాలా కష్టపడితివి. ఇక ఇప్పుడు సిద్ధమైన ధాన్యమును ఇంటికి చేర్చవలెను కదా!" అని అతనికి ఒక బండిని, **దానికి ఒక దున్నపోతును కట్టి గురువు ఇట్లనెను** – "నాయనా! ఈ బండిని తీసుకొనివెళ్ళి వెంటనే ధాన్యమును తీసుకొనిరమ్ము" అని చెప్పెను. పాపం ఆ శిష్యుడు ఆ దున్నపోతును కాడికి ఒకవైపున కట్టి, కాడికి రెండవ వైపున తాను స్వయంగా లాగుచూ, ఎంతో శ్రమపడి ఆ బండిని పొలము దగ్గరకు చేర్చెను. తదుపరి ధాన్యపురాశిని అంతయు బండిలో నింపెను. ఆ బండి కాడికి ఒకవైపున దున్నపోతును కట్టి, తాను రెండవ వైపున కాడిని తన మెడపై ధరించి బండిని లాగసాగెను. అప్పుడప్పుడు బండి వేగముగా పరుగెత్తుచున్నప్పుడు దానితో సమానముగ తాను

నడువలేక అతి కష్టముతో నిలద్రొక్కుకొనుచు కంఠమునకు కాడిని బహుజాగ్రత్తగా పట్టుకొని వెళ్ళుచుండెను. దున్నపోతుతో పాటుగా కాడిని మెడతో లాగుచూ మార్గములో నడచునపుడు దురదృష్టవశాత్తు ఆ దున్నపోతు బురదలో కూరుకొనిపోయెను. "అయ్యో! ఈ దున్నపోతు బురదలో కూరుకుపోయి పడుకున్నది కదా!" అని తన మనసులో ఎంతగానో చింతించి, విచారించుచూ దున్నపోతును కాడినుండి తొలగించి తానొక్కడే ఆ బండిని లాగసాగెను. తన మెడకు ఉరి పడినట్లుగా అయి ప్రాణము పోయినంతపని కాజొచ్చెను. ఇదంతయూ జరుగుచుండగా ధౌమ్యమునీశ్వరుడు ఆశ్రమమునందే యుండి, విషయమునంతయూ గమనించి, గుండె కరిగి శిష్యునకు ఎదురుగా వచ్చెను. బండిని లాగుచున్న శిష్యుని దీనమైన క్లిష్టపరిస్థితిని చూచిన వెంటనే ఆతని హృదయము ద్రవించిపోయెను. శిష్యునిపై అపారమైన కృపావృష్టి కురిపించెను. వెంటనే పరుగెత్తుకొనిపోయి శిష్యుని మెడపైగల కాడిని విడిపించి, **దయార్ద్రహృదయుడై, ప్రేమతో అతడిని గాఢాలింగనమొనర్చుకొనెను.** "ఆహా! నీ దృఢమైన నిశ్చయమునకు నేను పరవశించిపోయితిని. నాయనా! నీవు వేదశాస్త్రసంపన్నుడవు కాగలవని" వరప్రదానమొసగెను. వెంటనే బైదుడు సమస్తవిద్యాపారంగతుడయ్యెను. గురువుగారి దివ్యచరణారవిందములకు సాష్టాంగవందనమొనర్చి, వారి అనుమతిని పొంది బైదుడను రెండవ శిష్యుడు తన ఇంటికి వెళ్ళిపోయెను. (71-86)

అప్పుడు ధౌమ్యుల వారు మూడవ శిష్యుడైన ఉపమన్యుని సేవను పరీక్షించుటకై తన సమీపమునకు పిలిచెను. చిన్నవాడైన ఉపమన్యుడను ఆ శిష్యుడు గురుశుశ్రూష చేయుటలో గొప్ప నైపుణ్యము గలవాడు. గురుసేవను కడు ప్రీతితో చేయుచుండెడివాడు. కాని, అతనికి ఆకలి ఎక్కువ. అతడు తిను ఆహారమునకు హద్దు లేదు. అత్యధికమైన ఆహారము వాడికి అవసరము. అందుచేత అతనికి విద్య అబ్బుటలేదు. తత్కారణముగా ఈ మూడవ శిష్యుడైన ఉపమన్యుని పరీక్షించుటకై ధౌమ్యుడు ఒక చక్కని ఉపాయమును ఆలోచించెను. "నాయనా! ఉపమన్యూ! నీకు ఒక పనిని అప్పగించెదను. అదేమన, ప్రతినిత్యము మన పశువులను అడవులకు తీసుకొనివెళ్ళి వాటిని కడుపునిండా మేపుకొని బహుజాగ్రత్తగా రక్షింపుచూ, తిరిగి ఆశ్రమమునకు చేర్చవలెను. ఉదయము పశువులను తీసికొనివెళ్ళి సాయంత్రము వరకు తిరిగి రావలయునని నియమమును విధించి, వెళ్ళమని" ఆజ్ఞాపించెను. వెంటనే, ఆ శిష్యుడు గురువుగారి పాదపద్మములకు వినయముతో నమస్కరించి, అడవిలో మేపుటకై పశువులను వెంట తీసికొనివెళ్లెను. అచట పశువులను మేపసాగెను. ప్రొద్దెక్కిన కొలది అతనికి ఆకలి అధికము కాసాగెను. వెంటనే పశువులను ఇంటికి తీసికొనివచ్చెను. అది చూసి గురువు కోపించి 'ఏమిరా! ఇంత తొందరగా

వచ్చినావేమిటి?' అని ప్రశ్నించెను. 'సూర్యుడు అస్తమించేవరకు అడవిలో పశువులను రక్షించమని, అప్పటివరకు మేపుచుండవలెనని, ఇదేవిధముగ ప్రతిరోజు చేయవలెనని నీకు ఉదయమే పనిని అప్పగించితిని కదా! అందుకు అంగీకరించిన నీవు వెంటనే పశువులను తీసికొనివచ్చితివేమని" ఆగ్రహించెను. "ఓరీ! రేపటినుండి సూర్యాస్తమయమగువరకు గోవులను అరణ్యములో కాచుచుండుము. అస్తమయమైన తర్వాతనే గోవులను తీసికొని ఆశ్రమమునకు రమ్మని" గట్టిగా మందలించి చెప్పెను. అంతట శిష్యుడును గుర్వాజ్ఞను శిరసావహించి, ఉదయముననే గోవులను తీసికొని అడవికి వెళ్లెను. అవి నదీతీరములో తిరుగుచుండగా, తాను నదిలో దిగి స్నానము చేసెను. అచటికి సమీపమున నాలుగు బ్రాహ్మణ ఇండ్లు ఉండెను. వారి ఇండ్లకు వెళ్ళి భిక్ష చేసి, కమ్మగా భోజనము చేసి, సాయంకాలము వరకు గోవులను మేపెను. ప్రతినిత్యము ఇదేవిధముగ పశువులను కాచి వాటిని మేపుతూ, రాత్రికి ఇంటికి పశువులతో పాటు తాను చేరుకొనువాడు. కొంతకాలము జరిగిన పిమ్మట ఒకనాటి ఉదయము **ధౌమ్యుడు తన శిష్యుని ఇట్లడిగెను**– "నీవు నిత్యము ఉపవసించినప్పటికినీ, నీ దేహము ఇంతటి పుష్టిగా ఎట్లుండెను?" అని గురువు శిష్యుని ప్రశ్నించెను. శ్రీగురుదేవుల మాటకు బదులుగా **ఉపమన్యుడు ఇట్లు పలికెను**– "గురుదేవా! నదీతీరమునకు దగ్గరలోగల బ్రాహ్మణుల ఇండ్లకు వెళ్ళి భిక్ష చేసి, దానిని ఆరగించుచుంటిని. ఈవిధముగ ప్రతినిత్యము భిక్ష తెచ్చుకొని భోజనము చేసి సాయంత్రమునకు పశువులను తీసికొని తిరిగి ఇంటికి చేరుచుంటిని" అని శిష్యుడగు ఉపమన్యుడు సావధానముగ సమాధానము చెప్పెను. **వెంటనే శ్రీగురుడు ఉగ్రుడై అతనితో ఇట్లనెను**– "ఓరీ! మూర్ఖుడా! నన్ను వదలి భోజనము చేయుచుంటివా? వేరే ఇండ్లలో భిక్ష చేసిన ఆహారమును ప్రతిదినము ఇంటికి తెచ్చి నాకు ఇవ్వవలెను. తదుపరి పశువులవద్దకు వెళ్ళి వాటిని మేపి తిరిగి రాత్రివేళకే రావలయును. ఇది నా ఆజ్ఞ" అని హెచ్చరించెను. (87-100)

మరునాడు గుర్వాజ్ఞను అనుసరించి పశువులను అడవికి తీసికొనివెళ్ళెను. రోజువలెనే భిక్ష చేసి అది తీసికొనివెళ్ళి ఇంటిలో ఇచ్చెను. అతనికి ఇంటిలో చేసిన భోజనముతో ఎప్పుడూ కడుపు నిండునది కాదు. కనుక, తిరిగి వేరే చోట్లకు వెళ్ళి మళ్ళీ భిక్షను యాచించి, భుజించువాడు. ప్రతిరోజూ రెండు పర్యాయములు భిక్ష చేసి, మొదటి భిక్షను ఇంటిలో ఇచ్చి, రెండవ భిక్షను తాను భుజించి, కాలమును గడుపుచుండెను. ఇట్లు కొన్ని రోజులు గడువగా అతని శరీరము మరింత పుష్టిగా తయారయ్యెను. అది చూచిన గురువు శిష్యుని పిలిచి అందుకు కారణమేమిటని అడిగెను. శిష్యుడు ప్రతిరోజు రెండు పర్యాయములు భిక్ష చేయుచుంటినని, మొదటి భిక్షతో ఆకలి తీరక,

రెండవమారు భిక్షను చేసి నేను భుజించుచుంటినని స్పష్టముగా చెప్పెను. "ఓరీ! మూర్ఖుడా! బ్రహ్మచారి రెండుమార్లు మాధూకరిని యాచించకూడదు. నీవు ఎటువంటి శిష్యుడవురా? రేపటినుండి అట్లు చేయవలదు. రెండు పర్యాయములు తీసుకొనే మాధూకరమును ఇంటికే తెచ్చి ఇవ్వుమని" ఆజ్ఞాపించెను. గురువు ఆదేశమును శిరసావహించి తన మనస్సులో ఎట్టి క్లేశమును పెట్టుకొనకుండా ప్రీతితో రెండు పర్యాయములు చేసిన మాధూకరమును ఇంటిలోనే ఇవ్వసాగెను. మరునాడు పశువులతో పాటు అడవిలో తిరుగుచుండగా కడుపులో ఆకలి గోకుచుండెను. ఇంతలో అతని దృష్టి గోవుల వద్ద పాలను త్రాగుచున్న దూడలను ఆకర్షించినది. దూడలు తమ తల్లులవద్ద పాలు త్రాగుచుండగా కారిన చొంగపాలు నేలపాలగుచుండెను. వాటిని చూచి "అయ్యో! ఇవి వ్యర్థమగుచున్నవి కదా! వీటిని భూమిమీద వ్యర్థముగ పోనీయకుండా తాను త్రాగెదనని భావించి ఆకలితో పరుగెత్తి రెండు చేతులను కలిపి తన దోసిలిలోనికి ఆ ఎంగిలిపాలను పట్టుకొని పానము చేయసాగెను. తద్వారా, రెండువేళలా చేసిన మాధూకరమును భక్తిభావముతో ఇంటిలో అప్పగించుచుండెను. క్షీరపానము వలన మరింత పుష్టిగా తయారయ్యెను. కొద్దిరోజుల పిమ్మట గురువు అతని శరీరపుష్టిని చూసి "ఓరీ! నీవు ఇంత లావుగా ఎట్లు కాగలిగితివని" ప్రశ్నించెను. "అయ్యా! నేను అడవిలో ఆవులను మేపుచున్నపుడు దూడలు పాలు త్రాగుచుండగా కారిపోవుచున్న చొంగపాలను దోసిలితో పట్టుకొని త్రాగుచున్నానని" చెప్పెను. అది విని శిష్యునిపై ఆగ్రహించి "ఓరీ! బుద్ధిహీనుడా! ఉచ్ఛిష్టమైన పాలను త్రాగినచో మతిహీనుడవయ్యెదవు. అపరిమితమైన దోషభాక్కుడవు కాగలవు. కనుక, ఈ రోజునుండి ఉచ్ఛిష్టమైన ఆ పాలను నీవు త్రాగవద్దు. అట్లు చేయవద్దు" అని కఠినముగా శాసించెను. "అయ్యో! గురువుగారు పాలు కూడా త్రాగవద్దని అన్నారు కదా! ఇక నిత్యము నాకు ఆహారము లభించుటెట్లు? మరుసటిరోజునుండి నేనేమి చేయుదును" అని తనలోతాను బాధపడుచుండెను. ఈవిధముగ అతడు పశువులతో పాటు అడవిలో తిరుగుచుండగా అచ్చటచ్చట జిల్లేడు చెట్లనుండి పాలు కారుటను గమనించెను. ఆవులు గడ్డిని మేయుచూ పక్కదారిన వెళ్లుచుండగా వాటిని మరల్చుటకొరకై అతడు ఒక జిల్లేడు చెట్టుయొక్క కొమ్మను విరిచెను. దానినుండి జలజలా పాలు కారుటను గాంచెను. ఓహో! ఈ పాలు మంచివే. ఇవి ఉచ్ఛిష్టములు కావు కదా! వీటిని త్రాగి కడుపు నింపుకొందునని నిశ్చయించుకొనెను. జిల్లేడు చెట్టు యొక్క పాలు విషపూరితములని తెలియక అతడు ఆ చెట్టుయొక్క ఆకులను చక్కగా త్రుంచి వాటిలోనుండి కారుచున్న పాలను దొప్పలోనికి పట్టుకొని త్రాగుచుండగా, అతని కళ్లలో ఆ పాలు చిమ్మి పడెను. ఫలితముగా ఆతని రెండు నేత్రములు వెంటనే చూపును కోల్పోయెను. ఈవిధముగ దృష్టి లేనివాడై గోవులు కనిపించక దుఃఖించుచూ, ఆ గోవుల నిమిత్తమై

తడుముకొనుచూ, అటూ ఇటూ పరుగెత్తుచుండగా విధివైపరీత్యమున ఒక పాడుబడిన బావిలో పడిపోయెను. "అయ్యో! గురువుగారి గోవులు మార్గము తప్పి ఎటు పోయెనో కదా!" అని విలపించుచుండెను. అందులకు గురువు నన్ను ఎంతగా దూషించునో కదా! అని ఆ శిష్యుడు బావిలో పడి దుఃఖించుచుండగనే సూర్యుడు అస్తమించి చీకటిపడిపోయెను. ఇంతలో ఉపమన్యుడు ఇంతవరకూ రాలేదేమిటి? అని ధౌమ్యమహర్షి మనస్సులో చింతించి వెంటనే అడవికి వెళ్ళెను. అచట దూరముగా గోవులు కనిపించినవి. కాని, శిష్యుడు కనపడలేదు. అందుకు ఆయన మిగుల చింతించి బాధపడుచూ శిష్యుని పేరుపెట్టి బిగ్గరగా పిలిచెను. గురువుగారు పిలిచిన పిలుపును విని శిష్యుడు వెంటనే ప్రత్యుత్తరమిచ్చెను. "గురుదేవా! నేను బావిలో పడిపోయి వుంటిని. నన్ను రక్షింపుము" అని ఎలుగెత్తి ప్రార్థించెను. శిష్యవత్సలుడైన ధౌమ్యమహర్షి బావివద్దకు చేరి తన శిష్యుని పైకి లేవదీసి జరిగిన వృత్తాంతమునంతయూ విని దయార్ద్రహృదయుడై శిష్యుని చేష్టలకు జాలిపడెను. వాని అమాయకత్వమునకు మనసు నందు నొచ్చుకొనెను. వెంటనే అశ్వినీదేవతలను స్తుతించుమని శిష్యుని ఆదేశించెను. అత్యంత భక్తిభావముతో శిష్యుడు అశ్వినీదేవతలను స్తుతించి ఆహ్వానించెను. తత్క్షణమే అశ్వినీదేవతలు ప్రత్యక్షమై ఆ శిష్యునకు తిరిగి దృష్టిని ప్రసాదించి వెళ్ళిపోయిరి. శిష్యుడు ఆనందభరితుడై గురుదేవుల పాదపద్మములకు నమస్కరించి సమ్ముఖమున నిలువబడి గురుదేవుని ఎన్నో విధములుగా స్తుతించెను. అందుకు ధౌమ్యుడు మిగుల సంతసించి శిష్యుని చేరదీసికొని, గాఢమైన ఆలింగనమును అనుగ్రహించెను. చనువుతో అతని శిరమును నిమురుతూ బుజ్జగించి, "శిష్యోత్తమా! నీ యెడల నేను సంతుష్టిని పొందితిని" అని శిష్యుని యెడల ప్రసన్నుడై, ఆ మహర్షి ఉపమన్యు శిరముపై తన దివ్యమైన హస్తమును ఉంచెను. తత్క్షణమే గురువుయొక్క హస్తమస్తకస్పర్శమాత్రముచేతనే తృటిలో ఆ శిష్యుడు సకలవేదశాస్త్రపారంగతుడయ్యెను. **గురువుగారు ఆ శిష్యుని ఆశీర్వదించి నుడివెను–** "నాయనా! వెంటనే నీవు మీ గృహమునకు వెళ్ళి తలిదండ్రులకు నమస్కరించి, వారిని ఆనందింపచేయుము. ఆ తర్వాత వివాహము చేసికొని హాయిగా, దీర్ఘాయుష్మంతుడవై సుఖముగా జీవించుము" అని ఆశీర్వదించెను. నీవు సాటిలేని కీర్తిని గడించెదవు. నీకు ఎందరో శిష్యులయ్యెదరు. ఉత్తంకుడు అనే పేరుగల నీ శిష్యుడు ఎంతయో ప్రసిద్ధినొందును. అతడు నీకు దక్షిణగా ఆదిశేషుని జయించి కుండలములను తెచ్చి యిచ్చును. దానితో ఆతడు మిగుల కీర్తివంతుడగును. జనమేజయునకు ఉపదేశించి అతనితో సర్పయాగము చేయించును. ఆ ఉత్తంకుడు సర్పయాగమునందు **'సహేంద్రతక్షకాయ స్వాహా'** అని తక్షకునితో సహా ఇంద్రుని రప్పించును. అతని కీర్తి ముల్లోకములయందు వ్యాపించును" అని ధౌమ్యమహర్షి ఉపమన్యుని భవిష్యత్తును గూర్చి కూడా చెప్పి అతనిని పరిపూర్ణముగా అనుగ్రహించెను.

"ఓయీ! బ్రాహ్మణ మునీ! గురుకృప ఎంతయో సమర్థవంతమై ఉండును. గురువును దూషించువారు లేదా, గురువును ద్వేషించువారు పుణ్యలోకములను ఎట్లు పొందగలుగుదురు. గురుద్రోహియైన పాతకులు కుంభీపాకమనే నరకములో మగ్గిపోవుదురు. గురువును సంతుష్టిపరచినవారికి సాధ్యము కానిదంటూ ఈ లోకమునందు మరేదియూ ఉండదు. అట్టివారికి సమస్తవిద్యలు సిద్ధించుటకు తృటికాలము కూడా పట్టదు. ఇది నీవు గ్రహించుము. ఓ బ్రాహ్మణమునీ! వృథగా ఎందుకు తిరుగుచుంటివి. నీవు వెంటనే ఇంతకుముందు ఆశ్రయించిన గురువును చేరుకొమ్ము. అతడే నిజముగా నిన్ను తరింపచేయగల సమర్థుడు. ఆయన హృదయమును నీవు సంతుష్టపరచగలిగినచో, నీకు తప్పక మంత్రసిద్ధి కలుగును. ఈవిధముగ నీలో నీవు నా మాటను దృఢముగా నిశ్చయించుకొనుము. ఎంతమాత్రము ఆలసింపకుండ వెంటనే నీ గురువు యొక్క చరణములను ఆశ్రయించుము" అని శ్రీగురునాథుడు విస్పష్టముగ చెప్పెను. (101-140)

శ్రీగురునాథుని ఆదేశమును వినిన ఆ బ్రాహ్మణుడు గురుమూర్తి చరణములపై తన శిరసునుంచి నమస్కరించి, **అనేక విధములుగ స్తుతించి ఇట్లు విన్నవించెను.** "గురుమూర్తీ! మీకు జయము. జయము. మీరు కృపతో పరమార్థతత్త్వమును బోధించితిరి. తద్వారా, నేను అచ్చమైన పరమార్థమును గ్రహించగలిగితిని. నిజమునకు నేను గురుద్రోహినైతిని. గురువుపట్ల మహాపరాధమునొనర్చితిని. గురుచిత్తమును మిగుల బాధించితిని. అట్టి గురుమూర్తిని నేను ఎట్లు సంతసింపచేతును. ఇనుపముక్క విరిగినచో, తిరిగి అతికింపవచ్చును. కాని, మనసు విరిగితే తిరిగి అతికించుట కష్టము కదా! బంగారు, ఇనుము మొదలైన లోహధాతువులు విరిగిపోయినచో వాటిని తిరిగి అతికించవచ్చును. కాని, ముత్యమే పగిలితే దానిని తిరిగి అతకటము ఎట్లు? మనసు విరిగితే దానిని అతుకుట అసాధ్యము. పతితుడనైన నా మనస్సు పగిలిపోయినది. నా జీవితము వ్యర్థమైనది. నేను జీవించి ప్రయోజనమేమి? గురుద్రోహియైన నా ఈ శరీరమువలన ఉపయోగమేమి? నాకు జీవించవలయుననే ఇచ్ఛ లేదు. గురుద్రోహిగా మారిన నేను గురువుకోసమే నా ప్రాణములను వదలివేయుదును" అని ఆ బ్రాహ్మణుడు శ్రీ గురుమూర్తి యొక్క పాదములముందే తన ప్రాణములను వదలివేయుటకు నిశ్చయించి లేచి నిలబడెను. వెంటనే గురుమూర్తి **ఆ బ్రాహ్మణుని ఉద్దేశించి ఇట్లు పలికెను** - (141-146)

"ఓయీ! బ్రాహ్మణుడా! నీకిప్పటికి నిజమైన పశ్చాత్తాపము కలిగినది. అగ్ని ఎండుగడ్డిని ఎట్లు దహింపచేయునో, తనకు కలిగిన పశ్చాత్తాపము యొక్క తప్తము వలన అంతఃకరణము అట్లే శుద్ధమగును. అగ్ని కర్పూర కళికను సమూలముగ దహింపచేయునటుల

పశ్చాత్తాపముచేత పాపములు నశించిపోవును. నీ పాపాలను గురించి మరచిపొమ్ము. ఇప్పుడు నీ మనసులో చెలరేగిన అనుతాపమే ఆ పాపరాశినంతయూ భస్మీపటలము చేసివైచెను. నీవు వందజన్మములనుండి చేసిన పాపములన్నియు ఈ క్షణమే పటాపంచలైపోయెను. నీవు ఎంతమాత్రము దుఃఖింపవద్దు. చింతింపవలదు. నీ దురితము అంతయు దగ్ధమైపోయినది. ఇక నీవు శ్రీగురుచరణములను నీ మనస్సునందు చక్కగా స్మరింపుము" అని చెప్పి కరుణాపయోనిధియైన గురుమూర్తి ఆ బ్రాహ్మణుని అనుగ్రహించి అతని మస్తకమునందు తన దివ్యహస్తమునుంచెను. అతడు వెంటనే సర్వవిద్యాపారంగతుడాయెను.అంతట ఆ బ్రాహ్మణుని హృదయమునందు అత్యంత భక్తిభావము పొంగిపొరలుచుండెను. గురుమూర్తి దయార్ద్రహృదయమునకు, అంతులేని వారి అనుగ్రహపు తీరునకు అతని మేను పులకించిపోయెను. కనులవెంబడి బాష్పకణములు కారుచుండగా గద్గదకంఠుడై తన కరములను దోయిలించి శ్రీగురుచరణారవిందములకు శిరసాష్టాంగవందనము ఆచరించి, లేచి నిలిచి, **తిరిగి చేతులు జోడించుకొని వినమ్రుడై తలను వంచి ఇట్లు స్తుతించెను -**

"స్వామీ! గురుమూర్తీ! మీరే జగద్గురువులు. త్రిమూర్త్యాత్మక అవతారస్వరూపులు. మీ కృపను పొందిన పిదప ఈ శరీరమునందు పాపరాశికి తావులేదు. భాస్కరుడు ఉదయించిన వెంటనే అంధకారమునకు తావుండదు కదా! అట్లే మీ కృప సోకిన ఈ శరీరమునందు పాపములు ఎట్లు ఉండగలుగును" అని అనేకవిధములుగా శ్రీగురునాథుని భక్తితో స్తుతించినపుడు అత్యంత హర్షపులకాంకితుడై అతని కంఠము గద్గదమగుచుండెను. శరీరము రోమాంచమగుచుండెను. అంతట నిర్మలమైన మనస్సుతో ఆయన చరణాబ్జములపై తన శిరసునుంచి తనను తరింపచేయుమని" అనేకరకములుగా ఎంతో దయనీయముగా, శ్రీగురుమూర్తిని ప్రార్థించెను. అతని మనసులోని దృఢమైన నిశ్చయమును గాంచిన శ్రీగురుమూర్తి అతనియెడల అత్యంత ప్రసన్నుడై ఆతని శిరమును తన వరదహస్తముతో మరల తాకెను. పరుసవేదిని స్పృశించిన వెంటనే ఇనుము బంగారముగా మారినట్లు ఆ బ్రాహ్మణునకు దివ్యమైన తత్త్వజ్ఞానము కలిగెను. అతనియెడల చంద్రమౌళీశ్వరుడు అగు శంకరుడు ప్రసన్నుడాయెను. ఆ బ్రాహ్మణునికి లభించిన భాగ్యమును మనము ఏమని కొనియాడగలము. (147-160)

ఆ బ్రాహ్మణముని అంతులేని ఆనందముతో ఉప్పొంగిపోయెను. **అంతట శ్రీగురుడు ఆ బ్రాహ్మణుని చూచి పలికెను-** "నాయనా! మా మాటను తలదాల్చి నీవు వెంటనే నీ గురుమూర్తివద్దకు వెళ్లుమని" ఆజ్ఞాపించెను. నీవు నీ గురుమూర్తి వద్దకు వెళ్ళి వారికి అత్యంత భక్తిభావముతో నమస్కరించుము. అప్పుడాతడు మిగుల సంతోషించును. ఆయనయే నేనుగా గ్రహించుము. ఈ మాటను నీవు మరువవద్దు"

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

అని శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునకు తెలియజెప్పెను. శ్రీ స్వామివారి ఆజ్ఞను గైకొని వెంటనే ఆ బ్రాహ్మణముని తన గురువువద్దకు వెళ్ళిపోయెను.

అటుపిమ్మట శ్రీగురునాథుడు అచటినుండి భువనేశ్వరీ క్షేత్రమైన భిల్లవటి గ్రామమునకు చేరుకొనిరి. కృష్ణా పశ్చిమతీరమున ఉన్న ఔదుంబర వృక్షము క్రింద శ్రీగురుడు గుప్తముగా ఉండిపోయెను. అచట కృష్ణానది తూర్పు దిశగా ప్రవహించును అని సిద్ధుడు నామధారకునితో శ్రీగురుమూర్తి భిల్లవటి గ్రామమున ఉండగా వారి మహిమ ఎన్నో విధములుగ వెల్లడియై మిక్కిలి ప్రసిద్ధినొందెను. దానిని గూర్చి ఆ తరువాత నీకు వివరించి చెప్పెదను అని పలికెను. శ్రవణము చేయుటకు ఆహ్లాదభరితముగా ఉండి, మహామహిమాన్వితమైయుండి, సకలజనుల సమస్త అభీష్టములను నెరవేర్చగలిగెడు సిద్ధముని, నామధారకుల మధ్య జరిగిన సంవాదాత్మకమైన శ్రీగురుచరిత్రమును గంగాధరాత్మజుడైన సరస్వతి లోకమునకు ప్రకటించెను. (161-167)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "గురుశుశ్రూషణ మాహాత్మ్య వర్ణనము" అను పదహారవ అధ్యాయము ॥ 16 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 167; మొత్తము సంఖ్య : 1834 + 167 = 2001 ఓవీలు)

◆ ◆ ◆

అత్రిపుత్రో మహాతేజో దత్తాత్రేయో మహామునిః ।
తస్య స్మరణ మాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే ॥
(శ్రీవాసుదేవానంద స్వామి విరచితం - మంత్రాత్మక దత్తస్తుతి - 7)

శ్రీ గురు చరిత్ర

పదిహేడవ అధ్యాయము

ఖిల్లవటిస్థాన మహిమను వర్ణించుట - వేద పండితునకు మందమతియగు బాలుడు జన్మించుట - విద్యరాని వింతపశువని బంధువులు ఆ బాలుని నిందించుట - అతడు మరణించుటకు సిద్ధపడి ఖిల్లవటిని చేరుట - భువనేశ్వరీదేవి ఎదుట విలపించిన ఆ బాలుడు ప్రాయోపవేశము చేయుట - మేడిచెట్టు వద్దగల శ్రీగురుమూర్తిని చేరుకొమ్మని జగన్మాత ఆదేశించుట-అతడు శ్రీగురునాథుని వద్దకు వెళ్ళి శరణుజొచ్చుట - శ్రీగురుదేవుల అనుగ్రహముతో ఆ బాలుడు సంపూర్ణ జ్ఞానిగా మారుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని నామధారకునితో ఇట్లనెను – "గురుభక్తశిఖామణీ! నీ మనస్సు శ్రీగురుచరణకమలముల యందు నిశ్చయముగా లయమొందెను. పర్జన్యుడు వర్షించుటకు ముందు పూర్వసూచనగా చల్లని గాలి వీచి తాపమును పోగొట్టినట్లుగా నీకు గురుకృప వలన దైన్యము నశించి గురుచరిత్రమును వినుటయందు అభిరుచి, ప్రేమ మరింతగా వృద్ధినొందెను. ఆహా! కామధేనువు వంటి ఈ గురు చరిత్రమును నీకు మరింతగా విస్తరించి చెప్పెదను. శిష్యా! నీ మనసును ఏకోన్ముఖము చేసికొని వినుము. (1-3)

కృష్ణవేణీ నదీతీరమున ఖిల్లవటి గ్రామమునందు శ్రీభువనేశ్వరీదేవి క్షేత్రము కలదు. అట్టి దైవక్షేత్రమునకు పశ్చిమభాగమున అనగా ఆవలి తీరమున ఔదుంబర వృక్షమొకటి కలదు. ఆ వృక్షముక్రింద శ్రీగురుమూర్తి నివసించెను. శ్రీగురుడు తానెచ్చట ఉన్నది మరెవరికీ తెలియకుండా గుప్తరూపమున ఉండి అచట చాతుర్మాస్య వ్రతమును ఆచరించెను. వారు అచట అనుష్ఠానము ఒనర్చినందున ఆ స్థానము ఒక సిద్ధక్షేత్రముగా మారెను. ఏలనన, ముందే అది సిద్ధస్థానము. అత్యంత గహనమైనటువంటి భువనేశ్వరీదేవి సన్నిధానము అగుటచే ఇంకనూ విశేషించి అచట శ్రీగురునాథుడు నివసించుటవలన ఆ స్థలమహిమ చెప్పుటకు వీలులేనంతగా పెరిగిపోయెను.

సిద్ధుడు చెప్పిన మాటలను విని నామధారకుడు నమస్కరించి పలికెను – "మహానుభావా! గురుమూర్తి స్వయముగా పరమాత్మ అవతారమే కదా! ఇక వారు గుప్తముగా ఉండుటెందులకు? ఆయన తపస్సును ఆచరించుటకుగల కారణమేమి? ఆయన భిక్షాటనమును ఎందుకు చేసిరి? ఈవిధముగ నా మనసులో ఉప్పతిల్లిన సంశయములను దయతో నివారింపుము" అని ప్రార్థించెను. **అంతట సిద్ధముని ఇట్లు పలికెను** – "వత్సా! నామధారకా! వినుము. సంకోచము లేకుండా చక్కగా ప్రశ్నించితివి. ఇక సంశయము లేకుండా వినుము. పినాకపాణియగు పరమేశ్వరుడు కూడా భిక్షమెత్తలేదా? అటులనే త్రిమూర్తి స్వరూపులగు శ్రీదత్తాత్రేయ గురుమూర్తియు భక్తజనులను తరింపచేయు నిమిత్తము భిక్షాటనమును ఆచరించుచుండిరే కాని, వారి స్వార్థము కొరకు కాదు. వారు తీర్థయాత్రలను చేయుటయు, తపస్సును ఆచరించుటయు, లోకానుగ్రహార్థమే కాని, వేరొక కారణము లేదు. (4–10)

అయితే, వారు గుప్తముగా ఉండుటకు కారణమేమి? అనగా, లోకులందరు తండోపతండములుగా వచ్చి తమకిష్టమైన అనేక వరములను కోరుకొందురు. కావున, అందుకు కొంతదూరముగా ఉండుటకై ఒక స్థానప్రభావమును మరింతగా లోకమునకు ప్రకాశింపచేయుటకై వారు ఒక్కొక్కచోట అతి గోప్యముగా ఉండిపోయిరి. తీర్థాటన చేయటము కూడా భక్తజనులకు తెలియకుండా, అత్యంత గుప్తముగా ఉండిపోయినటువంటి క్షేత్రముల, తీర్థములయొక్క మహిమలు భక్తజనులకు వ్యక్తము చేయు నిమిత్తమే గాని, వారు వ్యక్తిగతముగ ఏదో సాధించుటకొరకు మాత్రము కాదని గ్రహింపవలెను. వారు గోప్యముగా ఉండుటకు యత్నించినప్పటికినీ, వారి మహిమ ఏదో ఒకవిధముగ బహిర్గతము అగుచునే యుండెను. ఏలనన, తేజోరాశియైన సూర్యప్రకాశమును కప్పియుంచుటకు సాధ్యమా? కస్తూరిని దాచిపెట్టినచో దాని పరిమళము దాగియుండునా? కల్పవృక్షము ఎక్కడ ఉండునో, అక్కడి భూప్రదేశమునందు జనులు సంకల్పించిన ఫలమును కాదనకుండా, లేదనకుండా ఇచ్చుటయే ఆ వృక్షముయొక్క మహత్తరమైన సహజగుణము కదా! కావున, వారు గుప్తముగ ఉన్ననూ, ఆయా ప్రదేశములలో వ్యక్తమైయున్ననూ, శ్రీగురుని యొక్క మహిమ దశదిశలకు వ్యాపించుచునేయుండెను. అట్టి విషయమును ఋజువు చేయగల ఒక దివ్యమైన వృత్తాంతమును నీకు ఎరిగించెదను. ఏకాగ్రచిత్తముతో వినవలసినదని చెప్పసాగెను – (11–15)

కరవీరము (కొల్హాపురము) అను పట్టణమునందు ఒక సద్బ్రాహ్మణుడుండెను. అతడు వేదవేదాంగపారంగతుడు. గొప్ప సదాచారసంపత్తి గలిగినవాడు. అతడు విద్యార్థులందరి చేత వేద, శాస్త్ర పురాణములను అధ్యయనము చేయించెడివాడు. ఆ బ్రాహ్మణుడు ఋగ్వేదశాఖకు

చెందినవాడు. అతనికి తర్కవ్యాకరణశాస్త్రములు బాగుగా తెలియును. ఆహ్నిక ప్రమాణమును అనుసరించి నిత్యకర్మమార్గ అనుష్ఠాన నిరతుడై యుండెను. ఇట్టి బ్రాహ్మణునకు ఒక పుత్రుడు జన్మించెను. ఆతడు పుట్టుకతోనే మందబుద్ధిని కలిగియుండెను. ఆ బాలునకు బాల్యముననే దురదృష్టవశాత్తు తలిదండ్రులిద్దరూ పరలోకగతులైరి. ఆ బాలుడు తమ తాతగారింటిలో పోషింపబడుచుండెను. ఇంతలో అతనికి ఏడు సంవత్సరముల ప్రాయము పూర్తికాజొచ్చెను. బంధువులందరూ కలిసి గర్భాష్టమ వయస్సు నందు ఆ బాలునకు ఉపనయనము చేసిరి. స్నానసంధ్యాదులు గానీ, గాయత్రీ మంత్రము గానీ, ఏది చెప్పిననూ వెంటనే అతడు మరచిపోవుచుండెను. ఎంత మందలించి చెప్పిననూ అతనికి ఇవేవియు కంఠస్థము గాకుండెను. అట్టి మందమతియైన మూర్ఖునకు ఇక వేదమంత్రములు ఎట్లు అబ్బును. ఇంతలో కొంత వయస్సు పెరుగుటవలన ఆ బాలుడు తనలో తాను బాధపడసాగెను. ఎవరు ఏ మాట చెప్పిననూ అది విన్న మరుక్షణమే అతడు ఆ మాటను మరచిపోయెడివాడు. అందువలన ఆ గ్రామములోగల ఇరుగుపొరుగు పండితులు, బంధువులు ఇట్లు అతనిని నిందించుచుండిరి. “ఓరీ! నీవు విద్యావిహీనుడవు. బ్రాహ్మణకులమునందు జన్మించి కూడా నీకింతటి మౌఢ్యమెట్లు ప్రాప్తించెను? నీ తండ్రి ఒక గొప్ప జ్ఞానవంతుడు. వేదశాస్త్రపురాణ మర్మజ్ఞుడైన మహాపండితుడు. అట్టి విద్వాంసుని గర్భమున ఇంతటి మందమతివై ఒక బండరాయివలె నీవు ఎట్లు జన్మించితివి? నీ జీవితము నశించిపోవుగాక! నీవలన నీ తండ్రి కీర్తిప్రతిష్ఠలన్నియు మంటగలిసిపోయెను కదా! నీవు బ్రతికియుండుటకంటే, పొట్టకొక బండరాయిని కట్టుకొని ఏ చెరువులోనో, బావిలోనో దూకి చచ్చుట మేలు. ఈ లోకములో ఒక పందివలె జీవించే నీ జన్మ వ్యర్థమైనది. ఓరీ! ఆచారహీనుడా! అనాచారముతో జీవించిన నీకు నరకమే లభించును. ఇక సద్గతి ఎక్కడిది? విద్యరాని వాడు వింత పశువు(1). విద్యగలవాడే మానవులలో అత్యధికుడగును. భూమిలో పాతిపెట్టిన ద్రవ్యనిధివలె విద్య తరగని నిధి వంటిది. ఎవరికి గొప్ప విద్య ఉండునో, అతనికి సర్వదా సమస్త భోగములు ప్రాప్తించును. అతడు సుఖసంపదలతో, కీర్తిప్రతిష్ఠలతో, లోకమునందు అందరిచేత పూజింపబడినవాడగును. వయస్సులో ఎంత పెద్దవాడైనప్పటికినీ విద్యావిహీనుడైన నరుడు ఎంతమాత్రము గౌరవింపబడడు. వయస్సులో ఎంత చిన్నవాడైననూ, గొప్ప విద్వాంసుడైనచో, అతడు తప్పక లోకమునందు అందరికి పూజనీయుడగును. సోదరులులేనివారికి విద్యయే సోదరుడగును. విద్యయే నిజమైన భ్రాత, బంధువు

---

1. **ఆహార నిద్రా భయ మైథునం చ సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్ । జ్ఞానం హి తేషామధికో విశేషో జ్ఞానేన హీనాః పశుభిస్సమానః ॥**
అనగా - ఆహారం, నిద్ర, భయం, మైథునం అనే ఈ నాలుగు సమస్త ప్రాణులయొక్క సామాన్య ధర్మాలు. ఇవి పశువులకు, మనుషులకు సమానములే! కాని, ఒక విశేషమేమనగా, మానవులకు ఉన్నది, పశువులకు లేనిది జ్ఞానం ఒక్కటే. అట్టి జ్ఞానము కూడా లేనివాడు పశువుతో సమానము.

కూడా అని గమనించుము. విద్యవలన మనిషి అన్ని విధములుగా వందనీయుడగును. విద్వాంసుడు పరదేశమునకు వెళ్ళినా, తన దేశములో ఉన్ననూ అతడిని అందరూ గౌరవించెదరు. పూజించెదరు. అతనికి పరదేశము కూడా స్వదేశమే యగును. ఇది నిశ్చయము[1]. అపారమైన విద్య గలిగినవాడే నిజమైన జ్ఞానవంతుడగును. అచ్చమైన విద్య గలవాడే వినయవంతుడగును. అట్టివాని దేహమునందు ఈశ్వరవిభూతి దేదీప్యమానమై వెలుగొందుచుండును. అతడందరిచేత గౌరవింపబడుచుండును. రాజ్యాధిపతికి కూడా అందరూ వందనము చేసెదరు. అట్టి రాజు కూడా విద్యావంతునకు వందనము చేసి గౌరవించును. ధనహీనునకు విద్యయే ధనము. విద్యాధనమును మించిన ధనము వేరొకటి లేదు[2]. అందువలన విద్యను తప్పక అభ్యసింపవలెను అని ఈ రీతిగా విద్య లేని నీ జన్మము ఎందుకని అందరు నిందింపసాగిరి". బ్రాహ్మణుల, బంధువుల మాటలను విని ఆ బాలబ్రహ్మచారి వారందరికి చేతులెత్తి నమస్కరించి ఇట్లనుచుండెను- (16-33□)

"అయ్యలారా! విద్యాభ్యాసము చేయుమని నాకు మీరు చక్కని జ్ఞానబోధ చేసితిరి. కాని, నేను గతజన్మలో విద్యాదానము చేసియుండక పోవచ్చును. తద్వారా, అందుకే నాకు విద్య అబ్బుటలేదు. అందుకు నేనేమి చేయుదును. నేను మీ ముందు దోషినైతిని. నేను మహాపాపిని. నాకు కూడా చదువుకొనవలయునని కోరిక కలదు. కాని, ఎంత చదివిననూ అది జ్ఞప్తికి వుండటములేదు. అందువలన మీరందరూ నన్ను కృపతో ఉద్ధరించగలరు. ఒకవేళ అందుకు తగిన ఏదేని ఉపాయమున్నచో, దయచేసి అది నాకు సెలవీయగలరు" అని వాడు వేడుకొనెను. ఆ బ్రాహ్మణులందరు హేళనగా నవ్వుచూ, "ఓరీ! పశువా! నీకు ఈ జన్మలో విద్య ఎట్లు అబ్బగలదు. ఓరీ! మూర్ఖుడా! కులనాశకుడా! బిచ్చమెత్తుకొని కడుపు నింపుకో పో! పొమ్మని దూషించిరి". వారందరు నీచమైన శబ్దజాలముతో నానావిధములుగా ఆ బాలుని దూషించిరి. తిరస్కరించిరి. వారి మాటలు వినుటచే తత్క్షణమే అతనిలో వైరాగ్యభావము కలిగెను. వెంటనే అతడాగ్రామమును వదలిపెట్టి అరణ్యమునకు

---

1. స్వగృహే పూజ్యతే మూర్ఖః, స్వగ్రామే పూజ్యతే ప్రభుః । స్వదేశే పూజ్యతే రాజా, విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥
అనగా - మూర్ఖుడు తన ఇంటియందే గౌరవింపబడును. ప్రభువు (గ్రామపెద్ద) తన గ్రామంలోనే ఆదరింపబడును. రాజు తన రాజ్యము నందే పూజింపబడును. విద్వాంసుడు మాత్రము అంతటా, ప్రపంచమంతట పూజింపబడును.

2. న చోరహార్యం, న చ రాజహార్యం, న భ్రాతృభాజ్యం, న చ భారకారి । వ్యయే కృతే వర్ధత యేవ నిత్యం, విద్యాధనం సర్వధన ప్రధానమ్ ॥
అన్ని ధనములకన్న విద్యాధనమే చాల ముఖ్యమైనది, గొప్పనైనది. ఎందుకంటే - విద్యాధనమును దొంగలు దోచుకొనలేరు. రాజులకుగానీ, ప్రభుత్వమునకుగానీ పన్నులు విధించుట కుదరదు. అన్నదమ్ములు పంచుకోలేరు. అది మోయడానికి బరువైనది కానేకాదు. మరొక విశేషం యేమిటంటే - ఇతర ధనములను ఖర్చుపెడితే అవి తరిగిపోతాయి. కాని, వాటికి విరుద్ధంగా విద్యాధనమును ఖర్చుపెట్టిన కొద్ది వృద్ధి పొందుతుంది. కావున, అన్ని ధనములకన్న విద్యాధనమే మిన్న.

వెళ్ళుటకై నిశ్చయించుకొని బయలుదేరెను. మనస్సు దుఃఖాక్రాంతమై లోలోన ఇట్లు చింతించుచూ దుఃఖింపసాగెను. 'అయ్యో! అందరూ నన్ను దూషించుచుండిరి కదా! నేను మందమతినైతిని. నాకింతటి మందబుద్ధిని ఈశ్వరుడు ఎందుకు ప్రసాదించెనో కదా! ఇక నేను జీవించి ప్రయోజనమేమిటి? ఈ ప్రాణములను వదలిపెట్టి మరణించుటయే నాకు దిక్కు ఇక ఏ ప్రయత్నము చేసినను అవన్నియూ వ్యర్థమే యగును' అని దృఢముగా నిశ్చయించుకొనెను. ఇంకనూ 'విద్యావిహీనుడను అగుటవలన నేను పశుప్రాయుడనైతిని. పైగా, నేను బ్రతికియుండి ప్రయోజనమేమిటి?' అని అనేకవిధములుగా దారిలో తలపోయుచూ నడక సాగించుచుండెను. ఇట్టి ఆలోచనలతో గ్రామగ్రామమును తిరుగుచూ దైవవశమున శ్రీ నరసింహ సరస్వతి గురుదేవులు నివసించుచున్న భువనేశ్వరీ క్షేత్రమైన భిల్లవటి గ్రామమునకు చేరుకొనెను. ఆహారపానీయములు తీసికొనకుండా ఉదయమునుండి ఉపవాసముతోనే ఉండి నాటి సాయంత్రమునకు అదృష్టవశాత్తుగా అతడు అమ్మవారి సన్నిధికి చేరుకొనెను. అచట భువనేశ్వరీ జగన్మాత అత్యంత మహిమాన్వితమై, నిత్యసన్నిహితయై విరాజిల్లుచుండెను. వెంటనే దైవసన్నిధిలోనికి ప్రవేశించి ఆ భువనేశ్వరిదేవిని దర్శించెను. అమ్మవారిని దర్శించిన ఆతని హృదయము ఒక్కసారిగా బాధతో ద్రవించిపోయి దుఃఖముతో పెల్లుబుకెను. విద్యలేని నా జన్మము ఎందులకు? అమ్మా! జగన్మాతా! నన్ను కరుణించుము" అని మిగుల దుఃఖించుచూ స్నానసంధ్యలు చేయకుండా, అన్నపానాదులను ముట్టకుండా మూడు దివసములు అహోరాత్రములు అమ్మవారి దేవాలయ ద్వారమునకు ఎదురుగా ప్రాయోపవేశమునకై కూర్చొనియుండెను. మూడు దినములు గడచిననూ, కఠోర నిశ్చయముతో కూర్చుండిపోయిననూ, దేవి సాక్షాత్కరించి తనకు విద్యాప్రదానము చేయనందున మిక్కిలి దుఃఖించి, అమ్మా! నీవు ఎదురుగా సాక్షాత్కరించకపోయిననూ, స్వప్నములోనైనా కనుపించవచ్చును కదా! నా యెడల నీవు ప్రసన్నురాలవు కాలేవా? నా జన్మము ఇంతగా వ్యర్థమైనదా? నేను నీ కరుణతో జన్మించినవాడను కానా? అయ్యో! నా జీవితము ఎందుకు ఇంతటి నింద్యమైనది. ఇది నశించిపోవుగాక!" అని ఆ తల్లిముందు దుఃఖించుచూ తీవ్రమైన బాధకు లోనయ్యెను. ఇంతలో ఒక్కసారిగా లేచి నిలబడి, "అంబా! భవానీ! నన్నెందుకు ఉపేక్షించుచుంటివి" అని గట్టిగా ఆక్రోశించి, తీక్షమైన శస్త్రమును తీసికొని తన నాలుకను ఛేదించి, అమ్మవారి చరణాబ్జములయందు సమర్పించెను. నాలుకను అమ్మవారి పాదములముందు సమర్పించినప్పటికినీ ఆమె ప్రసన్నురాలు కానందుకు తీవ్రముగ ఆగ్రహించి రెండు **చేతులెత్తి వినయముతో తల్లివైపు చూచెను.** "మాతా! భువనేశ్వరీదేవి! ఒకవేళ నీవు ఇదేవిధముగ నన్ను ఉపేక్షించినచో, రేపు ఉదయమున నా శిరస్సును ఛేదించి, నీ చరణములముందు సమర్పించెదను. నీలోనే నేను

లయమొందెదను" అని కృతనిశ్చయముతో అమ్మవారిముందు మొరపెట్టుకొనెను. విశ్వపాలినియైన, సర్వజ్ఞురాలైన ఆ జగన్మాత దయాపయోనిధి కదా! లోకమునంతటినీ దయతో పాలించు ఆ తల్లి తన బిడ్డ మనసారా దుఃఖించునపుడు పరుగెత్తుకొని రాకుండ ఉండునా? అటులనే ఆ రాత్రి అతనికి స్వప్నమునందు అమ్మవారు గోచరించి, "ఓరీ! బాలబ్రహ్మచారీ! వినుము. నేనొకమాట చెప్పెదను. నాపై ఏల కోపగించెదవు. నన్నెందులకు బాధించెదవు. కృష్ణానదికి పశ్చిమతీరమున, మేడిచెట్టు క్రింద ఒక మహానుభావుడు కూర్చొనియున్నాడు. ఆతని వద్దకు వెళ్ళి శరణుపొందుము. ఆయన సాక్షాత్తు ఈశ్వరావతారమే అని విశ్వసించుము. ఆ మహానుభావుడు నీ కోరికను నిశ్చయముగ నెరవేర్చును. వారి దర్శనమువల్లనే నీ మనోవాంఛ సిద్ధించగలదు" అని చెప్పగా వాడు మేల్కొనెను. వెంటనే బయలుదేరి జగన్మాత చెప్పినట్లుగా శ్రీగురుమూర్తి దర్శనార్థమై వెళ్ళెను. మిగుల హర్షముతో ఆ బాలబ్రహ్మచారి కృష్ణాప్రవాహమును ఈదుతూ అత్యంత శీఘ్రముగ ఆవలితీరమునకు చేరుకొని, ఔదుంబర వృక్షముక్రింద సాక్షాత్తు పరమేశ్వరునివలె దేదీప్యమానముగా ప్రకాశించుచున్న శ్రీగురునాథుని తిలకించెను. (34-53)

వెంటనే వెళ్ళి వారి చరణాబ్జములపై తన శిరము నుంచి గట్టిగా రెండు చేతులతో **వారి పాదములను పట్టుకొని వారిని స్తుతించచూ, భోరున విలపించెను–**

"ఓ మహానుభావా! తాము సాక్షాత్తూ పరమేశ్వరావతారమే కానీ, మానవమాత్రులు కాదు సుమా! నేను మీ శరణుజొచ్చితిని. భువనేశ్వరీమాత ఆనతిచ్చినది. కాదనకుండా కరుణించి నన్ను రక్షించుము. నా మనోభీష్టమును పూర్తి చేయుము స్వామీ" అని దీనముగా, వినయభావముతో శ్రీ గురునాథుని ప్రార్థించెను. కరుణాసముద్రులైన శ్రీగురుమూర్తి లోలోన సంతసించి, వాడిని దగ్గరకు పిలిచి, అతనికి ధైర్యమును చెప్పుచూ, ప్రసన్నహృదయులై తన దివ్యమైన హస్తమును ఆతని మస్తకముపై పెట్టగానే, అతనికి నాలుక ఎప్పటివలె వచ్చెను. వాడు జ్ఞానసంపత్తి కలిగినవాడయ్యెను. వేదశాస్త్ర పురాణములు, తర్కమీమాంస భాష్యవ్యాకరణాదులు సమస్తము ఆతని బుద్ధిలో ఒక జ్యోతివలె పరిపూర్ణముగ ప్రకాశించెను. అతడు సర్వవిద్యాపారంగతుడయ్యెను. మానససరోవరమునకు వెళ్ళి స్నానము చేసిన కాకి రాజహంసలా మారినట్లుగా ఆ బ్రాహ్మణ బాలకుడు శ్రీగురుమూర్తి హస్తమస్తకసంయోగముచే గొప్ప జ్ఞానవంతునిగా మారెను. చింతామణి స్పర్శవలన లోహము సువర్ణముగా ఎట్లు మారునో, జంబూనదిలో పడిన మట్టిపెడ్డ బంగారముగ ఎట్లు అగునో, అట్లే శ్రీగురుశ్రీచరణసరోజముల సంస్పర్శచేత వాడు సర్వజ్ఞుడయ్యెను. (54-59)

అంతట సిద్ధుడిట్లనెను – నామధారకా! శ్రీగురుమహిమ అనంతమైనది. వారు ఏయే స్థానములయందు నివసించెదరో, ఆయా స్థానములయందు వారి మహిమ అటులనే మరింతగా విజృంభించెను. అట్టి గురుమూర్తియొక్క మహిమను తెలియుటకు ఎవరికి సాధ్యము? వారు నివసించిన ప్రదేశముల మహిమను ప్రమాణీకరించి చెప్పుటకు ఎవరి తరమగునో, అది కేవలము ఆ గురుమూర్తికే తెలియును" అని నామధారకునితో సిద్ధముని చెప్పిన విధమును, గంగాధరనందనుడైన సరస్వతి శ్రవణము చేయుటకు మనోహరమైన శ్రీగురుచరిత్రమును సకలజనులు తరించు నిమిత్తముగ ప్రకాశింపజేసెను. అంతేగాక, దీనిని శ్రద్ధగా పఠించువారు, వినువారు తప్పక సకలమనోభీష్టములను పొందగలరనియు, మహామహిమాన్వితమైన శ్రీగురుచరిత్రమును విశదముగా లోకమునకు అందించెను. (60–61)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము **నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున** జ్ఞానకాండమునందు **"భిల్లవటీ స్థాన మహిమాను వర్ణనము – మందమతి బ్రాహ్మణ వరప్రదానము" అను పదిహేడవ అధ్యాయము ॥ 17 ॥**

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 61; మొత్తము సంఖ్య : 2001 + 61 = 2062 ఓవీలు)

◆ ◆ ◆

దత్తాత్రేయ హరేకృష్ణ, ఉన్మత్తానందదాయక ।
దిగంబరమునే బాల, పిశాచ జ్ఞానసాగర ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

శ్రీ గురు చరిత్ర

పద్దెనిమిదవ అధ్యాయము

అమరపురము - నరసింహవాడిస్థాన మహిమ - కృష్ణాతీరమునగల అమరేశ్వర క్షేత్రము మరియు అచటి తీర్థముల మాహాత్మ్యమును వర్ణించుట - ఒక బ్రాహ్మణుని దారిద్ర్యబాధను హరించివేయుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

"శ్రీ సిద్ధమునీశ్వరా! మీకు జయము. జయము. మీరు దయతో నన్ను సంసారసముద్రము నుండి తరింపచేయుచుంటిరి. మీరు వినిపించెడు సుధారసపరిపూర్ణమైన కథవలన నా కర్ణపుటములకు తృప్తి కలుగుటలేదు. కామధేనువు వంటి గురుచరిత్రమును ఎంత విన్నప్పటికినీ నాకు తనివి తీరుటలేదు. మరింతగా శ్రీగురుకథామృతమును తృప్తిగా పానము చేయవలయునను పేరాశ పెరుగుచున్నది. నా మనసంతా శ్రీగురుచరణముల పైననే స్థిరమై యుండెను. అయిననూ తృప్తి కలుగుటలేదు. స్వామీ! సంజీవిని వంటి కథామృతమును నా కర్ణపుటములకు తృప్తిదీర వివరింపగలరని" నామధారకుడు అత్యంత భక్తిప్రపత్తులతో సిద్ధముని చరణములపై శిరమునుంచి వినయపూర్వకముగ యాచించెను. **శిష్యుని మాటలకు తన్మయత్వమునొందిన సిద్ధమునీశ్వరుడు ఇట్లు చెప్పసాగెను** - "శిష్యశిఖామణీ! నామధారకా! నీవు ధన్యుడవు. నీ వాక్కు ధన్యము. నీ భక్తి శ్రీగురుచరణాబ్జములపై భ్రమరమువలె తల్లీనమైయుండెను. నీ మూలమున నేను మరింత ఉత్సాహముతో కూడిన స్ఫూర్తిని పొందుచున్నాను. నీ వలన గురుచరిత్రమును ఆద్యంతములుగా జ్ఞప్తికి తెచ్చుకొని తిరిగి నీకు చెప్పగలిగే భాగ్యము నాకు లభించినది కదా! సాటిలేని భిల్లవటి స్థానమహిమను ఇంతకుముందే నిరూపించితిని. ఇక ముందు రాబోవు కథ అత్యుత్తమమైనది. దానిని వివరించి చెప్పెదను. స్థిరమనస్కుడవై శ్రద్ధగా వినవలయును" అని సిద్ధముని చెప్పసాగెను (1-8) -

కొంతకాలము భిల్లవటియందు ఔదుంబర వృక్ష సమీపమున శ్రీగురుమూర్తి గోప్యముగా ఉండినప్పటికినీ అప్పుడప్పుడు వారి మహిమ ప్రకటమగుచుండెను. కాలము గడచినకొలది తనయొక్క మహిమా ప్రభావము సర్వత్ర వ్యాపించుచుండుటచే స్థానమును మార్చవలయునని శ్రీగురుదేవులు తలంచిరి. ఆ తదుపరి తాను ప్రకటము కావలయునని ముందుకు బయలుదేరిరి. వరుణాసంగమంగా ప్రసిద్ధినొందిన దక్షిణ

వారాణసి అను ప్రదేశమును గాంచి, అచటి భక్తులను శ్రీగురుమూర్తి అనుగ్రహించెను. అనంతరము కృష్ణానదీ తీరమునగల తీర్థమును పునీతము చేయు నెపముతో పంచగంగా సంగమమునందు వారు పండ్రెండు సంవత్సరములు నివసించిరి. అప్పటినుండి ఈ క్షేత్రము 'నరసింహవాడి' యని పిలువబడుచున్నది. ఈ తీర్థము అవిముక్త పురమగు కాశీక్షేత్రము వలె సాటిలేనిదిగా, తీర్థరాజమగు ప్రయాగతో సమానమైనదిగా ప్రఖ్యాతి నొందినది. ఈ సంగమమునందుగల 'కురువపురము' అను గ్రామము కురుక్షేత్రము వంటి పుణ్యప్రదేశమే. ఇచటి పంచగంగా సంగమము మరింత మహిమాన్వితమైనది. కురుక్షేత్రమునందు లభించెడు పుణ్యముకంటే ఇచట అత్యధికమైన పుణ్యరాశి లభింపగలదు. ఇచటగల తీర్థముల సంఖ్య అగణ్యమని చెప్పవచ్చును. తత్కారణముననే శ్రీగురుమూర్తి ఈ ప్రదేశమును తనకు నివాసయోగ్యముగా యెంచుకొనెను. ఈ పంచగంగా నదీ తీరము పురాణప్రసిద్ధమైనది. దీని మహిమను గురించి అనేకపురాణముల యందు విస్తరించి చెప్పబడి యున్నది. ఇట్టి సంగమస్థానమునందు స్నానమొనర్చువారి సమస్త పాపములు తత్‌క్షణమే నశించిపోవుననుటలో ఎట్టి సందియము లేదు. అయితే, ఈ పంచగంగానదీ తీరమునందున్న నదులను గూర్చి నీకు పరిచయము చేసెదను **జాగ్రత్తగా వినుము.** (9-15)

"శివా, భద్రా, భోగవతీ, కుంభీ, సరస్వతీ" అనే ఐదు నదులే పంచగంగలుగా ప్రసిద్ధి నొందినవి. అవి మహామహాపాతకములను కూడా ధ్వంసము చేయును. ఆవిధముగ అత్యంత ప్రఖ్యాతి నొందిన పంచగంగలు ముందుకు వచ్చి కృష్ణవేణిలో కలిసెను. అది తీర్థరాజమగు ప్రయాగకంటే మహిమోపేతమైన సంగమస్థానము. అది అత్యంతమనోహరముగా వుండును. అక్కడనే అమరపురమనే గ్రామము కలదు. అచట ఒక ఔదుంబర వృక్షము కలదు. అది సాక్షాత్తుగా కల్పతరువే సుమా! అక్కడి దైవము అమరేశ్వరుడే. దానినే 'షట్కూల సంగమము' అని కూడా అనెదరు. వారణాసి నగరమునందలి అత్యంత విశిష్టమైన గంగా - భాగీరథులతో సమానమైనది ఈ పంచనదీ సంగమము. అక్కడి అమరేశ్వరుని సన్నిధిలో (64) అరవై నాలుగు మంది యోగినులు కలరు. అందుచే అది నిర్గుణరూపమునగల శక్తి పీఠముగా ప్రసిద్ధి నొందుటయేగాక, అత్యంత లోకపావనమైన క్షేత్రముగా విరాజిల్లుచుండెను. మిక్కిలి విశిష్టమైన అమరేశ్వరలింగమునకు సహజముగనే వందనము చేసి పూజించిన చాలును. అట్టి మానవులు తప్పక అమరులయ్యెదరు. ఆయన విశ్వనాథుడు. తీర్థరాజమగు ప్రయాగయందు మాఘస్నానము చేసినచో, ఎంతటి పుణ్యము లభించునో, అంతకంటే వందరెట్లు ఎక్కువ పుణ్యరాశి ఈ పంచగంగా సంగమమునందు స్నానము చేయుటవలన లభించితీరును. నదీ సంగమస్థానమునందు సహజముగా అమరేశ్వర పరబ్రహ్మ నివసించెదరని, ఇది ప్రయాగతో సమానమైనదని ఖ్యాతినొందెను. అందువలన ఆ స్థానములయందు కోటి తీర్థములు నిర్గుణరూపములో ఉండును. అచట కృష్ణానది,

వేణీనదితో కలిసి నిరంతరము దక్షిణవైపుగా ప్రవహించును. ఆ ప్రదేశమునందు అపరిమితమైన తీర్థములు గలవని పురాణములు విస్తృతముగా వర్ణించినవి. ఈ కృష్ణా తటాకమునందు అష్టతీర్థములు జాగృతమై యున్నవనే ఖ్యాతి గలదు. ఉత్తరదిక్కున గల కృష్ణ పశ్చిమవాహినియై ప్రవహించుచుండును. శుక్ల తీర్థము అనబడే ఈ తీర్థస్నానము వలన బ్రహ్మహత్యాది పాపములు దూరమగును. ఔదుంబరమునకు ఎదురుగా ఒక్కొక్కటి నాలుగేసి మూరల దూరములో మనోహరములైన మూడు తీర్థములు గలవు. అమరేశ్వర సన్నిధానమునందు పాపవినాశిని, కామ్యతీర్థము, వరదతీర్థము అనునవి ఈ భూమండలమునందు సాటిలేనివని తెలిసికొనుము. సంగమ-షట్కూలమునందు ఆ తర్వాత ఖ్యాతి చెందినవి ప్రయాగ తీర్థము, శక్తితీర్థము, అమర తీర్థము, కోటి తీర్థము అని గ్రహింపవలెను. (16-30)

అచటి తీర్థములను అన్నింటినీ లెక్కించి వివరముగా చెప్పినచో ఒక గొప్ప గ్రంథమే కాగలదు. అటువంటి దివ్య క్షేత్రము అగుటచే శ్రీపాదగురువులు(1) అచట పంద్రెండు సంవత్సరములు నివసించిరి. కృష్ణా, వేణీ అను రెండు నదులు, వాటితోపాటు ఇంతకుముందు చెప్పబడిన పంచగంగలు కలిసి సప్తనదులు కలియుటచే ఆ క్షేత్రము 'సప్తగంగా సంగమము'గా ప్రసిద్ధమయ్యెను. అట్టి సంగమము యొక్క మహిమ మాటలతో చెప్పనలవికానిది. అచట ఒక్క పర్యాయము చేసిన స్నానము వలన బ్రహ్మహత్యాది మహాపాతకములు దగ్ధమైపోవును. అదొక సిద్ధస్థానముగా చెప్పబడినది. ఆ క్షేత్ర సందర్శనము వలన సమస్త అభీష్టములు నెరవేరును. ఆ క్షేత్రముతో మరియు అచటి సంగమస్థాన మహిమతో పోల్చదగినది మరొకటి లేనేలేదు అనేది నిర్వివాదాంశము. దర్శనమాత్రముచేతనే సకలమనోరథములు ఈడేరినపుడు ఇక స్నానఫలమును గురించి చెప్పవలసిన పనేమిటి? అచటగల ఔదుంబర వృక్షము సాక్షాత్తుగా కల్పతరువే. శ్రీగురుమూర్తి ఆ ప్రదేశమునందు గుప్తముగా ఉండిపోయిరి. భక్తజనులను తరింపచేయుటకొరకే శ్రీగురునాథుడు ఆ తీర్థమునందు ప్రకటమై దాని మహిమను జగద్విదితము గావించెను.(31-36)

ఇట్లుండగా శ్రీస్వామివారు ప్రాతఃకాలమున సంగమస్థానమునందలి ఔదుంబర వృక్షసమీపమున అనుష్ఠానమొనర్చి మధ్యాహ్న కాలమున ప్రతినిత్యము అమరపురమునకు భిక్షార్థమై వెళ్ళుచుండెను. ఆ గ్రామమునందు వేదాధ్యయనము చేసిన ఒక సద్బ్రాహ్మణుడుండెను. అతని భార్య పతిసేవాపరాయణయగు మహా సాధ్వి. అయితే, ఆ బ్రాహ్మణుడు మిక్కిలి పేదవాడు. అతడు ఉంఛవృత్తిచే జీవించుచుండెను. అది కూడా అపక్వభిక్షను యాచించి, కుటుంబ పోషణ చేసెడివాడు. ఆ ద్రవ్యముతోడనే పంచమహాయజ్ఞములను నిర్వహించువాడు. అత్యంత సాత్త్వికవృత్తితో

---

1. శ్రీపాదశ్రీవల్లభుల అనంతర అవతారమే శ్రీనరసింహసరస్వతీ స్వామివారు. కావున, శ్రీనృసింహ సరస్వతిగారినే “శ్రీపాదులు” అని, “శ్రీపాదగురువులు” అని పలుచోట్ల ప్రస్తావింపబడినదని గమనింపవలెను.

వైదిక కర్మమార్గమును అనుష్ఠింపుచూ అతిథులను ప్రేమతో సత్కరించుచూ, కాలము గడుపుచుండెను. అయితే ఆ బ్రాహ్మణుని ఇంటి పెరటియందు ఒక పెద్ద సొరకాయ తీగ పాదు ఉండెను. దానికి అనేక కాయలు కాయుచుండును. ఏనాడైనా ఆ బ్రాహ్మణునకు గ్రామమునందు భిక్ష లభించనిచో, ఆనాడు సంతోషముతో సొరకాయను తెంపి పక్వము చేసి, ఆ శాకమునే భుజించి తృప్తి చెందుచుండెడివాడు. అయితే, శ్రీగురుమూర్తి ఆ విప్రుని ఇంటికి భిక్షకై వెళ్లినపుడు వారు సొరకాయ శాకముతో భిక్ష చేయుచుండిరి. ఒకనాడు శ్రీగురుడు ఇంటిముందు భిక్షకై రాగా ఆ బ్రాహ్మణ దంపతులు స్వామివారికి ఎదురేగి అత్యంత భక్తిభావముతో వినయముగ ప్రార్థించి వారిని గృహములోనికి ఆహ్వానించిరి. వారి భక్తికి మెచ్చిన శ్రీగురునాథుడు ఇంటిలోనికి వెళ్లెను. ఉచితాసనమును సిద్ధపరచి, శ్రీ నరసింహ సరస్వతీ స్వామివారిని కూర్చుండజేసి ఆ దంపతులిరువురూ స్వామివారికి షోడశోపచారవిధముగా పూజించిరి. తదుపరి సొరకాయలతో చేసిన శాకమునే వారికి ఆహారముగా వడ్డించిరి. బ్రాహ్మణుని ఇంట భిక్ష చేసిన శ్రీగురుమూర్తి వారి అనన్యమైన భక్తికి, **వారి ప్రేమకు మిక్కిలి సంతోషించి వారిని ఆశీర్వదించుచూ పలికెను**– "ఇక మీ దారిద్ర్యబాధ తొలగిపోయినది. నాయనా! ఇకమీదట మీకు దరిద్రబాధ ఉండదు" అని వరదహస్తమును చూపించి బ్రాహ్మణుని పెరటినిండా పాకి ఆవరించిన అనేక కాయలతో నిండియున్న ఆ సొరచెట్టు మొదలు వద్దకు వెళ్ళి రెండు చేతులతో గట్టిగా దానిని పెళ్లగించి, పీకి పక్కన పడవేసి, వారు తమ సంగమ స్థలమునకు వెళ్ళిపోయిరి. అది చూచిన ఆ బ్రాహ్మణుని భార్య, ఆమె పుత్రులు "అయ్యో! హతవిధీ! మన ప్రారబ్ధము ఎంత బలీయమైనదో కదా!" అని బిగ్గరగా దుఃఖించుచుండిరి. మనకు నిత్యము ఆహారమును అందించుచున్న ఈ సొరకాయ తీగను సమూలముగ పెళ్లగించి పక్కన పడేసి పోయిరి కదా! ఈ యతీశ్వరునకు మనమేమి అపకారమొనర్చితిమి. గ్రామమునందు భిక్ష దొరకనిరోజున ఈశ్వరుడు ప్రసాదించిన ఈ సొరకాయలను ఆహారముగా చేసుకొని కాలమును గడుపుచున్న మనయందు కనికరించకుండా ఈ సన్న్యాసి వచ్చి, ఉన్న తీగపాదును పీకి పారవేసెను కదా! అయ్యో! మనది ఎంతటి దుష్టప్రారబ్ధమో కదా" అని ఆ బ్రాహ్మణ స్త్రీ అనేకవిధములుగా రోదింపసాగెను. ఆమె భర్త – "ఇది దుఃఖించవలసిన సమయము కాదు. ఇది మనం అనుభవించవలసిన బలీయమైన ప్రారబ్ధమే కాని, ఇందులో ఆ యతీశ్వరుని నిందించుటచే మరింతగా మనము దోషభాక్కులము అయ్యెదము" అని మందలించెను. (37–50)

మిక్కిలి విలపించుచున్న తన భార్యను చూచి **ఆమె భర్త ఆమెతో ఇట్లనెను** – "వ్యర్థముగా ఎందుకు ఏడ్చెదవు. ఎప్పుడు ఏది ఎట్లు జరిగిననూ అదంతయూ చంద్రమౌళీశ్వరుని కర్తృత్వమే. ఈ విశ్వమంతయునూ ఆయన అధీనమునందే యుండును. విశ్వవ్యాపకుడైన నారాయణుడు ఉత్పత్తి స్థితి లయములకు కారణభూతుడు. పిపీలికాది బ్రహ్మపర్యంతమూ జీవులందరికీ ఆయనయే ఆహారమును ప్రసాదించును. **"ఆయురన్నం ప్రయచ్ఛతి"** అని శ్రుతివాక్యము. సింహానికి, ఏనుగునకు ఆహారమును ఎవరు ఇచ్చుచుండిరి? (84) ఎనభై నాలుగు లక్షల

యోనుల జీవసముదాయమునందలి స్థూలమైన, సూక్ష్మమైన అనేక ప్రాణులను పరమేశ్వరుడు సృష్టించెను. అయితే, వాటికి ముందు ఆహారమును సృష్టించిన పిదపనే ఈ జీవులను సృష్టించునని గుర్తించుము. రాజును, పేదలను సమదృష్టితో సృష్టించి, సకలసృష్టిని పోషించుచుండును. మన పూర్వజన్మార్జిత మంచిచెడుల కర్మను అనుసరించి ప్రారబ్ధవశమున మనకు ఫలము లభించుచుండును. పూర్వజన్మమున ఎవరు ఏమి చేసిరో, వారు ఈ జన్మమున అట్టి కర్మఫలమును అనుభవించి తీరవలసినదే. పూర్వజన్మార్జితము అయిన పుణ్యపాపరాశిని మనకు మనమే అనుభవించవలెను కాని, అందులో ఇతరులను దూషించుట వలన తిరిగి పాపమును మూటగట్టుకొనుటయే యగును. మన ప్రారబ్ధములో ఈవిధముగా ఉండియున్నది. కావున, ఇతరులను నిందించుట మూర్ఖత్వమే యగును. ఏ విత్తనము నాటెదమో, దాని ఫలమునే భక్షించవలెను. దానికి మరొకరిని నిందించి ప్రయోజనమేమి? మన పూర్వసంచిత కర్మను గూర్చి ఆలోచించకుండా ఆ యతీశ్వరుని దూషించుచుంటిమి కదా! ఆయన మన గ్రాసమును హరించినారని అనుట అవిద్యాసాగరమునందు మునకలు వేయుటయే. ఆ మహానుభావుడు లోకమును తరింపచేయుటకే అవతరించెను. అందుకే మన ఇంటికి భిక్షకై వచ్చిరి. తన వెంట మన దారిద్ర్యదోషములను తీసుకొని వెళ్ళిరి. ఆయన మన పరివారతారకుడు సుమా!" అని ఈవిధముగ ఆ బ్రాహ్మణుడు తన భార్యకుపదేశించి, ఓదార్చి ఆ గురుమూర్తి చేత పీకివేయబడిన తీగను సమూలముగ త్రవ్వి పారవేయుటకై ఒక గునపమును తెచ్చి దాని మూలమున త్రవ్వుచుండెను. అచట చుట్టూరా త్రవ్వి ఈ తీగ మూలముయొక్క వ్రేళ్ళను లాగి పెల్లగించినపుడు ధనముతో నిండిన ఒక బిందె అతనికి లభించెను. దానిని చూచి మహదానందభరితుడై వెంటనే ఆ బిందెను తీసుకొని ఇంటిలోనికి వెళ్ళి తన భార్యాపిల్లలకు చూపెను. అందరూ ఆనందభరితులైరి. "ఆహా! ఎంతటి విచిత్రము జరిగెను. ఆ యతీశ్వరుడు మనపట్ల ప్రసన్నులైరి. అందుకే వారు ఆ చెట్టును పీకివేసిరి. తద్వారా మనకు నిధి దొరికెను. వారు మామూలు యతీశ్వరులు కారు. కేవలము ఈశ్వరుని అవతారమే. మన దైన్యమును హరించుటకే మన ఇంటికి ఏతెంచిరి. కావున, వెంటనే వెళ్ళి వారిని దర్శించుకొని వారి అనుగ్రహమును పొందుటకు ప్రార్థించవలెను" అని ఆ బ్రాహ్మణుడు తన భార్యతో చెప్పెను. దొరికిన బిందెతోపాటు సంగమ స్థలమునకు వెళ్ళిరి. మిగుల హర్షముతో ఔదుంబర వృక్ష సమీపమున కూర్చొనియున్న ఆ గురునాథుని దర్శించి, భక్తిభావముతో సాష్టాంగవందనములాచరించి దొరికిన లంకె బిందెను వారి పాదములముందు నిలిపి జరిగిన వృత్తాంతమును చెప్పిరి. **వెంటనే శ్రీగురుడు ఆతనితో ఇట్లనెను-** "నాయనా! ఈ విషయమును ఎవరితోడను చెప్పవద్దు. దీనిని గుప్తముగా నీ వద్దనే ఉంచుకొనుము. మేము ఈ పని చేసితిమని నీవు ప్రకటించినచో నీ ఇంటికి వచ్చిన లక్ష్మి వెళ్ళిపోవును. ఇప్పటినుండి మీ వంశమునందు తరతరములుగా అఖండలక్ష్మి తాండవించును. నీవు పుత్రపౌత్రులతో విలసిల్లెదవు" అని వరప్రదానమొసగి ఆశీర్వదించెను. (51-68)

శ్రీస్వామివారి ద్వారా సమస్త మనోరథములను పరిపూర్తిగా పొందిన ఆ బ్రాహ్మణుడు, అతని భార్య కలిసి మహదానందభరితులై తమ ఇంటికి తిరిగి వెళ్ళిరి. శ్రీగురుకృపాప్రభావము ఈవిధముగ ఉండునని మనము గ్రహించవలెను. దర్శనమాత్రముతోనే ఆ మహానుభావుడు దైన్యమును హరించివేయును. శ్రీగురుకృపను ఎవరు పొందెదరో వారికి పాపము, దైన్యము, దరిదాపులలో ఎట్లుండగలవు. కల్పవృక్షమును ఆశ్రయించిన వారి ఇంటిలో దారిద్ర్యము ఎట్లుండును? దురదృష్టవంతులు శ్రీగురు చరణములను పరిపూర్ణమైన విశ్వాసముతో ఆశ్రయించిన యెడల వారు తప్పక ఆవలితీరమునకు చేర్చబడుదురు. ఎంతటి దురదృష్టవంతులైననూ సరే, ఒకవేళ గురుకృపకు పాత్రులైనచో, అనంతరము వారు కూడా అంతటి పూజనీయులయ్యెదరు. ఎవరు గురువును భక్తిప్రపత్తులతో భజింతురో, వారికి ఇహపరములు రెండునూ లభించును. వారి గృహమునందు అఖండ లక్ష్మి తాండవించును. వారు అష్టైశ్వర్యములతో తులతూగెదరు. కావున, శ్రీగురుమహిమా ప్రభావమును మనస్ఫూర్తిగా గ్రహించి, వారిని త్రికరణశుద్ధిగా పూజించవలెను. తత్ఫలితంగా మీమీ గృహములయందు సాక్షాత్తుగా కామధేనువే కొలువుదీరియుండునని సిద్ధముని, నామధారకునితో చెప్పెను. తదనుసారముగా విస్తరించి చెప్పుచున్న శ్రీగురుకథామృతసారమును శ్రోతలందరు ఏకాగ్రచిత్తమును వహించి వినెదరుగాక! యని గంగాధరుని కుమారుడగు సరస్వతి విన్నవించుచుండెను. (69-73)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
జ్ఞానకాండమునందు "అమరపుర మహిమ - ద్విజ దైన్యహరణము" అను పదునెనిమిదవ అధ్యాయము ॥ (18)

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 73; మొత్తము సంఖ్య : 2062 + 73 = 2135 ఓవీలు)

-::: (సప్తాహపారాయణ క్రమము (2) రెండవరోజు విరామము) :::-

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

॥సర్వం శ్రీ శ్రీపాద శ్రీవల్లభ - శ్రీ నృసింహ సరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

॥ హరయే నమః ॥

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

పంతొమ్మిదవ అధ్యాయము

ఔదుంబర వృక్ష మాహాత్మ్యము - నిత్యము యోగినీ దేవతలు వచ్చి శ్రీగురుమూర్తిని సేవించుట - వారికి శ్రీగురుడు వరముల నొసంగుట - గురువును పరీక్షింపదలచినవారికి అధోగతి-అనన్యభక్తితో సేవించువారికి సద్గతి లభించునని నిరూపింపబడుట- ఒక నావికునకు త్రిస్థలిని దర్శింపజేయుట - శ్రీగురునాథుడు పంచగంగా సంగమ స్థలమునుండి గాణగాపురమునకు బయలుదేరుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ – శ్రీనృసింహసరస్వతీ – శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

ఉత్తమశిష్యుడైన నామధారకుడు సిద్ధముని చరణారవిందములకు సాష్టాంగ వందనమాచరించి, తిరిగి మోకాళ్లపై లేచి రెండు చేతులు జోడించెను. **పిమ్మట శిరస్సును వంచి వినయముతో సిద్ధమునీశ్వరుని ఇట్లు ప్రస్తుతించెను** – "సిద్ధయోగీశ్వరా! మీకు జయము. జయము. తమరు భక్తజనుల మనసులను దోచుకొనువారలు. వారిని ఘోరమైన భవసాగరము నుండి తరింపచేయగల సమర్థులు. మీరు అజ్ఞాన అంధకారమును నశింపచేయునట్టి జ్యోతిస్వరూపులు. స్వామీ! అజ్ఞానతిమిరమునందు మునిగి మదోన్మత్తుడనై గాఢనిద్రలో యున్న నన్ను కృపతో తట్టి లేపి నా బుద్ధిగుహలో జ్ఞానసూర్యుని ఉదయింపచేసితిరి. మీ అపారమైన కృపవల్లనే అజ్ఞానమోహమహానిద్రనుండి నేను జాగృతి నొందితిని. మీ దయవలన నా బుద్ధి సరియైనదిశలో ప్రచోదనము అగుచున్నది. మీరు నా యందు దయదలంచి దివ్యమైన గురుకథామృతమును ప్రాశనము చేయించుచుంటిరి. మీ వంటి దాతలు మరెచ్చటనూ లభించరు. గురుదేవా! శ్రీగురుమూర్తియొక్క అనంతరకథను విశదముగా నాకు శ్రవణము చేయించగలరని" నామధారకుడు వేడుకొనెను. **శిష్యుని మాటలను విని సిద్ధముని సంతోషాంతరంగుడై అనుపమానమైన శ్రీగురుమహిమను విస్తరించి చెప్పుటను ప్రారంభించెను–** "నామధారకా! గురుమహిమను చెప్పుచుంటిని. నీవు చిత్తశుద్ధితో వినవలయును. శ్రీగురుమూర్తి కడు ప్రీతితో కృష్ణానదీ తీరమున పంచగంగా సంగమస్థానమునందు ఔదుంబర వృక్షసమీపమున కొంతకాలము నివసించిరి" అని చెప్పగానే **నామధారకుడు అడ్డు తగిలి ఇట్లనెను–** "క్షమించుము, గురుదేవా! నాదొక సంశయము. లోకమునందు అనేక పుణ్యప్రదములైన

వృక్షములు కలవు కదా! అశ్వత్థ వృక్షము అన్ని వృక్షములకంటే ఎక్కువమహిమ గలదని వేదములు కూడా వర్ణించుచున్నవి కదా! అయితే గురుమూర్తి ఇట్టి వృక్షములను అన్నింటి వదలిపెట్టి ఔదుంబరము (మేడిచెట్టు) నందే ఇంతటి ప్రీతి కలిగియుండుటకు కారణమేమి? ఆ క్షేత్రమున మేడిచెట్టు మూలమునందే నివసించుటకు గల కారణమేమి? అట్టి ఔదుంబర వృక్షముయొక్క మాహాత్మ్యమును దయతో నాకు విస్తరించి చెప్పగలరని" ప్రార్థించెను. (1–9)

నామధారకుని ఉత్తమ ప్రశ్నను విని సిద్ధముని మిగుల ప్రీతినొంది, ఆ వృత్తాంతమును ఇట్లు చెప్పసాగెను – “నామధారకా! వినుము. ఔదుంబర వృక్షమాహాత్మ్యమును చెప్పుచున్నాను. పూర్వము హిరణ్యకశిపుని సంహరించుటకై స్వామి నరసింహావతారమును ధరించెను. అయితే అప్పుడు శ్రీనరసింహస్వామివారు అత్యంత ఉగ్రుడై, వాడియైన తన గోళ్ళతో ఆ హిరణ్యకశిపునియొక్క పొట్టను చీల్చి, ప్రేగులను బయటకు లాగి, వాటిని తన మెడలో మాలగా ధరించెను. ఆ హిరణ్యకశిపుని ఉదరమునందు కాలకూటమునకు మించిన బడబానలము వంటి విషము ఉండెను. దైత్యుని ప్రేవులను చీల్చినప్పుడు ఆ విషము ఆయన గోళ్ళకు అంటుకొని మిక్కిలి బాధ కలిగించెను. స్వామివారి వ్రేళ్లకు, గోళ్లకు ఎంతగానో తాపము కలుగుచుండెను. అప్పుడు మహాలక్ష్మి ఆ గోళ్లకు చల్లదనము కలిగించుటకై మిక్కిలి ప్రీతితో చక్కటి ఔదుంబర ఫలములను (మేడిపండ్లను) తెచ్చి, స్వామి యొక్క నఖములను ఆ పండ్లలో గ్రుచ్చెను. దానితో ఆ విషాగ్ని ఉపశమించెను. నరసింహా స్వామి తనయొక్క ఉగ్రరూపమును వదలి శాంతమూర్తియై లక్ష్మీదేవిని అత్యంత ప్రేమతో ఆలింగనము చేసుకొనెను. **అప్పుడు లక్ష్మీసమేతుడైన నృసింహస్వామి ప్రసన్నులై ఔదుంబర వృక్షమునకు ఇట్టి వరమును ప్రసాదించిరి– “ఓ వృక్షరాజమా! నేటినుండి మొదలు నీవు కల్పవృక్షముగా పరిగణింపబడెదవు. నీవు అన్ని కాలములయందు ఫలములను ప్రసాదించెదవు. మిగుల భక్తితో నిన్ను ఎవరు పూజించెదరో, వారికి చక్కని ఫలములు, సర్వకామ్యములు శీఘ్రముగా సిద్ధించగలవు. నిన్ను సేవించినచో, ఉగ్రమైన విషము నిర్విషము కాగలదు. నీ దర్శనమాత్రముననే సమస్త పాపములు సమసిపోవును.** నిన్ను సేవించిన మానవుల కోరికలన్నీ నెరవేరి, వారికి నిశ్చయమైన గొప్ప గొప్ప ఫలములు ప్రాప్తించును. వంధ్యత్వ దోషము గల స్త్రీలు నిన్ను పూజించి, ప్రదక్షిణములు ఒనర్చినచో, వారికి శీఘ్రముగ సంతానము కలుగును. దారిద్ర్యముతో పీడింపబడువారలు నిన్ను సేవించినచో, వారికి అష్టైశ్వర్యములు అచిరకాలమునందే సిద్ధింపగలవు. నీ నీడలో కూర్చొని ఎవరు జపతపాది అనుష్ఠానములు చేసెదరో, వారికి లభించెడి ఫలము అనంతముగా ఉండును. అంతేగాక, వారికి అంతులేని జ్ఞానము లభించును. వారు

సంకల్పించిన దాని ఫలితమును సత్వరమే పొందగలరు. నీ ఛాయయందు కూర్చొని జపానుష్ఠానము చేసినవారికి శీఘ్రముగ మంత్రసిద్ధి కలుగును. నిన్ను సేవించువారికి వ్యాధులెన్నడునూ ఉండజాలవు. నీ నీడలో స్నానము చేసినవారికి గంగాస్నానము చేసినంతటి పుణ్యఫలము లభించి తీరును. నిన్ను పూజించి, నీకు ప్రదక్షిణములనొనర్చు వారికి బ్రహ్మహత్యాది మహాదోషములు సైతము దుల్లిపోగలవు. ఏ కోరికను కలిగి ఎవరు ఎటువంటి భక్తిభావముతో నిన్ను సేవింతురో, అదేవిధముగ వారి కోరిక నీవు నెరవేర్చెదవు. ఈ కలియుగమునందు భువిలో వెలసిన నిజమైన కల్పతరువు నీవే సుమా! నేను లక్ష్మీసమేతుడనై ప్రసన్నవదనముతో నీ సమీపమునందే నిరంతరము నివసించెదను" అని అత్యంత హర్షముతో ఆ నరసింహమూర్తి ఔదుంబర వృక్షమునకు అనేక వరములను ప్రసాదించెను. (10-25)

నామధారకా! ఔదుంబర వృక్షము ఈ కలియుగమునందు కల్పవృక్షముతో సమానమని గ్రహించుము. నరసింహస్వామి యొక్క ఉగ్రత్వము దానివద్దనే ఉపశమించినది. అంతేగాక, శ్రీనృసింహసరస్వతి స్వామివారు నిరంతరము నరసింహ మంత్రానుష్ఠానమునే చేయుచుందురు. కావున, ఆ మంత్రము యొక్క ఉగ్రభావము శాంతింపగలందులకు వారు ఎల్లప్పుడు ఔదుంబర వృక్ష మూలముననే నివసించుచుండెదరు. అది మామూలు వృక్షమే అయినప్పటికినీ, విశేషించి శ్రీగురుదత్తాత్రేయులవారు దాని మూలమునందు నివసించిరి కనుక, అది కల్పవృక్షముతో సమానమైనది. అచటికి వెళ్ళినవారి కోర్కెలు తప్పక నెరవేరును. మరొక్క విశేషమేమన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను త్రిమూర్త్యాత్మక అవతార స్వరూపులైన శ్రీగురుమూర్తి మానవదేహమును ధరించి కల్పతరువైన ఔదుంబర మూలమున ఎల్లప్పటికీ నిలిచిపోయిరి. (26-30)

భక్తజనులను సముద్ధరించుటకొరకే, సమస్త తీర్థములను పవిత్రములుగావించుటకై త్రిమూర్తులే భువినుండి దివికి దిగివచ్చి, శ్రీ గురునాథులుగా ఈ పుణ్యపుడమిపై అవతరించి భక్తులపాలిట కొంగుబంగారమై ఔదుంబర వృక్షమూలమున కొలువుదీరియుండిరి. మేడిచెట్టు క్రింద శ్రీగురుడు దివారాత్రములు గుప్తముగా ఉండేవారు. అచట ప్రతిదినము సరిగ్గా మధ్యాహ్నపు వేళయందు మహోత్సవపు సందడి జరుగుచుండెడిది. ఆ క్షేత్రమున అమరేశ్వరుని సాన్నిధ్యమునందు చతుష్షష్టి యోగినీదేవతలు అనగా 64 మంది యోగినులు నివసించుచుండిరి.(1) ఆ యోగినులు గురుమూర్తియొక్క మహిమను తెలిసినవారు. కావున, నిత్యము మధ్యాహ్నపు వేళలో శ్రీగురుమూర్తిని

---

1. గజాననా, సింహముఖీ, గృధ్రాస్యా, కాకతుండికా । ఉష్ట్రగ్రీవా, హయగ్రీవా, వారాహీ, శరభాననా ॥
2. ఉలూకికా, శివారావా, మయూరీ, వికటాననా । అష్టవక్రా, కోటరాక్షీ, కుబ్జా, వికటలోచనా ॥
3. శుష్కోదరీ, లలజ్జిహ్వా, శ్వదంష్ట్రా, వానరాననా । ఋక్షాక్షీ, కేకరాక్షీ, చ బృహత్తుండా, సురాప్రియా ।

పూజించుటకై వారివద్దకు యేతెంచెడివారు. వారికి వినయభావముతో నమస్కరించి, ఆ యోగినీదేవతలందరూ కలిసి శ్రీవారిని తమ మందిరమునకు తీసికొనివెళ్ళి షోడశోపచారములతో విధివిధానముగా పూజలు సలిపెడివారు. ఆ పూజలో అద్భుతమైన పరిమళములను వెదజల్లెడు చిత్రవిచిత్రములైన పుష్పములతో, సువాసనభరితమైన శ్రీగంధముతో శ్రీవారిని కడు భక్తిభావముతో పూజించెడివారు. పూజానంతరము వారికి చక్కని భిక్షను అందించెడివారు. ఆ యోగినీదేవతల హస్తములచేత అందించిన భిక్షను గైకొని, దానిని భుజించిన అనంతరము వారందరూ కలిసి, స్తోత్రపాఠమును పఠింపుచూ శ్రీగురుదేవులను తిరిగి ఔదుంబర వృక్షము వద్దకు చేర్చి వెళ్ళిపోయెడివారు.(31-34□)

అయితే, ఒకనాడు ఆ గ్రామమునకు చెందిన ఒక ద్విజోత్తముడు ఈ అద్భుతమైన దృశ్యమును చూసి అత్యంత విస్మయమునకు లోనయ్యెను. ఈ యతీశ్వరుడు అతి విచిత్రముగా కన్పట్టుచున్నాడు. ఈయన ఎప్పుడూ గ్రామమునందు భిక్ష చేయుటలేదు. నిరంతరము అరణ్యములోనే ఉందురుగదా! మరి వీరెట్లు జీవించుచుండిరి? అయితే, ఈ దినమంతయూ వారు ఎట్లు గడుపుచుందురో? వీరి ప్రవర్తనము ఎట్లుండునో? రహస్యముగ దాగి కనిపెట్టుదును. తద్వారా, ఈ యతీశ్వరుని రహస్యమును తెలుసుకొని లోకమునకు ప్రకటించెదనని సంకల్పించుకొనెను. మరునాడు అతడు సంగమస్థానమునకు వెళ్లెను. తనకు అనువైన చోట రహస్యముగ మాటువేసి కూర్చొని గురునాథుల యొక్క చర్యను గమనించుచుండెను. నెమ్మదిగా మధ్యాహ్న సమయము కాజొచ్చెను. ఇంతలో ఆ బ్రాహ్మణుని అంతఃకరణమునందు ఒకవిధమైన భయము ఉత్పన్నమాయెను. భయముతోపాటుగా శరీరమునందు కంపనము ప్రారంభమాయెను. **నిజమునకు ఎవడు గురువుయొక్క పరిమితిని పరీక్షించుటకు ప్రయత్నించునో, వాడు నేరుగా యమలోకమునకే చేరుకొనును. అట్టి మదోన్మత్తుల గతి అధోగతియే కాని, వేరు**

---

4. కపాలహస్తా, రక్తాక్షీ, శుకీ, శ్యేనీ, కపోతికా । పాశహస్తా, దండహస్తా, ప్రచండా, చండవిక్రమా ॥
5. శిశుఘ్నీ, పాపహంత్రీ, చ కాళీ, రుధిరపాయినీ । వసాధయా, గర్భభక్షా శవహస్తాంత్రమాలినీ ॥
6. స్థూలకేశీ, బృహత్కుక్షిః, సర్పాస్యా, ప్రేతవాహనా । దండశూకకరా, క్రౌంచీ, మృగశీర్షా, వృషాననా ॥
7. వ్యాత్తాస్యా, ధూమనిశ్వాసా వ్యోమైక చరణోర్ధ్వదృక్ । తాపనీ, శోషణీదృష్టిః, కోటరీ, స్థూలనాసికా ॥
8. విద్యుత్ప్రభా, బలాకాస్యా, మార్జారీ, కటపూతనా । అట్టాట్టహాసా, కామాక్షీ, మృగాక్షీ, మృగలోచనా ॥

ఫలశ్రుతి : అరవై నాలుగు నామములను కలిగి కాశీక్షేత్రమునందు సంచరిస్తున్న ఈ యోగినీల నామాలను ప్రతిదినము మూడు పూటలు ఎవరు పఠించెదరో, వారికి దుష్టబాధలు నశించును. ఢాకినీ, శాకినులుగాని, కూశ్మాండ యక్షరాక్షసులుగాని ఈ నామాలను జపించువారిని ఎంతమాత్రము పీడించరు. శిశువులకు, మాతృగర్భానికి రక్షణ కల్పింతురు. ఈ యోగినీ పీఠాన్ని సేవించువారు అభీష్టసిద్ధిని పొందగలరు. ఈ యోగినీ గణము కాశిలోగల మణికర్ణికకు ఎదురుగా వుండెదరు. వారికి నమస్కరించిన చాలును, ఎట్టి విఘ్నాలు కలుగవు. ఇది స్కాందపురాణము నందలి కాశీఖండమునందు నలుబది ఐదవ అధ్యాయమున పేర్కొనబడియున్నది. జయ గురుదత్త.

గతి లేదు. ఆ బ్రాహ్మణునకు అతి విచిత్రమైన భయము, పిరికితనము, శరీరమునందు కంపరము ప్రారంభమగుటతోడనే అచట నిలుచుటకు ధైర్యము జాలక తాను దాగియున్న చోటునుండి నెమ్మదిగా తప్పించుకొని దూరముగా వెళ్ళిపోయెను. (35-39□)

కానీ, అదే కృష్ణాతీరమున ఉన్న తన పంటపొలమును రక్షించుకొనుటకై ఒక గంగానుజుడు (నావికుడు) దానికి కాపలా కాయుచుండెడివాడు. అయితే, అతడు దైవవశమున ఆనాడే శ్రీగురుని వద్దకు ఈ యోగినీ గణము వచ్చుటను, వారికి నమస్కరించి, శ్రీగురుమూర్తిని తమ మందిరమునకు తోడ్కొనిపోవుచుండగా, తీరమునుండి గంగలోనికి దిగిన వెంటనే ఆ గంగాప్రవాహము రెండు పాయలుగా విడిపోయి, వారందరికి చక్కని మార్గము ఏర్పడుటను గాంచెను. ఈ యతీశ్వరులు ఎవరు? కృష్ణానది రెండు పాయలుగా ఎట్లు విడిపోయెను? వారి వెంట వచ్చినవారందరు ఎవరు? నదిలోనుండి లోపలికి ఎటు వెళ్ళిరి? ఎందుకు వెళ్ళిరి? అని ఆ నావికుని మదిలో అతి విచిత్రమైన ప్రశ్నలు రేకెత్తి విస్మయుడయ్యెను. శ్రీగురుని ఆ యోగినులు పూజించి, భిక్ష చేసిన పిమ్మట తిరిగి ఆయన బయటకు వచ్చెను. ఆ నావికుడు అదంతయు విస్తుపోయి చూస్తూ ఉండిపోయెను. ఇది ఏమి చోద్యము. ఈశ్వరుని సంకల్ప కారణమున ఈ యతీశ్వరుడు అవతరించెనేమొ? అందుకే ఆ దేవకన్యలు వీరిని పూజించిరేమో? అని తనలో తాను భావించెను. మరునాడు తిరిగి తమ చేతులలో హారతులను ధరించి యోగినీ దేవతలు వచ్చిరి. మేడిచెట్టు క్రింద కూర్చొనియున్న శ్రీగురుమూర్తికి మంగళ ఆరతులతో నీరాజనములను సమర్పించి నమస్కరించిరి. (40-45)

అంతట శ్రీగురునాథుడు ఆ యోగినులతో కలిసి గంగాప్రవాహములోనికి పోవుచుండెను. తిరిగి కృష్ణానది రెండు పాయలుగా చీలి, వారికి దారిని కల్పించెను. అత్యంత చోద్యముగా ఈ దృశ్యమును చూచుచున్న ఆ గంగానుజుడు కూడా ధైర్యము చేసి, వారి వెనకాల వెళ్ళెను. శ్రీగురుమూర్తి నదీతీరము నుండి నీటిని సమీపించిన వెంటనే కృష్ణానది రెండుపాయలుగా చీలిపోయి దారిని ఏర్పరచెను. దాని మధ్య అత్యంత సౌందర్యవంతమైన భవనములతో, దేవాలయములతో, ఎత్తైన శిఖరములతో విరాజిల్లుచున్న ఒక మహాద్భుతమైన నగరము కనిపించెను. అది దేవలోకమునందలి అమరావతి నగరమును తలపింపజేయుచుండెను. సూర్యప్రభాభాసమానమైన తేజస్సుతో వెలుగొందుచుండెను. శ్రీగురుడు అచటికి ప్రవేశించిన వెంటనే ఆ నగరవాసులందరూ ఆరతులను ధరించివచ్చి వారికి ఎదురేగి నీరాజనములనిచ్చి స్తోత్రపాఠములను పఠించుచూ శ్రీగురునాథులను అత్యంత వినయభావముతో తమ మందిరములోనికి తీసికొనివెళ్ళిరి. అచట ఒక నవరత్నఖచితమైన, సువర్ణమయమగు సింహాసనమునందు వారిని కూర్చుండబెట్టిరి. ఆ యోగినీదేవతలందరూ కలిసి వారి శ్రీచరణసరోజములను శుద్ధోదకముతో,

సువాసనలు గుబాళించెడి పన్నీటితో ప్రక్షాళనము చేసిరి. విధివిధానముగా షోడశ ఉపచారములతో చక్కగా, భక్తిభావము ఉద్దీపడుచుండగా పూజించిరి. రకరకములైన వంటకములతో కూడిన షడ్రసోపేతమైన భోజనపదార్థములను వారికి భిక్షగా నొసగిరి. శ్రీగురుదేవులు అచట సాక్షాత్తు కైలాసవాసుడైన పరమేశ్వరుని వలె అర్ధనిమీలిత నేత్రుడై కూర్చొని అనుగ్రహభావముతో ప్రసన్నవదనులై, ఆ పూజను స్వీకరించిరి. వారు ఇచ్చిన భిక్షను భుజించిన పిమ్మట తిరిగి ఔదుంబరమును చేరుకొనుటకు వెనుదిరిగిరి. ఇంతలో అక్కడ వున్న ఆగంతకుడైన ఆ వ్యక్తిని గురునాథులవారు చూచి "ఓరీ! నీవెందుకు వచ్చితివని" శ్రీగురునాథుడు అడిగెను. అందులకు ఆ గంగానుజుడు "స్వామీ! మిమ్ములను దర్శించుటకొరకే నేను వచ్చితిని" అని పలికెను. అట్లు పలుకుచు, అతని ఎదలో ప్రేమపూర్వకమైన భక్తిభావము ఉప్పొంగుచుండగా పరుగు పరుగున వచ్చి శ్రీగురుచరణసరోజములపై తన శిరమునుంచి సాష్టాంగముగ పడిపోయెను. **మహిమోపేతమైన, అత్యంత ప్రతిభాన్వితమైన ఆ స్వామి యందు తల్లీనుడై ఇట్లు స్తుతింపసాగెను.** "స్వామీ! గిరిజారమణా! మీరు కేవలము త్రిమూర్త్యాత్మక స్వరూపులే సుమా! సంసారమోహమహార్ణవమునందు మునిగిపోయిన నాకు మీ స్వరూపజ్ఞానమేమిటో తెలియుటలేదు. స్వామీ! ఈ మోహ భవార్ణవమునుండి తరింపచేయగల సమర్థులైన మీరే నన్ను ఉద్ధరింపగలరు. నిశ్చయముగ ఈ లోకమును తరింపచేయుటకొరకే తాము భూమిపై అవతరించితిరి. అజ్ఞానమను రాత్రిలో అఖండమైన జ్యోతిస్వరూపులు మీరే! మీ దర్శనము ఎవరికి లభించునో వారి సర్వాభీష్టములు వెంటనే నెరవేరిపోవును. వారికి ఇహపరములు రెండునూ ఏ శ్రమ లేకుండగనే ప్రాప్తించుటకు తృటికాలము కూడా పట్టదు స్వామీ!" అని ఈవిధముగ శ్రీవారిని స్తుతించెను. అతని భక్తిభావమునకు పరవశించిపోయిన శ్రీగురుమూర్తి ప్రసన్నులై అతనిని చక్కగా ఆశీర్వదించిరి. **అనంతరము అతనితో శ్రీగురుడు ఇట్లనిరి** – "నాయనా! నీ దైన్యము హరించిపోయెను. నీ మనసునందు నీవేమేమి కోరుకొనుచుంటివో, అట్టి కోరికలన్నియు సిద్ధించును. కానీ, ఒక మాటను నీవు గట్టిగా గుర్తుంచుకొనవలయును. ఇక్కడ జరిగిన విశేషములను కాని, నీవు మా వెంట ఇచటికి వచ్చిన సంగతిని కాని, నీవు మరెవరితోనూ చెప్పవద్దు. పొరపాటున కూడా మరెప్పుడైనను లోకమునందు ప్రకటనము చేయవద్దు. ఒకవేళ ఎప్పుడైనను ఈ రహస్యమును బహిర్గతము చేయుదువో, అప్పుడే నీకొక గొప్ప ముప్పు వాటిల్లగలదు" అని శ్రీగురుమూర్తి గంగానుజుడితో హెచ్చరించి చెప్పెను. గురుమూర్తి మాటలు విన్న ఆ గంగానుజుడు భయపడి వారికి తిరిగి సాష్టాంగవందనమాచరించి, "స్వామీ! నన్ను రక్షింపుము" అని ప్రార్థింపుచూ శరణు పొందెను. అంతట శ్రీగురునాథుడు దయాపయోనిధి కావున, 'నీవేమి భయపడవలసిన పనిలేదు' అని వాడికి అభయమును ప్రసాదించెను. అనంతరము శ్రీవారు గంగానుజుడితోపాటుగా ఔదుంబర మూలమునకు చేరుకొనెను. *(46-60)*

ఔదుంబర వృక్షము వద్దకు చేరుకొనిన తరువాత శ్రీగురుమూర్తి వద్ద సెలవు గైకొని వినయముతో వారికి నమస్కరించి గంగానుజుడు వెళ్ళిపోయెను. అతడు తన పొలమును కాపలా కాయుటకు వెళ్ళెను. దైవవశమున గురుకృప మహిమవలన తన పొలమునందే అతడికి ఒక గొప్ప నిధి దొరికెను. అంతేగాక, తనలోతాను ఆ వ్యక్తి జ్ఞానపరిపూర్ణుడయ్యెను. నాటినుండి ఆ గంగానుజుడు గురునాథుని యందు అనన్యమైన భక్తి గలిగినవాడై ప్రతినిత్యము గురుసేవను చేయుట మొదలుపెట్టెను. తత్ఫలితముగా అతడు పుత్రపౌత్రులతో వృద్ధిని పొంది మహదైశ్వర్యముతో తులతూగుచూ మహదానందభరితమైన జీవితమును గడిపెను. అనన్యమైన భక్తిభావముతో శ్రీగురునికి తన భార్యతో పాటుగా కలిసి నమస్కరించి పూజించి తిరిగి వెళ్లుచుండెడివాడు. ఇట్లు కొద్దికాలము గడిచిన పిమ్మట మాఘమాసమునందలి పౌర్ణమి తిథి వచ్చెను. ఆనాడు నిండు పౌర్ణిమ. **ఈ నూతన భక్తుడు శ్రీగురుమూర్తికి నమస్కరించి ఇట్లు విన్నవించుకొనెను–** "స్వామీ! జగద్గురూ! ప్రసిద్ధమైన కాశీ క్షేత్రమును దర్శించుటకు మరియు తీర్థరాజమైన ప్రయాగయందు మాఘపూర్ణిమ నాడు స్నానము చేయు నిమిత్తముగ అందరును వెడలిపోయిరి. గయ, ప్రయాగ, వారాణసి అను పేర్లు వినుటయే గాని అవి ఎట్లుండునో అను సంగతి హీనజాతికి చెందినవాడనైన నాకెంతమాత్రము తెలియదాయే! నాకు తమ పాదద్వంద్వము తప్ప వేరేమియు తెలియదు. జ్ఞానహీనుడను. స్వామీ! నన్ను అనుగ్రహించి నా మనోభావమును గుర్తించి నాపై కృపజూపగలరని" అతడు వేడుకొనెను. (60–66)

శ్రీగురుమూర్తి తన అంతరంగిక భక్తుడైన ఆ గంగానుజుని మనోభావమును గుర్తించి ఇట్లు పలికిరి – "నాయనా! నీకు సమీపమున గల పంచగంగా సంగమమే ప్రయాగ యను తీర్థరాజమని నిశ్చయముగ తెలుసుకొమ్ము. ఈ జుగుళ అను గ్రామమే కాశీపురము. కొల్హాపురమే దక్షిణ గయగా గుర్తించుము. మనోహరమైన త్రిస్థలియాత్ర ఇదియే. అయినప్పటికినీ గయ, ప్రయాగ, కాశీ అను త్రిస్థలీయాత్రను నీవు చూడవలయునని కుతూహలపడుచుంటివి గాన, నీకిప్పుడే ప్రత్యక్షముగ ఆ పవిత్రస్థలములను దర్శింపచేయుదును. సిద్ధము కమ్మని అనుగ్రహించిరి. వెంటనే "ఓరీ శిష్యుడా! నేను కూర్చొనియున్న వ్యాఘ్రచర్మమును గట్టిగా పట్టుకొమ్ము" అని చెప్పిరి. వాడు అటులనే ఆ వ్యాఘ్రచర్మమును ఒక ప్రక్కన గట్టిగా పట్టుకొనెను. ఇంతలో మనోవేగముతో ఉదయ కాలమున ప్రయాగకు చేరుకొనిరి. అచ్చట స్నానము చేసి మధ్యాహ్న సమయమునకు కాశీపట్టణము చేరుకొని అచట విశ్వనాథుని దర్శనము చేసి, ఆ వెనువెంటనే గయకు చేరుకొనిరి. ఈవిధముగ త్రిస్థలీ యాత్రను పూర్తి చేసి, తిరిగి సాయంకాలము వరకు సంగమస్థానమును చేరుకొనిరి. ఈవిధముగ పరిపూర్ణమైన శ్రీగురుకృపా

ప్రభావమువలన ఆ నావికుడు ఒకేదినమున మూడు క్షేత్రములను దర్శించి వచ్చెను. ఆ దినమునందు శ్రీగురుమూర్తిని దర్శించుకొనుటకై వచ్చిన గ్రామవాసులందరునూ గురునాథులు కనిపించక, ఏమైరి? ఎచటకు వెడలిరి? అని అద్భుత ఆశ్చర్యములకు లోనైరి. సాయంకాలమునకు శ్రీవారి భక్తులవలన జరిగిన వృత్తాంతమును విని, గ్రామప్రజలందరూ శ్రీగురుమూర్తి కేవలము ఈశ్వరావతారమని, వీరు జగన్నాటక సూత్రధారులేయని బహుధా కీర్తించిరి. ఇట్లు కొంతకాలము అమరపురమునందు నివసించి అమరపురీశ్వరుని యొక్క మహిమను, ఔదుంబర వృక్షము యొక్క ప్రతిభను లోకమునకు తెలియజేసి పంచగంగా సంగమస్థానమును మహిమాన్వితముగా పవిత్రీభూతమొనర్చి అమరేశ్వరుని సెలవుగైకొని అచటినుండి ప్రయాణము చేయుటకు శ్రీగురుమూర్తి సిద్ధమాయెను. ఇంతలో గురునాథునకు ప్రతినిత్యము అదృశ్యరూపమున సేవించి భిక్ష చేయుచున్న యోగినీదేవతలందరును వచ్చిరి. చేతులు జోడించి శ్రీవారికి నమస్కరించి, దయనీయముగా "స్వామీ! మమ్ములను వదలిపెట్టి మీరు ఎట్లు వెళ్ళెదరు" అని వేడుకొనిరి. (67-74)

"ప్రతినిత్యము మీ దర్శనభాగ్యమువలన తాపత్రయ దావానలము హరించిపోవుచుండెను. మీవద్ద అన్నపూర్ణమ్మ నిలిచియుండెను. స్వామీ! మీరు లేకుండగ మేమెట్లు ఉండగలము?" అని వారు శ్రీగురుమూర్తిని పదేపదే ప్రార్థించిరి. అప్పుడు భక్తవత్సలుడైన శ్రీవారు మిగుల సంతసించి వారికి గొప్ప వరమును ప్రసాదించెను. **అంతట శ్రీగురునాథుడు వారిని ఉద్దేశించి ఇట్లు పలికెను** - "నిరంతరము మేము అదృశ్యరూపమున ఈ ఔదుంబర మూలముననే ఉండెదము. మేము ఇచట బాహ్యమునకు కనిపించకపోయినప్పటికినీ అనాదిగా మా నివాసస్థానము ఈ కృష్ణా పంచగంగా సంగమమే అని గుర్తుపెట్టుకొనుడు. అందుకే ఈ ప్రదేశము **'నృసింహవాడి'**గా ప్రఖ్యాతి నొందెను. మీరు ఈ మనోహరమైన కలియుగ కల్పతరువగు ఔదుంబరము వద్దనే యుండుడు. మేము ప్రీతితో ఈ ఔదుంబరము వద్ద అన్నపూర్ణమ్మను స్థాపించెదము. పశ్చిమతీరమున గల ఈ అమరపురమే మా స్వస్థానమని గ్రహింపవలయును. మీరందరు ఈ కల్పవృక్షమగు ఔదుంబరము వద్దనే స్థిరముగనిలిచియుండుడు. ఇచట అందరి మనోకామనలు వెంటనే నెరవేరును. ఈ ప్రదేశము మరెంతనో ప్రఖ్యాతినొందును. అసంఖ్యాకముగ జనులందరు ఇచటికి వచ్చి ఈ కల్పతరువును పూజించెదరు. మీరు వారికి సహాయమొనర్చుచుండవలెను. ఔదుంబరము క్రింద గల పాదుకలను మీతో పాటుగా ఎవరైతే అత్యంత భక్తితత్పరులై పూజించెదరో, వారి మనోరథములన్నియు వెంటనే నెరవేరును. ఇచట కొలువుదీరియున్న అన్నపూర్ణను నిత్యము ఆరాధించినచో, సమస్త కోరికలు పరిపూర్ణమగుటయేగాక చతుర్విధ పురుషార్థములు తప్పక

ప్రాప్తించును. ఇచ్చోటగల పాపవినాశన తీర్థము, కామ్యతీర్థము, సిద్ధ తీర్థముల యందు స్నానము చేసి ఏడు పర్యాయములు మీ అందరి సహితముగా ఈ ఔదుంబర వృక్షమును ఎవడు అభిషేకించునో, వాడు అరవై సంవత్సరముల ప్రాయముగలిగిన వంధ్యా స్త్రీలైనప్పటికినీ, వారికి శతాయుష్మంతులైన పుత్రులు కలిగెదరు. ఈ పవిత్ర తీర్థస్నానము వలన బ్రహ్మహత్యా దోషము నశించిపోవును. సూర్య చంద్రుల గ్రహణకాలమునందు మరియు సంక్రాంతి పర్వదివసములయందు సభక్తికముగ ఈ తీర్థస్థానములయందు స్నానము చేయుటవలన అసంఖ్యాకమైన అశ్వమేధయాగములు నిర్వహించిన పుణ్యరాశి లభించును. సోమవతీ అమావాస్య నాడు, వ్యతీపాతాది పర్వదివసములయందు ఈ తీర్థములయందు స్నానము చేసిన యెడల ఎంతటి ఫలము లభించునో వివరించి చెప్పెదను సావధానముతో వినవలయును.

కొమ్ములను, గిట్టలను, బంగారముతో చేసి అలంకరించిన ఒక వేయి కపిలగోవులను బ్రాహ్మణులకు గంగానది తీరమున దానము చేసినంతటి ఫలము లభించును. అత్యంత భక్తిభావముతో ఒక బ్రాహ్మణునకు ఈ చోట భోజనము పెట్టిన యెడల కోటి బ్రాహ్మణులకు సమారాధన చేసిన ఫలము లభించును. మేడిచెట్టు క్రింద నిర్మలమైన మనస్సుతో జపమును చేసిన యెడల హోమము చేసిన దానికంటె కోటిరెట్లు ఫలితము లభించును. మనస్ఫూర్తిగా ఏకాదశ రుద్రమును జపించి, అభిషేకించి ఏకాగ్రచిత్తముతో దీనిని అనగా ఔదుంబర వృక్షమును పూజించినచో, ఒక వేయి అతిరుద్రములు చేసిన మహాఫలితము లభింపగలదు. (75-90)

మందగతితో నెమ్మదిగా ఈ వృక్షరాజమునకు ప్రదక్షిణము చేసినచో అనంత పుణ్యఫలరాశి లభించును. ఒక్కొక్క అడుగునకు ఒక వాజపేయ యజ్ఞమును చేసినంతటి ఫలము లభించును. నమస్కార పూర్వకముగా రెండు పర్యాయములు లేదా, నాలుగు పర్యాయములు ప్రదక్షిణము చేయవలెను. అట్లు చేసినవారికి అపారమైన పుణ్యఫలము లభించును. కుష్ఠువ్యాధిగ్రస్తులైనవారు, అంగహీనులైనవారు ఈ వృక్షమునకు లక్ష ప్రదక్షిణములు చేసినచో, వారికి దేవతాసమానమైన దివ్యదేహము లభించును. ఈ ప్రదేశము అత్యంత మనోహరమైనది. ఇచటికి చేరినవారి యొక్క మనస్సు నిర్మలమగును. చిత్తచాంచల్యము నశించిపోవును. సహజమైన కలియుగ కల్పతరువుగా వెలసిన ఈ ఔదుంబర వృక్షమును అనన్యభక్తితో పూజింపవలెను" అని శ్రీగురునాథులు చతుష్షష్టి యోగినీ దేవతలతో విశదముగా వివరించి చెప్పెను. ఈ ప్రకారముగా తమ దివ్యానుగ్రహమును ప్రసరింపచేసి అచటినుండి శ్రీగురునాథుడు భీమానదీ తీరమునందు గల సాటిలేని గాణగాపురమునకు బయలుదేరెను.

విశ్వరూపుడైన జగన్నాథుడు అన్ని ప్రదేశములయందు నివసించును. ఔదుంబరము యందు గల కడు ప్రీతివలన ఆయన దాని మూలమునందు నిత్యనివాసము చేయుచుండెను. నరసోబావాడిలోని ఔదుంబర వృక్షమూలమున గుప్తముగా ఉంటూ శ్రీగురుమూర్తి గాణగాపురమునందు ప్రకటమై జగద్విఖ్యాతి నొందెను. అనంతరము ఆ మహానుభావుడు గాణగాపురమునందు ప్రత్యక్షమై యుండిరి. శ్రీగురుమూర్తి మహిమ అత్యద్భుతముగా ఉండును. దీనిని భక్తిశ్రద్ధలతో వినిన వారందరికి చతుర్విధ పురుషార్థ ఫలములు లభించును అని నామధారకునితో సిద్ధమునీశ్వరుడు చెప్పెను. తద్విధమననుసరించి, కామధేనువు వంటి శ్రీగురుచరిత్రమును వినిన భక్తజనులందరి గృహములయందు అష్టైశ్వర్యములు విరాజిల్లుచూ సకలమనోభీష్టములు నెరవేరుచుండును అని సరస్వతీ - గంగాధరుడు శ్రీగురుచరితామృతమును చక్కగా విస్తరించి లోకమునకు ప్రకటించెను.(91-100)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "ఔదుంబర వృక్షమహిమ మరియు చతుష్షష్టి యోగినీ దేవతా ప్రతిదిన దర్శనము, వరప్రదానము" అను పంతొమ్మిదవ అధ్యాయము ॥ 19 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 100; మొత్తము సంఖ్య : 2135 + 100 = 2235 ఓవీలు)

◆ ◆ ◆

నమామి సతతం దత్త మౌదుంబర నివాసినం ।
యతీంద్రరూపం చ సదా నిజానంద ప్రబోధకమ్ ॥
భక్తబృందాన్ దర్శనతః పురుషార్థ చతుష్టయం ।
దదాతి భగవాన్ భూమా సచ్చిదానంద విగ్రహః ॥
(ఔదుంబర పాదుకాస్తోత్రమ్ శ్లో.2-4)

శ్రీ గురు చరిత్ర

ఇరువదియవ అధ్యాయము

నృసింహవాడిలో గోప్యముగా నున్న శ్రీగురు ప్రభావము, ఔదుంబర వృక్షమహిమా నిరూపణము - ఔదుంబర పూజా ఫలితముగా విప్రవనితకు బ్రహ్మహత్యాపాపము నివృత్తియగుట - శ్రీగురుమూర్తి వరప్రభావమున ఆమెకు సంతానము కలుగుట - ఆకస్మికముగ ఒక పుత్రుడు మరణించుట - కన్నతల్లి మిగుల శోకించుట - ఇంతలో ఒక బ్రహ్మచారి యేతెంచుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యోత్తముడగు నామధారకుడు సిద్ధముని యొక్క చరణకమలములకు సాష్టాంగవందనమును ఆచరించెను. **పిమ్మట దోసిలొగ్గి, శిరము వంచి, వినమ్రుడై భక్తిభావముతో ఇట్లు విన్నవించెను** – "సిద్ధమునీశ్వరా! శ్రీగురుశిఖామణీ! మీకు జయము కలుగుగాక! అయ్యా! నాదొక విన్నపమును అవధరింపుము. స్వామీ! శ్రీగురుమూర్తి కృష్ణానదీ తీరమునందలి నరసోబావాడి (అమరపురము) నుండి బయలుదేరి గాణగాపురమునకు వెళ్ళునపుడు యోగినీదేవతలతో అచ్చటి కల్పద్రుమముగా వాసిగాంచిన ఔదుంబర వృక్షము యొక్క మహిమను గొప్పగా వర్ణించి తాము కూడా ఆ వృక్షము వద్దనే నిత్యము గుప్తరూపమున వుండి, భక్తులకు నిత్యసన్నిహితుడనై యుందునని ఆ యోగినీ దేవతలకు వరమును ఇచ్చెను కదా! కావున, ఆ క్షేత్రము యొక్క మహిమను మరియు ఔదుంబర వృక్షము యొక్క మాహాత్మ్యమును దయతో మీరు నాకు విశదముగ వివరించి చెప్పగలరని" ప్రార్థించెను. (1-5)

అందుకు సిద్ధమునీశ్వరుడు మిగుల సంతోషాంతరంగుడై నామధారకునితో ఇట్లనెను – "కుమారా! శ్రీగురుమూర్తి ఔదుంబర వృక్షముక్రింద నిలచి ప్రకటించిన అత్యద్భుతమైన గురు లీలలను గూర్చి ఏమని చెప్పగలను, ఎంతని చెప్పగలను. నాయనా! ఔదుంబర వృక్షమే మిక్కిలి మహిమోపేతమైనది. అందులో గురుమూర్తికి నివాస స్థానమైనట్టి ఆ ఔదుంబర వృక్షము యొక్క మహిమ అత్యంత వర్ణనాతీతము కదా! దానిని వర్ణించి చెప్పుటకు సమర్థుడెవ్వడు? వారు నివసించిన ప్రతిచోట తమ వద్దకు ఏతెంచెడు భక్తులు కోరిన కోర్కెలను సందేహము లేకుండా నెరవేర్చిరి. తద్వారా నరసోబావాడి యొక్క మహిమ గొప్పగా పెరిగిపోయి లోకవిఖ్యాతి నొందినది. అట్టి మహిమను పూర్తిగా వివరించి

చెప్పగల సామర్థ్యము నాకెంతమాత్రమూ లేదు. నేను అసమర్థుడను. అయినను గురుకృపచేత దృష్టాంతము కొరకు అచట ప్రత్యక్షముగా జరిగినటువంటి ఒక అద్భుతమైన కథను గూర్చి నీకు చెప్పెదను. సమాహితచిత్తుడవై వినవలయును. (6–9)

'శిరోల' అను గ్రామమునందు 'గంగాధరుడు' అను పేరుగల ఒక బ్రాహ్మణుడు ఉండెను. అతడు సదాచారసంపత్తి కలిగినవాడు. గొప్ప వేదవిదుడు. ఇక ఆయన భార్య మహాపతివ్రత. ఆమె శాంతచిత్తమును గలిగిన సౌశీల్యవతి. ఆమెకు కలిగిన పుత్రులు వెంట వెంటనే మరణించుటతో, ఆమె తీవ్రమైన మానసిక బాధను అనుభవించుచుండెను. ఐదుగురు పుత్రులు జన్మించిరి. వారిలో ఏ ఒక్కరు కూడా జీవించియుండలేదు. మొదటి సంతానము నష్టమైనందులకు చింతించి, తదుపరి కలిగిన సంతానము ఆరోగ్యవంతముగ జీవించుటకొరకై ఆమె ఎందరో దేవతలను ఆరాధించెను. అనేకవ్రతములను ఆచరించెను. ఉపవాస వ్రతములను కూడా చేసెను. కాని, ఆమెకు కలిగిన ఐదుగురు సంతానములో ఏ ఒక్క బిడ్డ కూడా జీవించి యుండలేదు. బహుశా బలీయమైన పూర్వజన్మ ప్రారబ్ధమువలన నాకు కలిగిన బిడ్డలు జీవించియుండుట లేదేమో? తనకు ఏ కారణమున పుత్రశోకము కలుగుచుండెనో, ఇందుకుగల కారణమేమిటోగదా? అని పరిపరివిధాలుగా తనలోతాను ప్రశ్నించుకొని, వాటికి తగిన సమాధానముకొరకై భర్తయైన గంగాధరునితో కలిసి జ్యోతిశ్శాస్త్రమర్మజ్ఞులైన బ్రాహ్మణోత్తముల వద్దకు వెళ్ళెను. "అయ్యా! దైవజ్ఞులారా! నాకు సంతానము దక్కుటలేదు. అనేకమంది దేవతలను పూజించితిని. ఉపవాసవ్రతములను ఆచరించితిని. అయిననూ, నాకు సంతానము దక్కుటలేదు. కావున, కర్మవిపాకమును విచారించి, పూర్వజన్మలో నేను ఎట్టి పాపకర్మను ఆచరించితినో, వాటి పరిణామమేమిటో, దయచేసి నాకు వివరించగలరని" ఆమె దుఃఖపూరిత అశ్రునయనాలతో వారిని వేడుకొనెను. (10–15)

అప్పుడు ఆ బ్రాహ్మణోత్తములు ఆమెతో ఇట్లు చెప్పిరి – "పూర్వజన్మలో అత్యధిక తమోగుణముతో వ్యవహరించినవారు, మరుజన్మలో వంధ్యలుగా అయ్యెదరు. లేదా, వారికి గర్భపాతము కలుగుచుండును. లేదా, ఒకవేళ వారికి సంతానము కలిగినప్పటికీనీ వెంట వెంటనే ఆ సంతానము దక్కకుండా పోవును. అశ్వవధ గాని, గోవధ గాని చేసినచో మరుజన్మలో వంధ్యలుగా జన్మించి, నిరంతరము మహాజ్వరముతో పీడింపబడెదరు. ఒకవేళ పరుల ద్రవ్యమును అపహరించిన యెడల సంతానము లేనివారుగా జన్మించెదరని చెప్పిరి. తిరిగి వారు ఆమెతో యిట్లు పలికిరి. నీ జాతకరీత్యా పూర్వజన్మమునకు సంబంధించిన మహాదోషములు నీయందున్నట్లుగా మాకు గోచరించుచున్నవి. వాటిని వివరించి చెప్పెదము శ్రద్ధగా వినుము. "అమ్మా! నీవు శౌనకగోత్రమునకు చెందిన ఒక బ్రాహ్మణుని వద్ద కొంత ధనమును అప్పుగా తీసుకొంటివి. చెల్లించవలసిన సమయము వచ్చినప్పటికీనీ అతడు ఎన్ని పర్యాయములు అడిగినప్పటికీనీ, నీవు తీసికొన్న ద్రవ్యమును తిరిగి

అతనికి చెల్లించలేదు. నిజమునకు ఆ బ్రాహ్మణుడు పరమలోభి. ఇచ్చిన ద్రవ్యమునకు వడ్డీ రూపమున మరింత ఎక్కువ ధనమును సమకూర్చుకొనవచ్చుననే దురాశకు లోబడి, లోభత్వముతో అతడు నీకు అప్పుగా ఇచ్చెను. కాని, నీవు తిరిగి ఇవ్వకపోవుటవలన అతడు ఎంతగానో బాధపడెను. చివరకు ఇక నీ నుండి ఆ డబ్బు రాదని, నిశ్చయమునకు వచ్చి, నిరాశ చెంది ఆత్మహత్య చేసికొనెను. దాని ఫలితముగా అతడు పిశాచముగా మారెను. (16-20)

ఆ బ్రాహ్మణుడే పిశాచమై నీకు గర్భపాతము కలిగించుచుండెను. లేదా, పుట్టిన పిల్లలను పట్టి వెంటనే చంపివేయుచుండెను. గత జన్మలో నీవు చేసిన దుష్కర్మలే ఈ జన్మలో నీ అనుభవమునకు తోడై నిన్ను బాధించుచున్నవి" అని స్పష్టముగా ఆ బ్రాహ్మణోత్తములు కర్మవిపాకమును గురించి చెప్పిరి. జ్యోతిశ్శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు విని ఆ బ్రాహ్మణ స్త్రీ దుఃఖాక్రాంతురాలై, మిగుల శోకించెను. వారి ఓదార్పునకు కొంత కుదుటపడి, ఆమె పశ్చాత్తాపమును జెంది ఆ బ్రాహ్మణోత్తముల చరణములను ఆశ్రయించి నమస్కరించెను. తనను తాను సంబాళించుకొని, చేతులు జోడించి, ఆ బ్రాహ్మణ పతివ్రత ఎంతో దీనముగా వారిముందు వినయభావముతో కనులనుండి దుఃఖాశ్రువులు రాలిపడుచుండగా, **గద్గదమైన కంఠముతో ఇట్లు పలికెను** – "మహానుభావులారా! నేను గత జన్మలో మహాపాపిని, దురాచారిని కావచ్చును. ప్రస్తుతము పాపసముద్రములో మునిగియుంటిని. స్వామీ! మీరే నన్ను తరింపచేయవలెను. పూర్వజన్మ పాతకము నశించి, నేను తిరిగి శుద్ధురాలను అగునట్టి, శాస్త్రవిధి ననుసరించిన ఏదేని ఒక ఉపాయమును చెప్పి నన్ను తరింపచేయుడు. ఋణమంటేనే హాలాహలమును భక్షించినట్లుగా యుండును. అట్టి ఘోరపాపమును చేసిన నేను ఆ పాపరాశినుండి విడివడి ఈ జన్మలో ఎంతో కొంత సంతోషముతో ఉండునట్లుగా, నన్ను మీరు దయతో అనుగ్రహింపగలరని" హృదయవిదారకముగ దుఃఖించుచు, కడు దీనముగ వారిని పదేపదే వేడుకొనెను.

అంతట వారిట్లనిరి – "నీవు ఒక బ్రాహ్మణుని ద్రవ్యమును అపహరించుటచే బ్రహ్మహత్యా దోషము పట్టుకున్నది. ఆ బ్రాహ్మణుడు చనిపోయిన పిమ్మట అతనికి ఎవ్వరూ ఉత్తరక్రియలు చేయలేదు. కావున, ముందుగా అతని జన్మను ఉద్ధరించుటకు లేదా, అతనికి సద్గతి కలిగించుటకొరకు నీవు శాస్త్రవిధిగా అతని గోత్రము, నామము పేరిట ఉత్తరకర్మలను నిర్వహింపవలెను. ఆ తదుపరి శౌనకగోత్రమునకు చెందిన ఒక బ్రాహ్మణుని పిలిపించి అతనికి నూట ఒక్క రూపాయలు దానముగా ఈయవలెను. కృష్ణా తీరమునందు పంచగంగా సంగమములో అనేక తీర్థములు వున్నవి. అచట కలియుగ కల్పద్రుమముగా వాసిగాంచిన ఔదుంబర వృక్షము గలదు. దాని మూలమున శ్రీనృసింహ సరస్వతీ గురుదేవులు నిత్యసన్నిహితులై ఉందురు. కావున, నీవు కృష్ణాతీరమునందు నివసించుచూ ఒక మాసముపాటు ఉపవసించవలెను. పాపవినాశన

తీర్థములో ముందుగా స్నానము చేయవలెను. అందులోని ఉదకమును తీసికొనివెళ్ళి ఔదుంబర వృక్షమునకు, దానిమూలమున గల శ్రీగురు పాదుకలకు ఏడు పర్యాయములు అభిషేకము చేసి పూజించవలెను. తదుపరి కామ్యతీర్థములో స్నానము చేయవలెను. శ్రీగురుపాదుకలను స్వయముగా శ్రీగురుమూర్తియే అను నిశ్చలభావముతో విధివిధానముగా అత్యంత చిత్తశుద్ధితో పూజించవలెను. ఔదుంబర వృక్షమునకు పూజ చేసి ప్రదక్షిణములను చేయవలెను. గురుచరణములను నిత్యము స్మరించుచు ఉపవాసదీక్షతో ఒకమాసము రోజుల పర్యంతము ఈ వ్రతమును నీవు ఆచరింపవలెను. చివరిరోజున శౌనకగోత్రజుడైన ఒక బ్రాహ్మణుని పిలిపించి, అతనికి నూట ఒక్క రూపాయలను దానముగా ఈయవలెను. అతనిపేరిట శుద్ధమైన అంతఃకరణముతో కర్మలన్నింటిని ఆచరించవలెను. బ్రాహ్మణునకు భోజనము పెట్టవలెను. తద్వారా నీ పాపములన్నియు పరిహరింపబడును. బ్రహ్మహత్యాదోషము నశించి బ్రహ్మపిశాచము కూడా ఉద్ధరింపబడును. ఇట్టి వ్రతమును పూర్తి చేసిన పిమ్మట శ్రీగురుమూర్తి యొక్క కృపవలన నీకు శతాయుష్మంతుడగు పుత్రుడు కలుగగలడు. అప్పుడు నీ కష్టములన్నియును గట్టెక్కగలవు. బ్రహ్మహత్యాదోషము నశించిపోవును" అని దైవజ్ఞులగు ఆ బ్రాహ్మణోత్తములు వివరించి చెప్పిరి.

అంతట ఆమె వారితో ఇట్లనెను – "మహానుభావులారా! నేను కడు పేదరాలను. నా వద్ద ధనము లేదు. వంద రూపాయలను నేను పుట్టిన నాటినుండి నేటివరకు ఎప్పుడూ చూడనే లేదు. అయితే, శారీరక కష్టము కావలసినంతగా చేయగలను. మీరు చెప్పిన విధివిధానమును అనుసరించి, చిత్తశుద్ధితో, భక్తిప్రపత్తులతో గురుసేవను తప్పక చేసెదను. ఉపవాసాది నియమములను, స్నానాది కృత్యములను, పూజా ప్రదక్షిణములను మీరు చెప్పిన నియమానుసారముగ ఆచరించి తీరెదను" అని వారితో విన్నవించెను. **అప్పుడు ఆ బ్రాహ్మణులు కూడా ఆమెతో ఇట్లు నుడివిరి –** తల్లీ! నిశ్చయమైన మనస్సుతో గురుపాదుకలను సేవించుము. నీవద్ద ద్రవ్యము లేనప్పుడు నీ దోషమేమియును లేదు. నిర్మలమైన మనస్సుతో నీవు చేసే పూజలద్వారా ఔదుంబర వృక్షము క్రింద నిత్యసన్నిహితమై నిలిచే శ్రీగురుమూర్తి నీ పాపములకు నిష్కృతి ప్రసాదించును. ఆయన భక్తవత్సలుడు. దయాపయోనిధి. నీవేమి సంకోచింపవలసిన పనిలేదు. నీ శుద్ధ హృదయభావమును గుర్తించి గురుమూర్తియే నిన్ను మహాపాతకమునుండి విముక్తి చేయును. ఔదుంబర వృక్షముక్రింద శ్రీగురునాథులు ఎల్లప్పుడూ నివసించియే యుందురు. నిశ్చలమైన భక్తిప్రపత్తులతో నీవు సేవించినచో నీ బ్రహ్మహత్యాదోషమును పోగొట్టి, శ్రీస్వామివారు నిన్ను తప్పక రక్షింపగలరు" అని వారు విశ్వాసపూర్వకముగా చెప్పిరి. బ్రాహ్మణులు పలికిన మాటలను విని ఆ బ్రాహ్మణ స్త్రీ మిగుల సంతసించి, వారికి నమస్కరించి, అనుమతిని పొంది, వెంటనే శ్రీగురుమూర్తి సన్నిధానమునకు చేరుకొనెను. (21-43)

ఆ బ్రాహ్మణ స్త్రీ కృష్ణాతీరమునగల పవిత్రమైన పంచగంగా సంగమక్షేత్రమునందలి పాపవినాశన తీర్థమునందు స్నానము చేసి, విధివిధానముగా ఔదుంబరవృక్షమునకు ఏడుమార్లు అభిషేకము చేసి, ప్రదక్షిణ నమస్కారములను పూర్తి చేసెను. అటుపిమ్మట కామ్యతీర్థమునందు స్నానము చేసి, శ్రీ గురుపాదుకలను అభిషేకించి అతి భక్తితో పూజించి, ప్రదక్షిణ నమస్కారములను పూర్తి చేసెను. నాటినుండి కఠినమైన ఉపవాస దీక్షను ప్రారంభించెను. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆ విప్ర స్త్రీ ఇదేవిధముగ మూడు రోజులు గడువగా మూడవరోజు రాత్రికి ఆమెకు కలిగిన స్వప్నములో "ఒక విప్రుడు వచ్చి చేయి చాచి, వంద రూపాయలను ఇవ్వుమని అడిగెను. ఇప్పుడు కూడా నీవు వంద రూపాయలను ఈయనిచో నీ ప్రాణములు తీయుదును. తదుపరి నీ వంశమును వృద్ధి పొందనీయను. నీవు చేసే శ్రమనంతయును వ్యర్థపరచెదను. ఇకముందు నీ వంశములో సంతానమెట్లు కలుగునో చూచెదను" అని అత్యంత క్రోధోన్మత్తుడై ఆమెను సంహరించుటకై ఆ స్వప్నములోనే పైపైకి వచ్చెను. ఆ భయంకర స్వప్నమునకు ఆమె అత్యంత భయచకితురాలై మేల్కొని, వెంటనే ఔదుంబర వృక్షముయొక్క ఆశ్రయమును పొంది దాని వెనుకకు వెళ్ళెను. అచట అదృశ్యముగా ఉన్న గురునాథుని గుర్తించి, వారి శరణుజొచ్చెను. వెంటనే గురునాథుడు ఆమెకు అభయమునిచ్చి స్వప్నగతముగా వచ్చిన ఆ బ్రాహ్మణుని నిలువరించి, "ఏమిరా! నీవు ఈ స్త్రీని ఎందుకు చంపబోవుచుంటివని" నిలదీసెను. "అయ్యా! గతజన్మలో ఈమె నా ద్రవ్యమును అపహరించినది. అందుకోసమై ఎంతో వ్యథ చెంది నేను మరణించితిని. స్వామీ! మీరు అందరియెడల సమానమైన కృప గలవారు. కాని, ఈ ద్రోహిపట్ల మీరు పక్షపాతము వహించుచుంటిరి. మీరొక ఉత్తమ పరివ్రాజకులు. మీకు పక్షపాతము తగదు కదా!" అనెను. అతని హితోపదేశపూర్వకమైన మాటలను విని **శ్రీగురుడు మిగుల కోపగించి ఇట్లనెను**– "ఓరీ! నా భక్తజనులకు ఉపద్రవమును కలిగించినచో ఎవరైననూ సరే, వారిని మేము శిక్షించెదము. మేము చెప్పిన పద్ధతిని శిరసావహించి, మా మాటను అనుసరించి, నీవు మసలినచో, నీకు ఉత్తమగతి లభించును. నీ పిశాచత్వము తొలగిపోవును. ఈ దీనురాలైన విప్రవనిత దాపరికము లేకుండా ఆమె శక్తికొలది ఎంతటి ద్రవ్యమును ఈయగలుగునో, దానినే నీవు మనస్ఫూర్తిగా అంగీకరించి స్వీకరించవలెను. తద్వారా, మీ ఉభయులకు మేలు కలుగును. నా మాట నచ్చనియెడల వెంటనే ఇచటినుండి నిష్క్రమించుము. నా భక్తుల వంశములను మిగుల వృద్ధి గావించి వారిని నేనే రక్షించెదను. ఒకవేళ తిరిగి నీవు ఇటు ప్రక్కన కనిపించినచో, వెంటనే తీవ్రముగ నిన్ను శిక్షించితీరెదనని" గురుమూర్తి హెచ్చరించెను. **శ్రీగురునాథుల మాటలకు భీతినొందిన ఆ బ్రహ్మపిశాచము తలయొగ్గి నమస్కరించి పలికెను**– "స్వామీ! మీ చరణములను

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

దర్శించితిని. మిమ్ములనే ఆశ్రయించుచుంటిని. దయతో నన్నుద్ధరింపుము. ప్రభూ! ఏవిధముగ నేను ఉద్ధరింపబడెదనో అందుకు తగిన విధమును తాము శాసింపుడు. మీ శాసనమునకు తలవంచి నేను తప్పక అంగీకరించెదను".(44-58)

అంతట శ్రీగురుమూర్తి తిరిగి ఆ బ్రహ్మపిశాచముతో ఇట్లు పలికెను – "ఈ బ్రాహ్మణ వనిత భక్తిపూర్వకముగ, విధివిధానముగ నీకు సద్గతి కలుగు మార్గమును సుగమము చేయుటకు తగినట్లుగ ఉత్తరకర్మలను చేయును. తద్ద్వారా నీకు సద్గతి కలుగును". **పిదప ఆ బ్రాహ్మణ స్త్రీతో శ్రీ గురుమూర్తి ఇట్లు పలికెను** – "అమ్మా! నీవద్ద ఎంత ద్రవ్యము కలదో అంత మాత్రముతో అతని పేరిట పది దివసములు కర్మను చేయవలెను. అంతేగాక, ఇతనిపేరుతో అష్టతీర్థములయందు స్నానము చేయుము. ఇది మొదలు ఏడురోజులు నిత్యము ఈ మేడిచెట్టునకు జలముతో అభిషేకమొనర్చుము. దానితో నీ బ్రహ్మహత్యాదోషము వెంటనే నశించును. అప్పుడు నీకు పూర్ణాయుష్యముగల సంతానము కలుగును" అని చెప్పి గురుమూర్తి అదృశ్యుడాయెను.

అంతట ఆ బ్రాహ్మణ స్త్రీ ఆశ్చర్యచకితురాలై, మనసులో ఎంతమాత్రము ఏమరుపాటు వహించకుండా శ్రీగురుమూర్తిని వారి కృపచేత జ్ఞానదృష్టితో చూసెను. శ్రీగురుమూర్తి ఆజ్ఞననుసరించి అన్ని కార్యక్రమములను పదిరోజులపాటు అతి భక్తితో ఆచరించెను. దానివలన ఆమెయొక్క బ్రహ్మహత్యాదోషము తొలగిపోయి ఆ బ్రాహ్మణునకు కూడా పిశాచ జన్మము నశించి సద్గతి లభించెను. మరుసటిరోజున స్వప్నమున శ్రీగురునాథుడు ప్రత్యక్షమై ప్రసాదముగా **రెండు నారికేళ ఫలములను ఆమె ఒడిలో ప్రసాదించి ఇట్లనెను** – "అమ్మా! నీవిక చింతింపవలదు. వీటిని ప్రేమతో భుజింపుము. నీకు వేదపండితుడైన కుమారుడు కలుగును. అతని సంతతి అపారముగ వృద్ధినొందును" అని శ్రీగురుమూర్తి పలికెను. గురునాథుని ఆజ్ఞను పొంది ఆ దంపతులు మనఃపూర్వకముగ అత్యంత ప్రీతితో ఆరాధించుచున్నప్పుడు పరుసవేదిని ఇనుము తాకిన వెంటనే అది బంగారముగ మారినట్లుగా శ్రీగురురాజుల వారు ప్రత్యక్షమైరి. చింతామణి స్పర్శ తగిలినతోడనే ఇనుమునకు సువర్ణత్వము అబ్బినట్లుగ శ్రీస్వామివారి దర్శనభాగ్యము వలన ఆ విప్రవనితయొక్క గత జన్మల పాపరాశి నశించిపోయెను.(59-68)

అనంతరము కొలదికాలము గడిచిన పిమ్మట ఆమె గర్భవతియై కుమారుని కనెను. మరికొంతకాలమునకు మరియొక పుత్రుడు కూడ కలిగెను. హర్షోల్లాసములతో వైభవముగా పెద్ద కుమారునకు ఉపనయనమును, రెండవకుమారునికి చూడాకర్మను చేయుటకు నిశ్చయించుకొనిరి. ఉపనయనమునకు, చూడాకర్మ సంస్కారమునకు కావలసిన సంభారములన్నింటినీ సిద్ధము చేసికొని, ఆ దంపతులు తమ ఇరువురు కుమారులను చూసి మిక్కిలి సంతోషభరితులై ఊహకందనంతటి ఉల్లాసముతో కాలమును గడుపుచుండిరి. వారు నిశ్చయించుకొనిన

ఉపనయన, చూడాకర్మ సంస్కారముల ముహూర్తము సమీపించుచుండెను. ఈలోపున ఒకనాటి అర్ధరాత్రి ఒక కుమారునకు తీవ్రమైన అనారోగ్యమేర్పడెను. వ్యాధులన్నింటినీ మించిన తీవ్రమైన ధనుర్వాతమను వ్యాధి వచ్చెను. అతని అవయవములన్నీ వంకరలు తిరిగిపోవుచూ, కళ్ళకు అతి భయంకరముగా కనిపించసాగెను. ఈవిధముగ ఆ పిల్లవాడు మూడు రోజులు తీవ్రముగా బాధపడెను. మూడవరోజు రాత్రికి ఆ బాలుడు మరణించెను. ఆ తల్లిదండ్రుల దుఃఖమునకు మేరలేకపోయెను. ఆ తల్లి ఆక్రోశముతో తన తలను నేలకేసి కొట్టుకొనుచూ ఆవేశముతో ఒక పెద్ద బండరాయిని తీసుకొని వక్షస్థలమునకేసి కొట్టుకొనుచూ మిగుల వివశురాలై దుఃఖించుచుండెను. నేలమీద పడి దొర్లుచూ ఒక క్షణము నిర్జీవముగా మారిపోయెను. తిరిగి అపార దుఃఖము వలన ఆమె కంటినుండి నీటిప్రవాహము కట్టలు తెంచుకొని ప్రవహింపసాగెను. ఆ తల్లి పుత్రుని శవముమీదపడి అతడిని గట్టిగా ఆలింగనము చేసికొని, **మాయామోహముతో కప్పబడి ఆక్రోశించుచుండెను–** "నాయనా! కుమారా! అమ్మను వదలిపెట్టి ఇంత కఠినము వహించి ఎచటకు వెళ్ళిపోయితివిరా? పుత్రా! ఆడుకొనుటకు ఎచటికైన వెళ్ళిపోయితివా! నా పాలిండ్లలో గల పాలు ఉబికి వచ్చి వ్యర్థమైపోవుచున్నవి. వెంటనే లెమ్ము, నాయనా! లే!" అని పలుకుచూ దుఃఖింపసాగెను. (69–80)

"నాయనా! కుమారా! నీ ముద్దు ముద్దు మాటలను, నీ ఆటపాటలను నేనెట్లు మరచిపోగలను. పుత్రా! నన్ను విడిచి నీవు ఎక్కడికి పోయితివి. నాకొక గుప్తనిధివలె లభించితివి కదా! కుమారా! నీవంటి అందమైన పుత్రుని నేను మళ్ళీ ఈ జన్మలో చూడగలనా? కలలో గుప్తనిధి లభించి మాయమైనట్లుగా అయిపోయినది కదా! అయ్యో! నేను మోసపోయితిని. నాకు ఐదుగురు పుత్రులు పుట్టి మరణించినప్పటికినీ నీవు గర్భమున పడిననాటినుండియు ఆ శోకమును మరచి సంతోషముతో ఉంటిని. అట్టి నన్ను గొప్ప దుఃఖసముద్రమున ముంచి ఎక్కడికి వెళ్ళిపోయితివి. అయ్యో! గర్భవతిగా ఉన్నపుడు నాలో ఉత్తమకోరికలే ఉత్పన్నమాయెను. నవమాసములు నిండిన పిదపనే పుత్రుడు కలుగునని అత్యాశతో, ఉల్లాసముతో గురుచరణములను స్మరించుచూ ఉంటిని. కానీ, నేను ఎప్పుడూ ఉద్విగ్నతకు గురికాలేదు. నీకు తప్పక పుత్రుడు కలుగునని శ్రీగురుమూర్తి నాకు వరమిచ్చెను. ఆ దివ్యవరముతో పుట్టబోయే బిడ్డడు నాకొక పెన్నిధిగా ఉండగలడని నాలో నేను మురిసిపోవుచూ, నీవు జన్మించిన ఉత్తరక్షణము నుండి నేను అనంత సుఖసౌఖ్యములను అనుభవించితిని. వృద్ధాప్యమున మాకు గొప్ప దిక్కుగా నిలిచి మమ్ము రక్షించెదవని నా ప్రాణములకంటె అధికమైన ప్రీతిగా నిన్ను పెంచుకొనుచుంటిమి. అవసానకాలమున నీవే మాకు దిక్కని మేమెంతయో నమ్మకముతో ఉంటిమి. అయ్యో! పుత్రా! మమ్ములను వదలిపెట్టి వెళ్ళిపోవుట ఉచితమా, నాయనా! నిన్ను చూచి మరచిపోయిన అపారమైన దుఃఖసాగరమే తిరిగి మాకు దిక్కయ్యెను కదా! నిన్ను నమ్ముకొని, పంచప్రాణములు నీయందే నిలిపి, నీవే దిక్కని నమ్ముకొనుచున్న మమ్ములను

వదలిపెట్టి పంచభూతములలో కలిసిపోవుట నీకు ఉచితమేనా, కుమారా!" అని ఇట్లు అనేకవిధములుగా ఆ తల్లి హృదయవిదారకముగా శోకింపసాగెను.

ఇట్లు ఆమె దుఃఖించుచుండగా ఆమెచుట్టూ చేరిన గ్రామమునందలి పెద్దలందరూ ఆమెతో ఇట్లు చెప్పసాగిరి – "అమ్మా! నీవింతగా ఎందుకు దుఃఖించుచుంటివో మాకు ఆశ్చర్యము కలుగుచున్నది. బ్రహ్మ లిఖితమును ఎవ్వరూ తప్పించలేరు. దేవదానవులు, ఋషిమునీశ్వరులు సైతము ప్రారబ్ధమును తప్పించుకొనలేకపోయిరి. వారికి కూడా ప్రారబ్ధము అనుభవించక తప్పలేదు. నిజానికి బ్రహ్మ వ్రాసిన లలాట లిఖితమును ఎవరూ మార్చలేరు కదా! భువినుండి దివికి దిగివచ్చి అవతారములను ధరించిన హరిహరులు కూడా ఈ లోకమున స్థిరముగా నిలిచియుండలేరు కదా! మనము కేవలము సామాన్య మానవులము. అట్టియెడ నీవుగాని, నీ గర్భమునందు జన్మించిన ఈ బాలుడు గానీ స్థిరముగా శాశ్వతమై ఎట్లుండగలరు?" అని ఈవిధముగా అచట చేరిన పెద్దలందరు ఆమెను ఓదార్చుచూ, ఆమెకు వాస్తవ స్థితిని గ్రహించునట్లుగా చెప్పసాగిరి. ఇంతలో ఆమె మనసులో గతములో జరిగిన ఒక సంఘటన తళుక్కున మెరిసెను. **దానిననుసరించి ఆమె ఇట్లు అనుచుండెను–** "నీకు కలిగిన సంతానము శాశ్వతముగా, స్థిరముగా దీర్ఘాయుష్మంతులై వుండెదరని చెప్పి శ్రీగురుమూర్తి రెండు ఫలములను నాకు ప్రసాదించెను. అమ్మా! వీటిని నీవు భుజించుము. దీర్ఘాయుష్మంతులైన కుమారులు కలిగెదరు. వారివలన నీ వంశము వృద్ధి పొందగలదని" చెప్పిరి. శ్రీ నరసింహ సరస్వతి గురుదేవులు ఈ భూమిపైన ఎంతయో మహిమాన్వితులని గొప్ప ఖ్యాతిని గడించిరి. ఔదుంబరము వద్ద నిరంతరము నిత్యసన్నిహితులైన ఆ గురుమూర్తి నాకొక పుత్రుని ప్రసాదించిరి. ఆయన మాటలు మిథ్యగా ఎట్లు మారును? వారు నాకు వరమిచ్చినది ముమ్మాటికీ సత్యము. కానీ, ఇప్పుడు ఆ మాటలు అసత్యములై వ్యర్థము లాయెను గదా! కావున, నేను ఆత్మహత్య చేసికొని నా పుత్రునితో పాటుగా నా ప్రాణములను విడిచిపెట్టెదను" అని **శ్రీగురునాథుని స్మరించెను.** "గురుదేవా! మీరు దయాపయోనిధులని, వరదమూర్తులని, మీపై దృఢమైన విశ్వాసమును కలిగియుంటిమి. మీ మాటలు అక్షరసత్యమని నమ్మిన నన్ను, మోసగించి నట్టేట ముంచితిరి. మీరు సత్యసంకల్పులని దృఢముగా నమ్మితిని. అందుకు మీరు గొప్ప విఘాతమును కలిగించితిరి. ఇక మిమ్ములను విశ్వాసఘాతకులని చెప్పకుండా నేనెట్లుండగలను? శ్రీనృసింహసరస్వతీ గురువర్యా! మీరు త్రిమూర్తుల అవతారమే అని నేను నమ్మితిని. అటు ధ్రువునికి, ఇటు విభీషణునకు మీరు గొప్ప గొప్ప వరములనిచ్చితిరి. దానిని నిజమని ఇప్పుడు ఎట్లు చెప్పగలను? మీ మాటలను దృఢముగా నేను నమ్మియుంటిని. కానీ, నన్ను మీరు ఉపేక్షించితిరి. మీ పేరుతో నా ప్రాణములను త్యజించివేసెదను. మీ దర్శనార్థముగా అసంఖ్యాకముగా

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

ప్రజలు వచ్చుచుండెదరు. వారందరూ మిమ్ములను అతి భక్తితో సేవించుచుండెదరు. ఔదుంబరమునకు ప్రదక్షిణము చేసి మిమ్ములను ఆరాధించుచుండెదరు. అటులనే నేను కూడా మీ మాటను విశ్వసించి, మీరు చెప్పినవిధముగా అనుష్ఠించితిని. నా అనుష్ఠానమునకు గొప్ప ఫలితము లభించెను. ఇక మీ మహిమనుగాని, మీ ప్రదేశమునుగాని విశ్వసించుట ఎట్లు? కనుక మీ పేరిటనే, మిమ్ముల నుద్దేశించియే నేను నా ప్రాణములను వదలిపెట్టెదను. నా జీవితమున మీరు తీవ్రమైన విఘాతమును కలిగించితిరి. ఇప్పుడు మిమ్ములనెవరు భజించెదరు? వారికి మీ యెడల విశ్వాసమెట్లు కలుగును? బ్రాహ్మణుని ద్రవ్యమును హరించిన పాపము నుండి నిష్కృతిని పొందుటకై మీ చరణకమలములను ఆశ్రయించితిని. ముందుగా విచారించకుము అని, చింతించకుము అని నమ్మబలికి, మధ్యలో నన్ను వదలివేయుట మీకు ధర్మమా? ఇది న్యాయమా? ఒక పులిని చూసి అత్యంత భీతికి లోనైన ఒక గోవు, వేరొకరిని ఆశ్రయించి నన్ను కాపాడుము అని కోరినపుడు వారే దాని ప్రాణమును తీసినట్లుగా నా గతి మారిపోయినది. దైవపూజకై ఒకడు దేవాలయమునకు వెళ్లినపుడు ఆ దేవాలయమే అతనిపాలిట అశనిపాతమై మృత్యువుగా మారి ఆతనిమీదనే కూలి పడినదట. స్వామీ! నా గతి కూడా అటులనే అయినది కదా! దేవా! నా ప్రాణమువంటి కుమారుని మీరు రక్షించలేకపోయితిరి కదా!" అని ఆ రాత్రి అంతయూ కంటిమీద కునుకు లేక ఆ బాలుని తల్లి పరిపరివిధములుగా విలపించుచుండగా, ఇంతలో సూర్యోదయమయ్యెను. **వీధిలోని బ్రాహ్మణులందరూ ఆమె వద్దకు వచ్చి ఇట్లనిరి–** "అమ్మా! నీవెందుకిట్లు వ్యర్థముగ దుఃఖించుచుంటివి. ఇది గొప్ప మూర్ఖత్వమే యగును. జరుగవలసిన దానిని బ్రహ్మాదులు కూడా తప్పించుకోలేరు కదా! కనుక, మరణించిన నీ బిడ్డ శవమునకు అంతిమ సంస్కారమును చేయక తప్పదు. గంగ వద్దకు వెళ్ళెదము పదమని" వారు పలికిరి. **వారి మాటలు విని ఆమె మిగుల ఆక్రోశింపుచూ, ఇట్లనెను** – "నాయనలారా! నా బిడ్డతోపాటే నన్ను కూడా ఆ చితిలోనికి త్రోసి, అగ్నిదేవునికి అర్పించగలరు. లేనిచో, ఈ శవమును మీకు అప్పగించను గాక, అప్పగించను. బాలునితోపాటుగా నన్ను కాల్చుటకు మీరు ఇచ్చగించనంతవరకు, నా కుమారుని శవమును మీ చేతికివ్వను" అని కుమారుని శవమును తన హృదయమునకు గట్టిగా హత్తుకొని కూర్చొనెను. (81–110)

బంధువులందరూ ఆమెతో "నీవు మామూలు స్త్రీవి కావు. గొప్ప మూర్ఖురాలవు, కఠినాత్మురాలివి. నీ కుమారుని శవముతోపాటు ప్రాణములను వదులుదునని పలుకుట ఏవిధమైన ధర్మమో మాకు తెలియజెప్పుము. మేము ఇంతవరకు ఇట్టి విడ్డూరమైన మాటను వినలేదు. చచ్చిన కొడుకు కొరకు తమ ప్రాణములను ఎవ్వరు విడిచెదరు? అది ఆత్మహత్యయే అగును. అదొక మహాదోషముగా పరిగణింపబడును" అని అనేకవిధములుగా వారందరూ ఆమెకు బోధించిరి. కాని, ఆమె 'ససేమిరా' వారి మాటలను అంగీకరించలేదు. తన పుత్రునితో పాటుగా

తాను ప్రాణములను వదలిపెట్టుటకే నిశ్చయించుకొనెను. ఇంతలో మధ్యాహ్న సమయము సంప్రాప్తమయ్యెను. శవసంస్కారమునకు ఆమె అంగీకరించుటలేదు. కనీసము కృష్ణానది తీరమునకు చేర్చుటకు కూడా ఆమె ఇష్టపడుటలేదు. గ్రామస్తులందరికి ఇది ఒక వింతగా కన్పట్టుచుండెను.

ఇంతలో ఒక దివ్యమైన బ్రహ్మచారి వారి మధ్యలోనుండి ముందుకు వచ్చెను. అచట గుమిగూడిన వారందరూ చూచుచుండగా ఆగంతకుడైన ఆ బ్రహ్మచారి ఆమెకు చక్కని ఆత్మజ్ఞానమును బోధించెను" అని సిద్ధముని చెప్పుచూ "నామధారకా! అప్పుడొక అపూర్వమైన సంఘటన ఘటించినది. వచ్చినవాడు బ్రహ్మచారి మాత్రమే కాని, అతడు మామూలు బ్రహ్మచారి కాడు. శ్రీగురుమూర్తియే భక్తవత్సలుడైన అవతారపురుషడగు నృసింహ సరస్వతి స్వామివారే ఒక బ్రహ్మచారిగా మాయాకల్పితమైన మానవవేషమున వచ్చెను" అని వివరించెను. ఇంతటి మనోహరమైన ఈ కథను శ్రవణము చేయు మానవులందరు శతాయుష్మంతులయ్యెదరు. భక్తిపూర్వకముగా ఈ కథను వినిన వారికి శరీరములో ఎట్టి వ్యాధులు ఉండవు. వారు శతవసంతములు జీవించెదరు. నా మాటలు సత్యములు" అని సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన శ్రీగురుచరిత్రమును గంగాధరాత్మజుడైన సరస్వతి చక్కగా వివరించి లోకమునకు అందించెను. (111-119)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "బ్రహ్మహత్యా దోష పరిహారము - ప్రేత జనని శోకము" అను ఇరువదియవ అధ్యాయము ॥ (20)

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 119; మొత్తము సంఖ్య : 2235 + 119 = 2354 ఓవీలు)

◆ ◆ ◆

(**ఒక ముఖ్యగమనిక :** నిత్యపారాయణము చేయువారలు ఈ (20) ఇరువదియవ అధ్యాయము చదివి ఆపివేయగూడదు. వెంటనే 21వ అధ్యాయమును చదివిన తర్వాత ఆనాటి పారాయణమును ఆపివేయవచ్చును. అనగా - 20, 21 రెండు అధ్యాయములను మధ్యలో నిలుపకుండా రెండింటిని వరుసగా చదువవలెనని గమనింపగలరు.)

శ్రీ గురు చరిత్ర

ఇరువది ఒకటవ అధ్యాయము

శ్రీనరసింహ సరస్వతీ స్వామివారు ఒక బ్రహ్మచారి వేషమున విచ్చేయుట - పుత్రశోకమున మునిగియున్న కన్నతల్లికి తత్త్వోపదేశము చేయుట - భక్తురాలి దృఢమైన విశ్వాసమును గమనించుట - కృపతో మృతుడైన ఆమె కుమారుని జీవింపచేయుట - కలికల్పద్రుమమగు ఔదుంబరము మరియు శ్రీగురుపాదుకల మహిమా నిరూపణము

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పుచున్నాడు - "నామధారకా! వచ్చిన ఆ బ్రహ్మచారి ఎవరో కాదు. అతడు అవతారపురుషుడు. శ్రీగురుమూర్తి యగు నృసింహసరస్వతి స్వాములవారే ఒక బ్రహ్మచారి రూపమున విచ్చేసి పుత్రశోకముతో తీవ్రముగా పరితపించుచున్న ఆ **భక్తురాలికి ఈవిధముగ తత్త్వోపదేశమును చేయుచుండెను**- "అమ్మా! నీవు మూఢురాలవై ఎందుకిట్లు దుఃఖించుచుంటివి? మూఢత్వముతో దుఃఖించుట తగదు. ఈ జగత్తులో స్థిరముగా, శాశ్వతముగా ఎవరు ఉండిరో, ఎవరు ఉండగలరో విచారించి చెప్పుము. జన్మించినది ఎవరు? మరణించినది ఎవరు? ఈ దేహము నీటినుండి పుట్టిన బుడగ వంటిది. బుద్బుదములు ఎక్కడైనా స్థిరముగా ఉండగలవా? పంచభూతముల కలయికతో ఈ దేహములు నిర్మింపబడినవి. అట్టి పంచభూతములనుండి విడివడిన వెంటనే ఈ దేహము నశించిపోవును. ప్రాణుల శరీరములన్నియు పంచభూతముల నుండి ఉత్పన్నమైనవే. కొలది కాలము మాత్రమే ఉండి, తిరిగి పంచభూతములలో కలసిపోవుట సహజ స్వభావమని నీవు గుర్తెరుగుము. పంచభూతాత్మకమైన శరీరము మాయాపాశముతో చుట్టబడినది. అందుచే దేహభ్రాంతి కలిగి పుత్రుడని, మిత్రుడని, భార్యయని భావించుకొనుచూ, మనిషి మనుగడ సాగించుచున్నాడు. త్రిగుణములు అనగా సత్త్వరజస్తమోగుణములు ఈ భూతములనుండి వేరు పడే లక్షణములుగా వుంటాయి. అనగా ఏమిటి? జాగ్రత్తగా వినుము.

సత్త్వగుణము గలవారు సాత్త్వికకర్మలను ఆచరించుటచే వారికి దేవత్వము సిద్ధించును. రజోగుణ సంపన్నులు రాజసకర్మలను ఆచరించుటవలన మనుష్యులుగా జన్మించెదరు. ఇక, తమోగుణము గలిగినవారు తామసిక కర్మలు ఒనరించుట వలన దైత్యులుగా జన్మింతురు. అట్టి

గుణానుబంధమువలన కర్మలు జరుగుచుండును. మానవుడు ఏయే గుణములతో, ఏయే కర్మలను చేయునో, అవి దుష్కృతములు కావచ్చును, సుకృతములు కావచ్చును. ఏదైననూ సరే! చేసిన కర్మలను అనుసరించియే తత్కర్మఫలములు లభించుచుండును. ఆయా కర్మఫలములను ఎవరైనను, ఎప్పటికైనను తప్పక అనుభవించి తీరవలసినదే. గుణముల వాసనను అనుసరించి ఇంద్రియములు ఆ వాసనలకు అధీనమై యుండును. మాయాపాశములో చిక్కుకొని సుఖదుఃఖాదులకు అంటిపెట్టుకొని జీవులు వుందురు.(1) ఈ జగత్తు నందు పూర్వజన్మ కర్మలను అనుసరించియే అన్నివిధముల జీవులు ఉత్పన్నమగుచుండును. ఆయా జీవులు తమ తమ సంచిత కర్మను అనుసరించియే ప్రస్తుత జన్మమునందు ప్రారబ్ధముగా వాటి సుఖదుఃఖములను అనుభవించుదురు. (1–10)

దేవతలకు, ఋషులకు కోటికల్ప సంవత్సరాల ఆయుష్యముండును. అయిననూ వారిని కూడా ఈ కర్మపాశములు వదలిపెట్టవు. ఇక మానవులనగా ఎంతపాటి కనుక, ప్రారబ్ధమును మనమెట్లు తప్పించుకొనగలము. జీవుడు దేహాధీనుడు. దేహము కాలాధీనము. దేహధారులందరు తమ తమ గుణములను అనుసరించియే కర్మలను ఆచరించెదరు.(2) దేహధారులకు అనేక విధముల వికారములు ఉండును. నేను, నాది (అహంకార– మమకారములు) అనుటకు నిర్ధారణగా ఈ సంసారమునందు స్థిరముగా నిలిచి ఎవ్వరూ ఉండనేరరు. అందువల్లనే, జ్ఞానులు జన్మ వచ్చినందులకు సంతోషించరు. మరణము సంభవించినందులకు దుఃఖింపరు.(3) పుట్టుటకు ముందు ఎవరికి స్థూలదేహము ఉండదు. సూక్ష్మముగా ఉన్న శరీరము స్థూలశరీరముగా మారును. అదియే తిరిగి సూక్ష్మశరీరముగా మారిపోవును. మరణించుట అనగా స్థూలశరీర నష్టమే. దేహమే నశించినది. కానీ, దేహి నశించలేదు. నీటిలో అప్పటికప్పుడే పుట్టిన బుడగలు వెంటవెంటనే నశించిపోవుచుండును. కాని, నీరు మాత్రము యథాతథముగనే యుండును. అటులే ఈ దేహములు కూడా ఎప్పటికినీ స్థిరముగా ఉండజాలవు. జన్మించిన ప్రతివాడూ మరణించక తప్పదు. చేసిన కర్మలకు ఈ దేహము ద్వారా ఫలితము అనుభవింపవలసి వచ్చును. దేహము ఎప్పుడు వచ్చునో, అట్టి దేహముతో

---

1. **శ్లో॥ సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సంభవాః । నిబధ్నంతి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్ ॥**(గీ. 14/5)
అనగా అర్జునా! సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాలు ప్రకృతినుండియే ఉత్పన్నములగును. ఈ మూడు గుణములే నాశములేని దేహిని అనగా జీవాత్మను శరీరమునందు బంధించి యుంచును.
2. **న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ । కార్యతే హ్యావశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥** (గీత. 3/5)
మానవుడు ఎప్పుడైనను ఏదో ఒక కర్మను ఆచరించకుండా క్షణకాలము కూడా ఉండలేడు. కావున, మనుషులందరు ప్రకృతినుండి జనించిన గుణములకు లోబడి తప్పనిసరిగా కర్మలను చేయుటకు బాధ్యులయ్యెదరు.
3. **గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** (గీత. 2/1) (పండితులైనవారు ప్రాణములు పోయినవారిని గురించిగాని, ప్రాణములు ఉన్నవారి గురించి గాని దుఃఖించరు).

సంబంధించిన సుఖదుఃఖములు, సంయోగ వియోగములు అప్పుడే వచ్చినవి. అవి ఎంతవారికైనను తప్పవు సుమా! జీవుడు ఏనాడు మాతృగర్భమున ప్రవేశించెనో, ఆనాడే వాని జీవితకాలపరిమితి నిశ్చయింపబడి యుండును. దానిని తప్పించుటకు ఎవరికినీ తరము గాదు. మరణమునకు కాలనియతి లేనేలేదు. కొందరు కర్మను అనుసరించి పసితనముననే మరణించెదరు. కొందరు బాల్యమున మరణింతురు. మరికొందరు యౌవనములో, ఇంకొందరు వృద్ధాప్యములో మరణించెదరు. తమ పూర్వజన్మార్జిత సంచితమెట్లుండునో, అటులనే ప్రారబ్ధమేర్పడి, తత్ఫలితము సంభవించుచుండును. కొందరు గర్భముననే వారి ప్రాక్తన (పురాకృత) కర్మను అనుసరించి మరణించుచుండెదరు. జనులు మాయాపాశమునందు చిక్కుకొని, అసలైన తత్త్వమును గ్రహింపజాలరు. మాయామోహితులై, ఆయా గుణములను అనుసరించి తల్లియని, తండ్రియని, పుత్రుడని, భార్యయని, మిత్రుడని, నానావిధములైన మమకారములను కల్పించుకొని, మూఢత్వముతో బాధపడుచుండెదరు.

ఒకవేళ ఈ దేహమును పవిత్రమైనదని చెప్పుదుమా? అని అన్నచో, ఇది భయంకరమైన మలమూత్రాదుల నుండి పుట్టినది. రక్తము, రేతస్సుతో కలిసి ఇది ఉత్పన్నమగును. 'కర్మను అనుసరించి చేసిన పాపపుణ్యములను అనుభవించుడు' అని ముందే లలాటమునందు బ్రహ్మదేవుడు లిఖించిపెట్టును. అట్టి అనుభవమును గాని, కాలమును గాని జయించుట ఎవరికీ సాధ్యము కాదు. కావున, దేహమునకు శాశ్వతత్త్వము అనునది లేదని గ్రహింపవలెను. స్వప్నములో ద్రవ్యనిధి కనిపించినపుడు దానిమీద ఎవరైనా గట్టి నమ్మకమును పెట్టుకొందురా? ఈ సంసారమంతయూ ఒక ఇంద్రజాలకుని ఆటవంటిది. గారడి విద్య వంటిది. ఈ దేహమును స్థిరమని ఎట్లు నమ్ముకొనగలము. ఇంతకుపూర్వము నీవెన్ని జన్మలను అనుభవించితివో, అప్పుడు మానవజన్మయే వచ్చెనా? లేక పశుజన్మయా? పక్షి జన్మయా? క్రిమికీటకమా? అదేమిటో నీవు చెప్పగలవా? ఒకవేళ మానవజన్మ ప్రాప్తించినప్పటికినీ, అప్పుడు నీవు ఎవరికి తల్లివో, తండ్రివో, అప్పుడు ఎంతమందికి భార్యవైతివో, తల్లివైతివో నిర్ధారించి చెప్పగలవా? గత జన్మలలో నీ తలిదండ్రులెవరో చెప్పగలవా? ఇవేవియు నిశ్చితముగా తెలియని అజ్ఞానముతో, మూఢత్వముతో నా పుత్రుడని దుఃఖించుచూ వ్యర్థప్రేలాపన చేయుచుంటివి. బేలవై దుఃఖించుచుంటివి. చర్మము, మాంసము, ఎముకలు, మజ్జులతో నిండియున్న ఈ దేహము పాంచభౌతికమైనది. నవద్వారములు కలిగిన ఈ శరీరము కేవలము మలమూత్రాదులతో నిండియున్నది. పుత్రుడేమిటి? మృత్యువేమిటి? భ్రమతో వ్యర్థముగా ఎందుకు దుఃఖించుచుంటివి? ఇప్పటికైననూ సత్యమును గుర్తించుము. ఈ శవమును లౌకికముగా (దహన) సంస్కారమొనరించుటకు నీ బంధువులకు ఇచ్చివేయుము" అని ఆ బ్రహ్మచారి అచ్చమైన తత్త్వజ్ఞానమును వివరించి చెప్పెను. (11-29)

ఆతని ఉపదేశవాక్యములను విని, ఆ విప్రవనిత అత్యంత దీనురాలై ఆ బ్రహ్మచారితో ఇట్లు పలికెను – "స్వామీ! మీరింతవరకు నాకు అవసరమైన సమస్త ధర్మములను బోధించితిరి. అయిననూ నా మనస్సు స్థిరము కావటములేదు. నిజమునకు ప్రారబ్ధమును అనుసరించియే సమస్తమూ జరుగునని, ఒకవేళ నిశ్చయముగా భావించినచో, ఇక శ్రీహరిని పూజించుట ఎందులకు? పరుసవేదిని స్పర్శించిన ఇనుము, బంగారముగా మారదని అను వారలు ఎవరైనా ఉందురా? మేము మొదటినుండియూ దురదృష్టవంతులమే. అందుకే శ్రీగురుమూర్తి చరణారవిందములను ఆశ్రయించితిమి. పూర్ణాయుష్కుడయిన పుత్రుడు కలుగునని ఆయన మాకు స్పష్టమైన అభయమును ఇచ్చిరి కదా! అట్టి మాటలను మేము గట్టిగా విశ్వసించితిమి. ఇందులో మా తప్పేమిటి? ఎవరికైనను రోగము వచ్చినచో, వారు వైద్యునివద్దకు వెళ్ళి ఆ రోగమునకు తగిన చికిత్సను చేసుకొని తిరిగి ఆరోగ్యమును పొందుచున్నారు గదా! (30-33)

కాని, ఇది నా ప్రారబ్ధము కదా! అని ఎవ్వరునూ ఉదాసీనులై చేతులు ముడుచుకొని కూర్చొనియుండరు కదా! ఎవరికైననూ ప్రారబ్ధవశమున ఆపదలు సంభవించినపుడు పెద్దలను ఆశ్రయించి వారివలన ఆ ఆపదను పోగొట్టుకొనుటలేదా? అటులనే నేను కూడా త్రిమూర్త్యాత్మక అవతారమైన శ్రీనృసింహసరస్వతి స్వామివారిని ఆశ్రయింపగా నా బాధను గుర్తించి దయాసింధువైన ఆ మహానుభావుడు దీర్ఘాయుష్మంతుడగు పుత్రుడు కలుగునని వరమును ఇచ్చెను. అది అసత్యమెట్లగునో, నాకు తెలియజెప్పుము. నేను వారిని మనసారా ఆరాధించితిని. కరుణించి అనుగ్రహముతో వారు మాకు వరమునిచ్చిరి. వారి చరణారవిందములయందు గల విశ్వాసముతో మేము ప్రశాంతచిత్తులమై ఉంటిమి. అంతటి దృఢమైన విశ్వాసముతో మేముండగా అట్టిదానిని ఈవిధముగా భగ్నము చేయుటెందులకు? ఇది నా మూర్ఖత్వమెట్లగునో, మీరే తెలియజెప్పుడు. స్వామీ! అందువల్లనే నేను ఇప్పుడు నా ప్రాణములను త్యజించి శ్రీగురునాథుని చరణములయందే అర్పించెదను. తద్వారా వారి కీర్తి దిగ్దిగంతవ్యాప్తి చెందును కదా!" అని ఆమె పలికిన మాటలను విని ఆమె అంతరంగ భావమును, సునిశ్చితమైన విశ్వాసమును గుర్తించి ఒక చక్కని జ్ఞానోపదేశపూర్వకమైన **ఉపాయమును ఆమెకు ఆ బ్రహ్మచారి బోధించెను**– "అమ్మా! నీవు శ్రీగురుమూర్తిని విశ్వసించి పూర్ణాయుష్మంతుడగు పుత్రుని పొందితివి. కాని, అతడు అకాలమరణమును చెందెను. ఎవరి వరప్రసాదమువలన ఈ పుత్రుడు నీకు కలిగెనో, ఆ వరదమూర్తి దగ్గరకే నీ కుమారుని తీసుకొని వెళ్ళుము. నీకు వరము లభించిన పంచగంగా కృష్ణాతీరములోని ఔదుంబర వృక్షము దగ్గరనే నీవీ కళేబరమును సమర్పించుమని" ఆ బ్రహ్మచారి చెప్పెను. అతడు చెప్పిన ఈ చివరి వాక్యములను విన్న ఆ విప్రవనిత మనస్సునకు గట్టి విశ్వాసమేర్పడెను. 'ఈ మాట సత్యమే' అని నిశ్చయించుకొని వెంటనే కుమారుని శవమును తన వీపునకు కట్టుకొని నరసోబావాడిలోని

కృష్ణవేణి తీరమున గల పంచగంగా పవిత్రక్షేత్రమునందు విరాజమానమైయుండి కల్పభూరుహముగా ప్రసిద్ధినొందిన ఔదుంబర వృక్షము దగ్గరకు చేరెను. అక్కడ ఆ శవమును గురుమూర్తి యొక్క పాదముల ముందు పరుండబెట్టి తన శిరస్సును గురునాథుని పాదుకలమీద రక్తము చిందునట్లు గట్టిగా కొట్టుకొనుచూ, మిక్కిలి దుఃఖపడసాగెను. ఆ పాదుకలు రక్తముతో తడిసిపోయెను. మిగుల ఆక్రోశించుచూ ఆమె అత్యధికముగా దుఃఖింపసాగెను. నిజమునకు పుత్రశోకము సహింపరానిది. అట్టి మృత్యువు తలిదండ్రులపాలిటి క్షయరోగమువలె వుండును. ఇంతలో సూర్యుడు అస్తమించి చీకటి పడసాగెను. గ్రామస్థులు, ఆమె బంధువులు వచ్చి “అమ్మా! చీకటి పడుచున్నది. ఎందుకమ్మా! ఇంతగా విలపించెదవు. ఈ అరణ్యములో మనుష్యులు సంచరించరు. ఇచట ఎట్లు ఉండెదవు. కనుక, శవమును మాకు ఇవ్వవలసినది. దహనసంస్కారములు చేసి మేము వెళ్ళెదము. లేదా, మిమ్ములను వదలి మేము వెళ్ళిపోయెదమని” ఒకరి తరువాత ఒకరు కఠినముగా మాట్లాడిరి. “అయ్యా! మీరు ఏమి చేసినప్పటికినీ నేను ఈ శవమును మాత్రము ఇవ్వనుగాక ఇవ్వను. ఈ శవముతోపాటుగా నేనును దగ్ధమయ్యెదను” అని తన కడుపునకు కట్టుకున్న ఆ శవముతోపాటు ఆమె శ్రీగురుమూర్తి పాదుకలమీద అటూ ఇటూ రోదించుచూ దొర్లసాగెను. **అంతట వారందరూ ఇట్లు పలికిరి.** “ఈ అడవిలో ఒంటరిగా ఉండకూడదు. చోరుల వలన ఉపద్రవములు సంభవించును. రేపటికి శవము కుళ్ళిపోవును” అని వారు ఎన్నివిధముల భయపెట్టిననూ ఆమె అంగీకరింపలేదు. అందువలన, అందరునూ ఆమెయొక్క మూర్ఖ స్వభావమును నిందించుచుండిరి. ‘ఈ రోజు రాత్రి శవమును వదలివేసినచో దుర్గంధము వ్యాపించును. అంతట ఆమె తనంతట తానే దహనము చేయుటకు ఇచ్చునులే’ అని భావించుకొని వెంట వచ్చిన ఆమె బంధువులు, గ్రామస్తులు అందరూ వెళ్ళిపోయిరి. (34–50)

ఇక శవముతో మిగిలినది తలిదండ్రులు మాత్రమే. వారు శవమును ముందు పెట్టుకొని శోకించుచుండగా దట్టమైన చీకటి కమ్ముకొనెను. గత రెండు రోజులనుండి నిద్రాహారములు లేని కారణమున ఆ తలిదండ్రులకు మధ్యరాత్రి దాటిన పిదప మూడవ జామున వారికి కునుకు పట్టెను. వెంటనే ఆమె ఒక స్వప్నమును గాంచెను. ఆ స్వప్నమునందు వ్యాఘ్రచర్మమును ధరించి, మెడలో రుద్రాక్షమాలను కలిగి, శరీరమునిండుగా భస్మాంకితుడైనట్టి ఒక జటాజూటధారి గోచరించెను. అతడు ఒక చేతిలో యోగదండమును, మరొక చేతిలో త్రిశూలమును పట్టుకొని ఔదుంబర వృక్షము వద్దకు వచ్చి “తల్లీ! నాపై మిగుల కోపించి నీవెందులకు దుఃఖించుచుంటివి. నీ కుమారుడికి ఏమైనది. అందుకు ఒక నివారణోపాయము ఉన్నది. దానిని చెప్పుటకే నేను వచ్చితిని” అని భక్తవత్సలుడైన శ్రీగురునాథుడు వారికి అభయమును ఇచ్చెను. వెంటనే భస్మమును తీసి అతని సర్వాంగములకు లేపనము చేసెను. ఇతని నోటిని తెరిచి నా నోటితో గాలిని ఊదెదను అంటూ ప్రాణమంటే వాయువే

కదా! ఆ గాలి ఇతనిని వదలివేసి బయటకు వెళ్ళిపోయెను. వెళ్ళిపోయిన వాయువును తిరిగి ఇతనిలో నింపెదను. నీ పుత్రుడు సజీవుడు కాగలడు" అని అనెను.

ఇంతలో భయభ్రాంతురాలైన ఆ విప్రవనిత తటాలున మేలుకొనెను. ఆమెలో ఒక విచిత్రమైన విచారము ప్రారంభమాయెను. ఈ ప్రేతముమీద తనకింతటి భ్రాంతి ఎందుకు కలిగినట్లు? తన మనసులో గల భావమే నిద్రించిన సమయమున స్వప్నగతముగ కనిపించినది కదా! నృసింహసరస్వతి భగవానులు ఎట్లు వచ్చెదరు? ఇది నాకు కలిగిన కలయా? భ్రాంతియా? నిజమా? మా ప్రారబ్ధమిట్లు ఉండగా ఆ దేవదేవుని నిందించి ప్రయోజనమేమిటి? కేవలము ఇది నా అజ్ఞానమే, మూర్ఖత్వమే అగును. శ్రీగురుని నిందించి ఏమి లాభము? అతనిపై ఆగ్రహించుటవలన లాభమేమిటి? అని ఈవిధముగ చింతించుచుండగా తనకెదురుగా వున్న శవములో చైతన్యము కలుగసాగెను. దేహములోని అవయవములలో ఉష్ణము ప్రవహించి కదలిక ఏర్పడసాగెను. ఈ ప్రేతమునకు ఏమయ్యెను? అయ్యో! ఇందులో ఏదో భూతము ప్రవేశించలేదు కదా! అని ఆమె మనసులో ఒక విధమైన భయము ఉత్పన్నమై మేను జలదరించి గగుర్పొడచెను. తటాలున ఆమె ఆ శవమునకు కొంచెము దూరమునకు జరిగెను. ఇంతలో అవయవములన్నింటిలోనూ జీవము నిండిపోవగా ఆ పిల్లవాడు నిద్రనుండి లేచినట్లుగా లేచి కూర్చొనెను. తల్లివైపు చూసి "అమ్మా! నాకు ఆకలి దహించివేయుచున్నది. అన్నము పెట్టుమమ్మా!" అని రోదింపసాగెను. పుత్రుడు తల్లి సమీపమునకు వచ్చిన వెంటనే ఆమె స్తనములనుండి క్షీరము (32) ముప్పదిరెండు ధారలుగా ఉబికివచ్చి ప్రవహింపసాగెను. వెంటనే తన కుమారుని నోటికి స్తన్యమును అందించి తృప్తిపరచెను. ఆమెలో ఏకకాలమున సంతోషభయములు ముప్పిరిగొనగా తన సందేహమును తీర్చుకొనుటకై ప్రీతితో పిల్లవాడిని ఎత్తుకొని నిద్రపోవుచున్న తన భర్తను లేపి జరిగిన వృత్తాంతమంతయు అతనికి తెలియజెప్పెను. అతడు వెంటనే శ్రీగురునాథుల వారి మహిమలు 'ఇట్లే వుండును' అని వేనోళ్ల ప్రశంసింపసాగెను. దంపతులిద్దరూ కుమారునితోపాటుగా ఔదుంబర వృక్షమునకు ప్రదక్షిణములను చేసి సాష్టాంగవందనములను **అర్పించి అనేకవిధములుగా స్తుతించిరి–** "ఓ వరదమూర్తీ! మీకు జయము. జయము. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల అవతారమైన మీకు భక్తుల కోరికను తీర్చే భక్తవత్సలుడను ఖ్యాతి లభించెను. భక్తవత్సలా! మీరు ఈ విశ్వమును తరింపజేయుటకొరకే ఈ భూమిపై అవతరించితిరి. విశ్వతారకులు. స్వామీ! అజ్ఞానులమైన మాకు మిమ్ములను వర్ణించుట అశక్యము. మమ్ములను క్షమించుము. ప్రభూ! అజ్ఞానముతో అనేక నిష్ఠురోక్తులను పలికితిమి. తల్లిపై కోపించిన పిల్లలు నిష్ఠురముగా మాట్లాడినట్లు అవిద్యా–మాయవలన మీతో

మూర్ఖముగ మాటలాడితిని. నేను మిమ్ములను నిందించితిని. మమ్ములను క్షమించుము ప్రభూ! మమ్మనుగ్రహించుము స్వామీ!" అంటూ సాష్టాంగవందనములను చేయుచూ దీనముగా మొరపెట్టుకొనిరి. (51-71)

అనంతరము కృష్ణవేణీ పంచగంగా సంగమమునందు స్నానము చేయుటకై వెళ్ళిరి. తమ కుమారునితో పాటు పవిత్రముగ స్నానమొనర్చి ఆ ఉదకమును తెచ్చి, ఔదుంబర వృక్షమును అభిషేకించిరి. గురునాథుని పాదుకలకు అంటిన రక్తము పోవునటుల శుభ్రముగా కడిగి అనంతరము మనసారా అభిషేకమొనర్చిరి. ఇంతలో ఆమె దీపమును వెలిగించెను. మంత్రపూర్వకముగా విధివిధానముతో శమీపత్ర పుష్పాదులతో భక్తిగా స్వామి పాదుకలను, ఔదుంబర వృక్షమును పూజించిరి. అనంతరము హారతులిచ్చి కడు సంతోషముతో స్తోత్రగానము చేసి భక్తిపూర్వకముగా వినమ్రులై అనేక విధములుగా స్వామిని స్తుతించిరి. ఇంతలో సూర్యోదయమయ్యెను. శవమును దహనము చేయుటకొరకై ఆమె బంధువులు, మరికొందరు విప్రులు విచ్చేసిరి. సజీవుడైన వారి కుమారుని చూచి, వచ్చినవారందరూ నిర్ఘాంతపోయిరి. అత్యంత ఆశ్చర్యమునకు లోనై, వచ్చిన బంధువులు, గ్రామప్రజలు తల్లిదండ్రులద్వారా జరిగిన వృత్తాంతమును తెలుసుకొని మహదానందభరితులై చిందులు వేయసాగిరి. గురుమూర్తియొక్క కృపను వేనోళ్ల కొనియాడుతూ కరతాళధ్వనులతో ఆ అరణ్యమంతయూ దిక్కులు పిక్కటిల్లునట్లుగా గురుమూర్తికి జయజయధ్వానములను పలికిరి. ఆ దంపతులు సజీవుడైన కుమారుని ముందర నిలుపుకొని అత్యంత హర్ష పులకాంకితులై స్వామిని మాటిమాటికి స్మరింపుచు అక్కడే ఆ ఔదుంబర వృక్షము ముందరనే తమ గ్రామములోని బ్రాహ్మణులకు, తమవద్దకు వచ్చిన బంధువులకు, గ్రామములోని జనులకు చక్కని సమారాధనమును గావించిరి. ఆ ఔదుంబర వృక్షమువద్ద నిత్యసన్నిహితమై, అదృశ్యరూపమునగల శ్రీనృసింహ సరస్వతీ గురుదేవులను మనసారా స్మరించుచు స్వామియొక్క మహిమను, వారి ప్రతిభను, వారి లీలావైభవమును మననము చేసికొనుచుండిరి. ఒకరితో ఒకరు హర్షపూర్వకముగా చర్చించుకొనుచుండిరి. ఆవిధముగా శ్రీగురుస్థానము లోకులందరి మనోరథములను ఈడేర్చుచుండెను. ఈవిధముగ ఒక్కొక్క మహిమను వర్ణించి చెప్పినచో వేలాది కథలుగా ఈ చరిత్రము విస్తరించిపోవును.

నామధారకా! నరసింహవాడి స్థానమహిమ వర్ణనాతీతము. ఇట్టి దృష్టాంతములు వేలకు వేలుగా గలవు. కాని, నీలో విశ్వాసము కుదురుకొనుటకు, గురుప్రభావము తెలియుటకొరకు ఒక్క కథను మాత్రమే వివరించి చెప్పగలిగితిని. మేడిచెట్టు క్రింద శ్రీగురుడు నిత్యము, నిరంతరము నివసించియుండును. శ్రీగురుమూర్తిని చక్కగా ఆరాధించినచో, కోరిన కోరికలు అత్యంతశీఘ్రముగా నెరవేరి తీరును. ఆ మహానుభావుడు భక్తులకు సర్వాభీష్టములను ప్రసాదించుచుండును. నీవును దృఢభక్తితో గురువును ఆరాధించుచుండుము. నీ మనోరథములన్నియు

శీఘ్రముగనే సిద్ధింపగలవు. గురుపాదులను ఆరాధించు వంధ్యలకు పుత్రసంతానము కలుగును. దరిద్రులకు అష్టైశ్వర్యములు లభించును. రోగులకు ఆరోగ్యము లభించితీరును. ఇక అపమృత్యువన్నది ఎన్నటికీ వారి జోలికి వెళ్ళనే వెళ్ళదు. (72-80)

మనమునందు కడు భక్తిభావమును వహించి మనోవాక్కాయకర్మలతో శ్రీగురుచరణారవిందములను పూజించవలెను. ఎవరి మనసులో ఏయే కోరికలుండునో, అవన్నియును వెనువెంటనే నెరవేరుచుండును. కుష్టువ్యాధితో అంగహీనులైనవారు గురుచరణములను అర్చించినయెడల వారి దేహము సువర్ణమయముగా మారిపోవును అని చెప్పుటలో ఎంతమాత్రము సందేహింపనవసరము లేదు. శ్రీగురుపాదుకలను భక్తిభావముతో అర్చించిన వారికి గుండెనొప్పి, గండమాల, అపస్మారాది రోగములన్నియు సమసిపోవును. మందమతులు, బధిరులు, మూగవారు, కుంటివారు, కుష్ఠురోగులు మున్నగు వ్యాధులతో బాధితులైనవారు ఔదుంబరవృక్షమును పూజించినచో ఆరోగ్యవంతులగుదురను మాట ముమ్మాటికీ సత్యము. అచట చతుర్విధ పురుషార్థ ఫలములు నిశ్చయముగా లభించును. నృసింహవాడిలోని ఔదుంబర వృక్షమునందు శ్రీగురునాథులు ప్రత్యక్షముగా వుండియుందురు. మానవులు కోరుకొన్నవన్నింటినీ నెరవేర్చగల ఔదుంబర వృక్షము సాక్షాత్తు కల్పతరువే అని ప్రత్యేకముగ చెప్పవలసిన పనిలేదు. నృసింహవాడి యను క్షేత్రము యొక్క మహిమను, ఔదుంబర వృక్షము యొక్క ప్రతిభను గూర్చి వివరించి చెప్పుటకు నేను అసమర్థుడను. శ్రీనరసింహ సరస్వతీస్వామి వారి పేరు ఆ విధముగా జగద్విఖ్యాతి నొందినదని సిద్ధముని నామధారకునితో చెప్పిన విధముగా గంగాధర నందనుడైన సరస్వతి పవిత్రమైన శ్రీగురుచరిత్రమును మనకు కృపతో వ్యక్తపరచెను. దీనిని భక్తిపూర్వకముగా పఠించిన జనులు సకలాభీష్టములను పొందెదరు. ఇహపరసౌఖ్యములను అనుభవించుటకు, భవసాగరమునుండి తరించిపోవుటకుగాను, సరస్వతీ గంగాధరుడు నిరంతరము శ్రీగురుపాదాబ్జములను ధ్యానించుచుండెను. (81-89)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "మృతపుత్రసంజీవనము" అను ఇరువది ఒకటవ అధ్యాయము ॥ 21 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 89; మొత్తము సంఖ్య : 2354+89=2443 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ఇరువది రెండవ అధ్యాయము

గాణగాపురమునందు గుప్తముగనున్న శ్రీగురుమూర్తి మహిమలు ప్రకటమగుట - ఒక నిరుపేద బ్రాహ్మణుని గృహమునకు శ్రీగురునాథుడు భిక్షార్థియై వెడలుట - గురుకృపవలన వారి ఇంటిలోగల గొడ్డు బఱ్ఱె పాలను ఇచ్చుట - బ్రాహ్మణ దంపతులు శ్రీగురుదేవులను పూజించుట - వారి దారిద్ర్యము నశించి ఐశ్వర్యవంతులగుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యశ్రేష్ఠుడైన నామధారకుడు సిద్ధమునీశ్వరుని చరణారవిందములకు సాష్టాంగ వందనమును ఆచరించెను. **పిమ్మట వినయముతో ఇట్లు విన్నవించుకొనుచుండెను–** "సిద్ధయోగీశ్వరా! మీకు జయమగుగాక! శిష్యజనమనోహరా! అజ్ఞానతిమిరాంధకారమున మునిగి తచ్చాడుచున్న భక్తజనులకు మీరు జ్ఞానజ్యోతిస్వరూపులు. ఈ భయంకర భవసాగరమునుండి తరింపచేయగల సమర్థులు. మీ చరణారవిందముల సంపర్కము వలన నాకు పరిపూర్ణమైన జ్ఞానము లభించెను. తద్వారా, మీ అనుగ్రహముచే నా మనస్సు పరమార్థజ్ఞానమునందు లయమొందెను. పరమపురుషా! సిద్ధరాయా! లోకోద్ధారకులైన పరమగురువును మీరు మిక్కిలి సులభముగా ప్రాప్తింపచేసితిరి. కామధేనువనదగిన శ్రీగురుచరిత్రమును దయతో విస్తరించి చెప్పుచుంటిరి. అట్టి దివ్యమైన గురుచరిత్రమును ఎంత విన్నప్పటికినీ నా మనసుకు తృప్తి కలుగుటలేదు. ఇంకనూ, వినవలయుననెడి కౌతుకము అంతకంతకు పెరిగిపోవుచున్నది. మహాత్మా! శ్రీగురుడు గాణగాపురమునకు వచ్చిరని చెప్పితిరి. వారు అచట నివసించియున్నప్పుడు జరిగిన మహత్తరమైన చరిత్రమును నాకు దయతో వినిపించి నన్ను తరింపచేయగలరని" ప్రార్థించెను. **శిష్యరత్నమగు నామధారకుని మాటలను విని మిగుల సంతోషించిన సిద్ధమునీశ్వరుడు ఇట్లు చెప్పదొడగెను–** "నామధారకా! నీవు గుణవంతుడవు. గురుకృపాపాత్రుడవు. ఒక ఉత్తమ శిష్యుడవు. నీ మనస్సు నిర్మలమైనది. నీ జీవనము మిక్కిలి ధన్యమైనది. గురుమూర్తి అనుగ్రహమునకు పరిపూర్ణముగ పాత్రుడవైతివి. సమస్త లోకములందు నీవు పూజనీయుడవైతివి. నీవు అడిగిన ఉత్తమప్రశ్నల వలన నాకు అంతులేని ఆనందము కలుగుచుండెను. కామధేనువు వంటి గురుచరిత్రమును విస్తారముగా చెప్పవలెనని నా మనస్సు ఎంతగానో ఉల్లసిల్లుచుండెను. శ్రీగురుమూర్తి మహిమలు

అనంతములు. నిరుపమానములు. వారి మహిమలను భక్తితో శ్రవణమొనర్చువారు సర్వాభీష్టములను పొందెదరు. శ్రీగురునాథుడు గాణగాపురమునకు వచ్చి అచట గుప్తరూపమున ఉండిపోయిరి. (1-10)

గాణగాపుర సమీపమున భీమానది ఉత్తరవాహినియై ప్రవహించుచుండెను. అది అమరజా నదితో సంగమించుచుండుటవలన ఆ క్షేత్రము యొక్క మహిమ వర్ణనాతీతమయ్యెను. భీమా – అమరజా సంగమ స్థానమున ఒక అశ్వత్థ వృక్షము కలదు. దానియొక్క మహిమ అపారము. ఆ దివ్యక్షేత్రము వరదభూమి. అత్యంత పుణ్యప్రదమైన అమరజానది భీమా తీరమునందు సంగమించును. అది అష్టతీర్థములతో కూడిన మహాక్షేత్రము. ఈ క్షేత్రము తీర్థరాజమగు ప్రయాగతో సమానమైనది. అచటి అష్టతీర్థముల మహిమ చెప్పనలవికానిది. ఇట్టి మహిమాన్వితమైన క్షేత్రముయొక్క తీర్థము యొక్క మహిమను లోకమునకు వెల్లడి చేయుటకొరకు, అచటి భక్తజనులను తరింపచేయుటకొరకు శ్రీగురుమూర్తి అచట ప్రీతితో గుప్తముగా ఉండిపోయిరి. శ్రీగురుచరణములలో సమస్త తీర్థములు ఉండునని వేదములు ఘోషించుచున్నవి. శ్రీగురునాథుడు భక్తజనులను తరింపచేయుటకొరకే అవతరించిరిగాన, అతి గోప్యముగా ఉండిపోయిన తీర్థములను లోకమునకు వెల్లడించుటకొరకు, వాటి ఖ్యాతిని ఇనుమడింపచేయుటకొరకే ఆయా తీర్థములయందు వారు నివసించిరే కాని, వారి పాదములయందే సర్వతీర్థములు ఉన్నందున వారికి తీర్థక్షేత్రములతో ఒనగూడే ప్రయోజనము ఎంతమాత్రము లేదు.(1) అయితే శ్రీనృసింహసరస్వతి స్వామివారు గోప్యముగా ఉండవలయునని సంకల్పించినప్పటికినీ వారి మహిమ ఏవిధముగ ప్రకటమై విఖ్యాతి నొందెనో, అట్టి దృష్టాంతమును గూర్చిన కథను నీకొకటి విస్తరించి చెప్పెదను. సావధానుడవై వినుము. (11-18)

---

1. **'తీర్థీ కుర్వంతి తీర్థాని'** అని శాస్త్రవచనము. **'తీర్థీ కుర్వంతి తీర్థాని, సుకర్మీ కుర్వంతి కర్మాణి, సచ్ఛాస్త్రీ కుర్వంతి శాస్త్రాణి'** (నారద భక్తిసూత్రములు - 69) సాధువులు, సత్పురుషులు, బ్రహ్మనిష్ఠులు, శాంతస్వరూపులు, జీవన్ముక్తులు అగు మహానుభావులు నిలిచినచోటు, వారు స్నానమాడిన రేవు తీర్థమగును. వారిచేత ఆచరింపబడు శాస్త్రోక్త కర్మలే ఆదర్శవంతములగు సత్కర్మలగును. వారు ఏ శాస్త్రమును ఆదరింతురో, అదియే సచ్ఛాస్త్రముగా మారిపోవును. **'భవద్విధా భాగవతా స్తీర్థభూతాః స్వయం విభో । తీర్థీ కుర్వంతి తీర్థాని స్వాంతఃస్థేన గదాభృతా ॥'** (శ్రీమద్భాగవతం 1-13-10) అనగా - "ఓ ప్రభూ! మీ వంటి భాగవతోత్తములు స్వయముగ తామే తీర్థస్వరూపులగుదురు. మీ హృదయాలలో గదాధారియగు శ్రీకృష్ణపరమాత్మ స్థిరముగా నివాసముండుటచే, మీరు వెళ్ళిన ప్రతి తావు తీర్థస్వరూపమే అగును. అంతేకాదు, తీర్థస్వరూపులైన మీవలన తీర్థములు కూడా పవిత్రములైపోవును కదా!" అని ధర్మరాజు భక్తప్రవరుడగు విదురునితో అన్నమాట. ఇది శ్రీమద్భాగవతము ద్వారా శ్రీ వ్యాసమహర్షి చెప్పిన గొప్ప మాట.

సహస్రకిరణములు కలిగిన సూర్యభగవానుని ఎవరైన గుప్తముగా ఉంచగలరా? తనంతతానుగా ప్రకాశించుటయే ఆయన సహజస్వభావము. అదేవిధముగ మనోహరమైన సంగమమునందు త్రిమూర్త్యాత్మక అవతారస్వరూపమైన శ్రీగురునాథుడు గుప్తముగ ఎట్లుండగలరు? సంగమ తీరమున గల అరణ్యప్రదేశమునందు శ్రీగురుడు నివసించుచూ మధ్యాహ్నకాలమున గాణగాపురమునకు నిత్యము భిక్షార్థముగా వెళ్లుచుండెడివారు. ఆ గ్రామమునందు సుమారుగా ఒక వంద బ్రాహ్మణ కుటుంబములు ఉండెను. ఆనాడు అది ఒక బ్రాహ్మణ 'అగ్రహారము'గా విరాజిల్లెను. పూర్వము వేదాధ్యయనము చేయుచూ, వైదిక ధర్మ, కర్మ, నిష్ఠాగరిష్ఠులైన బ్రాహ్మణులు నివసించిన ప్రదేశమును అగ్రహారమనెడు పేరుతో పిలిచేవారు. ఆ గ్రామములోని బ్రాహ్మణ కుటుంబములలో ఒక నిరుపేద బ్రాహ్మణుడు ఉండెను. అతని భార్య భర్తను అనుసరించే ఉత్తమ ఇల్లాలు. ఆమె గొప్ప పతివ్రతగా వాసిగాంచినది. కటిక దారిద్ర్యముతో బాధపడుచున్న ఆ బ్రాహ్మణుని ఇంటిలో ఒక ముదుసలి గొడ్డుబోతు బర్రె ఉండెను. ఆ బర్రెకు దంతాలు ఊడిపోయి బక్కచిక్కియుండెను. ఆ గొడ్డు బర్రెను నదీతీరమున ఉన్న ఒండ్రుమట్టిని తమ పంటపొలమునకు చేర్చుటకై మోయడానికిగాను ఆ గ్రామములోని రైతులు బాడుగకు తీసికొనిపోయెడివారు. అందుకు బదులుగా వారు కొంత ద్రవ్యమును ఆ బ్రాహ్మణునకు ఇచ్చెడివారు. అట్టి ధనముతో కావలసిన ఆహారసామగ్రిని తెచ్చుకొని ఆ పేదబ్రాహ్మణ దంపతులు కాలము గడుపుచుండెడివారు. ధనము లభించని నాడు గ్రామమునందు ఇంటింటికి వెళ్ళి యాచన చేసి వారిచ్చే ఆహార సామగ్రిని తెచ్చుకొని వంట చేసుకొని ఈశ్వరునకు నివేదించెడి వారు. దానినే మహాప్రసాదముగా భుజించి కాలము గడుపువారు. ఒకరోజున వారి ఇంటికి శ్రీగురునాథుడు అత్యంత ప్రీతితో భిక్షకై వెళ్ళిరి. ఆ బ్రాహ్మణ దంపతులు గురునాథునియందు కడు భక్తిని గలవారై ఉండినందున శ్రీగురుమూర్తి నిత్యము వారి ఇంటికే భిక్షకు వెళ్ళుచుండెడి వారు. అది చూసి ఆ గ్రామములోని బ్రాహ్మణులందరు ఈవిధముగ పరస్పరము ముచ్చటించుకొనెడివారు. 'శ్రోత్రియులమైన పండితులము, శ్రీమంతులము అయిన మనము ఇంతమందిమి ఉండగా మన గృహములకు రాకుండా ఈ స్వాములవారు ఆ నిరుపేద బ్రాహ్మణుని ఇంటికే ప్రతిరోజు భిక్షకు వెళ్లుచుండిరి. మనము కమ్మని శాకపాకములతో చక్కని భిక్ష చేయగలము గదా! కాని, ఆ బ్రాహ్మణుడు ఏమి చేయగలడు. ఈ యతీశ్వరుడు నిత్యమూ మన గృహములన్నింటినీ వదలిపెట్టి ఆ దరిద్రుని ఇంటికే వెళ్ళుచున్నాడేమిటి?' అని అనేకవిధముల నిందావాక్యములను పలుకుచుండిరి. భక్తవత్సలుడైన శ్రీగురునాథుడు ప్రపంచమునకు అతీతమైనవాడు. తన భక్తులను కృతార్థులను చేయుటకు భగవద్భక్తి గలవారి ఇంటికే భిక్షకు వెడలును గాని, భక్తి లేని ఇంటివారి దిక్కు

చూడనైనా చూడదు కదా! అట్టి మహాత్ములకు పక్వాన్నములతో ప్రయోజనమేమిటి? వారికి భక్తి పరమాన్నమే ప్రధానము. కృష్ణపరమాత్ముడు హస్తినాపురమునకు వెళ్లినపుడు వెదకి వెదకి తన భక్తుడైన విదురుని గృహమునకే వెడలెను గాని, సమస్త వైభవములతో కూడిన విందుభోజనము తయారు చేయించిన, దుర్మార్గభావమును కలిగిన దుర్యోధనుని రాజద్వారము వైపు కన్నెత్తి కూడా చూడలేదు కదా!(1) ఎవరు సాత్త్వికమైన బుద్ధిని కలిగియుందురో, వారియందే శ్రీగురువునకు అత్యంత ప్రేమ నిండియుండును. అట్టివారే గుర్వనుగ్రహమునకు పాత్రులై ఇహపరసౌఖ్యములను పొందెదరు. గురువునకు భక్తులయందు అపారమైన ప్రేమ యుండును. భక్తుడు పేదవాడు అను నిరసనభావము గురువు హృదయము నందు ఎప్పుడూ ఉండదుగాక వుండదు. ఒకవేళ గురువు అనుగ్రహించిన యెడల పరమ దరిద్రుడు కూడా తృటికాలములో ఆగర్భశ్రీమంతుడు కాగలడు. ఒక నిరుపేదను రెప్పపాటులో ఒక రాజ్యమును పరిపాలించగలిగే రాజుగా చేయగలడు. కోపించినచో, ఎంతటివానినైనా క్షణమున భస్మము చేయ సమర్థుడు. అందువలన దయాపయోనిధియగు పరమపురుషడగు గురునాథుడు భక్తులయందలి విశుద్ధమైన ప్రేమభావమునకు వివశుడై హర్షముతో దరిద్రుని ఇంటికి వెళ్ళుటలో దోషమేముండును? అట్టి సమర్థుడైన సద్గురువు లభించి శ్రీగురుచరణసరోజముల స్పర్శ ఎవని మస్తకమునకు సిద్ధించగలదో, వాని నొసట బ్రహ్మదేవుడు దిద్దిన దుష్టాక్షరములు సైతము శుభాక్షరములుగా మారిపోవును. శ్రీగురునాథునకు అట్టి మహిమను ప్రకాశింపచేయు బిరుదములు అనేకములుగా గలవు. పరబ్రహ్మస్వరూపుడైన శ్రీగురుమూర్తి యొక్క మహిమను, వారి ప్రభావమును వర్ణించు సామర్థ్యము మన వాక్కునకు ఎక్కడున్నది? అనేక జన్మజన్మాంతర సుకృతము గలిగినవారికే సద్గురుమూర్తి యొక్క దర్శనముగాని, స్పర్శగాని, అనుగ్రహముగాని లభించగలదు. అంతటి మహిమోపేతులైన శ్రీగురుమూర్తిని తమ ఇంటికి రప్పించుకొనుచున్న ఆ నిరుపేద బ్రాహ్మణ దంపతుల పూర్వజన్మపుణ్య విశేషమును గూర్చి మనము ఏమని చెప్పగలము? ఎంతని వర్ణించగలము? వారి పూర్వపుణ్య విశేషము గొప్పది కావుననే, నిత్యమునూ శ్రీగురునాథుడు వారి ఇంటికే భిక్షకు వెడలుచుండెను. (19-34)

సీ॥ భక్తితో నొసగిన పత్రమైనను గాని, తినలేదె? ద్రుపదుని తనయ కొరకు,
ఆర్తితో కుసుమమ్ము నర్పించి మొరలిడ, రాలేదె? వే కరిరాజుకొరకు,
పండుదినుటగాదు పై పొట్టు సైతము, మ్రింగలేదె? విదురాంగనకయి,
నోరూరబడిశెడు సీరమున్ గైకొని, త్రావలేదె? రంతిదేవుకొరకు,
గీ॥ ఏమిగని యారగించితో శ్యామలాంగ! అట్టి ప్రేమను భిక్షగా బెట్టుమయ్య,
జోలిసాచితి నీ ముందు జాలితోడ, పరమకరుణాంతరంగ! శ్రీ పాండురంగ !! – (శ్రీపాండురంగశతకము – 4వ; రచన: మహోన్నత పూజ్య శ్రీ అప్పాల విశ్వనాథశర్మ)

ఇట్లుండగా, ఒకనాడు వారి ఇంటిలోగల ముసలి గొడ్డు బర్రెను మట్టి మోయుటకు గాను బాడుగగా ఎవరునూ తీసుకొని వెళ్ళలేదు. అందుచే వారికి ఆ దినమున ద్రవ్యము లభించలేదు. అది వైశాఖమాసమగుటచే మధ్యాహ్నకాలము ఎండ తీవ్రముగా కాయుచుండెను. అట్టి సమయమున కృపామూర్తియగు గురుమూర్తి ఆ పేదబ్రాహ్మణుని ఇంటికి భిక్షకై వచ్చుట తటస్థించెను. ఆనాడు వారి ఇంట ఏమియూ లేనందున, ద్రవ్యముకూడ లభించనందున ఆ బ్రాహ్మణుడు మాధుకరమునకై గ్రామములోనికి వెళ్ళియుండెను. ఇంటిలో అతని భార్య మాత్రమే యుండెను. **అట్టి సమయమున శ్రీగురునాథుడు ఇంటిముందుకు వచ్చి 'భిక్షాం దేహి' అని పలికెను.** స్వామివారి మాటను వినుటతోడనే ఆ పతివ్రత అతిశీఘ్రముగ పరిగెత్తుకొనివచ్చి **సాష్టాంగవందనము నాచరించి, వినయముతో పలికెను-** "స్వామీ! లోపలికి దయచేయుడు. మా యజమాని మాధుకరమునకై గ్రామములోనికి వెళ్ళియుండిరి. ఉత్తమ ధాన్యమును తీసికొని వేగమే వచ్చెదరు. దయచేసి ఈ ఆసనమును స్వీకరించి, స్వామీ! కొద్ది తడవు కూర్చొనుడు" అని ఆ పతివ్రతామతల్లి ప్రార్థించెను. శ్రీగురునాథుడు మందహాసవదనముతో ఆసనమును అలంకరించి **ఆ విప్రవనితను చూసి, ఇట్లనెను** – "అమ్మా! మీ ఇంటిలో పాలు లేవా? ఒకవేళ పాలు ఉన్న యెడల వాటిని భిక్షగా ఇవ్వవచ్చును. అదుగో! మీ ఇంటిలో బర్రె ఉన్నది కదా! ఇంటిలో బర్రె ఉండగా పాలు ఎందుకు ఉండవు. ఇంటిలో ఏమియూ లేదు. నా భర్త వచ్చువరకు వేచియుండమని చెప్పెదవేమి? నేను భిక్షగా పాలనే స్వీకరించెదను. ఇట్లు నన్ను మోసగించుట యుక్తము కాదు" అని పలికెను. **శ్రీగురునాథుని మాటలు విని ఖేదపడిన ఆ విప్రవనిత చేతులు జోడించి, నమస్కరించి వినయముతో ఇట్లనెను-** "స్వామీ! ఆ బర్రె గొడ్డుది. పైగా ముసలిది. దానికి పళ్ళు కూడా ఊడిపోయినవి. ఇప్పటివరకు అది ఒక్కసారియైనను గర్భమును ధరించుటగాని, ప్రసవించుటగాని యెరుగదు. అది పాషాణమువంటి వంధ్య మహిషి. దానిని దున్నపోతును పోషించినట్లుగా పోషించుచుంటిమి. తత్కారణమున మట్టి మోయుటకు దానిని ఉపయోగించుచుంటిమి. తద్వారా, వచ్చు ద్రవ్యముతో మేము మా ఉదరపోషణ చేసుకొనుచుంటిమి" అని సమాధానము చెప్పెను. అంతేగాక, ఈ రోజున దీనిని బాడుగకు కూడా ఎవ్వరూ తీసికొనిపోనందున, ఇంటిముందర కట్టివేయబడి యున్నదని" వినయముతో చెప్పెను. **అందుకు శ్రీ స్వామివారు ఆమెతో ఇట్లనెను** – "తల్లీ! అసత్యము చెప్పుచుంటివేమి? ఎందులకు? నీవు వెంటనే ఒక పాత్రను తీసికొని, ఆ బర్రె దగ్గరకు వెళ్ళి పాలు పితుకుము. ఆ పాలతో నేను భిక్షను గైకొని వెడలిపోవుదును. ఆలస్యము చేయకుము" అని పలికెను. ఆమె గురువు యందు దృఢమైన విశ్వాసము కలిగిన భక్తురాలు గనుక, గురుమూర్తి పలుకులను గట్టిగా విశ్వసించి, వెంటనే పాత్రను తీసికొని పాలు

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

పితుకుటకై గేదె వద్దకు వెళ్ళెను. సాక్షాత్తు కామధేనువు వంటి శ్రీగురువాక్యములతో ఆ విప్ర వనిత వెళ్ళి పాలు పితికినది. అంతే, రెండు క్షణాలలో ఆ గొడ్డు బర్రె ఇచ్చిన పాలతో ఒకటి కాదు, రెండు పాత్రలు నిండిపోయెను. ఆ పతివ్రతామతల్లి మిగుల ఆశ్చర్యచకితురాలయ్యెను. 'ఈయన నిశ్చయముగా పరమేశ్వరుడే కాని, మానవమాత్రుడు కాదు. ఈయన మాటలు ఎంత నిజమైనవి. ఎంత విచిత్రముగ మాట్లాడిరి' అని లోలోన తలపోసెను. పాలు తీసికొని వెంటనే పరుగెత్తుకొని వంట ఇంటిలోనికి ప్రవేశించి వాటిని చక్కగా కాచి, చల్లార్చుచుండెను. ఇంతలో గురుడు ఆమెతో "అమ్మా! భిక్షగా పాలను త్వరగా తెచ్చి ఇవ్వుము. నేను మా నివాసమునకు వెళ్ళిపోవలెనని" ఆజ్ఞాపించిరి. స్వామివారి మాటలు విని మహదానందభరితురాలై, ఒక పాత్రనిండుగా పాలను తెచ్చి శ్రీ గురుమూర్తి ఎదుట సమర్పించెను. **శ్రీగురునాథుడు మిగుల సంతసించి అత్యంత ప్రీతితో నుడివెను-** "అమ్మా! నేటినుండి మీ ఇంటిలో నిరంతరము లక్ష్మీదేవి అఖండముగా నివసించును. మీకు నిశ్చయముగ పుత్రపౌత్రులు కలిగెదరు. అఖండ ఐశ్వర్యము ప్రాప్తించును" అని వరమునిచ్చి, పాలను స్వీకరించి వెంటనే సంగమస్థానమునకు వెళ్ళిపోయిరి. (35-54)

శ్రీగురుడు సంగమస్థానమునకు వెళ్ళిన పిమ్మట భిక్షాటనమునకు వెళ్ళిన ఆ విప్రుడు తిరిగి ఇంటికి చేరెను. శ్రీగురుమూర్తియగు నృసింహసరస్వతీ స్వామివారి మహిమను తన భార్య నోట వివరముగా వినెను. **అద్భుతమైన విశేషము ఘటించిన సంఘటనకు మిగుల అబ్బురపడి ఆతడిట్లనెను-** "ఆహా! మన కంటికి మానవునిగా కనిపించినప్పటికినీ ఆయన సాక్షాత్తు పరమేశ్వరుని అవతారమే. కాని, వేరు కాదు. ఆయన నిజముగా పరమపురుషులే. ఇందెంతమాత్రము సందియము లేదు" అని అంటూ, మన పేదరికమునకు కారణమైన పాతకమంతయు హరించిపోయెను. శ్రీగురుమూర్తి యొక్క అనుగ్రహము వలన సకలాభీష్టములను పొందెదము" అని హర్షాతిరేకముతో పలికెను. వెంటనే పరమపూజ్యులైన ఆ యతీశ్వరులను దర్శించుకొనవలయుననే తపనతో తన భార్యను పురమాయించి, పూజాద్రవ్యములను, మంచి పుష్పములను, ఒక మంగళహారతిని, ఒక కలశము నిండా జలమును తీసికొని ఆ దంపతులు సంగమస్థలమునకు వెళ్ళిరి. శ్రీనృసింహసరస్వతి స్వామివారిని దర్శించుకొని, వారికి సాష్టాంగవందనము ఆచరించిరి. అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన ప్రీతిపూర్వకమగు ఉత్కటమైన అనన్య భక్తిభావము ఆ దంపతుల ఎదలో పొంగిపొరలుచుండెను, గురుమూర్తి వారి యెడల కురిపించిన కరుణాసముద్రములో మునకలు వేయుచుండిరి. గుండెలు కరిగిపోయి కనులవెంబడి బాష్పకణములు రాలుచుండగా, గురుభక్తికి పరవశులైన ఆ దంపతులు

ప్రత్యక్షముగా శ్రీగురుమూర్తి దివ్య శ్రీచరణసరోజములను అభిషేకించిరి. మంగళద్రవ్యములతో పూజించిరి. కడుభక్తితో హారతినిచ్చిరి. వారికి సాష్టాంగవందనము ఆచరించి అనేకవిధములుగా స్తుతించిరి. ఆ నిరుపేద బ్రాహ్మణుల శుద్ధమైన, స్వచ్ఛమైన భక్తిప్రపత్తులకు మిగుల సంతోషించిన **శ్రీగురుమూర్తి తిరిగి వారితో ఇట్లు పలికిరి** – "నేటినుండి మీకు దరిద్రము దూరమైపోయి సకలసంపదలతో తులతూగుచూ, పుత్రపౌత్రాభివృద్ధితో పూర్ణాయుష్మంతులై ఉండెదరని, అభయదానపూర్వకముగ వరమునిచ్చెను. ఈవిధముగ ఆ బ్రాహ్మణునకు లభించిన వరము నిజమై అనంతరము వారికి కుమార్తెలు, కుమారులు కలిగి, అష్టైశ్వర్యములతో తులతూగుచూ పూర్ణాయుష్మంతులై జీవించిరి" అని సిద్ధముని తన శిష్యునితో చెప్పుచూ, **"నామధారకా! శ్రీగురుదేవుని సేవించి, వారి అనుగ్రహమునకు పాత్రులైన మానవులకు దైన్యమనునది ఎట్లుండును? వారు నిరుపేదలైనను, జ్ఞానహీనులైనను, నికృష్టులైనను, నీచులైనను, పరమార్థజ్ఞానమును పొంది, ఇహమునందు అష్టైశ్వర్యములను అనుభవించి, పరమునందు మోక్షమునకు యోగ్యులయ్యెదరు"** అని వివరించి చెప్పెను. అట్టి గురుశిష్యుల సంవాదమును సరస్వతీ గంగాధరుడు శ్రీగురుచరిత్రమను గ్రంథరూపమున విస్తరించి మనకు చెప్పుచుండెను. అత్యద్భుతమైన ఈ కథను నిత్యపారాయణము చేసినచో, ఇటు దీనత్వము, అటు కటిక దారిద్ర్యము వెంటనే పలాయనము చిత్తగించును. (55–62)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "వంధ్యామహిషీ దోహనము" అను ఇరువది రెండవ అధ్యాయము ॥ 22 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 62; మొత్తము సంఖ్య : 2443 + 62 = 2505 ఓవీలు)

◆ ◆ ◆

దత్తో నామస్మరణ మమలం కుర్వతాం సన్నిధానే,
గూఢాకార శ్చరతి సహసా వాంఛితం దాతుకామః ।
నిత్యాకారం నిరుపమయశ స్సంపదా మాదిహేతుం
దత్తాత్రేయం వరద మనిశం భావయామి ప్రసన్నమ్ ॥

శ్రీ గురు చరిత్ర

ఇరువది మూడవ అధ్యాయము

శ్రీగురుమూర్తి నృసింహసరస్వతీ స్వామివారి లీలావైభవము - గాణగాపుర గ్రామాధిపతి గురునాథుని తమ గ్రామమునందు నివసించుటకై అభ్యర్థించుట - శ్రీగురుడు అంగీకరించుట - పల్లకిలో ఊరేగింపుగా శ్రీవారు గాణగాపురమునందు ప్రవేశించుట - అశ్వత్థ వృక్షముపైనగల బ్రహ్మరాక్షసుని ఉద్ధరించుట - మఠము నిర్మించుట - శ్రీగురుమహిమలు విస్తృతముగ వ్యాపించుట - కుమసి గ్రామములోగల ఒక తాపసి శ్రీగురునాథుని నిందించుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

"ఆ తర్వాత కథాక్రమమును వివరించి చెప్పుము స్వామీ!" అని నామధారకుడు సిద్ధమునీశ్వరుని ప్రార్థించెను. **అంతట సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పసాగెను** – "కుమారా! గురుమూర్తి యొక్క లీలలు అత్యద్భుతములు, అగాధములు, అపారములు. ఆ తర్వాత జరిగిన అత్యద్భుతమైన గురుమూర్తి యొక్క కథావృత్తాంతమును ఇప్పుడు చెప్పుచున్నాను. నీవు సావధానముగా వినవలయును. తమ ఇంటిలో గురుదేవుల యొక్క అపారమైన కృపాప్రభావముచేత ఒక ముదుసలి గొడ్డుబర్రె యౌవనములో ఉన్నటువంటి పాడిబర్రె ఏవిధముగ పాలను ఇచ్చునో, ఆవిధముగ రెండుపూటలా పాలను ఇచ్చుటను చూచి ఆ నిరుపేదబ్రాహ్మణ దంపతులు తమ భాగ్యమునకు తామే మురిసిపోవుచుండిరి. ఏ పూర్వజన్మ సుకృతమువల్లనో మనలను ఉద్ధరించుటకొరకై ఆ పరమేశ్వరుడే మారువేషములో ఈ యతీశ్వరుని రూపమున భిక్షకోసమై మన ఇంటికి ఏతెంచెనని భావించుకొనుచు, శ్రీవారియందు మరింత దృఢమైన భక్తిని పెంచుకొనుచుండిరి. వారి కృపను మాటిమాటికి స్మరించుకొనుచుండిరి. ఇట్టి అత్యాశ్చర్యకరమైన లీలను గూర్చి ఆ బ్రాహ్మణుడు తమ ఇరుగుపొరుగువారితో తెలియచెప్పెను. మరునాడు మామూలు ప్రకారముగ ఆ గ్రామములోని రైతులు ఈ బ్రాహ్మణుని ఇంటికి వచ్చి "అయ్యా! ఎరువు మట్టిని మోయటానికి ఈ రోజు మీ బర్రెను బాడుగకు మాకు పంపించవలసినది" అని అడిగిరి. **అందుకు ఆ బ్రాహ్మణుడు వారితో** – "నాయనా! చక్కగా పాలను ఇచ్చుచున్న మా బర్రెను నేటినుండి ఎరువు మట్టిని మోయుటకొరకు బాడుగకై మీకు ఇవ్వటము కుదరదని" చెప్పెను. ఈ మాటను విన్న ఆ రైతులు అత్యంత

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

ఆశ్చర్యమునకు గురియైరి. “ఏమయ్యా! బ్రాహ్మణుడా! నవ్వులాటయా! నిన్న మొన్నటివరకు బాడుగకు ఇచ్చినది. పైగా అది గొడ్డు బర్రె గదా! ముదుసలిది. బక్కచిక్కినది. పళ్లు ఊడిపోయినది. ఏనాడూ గర్భము ధరించనటువంటి వట్టిపోయిన పొదుగును కలిగిన గొడ్డు బర్రె నిన్నటినుండి పాలు ఇచ్చుచున్నది అని నీవు చెప్పడము కదు విడ్డూరముగా ఉన్నది. అది పాలను ఎట్లు ఇచ్చుచుండెను. నిజమా! లేక బాడుగకు ఈయకూడదని ఇట్లు అనుచుంటివా?” అని వచ్చిన రైతులు ప్రశ్నించిరి. అందుకు ఆ బ్రాహ్మణుడు వెంటనే ఇంటిలోనికి వెళ్ళి తాను పాలను పితికిన కడవను తెచ్చి, వారికి చూపించి, “ఇదుగో! చూడుడు! నాయనా! ఈ కడవ నిండుగా పాలు. పూటకు రెండు కడవల పాలు. అదికూడా రెండు పర్యాయాలు సమృద్ధిగా పాలను ఇచ్చుచున్నది” అని చెప్పెను. ఆ రైతులు నివ్వెరపోయిరి. “ఏదీ మేము మా కంటినిండా చూచెదము, ఒకసారి పితికి చూపించుము” అని కోరిరి. అందుకు హర్షాతిరేకముతో ఆ బ్రాహ్మణుడు వెంటనే వారి అందరి ఎదుట పాలను పితికి చూపించెను. ఆ ముసలి బర్రె సమృద్ధిగా పాలను ఇచ్చెను. ఈ అద్భుతమునకు అందరూ విస్మయావహులైరి. ఇది కేవలము మా ఇంటికి ప్రతినిత్యము భిక్షకొరకై విచ్చేయుచున్న శ్రీగురుదేవుల యొక్క మహిమనే తప్ప మరేమియు కాదని, క్రిందటిరోజున జరిగిన అద్భుతమైన గురునాథుల యొక్క మహిమను గూర్చి ఆ బ్రాహ్మణ దంపతులు వారి ఇంటికి వచ్చిన రైతులకు ప్రశంసాపూర్వకముగా కదు ముదముతో వివరించి చెప్పిరి. వారందరు ఆ వీధిలో ఉన్నవారికి, ప్రక్కవీధిలో వున్నవారికి అత్యద్భుతంగా సంఘటించిన గురుమహిమా విశేషమును గూర్చి ఒకరితోనొకరు ముచ్చటించుకొనుచుండిరి. ఆ నోట, ఈ నోట చర్చింపబడుచున్నటువంటి గొడ్డు బర్రె పాలను ఇచ్చుచున్న విశేషమును గూర్చి కొందరు తమ గ్రామాధిపతికి తెలియజేసిరి. ఆ గ్రామాధిపతి ఆశ్చర్యచకితుడై వెంటనే వచ్చి ఈ బ్రాహ్మణునకు నమస్కరించి ఆదరముతో ప్రశ్నించెను. **అందుకు వెంటనే ఆ బ్రాహ్మణుడు వినయపూర్వకముగా తమ గ్రామాధిపతికి ఇట్లు వివరించి చెప్పెను.** (1-8)

“మహాశయా! సంగమస్థలమువద్దకు కొత్తగా ఒక గొప్పనైన వర్చస్సు కలిగిన సన్న్యాసి వచ్చియున్నారు. వారు ఆ సంగమస్థలమువద్ద ఔదుంబర వృక్షము క్రింద నివసించుచున్నారు. ఇదంతయూ వారి మహిమా ప్రభావమేగాని, వారు మామూలు సన్న్యాసి యని మేము భావించితిమి. కాని, ఇప్పుడు వారు కేవలము త్రిమూర్త్యావతార స్వరూపమే అని మాకు స్పష్టమైనది. ఏలనన, ప్రతినిత్యము ఆ మహానుభావుడు మా ఇంటికి మధ్యాహ్నము వేళ భిక్షకోసమై వచ్చెడివారు. అత్యంత కృపతో, భక్తవత్సలుడైన శ్రీగురునాథుడు నిరుపేదలమైన మా ఇంటిని ఎంచుకొని ఏ పూర్వజన్మపుణ్య విశేషముచేతనో, మా ఇంటికి భిక్షకు వచ్చుచున్నారని భావించి, వారికి నిత్యము భిక్షను ఇచ్చుచుంటిమి.

అయితే, నిన్నటి దినము మా బర్రెను బాడుగకు ఎవరునూ తీసికొని వెళ్లలేదు. అందువలన ఇంటిలో ద్రవ్యము కరువైనది. ఏ పదార్థము లేకుండెను. నేను భిక్షాటన నిమిత్తముగ మన ఊరిలోనికి వెళ్ళితిని. ఇంతలో శ్రీగురుమూర్తి భిక్షకొరకై రానే వచ్చిరి. "అయ్యో! భగవంతుడా! ఇప్పుడు నేనేమి చేయుదును?" అని నా భార్య లోలోపలే దిగులు పడుచుండెను. అది గమనించిన శ్రీస్వామివారు – "భయమెందుకు తల్లీ! మీ బర్రెను పిండి పాలు ఈయవచ్చును గదా!" అని పలికిరి. వారి వాక్కును విశ్వసించి ఆమె పాత్రను తీసికొని బర్రె వద్దకు వెళ్ళెను. దాని పొదుగు నిండిపోయి పాలు కారిపోవుచుండెను. చెప్పుటకు ఇంకేమున్నదయ్యా! మా గొడ్డు బర్రె సమృద్ధిగా పాలను ఇచ్చెను. ఆ పాలనే భిక్షగా స్వీకరించి శ్రీస్వామివారు ముదముతో వెళ్ళిపోయిరని" చెప్పెను.

అందుకు ఆ గ్రామాధిపతి ఇది గొడ్డుపోయిన బర్రె అని గ్రామములో అందరికీ తెలిసిన విషయమే. కానీ, నీవు చాలా చోద్యమును వివరించుచుంటివి. నా కళ్ళముందు పితికి చూపించుమని ఆయన కోరెను. అప్పుడు సరేనని, వెంటనే పాత్రను తెచ్చి తమ గ్రామాధిపతి కళ్ళెదుట ఆ బ్రాహ్మణుడు గొడ్డుపోయిన ముసలి బర్రె పొదుగును పిండగా, పాత్ర నిండుగా పాలను ఇచ్చెను. తమ కంటిముందు జరిగిన, అద్భుతమైన గురుమూర్తి యొక్క లీలను చూచిన ఆ గ్రామాధిపతి నివ్వెరపోయెను. వెంటనే శ్రీస్వామివారిని దర్శించుటకై ఆ బ్రాహ్మణ దంపతులను తమ వెంట రావలసినదని కోరెను. అందుకు వారు 'సరే'ననిరి. ఆ రాజుగారు(1) వెంటనే తన భార్యాపుత్రులను, తమ యొక్క సేవక దళమును, సైన్యమును వెంట తీసికొని, మేళతాళాలతో గురువుయొక్క మహిమను కీర్తించుచు ఊరేగింపుగా సంగమస్థలమునకు వెళ్ళెను. సంగమస్థలము వద్ద ఔదుంబర వృక్షముక్రింద అద్భుతమైన వర్చస్సుతో ఆసీనులై విరాజిల్లుచున్న శ్రీ గురుమూర్తిని దర్శించి వెంటనే ఆ రాజుగారు అత్యంత భక్తిభావముతో సాష్టాంగ వందనము చేసెను. లేచి నిలబడి రెండు చేతులను జోడించి **ఆ గురుమూర్తిని ఇట్లు స్తుతించెను.** (9–13)

"జగద్గురూ! మీకు జయము. జయము. మహిమాన్వితమగు మీ కృపకు, అత్యద్భుతమైన మీ లీలకు మా కోటికోటి వందనములు. మీరు త్రిమూర్తుల అవతారమే. మీ మహిమను మేము ఏమని వర్ణించగలము. అబ్బురపరచే లీలలు. అది వర్ణించుటకు మాకు అసాధ్యము. మాయామోహమనే అంధకారములో మునిగియున్న మందబుద్ధులము మేము. జ్ఞానజ్యోతి స్వరూపా! జగజ్జ్యోతి స్వరూపా! మమ్ములనుద్ధరించుము.

---

1. ఈ కథలోగల గ్రామాధిపతినే రాజుగా సంబోధింపబడినదని గమనింపగలరు.

హే! విశ్వకర్తా! ఘోరమైన సంసారసాగరములో చిక్కుకొని, మాయామోహముచేత చుట్టబడి, మునిగి తేలుచున్న అజ్ఞానులమైన మమ్ములను దయతో తరింపచేయుము" అని వారి శరణాగతి కోరుతూ శ్రీవారి శ్రీచరణములను పట్టుకొని సాష్టాంగ వందనము చేసెను. "స్వామీ! మా కంటికి మీరు మానవమాత్రునిగా కనిపించినప్పటికినీ సాక్షాత్తు విశ్వకర్తలైన భగవత్స్వరూపులే సుమా! ఈ సృష్టిని లీలగా రచించగల సమర్థులు. మీ మహిమను వర్ణించి మిమ్ములను స్తుతించుట నా వంటి అజ్ఞానికి సాధ్యము కాని పని. మానవరూపముతో, భక్తానుగ్రహార్థముగా మీరు మాకు కనిపించుచుంటిరే కాని, మీరు కేవలము చిన్మయ స్వరూపులు. జగద్రక్షకులు. మమ్ములను మీరే రక్షింపవలసినది" అని అనేక విధములుగా గురుమూర్తిని స్తుతించెను. అందుకు రాజుగారి భక్తిని, వినయమును చూచి గురుమూర్తి మిగుల సంతసించి అతనిని ఆశీర్వదించిరి. **తదుపరి శ్రీగురుమూర్తి రాజును ఇట్లు ప్రశ్నించెను.** "నాయనా! మేము అడవిలో నివసించి, తపస్సు చేసుకొనే సన్న్యాసులము. నీవు ఇంత సంరంభముతో మా వద్దకు రావడానికి గల కారణమేమి? భార్యాపుత్రులతో, సేవకసైన్య సమేతుడవై మా వద్దకు వచ్చుటకు కారణమేమి? వివరముగా చెప్పవలయునని" ప్రశ్నించెను. **శ్రీగురునాథుని మాటలను విని వెంటనే ఆ రాజు చేతులు జోడించి వినయముతో పలికెను–** "లోకోద్ధారమునకై అవతరించిన మీరు, భక్తజనులను నిర్హేతుకమైన కృపచేత తరింపచేసే మీరు అరణ్యవాసమును ఎందుకు చేయుచుంటిరి. భక్తులను ఉద్ధరించుటకొరకే, దివినుండి భువికి దిగివచ్చిన సాక్షాత్తు నారాయణ స్వరూపులే మీరు అని మా గట్టి విశ్వాసము. భక్తజనుల ఇష్టానుసారముగ మీరు వారిని అనుగ్రహించుచుండెదరు. మిమ్ములను అనేకానేక బిరుదాంకితములైన మాటలచేత వేద, పురాణ, శాస్త్రాదులు మాటిమాటికి కీర్తించుచున్నవి. భక్తవత్సలా! చిన్మయమూర్తీ! మీ కీర్తి అంతులేనిది. అనుపమానమైనది. నా విన్నపమును దయతో మీరు వినగలరు. స్వామీ! మా గాణగాపుర మహాస్థానమును పునీతము చేయుడు. గురుమూర్తీ! నిత్యము మా గ్రామములోనే నివసించుచూ, మీకిష్టమైనచో ఈ సంగమ స్థానమునందు అనుష్ఠానమును చేసికొనవచ్చును. కాని, మిగిలిన వేళలందు మా గ్రామములోనే మీరు నివసించవలయునని పదేపదే నేను ప్రార్థించుచుంటిని. మీరు కోరినచోట ఒక చక్కని మఠమును నిర్మింపచేసెదను. అందు మీరు నివసించి మమ్ములను ఉద్ధరించగలరు. మాకు జ్ఞానమును ఉపదేశించి, మమ్ము తరింపచేయగలరని మిమ్ము శరణుగోరి మాటిమాటికి వేడుకొనుచుంటినని" ఆ రాజుగారు గురుమూర్తియొక్క చరణములను పట్టుకొని భక్తిపూర్వకముగా ప్రార్థించెను. శ్రీగురుమూర్తి తనలో ఇట్లు తలపోసెను. 'మేము లోకమునకు ప్రకటమయ్యే సమయము ఆసన్నమైనదని సంకల్పించుకొని కొంతకాలము ఈచోట ఉండవలయును. భక్తజనులను తరింపచేయవలసి

యుండుటయే గాక, శిష్యపరంపరను విస్తరించవలసిన అవసరము కూడా ఉండియున్నది కనుక, ఈ రాజుగారి మనోరథమును నెరవేర్చెదను’ అని గురుమూర్తి తనలో తాను నిశ్చయించుకొని, **అప్పుడు వెంటనే బాహ్యముగా పలికిరి-** “రాజా! మీ అభీష్టప్రకారముగా చేయవచ్చును. మేమందులకు సమ్మతించుచుంటిమి” అని వారు అభయమునిచ్చిరి.(14-29)

శ్రీగురునాథుడు సమ్మతించినందులకు ఆ రాజు బ్రహ్మానందభరితుడాయెను. వెంటనే తన సేవకబృందమును పురమాయించి వెంట తెచ్చిన పల్లకిని అలంకరించి, అందులో శ్రీస్వామివారిని కూర్చుండజేసి స్వయముగా వారు పల్లకీని మోయుచూ, గాణగాపుర గ్రామమునకు గురునాథుని తీసికొని వెళ్లుటకు బయలుదేరిరి. ఆ పల్లకి ముందు అనేకవిధములైన మంగళ గీతవాద్యఘోషములు మనోహరముగా వాయించుచుండిరి. ఛత్రపతాకములతో అలంకరింపబడిన వాహనములు, ఏనుగులు, గుర్రములు, తన భార్యాపుత్రాదులతో, బంధుసమేతముగా గొప్ప ఊరేగింపుతో ఒక మహోత్సవ స్ఫూర్తితో బయలుదేరిరి. పల్లకి ముందు ఒకవైపు బ్రాహ్మణులు వేద స్వస్తివచనములు పలుకుచుండిరి. మరొకవైపు వందిమాగధులు త్రిమూర్త్యాత్మక అవతారస్వరూపమైన శ్రీనృసింహసరస్వతి స్వామివారి బిరుదములను, ప్రాభవమును పొగడుచుండిరి. ఈవిధమైన అంగరంగవైభోగముతో ఒక గొప్ప మహోత్సవమును తలపింపచేయుచూ ఆ రాజుగారు శ్రీస్వామివారిని గొప్ప ఊరేగింపుతో తమ గ్రామములోనికి తీసికొనివెళ్ళెను. నగరవాసులందరూ అనేకవిధములైన హారతిపళ్ళెములను అలంకరించి, స్వామివారు వచ్చుచున్న మార్గమునకు ఇరువైపులా నిలబడి నీరాజనములను సమర్పించుచుండిరి. ఆ గ్రామాధిపతియైన రాజు చేసిన గొప్ప వేడుకను చూసి శ్రీగురుమూర్తి అవ్యాజమైన ప్రేమతో మిగుల సంతసించెను. ఈవిధముగ వారు ప్రవేశించిన ఆ గ్రామమునకు పశ్చిమ దిశలో ఒక గొప్ప ఎత్తైన అశ్వత్థ వృక్షము ఉండెను. దాని ప్రక్కనే ఒక పాడుబడిన ఇల్లు కూడా ఉండెను. చూచుటకది ఒకవిధమైన భయమును కలిగించునట్లుగా ఉండెను. ఆ వృక్షముమీద ప్రాణులందరినీ భయపెట్టునట్టి ఒక భయంకరమైన బ్రహ్మారాక్షసుడు నివసించుచుండెను. చాలాకాలము నుండి ఆ అశ్వత్థవృక్షముమీద నివసించుచున్న బ్రహ్మరాక్షసుడు మనుష్యులనే ఆహారముగా గ్రహించుచుండెను. అందుచేత ఆ అశ్వత్థమునకు చుట్టుప్రక్కల వెళ్ళుటకు గ్రామములోని ప్రజలందరూ భయపడుచుండిరి. దానికి సమీపమున ఎవరునూ గృహములను నిర్మించుకొనుటలేదు. అటువైపు ఎవరునూ వెళ్లుటకు కూడా సాహసింపకుండిరి. ఒంటరిగా అశ్వత్థమువైపు వెళ్ళుటకు అందరూ భయపడుచుండిరి. గురుమూర్తియొక్క మహోత్సవము ఆ అశ్వత్థవృక్షము సమీపమునకు రాగానే తమ ఊరేగింపును నిలుపవలసినదిగా గురుమూర్తి ఆజ్ఞాపించెను. “నేను ఈ వృక్షము

వద్దనే నివసించెదను" అని ప్రకటించెను. ఈ వృక్షము సమీపముననే మఠమును నిర్మించవలసినదని గురునాథుడు రాజుగారితో పలికెను. అప్పుడు గ్రామస్తులందరూ "అయ్యా! ఈ అశ్వత్థవృక్షముపైన ఒక భయంకరమైన బ్రహ్మరాక్షసుడు గలడు. ఇటువైపు వచ్చిన మనుషులను, ప్రాణులను ఆ బ్రహ్మరాక్షసుడు చంపుచుండును. అది భయంకరరూపమును దాల్చి రాత్రులందు సంచరించుచుండును. ఇటువైపు వచ్చుటకుగాని, నివసించుటకుగాని ఈ గ్రామములోని వారెవరునూ సాహసించుటలేదు. అందుకే చెట్టుకు సమీపమునగల ఈ ఇల్లు పాడుపడిపోయినది" అని వారు చెప్పిరి. ఇంతలోనే అశ్వత్థవృక్షము పైన ఉన్న బ్రహ్మరాక్షసుడు వెంటనే క్రిందికి దూకి ప్రత్యక్షమై, అందరు చూచుచుండగా స్వామివారి పాదములపైబడి సాష్టాంగముగా వందనము చేసెను. **వెంటనే భక్తిపూర్వకముగా స్వామివారిని** ప్రార్థించుచుండెను– "స్వామీ! నేను మహాపాపిని. అజ్ఞానమనెడు ఘోరమైన అంధకారములో చిక్కుకొని దుఃఖించుచుంటిని. దయతో నన్ను తరింపచేయుడు. మీ దర్శనమాత్రముచేతనే నా పూర్వజన్మార్జిత పాపములన్నియు పటాపంచలైపోయినవి. ప్రాణులయెడ నిర్హేతుకమైన కృపను చూపించే దయాసాగరా! ప్రభూ! నన్ను తరింపచేయుడు. నన్నుద్ధరించుడు. నేను మీ శరణాగతుడను" అని మొరపెట్టుకొనెను. ఆతని ప్రార్థనమును విని శ్రీగురుమూర్తి వెంటనే అతని శిరస్సుమీద తన దివ్యమైన హస్తమును పెట్టగానే అతడు మనుష్యరూపమును ధరించెను. అందుకు ఆ బ్రహ్మరాక్షసుడు వెంటనే స్వామివారి పాదపద్మములపై పడి దొర్లుతూ ఆనందబాష్పములను కార్చుచుండెను. **అప్పుడు గురుమూర్తి ఆ బ్రహ్మరాక్షసుని ఉద్దేశించి నుడివెను** – "నాయనా! వెంటనే ఆలస్యము చేయకుండా నీవు నదీ సంగమమునకు వెళ్ళి స్నానము చేయుము. అంతట నీ పిశాచశరీరము విడిపోవును. అప్పుడు నీవు ముక్తిని పొందెదవు. ఇక నీకు పునర్జన్మ ఉండదు" అని అభయమును ప్రసాదించెను. అక్కడ చేరినవారందరు అత్యంత ఆశ్చర్యమునకు లోనై "శ్రీగురునాథా! త్రిమూర్త్యవతారస్వరూపా! మీకు జయము. జయము" అని కరతాళధ్వనులు మ్రోగించుచూ, దిక్కులు పిక్కటిల్లునట్లుగా జయఘోషములను పలికిరి. ఒకరితో ఒకరు ఈ మహాత్ముడు మామూలు మానవుడు కాదు సుమా! సాక్షాత్తుగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అవతారమే అని అందరూ వేనోళ్ల పొగడుచుండిరి. చేతులెత్తి నమస్కరించుచుండిరి. (30-45)

శ్రీగురునాథులు ఆజ్ఞాపించిన ప్రకారముగ అశ్వత్థ వృక్షమునకు సమీపమున చక్కని మఠము నిర్మింపబడెను. ఆ మఠమునందే శ్రీనృసింహ సరస్వతి స్వామివారు నివసింపసాగిరి. నాటినుండి ఆ రాజు శ్రీస్వామివారిని ధర్మపత్నీసమేతముగా వచ్చి షోడశోపచారములతో పూజించుచుండెను. ప్రతినిత్యము అనేకవిధ వాద్యములతో, మంగళగీతములతో, తన సేవకబృందము వెంట వచ్చుచుండగా, వివిధ

పూజాసామగ్రిని వెంట తీసికొని అత్యంత వైభవోపేతముగ మఠమునకు విచ్చేసి, శ్రీగురుమూర్తిని కడు భక్తిశ్రద్ధలతో పూజింపసాగిరి. శ్రీగురునాథుడు ప్రతినిత్యము ప్రాతఃకాలమున సంగమమునకు వెళ్ళి అనుష్ఠానమును చేసికొనుచుండెను. అయితే, అనుష్ఠానమునకై శ్రీగురుమూర్తి సంగమమునకు వెళ్ళుచుండునపుడు ఆ భూపాలుడు తాను కూడా సేవకజనసమేతముగ శ్రీస్వామివారి వెంబడి పాదచారియై వెళ్ళుచుండెడివాడు. తిరిగి వారు అనుష్ఠానమును ముగించుకొని మఠమునకు బయలుదేరినపుడు మధ్యాహ్నమువేళ పరివారసమేతముగ ఆ రాజుగారు ఆనందముతో మఠమునకు తిరిగివచ్చి వారికి వినయపూర్వకముగ నమస్కరించి తమ తమ ఇండ్లకు చేరుకొనెడివారు. అప్పుడప్పుడూ శ్రీగురుమూర్తిని చక్కగా, వైభవోపేతముగా అలంకరింపబడిన ఆందోళికయందు కూర్చుండజేసి సర్వదళసైన్య సమేతముగ ఊరేగింపువలె వారి కీర్తిని, వారి లీలలను ప్రశంసింపుచూ ఊరి బయటకు తీసికొనివెళ్ళి ఉపవనాలు, మైదానములు మొదలైన చోట్లలో కొద్దిసేపు విడిది చేసి, మఠమునకు తిరిగి వచ్చుచుండెడివారు. (46-50)

భక్తవత్సలుడైన శ్రీగురుమూర్తి భక్తులకు అధీనుడు గావున, వారి మనోభీష్టమునకు అనుకూలముగా, వారిని సంతోషింపచేయుచూ, వారి మనసుకు ఆనందమును కలిగించుచూ ప్రవర్తించెడువారు. గురుమూర్తిని ఏయే భావములతో భక్తులు సేవించుచుండిరో, వారు కూడా తమ భక్తులను ఆయా భావముల ననుసరించియే అనుగ్రహించుచుండిరి.[1] ఈవిధమైన సంభ్రమము ప్రతినిత్యము గాణగాపుర గ్రామములో జరుగుచున్నదని, గురుమూర్తి యొక్క మహిమలు, లీలలు, వారి నిర్మలమైన కీర్తి దినదినమునకు చుట్టుప్రక్కలగల గ్రామములకు, నగరములకు విస్తరించెను. గాణగాపురమునకు కొంతదూరమున 'కుమసి' అను గ్రామము ఉండెను. ఆ గ్రామమునందు ఒక గొప్ప తపస్వి ఉండేవారు. వారి పేరు త్రివిక్రమభారతి. మూడు వేదములయందు సాంగముగ ఆరితేరినవారు. ఆ త్రివిక్రమభారతి అనే తాపసి నిత్యము మానసిక ఆరాధన చేయుచూ, నిరంతరము నరహరిని ధ్యానించేవారు. అయితే, ఈ త్రివిక్రమభారతీస్వామివారు గాణగాపురములోనున్న నరసింహసరస్వతి గురించి వినుట తటస్థించెను. వారి లీలలు, వారి మహిమలను విన్న త్రివిక్రమభారతి **ఇట్లు తలపోయుచుండెను–** ఈయన అసలైన సన్న్యాసి కాదు. వట్టి దాంభికుడు. ఇతనికి సన్న్యాసాశ్రమమును ఎవరిచ్చిరి? ఒక సన్న్యాసిగా ఉండి పల్లకీలో కూర్చొని ఊరేగుటేమిటి? ఇది అత్యంత

---

[1] **"యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్ ॥ మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥** (గీత. 4/11) (పార్థా! భక్తులు నన్ను సేవించినరీతికి అనుగుణముగ నేను వారిని సేవించెదను. మానవులందరునూ వివిధ రీతులలో నా మార్గమునే అనుసరింతురు.)

చోద్యముగా ఉన్నది? అని వారిని మనసులో నిందించుచుండెను. అవతారస్వరూపులైన శ్రీగురునాథులు పరుల మనస్సుల మర్మము తెలిసినవారు. అందరి మనోభావములు వారిముందు తెరచిన పుస్తకమువలె ఉండును గావున, ఈ యతీశ్వరుడు తన మనసులో తమను నిందించుచుండెనని గుర్తించెను.

గురుమూర్తి సర్వజ్ఞుడు గావున త్రివిక్రముడు తనను నిందించుచున్నాడని గ్రహించెను అని **సిద్ధముని నామధారకునితో ఇట్లనెను** - "నాయనా! రాబోవు కథ చాలా అపూర్వమై యుండును. గురులీలలు అతి విచిత్రములు. కావున, మనస్సును నిర్మలమొనర్చుకొని ఏకాగ్రచిత్తుడవై శ్రద్ధగా శ్రవణమొనర్చుచుండుము" అని చెప్పిన విధమును గంగాధర సరస్వతిగారు శ్రీగురుచరిత్రమును విస్తరించి గ్రంథరూపమున లోకమునకు ప్రకటింపచేసిరి. ఇంతటి దివ్యమైన, మనోహరమైన ఈ కథను విన్నవారికి సమస్త మనోభీష్టములు సిద్ధించును. (51-58)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు "బ్రహ్మరాక్షస ముక్తకరణము" అను ఇరువది మూడవ అధ్యాయము ॥ 23 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 58; మొత్తము సంఖ్య : 2505 + 58 = 2563 ఓవీలు)

◆ ◆ ◆

దత్తాత్రేయో మహాదేవో విష్ణురూపో మహోత్సుకః ।
స్మరణా దేవ నశ్యంతి కిం నో మృత్యుః కరిష్యతి ॥
- శ్రీ నారదకృత శ్రీదత్తాత్రేయ స్తోత్రము - 3)

శ్రీ గురు చరిత్ర

ఇరువది నాలుగవ అధ్యాయము

శ్రీగురుడు కుమసి గ్రామమునకు వెళ్ళుట - గురునింద చేయుచున్న త్రివిక్రమభారతికి విశ్వరూప దర్శనము చేయించుట- అతని అహంకారమును హరించుట - త్రివిక్రమభారతి గురుమూర్తిని స్తుతించుట - శ్రీగురునాథుడు ఆతనిని అనుగ్రహించుట.

శ్రీ గణేశాయ నమః ။ శ్రీ సరస్వత్యై నమః ။ శ్రీ గురుభ్యో నమః ။ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ။

"ఆ తర్వాత కథాక్రమమును వివరించి చెప్పుడని" **నామధారకుడు సిద్ధమునిని ప్రార్థించెను. శిష్యుని మాటలను వినిన సిద్ధముని ఇట్లు పలికెను** – "నాయనా! నామధారకా! ఆ అభినవ గురుచరిత్రమును సావధానచిత్తముతో వినవలసినదని" **యిట్లు చెప్పసాగెను** – "గురుమూర్తియొక్క కీర్తిని సహింపలేక 'కుమసి' గ్రామములో ఉన్న త్రివిక్రమభారతి అను ఒక తాపసి నిత్యము శ్రీగురుమూర్తిని ఈతడు అచ్చమైన సన్యాసి కాజాలడని, ఒక డాంభికుడు ఈవిధముగ తన పేరిట కీర్తిని సంపాదించుటకు లోకులముందు దంభమును ప్రదర్శించుచున్నాడని" నిందించుచుండెను. సమస్త విశ్వాంతరాళము యొక్క భూత, భవిష్యత్తులను, వర్తమాన రూపములో గమనించగలిగిన సర్వజ్ఞుడైన శ్రీగురుమూర్తి కుమసి గ్రామములో గల ఒక ముని తనను నిందించుచున్నాడని గమనించెను. ఒకనాటి ఉదయమున రాజుగారు తమ దర్శనమునకు వచ్చినపుడు శ్రీగురుమూర్తి ఆయనతో ఈ విషయమును సంక్షిప్తముగ తెలియజెప్పి, "రాజా! మనము ఈనాడు కుమసి గ్రామమునకు వెడలుచుంటిమి" అని పలికిరి. గుర్వాజ్ఞకు ఎంతయో సంతసించిన ఆ రాజు తన సేవకదళమును, సైన్యమును, గజ, తురగ, పదాతిదళములను అనేకవిధములుగా అలంకరింపచేయించెను. తదుపరి, పల్లకిని శోభాయమానముగ అలంకరించి అందులో దండకమండలధారియైన శ్రీనృసింహసరస్వతి స్వామివారిని కూర్చుండబెట్టి వివిధములైన వాయిద్యములతో, వేదఘోషతో, వందిమాగధులయొక్క బిరుదావళి ప్రశంసలతో ఒక గొప్ప అట్టహాసముగ గురుమూర్తిని తీసికొని కుమసి గ్రామమునకు బయలుదేరెను. ఈవిధమైన ఉత్సవశోభతో శ్రీగురుమూర్తి కుమసి గ్రామమునకు వెళ్ళుచుండెను. అట్టి సమయమున త్రివిక్రమభారతి అను ఆ మునీశ్వరుడు మానసిక పూజను చేయుచుండెను. వారు నిత్యము నరహరిని తన మానసమున ధ్యానించి మనసార పూజించుచుండెడివాడు. ఎప్పుడైతే గురుమూర్తి గాణగాపురమునుండి బయలుదేరి కుమసి

గ్రామమువైపునకు వచ్చుచుండెనో, అప్పుడే త్రివిక్రమభారతి మానసిక ఆరాధన చేయుటకు ధ్యానమునందు కూర్చుండెను. కాని, ఆతని మనోపటలమునందు నరహరి జాడ కనిపించకుండెను. అటులే ఆయన మనస్సు నరహరి యందు స్థిరపడకుండెను. ఎంత ప్రయత్నించినప్పటికినీ నరసింహస్వామి దర్శనము ఎప్పటివలె వారి హృదయకమలమునందు సాక్షాత్కరించుట లేదు. **తత్కారణమును గూర్చి ఆయన ఈవిధముగ చింతింపసాగెను-** "అయ్యో! నా మనోపటలమునందు ఈ రోజు నరహరిమూర్తి ఎందుకు ప్రకటము గాకుండెను? నా తపస్సు యొక్క సామర్థ్యము సన్నగిల్లెనా, వ్యర్థమైపోయెనా, ఏమి చోద్యమిది? ఇప్పుడు నేనేమి చేయుదును?" నరహరి స్వామిని ఎంతో కాలమునుండి ఆరాధించుచుంటిని. మానసికముగ స్వామిని ఆహ్వానము చేసి, నవరత్నఖచితమైన సింహాసనమునందు కూర్చుండజేసి, షోడశోపచారములతో ఆరాధించుచుంటిని. నేను ధ్యానము చేసిన వెంటనే నరహరి స్వామి అద్భుతమైన రూపముతో ప్రత్యక్షముగ నా ముందు సాక్షాత్కరించువారు. కాని, ఈనాడు నన్ను ఎందులకు ఉపేక్షించుచుండెనో కదా! ఎంతకూ ఆ మూర్తియందు నా మనస్సు లగ్నమగుటయేలేదు. ధ్యానము ఎందుకు కుదరకుండెను? స్వామి రూపము చూచాయగా కూడా కనిపించలేకపోవుచుండెను కదా! నా తపస్సు వ్యర్థమైపోయినదా! ఏమి కారణమో! అని ఎంత యోచించిననూ అతనికి తగిన కారణము బోధపడదయ్యెను. ఇంతలో తాను నిత్యము మానసికముగ ఆరాధించు మూర్తి యొక్క స్వరూపముతో శ్రీగురుమూర్తి అల్లంతదూరము నుండి నదీతీరము దాటి వచ్చుట కనిపించెను. వెంటనే వారిని దర్శించు నిమిత్తముగ త్రివిక్రమభారతి నదీతీరమునకు చేరుకొనెను. (1-12)

అంతట శ్రీగురునాథుడు చమత్కారముగ ఒక దివ్యమైన సన్నివేశమును రచింపజేసెను. త్రివిక్రమభారతి ఉత్సవశోభతో వచ్చుచున్నటువంటి గురుమూర్తి యొక్క రాకను గమనించి ఎదురుగా వెళ్ళి రెండు చేతులు జోడించి నిలబడి చూచుసరికి, ఆ ఊరేగింపులోని వారందరికందరు దండము, కమండలమును ధరించిన నృసింహసరస్వతీ స్వామియొక్క స్వరూపముతో గోచరింపసాగిరి. రాజు, రాజుగారి సేవకదళము, సైన్యము, వెంట వచ్చుచున్న ఇతర భక్తులు, శిష్యులు అందరికందరు సర్వమునూ దండకమండలధారులైన నృసింహమూర్తి స్వరూపముగనే త్రివిక్రమభారతి కంటికి గోచరించెను. అతడత్యంత విస్మయావహుడయ్యెను. వెంటనే సాష్టాంగనమస్కారమును చేసి, ఇంతకుముందు గురుమూర్తియెడల తనకుగల అసూయాభావమును విడనాడి సాష్టాంగ వందనమును చేయుచు శ్రీగురుచరణములను ధ్యానింపసాగెను. అసంఖ్యాకమైన గురుమూర్తి స్వరూపాలను చూసి అసలైన గురుమూర్తి ఎవరో, ఎవరు కారో, అందులో ఎవరు చిన్నయో, ఎవరు పెద్దయో,

అసలైన గురుమూర్తి ఎక్కడున్నారో కూడా అతనికెంతకూ అంతుపట్టక పోయెను. గురుమూర్తిని గుర్తించుటకు అసమర్థుడయ్యెను. అతని బుద్ధి భ్రష్టమయ్యెను. ఒక గొప్ప భ్రాంతిని పొందిన త్రివిక్రమభారతికి ఏమియూ తోచక, ఏమి చేయవలెనో బోధపడకుండెను. ఇంతకుపూర్వము తనలో పొటమరించిన ఏ దంభము, ఏ దాంభికము, ఏ అహంకారము ఉండెనో, అది వెంటనే మటుమాయమయ్యెను. అంతఃకరణము శుద్ధదర్పణమువలె నిర్మలమయ్యెను. **వెంటనే గురుమూర్తిని త్రికరణశుద్ధితో శరణు కోరుతూ కదు భక్తిప్రపత్తితో ఇట్లు ప్రస్తుతింపసాగెను-**

“ఓ బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపా! జగద్గురూ! అవిద్యలో మునిగి స్వరూపజ్ఞానము నశించి అసమానమైన మీ మహిమను తెలిసికొనజాలకున్నాను. చర్మచక్షువులతో మిమ్ములను గుర్తింపగలిగే సామర్థ్యము ఎంతమాత్రము లేని భాగ్యహీనుడను. నిత్యము నేను ధ్యానించే నరహరి స్వరూపులు మీరేనని, ఇప్పుడు నిశ్చయమాయెను. స్వామీ! అవ్యాజమైన ప్రేమతో, నిర్హేతుకమైన కృపతో మీ నిజస్వరూపమును ధరించి మీ అసలైన స్వరూపమును నాకు దర్శింపచేయుము”.

“ప్రభో! గురునాథా! మీ నిజస్వరూపమును గుర్తించుటకు నాకు అశక్యముగా నున్నది. ఈ చర్మచక్షువులతో ఇప్పుడు మిమ్ములను దర్శింపలేకుంటిని. సమస్త ప్రాణిలోకమునందు వ్యాపించియున్న మీరు యతిగా అవతరించిన నరసింహస్వామియే ఈ నరసింహ సరస్వతిగా గోచరించుచుండెనని నిశ్చయమగుచున్నది. కాని, నిజమైన స్వరూపమును గుర్తించలేకపోవుట వలన స్వామీ! మీకెట్లు నమస్కరించుదును. ఏవిధముగ నా అంతఃకరణమును తెరచి మీ ముందు చూపించెదను? సాక్షాత్తు మీరు త్రిమూర్తుల అవతారస్వరూపమే అని ఖచ్చితముగా నేను గుర్తించితిని. దయతో మీ నిజస్వరూపమును దర్శింపజేయుము. ఎంతోకాలమునుండి తపస్సు చేయుచుంటిని. నిత్యము మిమ్ములను మానసికముగ ఆరాధించితిని. మీ రూపమునే ధ్యానించితిని. నా మనోమందిరమునందు మిమ్ములను ఆవాహనము చేసి నిత్యము మానసికముగ పూజించితిని కదా! ప్రభూ! దానికి ప్రత్యక్ష ఫలముగ నా స్వామిని, నా స్థూలమైన దృష్టితో చూడగలిగే సత్ఫలితము ఈనాడే నాకు లభించినదని ఇప్పుడు నాకు బోధపడుచున్నది. సమస్త విశ్వమును తరింపచేయుటకొరకే మీరు ఈ అవనిపై అవతరించితిరి. మమ్ము ఉద్ధరించుటకొరకే మీ చిన్మయస్వరూపమును, మీ విశ్వరూపమును చూపించితిరి”.

“ఓ దయామయా! కృపాసింధూ! హే! గురుమూర్తీ! నా మొరను ఆలకించి, నా యందు దయదలంచి, మీ యొక్క స్వస్వరూపమును దర్శింపచేయించి, మిమ్ములను స్వయముగా గుర్తించగలిగే జ్ఞానమును నాకు ప్రసాదింపుము స్వామీ!” అని ఆ త్రివిక్రమభారతి అనేకవిధములుగా

శ్రీగురుమూర్తిని స్తుతించెను. వెంటనే భక్తవత్సలుడైన గురుమూర్తి తననుండి వ్యక్తమైన విశ్వరూపమును ఉపసంహరించుకొనెను. తత్క్షణమే త్రివిక్రమభారతి యొక్క దృష్టికి సైన్యము, సేవకబృందము, మున్నగునదంతయూ యథాతథముగా కనిపించసాగెను. ఇంతలో శోభాయమానముగ అలంకరించిన పల్లకిలో భక్తవరదుడైన నృసింహ సరస్వతి స్వామివారు, దండకమండలములను ధరించి మందహాసవదనులై చిరునవ్వు లొలికించుచు, దయార్ద్రదృష్టితో అతనివైపు అనుగ్రహవీక్షణమును సారించెను.ఆ ప్రేమైకమూర్తిని, దయాపయోనిధిని, త్రివిక్రమభారతి దర్శించెను. వెంటనే పరుగెత్తుకొని వెళ్ళి శ్రీగురుమూర్తి యొక్క చరణారవిందములను పట్టుకొని పదేపదే ప్రణమిల్లుచూ అనేకవిధములుగ స్తుతించుచుండెను.(12-24)

శ్రీ గురుమూర్తి ఆయనతో ఇట్లనెను – “నీవు నన్ను మాటిమాటికి దాంభిక సన్యాసియని నిందించుచుంటివి. నిత్యము నీవు శ్రీనృసింహస్వామికి మానసపూజ చేసెదవు. కనుక, నీ భక్తిని చూచి నేనే స్వయముగ నీవద్దకు ఏతెంచితిని. అసలైన దంభము ఏవిధముగ ఉండునో, ఇప్పుడు నాకు వివరించి చెప్పుము. నీ మనసులో ‘హరి’ వున్నాడు కదా! ఆతనిని గమనిస్తూ, అసలైన దంభమేమిటో నాకు వివరించి చెప్పుము నాయనా!” అని శ్రీగురుమూర్తి పలికెను. **ఆ త్రివిక్రమభారతి వెంటనే గురుమూర్తికి సాష్టాంగ వందనములు చేసి ఇట్లు విన్నవించుకొనెను–** “సద్గురురాజా! నన్ను క్షమించుము. నేనొక అవిద్యావంతుడను. అజ్ఞానాంధకారములో కొట్టుమిట్టాడుతూ మీ మహిమను గ్రహించలేకపోయితిని. మందమతినైతిని. నా బుద్ధి భ్రష్టమైపోయెను. నన్ను క్షమింపవలయును. ఈ సమస్త విశ్వమును తరింపచేయగల త్రిమూర్తుల అవతారస్వరూపమే మీరు. నన్ను చుట్టి వున్న అజ్ఞానము నన్ను మాయలో నెట్టివేయుచుండెను. మాయామోహాంధకారము అనే మహాసముద్రములో మునిగి పరమార్థమును నిశ్చయముగ గమనించలేక కళ్ళు ఉండి కూడా పగటిపూట చూడలేని గుడ్లగూబగా మారిపోయిన నిర్భాగ్యుడను. స్వామీ! పరంజ్యోతి స్వరూపంతో ప్రకాశించే మీరు నాలో జ్ఞానజ్యోతిని ప్రకాశింపచేసి నన్నుద్ధరింపవలయును. స్వామీ! ఈ సేవకుని క్షమించి, ఉద్ధరించుము ప్రభూ! అవిద్య, మాయ అనే మహాసాగరమున మునుగుతూ, తేలుతూ ఈదుచుంటిని. ఆవలి తీరము గానక ప్రాపంచిక అలల తాకిడికి తట్టుకొనలేక మునిగిపోవుచుంటిని. స్వామీ! కృపాసాగరా! దయతో జ్ఞానమనే నౌకలో నన్ను కూర్చుండజేసి కరుణ అనే వాయువును ప్రేరేపించి, నన్ను ఆవలితీరమునకు చేర్చగలరని ప్రార్థించుచుంటిని. మీ కృపను, మీ అనుగ్రహమును పొందినవారికి దుఃఖముగాని, దోషముగాని ఎట్లుండును. అట్టివాడికి దైన్యము వుండనే వుండదు. వాడు కాలప్రభావమును జయించి పరమాత్మలో తప్పక ఐక్యము

నొందగలుగును. కలికాల మహిమను జయించి పరమార్థమార్గములో ప్రయాణించగలుగును. గురునాథా! మహాభారత సంగ్రామమునకు ప్రారంభమున అర్జునుడు వ్యామోహచిత్తుడై కొట్టుమిట్టాడుచున్న సమయమున అతని వ్యామోహమును పోగొట్టి కర్తవ్యోన్ముఖుని చేయుటకొరకు నిర్హేతుకమైన కృపతో కృష్ణపరమాత్ముడు అద్భుతమైన విశ్వరూపమును చూపించిన విధముగ, మీరు ఈ రోజు నాకు మీ విశ్వరూపమును చూపించితిరి. భక్తవత్సలుడైన గురునాథుని అనుగ్రహమువలన అద్భుత, ఆశ్చర్యకరమైన అనంతమహిమ సంఘటించెను. భవసాగరమునుండి సులభముగా తరింపచేయగలిగే జగద్గురూ! మీకు జోహార్లు. నరసింహసరస్వతీ! మీరు సాక్షాత్తు త్రిమూర్త్యాత్మక స్వరూపులే. మీకు జయము. జయము. మీ చరణారవిందములను దర్శించి నేను కృతార్థుడనైతిని. అనాయాసముగ నా చేతికి రత్నమయమైన చింతామణి లభించెను. శాపదగ్ధులై బూడిదకుప్పలుగా మారిన సగరపుత్రులమీదికి భగీరథుని ప్రయత్నముతో గంగ ప్రవహించి వారిని ఉద్ధరించినట్లుగా, ఈ భవసాగరమున మునిగి కొట్టుమిట్టాడుతున్న అజ్ఞానినైన నన్ను, మోహాంధకారము నుండి తరింపచేయుటకు స్వయముగా విచ్చేసిన జగద్గురూ! మీకు సాష్టాంగపడుచున్నాను. శ్రీకృష్ణపరమాత్ముడు భక్తిభావమునకు వివశుడై, విదురుని ఇంటికి వెళ్ళి విందు స్వీకరించినట్లుగా, నిర్హేతుకముగా కృపను వర్షించే సద్గురుమూర్తీ! నన్ననుగ్రహించుటకు దయాపయోనిధులైన మీరే స్వయముగా నా వద్దకు విచ్చేసితిరి కదా! తద్వారా, భక్తవత్సలుడనే కీర్తిని ఇనుమడింపచేసిన మీ మహిమను దర్శింపజేసి, నన్ను కృతకృత్యుడను చేసిన, మీ చరణారవిందములకు కోటికోటి వందనములు. జగద్గురుమూర్తీ! మీ అనంతమైన మహిమాప్రభావమును వర్ణించుటకు నేను అసమర్థుడను. నా మాటలు సరిపోవుటలేదు. అసమానమహిమాన్వితమైన మీ గొప్పతనమును, మీ లీలలను వర్ణించుటకు అల్పజ్ఞుడనైన నేను అశక్తుడను" అని అనేకవిధములుగ గురుమూర్తిని శరణుగోరి, అనుగ్రహించుమని మాటిమాటికి అత్యంత వినమ్రుడై, నమస్కరించుచూ తోచినవిధముగ స్తుతింపసాగెను. నిరంతరము మానసికముగ తన స్వరూపమును ధ్యానము చేసి పూజించుచున్న ఆతని భక్తికి మెచ్చి వచ్చిన శ్రీగురుమూర్తి మరింతగా సంతసించెను. **పిమ్మట ఆతనికి వరదానమును ప్రసాదించుటకై ఇట్లనెను** - "త్రివిక్రమా! నీ భక్తికి మెచ్చి, నేను సంతుష్టుడనైతిని. నీకు నిశ్చయముగ సద్గతి లభించును. నీకిక పునర్జన్మము లేదు. నాయనా! పునరావృత్తిరహితమైన సద్గతి సిద్ధించును. నీవు ఆత్మసాక్షాత్కారము కలవాడవై ఈశ్వరునిలో ఐక్యము నొందెదవు" అని శ్రీగురునాథుడు అవ్యాజమైన ప్రేమతో, త్రివిక్రమభారతిని పరిపూర్ణముగ అనుగ్రహించి గొప్ప వరమునిచ్చెను. అంతట శ్రీస్వామివారు ఆ కుమసి గ్రామమున అందరు చూచుచుండగనే, అదృశ్యులై క్షణమాత్రమున గాణగాపురక్షేత్రమునందలి మఠమునకు చేరుకొనిరి. (25-44)

అప్పుడు సిద్ధముని నామధారకునితో ఇట్లనుచుండెను – “నాయనా! శ్రీగురుమహిమ అంటే ఏమిటో ఇప్పుడు బోధపడినదా! మానవరూపమున సంచరించే త్రిమూర్త్యాత్మక స్వరూపులే గురుమూర్తి అని గ్రహించుము. గురుమూర్తి మహిమ ఎంత గొప్పదో నీకు వివరించి చెప్పితిని. ఇట్టి పరమపురుషుడు, గంభీరుడు అయిన శ్రీ గురుమూర్తిని ఎవరు నరుడని భావింతురో, వారు శాశ్వతముగ నరకమునే పొందగలరు. ఏడేడు జన్మలవరకు నరకలోకముననే నివసించెదరు. వేదములు, శాస్త్రములు, పురాణములన్నియు గురువే బ్రహ్మము, గురువే విష్ణువు, గురువే పరమేశ్వరుడు అని ఘోషించి, ఎలుగెత్తి చాటుచున్నవి. అందువలన శ్రీగురుమూర్తియే త్రిమూర్త్యాత్మకస్వరూపమని దృఢముగా నిశ్చయమునొంది గురుచరణములనే శరణుపొందవలయును. “శరణుపొందితి దీనుడ కరము నీకు ప్రణతి సేతును కరుణించు పరమపురుష దిక్కులేదయ్య నీకన్న దేవ!దేవ!” అని దృఢమైన బుద్ధితో, నిశ్చయమును చెంది, గురుచరణాబ్జములను శరణు పొందవలయును. చివరకు శ్రీగురునాథుని చరణారవిందముల యందు లీనము కావలయును. (45–48)

“అమృతమయమైన చలివేంద్రమునందు గురుచరిత్రమనెడు కామధేనువు నెలకొల్పబడినది. జ్ఞానజనులెల్లరూ గురుచరిత్రము అను కామధేనువు యొక్క దుగ్ధమును కడుపారగా గొంతుల వరకు గ్రోలుచుందురు” అని సిద్ధముని నామధారకునకు చెప్పినరీతిగ, అమృతమయమైన శ్రీగురుచరిత్రమును విస్తరించి, గంగాధరనందనుడగు సరస్వతి లోకమునకు (మరాఠీ భాషలో) గ్రంథరూపమున ప్రకటింపచేసెను. దీనిని భక్తిపూర్వకముగ చదివినవారికి, వినినవారికి అహంకారము నశించి, చతుర్విధ పురుషార్థములు అనాయాసముగ సిద్ధించును. (49–50)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము
నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున జ్ఞానకాండమునందు “త్రివిక్రమభారతికి విశ్వరూప సందర్శనము”
అను ఇరువది నాలుగవ అధ్యాయము ॥ 24 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 50; మొత్తము సంఖ్య : 2563 + 50 = 2613 ఓవీలు)

॥ జ్ఞానకాండము సమాప్తము ॥

॥సర్వం శ్రీ శ్రీపాద శ్రీవల్లభ – శ్రీనృసింహ సరస్వతీ – శ్రీగురుదత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

॥ హరయే నమః ॥

శ్రీ గురు చరిత్ర

కర్మకాండము

ఇరువది ఐదవ అధ్యాయము

ఒక యవనరాజు వేదములను, బ్రాహ్మణులను నిందించుట - ధనాశతో ఇరువురు దుష్టవిప్రులు యవనరాజు ముందు వేదమును పఠించి, సత్కారములను పొందుట - మదోన్మత్తులైన వారు ఉభయులు త్రివిక్రమభారతిని చేరి, తమతో శాస్త్రార్థమును చేయుమని నిర్బంధించుట - త్రివిక్రమముని నచ్చజెప్పి వారిని శ్రీగురునాథుల వద్దకు చేర్చుట - ఆ దుష్ట బ్రాహ్మణుల ఆత్మస్తుతిని శ్రీగురుమూర్తి నిరసించుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

"సిద్ధయోగీశ్వరా! మీకు జయము. జయము. అత్యంత కృపతో మీరు నాకు చక్కని పరమార్థమును బోధించితిరి. మీరే నన్ను తరింపచేయగలవారని నా అంతఃకరణమునందు నిర్ధారణమగుచుండెను. "మునీశ్వరా! కృపామూర్తియైన సర్వేశ్వరుడే శ్రీ నృసింహసరస్వతిగా, భక్తజనులను ఉద్ధరించుటకై ఈ లోకమున అవతరించిరి. అయితే, అజ్ఞానులకు వారు మానవమాత్రులుగనే కనిపించెందరు. కాని, జ్ఞానజనులకు మాత్రము వారు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపముగనే గోచరించెదరని నాకు విదితమయ్యెను. మహాత్మా! శ్రీగురుమూర్తి త్రివిక్రమభారతికి విశ్వరూపసందర్శనము చేయించి, అతని అహంకారమును నశింపచేసెను. తద్వారా, ఆయనను తరింపచేసిన వైనమును తమరు వివరించితిరి. అట్టి దివ్యమైన కథను విని నేను కృతార్థుడనైతిని. అనంతరము జరిగిన కథ యేమిటో తాము వివరించి చెప్పగలరని" నామధారకుడు ప్రార్థించెను. **అంతట సిద్ధమునీంద్రుడు ఎంతయో సంతసించి, నామధారకునితో ఇట్లు చెప్పదొడగెను -**

"కుమారా! అత్యంత గహనమైన శ్రీగురునాథుని లీలలు అపారములు. వారి లీలలు ఎంతవారికైనను అగమ్యములు. వాటిని వివరించి చెప్పుటకు ఎవరి తరము. ఒకవేళ గురుమహిమను విస్తరించి చెప్పవలెనన్నచో, బహుకాలము వ్యతీతమగును. కథాగమనము అపరిమితముగా విస్తరించిపోవును. అందుచే, నామధారకా! నీ గురుభక్తికి మెచ్చితిని. నీ జిజ్ఞాస బహు గొప్పది. నా శక్తికొలదిగా గురుచరిత్రమును వివరించి

చెప్పుటకు ప్రయత్నించెదను. సావధానచిత్తముతో వినవలయును. నామధారకా! ఆ తరువాత ఒక అద్భుతమైన అపురూపమైన సంఘటన ఘటించెను. ఇప్పుడు దానిని చెప్పెదను" **శ్రద్ధగా ఆకర్ణింపుము.** (1-5□)

'విదుర' అను పేరుగల ఒక నగరము ఉండెను. ఆ నగరమును యవనవంశమునకు చెందిన ఒక యవనరాజు పాలించుచుండెను. అతడు మహాక్రూరుడు. బ్రాహ్మణద్వేషి, ఆతడు ఎల్లప్పుడు జీవహింసను చేయుచుండెను. బ్రాహ్మణులను తన సభాస్థలికి పిలిపించి, వారిని వేదమును పఠింపుమని నిర్బంధించుచుండెను. వారితో వ్యర్థమైన వాదవివాదములు చేయుచుండెను. వేదమును పఠించుటయే కాదు, వేదముయొక్క అర్థమును విపులముగా చెప్పవలసినదని ఆ యవనరాజు వేదవేత్తలను కోరుచుండెను. అంతేగాక "వేదపండితులను పిలిపించి మీలో ఎవరు గొప్ప విద్వాంసులో, ఎవరైతే వేదార్థమును వివరించి చెప్పెదరో, వారే మిగిలిన వారందరిలో అత్యంత గౌరవనీయులని ప్రకటించి, వారికి అపారమైన ధనసంపదను ఇచ్చెదను. అంతేగాక, ఉన్నతాసనమున కూర్చుండజేసి వారిని పూజించెదను" అని ఆ యవనరాజు ప్రకటించుచుండెను. అంతట వేదవేత్తలైన వారు చేతులు జోడించి, "రాజా! మేము వేదముయొక్క అర్థమును ఎంతమాత్రమూ తెలిసినవారము కాదు. మేము మతిహీనులము. అజ్ఞానులము. మాకు వేదార్థము తెలియదు" అని వినయముతో చెప్పి రాజసభనుండి నిష్క్రమించెడివారు. కాని, ధనహీనులైనటువంటి కొందరు అజ్ఞానులు మాత్రము రాజుగారు ఇవ్వజూపిన ధనాశకు, రాచమర్యాదకు పేరాశపడి, ఆ మ్లేచ్ఛుడి ముందుకు వెళ్ళి గొప్పగా వేదశాస్త్రములను పఠించెడువారు. వాటి అర్థమును కూడా తెలియజెప్పెడివారు. అయితే, ఆ మ్లేచ్ఛుడు కపటమనస్కుడై ఈ బ్రాహ్మణులు చదివే యజ్ఞకాండము యొక్క అర్థమును శ్రద్ధగా వినుచుండెను. **పిదప ఆతడు ఇట్లు అనుచుండెను–** "బ్రాహ్మణులు యజ్ఞము చేయునపుడు పశువధ చేసెదరు. కాని, మ్లేచ్ఛులైనవారు పశువధ చేయుచున్నారని, వీరు అధములని మమ్ములను నిందించుచుండిరి. ఇది ఏమి చోద్యము" అని వేదమును పఠించి, దాని అర్థమును వివరించిన బ్రాహ్మణులను అనేకవిధములుగ అతడు నిందించుచుండెను. వేదార్థమును తెలియజేసిన యోగ్యులైన బ్రాహ్మణులకు మాత్రము అతడు అపారమైన ద్రవ్యమును ఇచ్చి సత్కరించుచుండెను. ఈవిధముగ ఆ యవనరాజు వేదమును చదివి, వేదార్థమును వివరించినవారికి అపారమైన ద్రవ్యమును ఇచ్చుచున్నాడను విషయము దేశ, విదేశములకు ప్రాకిపోయెను. యవనరాజు ప్రకటించిన వార్తను తెలిసిన కొందరు వేదవిద్వాంసులు ద్రవ్యాభిలాషతో దేశదేశములనుండి తండోపతండములుగా వచ్చి, అతని ఎదుట పవిత్రమైన వేదమును పఠించి అతని ద్వారా బహుద్రవ్యమును బహుమానముగ స్వీకరించుచుండిరి. ఎవరైతే మదోన్మత్తులై ద్రవ్యాశతో, దురాచారపరులై వేదమును దుర్వినియోగపరచెదరో, వారు కలిపురుషునికి సమీపబంధువులయ్యెదరు.

అట్టి వారలు నేరుగా యమలోకమునకే చేరుకొందురు. అచట వారికి రౌరవాది నరకమే సిద్ధించును. దీనినే కలియుగ మహత్తుగా తెలియవలయును. (5□-16)

ఇట్లు జరుగుచుండగా ఒకనాడు మందభాగ్యులైన ఇద్దరు బ్రాహ్మణులు వచ్చి యవనరాజును కలిసి ఇట్లు పలికిరి. తమకు సమస్త వేదశాస్త్రములు బహుచక్కగా తెలియునని, తాము మూడు వేదములను చక్కగా పఠించగలమని, వాటి అర్థమును కూడా తెలియజెప్పగలమని రాజుగారి ముందు తమ కీర్తిని తామే ఆత్మప్రశంసగా ప్రకటించుకొనిరి. అంతేగాక, "రాజా! మన చుట్టూరా గల నాలుగు రాజ్యములలో వేదశాస్త్ర జ్ఞానసంపన్నులుగానీ, వేదశాస్త్రమునందు వాదించుటకు మాతో సరితూగగల సమర్థులుగానీ ఎవరునూ లేరు. ఒకవేళ మీ నగరమునందు ఎవరేని విద్వాంసులుండినచో, వెంటనే వారిని పిలిపించి, మాతో వాదమును చేయించుడు" అని పలికిరి. ఆ విప్రుల మాటలను వినిన రాజునకు రోషము కలిగెను. వెంటనే అతడు తన నగరములోగల బ్రాహ్మణులందరిని రప్పించెను. **వారందరిని ఉద్దేశించి ఆ యవనరాజు ఇట్లు ప్రకటించెను-** "అయ్యా! మీలో ఎవరేని దూరదేశమునుండి విచ్చేసిన ఈ ఇరువురు పండితులతో వేదశాస్త్రములను గురించి వాదవివాదములను సలిపి, ఎవరైతే వీరిని ఓడించెదరో, అట్టి వారికి అపారమైన ధనమును, అమూల్యమైన బహుమానములను ఇచ్చి సత్కరించెదనని" ప్రకటించెను. **ఆ బ్రాహ్మణ పండితులు యవనరాజుతో ఇట్లు పలికిరి –** "రాజా! అంతటి యోగ్యత ఎవరికున్నది. వారిని ఎవరు పరాభవింపగలరు. మాకు వీరితో వాదించు సామర్థ్యము లేదు. వీరిద్దరే గొప్ప విద్వాంసులు. వీరిని ఎవరునూ జయింపజాలరు. కావున, మహారాజా! ఉభయులను విద్వాంసులుగా ప్రకటించి వారినే మీరు సత్కరించగలరు. మాకెట్టి అభ్యంతరము లేదు" అని చెప్పిరి. బ్రాహ్మణులందరు పలికిన మాటలను విని ఆ యవనరాజు ఈ ఉభయ పండితులను చిత్రవిచిత్రమైన వస్త్రములతో అమూల్యమైన ఆభరణములతో సత్కరించెను. ఈ ఉభయ బ్రాహ్మణ విద్వాంసులతో సరిసమానమైనవారు ఈ రాజ్యములో మరెవరూ లేరని ప్రకటింపచేసి వారిని ఏనుగుపై ఎక్కించి, ఊరేగింపుగా నగరమంతయూ త్రిప్పెను. "యవనులలో తానే రాజునని, ఇక ద్విజులలో ఈ ఉభయ బ్రాహ్మణ విద్వాంసులే రాజులని" ప్రకటించెను. అనంతరము ఆత్మప్రశంసను చేసుకొనెడి తామసికులైన ఈ బ్రాహ్మణులిద్దరు యవనరాజుగారి ముందు నిత్యము వేదమును పఠించెడివారు. తామసస్వభావముతో మిడిసిపడే ఈ బ్రాహ్మణులు ఇతర బ్రాహ్మణులను దూషించుచుండెడివారు. ఈ యవనరాజ్యమునందు మేమే గొప్ప విద్వాంసులమని, నిజమైన బ్రాహ్మణులమని తమనుతామే పొగడుకొనుచుండిరి. ఇట్లు కొంతకాలము

గడిచినమీదట **ఒక దినమున మదాంధులైన ఆ బ్రాహ్మణులు యవనరాజును సమీపించి, వారితో ఇట్లు విన్నవించిరి–** "మహారాజా! మాతో వాదించగలవారెవ్వరూ ఈ దేశములో లేనందున మాకేమియు తోచుటలేదు. మేము నేర్చుకొనిన విద్య అంతయూ నిరర్థకమైపోవుచున్నది. వేదశాస్త్రార్థమును గురించి వాదవివాదములు చేయవలయునను ఉత్కంఠతో మా మనసులు ఉబలాటపడుచున్నవి.

కావున, మీరు అనుమతించినయెడల మేమే స్వయముగా మీ రాజ్యమునందు పర్యటించి విద్వాంసులతో శాస్త్రవాదము సలిపెదము. వాదించలేని వారినుండి జయపత్రములను వ్రాయించి తీసికొనివచ్చెదము" అని చెప్పిరి. **అందుకు రాజు వారితో ఇట్లనెను –** "చాలా సంతోషము. మీరు వెంటనే మా రాజ్యమున తిరిగి బ్రాహ్మణులను పరాభవించుడు. అందుకు నేను అనుమతిని ఇచ్చుచుంటిని" అని రాజు చెప్పిన వెంటనే తామసప్రవృత్తి కలిగిన ఆ బ్రాహ్మణులిరువురు యవనరాజు ఆజ్ఞతో బయలుదేరి ప్రతి గ్రామమునకు వెళ్ళి అక్కడగల బ్రాహ్మణులను కలిసి తమతో వేదశాస్త్రములను గూర్చి వాదించమని కోరుతూ పర్యటించుచుండిరి. ప్రతి గ్రామమును పర్యటించుచూ తమతో వాదించగల శక్తిలేని వారిచేత జయపత్రములను వ్రాయించుకొని వాటిని భద్రపరచుకొనుచూ తిరుగుచుండిరి. ఈవిధముగ ప్రతివారి వద్దనూ జయపత్రములను స్వీకరించి క్రమక్రమముగ పర్యటించుచు దక్షిణదేశమున ప్రవేశించిరి. మూడు వేదములను అధ్యయనము చేసినట్టి, అనేక శాస్త్రములయందు గొప్ప పాండిత్యము కలిగియున్నట్టి త్రివిక్రమభారతి నివసించుచున్న భీమా నదీ తీరమునగల కుమసి అనే గ్రామమునకు వారు చేరుకొనిరి. (17–37)

త్రివిక్రమభారతిముని వద్దకు చేరుకొని వారిట్లు పలికిరి– "నేను త్రివేదిని అని మీరు అనిపించుకొనుచుంటిరి. శాస్త్రార్థమునందు మహావిద్వాంసులమని ప్రకటించుకొంటిరి కదా! కావున, ఇప్పుడు మాతో మీరు వాదమును చేయుడు లేదా, జయపత్రమునైనను వ్రాసి ఇవ్వవలయును" అని పలికిరి. **ఆ బ్రాహ్మణుల మాటలను విని త్రివిక్రమముని ఇట్లనెను –** "నాయనా! మాకు మూడు వేదములు కాదు కదా, కనీసము ఒక్క వేదమైనను తెలియదు. ఒకవేళ మాకు వేదశాస్త్రములే బాగుగ తెలిసినమాట నిజమైనచో, మేము ఈ అరణ్యములో ఎందుకుండెదము. రాజులందరు మాకు వందనము చేసెడివారు కదా! మీవలెనే మేము కూడా సకల సౌఖ్యములను అనుభవించెడువారము గదా! మాకేమి తెలియదు. కావుననే, మేమీ అడవిలో నివసించుచుంటిమి. అందులోను నేను సన్యాసిని. మేము భిక్ష చేసికొని జీవించెడు తాపసికులము. మీతో మేము సమానులము కాము. ఓడిననూ, గెలిచిననూ మేము అందులకు గర్వించము. మీవంటి మహావిద్వాంసులు మాతో ఏమని వాదించెదరు. మీతో సమానులెవ్వరునూ లేరు. మీతో వాదించి ఓడిపోయినను, గెలిచినను కూడా మాకేమి లాభము. మాకు

జయాపజయములతోగాని, మానావమానములతో గాని ఎట్టి సంబంధమును లేదు'' అని చెప్పెను. ఆ ముని మాటలను విని ఆ బ్రాహ్మణులకు మరింత గర్వము హెచ్చి **క్రోధముతో ఇట్లు పలికిరి** – “మేము దేశదేశములన్నియూ తిరిగితిమి. మాతో ఎవ్వరునూ శాస్త్రవాదము చేయలేకపోయిరి. ఈ భూమండలమున మాతోపాటు వాదించగల వారెవరా?” అని దేశదేశములను పర్యటించుచూ వచ్చితిమి. మాకు సాటిగల వారెవ్వరునూ లభించుటలేదు. మాతో ఎవరునూ వాదించలేకపోయిరి. అందరునూ మాకు జయపత్రములను వ్రాసి ఇచ్చిరి. వీటినన్నింటిని పరిశీలించి మీ మనసులో ఏమాత్రము అభిమానము ఉన్ననూ మాతో వాదించలేకపోయిన యెడల ఇదేవిధముగ మీరుకూడా మాకు జయపత్రమును ఇవ్వవలయునని చెప్పి, తమవద్ద గల లెక్కలేని జయపత్రములను వారికి చూపించిరి. ఆ త్రివిక్రమముని బ్రాహ్మణులతో అత్యంత వినయపూర్వకముగ, ఎన్నోవిధములుగ నచ్చచెప్పెను. కాని, ఎంత చెప్పిననూ వినిపించుకొనకుండ ఆ మదాంధులైన బ్రాహ్మణులు తమకు తప్పనిసరిగ జయపత్రమును వ్రాసి ఇవ్వవలసినదేనని పట్టుపట్టిరి. (38-47)

అంతట త్రివిక్రమముని తన మనసులో ఇట్లు తలపోసెను – ‘ఈ తామస బ్రాహ్మణులను శిక్షించుటకొరకై గాణగాపురమునకు తీసికొనివెళ్ళెదను. వీరుభయులూ అహంకారముతో విఱ్ఱవీగుచూ, మదాంధులై ఎందరో బ్రాహ్మణులను ధిక్కరించుచుండిరి కదా! దీనికేదేని ఒక మంచి ఉపాయమును ఆలోచించవలెనని’ యోచించెను. అంతట త్రివిక్రమభారతి ఆ బ్రాహ్మణులతో, “నాయనా! మనము గాణగాపురమునకు వెళ్ళెదము. అచట మా గురువుగారు ఉన్నారు. వారి ముందు మీకు జయపత్రములను వ్రాసి ఇచ్చెదను. మా గురుమూర్తి మీ మనసులోగల అభిమానమును శాంతింపజేయును” అని పలికెను. ఆవిధముగ యుక్తియుక్తముగ పలికి త్రివిక్రమమహాముని ఆ ఉభయులను వెంటతీసికొని గాణగాపురమునకు బయలుదేరెను. ఆ బ్రాహ్మణులిరువురూ పల్లకిలో కూర్చొని అతనితోపాటుగ వెళ్ళుచుండిరి. మూఢులు, అజ్ఞానులు అయిన ఆ బ్రాహ్మణులు సన్న్యాసిని నేలపై నడిపించుచు, తాము పల్లకిలో కూర్చొని విర్రవీగుచూ వెళ్ళుచున్నందువలన అల్పాయుష్కులైరి. వారి ఆయువు క్షీణించెను. ఈ లోకమునందు అత్యంత ఆహ్లాదపూర్వకమైన రమ్యస్థానమగు గాణగాపురమునందు శ్రీనృసింహసరస్వతీ స్వామివారు కొలువుదీరియుండిరి. శ్రీగురువర్యులు నివసించుచున్న ప్రదేశమునకు వారు చేరుకొనిరి.

త్రివిక్రమభారతి శ్రీగురుమూర్తికి అత్యంత వినమ్రుడై నమస్కరించి, **సభక్తికముగ ఇట్లు విన్నవించెను.** “వ్యోమకేశా! కృపామూర్తీ! భక్తవత్సలా! పరమపురుషా! జగద్గురూ! మీకు జయము. జయము. నిర్గుణులు, నిర్వికారులు, అయిన త్రిమూర్త్యాత్మక అవతారస్వరూపులైన

---

1. యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ । సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ (గీత. 2/48)
(ధనంజయా! ముందుగా కర్మలయందు ఆసక్తిని త్యజింపుము. సిద్ధి-అసిద్ధులు - అనగా చేసిన కర్మలు ఫలించినను, ఫలించక పోయిననూ సమబుద్ధిని కలిగియుండుము. ఈవిధంగా కర్తవ్యకర్మలను ఆచరింపుము. ఇట్టి సమత్వభావమునే యోగమని అందురు.)

మీరు అనాథరక్షకులుకదా! మీ చరణాబ్జములను ఆశ్రయించినవారిని కృపామూర్తులై మీరు వెంటనే వారిని సంసారసాగరమునుండి తరింపచేయుదురు. గురుదేవా! మిమ్ములను తెలిసికొనలేని అజ్ఞానుల గతి అధోగతియే" అని అతడు పలుకుచున్నప్పుడు అతని కంఠము రుద్ధమయ్యెను. గాత్రము పులకించిపోయెను. నేత్రములనుండి ఆనందబాష్పములు కురియసాగెను. గురుమూర్తి యొక్క చరణారవిందములపై తన శిరసునుంచి సాష్టాంగముగ నమస్కరించుచున్నపుడు శ్రీగురునాథుడు పరిపూర్ణమైన అనుగ్రహభావముతో ఆ త్రివిక్రమ మునిని ఆప్యాయముగ లేవనెత్తి తన కరకమలములను సాచి, దివ్యమైన అనుగ్రహభావముతో అమృతమయమైన ఆలింగనమును ప్రసాదించెను. అనంతరము కుశలమును ప్రశ్నించిన మీదట శ్రీగురుమూర్తి యతీశ్వరుని చూచి, "మునివర్యా! మీరు ఏ పనిమీద నా వద్దకు వచ్చితిరో తెలియజేయుమని" కోరిరి. (48–60)

అంతట త్రివిక్రమభారతి గురుమూర్తితో ఇట్లు చెప్పెను– "అయ్యా! గురుదేవా! మదోన్మత్తులైన ఇద్దరు బ్రాహ్మణులు శాస్త్ర వాదము చేయుటకై నా వద్దకు వచ్చిరి. మేము అన్ని వేదములను, అన్ని శాస్త్రములను అధ్యయనము చేసితిమి. చతుర్వేదములు మా అధీనములో గలవని, వేదశాస్త్ర పరిజ్ఞానము మాకు కరతలామలకమని ఈ మూఢ బ్రాహ్మణులు పలుకుచుండిరి. మాతో శాస్త్రార్థము చేయవలసినది. ఒకవేళ తమతో వాదించని యెడల ఓడిపోయితిమని జయపత్రమును వ్రాసి ఇవ్వవలయునని నన్ను నిర్బంధపరచిరి. ఎన్నివిధముల నచ్చజెప్పినను నా మాటలు ఈ ఉన్మత్తుల చెవికెక్కుటలేదు. అందులకే వారిని తమ సమక్షమునకు తీసికొనివచ్చితిని. స్వామీ! మీరు గురుశ్రేష్ఠులు. మీరే మాకు గురువులు. కాన, మమ్ము రక్షింపవలసినదని" శరణు పొందెను. త్రివిక్రమముని విన్నపమును విని శ్రీగురుమూర్తి హాస్యవదనులై **ఆ ఇద్దరి బ్రాహ్మణులను పిలిచి వారితో ఇట్లు పలికెను–** "బ్రాహ్మణులారా! మీరు ఏ పనిమీద వచ్చితిరి. మీతో వాదము ఎందుకు చేయవలెను. వాదించుట వలన మీకు వచ్చు లాభమేమి. మేము తపస్సు చేసుకొనెడి సన్న్యాసులము. అరణ్యవాసులము. సన్న్యాసులమైన మేము మీతో వాదించి ఓడిపోయిననూ మాకు కలిగెడు నష్టమేమిటి? ఒకవేళ ఒక సన్న్యాసిని వాదమునందు ఓడించినచో మీకు వచ్చు లాభమేమి గలదు? మాకు మాత్రము గెలుపు ఓటములు ఒక్కటే! అవి రెండునూ సరిసమానములే" అని ప్రశాంతవదనముతో పలికిరి. (61–67)

శ్రీగురుమూర్తి మాటలను వినిన ఆ బ్రాహ్మణులు ఉభయులూ ఇట్లనుచుండిరి– "అయ్యా! మేము ప్రపంచమంతయు పర్యటించుచూ విద్వాంసులైన విప్రులందరినీ జయించుచుంటిమి. మా ఎదుట నిలువగల సామర్థ్యము ఎవరికినీ లేకపోయెను. వేదార్థమును గూర్చి, శాస్త్రార్థమును గూర్చి మాతో వాదము చేసి అందరూ పరాఙ్ముఖులైరి. అట్లు వాదమునందు ఓడినవారు, వాదించలేనివారలు, అందరి వద్దనుండి జయపత్రములను తీసికొని మేమెన్నియో జయపత్రములను సంపాదించితిమి. ఇదేవిధముగ ఈ త్రివిక్రమభారతి స్వామివారిని

కూడ మేము కోరితిమి. వారలు మామీద మిక్కిలి కోపగించి, మీ వద్దకు తీసికొనివచ్చిరి. ఒకవేళ వాదించగలమన్న విశ్వాసము మీకున్న యెడల మీరుభయులునూ కలిసి మాతో శాస్త్రార్థము చేయవలసినది. వేదములన్నింటిని మేము చదివితిమి. మాకు చతుర్వేదములు పూర్తిగా తెలియును. వేదములేకాక, సమస్త శాస్త్రములను కూడ మేము అధ్యయనము చేసితిమి. మాకు సాటి రాగల వారెవరునూ ఈ జగత్తునందు కనిపించుటలేదు. ఇక మీరిద్దరూ సన్న్యాసులే కదా! మీకు వేదాంతమేమి తెలియును" అని ఆ దుష్టబ్రాహ్మణులు వెకిలిగా పలికిరి. **వారి మాటలను విని శ్రీగురునాథుడు వారితో ఇట్లనెను** – "ఓ బ్రాహ్మణులారా! మేము గొప్ప విద్వాంసులము అను గర్వముతో మీరు మిడిసిపడుచుంటిరి. గర్వముతో అందరూ నాశనమైరి. దేవదానవులు సయితము గర్వముతో నశించిరి. గర్వించిన ఆ బలిచక్రవర్తి వామనమూర్తితో పదవీభ్రష్టుడయ్యెను కదా! బాణాసురుడు, రావణాసురుడు మొదలగు వారెందరో గర్వరక్కసికి ఆహుతియై, యమసదనమునకు అతిథులై జనిరి. మదాంధులైన కౌరవులందరు నేరుగా యమపురమునకే చేరుకొనిరి కదా! వేదాంతము తెలియదని మమ్ము ఆక్షేపించితిరి. వేదాంతమును తెలుసుకొన సమర్థులెవరు? అనాదియైన వేదములు అనంతములు. అట్టి వేదములయొక్క అంతము బ్రహ్మాదులకే గోచరించనప్పుడు మానవులమగు మనకేమి తెలియగలదు. మీరెందులకు అహంకరించుచుంటిరి. వ్యర్థముగ గర్వింపకుడు. మీలో మీరు మీ హితమును గురించి బాగుగ ఆలోచించుకొని, మీలోగల గర్వమును, భ్రాంతిని విడిచిపెట్టి, సంసారసాగరము నుండి తరించుటకు యత్నించుడు. చతుర్వేదములు మాకు తెలియునని మీరు చెప్పుచుంటిరి. నిజమునకు అట్టి వేదమును, వేదాంతమును గురించి మీకేమి తెలియును?" అని శ్రీగురుమూర్తి పలికెను. వారి మనసునిండా గర్వము నిండిపోయియుండగా, మదోన్మత్తులైన ఆ బ్రాహ్మణులు తిరిగి శ్రీగురునితో "మాకు మూడు వేదములు పూర్తిగా తెలియును" అని గొప్పగా బదులు పలికిరి. అందుకుగాను శ్రీగురుమూర్తి వారికి వేదములయొక్క స్వరూప లక్షణములను విపులముగా బోధించెను. అప్పుడొక అపూర్వము సంభవించెను, అని సిద్ధముని నామధారకునితో చెప్పిన కథను ఏకాగ్రచిత్తముతో వినుమని సరస్వతీ గంగాధరుడు లోకమునకు లిఖితరూపమున ప్రకటించెను. (68-79)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "విప్ర ఆత్మప్రశంసనము" అను ఇరువది ఐదవ అధ్యాయము ॥ 25 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 79; మొత్తము సంఖ్య : 2613 + 79 = 2692 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ఇరువది ఆరవ అధ్యాయము

శ్రీగురుమూర్తియగు శ్రీనృసింహ సరస్వతీ స్వామివారు దుష్టబ్రాహ్మణుల యెదుట చతుర్వేదములను, వాటి అవాంతర శాఖా భేదములను గూర్చి వివరించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ – శ్రీనృసింహసరస్వతీ–శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధమునీశ్వరుడు నామధారకునితో ఇట్లు చెప్పుచుండెను– "నామధారకా! మాకు జయపత్రమును ఈయవలయునని పట్టుదలతో పలుకుచున్న ఆ దుష్టబ్రాహ్మణ పండితులను చూచి **శ్రీగురుమూర్తి ఇట్లు పలికెను** – "బ్రాహ్మణులారా! మేమే పండితులమని, వేదవేత్తలమని, మీకు మీరే ఊహించుకొని గర్వించుచుంటిరి. మీ కపోల కల్పనలతో మీకు మీరే భ్రమకు గురై భ్రాంతిలో పడి నశించిపోవలదు. వేదములు అనంతములు. వాటి అంతమును తెలియుట బ్రహ్మదేవునకే తరము కానప్పుడు, సామాన్య మనుష్యులమైన మనకేమి తెలియును. వేదములను విభజించి లోకమునకు అందించిన శ్రీనారాయణమూర్తి అవతారస్వరూపులైన శ్రీకృష్ణద్వైపాయనుడను నామమును కలిగి, జగద్విఖ్యాతి నొందిన వేదవ్యాసమునీంద్రులే వేదముయొక్క అంతమును అందుకొనలేకపోయిరి. అట్టియెడ, అల్పజ్ఞులమైన మనవంటి మానవమాత్రులకు వేదములయొక్క అంతు తెలియుట సాధ్యమా? మాకు వేదములన్నియును తెలియునని మీరు మిడిసిపడుచుంటిరి. అది ఎంతమాత్రము ఉత్తమమైన మార్గము కాదు. వ్యాసమహర్షికి పైలుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు అనే నలుగురు శిష్యులుండిరి. వీరు వేదాభ్యాసమును చేయుదుమని **వ్యాసమహర్షితో మనవి చేసినప్పుడు వారిట్లనిరి** – "ఉత్తమ శిష్యులారా! పూర్తి వేదమును నేర్చుకొనుట మీకు అసాధ్యము. అది అశక్యమైన పని. నాయనా! ఒక్కొక్క వేదమును నేర్చుకొనుటకు ఒక కల్పాంతకాలము పట్టును. మరి నాలుగు వేదములను ఎప్పుడు నేర్చుకొందురు. వేదముల మహిమ అపారము. అనంతము. అట్టి వేదములయొక్క ఆద్యంతములను గూర్చి మీకు నేను తెలియజేసెదను. దానిని ఏకాగ్రచిత్తముతో వినగలరు. (1–7)

పూర్వము భరద్వాజ మహర్షి వేదములనన్నింటిని అభ్యసింపవలయునని సంకల్పించెను. తదనుగుణముగా, నిరంతరము బ్రహ్మచర్యమును పాటించి వందలాది సంవత్సరములపాటుగా అధ్యయనము చేసెను. ఆవిధముగ మూడు బ్రహ్మకల్పముల కాలము గడచిపోయెను. అయినప్పటికినీ,

భరద్వాజునకు వేదజ్ఞానము యొక్క అల్పాంశము మాత్రమే అబ్బెను. కాని, పూర్తి వేదములను పఠించవలయునను పట్టుదలతో భరద్వాజ మహర్షి బ్రహ్మనుగూర్చి తపస్సు చేసెను. ఆ మునీశ్వరుని తపస్సునకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై 'మీకు కావలసిన వరమును కోరుకొనుమని' పలికెను. **అంతట భరద్వాజుడు బ్రహ్మకు నమస్కరించి అనేకవిధముల స్తుతించి ఇట్లనెను** - "స్వామీ! దయతో నాకు ప్రత్యక్షమైతిరి. ఈ బ్రహ్మచర్యాశ్రమమునందు ఆద్యంతములతో కూడిన నాలుగు వేదములను సంపూర్ణముగ నేర్చుకొనునట్లుగా నాకు వరమును ప్రసాదింపుము. లేదా, మీరే నాకు వేదములు పరిపూర్ణముగా నేర్పవలయునని" ప్రాధేయపడుచు ఆయన చరణారవిందములను పట్టుకొనెను. **అప్పుడు బ్రహ్మదేవుడు భరద్వాజునితో ఇట్లనెను**- "నాయనా! భరద్వాజా! వేదములకు అంతమే లేదు. వాటికి పరిమితి అసలే లేదు. ఆ వేదములు మాకే అగోచరములు. నీవు వాటిని పూర్తిగా ఎట్లు నేర్చుకొనగలవు. మాకే అంతు తెలియని వేదములను మేము నీకెట్లు చెప్పగలము. కావున, నీకు కావలసిన వేద వాఙ్మయరాశిని ప్రత్యక్షముగ చూపెదను. భరద్వాజా! నిరంతరము నీ మనసును నిర్మలముగ నుంచుకొని ఆ వేదరాశి నుండి నీకు శక్యమైనంత గ్రహించి అభ్యసించుము" అని భరద్వాజునితో చెప్పి ఆ బ్రహ్మ భరద్వాజునకు వేదముల రాసులను చూపెను.(8-13)

"ఎత్తైన గొప్ప గొప్ప పర్వతాకారములు కలిగిన మూడు వేదముల వాఙ్మయరాశి కోటిసూర్యుల ప్రకాశముతో సాక్షాత్కరించెను, అంతట అతడు పర్వతాకార సదృశమైన మూడు వేదరాశులను దర్శించెను. వాటిని చూచినంతలోనే 'అబ్బా! వీటిని నేనెట్లు నేర్చుకొనగలను' అని భరద్వాజునకు దేహము గగుర్పొడిచి అత్యంత భీతి కలిగెను. 'మూడు బ్రహ్మకల్పములపాటు బ్రహ్మచర్యమును ఆచరించి నిరంతరము అధ్యయనము చేసినప్పటికినీ అతి స్వల్పమాత్రమైన వేదమును మాత్రమే నేను నేర్చుకొనగలిగితిని. ఇక ఇంత పెద్ద పర్వతసదృశమైన ఈ వేదరాశిని నేర్చుకొనుటకు నాకు సాధ్యమా?' అని భయపడి **బ్రహ్మదేవుని చరణారవిందములను ఆశ్రయించి ఇట్లనెను** - "స్వామీ! నేను అశక్తుడను. నాకు నేనుగా ఏదో ఊహించుకొని భ్రమలో మునిగి పూర్తి వేదములను నేర్చుకొనవలయునను మితిమీరిన వాంఛతో మిమ్ములను వరమడిగితిని. దయతో నన్ననుగ్రహించి నా తప్పిదమును క్షమించగలరు. జగన్నాథా! ఈ వేదములను కంటితో చూచుటకు కూడా నేను అశక్తుడనగుచుంటిని. వీటిని మీరు మాత్రమే తెలిసికొనగలరు. సర్వసమర్థులైన మీరే ఈ వేదరాశినుండి ఎంతటి పరిమాణముతో నాకు అనుగ్రహించెదరో, అంతమాత్రమే నేను స్వీకరించెదను. మీరు శరణాగతవత్సలురు. వేదములను నేర్చుకొనవలయునని నా మనసులో దృఢమైన ఆకాంక్ష కలదు. అందుకే మిమ్ములను ఆశ్రయించితిని. చూచుటకు ఇవి అపరిమితమై పర్వతసమానముగా గోచరించుచుండెను. ఇంతటి అధ్యయనశక్తి నాకు లేదుగాక లేదు. కావున, ఆ వేదవిజ్ఞానమును మీకు తోచినంత మాత్రమే నాకు ప్రసాదింపుమని" ప్రార్థించెను.

భరద్వాజుడు పలికిన వాక్యములను విని బ్రహ్మదేవుడు మిగుల సంతసించి, "నాయనా! శుభమస్తు. ఇదిగో స్వీకరించుము" అని పర్వతసమానమైన మూడు వేదరాసులనుండి మూడు పిడికిళ్ళ పరిమితమైన వేదమును భరద్వాజునకు బ్రహ్మదేవుడు ప్రసాదించెను. అట్టి వేదత్రయ మంత్రములను వేరు వేరుగా చేసి నాలుగు వేదములను భరద్వాజమహర్షి అభ్యసించెను. వాటిని ఇప్పటివరకు వేరెవరూ పూర్తిగా అధ్యయనము చేయలేదు. కావున, అట్టి నాలుగు వేదములను ఒక్కొక్కరికి ఒక్కొక్క వేదము చొప్పున మీ నలుగురిలో ఒక్కొక్కరికి ఒక్కొక్క వేదవిభాగమును అందించి, వాటిని ఎంతటి ప్రయాసతో, ఏవిధముగ అధ్యయనము చేయవలయునో, అభ్యసింపవలయునో నేను మీకు వివరించెదను" అని వ్యాసమహర్షి తన నలుగురి శిష్యులతో చెప్పెను. **అందుకు ఆ నలుగురు శిష్యులు తమ గురువైన వ్యాసమహర్షికి నమస్కరించి ఇట్లు ప్రార్థించిరి–** "వ్యాసరాజా! తాము మాపై కృపను చూపి ఒక్కొక్క వేదమును గూర్చిన ఆద్యంతమును వివరించుము. అప్పుడు మేము మా శక్తికొలదిగా నేర్చుకొనుటకు ప్రయత్నించెదము" అని తమ గురుదేవుని ప్రార్థించి, వారి పాదారవిందములను పట్టుకొనిరి. దీనముగ పలికిన శిష్యుల మాటలను విని వ్యాసముని సంతసించి 'తథాస్తు' అని నలుగురు శిష్యులను అభయదానముతో అనుగ్రహించెను. (14-26)

అనంతరము ఆ నలుగురిలో పైలుడనే శిష్యుని పిలిచి ఇట్లు పలికెను – "శిష్యోత్తమా! వినుము. నీకు ఋగ్వేదమును ఉపదేశించెదను. ధ్యానపూర్వకముగా, ధర్మ, కర్మ నిష్ఠతో దీనిని అధ్యయనము చేయుము" అని చెప్పెను. పిమ్మట, **పైలుడు వ్యాసమహర్షికి** సాష్టాంగవందనమును **చేసి పలికెను–** గురుమూర్తీ! నా యెడల మీరు కామధేనువులై, నాపై జ్ఞానామృతమును కురిపించుడు. కృపాసాగరా! ఋగ్వేదముయొక్క లక్షణములను, వాటి భేదాభేదములను నేర్చుకొనుటకు నేనెంతవరకు సమర్థుడనో నా యోగ్యతను గమనించి తాము దయతో నాకు ఋగ్వేదమును అనుగ్రహింపుమని" ప్రార్థించెను. **అందుకు వ్యాసమహర్షి పైలునితో ఇట్లు చెప్పసాగెను–** "ఋగ్వేదము యొక్క భేదములను, వర్ణరూపములను గూర్చి నీకు తెలియజేయుదును సావధానుడవై వినుము. ఋగ్వేదమునకు ఉపవేదముగా ప్రఖ్యాతమైనది ఆయుర్వేదము. దీనికి అధిదేవత బ్రహ్మ. ఆత్రేయస గోత్రము. గాయత్రి ఛందస్సు. రక్తవర్ణము. కమలదళములవంటి నేత్రములు, శంఖము వంటి చక్కని కంఠము, గిరజాల జుట్టు, నులితిరిగిన మీసములను కలిగి రెండు మూరల పొడుగును కలిగియుండును. ఇట్టి రూపధారణ చేసిన దేవతాస్వరూపమును కలిగిన ఋగ్వేదమును పైలుడు అభ్యసించెను. అందులో మొదటిది చర్చా శ్రావకము. ఇక రెండవది చర్చక శ్రవణీయము. ఇవికాక, పార, క్రమ అను రెండు శాఖలు గలవు. ఇక జట, శకట అను రెండు శాఖలతో ఆరు అయినవి. ఇక ఏడవది దండ అను శాఖతో మొత్తము ఏడు భేదములు ఉన్నవి. ఇంకనూ శాకల, బాష్కల, ఆశ్వలాయనీ, సాంఖ్యాయనీ, మాండుకేయ అనే ఐదింటితో కలిసి

ద్వాదశ శాఖలు గలవు. ఈవిధముగ వ్యాసుడు పైలుడను శిష్యునితో ద్వాదశ భేదములు కలిగిన ఋగ్వేదమును విస్తరించి చెప్పెనని" శ్రీగురుమూర్తి ఆ దుష్టబ్రాహ్మణులతో చెప్పెను. అంతేకాదు, 'ఇంతటి విస్తారమైన ఈ వేదములను కలియుగమునందు గల మీరు నాలుగే వేదములు అని చెప్పుచూ మేము గొప్పవారమని వ్యర్థముగ అహంకరించుచుంటిరి. పైగా మేము అధ్యాపకులమని మిడిసిపడుచుంటిరి. సమస్త లక్షణములతో కూడిన స్పష్టమైన ఒక వేదమును గూర్చి మీ ఉభయులలో ఏ ఒక్కరికైనా తెలిసినయెడల వాటిని మాకు వివరించి చెప్పుడు. ఈ ద్వాదశ శాఖలలో ఒక శాఖ మిగుల ప్రఖ్యాతి నొందినది అని వ్యాసుడు పైలునికి చెప్పెనని' శ్రీగురుమూర్తి మదోన్మత్తులైన ఆ బ్రాహ్మణులకు వివరించి చెప్పెను. అందుకు దుష్టభావమును కలిగిన ఆ బ్రాహ్మణులు తమ తలలు దించుకొని మిన్నకుండిరి. (27-42)

తదుపరి గురుమూర్తి ఇట్లు చెప్పసాగెను- పైలుని తదుపరిగల వైశంపాయనుడు అనే శిష్యశ్రేష్ఠునకు వ్యాసముని యజుర్వేదమును ఉపదేశించెను. "నాయనా! వైశంపాయనా! వినుము. యజుర్వేదమునకు ఉపవేదము ధనుర్వేదము. దీనిని ధనుర్విద్యా శాస్త్రమని కూడ అందురు. దీనికి అధిదేవత రుద్రుడు. భారద్వాజస గోత్రము. త్రిష్టుప్ ఛందస్సుగా ధ్యానించుము. ఇప్పుడు దాని లక్షణములను చెప్పుచున్నాను. సన్నని నడుము. విశాలమైన పొడవైన మెడ. చక్కని చెక్కిళ్ళు. మనోహరమైన బంగారు ఛాయను కలిగి, పింగళ వర్ణము గల నేత్రములతో నుండును. స్థూలదేహమును కలిగి, మిగిలిన శరీరమంతయూ ఎరుపు, నలుపు రంగును కలిగి, ఐదు మూరల పొడవైన రూపమును కలిగియుండును. ఇట్టి యజుర్వేదమును ధ్యానపూర్వకముగ వైశంపాయనుడు పఠించెను. ఈ యజుర్వేదమునకు ఎనభై ఆరు భేదములు గలవని వ్యాసుడు శిష్యునకు చెప్పి, వాటిని చక్కగా వివరించెను. చరకము, ఆహ్వారకము, కఠము, ప్రాచ్యకఠము, కపిష్ఠలకఠము, చారాయణము, వార్తాంతవీయము, శ్వేతము, శ్వేతాశ్వతరము అను తొమ్మిది శాఖలు. మైత్రాయణీ అనునది పదవశాఖ. దీనికి ఉత్తమమైన ఏడు శాఖలు గలవు. అవి మానవ, దుందుభ, ఐకేయ, వారాహ అనే నాలుగు భేదములు గలవు. హారిద్రవా అనునది ఐదవ భేదము. ఇక శ్యామ, శ్యామాయణీ అనునవి ఆరవ, ఏడవ శాఖలు. వాజసనేయమనే శాఖకు మొత్తము 18 భేదములు గలవు. వాటి పేర్లను వివరించి చెప్పెదను వినుమని శ్రీగురుడు ఆ బ్రాహ్మణులతో చెప్పుచుండెను. వాజసనేయము అనునది ఒకటి. రెండవది జాబాలిక, మూడవది బౌధేయము, నాలుగు కాణ్వము. ఐదవది మాధ్యందినము. ఆరవది శాఫేయము, తాపనీయము ఏడవది. ఎనిమిదవది కాపాలము. పౌంద్ర వత్సమనునది తొమ్మిదవది అత్యంత విఖ్యాతి నొందినది. ఇక పదవది ఆవటికము. ఇది చాలా ఉన్నతమైనది. ఇక పరమావటికము అనునది పదకొండవ భేదము. ఇది నిత్యమైనది. పంద్రెండవది పారాశర్యము. పదమూడవది వైనేయము. పదునాల్గవది వైధేయము. పదిహేనవది జౌధేయము అను

పేరు కలిగినది. ఇది చాలా విశిష్టమైనది. ఇక పదహారవది గాలవము. పదునేడవది బైజవము. పదునెనిమిదవది కాత్యాయని అను విశేషమైన పేరు కలిగినది. ఈవిధముగ వాజసనేయ శాఖకు భేదములు చెప్పబడినవి. తైత్తిరీయ శాఖకు రెండు భేదములు గలవు. వానిలో ఔఖ్యము మరియు కాండికేయము అనునవి రెండు భేదములు. వీటిలో కాండికేయమునకు తిరిగి ఐదు భేదములు గలవు. వీనిలో ఆపస్తంబీయశాఖ అతి మనోహరమైనది. ఇందులో యజ్ఞాది ధర్మకర్మలు విస్తారముగా యుండును. ఇక రెండవది బోధాయని, మూడవది సత్యాషాఢీ, నాల్గవది హిరణ్యకేశీయము ఇవి నాలుగు శాఖలు. ఔఖేయి అనునది ఐదవ శాఖ. వీటిని వరుసగా పఠించుమని వ్యాసుడు వైశంపాయనునకు ఉపదేశించెను. ఈ యజుర్వేదమునకు విశేషించి షడంగములు గలవు. శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము అని ఆరు అంగములు ముఖ్యమైనవి. వీటికి ఇంకనూ ఉపాంగములు గలవు. అవి ఏవన, ప్రతిపదము, అనుపదము, మూడవది ఛందస్సు. నాల్గవది భాష, ఐదవది ధర్మము, ఆరవది మీమాంస, ఏడవది న్యాయము, ఎనిమిదవది తర్కము అని వీటికి ఉపాంగములున్నవి. పరిశిష్టమునందు అష్టాదశ విశేషములు గలవు. వాటిని వివరించి చెప్పగలనని వ్యాసుడు తన శిష్యునితో పలికెను. ఇంతకుపూర్వము వేదరాశిని నేర్చుకొనుట మానవులకు అశక్యముగా నుండెను. కావున, లోకోపకారార్థమై వ్యాసమహర్షి వేరువేరుగా విభజించి వాటిని విస్తరించి చెప్పెను. ఎవరెవరు ఎంతెంత నేర్చుకొనవలయునని ఆకాంక్ష కలిగియుందురో, వారు వాటిని మాత్రమే నేర్చుకొనగలరని శాఖాభేదములను విస్తరించి చెప్పెను. (43–70)

ఈవిధముగ వ్యాసుడు విస్తరించి చెప్పుచుండగా **వైశంపాయనుడు దోసిలొగ్గి గురుదేవునకు నమస్కరించి వినయముతో ఇట్లు ప్రార్థించెను–** యజుర్వేదశాఖా భేదములను అనుక్రమానుసారముగ వేరువేరుగ విభజించి మాకు వివరముగా చెప్పితిరి. అయితే మూలశాఖ ఎట్లుండునను సందేహము నాలో తలెత్తుచుండెను. స్వామీ! నన్ను క్షమించి, నా జిజ్ఞాసను గమనించి ప్రీతితో వివరించి చెప్పగలరని ప్రాధేయపడెను. అందుకు **వ్యాసమునీంద్రుడు శిష్యుని జిజ్ఞాసకు మిగుల సంతసించి పలికెను–** "నాయనా! వైశంపాయనా! చాలా చక్కగా ప్రశ్నించితివి. ఈ యజుర్వేద మూలమునుగూర్చి నీకు తెలిపెదను. మంత్రము, బ్రాహ్మణము, సంహితము అను మూడింటిని కలిపి మిశ్రమముగా చదివెదరు. అదియే మూలమని ప్రసిద్ధి చెందెను. దానినే యజుర్వేదమని అందురు. సంహితతో కలిసిన బ్రాహ్మణమే యజుర్వేదమునకు మూలమని గుర్తెరుగుము. మిగిలినవి శాఖలు, పల్లవములని మరొకవిధంగా చెప్పబడెను. యజ్ఞాదికర్మ క్రియలే దీనికి మూలము. విధిపూర్వకముగ వీటిని చక్కగ అభ్యసించుమని వ్యాసుడు శిష్యునితో చెప్పెను. గుర్వాజ్ఞను తలదాల్చిన వైశంపాయనుడు చేతులు జోడించి మరికొంత వివరమును చెప్పవలసినదిగా ప్రార్థించెను. **అందుకు వ్యాసమహర్షి ఇట్లు చెప్పుచుండెను–** దీనికి గ్రంథత్రయము అనగా మంత్రము, బ్రాహ్మణము,

సంహిత అని ఉందును. సప్త అష్టక సంహితలను ఒక్కొక్కటిగా విస్తరించి చెప్పెదను వినుము. మొదట **'ఇషేత్వా'** అన్న ప్రశ్నకు పదునాలుగు అనువాకములు, ఎనిమిది అధిక పన్నములు ఉందును. **'ఆపఉందంతు'** ప్రశ్నకు పదునాలుగు అనువాకములు. వీనికి 34 అధిక పన్నములు ఉందునని గ్రహింపుము. **'దేవస్యత్వా'** అను ప్రశ్నకు పదునాలుగు అనువాకములు, ముప్పదియొక్క పన్నములుందును. **'ఆదదేతి'** అను నాలుగవ ప్రశ్నకు నలుబది ఆరు అనువాకములు కలిగి, ఏబదినాలుగు వేదాధికములగు పన్నములుందును. **'దేవాసుర'** అను ప్రశ్నకు 11 అనువాకములుందును. వీనికి ఏబది నాలుగు పన్నములు గలవు. **'సంత్వాసించామి ఇతి'** అను ఐదవ ప్రశ్నకు ద్వాదశ అనువాకములు ఉందును. ఏబదియొక్క పన్నములు గలవు. **'పాకయజ్ఞమ'** ను ప్రశ్నకు 13 అనువాకములు, 51 పన్నములుందును. **'అనుమత్యై'** అను ఏడవ ప్రశ్నకు 22 అనువాకములు, 42 పన్నములుందును. యజుర్వేదమునందలి ప్రథమ అష్టకము ఈవిధంగా ఉందును. ప్రథమాష్టకము నందు 146 అనువాకములు అధికముగా ఉందునని గుర్తుంచుకొనుము. 342 పన్నములుందును. ద్వితీయాష్టకమునందు ప్రథమ ప్రశ్నలో **'వాయవ్యామితి'** అంటారు. ఈ ప్రథమ ప్రశ్నలో 11 అనువాకములు, 65 పన్నములుందును. **'ప్రజాపతి గుహాన్'** అను ద్వితీయ ప్రశ్నమునందు 12 అనువాకములు, 71 పన్నములుందును. **'ఆదిత్యేభ్యః'** అనే ప్రశ్నకు 14 అనువాకములు, ఏబది ఆరు పన్నములుందును. **'దేవామానుషి'** అనే ప్రశ్నకు 14 అనువాకములు, 48 పన్నములు ఉందును. దీనిని ఉచ్చరించుటవలన మహాపాతకములు సమసిపోవును. **'విశ్వరూప ఇతి'** అను ప్రశ్నలో 12 అనువాకములు, 74 పన్నములుందును. **'సమిధా'** అను ప్రశ్నయందు 12 నిరుతే అనువాకములు, 70 పన్నములుందును.(71-98)

ఇక ద్వితీయాష్టకములో 6 ప్రశ్నలుందును. 75 అధిక అనువాకములుందును. మొత్తం 384 వేదాధికములు అయిన పన్నములుందును. ఇక మనోహరమైన మూడవ అష్టకమును చెప్పెదను వినుము. మూడవ అష్టకములోని ప్రథమ ప్రశ్నను **'ప్రజాపతిరకామ'** అని పేరు. అందులో 11 అనువాకాలు, 42 ప్రశ్నలుందును. **'యో వై పవమానా'** అని రెండవ ప్రశ్న పేరు. ఇందులో 11 అనువాకాలు, 36 పన్నములుందును. **'అగ్నేతేజస్వి'** అని మూడవ ప్రశ్న. ఇందులో 11 అనువాకాలు, 36 పన్నములుందును. **'వివాఏత'** అనునది నాల్గవ ప్రశ్న. ఇందులో 11 అనువాకాలు, 46 పన్నములుందును. **'పూర్ణాపశ్చాత్'** అను పేరు గలది ఐదవ ప్రశ్న. ఇందులో 11 అనువాకాలు, 36 పన్నములుందును. ఈ మూడవ అష్టకమునందు ఐదు ప్రశ్నలుందును. ఇది 55 అనువాకములు, 206 పన్నములను కలిగియుందును. ఇక నాల్గవ అష్టకమునందలి మొదటి ప్రశ్న **'యుంజాన'** అని పేరు. ఇందులో 11 అనువాకములు, 46 పన్నములుందును. **'విష్ణోఃక్రమోసి'** అను ప్రశ్నలో *11* అనువాకాలు,

48 పన్నములు విస్తరించియుండును. **'అపాంత్వేమ'** అనునది మూడవ ప్రశ్న. అందులో 13 అనువాకాలు, 36 పన్నములుండును. **'రశ్మిరసి'** అనునది నాల్గవ ప్రశ్న. దానిలో 12 అనువాకాలు, 37 పన్నములుండును. **'నమస్తే రుద్రమన్యవ'** అనునది 5వ ప్రశ్న. ఇది అత్యంత ఉత్తమమైనది. ఇందులో 11 అనువాకాలు, 27 పన్నములుండును. **'అశ్మన్నూర్జ'** అను ప్రశ్నలో 9 అనువాకములు, 46 పన్నములుండును. **'అగ్నావిష్ణూ'** అను ప్రశ్నలో 15 అనువాకములు, 39 పన్నములుండును. ఈవిధముగా 7 ప్రశ్నలతో, 82 అనువాకములతో, 279 పన్నములతో నాలుగవ అష్టకము కూడియుండును. (99-115)

ఇక ఐదవ అష్టకమునందలి మొదటి ప్రశ్న. **'సావిత్రాణి'** అను పేరుగలది. ఇందులో 11 అనువాకములు, 59 పన్నములుండును. **'విష్ణుముఖ'** అను ప్రశ్నలో 12 అనువాకములు, 64 పన్నములుండును అని శ్రీగురుడు ద్విజులతో చెప్పెను. **'ఉత్సన్న'** అను మూడవ ప్రశ్నలో 12 అనువాకములు, 48 పన్నములుండును. **'దేవాసుర'** అను నాలుగవ ప్రశ్నలో 12 అనువాకములు, 58 పన్నములు గలవు. **'యదేకేన'** అనే పేరుగల ప్రశ్నలో 24 అనువాకములు, 62 పన్నములు గలవు. **'హిరణ్యవర్ణా'** అను ప్రశ్నలో 23 అనువాకములు, 54 పన్నములు గలవు. **'యో వా ఆ య థా'** అనే పేరుగల ప్రశ్నలో 26 అనువాకములు, 58 పన్నములు గలవు. ఇక పంచమాష్టక సంహితలో ఏడు ప్రశ్నలుండును. అందులో మొత్తము 120 అనువాకములు అధికముగా విస్తరించియుండును. పన్నముల సంఖ్య 403 ఉండును. ఆరవ అష్టక సంహితలో మొదటి ప్రశ్నను **'ప్రాచీనవంశగ్ం'** అని అందురు. అందులో 11 అనువాకాలుండును. 76 పన్నములు అధికముగా ఉండును. **'యదుభౌ'** అను ప్రశ్నయందు 11 అనువాకాలు, 59 పన్నములుండును. **'చాత్వాల'** అనే మూడవ ప్రశ్నయందు 11 అనువాకాలు, 62 పన్నములుండును. **'యజ్ఞేన'** అను నాలుగవ ప్రశ్నయందు 11 అనువాకాలు, 51 పన్నములుండును. **'ఇంద్రోవృత్ర'** అను ఐదవ ప్రశ్నయందు 11 అనువాకములు, 42 పన్నములు గలవు. **'సువర్గాయ'** అను ప్రశ్నమునందు 11 అనువాకాలు, 43 పన్నములు గలవు. ఇంతటితో ఆరవ అష్టకము పరిపూర్ణమైనది. ఇందులో 6 ప్రశ్నలుండును. ఇది 66 అనువాకములు కలిగి 333 పన్నములతో కూడుకొని యుండును.(116-132)

ఇక ఏడవ అష్టకమునందలి మొదటి ప్రశ్నకు **'ప్రజనన'** అని పేరు. ఇందులో 20 అనువాకములు, 52 పన్నములు గలవు. **'సాధ్యా'** అను రెండవ ప్రశ్నయందు 20 అనువాకములు, 50 పన్నములు గలవు. **'ప్రజవం వా'** అను ప్రశ్నలో 20 అనువాకములు, 42 పన్నములు గలవు అని శ్రీగురునాథుడు ఆ దుష్టబ్రాహ్మణులతో చెప్పుచుండెను. **'బృహస్పతిరకామ'** అను ప్రశ్నలో 22 అనువాకములు, 53 పన్నములుండును. **'గావో వా'** అను ఐదవ ప్రశ్నయందు 25 అనువాకములు, 54 పన్నములు గలవు. సప్తమాష్టకసంహితలో 5 ప్రశ్నలు, 107 అనువాకములు

గలవు. అందులో 251 పన్నముల సంఖ్యను కలిసి సరసమైన సప్తమాష్టకమును గురించి ఏకాగ్రముగా వినుము. సప్తమాష్టక సంహితలో 44 ప్రశ్నలు. 651 అనువాకములు ఉండును. ఈ మొత్తము 2198 పన్నములను నీవు పఠించవలసి యుండునని వ్యాసుడు శిష్యునితో చెప్పెను.(133-141)

బ్రాహ్మణమునందు ముఖ్యమైన మూడు అష్టకములుండును. అందలి మొదటి అష్టకములో ఎనిమిది ప్రశ్నలు. వాటి పేర్లు రసభరితమైనవి. **వాటిని గూర్చి చెప్పెదను వినుము.** మొదటి ప్రశ్న '**బ్రహ్మసంధత్త**' అను పేరుతో ప్రఖ్యాతి నొందెను. అందులో 10 అనువాకములుండును. విస్తృతమైన 80 దశకములుండును. '**ఉద్ధన్య**' అనే పేరుగల రెండవ ప్రశ్నలో 6 అనువాకములు, 60 దశకములు గలవు. వాజపేయ యజ్ఞమును గూర్చిన విషయము ఈ ప్రశ్నలోనే కలదు. ఇక మూడవ ప్రశ్న '**దేవాసుర**' అనునది. ఇందులో 10 అనువాకములు, 65 దశకములు గలవు. '**ఉభయే**' అనే నాలుగవ ప్రశ్నలో 10 అనువాకములుండును. అందులో 66 దశకాలు ఉండును. '**అగ్నేఃకృత్తికా**' అనే ఐదవదైన ప్రశ్నయందు 12 అనువాకములు గలవు. అందులో 62 దశకములుండును. '**అనుమత్య**' అను ఆరవ ప్రశ్నయందు 10 అనువాకములు, 75 దశకములు గలవు. '**ఏతద్బ్రాహ్మణా**' అను ఏడవ ప్రశ్నయందు 10 అనువాకములు, 64 దశకములు గలవు. '**వరుణస్య**' అను ఎనిమిదవ ప్రశ్నయందు 10 అనువాకములు, 37 దశకములు గలవు. బ్రాహ్మణమునందు మొదటి అష్టకమున, ఎనిమిది ప్రశ్నలు, 78 అనువాకములు గలవు. అందులో 499 దశకములు గలవు అని వైశంపాయనుడు వ్యాసమునీంద్రుని గురుముఖముగ చక్కగా వినెను. ఇక బ్రాహ్మణములలో రెండవ అష్టకములోని మొదటి ప్రశ్న '**అంగిరస**' అనునది. అందులో 11 అనువాకములు, 60 దశకములుండును. '**ప్రజాపతిరకామ**' అనే ప్రశ్నను కాండమని అందురు. ఇక రెండవ ప్రశ్న మహామధురమైనది. ఇందులో 11 అనువాకములు, 73 దశకములు గలవు. '**బ్రహ్మవాదిన**' అను కాండలో 11 అనువాకాలు, 70 దశకములు గలవు. '**జుష్టో**' అను ప్రశ్నయందు 8 అనువాకములు, 80 దశకములు గలవు. '**ప్రాణోరక్షతి**' అనే ప్రశ్నలో ఖ్యాతి వహించిన 8 అనువాకములు, 45 దశకములు గలవు. '**స్వాద్వీంత్వా**' అనునది ఆరవ ప్రశ్న. ఇందులో '**సౌత్రామణి**' అనే ప్రశ్న బహు ఉత్తమమైనది. ఇందులో 20 అనువాకములు, 86 దశకములు గలవు. '**త్రివృత**' అనే ఏడవ ప్రశ్నలో 18 అనువాకములు, 66 దశకములు గలవు. '**పీవోఅన్న**' అను 8వ ప్రశ్నలో 9 అనువాకములు, 79 దశకములు గలవు. ద్వితీయ అష్టక బ్రాహ్మణమునందు 8 ప్రశ్నలుండును. అందులో 96 అనువాకములు అతి రమ్యమైనవి గలవు. ఇందులో మొత్తము 539 దశకములుండును. బహుజాగ్రత్తగా వినుము. (142-163)

తృతీయాష్టక బ్రాహ్మణమునందు 12 ప్రశ్నలు గలవు. **'అగ్నిర్నఃపాతు'** అను ప్రసిద్ధి చెందినది మొదటి ప్రశ్న. ఇందులో 6 అనువాకములు, 63 దశకములు గలవు. **'తృతీయస్య'** అనునది రెండవ ప్రశ్న. ఇందులో 10 అనువాకములు, 85 దశకములు గలవు. **'ప్రత్యుష్టగ్ం రక్ష'** అనేది మూడవ ప్రశ్న. ఇందులో 11 అనువాకములు, 79 దశకములు గలవు. **'బ్రహ్మణేసి'** అనునది నాల్గవ ప్రశ్న. ఇందులో ఒకే ఒక అనువాకము, 19 దశకములు గలవు. **'సత్యా'** అనునది ఐదవ ప్రశ్న. ఇందులో 13 అనువాకములు, 29 దశకములుండును. **'అంజంతి'** అనేది ఆరవ ప్రశ్న. ఇందులో 15 అనువాకములు, 38 దశకములుండును. **'అచ్ఛిద్ర'** అను ప్రశ్నలో 14 అనువాకములు, 130 దశకములు గలవు. అశ్వమేధమును గూర్చిన ప్రశ్నతో కూడిన **'సాంగ్రహణ్యా'** అను పేరుతో విఖ్యాతి చెందిన దానిలో 23 అనువాకములు, 91 దశకములుండును. **'ప్రజాపతిః'** అను పేరుగల అశ్వమేధమును గూర్చిన విషయమును ప్రస్తావింపబడిన ప్రశ్నలో 23 అనువాకములు, 84 దశకములు గలవు. **'సంజ్ఞాన'** అను కాఠకమను పేరుగల శాఖలో 11 అనువాకములు, 29 దశకములు గలవు. **'లోకోసి'** అను రెండవ కాఠకమునందు 10 అనువాకములు గలవు. ఇందులో 62 దశకములు గలవు. **'తుభ్యా'** కాఠకమను 12వ ప్రశ్నలో 9 అనువాకములు, 56 దశకములు వుండును. బ్రాహ్మణములో 3వ అష్టకమునందు బహుప్రసిద్ధమైన 12 ప్రశ్నలు గలవు. అందులో 146 అనువాకములు, 785 దశకములు గలవు. ఈ బ్రాహ్మణమునందలి 3వ అష్టకములో 28 ప్రశ్నలు గలవు. ఇందులో 321 అనువాకములుండును. **'పరాత్త'** అను బ్రాహ్మణమును పరిశీలించెదము గాక. ఇందులో 1823 దశకముల సంఖ్యతో కూడి బహు విస్తారముగ ఉన్నవి. (164-180)

ఇక ఆరణ్యకము. ఇందులో 10 ప్రశ్నలుండును. **'భద్ర'** అనేది మొదటి ప్రశ్న. ఇందులో 32 అనువాకములు, 130 దశకములు గలవు. **'స్వాధ్యాయ'** అను బ్రాహ్మణములో 20 అనువాకములు, 24 దశకములు గలవు. **'చిత్తి'** అనే ప్రశ్నలో 21 అనువాకములు, 53 దశకములు గలవు. **'మంత్రబ్రాహ్మణా'** అనునది విశిష్టమైన 4వ ప్రశ్న. ఇందులో 42 అనువాకాలు, 85 దశకములు గలవు. **'శ్రేష్ఠా'** అను బ్రాహ్మణ ప్రశ్నలో 12 అనువాకములు, 108 దశకములు గలవు. **'పితృమేధ'** అను ప్రశ్నలో 12 అనువాకములు పరిపూర్ణముగా ఉండును. దానిలో 27 దశకములు గలవు. **'శిక్షా'** అను పేరుగల ప్రశ్నలో 12 అనువాకములు, 23 మనోహరమైన దశకములు గలవు. **'బ్రహ్మవల్లీ'** అనే ప్రశ్నలో 9 అనువాకములు, 14 దశకములు ఉండును అని వ్యాసుడు తన శిష్యునకు చెప్పెను. ఇక **'భృగువల్లీ'** అను ప్రశ్నలో 10 అనువాకములు, 15 దశకములు గలవు. **'నారాయణ'** అనే 10వ ప్రశ్నలో 80 అనువాకములు గలవు. 104 దశకములు గలవు. **'అరణాసీ'** అను పదవ

ప్రశ్నలో 250 అనువాకములు, 583 మనోహరములైన దశకములుండును అని వ్యాసుడు శిష్యునకు వివరించుచుండెను. ఈవిధముగా 'సంహిత', 'బ్రాహ్మణ' 'ఆరణ్యకము'లను గ్రంథత్రయంలో 82 ప్రశ్నలు, 1221 మనోహరమైన అనువాకములు ఉండును. ఇక పన్నములను, దశకములను గురించి విస్తరించి నీకు చెప్పెదను వినుము. ఇందులో 2198 పన్నములుండును. గ్రంథత్రయంలో పరిపూర్ణముగా 2406 దశకములు గలవు. ఆవిధంగా యజుర్వేదమునందు 86 భేదములు గలవు. అందలి ఒక్కొక్క భేదము గొప్పగా విస్తరించి చెప్పబడి ఉన్నది అని ఈవిధముగ వ్యాసమునీంద్రుడు వైశంపాయనుడను శిష్యునకు యజుర్వేదమును గూర్చి వివరించి చెప్పెనని **శ్రీ గురుమూర్తి తనకెదురుగా కూర్చొనియున్న దుష్టబ్రాహ్మణులతో పలికెను.** (181-198)

అనంతరము వ్యాసమునీశ్వరుడు జైమిని అనే మూడవ శిష్యునకు సామవేదమును సాంగముగా ఉపదేశించెను. సామవేదమునకు గాంధర్వమను వేదము ఉపవేదము. ఆ వేదస్వరూపమును ఇట్లు వర్ణించెను. సామవేదమునకు విష్ణువు దైవము. కశ్యపస గోత్రము. జగతీ ఛందస్సు. నిత్యనూతనమైన పూలమాలను, శుద్ధమైన తెల్లని పట్టువస్త్రమును ధరించియుండును. శమదమగుణ సంపన్నుడు. కృష్ణాజినమును, దండమును ధరించియుండును. విశాలములైన నయనములను గలిగి, బంగారు రంగులో మెరయుచుండును. ఆరు మూరల పొడవును కలిగి సూర్యకిరణ సదృశముగా దేదీప్యమానమైన ప్రకాశమును కలిగియుండును. ఇదియే సామవేదరూపము. సామవేదమునకు అనంతమైన శాఖాభేదములు గలవు. ఎంతవారికైనను దీనిని పూర్తిగా పఠించుటకు శక్తి చాలదు. ఇందులోగల భేదములు ఒక్క నారాయణమూర్తికి తప్ప మరెవరికినీ అంతుపట్టవు. శిష్యుడా! జైమినీ! అది నీకు కొద్దిమాత్రముగ వివరించెదను. ఇందులో మొట్టమొదటిది **'ఆసురాయణీ'**. రెండవది **'వాసురాయణీ'**. ఇక మూడవది **'వార్తాంతవేయము'**. **'ప్రాంజలి'** అనునది నాలుగవ భేదము. **'ఋగ్వైనవిధ'** మనునది ఐదవది. ఇక ఆరవది **'ప్రాచీనయోగ్య'** శాఖ. ఏడవ శాఖను **'జ్ఞానయోగ్య'** మందురు. **'రాణాయని'** అను పేరుగల శాఖకు తొమ్మిది భేదములు గలవు. **'రాణాయని' 'శాట్యాయని' 'శాట్యా'** అనునది మూడవ భేదము. **'ముద్గల'** అనునది నాలుగవ భేదము. **ఖల్వాల, మహాఖల్వాల** ఐదవది, **లాంగల** ఆరు, **కౌథుమ** ఏడు, **గౌతమ** అనునది ఎనిమిదవ భేదము. ఇందులో తొమ్మిదవ దానిని **'జైమిని శాఖ'** యందురు అని వ్యాసముని సామవేద భేదములను గూర్చి చెప్పెను. పిమ్మట, వ్యాసమహర్షి సుమంతుడు అనే శిష్యుని తన ముందుకు పిలిచి హర్షాతిరేకముతో అథర్వణవేదమును అతనికి ఉపదేశించెను. అథర్వణవేదమునకు ఉపవేదము శస్త్రశాస్త్ర యుక్తమైన ధనుర్వేదము. దీని గోత్రము వైతానము. దీనికి ఇంద్రుడు అధిదైవతము.

అనుష్టుప్ ఛందస్సు. భయంకరమైన, తీక్ష్ణమైన కృష్ణవర్ణమును కలిగియుండును. కామరూపమును కలిగి క్షుద్రకర్మ నాచరించును. అతని పేరు స్వదారతుష్ట. విశ్వమును సృష్టించుట అతని నిత్యకృత్యము. ఉదకముతో నిండియున్న పాత్రను శిరమున ధరించియుండును. అథర్వణవేద రూపము ఇట్లుండునని చెప్పి దీనిలో తొమ్మిది భేదములు గలవని సుమంతుడను శిష్యునకు వ్యాసమునీంద్రుడు ఉపదేశించెను. దీని భేదములలో మొదటిది **పైప్పలాదము.** రెండవది **దాంతము.** మూడవది **ప్రదాంతము.** నాల్గవది **తౌతము. ఔతమను** పేరు గలది మరొకటి. తదుపరి విశేషమైనది **బ్రహ్మద పలాశము.** ఆ తరువాత ఏడవది **శౌనకి శాఖ.** ఎనిమిదవది **వేదదర్శి.** తొమ్మిదవది **చారణ విద్య.** ఇక ఈ వేదముయొక్క ఉపగ్రంథమైన ఐదు కల్పముల గురించి తెలియజేసెదను, జాగ్రత్తగా వినుము. **'నక్షత్ర'** – **'విధి'** – **'విధాన'**–**'సంహిత'** – **'శాంతి'** అను ఐదు కల్పములలో సమస్త దేవతలు ఉపాంగరూపమున ఉందురు అని వ్యాసమహర్షి అథర్వణ వేదమును ఉపదేశించెను. ఈవిధముగ వేదవ్యాసులవారు తమ నలుగురి శిష్యులకు నాలుగు వేదములను, సాంగముగ శాఖోపశాఖల యుక్తముగ ఉపదేశించి ఈ భూతలమునందు గల భరతఖండములో వీటిని చక్కగా ప్రకాశింపచేయవలసినదని వారిని ఆదేశించెను. భరతఖండమునందు పూర్వము ఎందరో పుణ్యాత్ములుండెడివారు. జనులు తమ తమ వర్ణాశ్రమ ధర్మములను చక్కగా పాటించుచుండెడివారు. ఈ కలియుగమునందు బ్రాహ్మణులు ధర్మకర్మలను వదలివేయుటవలన భూలోకమునందు వేదములు గుప్తముగా ఉండిపోయినవి. ఇక బ్రాహ్మణులు కర్మభ్రష్టులై మ్లేచ్ఛులముందు వేదములను వల్లించుచుండిరి. సత్త్వమును కోల్పోయి, మందమతులై తిరుగుచుండిరి. పూర్వకాలమున బ్రాహ్మణులు వేదములయొక్క మహత్త్వమును గ్రహించి దైవత్వమును కలిగియుండిరి. కావున, వారు భూసురులనియు, భూదేవతలనియు పిలువబడిరి. పూర్వకాలమున రాజులు బ్రాహ్మణులను మిక్కిలిగా ఆదరించి, కడు భక్తితో పాదపూజలను చేసి వారిని పూజించెడివారు. రాజులు తమ సర్వస్వమును వారికి దక్షిణగా సమర్పించెడివారు. కాని, నాటి బ్రాహ్మణులు నిత్యతృప్తులై, వీతరాగులై ఉండుటవలన గొప్ప గొప్ప బహుమానములనుగానీ, దక్షిణలనుగానీ స్వీకరించెడివారు కాదు. ధనమును వారు తృణప్రాయముగ నిరాకరించెడివారు. వేదమూర్తులైన మన పూర్వీకులకు త్రిమూర్తులు, ఇంద్రాది సురవరులు సహితము వశులై యుండెడివారు. వేదవేత్తలైన బ్రహ్మణ్యుల నోటివెంట వెలువడిన వాక్యములను కామధేనువుగను, కల్పవృక్షముగను భావింపబడుచుండెను. నాటి బ్రాహ్మణోత్తములు తమకున్న వైదిక బలముతో తమ వాక్కుచే వజ్రమును తృణప్రాయముగను మార్చగలిగిన శక్తిని కలిగియుండెడివారు. ఒక గడ్డిపోచను పర్వతముగను, పర్వతమును తృణప్రాయముగను

మార్చివేయగలిగెడి శక్తిని కలిగియుండెడివారు. అందువల్లనే వేదవేత్తలగు బ్రాహ్మణులు నాకు దైవస్వరూపులు. నిరంతరము నేను వారి పాదములను పూజించుచుందునని సాక్షాత్తు విష్ణుమూర్తియే భాగవతాది గ్రంథములయందు ఎంతో గొప్పగా ప్రశంసించియుండిరి. (199-229)

దైవాధీనం జగత్సర్వం మంత్రాధీనం తు దైవతమ్ । తన్మంత్రం బ్రాహ్మణాధీనం బ్రాహ్మణో మమ దేవతా ॥ (230)

అనగా - ఈ జగత్తంతయు దైవముమీద ఆధారపడియుండును. దైవము మంత్రముమీద ఆధారపడియుండును. అట్టి మంత్రము బ్రాహ్మణులకు వశమైయుండును. కావున, అట్టి బ్రాహ్మణులే నాకు దేవతాస్వరూపులని విష్ణుమూర్తి స్వయముగ నుడివెను. కావున, దీనిననుసరించి బ్రాహ్మణులకు ఇంతకు పూర్వము మహోన్నతమైన గొప్పతనము లభించుచుండెను. వేదమార్గమును త్యజించి, అన్యమార్గమును అవలంబించుటచే ఉన్నతులైన బ్రాహ్మణులు అవనతులైపోయిరి. వేదమార్గమును వదలివేయుటయే గాక హీనుల సేవను చేయుటకు వెనుకాడకుండిరి. ధనమునకు ఆశించి, హీనజాతివారి వద్ద వేదములను పఠించుచుండిరి. వాటిని ద్రవ్యమునకు అమ్ముకొని, వాటి పవిత్రతను ధ్వంసమొనర్చుచుండిరి. అట్టివారి ముఖమును చూచినను మహాపాతకము చుట్టుకొనును. ముందు ముందు వారు బ్రహ్మరాక్షసులుగా మారెదరు. వారే స్వయముగ తమ మహిమను నశింపచేసికొని, వేదమును ద్రవ్యమునకు విక్రయించి, వేదభ్రష్టులగుచుండిరి. ఇట్టి మహత్తరములైన, అనంతములైన వేదములను పూర్తిగా ఈ భూలోకమునందు తెలుసుకొనుటకు ఎవడు సమర్థుడగును. అవన్నియును గుప్తములై పోయినవి. అన్ని శాఖలు నేడు లభించుటలేదు. మీరేమో మాకు నాలుగు వేదములు వచ్చును. మేము చతుర్వేదులము అని అనిపించుకొని, ఇతరులతో వాదించెదము అని వ్యర్థముగ ప్రేలుచుంటిరి. అనంతమైన శాఖలు కలిగిన వేదములను గూర్చి మీకేమి తెలియును. దానివలన మీకు వచ్చు లాభమేమిటి? వ్యర్థముగ బ్రాహ్మణులకు క్షోభను కలిగించుటవలన మీకు వచ్చు లాభమేమి? అసలు మీకు ఈ వేదములను బోధించినది ఎవరు? అందరిని మేము జయించితిమి, మా ఎదుట నిలబడుటకు కూడా యోగ్యతలేని బ్రాహ్మణులందరు పరాజితులమని అంగీకరించి జయపత్రములను వ్రాసి ఇచ్చిరని, మేము అందరిని జయించితిమని, మా ఎదుట నిలబడు శక్తి ఈ లోకమునందు మరెవరికీ లేదని వ్యర్థముగ మీకు మీరే ఆత్మస్తుతిని చేసికొనుచుంటిరి. ఈ త్రివిక్రమభారతి వద్దకు వచ్చి మాకు జయపత్రమును వ్రాసి ఇవ్వుమని వారిని మిక్కిలి బాధించితిరి. బ్రాహ్మణులను నిష్కారణముగ బాధించిన పాపము వృథాగా పోదు అని మీరు గ్రహించవలెను. ఇప్పటికైనను నా మాటను విని, మీరు సద్బుద్ధిని కలిగి, నిరహంకారులై ఇక్కడినుండి మీ గృహములకు వెళ్ళిపోవుడు. గర్వముతో విర్రవీగిన వారు వ్యర్థముగా నశించిపోవుదురు సుమా! అని

ఆ దుష్టబ్రాహ్మణులకు శ్రీ గురునాథుడు ఎంతగానో హితబోధ చేసెను. అయినప్పటికిని తామసగుణ ప్రభావము కలిగిన ఆ విప్రులు గురుమూర్తి మాటలను పెడచెవిన పెట్టిరి. “లేదు, లేదు మాతో వాదమునకు కూర్చొనుడు. ఒకవేళ మీరు మాతో వాదము చేయకుండా, జయపత్రము వ్రాసి ఇవ్వకుండా మిన్నకుండిన యెడల మేము ఓడిపోయితిమని జనులందరూ యవనరాజునకు ఎరిగించెదరు. అప్పుడు మా గొప్పతనము నశించిపోవును కదా!” అని గురుమూర్తితో నుడివిరి. మదోన్మత్తులైన ఈ దుష్టబ్రాహ్మణ పండితులకు వినాశకాలము దాపురించినందుననే గురునాథుని హితమును పెడచెవిన పెట్టి వీరు తమ హితమును తెలిసికొనలేకపోవుచుండిరి. వారికి మృత్యువు సమీపించినట్లున్నది. అందుకే గురుమూర్తియొక్క హితబోధ వారికి రుచింపలేకపోయెను” అని సిద్ధమునీంద్రుడు నామధారకునకు చెప్పిన విధముగ గంగాధర సరస్వతి కామధేనువు వంటి గురుచరితామృతమును మనకు ప్రకటింపచేసిరి. ఇట్టి వేదవివరణమును పఠించిన, వినిన సాధకులందరికి చక్కని ఆత్మ తృప్తి కలుగును అని గంగాధర సరస్వతి పలుకుచుండెను. (231–242)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు “వేదవిస్తారకథనము” అను ఇరువది ఆరవ అధ్యాయము ॥ 26 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 242; మొత్తము సంఖ్య : 2692 + 242 = 2934 ఓవీలు)

◆ ◆ ◆

శోషణం పాపపంకస్య దీపనం జ్ఞానతేజసః ।
భక్తాభీష్టప్రదం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥
శ్రీవాసుదేవానంద స్వామి విరచితం శ్రీదత్తాత్రేయ స్తోత్రం – శ్లో – 5

శ్రీ గురు చరిత్ర

ఇరువది ఏడవ అధ్యాయము

దుష్టబ్రాహ్మణులు తమతో శాస్త్రవాదము చేయుమని గురుమూర్తిని పదేపదే కోరుట - శ్రీగురుడు తమ దివ్యదృష్టిచే మాతంగుడను వ్యక్తికి పూర్వజన్మ స్మృతిని ప్రసాదించుట - వెంటనే అతడు వేదశాస్త్ర జ్ఞాన సంపన్నుడగుట - శ్రీగురుమహిమకు భీతినొందిన దుష్టవిప్రులు శరణుజొచ్చుట - వారు బ్రహ్మరాక్షసులగుట - వారికి శ్రీగురునాథుడు శాపవిముక్తిని అనుగ్రహించుట-పూర్వజన్మస్మృతి గలిగిన మాతంగుడు తనయొక్క గతజన్మల దోషములను గూర్చి ప్రశ్నించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః॥

శిష్యుడగు నామధారకుడు సిద్ధముని పాదద్వంద్వమును పట్టుకొని అంజలి ఘటించి మిగుల వినయముతో ఇట్లు పలికెను - "సిద్ధయోగీ! మీకు జయమగుగాక! ఈ జగత్తునందు నన్ను తరింపజేయువారు తమరే సుమా! నాలో జ్ఞానమును ప్రకాశింపచేయుటకొరకే మీ దివ్యచరణారవిందముల దర్శనమును నాకు అనుగ్రహించితిరి. స్వామీ! మీ కృపవలన అత్యద్భుతమైన, అమృతప్రాయమైన శ్రీగురుచరిత్రమును వినగలుగుచుంటిని. శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణులకు నాలుగు వేదములను, వాటి శాఖాభేదములను కూడా వివరించి చెప్పిన పిదప జరిగిన కథావృత్తాంతమును దయతో నాకు సెలవీయవలసినదని" ప్రార్థించెను. **అంతట సిద్ధముని మిగుల హర్షించి ఇట్లు చెప్పసాగెను**- "శిష్యా! నామధారకా! శ్రీగురుమూర్తి యొక్క అమోఘమైన మహిమాప్రాభవమును సావధాన చిత్తముతో వినుము. ఆ దుష్టబ్రాహ్మణులకు శ్రీగురునాథుడు ఎన్ని విధములుగ హితవు చెప్పినప్పటికిని తామసిక వృత్తిని కలిగిన ఆ విప్రులు వినకుండా తమతో వాదమును చేయుమని లేదా, తమకు జయపత్రమైనా ఇవ్వమని నిర్బంధముగ మాటిమాటికి కోరుచుండిరి. శ్రీగురునాథులు వారి అవినయమును చూచి మిగుల కోపగించి, మీ మనసున ఎట్టి భావము కలదో, దానినే మీరు పొందెదరు. ఎవరి కర్మను వారు అనుభవించవలసినదై ఉండగా దానిని తప్పించుటకు ఎవరి తరమగును. **'వినాశకాలే విపరీతబుద్ధిః'** అను లోకోక్తిని అనుసరించి దానికి నిదర్శనముగా మీరు కనిపించుచుంటిరి. ఏలనన, పాములు పెట్టిన పుట్టకు కన్నము వేయుటకు పోయిన ఎలుక ఆ పామునకే ఆహారమైన విధముగా, ధగధగ మెరిసిపోవుచున్న దీపజ్వాలను చూచి

ఆకర్షితురాలై అందులో పడి కాలిపోయిన మిడతవలె మీ సర్వనాశనమునకు మీరే స్వయముగా స్వాగతము పలుకుచుండిరి. అందుకు నేనేమి చేయగలను. మదోన్మత్తులైన ఆ విప్రులు శ్రీగురుమూర్తిని గుర్తించక గుడ్లగూబలవలె బలవంతముగ తమ ప్రాణములను సైతము వదలుకొనుటకే సిద్ధపడిరి. ఇంతలో తమకు కొద్దిదూరమున దారిగుండా పోవుచున్న ఒక వ్యక్తిని చూచి గురుమూర్తి తమ శిష్యులతో ఆ దారిగుండా పోవుచున్న మనిషి ఎవరో తెలిసికొని అతనిని తీసుకొని రమ్మని ఆదేశించిరి. శిష్యులు వెంటనే పరుగెత్తుకొని వెళ్ళి ఆ మనిషిని తీసుకొని వచ్చి గురునాథుల ఎదుట నిలిపిరి. (1-10)

అంతట శ్రీగురుమూర్తి "నాయనా! నీవెవరవు? ఏ జాతికి చెందినవాడవు? నీ వృత్తాంతమును యథార్థముగా చెప్పుమని" కోరెను. అతడు గురుమూర్తితో ఇట్లు చెప్పెను - "అయ్యా! నేను ఆరణ్యకుడను. నా పేరు మాతంగుడు. గ్రామమునకు వెలుపల నేను నివసించుచున్నాను. నేనెందులకో మహాత్ముల దృష్టిలో పడితిని. స్వామీ! సమస్త జీవులపట్ల దయాస్వభావముగల కరుణామూర్తులు మీరు. కనుకనే, దారిన పోవుచున్న నన్ను కడు ప్రీతితో పిలిపించితిరి. ఇక, నేను ఉద్ధరింపబడినట్లే కదా! అయిననూ, దయతో తాము నన్ను ఉద్ధరింపవలసినదని" వేడుకొనుచు అతడు సాష్టాంగముగ దూరమునుండి నమస్కరించెను. పరమ కృపాళురైన ఆ పరమపురుషుడు అపారమైన కృపామృతదృష్టిని వాడిపై ప్రసరింపచేసిరి. అంతే, పరుసవేదిని తాకిన ఇనుము బంగారముగ మారినట్లు, శ్రీగురుమూర్తి యొక్క కరుణామయకిరణము ప్రసరించినమీదట ఆ కడజాతివాడు ఉత్తముడు అగుటకు ఆలస్యమగునా? వెంటనే ఒక శిష్యుని చేతికి దండమును ఇచ్చి నేలమీద వరుసగా ఏడు గీతలు గీయించిరి. ఆ శిష్యుడు ఏడు రేఖలను గీసెను. **అంతట శ్రీ గురుమూర్తి ఆ మాతంగునితో ఇట్లు చెప్పెను-** "నాయనా! నేలపై గీసిన ఏడు గీతలలో నీవు ఒక్కొక్క గీతను దాటిరమ్మని" గురుమూర్తి ఆజ్ఞాపించెను. శ్రీస్వామి వారి ఆజ్ఞను అనుసరించి ఆ మాతంగుడను వ్యక్తి మొదటి రేఖను దాటిన వెంటనే, వాని జాతి దోషములన్నియు నశించి పునీతుడు కాగలడని గురుమూర్తి చెప్పెను. అటులనే అతడు మొదటి రేఖను దాటెను. వెంటనే శ్రీగురునాథుడు అతనితో 'నీవు ఏ కులమున జన్మించితివి? అప్పుడు నీ పేరేమి? నీవెవరవు?' అని ప్రశ్నించెను. అంతట వాడికి పూర్వజ్ఞానము ఉదయించి, 'అయ్యా! నేను కిరాతవంశమున భిల్లజాతికి చెందినవాడిని. అప్పుడు నా పేరు 'బనరాఖ' అని' చెప్పెను. రెండవ రేఖను దాటగనే జరిగిన జరగబోయే భూత, భవిష్యజ్ఞానమునకు చెందిన పరిపూర్ణమైన జ్ఞానము వాడికి ప్రాప్తించెను. అప్పుడతడనేక విషయములను చెప్పసాగెను. అందుకు అక్కడగల వారందరు విస్మయమును చెందుచుండిరి. తరువాత, మూడవ రేఖను దాటగానే అతనికి పూర్వజన్మ స్మృతి కలిగెను. 'నీవెవడవని' గురుమూర్తి ప్రశ్నింపగా 'స్వామీ! నేను గంగాసుతుడను. అనగా

నావికుడను. మా నివాసము నదీతీరము' అని చెప్పెను. పిమ్మట నాలుగవ రేఖను దాటగానే 'తాను శూద్రజాతికి చెందినవాడినని, తమ జాతికి సంబంధించిన వృత్తియగు వ్యవసాయ పనిని చేయుటకు వెళ్లుచుండగా స్వామివారు తనను పిలిపించినారని' చెప్పెను. ఐదవ రేఖను దాటగానే "మహాత్మ! నేను వైశ్యుడను. నా పేరు సోమదత్తుడు" అని చెప్పెను. అనంతరము ఆరవ రేఖను దాటిన మరుక్షణమే "మహానుభావా! నేను గొప్ప క్షత్రియ వంశమున జన్మించితిని. గోదావరి (గోవిందుడు) అను పేరుతో మిక్కిలి ప్రసిద్ధినొందితిని" అని నుడివెను. తదుపరి, ఏడవ రేఖను దాటిన వెంటనే శ్రీస్వామివారి ప్రశ్నకు బదులుగా – "గురుదేవా! నేను అగ్రజాతికి చెందిన బ్రాహ్మణుడను, వేదశాస్త్రజ్ఞాన సంపన్నుడను. నా పేరు 'అధ్యాపకుడు' అని" పలికెను. **అంతట శ్రీగురుమూర్తి అతనితో ఇట్లు నుడివెను** – నీవు వేదశాస్త్రజ్ఞానసంపన్నుడను అని చెప్పుచుంటివి కదా! ఈ ఇద్దరు బ్రాహ్మణులు వేదచర్చకు వచ్చిరి. వీరితో నీవు వాదింపవలసినది అని, తమ వద్ద గల దివ్యమైన విభూతిని అభిమంత్రించి అతని దేహముపై ప్రోక్షింపగా, వాడు పరుసవేది స్పర్శవలన ఇనుము బంగారముగ మారినట్లు, మానససరోవరము నందు మునిగిన కాకి, హంసగా మార్పిడి చెందినట్లు శ్రీ నృసింహసరస్వతీ జగద్గురువుల మాహాత్మ్య విశేషము వలన, వారిచేత చల్లిన విభూతి స్పర్శవలన ఆ మాతంగుడు మహాజ్ఞాన సంపత్తిగలవాడై వెలుగొందెను. త్రిమూర్త్యాత్మక అవతారపురుషులైన శ్రీజగద్గురు నరసింహ సరస్వతీ స్వామివారిని మానవుడు అని అజ్ఞానముచేత పలికిన వారందరూ అథఃపతనము నొందెదరు. ఈ విధముగ ఒక పతితుడైన వ్యక్తి అత్యంత గొప్ప జ్ఞానిగా మారి, వేదశాస్త్రాదులను సాంగోపాంగముగా చెప్పసాగెను. శాస్త్రచర్చకై వచ్చిన ఆ విప్రులు ఈ అద్భుతమునకు అచ్చెరువొంది, భయభ్రాంతులై మాటలు పడిపోయి మూగవారైపోయిరి. సర్వాంగములయందు కంపము కలుగసాగెను. వారికి హృదయశూల ప్రారంభమాయెను. అంతట ఆ బ్రాహ్మణులు గజగజ వణకిపోవుచూ శ్రీగురునాథుని దివ్యచరణారవిందములపై పడి, శరణుగోరుతూ సాష్టాంగవందనమును ఆచరించి తమను రక్షింపుమని **పదేపదే ప్రార్థింపుచూ ఇట్లు స్తుతించిరి.** (11–30)

"స్వామీ! జగజ్జ్యోతిస్వరూపా! మహాత్మ! మా గతి ఏమి? జ్ఞానజ్యోతీ! బ్రాహ్మణులను ధిక్కరించిన మేము గురుద్రోహులమైతిమి. స్వామీ! మీరు సాక్షాత్తు గౌరీరమణుల అవతారస్వరూపులు. మమ్ములను దయతో క్షమింపుము. మాయాపాశముతో బంధింపబడి మదోన్మత్తులమై మీ నిజస్వరూపమును మేము గుర్తించలేకపోయితిమి. మహానుభావా! మమ్ములను క్షమియించి రక్షించుము. సమస్తజీవుల యెడ సహజముగనే కృపావృష్టిని ప్రసరింపచేసే ఓ కరుణాపయోనిధీ! మా దోషములను మీ మనసు నుండి తొలగింపుము. వాటిని నివారించి మమ్ములనుద్ధరించుము ప్రభూ!" అని **శ్రీవారి చరణములను పట్టుకొని ప్రార్థింపుచు ఇట్లు పలికిరి** – లీలగా సంకల్పమాత్రమున మీరు ఒక తృణమును పర్వతముగ

మార్చగలరు. అట్టి పర్వతమును మీరు కినుక వహించి మీ చూపును ప్రసరింపచేసిన చాలును. అది ఖచ్చితముగా మాడి మసిబొగ్గుగా మారిపోవును. ఓ త్రిమూర్తి అవతారా! జగద్గురూ! ఈ సమస్త సృష్టికి కర్తలు, భర్తలు, హర్తలు మూడునూ మీరే. మీరే సృష్టించెదరు. మీరే లోకమును పోషించెదరు. ప్రళయమునకు కూడా కర్తలు మీరే. త్రిమూర్తులైన జగద్గురువులు మీరే. మీ మహిమను వర్ణించగలశక్తి మాకెంతమాత్రమూ లేదు. శరణాగతులము. మా రక్షకులైన మీరే, దయతో మమ్ములనుద్ధరింపగలరు” అని ఆ విప్రులు మిగుల దీనవదనులై విన్నవించుకొనిరి. అంతట శ్రీగురుడు ఇట్లనెను- **“దుష్టబ్రాహ్మణులారా! నిష్కారణముగ మీరు ఉత్తమ మహామునియైన త్రివిక్రమ భారతీస్వామిని మిక్కిలి బాధించితిరి. అనేకమంది బ్రాహ్మణులను నిందించి మహాపాపరాశిని మూటగట్టుకొంటిరి. మీరు చేసిన పాపములకు అంతులేదు. అకారణముగ బ్రాహ్మణోత్తములను, వేదవిదులను నిందించితిరి. కావున, మీరు చేసిన కర్మలను మీరే అనుభవించవలయును. మీ పాపమును క్షమించుటకు ఎంతమాత్రమూ వీలులేదు. మీరు చేసిన ఈ విపరీతకర్మలయొక్క పాపఫలమును అనుభవించుటకు మీరు బ్రహ్మ రాక్షసులుగా మారెదరు. ఎవరు చేసిన పాపపుణ్యములను వారే అనుభవించవలెను. పాపములకు నిష్కృతి లేదు. అవి అనుభవింపక తప్పదు”** అని శ్రీగురునాథులు పలికిరి. (31-39)

శ్రీవారి మాటలను వినిన ఆ బ్రాహ్మణులు ఉభయులు గడగడ వణకుచూ అత్యంత భయముతో తేజోహీనులై గురునాథుని పాదపద్మములను పట్టుకొని మమ్ములనుద్ధరింపుమని మిగుల దుఃఖించుచూ “స్వామీ! మేము ఈ భవసాగరమునుండి ఉద్ధరింపబడుటెట్లు? ఆవలితీరము చేరుకొనుట ఎట్లు?” అని మిక్కిలి దుఃఖింపసాగిరి. **దయాసింధువైన శ్రీగురునాథులు ఆ విప్రుల యెడ దయగలవారై ఇట్లనిరి** – “మీరు బ్రహ్మరాక్షసులై పన్నెండు సంవత్సరములపాటు ఉండెదరు. పూర్తికాలము మీ దుష్కృతమును అనుభవింపవలసి వచ్చును. పశ్చాత్తాపమును పొందుటవలన కొంత పాపము నశించినది. అందుచే కొంతకాలమునకు మీరు శాంతిరూపులయ్యెదరు. అప్పుడు మీరు **‘శుక్లనారాయణా!’** అను వాక్యమును స్మరింపుచుండవలెను. అంతట మీ పాపములు నశించి శుద్ధమైపోయెదరు. అట్టి సమయమున దేశపర్యటన చేయుచున్న ఒక ద్విజవర్యుడు వచ్చి మీ ముందు ‘నారాయణ’ శబ్దమును ఉచ్చరింపగలడు. ఆ నారాయణ శబ్దమును వినినంతమాత్రముననే మీకు శాపవిముక్తి కలిగి ఉద్ధరింపబడెదరు” అని చెప్పినమీదట “ఇప్పుడు మీరు ఉభయులు వెంటనే గంగాతీరమునకు వెళ్లవలసినది. అదియే మీరు నివసించుటకు ఉత్తమస్థానమని” ఆ బ్రాహ్మణులకు సెలవిచ్చిరి. గురుమూర్తి ఆజ్ఞప్రకారముగ స్వామి వారికి నమస్కరించి వెంటనే కృష్ణానదీ తీరమునకు వారు వెళ్ళిపోయిరి. గ్రామము బయటకు వెళ్ళిన వెంటనే విపరీతమైన హృదయశూల కలిగి గంగాతీరము చేరిన మరుక్షణమే

వారు ఉభయులు మరణించిరి. తాము చేసిన పాపకర్మలకు వేరొక గత్యంతరము లేనందున తామసికులైన ఆ విప్రులు ఆత్మఘాతకులైరి. గురువచనము ననుసరించి వెంటనే వారుభయులు బ్రహ్మరాక్షసులుగ మారిపోయిరి. గురునాథుని వాక్యము ఎప్పటికినీ అన్యథా కాజాలదు కదా! ఆవిధముగ ఉన్మత్తబ్రాహ్మణులు పన్నెండు సంవత్సరముల పాటు బ్రహ్మరక్కసులై చరించిరి. (40-47)

విప్రులను గంగకు పంపించిన తరువాత జరిగిన వృత్తాంతమును **సిద్ధముని నామధారకునకిట్లు చెప్పసాగెను**- గురుకృపవలన పతితుడైన వ్యక్తి ఏడు జన్మల స్మృతి కలిగి మహాజ్ఞానిగా మారెను గదా! అతడు మునుపటి జన్మలో నేను బ్రాహ్మణుడనని తనలో నిర్ధారణ చేసికొనెను. అప్పుడా మాతంగుడు శ్రీగురుమూర్తికి నమస్కరించి, **కడు భక్తితో ఇట్లు విన్నవించెను**- "జగద్గురూ! అజ్ఞానమాయాపూరిత తిమిరమునకు మీరు జ్యోతిస్వరూపులు. నేను పూర్వము బ్రాహ్మణుడను కదా! అయితే ఏ దోషము వలన ఇప్పుడు ఇట్లు హీనజాతివాడిని అయితిని. స్వామీ! మీరు సర్వజ్ఞులు. త్రికాలజ్ఞులు. నా పూర్వజన్మ వృత్తాంతమును చెప్పి నన్నుద్ధరింపవలసినది. స్వామీ! శ్రీశంకరా! నృసింహసరస్వతీ! గత జన్మలలో నేను ఏయే మహాదోషములను చేసితినో, దయతో నాకు సెలవీయవలసినదని" పదే పదే ప్రార్థించెను. అతని మాటలు విని శ్రీగురుమూర్తి చిరునవ్వు చిందించెనని సిద్ధముని నామధారకునితో చెప్పెనని **గంగాధరసరస్వతి గారు ఇట్లనెను** - "ఈ కథను పతితులైనవారు విన్నయెడల బ్రహ్మజ్ఞానులు కాగలరు. పతితపావనమైన ఈ కథను వినిన జనులందరును నిశ్చయముగా చతుర్విధపురుషార్థములను శీఘ్రముగ పొందెదరు అని చెప్పుటలో ఎంతమాత్రము సందేహములేదు" అని శ్రీగురుచరిత్రమును విస్తరించి లోకమునందు ప్రకటించెను. (47-55)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "మదోన్మత్త విప్ర శాప కథనము" అను ఇరువది ఏడవ అధ్యాయము ॥ 27 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 55; మొత్తము సంఖ్య : 2934 + 55 = 2989 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ఇరువది ఎనిమిదవ అధ్యాయము

కర్మవిపాక నిరూపణము - వివిధ పాపముల స్వరూపములను - వాటి ప్రాయశ్చిత్తములను గూర్చి శ్రీగురుమూర్తి వివరించుట - విభూతి మహిమచే పతితుడు మహాజ్ఞానిగా మారుట - భస్మప్రక్షాళనచే మరల వాడు స్వస్వరూపమును పొందుట - త్రివిక్రమభారతి భస్మమహిమను వివరించుమని గురునాథుని ప్రార్థించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

"సిద్ధమునీంద్రా! అత్యంత మధురమైన గురుచరిత్రమును శ్రవణము చేయుటవలన నాకు ఎనలేని హృదయానందము కలుగుచుండెను. ఆ తరువాత జరిగిన కథాక్రమమును దయతో వివరించి చెప్పగలరని" **నామధారకుడు సిద్ధమునిని ప్రార్థించెను. అంతట సిద్ధముని నామధారకునితో ఇట్లనెను** - "నామధారకా! అలౌకికమైన, దివ్యమైన ఈ కథను వినుటచే దోషములన్నియు నశించిపోయి, జ్ఞానజ్యోతి ప్రకాశించుట తథ్యము. గడిచిన కథలో గురుకృపవలన ఒక చండాలునకు జాతిదోషము నశించిపోయి జ్ఞానజ్యోతి ఉదయించెను కదా! వాడు తన పూర్వజన్మ కర్మలను గూర్చి వివరించమని" గురుమూర్తిని కోరియుండెను. **అందుకుగాను శ్రీగురునాథుడు అతనితో ఇట్లనెను**- "నాయనా! నీకు ఈ చండాలజన్మమెట్లు వచ్చెనో అటులే నీ యొక్క మిగతా పూర్వజన్మకర్మలను గురించి వివరించుమని అడిగితివి కదా! వాని క్రమమును విశదముగ నీకు వినిపించెదను. కదు జాగ్రత్తగా వినవలయును" అని **గురునాథుడిట్లు చెప్పసాగెను.** (1-3)

పూర్వజన్మములలో చేసిన పాపపుణ్యములను అనుసరించియే అనంతర జన్మమునందు కర్మలను అనుభవించెదరు. కర్మఫలమువల్లనే అనేక జన్మలపాటుగా నీచజాతుల జన్మలు కలుగుచుండును. వాటివల్లనే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు చండాల జన్మము అనగా హీనజాతి సంప్రాప్తము అగును. అట్టి దుష్కర్మ విపాకమును గూర్చి ఇప్పుడు చెప్పుచున్నాను వినుము. బ్రాహ్మణ స్త్రీతో శూద్రుడు వ్యభిచరించుటవలన చండాలపిండము ఉద్భవించును అని శాస్త్రములు నుడువుచున్నవి. వరుసక్రమములో చండాలజాతి పదహారవ జాతి అని తెలియుము. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే ఉత్తమ జాతిలో జన్మించి, నీచకర్మలను ఆచరించువారు హీనజాతిలో జన్మించెదరు. అట్టి దోషములను

గూర్చి, అందుకు కారణమైన కర్మలను గూర్చి ఇప్పుడు నేను వివరముగ నిరూపించుచున్నాను. **వాటిని కడు జాగ్రత్తగా వినవలసినది.** బ్రాహ్మణులు అనాచారవంతులగుటచే బ్రాహ్మణత్వమును పోగొట్టుకొనెదరు. తర్వాత, హీనయోనులయందు అనగా కడజాతి జన్మలను లేదా వృక్షములుగను, లతలుగను, క్రిములుగను, కీటకములుగను జన్మించెదరు. గురువును, తల్లిదండ్రులను తిరస్కరించినవారు, త్యజించివేసినవారు కూడా చండాలురై జన్మించెదరు. కట్టుకొన్న భార్యను వదలివేసినవాడు తప్పనిసరిగా చండాలయోనిలో జన్మించును. వంశపరంపరగా ఆరాధించునట్టి కులదైవమును పూజించుటను మానివేసి, ఇతరమైన దేవతలను పూజించినవారు, ఎల్లప్పుడు అసత్యమును పలుకువారు కూడా చండాలయోనిలో జన్మించెదరు. సదా జీవహింసను చేయువారు, కన్యావిక్రయమునకు పాల్పడి ఆ ద్రవ్యముతో హాయిగా జీవించువారు, అసత్యప్రమాణములు చేయువారు, దొంగసాక్ష్యములను చెప్పువారు కూడా చండాలురై జన్మించెదరు. బ్రాహ్మణులు శూద్రుల ఇంట భుజించుటవలన, అశ్వములను విక్రయించుటవలన, ఎల్లప్పుడు శూద్రసంపర్కమును కలిగియుండుటవలన చండాలజన్మనే పొందెదరు. శూద్రస్త్రీ సంపర్కము చేయువారు, నిత్యము ఆ శూద్ర స్త్రీ చేత శుభ్రము చేయబడిన, ఆమె చేత స్పృశింపబడిన పాత్రలతో దేవ, పితృ కర్మలను చేయువారు కూడా చండాలయోనిలో జన్మింపక తప్పదు. అరణ్యములను అగ్నికి ఆహుతి చేయువారు, ఆవును, దూడను విడదీయువారు హీనజాతిలో జన్మించెదరు. కన్న తల్లిని దూషించి, వదలివేసినవారు, పరాయి తల్లిబిడ్డలను బలవంతముగ విడదీసినవారు కూడా చండాలయోనిలో జన్మింతురు. బ్రాహ్మణుడు ఎద్దు మీద కూర్చుండుటచే, శూద్రుని ఇంట సంతోషముతో భుజించుటచే తప్పనిసరిగా చండాలయోనిలో జన్మింపక తప్పదని శ్రీగురునాథుడు చెప్పుచుండెను. (4-16)

తీర్థయాత్ర చేయుచు, పుణ్యక్షేత్రములయందు తీర్థశ్రాద్ధాది కర్మలను చేయనివారును, ఎల్లప్పుడూ పరాన్నభుక్కులై జీవించెడివారు కూడా చండాలజాతిలో జన్మించెదరు. షట్కర్మరహితులైన బ్రాహ్మణులు, కపిలగోవు పాలను భగవంతునికి నివేదనము చేయకుండా ఈశ్వరునికి అభిషేకించకుండా, తామే క్షీరపానము చేయువారు చండాలయోనినే పొందెదరు. తులసీదళములతో హరిహరుల చరణాబ్జములను అర్చించనివారు చండాలురయ్యెదరు. శూద్రులు సాలగ్రామను పూజించినచో చండాలత్వమును పొందెదరు. తలిదండ్రులను సేవించకుండా, వారిని త్యజించి, వారి ఆలనాపాలన ఏమాత్రము పట్టించుకొనకుండ ఉండువారలు ఖచ్చితముగ చండాల యోనిలో జన్మించెదరు. అనంతరము వారు ఏడు జన్మలపాటు క్రిములై పుట్టెదరు. మొదట ఒక భార్య యుండగా ఆమెను వదలిపెట్టి, ఇద్దరు ముగ్గురు భార్యలను పెండ్లాడువారలు కూడా చండలయోనినే పొందెదరు. మరొక విశేషమును చెప్పెదను వినుము. అలసిపోయి, అతిథిగా వచ్చిన బ్రాహ్మణుని ఎవ్వరైతే వేదమును

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

పఠించుమని పరీక్షించెదరో వారు చండాలురయ్యెదరు. యోగ్యుడైన బ్రాహ్మణుని నిందించి, వేరొక జాతివారిని గౌరవించువారును పతితులయ్యెదరు. ఇతరుల జీవనోపాధికి సంబంధించిన సాధనమును అపహరించినయెడల వారికి చండాలయోని తప్పదు. బ్రాహ్మణులను దూషించువారలు, ఇతరుల వృత్తికి విఘాతము ఒనర్చువారలు, తటాకములను, బావులను, నాశనమొనర్చువారలు, శివాలయము యొక్క పూజకు ఆటంకమొనర్చువారు, గృహమును తగులబెట్టువారు, బ్రాహ్మణుల ఇంటిని పడగొట్టినవారు కూడా చండాలజాతిలో జన్మింతురు. నమ్మకమును కలిగించి, యజమాని భార్యతోను, గురుపత్నితోను, శత్రుమిత్రుల భార్యలతోను ఎవరు వ్యభిచారమొనర్చుదురో, వారందరు చండాల జాతిలో జన్మించెదరు. ఇద్దరు భార్యలు ఉండగా, ఒక భార్యయందు మాత్రమే పక్షపాతమును చూపువారు, సూర్యాస్తమయమైన తదుపరి ఇంటికి వచ్చిన అతిథిని నిరాకరించి భోజనము పెట్టనివారు కూడా చండాలురయ్యెదరు. త్రిసంధ్యాకాలములయందు అవివేకవంతులై భుజించెడి విప్రులు, దానమును ఇచ్చి తిరిగి తీసుకొనువారు, ఇచ్చిన మాటను నిలబెట్టుకొనక వెనుకకు తీసుకొనువారు కూడా చండాలజన్మమునే పొందెదరు. భూమిని దానమొసగి, తిరిగి దానిని తీసుకొనువారు, ఇతరులచే దానమీయబడిన భూమిని బలవంతముగ అపహరించువారు, సంధ్యవేళ హాయిగా నిద్రించువారు, వైశ్వదేవము చేయు కాలమున అతిథులతో చెడుగా మాటలాడి, వారికి భోజనము పెట్టనివారు కూడా హీనయోనియగు కోడిగా జన్మించెదరు. గంగను నిందించువారు, ఏకాదశి మొదలగు పర్వకాలములయందు భుజించువారు, యజమానిని నమ్మించి, మధ్యలో వదలిపెట్టి పారిపోయెడివారు కూడా చండాలయోనిలో జన్మించెదరు. (17-30)

పర్వదినములలోను, ఏకాదశి రోజునను, భార్యతో సంగమించువారు, శూద్రులకు వేదమును బోధించువారు కూడా చండాలయోనిలో జన్మింతురు. శ్రాద్ధదినమున శ్రద్ధగా శ్రాద్ధమును ఆచరించక ఇతర పుణ్యకర్మలను చేయువారు, మేము గొప్ప గొప్ప పుణ్యకార్యములను చేసితిమని గొప్పలు చెప్పుకునేవారు, భాగస్వాములను మోసగించెడివారు చండాలయోనిలో జన్మింతురు. గ్రీష్మకాలమునందు, ధర్మార్థముగా ఏర్పరచిన చలివేంద్రములకు భంగమొనర్చువారు, లేదా చలివేంద్రమును ఏర్పరచిన పుణ్యాత్ములకు విఘ్నమును కలిగించువారు కూడా చండాలయోనిలో జన్మింతురు. నాడీజ్ఞానము తెలియక వైద్యము చేయువారు, వైద్యము బాగుగా తెలిసికూడా సరియైన ఔషధమును రోగికి ఇవ్వనివారు కూడా చండాలయోనియందే జన్మించెదరు. వేదమార్గమును వదలిపెట్టి, క్షుద్రమంత్రోపాసనమొనర్చి, మారణమోహనాది కృత్యములతో దుష్టబుద్ధులై, ఇతరులను బాధించువారును ముమ్మాటికి చండాలయోనిలో జన్మింతురు. గురువును మనుష్యభావముతో

చూచువాడును, హరిహరులను నిందించుచు, అన్యదేవతలను పూజించువారు, తాను వైదికుడై యుండియు, వేదమార్గమును వదలిపెట్టినవారును చండాలురై జన్మింతురు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు తమకు నిర్దేశింపబడిన స్వజాతికర్మలను త్యజించి, మౌఢ్యముతో ఇతర జాతికర్మలను ఆచరించిరేని వారు కూడా చండాలురై జన్మింతురు. శూద్రులను గురువుగా ఎంచుకొని, వారివద్ద మంత్రములను నేర్చుకొనువారికి అనేకానేక పాతకములు చుట్టుకొనును. అంతేకాదు, వారు శ్వానచర్మమునందు పోసిన గంగోదకముతో, గోక్షీరముతో సమానమయ్యెదరు. వితంతు స్త్రీతో సంగమమొనర్చువారు, అతిథులకు శాపనార్థములను పెట్టుచూ భోజనమును పెట్టువారు, శ్రాద్ధదినమున పిండప్రదానము చేయనివారు చండాలయోనిలో జన్మింతురు. మాతాపితరులను, గురువును ద్వేషించువారును చండాలయోనిలో జన్మింతురు. వారు మరుజన్మలో పాపిష్టి వంశమునందు లేదా వేశ్యకులమునందు పుట్టెదరు. మిగుల సంతోషముతో గురువును నిందించువారు, సదా బ్రాహ్మణులను పరాభవించువారు, అనేకవిధములుగ వేదచర్చను చేయువారు, బ్రహ్మరాక్షసులై జన్మించెదరు. గురువును నిందించుచు, దేవతలను దూషించుచు, నేను భక్తుడనని చెప్పుకొనువారు, అపస్మారక రోగము గలవారై దారిద్ర్యముతో బాధపడువారలై జన్మించెదరు. తలిదండ్రులను, గురువును త్యజించివేసి, భార్యతో సుఖమును అనుభవించువారు, ఉదరరోగము గలవారై దోపిడీదొంగల కడుపున జన్మించి, మహారోగులై ఉండెదరు. వేదమును దూషించువారు, బ్రాహ్మణులను అవమానించెడివారు, కర్మభ్రష్టులై మూత్రకృచ్ఛ్రరోగము గలవారై జన్మించెదరు. జనుల రహస్యకర్మలను మాటిమాటికి ఉచ్చరించెడువారు, హృదయరోగులై మహాకష్టముల ననుభవించెదరు. లోకకంటకుడై నిరంతరము ఇతరులను బాధించుచున్నవాడు కూడా హృదయరోగము గలవాడై మిక్కుటమైన క్లేశములను అనుభవించును. గర్భపాతము చేసిన స్త్రీలు వంధ్యలై జన్మింతురు. అట్టివారికి పుట్టిన పిల్లలు వెంటవెంటనే మరణింతురు. కావున, గర్భపాతమునకు పాల్పడకూడదు. అది మహాదోషపూరితము. పతితులతో సహవాసమొనర్చువారు, ధర్మశాస్త్రములు నిర్వచించి చెప్పుచుండగా, శాస్త్రనియమములను పెడచెవినపెట్టి మితిమీరి భుజించువారు లేదా, స్వాదుభోజనముపై దృష్టిపెట్టువారు కూడా చెవిటివారుగా, జన్మాంధులుగా జన్మించెదరు. పతితులతో మైత్రిని నెరపువారు గార్దభయోనిలో జన్మించెదరు. పతితులనుండి ప్రశంసలను స్వీకరించువారు హరిణములుగా జన్మింతురు. బ్రహ్మహత్య చేసినవారు క్షయరోగులయ్యెదరు. సురాపానమొనర్చువాడు శ్యావదంతుడగును. అనగా వాడికి పిప్పిపళ్లు ఏర్పడును. సువర్ణమును దొంగిలించినవారికి పిప్పిగోళ్ళ రోగము వచ్చును. గురుపత్నిని కామదృష్టితో నిరీక్షించినవాడు కుష్ఠురోగియై జన్మించును. అశ్వమును, గోవును వధించువారు నిశ్చయముగా వంధ్యులుగా

జన్మించెదరు. పశ్చాత్తాపము సమస్తపాపములను హరింపచేయును గావున, వెంటనే పశ్చాత్తాపముతో తప్తమైనవారికి దోషము హరించిపోవును. విశ్వాసఘాతకులకు మాత్రము అధోగతియే గాని, ప్రాయశ్చిత్తము ఎంతమాత్రము చెప్పబడలేదు. అన్నదానము చేయనివాడు, అన్నద్వేషము గలవాడై జన్మించును. తన సేవకుని ఒంటరిగా గదిలో పెట్టి బంధించువారు, ఇతరుల సేవకులతో నిరంతరము సేవజేయించుకొనువారు, చోరజాతిలో పుట్టి కారాగృహ శిక్షను అనుభవించెదరు. స్త్రీలను అపహరించువారు బుద్ధిహీనులై జన్మింతురు. వారు ఎల్లప్పుడూ క్లేశములనే అనుభవించవలసి వచ్చును. చివరకు నరకమే వారికి గతి. సర్పములను చంపువారికి గొప్ప దోషము కలిగి, నిశ్చయముగ వారు తిరిగి సర్పయోనిలోనే జన్మింతురు. (31-55)

ఇప్పుడు చోరప్రకరణమును గూర్చి చెప్పెదను. (బ్రాహ్మణుల) సువర్ణమును దొంగిలించినవారికి తప్పనిసరిగా ప్రమేహవ్యాధి అనే మూత్రరోగము కలుగును. ఇతరుల గ్రంథములను దొంగిలించినవారు అంధులై జన్మించెదరు. వస్త్రమును అపహరించినవాడు పాండురోగి యగును. ఘనద్రవ్యమును దొంగిలించినవానికి గండమాలా రోగము సిద్ధించును. శ్వాసోచ్ఛ్వాసమునకు సంబంధించిన రోగము అనగా ఉబ్బసవ్యాధి కలిగిన రోగుల వస్తువులను దొంగిలించిన వారు ఎల్లప్పుడు కారాగారములోనే పడియుండవలసి వచ్చునని బ్రహ్మాండపురాణమునందు చెప్పబడినది. పరద్రవ్యాపహారము, పరదత్తాపహారము, పరద్వేషమును చేయువారు సంతానహీనులై జన్మించెదరు. అన్నమును అపహరించినవాడు గుల్మరోగిగా జన్మించును. ధాన్యాదులను దొంగిలించినచో, దుర్గంధభూయిష్టమైన రక్తస్రావము కలిగిన శరీరముతో జన్మించుదురు. తైలమును అపహరించువారి శరీరము కూడా దుర్గంధభూయిష్టమగును. పరస్త్రీలను, పరవస్తువులను, బ్రాహ్మణ ద్రవ్యమును అపహరించినచో, బ్రహ్మరక్షసుని జన్మను పొందెదరు. ముత్యములు, మాణిక్యములు, రత్నములను దొంగిలించిన వారు హీనజాతియందు జన్మించెదరు. ఆకుకూరలను, కూరగాయలను, వివిధ ఫలములను దొంగిలించినవారు గజ్జి, తామరరోగులై పుట్టెదరు. గోమారులుగను జన్మించెదరు. రక్తపానమొనర్చువారు గోమారి పురుగులై పుట్టెదరు. కంచును, ఇనుమును, దూదిని, లవణమును అపహరించువారు శ్వేతకుష్ఠువ్యాధి పాలగుదురు. వీటిని బాగుగా తెలిసి, చింతించి, జీవనమును సరిదిద్దుకొని సరియైన మార్గమునందు వ్యవహరించుట అనివార్యమని గ్రహింపవలెను. (56-64)

ఇక దేవద్రవ్యమును అపహరించినవారు, దైవకార్యమునకు విఘ్నమును కలిగించువారు, అభక్ష్య భక్షణము చేయువారు, పాండురోగులై జన్మించెదరు. ఫలములను దొంగిలించినవారు కురూపులయ్యెదరు. ఇతరులు దాచిపెట్టిన ధనమును అపహరించినవారికి శాశ్వత శోకమే

మిగులును. ఆవులను అపహరించినవాడు ఒంటెగా జన్మించును. అటులే ధనమును అపహరించినవాడు కూడా ఉష్ట్రముగా జన్మించును. ఫలచోరులందరు వనచరులుగా జన్మించెదరు. జలచోరులు కాకులుగా జన్మించెదరు. గృహోపకరణములను తస్కరించినవారికి కాకిజన్మ ప్రాప్తించును. తేనెను దొంగిలించినవారు గ్రద్దలుగా జన్మించెదరు. ఆవుపాలు, పెరుగు, వెన్న మొదలగు వాటిని దొంగిలించినవారు కుష్ఠురోగము పాలయ్యెదరు. ఏయే చోరకార్యములను చేయుటవలన ఎటువంటి జన్మలు లభించును అని చెప్పిన పిమ్మట శ్రీగురుమూర్తి శాంతిపర్వమునందు చెప్పబడిన వ్యభిచార ప్రకరణమును గురించి చెప్పుచున్నాను, శ్రద్ధగా వినవలయునని పతితునితో చెప్పిన విధమును **సిద్ధముని నామధారకునితో యిట్లు చెప్పుచుండెను.**

పరస్త్రీని ఆలింగనమొనర్చుకొనువాడు, శతాధిక జన్మములపాటు శ్వానముగా జన్మింపవలసి వచ్చును. తదుపరి నిశ్చయముగ సర్పజన్మమునెత్తి చిరకాలము అనంతదుఃఖమును అనుభవింపవలసి వచ్చును. పరస్త్రీ యోని దర్శనము చేసినవాడు జన్మాంధుడై జన్మించును. సోదరుని భార్యతో సంపర్కము చేయుటవలన గార్దభ జన్మ లభించును. అటుమీదట సర్పయోనిలో జన్మించి నానాయాతనలు అనుభవించి, తిరిగి నరకలోకమును చేరి, అనేక కష్టములపాలు కావలసి వచ్చును. స్నేహితుడి భార్యతో, మేనమామభార్యతో సంపర్కము పెట్టుకొనుటవలన శ్వానయోనిలో జన్మింపవలసి వచ్చును. పరస్త్రీ ముఖమును దుష్టబుద్ధితో చూచినయెడల నేత్రరోగమును అనుభవింపవలసి వచ్చును. శూద్రజాతికి చెందినవాడు బ్రాహ్మణ స్త్రీతో సంగమము చేసినచో, ఇరువురును నీచమైన అనగా అశుద్ధములైన పురుగులుగా పుట్టెదరు. ఎల్లప్పుడు శూద్రసంపర్కము చేయుచు, వారి భార్యలతో సంభోగమొనర్చువారు కుక్కల కడుపులో పుట్టెదరు. అది ఘోరమైన మహాదోషముగా పరిగణింపబడినది అని ఈవిధముగ గురుమూర్తి మాతంగుడికి చెప్పుచుండగా వారి సమీపమున కూర్చొని శ్రవణము చేయుచున్న **త్రివిక్రమభారతి శ్రీగురునాథునకు నమస్కరించి ఇట్లు ప్రశ్నించెను-** "స్వామీ! సమస్త ధర్మములను, వాని అతిక్రమణమువలన కలిగే దుష్టఫలితములను మీరు స్పష్టముగా నిరూపించితిరి. ప్రమాదవశాత్తుగా ఇట్టి పాపములను చేసినవారికి పరిహారము ఎటుల కలుగునో, వాటి విధివిధానము లెట్లుండునో తాము దయతో సెలవీయవలసినదని" ప్రార్థించెను. (65-78)

అంతట శ్రీగురునాథుడు త్రివిక్రమభారతితో ఇట్లు చెప్పెను- అట్టి పాపులకు పశ్చాత్తాపమే నిజమైన ప్రాయశ్చిత్తము. దానితో వారు చేసిన పాపములు నశించును. ఒకవేళ గొప్ప పాతకములను చేసినయెడల తద్వారా అంతఃకరణమునందు బాధ కలిగినచో, వారికి కూడా అదే

ఉత్తమ ప్రాయశ్చిత్తమని కర్మవిపాకమను గ్రంథమున చెప్పబడినది. అయితే చేసిన పాపములు సంస్కారరూపమున అంతఃకరణమునందు ఆశ్రయించియే యుండునుగాన పశ్చాత్తాపమే గాక, కర్మవిపాకమను గ్రంథమునందు ఎందరో మహర్షులు వివిధ ప్రాయశ్చిత్తములను గూర్చి చెప్పియుండిరి. వాటిని గూర్చి ఇప్పుడు నేను వివరించెదను శ్రద్ధగా వినుడు. మొదట 'బ్రహ్మదండము'ను ఇచ్చినచో పాపము శమించును.(1) ఆ తర్వాత సాలంకృత గోదానమును గానీ(2) గోవు లభించని యెడల యథాశక్తి ద్రవ్యమును గానీ, దానమిచ్చినచో పాపము శమించును. పదహారు మాసముల బంగారు నాణెములను నిష్కము అనగా పదహారు బంగారు నాణెములు లేదా, అర్ధ నిష్కము అనగా అందులో సగభాగమైన ఎనిమిది బంగారు నాణెములను లేదా, అందులో పావువంతు బంగారు నాణెములను దానము చేయవలెను. చేసిన పాపముయొక్క హెచ్చుతగ్గులను అనుసరించి దానమును ఈయవలెను. అజ్ఞానముతో చేసిన పాపములను పశ్చాత్తాపమే శుద్ధపరచును. భక్తితత్పరతతో గురుసేవ యొనర్చుటవలన చేసిన పాపములకు నిష్కృతి లభించును. తెలియక చేసిన పాపములకు రెండువందల సార్లు ప్రాణాయామములు చేసినచో పాపము నశించును. పుణ్యతీర్థములయందు పదిమార్లు లేదా దశవిధ స్నానములు చేసినచో, పాపములకు ప్రాయశ్చిత్తము లభించును. మూడు గురివింద గింజల ఎత్తు సువర్ణమును దానము ఇచ్చిన యెడల సౌమ్యపాతకములు నశించును. రెండు యోజనముల పర్యంతము నదీతీరములయందు తీర్థయాత్ర చేయుటవలన సౌమ్యపాతకములు నివారింపబడును. స్త్రీ పురుషులు ఇద్దరు కలిసి చేసిన పాపపుణ్యాలకు ప్రాయశ్చిత్తము ఇద్దరికి ఒకేవిధముగా వుండును. దాని ప్రాయశ్చిత్తమును ఉభయులూ కలిసి ఆచరించవలెను. పదివేల గాయత్రీ మంత్రజపమును చేసి, 12 మంది బ్రాహ్మణులకు భోజనము పెట్టుటవలన పాపము పరిహరింపబడును. ఒక వేయి తిల హవనములను వేదమంత్రములతో పాటుగా చేయుటను **'గాయత్రీ కృచ్ఛ్రమని'** అందురు. ఇట్టి గాయత్రీ కృచ్ఛ్రమును ఆచరించుటవలన పాపము నశించును. ప్రాజాపత్య కృచ్ఛ్రము, అతి కృచ్ఛ్రము, చాంద్రాయణ వ్రతము మొదలగు తపస్సులను ఆచరించినచో సామాన్య

---

1. బ్రాహ్మణ పరిషత్తును ఆహ్వానింపవలెను. ఆ పరిషత్తు బ్రాహ్మణులకు ప్రదక్షిణము చేయవలెను. వారందరికి యథోచితదక్షిణలు సమర్పింపవలెను. దీనినే "బ్రహ్మదండము" అని అందురు. (పరిషత్తు = సభ, గుంపు, సంఘము, సమూహము, సమితి, గోష్ఠి మొ॥వి నిఘంటువు చెప్పిన అర్థములు.

2. "గోదాన ద్యావే అలంకృత కాండ" అని మూలగ్రంథంలో పేర్కొనబడిన మాటకు సాలంకృత గోదానమని దాని తాత్పర్యము అనగా - పాపపరిహారమునకు ప్రాయశ్చిత్తంగా ఒక మంచి ఆవును తీసికొని దాని గిట్టలకు, కొమ్ములకు, బంగారు తొడుగులు తొడిగించి, వీపుమీద అందమైన మంచి వస్త్రముతో అలంకరించవలెను. అటులే గ్రాసము (గడ్డి), ఉలవలు, రాగులు, గోధుమలు మున్నగు పదార్థములను, వాటిని తినడానికి ఒక పాత్రను, నీరు త్రాగడానికి మరొక పాత్రను జతచేసి దానముగా ఈయవలెను. దీనినే "సాలంకృత గోదానము" అని అందురు.

పాపములన్నియును నశించిపోవును. ఇందులో '**ప్రాజాపత్యకృచ్ఛ్రము**' అను విధి అత్యంత విశిష్టమైనది. దీని ఆచరణమునందు ఒక పర్యాయమే భోజనము చేయవలెను. లేదా, అయాచితముగా దొరికిన భిక్షను స్వీకరించి భుజింపవలెను. మూడు దివసములు ఉపవసించి శ్రీగురుచరణకమలములను అనుక్షణము స్మరింపవలెను. తద్వారా సౌమ్యదోషములు అనగా తాము చేసిన సామాన్యమైన పాపములు తొలగిపోవును. అజ్ఞానమువలన జరిగే సాధారణ దోషములు కూడా వుండి యుండును. దానికి అతికృచ్ఛ్రము అనే ఒక పద్ధతి చెప్పబడినది. ఆరు రోజులపాటు ఒక్కొక్క కబళము (ముద్ద) చొప్పున తినవలెను. తరువాత మూడు రోజులు ఉపవసింపవలెను. లేక అన్నమును 27 కబళములు తినవలెను. పగలు 15 కబళములు, రాత్రి 12 కవళములు లేదా రెండు పూటలా అయాచితముగా లభించిన ఆహారమును ఎనిమిదేసి గ్రాసముల చొప్పున భుజింపవలెను. తద్వారా, సౌమ్యపాతకములు నశించిపోవును. లేదా, ఒక నెల దినములపాటు నియమముగా కేవలము ఒకే ఒక దోసెడు అన్నమును కరపాత్రగా స్వీకరించుటచేత సౌమ్యపాతకములు నశించిపోవును. **ఇప్పుడు మరొక విధానమును చెప్పెదను.** మూడు రోజులు ఉపవసించి నేతితో పారణ చేయవలెను. మూడు రోజులు నేతిని స్వల్పమాత్రముగా తీసికొని ఆపైన మూడు రోజుల పాటు పాలు మాత్రమే స్వీకరించవలెను. అటుమీదట మరి మూడు రోజుల వరకు వాయుభక్షణము చేసి తిరిగి 21 రోజులపాటు క్షీరములను మాత్రమే స్వీకరింపవలెను. ఈ వ్రతమును ఆచరించుటకు ఎవరేని శారీరకముగ అశక్తులై ఉన్న యెడల వారలు తిలలు, గుడము అనగా నువ్వులు, బెల్లము స్వీకరించి లేదా పేలపిండిని భుజించి ఉపవసింపవచ్చును. ఇక '**పర్ణకృచ్ఛ్రము**' కూడా చెప్పబడినది. దాని విధానము ఏమనగా, ప్రతి దినము చేసిన పాపమునకు తగిన పశ్చాత్తాపముతో తప్తమగుచూ, పర్ణోదకమును స్వీకరించి ఉపవసింపవలెను. పర్ణోదకము అనగా తామర ఆకులను లేదా బిల్వపత్రములను లేదా అశ్వత్థ పత్రములను, కుశోదకముతో కలిపి నిత్యము సేవించవలెను. దీనికి మరియొక పద్ధతి కూడా కలదు. అది చాంద్రాయణవ్రతము. ఈ వ్రతమునందు ఒక పిడికెడు ఆహారమును తీసికొని రోజుకొక ముద్ద చొప్పున క్రమముగా పెంచుచూ స్వీకరింపవలెను. అనగా అమావాస్య రోజున ఒకే ఒక పిడికెడు అనగా ఒక ముద్ద ఆహారమును తీసికొని ఒక్కొక్క తిథి ప్రకారముగ పౌర్ణమినాటి వరకు 15 ముద్దల పిడికిళ్ల ఆహారమును తీసికొనవలెను. ఇక కృష్ణపక్షమునందు తిథిప్రకారముగ ఒక్కొక్క ముద్దను తగ్గించుచూ అమావాస్య నాటికి ఉపవసింపవలెను. ఈవిధముగ ఒక మాసము అనంతరము ఆపైన వచ్చెడి నెలలో హవిష్యాన్నమును మాత్రమే స్వీకరింపవలెను. దీనినే 'చాంద్రాయణ వ్రతమ'ని అందురు. ప్రాయశ్చిత్తము చేసికొనిన పిమ్మట తాము చేసిన

పాపమును వేదవేత్తలైన బ్రాహ్మణసభలో పశ్చాత్తాపతప్త హృదయంతో అట్టి పాపములను ప్రకటించిన యెడల, ఆ పాపములన్నియు దహించుకొనిపోవును. (79-102)

ఇప్పుడు **'తీర్థకృచ్ఛ్రమును'** గురించి చెప్పెదను. వారణాసి మరియు హిమాలయ పర్వత యాత్రలను, శ్వేతపర్వత యాత్రలను చేసి, అచట స్నానము చేసినంత మాత్రమున పాపములు పటాపంచలగును. మిగిలిన తీర్థములకు వెళ్ళి సహస్రగాయత్రీ జపము చేసినయెడల పాపములు వెంటనే తొలగిపోవునని అగస్త్యమహర్షి వచనము చెప్పుచున్నది. సముద్రసేతు బంధనము అనగా కాశీ రామేశ్వర యాత్రలను చేసి, అచట పవిత్ర స్నానములను చేసినయెడల భ్రూణహత్యాది పాపములు నశించిపోవును. అటులే కృతఘ్నాది పాపములు కూడా సమసిపోవును. **"త్రివిక్రమా! శ్రద్ధగా వినుము"** అని గురుమూర్తి చెప్పుచుండెను. శుచిగా, విధివిధానముగా కోటి గాయత్రీజపమొనర్చినచో, బ్రహ్మహత్యాది పాపము నశించిపోవును. పదిలక్షల పర్యాయములు గాయత్రీ జపము చేసినచో సురాపాన పాపము నశించిపోవును. ఏడు లక్షల గాయత్రీ జపము చేసినచో స్వర్ణస్తేయ పాపము నశించును. ఎనిమిది లక్షల గాయత్రీ జపము చేసినచో గురుపత్నీగమన పాపము హరించును.

ఇక వేదమంత్రములతో పాపపరిహారమును గూర్చిన విధానమును చెప్పెదను వినుము. **'పవమానసూక్తము'**ను నాలుగు పర్యాయములు పఠించినచో బ్రహ్మహత్యా పాతకము పరిహరింపబడును. ఒక మాసము పర్యంతము **'ఇంద్రమిత్ర'**ను జపింపవలెను. తద్వారా సురాపానాది పాతకములు తొలగిపోవును. **'శునశ్శేపమనే'** సూక్తముతో బంగారము దొంగిలించిన పాపము పరిహరింపబడును. **'పవమాన'**, **'శన్న ఇంద్ర'** అనే సూక్తములు, **'హవిష్పాంత'** అనే ఋగ్వేద సూక్తమును ఒకమాసము పర్యంతము పఠించినచో, గురుతల్పగత పాతకము హరించిపోవును. ఐదుమాసములు లేదా ఆరు మాసములు మితాహారమును స్వీకరింపుచూ **'పురుషసూక్తము'**ను పారాయణము చేసినచో, పురుషులయొక్క పంచమహాపాతకములు నశించిపోవును. **'త్రిమధు'** అను మంత్రసూక్తముతో **'సుపర్ణా'**, **'త్రివర్ణా'** అను సూక్తయుక్తముగా **'నాచికేతుని'** మంత్రమును జపించినచో, సమస్తపాపములకు ప్రాయశ్చిత్తము కలుగును. **'నారాయణ ఉపనిషత్తు'**ను శ్రద్ధాభక్తిపూర్వకముగా జపించినచో పంచమహాపాతకములు భస్మీపటలమగును. **'త్రిపదా గాయత్రి'**ని **'అఘమర్షణ సూక్తము'**తో త్రిరావృత్తిగా మూడువేళల జపించిన యెడల సప్తజన్మముల పాపము తొలగిపోవును. **'అపాం మేధ్యా'** అనే పన్నమును **'తద్విష్ణో'** అను సూక్తముతో సభక్తికముగా జపించువారి సప్తజన్మముల పాపములు సమసిపోవును. అజ్ఞానకృతదోషాదికాలు పరిహరింపబడుటకు నిశ్చయాత్మకమైన పశ్చాత్తాపముతో పంచగవ్య ప్రాశనమును

చేయవలెను. అది ఎట్లనగా, మొదటిరోజున ఉపవసింపవలెను. తదుపరి గోమూత్రము, గోమయము, గోక్షీరము, గోదధి, గోఘృతము, కుశసారము అనగా దర్భ రసముతో కలిపి విధివిధానముగా స్వీకరింపవలెను. నల్లని గోమూత్రమును, నల్లని గోమయమును, తామ్రవర్ణముగల గోవు యొక్కక్షీరమును, శ్వేతధేనువు యొక్క దధిని అనగా పెరుగును, కపిలగోవు యొక్క ఘృతము అనగా నెయ్యిని ఈవిధముగ పంచగవ్యములను సమకూర్చుకొనవలెను. **దీనిని గూర్చిన విధానమును క్లుప్తముగ వివరించెదను.** పావుశేరు గోమూత్రము, అంగుష్ఠాగ్రముగ గోమయమును, పావు తక్కువ రెండు శేర్ల పాలను, మూడు పావుశేర్ల పెరుగును, పావుశేరు నేతిని, అంతే కొలతగల కుశసారమును కలిపి తీసికొనుచూ వాటికి తగిన మంత్రములను పఠింపవలెను. కుశలతో పాటుగా ఆరు రసములకు ఒక్కొక్కదానికి వేర్వేరు మంత్రములు చెప్పబడినవి. అందులో మొదటి మంత్రము **ఇరావతి**, రెండవది **ఇదం విష్ణుః**, ఇక మూడవది **మానస్తోకే**, నాల్గవది **ప్రజాపతి**, ఐదవది **గాయత్రీ మంత్రపఠనము**. ఆరవది **వ్యాహృతిపూర్వక ప్రణవము**. ఆవిధముగ పంచగవ్యములను మంత్రపూతము చేసి స్వీకరింపవలెను. ఏకభావముతో అనుతప్తులైన వారికి, ఈవిధముగ ప్రాయశ్చిత్తములు చేసికొనువారికి అస్థిగతమైన, చర్మగతమైన పాపములు నశించిపోవును. ఒకవేళ ఐదు విధములైన గోవులు లభించనియెడల ఉత్తమమైన కపిలగోవుయొక్క పంచగవ్యములను స్వీకరించి, ఆ కపిలగోవును దర్శనము చేయుటవలన, పూజించుటవలన సమస్త పాపములు హరించును. ఇక పంచమహాపాతకములు. **కర్తుం** అనే పేరుతో నాలుగు పాతకములు గలవు. ప్రత్యక్షముగ ఆయా పాపములను చేయువారు ఐదవవారు అనగా వారికి సహకరించువారు అని తాత్పర్యము. బ్రహ్మహత్య, సురాపానము, గురుభార్య గమనము, స్వర్ణస్తేయము అను ఈ నాల్గింటి పాతకములను చేయువారితో కలియుట అనే పాతకము ఐదవది. ఇట్టి పంచమహాపాతకములు ప్రాప్తించినవారికి ప్రాయశ్చిత్తమేమిటి? అనగా, జగద్గురువులను దర్శించుట, ప్రీతిపూర్వకముగ జగద్గురువును దర్శించుకొని, వారి అనుగ్రహమును పొందుటద్వారా ఈ పంచమహాపాతకములనుండి పునీతులయ్యెదరు. ఇంకనూ వేదశాస్త్ర మర్మజ్ఞులైనటువంటి, స్వధర్మాచరణమును తెలిసి, నిత్య ధర్మ, కర్మానుష్ఠానపరులైనవారి అనుగ్రహముతో కూడా పాపములు నశించి పునీతులయ్యెదరు" అని శ్రీగురుమూర్తి త్రివిక్రమభారతితో ప్రాయశ్చిత్తములను గూర్చి వివరముగా చెప్పినపుడు గురుసన్నిధానమున కూర్చుండియుండిన బ్రాహ్మణులందరికీ చక్కని జ్ఞానోదయమై, వారు సంతుష్టులైరి. అప్పుడు శ్రీ గురుమూర్తి మాతంగుడిని ఉద్దేశించి ఇట్లనెను – "ఓరీ! పూర్వము నీవు బ్రాహ్మణుడవే కాని, గురువును, తలిదండ్రులను నీవు దూషించుటవలన నీకు ఈ చండాలజన్మ ప్రాప్తించినది. నీవు వెంటనే భీమ, అమరజా సంగమమునకు వెళ్ళి, ఒక నెలరోజులపాటు

స్నానమొనర్చుము. తద్వారా నీ దోషములు పరిహరింపబడి, నీవు శుద్ధుడవు కాగలవు. తిరిగి బ్రాహ్మణజన్మను పొందగలిగే యోగ్యత నీకు లభింపగలదని గురుమూర్తి చెప్పెను. **అందుకు వెంటనే అతడిట్లు పలికెను** – "స్వామీ! నాకు మీ దర్శనభాగ్యము లభించినది. పరుసవేది సోకినంతనే ఇనుము బంగారమైనటుల, మానససరోవరమునందు మునిగిన కాకి రాజహంసలా మారిన పగిది నేను కూడా మీ దర్శనభాగ్యమువలన పవిత్రుడనైతిని కదా! శరణాగతరక్షకా! నన్ను తరింపచేయుము. స్వామీ! జగద్గురూ! పరుసవేదిని తాకిన ఇనుము తక్షణమే సువర్ణముగా మారుతుంది గానీ, తిరిగి ఆ సువర్ణమే ఇనుముగా ఎట్లు మారును? అమృతప్రాయమైన మీ దర్శనభాగ్యముతో నేను జ్ఞానరాశినైతిని. ఇప్పుడు నన్ను అభిమంత్రించి బ్రాహ్మణజాతిలో కలిపివేయగలరని చేతులు జోడించి ప్రార్థించుచున్నానని" యనెను. **వాడి మాటలకు శ్రీగురుడు నవ్వి ఇట్లనెను** – "ఓరీ! నీవు ధరించిన ఈ దేహము హీనజాతికి చెందినది. కావున, నిన్ను విప్రుడు అని అనటము ఎంతవరకు సమంజసము. పతితుల అన్నరసముతో నీ రక్తమాంసములు వృద్ధి చెందినవి. కావున, నిన్ను బ్రాహ్మణుడని ఎవరు? ఎందుకు? ఎట్లు? పలికెదరు. నిన్నందరునూ నిందించెదరు. (103-140)

పూర్వకాలము విశ్వామిత్రుడనువాడు ఇదేవిధముగ క్షత్రియవంశములో గాధిపుత్రునిగా జన్మించి తపోబలముతో పవిత్రుడై తాను విప్రుడను అని ప్రకటించుకొనసాగెను. ఎంతో కష్టపడి బ్రహ్మనుగూర్చి వంద సంవత్సరములపాటు ఘోరమైన తపస్సును చేసి తపోబలముతో తాను బ్రహ్మర్షినైతినని చెప్పుకొనసాగెను. తనను బ్రహ్మఋషిగా పిలవమని ఇంద్రాదిదేవతలకు విన్నవించెను. అప్పుడు దేవతలు, ఋషులందరు కలిసి, "నాయనా! మా అందరికి గురువైన వసిష్ఠమహర్షి నిన్ను 'బ్రహ్మర్షి' అని పిలిచినచో, మేమందరము అందుకు అంగీకరించెదము" అని వారు ప్రకటించిరి. అందుకు తానెంతో కాలము ఘోరమైన తపస్సును చేసితిని కావున, తనను బ్రాహ్మణుడని అంగీకరించమని వసిష్ఠులవారితో విశ్వామిత్రుడు విన్నవించెను. **అంతట విశ్వామిత్రునితో వసిష్ఠమహర్షి ఇట్లు పలికెను**– "తామసిక గుణయుక్తము, అపవిత్రము ఐన దేహముతో వుండే క్షత్రియుడు తపస్సు చేయుటకు అనర్హుడు. కావున, నీవు బ్రాహ్మణకులమునందు జన్మించినట్లు ఎట్లు కుదురును? నీకు ఉపనయనము జరిగి గాయత్రీ ప్రబోధమైన యెడల నీవు పరిశుద్ధుడవు కాగలవు. అప్పుడు నీకు బ్రహ్మర్షి అనే పేరు వచ్చును" అని పలికెను. అంతట విశ్వామిత్రుడు తనను బ్రహ్మఋషి అని వసిష్ఠమహర్షి అంగీకరించకపోవుటతో, మిగుల క్రోధోద్రిక్తుడై వసిష్ఠమహర్షియొక్క నూరుగురు పుత్రులను వధించివేసెను. వసిష్ఠులవారు నిజమైన బ్రహ్మజ్ఞాని కనుక, విశ్వామిత్రుడు ఎంతటి ఘోరకృత్యమునకు తలపడినప్పటికిని ఆతడు

ఎంతమాత్రము తామసమును పొందలేదు. కోపగించలేదు. అందుకు అతనికి భయపడి విశ్వామిత్రుని బ్రహ్మఋషి అని కూడా ససేమిరా అంగీకరింపలేదు. ఇట్లుండగా, విశ్వామిత్రుడు ఒక దినమున పెద్ద కొండరాతిని తీసుకొని వచ్చి వసిష్ఠుని తలమీద వేసి చంపబోయెను. అంతట తనలోతాను ఇట్లు తలపోసెను. "ఒకవేళ తాను వసిష్ఠుని వధించినయెడల తనను బ్రహ్మఋషి అని ఎవరందురు? వసిష్ఠ మహర్షిచేత నిన్ను నీవు బ్రహ్మఋషిగా అంగీకరింపచేసిన యెడల నిన్ను మేమందరము బ్రహ్మర్షిగా పిలిచెదమని దేవతలందరు చెప్పిరి. కావున, ఈ వసిష్ఠుని చంపినచో నాకు పాపమే లభించును. తిరిగి బ్రహ్మర్షిత్వము నాకు లభించదు గాక లభించదు" అని తనను తాను తమాయించుకొని, చేతిలోనున్న కొండరాతిని నేలమీదకు విసరికొట్టెను. అతడు మనసులో విపరీతమైన అనుతాపమును చెందుటను గుర్తించి వసిష్ఠమహర్షి వెంటనే అతనిని 'బ్రహ్మఋషి' అని పిలిచెను. అందులకు విశ్వామిత్రుడు మిగుల సంతోషించి, మీ మాటలు నిజమైనచో, 'స్వామీ! నా ఇంటిలో మీరు ఆతిథ్యమును స్వీకరింపవలెనని' కోరెను. విశ్వామిత్రుని విన్నపమును విని వసిష్ఠముని 'మహర్షీ! సూర్యకిరణముల వేడిమితో నీ శిరసుమీద అన్నమును తయారుచేయవలెను' అని కోరెను. అందులకు విశ్వామిత్రుడు అంగీకరించి సూర్యకిరణముల వేడిమితో తలపై పాత్రను పెట్టుకొని అన్నమును తయారుచేసెను. ఆవిధముగ సహస్రాధిక కిరణములచే తపింపచేయు వేళ అతని దేహమంతయూ పూర్తిగా భస్మమైపోయెను. అనుష్ఠానమునందు అత్యంత సమర్థుడైన, పట్టుదలతో చేసిన తపస్సు వలన విశ్వామిత్ర మహామునియొక్క పూర్వపు దేహము దగ్ధమైపోయెను, అమోఘమైన తపశ్శక్తి సంపన్నుడు కనుక, అతడు నూతన దేహమును ధరించెను. అప్పుడు వసిష్ఠమహర్షి విశ్వామిత్రుని చూచి, 'బ్రహ్మర్షి బ్రహ్మజ్ఞాని' అని పిలిచెను. వెంటనే మునులందరునూ ఆతనిని ప్రస్తుతించిరి. అనంతరము మూడు లోకములలో విశ్వామిత్రుడు బ్రహ్మర్షిగా ప్రఖ్యాతి నొందెను.(141-159)

అందువలన నీవు నీ దేహమును త్యజించిన పిమ్మట నీ అంతఃకరణమునందు తీవ్రమైన అనుతాపమును పొందినమీదట తిరిగి నీవు బ్రాహ్మణకులమునందు జన్మించెదవు అని శ్రీగురుమూర్తి మాతంగుడికి లభించబోయే అనంతర జన్మనుగూర్చి బోధించెను. కానీ, అది ఆతని మనసుకు నచ్చలేదు. గురుమూర్తి మాటను వాడు పట్టించుకొనలేదు. ఏలయన, దరిద్రునకు నిధి లభించినచో అతడు దానిని వదలుకొనునా? అమృతము దొరికినవాడు వ్యర్థముగ పారవేసి బయలుదేరిపోవునా? ఉపవాసముతో నకనకలాడుచున్న పశువులకు మంచి ఎత్తైన ఎండుగడ్డి వాము కనిపించినపుడు, వాటికి ఆ గడ్డివామును వదలి దూరముగ పోవుటకు బుద్ధి పుట్టునా? అటులే హీనజాతివాడికి జ్ఞాననిధి లభించెను.

కావున, తాను బ్రాహ్మణుడననే భావముతో అతనికి తిరిగి తన ఇంటికి పోవుటకు సమ్మతి కలుగకుండెను. ఇంతలో అతని భార్యాబిడ్డలు అతడెంతకూ తిరిగి ఇంటికి రాకపోవుసరికి అతనికోసమై పరుగెత్తుకొని వచ్చిరి. తన సమీపమునకు వచ్చుచున్న భార్యతో వాడు 'ఇప్పుడు నీవు నన్ను తాకవద్దు' అని ఆగ్రహముతో ఆమెను నివారించెను. ఇతనికేమైన అపస్మారక వ్యాధి సోకినదా ఏమి? అని ఆశ్చర్యమునకు గురియైన అతని భార్య మిగుల దుఃఖించుచూ పరుగున వెళ్ళి **శ్రీగురుమూర్తి పాదపద్మములకు నమస్కరించి చేతులు జోడించి, వినయముతో పలికెను-** "స్వామీ! నా భర్త నన్ను వదలివేసి వెళ్ళుచుండెను. నాకు కొడుకులు, కూతుళ్లు ఎందరో ఉన్నారు. బహుసంతానము కలిగిన కుటుంబము మాది. వారిని ఎవరు పోషించెదరు. స్వామీ! మమ్ములను వదలి అతడెట్లు వెళ్ళగలడు. తమరే దయతో చెప్పగలరు. "స్వామీ! ఒకవేళ మీరతనికి నచ్చచెప్పని యెడల నా బిడ్డలతో సహా నేను మరణించెదను. అయ్యా! ఇక మేము అనాథలమైపోయెదము. మమ్ములనెవరు పోషించెదరు" అని ఆమె బిగ్గరగా యేడ్చుచుండెను.

అంతట శ్రీ గురుమూర్తి ఆ మాతంగుడితో ఇట్లనెను – "చూడుము, నాయనా! నీ నిమిత్తముగ భార్యాబిడ్డలు ఎంతగా తపించుచుండిరో గమనించుము. నీవు నీ ఇంటికి వెళ్ళవలసినదే. అట్లు చేయుటవలన నీకు ఉత్తమగతి లభించును. ఈ సంసారమునందు జన్మించిన నీవు నీ ఇంద్రియములనన్నింటిని సంతుష్టపరచుము. తదుపరి న్యాయముగ ధర్మముననుసరించి భవసాగరమునుండి తరించెదవుగాక. ముందుగనే నీవు పెళ్ళి చేసుకొనకుండ ఉండవలసినది. కాని, వివాహానాంతరము భార్యను వదలివేయుటవలన మహాదోషము లభించును. భూమి, సూర్యుల సాక్షిగా నీవు నీ భార్యను వివాహమాడితివి. ఇప్పుడామెను వదలివేయుట మహాపాపము. అట్లు చేయుటవలన నీ గతి అధోగతియే. నీకెన్నటికీ ఉత్తమగతి లభించదుగాక లభించదు" అని గురుమూర్తి చెప్పగా, **చేతులు జోడించి అతడిట్లు విన్నవించెను.** "స్వామీ! నేను జ్ఞానమును పొంది, తిరిగి జాతిహీనుల వద్దకెట్లు పోవుదును. నేను మరల హీనజాతివాడిగా ఎట్లు కాగలను?" అని ప్రశ్నించెను. అంతేగాక, నన్ను తిరిగి హీనజాతిలో ప్రవేశించుమని దయతో తాము నన్ను నిర్బంధింపవలదని చేతులు జోడించుకొని మాటిమాటికి ప్రాధేయపడుచుండెను. అంతట శ్రీగురునాథుడు ఇట్లు చింతించెను. వీని శరీరమునందు నాచే ప్రోక్షింపబడిన విభూతి గలదు. తద్వారా ఇతనికి తాత్కాలికముగ జ్ఞానము ఉదయించెను. ఇట్టి విభూతిని లోభులైన వ్యక్తులచేత ప్రక్షాళనము చేయించినచో, తిరిగి అతనికి యథాప్రకారముగ సహజజ్ఞానము లభించును" అని తనలో యోచించి వెంటనే శిష్యులను పిలిచి, సమీపమునగల ఒక లుబ్ధాగ్రేసర చక్రవర్తిని తీసుకొనిరమ్మని ఆదేశించెను.

వారు వెంటనే గ్రామములోనికి వెళ్ళి ఒక వ్యాపారము చేయుచున్న మహా లుబ్ధాగ్రేసర చక్రవర్తియైన ఒక బ్రాహ్మణుని తీసుకొనివచ్చిరి. **అంతట శ్రీగురునాథులవారు అతనితో ఇట్లనెను–** “నాయనా! ఈ మాతంగుడికి నీవు స్వయముగా ఉదకమును తీసుకొనివచ్చి స్నానము చేయించుమని” ఆదేశించెను. “అప్పుడతడు సంసారముపట్ల తిరిగి ఆసక్తుడు కాగలడని” నుడివెను. గురునాథుని అనుజ్ఞతో ఆ లుబ్ధబ్రాహ్మణుడు తన చేతితో ఉదకమును తెచ్చి, అతనిమీద చల్లి స్నానము చేయించుటవలన తత్క్షణమే అతని శరీరమునగల విభూతి తొలగిపోయెను. అతడి దేహమునందు ప్రోక్షింపబడిన విభూతి ప్రక్షాళనమైనతోడనే అతనికి పూర్వజ్ఞానము కలిగెను. అప్పుడు వాడు తన భార్యాబిడ్డల ముఖమును చూచి వెంటనే పరుగుపరుగున వారివద్దకు వెళ్ళెను. తన కుమారుని ఆలింగనము చేసికొని మీకేమైన పిచ్చి పట్టినదా? మీరెందుకు ఇక్కడికి వచ్చితిరి? ఏ పనిమీద వచ్చితిరి? అని తనలో తాను ఆశ్చర్యపోవుచు ఇట్టి మాటలు అనసాగెను. వెంటనే జరిగిన వృత్తాంతమంతయూ అచట చేరిన జనులు చెప్పినతోడనే అందుకు మిగుల సంభ్రమమునకు లోనైన ఆ మాతంగుడు దూరమునుండియే శ్రీస్వామివారికి సాష్టాంగవందనము చేసి, తన భార్యాబిడ్డలను తీసికొని స్వస్థానమునకు వెళ్ళిపోయెను. ఇట్లు ఈవిధముగ జరుగుచున్నటువంటి సంఘటనమును అత్యంత ఆసక్తితో తిలకించుచున్న అక్కడి జనులందరూ “ఇదేమి చిత్రము. ఇది ఎంతటి మహావిచిత్రము. ఇదేమి చోద్యమబ్బా!” అని ఆశ్చర్యచకితులై శ్రీగురుమూర్తిని మాటిమాటికి తనివితీర తిలకింపసాగిరి. బిగ్గరగా గొంతెత్తి జేజేలు పలుకసాగిరి. **అంతట త్రివిక్రమభారతి శ్రీగురుమూర్తి ముందు రెండుచేతులు జోడించి, వినయముగా ఇట్లు పలికెను–** “గురునాథా! నాదొక మనవిని వినుడు. నా అంతరంగములో ఒక గొప్ప సందేహము ఉప్పతిల్లినది. దానికి తగు సమాధానమును దయదలంచి తామే చెప్పవలయును. మహాపతితుడైన కడజాతికి చెందిన వాడికి, స్వామీ! క్షణములో గొప్ప జ్ఞానమును కలిగించితిరి. ఇట్టి దేహధారియైన వాడికి కలిగిన మహాజ్ఞానము తృటిలో ఎట్లు తొలగిపోయెను. ఇది నాకు బోధపడుటలేదు. కృపతో దీని మర్మమేమిటో నాకు వివరించి చెప్పవలయునని” భావభక్తియుక్తుడైన త్రివిక్రమ మహాముని శ్రీగురుమూర్తి చరణారవిందములను పట్టుకొని ప్రార్థించెను.

అంతట శ్రీగురుమూర్తి మందహాసమును చిందించి, నుడివెను – “నాయనా! అతని దేహమునందు ప్రోక్షింపబడిన మంత్రపూతమైన ఏ విభూతి కలదో, దానిని ప్రక్షాళనము చేసిన వెంటనే వాడికి లభించిన జ్ఞానము నష్టమైపోయినది” అని వివరించి చెప్పెను. **విభూతి మహిమ అత్యద్భుతమైనది. మహాత్ముల హస్తమస్తక సంయోగముతో ప్రపంచమే పరబ్రహ్మగా మారును. భస్మమహిమ అమోఘమైనది అని పలికెను.**

గురుని మాటలు విని త్రివిక్రమమహాముని తిరిగి చేతులు జోడించి, "జగద్గురు శిరోమణీ! హే! గురునాథా! మహిమాన్వితమైన భస్మమహిమను గూర్చి దయతో విశదముగా వివరించగలరని" ప్రార్థించెను.

"నాయనా! నామధారకా! శ్రీగురునాథులవారు త్రివిక్రమహామునికి వివరించి చెప్పిన భస్మమాహాత్మ్యమును ఏకాగ్రచిత్తుడవై మిక్కిలి శ్రద్ధగా తరువాతి అధ్యాయమున వినుమని" చెప్పిన నామధారక - సిద్ధముని సంవాదమును మనోహరమైన గురుచరిత్రగా మలచి సరస్వతీ గంగాధరుడు, లోకకల్యాణహేతువుగా జగత్తునకు ప్రకటింపచేసెను. దీనిని చదివిన వారికి, వినిన వారికి సకల అభీష్టములు నెరవేరును. అనంతరము సిద్ధమునీశ్వరుడు విస్తరించి చెప్పబోవు తరువాతి కథ అత్యంత పావనమైనది అని గురుదాసుడైన సరస్వతీ గంగాధరుడు దీనిని మహారాష్ట్రభాషయందు ప్రకటించెను. (160-194)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "కర్మవిపాక కథనము" అను ఇరువది ఎనిమిదవ అధ్యాయము ॥ 28 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 194; మొత్తము సంఖ్య : 2989 + 194 = 3183 ఓవీలు)

-::: (సప్తాహపారాయణ క్రమము (3) మూడవరోజు విరామము) :::-

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

॥ సర్వం శ్రీ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహ సరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

॥ హరయే నమః ॥

◆ ◆ ◆

సర్వానర్థహరం దేవం సర్వమంగళ మంగళమ్ ।
సర్వక్లేశహరం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥
శ్రీవాసుదేవానంద సరస్వతీ స్వామి కృత జయలాభాదికర శ్రీ దత్తస్తోత్రం శ్లో.4)

శ్రీ గురు చరిత్ర

ఇరవై తొమ్మిదవ అధ్యాయము

భస్మధారణ మాహాత్మ్యము - వామదేవుని వలన బ్రహ్మరాక్షసుని ఉద్ధారము - పరమేశ్వరుడు సనత్కుమారునకు విభూతి మహిమను వివరించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునితో నుడివెను - "కృపాసింధూ! గురుచరిత్రమునందు, ఆ తరువాత జరిగిన కథాక్రమమును వివరించి చెప్పగలరు. త్రివిక్రమభారతి భస్మమాహాత్మ్యమును చెప్పవలసినదని గురుమూర్తిని ప్రార్థించినారని ఇంతకుమునుపు మీరు చెప్పితిరి కదా! అట్టి భస్మమాహాత్మ్యమును ఇప్పుడు నాకు ఉపదేశించి, నన్ను కృతార్థుని చేయవలసినదని" వినయముతో ప్రార్థించెను. నామధారకుని విన్నపమునకు సిద్ధమునీశ్వరుడు **మిగుల సంతసించి ప్రసన్నవదనుడై ఇట్లు పలికెను** - "నామధారకా! శ్రీగురుమూర్తి భస్మమాహాత్మ్యమును గూర్చి త్రివిక్రమభారతికి చెప్పినరీతిగా నేను నీకు వివరించుచుంటిని. ఏకాగ్రచిత్తుడవై వినుము. పూర్వము కృతయుగమునందు వామదేవుడను పేరుగల ఒక యోగి యుండెను. వారితో సాటి రాగలిగిన గురువులు ఆ యుగమునందు జగత్తులో లేనేలేరు. అనగా, ఆయన జగత్ప్రసిద్ధుడైన గురువుగా వాసిగాంచెను. తన గృహమును, భార్యాబిడ్డలను త్యజించి శుద్ధ బుద్ధ బ్రహ్మజ్ఞానిగా విరాజిల్లుచుండెను. ఆ వామదేవుడు నిరంతరము తన శరీరము నిండుగా దివ్యమైన భస్మవిభూషితుడై, కామక్రోధాదులను త్యజించి నిస్పృహుడై, వల్కలములను వ్యాఘ్రాజినమును ధరించి, జటాధారియై, ఈ భూమండలమునందు గల అనేక పుణ్యక్షేత్రములను దర్శించుచు సంచరించుచుండెను. (1-8)

ఆ వామదేవుడు ఒకనాడు మానవసంచారము లేని క్రౌంచారణ్యమునందు ప్రవేశించి ఒక దారిగుండా వెళ్లుచుండెను. ఆ అడవిలో ఒక భయంకరమైన బ్రహ్మరాక్షసుడు నివసించుచుండెను. అతడు నిత్యము మానవులతో సహా అనేక జీవులను పట్టి భక్షించుచుండెను. అట్టి అరణ్యమునందు పాదచారియై దారిగుండా వెళ్ళుచున్న వామదేవుడను యోగి తానున్నచోటును సమీపించుటను చూచి, భయంకరమగు ఆ బ్రహ్మరక్కసుడు ఈనాడు నాకు మంచి ఆహారము లభించెనని మిగుల సంతోషముతో పళ్లు పటపట కొరుకుచు భయంకరముగా నోరు

తెరచుకొని అతనిమీదకు పరుగెత్తుకొని వచ్చుచుండెను. అప్పటికే ఆకలితో నకనకలాడుచున్న ఆ బ్రహ్మరాక్షసుడు "నేనిప్పుడే నిన్ను కొరికి కమ్మగా భుజించెదనని" తన నోటిని తెరచి అతని పైపైకి వచ్చుచుండెను. ఆ రాక్షసుని చూచిన మహాజ్ఞానియగు వామదేవుడు ఎంతమాత్రము భయపడక నిర్భయముతో, నిస్సంకోచముగ ఆ రక్కసుడినే చూచుచు నిలబడియుండెను. కమ్మటి ఆహారము దొరికినదని ఎంతయో సంతసించిన ఆ రక్కసుడు అతడిని చంపి తినవలయునను బలీయమైన కోరికతో పరుగెత్తుకొని వచ్చి, ఆ మహర్షిని ఆలింగనము చేసికొనెను. అంతే! ఆతని దేహమునకుగల భస్మము ఈ రాక్షసుని శరీరమునకు అంటుకొనెను. వెంటనే అతనికి పూర్వజన్మ జ్ఞానము కలిగి, గతజన్మయొక్క జ్ఞానము గుర్తుకు వచ్చెను. తత్క్షణమే పూర్వజన్మ పాతకములన్నియు దగ్ధమైపోయెను. చింతామణీ స్పర్శ తగిలిన వెంటనే లోహము సువర్ణముగా మారినట్లు, వామదేవుని శరీరమునకు గల భస్మము ఈ బ్రహ్మరాక్షసుని ఒంటికి తగిలిన వెంటనే వాడొక మహాజ్ఞానిగా మారిపోయెను. మానససరోవరమునకు వెళ్ళిన కాకి, అందులో మునిగి రాజహంసగా మారినట్లు, కడుపారగా అమృతమును త్రాగిన మానవునకు దైవత్వము లభించినట్లు, జంబూనదమునందలి మట్టి బంగారముగ మార్పు చెందినట్లు మునీశ్వరుని స్పర్శచే మహాపాపిష్ఠుడైన బ్రహ్మరాక్షసుడు పునీతుడయ్యెను. ఈ జగత్తునందు సత్పురుషుల సందర్శనము సిద్ధించుట కడు దుర్లభము. **సాధుసాంగత్యము వలన, శ్రీగురుచరణాబ్జముల స్పర్శవలన తత్కాలమే సమస్తపాపములు నశించిపోయి, జనుల మనోరథములన్నియు నెరవేరగలవు.** ప్రతినిత్యము ఎన్నియో ఏనుగులను, గుఱ్ఱములను, ఎందరో మనుష్యులను భక్షించినప్పటికినీ తనివి తీరని ఆ బ్రహ్మరాక్షసుని ఆకలియు, సముద్రోదకమునంతయును ఏకబిగిన త్రాగినప్పటికినీ శమించని ఆ రక్కసుని దప్పికయు, ఈ మహర్షియొక్క దేహస్పర్శవలన ఆకలిదప్పుల ఆక్రోశము వెంటనే ఉపశమించి, గతజన్మల జ్ఞానము స్ఫురణకు వచ్చెను. (8-21)

పూర్వజ్ఞానమును పొందిన ఆ బ్రహ్మరాక్షసుడు మహాజ్ఞానియైన వామదేవులవారి పాదారవిందములమీద పడి సాష్టాంగవందనమును **ఆచరించి ఇట్లు ప్రార్థించెను-** "గురుశిరోమణీ! మహాత్మా! మీరు సాక్షాత్తుగా ఈశ్వరులే సుమా! పాహిమాం ప్రభూ! మాం పాహి. స్వామీ! నన్ను రక్షింపుము. రక్షింపుము. ఘోరసంసార సాగరములో మునిగిపోవుచున్న నన్ను దయతో ఉద్ధరింపుము. మహామునీ! మీ దర్శనమాత్రముచేత నా పాపరాశి కాలి బూడిదయ్యెను. జగద్గురూ! భక్తులపాలిట కృపామూర్తీ! ఓ గురురాయా! నన్ను తరింపచేయుడు. నేను మీ శరణుజొచ్చితిని" అని ఆ బ్రహ్మరాక్షసుడు కడు వినయముతో దోసిలొగ్గి విన్నవించుకొనెను. **కృపామూర్తియగు వామదేవుడు ఆ రక్కసునితో ఇట్లనెను -**

"నీవెవరవు? ఏ వంశమునకు చెందినవాడవు. ఈ ఘోరమైన కీకారణ్యమునందు నీవు ఉండుటకు గల కారణమేమి?" అని ప్రశ్నించెను. అప్పుడా బ్రహ్మరాక్షసుడు తన రెండు చేతులను జోడించి, తలను వంచి నమస్కరించి మిక్కిలివినయముతో తన వృత్తాంతమును ఇట్లు వివరింపసాగెను. (22-27)

"త్రివిక్రమ మునీశ్వరా! ఆ బ్రహ్మరాక్షసుడు వామదేవమునీశ్వరునితో తన వృత్తాంతమును ఏమని తెలియపరచెనో, దానినే ఇప్పుడు నీవు వినుము" అని గురుమూర్తి ఇట్లు చెప్పదొడగెను. **రాక్షసుడు వామదేవునితో ఇటుల విన్నవించెను-** "స్వామీ! నాకు మీ దివ్యదర్శనమువలన అనంతకాలము యొక్క పూర్వజన్మల స్మరణముతోపాటు సమస్తజ్ఞానము సిద్ధించెను. గత 24 జన్మలలోని సమస్తదోషములు మరియు ఉత్కృష్టమైన 25వ జన్మము నాకు ఇప్పుడు చక్కగా, పరిపూర్ణముగా జ్ఞప్తికి వచ్చెను. ఆ ఇరువది ఐదు జన్మలను నేనిప్పుడు ప్రత్యక్షముగా చూడగలుగుచుంటిని. 25వ జన్మలో నేను యవనదేశమునకు రాజుగా ఉంటిని. అప్పుడు నేను 'దుర్జయుడు' అను పేరుగలవాడనై అనేక దురాచారములను ఆచరించి, మహాపాపినైతిని. అనేకమందిని చంపితిని. ప్రజలకు అంతులేని దుఃఖములను కలిగించితిని. రాచరికపు మదముతో అనేక స్త్రీలను అపహరించి వరించితిని. వరించిన స్త్రీలనే కాక, మరెందరినో బలాత్కారముగ చెరబట్టితిని. అసంఖ్యాకమైన స్త్రీలను వివాహమాడితిని. ఒక పర్యాయము అనుభవించిన వారిని తిరిగి వారి ముఖమును చూచువాడను కాను. రోజుకొకరి చొప్పున నిత్యనూతనముగ అనుభవించి వారిని అంతఃపురమున వదలిపెట్టి తిరిగి వారి వైపు కన్నెత్తికూడా చూచువాడను కాను. ఇట్లు అనేకమంది స్త్రీలను అంతఃపురములో చెరబట్టితిని. తిరిగి వారివైపు కన్నెత్తి చూడటము లేదని వారందరు ఘూర్ణిల్లుచు నన్ను అహర్నిశము శపించెడివారు. తోటిరాజులనెందరినో జయించి వారి వారి రాజ్యములలో గల స్త్రీలను చెరబట్టి, వారినందరిని అనుభవించి, అంతఃపురమునందు బంధించితిని. అంతులేని పరస్త్రీ వ్యభిచారమొనర్చితిని. అందముగ కనిపించిన స్త్రీలను బలవంతముగా రప్పించుకొని అనుభవించుచుంటిని. వచ్చుటకు ఇష్టపడని వారిని ధనాశను చూపి రప్పించుకొని సంభోగించితిని. రాజులనందరిని గెలిచి వారి స్త్రీలతో భోగించి, వారినందరిని ఖైదీలను చేసి మిక్కిలి క్షోభకు గురిచేసితిని. నా దేశములోగల బ్రాహ్మణులు పరదేశమునకు వెళ్లుటను చూసి వారి స్త్రీలను అపహరించి, ఉన్మత్తుడనై వారిని కామించితిని.పతివ్రతలు, ముత్తైదువలను అందులో ముఖ్యంగా వితంతువులను, రజస్వల స్త్రీలను మిక్కిలి ఉన్మత్తుడనై వ్యభిచరించితిని. వివాహముగాని కన్యలతో కూడా వ్యభిచరించితిని. 300కు పైగా బ్రాహ్మణ స్త్రీలతోను, 400 మంది క్షత్రియ స్త్రీలతోను, 600 మంది వైశ్య

స్త్రీలతోను, ఒక వేయి మంది శూద్రస్త్రీలతోను వ్యభిచరించితిని. ఒక వందమంది చండాల స్త్రీలతోను, వేయిమంది భిల్లజాతి స్త్రీలతోను, 500 మంది దొమ్మరి స్త్రీలతోను, 400 మంది రజక స్త్రీలతోడను రమించితిని. నేను ఉన్మత్తుడనై వారాంగనలను లెక్కలేనంతమందిని అనుభవించితిని. స్వామీ! అయినా నా మనస్సునకు తృప్తి కలుగలేదు. అసంఖ్యాకమైన స్త్రీలను భోగించినప్పటికినీ నా మనసుకుగల కామతృష్ణకు సంతృప్తి లభింపలేదు. విషయాసక్తుడనై నిత్యము వెఱ్ఱినై, ఉన్మత్తతతో మద్యపానము చేయుచుంటిని. ఈవిధముగ విచ్చలవిడిగా నేను ప్రవర్తించుచుండగా నాకు క్షయవ్యాధి సంప్రాప్తమయ్యెను. మహాత్మా! ఇదియే అదనుగా భావించి పరదేశపు రాజులు అందరూ కలిసి నా రాజ్యముపై దాడిచేసిరి. నా రాజ్యమును హరించి, నన్ను కూడా వెడలగొట్టిరి. శత్రువుల చేతికి చిక్కి అప్పుడు నేను మరణించితిని. యమదూతలు నన్ను తీసికొనివెళ్ళి నేరుగా ఘోరమైన నరకములో పడవేసిరి. దేవమానముతో పదివేల సంవత్సరముల పాటు నానావిధ నరకములను అనుభవించితిని. అటుపిమ్మట సహస్రశిశ్నములు గల వికృతమైన ప్రేతరూపమును ధరించి దివ్యశత సంవత్సరములపాటు ఆకలిదప్పులతో మలమలమాడుచూ మిక్కిలి క్లేశమును అనుభవించితిని. తిరిగి యమలోకమునకు వెళ్ళి అంతులేని నరకబాధలను అనుభవించితిని. (28-48)

ఆ తరువాత వ్యాఘ్రరూపమున రెండవజన్మను ఎత్తి లెక్కకు మిక్కిలి జీవహింస సలిపితిని. ఇక మూడవ జన్మగా అజగరమునైతిని. తదుపరి తోడేలుగా జన్మించితిని. ఐదవ జన్మలో గ్రామసూకరముగా పుట్టి, ఆరవ జన్మలో తొండనైతిని. ఏడవజన్మలో కుక్కగా పుట్టి, ఎనిమిదవ జన్మలో బుద్ధిహీనమైన నక్కగా జన్మించితిని. తొమ్మిదవ జన్మలో లేడినైతిని. పదవ జన్మలో కుందేలుగా పుట్టితిని. ఇట్లు పదిజన్మలు పొందిన పిదప పదకొండవ జన్మలో మర్కటముగా నైతిని. తదుపరి పన్నెండవ జన్మలో గ్రద్దగా మారితిని. పదమూడవ జన్మలో ముంగిసగా పుట్టితిని. పదునాల్గవ జన్మలో కాకినై జన్మించితిని. పదిహేనవ జన్మగా ఎలుగుబంటినైతిని. పదహారవ జన్మలో అడవి కోడిగా పుట్టితిని. ఆ తరువాత ఏయే జన్మలు నాకు లభించెనో వరుసగా మనవిచేసెదను వినుము. పదునేడవ జన్మలో గుడ్డి గాడిదనై పుట్టితిని. మహానుభావా! పదునెనిమిదవ జన్మలో పిల్లి యోనిలో జన్మించితిని. పంతొమ్మిదవ జన్మలో మండూకమునై పుట్టితిని. ఇరువదియవ జన్మలో కూర్మముగా జన్మించితిని. ఆ తరువాత చేపగా పుట్టితిని. ఇరవై రెండవ జన్మలో ఎలుకగా మారితిని. ఇరవై మూడవ జన్మలో గుడ్లగూబగా పుట్టితిని. ఇరవై నాల్గవ జన్మలో మదగజమునై జన్మించితిని. ఇరవై అయిదవ జన్మలో బ్రహ్మరాక్షసుడనైతిని. ఈ జన్మలో అహరహము ఆకలితో అలమటించుచూ అనేక క్లేశములను అనుభవింపుచు, ఈ కీకారణ్యమునందు నిరాహారినై తిరుగాడుచుంటిని. మిమ్ములను చూచిన వెంటనే చంపి తినవలెననే

తీవ్రమైన కోరిక కలిగెను. మహాపాపినైన నేను అందుకే మీ మీదకు పరుగెత్తుకొని వచ్చితిని. దైవవశమున మీ అంగస్పర్శచేత ఇప్పుడు నాకు గతజన్మల స్మృతిజ్ఞానము లభించెను. స్వామీ! వేలాది జన్మలనుండి నేనొనర్చిన దుష్కృత్యములన్నియు నా కనులముందు కదలాడుచున్నవి. ఇక నాకు ఈ జన్మలు చాలును. మీ దివ్యానుగ్రహముతో నేను తరించితిని. దేవా! ఈ ఘోరమైన అంధకారసంసారయాతనమునుండి నన్ను తరింపచేయుము. నిశ్చయముగా మీరు తరింపచేయుటకు సమర్థులు. అందుకే దైవవశమున మీరు నాకు దర్శనమొసగితిరి. మీ స్పర్శమాత్రముచేతనే జ్ఞానము కలిగించిన మీ దర్శనము ఎంత ప్రతిభావంతమైనదో కదా! నేనేమని చెప్పుదును. ధరాతలమునందు మానవులుందురు. యతులు కూడా అదేరూపముతో కనిపించుదురు. కాని, స్వామీ! మీ మహిమ అతులితమైనది. అనుపమానమైనది. కీకారణ్యములో తచ్చాడుచున్న మహాపాపిని, దురాచారిని అయిన నాకు మీ అంగస్పర్శమాత్రముచేతనే గడచిపోయిన పూర్వజన్మల జ్ఞానము కలుగుట ఎంతటి చోద్యము. మీ దేహమునందెంతటి మహిమ కలదో కదా! ఈ జగత్తులో మీరు సాక్షాత్తు పరమేశ్వరులే అయి వుందురు. స్వామీ! వామదేవా! నన్నుద్ధరించుటకొరకే ఏ పుణ్యభాగ్యవశముననో మీరిచటకు ఏతెంచితిరి" అని పలికెను. బ్రహ్మరాక్షసుడు చెప్పినదంతయు విని **వామదేవమహర్షి మిక్కిలి సంతోషముతో ఇట్లనెను–** "భాగ్యవంతుడా! నా దేహమునకు లేపనము చేయబడిన భస్మమహిమ అట్టిది. నా దేహముపై ధరించిన విభూతి స్వల్పమాత్రముగ నీ దేహమునకు తగిలిన వెంటనే నీలో బుద్ధి జాగృతమై గతజన్మల గురించిన స్ఫురణ కలిగెను. భస్మమహిమ అమోఘమైనది. అయినప్పటికినీ, బ్రహ్మాదికులకు కూడా అది అగోచరము. అందుకొరకే స్వచ్ఛమైన కర్పూరము వలె ధవళకాంతులతో శోభించెడు పరమేశ్వరుడు తన సర్వాంగములకు భస్మమునే అలంకారముగ స్వీకరించెను. అందరిచే వందనములను అందుకొనునట్టి ఆ వ్యోమకేశుడైన పరమేశ్వరునికే ఈ భస్మమహిమ తెలియును. దాని మహిమను అల్పజ్ఞులమైన మన మాటలతో వర్ణించలేము. అట్టి అతులితమహిమాన్వితమైన భస్మమును గురించి మరింతగా చెప్పుమని ఒకవేళ నన్ను నీవు ప్రశ్నించినచో, అందుకొక ప్రబలమైన ఉదాహరణమును చూపించెదను. భస్మమునకుగల అపారమహిమను నేను నా కన్నులార తిలకించితిని. ఆ దృష్టాంతమును ఇప్పుడు నీకు చెప్పెదను. శ్రద్ధగా వినుము. **అంతట వామదేవుడను యోగి బ్రహ్మరాక్షసునితో ఇట్లు చెప్పదొడగెను–**(49–70)

ద్రవిడదేశమునందు ఒక ఆచారభ్రష్టుడైన నీచబ్రాహ్మణుడుండెను. అతడు ఎల్లప్పుడు శూద్రస్త్రీతో రమించుచూ కర్మభ్రష్టుడై వ్యవహరించుచుండెను. అందువలన అతని తల్లిదండ్రులు, వారి గోత్రజులు, మిగిలిన బంధువర్గము అందరు కూడా ఆ బ్రాహ్మణుని

కులబహిష్కారమొనర్చిరి. అప్పుడా బ్రాహ్మణుడు లజ్జావిహీనుడై తాను వరించిన శూద్రస్త్రీతోడనే కాపురము చేయుచు, చౌర్యవృత్తిని యెంచుకొని కడుపు నింపుకొనుచుండెను. ఈ రీతిగా మహాపాపిగా మారి దురాచార పూర్వకమైన ఉన్మత్తతతో, ఇతర స్త్రీలతో కూడా వ్యభిచరించెడివాడు. ఇట్లు కాలము గడుచుచుండెను. ఇట్లుండగా ఒకనాటి రాత్రి ఆ బ్రాహ్మణుడు వ్యభిచారము చేయు నిమిత్తముగా ఒక శూద్రుని ఇంట ప్రవేశించి చోరత్వము చేయుచుండగా, ఆ ఇంటి యజమానియగు శూద్రుడు ఆ బ్రాహ్మణుని పట్టుకొని చావగొట్టెను, స్పృహ తప్పి పడిపోయిన అతనిని మోసుకొనిపోయి, ఊరిబయట ఒక పాడుబడిన బావిలో పడవేసెను. ఆ సమీపమునందు ఒక కుక్క బూడిదలో పడి పొరలుచుండెను. అప్పుడు దానికి ఆకలివేసి ప్రేతవాసనను పసిగట్టి తిరుగుతూ అటూ ఇటూ పచార్లు చేసి ఆ ప్రేతమును సమీపించి, దానిని భక్షించుటకు ప్రయత్నించుచుండెను. అంతట దైవయోగముచే శునకముయొక్క శరీరమునకు తగిలియున్న భస్మము ఆ శవముయొక్క లలాటమునకు అంటెను. అటులే వక్షఃస్థలమునకు మరియు బాహువులకు కూడా ఆ బూడిద తగులుకొనెను. ఆ బ్రాహ్మణుడు ప్రాణము వదలిన వెంటనే యమకింకరులు భయంకరరూపముతో ఆతనిని యమలోకమునకు తీసికొనిపోవుటకు వచ్చిరి. ఇంతలో శివదూతలు కైలాసమునుండి విమానమును తీసికొనివచ్చిరి. **వారు యమదూతలకు అడ్డుగా నిలిచి ఇట్లనిరి–** "ఇతని దేహమునకు భస్మలేపనము వుండగా మీరెందుకు తీసికొనివెళ్లుచుంటిరి. ఇతడు కైలాసమునకు వెళ్లుటకు యోగ్యుడయ్యెను" అని పలికి యమకింకరులను కోపముతో కొట్టి వెళ్ళగొట్టిరి. శివదూతలచే హింసింపబడిన యమదూతలు బ్రాహ్మణుని వదలివేసి యమలోకమునకు చేరుకొని, **యమధర్మరాజుతో ఇట్లు మొరపెట్టుకొనిరి–** "స్వామీ! యమధర్మరాజా! మీ ఆజ్ఞ ప్రకారముగా మహాపాపి, దురాచారి, భయంకర స్వరూపుడైన బ్రాహ్మణుని తీసికొనివచ్చుటకై మేము భూలోకమునకు వెళ్ళితిమి. శివదూతలు వచ్చి మామీద పడి కొట్టి మిమ్ములను చంపెదమనుచు పరుగెత్తుకొని వచ్చి ఆ ప్రేతమును మా నుండి లాగుకొని వారి వశమొనర్చుకొనిరి. ప్రభూ! ఇక మా గతి ఏమిటి? భూలోకమునందు మేము తప్పించుకొనుటకు మార్గమే శూన్యమాయెను. మేము వెళ్ళినచో శివదూతలు మమ్ములను చంపెదరు" అని ఆ యమదూతలు ధర్మరాజుతో విన్నవించుకొనిరి. దూతల మాటలు విని యముడు ఉగ్రుడై మిగుల కోపముతో వెంటనే బయలుదేరి శివదూతల వద్దకు చేరెను. **శివదూతలను చూచి యముడిట్లనెను–** "నా కింకరులను మీరు ఏల కొట్టితిరి? మహాపాపియైన బ్రాహ్మణుని బలవంతముగ లాగుకొని శివలోకమునకు ఎట్లు తీసికొనివెళ్ళెదరు. వాడు చేసిన పాపములకు అంతులేదు. గంగలో ఎన్ని ఇసుకరేణువులు ఉండునో వాటికన్నా రెట్టింపు అధికమైన పాపములను చేసిన మహాపాపి. ఇతడు గొప్ప భయంకరుడు. అట్టి వ్యక్తిని మీరు విమానములో కూర్చుండబెట్టుకొని, మూఢులై శివలోకమునకు చేర్చుటకై తీసికొనివెళ్ళుచుంటిరి కదా! ఇతడు విమానమును అధిరోహించుటకు గానీ,

శివలోకమునకు చేరుటకు గానీ ఎంతమాత్రము అర్హుడు కాదు" అని యమధర్మరాజు మిగుల కోపముతో పలికెను. అందుకు శివదూతలు ఇట్లనిరి – "ఈ శవము యొక్క ముఖమునకు భస్మవిలేపనముగల గుర్తులు గలవు. దీని వక్షఃస్థలముపైన, ఫాలభాగమున, బాహంవులకు, చేతులపైన భస్మలేపనము కలదు. అట్టి స్థితిలో నీ దూతలు ఇతడిని ఎట్లు తీసికొనివెళ్ళగలరు. భస్మాంకిత శరీరముతో గల మానవులను శాశ్వతముగా నివసించుటకొరకు కైలాసమునకే తీసికొని రావలసినదని ఈశ్వరుడు మమ్ములను ఆదేశించెను. ముఖముమీద భస్మము ఉండగా మీ దూతలు ఇతడిని ఎట్లు తాకగలరు. వెంటనే వారిని వధించెడివారము. కాని, ధర్మము కొరకు మీ దూతలను వధించకుండా వదలిపెట్టితిమి. భస్మలేపనము కలిగిన మానవులను మీరుగాని, మీ దూతలుగాని ఇక మీదట తీసికొనివెళ్ళుటకు వీలులేదు. ఇట్టి మాటను ఈశ్వరుని శాసనముగా మీ దూతలకు తెలియజెప్పుము. భస్మలేపనము కలిగిన మానవులకు దోషములు అంటవు. వారు స్వర్గలోకమును చేరుటకే యోగ్యులయ్యెదరు" అని శివదూతలు పలికిరి. శివదూతలు చెప్పిన మాటలు విని యమధర్మరాజు తిరిగి తన లోకమునకు వెళ్ళి తమ యొక్క దూతలను పిలిపించి ఇట్లు ఆదేశించెను. "దూతలారా! ఇకమీదట మీరు భూలోకమునకు వెళ్ళినప్పుడు భస్మాంకిత శరీరము కలిగిన వారి జోలికి వెళ్ళకూడదు. వారు ఎంతటి ఘోరమైన పాపములను చేసిననూ సరే, వారి దేహమునందు త్రిపుండ్రములను ధరించియున్న యెడల అట్టివారిని మీరు తాకవద్దు. మన లోకమునకు తీసికొనిరాకూడదు. ఎవరి గళమున రుద్రాక్షమాల గలదో, ఎవరి నుదుట త్రిపుండ్రములు దిద్దబడి యుండునో, ఎవరి శరీరము దివ్యభస్మాంకితమై యుండునో అట్టివారిని మీరు తాకవద్దు. ఇది ఈశ్వరాజ్ఞ" అని యమధర్మరాజు తన దూతలకు హెచ్చరిక చేసెను. తాను స్వయముగా దర్శించిన ఈ దృష్టాంతమును వామదేవుడు బ్రహ్మరాక్షసునితో వివరించి చెప్పెను. తిరిగి రాక్షసునితో ఇట్లనెను – "దేవ దుర్లభమైన విభూతికి మహత్తరమైన మహిమ గలదు. భస్మము ధరించువారు ఈశ్వరుని ప్రేమకు పాత్రులయ్యెదరు. ఇంతటి మహిమాన్వితమైనది కనుకనే, నేను అత్యంత భక్తితో ఈ విభూతిని నా శరీరమునకు ధరించుచుంటిని. ముల్లోకములకు వందనీయుడైన ఈశ్వరుడు అత్యంత ప్రీతితో ఈ భస్మమును తన శరీరమునందు ధరించుకొనుచుండును. ధవళకాంతులీనెడు పరమేశ్వరుడు తెల్లనైన విభూతిని ధరించియుండే ఆతని శరీరమును, భస్మలేపనమును, దానియొక్క మహిమను ఎవరు వర్ణించగలరు" అని వామదేవుడు చెప్పెను. అంతట ఆ బ్రహ్మరాక్షసుడు మునీశ్వరునకు నమస్కరించి వినయముతో ఇట్లు పలికెను – "జగజ్జీవనా! వామదేవా! మీరే ఈశ్వరులు. నన్ను ఉద్ధరింపగలరు. నాకు మీ దివ్యచరణముల దర్శనము లభించెను. తద్ద్వారా వేలాది జన్మల పూర్వజ్ఞానము తృటిలో లభించెను. బహుశః ఏ జన్మలోనో, నేనేదో కొద్దిమాత్రమైన పుణ్యమును చేసియుందును. అందుకే మీ దివ్యదర్శనము లభించెను. నేను యవనరాజునై రాజ్యమును

పరిపాలించుచుండగా చేసిన పుణ్యప్రదమైనపని ఇప్పుడు నా జ్ఞప్తికి వచ్చినది. ఆనాడు నేను అడవులలో తటాకములను నిర్మింపజేసితిని. బ్రాహ్మణులకు వృత్తిని కల్పించితిని. రాజ్యము చేయుచున్నపుడు అనేక మహాపాపములను యొనర్చినప్పటికినీ, ఈ స్వల్పమాత్రమైన పుణ్యకార్యము చేసినందువలన ఈనాడు తమ దర్శనభాగ్యము నాకు ఘటించినది. నన్ను యమలోకమునకు తీసికొనివెళ్ళినపుడు యముడు ఇతడు చేసిన పుణ్యమేమిటని చిత్రగుప్తుని ప్రశ్నించెను. **అప్పుడు చిత్రగుప్తుడు యమధర్మరాజుతో ఇట్లు చెప్పెను.** "అతడు చేసిన స్వల్పమైన ఈ పుణ్యమునకు ఫలితము అతని ఇరువది ఐదవ జన్మలో లభించునని" పలికెను. అట్టి పుణ్యకార్యము వల్లనే ఇప్పుడు నేను మీ చరణారవిందములను దర్శించగలిగితిని. జగద్గురూ! వామదేవా! ఓ స్వామీ! నన్ను ఉద్ధరింపజేయుము. మీరే నాకు దిక్కు. వేరెవ్వరునూ లేరు. నన్నుద్ధరించగల సమర్థులు మీరు మాత్రమేనని నా నిశ్చయము. స్వామీ! ఇంకనూ ఈ భస్మమాహాత్మ్యమును, దానిని ధరింపవలసిన విధివిధానమును, అందుకు పఠింపవలసిన మంత్రమును నాకు విశదముగా తెలియజెప్పుమని బ్రహ్మరక్కసుడు ప్రార్థించెను. (71-110)

అందుకు వామదేవుడు సంతసించి బ్రహ్మ రాక్షసునితో ఇట్లు చెప్పెను – "విభూతి ధారణమును గూర్చి అడిగితివిగాన, తద్విషయమును వివరించి చెప్పెదను. కడు జాగ్రత్తగా వినుము. పూర్వము ఒకసారి పరమశివుడు మందరపర్వతముపైకి క్రీడించుటకొరకై వెళ్ళెను. అచట కోటిరుద్రాదిగణసహితముగా పార్వతీ సమేతుడైన పరమేశ్వరుడు కొలువుదీరి కూర్చొనియుండెను. ముప్పదిమూడుకోట్ల దేవతలతో సహా దేవేంద్రుడు అచటికి అతి వేగముతో వచ్చెను. అగ్ని, యమ, వరుణులతో సహా కుబేరుడు, వాయుదేవుడు సైతము అక్కడికి చేరుకొనిరి. యక్షులు, గంధర్వులు, చిత్రసేనులు, ఖేచరులు, పన్నగులు, విద్యాధరులు, కింపురుషులు, సిద్ధులు, సాధ్యులు, గుహ్యకులు ఆ సభకు విచ్చేసిరి. అర్యమాది పితరులతో సహా ఆ ఈశ్వరుని సభకు దేవతల గురువైన బృహస్పతి, వసిష్ఠ, నారదాదులు సయితము అచటకు చేరుకొనిరి. బ్రహ్మదేవుడు ఏతెంచెను. దక్షప్రజాపతులతో పాటుగా ఋషికులమంతయూ వచ్చి చేరెను. ఊర్వశి మొదలైన అప్సరసలు విచ్చేసిరి. చండికతో కలిసిన శక్తిగణమంతయూ, ఆదిత్యాది ద్వాదశ సూర్యులు, అష్టవసువులు కలిసి ఈశ్వరుని సభకు చేరుకొనిరి. అశ్వినీ దేవతలు, విశ్వేదేవతలతో కలిసి వచ్చిరి. బ్రహ్మరాక్షసుడా! వినుము. భూతపతి, మహాకాలుడు, నందికేశ్వరుడు, మహానీలుడు బలమైన ద్వారపాలకులుగా సమీపములో నిలబడియుండిరి. వీరభద్రుడు, శంఖకర్ణుడు, మణిభద్రుడు, షట్కర్ణుడు, వృకోదరుడు, దేవమాన్యుడు, కుంభోదరుడు వీరందరూ అచటికి వచ్చిరి. కుండోదరుడు, మండోదరుడు, వికటకర్ణుడు, కర్ణధారుడు, ధారకేతువు, మహావీరుడు, భూతనాథుడు కూడా విచ్చేసిరి. నానావిధరూపములతో అనేకవిధ వర్ణములతో కూడిన ముఖములు గలవారు, చిత్రవిచిత్రములైన శారీరిక అవయవములు కలిగిన

భూతనాథుని సేవకులు చేరుకొనిరి. భూతనాథుని గణములలో మిక్కిలి ఖ్యాతి చెందిన భృంగి, రిటి మొదలగు భూతనాథులందరు పరమశివుని స్తుతించుచుండిరి. నానావిధములైన వర్ణములతో, అవయవములతో, ఆకారములతోగల రుద్రగణములు పరమశివుని సేవించుచుండిరి. ఇక రుద్రగణము నందలి వారి రూపములు వర్ణించెదను వినుము. కృష్ణవర్ణము, శ్వేతవర్ణము, పీతవర్ణము, ధూమ్రవర్ణమును కలిగినవారు కొందరు, తామ్రవర్ణము, సువర్ణ వర్ణము, హరితవర్ణము, రక్తవర్ణము, లోహితవర్ణము మొదలైన చిత్రవిచిత్ర వర్ణములతో మండూకము వంటి ముఖములను కలిగిన రుద్రగణములు అచటికి చేరుకొని పరమశివుని స్తుతించుచుండిరి. నానావిధములైన ఆయుధములను ధరించి, శస్త్రాస్త్రములతో అనేక చిత్రవిచిత్రములైన భూషణములతో, ఆభరణములతో, వాహనములతో వచ్చిరి. అందులో కొందరి ముఖములు వ్యాఘ్రముఖములు. కొందరివి సూకరముఖములు. మరికొందరివి గజముఖములు. ఇంకొందరివి మొసలి ముఖములు. ఇంకొందరివి శునకముఖములు. అటులే హరిణ ముఖములు. ఉష్ట్రముఖములు, శరభ ముఖములు, శార్దూల ముఖములు, భేరుండ ముఖములు, సింహముఖములు, ద్విముఖములను, చతుర్ముఖములను కలిగిన రుద్రగణములు అచటికి చేరుకొనిరి. ఇంకను చతుర్భుజములు కలిగినవారు, ముఖము కూడా లేనటువంటి వారు అక్కడికి చేరుకొనిరి. ఒకే హస్తముగల వారు కొందరు, హస్తద్వయమును కలిగినవారు మరికొందరు, ఐదు, ఆరు హస్తములు కలిగినవారు ఇంకొందరు, పాదములు అసలే లేనివారు కొందరు, అనేక పాదములను కలిగినవారు ఇంకొందరు చెవులు లేనివారు కొందరు, ఒకే చెవి కలిగినవారు మరికొందరు, అనేక చెవులు కలిగినవారు ఇంకొందరు. ఇట్లు చిత్రవిచిత్రమైన ఆకార, వికారములు కలిగిన రుద్రగణముల వారు అచటికి వచ్చిరి. ఒకే కన్ను గలవారు కొందరు, నాలుగు కండ్లు కలిగిన విచిత్రమైనవారు కొందరు, స్థూలకాయులు కొందరు, నిటారుగా ఎత్తైనవారు, మరికొందరు పొట్టిగా, మరుగుజ్జులుగా ఉన్నవారు, ఇంకొందరు ఇట్టి అసంఖ్యాకమైన ఈశ్వరగణము ఆ సభాస్థలికి చేరుకొనెను. ఇట్టి గణములతోపాటు శివుడు సప్తప్రభావళితో కూడిన నవరత్నఖచిత హేమసింహాసనమును అధిష్ఠించి దేదీప్యమానుడై మూర్తిమంతుడై విరాజిల్లుచుండెను. (111-132)

పరమశివుడు ఆసీనుడైయున్న సింహాసనము యొక్క మొదటి ప్రభ అంతులేని కాంతులు విరజిమ్మెడు రత్నాలతో పొదగబడి అనుపమానమైన కాంతిని వెదజల్లుచుండెను. ఇక రెండవ ప్రభ పచ్చని బంగారు రంగు లీనుచుండెను. దానిపైన పుష్కలమైన రత్నములు చెక్కబడి మెరయుచుండెను. మూడవ ప్రభ నీలివర్ణము కలిగిన రత్నములతో చూడముచ్చటగా పొదగబడియుండెను. ఈశ్వరుడి సింహాసనమునకు గల నాల్గవ ప్రభ ధవళకాంతులీనుచుండెను. దానిపై పద్మములవంటి రత్నములు పొదగబడి యుండెను. ఐదవ రత్నఖచిత ప్రభావళి లెక్కకు మిక్కిలి ముత్యములతో

పొదగబడియుండెను. దానిక్రింద నీలవర్ణముతోను, మధ్యన సువర్ణవర్ణముతోను ఉన్న ఈశ్వరుని ఆరవ అపూర్వమైన ప్రభ మేలిమి రత్నములతో పొదగబడి కాంతులీనుచుండెను. విశ్వకర్మచే నిర్మింపబడిన ఏడవ ప్రభ అనేక దివ్యరత్నములతో పొదగబడి యుండెను. అది త్రిభువనములయందు అపూర్వమైనది. అట్టి సింహాసనమును అలంకరించియున్న ఆ త్రిపురారి కోటిసూర్యుల ప్రభాభాసమానుడై తేజరిల్లుచుండెను. మహాప్రళయకాలమున సప్తసముద్రముల కలయిక వంటి శ్వాసోచ్ఛ్వాసలతో పరమశివుడు ఆసనమును అలంకరించియుండెను. ఆయన ఫాలభాగమున మూడవనేత్రము జ్వాలమాలికగా జ్వలియించుచుండెను. ప్రళయకాలీనమునందు ఉద్భవించు సంవర్తాగ్ని సదృశముగ జటామండలము ప్రకాశించుచుండెను. శిరముపై షోడశకళలతో కూడిన తెల్లని, చల్లని వెన్నెల కురిపించే నెలవంకను ధరించిన సదాశివుడు అత్యంత శోభాయమానుడై విరాజిల్లుచుండెను. ఆ పరమేశ్వరుని వామకర్ణమునకు తక్షకుడు, దక్షిణ కర్ణమునకు వాసుకి ఆభరణములై యుండిరి. ఆయన రెండు నేత్రములు అత్యద్భుతములైన నీలిరత్నములవలె కాంతులీనుచుండెను. (133-143)

నీలకంఠుడు మెడలో నాగహారమును, కరములందు నాగకంకణములను, చేతివ్రేళ్లకు కూడా సర్పములనే ముద్రిక (ఉంగరము)లుగా ధరించి యుండెను. ఆయన మొలనూలు కూడా సర్పమే. వ్యాఘ్రచర్మమును పరిధానముగా ధరించి పరమశివుడు తన కాంతిచే నిర్మలమైన దర్పణమువలె ప్రకాశించుచుండెను. కర్కోటకుడు, మహాపద్ముడు అనే ఉభయ సర్పములను కేళీవిలాసమునకై పరమేశ్వరుడు తన కాళ్ళకు నూపురములుగా (అందెలుగా) మలచుకొనెను. ఈవిధమైన పరమేశ్వరుడు పూర్ణిమనాటి నిండుచందమామవలె శుద్ధమైన ధవళకాంతులతో దిక్కులను శోభింపచేయుచుండెను. అందుకే ఆయనను **'కర్పూరగౌరుడు'** అని అందురు. ఆ పశుపతిని ఈవిధముగనే ధ్యానింపవలెను. నవరత్నఖచితమైన కిరీటము వలె శిరమున నాగేంద్రుడే శోభిల్లుచుండెను. బాహుభూషణములతో, కర్ణకుండలములతో అత్యద్భుతముగా ప్రకాశించుచూ భోళాశంకరుడు, అమాయకపు చక్రవర్తి ఆ నిండుసభలో సింహాసనమును అధిష్ఠించి శోభిల్లుచుండెను. నిలువెల్ల తెల్లని కమలాలతో అర్చించినట్లుగా దివ్యమైన చందనము అలదినట్లుగా కర్పూరకళికతో పూజించినట్లుగా ఈశ్వరుడు శోభిల్లుచుండెను. పొడవైన పదిభుజములు కలిగి ఒక్కొక్క చేతిలో ఒక్కొక్క ఆయుధమును వరుసక్రమంలో ఆ పరమశివుడు ఒక చేతిలో త్రిశూలము, మరొక చేతిలో చక్కని ఢమరుకము, ఇంకొక చేతిలో తీక్ష్ణమైన ఖడ్గము, తదుపరి ఒక పానపాత్ర, ధనుర్బాణములు, కట్వాంగము, పరశువు, అంకుశము, మృగము, పినాకము అనే పదింటిని పది చేతులలో ధరించియుండెను. ఈవిధముగ ఆ నిండుసభలో ఆసీనుడై సర్వేశ్వరుడైన పరమేశ్వరుడు తేజోరూపుడై తన కాంతులను దిగంతములకు వ్యాపింపచేయుచూ అలరారుచుండెను. (144-154)

ఆయన పంచముఖ పరమేశ్వరుడు. అలంకరింపబడిన ఐదు ముఖములు మనకు గోచరించుచున్నవైనము ఇట్లున్నది. మన్మథుని దగ్ధము చేసిన భస్మభూషణుని రూపము మచ్చలేని చంద్రుడివలెను, పాలమీది తెల్లని నురుగువలెను ఉండెను. సూర్యచంద్రులే ఆయన నేత్రములు. అగ్నియే ఫాలభాగమున జ్వలించుచున్న త్రినేత్రము. నాగహారమును, కటిసూత్రమును ధరించి తెల్లని ఫాలభాగముపై తిలకమును దిద్దుకొని ఆ చంద్రమౌళి అత్యద్భుతముగా శోభించుచుండెను. దరహాసవదనము కలిగి, అపూర్వవైభవముతో పశ్చిమవైపున గల మొదటి ముఖము దివ్యదర్శనమును ప్రసాదించుచుండెను. ఇక ఉత్తరమువైపునకు గోచరించుచున్న రెండవ ముఖము తామ్రవర్ణమును కలిగి, దానిమ్మపువ్వువలె బాలభానుని కాంతియుక్తమైన శోభతో తేజరిల్లుచుండెను. శిరమున అర్ధచంద్రునితో, జటాజూటమున గంగమ్మను కలిగి సర్పముతో చుట్టిన జటాబంధనమును కలిగి తూర్పువైపున మూడవ ముఖము శోభిల్లుచుండెను. దక్షిణమువైపున గల నాలుగవ ముఖము భయంకరమైన, దారుణమైన దవడలతో నీలివర్ణములు కలిగి నోటినుండి వెలువడుచున్న జ్వాలలతో, చుట్టబడిన సర్పములతో రుండమాల (కపాలమాల)ను ధరించి శోభిల్లుచుండెను. కనబడి కనబడకుండా యున్నట్టి ఐదవ ముఖమును కలిగిన ఈశ్వరుడు అటు సాకార–నిరాకారముగను, ఇటు సగుణ–నిర్గుణ స్వరూపుడుగను ఉండెను. ఆయన వదనము సలక్షణముగను, నిర్లక్షణముగను వరలుచుండెను. ఇంతటి తేజోమూర్తియైన పంచముఖ సర్వేశ్వరుడు సాక్షాత్తు పరబ్రహ్మవస్తువేగాని వేరొకటి కాబోదుకదా! ఆ స్వామి మెడలో క్రూరములైన అనేక సర్పములు పూలమాలలుగా వ్రేలాడుచుండెను. భక్తులకు ఆశ్రయమును ప్రసాదించే ఆ పరమేశ్వరునియొక్క పాదములు ఎల్లనైనటువంటి లేత ఎరుపు వర్ణమును కలిగిన పద్మములవలె శోభిల్లుచుండెను. ఆయన చరణములకు గల నఖములు అర్ధచంద్రాకృతిని పోలియుండెను. పరమేశ్వరుని పాదములకు మెరిసిపోవుచున్న పాదుకలుగా చక్కని పాములే అమరియుండెను. పులి చర్మమునే వస్త్రముగా ధరించి, నడుమునకు నాగబంధమును కలిగియుండెను. ఆ స్వామి యొక్క విశాల వక్షస్థలమునందు చూడముచ్చట గొలిపెడు దట్టమైన రోమములు, చంద్రావళితో అందగించెడు నాభియును భక్తజనులకు మూర్తిమంతమైన పరమార్థమును లభింపజేయుట కొరకే మేము ఉన్నామన్నట్లుగా గోచరించుచుండెను. భోళాశంకరుడు అమాయకచక్రవర్తిగా వాసిగాంచిన ఆ పరమేశ్వరుడు, భూతనాథుడు, దయాపయోనిధి, అమ్మవారిని తనకు ఎడమవైపున కూర్చుండబెట్టుకొని శోభాయమానుడై సింహాసనమును అధిష్ఠించియుండెను. (155–170)

ఇక సర్వేశ్వరియైన పార్వతీదేవి ధరించిన ఆభరణములు అత్యంత అమూల్యములు. బంగారు సంపెంగ వంటి వన్నెతో కూడిన మెడలో జిగేలుమనెడు ముత్యాలహారములు, నాగబంధములు వ్రేలాడుచుండెను, రత్నఖచితమైన మకుటమును ధరించియుండెను. అట్టి మకుటముపైన

అనేక పుష్పజాతులు శోభిల్లుచుండెను. ఆ పుష్పముల పరిమళాలకోసమై అచట చేరిన భ్రమరములు గుంజారవములను చేయుచుండెను. ఆ మకుటమునకు ఒక పెద్ద ముత్యాల వల, రత్నములచే పొదగబడి దిగంతములకు కాంతిని విరజిమ్ముచూ శోభాయమానముగా కాన్పించుచుండెను. మందహాసవదనారవిందమును కలిగి చిరునవ్వులు చిందించే ఆ చిన్మయి, జగన్మాత, విశ్వవంద్య, లోకేశ్వరి, పరమేశ్వరి యొక్క వదనము నిండుపున్నమరేయి చంద్రబింబమువలె కన్పట్టుచుండెను. కోటేరువలె తీర్చిదిద్దబడిన ఆమె నాసికాగ్రమును, ముత్యాలనత్తు, ఉజ్వలమైన రత్నములతో పొదగబడి తన కాంతులను దశదిశలయందు వెదజల్లుచుండెను. పగడాలవంటి అధరములతో తెల్లని రత్నములవంటి పలువరుసతో ఆ జగన్మాత దేదీప్యమానముగా శోభిల్లుచుండెను. రత్నాలు పొదగబడిన కర్ణాభరణములతో పచ్చనైన రవికను ధరించి అనేకమైన ఒంటిపేట రత్నాలహారములు మెడలో అలంకరించియుండెను. కాలవ్యాళమగు సర్పము ఆ మహాతల్లియొక్క స్తన్యపానమును చేయుచుండెను. అట్టి జగన్మాత స్తన్యపానమును చేయగలిగిన ఆ వ్యాళముయొక్క అదృష్టము ఎంత గొప్పదో కదా! దానిమ్మగింజలను పోలిన ఎరుపువర్ణము కలిగిన వస్త్రమును గిరిజామాత ధరించియుండెను. ఆ తల్లి కుంకుమశోభతో అలరారుచుండెను. అపూర్వమైన, అందమైన ముంజేతి కంకణాలను, భుజములకు వంకీలను, నడుమునకు రత్నాలు పొదిగిన ఒడ్డాణమును, జలతారువంటి మొలనూలును ధరించియుండెను. అమ్మ చరణారవిందములయందు గొప్పనైన బంగారు నూపురములు శోభిల్లుచుండెను. అష్టమినాటి చంద్రునివలె ఆమె ఫాలభాగమున తెల్లని ముత్యపు త్రిపుండ్రములు శోభిల్లుచుండెను. జగన్మాతయగు అంబిక ధరించిన ఆభరణములను, ఆమె శృంగారమును, ఆమె చక్కదనమును వర్ణించి చెప్పుట కెవరి తరము. అట్టి జగన్మాతతో కూడిన మహాదేవుడు ముప్పదిమూడుకోట్ల దేవతాపరివారముతో కొలువుదీరి కూర్చుండియుండెను. దేవేంద్రుడు సహజముగనే అచట నిలబడియుండెను. సమస్త సురవరులు నిండియున్న ఈశ్వరుని సభకు దేవర్షి సనత్కుమారుడు అతి వేగముతో విచ్చేసెను. (171-187)

అంతట సనత్కుమారుడు పరమేశ్వరుని చరణారవిందములకు సాష్టాంగవందనము చేసి వినయముతో దోసిలొగ్గి ఇట్లు విన్నవించెను. "ఉమాకాంతా! జగదీశ్వరా! మీకు జయము. జయము. విశ్వకర్తా! శంభుదేవా! మీకు జయము. జయము. ముల్లోకములకు చతుర్విధపురుషార్థ ఫలములను ప్రసాదించే దాతవు నీవే కదా! స్వామీ! పాపాలను నశింపచేసి, భవసాగరమును తరింపచేయగల సమస్త ధర్మాలను దయతో మీరు సెలవీయుడు. అల్పపుణ్యముతోడనే ముక్తిని ప్రసాదించగలిగే నాలుగు పురుషార్థములు అనాయాసముగా లభింపచేయగలుగుటకు

మరియొక వరమును మానవాళికి మీరు ప్రసాదించవలయును. లేనిచో, సమస్తపుణ్యకార్యముల కోసమై పరిమితి లేనంతగా కష్టపడవలసి వచ్చును. స్వామీ! సమస్త మానవాళికి శ్రేయమైన, హితకరమైన, మరొక దివ్యమైన, అతిసులభముగా పుణ్యరాశిని సంపాదించుకొన గలిగెడు ఉపాయమును ఏదేని మరొక సాధనమును మాకు అందించవలసినది" అని ప్రార్థించెను. సనత్కుమారునియొక్క విన్నపమునాలించి తన మనసులో మిగుల సంతసించిన **కర్పూరగౌరుడగు ఈశ్వరుడు అతనికి ఇట్లు సమాధానము చెప్పెను**– "దేవతలారా! ఋషులారా! మీరందరూ శ్రద్ధగా వినగలరు. ఏ ధర్మమును ఆచరించిన వెంటనే తత్క్షణమే పుణ్యరాశి లభింపగలదో, అట్టి వేదశాస్త్ర సమ్మతమైన ధర్మమును ఇప్పుడు మీకు తెలియజేయుదును. అదేమిటనగా, భస్మముతో త్రిపుండ్రములను ధరించుట వలన అనంతపుణ్యఫలము లభించితీరును" అని పరమేశ్వరుడు తెలిపెను. అందుకు వెంటనే **సనత్కుమారుడు పరమశివుని ఇట్లు ప్రార్థించెను**– "స్వామీ! ఈ భస్మమును మానవులు ఏ పద్ధతితో ధరింపవలెను. ఎచ్చటెచ్చట ధరింపవలెను. దేనితో సిద్ధపరచవలెను. ఆ భస్మమునకు అధిష్ఠాన శక్తియగు దేవత ఎవరు? ఎవరెవరు ఏ ప్రమాణంగా దీనిని ధరించవలెను? ఎట్లాచరించవలెను? ఏ మంత్రముతో దీనిని ధరింపవలెను? పరమేశ్వరా! ఇట్టి సమస్త వివరములను మాకు విశదముగా వివరించి చెప్పగలరని, అత్యంత వినమ్రుడై సనత్కుమారుడు ప్రార్థించెను. (188–197)

సనత్కుమారుని విన్నపమును వినిన మహాదేవుడు మందహాసవదనారవిందుడై ఇట్లు చెప్పసాగెను – "నాయనా! గోమయమును అగ్నితో కాల్చి భస్మమును సిద్ధము చేయవలెను. భూలోకమున యజ్ఞము చేయబడిన కుండమునందలి భస్మమును ధరించిన మరుక్షణమే గొప్ప పుణ్యము లభించును. **'సద్యోజాతాది'** మంత్రములతో భస్మమును అరచేతికి తీసికొనవలెను. తదుపరి **'అగ్నిరీత్యాది'** అనే మంత్రముతో ఆ భస్మమును అభిమంత్రించవలెను. పిమ్మట, **'మానస్తోకే'** అను మంత్రముతో జలమును కలిపి అంగుష్ఠముతో రుద్దవలెను. తదుపరి **'త్ర్యంబకో'**మను మంత్రముతో శిరసున భస్మమును ధరించవలెను. ఆ తర్వాత **'త్రియాయుషేతి'** మంత్రముతో లలాటమునకు, ఇరు భుజములకు, వక్షస్థలమునకు, ఇదే మంత్రముతో ప్రతిచోటను భస్మమును ధరింపవలెను. ఈ మంత్రమును పఠింపుచు మూడు రేఖలను, తర్జనీ, మధ్యమ, అనామిక అనే మూడు వ్రేళ్లతో కలిపి ధరించవలెను. ఇక లలాటమునందు కనుబొమల చివరలు దాటకుండా సమానముగా మూడు రేఖలను ధరింపవలెను. ఫాలభాగమున భస్మధారణ ముందుగా బొటనవ్రేలితో మధ్యరేఖను కుడినుండి ఎడమకు ధరించవలెను. తదుపరి మధ్యమ, అనామిక లనే రెండు వ్రేళ్లతో ఎడమ నుండి కుడివైపునకు పై, క్రింది రేఖలుగా భస్మమును ధరింపవలెను. ఈవిధముగా త్రిపుండ్రమును ధరింపవలెను. ఇందులోని ఒక్కొక్క రేఖనుగూర్చి వివరముగా చెప్పెదను. **సావధానముగా అవధరింపుడు.** (198–205)

ఈ మూడు రేఖలలో ఒక్కొక్క రేఖయందు తొమ్మండుగురు దేవతలుండెదరు. ‘అ’కారము, గార్హపత్యాగ్ని, భూః, ఆత్మ రజోగుణము, ఋగ్వేదము, క్రియాశక్తి, ప్రాతఃసవనము ఇవన్నీ మొదటి రేఖలో ఉండునని సదాశివుడు ఆ సభలో కూర్చున్న వారందరికి చెప్పుచుండెను. ఇక రెండవ రేఖలో ‘ఉ’కారము, దక్షిణాగ్నిదేవత, నభము, సత్త్వగుణము, యజుర్వేదము, మాధ్యందిన సవనము, ఇచ్ఛాశక్తి, అంతరాత్మ మహేశ్వరుడు దేవతగా ఉండురు. ఇక మధ్యలో గల మూడవ రేఖ యందు ‘మ’కారము, ఆహవనీయాగ్ని, పరమాత్మ, ద్యులోకము, జ్ఞానశక్తి, తమోగుణము, తృతీయసవనము, సామవేదము ఇవన్నింటికి ప్రతీకముగా ఉండునని శివదేవుడు వారి సందేహములన్నీ తీరిపోవునట్లుగా మూడు రేఖలుగా త్రిపుండ్రములను తీర్చిదిద్దుకొనే విధానమును గూర్చి వివరించెను. ఈ రీతిగ నిత్యము నమస్కరించి, లలాటమునందు త్రిపుండ్రమును ధరింపవలెను. అదియే మహేశ్వర వ్రతముగా వేదశాస్త్రములు పేర్కొనుచుండెను. ముక్తిని కోరుకొనువారు ఈ త్రిపుండ్రమును ధరించినచో వారికి పునర్జన్మ ఉండదు. సకాములు మనసునందు సంకల్పించిన సమస్త అభీష్టములు, చతుర్విధ పురుషార్థములతో సహా లభించును. ఇక బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, యతులు అందరు అత్యంత సంతోష ఉల్లాసములతో భస్మముతో త్రిపుండ్రముగా తప్పక ధరింపవలెను. మహాపాతకులైన వారు ఈ భస్మమును ధరించిన మరుక్షణమే వారు పుణ్యాత్ములు కాగలరు. క్షత్రియ, వైశ్య, శూద్ర మొదలైన జాతులవారు స్త్రీ వధగాని, గోహత్యాది మహాపాతకములు గాని చేసినవారు, వీరహత్య, ఆత్మహత్య మొదలగు పాతకములకు పాల్పడినవారు ఈ భస్మమును ధరించిన వెంటనే పరిశుద్ధులయ్యెదరు. సమంత్రకముగా, విధివిధానముగా అత్యంత భక్తిశ్రద్ధలతో భస్మము ధరించువారి యొక్క మహిమ అపారము. వారు దేవలోకము నందు వందనీయులయ్యెదరు. ఒకవేళ మంత్రము తెలిసినను, తెలియకపోయినను భావశుద్ధితో భస్మమును ధరించువారియొక్క మహిమ కూడా అపారమైనదని గమనింపవలెను. పరద్రవ్యమును అపహరించినవారు, పరస్త్రీ గమనము చేసిన పాపులు, పరనింద చేయువారు, ఇతరుల పొలమును, క్షేత్రమును అపహరించినవారు, పరులను పీడించే పరాయణులు, ధాన్యమును అపహరించేవారు, తోటలను ధ్వంసమొనర్చువారు భస్మమును ధరించినయెడల తమ పాతకములనుండి విడివడి పునీతులయ్యెదరు. ఇతరుల గృహాలను అగ్నికి ఆహుతి చేసిన పాపులు, అసత్యవాదులు, పరనింద చేయువారు, వేదమును విక్రయించుకొని జీవించువారు, దొంగసాక్ష్యమును చెప్పువారు, పట్టిన వ్రతమును విడిచిపెట్టినవారు, పొట్టకోసమై మోసములను చేయువారు మున్నగు వారందరు కూడా భస్మలేపనమువలన పునీతులయ్యెదరు. గోవులు, భూములు, సువర్ణము, గేదెలు, నువ్వులు, గొంగళ్ళు, వస్త్రములు, అన్నము మొదలైన

ద్రవ్యములను దానముగా స్వీకరించే పాపులు కూడా భస్మవిలేపనముతో పునీతులయ్యెదరు. ధాన్యమును, జలమును దానముగా స్వీకరించే నీచులు కూడా భస్మధారణ వలన పవిత్రులయ్యెదరు. దాసి, వేశ్య, జారిణి, శూద్ర స్త్రీ, లేదా పెళ్లికి ముందు రజస్వలయైన కన్య ఏదేని దోషములు చేసినయెడల వారందరూ పునీతులయ్యెదరు. కన్యలతో, వితంతువులతో, పరస్త్రీలతో సంగమించినవారు తగు పశ్చాత్తాపమును చెంది, భస్మమును ధరించినచో పునీతులయ్యెదరు. రసము, మాంసము, లవణాదికాలు విక్రయించేవారు కూడా త్రిపుంధ్రములు ధరించినచో పునీతులయ్యెదరు. తెలిసీ తెలియక ఎందరిచేతనో పాపములు చేయబడుచుండును. అట్టివారందరునూ విభూతిని ధరించుటవలన పుణ్యాత్ములయ్యెదరు. వారి పాపములన్ని నశించిపోవును. భస్మమహిమ అంతులేనిది, అపారమైనది, అమోఘమైనది. శివుని నిందించినవారు, శివద్రవ్యమును అపహరించినవారు, శివభక్తులను నిందించువారు, ఇతరమైన పాపములు చేయువారు మొదలగు వీరందరి పాపములకు నిష్కృతిలేదు. కాని, మెడలో చక్కని రుద్రాక్షమాలను ధరించి, విభూతిని త్రిపుంధ్రములుగా నిత్యము ధరించినయెడల ముల్లోకముల యందు వారు పూజ్యులయ్యెదరు. భస్మమును ధరించుటవలన భూలోకమునగల సమస్త తీర్థములను, పుణ్యక్షేత్రములను, నదులను దర్శించి, అచట స్నానము చేసినంతటి పుణ్యరాశి ఫలము లభించును. పంచాక్షరాది సప్తకోటి మంత్రములు, అనంతవేదశాస్త్ర మంత్రములు జపించిన ఫలము కేవలము విభూతి ధారణతో మాత్రమే లభించును. విభూతిని ధరించేవారి యొక్క నలుబది రెండు వంశములవారు గతజన్మలలో చేసిన వేలాది పాపములు, రాబోవు జన్మలలో చేయబోవు వేలాది పాపములు పటాపంచలైపోవును. భస్మమును ధరించుటచే ఇహలోకమునందు సమస్త సౌఖ్యములు కలిగి, వందసంవత్సరములు జీవించి ఎట్టి ఆధివ్యాధులు లభింపక, వారి దేహమునకు ఎట్టి వ్యాధులు రాకుండా దివ్యశరీరమును కలిగి అష్టైశ్వర్యములతో తులతూగెదరు. అంతేగాక, అట్టి మానవులకు అంతిమ సమయమున నిశ్చయమైన పరమజ్ఞానము లభించును. తద్వారా పరలోకసౌఖ్యము లభించును. భస్మధారణ వలన వందమంది దేవతా స్త్రీలు దివ్యవిమానమును తీసుకొనివచ్చి అందులో భస్మధారణ చేసినవారిని కూర్చుండబెట్టి, వారిని సేవించుచూ స్వర్గలోకమునకు తీసికొనివెళ్లెదరు. విద్యాధరులు, సిద్ధజనులు, గంధర్వాది దేవగణములు, ఇంద్రాది లోకపాలురు అందరు భస్మధారణ చేసినవారికి వందనము చేయుదురు. స్వర్గలోకమునందు అనంతకాలము అద్భుతమైన సుఖసౌఖ్యములను అనుభవింపగలరు. అటుపిమ్మట శాశ్వతముగా బ్రహ్మలోకమునకు వెళ్ళెదరు. వందకల్పముల వరకు బ్రహ్మలోకమున నివసించెదరు. అచటినుండి విష్ణుపురమైన వైకుంఠమునకు చేరుకొందురు. మూడు బ్రహ్మ కల్పముల పర్యంతము వారు

వైకుంఠమునందు ఉండెదరు. అనంతరము కైలాసలోకమునకు వెళ్ళి అక్కడే అక్షయకాలము ఉండిపోయెదరు. వారికి శివసాయుజ్యము లభించును" అని సనత్కుమారాది సమస్త జనులను ఉద్దేశించి ఈ విషయమును నేను చెప్పుచున్నానని పరమశివుడు పలికెను. ఇందెంతమాత్రము సందేహించకుండా లలాటమునందు త్రిపుండ్రమును ధరించవలెనని ఉపదేశించెను. ఇంకనూ వేదశాస్త్రాది ఉపనిషదర్థముల సారమును నేను తిలకించితిని. భస్మధారణతో చతుర్విధ పురుషార్థములు అత్యంత సులభముగా లభించితీరును. సనత్కుమారాది ఋషిమునీశ్వరులందరికందరూ విభూతిని ధరించగలరు" అని త్రిపుండ్రము యొక్క మహిమను పార్వతీసమేతుడైన పరమేశ్వరుడు విశదముగా వివరించెను. ఆవిధముగా సనత్కుమారాదులకు ఉపదేశించి వెంటనే ఈశ్వరుడు కైలాసలోకమునకు వెళ్ళిపోయెను. సనత్కుమారుడు మహదానందభరితుడై బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయెను. (206-245)

భస్మమహిమను గూర్చి వామదేవమహాముని ఇంత గొప్పగా చెప్పినందులకు మిగుల సంతసించిన బ్రహ్మరాక్షసుడు ఆ మహామునీశ్వరుని పాదములకు శిరస్సాష్టాంగవందనము ఆచరించెను. **అంతట వామదేవుడు ఆ రాక్షసునితో ఇట్లనెను-** "నాయనా! భస్మమాహాత్మ్యము అత్యద్భుతమైనది. నా అంగస్పర్శ, నా అంగమునకు గల భస్మముయొక్క స్పర్శచేత నీకు ఇంతటి జ్ఞానము లభించినది" అని పలికి, సంతోషముతో వామదేవుడు భస్మమును అభిమంత్రించి రాక్షసునకు ఇచ్చెను. అంతట బ్రహ్మరాక్షసుడు తన నుదుటిపై త్రిపుండ్రమును ధరించిన వెంటనే దివ్యదేహము లభించి తేజోమూర్తిగా మారిపోయెను. దివ్యమైన దేహమును కలిగి, ఆకాశమునందు భానుడు ప్రకాశించునట్లుగా ఆ బ్రహ్మరాక్షసుడు ఆనందస్వరూపుడయ్యెను. వెంటనే అతడు యోగీశ్వరుని పాదములపై వ్రాలెను. కడుభక్తితో అతనికి ప్రదక్షిణములు చేసి నమస్కరించెను.

ఇంతలో కోటిసూర్యప్రభాభాసమైన విమానము ఆకసమునుండి దిగివచ్చెను. దివ్యదేహమును ధరించిన బ్రహ్మరాక్షసుడు ఆ విమానమును అధిరోహించి తత్క్షణమే స్వర్గలోకమునకు వెళ్ళెను. ఆవిధముగ వామదేవమహాముని అతనికి దివ్యమైన పరలోకమును ప్రసాదించెను. మానవరూపముతో మన కంటికి కనిపించే వామదేవుడను మహాదేవుడు భక్తులను తరింపచేయుటకై భూలోకమునందు ప్రత్యక్షముగా సంచరించెడు శంభుదేవుడే సుమా! త్రిమూర్తుల అవతారమైన వామదేవుడే గురువు. జగత్తును ఉద్ధరించుటకై ఆయన భూలోకమునందు సంచరించుచుండును. నామధారకా! గమనించితివా! ఆతడే బ్రహ్మరాక్షసునకు వరమునిచ్చి ఉద్ధరించెను. విశేషించి గురు హస్త స్పర్శ కలిగిన

విభూతి మాహాత్మ్యము చాలా గొప్పనైనది. గురువును ఆశ్రయించకుండా ఏ మంత్రమూ సిద్ధింపదు. **'నాస్తి తత్త్వం గురోః పరమ్'** గురువును మించిన విలక్షణమైన, శ్రేష్ఠమైన తత్త్వము మరియొకటి లేదు అని వేదశాస్త్రములు వక్కాణించినవి. **సూతుడు ఋషీశ్వరులతో ఇట్లు పలికెను-** "భస్మమాహాత్మ్యము మహత్తరమైనది. అది గురు హస్తమునుండి లభించినచో మరింత గొప్పదగును. అది లభించుటకు గురువే కారణమగును" అని ఈవిధముగ త్రివిక్రమునితో శ్రీగురుమూర్తి భస్మమాహాత్మ్యమును గూర్చి తెలియజెప్పెను. (246-257)

అంతట త్రివిక్రమభారతి మిగుల హర్షమును పొంది నృసింహసరస్వతీ స్వామివారి దివ్యచరణారవిందములపై తన తలనుపెట్టి సాష్టాంగవందనమును ఆచరించెను. శ్రీగురునాథునియొక్క అనుమతిని స్వీకరించి, తన నివాసస్థానమునకు బయలుదేరెను. శ్రీగురుమూర్తి యొక్క ఉపదేశములవలన సమస్తజనులకు జ్ఞానము లభించెను అని ఈవిధముగా సిద్ధముని వివరించి చెప్పగా, శిష్యోత్తముడగు నామధారకుడు అత్యంత భక్తిపూర్వకముగా వినెను. అట్టి గురుశిష్యుల సంవాదమునే స్వీకరించి సరస్వతీ గంగాధరుడు గురుచరిత్రమును మరింతగా వివరించి లోకమునకు అందించెను. కదు భక్తిభావముతో దీనిని చదువువారికి, వినువారికి చతుర్విధ పురుషార్థ ఫలములు లభించునని గ్రంథరూపమున ఆయన ప్రకాశింపచేసెను. (258-261)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి
శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "భస్మమహిమానువర్ణనము" అను ఇరవై తొమ్మిదవ అధ్యాయము ॥ 29 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 261; మొత్తము సంఖ్య : 3183 + 261 = 3444 ఓవీలు)

◆ ◆ ◆

దత్తాత్రేయో దయాపూర్ణో దత్తో దత్తక ధర్మకృత్ ।
దత్తాభయో దత్తధైర్యో దత్తారామో దరార్దనః ॥
శ్రీవాసుదేవానంద సరస్వతీ విరచితం దకారాది దత్తసహస్ర నామ స్తోత్రం)

★ ది గం బ రా ది గం బ రా శ్రీ పా ద వ ల్ల భ ది గం బ రా ★

శ్రీ గురు చరిత్ర

ముప్పదియవ అధ్యాయము

శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి మహిమా ప్రాభవమును గూర్చి సిద్ధముని, నామధారకునితో వివరించుట - మాహూర్‌గఢ్‌లోగల గోపీనాథునకు దత్తకృపతో ఒక పుత్రుడు కలుగుట - వివాహానంతరము అతడు రోగగ్రస్తుడగుట - పతివ్రతయగు అతని భార్య తన భర్తకు శుశ్రూష చేయుట - భర్తను బ్రతికించుకొనుటకై ఆమె గాణగాపురమునకు తీసికొనివెళ్ళుట - అచటికి చేరిన వెంటనే అతడు మరణించుట - భర్త మృతిపట్ల ఆమె శోకించుట - అంతలో ఒక సాధువు విచ్చేసి ఆమెను ఓదార్చి, తత్త్వోపదేశమును చేయుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యోత్తముడగు నామధారకుడు సిద్ధమునీంద్రునకు సభక్తికముగా చేతులు జోడించి, కైమోడ్పులు అర్పించెను. **అనంతరము వినయభావముతో అంజలి ఘటించి నతమస్తకుడై ఇట్లు విన్నవించెను** - "సిద్ధమునీశ్వరా! మీకు జయమగుగాక! అజ్ఞానమనే గాఢాంధకారమును నశింపచేసి నన్ను భవసాగరమునుండి తరింపచేసిన జ్యోతిస్స్వరూపులు మీరే. గురునాథా! అవిద్య అనే మహామాయా సముద్రములో మునిగి కొట్టుమిట్టాడుచున్న నన్ను, మీ కృప యనెడు నౌకలో కూర్చుండజేసి తరింపచేసితిరి. స్వామీ! ఏ మార్గమువలన సత్యమైన పరమార్థము లభించునో, అట్టి అచ్చమైన మార్గమును తమరే చూపించితిరి. మహానుభావా! ఈ విశ్వమును పరిపాలించే గురునాథులు మీరే. మీ అనుగ్రహమువలన నేను పరమార్థమును గ్రహింపగలిగితిని. గురుదేవా! గురుచరిత్ర యనే సుధారసమును నాచేత మిగుల ప్రేమతో త్రాగించుచుంటిరి. కాని, నాకు తృప్తి కలుగుటలేదు. నాలోని శ్రవణ తృష్ణ మరింత మిక్కుటముగా పెరుగుచుండెను. మీరు చేసిన ఈ మహోపకారమునకు తరతరములుగా సేవించినప్పటికినీ మీ ఋణము తీరదుగాక తీరదు. సిద్ధమునీ! గురువుయొక్క నిజస్వరూపజ్ఞానమును తామే నాకు దర్శింపచేయించితిరి. వారి స్వస్వరూపమును నా కెరుకపరచి నన్ను కృతార్థుని చేసితిరి. అట్టి మీ ఋణమును నేనెన్నటికినీ తీర్చజాలను. శ్రీగురుమూర్తి ఒక చండాలుడు, ఒక పతితుడు అగు వ్యక్తిని పవిత్రునిగా మార్చి, అతనిచే చతుర్వేదములను అనర్గళముగా చెప్పించెను. అంతేకాదు, త్రివిక్రమభారతీ మహామునీశ్వరునకు

★ ద త్త గు రో ద త్త గు రో ద త్తా త్రే య అ వ ధూ త గు రో ★

చక్కని జ్ఞానబోధను చేసెను. మహాత్మ! ఈ సృష్టిలో అభినవమైన గురుమహిమను వెల్లడించే అనంతరకథను సవివరముగా తాము సెలవీయగలరని" నామధారకుడు ప్రార్థించెను. (1-8)

ఈవిధముగా శిష్యశ్రేష్ఠుడగు నామధారకుని వినయపూర్వకమైన మాటలను విని మిగుల సంతసించి అత్యంత ప్రీతుడైన సిద్ధమునీంద్రుడు ఒక్కసారిగా లేచి తనలో శిష్యునియెడల అపారమైన ప్రేమభావము పొంగిపొరలుచుండగా రెండు చేతులను చాచి, అతనికి తన దివ్యమైన ఆలింగనమును ప్రసాదించెను. పిమ్మట చక్కగా ఆశ్వాసింపచేసెను. తద్వారా, ఆ శిష్యుడు గొప్ప ఆశ్వాసితుడై మిగుల ఊరట చెందెను. "శిష్యోత్తమా! నామధారకా! నీ మనోరథములన్నియు ఈడేరినవి. అలభ్యమైన గురుకృప నీకు లభించినది. నీవు ధన్యుడవు. శ్రీగురుచరణాబ్జములకై పరితపించే నీ వాక్కు ధన్యమైనది. సకల అభీష్టములను పొంది భయంకరమైన ఈ భవసాగరమునుండి సులభముగా నీవు తరించిపోగలవు" అని తన శిష్యుని చక్కగా ఆశ్వాసింపచేసెను. "నాయనా! అనంతర వృత్తాంతమును గూర్చి నీవు నన్ను ప్రశ్నించితివి. ఈ రోజు ఎందులకో గాని నాలో మిగుల సంతసము ఉప్పొంగిపోవుచున్నది. అసంఖ్యాకమైన, అతులితప్రభావాన్వితములైన శ్రీగురుమహిమలను వివరించుట కడు కష్టదాయకము. వారిని గూర్చిన ఒక్కొక్క కథను, వారి మహిమను గూర్చిన ఒక్కొక్క సంఘటనను వివరించినచో, ఒక గొప్ప గ్రంథమే కాగలదు. ఒక్కొక్క గురులీలను పూర్తిగా వర్ణించుటకు ఎంతవారికిని శక్యము కాదు. కుమారా! నీ కొరకు సంగ్రహముగా నా శక్తికొలదిగా, అనంతరకథను చెప్పుచుంటిని. సమాహితమనస్కుడవై వినుము" అని సిద్ధముని నామధారకునితో అనంతరకథను ఇట్లు వివరించుచుండెను. త్రిమూర్త్యాత్మక అవతారమైన శ్రీ నృసింహసరస్వతి గారు **'దైవం మానుష రూపేణ'** అన్నట్లుగా మానవరూపములో అవతరించిరి. ఆయన మహిమ అపారమైనది. దానిని వివరించి చెప్పుట కష్టసాధ్యము. అయితే శ్రీనృసింహసరస్వతి గురుదేవులు గాణగాపురములో నివసించియుండుటవలన వారి మహిమాప్రభావముచేత గాణగాపురముయొక్క ప్రఖ్యాతి దశదిశల పరివ్యాప్తము చెందెను. ఆ త్రిమూర్త్యాత్మకుని గూర్చిన మహిమా ప్రభావమును గూర్చి చెప్పుటకు, వివరించుటకు నాకున్న శక్తి ఏపాటిది. మానవరూపమును ధరించి ఈ భూమిమీద అవతరించి, ఆయన ఒక వినూత్నమైన, విలక్షణమైన, మహిమాన్వితమైన చరిత్రను సృష్టించిరి. శ్రీగురుని మహిమాప్రాభవమును విన్నటువంటి ఎందరో భక్తులు దూరదేశములనుండి వారి దర్శనార్థమై గాణగాపురమునకు గంగాప్రవాహము వలె వచ్చుచుండిరి. భక్తజనము అచటికి ఒక యాత్రగా వచ్చెడివారు. ఏకాగ్రచిత్తమును కలిగి అత్యంత భక్తిభావముతో శ్రీగురుదేవుల చరణకమలముల సందర్శనమాత్రముచేతనే వారు సమస్త మనోభీష్టములను పొందుచుండిరి. నాయనా! నేను ఏమని చెప్పుదును. వారిని దర్శించిన, సేవించిన భక్తులలో గల దరిద్రులు

ధనవంతులగుచుండిరి. వంధ్యలు వెంటనే సంతానవంతులైరి. దీనులు శ్రీమంతులైరి. కుష్ఠరోగముతో పీడించబడేవారు దివ్యదేహమును ధరించిరి. గ్రుడ్డివారు చక్కని నేత్రవంతులైరి. చెవిటివారికి తగిన వినికిడి శక్తి లభించెను. శ్రీగురుచరణదర్శనమాత్రముచేత ఎందరికో అపస్మారాది సమస్త దుర్ఘటమైన వ్యాధులన్నియును తృటిలో నశించిపోవుచుండెను. పరుసవేదిని తాకిన వెంటనే ఇనుము బంగారముగ మారినదని చెప్పుటలో గల విశేషమేమున్నది. వత్సా! శ్రీగురుకృపను పొందిన భక్తజనులందరికందరూ తాము కోరుకొనిన సమస్త కోరికలను క్షణములో పొంది, మిగుల ఆనందమును అనుభవించుచుండిరి.

అనంతరము శ్రీనృసింహసరస్వతి యతీంద్రులకు జేజేలు పలుకుచుండిరి. ఇట్టి అత్యంత మహిమాన్వితమైన శ్రీగురుకృపా ప్రభావమును ఎరుగుట ఎవరితరమగును. పరుసవేది స్పర్శచే లోహమునకు సువర్ణత్వము అబ్బినట్లుగా, భక్తజనులకు శ్రీవారి కృపచే సమస్త అభీష్టములు నెరవేరుచుండెను. శ్రీగురునాథుని చరిత్రయందలి ఒకానొక అద్భుతలీలను వివరించి చెప్పుదును. నామధారకా! సావధానచిత్తుడవై వినుము”

అని సిద్ధముని ఇట్లు చెప్పనారంభించెను - (9-21)

ఉత్తరదేశమునందు ‘మాహుర్‌గఢ్’ అను పేరుగల నగరమునందు ‘గోపీనాథుడ’నే ఒక మహాధనవంతుడైన విప్రుడు నివసించుచుండెను. ఆ దంపతులకు అనేకమంది పుత్రులు కలుగుచు మరణించుచుండిరి. అందులకు వారు మిగుల దుఃఖించుచుండిరి. అంతట తనలో తాను విచారించుకొని ఆ బ్రాహ్మణుడు తన భార్యతో గూడి శ్రీదత్తాత్రేయ స్వామిని చక్కగా ఆరాధింపసాగెను. తత్ఫలితముగా వారికి మరొక పుత్రుడు కలిగెను. అతనికి ‘దత్తుడు’ అని నామకరణము చేసిరి. వారు మిగుల ధనవంతులగుటచే మిక్కిలి గారాబముతో తమ కుమారుని పోషించుచుండిరి. ఆ బాలునకు ఐదు సంవత్సరముల ప్రాయముననే ఉపనయనమును చేసిరి. అనంతరము పన్నెండు సంవత్సరముల వయస్సు పూర్తియైన వెంటనే అందమైన ఒక కన్యకను గాలించి, నిశ్చయించి అత్యంత వైభవోపేతముగా అతనికి వివాహమును కూడా చేసిరి. మన్మథుని ప్రక్కన రతీదేవివలె ఆ యువ దంపతులు కనువిందు చేయుచుండిరి. అత్తమామలు తమ కోడలిని మిక్కిలి ప్రేమతో చూచుచుండిరి. తమ కుమారుడైన దత్తునికి పదహారేళ్ల ప్రాయము నిండెను. ఇద్దరు సమవయస్కులగుటచే సమానమైన మిగుల సౌందర్యమును కలిగియుండుటచే ఆ నూతన దంపతులు పరస్పరము కడు ప్రేమతో ఉండెడివారు. సమాన వయస్సును, సరిసమానమైన అందచందములను కలిగిన తమ కుమారుని, కోడలిని చూచి ఆ తల్లిదండ్రులు హర్షోల్లాసములను పొందుచుండిరి. ఆ దంపతులు ప్రాణప్రియముగా తమ దాంపత్యజీవనమును గడుపుచుండిరి. వారుభయులు ఒకరిని విడిచి మరొకరు ఒక్క క్షణకాలము కూడా దూరముగ ఉండుటకు ఎంతమాత్రము సహించువారు కారు. అన్యోన్య

ప్రేమభావముతో ఆ దంపతులు కలిసిమెలిసి ఉంటుండగా కొంతకాలము గడచెను. ఇంతలో గోపీనాథుని కుమారుడైన దత్తునకు దురదృష్టవశాత్తుగా దుర్ఘటమైన ఒక వ్యాధి సంప్రాప్తమయ్యెను. ఎందరు వైద్యులను సంప్రదించినప్పటికినీ, ఎన్ని మందులు వాడినప్పటికినీ అతనికి ఆరోగ్యము కుదుటపడదయ్యెను. దినదినమునకు లోలోపల ఆ వ్యాధి పెరుగుచుండెను. అతనికి అన్నముమీద అరుచి ఏర్పడెను. అన్నమే హితవరి కాకుండా పోవుటచే అతడు నిరాహారియై ఉండసాగెను. అతనిపై మిక్కుటమైన ప్రేమ కలిగిన, పరమపతివ్రతయైన అతని భార్య కూడా తాను అన్నమును తినుట మానివేసెను. భర్త ఔషధసేవనము చేయుటచే తాను కూడా ఔషధసేవనము చేయుచూ, నిరంతరము భర్తకు తోడునీడగా నిలచి, అఖండమైన సేవ చేయుచు, కాలము గడుపుచుండెను.(22-32)

ఇట్లు మూడు సంవత్సరములు గడచినవి. ఆ పతివ్రతా స్త్రీ తన భర్తతోపాటు అతని కష్టమును తాను కూడా అనుభవించుచుండెను. తాను కూడా దినదినమునకు కృశించుచు కేవలము భర్తయొక్క పాదోదకమునే త్రాగి జీవించుచుండెను. వ్యాధివలన భర్త దేహము క్షీణించుచుండెను. అతనితోపాటుగా ఆ అమ్మాయి కూడా క్షీణించిపోయెను. శరీరమునందలి వ్యాధి ప్రకోపించి అతని దేహము దుర్గంధభూయిష్టమయ్యెను. వైద్యులు కూడా అతని వద్దకు వచ్చుటను మానివేసిరి. అతని దగ్గరకు చేరుటకు అందరు భయపడుచుండిరి. కాని, ఆ పతివ్రతా స్త్రీ మాత్రము అతడిని ఒక్కక్షణమైనను వదలిపెట్టక నిరంతరము సేవించుచుండెను. తన భర్త ఏది భుజించునో తాను కూడా అదియే భుజించును. బంధువులు, అత్తమామలు ఎంత చెప్పినను వినకుండా భర్తనే తన ప్రాణముగా భావించి సమస్త ఆభరణములనుత్యజించివైచెను. నిరంతరము కంటికి రెప్పవలె భర్త శుశ్రూషను చేయుచుండెను. ఆ ఉభయుల తల్లిదండ్రులు ధనవంతులు, శ్రీమంతులు అయినందున బహు ద్రవ్యమును వెచ్చించి అనేకానేక జపానుష్ఠానములను, గొప్ప గొప్ప హోమహవనాదులను, అపరిమితమైన బ్రాహ్మణ సంతర్పణలను జరిపించిరి. కాని, ఆశించిన ప్రయోజనము శూన్యమే యగుచుండెను. దూరదేశములనుండి రకరకములైన సుప్రసిద్ధులగు వైద్యులు వచ్చి దివ్యరసములతో కూడిన అమూల్యమైన ఔషధములను ఇచ్చిరి. ఏమి చేసినను, ఎంతటి గొప్ప ఔషధములను ప్రయోగించినను అతని వ్యాధి ఉపశమించుటలేదు. అదొక మహావ్యాధిగా మారి దినదినమునకు వృద్ధిపొందుచుండెను. వైద్యులను అడుగగా మేమేమియూ చెప్పజాలము. ఇతనికి సంక్రమించిన వ్యాధిని గూర్చిన నివృత్తి కేవలము ఈశ్వరాయత్తమై యున్నదని వారు పలుకుచుండిరి. జ్యోతిష్కులను, మహాజ్ఞానులను ప్రశ్నింపగా అతని జాతకమును చూచి వారునూ ఇది దుర్ఘటమైన వ్యాధి అనియు, ఇందుకు మానవ ప్రయత్నము ఫలించుట కష్టమనియు చెప్పుచుండిరి. వారి మాటలను వినిన ఆ తలిదండ్రులు తీవ్రమైన బాధకు గురియై విలపించుచుండిరి. తమ కులదేవతకు పూజలు చేసిరి. **ఇంతలో అతని వ్యాధికి**

చికిత్స చేయుచున్న వైద్యులు ఇట్లు పలికిరి– "అతని పరిస్థితి ఏమాత్రమూ బాగుండుటలేదు. ఇక మీ కుమారుని ఈశ్వరుడే కాపాడవలెను. మానవప్రయత్నములు ఫలించుట కష్టతరమే" అని చెప్పిరి. వారి మాటలను వినిన తలిదండ్రులకు దుఃఖము కట్టలు త్రెంచుకుని రాగా **ఇట్లు తీవ్రముగా విలపించసాగిరి–** "హా! దైవమా! గురురాజా! జగన్నాథా! దత్తాత్రేయా! గురుమూర్తీ! జయము. జయము. నిన్ను అనవరతము అత్యంత ప్రీతితో ఆరాధించుటవలన మాకు ఈ పుత్రుడు కలిగెను. అందుకు మేమెంతయో సంతసించితిమి. కాని, మేము పాపులము. అందుకే మా వద్ద ఆ నిధి నిలిచియుండుటలేదు. దత్తాత్రేయస్వామీ! మా వంశమునకు ఒకే ఒక పుత్రుడు కలిగెను. ఒకవేళ అతడిని రక్షించలేకపోయినచో, అతనితోపాటే మేము కూడా మరణించెదము. కలిగిన ఒక్కగానొక్క కుమారుడు జీవించనిచో మా జన్మ ఎందులకు? ప్రభూ! వృద్ధాప్యములో ఉన్న మా జన్మ వ్యర్థమైనది. మేమునూ అతనితోపాటే మరణించెదము. స్వామీ! రక్షింపుము" అని స్వామిని ప్రార్థించుచు అనేకవిధములుగా తన జననీజనకులు దుఃఖించుచుండగా వారిని ఆలింగనము చేసికొని, **దత్తుడను వారి కుమారుడు ఇట్లు చెప్పుచుండెను–** "తలిదండ్రులారా! నా సుఖమునకు తెర దించబడినది. ఇప్పటికే మీకెంతగానో ఋణపడియున్న నేను ఇంకనూ మీ నుండి ఏమి స్వీకరింపగలను. మీ ఋణానుబంధము నుండి నేనెట్లు తప్పించుకొనగలను. నాకును, మీకునూ ఎంత ఋణానుబంధముండెనో అదంతయూ తీరిపోయెను" అని పలికిన కుమారుని మాటలు వినిన ఆ తలిదండ్రులు పొంగిపొరలిపోయెడి తీవ్ర దుఃఖముతో కుమారుడిపై పడి భోరుమని విలపించుచూ మూర్ఛిల్లిరి. "నాయనా! కుమారా! నీవు మమ్ములను వృద్ధాప్యదశలో కాపాడెదవని నిశ్చయముగ భావించుచుంటిమి. కాని, మా ఆశలన్నియు అడియాసలాయెను. మేల్కొన్నమీదట వారిట్లు పలుకుచుండిరి– ముసలివాండ్రైన మమ్ములను దుఃఖసాగరములో ముంచి నీవు ఎచటకు వెళ్లెదవు. అది నీకు ధర్మమెట్లగును అని శోకసాగరములో మునిగి విచారించుచూ, **మిగుల ఆక్రందించుచున్న వారితో అతడిట్లనెను –** "తలిదండ్రులారా! మన చేతిలో ఏమి కలదు. అంతయూ ఈశ్వరాధీనమై యుండును కదా! దానిముందు మానవుల యత్నములు ఏపాటివి? తలిదండ్రుల ఋణమును కుమారుడు తీర్చుకొనుట ధర్మమే. అప్పుడే అతడు కొడుకు అని అనిపించుకొనును. లేనియెడల, ఆ కొడుకు ఒక బండరాయితో సమానమేయగును. అమ్మా! నన్ను పాలిచ్చి పెంచి పోషించితివి. కనీసము ఒక్క ఘడియ కాలము సేవించిన స్తన్యపానమునకు బదులుగా నేను ఋణము తీర్చుకొను దశలో లేను కదా! ఈ భవసాగరమున ఇంకెన్ని జన్మలెత్తిననూ నేను తరించగలిగే ఆశ శూన్యమే. మీ కడుపున పుట్టి మీకెంతయో కష్టమును కల్పించితిని. ఒక కుమారునిగా మీ కెంతమాత్రమును సుఖమును కల్పించలేని మహాపాపిని. తలిదండ్రులను కష్టపెట్టుటకే మీ గర్భవాసమున జన్మించితినేమో. నా జన్మ వ్యర్థమైనదే. నా కొరకు మీరు దుఃఖించకుండా మీ పరమార్థమును

మీరు చూచుకొనుడు. జరగవలసినదానిని బ్రహ్మాదులు కూడా తప్పించలేరు కదా! బ్రహ్మాదులకు సైతము చేసికొన్న కర్మ అనుభవించక తప్పదు కదా!" అని తన జననీజనకులతో ఈవిధముగ చెప్పి **తన భార్యను చూచి ఇట్లు చెప్పుచుండెను.** "ప్రాణేశ్వరీ! వినుము. నా కొరకు నీవెంతయో కష్టమును అనుభవించితివి. నీ కష్టమంతయు వ్యర్థమైపోయెను. నీకు, నాకు మధ్య గల అనుబంధ కాలము తీరిపోయెను. నేను నీకు జన్మాంతర శత్రువును కాబోలు. అందుకే నిన్నిప్పుడు కష్టపెట్టుచుంటిని. బహుశః జన్మాంతర శత్రుత్వము వల్లనే ఇట్టి జన్మజన్మాంతర కష్టమును నీవు అనుభవించుచుంటివేమో! అని నాకు తోచుచున్నది. మనమధ్యన ఎంతటి ఋణముండెనో, అదంతయూ తీరిపోయినట్లున్నది. నా అనంతరము నీవు మా ఇంటనే ఉండదలచినచో, నిన్ను మా తలిదండ్రులు పోషించెదరు. కాని, అది నీకు కష్టమనిపించిన యెడల, నీవు నీ పుట్టినింటికి వెళ్ళి అచట నివసింపవచ్చును. అపురూపమైన నీ సౌందర్యము దురదృష్టవంతుడినైన నాకు లభించలేదు. అట్టి నా దేహమును స్పృశించుటవలన నీ సౌభాగ్యము నిలుచుటలేదు" అని చెప్పిన భర్తమాటలు వినిన వెంటనే, ఆమె మిగుల వ్యథను చెంది మూర్ఛిల్లినది. అనంతరము స్పృహ కలిగి అతని పాదద్వంద్వముమీద తన తలను పెట్టి హృదయవిదారకముగా రోదించుచుండెను. "స్వామీ! ప్రాణేశ్వరా! మీరు అటులనవద్దు. నన్ను వదిలేయవద్దు. ఈ జన్మలో మీరు తప్ప నాకు వేరే గతి లేదు. మీ దేహము ఎచట ఉండునో దానితోపాటే నేను కూడా ఉండగలను. ఈ విషయమునందు మీ మనసులో ఎట్టి సందేహము వలదు. నేనెప్పుడూ మీ తోడనే వుండెదను" అని విలపించుచూ పలికిన కోడలి మాటలను విని తలిదండ్రులు నేలమీద పడిపోయి గొప్పగా రోదింపసాగిరి. అప్పుడు ఆ పతివ్రత మామగారిని లేపి, **అత్తగారిని చూచి ఇట్లు చెప్పుచుండెను**– "మీరు చింతింపవలదు. తప్పక నా భర్త రక్షింపబడును. మా ఉభయులను ఆ ఈశ్వరుడు తప్పక రక్షింపగలడు. మనలనందరినీ ఆ చంద్రమౌళీశ్వరుడు తప్పక రక్షించగలడు. అయితే, స్థలమార్పిడికోసమై మమ్ములను ఎచటికైనను పంపవలసినది. నా భర్త తప్పక ఆరోగ్యవంతుడగును" అని పదే పదే ప్రార్థించినది. ఇంకనూ ఆమె ఇట్లనుచుండెను. "జనులందరు గాణగాపురములో ఉన్న శ్రీగురుమూర్తియగు నృసింహ సరస్వతి స్వామి వారి గురించి ఎంతయో గొప్పగా చెప్పుచుండిరి. వారి దర్శనమాత్రమున నా పతికి తప్పక ఆరోగ్యము సిద్ధింపగలదు అని నా నమ్మిక. మమ్ములను దయతో అచటికి పంపవలెను. వెంటనే మాకు అనుజ్ఞనిచ్చినచో మేము గాణగాపురమునకు వెళ్ళెదము" అని పలికి తమ అత్తమామలకు, తలిదండ్రులకు మిక్కిలి వినయముతో నమస్కరించినది. ఇట్టి ప్రస్తావన వారందరికి బాగుగా నచ్చినది. తన తలిదండ్రులు, అత్తమామలు మిగిలిన వారందరివద్ద అనుమతిని గైకొని ఆ పతివ్రతా స్త్రీ తన భర్తను వెంట తీసుకొని ఒక పల్లకిలో అతనిని పరుండజేసి గాణగాపురము వైపు బయలుదేరుచూ, **అత్తమామలతో ఇట్లు విన్నవించినది**– "మీరందరూ మనసును

స్థిరపరచుకొని సుఖముగా ఉండుడు. నా భర్త నాకు ప్రాణముతో సమానము. ఆయనను తప్పక మన కులదేవత రక్షించును" అని పలికి అత్తమామలకు ప్రీతితో నమస్కరించినపుడు వారు మిగుల హర్షముతో, "అమ్మాయీ! నీ సౌభాగ్యము స్థిరముగా ఉండుగాక!" అని **మనస్ఫూర్తిగా ఆశీర్వదించిరి.** "అమ్మా! నీ అదృష్టమువల్లనే మా కుమారుడు రక్షింపబడగలడు" అని వారందరు ఆశీర్వదించి వారికి వీడ్కోలు పలికిరి. ఈవిధముగ వ్యాధిగ్రస్తుడైన భర్తతో కలిసి ఆ పతివ్రతావనిత గాణగాపురమువైపునకు బయలుదేరెను. భర్తతో పాటుగా ప్రయాణించుచూ ఆమె గాణగాపురమునకు సమీపమునకు చేరుకొనుచుండగా అతనికి సంక్రమించిన రోగము క్రమముగా పెరిగిపోయి త్రిదోషములు అనగా కఫము, వాతము, పిత్తము అను మూడు దోషములు ప్రకోపించెను. అయినను ధైర్యము వహించి అతికష్టముమీద ఆమె తన భర్తతోపాటుగా గ్రామములోనికి ప్రవేశించి ఒకచోట పల్లకిని దింపి ఆ అమ్మాయి శ్రీగురునియొక్క దర్శనము కోసము గ్రామజనులను విచారించుచుండెను. అంతట శ్రీగురుమూర్తి అనుష్ఠానమునకై సంగమమునకు వెళ్ళినారని అచటి గ్రామప్రజలు ఆమెతో చెప్పిరి. (33-77)

అప్పుడా వనిత వెంటనే సంగమస్థలములో గల గురుమూర్తి వద్దకు తన భర్తను తీసికొనిపోవలయునని నిశ్చయించుకొనెను. ఇంతలో భర్త దగ్గరకు వచ్చి అతనిని చూడగా, అంత్యకాలము సంప్రాప్తమైనందున తత్క్షణమే అతని ప్రాణములు అనంతవాయువులో కలిసిపోయినవి. ఒక్క క్షణములో జరిగిన దుర్ఘటనకు ఆమె విస్తుపోయి మిగుల దుఃఖించుచూ నిలువలేక నేలమీద పడి దొర్లుచూ బిగ్గరగా ఆక్రోశింపసాగెను. కత్తితో పొడుచుకొని చనిపోవుటకు ప్రయత్నించెను. కాని, ఆ చుట్టుప్రక్కల గల గ్రామవాసులు ఆ అమ్మాయిని నివారించిరి. ఆమె తన తలను నేలకేసి కొట్టుకొనుచూ ఏడ్చుచుండెను. ఒక బండరాయిని తీసుకొని, వక్షస్థలమును బాదుకొనుచు దుఃఖించుచుండెను. కేశపాశము విడివడిపోయి రెండు చేతులు పైకెత్తి భర్త మరణమునకు **మిగుల ఆక్రోశించుచు బిగ్గరగా ఇట్లు రోదింపసాగెను-** "అయ్యో! దైవమా! ఎట్టి దుర్గతి దాపురించెను. ఏమియూ తెలియని ఒక గోవువంటి అమాయకురాలినైన నన్ను ఇట్లేందుకు హింసించుచుంటివి. ఇట్లు నన్ను బాధించుట నీకు ధర్మమేనా? ఓ నృసింహసరస్వతీ! నీవు నా భర్తయొక్క ప్రాణములు రక్షించెదవని, అతడి అనారోగ్యమును చక్కబరచెదవని గట్టి నమ్మకముతో ఎంతయో ఆశపడి, శ్రమకోర్చి నీ నివాసమునకు తీసికొని వచ్చితిని. నా ఆశ దురాశగా మారి వ్యర్థమాయెను గదా! స్వామీ! దేవుని పూజించుటకై ఒక వ్యక్తి దేవాలయమునకు వెళ్ళగా ఆ దేవాలయమే కూలి అతనిమీద పడి ఆఘాతము కలిగించినట్లుగా, నా చెవులతో నేను విన్న సామెత నా విషయములో ఇపుడు సత్యమయ్యెను కదా! ఒక బాటసారి ఎండలో నడచి, వేసవితాపముతో బాధపడుచూ శ్రమదీర్చుకొనుటకై ఒక వృక్షము క్రిందకు చేరి కూర్చొనియుండగా ఆ వృక్షమే అతనిమీద పడి వాడు చచ్చెనన్న సామెత నా విషయములో యథార్థమయ్యెను

కదా! ఎవరో ఒకరు మిక్కిలి దాహముతో పీడింపబడుచు నీరు త్రావి సుఖించు నిమిత్తమున ప్రక్కన కనిపించిన గంగలోకి దిగి కాలుపెట్టిన వెంటనే ఆ తీరముననే నీటిలో మునిగియున్న మొసలి నోరు తెరచి వానిని మ్రింగినట్లుగా నాకు ఈ దుర్గతి దాపురించినది. పెద్దపులిని చూసి తనను చంపునని భయపడి ఒక గోవు తప్పించుకొని పారిపోవుచూ ఆశ్రయము కోసమై తన ప్రాణరక్షణ కొరకు ఒక ఇంటిముందుకు చేరగానే ఆ ఇంటి యజమాని యగు మ్లేచ్ఛుడు దానిని వధించివేసినట్లుగా, నాకు దుర్ఘటమైన దుస్థితి దాపురించినది. నేను పరమపాపిని. మిగుల దురదృష్టవంతురాలను. ఈనాడు ధైర్యముతో నా తలిదండ్రులను వదలిపెట్టి అత్తమామలకు ధైర్యమును చెప్పి నా భర్తను తీసుకొని పరదేశమునకు వచ్చి, ఇచట నా భర్త ప్రాణములను బలిగొంటిని. ఇక ఏమి చేయుదును. నీవే రక్షకుడవని భావించి నీ నివాసమునకు వచ్చిన నన్ను నీవే భక్షించితివి కదా! ప్రభూ!" అని అనేకవిధములుగా ఆమె విలపించుచున్నప్పుడు చుట్టుప్రక్కల గల జనులందరు గుమిగూడి ఆమె దుఃఖమును ఉపశమింపచేయుటకు అనేకవిధములుగా ఓదార్పు మాటలను, సానుభూతి వాక్యములను పలుకసాగిరి. కొందరు ముత్తైదువ స్త్రీలు ఆమెను వారించుచు, ఓదార్చుచు, "అమ్మాయి! కొంచెము నిదానముగా విచారించుము. జరగవలసినది జరిగియే తీరును. దానినుండి ఎవ్వరునూ తప్పించుకొనలేరు. నీవెందులకు దుఃఖించుచుంటివి" అని ఆ నగరములోని స్త్రీలు అనుచుండగా ఆమె దుఃఖము మరింతగా పెరిగిపోయి తనయొక్క జన్మకర్మలనన్నింటిని పదేపదే గుర్తుకు తెచ్చుకొని దుఃఖింపసాగెను. (78-89)

"అమ్మలారా! అక్కలారా! వినుడు. శ్రీగురుమూర్తి సన్నిధానమునందు తప్పక రక్షింపబడగలడు అనే ఆశతో, దృఢమైన నమ్మకముతో నేను నా భర్తను ఇచటికి తీసుకొనివచ్చితిని. కాని, దైవయోగమో, నా దురదృష్టమో కానీ, నా భర్త మరణించెను. నా ఆశ అంతరించెను. నా నమ్మకము మంటకలిసెను. ఇప్పుడు నేనేమి చేయుదును. ఎట్లు జీవించుదును. ఇపుడు నేను ఎవరి శరణుగోరుదును. నా ప్రాణేశ్వరుని వదలి నేనెట్లు జీవింపగలను. నా ప్రాణములను రక్షించునది ఎవరు? నా భర్తను ఎవరు బ్రతికించెదరు. అయ్యో! హతవిధీ! నేనేమి చేయుదును. బాల్యము నుండి గౌరీదేవిని భక్తిగా పూజించితిని. శంకరుని ప్రేమతో ఆరాధించితిని. వివాహము నాటి నుండి మంగళగౌరిని సేవించితిని. నాకు స్థిరమైన సౌభాగ్యము లభించునను ఆశతో భవానీమాతను అర్చించితిని. పెద్దలు చెప్పిన వ్రతములన్నింటిని చక్కగా ఆచరించితిని. ఎందరో సువాసినులు అనేక వివిధములైన వ్రతములను నాకు చెప్పియుండిరి. వారు ఏయే వ్రతములను ఆచరించుమని చెప్పిరో, అట్టి పూజలను, వ్రతములను ఒక్కటికూడా మొక్కపోకుండగా అఖండముగ ఆచరించితిని. నేను చేసిన వ్రతములు, పూజలు అన్నియునూ వ్యర్థములెట్లయ్యెను. గౌరీమాత యెడల నేను ఏమి అపరాధమొనర్చితిని. ఆమెయే సర్వస్వమని భావించి ఆరాధించితిని. ఆ గౌరీమాత నాపైన

కోపించినది కాబోలు! ఇప్పుడు ఆమెకు నామీద ఇంతటి కోపము యేల వచ్చినదో అంతుబట్టదు. నా పసుపు కుంకుమలు అపహరించబడినవి. నా మంగళసూత్రములు దొంగిలించబడినవి. నేనేమి చేయుదును. అనేకమంది సువాసినులను అమ్మవారి స్వరూపముగా భావించి గాజులు, రవికలు దానమొనర్చితిని. అయ్యో! ఆ పుణ్యమెచటికి పోయి యుండవచ్చును. అమ్మలారా! అక్కలారా! వినుడు. నేను సంపాదించిన పుణ్యరాశి ఎక్కడికి పోయినట్లు. వారి ఆశీర్వచనములు, వారి అనుగ్రహము వ్యర్థమైపోయెను కదా! మిక్కిలి శ్రద్ధాభక్తులతో గౌరీరమణుని నిరంతరము పూజించితిని. కాని, ఆయన నన్ను మరింత నిరాశకు గురిచేసెను. నా ప్రాణేశ్వరుడు లోకులవంటి వాడు కాడు. నా భర్త నాకు ప్రాణసమానుడు. నేనిపుడు ఎట్లు జీవించగలను" అని అనేకవిధములుగా ఆ పతివ్రతా స్త్రీ దుఃఖించుచుండెను. భర్త ముఖమును చూచి ఆమె మరింత దీనముగా రోదింపసాగెను. శవమును కౌగిలించుకొని తాము గడిపిన వెనుకటి విషయములను, ఆనాటి స్మృతులను, అప్పటి ప్రేమను, స్మరించుకొనుచు, గుర్తుకు తెచ్చుకొనుచు హృదయవిదారకముగా రోదించుచుండెను. "హా! ప్రాణేశ్వరా! నన్ను వదలి ఎక్కడకు పోయితివి. నా చేతిని ఎట్లు వదలిపెట్టితివి. నీకు నాపై విసుగు పుట్టినదా? అందుకే నన్ను ఉపేక్షించితివా? నేనెంతటి దురదృష్టవంతురాలిని. తటాక తీరమునగల మట్టిపాత్ర దాని తీరమునకే తగిలి ఛిన్నాభిన్నమైనట్లుగా నీ ఆయువు తీరిపోయి మరణించితివి కదా! నా తలిదండ్రులను వదలిపెట్టి నిన్ను పరదేశమునకు తెచ్చితిని. నీ తలిదండ్రులకు నిన్ను దూరము చేసి మరణముకొరకై ఇంతటి దూరదేశమునకు తెచ్చితిని కదా! పూర్వము దశరథమహారాజు శ్రవణుడు అను మునికుమారుని చంపగా ఆ వార్త వినిన శ్రవణుని ముదుసలి తలిదండ్రులు వెంటనే ప్రాణత్యాగము ఒనర్చిన విధముగ నీ మరణవార్తను వినిన వెంటనే నీ తలిదండ్రులు సైతము మరణింతురు కదా! నేనెంతటి మహాపాపినైతిని. పాపాత్మురాలినైన నా వలన మీయొక్కయు, మీ తలిదండ్రుల యొక్కయు ముగ్గురి మరణమునకు నేనే కారణమైతిని కదా! నేను మీకు శత్రువును. నిజముగా పతి ఘాతకిని, పాతకిని అని లోకులు నన్ను ఎంతగా నిందింతురో కదా! ప్రాణేశ్వరా! భర్తను బలవంతముగా పరదేశమునకు తెచ్చి అతని ప్రాణములను బలిగొన్న మహాపాపినని, చండాలురాలినని లోకులందరు నన్ను ఎంతగా దూషించెదరో కదా! ఇది సత్యము. నేను నీ భార్యను కాదు. కఠినమైన శస్త్రముతో నీ శరీరమును పొడిచి, నీ ప్రాణములను తీసిన నీ ప్రబల శత్రువును. నీ తలిదండ్రులు, నీ సోదరులందరు నీ వద్ద యుండి ఉన్నచో, అంతిమ సమయమున కనీసము ఒకసారైన నీ ముఖమును చూచియుండెడివారు కదా! అందుకు నేను విఘ్నము కలిగించితిని. వృద్ధులైన నా అత్తమామలు నీపై ఎంతయో ఆశలు పెట్టుకొనియుండిరి. వారి కోరిక నెరవేరలేదు. వారిని వదలిపెట్టి ఎచటకు వెళ్ళితివి స్వామీ! ఓ ప్రాణేశ్వరా! వారి కడుపున నీవొక్కడవే పుట్టితివి. మమ్ములను పోషించుటకు విసుగు పుట్టి మమ్ములను వదలి ఎచటికో

వెళ్ళిపోయితివా? ఇపుడు నేనెచటకు వెళ్లుదును. ఇక నన్నెవరు పోషించెదరు. హా! ప్రాణేశ్వరా! నాకు ఒక్కమాటనైనా చెప్పకుండా ఎక్కడికి వెళ్ళితివి. నీవే నా నాథుడవు. నా సర్వస్వము. నీవు నాపైన చూపిన మమకారమును నేనెట్లు మరచిపోవుదును. లోకులవలె కాక నీవు నన్నెంతయో ప్రేమగా చూచుకొనువాడవు. నేను వేరొక శయ్యమీద పడుకొనుట ఎరుగను. నీ ఎడమచేయి నాకు దిండువలె లేనిచో, నా మనసు ముక్కలు చెక్కలై పగిలిపోవును. ప్రాణేశ్వరా! ఇక నేనెట్లు బ్రతుకుదును. నీ గుణములు ఎన్నని గుర్తుకు తెచ్చుకొందును. కేవలము నీవు భర్తవే కాదు. నా ప్రాణసముడవు. అట్టి నీవు చివరకు నన్ను వదలిపెట్టితివి కదా! నేనెట్లు జీవింతును. ఎట్లు బ్రతుకుదును. ఇపుడు నేనెవరిని ఆశ్రయింతును. నన్నెవరు పోషింతురు. లోకమంతా బాల వితంతువని నన్ను తిరస్కరించెదరు కదా! ప్రాణనాథా! నాకు ఒక్క హితవైన మాటను కూడా చెప్పకుండా అమాంతముగ నీవు యెగిరిపోయితివి కదా! శిరమునగల కేశములను తీయించుకొని నేనిపుడు ఎచటికి వెళ్ళెదను. నీవు నన్ను అమితముగా ప్రేమించుచుండుటవలన నా తలిదండ్రులను నేనెప్పుడో విస్మరించితిని. నిత్యమూ నన్ను రమ్మని పిలిచినప్పటికినీ నేను మా తల్లివారింటికి ఒక్కనాడైననూ వెళ్లనేలేదు. ఓ ప్రాణనాథా! స్వామీ! దైన్యవృత్తితో ఇప్పుడు వారింటికి నేనెట్లు వెళ్లుదును. వారు ఒకవేళ నన్ను ఉపేక్షించినచో నేనెట్లు సహింతును. నీ ఆశ్రయము నాకున్నంతవరకు నేను అంతటా పవిత్రురాలినే కదా! అందరూ నన్ను ఆప్తమిత్రురాలిగా గౌరవించిరి కదా! అపవిత్రురాలనైన నన్ను ఇప్పుడందరూ నిందించెదరు. లేక, అత్తమామల వద్దకే వెళ్లుదు నన్నచో, నన్ను చూచిన తత్క్షణమే వారు తమ ప్రాణములను వదలిపెట్టెదరు. ఇది సత్యము, ప్రాణేశ్వరా! నీవు లేని ఇల్లు అరణ్యమైపోవును. నీ ఆరోగ్యరక్షణార్థమే నేను నిన్ను ఇచటికి తీసుకొని వచ్చితిని. కాని, ఇప్పుడు నిన్నిక్కడనే వదలి నేనెట్లు ఇంటికి వెళ్లగలను. నేను ఒక రాక్షసిని. మహాపాపిని. దురాత్మురాలిని. పతియొక్క ప్రాణఘాతకిని" అని అంటూ ఆ స్త్రీ అనేకవిధములుగా తన పూర్వపు జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొనుచు అపరిమితముగా దుఃఖించుచుండెను. ఇట్టి సమయమున అచటికి ఒక సాధువు ఏతెంచెను. రుద్రాక్షమాలను మెడలో ధరించి చేతిలో త్రిశూలమును పట్టుకొని, భస్మాంకితగాత్రుడై జటాధారిగా వెలుగొందుచున్న ఆ సాధువు నేరుగా వచ్చి ఈ పతివ్రతా స్త్రీకి ఎదురుగా నిలబడెను. (90-122) ఆ సాధువు ఈ పతివ్రతా స్త్రీని చూచి ఉపదేశాత్మకముగ ఇట్లు మాటలాడసాగెను-

"అమ్మా! నీవు ఎందులకిట్లు గట్టిగా రోదించుచుంటివి. ప్రారబ్ధమున ఏది రాసిపెట్టి యుండునో అటులనే జరిగితీరును. గతజన్మలో చేసిన కర్మఫలమును నీవు నిశ్చయముగా అనుభవించుచుంటివి. వ్యర్థముగ ఎందులకు దుఃఖించెదవు. బ్రహ్మలిఖితమును ఎవరు తప్పింపగలరు. ఎంత దుఃఖించినను ఏమి లాభము. నీవు ఎన్ని రోజులు ఏడ్చినను నీ పతి తిరిగి బ్రతికి వచ్చునా! అతని ప్రారబ్ధమున ఏమి వ్రాసిపెట్టి యున్నదో,

అటులనే జరుగును. మూఢత్వముతో దుఃఖించుచుంటివి. కాని, నీకు కూడా నిజము తెలియును. ఈ భూలోకమున ఏ ఒక్కరైనను స్థిరముగ ఉండగలరా? ఈ నేలమీద మరణించని వారు ఎవరో నాకు తెలియజెప్పుము. ఇచటికి వచ్చిన వారందరికినీ మరణము తప్పదని నీకు మాత్రము తెలియదా? తల్లీ! మూఢురాలవై ఎందులకిట్లు దుఃఖించెదవు. అమ్మా! నా మాటలను వినుము. 'ప్రాణేశ్వరా! నా పతిదేవుడా!' అని నీవు ఏడ్చుచుంటివి. కొంచెము విచారించుము. అతడు ఎక్కడ పుట్టెను? నీవెచట పుట్టితివి? నీ తలిదండ్రులెవరు? అతని తలిదండ్రులెవరు? ఒక నదీ ప్రవాహమునకు వరదలు వచ్చినపుడు అనేకవిధములైన ఎండుకట్టెలు కొట్టుకొని వచ్చి వాటిలో కొన్ని ఒకచోట కలిసి కొంతదూరము వెళ్ళిన మీదట, అవి తిరిగి విడిపోయినట్లు ఈ సంసారమునందు కూడా భార్యాభర్తలేమి? పుత్రమిత్రాదులేమి? కర్మవశమున ఒక సమయమున కలియుచుందురు. కర్మ తీరిపోయిన వెంటనే విడిపోవుచుందురు. ఒక చెట్టు మీదికి రాత్రిపూట పక్షులు అపరిమితముగా చేరుకొనును. రాత్రి గడచి తెల్లవారగనే తిరిగి అవి అన్నివైపులకు ఎగిరిపోవుచుండును కదా! తల్లీ! ఈ జగత్తు కూడా అంతే సుమా! మాయామోహవశములో చిక్కుకొని నా భార్య, నా భర్త, నా కూతురు, నా కుమారుడు అని వ్యామోహపడెదరు. కాని, ఇక్కడ ఎవరునూ శాశ్వతముగా ఉండరుగాక ఉండరు. నదిలో ఏర్పడిన నీటి బుడగవంటిదే ఈ దేహము. అది స్థిరమైనది కాదు. అందువలన నీవు వ్యర్థముగ దుఃఖించకుము. ఈ దేహము పంచభూతాత్మకమైనది. దాని గుణాలు దానికి సంబంధించియే యుండును. తమ తమ కర్మలను అనుసరించియే తమ గుణములు ఉద్భవించును. కర్మలు గుణమును అనుసరించియే జరుగుచుండును. మాయామోహములను అనుసరించి, పాశములు చుట్టుకొని బంధించును. కర్మలను అనుసరించియే దుఃఖము ప్రాప్తించుచుండును. మాయాసంబంధము వలన జీవులు సత్త్వరజస్తమోగుణములను అనుసరించి ఆయా గుణముల అనుబంధముతో స్థూల, సూక్ష్మ, కారణ, దేహములను కలిగియుందురు. ఈ దేహము త్రిగుణాత్మకమైనది. త్రిగుణాత్మకమైన గుణానుబంధముతో జీవులందరూ తత్తత్కర్మలను ఆచరించి ఆయా కర్మానుభవము నిమిత్తముగా తదనురూపములైన జన్మములను ఎత్తుచుందురు. ఆయా జన్మలయందు తమ ప్రారబ్ధకర్మాధీనమై ప్రాప్తించినట్టి సుఖదుఃఖములను అనుభవించుచుందురు. ఈ జగత్తులో జన్మించినవారందరు కర్మలకు అధీనులే. దేవతల ఆయువు కోటికల్పాల కాలము వుండును. వారు కూడా కాలుని తప్పించుకొనలేరు. ఇక మానవుల మాటేమిటి? కోటికల్పములు జీవించిన వారు కూడా ప్రారబ్ధకర్మను అనుభవించి తీరవలసినదే. వారు కర్మ తీరగనే కాలప్రవాహమునకు బలి కావలసినదే. దేవతలకే కాలప్రవాహమును తప్పించుకొనుటకు శక్యము కానపుడు, ఇక మానవులమగు మన మాటేమిటి? పాంచభౌతికమగు ఈ దేహము కాలమునకు, కర్మకు అధీనమైయుండును. కాలము తీరిన తత్‌క్షణమే మరణించక తప్పదు. జీవుడు మాతృగర్భములో ప్రవేశించిన తత్‌క్షణమే

నశించిపోవుట తథ్యమనునది సత్యమైన నానుడి. వారి గుణకర్మలను, ప్రారబ్ధమును అనుసరించియే వారి జననమరణములు వుండును. కొందరు బాల్యముననే చనిపోవుదురు. మరికొందరు యౌవనములో మరణింతురు. మరికొందరు వృద్ధాప్యదశ వచ్చిన పిదప మరణింతురు. అది వారి వారి ప్రారబ్ధవశము ననుసరించియే జరుగుచుండును. పూర్వజన్మలో చేసిన కర్మలను అనుసరించి ప్రతివారు సుఖదుఃఖములను అనుభవించెదరు. దారాపుత్రాదులు అందరు పాపపుణ్యముల అంశములే. ఋణానుబంధరూపములే! సుఖదుఃఖములు, ఆయుష్యము, సమస్తము పాపపుణ్యములను అనుసరించియే బ్రహ్మదేవునిచే నిర్దేశింపబడును. విద్వజ్జనులు కూడా దీనిని తప్పించుకొనలేరు. ఒక్కొక్కసారి తమ కర్మలను పుణ్యరాశియొక్క బలముతో దాటివేయవచ్చును. కాని, దేవతలు, దానవులు, మానవులు ఎవరు కూడా మృత్యువునుండి మాత్రము తప్పించుకొనలేరు. దేవదానవులు సైతము కర్మానుభవమును తప్పించుకొనజాలరు. అశాశ్వతమగు ఈ సంసారమంతయు ఒక స్వప్నమువంటిది. గారడీవాడు చేసే ఇంద్రజాలమువంటిదనియు, భ్రాంతిచే కల్పితమైనదే గాని సత్యము కాదనియు, బాగుగా గుర్తెరిగి సుఖదుఃఖములను త్యజించి, చక్కని జ్ఞానమును పొంది ముక్తినొందుము. కాని, మిథ్యయైన దానిని గాంచి నీవు దుఃఖించకుము. మూర్ఖత్వముతో నీవు వ్యర్థముగా దుఃఖించుచుంటివి కాని, శతసహస్ర కోటి జన్మలలో నీవు ఎవరెవరికి గృహిణివో, ఎంతమందికి భార్యవైతివో, లేక భర్తవైతివో ఒకసారి యోచింపుము. పంచభూతాత్మకమైన ఈ మానవదేహము, చర్మము, మాంసము, రక్తము, నాడులు, మేధ, మజ్జ, ఎముకలు, మలమూత్రాదులు, శ్లేష్మములతో కలిసి కూడుకొనియున్నది. మలమూత్ర రక్తాదులతో నిండియున్న జుగుప్సాకరమైన ఈ శరీరముపై స్వార్థభావమును పెంచుకొనుట వలన లాభమేమిటి? అందుకై నీవెందులకు మూర్ఖముగా రోదించుచుంటివి. ఇట్టి శరీరమునందు నా భర్త అను భ్రాంతిని కలిగి అజ్ఞానముతో దుఃఖించుచుంటివి. అమ్మాయి! ఒక పర్యాయము పరలోకమును గురించి, సంసార సాగరమును గురించి, తరించిపోవుటను గురించి, అందుకు ఏది సరియైన మార్గమో, ఏది సత్యమైన మార్గమో దానిని గూర్చి యోచించుము. వివేకమును సంపాదించి సంసారమునుండి తరించు ప్రయత్నము చేయుము" అని ఆ సాధువు ఆమెకు తత్త్వోపదేశము చేసెను. ఆ సాధువు యొక్క ఉపదేశ వాక్యములను వినిన ఆమెలో కొంచెము వివేకము జాగృతమయ్యెను. (123-149)

భర్త మరణించినందులకు కలిగిన శోకమును కొంత తగ్గించుకొని, చేతులు జోడించి, ఆ తాపసి పాదములపై ఆమె తన శిరమునుంచి నమస్కరించెను. లేచి నిలువబడి వినయముతో దోసిలొగ్గి, నతమస్తకురాలై ఇట్లు ప్రార్థించెను- "స్వామీ! మహానుభావా! మీరు చెప్పినటుల తప్పక నడచుకొందును. మీరే నాకు తలిదండ్రులు. నేను మీ శరణు కోరితిని. ఈ సంసారసాగరము నుండి ఏవిధముగ నేను తరించెదనో,

అందుకు తగిన మార్గమును సెలవీయగలరు. మీ ఉపదేశామృతము వలన నా బుద్ధి జాగృతమై, నా మనసు స్థిరపడినది. కావున, నాకు తరించే మార్గమును మరింత చక్కగా బోధించి, నన్ను రక్షింపుడు. నన్ను తరింపచేయుడు" అని పదేపదే ఆమె ప్రార్థించెను. "ఆమె మాటలు వినిన, ఆ యోగిపుంగవుడు ప్రసన్నవదనుడై స్త్రీలు ఆచరించవలసిన ధర్మములను గూర్చి సవిస్తరముగ చెప్పసాగెను" అని సిద్ధమునీంద్రుడు నామధారకునకు చెప్పిన విధముగా సరస్వతీ గంగాధరుడు గురుచరిత్రమును విస్తరించి శ్రోతలమగు మనకందరకు వ్యక్తపరచెను. అది వినుటవలన సమస్త పాపములు దూరమై సర్వాభీష్టములు నెరవేరును. (150-154)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "ప్రేతాంగనా శోకము" అను ముప్పదియవ అధ్యాయము ॥ 30 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 154; మొత్తము సంఖ్య : 3444 + 154 = 3598 ఓవీలు)

ముఖ్య గమనిక : ఈ 30వ అధ్యాయము వద్ద పారాయణము ఆపగూడదు. 30-31-32 అను మూడు అధ్యాయములను వరుసగా పఠింపవలయును. మధ్యలో నిలిపివేయకూడదు.

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

◆ ◆ ◆

జయతు జయతు దత్తో దేవసంఘాభిపూజ్యో, జయతు జయతు భద్రో భద్రదో భావుకేజ్యః ।
జయతు జయతు నిత్యో నిర్మలజ్ఞానవేద్యో, జయతు జయతు సత్యః సత్యసంధోఽనవద్యః ॥
శ్రీవాసుదేవానంద సరస్వతీ విరచితం - శ్రీదత్తభావ సుధారసమ్ - శ్లో - 107)

శ్రీ గురు చరిత్ర

ముప్పది ఒకటవ అధ్యాయము

తనంతటివాడు లేడని అహంకరించిన వింధ్యుడు అమాంతంగా పెరిగి సూర్యమండలమును దాటిపోవుట - తత్ఫలితంగా చిమ్మచీకట్లు అలుముకొని దక్షిణదేశము తల్లడిల్లుట - లోకరక్షణార్థముగ బ్రహ్మ సూచన మేరకు దేవేంద్రుడు కాశీలోగల అగస్త్యమహర్షిని చేరుకొనుట - పతివ్రతా శిరోమణీయగు లోపాముద్రను గూర్చి దేవగురువు ప్రస్తుతించుట- పతివ్రతా ధర్మములను గూర్చి బృహస్పతి వివరించుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పుచుండెను - "నామధారకా! అనంతరము ఒక అపూర్వమైన విచిత్రము జరిగినది. కారణజన్ముడైన ఆ యోగీశ్వరుడు తన భర్త మరణమునకు తీవ్రముగా విలపించుచున్న ఆ పతివ్రతతో స్త్రీ ధర్మములను గూర్చి ఇట్లు చెప్పుచుండెను - "అమ్మా! నీవు పతివ్రతా ధర్మకర్మలను గూర్చి నన్ను ప్రశ్నించితివి. స్త్రీలు ఈ భవసాగరము నుండి సులభముగా తరించు విధమును గూర్చి చెప్పుచున్నాను. నీవు శ్రద్ధగా వినవలసినది. భర్త జీవించియున్నపుడు అనగా సుమంగళి యగు స్త్రీ యొక్క నడవడిని, ఆమెయొక్క ధర్మకర్మలను గూర్చి, మరియు భర్తృవియోగమైన పిమ్మట అనగా వైధవ్యమునొందిన స్త్రీ యొక్క ధర్మకర్మలను గూర్చి విస్తరించి చెప్పుచున్నాను. ఇందులో నీకు ఏది మంచిదనిపించునో దానినే నీవంగీకరించుము. సహజముగా స్త్రీలందరు నడచుకొను విధానమును గూర్చి ముందుగా తెలియజేయుచున్నాను. స్త్రీ ధర్మాలను గూర్చి స్కాందపురాణాంతర్గతమైన కాశీఖండము నందు విశేషించి వివరింపబడియున్నది. వాటినే సంగ్రహించి ఇప్పుడు నీకు చెప్పుచున్నాను. కావున, కడు జాగ్రత్తగా వినుము. (1-5)

పూర్వకాలమున కాశీనగరమునందు మహాజ్ఞానవంతుడైన అగస్త్యుడు అను పేరుగల మహర్షి ఉండెను. ఆ మహర్షి యొక్క భార్య పేరు లోపాముద్ర. ఆమె మహాపతివ్రతాశిరోమణి. అంతేకాదు, గొప్ప విదుషీమణి కూడా. ఆ కాలంలో ఆమెతో సమానమైన పతివ్రతలు వేరొకరు లేనేలేరు అని చెప్పుట ఎంతమాత్రము అతిశయోక్తి కాబోదు. ఆ మహర్షి దంపతులు కాశీనగరములో ఉన్నప్పుడు ఒక విచిత్రమైన ఉదంతము

జరిగెను. అట్టి అగస్త్యమహర్షికి 'వింధ్యుడు' అను పేరు కలిగిన పర్వతము ముఖ్యశిష్యుడై ఉండెను. ఆ వింధ్యాచల మహాశిఖరము అనేకవిధములుగా శోభాయమానమైన, అపురూపమైన అరణ్యములతో విలసిల్లుచూ, బహురమ్యముగా గోచరించుచుండెను. అయితే ఒకమాట. వింధ్యపర్వతము అనగా ఒక రాతికొండ కదా! ఈ రాతికొండ ఒక మహర్షికి శిష్యుడగుట ఏమి విచిత్రము అని శంకింపనవసరములేదు. మన శాస్త్రప్రకారముగా విచారించి చూచినయెడల పర్వతములను, నదులను, వనములను, అంతేగాక, ప్రకృతియొక్క సంపదకు భౌతికరూపముతోపాటుగా ఆధిదైవిక రూపము కూడా కలదనియు, అట్టి ఆధిదైవిక రూపముతో అవికూడా మనవలెనే వ్యవహరింపగలవనియూ విదితమగుచున్నది. అందువలన వింధ్యపర్వతము, అగస్త్యమహర్షికి ముఖ్యశిష్యుడు అని చెప్పుటలో ఎంతమాత్రము వింతకాబోదని గమనించవలెను. అయితే, ఈ వింధ్యపర్వతము అన్ని పర్వతములకంటే తానే గొప్పదానినని గర్వించుచుండెను. లోకకళ్యాణకారకమైన నారదమునీంద్రుడు ఈ విషయమును గ్రహించి ఒకానొక సమయమున లోకసంచారము చేయుచూ, వింధ్యపర్వతము వద్దకు చేరుకొని ఇట్లు చెప్పెను - "ఓయీ! వింధ్యుడా! నీవంటి పర్వతము ఈ లోకంలో మరొకటి లేనేలేదు. అన్ని పర్వతములలో కెల్ల నీవు ప్రసిద్ధమైనవాడవు. ఎన్నియో విధములైన సమస్త వృక్షములు నీయందే గలవు. నీ ప్రదేశము అత్యంత మనోహరమైయుండును. సర్వమూ ఉత్తమ లక్షణములే నీ యందు గలవు. కాని, నాకు ఒక లోటు గలదని తోచుచుండెను. వింధ్యుడా! నీవు ఎత్తులోనూ, విశాలమునందునూ మేరుపర్వతముతో సమానమైనవాడవు కాదు సుమా! ఈ కారణమున నీ మహత్తునకు ఒక లోపము సిద్ధించినది. ఈ ఒక్క లోపమువల్లనే మేరువు అత్యంత ఖ్యాతిని పొందియున్నది" అని నారదముని పలికెను. వెంటనే వింధ్యాచలమునకు అభిమానము పెరిగిపోయినది. తత్క్షణమే నేను మేరువుతో సమానమైపోయెదనని తలంచి ఎత్తుగా పెరగసాగినది. నెమ్మది నెమ్మదిగా ఎత్తులోను, వైశాల్యమునందును పెరిగి పెరిగి సూర్యమండలమును కూడా అధిగమించి ఆ వింధ్యపర్వతము స్వర్గలోకమును తాకినది. తత్ఫలితముగా వింధ్యాచలమునకు దక్షిణభాగమంతయు అంధకారబంధురమాయెను. సూర్యుడు కనబడకపోవుటచే యజ్ఞయాగాది సత్కర్మలన్నియునూ ఆగిపోయెను. ప్రపంచమంతయు అల్లకల్లోల మాయెను. వింధ్యపర్వతమునకు దక్షిణభాగమున గల దేశమంతయు గగ్గోలుపడసాగెను. ఊహించని విధముగా ఏర్పడిన ఈ విపత్కర పరిస్థితిని గమనించిన ఋషులందరూ కలిసి ఇంద్రలోకమునకు వెళ్ళి వింధ్యపర్వతము చేసిన ఆగడమును గూర్చి దేవేంద్రునితో సవిస్తరముగా విన్నవించిరి. అంతట దేవేంద్రుడు కోపగించి బ్రహ్మలోకమునకు చేరుకొని వింధ్యపర్వతము యొక్క వృత్తాంతమంతయును బ్రహ్మతో చెప్పి, వెంటనే లోకములను రక్షింపుమని దేవేంద్రుడు ఆయన శరణుపొందెను.(6-17)

అంతట బ్రహ్మ దేవేంద్రునితో ఇట్లు పలికెను– "ఇందులకు ఒక ఉపాయము ఉన్నది. వింధ్యపర్వతము అగస్త్యమహర్షిగారి శిష్యుడు. కావున, ఈ కార్యము అగస్త్యులవారి సాయముతో మాత్రమే సంభవమగును. ప్రస్తుతము అగస్త్యమహర్షి కాశీనగరము నందు నివసించుచున్నారు. మీరు వెంటనే కాశీపట్టణమునకు చేరుకొని అగస్త్యమహర్షిని ప్రార్థించి, వారిని దక్షిణదేశయాత్ర చేయునటుల ప్రోత్సహింపవలెను. అగస్త్యమహర్షిని దక్షిణదిశకు పంపించుటకు తప్ప వేరొక గత్యంతరము లేదు. ఎందుకనగా, వింధ్యాచలుడు అగస్త్యమహర్షి శిష్యుడు. అందువలన తన గురువైన అగస్త్యమహర్షి తన వద్దకు విచ్చేసినపుడు, అతడు తన తలను వంచి గురువునకు సాష్టాంగ వందనమును ఆచరించును. అంతట వారు తన శిష్యుని తిరిగి పెరగవద్దని చెప్పి అటులనే యుండునటుల ఆ పర్వతరాజును ఆశీర్వదించును. తద్వారా అతని శిఖరము భూమితో సమానముగా ఏర్పడును. అంతట నీ కార్యము సిద్ధింపబడును. ఇట్లు చేసిన యెడల దక్షిణదిశ యందు అంధకారము నశించిపోయి సూర్యగమనము సిద్ధించును. తిరిగి యజ్ఞయాగాది సత్కర్మలు జరుగును. తద్వారా లోకమునకు క్షేమము చేకూరగలదు. కావున, మీరెంతమాత్రము ఆలస్యము చేయకుండ వెంటనే కాశీపట్టణమును చేరుకొని అగస్త్యులవారిని ప్రార్థింపుడు" అని బ్రహ్మదేవుడు చెప్పెను. అందుకు ఇంద్రుడు అంగీకరించి తన వెంట ఇతర దేవతాగణమును, ఋషీశ్వరులను, దేవగురువగు బృహస్పతిని తీసుకొని వేగిరముగా కాశీపట్టణమును చేరుకొని, అగస్త్యాశ్రమమును సమీపించెను. తమ ఆశ్రమమునకు విచ్చేసిన ఇంద్రాదిదేవతలకు, దేవగురువుతో పాటు ఋషులందరకు అగస్త్యమహర్షి స్వాగతపూర్వకముగా నమస్కరించి తగు ఆసనములను ఏర్పరచి అర్ఘ్యపాద్యాదులను ఇచ్చి సభక్తికముగా వారినందరిని పూజించెను. అందుకు దేవతలు, ఋషులు, అగస్త్యులవారిని మిక్కిలి ప్రశంసించిరి. దేవగురువగు బృహస్పతి ప్రత్యేకముగా అగస్త్యమహర్షిని కడు గొప్పగా స్తుతించి, వెనువెంటనే అతని భార్యయైన పతివ్రతాశిరోమణియగు లోపాముద్రను కూడా ప్రస్తుతించెను. అనంతరము, దేవగురువగు బృహస్పతి అగస్త్యమహర్షి ధర్మపత్నియైన, పరమపతివ్రతయగు లోపాముద్ర యొక్క పాతివ్రత్యము యొక్క తీరుతెన్నులను గూర్చి గొప్పగా ప్రశంసించుచూ, ఒకవైపు దేవతలు, మరొకవైపు ఋషీశ్వరులు అందరు వినుచుండగా పతివ్రతా స్త్రీ ధర్మములను గూర్చి విపులముగా ఇట్లు ప్రవచించెను– (18–27) **"సృష్ట్యాదికాలమునుండి ఎందరో పతివ్రతలు ఉండిరి. కాని, ఈ లోపాముద్రాదేవితో సమానమైన పతివ్రతలు ఎందునూ కానరారు. మహాపతివ్రతామతల్లులైన అరుంధతి, సావిత్రి, అనసూయ, శాండిల్య మహర్షియొక్క భార్య గొప్ప పతివ్రతలుగా ఖ్యాతి గాంచిరి. అంతేకాదు, లక్ష్మీదేవి, పార్వతీదేవి, స్వయంభూపత్నియగు శతరూప, హిమవంతుని ప్రాణేశ్వరియైన మేనక గొప్ప ప్రసిద్ధిగాంచిరి. ఇంకనూ ధ్రువుని తల్లియగు సునీత, సూర్యుని భార్యయైన సంజ్ఞాదేవి, యజ్ఞపురుషుని ప్రాణేశ్వరియగు స్వాహాదేవి కూడా ప్రఖ్యాతి చెందిరి.**

కాని, వీరందరికంటెను పాతివ్రత్యవిషయమున అగస్త్యమహర్షియొక్క ధర్మపత్నియైన ఈ లోపాముద్రయే ప్రథమస్థానమును పొందినది" అని అందరి సమక్షమున దేవగురువగు బృహస్పతి పతివ్రతా శిరోమణిగా ప్రథమస్థానమునందు వినుతికెక్కిన లోపాముద్రాదేవిని ప్రస్తుతించుచూ, ఆమె ఆచరించిన మరియు శాస్త్రము బోధించిన పతివ్రతా స్త్రీ ధర్మములను గూర్చి ఆయన ఇట్లు చెప్పసాగెను. (25-32)

"దేవతలారా! ఋషీశ్వరులారా! మీరందరూ ఆకర్ణింపుడు - భర్తలు భుజించిన పిమ్మట, భుక్తశేషమును సభక్తిముగా ప్రసాదమని భావించి భుజించుటయే స్త్రీలందరి ముఖ్య ధర్మము. భర్త నిలబడినప్పుడు వారు కూడా నిలబడియుండవలెను. ఆతని ఆజ్ఞ లేకుండా కూర్చొనకూడదు. తమ భర్త ఆజ్ఞనెప్పుడు కూడా ఉల్లంఘించరాదు. దినమునందు అఖండముగా భర్తను సేవించవలెను. అతిథులు వచ్చినయెడల వారిని పూజింపవలెను. భర్త అనుమతి లేకుండా దానధర్మములు చేయకూడదు. మనసులో తన భర్తనే భగవంతునిగా భావించుచూ నిరంతరము పతిసేవాపరాయణ కావలెను. భర్త చేయు అతిథిపూజ మొదలగు ధర్మ కార్యములయందు తాను త్రికరణములతో సహకరింపవలెను. భర్తను అవమానింపరాదు. భర్త పడుకొనినపుడు రాత్రి సమయమున అతనిని భక్తిశ్రద్ధలతో సేవించవలెను. సర్వకాలములయందు భర్తను భక్తితో సేవించి అతనికి ఆనందమును కలిగించుచుండవలెను. భర్త నిద్రించిన పిమ్మటనే తాను నిద్రింపవలెను. తన రవిక గాని, చెవి పోగులుగాని (ముత్తైదువులు ధరించే కర్ణాభరణములు గాని) భర్త శరీరమునకు తగలకుండా జాగ్రత్తపడవలెను. తన రవిక యొక్క స్పర్శ భర్తకు తగిలితే ఆతని ఆయువు క్షీణించును. భర్త నామమును పతివ్రత ఉచ్చరింపకూడదు. ఒకవేళ ఉచ్చరించినచో అతని ఆయుష్యమును హరించినది అగును. భర్తకంటె ముందే నిద్రనుండి మేల్కొని అతని పాదములకు నమస్కరించవలెను. అనంతరము గృహమునందు, గృహాంగణమునందు సమ్మార్జనము (ఊడ్చుట, తుడుచుట, చల్లుట మొ॥ పనులు పూర్తి) గావింపవలెను. నిత్యము భర్తను పూజించి, అతని చరణతీర్థమును స్వీకరించవలెను. తన భర్తనే పరమేశ్వరునిగా భావించి అతని పాదములకు నమస్కరింపవలెను. భర్త గ్రామములోగాని, ఇంటిలోగాని ఉన్నప్పుడు అత్యంత హర్షోల్లాసములతో ఉండి సమస్త అలంకారములను చేసుకొనవలెను. తద్వారా భర్తకు మానసికోల్లాసమును కలిగింపవలెను. కాని, భర్త గ్రామాంతరము వెళ్ళినపుడు పతివ్రతా స్త్రీ శృంగార వేషమును ధరించరాదు. ఒకవేళ భర్త తనపై కోపగించిననూ తిరిగి తాను మాత్రము కోపగించకూడదు. వారి కోపమునకు క్షమించమని అతని పాదములను పట్టుకొనవలెను. కాని, తాను మాత్రము మానసికముగా కోపమును వహించకూడదు. భర్త బయటకు వెళ్ళి తన వృత్తి ధర్మమును ముగించుకొని ఇంటికి వచ్చినపుడు ముఖ్యమైన వేయి పనులున్నా సరే, వాటిని ప్రక్కనబెట్టి భర్తకు సమ్ముఖముగా వెళ్ళి చిరునవ్వుతో ఎదురేగి నమస్కరించి 'ఏమి ఆజ్ఞ' అని అడుగవలయును. అతని మనసులో

ఏయే భావములు కలవో, వాటిని గమనించి తదనుగుణ్యముగ తాను నడచుకొనవలెను. పతివ్రతా స్త్రీ గృహమును దాటి బయటకు వెళ్ళకూడదు. ఒకవేళ వెళ్ళినచో అనేకదోషములు వాటిల్లును. అత్యవసరమైన పనిమీద బయటకు వెళ్ళవలసి వచ్చినచో, దారిలో పర స్త్రీని గాని, పరపురుషుని గాని, చూడకుండా తన పనిని ముగించుకొని వెంటనే గృహము లోపలికి రావలెను. ఒకవేళ అన్యపురుషుడిని మరొక దృష్టితో చూచినయెడల ఆ స్త్రీ గుడ్లగూబగా జన్మించును. నేను ఇంతవరకు చెప్పిన లక్షణములన్నియు సంపూర్ణముగా ఆచరించినవారగుటచేతనే లోపాముద్ర మొదలగు పతివ్రతలు గొప్ప కీర్తిప్రతిష్ఠలను ఆర్జించిరి. పతివ్రతా శిరోమణియగు లోపాముద్ర ఎప్పుడూ ఇంటి బయట కాలు పెట్టినది కాదు. ప్రాతఃకాలముననే లేచి గృహమునందు, గృహాంగణమునందు శుభ్రపరచి, సమ్మార్జనమును పూర్తిగావించుచుండును. చక్కని ముగ్గులతో తీర్చిదిద్దును. దేవపూజకు కావలసిన పాత్రలు శుభ్రపరచి, గంధాక్షతలను సిద్ధపరచి పెట్టును. దీపపు వస్తువులను సిద్ధపరచి, దేవుని ముందు పంచరంగులతో కూడిన రంగవల్లులతో అలంకరించును. అనుష్ఠానము నిమిత్తమై భర్త వచ్చుసరికి శీఘ్రముగా అందుకు కావలసిన సామగ్రిని సిద్ధము చేసిపెట్టును. భర్తయొక్క చిత్తవృత్తిని అనుసరించి వ్యవహరించుచుండును. పతివ్రతా స్త్రీలు తమ గృహమును నిర్మలముగా, ప్రశాంతముగా, సద్భావముతో నిండిన వాతావరణముతో ఉంచవలెను. భర్త నిర్ణయించిన పనియే చేయవలెను. భర్త ఉచ్ఛిష్టముమునే స్త్రీలు మనస్ఫూర్తిగా భుజించవలెను. ఒకవేళ భర్త గ్రామములో లేనియెడల అతిథికి భోజనమును పెట్టిన పిదప, లేదా గోవును పూజించి, దానికి ఆహారమును ఇచ్చిన తరువాతనే తాను భోజనమును చేయవలెను. భర్త అనుమతి లేకుండా ఏ ధర్మమునుగాని, వ్రతమునుగాని, ఉపవాసమునుగాని చేయకూడదు. తమ నగరములో ఉత్సవములు జరిగినచో భర్తకు చెప్పకుండా, అతనికి తెలియకుండా ఎప్పుడూ వెళ్ళకూడదు. తీర్థయాత్రలకు గాని, వివాహాదులకు గాని భర్త తోడు లేకుండా వెళ్ళకూడదు. భర్త సంతోషవదనముతో ఉన్నప్పుడు తాము విచారవదనముతో ఉండకూడదు. ఒకవేళ భర్త విచారవదనముతో ఉన్న యెడల తాము సంతోషకరముగా ఉండకూడదు. రజస్వలయైనప్పుడు ఎవరితోను మాటలాడకుండా మౌనముగ ఉండవలెను. వేదధ్వనిని వినకూడదు. ముఖ్యముగా తన ముఖమును మరెవరికీ చూపకూడదు. ఆవిధముగా నాలుగు రోజుల పిమ్మట సుస్నాతయైన తరువాత తన భర్త ముఖమును మాత్రమే చూడవలెను. ఒకవేళ భర్త ఇంటియందు లేనిచో, ఆతని రూపమును తన మనసులో భావించుకొనుచు, సూర్యమండలమును దర్శించి గృహములోనికి వెళ్ళవలెను. భర్తయొక్క ఆయుష్యాభివృద్ధి కొరకు ప్రతి స్త్రీ పసుపు కుంకుమలను ధరించవలెను. మంగళసూత్రమును, కాటుకను, సిందూరమును ధరించుచుండవలెను. దువ్వెనతో తలను చక్కగా దువ్వుకొని జడను వేసికొనవలెను. ముత్తైదువులకు తాంబూలమును ఇచ్చుచుండవలెను. తగిన ఆభరణములను

ధరించుచుండవలెను. శిరమున జడ, చేతులకు గాజులు, చెవులకు కమ్మలు, కాళ్ళకు మట్టెలు ధరించి భర్త దగ్గరకు వెళ్ళవలెను. ఇరుగుపొరుగున వున్న వ్యభిచారిణులతోను, రజక స్త్రీలతోను, కుటిల స్వభావము గల స్త్రీలతోడను, జైన స్త్రీలతోనూ, దరిద్ర స్త్రీలతోడను మైత్రిని చేయకూడదు. ఒకవేళ చేసిన యెడల గొప్ప హాని వాటిల్లగలదు. భర్తను నిందించే పరాయి స్త్రీలతో పతివ్రతా స్త్రీలు మాట్లాడకూడదు. అట్లు మాట్లాడినచో పతివ్రతా ధర్మమునకు దోషము వాటిల్లును. అత్తమామలను, ఆడుబిడ్డలను, వదిన, మరదులను, బావమరదులను మొదలగు వారిని వదలివేసి భర్తతో వేరుగా కాపురము చేయువారు కుక్కజన్మమును ఎత్తెదరు. నగ్నముగ స్నానము చేయకూడదు. రోటిమీదగాని, రోకలిమీదగాని కూర్చొనకూడదు. పిండి విసిరే విసురురాయి మీద కూడా కూర్చొనకూడదు. ఇంటి గడపమీద, అరుగుమీద, పెద్దల ఎదుట కూర్చొనరాదు. భర్తతో ఎప్పుడూ వివాదము చేయకూడదు. భర్తతో కలహించుట వలన మహాదుఃఖము కలిగితీరును. భర్త మనసులో ఉన్న భావమునకు వ్యతిరేకముగా తన మనసులో మరొక భావమును పెట్టుకొనకూడదు. భర్తయొక్క అంతఃకరణమునకు ఎప్పుడునూ ఖేదమును కల్పించకూడదు. ఒకవేళ భర్త దురదృష్టవంతుడు, పేదవాడు, దుష్టుడు, నపుంసకుడు, వ్యాధిగ్రస్తుడు, అసమర్థుడు అయినప్పటికినీ అతనిని దైవసమానునిగా భావించవలెను. ఒకవేళ తనకు లభించిన భర్త పైన చెప్పిన విధముగ ఉన్న యెడల అతనినే శ్రీహరిగా భావించి, అతని అనుజ్ఞ ప్రకారముగ నడచుకొన్న యెడల ఆ స్త్రీయే పరమేశ్వరుని ప్రేమకు పాత్రురాలు అగును. భర్త మనసుకు నచ్చిన ఆభరణములనే, వస్త్రములనే ధరించవలెను. పతి విచారముతో ఉన్నయెడల తాను శృంగారముగా అలంకరించుకొనకూడదు. ఎప్పుడైనా ఇంటికి కావలసిన వస్తువులు గాని, అలంకార వస్తువులు గానీ కావలసియున్న యెడల తానే భర్తతో స్వయముగా చెప్పకుండా తమ కుమారుల ద్వారా లేదా, కుమార్తెల ద్వారా చెప్పించుచుండవలెను. ఒకవేళ దగ్గరలో ఎవరు లేని పరిస్థితిలో వస్తువుల గుర్తులను తెలియజెప్పవలెను. లేదా, తానే గ్రహించుకొనునట్లుగా, వారి మనసునకు తోచునట్లుగా మిగిలియున్న భాగములను తన భర్తకు చూపించవలెను. భర్త తెచ్చినదానితో మాత్రమే తాను సంతృప్తి చెందవలెను. శ్రీమంతులను చూచి లోభముతోను, లేదా వికల్పముతోడను భర్తను ఎంతమాత్రము నిందించకూడదు. (33-72)

ఇతరులెవరైనను తీర్థయాత్రలకు వెళ్ళుచుండినచో అట్టి ఉద్దేశమును భర్తతో సూచింపకూడదు. తాను వెళ్ళవలయునని ఉబలాటపడకూడదు. భర్త యొక్క పాదతీర్థమే భాగీరథిగా భావించవలెను. గంగతీర్థము కంటె భర్త చరణతీర్థమే ఎక్కువయని, పతిసేవయే ముఖ్య సౌఖ్యమను భావముతో తన భర్తను సేవించుచుండుటవలన త్రిమూర్తులు సంప్రీతులయ్యెదరు. అనగా తన భర్తను త్రిమూర్తి స్వరూపముగా భావించి పూజింపవలెను. ఏదేని వ్రతమును చేయవలెనను సంకల్పము కలిగినచో, భర్తను అడిగి తాను వ్రతమును ఆచరింపవచ్చును. కాని, భర్త

అనుమతిని తీసుకొనకుండా తమ ఇష్టప్రకారముగా ఏదేని వ్రతమును ఆచరించుటవలన తన భర్తయొక్క ఆయువు క్షీణించును. భర్తతో కలిసి వారు నరకలోకమునకు వెళ్ళెదరని శ్రుతులు చెప్పుచున్నవని, దేవగురువు బృహస్పతి చెప్పుచుండెను. (73-76)

క్రోధమును వహించి, భర్తకు ఎదురు సమాధానమును చెప్పిన స్త్రీలు శ్వానయోనిలో జన్మింతురు. అనంతరము నక్కజన్మను పొంది గ్రామసరిహద్దులకు వచ్చి మొరుగుచుందురు. నిత్యనియమముగా స్త్రీలు తమ భర్తయొక్క ఉచ్ఛిష్టమునే భుజించి, అతని పాదములను కడిగి చరణ తీర్థమును స్వీకరించిన పిమ్మటనే భోజనమును చేయవలెను. అట్టి స్త్రీలకు పరమేశ్వరుడు నిత్యప్రత్యక్షమై యుండును. వారి సమస్త మనోవాంఛలు వెంటవెంటనే నెరవేరును. అట్టివారలు భర్తతో కలిసి వైకుంఠలోకమునకు వెళ్ళెదరు. తన భర్త పేదవాడైనచో, అతని ముందు ధనికులను గూర్చి పొగడకూడదు. భర్త చెడుప్రవర్తన గలవాడైనచో, నేరుగా అతనిని నిందించకూడదు. పతి అనాచారపరుడైనను, అతనిని నిందించకుండా తన భర్తను స్తుతించవలెను. అతడినే మనస్ఫూర్తిగా లక్ష్మీపతిగా భావించుచుండవలెను. భర్త ఎదుట గాని, అత్తమామల ఎదుటగాని పెద్దగా అరచి, అమర్యాదకరముగా మాటలాడకూడదు, వారిముందు బిగ్గరగా నవ్వకూడదు. అట్లొనర్చినయెడల భర్త ఆయుష్యము క్షీణించును. అత్తమామలను వదలివేసి ఒంటరిగా ఉండుమని భర్తకు బోధించెడు స్త్రీ గుడ్లగూబ యోనిలో జన్మించి చిట్టడవిలో నివసింపవలసి వచ్చును. భర్త కోపగించి ఒకవేళ కొట్టినపుడు, అతడిని 'చావుమ'ని శపించు స్త్రీకి వ్యాఘ్రజన్మము లభించును. ప్రేమతో పరపురుషుని చూచిన స్త్రీ పుట్టు గ్రుడ్డిగా జన్మించును. భర్తకు తెలియకుండా అతడిని వంచించి ఒంటరిగా పక్వాన్నములను చేసికొని తాను కమ్మగా భక్షించు స్త్రీ గ్రామసూకరమై జన్మించును. అటు తర్వాత గబ్బిలముగా జన్మించి చెట్టుకు వ్రేలాడి తన మలమునే తాను భక్షించుచూ, తలక్రిందులుగా వేలాడుచుండును. తన భర్తను విదిలించి కోపముతో నిష్ఠురమైన సమాధానము ఇచ్చినవారు మూగవారుగా జన్మించి, ఏడు జన్మల పర్యంతము అఖండదారిద్ర్యమును అనుభవించెదరు. ఒకవేళ తన భర్త ద్వితీయ వివాహము చేసికొనిన యెడల, సవతితో వైరము పెట్టుకొన్న స్త్రీ సప్తజన్మల పర్యంతము గొప్ప దారిద్ర్యబాధను అనుభవించును. పరపురుషుని కన్నెత్తి చూచిన స్త్రీ అంగహీనురాలై పేదవారుగా చండాలుర జాతిలో జన్మించును. తన భర్త బయటకు వెళ్ళి తిరిగి ఇంటికి చేరినపుడు అతనికి ఎదురుగా వెళ్ళి ప్రసన్నవదనముతో అతని పాదములను కడిగి, మంచినీటిని ఇచ్చి బడలిక తొలగిపోవుటకు విసనకర్రతో విసరవలెను. భక్తితో అతనికి పాదసంవాహనము చేయుచూ, అత్యంత వినయభావముతో, ప్రీతితో సంభాషించవలెను. భర్త సంతోషించిన యెడల త్రిమూర్తులు సైతము సంతోషించెదరు. తలిదండ్రులుగాని, బంధువులుగాని, సోదరులుగాని, స్త్రీలకు ఏమియూ ఇవ్వజాలరు. ఇహపరసౌఖ్యములను ఇచ్చుటకు ఒక్క భర్త మాత్రమే సమర్థుడు. స్త్రీకి భర్తయే దేవుడు, దైవము, గురువు, ధర్మము. భర్తయే సర్వతీర్థములు. సమస్తము తన భర్తయే అను దృఢభావమును కలిగిన స్త్రీయే నిజమైన పతివ్రతగా

చెప్పబడును. శరీరమునందు జీవుడున్నప్పుడు మాత్రమే శరీరము పవిత్రముగా భావించబడును. జీవుడు వెడలిపోయిన వెంటనే ఆ శరీరము అస్పృశ్యమై ప్రేతశబ్దవాచ్యమగుచుండును. అదేవిధముగ భర్తయే తనకు ప్రాణము కనుక, భర్త లేని స్త్రీ అశుచిగా పరిగణింపబడును. అస్పృశ్యురాలుగా భావింపబడును. కాన, స్త్రీ పతిని భక్తితో సేవింపవలెను. భర్తలేని స్త్రీ ముఖమును చూడకూడదు. నిజమునకు పతిలేని స్త్రీ ప్రేతముగ పరిగణింపబడును కదా! విధవ అంటే ప్రేతముతో సమానము. పుత్రులు లేని స్త్రీ గాని, సంతానము లేని స్త్రీ గాని లోకమునందు మిక్కిలి నింద్యముగా చూడబడుచుండును. పరగ్రామమునకు ప్రయాణము చేయుచున్నప్పుడు వితంతువగు స్త్రీ ఎదురుగా వచ్చినచో, వారికి మరణము సిద్ధించునని శాస్త్రములు చెప్పుచున్నవి. ఈ దోషము ఆమె కుమారునికి మాత్రము వర్తించదు. విధవయైన తల్లి కుమారునకు ఎదురుగ వచ్చినను శుభమే సిద్ధించును. పుత్రులు లేని విధవ స్త్రీకి ఎవరునూ నమస్కరింపరాదు. వితంతువైన స్త్రీ ఆమె పుత్రులకు శుభశకునమే యగును. ఆమె ఆశీర్వాదబలముతో సమస్తము మంగళప్రదమే యగును. ఒకవేళ ఆమె శపించినచో మరణము సిద్ధించును. ఆమెతో ఎవరునూ మాట్లాడకూడదు. అందువలన, మన నీడ దేహముతో ఎట్లు నశించునో, అటులనే పతివ్రతయైన స్త్రీ భర్తతోపాటుగా చక్కగా వెళ్ళిపోవలెను. చంద్రునితోపాటు వెన్నెల కూడా అస్తమించినట్లుగా, మేఘములతోపాటు మెరుపులు కనుమరుగైనట్లుగా తన భర్తతోపాటు పతివ్రతయైన స్త్రీ వెళ్ళిపోవలయును. సహగమనము చేయుట గొప్ప ధర్మమని, అట్లు చేసినచో ఆ పతివ్రతామతల్లితోపాటుగా నలుబది రెండు వంశములవారు ఉద్ధరింపబడగలరని శ్రుతి చెప్పుచున్నది. తన భర్త మరణింపగా ఏ పతివ్రతనైతే భర్తతోపాటుగా తన దేహమును సహగమనమొనర్చునో, అట్టి స్త్రీ చంద్రుని వెంట వెన్నెల వెళ్ళిపోయిన విధముగా భర్తతోపాటుగా తాను ఉత్తమ లోకమును పొందగలదు. కావుననే, సమస్త ధర్మములలో కెల్ల స్త్రీలకు సహగమనమే ముఖ్యధర్మమని వేదములు ఘోషించుచున్నవి. సహగమనము కొరకు వెళ్ళుచున్న స్త్రీ వేసే ఒక్కొక్క అడుగునకు వేయి అశ్వమేధ క్రతువులు చేసిన పుణ్యరాశి లభించును. ఒకవేళ భర్త పాపియై అతడు మరణించినపుడు యమదూతలు వచ్చి అతనిని బంధించి నరకమునకు తీసుకొనిపోవుటకు వచ్చినచో, పతివ్రతయైన ఆతని భార్య ఒకవేళ సహగమనము చేయుటకు నిశ్చయించుకొనినచో, అప్పుడు లభించెడు ఆ పుణ్యముచే ఆమె తన భర్తను గరుడుడు సర్పమును ఈడ్చుకొనిపోయినట్లుగా స్వర్గమునకు తీసుకొనిపోగలదు. సహగమనమును చేయు స్త్రీని చూచినంతనే యమదూతలు తమ లోకమునకు పలాయనము చిత్తగించెదరు. పతివ్రతను చూచుటకు యముడు కూడా భయపడుచుండును. పతివ్రతాశిరోమణియగు స్త్రీ తన భర్తను విమానములో కూర్చుండజేసికొని శీఘ్రముగ స్వర్గలోకమునకు తీసికొనిపోవును. అచట దేవకన్యకలు నీరాజనములిచ్చి ప్రశంసించెదరు. ఇక పతివ్రతా స్త్రీని చూచి పారిపోవుచున్న యమదూతలు కాలుని చూచి మేము ఎవరికినీ భయపడము కాని, పతివ్రతా స్త్రీని చూచినంతనే భయంకరమైన భయము కలుగునని

జంకెదరు. పతివ్రతా స్త్రీని చూచి సూర్యుడు కూడా భయపడి నేరుగా ఆమెయందు తన వేడి కిరణములను నేరుగా ప్రసారము చేయకుండా మందమందముగ ప్రకాశించును. ఆమెను చూసి అగ్ని భయపడి శాంతించును. ఇక ఉష్ణము ఆమెను తాకనైననూ తాకలేదు. తమ స్థానమును ఆక్రమించునేమో యని నక్షత్రములు పతివ్రతా స్త్రీని చూచి భీతిల్లుచుండును. ఆమె తన భర్తతో కలిసి నేరుగా స్వర్గలోకమునకే వెళ్లును. ఏ స్త్రీ తన భర్తతో సహగమనమును చేయునో, ఆమె ఒంటికి ఎన్ని రోమములు గలవో అన్ని కోట్ల సంవత్సరముల పర్యంతము తన భర్తతో సహా స్వర్గసుఖమును అనుభవింపగలదు. సహగమనము అంతటి పుణ్యమును సంపాదించిపెట్టును. అట్టి స్త్రీ తాను పుట్టిన వంశములోని నలుబదిరెండు తరముల వారిని స్వర్గలోకమునకు తీసుకొనివెళ్లును. ఆమె తలిదండ్రులు ధన్యులు. ఆమెతో ఇరువదొక్క తరములవారు ఉద్ధరింపబడెదరు. ఆమె భర్త వంశముకూడా ధన్యమగును. అతనివైపు గల నలుబది రెండు తరములవారు ఉద్ధరింపబడెదరు. సహగమనము ఎంతయో పుణ్యప్రదమైనది. దానివలన అనంతపుణ్యరాశి లభించును. పాతివ్రత్యమునకు మించిన వ్రతము మరొకటి సృష్టిలో లేదు. తద్వారా మేరలేని పుణ్యఫలితము లభించితీరును" అని చెప్పి మరికొన్ని స్త్రీ ధర్మములను గూర్చి వివరముగా చెప్పెదనని **దేవగురువగు బృహస్పతి మరల ఇట్లు చెప్పసాగెను.**(73-117)

స్త్రీ దురాచారి, లేక వ్యభిచారి యైనచో, అందుకు కూడా ఫలితము చెప్పబడినది. అది శ్రద్ధగా వినుడు. ఉభయ వంశములకు చెందిన నలుబదిరెండు తరముల వారు ఒకవేళ స్వర్గలోకములో నివసించుచున్నప్పటికినీ ఒక దురాచారియైన స్త్రీ లేదా వ్యభిచరించిన స్త్రీ వారందరిని నరకలోకములోనికి పడద్రోయును. ఆమె దేహమునందు ఎన్ని రోమములు గలవో, అన్ని సంవత్సరముల పర్యంతము వారు నరకములో యమయాతనలు అనుభవించెదరు. పతివ్రతా చరణములు తన మీద నడచినప్పుడు మరుక్షణమే తాను పవిత్రురాలను అగుదునని భూదేవత మురియుచుండును. సూర్యచంద్రులు తమ కాంతికిరణములు పతివ్రతులను సోకినచో, తాము పవిత్రులమగుచున్నామని తలంచెదరు. వాయుదేవుడు, వరుణదేవుడు పతివ్రతా స్త్రీల స్పర్శతో తాము నిశ్చయముగా పావనమయ్యెదమని, ఆమెను చూచుటచే తామేగాక ఎల్లరునూ పునీతులయ్యెదరని చెప్పుచుండెదరు. (118-123)

ప్రతిగృహమునందును స్త్రీలు ఉందురుగదా! వారెందరు ఉండిన ఏమి ఫలము? వారెంతటి సౌందర్యశోభను, లావణ్యసంపత్తిని గలవారైనను ఏమి ప్రయోజనము. **ఏ స్త్రీ తన పాతివ్రత్యమహిమచే వంశమును ఉద్ధరించునో, అట్టి స్త్రీయే నిజమైన స్త్రీగా పరిగణింపబడును. ఇంటిలోగల దైవమున కంటే పతివ్రతయైన ఇల్లాలు వలన ఆ ఇంటికి, ఆ భర్తకు, ఆ వంశమునకు ఎల్లలు లేని ఖ్యాతి లభించితీరును. అట్టి భార్యను పొందుటకు ఏడేడు జన్మల పుణ్యరాశిని సంపాదింపవలసి యుండును. భర్తకు చతుర్విధ పురుషార్థములు నిశ్చయముగా భార్యవలన**

మాత్రమే లభించును. అంతులేని పుణ్యరాశి సంపాదనవలననే అట్టి భార్య లభించును. ఎవరి గృహమునందు పతివ్రతయైన భార్య యుండదో, అట్టివారికి ఎట్టి పుణ్యము లభింపదుగాక లభింపదు. అతనికి యజ్ఞాదిక్రతువులు చేసే అర్హత కూడా లభింపదు. పతివ్రతా భార్య ప్రక్కన ఉండినందున యజ్ఞాది సత్కర్మలు వెంటనే సిద్ధింపగలవు. ఎవరి ఇంటిలో సతీమణి యుండదో, ఆ ఇల్లు అరణ్యముతో సమానమే కాని వేరుకాదు. వారు కర్మబాహ్యులే యగుదురు. వారి జన్మము ఈ లోకమునందు వ్యర్థమైనదే యగును.

పతివ్రతయైన చక్కని భార్య ఎవరికి లభించునో, వారికి సమస్త పుణ్యములు లభించును. భార్యవలన మాత్రమే పరలోకమునకు సాధకులైన పుత్రసంతానము లభించును. భార్య లేనివారిచేత ధర్మకర్మలు సాగించబడవు. అట్టి వ్యక్తి దైవసంబంధమైన లేదా, పితృసంబంధమైన కర్మలను అచరించుటకు పాత్రుడు కాడు. దీనివలన తమ ధర్మకర్మలను ఆచరించుటలో భార్యకు ఎంతటి ఉన్నత స్థానము ఈయబడినదో చక్కగా తేటతెల్లమగుచున్నది. పతివ్రతామ స్త్రీ మూర్తియొక్క దర్శనమాత్రముచేతనే గంగాస్నానమొనర్చిన పుణ్యఫలము సిద్ధించును. పుత్రపౌత్రాభివృద్ధియు, శాశ్వత సద్గతియు ఆమెవల్లనే సిద్ధించును. మహాపాపములు సైతము తత్కాలమున నశించి తీరును. సప్తజన్మలుగా చేసిన పాపపరంపర కూడా నశించి పుణ్యవంతు లయ్యెదరు" అని దేవగురువగు బృహస్పతి స్త్రీ యొక్క ధర్మకర్మలను విస్తారముగ వివరించి చెప్పెనని గాణగాపురమునందు భర్త మరణముతో రోదించుచున్న పతివ్రతయగు స్త్రీతో యోగేశ్వరుదు పతివ్రతా లక్షణములను వివరించెను" అని సిద్ధముని నామధారకునితో చెప్పిన సంవాదమును, సరస్వతీ గంగాధరుడు పుణ్యముల పంటను పండించే గురుచరిత్రముగా లోకమునకు అందించెను. ఈ అధ్యాయమునందు వివరింపబడిన పతివ్రతా స్త్రీ ధర్మములను శ్రద్ధగా ఎవరు విందురో, ఎవరు చదివెదరో, వారు పునీతులయ్యెదరు. అంత్యమున వారు సద్గతిని పొందెదరు అని ఈ అధ్యాయము యొక్క ఫలమును గంగాధరనందనుడైన సరస్వతి లోకమునకు ప్రకటించెను. (124-133)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "పతివ్రతాధర్మ నిరూపణము" అను ముప్పది ఒకటవ అధ్యాయము ॥ 31 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 133; మొత్తము సంఖ్య : 3598 + 133 = 3731 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ముప్పది రెండవ అధ్యాయము

అగస్త్యమహర్షి ఆశ్రమములో దేవగురువు బృహస్పతి పతివ్రతా ధర్మములను వివరించుట - యోగీశ్వరుని అనుమతితో విప్రవనిత భర్తతోపాటుగా సహగమనము చేయుటకే ఇష్టపడుట - ఆమెకు యోగీశ్వరుడు రుద్రాక్షలను ప్రసాదించుట - చివరగా ఆ విప్రస్త్రీ సంగమమునందు గల శ్రీగురునాథుని దర్శించుట - అమృతమయదృష్టితో మృతుడయిన బ్రాహ్మణుని శ్రీగురుమూర్తి బ్రతికించుట - శ్రీగురుమహిమకు భక్తజనులందరు జయజయధ్వానములు పలుకుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః॥

సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పుచుండెను – "కాశీపట్టణమునందు అగస్త్యమహర్షి ఆశ్రమమున దేవగురువైన బృహస్పతి అచట చేరిన దేవేంద్రాది దేవతలకు, ఋషిగణమునకు పతివ్రతా ధర్మములను, వారి నడవడిని, సహగమనము యొక్క ఫలశ్రుతిని గూర్చి చక్కగా వివరించి చెప్పెను. **అంతట ఋషులు తమ దేవగురువైన బృహస్పతిని తిరిగి ఇట్లు ప్రశ్నించుచుండిరి** – అటులే, గాణగాపురము నడివీధిలో, భర్త మరణించి తీవ్రముగా దుఃఖించుచున్న పతివ్రతయగు బ్రాహ్మణ స్త్రీతో యోగీశ్వరుడు 'అమ్మా! నీవు శ్రద్ధగా వినవలసినదని' పలికి ఈ ఉదంతమును గూర్చి చెప్పుచుండెను– "ఓ సాధ్వీ! ఋషీశ్వరులందరూ దేవగురువు బృహస్పతిని ఉద్దేశించి, "గురుదేవా! ఒకవేళ భర్త పరదేశమునకు వెళ్ళి మరణించిన యెడల సహగమనము ఎట్లు ఘటించును? భార్య గర్భవతిగా నుండినచో లేదా, ఇంకనూ స్తన్యపానము చేయుచున్న సంతానము కలిగియున్నచో అట్టి పతివ్రత సహగమనమును ఎట్లు చేయవలెను? అని ప్రశ్నించి తగు సమాధానమును చెప్పవలసినదని" ఋషీశ్వరులు ప్రార్థించిరి.

అంతట దేవగురువగు బృహస్పతి ఇట్లు చెప్పసాగెను – తన భర్త సమీపమున లేకుండా దూరదేశమున అతడు మరణించినప్పుడు గాని గర్భవతియై ఉన్నప్పుడు గాని, ఇంకనూ పాలుత్రాగే పసిపిల్లను కలిగియుండిన గాని అట్టి స్త్రీ సహగమనము చేయకూడదు. అట్లు చేయుట మహాపాపమగును. అయితే, అట్టి స్త్రీలు వైధవ్యము ప్రాప్తించిన స్త్రీలకు చెప్పబడిన ధర్మములను చక్కగా ఆచరించినచో, వారికి సహగమనమొనర్చిన

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

పుణ్యఫలమే సిద్ధించును. ఇందులో ఎంతమాత్రము సందేహము లేదు. భర్త మరణించిన స్త్రీ కేశములను వపనము చేయించుకొనవలెను. విధవకు వెంట్రుకలుండినచో అవి ఆమె భర్తకు పరలోకమున బంధకములై నరకబాధలపాల్జేయును. అందువలన వారు తప్పక కేశవపనమును చేయించుకొనవలెను. (1-10)

నిత్యము ప్రాతఃకాలమున స్నానము చేయవలెను. ఒకపూట మాత్రమే భుజింపవలయును. ఒక్క అన్నమునే తినవలయును. అనగా ఒక్క ధాన్యముతో వండిన అన్నమును మాత్రమే ఆమె తినవలయును. రెండవపూట ఉపవసింపవలెను. అంతేగాక, మూడు రోజులకు ఒక పర్యాయము, ఐదు రోజులకు ఒక పర్యాయము, పదిహేను రోజులకు ఒక పర్యాయము, మాసమున కొకమారు ఆమె ఉపవసింపవలెను. లేదా, చాంద్రాయణ వ్రతమును శాస్త్రవిధానముగా ఆచరించవలెను. అనగా అమావాస్య మరుసటిరోజున చంద్రోదయము అయిన నాటినుండి ఒక్కొక్క తిథి నాడు ఒక్కొక్క ముద్ద ఆహారమును పెంచుకొనుచూ, పౌర్ణమి రోజున పదిహేను ముద్దలు మాత్రమే భుజింపవలెను. అటులే, పౌర్ణమి అనంతరము వచ్చే కృష్ణపక్షమునందు ఒక్కొక్క తిథినాడు ఒక్కొక్క ముద్దను తగ్గించుకొనుచూ అమావాస్య రోజున ఒక ముద్ద మాత్రమే స్వీకరింపవలెను. దీనినే చాంద్రాయణ వ్రతమని అందురు. శారీరక శక్తి నశించుటవలన లేదా, వృద్ధాప్య దశ వలన ఆమెకు శక్తి లేని యెడల ఒకపూట భోజనము చేయవచ్చును. ఇంకను ఫలములను, లేదా పచ్చి కాయగూరలను తినవచ్చును. కొద్ది మాత్రము పాలను స్వీకరింపవచ్చును. ఎట్లనగా, ఎంతమాత్రమైన ఆహారముతో ప్రాణములు నిలబడునో, అంతమాత్రమే ఆహారమును తీసుకొనవలెను. అధికముగా భుజింపకూడదు. భర్త లేని స్త్రీ మంచముపై పడుకొనినచో, ఆమె భర్త ఘోరమైన రౌరవాది నరకములో పడిపోవును. అనంతరము భర్తతో పాటుగా ఆమె కూడా నిరంతరము నరకయాతన అనుభవించును. శరీరమునకు గంధ, పుష్ప, పరిమళ ద్రవ్యములను ఉపయోగించుకొనకూడదు. మంగళస్నానములను చేయకూడదు. దేహమర్దనము పనికిరాదు. తాంబూలమును, పుష్పములను పూర్తిగా విసర్జించవలెను. ఒకవేళ అట్టి స్త్రీకి పుత్రసంతానము లేనియెడల పుత్రునివలె ఆమె నువ్వులు, దర్భలు మొదలైనవాటితో గోత్రనామములను ఉచ్చరించి పితృదేవతలను ఉద్దేశించి తర్పణములను విడువవలెను. ఆమె నిత్యము విష్ణుపూజను చేయవలెను. తన భర్త విష్ణువే అని భర్త రూపమును మనసులో ముద్రించుకొని, దానిని విష్ణుస్థానములో నిలిపి, శ్రద్ధగా, అతి భక్తితో పూజించవలెను. లేదా, ఇతరదేవతలను పూజించినపుడు ఆ దేవతయందు తన భర్త రూపమును భావించుకొనుచు పూజింపవలెను. భర్త జీవించియున్న కాలమున ఎట్టి ఆచారములను, అభ్యాసములను భర్త యొక్క ఆజ్ఞచేత పరిపాలించుచుండెనో, అట్టి ఆచారములను అన్నింటిని భర్త పోయిననూ తాను మానుకొనరాదు. తీర్థయాత్రలు గాని, ఉపవాస వ్రతములు గాని భగవదాజ్ఞతో

చేయుటవలన పవిత్రమగును. లేదా, బ్రాహ్మణ గురువుద్వారా అనుజ్ఞను తీసుకొని ఆచరించుటవలన మేలగును. తాను సువాసినిగా ఉన్నప్పుడు తన మనసులో ఏయే వస్తువులయందు ఎక్కువ మక్కువను కలిగియుండెనో, అటువంటి వస్తువులను విద్వజ్ఞులైన బ్రాహ్మణులను పూజించి, వారికి దానమీయవలెను. వైశాఖమాసము, మాఘమాసము, కార్తిక మాసములయందు ఆచరింపవలసిన ఆచారములు విశేషమైనవి. ఈ మాసములయందు విష్ణుదేవుని ప్రీతిగా ఆయా మాసవ్రతములను ఆచరింపవలెను. తీర్థములయందు మాఘస్నానమును విష్ణుస్మరణతో చేయవలెను. వైశాఖమాసమునందు జలకుంభ దానము చేయవలెను. కార్తికమాసమునందు దీపారాధనము చేయవలెను. దీపదానముసీయవలెను. బ్రాహ్మణులకు తమ శక్తిననుసరించి దక్షిణను జోడించి ఘృత దానము చేయవలెను. మాఘమాసము నందు తిలదానము, ఘృతదానము చేయవలెను. వైశాఖమాసమునందు నిర్జన ప్రదేశములయందు చలివేంద్రములను ఏర్పాటు చేయవలెను. శివాలయమునందు ఈశ్వరునకు పవిత్రమైన జలమును తెచ్చి అభిషేకించవలెను. పరమశివుని పరిమళ గంధముతో పత్రపుష్పములతో పూజించినచో అనంతపుణ్యము లభించును. అంతేగాక, పూజాద్రవ్యములను శివునకు సమర్పింపవలెను. తమ శక్త్యానుసారముగా బ్రాహ్మణ గృహములకు నీటిని అందించవలెను. మధ్యాహ్నవేళలో అతిథులకు, విద్వజ్జనులకు అన్నదానము చేయుచుండవలెను. (11-29)

తీర్థయాత్రలకు పోవు వారలు తమ ఇంటికి వచ్చినపుడు వారికి పాదప్రక్షాళనము చేయవలెను. అట్టివారికి పాదరక్షలను, గొడుగులను యథాశక్తిగా దానమొనర్పవలెను. త్రాగుటకు జలపాత్రలను అందించవలెను. వారిని కూర్చుండజేసి,వారి బడలికను తొలగించడానికి విసనకర్రతో వీచి తగిన వస్త్రములను దానము చేయవలెను. పరిమళ గంధమును, కర్పూర తాంబూలాదులను సమర్పించవలెను. మామిడి, ద్రాక్ష, కొబ్బరితో కూడిన బెల్లపు పానకమును తయారుచేసి వారికి అందించవలెను. ఈవిధముగా ఏ దానము చేసినను అప్పుడు తన భర్తను ఉద్దేశించి అతనిని స్మరించి, నమస్కరించి, అతని ప్రీతికోసమై, అతని కృతార్థతకొరకై దానమును చేయవలయును. ఇక కార్తికమాసమునందు సజ్జలతో చేసిన అన్నమును భుజింపవలెను. ఒకేపూట భోజనము చేయవలెను. వంకాయలు, మునక్కాయలు, కందగడ్డ, నూనె, తేనెలను విసర్జింపవలెను. కార్తికమాసమంతయును కాంస్యపాత్ర అనగా కంచుపాత్రలో భుజించకూడదు. ద్విదళధాన్యమును విసర్జింపవలెను. మనసును పవిత్రముగా ఉంచుకొనవలెను. అపవిత్రమైన వస్తువులను విసర్జింపవలెను. వాటిని తాకకూడదు. మోదుగ ఆకుల విస్తరిలో భోజనము చేయవలెను. తాను ఏయే వ్రతములను ఆచరించెనో, వాటికి తగు ఉద్యాపనములను కూడా చేయవలెను. కంచుపాత్ర లేదా, దొప్పను నేతితో నింపి మనస్ఫూర్తిగా అత్యంత ప్రీతితో ఒక బ్రాహ్మణునకు దానము చేయవలెను. తాను నేలపైననే నిద్రించవలయును. కావున,

ఆ నియమమును స్వీకరించి ఒక బ్రాహ్మణునకు మంచమును దానము చేయవలెను. మరొక ముఖ్యమైన అంశమేమనగా, తాను ఏయే వస్తువులను విసర్జించునో, అయా వస్తువులను బ్రాహ్మణులకు దానమొనర్చవలయును. బెల్లము, ఉప్పు మొదలైన పదార్థములను కార్తికమాసము నెలరోజులపాటు విడిచిపెట్టవలెను. పాలు,పెరుగును వర్జించి ఈ వ్రతమునకు ఉద్యాపనముగా తమ శక్త్యానుసారము సాలంకృతమైన గోదానము చేయవలెను. విశేషమైన మరొక వ్రతము చెప్పబడినది. అదియే దీపదాన వ్రతము. దీని మహిమ అనంతమైనది, వర్ణనాతీతము అని దేవతలతో బృహస్పతి చెప్పుచున్నాడు. దీపదానవ్రతమునకు ఇతర దానధర్మములు అన్నీ పదునారవ వంతునకు కూడా సరిపోవజాలవు. అందువలన అనంతఫలమును పొందుటకై కార్తికమాసమునందు దీపదానము తప్పక చేయవలెను. (30-41)

ఇక మాఘమాసమందు సూర్యోదయాత్పూర్వమే మేల్కొని నిత్యకృత్యములను పూర్తిచేసి మాఘస్నాన మాచరింపవలెను. నెలరోజులపాటు సభక్తికముగ మాఘస్నానమును ఆచరింపవలెను. చివరకు నువ్వులు, ఖర్జూరములతో లడ్డూలను చేసి బ్రాహ్మణులకు భక్తిపూర్వకముగా సమర్పింపవలెను. మాఘమాసపు చివర వివిధ పక్వాన్నములతో సహా బ్రాహ్మణ సమారాధనము చేయవలెను. ఇక ఏలకులు, మిరియాలు, చక్కెర కలిపి నేతితో అరిసెలు చేసి సన్యాసులకు, తాపసికులకు దానమీయవలెను. ఇది హేమంతఋతువుయొక్క శీతబాధా నివారణార్థము ఎంతయో ఉపకరించును. హేమంతఋతువు నందు శీతబాధా నివారణార్థముగా కట్టెలు, కప్పుకొనుటకు వస్త్రములు, కంబళ్లు దానము చేయవలెను. పుణ్యాత్ములగు తాపసులకు, సద్బ్రాహ్మణులకు నిద్రించుటకై పర్యంకమును అనగా మంచమును దానమీయవలెను. రంగురంగుల ఎఱ్ఱని వస్త్రములను, కంబళిని బ్రాహ్మణునకు దానమీయవలెను. చలిబాధను నివారించుకొనుటకు ఉష్ణప్రేరకములైన ఔషధములను అందించవలెను. ప్రధానముగా హేమంతఋతువునందు ఏలకులు, కర్పూరము వేసిన తాంబూల దానమును చేసినచో అనంతపుణ్యఫలము లభించును. ఒక సద్బ్రాహ్మణ కుటుంబమునకు గృహదానము చేయవలెను. ఆ కుటుంబమునకు ఒక సంవత్సరమునకు సరిపడు గ్రాసదానమును కూడా యథాశక్తిగా అందించవలెను. తీర్థయాత్రకు వెళ్ళునప్పుడు పాదరక్షలను దానమొనర్చవలెను. పరిమళగంధ పుష్పములతో కేశవుని పూజించవలెను. అటులే షోడశోపచారములతో గౌరీశంకరులకు రుద్రాభిషేకమును చేయవలెను. ధూప, దీప, నైవేద్యములతో కూడిన షోడశోపచార పూజను చేసి శంకరుని ప్రీతికోసమై దీపమాలను వెలిగించవలెను. తన భర్తను ధ్యానించి, అతడే నారాయణుడని ఏకాగ్రచిత్తముతో, భక్తిభావముతో పూజింపవలెను. ఏ దైవమును పూజించినప్పటికినీ తన భర్తయు, ఆ దైవము ఏకరూపమని భావించి, భక్తిశ్రద్ధలతో పూజించవలెను. ఇక ఎద్దుమీద ఎక్కకూడదు. రవికను ధరించకూడదు. చేతికి కంకణములు ధరింపరాదు. తెల్లని వస్త్రములనే ధరింపవలెను. ఇది తప్పనిసరిగా

పాటింపవలసిన నియమము. రక్తవర్ణము, కృష్ణవర్ణము లేక చిత్ర విచిత్ర వర్ణములతో కూడిన వస్త్రములను ధరించుటవలన ఎంతయో దోషము వాటిల్లగలదు. ఇక మరొక ముఖ్యమైన వ్రతము చెప్పబడినది. అదేమిటనగా, వైధవ్యము ఆవహించిన స్త్రీ తన పుత్రుని మాటలను అనుసరించి వ్యవహరింపవలెను. **'ఆత్మా వై పుత్రనామాసి'** అనగా భర్తయే పుత్రరూపముతో జన్మించునని వేదమాత చెప్పుచున్నది. కావున, పుత్రుని ఆజ్ఞ ప్రకారముగ నడచుకొనవలెను. ఈవిధముగ శాస్త్రములయందు వివరింపబడిన విధవా ధర్మములను, ఆచారములను ఎంతమాత్రము అతిక్రమింపకుండా ఏ స్త్రీ ఆచరించునో, అట్టి స్త్రీ సహగమనము చేసిన సుకృతమును తప్పక పొందగలదు. ఒకవేళ మరణించిన ఆమె భర్త లోగడ పాపియై జీవించి నరకలోకమున ఉండినచో లేదా, ఇతర నీచమైన ఏ యోనిలోనో జన్మించి బాధపడుచున్నచో, ఇంతకుపూర్వము వివరింపబడిన సదాచారమును, వైధవ్య ధర్మములను వివిధ ధర్మములను చక్కగా ఆచరించిన స్త్రీ తాను మరణించినప్పుడు తనతో పాటుగా తన భర్తను సయితము తీసికొని స్వర్గలోకమునకు నిరాటంకముగా వెళ్ళగలదు. ఇందు ఎంతమాత్రము సందేహము అక్కరలేదు అని ఈ ప్రకారముగ దేవగురువైన బృహస్పతి ఇంద్రాది దేవసమూహముతో, ఋషిగణముతో వివరించి చెప్పుచూ పతివ్రతా శిరోమణి లోపాముద్రను విశేషముగా ప్రస్తుతించెను.పతివ్రతా స్త్రీలందరూ భాగీరథులతో సమానమని, వారి భర్తలందరును శంకరులని భావించి ఆ ఉభయులను పూజించవలెను" అని దేవగురువైన బృహస్పతి పతివ్రతా ధర్మములను విపులముగా వర్ణించి చెప్పినాడని యోగీశ్వరుడు గాణగాపురము నందు బ్రాహ్మణ పతివ్రతా స్త్రీతో వివరించి చెప్పెను. (42-60)

పిదప ఆయన ఇట్లనెను – "అమ్మా! మీకు చెప్పవలసిన దంతయునూ శేషము లేకుండా సాంగముగా తెలియజెప్పితిని. సహగమనమును ఆచరించుటయా లేక, విధవా ధర్మములను పాటించుటయా? ఈ రెండింటిలో నీకు ఏది రుచించుచున్నదో, ఏది అంగీకారమని తోచుచున్నదో దానినే ఆచరింపుము. నా మాటలను బాగుగా గ్రహించి, దుఃఖమును త్యజించివేసి, మనసును స్థిరపరచుకొనుము. పరలోకసాధనమును గూర్చి రెండు మార్గములను నీకు తెలియజెప్పితిని. నీకు ధైర్యము కలదా! వెంటనే మరణించిన నీ భర్తతో పాటుగా సహగమనమును ఆచరింపుము. లేదా, వైధవ్యధర్మమును ఆచరించుటకు ప్రతిజ్ఞ పూనుము. అట్లైనను నీకు సద్గతియే సిద్ధించును. ఈ రెండింటిలో దేనిని ఆచరించిననూ సమానమైన పుణ్యఫలమే నీకు సిద్ధింపగలదు. ఇందెంతమాత్రము సందేహము వలదు. తల్లీ! నీ మనసునకు ఏది ఇష్టమగుచున్నదో దానినే తెలియజెప్పుము" అని ఆ యోగీశ్వరుడు అత్యంత ప్రేమభావముతో తన హస్తమును ఆమె శిరముపై ఉంచి అడిగెను. అప్పుడా స్త్రీ గౌరవభావముతో చేతులు జోడించి భక్తిపూర్వకముగ తలను వంచి కరుణరసము ఉప్పొంగి ప్రవహించునటుల ఇట్లు విన్నవించినది-

"యోగీశ్వరా! మీకు జయము, జయము. మీరే నాకు తండ్రి. మీరే నాకు సోదరులు. చివరి సమయమున చక్కని పరమార్థమును అందించెడు ఆత్మీయమైన హితవరిగా మీ దర్శనము కలిగినది. చివరగా నాకు బంధువులెవరునూ లేరు. ఆ భగవంతుడే పరలోకబంధువుగా మిమ్ములను నా వద్దకు పంపించెనని దృఢముగా నిశ్చయమును చెందితిని. స్వామీ! మీరు అనేకవిధములైన ధర్మములను చెప్పితిరి. విధవా ధర్మములను ఆచరింపగల ధైర్యము నాకు కనబడుటలేదు. అవి బహుకష్టములుగా తోచుచున్నవి. పైగా నేను తారుణ్యావస్థలో ఉంటిని. అత్యంత సౌందర్యోపేతమైన ఈ శరీరముతో జీవించియున్నచో, కలికాలమునందలి లోకులద్వారా వచ్చి పడే నిందాపనిందలను నేను భరింపజాలను. నేనెంతటి పవిత్రముగ ఉన్నప్పటికినీ లోకులు నాపైన నింద మోపుటకు ఎంతమాత్రము వెనుకాడబోరు. కావున, నా మనసు సహగమనమును చేయుటనే కాంక్షించుచున్నది. తద్వారా అపారమైన పుణ్యరాశి లభించునని మీ మాటలద్వారా నిశ్చయము కలిగి, నాకు ఎనలేని ఆనందము కలుగుచున్నది. కావున, స్వామీ! యోగీశ్వరా! నేను నా భర్తతో పాటుగా సహగమనమొనర్చి అపరిమితమైన సంతోషముతో వారితో పాటుగా నేను పరలోకమునకే వెళ్లెదను" అని పదే పదే యోగీశ్వరుని చరణకమలములపై తన తలనుంచి **నమస్కరించి ఇట్లు ప్రార్థించెను** – "స్వామీ! భవసాగరములో మునగబోవుచున్న నన్ను తరింపజేయుము. కరుణాపయోనిధియైన యోగీశ్వరరూపముతో వచ్చిన ఆ పరమేశ్వరుడే అత్యంత దయను పూని కారుణ్యదృష్టితో ఆమెను లేవనెత్తి హాయిగా నీ భర్తతోపాటుగా నీవు నివసించుమని అభయమును ఇచ్చిరి. తల్లీ! మరొక్కమాట నీకు తెలియజేసెదను. నీవు నీ భర్త శవమును నదీతీరమున దహించుటకు ముందు ఒకసారి సంగమమునకు వెళ్ళిరావలసినది. నా మాట వినుము. తప్పనిసరిగా సంగమానికి వెళ్లుము. మరియొక్క విశేషమైన మాటను చెప్పెదను. మనసు పెట్టి దృఢముగా వినుము. (61–72)

శ్రీగురుమూర్తిని దర్శించి నీ భర్తకు ఆరోగ్యమును సంపాదించుకొనవలయునను శుభేచ్ఛతో, దృఢమైన విశ్వాసముతో నీవు నీ భర్తను ఎంతో దూరమునుండి శ్రమపడి గాణగాపురమునకు చేరితివి. కాని, నీవు దైవోపహతురాలవైతివి. **కాలమును ఎవ్వరూ జయింపలేరు.** సర్వమూ ఈశ్వరుని సంకల్పానుసారమే జరిగితీరును. బ్రహ్మలిఖితమును తప్పించుకొనుటకు ఎవరికి సాధ్యము. కారణము లేకుండా ఏ కార్యమూ జరగదని శ్రుతి చెప్పుచున్నది. దానికి ఎవ్వరూ దుఃఖించకూడదు. దుఃఖించుటవలన ఎట్టి ప్రయోజనము ఒనగూడదు. మన దుఃఖము వ్యర్థమే యగును. హరిశ్చంద్రుని యంతటి మహారాజు సైతము ఒక మాలవాని ఇంట దాస్యము చేయలేదా? కావడిపై నీటిని మోయలేదా? బలిచక్రవర్తి పాతాళలోకమునకు వెళ్ళలేదా? ఆరు కోట్ల సంవత్సరముల ఆయుర్దాయము కలిగియుండి, విర్రవీగుచున్న రావణుడు కూడా కాలముచే కబళింపబడెను కదా! ఇక దుర్యోధనుడేమాయెను. ఇచ్ఛామరణమును పొందగలిగిన భీష్ముడు ఏడి? సర్పభయముతో

దాగుకొన్నటువంటి పరీక్షిత్తు యొక్క మరణమును మనము వినలేదా? జగత్తునందు అనంతరూపములతో, అనంత అవతారములు వచ్చికూడా కాలప్రవాహములో తిరోహితము కాలేదా? అదేవిధముగ దేవదానవులందరూ కాలమునకే లొంగిపోయిరి కదా! అందువలన, ఈ భూమిమీద ఎవరునూ కాలమును జయింపలేరు. కాలమే అందరిని స్వాధీనపరచుకొనుచుండును. ఇది నిశ్చయము. మరొక్కమాట. ఇట్టి కాలమును ఒక్క గురువు తప్ప ఇంకెవరునూ జయించలేరు. ఇట్టి దృఢనిశ్చయమైన భావము ఎవరియందు దృఢపడియుండునో, వారియెడల గురుమూర్తి తప్పక ప్రసన్నులయ్యెదరు. ఈ మాటను నీవు బాగుగా గుర్తుపెట్టుకొనుము. అయితే, అమ్మా! నీవు గురుమూర్తిని దర్శింపవలయుననే స్థిరసంకల్పముతో వచ్చితివి కావున, ఇప్పుడు నీవు త్వరగా సహగమనమునకు తరలిపొమ్ము. చిట్టచివరి క్షణములో గురుదర్శనమునకు తప్పనిసరిగా వెళ్లుము. ఎంతయో కష్టపడి ఇంతదూరము వచ్చినదానవు శ్రీగురుచరణ కమలములను కళ్ళతో చూచిన అనంతరమే నీవు నీ భర్తను అనుసరించి వెళ్లుము" అని ఆ యోగీశ్వరుడు హెచ్చరికగా చెప్పి కొంత భస్మమును మంత్రించి ఆమె నుదుటిమీద విభూతిని ధరింపజేసి ఆమెకు నాలుగు రుద్రాక్షలను ఇచ్చెను. **పిదప ఆ యోగీశ్వరుడు మరల ఇట్లు చెప్పెను–** "రెండు రుద్రాక్షలను నీ మెడలో కంఠసూత్రముగా ధరించుము. మిగిలిన రెండింటిని నీ భర్తయొక్క రెండు చెవులకు అనగా ఒక్కొక్క రుద్రాక్షను ఒక్కొక్క చెవికి కట్టుమని" చెప్పి అతనిని దహనము చేయుమనెను. అనంతరము మరియొక ముఖ్యమైన మాటను చెప్పెదను వినుము. "తల్లీ! గురుదర్శనమునకు వెళ్లుచున్నప్పుడు బ్రాహ్మణులు, శిష్యులు శ్రీగురుచరణకమలములను రుద్రసూక్తమును చెప్పుచూ, అభిషేకమును చేయుచుందురు. అట్టి తీర్థమును నీవు స్వీకరించి కొంత నీపై ప్రోక్షించుకొని మిగిలిన తీర్థమును నీ భర్తయొక్క శవముపైన భక్తితో చల్లుము. ముత్తైదువులకు వాయనములు దానములుగా ఇవ్వుము. బ్రాహ్మణులకు ద్రవ్యమును దక్షిణలుగా అర్పించుము. అనంతరమే నీవు సహగమనము చేయుము" అని చెప్పి ఆ యోగీశ్వరుడు అచటినుండి వెళ్ళిపోయెను. తదనంతరము ఆ పతివ్రతా స్త్రీ యోగీశ్వరుడు చేసిన ఉపదేశమును శిరసావహించి భర్తతోపాటుగా సహగమనము చేయుటకే సిద్ధపడెను. (73–89)

షోడశకర్మను చక్కగా నిర్వహించుటకు గాను ఒక సద్బ్రాహ్మణుని ఏర్పరచుకొని ముందుగా ప్రేతమునకు ప్రాయశ్చిత్తాది కర్మలను పూర్తిచేసెను. మరణానంతరము చేయవలసిన షోడశ కర్మను పూర్తిచేసి, తాను స్నానమొనర్చి, పట్టువస్త్రమును ధరించెను. ముత్తైదువులు ధరించెడు సమస్త ఆభరణములను, పసుపు కుంకుమలను అలంకారముగా ధరించెను. విధివిధానముగా ప్రేతకర్మలను పూర్తి గావించి తన చేతితో అగ్నిని పట్టుకొని ఆ స్త్రీ బయలుదేరి బ్రాహ్మణులద్వారా భర్త శవమును గంగయొద్దునకు తీసికొనిపోవుచున్నప్పుడు ఆమె మనసునకు

మిగుల ఆనందము కలుగుచుండెను. పదునారేండ్ల ప్రాయముతో, అత్యంత రూపసౌందర్యమును కలిగి సర్వాభరణభూషితురాలై, సాక్షాత్తుగా ఆమె లక్ష్మీదేవివలె గోచరించుచుండెను. గాణగాపురమునందు గల నాలుగు వేల మందికి పైగా స్త్రీ పురుషులు ఆమెను చూడవచ్చిరి. ఆ పతివ్రతను చూచి ఆకసమున సురవరులందరు 'ఆహాఁ!' యని తలలను ఊపుచుండిరి. "ఎంత విచిత్రము. అబ్బా! ఎంతటి ఆశ్చర్యము. ఎంతటి సాహసము. పిన్నవయస్సులోగల ఈ అమ్మాయి పతితో సహగమనము చేయుటకు ఆనందపరవశురాలై అడుగులు వేయుచుండెను. ఇది పూర్వజన్మకర్మ ఫలమే" యని కొందరనుచుండిరి. "అయ్యో! పాపము దురదృష్టవంతురాలు. ఎట్టి సుఖమునూ ఎరిగినది కాదు కదా! పతితో సుఖమును అనుభవించలేదు. ఒక్క సంతానమైననూ కలుగలేదు. ప్రాణములను అగ్నిదేవునికి ఆహుతి చేయుటకు అత్యంత ఆనందముతో వెళ్ళుచున్నదని" కొందరు పలుకుచుండిరి. మరికొందరేమో "సహగమనమనే పేరిట వ్యర్థముగా తన ప్రాణములను వదలుకొనుచున్నది. ఎందుకమ్మా! తిరిగి పుట్టింటికి వెళ్ళి మీ తల్లిదండ్రులతో హాయిగా వుండవచ్చును కదా!" అని పలుకుచుండిరి. కొందరు జ్ఞానులు ఆమెను తిలకించి – "ఈమెయే నిజమైన పతివ్రత. ఆ జగన్నాథుడు లోకమునందలి సమస్త స్త్రీలకు ఇట్టి బుద్ధిని ఇచ్చినచో ఎంతయో బాగుండును. ఆహా! ఈమెను కన్న తల్లిదండ్రులు ఎంతటి ధన్యులో కదా! సహగమనమొనర్చి ఉభయ వంశములకు చెందిన నలుబది రెండు తరముల వారిని ఉద్ధరించుచున్నది. శవముతోపాటు ఆమె వేసే ఒక్కొక్క అడుగునకు, ఒక్కొక్క అశ్వమేధ యాగము చేసిన పుణ్యఫలము లభించుచుండెను" అని ప్రశంసించుచుండిరి. ఈవిధముగా లోకులు తమ చిత్తమునకు వచ్చినరీతిగా పలుకుచుండిరి. కాని, ఆమె మాత్రము ఎవరి మాటలను వినిపించుకొనకుండా సహగమనము చేయుటయందే నిశ్చయమును పూని తన భర్తతోపాటుగా నదీతీరమునకు చేరుకొనెను. కట్టెలు, పిడకలు మొదలగు వాటితో చితిని సిద్ధము చేసి, దానిపై భర్త శవమును పడుకొనబెట్టినది. అనంతరము ముత్తైదువులను పిలిపించి చేట, రవిక, పసుపు కుంకుమలు, కాటుక, స్త్రీలు ధరించెడు కర్ణాభరణములు, నల్లపూసల గొలుసులు, మంగళసూత్రములను వారికి వాయనదానములుగా ఇచ్చెను. పరిమళ గంధపుష్పాదులతో భక్తితో బ్రాహ్మణులను, సువాసినీ స్త్రీలను పూజించి అపారమైన ద్రవ్యమును దానము జేసెను. అనంతరము అందరికీ శిరసు వంచి నమస్కరించి, **ఆమె ఇట్లు పలికెను.** "అమ్మలారా! మీకెల్లరకు నమస్కరించుచుంటిని. నేను మా పుట్టినింటికి పోవుచుంటిని. నాకు అనుజ్ఞను ఇవ్వవలసినది. నా యందు దయ చూపగలరు. నా తండ్రి శూలపాణి. మా తల్లి పార్వతీదేవి. అంతఃకరణమునందు అత్యంత ప్రేమభావమును కలిగి మా యమ్మ నన్ను సగుణరూపముతో తమ వద్దకు రమ్మని ఆహ్వానించినది. దీపావళి పండుగ వచ్చినది. నిర్మలమైన చిత్తముతో నా భర్తతో పాటు కలిసి నేను మా అమ్మ దగ్గరకు వెళ్ళుచుంటిని. నాపై కృపజూపుడు. సతీసహగమనమునకై

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

వెళుచున్న ఆమె తనతోపాటుగా గ్రామమునుండి వచ్చినవారినందరిని కలయజూచి, "అయ్యలారా! అమ్మలారా! మీరందరు తిరిగి తమతమ ఇండ్లకు వెళ్ళగలరని కోరినది. మరొక్కమాటను మీరు మన్నించగలరు. మా బంధువులుగాని, తలిదండ్రులు గాని, మా అత్తమామలు గాని, ఎప్పుడైనను మీకు కనబడి, మా క్షేమమును గూర్చి అడిగినచో, ఈ విషయమును వారికి తెలియజెప్పకుడు. ఈ వార్త వినినంతనే వారు తమ ప్రాణములను వదలిపెట్టెదరు. అప్పుడు మీకు ఒక వంశమును హత్య చేసిన పాపము చుట్టుకొనును. మేము భీమాతీరమున శ్రీగురుమూర్తి సన్నిధిలో క్షేమముగా ఉన్నామని మా వారితో చెప్పగలరు. శ్రీగురుదర్శనార్థమై వచ్చిన పిమ్మట ఆమె భర్తకు ఆరోగ్యము చేకూరినది. వారు ఉభయులు అత్యంత సంతోషముతో ఉన్నారు అని మాత్రమే మా వాళ్లతో, మీరు చెప్పగలరు. మా అత్తమామలకు ఏవిధముగ చెప్పెదరో, మా తలిదండ్రులకు కూడా అదేప్రకారముగ చెప్పగలరు. ఆప్తులు, ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు మున్నగు వారెవరైనా మా గురించి ప్రశ్నించిననూ వారికి ఇదేవిధమైన సమాధానమును చెప్పగలరు" అని ప్రార్థించినది. భర్త శవము దగ్గర నిలబడి ప్రసన్నవదనముతో, అమ్మాయి చెప్పుచున్న మాటలను విని అక్కడున్న వారందరూ ఘొల్లుమని దుఃఖించిరి. వెంటనే అగ్నిగుండమునందు కట్టెలను, పిడకలను వేసి అగ్నిని పెట్టబోవుచుండగా యోగీశ్వరుడు చెప్పిన మాటలు ఆమెకు జ్ఞప్తికి వచ్చినవి. వెంటనే రెండు రుద్రాక్షలను తీసి ఆ శవముయొక్క ఒక్కొక్క చెవికి ఒక్కొక్కటి కట్టెను. మిగిలిన రెండు రుద్రాక్షలను తన మంగళసూత్రముతో కలిపి మెడలో ధరించెను. అనంతరము అచట చేరిన బ్రాహ్మణులను చూసి చేతులు జోడించి, **ఇట్లు ప్రార్థించెను**– "బ్రాహ్మణోత్తములారా! శ్రీగురుమూర్తిని దర్శింపవలెనని సంకల్పము గలిగినది. స్వామివారి దర్శనము చేసికొని తిరిగి చితివద్దకు నేనే వచ్చెదను. దయతో నాకు అనుజ్ఞనిచ్చి ఈ చితివద్దనే మీరు ఉండగలరు" అని ఆమె విన్నవించెను. ఆమె మాటలను వినిన బ్రాహ్మణోత్తములు "తల్లీ! శీఘ్రముగ వెళ్ళి గురుమూర్తి చరణములను దర్శనము చేసికొనుము. కానీ, సూర్యాస్తమయము కాకముందే దహనము చేయవలసి యుండును. కావున, శీఘ్రముగ రావలసినదని చెప్పిరి. బ్రాహ్మణులవద్ద అనుమతి గైకొని ఆ పతివ్రతయైన స్త్రీ హృషీకేశుడైన శ్రీనృసింహసరస్వతీ స్వామివారు ఉన్న సంగమ స్థలమునకు బయలుదేరెను. ఆమెతోపాటుగా వెంట వచ్చిన స్త్రీలు, పురుషులు ఇతర బ్రాహ్మణులు ఆ పతివ్రతా స్త్రీ వైపు ఆసక్తితో చూచుచు ఆమె వెనకాల వెళ్లుచుండిరి.(90–120)

ఆ విప్రవనిత సంగమమునకు చేరబోవుచూ దారిలో **శ్రీగురుమూర్తిని ఈవిధముగ స్తుతించుచుండెను.** "స్వామీ! నరకేసరీ! నా జీవితమునందలి పూర్వాపరములయందు నేనెంతయో అభాగ్యురాలనని భావించి, నన్ను ఉపేక్షించితివా! సర్వేశ్వరుడవు, శరణాగత రక్షకుడవు అని నీకు గొప్ప బిరుదములెన్నియో కలవు. కానీ, అవన్నియూ నా యెడల నిరుపయోగములయ్యెను కదా! నీవు త్రిమూర్త్యావతారుడవు. సత్త్వరజస్తమోగుణములతో,

సృష్టి, స్థితి సంహారములను చేయువాడవు. సహజలీలగా రజోగుణయుక్తుడవై త్రిభువనములను రచించువాడవు, సత్త్వగుణయుక్తుడవై సృష్టిని పరిపాలన చేయువాడవు నీవే కదా! ఇక తమోగుణయుక్తుడవై సమస్త జీవులను లయము చేయువాడవు కూడా నీవే కదా! ప్రభూ! ఈ మూడు గుణములు మీవే. దేవా! మీరే త్రిమూర్తులు. మీ వద్ద సమస్త సిద్ధులు కొలువుదీరియున్నవి. నవనిధులు నాట్యమాడుచున్నవి. బహుశా నాలో దుర్బుద్ధి గలదని నా యెడల కరుణ చూపలేకపోయితిరి కాబోలు! ఐననూ, నేను దురదృష్టవంతురాలను. కావుననే, నన్ను నీవు ఉపేక్షించితివి. అనేకవిధముల బాధలను అనుభవించు ఒక వ్యక్తి తన బాధను మొరపెట్టుకొనుటకై రాజభవనమునకు వెళ్ళిన మరుక్షణమే వారతనికి సాయమందించెదరు అని కొందరు మిత్రులు చెప్పిన మాట విని ఒక దరిద్రుడు రాజుగారి వద్దకు వెళ్ళినట్లుగా, ఒక మంచి వైద్యుడు గలడు, అతడు నీ వ్యాధిని తప్పక నివర్తింపచేయును. అతని హస్తగుణము చాలా గొప్పది, అతనిచేత ఔషధము సేవించినచో చిటికెలో ఆరోగ్యము సిద్ధించునని, హితవరులు చెప్పగా రోగి నమ్మి ఆ ఉత్తమ వైద్యుని సమీపించినట్లుగా, అపారమైన నీ ఖ్యాతిని విని నీవు త్రిమూర్త్యవతారమూర్తివని, భక్తజనులకు ఆశ్రయస్థానమని, ఆర్తత్రాణపరాయణుడవని జనులందరు ఎలుగెత్తి చాటుచుండిరి. అట్టి మాటలను విని నేను దృఢముగా నిన్ను విశ్వసించి ఇరవై క్రోసుల దూరమునగల మా గ్రామము నుండి రోగియగు నా భర్తను తీసికొని, మా తల్లిదండ్రులను, అత్తమామలను విడిచి వచ్చితిని. ప్రభూ! నేనేమి అపరాధము చేసితినని నన్నెందులకు ఉపేక్షించితివి. తప్పక నీ దర్శనము కాగలదు. నా భర్తకు ఆరోగ్యము సిద్ధింపగలదని ఎంతయో ఆశతో ఉబలాటపడుచూ అనుక్షణము నిన్నే స్మరించుచు, నీ ధ్యానముతోనే పరుగెత్తుకొని నీ నివాసమునకు చేరుకొంటిని. కాని, నా ఆశ అడియాసయే అయినది. ఓ కృపాసింధూ! నా వంటి స్త్రీలు ఎందరో సర్వసౌభాగ్యములను కలిగి, పుత్రపౌత్రాదులను పొంది, ఆనందించుచుండిరి. నాకు పుత్రులు లేక ఎట్టి సౌఖ్యమును లభింపక ఒక బండరాయిగా మిగిలితిని. నా భర్త ఒక రోగి. నాకు పుత్రులెట్లు పుట్టెదరు. స్వామీ! అందుగూర్చి ఆక్రోశించుచూ, నిన్ను యాచించుటకొరకే నీ దరి చేరితిని. కరుణామయా! నా భర్తకు తప్పక ఆరోగ్యము కలుగునని, మాకు పుత్రులు కలుగుదురని గొప్ప ఆశతో నిన్ను చేరవచ్చితిని. స్వామీ! ఇక నా మనోరథము ఈడేరినది. ఆహా! నా భర్తకు ఆరోగ్యము కుదుటపడినది. ఎందరో కొడుకులు జన్మించిరి. నా మొక్కు తీరిపోయినది. నా కోరిక తీరినదని, ఘనతరమైన నీ కీర్తిని నా నెత్తిన మోసుకొని నా భర్తతోపాటుగా చితిలో ఆహుతినై పరలోకమునకు వెళ్ళుటకై నీ అనుమతిని యాచించుటకై నీ పాదములచెంతకు వచ్చుచుంటిని" అని ఈవిధముగా తీవ్రమైన మనోవ్యథకు గురియైన ఆ పతివ్రతామతల్లి స్వామిని స్తుతింపుచూ వేగముగా అమరజాసంగమమునకు చేరుకొనెను. అప్పుడచట ఒక అశ్వత్థ వృక్షము క్రింద కూర్చొనియున్న శ్రీనృసింహసరస్వతీ స్వామివారిని దర్శించి, దూరముగా వారికెదురుగా

నిలబడి రెండు చేతులు జోడించి సాష్టాంగవందనమును ఆచరించెను. అప్పుడు శ్రీగురుమూర్తి ఆమెను చూచి 'దీర్ఘసుమంగళీ భవ!' అని ఆశీర్వదించెను.

అంతట కడు భక్తిభావముతో ఆమె తిరిగి మరల సాష్టాంగవందనమును ఆచరింపగా "తల్లీ! నీవు అష్టపుత్రులను పొందెదవు" అని ఆశీర్వదించెను. గురుమూర్తి మాటలను విని అక్కడ చుట్టుప్రక్కల చేరినవారందరూ పకపక నవ్వి ఆమె వృత్తాంతమును శ్రీగురుమూర్తికి వివరించి చెప్పిరి. **ఆమె వెంటగల బ్రాహ్మణులు గురుదేవులతో ఇట్లు పలికిరి–** "స్వామీ! ఈమె భర్త మరణించెను. ఈమె సుమంగళిగా ఎట్లగును? శవమును స్మశానమునకు తీసుకొనిపోయి చితిపై నుంచి సహగమనము చేయుటకు సంకల్పించుకొని, మీ వద్ద అనుమతిని పొందుటకై మీ చరణసన్నిధికి చేరినది. మీ అనుజ్ఞను స్వీకరించి, చితిలో ప్రవేశించి పతితో కలిసి దహనము కాబోవుచున్నది" అని పలికిరి. ఇట్టి స్త్రీని మీరు దీర్ఘ సుమంగళిగా ఉండమని, అష్టపుత్రులు కలిగెదరని ఎట్లాశీర్వదించితిరి? అని విస్మయమును పొందిన బ్రాహ్మణులు చెప్పగా, వారి మాటలను వినిన **శ్రీగురుమూర్తి నవ్వి ఇట్లనెను –** "ఈమె సౌభాగ్యము స్థిరమైనది. ఈమెకు మరణమెట్లు సంభవము. ఈమె భర్త ఎట్లు మరణించెను. ఆశ్చర్యముగా నున్నది. కాదు, కాదు మీరు వెంటనే వెళ్ళి ఆ శవమును నా వద్దకు తీసుకొనిరాగలరు. ఈమె సౌభాగ్యము శాశ్వతమన్న మాట నా నోటినుండి వెలువడినది. నా వాక్యము సత్యము. ఆమె భర్త ప్రాణము ఎట్లు పోగలదు. మీరు సందేహింపవద్దు. శవమును దహింపక వెంటనే నా వద్దకు తీసుకొనిరండు. నేను చూచెదను. నా మాటను శివుడు సత్యము చేయును" అని శ్రీగురుమూర్తి ఆజ్ఞాపింపగా, వెంటనే వారు శవమును తీసుకొని వచ్చుటకై పరుగెత్తుకొని వెళ్ళిరి. అచట చేరినవారందరు మిగుల ఆసక్తితో ఏమి జరుగునో చూడవలెనను ఉత్సుకతతో సంభ్రమాశ్చర్యములతో చూచుచుండిరి. ఇంతలో అచటికి నలుగురు బ్రాహ్మణోత్తములు వచ్చి శ్రీగురుమూర్తిని భక్తితో పూజించుచుండిరి. రుద్రసూక్తమును పఠింపుచు, శ్రీగురుచరణకమలములను అభిషేకించుచుండిరి. భక్తిశ్రద్ధలతో షోడశోపచారపూజను ప్రారంభించిరి. అనేకవిధముల తీర్థములతో వివిధ పూజోపచారములతో వారిని పూజించుచున్న సమయమున అచటికి శవమును తీసుకొనివచ్చిరి. ఆ శవమును శ్రీగురుమూర్తి కెదురుగా పడుకొనబెట్టిరి. వెంటనే శ్రీగురుడు ఆ శవముపైన కప్పిన వస్త్రమును తొలగింపుడని చెప్పెను. శ్రీగురుని అనుమతితో ఆ బ్రాహ్మణులు స్వామి చరణములను అభిషేకించిన తీర్థమును శవముపై చల్లి స్నానము చేయించిరి. వెంటనే శ్రీగురుమూర్తి తాను కూర్చున్న చోటునుండి అమృతమయదృష్టితో ఒకసారి శవమును పరికించెను. అంతే, శ్రీగురుమూర్తి యొక్క అమృతమయదృష్టి సోకినంతనే ఆ శవమునందు చైతన్యము ప్రారంభమయ్యెను. కొన్ని క్షణాలలో నిద్రించిన వాడు

లేచినటుల లేచి కూర్చొని, ఒళ్లు విరుచుకొనుచు అతడు అటు ఇటు చూడసాగెను. తాను నగ్నముగ వున్నందులకు అతడు సిగ్గుపడెను. నూతన వస్త్రమును వెంటనే అందించగా, ఆ వస్త్రమును ధరించి గురుమూర్తి సమీపమున ఓ ప్రక్కన కూర్చొనెను. **వెంటనే తన భార్యను పిలిచి ఇటుల ప్రశ్నిచుచుండెను–** "నన్ను ఎచటికి తీసుకొనివచ్చితివి. ఈ యతీశ్వరులెవరు? చుట్టూరా ఇంతమంది మనుషులు ఏల వచ్చిరి? నాకు మెలకువ రాలేదేమి? నాకింతటి గాఢనిద్ర ఏల పట్టెను? నీవు నన్నెందులకు లేపలేదు?" అని వడివడిగా ప్రశ్నించెను. భర్త మాటలు విని ఆమె జరిగిన వృత్తాంతమునంతయూ అతనికి వివరించి చెప్పెను. వెంటనే ఆ దంపతులు లేచి నిలబడి, శ్రీగురుమూర్తికి సాష్టాంగవందనమును ఆచరించిరి. అచటి మహాజనులందరు మహదానందభరితులై గురుమూర్తికి జేజేలు పలుకసాగిరి.(121–159)

అప్పుడు ఆమె అంజలి ఘటించి, శిరసు వంచి, శ్రీగురుమూర్తిని ఇట్లు స్తుతించెను– "మహానుభావా! నేను పరమపాపిని. అయిననూ నాకు మీ దర్శనభాగ్యము లభించెను. గతములో మేము చేసిన పాపములను అనుసరించి ఇప్పుడు మాకీ జన్మ కలిగినట్లున్నది. త్రిమూర్తీ! సద్గురుమూర్తీ! దుర్బుద్ధితో చేసిన పాపముల ఫలితముగా భవసాగరములో మునిగిపోయితిమి. మీ స్మరణమును మరచిపోయితిమి. సమస్త జీవకోటిని రక్షించే పరమేశ్వరులు మీరేనని, మీరే శరణాగత రక్షకులని, మీకు గొప్ప బిరుదము కలదు. జగద్గురూ! విశ్వమూర్తీ! పరాత్పరా! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరా! సచ్చిదానందస్వరూపా! మమ్ములను రక్షించుము. విశ్వకర్తా! జగద్భర్తా! కృపాసాగరా! గురునాథా! భక్తజనవరప్రదా! మమ్ము రక్షింపుము. గురుమూర్తీ! మీకు జయము. జయము. జటాజూటము కలిగిన పశుపతీ! మీరు మానవదేహమును ధరించి, భూలోకమున భక్తులను రక్షించుటకై అవతరించితిరి. శంకరా! శివా! మహాదేవా! మమ్ములను రక్షింపుము. దేవతలకే శిరోమణులైన మీరు భక్తజనులను ఆపత్తులనెడు భయమునుండి రక్షించుచుదురు. కడు కరుణతో పరిపాలించెదరు. సర్వభూతములయందు నివసించువాడవు. మీ చరణకమలములకు నమస్కరింతును. చిన్మాత్రస్వరూపుడవు. శరణాగతులను రక్షించి, వారికి ఇహపర సౌఖ్యములను ఇచ్చువాడవు. నిరాకారుడవు, భక్తులను తరింపచేయు నిమిత్తము మనుష్యాకారమును ధరించితివి. ఓ నరసింహ సరస్వతీ! నన్ను క్షమింపుము. మమ్ము రక్షింపుము. మీరు మాయారూపములో ఉండినందున మేము మిమ్ము తెలియజాలమైతిమి. చరాచరసృష్టిని లీలగా, తృటిలో మీరు సృష్టింపగలరు. ఓ జ్ఞానస్వరూపా! మీకు వందనము. మీ పాదారవిందములపై నతమస్తకులమగుచున్నాము. మిమ్ము దర్శించిన మాకు తిరిగి జన్మ యుండదని మా మనసునకు నిశ్చయమును కలిగించితిరి. మీరు శిక్షకులై మీ మాటను విననివారిపట్ల కోపగించెదరు. కాని, నీవు ప్రశాంతుడవు. నిర్మలుడవు. నిష్కళంకుడవు. స్వామీ! ఆనందస్వరూపా! కృపాసాగరా! భక్తజనులను రక్షించువారు మీరే. జీవమాత్రులపై కృప చూపి శరణాగతులను రక్షించి, వారికి

ఇహపరసౌఖ్యములను ప్రసాదించెదరు. అంతేగాక, చతుర్విధ పురుషార్థములను అనుగ్రహించెదరు. స్వామీ! మీరు దయాపయోనిధులు. చిన్మాత్రనిధులు. శ్రీనృసింహసరస్వతీ స్వామీ! మమ్ములను క్షమింపుడు. మమ్ములను రక్షింపుడు. మహాప్రభూ! మీకు వందనములు" అని కనులవెంబడి కన్నీరు కారుచుండగా, హృదయము భక్తిభావముతో నిండిపోవగా, గొంతు గద్గదము అగుచుండగా అనేకవిధములుగా, ఎదురుగా నిలిచిన త్రిమూర్తిస్వరూపులైన శ్రీగురుమూర్తిని ఆమె మనస్ఫూర్తిగా స్తుతించెను. (160–174)

నిర్మలమైన మనసుతో స్తుతించిన ఆ విప్రవనితను శ్రీగురుదేవులు ఇట్లు ఆశీర్వదించిరి– "అమ్మా! ఇక మీరు చింతపడవలసిన పనిలేదు. పూర్ణాయుష్మంతులైన ఎనిమిది మంది పుత్రులు మీకు కలిగెదరు. వారు శ్రీమంతులై ఉండెదరు. మీ పాతకములన్నీ కాలిపోయినవి. అంత్యకాలమున మీకు మోక్షము లభించును. మీకు నిజముగా ధర్మార్థ కామమోక్షములనెడు చతుర్విధ పురుషార్థములు లభించినవి. ఇందులో ఎంతమాత్రము సందేహింపవలసిన పనిలేదు. మీ రెంతమాత్రము శంకించకుండా నా మాటలను విశ్వసించి సుఖముగా అనంతరజీవితమును గడుపగలరు" అని శ్రీగురుమూర్తి తన యొక్క వరదాభయహస్తములతో వారిని అనుగ్రహించెను. ఈ సమాచారమును వినిన గాణగాపురగ్రామములో గల వారందరూ పరుగెత్తుకొని వచ్చి గురుమహిమను చూచి, మిగుల ఆశ్చర్యమునొంది జయధ్వానములను పలికిరి. జనులందరూ నమస్కరించి స్తోత్రములు పాడుచుండిరి. అఖండములైన నీరాజనములనిచ్చి ఆనందతరంగములతో నాట్యములను చేయుచూ, జయకారములను తెలిపిరి. వారి జయజయధ్వానములు మిన్నుముట్టెను. (175–178)

ఇట్టి సమయమున ధూర్తుడు, కుబుద్ధిమంతుడు అయిన **ఒక విప్రుడు వచ్చి గురుమూర్తిని ఇట్లు ప్రశ్నించెను.** "స్వామీ! నా మనసులో ఒక సంశయము కలిగినది. అందుకు తగు సమాధానము చెప్పవలెను. బ్రహ్మ లిఖితము సత్యము అను వాక్యమును వేదశాస్త్ర పురాణములు ఘోషించుచున్నవి. ఎందరో పెద్దలు ఎలుగెత్తి చాటిచెప్పుచుండిరి. ఇతనికి అపమృత్యువు సంభవింపలేదు. సహజముగనే కాలమరణమును పొందెను. తిరిగి ఇతడు ఎట్లు బ్రతుకగలిగెను? ఇతనికి ప్రాణమెట్లు వచ్చెను? ఇప్పుడు బ్రహ్మ లిఖితము సత్యమా? లేక మిథ్యయా? వేదశాస్త్ర పురాణములన్నియూ కాలమృత్యువును తప్పింపనెవరికి శక్యము కాదని నొక్కి వక్కాణించుచున్నవి కదా! అట్టి వేదశాస్త్ర ప్రమాణములకు విరుద్ధముగా అతడెట్లు జీవింపగలిగెను. ఇట్టి నా శంకకు సరియగు సమాధానమును చెప్పవలసినది. గురురాజా! సమాధానమును చెప్పుడు" అని ప్రశ్నించెను. **అందులకు చిరునవ్వు చిందించిన గురుమూర్తి ఆ బ్రాహ్మణునితో ఇట్లు చెప్పెను –** "ఓయీ! బ్రాహ్మణుడా! నీకు వివరముగా చెప్పెదను శ్రద్ధగా వినుము. బ్రహ్మ లిఖితము తప్పని మాట సత్యమే. కానీ, ఇతనియొక్క ముందు రాబోవు జన్మయొక్క ఆయుష్యములో నుండి

బ్రహ్మదేవుని అడిగి నా భక్తజనుని రక్షించుటకై ముప్పది సంవత్సరముల ఆయువును ఋణముగా తీసుకొని ఈ జన్మలో ఇతనికి కలిపితిని. కనుక, ఈ ముప్పది సంవత్సరముల ఆయువు ఈ జీవుని అనంతర జన్మలో తగ్గిపోగలదు" అని వివరముగా ఆ బ్రాహ్మణునకు సమాధానము చెప్పెను. గురునాథుని సమాధానమును విని అచట చేరిన వారందరూ హర్షధ్వానములను చేసి, సాష్టాంగవందనములు ఆచరించిరి. అందరి హృదయములు భక్తిభావముతో గద్గదములాయెను. అనంతరము జనులందరూ తమ తమ నివాసములకు వెళ్ళిపోయిరి. ఇట్టి అద్వితీయమైన శ్రీనృసింహసరస్వతీ స్వామివారి అఖండమైన ఖ్యాతి దిగ్దిగంతములకు వ్యాపించెను. (179–187)

అనంతరము ఆ పతివ్రతయు తన భర్తతో పాటుగా సంగమమునందు స్నానము చేసి, భక్తిభావముతో అత్యంత హర్షోల్లాసములతో శ్రీగురునాథుని షోడశోపచారములతో పూజించెను. అపారమైన ద్రవ్యమును వినియోగించి అచట సమారాధానము నిర్వహించెను. బ్రాహ్మణులకు అనేక ద్రవ్యములను ఇచ్చి సంతోషపరచెను. ఆ దంపతులిద్దరూ పదేపదే శ్రీగురుమూర్తికి నమస్కరింపుచూ మంగళనీరాజనములను ఇచ్చి పరిపరివిధములుగా స్తుతించిరి. ఇంతలో సాయంకాల సమయము కాజొచ్చెను. శ్రీగురునాథులు సంగమస్థానము నుండి బయలుదేరిరి. భక్తజనులు అడుగడుగునా సాష్టాంగవందనములను ఆచరించుచుండిరి. అత్యంత హర్షోల్లాసములతో జయజయధ్వానములు చేయుచుండగా స్వామివారు గాణగాపురమునకు వచ్చి తమ మఠమునందు ప్రవేశించిరి. అందరును ప్రేమపూరిత భక్తిభావముతో గురుమూర్తికి తిరిగి పూజలు సల్పి నీరాజనములను ఇచ్చిరి. ఈవిధముగ సిద్ధముని–నామధారకుల మధ్య జరిగిన సంవాదపూర్వకమగు పరమపవిత్రమైన గురుచరిత్రమును దత్తోపాసకుడగు శ్రీగంగాధర సరస్వతి శ్రోతలమగు మనందరకు గ్రంథరూపమున ప్రకటించెను. ఇట్టి పవిత్రమైన గురుచరిత్రమును ఎవరు భక్తితో విందురో, పఠించెదరో వారు సకలమనోభీష్టములను పొందగలరు. (188–192)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "మృత విప్ర సంజీవనము" అను ముప్పది రెండవ అధ్యాయము ॥ 32 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 192; మొత్తము సంఖ్య : 3731 + 192 = 3923 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ముప్పది మూడవ అధ్యాయము

శ్రీగురునృసింహ సరస్వతీ స్వామి వారు రుద్రాక్ష ధారణ - వాటి మహిమను గూర్చి బ్రాహ్మణ దంపతులకు వివరించుట - కాశ్మీర దేశమునగల భద్రసేనుడను రాజుగారి కథ మరియు పతివ్రతయగు వేశ్య ఉద్ధారమును గూర్చి వివరింపబడుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యోత్తముడగు నామధారకుడు సిద్ధమునీంద్రుని పాదపద్మములకు భక్తిపూర్వకముగా ప్రణామములర్పించి, వినయముతో ఇట్లు ప్రశ్నించెను- "స్వామీ! సిద్ధమునీశ్వరా! తమరు దయతో చెప్పిన అద్భుతమైన గురులీలను శ్రద్ధగా వింటిని. కృతార్థుడనైతిని. పూర్వకథను అనుసరించి పతిసమేతురాలైన ఆ సువాసిని సంగమము నుండి శ్రీగురుమూర్తితో పాటుగా బయలుదేరి గాణగాపురములో గల మఠమునకు చేరినదని తెలియజేసితిరి. ఆ బ్రాహ్మణ దంపతులు గురుమూర్తిని భక్తిశ్రద్ధలతో పూజించిరని కూడా చెప్పితిరి. శ్రీగురుమూర్తి మఠమునకు వచ్చిన అనంతరము జరిగిన కథను గూర్చి నాకు వివరముగా వినిపింపవలసినదని" ప్రార్థించెను. (1-3)

అంతట సిద్ధమునీంద్రుడు నామధారకునితో ఇట్లు చెప్పుచుండెను - "నాయనా! వినుము. మరునాటి ఉదయముననే ఆ దంపతులు శ్రీగురుమూర్తి సన్నిధానమునకు విచ్చేసి, భక్తిశ్రద్ధలతో నమస్కరించి వారి అనుమతితో కొంతదూరమున శ్రీస్వామివారికి ఎదురుగా కూర్చొనియుండిరి. పిమ్మట ఆ పతివ్రత సవినయముగా అంజలి ఘటించి **శ్రీగురుమూర్తితో ఇట్లు మనవి చేసెను**- "స్వామీ! గురుమూర్తీ! నేను తీవ్రమైన దుఃఖముతో బాధపడుచున్న సమయమున ఒక యతీశ్వరుడు నా వద్దకు వచ్చెను. వారు దయతో నన్ను ఓదార్చి అనేక విధములైన ధర్మములను ఉపదేశించి నా దుఃఖమును ఉపశమింపచేసెను. తదుపరి నాలుగు రుద్రాక్షలను ఇచ్చెను. వాటిలో రెండు రుద్రాక్షలను శవముయొక్క చెవులకు కట్టినమీదట దహనము చేయుమని చెప్పెను. ఇంకనూ ఇట్లు సూచించెను. నీవు తప్పక సంగమము వద్ద గల గురునాథుని వద్దకు వెడలుము. అప్పుడచట రుద్రసూక్తమును పఠింపుచు బ్రాహ్మణులు శ్రీగురునాథుల పాదపద్మములను అభిషేకించెదరు. అట్టి తీర్థమును తీసుకొని వచ్చి అత్యంత భక్తి భావముతో శవముపైన చల్లవలసినది" అని చెప్పి వారు వెడలిపోయిరి. అట్టి రుద్రాక్షలు నా

వద్దనే గలవు. చెవులకు కట్టిన రెండు రుద్రాక్షలు నా భర్త చెవులకే వుండిపోయినవి. స్వామీ! ఇప్పుడు మా కర్తవ్యమేమిటో తమరు అనుమతింపవలసినదని వేడుకొనుచున్నాను. అంతేగాక, తమరి అనుగ్రహమువలన ఆ యోగీశ్వరుడు చెప్పిన పద్ధతి ప్రకారముగ నేను చేయుటవలన మరియు పరిపూర్ణమైన మీ అనుగ్రహమువలన నా భర్త జీవించెను. మా యందు దయయుంచి ఈ రుద్రాక్షల మహిమను తెలియజెప్పవలసినదని" ప్రార్థించెను. ఆ సువాసిని మాటలు వినిన శ్రీగురుమూర్తి ప్రసన్నవదనముతో చిరునవ్వు చిందించి, **ఆమెతో ఇట్లనెను–** "పతివ్రతాశిరోమణీ! నీ భక్తిభావమును గమనించి అప్పుడు నీ వద్దకు వచ్చినది ఎవరో కాదు, నేనే. ఆ రుద్రాక్షలను నీకిచ్చినది కూడా నేనే అని చెప్పి నవ్వుచూ ఆ దంపతులకు రుద్రాక్ష మహిమను గూర్చి గురునాథుడు చెప్పసాగెను. రుద్రాక్షమహిమ అపారమైనది. సాటిలేనిది. దానిని గూర్చి మీకు వివరముగా ఎరిగించెదను. కడు శ్రద్ధగా మీరు వినవలసినది. **భక్తిని కలిగి గాని, భక్తి లేకుండగ గాని రుద్రాక్షలను ధరించువారికి ఎట్టి పాపములును అంటవు. అట్టి మనిషి ఉత్తముడైనా సరే, అధముడైనా సరే అతనికి ఎటువంటి పాపము అంటదు. రుద్రాక్షలను ధరించు వాడు దేవతలతో సమానుడని శ్రుతులు చెప్పుచున్నవి. రుద్రాక్ష ధారణ వలన లభించే పుణ్యమునకు అంతులేదు. దానికి సాటి వేరొకటి లేదు. ఈ మాట శ్రుతి సమ్మతమైనది. వేయి రుద్రాక్షలను మాలగా ఎవడు కంఠమునందు ధరించునో, వాడు సాక్షాత్తుగా రుద్రుడనియే తెలియవలెను. అతనికి సమస్త దేవతలు వందనము చేసెదరు.** వేయి రుద్రాక్షలు లభించనియెడల రెండు భుజములకు పదహారేసి చొప్పున, శిఖ యందు ఒకటి, ఒక్కొక్క చేతికి పన్నెండు రుద్రాక్షల చొప్పున రెండు చేతులకు ఇరవై నాల్గు రుద్రాక్షలను కర కంకణములుగా ధరింపవలెను. కంఠాభరణముగా ముప్పదిరెండు, మస్తకమునందు నలుబది రుద్రాక్షలు, రెండు చెవులకు పన్నెండు అనగా ఒక్కొక్క చెవికి ఆరేసి చొప్పున రుద్రాక్షలు ధరించవలెను. నూట ఎనిమిది రుద్రాక్షలను కంఠమాలగా తన మెడలో ధరించినవాడు రుద్రపుత్రుడైన కుమారస్వామితో సమానుడగునని ఎరుగుము. (4–17)

ముత్యములు, పగడములు, స్ఫటికములు, వైడూర్యములు, వెండి, బంగారము, మొదలగు వాటితో కలిపి తయారు చేయించుకొని రుద్రాక్షలను ధరించుటవలన కూడా అపారమైన పుణ్యము సిద్ధించును. రుద్రాక్షమాల మిగుల శ్రేష్ఠమైనది. అది ఎవరి మెడలో ఉండునో, వారిని ఏ పాపములు కూడా అంటవు. అట్టివారికి సద్గతి లభించును. వారు శాశ్వతముగా రుద్రలోకమునందు నివసించెదరు. ఇక రుద్రాక్షమాలతో జపమును అనుష్ఠించుటవలన అనంతఫలము సిద్ధించును. రుద్రాక్షలను ఎవడు ధరింపడో, వారి జన్మము వృథాయగును. అటులే, ఎవరి ముఖమున భస్మత్రిపుండ్రధారణముండదో, వారి జన్మము వ్యర్థమని తెలిసికొనుము. రుద్రాక్షను శిరసున ధరించియైనను లేదా,

కనీసము రెండు కర్ణములయందు రెండు రుద్రాక్షలు ధరించియైనను స్నానమొనర్చిన యెడల అట్టివారికి గంగాస్నాన ఫలము లభింపగలదు. రుద్రాక్షలకు రుద్రసూక్తముతో అభిషేకము చేసి పూజించినచో, తప్పనిసరిగా లింగపూజను చేసినంతటి ఫలము లభించును. ఈ రుద్రాక్షలలో ఏకముఖము, పంచముఖము, ఏకాదశముఖము, చతుర్దశ ముఖము మొదలగు వివిధసంఖ్యాత్మకములైన ముఖములు కలిగిన రుద్రాక్షలుండును. అట్టి రుద్రాక్షలతో చేసిన మాలను ధరింపవలెను. అది ఎంతో ఉత్తమమైనది. లేనియెడల వేర్వేరుగా ఎన్ని ముఖములున్నప్పటికినీ రుద్రాక్షలను ధరించిన చాలును, చతుర్విధ పురుషార్థములు సిద్ధించును. రుద్రాక్షకు విశేషమైన మహత్త్వము ఉన్నది. పూర్వకాలమునందు ఈ రుద్రాక్ష మహిమ విషయంలో జరిగిన ఒక విచిత్రమైన ఆఖ్యానము గలదు. ఇప్పుడు దానినే మీకు చెప్పుచుంటిని. శ్రద్ధతో ఈ కథను శ్రవణము చేయువారికి సమస్త పాపములు సమసిపోవును అని రుద్రాక్ష మహిమకు చెందిన ఒక కథను గూర్చి శ్రీగురునాథులవారు ఆ బ్రాహ్మణ **దంపతులకు ఇట్లు చెప్పుచుండెను.** (18–27)

"పూర్వము కాశ్మీరదేశమునందు భద్రసేనుడు అను పేరుగల ప్రసిద్ధమైన రాజు ఉండెను. అతనికి సుధర్ముడు అను పేరుగల కుమారుడుండెను. అటులే ఆ రాజుగారి మంత్రికి కూడా ఒక కుమారుడుండెను. అతని పేరు తారకుడు. ఇట్టి రాజకుమారునకు, మంత్రికుమారునకు చిన్ననాటినుండి అత్యధికమైన స్నేహముండెను. ఆ కుమారులిరువురూ జ్ఞానవంతులు. సమవయస్కులు. సుకుమారులు. సౌందర్యవంతులు. ఇరువురు ఒకేచోట విద్యను అభ్యసించుచుండిరి. అన్యోన్యముగా కలిసి వారుభయులు విహరించుచుండెడివారు. ఆటస్థలములయందు, భోజనసమయములందు అన్యోన్యమైన ప్రేమభావముతో కలిసివుండెడివారు. వారిరువురు బాల్యమునుండి జ్ఞానసంపన్నులగుటచే శైవధర్మము ననుసరించి కడు భక్తితో శివుని పూజించుచుండెడివారు. భస్మధారణ చేయుచూ, త్రిపుండ్రములను ధరించి, తిలకమును దిద్దుకొని, దేహమునిండా రుద్రాక్షలనే అలంకరించుకొని యుండెడివారు. తమ శరీరమునందు రుద్రాక్షమాలలను మిగుల ప్రేమాదరములతో ధరించెడివారు. కానీ, రత్నఖచితమైన సువర్ణాభరణములను వారు ఇనుముతో సమానముగా చూచెడివారు. రుద్రాక్షమాలలను తప్ప ఇతర ఆభరణములను ఎంతమాత్రము ధరించెడివారు కాదు. ఒకవేళ తలిదండ్రులు ప్రయత్నించి రత్నహారములను ధరింపజేసినచో, వారు వాటిని, 'ఇవి ఇనుప పాషాణములు' అంటూ అసహనముతో తీసి విసరివేసెడివారు. లేదా, రత్నాభరణములను తీసి బ్రాహ్మణులకు దానమొనర్చి తిరిగి రుద్రాక్ష మాలలనే ధరించుచుండెడివారు. తలిదండ్రులుగాని, బంధువులుగాని ఈ విషయములో చేసిన ప్రయత్నములన్నియు వ్యర్థమయ్యెను. *(28–34)*

ఇట్లుండగా ఒకనాటి శుభసమయమునందు ఆ రాజప్రాసాదమునకు సాక్షాత్తుగా బ్రహ్మసమానుడైన పరాశరమహర్షి ఏతెంచెను. ఋషివర్యుల రాకను చూచి రాజు వెంటనే వారికి ఎదురేగి వినయముతో స్వాగతమును పలికి, సాష్టాంగ వందనము చేసి, చేతులు జోడించి, భవనములోనికి తీసుకొని వచ్చెను. వారిని ఉచితమైన సింహాసనముపై కూర్చుండజేసి, అర్ఘ్యపాద్యాదులనిచ్చి, భక్తిభావముతో మహదానందభరితుడై ఆ మహర్షిని పూజించెను. అనంతరము మహర్షి ప్రశ్నించిన యోగక్షేమములకు తగు సమాధానములు చెప్పిన మీదట, ఆ రాజుగారు సభక్తికముగా చేతులు జోడించి వినయభావముతో **మహర్షిని ఉద్దేశించి ఇట్లు పలికెను–**

"ఋషివర్యా! మా పుత్రులకు పిచ్చి పట్టినట్లుగా తోచుచున్నది. అందులకు ఏమి చేయుమందురు స్వామీ! అని విన్నవించిరి. రత్నాభరణములను, వివిధ సువర్ణాలంకారములను ధరించకుండా వీరు నిరంతరము రుద్రాక్షమాలలనే సర్వాభరణములుగా ధరించుచుండిరి. ఎంత చెప్పిననూ వినిపించుకొనుటలేదు. ఒకవేళ బలవంతముగ మేమెన్నియో సువర్ణరత్నాభరణములను కుమారులకు అలంకరింపజేసినచో, వాటిని వెంటనే దూరముగా విసిరివేసి ఎల్లప్పుడు రుద్రాక్షమాలలే ధరించుచుండిరి. మేము కోపగించిననూ, శిక్షించిననూ మా మాటలను వారు వినకుండిరి. దయతో మీరైననూ మా పిల్లలకు జ్ఞానోదయము కలుగునట్లుగా ఉపదేశింపుడు. స్వామీ! మీరు భూతభవిష్యద్వర్తమానములు తెలిసిన త్రికాలజ్ఞులు. కావున, మా కుమారుడు గాని, మంత్రిగారి కుమారుడు గాని ఈ పిల్లలిద్దరూ ఎల్లప్పుడూ రుద్రాక్షలనే సర్వాంగములయందు ఎందుకు ధరించుచుందురో, వారి ఆంతర్యమేమిటో, తాము గుర్తించి, మాకు తెలియజెప్పవలసినదని" పదేపదే వేడుకొనిరి. రాజుగారి మాటలను వినిన పరాశరమహాముని చిరునవ్వు చిందించి, "రాజా! ఇందులో ఒక విచిత్రము దాగియున్నది. మీ కుమారుని గూర్చి, మంత్రిగారి కుమారుని గూర్చిన అత్యంత ఆశ్చర్యకరమగు పూర్వజన్మముల వృత్తాంతమును ఇప్పుడు మీకు చెప్పుచున్నాడను శ్రద్ధగా ఆలకింపుడు" అని పరాశరమహర్షి ఆ బాలురకు సంబంధించిన పూర్వజన్మ వృత్తాంతమును యిట్లు వివరింపసాగెను. (35-43)

పూర్వము నందిగ్రామమను పేరుగల నగరమునందు ఒక వేశ్య ఉండెను. ఆమె మిగుల సౌందర్యవతి. ఆమె ముఖము చంద్రబింబమువలె ఉండెను. ఆమె దేహకాంతి నిండు పున్నమినాటి చంద్రచంద్రిక వలె ఉట్టిపడుచుండెను. ఆమె నివసించు భవనము స్వర్గమును మించిన శోభతో ప్రకాశించుచుండెను. రత్నఖచితమైన సువర్ణసింహాసనముపై ఆమె కూర్చొనియుండెను. ఆ సింహాసనమునకుగల ఛత్రము పౌర్ణమినాటి చంద్రుని పోలియుండెను. ఆమె భవనమంతయు బంగారుమయము. ఆమె పాదుకలు కూడా బంగారముతో చేసినవే. అనేకవిధములైన చిత్రవిచిత్రములగు ఆభరణములు ధరించుచుండెను. ఆమె గృహము రత్నఖచితమైన పర్యంకములతోడను, లెక్కలేనన్ని రత్నాభరణములతోడను

కూడుకొని యుండెను. అనేక దాసదాసీజనముతోడను, ఆవులను, ఎద్దులను కలిగియుండెను. తనకుగల సమస్త ఆభరణములతో అపర రతీదేవివలె నవయౌవనశోభతో చంద్రకాంతివలె ఉట్టిపడుచుండెను. మిగుల లావణ్యసుందరిగా ఆమె శోభిల్లుచుండెను. ఆమెకుగల ధనధాన్య సంపత్తికి పరిమితిలేదు. గంధము, కుంకుమ, కస్తూరి, రకరకములగు పుష్పములు, సమస్త ధనధాన్యసంపత్తితో, అనేకవిధముల సౌఖ్యములతో ఆమె గృహము పరిపూర్ణమైయుండెను. ఆవిధముగా ఉండిన ఆ వారవనిత తాను పతివ్రతను అని చెప్పుకొనుచుండెను. తాను వేశ్యయైనను, వేశ్యావృత్తిని నిర్వహించుచున్నప్పటికినీ పతివ్రతయై బ్రాహ్మణులకు అసంఖ్యాకముగా అన్నవస్త్రములను, ఆభరణములను నిరంతరము దానమొనర్చుచుండెను. ఆమెయొక్క గృహమునకు ఎదురుగా ఒక నాట్యమండపమును నిర్మించుకొనెను. అది అనేకవిధములైన, చిత్రవిచిత్రములైన రత్నములతో నిర్మింపబడియుండెను. నిత్యము ఆమె తన చెలికత్తెలతో కలిసి ఆ నాట్యమండపమున విలాసవంతముగ నృత్యమొనర్చుచుండెను. ఆ వేశ్య మనోవినోదమునకై ఒక కోడిని, ఒక కోతిని పోషించుచుండెను. ఆ కోతిని రుద్రాక్షమాలలతో అలంకరించుచుండెను. కోడి తలకు ఒక రుద్రాక్ష మాల ధరింపచేసెను. ఆ కోడికి, కోతికి వినోదముగా ఒక చక్కని నృత్యమును నేర్పించెను. అంతేగాక, ఆ రెండింటికి వినోదార్థముగా వేరు వేరు నృత్యములను అభ్యసింపచేయుచూ ప్రతినిత్యము ఆ నాట్యమండపమునందే కట్టివేయుచుండెను. (44-55)

ఇట్లుండగా, ఒకనాడు ఆమె గృహమునందు ఒక విశేషము ఘటించెను. ఆనాడు ఆమె ఇంటికి 'శివవ్రతుడు' అను మహాధనికుడైన ఒక వైశ్యుడు వచ్చెను. అతడు ఒంటినిండా భస్మమును, రుద్రాక్షమాలలను ధరించి యుండెను. అతని చేతిలో రత్నఖచితమైన ఒక లింగము సూర్యునివలె తీక్ష్ణమైన తేజస్సుతో ప్రకాశించుచుండెను. ఆ వేశ్య స్త్రీ శివభక్తుడను పేరుగల ఆ వైశ్యుని చూచి అతని చేతిలోగల రత్నఖచిత లింగమును చూచి విస్మయమును చెంది, ఆతనిని అత్యంత ఆదరముతో తన గృహమునకు ఆహ్వానించెను. అనంతరము నాట్యమండపమునందు ఆ వైశ్యుని కూర్చుండజేసి, నయనానందకరముగా అతని సముఖమున నృత్యమొనర్చుచుండెను. అట్టి సమయమున అతనివద్ద మిగుల కాంతితో జిగేలుమని ప్రకాశించుచున్న లింగమును చూచి ఆశ్చర్యమును పొంది తన చెలికత్తెలతో ఆ లింగమును తనకు ఈయవలసినదని, దానికి తగిన మూల్యమును తాను చెల్లించెదనని, లేదా, అతనితో మూడు రోజులు కులస్త్రీగా ఉండి, రతిసుఖమును అనుభవింపజేసెదనని చెప్పుమని కోరెను. ఆమె మాటలను వినిన చెలికత్తెలు ఆ వైశ్యునితో మా స్నేహితురాలికి నీవు నీ రత్నలింగమును ఇచ్చినచో, దానికి మూల్యముగా లక్షలాది రూప్యములనిచ్చును. లేదా, మూడు దివసములు నీతో కులస్త్రీవలె ప్రవర్తించి రతిసుఖముతో ఆనందింపజేయును. మీకు ఏది ఇష్టమో, దానిని తెలియజేయుడని కోరగా, అందులకా వైశ్యుడు నవ్వి ఇట్లనెను – "నీవు వారవనితలలో చాలా ముఖ్యమైనదానవు.

నాతో మూడు రోజులు కులస్త్రీగా ఎట్లుండగలవు. అది నీకు శక్యమగునా? నీవు వ్యభిచారిణివి. నీ మాటలు నిజమెట్లగును. అనేకమంది పురుషులతో వ్యభిచరించుటయే దురాచారముగా నున్న నీకు ధర్మకర్మలనునవి ఎట్లుండును. నీ మనసున స్థైర్యమెట్లుండగలదు. నీవు కులస్త్రీగా, పతివ్రతగా ఎట్లు కాగలవో చెప్పుము". వైశ్యుని మాటలు విని **ఆ వేశ్య అతనిని చూచి ఇట్లు పలికెను-** "నిజముగా నేను మూడు రోజులు మీకు కులస్త్రీగా ఉండెదను. ఓ వైశ్యరత్నమా! నీవద్దగల రత్నలింగమును నాకు ఇచ్చిన యెడల నేను నిన్ను మూడు దినముల పర్యంతము తనుమనధనములతో సంతోషింపచేయగలనని" పలికినది. అందులకు ఆ వైశ్యుడు ఆమెతో "నీవు మూడు రోజులపాటు వరుసగా మూడు పగళ్ళు, మూడు రాత్రిళ్ళు పూర్తిగా నాకు పత్నిగా ఉందునని ముందుగా ప్రమాణము చేసి చెప్పినచో నేను నిన్ను నమ్మెదనని" పలికెను. అందులకు సంతసించిన ఆ వేశ్య వెంటనే తన హస్తమును ఆ రత్నలింగము మీద ఉంచి "సూర్యచంద్రుల సాక్షిగా నేను నీకు పత్నిగా ఉండెదను" అని ప్రమాణము చేసినది. అందుకతడు సంతసించి వెంటనే ఆ రత్నలింగమును ఆమె చేతికి అందించెను. ఆమె మిగుల సంతసించెను. **అప్పుడా వైశ్యుడు ఆమె చేతికి కంకణము కట్టి లింగమునిచ్చి ఇట్లనెను-** "ప్రేయసీ! ఈ లింగము నాకు ప్రాణముతో సమానము. కనుక, ఈ లింగమునకు ఏ కారణముచేతనైనను హాని కలిగినచో, తత్క్షణమే నేను ప్రాణత్యాగము చేసెదను. ఇందుకు నీవు అంగీకరించవలెనని" చెప్పెను. వైశ్యుని మాటలు విని ఆ వేశ్య అందుకు మనస్ఫూర్తిగా అంగీకరించినది. అంతేకాదు, "ఈ లింగమును గూర్చి నేను కూడా నా ప్రాణసమానముగా జాగ్రత్త పడెదనని" ప్రమాణము కూడా చేసినది. (56-76)

అనంతరము ఆ ఉభయులూ కలిసి నాట్యమండపములో కూర్చొని సరససల్లాపములతో అస్తమయమగు వరకు కాలము గడిపిరి. సూర్యుడస్తమించిన పిదప 'శయనమందిరములోనికి పోవుదమని' ఆమె కోరెను. అప్పుడు వైశ్యుడు ఆమెతో 'సంభోగ సమయమునందు రత్నలింగము మనవద్ద ఉండరాదు. మనకు దూరముగా ఉండవలయును' అని చెప్పెను. ఆ వైశ్యుని మాటలు విని ఆ వేశ్య వనిత రత్నలింగమును నాట్యమండపమునందలి మధ్యలోగల స్తంభమువద్ద పెట్టి, పదిలపరచి వైశ్యునితో కలిసి శయన మందిరమునకు ఏకాంతముగా వెళ్ళి, అతనితో కులకాంతవలె క్రీడించుచుండెను.

ఇంతలో అకస్మాత్తుగా నాట్యమండపమునందు నిప్పు అంటుకొని దారుణమైన మంటలు చెలరేగెను. అప్పుడది చూచిన వైశ్యుడు "అయ్యో! మండపమునకు నిప్పంటుకొని భస్మమగుచున్నదని శోకించెను". కొన్ని క్షణములలోనే ఆ నాట్యమండపము బూడిదకుప్పగా మారెను. అది చూచిన వైశ్యుడు విషయమును గమనించి, మిగుల దుఃఖించుచూ "అయ్యో! హతవిధీ! ఇట్లు జరిగినదేమిటి? నా ప్రాణలింగమా!

నీవేమైతివి. ఇక నేనెట్లు బ్రతుకగలను. నా ప్రాణలింగము బూడిదైపోయెను కదా!" అని రోదించుచుండగా చుట్టుప్రక్కల వారందరు పరుగు, పరుగున వచ్చి అతి ప్రయత్నముతో మంటలను ఆర్పివేసిరి. ప్రాణలింగము కోసమై పిమ్మట వెదకిరి. చెలరేగిన మంటలలో లింగముతో సహా కోడి, కోతి కూడా దగ్ధమైపోయెను. (77-83)

అంతట ఆ వైశ్యుడు మిగుల శోకించుచూ నా ప్రాణలింగము దగ్ధమైపోయినది కనుక, నేను కూడా ప్రాణత్యాగము చేసెదను అనుచూ ఆ చుట్టుప్రక్కల కట్టెలను తెచ్చెను. వాటిని చితిగా పేర్చి, అగ్నిని ప్రజ్వలింపజేసెను. అచట చేరిన జనులెల్లరు మిక్కిలి ఆశ్చర్యముతో చూడసాగిరి. ప్రజ్వలించుచున్న ఆ చితిలోనికి అకస్మాత్తుగా ఆ వైశ్యుడు దూకి తన దేహమును అగ్నికి ఆహుతియొనర్చెను. ఆ దృశ్యమును చూచుచు అచట చేరియున్న ప్రజలందరు విస్తుపోయి విగ్రహములవలె నిలబడి చూచుచుండిరి. ఇంతలో ఆ వారాంగన విభ్రాంతినొంది తలను బాదుకొనుచూ **ఇటుల విలపింపసాగెను.** "అయ్యో! ఏమి విపరీతము ఘటించినది. నేను అనుకున్నది ఒకటి. జరిగినది మరొకటి. ఏమి చేయుదును. ఎంతటి పాపము ఘటించినది నాకు. రత్నలింగమును ఎంతో ఇష్టపడి ఆ వైశ్యుని వద్దనుండి నేను గ్రహించి, మండపములో బహుజాగ్రత్తగా భద్రపరచితిని కదా! విధి వక్రించి నాట్యమండపముతో పాటుగా ఆ లింగము, నాకు ఇష్టమైన కుక్కుటము, మర్కటము కూడా దగ్ధమైపోయెను. ముందు తాను చెప్పిన ప్రకారముగ నా భర్త తన యొక్క రత్నలింగము దగ్ధమైపోయెను గదా! అని మిగుల ఖేదమునొంది తన శరీరమును కూడా అగ్నికి ఆహుతి చేసివైచెను కదా! అయ్యో! నా భర్తను హత్యచేసిన మహాపాపము నన్ను పట్టుకొనెను కదా! ఈ వైశ్యుడు నాకు ప్రాణేశ్వరుడు. అతనికి నిశ్చయముగా హాని జరిగిపోయెను. నేను పతివ్రతా ధర్మమును కలిగినదానినని ఖ్యాతి నొందితిని. మూడు దివసముల పర్యంతము కులకాంతవలె నీతోపాటు ఉండెదనని, నేను ప్రతిజ్ఞను పూనితిని. అది భంగమైపోయినందున నేను కూడా నా ప్రాణములను వదలిపెట్టెదను" అని గట్టిగా ఆ వేశ్య పలికెను. వెంటనే ఆ వేశ్యా పతివ్రత బ్రాహ్మణుని పిలిపించి అతనికి నమస్కరించి, సహగమనమును చేయుటకు తగిన దానధర్మములు మిగిలిన ధార్మిక కృత్యములను చేయించుమని ప్రార్థించెను. ఆ బ్రాహ్మణునకు వస్త్రాభరణములు, తగినంత ద్రవ్యము సర్వమునూ దానముగా సమర్పించెను. బ్రాహ్మణుని ద్వారా సహగమనమునకు సంకల్పము చేసి కొందరు బ్రాహ్మణులకు, కొందరు ముత్తైదువులకు తగిన దానదక్షిణలను ఇచ్చెను. చందనము కట్టెలను చితిగా పేర్చి అగ్ని, నెయ్యి మొదలైన వస్తువులను సమకూర్చి, తన బంధుసహోదరులందరకు నమస్కరించి **ఆ వేశ్య ఇట్లు పలికెను–** "బంధుమిత్రులారా! నా ప్రాణేశ్వరుని సన్నిధికి నేను వెళ్ళిపోవుచుంటిని. నాకు అనుజ్ఞను ప్రసాదింపవలసినదని" ప్రార్థించెను. ఆమె మాటలు విని బంధుజనులు, మిత్రులు, వేశ్యవద్దగల **చెలికత్తెలందరునూ మిగుల దుఃఖించి ఇట్లనుచుండిరి** – "ఇదెక్కడి ధర్మము. నీ బుద్ధి వక్రించినది. మనము ఎవరికి పుట్టితిమో, ఏ వృత్తియందు గలమో దానిని అనుసరించి

ప్రవర్తింపవలెను. అట్లు చేయుట దోషాస్పదము కానేరదు. తద్వ్యతిరిక్తముగా నీవిట్లు ఎందులకు చేయుచుంటివి. నీవు వేశ్యవు. వారాంగనవు. ఎంతమందియో పరపురుషులు నీ ఇంటికి వచ్చిపోవుచుందురు. వారందరు నీకు భర్తలగుదురా? అంతమందిలో ఎవడు నీ భర్త కాగలడు. ఈ వైశ్యుడేమిటి? ఆ లింగమేమిటి? అతనికి నీకు గల సంబంధమేమిటి? వారాంగనల ధర్మము నీకు తెలియదా? నీకీ వింత ధర్మమును నూరిపోసినదెవరు? నీ దేహమును ఎందుకు వ్యర్థపుచ్చుచుంటివి. నిత్యము ఒక నూతన భర్త ఉండడమే వేశ్య ధర్మము కదా! ఇటువంటి వైశ్యులెందరో వచ్చెదరు, పోయెదరు. వారికి నీవు భార్యవెట్లగుదువు. నీ బుద్ధి ఇట్లు ఏల మందగించెను" అని అందరూ ఆమెను నిరుత్సాహపరచునట్టి పలుకులను పలికిరి. ఆమె సహగమనమును వారించుటకు ప్రయత్నించిరి. కాని, అట్టి సమయమున ఆ పతివ్రతయగు వేశ్య అచటి వారందరిని ఉద్దేశించి, **తన అభిప్రాయమును సూటిగా ఇట్లు చెప్పెను–** "ఈ వైశ్యుడే నాకు భర్త. మూడు దివసముల పర్యంతము నీతోపాటు కులకాంతవలె వ్యవహరించెదనని సూర్యచంద్రుల సాక్షిగా నేను ప్రమాణము చేసితిని. కావున, ఈ వైశ్యుడే నాకు భర్త కాగలడు" కాని వేరు కాదు. నేను పూర్వము నుండి వారాంగనను అయినప్పటికినీ తదాదినుండి ఒక పతివ్రతా ధర్మమును పాటించుచుంటిని. ఈ రోజున కూడా అదేవిధముగ పతివ్రతా ధర్మమును పాటించి, అతని చేతిలోగల రత్నలింగముపై చేయిపెట్టి, ప్రమాణము చేసి అతనికి భార్యనైతిని. నాకు పతివ్రత అను ఖ్యాతి మునుపటి నుండియే కలదు. కావున, నా భర్త నిమిత్తముగా నేను తప్పక ఈ దేహమును అగ్నికి ఆహుతి చేసివైచెదను.

ఇక నేను జీవించియుండుట అసంభవము. వేదశాస్త్రములయందు పతివ్రతా ధర్మములు అత్యంత శ్రేష్ఠముగా చెప్పబడినవి. భర్తతోపాటుగా సహగమనమొనర్చు స్త్రీ, అందుకు వేసే ఒక్కొక్క అడుగునకు అశ్వమేధయాగమును చేసిన మహాపుణ్యము సంపాదింపబడునని వేదశాస్త్రములు నొక్కి చెప్పుచున్నవి. అంతేగాదు, సహగమనము చేసే స్త్రీ యొక్క తల్లిదండ్రుల పక్షమున ఇరువది ఒక్క తరములవారు, ఆమె భర్తవైపు గల తలిదండ్రుల పక్షమున ఇరువది ఒక్క తరముల వారు ఘోరనరకములో ఉన్నప్పటికినీ వారందరు తరించిపోయి తమతోపాటుగా నేరుగా స్వర్గలోకమునకు వెళ్ళిపోవుదురని అనేక శాస్త్రములు ఘోషించుచున్నవి. అంతటి మేరలేని పుణ్యరాశి వచ్చుచుండగా దానిని వదలిపెట్టి ఈ నేలమీద జీవించుట ఎందుకు? దుఃఖపూరితమైన భవసాగరములో ఏనాటికైనా మరణము తప్పదుగాక, తప్పదు. ఆనాటి మరణము కంటె ప్రమాణపూర్తిగా అంగీకరించిన ఈ వైశ్యుడు అనే భర్త వెంట సహగమనము ద్వారా నేను నేరుగా స్వర్గలోకమునకు చేరిపోవుటయే మేలని నిశ్చయముగ భావించుచుంటిని" అని సవినయముగా అందరికి తన నిశ్చయమును ప్రకటించి అత్యంత సంతోషభరితయై, అగ్నిగుండము వద్దకు వచ్చి, అగ్నిదేవునకు నమస్కరించి దానిచుట్టూరా మూడు ప్రదక్షిణములు చేసిన అనంతరము మిక్కిలి ఆనందోల్లాసములతో ఆ సర్వేశ్వరుని స్మరించి, కర్మసాక్షిగా సూర్యనారాయణునకు నమస్కరించి, బ్రాహ్మణులందరికి అంజలి ఘటించి, నతమస్తకురాలై నమస్కరించి

అగ్నిముందు నిలబడి మరొక్కమారు ఏ భర్త కోసమై ఆమె సహగమనము చేయుచుండెనో, ఆతనిని స్మరించి, నమస్కరించుచూ అగ్నిగుండము లోనికి అమాంతముగా దుమికెను. (84-107)

అప్పుడొక అద్భుతమైన సంఘటన ఘటించెను. తత్క్షణమే పంచవక్త్రుడు, దశభుజుడు, భస్మాంకితగాత్రుడు, త్రిశూలధారి, నాగాభరణుడు, నందివాహనధారి అయిన సదాశివుడు తన చేతులలో శూలమును, డమరుకమును, పానపాత్రమును ధరించి అగ్నిగుండమున ప్రత్యక్షమాయెను. వెంటనే, ఆ వేశ్యను తన దశభుజములతో పట్టుకొనెను. ప్రజ్వలించిన అగ్ని శీతలమైపోయెను. భక్తవత్సలుడైన జగన్నాథుడు అత్యంత ప్రసన్నవదనుడై ఆ వేశ్యను అగ్నిగుండము బయటకు దింపి, "అమ్మా! నేను నీ ధర్మనిష్ఠను పరీక్షింపదలచి వచ్చితిని. ఈ వైశ్యుడు, రత్నలింగము, ఇదంతయును తాత్కాలికముగ నేను సృష్టించినదే. అదికూడా నీ పరీక్షార్థమే నిర్వహించితిని. నా మాయచేతనే అగ్నిని సృష్టించి నీవు నిర్మించుకొన్న నాట్యమండపమును దగ్ధమొనర్చితిని. కారణమేమన, నేను వేశ్యనైనప్పటికినీ పతివ్రతా ధర్మమును ఆచరించుచుంటినని ఎల్లవేళలా నీవు చెప్పుచుంటివి. కనుక, నీ పతివ్రతా ధర్మమును, నీకున్న ధైర్యమును, ధర్మముయందు నీకుగల నిశ్చలమైన బుద్ధిని, నీ అకుంఠిత దీక్షను పరీక్షించి లోకమునకు నీవంటి పతివ్రతను పరిచయము చేయుటకొరకే నేను వైశ్యుడిగా వేషమును ధరించి స్వయంభూ రత్నలింగమనే మాయతో నీవద్దకు వచ్చితిని. నీ మనసును పరీక్షించుటకొరకే నేను అగ్నిప్రవేశము చేసితిని. నిజమునకు ముమ్మాటికీ నీవు పతివ్రతవే. నీవు విశ్వసించిన నీ వ్రతమును సత్యముగా నిరూపించి చూపితివి. నీ భక్తికి, నీ ధర్మనిష్ఠకు నేను మిగుల సంతుష్టుడనైతిని. నీవు కోరిన వరము నిచ్చెదను. కోరుకొనుము. ఆయురారోగ్య ఐశ్వర్యములలో మరింకేదైననూ సరే నీకభీష్టమైన వరమును కోరుకొనుము. కాదు, లేదనకుండా ఇచ్చి వెళ్ళుటకు సిద్ధముగా నుంటిని" అని పరమేశ్వరుడు కడు ప్రసన్నవదనముతో పలికెను. అప్పుడా వేశ్య చేతులు జోడించి నతమస్తకురాలై అద్భుతమైన భక్తిభావము హృదయమునిండుగా పొంగిపొరలుచుండగా, కనులవెంబడి కన్నీరు కారుచుండగా, చేతులు జోడించి ఇట్లు పలికెను - "చంద్రమౌళీశ్వరా! జగన్నాథా! నాకు ఏ వరము అక్కరలేదు. భూలోక, పాతాళలోక, స్వర్గలోకములేగాక మరెచ్చటనైననూ లభించే ఐశ్వర్యముగాని, భోగభాగ్యములు గాని నాకు ఏవీ అక్కరలేదు. స్వామీ! నేను కోరుకొనునదొక్కటే. దానిని నాకు ప్రసాదించినచో చాలును. నీ చరణసరోజములవద్ద నేను భ్రమరమునై నిరంతరము తిరుగుచుండునట్లుగా నాకు వరమును ప్రసాదింపుడు. అంతేగాక, మరొక్కమాటను కోరెదను. నన్ను నమ్ముకొని నా చుట్టూరా జీవించుచున్న నా ఆప్తులు, బంధువులు, మిత్రులు, నాకున్న దాసదాసీజనమునకు నీ సాన్నిధ్యలోకమును ప్రసాదించుము. పశుపతీ! నా దాసదాసీజనులందరిని ఉత్తమలోకములకు చేరుకొనుటకై అనుమతిని అనుగ్రహింపుము. స్వామీ! సర్వేశ్వరా! వీరందరిని నీ సన్నిధిలో నిలుచుటకై స్థానమును ప్రసాదింపుము. నాకు మరల జన్మము

వద్దే వద్దు. ప్రభూ! ఈ సంసార యాతనల నుండి త్వరగా నాకు విమోచనమును ప్రసాదింపుమని" శిరసాష్టాంగవందనము నాచరించి తన రెండు చేతులతో ఆ పరమశివునియొక్క పాదపద్మములను పట్టుకొని ప్రార్థించెను. తన కన్నీటితో ఆ ప్రభువు యొక్క పాదపద్మములను అభిషేకించెను. ఆమె మాటలను విని భక్తవత్సలుడగు గౌరీరమణుడు అత్యంత ప్రసన్నుడై మోమున మందహాసము చిందులు వేయుచుండగా ఆ వేశ్యతో పాటుగా యోగ్యత గలిగిన వారందరినీ తన విమానమునందు కూర్చుండజేసి నేరుగా తన లోకమునకు తీసుకొనివెళ్ళెను. (108-120)

ఇక నాట్యమండపములో ఒక కుక్కుటము, మరొక మర్కటము దగ్ధమైపోయినది కదా! మహారాజా! ఆ కోతి తన మర్కటత్వమును వదలిపెట్టి నీ కడుపున కుమారునిగా జన్మించెను. రుద్రాక్షలను ధరించినందువలన అతడు రాజకుమారుడై జన్మించెను. ఇక కోడియే నీ మంత్రి గర్భవాసమున పుత్రుడై జన్మించెను. పూర్వవాసనను అనుసరించి ఈ జన్మయందు వారిరువురు రుద్రాక్షమాలలనే ధరించుచుండిరి. ఈ రుద్రాక్షలు ధరించిన పూర్వజన్మ సంస్కారమువలన ఈ ఇద్దరు కుమారులు జ్ఞానవంతులు, ఈశ్వరభక్తి సంపన్నులైరి. **పూర్వజన్మలో అజ్ఞానులుగా ఉన్నప్పటికినీ నిత్యము రుద్రాక్షలు ధరించుటవలన మిక్కిలి మహత్పుణ్యభాగ్యము లభించి మీకు కుమారులై జన్మించిరి.** ఈ జన్మలో పూర్వజ్ఞానము ననుసరించి ఆ రుద్రాక్షలను ధరించుటచే వారికి లభించబోయే పుణ్యము అపారమైనది. దాని ఫలము వర్ణనాతీతము. అది చెప్పుటకు నేను వివశుడను" అని ఈవిధముగ పరాశరమహర్షి రాజుగారితో చెప్పెను. కావున, సంసారములో ఉండి కూడా తరింపగోరువారు రుద్రాక్షలను ధరింపవలయునని, రుద్రాక్షలను గూర్చిన మహిమను కోరిన ఆ బ్రాహ్మణ దంపతులతో శ్రీగురునాథుడు చెప్పెననీ, సిద్ధముని నామధారకునకు చెప్పిన విధమున ఇట్టి అపూర్వమైన కథా వృత్తాంతమును గంగాధరనందనుడు, సరస్వతీ నామధేయుడు కామధేనువనదగిన 'గురుచరిత్రము' అను పేరిట విస్తరించి మనకు అందించెను. దీనిని కదు భక్తిశ్రద్ధలతో విన్నవారికి, చదివినవారికి చతుర్విధ పురుషార్థములు అత్యంత సులభముగా లభించగలవు. (121-130)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "రుద్రాక్ష మహిమా నిరూపణము" అను

ముప్పది మూడవ అధ్యాయము ॥ 33 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 130; మొత్తము సంఖ్య : 3923 + 130 = 4053 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ముప్పది నాల్గవ అధ్యాయము

పరాశరమహర్షి కాశ్మీరరాజునకు రుద్రపఠనము, రుద్రాభిషేకము యొక్క మాహాత్మ్యమును గూర్చి చెప్పుట - రుద్రాభిషేక ప్రభావము వలన అల్పాయుష్కులైన రాజకుమారులు దీర్ఘాయుష్మంతులగుట - పరాశరుడు బోధించిన ఈ వృత్తాంతమును శ్రీగురుమూర్తి విప్రదంపతులకు వినిపించుట - రుద్రాభిషేకమువలన సమస్త ఇహపర సౌఖ్యములు సిద్ధించునని నిరూపింపబడుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః॥

సిద్ధముని నామధారకునితో అనంతర గురుకథామృతమును చెప్పుచుండెను - “నామధారకా! కాశ్మీర రాజునకు పరాశరమహర్షి రుద్రాక్ష మహిమను గూర్చి మరియు రాజుగారి కుమారునియొక్క, మంత్రి కుమారునియొక్క గత జన్మ విశేషాలను గూర్చి తన మధురమైన వాక్కులతో వినిపించెను. అందులకు ఆ రాజు సంతోషభరితుడై పరాశరులవారి చరణాంబుజములకు నమస్కరించెను. **వినయముతో చేతులు జోడించి ఇట్లు ప్రార్థించెను**- “మహర్షీ! పూర్వజన్మలో రుద్రాక్షలు ధరించుటవలన అత్యధిక పుణ్యము లభించి, ఈ జన్మలో వారే నా కుమారునిగా, మంత్రి కుమారునిగా జన్మించిరనియు, ప్రస్తుత జన్మయందు కూడా ఆ కుమారులిద్దరు శివభక్తులై రుద్రాక్షలను నియమముతో ధరించుచున్నారనియు మీరు తెలియజేసితిరి. గత జన్మలో ఒక వేశ్య అజ్ఞానమువలన, రుద్రాక్ష యొక్క మహిమను తెలియకయే తాను పెంచిన కోడికి, కోతికి రుద్రాక్షలను ధరింపజేసెను. తద్వారా అపరిమితమైన పుణ్యరాశి ఫలించి, వారుభయులు రాజవంశములో, రాజకుమారులై జన్మించిరి. అయితే భూత భవిష్యద్వర్తమానములను గూర్చిన త్రికాలజ్ఞులు మీరు. మహాత్మా! అనంతరము మా కుమారునియొక్క, మంత్రి కుమారునియొక్క భవిష్యత్తు ఎట్లుండును? భావిజీవితములో సంఘటించే వారి జాతకలక్షణములను తాము వివరించి చెప్పగలరని” ప్రార్థించెను. అప్పుడు పరాశరమహర్షిగారు రాజు ప్రశ్నకు ప్రత్యుత్తరముగా ఉభయకుమారులయొక్క లక్షణాలను వివరించి **అనంతరము ఇట్లనెను** - “రాజా! మీరు మీ కుమారులయొక్క భవిష్యత్తును గూర్చి తెలుపమని ప్రశ్నించితిరి. కాని, వారి భావిజీవితమును గూర్చి తెలియజేసినచో, మీరు మిగుల దుఃఖించెదరు. అది ఎట్లు తెలియజేయవలెనో, నాకు బోధపడుటలేదనెను”. అంతట రాజు వెంటనే చేతులు జోడించి, వినయముగా ఆ

మహర్షితో ఇట్లనెను – "మహానుభావా! చెప్పుటకు సందేహించునట్టి విషయమును మీరు నాకు వివరముగా తెలియజేయుడు. అంతేకాదు, అది ఏదేని, ప్రమాదకరమైన యెడల, అందుకు తగిన ఉపాయమును కూడా సూచించి, మా దుఃఖభారమును దూరము చేయగలరని" దీనవదనుడై ఆ రాజు పదేపదే ప్రార్థించెను.(1–10)

అప్పుడు పరాశరమహర్షి ఇట్లు పలికెను – "రాజా! వినుము. ఈ పిల్లలిద్దరికీ పన్నెండు సంవత్సరముల ఆయుర్దాయము మాత్రమే నిశ్చయమై ఉన్నది. ఇప్పుడు వారు పన్నెండేండ్ల ప్రాయములో ఉన్నారు. ఇక వీరికి ఏడు రోజుల ఆయువు మాత్రమే మిగిలియుండెను. అనంతరము ఎనిమిదవ దినమున మీ పుత్రులు ఉభయులూ మరణించెదరు" అని ఋషీశ్వరుడు చెప్పిన వెంటనే రాజు 'హా!' అని మూర్ఛిల్లెను. అనంతరము అనేక విధములుగా విలపించెను. ఋషీశ్వరుడు ఓదార్చిన పిమ్మట ఆ రాజు తిరిగి పరాశరమహర్షి యొక్క చరణాంబుజములపై వ్రాలి తన తలను మోపి, నిష్ఠతో నమస్కరించి, **దీనవదనముతో ఇట్లు పలికెను** – "మహర్షీ! మహాత్మా! నేను మీ శరణాగతుడను. మమ్ములను మీరే రక్షింపవలెను. మీ తపోబలముతో మమ్ము రక్షింపగలరు. ఇక ఇప్పుడు మేమేమి చేయవలెను" అని పొంగిపొరలుచున్న దుఃఖములో మునిగి ఇటు రాజదంపతులు, అటు మంత్రి దంపతులు అత్యంత దుఃఖాక్రాంతులై ఆ మహర్షిని శరణాగత భావముతో ప్రార్థించిరి. ఆ ఉభయ కుమారుల తల్లిదండ్రుల బాధను, అంతులేని దుఃఖమును చూసి, దయానిధియైన **పరాశరమహర్షి ఇట్లు చెప్పెను**– "రాజా! మనసును కుదుటపరచుకొని ఉమాకాంతుడు, ఆదిగురువు అయిన శివుని శరణుగోరుము. భయమును విడచి, మనసును స్థిరపరచుకొని నిరంతరము శరణాగతిని పొంది, శివుని స్మరింపుడు. ఆయననే ఆరాధించుడు. ఆ శూలపాణియే మిమ్ములను తప్పక రక్షింపగలడు. కాలమృత్యువును జయించుటకు మృత్యుంజయుడగు శివుని ఆరాధించుటకంటే వేరొక మార్గము లేనేలేదు. మహాదేవుడగు శివభగవానుని మహిమను గూర్చి చెప్పుచున్నాను వినుము. దానిని శ్రద్ధగా వినుడు. స్వర్గ, మర్త్య, పాతాళ లోకములను బాగుగా విచారించి చూచినచో, ఆ వ్యోమకేశుడగు శివుని మించిన దేవుడు వేరొకడు లేనేలేడు. శివుడు నిష్కళంకుడు. చిదానందస్వరూపుడు. తన రజోగుణముతో జగత్తుయొక్క సృష్టి నిమిత్తముగా బ్రహ్మదేవుని సృజించెను. అట్టి బ్రహ్మకు తాను రచించవలసిన సృష్టిని నడిపించుటకు గాను నాలుగు వేదములను ప్రసాదించెను. ఇక ఆత్మతత్త్వ రహస్యము ఎందులో గర్భితమై యున్నదో, అట్టి ఉపనిషత్తులను ఆయన తన వద్దనే ఉంచుకొనెను. అయితే, ఈ చతుర్వేదములలోని ఒకటైన యజుర్వేదాంతర్గముగా ఉన్నట్టి, వేదసారమైనట్టి, విస్తారమైన రుద్రాధ్యాయమును ప్రత్యేకముగా భక్తవత్సలుడైన సర్వేశ్వరుడు బ్రహ్మదేవునకు

ప్రసాదించెను. అట్టి రుద్రాధ్యాయ మహిమ వర్ణనాతీతము. దాని ఫలితము వలన ప్రాణము నశించక నిలచియుండును. అది అవినాశి. శివాత్మకమైన పరమతత్త్వము కంటె రుద్రాధ్యాయము మరింత అధికమైనదని తెలియుము. వేదవాణిని అనుసరించియే చతుర్ముఖుడగు బ్రహ్మదేవుడు ఈ సమస్త విశ్వమును సృజించెను. అట్టి చతుర్ముఖుడు తనకు ఈశ్వరుడు ప్రసాదించిన నాలుగు వేదములను నాలుగు ముఖములతో నిరంతరము పఠించుచుండెను. ఆ చతుర్ముఖుడు తన దక్షిణముఖముతో యజుర్వేదమును పఠించును. యజుర్వేద అంతర్గతముగా ఉన్న ఉపనిషత్తుల సారమైన రుద్రాధ్యాయమును బ్రహ్మదేవుడు మునివరులకు వివరించి చెప్పెను. దానినే మరీచి, అత్రి మొదలగు మహర్షులందరకు సృష్ట్యాదికాలమునందు ఉపదేశించెను. తర్వాత వాటిని ఆ ఋషీశ్వరులు తమ శిష్యులకు, ప్రశిష్యులకు అనంతరము ఏర్పడిన భావి శిష్యులకు వరుసక్రమంలో ఈ రుద్రాధ్యాయమును బోధించుచు వచ్చిరి. అనంతరం వారి పుత్రపౌత్రులు వారసత్వముగా నేర్చుకొనిరి. ఈవిధముగా పవిత్రమైన రుద్రాధ్యాయము ముల్లోకములయందు బహు చక్కగా విస్తరింపబడెను. దానికి మించిన వేరొక మంత్రముగాని, వేరొక మంత్రాధ్యాయముగాని లేదు. దానితో చేసిన తపస్సు వెంటనే ఫలించి చతుర్విధ పురుషార్థములు లభించును. నానావిధములైన మహాపాతకములు సైతము రుద్రాధ్యాయము వలన నశించిపోయి ఉత్తమ పదవి ప్రాప్తించును. రుద్రాధ్యాయమును పఠించినవారికి సమస్త సిద్ధులు శీఘ్రముగనే సిద్ధింపగలవు. రుద్రాధ్యాయము పఠించువారికి రకరకములైన పాతకములు క్షణములో భస్మీపటలము కాగలవు. మానవులు తరించు నిమిత్తము బ్రహ్మదేవుడు తీర్థమును నిర్మించెను. అందు స్నానమొనర్చువారలు జన్మకర్మలవలన విముక్తులై తప్పక ముక్తిని పొందగలరు. బ్రహ్మ సృష్టించిన దేవతీర్థములందు స్నానపానాదులు చేసినవారు, భవసాగరము నుండి తరించిపోయెదరు. పొలమునందు ఏ గింజలు నాటుదుమో, ఆ మొక్కలే మొలకెత్తునట్లుగా మన సుకృత, దుష్కృతములను అనుసరించియే ఆయా ఫలితములు లభించి అనుభవింపవలసి వచ్చును. ఈ సృష్టిని బ్రహ్మ ధర్మప్రవృత్తితో రచించెను. తన వక్షఃస్థలమునుండి ధర్మమును, పృష్ఠభాగమునుండి అధర్మమును ఉత్పన్నము చేసెను. ఎవరు ధర్మమును ఆచరించెదరో, వారికి ఇహలోకమునందు సమస్త సౌఖ్యములు లభించును. పరలోకమునందు సద్గతి లభించును. ఇక, ఎవరైతే అధర్మమును ఆశ్రయించి పాపములను ఆచరింతురో, వారు పాపరూపులయ్యెదరు. అట్టివారలు తిరిగి ఈ జననమరణ ప్రవాహములోనే పడిపోయి మునుగుచూ, లేచుచూ తిరుగాడుచుండెదరు. ఇక కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములతో నిండియున్న వారలను అధర్మ పుత్రులని తెలియపలెను. వీరందరు నరకానికి పాత్రులయ్యెదరు. ఇట్టి వీరితో ఎవరు సఖ్యమొనర్చెదరో, వారు నేరుగా నరకమునే

పొందెదరు. గురుపత్నీగమనమునకు, సురాపానమునకు పాల్పడువారు, చండాలమైన మనోభావము గలవారు, హద్దుమీరిన కాముకులు నరకలోక ప్రవేశానికి అతిముఖ్యులు. అంతేగాక, మిక్కిలి క్రోధావేశముతో పితృవధ, మాతృహత్య, బ్రహ్మహత్యాది ఘోరపాతకాలను చేయువారు, కన్యావిక్రయమునకు పాల్పడువారు, కామ, క్రోధముల యొక్క గారాల బిడ్డలగుదురు. వీరే "క్రోధకుమారులు"గా ప్రసిద్ధినొందెదరు. దేవ, ద్విజ, గురు ద్రవ్యమును అపహరించువారు, బ్రాహ్మణ ద్రవ్యమును తీసుకొని తిరిగి ఇవ్వనివారు, బంగారమును దొంగిలించువారు, లోభముయొక్క ఇష్టమైన సంతానము. వీరు "లోభ పుత్రులు"గా పరిగణింపబడెదరు. (11-41)

ఒకనాటి శుభసమయమున యమధర్మరాజుగారు సమస్త పాతకములను పిలిపించి వాటితో ఇట్లు పలికెను - "ఓ పాతకములారా! మీరందరు మీ,మీ గుణములను అనుసరించి పోషించుకొనుచూ భూలోకమునకు వెళ్ళి నివసింపుడు. అంతేగాక, ఉపపాతకములను అన్నింటినీ మీకు భృత్యులనుగా చేసి మీతోపాటుగా పంపెదను. మీరందరు కలిసి భూలోకమునందు తిరుగుచూ హెచ్చు పాపములకు పాల్పడునట్లుగా మానవులను ప్రోత్సహించుడు. తత్ఫలితముగా - చిన్న, పెద్ద పాతకములకు పాల్పడునట్టి పాపాత్ములను బంధించి నరకలోకమునకు పంపుచుండగలరు" అని ఆదేశించి పంపెను. అప్పుడు వారందరూ యమాజ్ఞను శిరసా వహించి భూలోకమునకు వెళ్ళిరి. కాని, అచటి జనులు రుద్రపారాయణ మొనర్చుటను చూసి, వారి దరికి చేరుటకు శక్తి సరిపోవక భయపడి తిరిగి యమలోకమునకే పరుగెత్తుకొని వెళ్ళిరి. **యముని పాదములను పట్టుకొని, చేతులు జోడించి, ఇట్లు చెప్పుచుండిరి**- "యమధర్మరాజా! మీకు జయము. జయము. మీ ఆజ్ఞ ప్రకారముగా మేము భూలోకమునకు వెడలితిమి. అచట అందరికందరూ రుద్రపారాయణము చేయుచుండిరి. అంతటా రుద్రాగ్ని వ్యాపించిపోయెను. అందులో మేము దగ్ధమగుచుంటిమి. అట్టి రుద్రపారాయణము చేయుచున్న వారి సమీపమునకు మేము వెళ్ళలేకపోయితిమి. భూలోకమున నిలచుటకు మాకు శక్తి సరిపోవుటలేదు. రుద్రజపము, రుద్రపారాయణము చేయువారిని చూచిన చాలును, మేము దగ్ధమైపోవుచుంటిమి. స్వామీ! గ్రామములయందు, నదీతీరములయందు, దేవాలయములయందు, పుణ్యక్షేత్రములయందు గల బ్రాహ్మణులందరు రుద్రపారాయణము, రుద్రజపము చేయుచుండిరి. తత్కారణముగా మేము భూలోకమున ప్రవేశించుటకే అశక్యమగుచుండెను. ఇక మా గతి ఏమిటి? మహాపాపాత్ములు కూడా రుద్రపారాయణము చేసి, పురుషసూక్తమును పఠించి పునీతులగుచుండిరి. వేలాది ప్రాయశ్చిత్తములు చేసినప్పటికినీ విముక్తులు కానటువంటి బ్రాహ్మణులు కూడా ఈ రుద్ర జపముతో, రుద్ర పారాయణముతో పునీతులగుచుండిరి. యమరాజా! ఒకసారి భక్తితో

రుద్రాధ్యాయమును జపించినంత మాత్రమున వారు పుణ్యవంతులు ఎట్లయ్యెదరో? మాకు బోధపడుటలేదు. ఘోరాతిఘోరమైన పాపులు కూడా పుణ్యాత్ములగుచుండిరి. ఇక, మేము భూలోకమున ఎట్లు తిరుగగలిగెదము. ఇంతేకాదు, రుద్రజపమును చేయువారు కాలకూటవిషమువలె కనిపించుచున్నారు. వారిని సమీపించినంతలోనే మా దేహములు దహింపబడుచుండెను. అందువలన, భూలోకమున కాలుమోపుటకు కూడ మేము శక్తిహీనులమైతిమి. కావున, అట్టి రుద్రజపమును చేయువారి చుట్టూరా ఆవరించిన రుద్రాగ్నిని గాని, అట్టి ఉపద్రవమును గాని ఉపశమింపచేయగల శక్తి మీకు మాత్రమే ఉన్నదని మా విశ్వాసము. స్వామీ! దయతో మీరు మమ్ములను రక్షింపగలరు" అని తమయొక్క కింకరులు వివరించిరి. వారి మాటలు వినిన యముడు ఒక్కసారిగా తలను అడ్డముగా త్రిప్పెను. మిగుల కోపగించి, కనులెఱ్ఱజేసి ఆవేశముతో ఆయన బ్రహ్మలోకమునకు బయలుదేరెను. (42-57)

బ్రహ్మలోకమునకు చేరిన యముడు బ్రహ్మదేవుని సమీపించి, **చేతులు జోడించి, ఇట్లు పలికెను–** "కమలాసనా! మీకు జయము. జయము. జగత్స్రష్టా! చతుర్ముఖా! బ్రహ్మదేవా! మీకు వందనము. నేను మీ శరణాగతుడను. భూలోకమునందు పాపాత్ములైన మానవులను మహాసముద్రము వంటి నరకలోకమునకు తెచ్చి వారిని తగువిధముగా శిక్షింపుమని నన్ను నియమించితిరి. మీ ఆదేశమును అనుసరించి నరకములమీద నాకివ్వబడిన అధికారమునకు లోబడి నా పనులను నేను నిర్వహించుచుంటిని. అయితే, ప్రస్తుతము భూలోకమునగల మహాపాపాత్ములైన నరులను తీసికొనిరమ్మని నా దూతలను పంపించితిని. కాని, అచట ఒక విచిత్రము జరుగుచుండెను. మహాపాతకములకు పాల్పడిన వారు సైతము రుద్రజపమువలన, రుద్రాధ్యాయ పఠనము వలన పునీతులగుచుండిరి. వారందరు నేరుగా స్వర్గలోకమునకే వెళ్ళుచుండిరి. అందువలన నరకలోకము శూన్యమగుచుండెను. నా అధికారము నిష్ఫలమయ్యెను. జనులందరూ కైవల్యమును పొందుటచే, సృష్టి యొక్క ఉత్పత్తి మందగించెను. స్వామీ! ఈ మానవులకు రుద్రాధ్యాయ విధానమును ప్రసాదించి నా యమలోకాధిపత్యమును నీరుగార్చితిరి. ఇట్టి రుద్రాధ్యాయమును వారికి ఎందుకు ఇచ్చినట్లు? మీరిచ్చిన ఈ యమలోకాధిపత్యమును మీరే తీసుకొనుడు. ఇక నాకక్కరలేదు. మా లోకము శూన్యమగుచున్నది గనుక, నేనిట్లు మిమ్ములను వేడుకొనుచుంటిని. పుణ్యములతోపాటు పాతకములు కూడా సృష్టిలో గలవు. కాని, ప్రస్తుతము భూలోకమున మానవులందరూ రుద్రజపమును చేసి, ఆ రుద్రాగ్నిచేత పాతకాలను దగ్ధము చేయుచున్నారు. తద్వారా, వారందరు పుణ్యవంతులగుచుండిరి. వారికి స్వర్గలోకనివాస యోగ్యత ప్రాప్తించుచున్నది. దీనికి ఏదో ఒక ఉపాయము సూచించుటకు మీరే సమర్థులు. స్వామీ! మమ్ము రక్షింపుడు" అని ఈవిధముగ యముడు బ్రహ్మదేవునకు తన గోడును విన్నవించెను. *(58-65)*

అంతట బ్రహ్మదేవుడు యమునికి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను– "యమధర్మరాజా! మీరు చింతపడవలసిన పనిలేదు. ఎవరైతే అజ్ఞానులై, తమోగుణముతో ప్రవర్తించుచు, భక్తిశ్రద్ధలు లేకుండా దంభమునకు మాత్రమే రుద్రాధ్యాయమును పఠించెదరో, వారికి ఎట్టి ఫలమును లభింపదు. వారిని నీవు శిక్షింపవచ్చును. అంతేగాక, గర్వముతో పఠించువారికి, నిలబడిగాని, పడుకొనిగాని రుద్రాధ్యాయమును పఠించువారికి పుణ్యఫలము లభించకపోగా మరింత పాపమే లభింపగలదు. అట్టివారిని మీరు వెంటనే దండింపవచ్చును. కాని, భక్తిశ్రద్ధలతో రుద్రజపము చేయువారికి అత్యధిక పుణ్యరాశి లభించును. భక్తిభావముతో, కడు శ్రద్ధతో పఠించువారల జోలికి మీరు వెళ్ళవద్దు. ఎవరైతే అత్యంత భక్తిశ్రద్ధలతో రుద్రపారాయణమొనర్చెదరో, వారి జన్మాంతర పాపములు సైతము నశించిపోవును. అంతేకాదు, వారికి గల అపమృత్యువు కూడా తొలగిపోగలదు. గత జన్మము యొక్క పాపరాశి వలన అల్పాయుష్యముతో జన్మించినవారికి రుద్రజపము చేయుటవలన నిష్కృతి లభించును. కావున, అల్పాయుష్కులైన వారలు శ్రద్ధగా రుద్రాధ్యాయమును పఠించినయెడల వారి పాపములు సర్వమూ భస్మీపటలమైపోయి దీర్ఘాయుష్మంతులయ్యెదరు. యమధర్మరాజా! రుద్రజపము వలన తేజస్సు, వీర్యము అనగా వర్చస్సు, బలము, ధైర్యము, సంపద, బుద్ధి, ఆయువు, ఆరోగ్యము, జ్ఞానసంపద ఇవన్నియు వృద్ధి గాంచును. రుద్రపారాయణముతో ఈశ్వరుని అభిషేకించి, ఆ జలముతో ఎవరైతే భక్తివిశ్వాసములతో స్నానపానములు చేసెదరో, వారికి మృత్యుభయము ఉండదు. అంతేగాక, రుద్రజపము వలన పుణ్యదేహులై చిరంజీవులుగా నయ్యెదరు. రుద్రాభిషేకము యొక్క జలముతో స్నానము చేసినవారిని చూచి మృత్యువే భయపడును. వారు సులభముగా భవార్ణవము నుండి తరించిపోయెదరు. వంద పర్యాయములు రుద్రాభిషేకములను చేసి పరమేశ్వరుని పూజించినవారు, సమస్త పాపములనుండి ముక్తులై శతాయుష్మంతులయ్యెదరు. కావున, నేను చెప్పిన విధముగా రుద్రజపము చేయు బ్రాహ్మణులను ఎంతమాత్రము బాధింపవద్దని మీ దూతలను ఆజ్ఞాపింపుడు" అని బ్రహ్మదేవుడు చెప్పెను. 'బ్రహ్మ మాటలను విని, వారివద్ద సెలవు గైకొని యముడు తిరిగి తన స్వస్థానమునకు చేరుకొనెనని' పరాశరమహర్షి ఆ రాజుతో చెప్పెను. (58–78)

అనంతరము ఆ మహర్షి రాజుతో ఇట్లనెను – "రాజా! ఇప్పుడు నీ కుమారులకు దీర్ఘాయువు పొందుటకై ఒక చక్కని ఉపాయమును తెలిపెదను వినుము. నీవు నీ పుత్రునకుగాని, మంత్రి పుత్రునకుగాని మృత్యుభయము తొలగిపోవుటకొరకు ఒక వందమంది బ్రాహ్మణులను ఆహ్వానించి పదివేల రుద్రములతో పరమేశ్వరుని అభిషేకింపుము. మీకు మిగుల శ్రేయస్సు లభింపగలదు. మీ కుమారునకు గల మృత్యువు

తొలగిపోయి అతడు పదివేల సంవత్సరముల పర్యంతము నిష్కంటకముగా రాజ్యపరిపాలన చేయును. అతడు అమరనాథుడైన దేవేంద్రునివలె వ్యవహరించును. వారి రాజ్యశ్రీవైభవమునకు పతనము ఉండదు. మీ కుమారులు ఎట్టి సంకటములు లేకుండా హాయిగా సుఖసౌఖ్యములతో జీవించెదరు. కావున, మహారాజా! బ్రాహ్మణోత్తములను పిలిపించుము. వందలాది విద్వజ్జనులను, జ్ఞానులను, యాజ్ఞీకులను ఆహ్వానించుము. వారిచే శివాభిషేచనము నిర్వహింపుము. తత్ఫలముగా మీ కుమారుల ఆయువు పెరుగును. వారికి వెంటనే మేలు కలుగగలదని" చెప్పెను.

పరాశరమహర్షి చెప్పిన మాటలు విని ఆ రాజు మిగుల సంతసించి వెంటనే తమ రాజ్యములోగల వేలాది మంది సద్బ్రాహ్మణులను పిలిపించెను. రాజుగారి పిలుపును విని వేలాదిగా విద్వజ్జనులగు బ్రాహ్మణులు విచ్చేసిరి. అందుకు సంబంధించిన కార్యక్రమమును దయతో తామే నిర్వహింపజేయవలయునని రాజు పరాశరమహర్షిని ప్రార్థించెను. అందుకు పరాశరుడు అంగీకరించెను. మహర్షి చెప్పిన సంభారములన్నింటిని సమకూర్చిరి. చక్కని వేదికను ఏర్పాటుచేసి వందమంది బ్రాహ్మణులను అభిషేకము కొరకు నియమించి, ఒక గొప్పనైన వృక్షచ్ఛాయలో శివునికి అభిషేకమును ప్రారంభించిరి. వంద కలశముల చెరకు రసముతో విధిపూర్వకముగా శివునికి అభిషేకము జరిగెను. ప్రతినిత్యము రుద్రాభిషేకము చేసిన జలముతో రాజుగారి, మంత్రిగారి కుమారులిద్దరికి స్నానమును చేయించుచుండిరి. ఏ పూటకాపూట వారికి పరమేశ్వరుని తీర్థమును ఇచ్చుచుండిరి. భక్తిశ్రద్ధలతో వైభవోపేతముగా పరమేశ్వరుని పూజించుచుండిరి. ఇట్లు నిరాటంకముగా, అఖండముగా రుద్రాభిషేక కార్యక్రమము ఏడు రోజులుగా జరిగెను. ఎనిమిదవ రోజున అకస్మాత్తుగా మూర్ఛ వచ్చి ఆ పిల్లలిద్దరు క్షణముపాటు అచేతనముగా నేలపై పడిపోయిరి. నిశ్చేష్టులై నేలమీద పడిపోయిన కుమారులను చూచి, అటు రాజదంపతులు, ఇటు మంత్రి దంపతులు మిగుల దుఃఖాక్రాంతులై విలపించుచుండిరి. అంతట పరాశరుడు వారికి మిగుల ధైర్యమును చెప్పి, ఓదార్చి రుద్రాభిషేకము చేసిన జలమును తెచ్చి, రుద్ర జపమును చేయుచూ ఆ జలమును వారిపై ప్రోక్షించెను. అట్టి సమయమున ఆకస్మికముగ అదృశ్యమైన శబ్దములు వినిపించుచుండెను. వెంటనే చేతిలో ఒక దండమును ధరించిన మహాపురుషుడు అత్యద్భుతముగా గోచరించెను. గొప్ప కోరలు కలిగిన భయంకర రూపములతో యమదూతలు బాలుని గొనిపోవుటకు వచ్చిరి. కాని, రుద్రమంత్రములను గట్టిగా పఠించుచున్న ఆ బ్రాహ్మణుల యొక్క మంత్రఘోష వారి చెవులకు సోకినంతనే భయగ్రస్తులై ఆ కుమారుల దరికి రాలేక దూరముగనే నిలిచి యమపాశములతో ఆ బాలురను భయపెట్టుచుండిరి.

ఇంతలో పరాశరమహర్షి ఆ కుమారుల మీద రుద్రమంత్రమును పఠించుచూ, అభిషేక జలమును, మంత్రాక్షతలను చల్లెను. ఈ

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

దృశ్యమును యమదూతలు దూరముగా నిలబడి చూచిరి. కాని, సమీపమునకు వచ్చుటకు జంకుచుండిరి. ఇంతలో దండహస్తులైన శివదూతలు పరుగెత్తుకొని వచ్చి, యమదూతలను దండించుటకు వచ్చిరి. వేదపురుషరూపులైన శివదూతలు త్రిశూలములతో యమదూతలను తరిమికొట్టిరి. భయభ్రాంతులైన యమదూతలు కాలికి బుద్ధి చెప్పి పరుగెత్తుకొని పోయిరి. వెంటనే ఆ రాజకుమారులు లేచి కూర్చొనిరి. రుద్రాభిషేక మహిమ వలన రాజుగారి కుమారుడు, మంత్రిగారి కుమారుడు పునరుజ్జీవితులైరి. వెంటనే బ్రాహ్మణులందరూ రాజకుమారులను అమోఘమైన వేదమంత్రములతో ఆశీర్వదించిరి.(78-94)

అనంతరము ఆ రాజకుమారుల మనసులు స్థిరపడి సావధానచిత్తులైరి. రాజదంపతులు, మంత్రి దంపతులు కూడా మిగుల ఆనందమును అనుభవించి, మహర్షిగారికి, బ్రాహ్మణులకు పదే పదే వందనములు చేసిరి. తదుపరి బ్రాహ్మణోత్తములందరిని సగౌరవముగా పూజించిరి. అందరికి షడ్రసోపేతములైన భోజనమును వడ్డించిరి. గొప్ప సమారాధనము గావించి అనేకవిధముల సత్కరించిరి. బ్రాహ్మణులకు తాంబూలాది దక్షిణలనిచ్చి వారిని సంతృప్తిపరచిన పిదప ఆ రాజు ఒక సభను ఏర్పాటుచేసెను. తన సింహాసనముపై పరాశరమహర్షులవారిని కూర్చుండజేసెను. వారికి సాష్టాంగవందనమును ఆచరించెను. భక్తిశ్రద్ధలతో పరాశరమహర్షిని ఘనమైన సత్కారములతో పూజించిరి. రాజుగారు, మంత్రిగారు తమ తమ భార్యలతో, కుమారులతో కలిసి తృప్తిగా భుజించిరి. అనంతరము ఆ సభలో మహదానందభరితులై ఆసీనులైరి. అట్టి సమయమున బ్రహ్మసుతుడైన త్రిలోకసంచారియగు నారదమహర్షి అచటికి ఏతెంచెను. ఆ రాజుగారు వెంటనే ఎదురేగి మహర్షికి నమస్కరించి సభలోనికి ఆహ్వానించి, వారిని ఉన్నతాసనముపై కూర్చుండజేసి అర్ఘ్యపాద్యాదులతో చక్కగా పూజించెను. పిమ్మట సాష్టాంగవందన మొనరించి, భక్తిప్రపత్తులతో **చేతులు జోడించి ఇట్లనెను** – "మహర్షీ! నారదమునీంద్రా! మీరెల్లప్పుడు ముల్లోకములను తిరుగుచుండెదరు. తమరు ప్రస్తుతము ఎచటినుండి వచ్చుచుంటిరి. ఏ లోకమునందైననూ ఏవేని విశేషసమాచారములున్నచో దయతో తాము తెలియజేయగలరని" కోరెను. (95-101)

అంతట నారదమహర్షి రాజుగారిని సంబోధించి ఇట్లు పలికెను – "రాజా! నేను ప్రత్యక్షముగా చూచిన విషయమును చెప్పుచుంటిని. శ్రద్ధగా వినుడు. ఈశ్వర దర్శనార్థమై నేను కైలాసమునకు వెళ్ళి వచ్చుచుండగా, దారిలో ఒక విచిత్రమును చూచితిని. మహామృత్యువు తన దూతలతో కలిసి నీ కుమారుని తీసుకొనిపోవుటకు వచ్చెను. అంతలోనే అచటికి చేరిన శివదూతలు మృత్యువును పరాభవించిరి. వెంటనే

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

కాలికి బుద్ధి చెప్పి పారిపోయిన యమదూతలు తమ రాజైన యమునితో "స్వామీ! మమ్ములను శివదూతలు బాధించుచుండిరి. ఇక మేము భూలోకమునకు ఎట్లు పోయెదము" అని వేడుకొనిరి. అంతట యముడు వెంటనే మిగుల కోపమును వహించి శివలోకమునకు చేరుకొనెను. **వీరభద్రుని చూచి ఇట్లనెను-** "వీరభద్రా! ఏమి అన్యాయము. మా దూతలను మీ దూతలు దండించుటకు గల కారణమేమి? వారు నిరపరాధులు. తాము చేసిన కర్మలను అనుసరించి రాజపుత్రులు మరణించిరి. వారిని తీసికొనివచ్చుచున్న యమదూతలను శివదూతలు అకారణముగా ఎందుకు బాధించిరి. ఇది న్యాయమా" అనెను. **అప్పుడు వీరభద్రుడు కోపోద్రిక్తుడై రుద్రమూర్తిగా ఇట్లనెను -** "యమధర్మరాజా! రాజకుమారులకు పదివేల సంవత్సరముల ఆయుష్యము గలదు. చిత్రగుప్తుడు సరిగా విచారింపలేదు. మీరు చిత్రగుప్తుడిని సరిగా విచారించకుండా వ్యర్థముగా మీ దూతలను పంపితిరి. ఇంకనూ శివదూతలు మీ దూతలను ప్రాణములతో వదలిపెట్టి చాలా తప్పు చేసిరి. కావలసినచో, వెంటనే మీ చిత్రగుప్తులవారిని పిలిపించి తమ చిట్టాను మరొకసారి పరిశీలించమని" పలికెను. వెంటనే యముడు తన దూతలను పంపించి చిత్రగుప్తుని పిలిపించెను. "చిత్రగుప్తా! నీ చిట్టాను సరిగా చూడక, దూతలను వ్యర్థముగా ఎందులకు పంపితివి. ఇప్పుడైనను వారి ఆయుష్యమును గూర్చి సరిగా చూచి చెప్పుమని" యముడు ఆదేశించెను. వెంటనే చిత్రగుప్తుడు తన లెక్కల పుస్తకమును విప్పి చూడగా, ఆ కుమారులకు పన్నెండు సంవత్సరముల ఆయుష్యమే వ్రాసియున్నది. కాని, దాని ప్రక్కనే వారు తమ సామర్థ్యముతో, స్వప్రయత్నముతో పదివేల సంవత్సరముల వరకు జీవించియుండగలరని వ్రాయబడి యుండెను. అది చూచి చిత్రగుప్తునకు, యమునకు సందేహము కలిగి వెంటనే "స్వామీ! మా వలన అపరాధము జరిగినదని" సిగ్గుపడి వీరభద్రునకు నమస్కరించిరి. క్షమింపుమని ప్రార్థించి, తిరిగి తమ లోకమునకు చేరుకొనిరి. ఈ విషయమునంతయునూ కైలాసమునందు చూచి ఇట్లు జరిగిన మిగుల ఆశ్చర్యకరమైన, అత్యంత విచిత్రమైన సంఘటనను గూర్చి మీరు ఏర్పాటు చేసిన సభలో ప్రకటింపవలెనను ఉత్కంఠతో నేను బయలుదేరి వచ్చితిని అని" నారదుల వారు వివరించిరి.(102-112)

"ఓ రాజా! రుద్రజపము చేయుటవలన, రుద్రాభిషేకము యొక్క మహిమ వలన నీ కుమారుడు జీవించెను. పరాశరగురుకృపవలన మీరు మృత్యువును గెలువగలిగితిరి" అని చెప్పి నారదులవారు వెంటనే అచటినుండి వెడలిపోయెను. అనంతరము పరాశరమహర్షి రాజదంపతులను, వారి సంతానమును ఆశీర్వదించి రాజువద్ద సెలవు గైకొని వెడలిపోయెను. బ్రాహ్మణులందరు తమ తమ స్వస్థలములకు వెళ్ళిపోయిరి. రాజు

మిగుల హర్షమును పొంది నిరంతరము రుద్రాభిషేకముల నొనర్చుచూ ఇహపరసౌఖ్యములను పొందెను. పుత్రపౌత్రులతో వర్ధిల్లి భూలోకమున రాజ్యపరిపాలనము చేసెను. (113-115)

రుద్రాధ్యాయము యొక్క మాహాత్మ్యము సాటిలేనిది, అనంతమైనది. రుద్రజపము, రుద్రపారాయణము, రుద్రాభిషేకమును చేయుచూ గురుబ్రహ్మను పూజించుటవలన యముని యొక్క భయము మానవులను ఆవహించదు. కావున, మీరు కూడా నిరంతరము గురుభక్తి కలిగినవారై రుద్రాభిషేకమొనర్చుచుండుడు. తద్వారా సమస్త సుఖములు మీకు సిద్ధించును" అని శ్రీగురుమూర్తి ఆ విప్రదంపతులకు చెప్పిరని, సిద్ధముని నామధారకునితో వివరించి చెప్పెను. అట్టి కథామృతమును గంగాధరసరస్వతి గురుచరిత్రయను గ్రంథరూపమున లోకమునకు ప్రకాశింపచేసెను. ఇట్టి గురుచరిత్రమునందలి రుద్రాధ్యాయ మహిమను ఎవరు భక్తిశ్రద్ధలతో పఠించెదరో, శ్రవణము జేసెదరో, వారు అనాయాసముగ భవసాగరమును దాటిపోయెదరు. వారికి సులభముగా చతుర్విధ పురుషార్థ ఫలములు సిద్ధించును. (116-119)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "రుద్రాధ్యాయ మహిమా వర్ణనము" అను ముప్పదినాల్గవ అధ్యాయము ॥ 34 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 119; మొత్తము సంఖ్య : 4053 + 119 = 4172 ఓవీలు)

-::: (సప్తాహపారాయణ క్రమము (4) నాలుగవరోజు విరామము) :::-

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

॥ సర్వం శ్రీ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహ సరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

॥ హరయే నమః ॥

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ముప్పది ఐదవ అధ్యాయము

స్త్రీలకు మంత్రోపదేశము కూడదని, వారికి పతిభక్తియే ప్రధానమని శ్రీగురుమూర్తి వివరించుట - కచుడు శుక్రాచార్యుల నుండి మృతసంజీవినీ విద్యను అపహరించుట - కచ దేవయానుల కథ - సోమవారవ్రత మాహాత్మ్యము - సీమంతినీ చంద్రాంగదుల ఆఖ్యానము

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునికి కడు భక్తితో నమస్కరించి వినయపూర్వకముగా ఇట్లనెను - "మహానుభావా! శ్రీగురుమూర్తి స్వయంగా ఆ బ్రాహ్మణ దంపతులకు రుద్రాధ్యాయ మాహాత్మ్యమును వివరించిన వైనమును విని నేను ధన్యుడనైతిని. అనంతరము జరిగిన వృత్తాంతమును నాకు చెప్పవలసినది. శ్రీగురుచరిత్రమును వినినకొలది మనసు తృప్తిచెందక మరింతగా వినవలెనని నా మనసు అపేక్షించుచున్నది. కావున, మహాత్మా! అటుపిమ్మట జరిగిన గురుచరిత్రమును నాకు వినిపింపవలసినదని" కోరెను. **అందులకు సిద్ధముని నామధారకునితో ఇటుల చెప్పుచుండెను**- "నాయనా! నామధారకా! వినుము. అనంతరకథ చాలా అపూర్వమైనది. ఒకనాడు ఆ పతివ్రత శ్రీగురుమూర్తిని సమీపించి అత్యంత భక్తిశ్రద్ధలతో నమస్కరించెను. **ఆ మీదట దోసిలొగ్గి వినయముతో ఇట్లు విన్నవించుకొనెను**- "గురుదేవా! మహానుభావా! అద్భుతమైన మీయొక్క పరిపూర్ణమైన కృపచేత మరణించిన నా భర్త జీవించెను. నా నుదుట చెరిగిపోయిన తిలకమును పునరుద్ధరించి, అఖండమైన సౌభాగ్యమును నాకు ప్రసాదించిన మీ దివ్యశ్రీచరణసరోజములకు నేను ఎన్ని జన్మలెత్తి, ఎంతటి సేవచేసిననూ ఆ ఋణము తీరునది కాదు. ఇంతవరకు మీరు వినిపించిన రుద్రాక్ష మహిమను, రుద్రాధ్యాయ మాహాత్మ్యమును విని మేము కృతార్థులమైతిమి. అయితే, నాదొక విన్నపమును ఆలకించుము ప్రభూ! ఇకమీదట మా గతి ఎట్లుండును? మేము ఏవిధముగా ఉండవలయును? మీ పవిత్రమైన, దివ్యమైన చరణాబ్జములను నిరంతరము స్మరించుచు ఉండెదము. కాని, విశేషించి మరేవిధముగా ఉండి మా ప్రాణములను నిలుపుకొనవలయునో, దయతో మరేదేని ఉపాయమును అనుగ్రహించుము. మీ దరిజేరిన పిమ్మట, మీ సన్నిధానమునందు నా మనసులో ఒక అభిలాష జనించినది.

అది యేమన, నాకు తమరు దయతో ఏదేని ఒక మంత్రమును ఉపదేశింపగలరని వేడుకొనుచున్నాను. అట్టి మంత్రమును నిరంతరము జపించి, మీ దివ్యానుగ్రహమువలన నేను తరించెదను" అని ఆమె ప్రార్థించెను. **అందులకు కరుణాంతరంగుడైన శ్రీగురుమూర్తి చిరునవ్వును చిందించి ఆమెతో ఇట్లనెను** – "అమ్మా! ముఖ్యముగా స్త్రీలకు భక్తిభావముతో పతిని సేవించుటకంటె వేరొక ఉపదేశము అక్కరయేలేదు. అయిననూ, స్త్రీలకు ఎట్లు ఉపదేశించెదను. నిజమునకు స్త్రీలకు ఉపదేశింపకూడదు. ముఖ్యముగా నేను స్త్రీలకు మంత్రోపదేశము చేయను. ఒకవేళ స్త్రీలకు మంత్రోపదేశము చేసిన యెడల అట్టి మంత్రమహిమకు భంగము వాటిల్లవచ్చును. ఇంతకుపూర్వము అసురులకు గురువైన శ్రీశుక్రాచార్యులవారు ఒక స్త్రీకి మంత్రోపదేశము చేసి చాలా నష్టపోయిరి. కావున, స్త్రీలు హర్షోల్లాసములతో నిత్యము పతిపరాయణలై భక్తితో తన పతిని సేవించుట ద్వారా తప్పక తరించెదరు" అని చెప్పెను. ఆ పతివ్రత శ్రీగురునాథుని మాటలు విని, **అంజలి ఘటించి మిగుల కుతూహలముతో ఇట్లనెను** – "స్వామీ! స్త్రీలు మంత్రోపదేశమునకు అనర్హులెట్లయిరి? శుక్రాచార్యుల వారికి ఏమైనది? మహిళలు మంత్రోపదేశమునకు నోచుకొనకపోవుటకు గల కారణమేమి? ప్రభూ! కృపతో అదంతయు మాకు వివరముగా చెప్పవలయునని" మిగుల దయనీయముగా ప్రార్థింపుచూ శ్రీవారి శ్రీచరణకమలములకు నమస్కరించెను. ఆ పతివ్రతయొక్క ప్రార్థనను మన్నించి **శ్రీగురుమూర్తి ఇట్లు చెప్పసాగెను**– (1-9)

"పూర్వము ఒకసారి దేవతలకు, దైత్యులకు భయంకరమైన సంగ్రామము సంప్రాప్తమయ్యెను. అప్పుడు ఆ యుద్ధమునందు దేవతలచేతిలో రాక్షసులు పరంపరగా మరణించుచుండిరి. వెంటనే మరణించిన రాక్షసులను శుక్రాచార్యుల వారు తమ వద్దగల మృతసంజీవినీ అను మంత్రమహిమతో తిరిగి వారిని బ్రతికించుచుండెను. ఆ మంత్రమును జపించిన వెంటనే మరణించిన రాక్షసులు లేచి తిరిగి దేవతలను చంపుటకు ముందుకు పరుగెత్తుకొని వచ్చుచుండిరి. ఇంద్రుడు తన వజ్రాయుధముతో ఎన్ని పర్యాయములు రాక్షసులను సంహరించిననూ శుక్రాచార్యుల వారు మృతసంజీవినీ విద్యతో తిరిగి బ్రతికించుచుండుటవలన రాక్షస సైన్యమును గెలుచుట దేవేంద్రునకు అశక్యమాయెను. ఇటుల జరుగుచుండగా, ఒకనాడు ఇంద్రుడు భయపడి కైలాసమునకు వెళ్ళి జరిగిన వృత్తాంతమునంతయు పరమేశ్వరునకు విన్నవించెను. అంతట శివుడు కోపగించి నందీశ్వరుని పిలిచి "నీవు తత్క్షణమే వెళ్ళి శుక్రాచార్యులవారిని నా వద్దకు తీసుకొని రమ్మని" ఆదేశించెను. అందుకు నందీశ్వరుడు స్వామి ఆజ్ఞను శిరసావహించి వెంటనే వెళ్ళి తపస్సును ఆచరించుచున్న శుక్రాచార్యులను ఉన్నదున్నట్లుగా ఎత్తుకొనివచ్చి శివుని ముందు ఆతనిని నిలిపెను. అగస్త్యమహర్షి అమాంతంగా సముద్రమును మ్రింగివేసినట్లుగా, పరమేశ్వరుడు శుక్రాచార్యులవారిని

నోటిలో వేసుకొని గుటుక్కున మ్రింగివేసెను. అచట రాక్షసులందరునూ శుక్రుడు కనపడనందుకు మిక్కిలి విచారపడుచుండిరి. అయితే, శుక్రుడు కొంతకాలము పరమేశ్వరుని ఉదరములోనే ఉండి తదుపరి మూత్రము ద్వారా బహిర్గతుడై పూర్వమువలె మృతులైన రాక్షసులను తన మంత్రముచే జీవింపచేయుచుండెను. **ఈశ్వరుని ఉదరమునుండి బయటకు వచ్చుట వలన శుక్రాచార్యులకు భార్గవుడు అను నామము ఏర్పడెను.** ఇంద్రుడు భయభ్రాంతుడై ఏమియు తోచక **దేవగురువైన బృహస్పతిని పిలిచి వారితో ఇట్లు విన్నవించెను.** "గురురాయా! బృహస్పతీ! దేవతలమందరము మిమ్ము గురువుగా పూజింపుచుంటిమి. శుక్రాచార్యుల వారేమో మృతసంజీవినీ అనే మంత్రప్రయోగము చేసి మరణించిన దైత్యులను బ్రతికించుచుండెను. ఇట్టి కార్యక్రమమునకు విఘ్నమును కలిగించవలెను. లేనిచో, దైత్యులను గెలుచుట దినదినమునకు మాకు అశక్యమగుచున్నది. స్వామీ! మీరు మూర్తీభవించిన వివేకమూర్తులు. జ్ఞానస్వరూపులు. తమరు బాగుగా విచారించి మాకు జయము చేకూర్చుటకై ఏదేని ఒక యుక్తిని లేదా ఉపాయమును ఆలోచింపగలరు. మీకన్న మాకు రక్షకులు వేరెవరు లేరు కదా! మీ ముందు శుక్రాచార్యుడు ఎంతటివాడు. దేవతలందరకు మీరు పరమపూజ్యులు. మామీద కృపను చూపి ఒక గొప్పనైన యుక్తిని ఆలోచించి మమ్ము రక్షింపవలయునని" కోరెను. అమరనాయకుడు ఇంద్రుడు తన శరణుగోరి అతడు చేసిన స్తోత్రమునకు ఔపచారిక పూజలకు దేవగురువైన బృహస్పతి మిగుల సంతోషించెను. **అంతట గురువు ఇంద్రునితో ఇట్లనెను** – "దేవేంద్రా! నీవు కోరినటుల ఇందులకు తగిన ఒక ఉపాయమును చెప్పెదను వినుము. శుక్రుడు తన మంత్రప్రభావముతో మరణించిన రక్కసులను జీవింపచేయుచుండెను. ఇప్పుడు అతని మంత్రమును నిర్వీర్యమొనర్చుట మన తక్షణ కర్తవ్యము. అయితే, ఇందులో ఒక రహస్యము దాగియున్నది. శుక్రాచార్యుల వారి మంత్రము షట్కర్ణ మంత్రము. కనుక, అది షట్కర్ణ గ్రస్తమైనచో, వెంటనే అది నిర్వీర్యమైపోవును. దాని సామర్థ్యము ఉడిగిపోవును. అందుకై శుక్రాచార్యుల వద్దకు ఎవరినైనా పంపవలెను. అతడు కపటవేషధారియై, అతనిని నమ్మించి ఆ మంత్రమును నేర్చుకొనవలెను. అప్పుడు మనకెట్టి విఘ్నములు రాకుండా రక్షింపబడగలము. ఇట్టి మహత్తరమైన కార్యమును సాధించుటకు నేను నా పుత్రుడైన 'కచుని' శుక్రాచార్యుల వద్దకు విద్యార్థిగా పంపెదను. అతడు నేర్పుతో శుక్రుని వద్ద నుండి మంత్రమును గ్రహించును. తద్వారా, మన కార్యము ఫలించును" అని చెప్పి తన కుమారుడైన **కచుని పిలిపించి ఇట్లు పలికెను** – "వత్సా! చిరంజీవీ! నా మాటను శిరసా వహించి నీవు వెంటనే శుక్రుని వద్దకు విద్యార్థిగా వెళ్లుము. అక్కడ నిరంతరము దేవతలమైన మమ్ములందరిని దూషించుచుండుము. లేనిచో, అతడు నిన్ను నమ్మజాలడు. కావున, దేవతలను దూషించుచూ శుక్రాచార్యుల వారికి శుశ్రూష చేయుచూ అతనిని మెప్పించి, నమ్మించుము. అతని వద్ద విద్యార్థిగా నటించుచూ, ఏదో ఒక సమయమున

అతని మెప్పును పొంది, అతని వద్దగల మృతసంజీవినీ విద్యను సంపాదించి తిరిగి రమ్మని" చెప్పెను. అందులకు పితృదేవుని మాటను శిరసావహించి కచుడు వెంటనే తన తండ్రికి నమస్కరించి ఇంద్రుని ఆజ్ఞను గైకొని విద్యార్థి వేషముతో శుక్రుని వద్దకు వెళ్ళెను. (10-30)

కచుడు శుక్రాచార్యుల వద్దకు చేరి అతనికి సాష్టాంగ వందనమును చేసి వినయభావముతో చేతులు కట్టుకొని, దీనముగా నిలబడెను. శుక్రాచార్యులు అతనిని చూచి వెంటనే "నీవెవరవు? ఎక్కడినుండి వచ్చితివి? నీవు వచ్చుటకు గల కారణమేమి?" అని ప్రశ్నించెను. అందులకు **కచుడు సమాధానమును ఇట్లు చెప్పెను** – "స్వామీ! నేనొక బ్రాహ్మణ పుత్రుడను. మీయొక్క ఘనతరమైన కీర్తిని విని మిమ్ములను సేవించి మీ వద్ద విద్యాభ్యాసము చేయుటకు వచ్చితిని. మీకు సేవ చేయుటకు అనుమతించుడు. అనాథనాథా! భక్తవత్సలా! నన్ను శిష్యునిగా స్వీకరించుము మహాత్మా!" అని పదేపదే ప్రార్థించుచుండెను. అప్పుడు శుక్రాచార్యుల వారి సమీపమున నిలిచియున్న **అతని కుమార్తెయైన దేవయాని అత్యంత వ్యాకులత్వముతో తండ్రిని సమీపించి ఇట్లనెను** – "తండ్రీ! ఈ బ్రాహ్మణ కుమారుడు మంచివానివలె కనిపించుచుండెను. మీ వద్దకు శుశ్రూష చేయుటకు వచ్చెను. మీరు ఇతనిని శిష్యునిగా స్వీకరించి విద్యను అభ్యసింపచేయుము" అని చెప్పెను. అయితే, ఆ కచుని యొక్క సులక్షణయుక్తమైన సౌందర్యోపేతమగు రూపమును చూచినప్పటినుండి దేవయాని అంతరంగములో ఇతడు తనకు భర్త కావలయునని ఆకాంక్ష రేకెత్తెను. మన్మథుడిలా తన మనసును దోచుకొనుచున్న కచుడిని మాటిమాటికి చూచుచు ఇట్టివాడే తనకు భర్త కావలయునని మనసులో కోరుకొనుచు, దానిని బయటకు తెలియనీయకుండా జాగ్రత్తపడి కచుని తమకు శిష్యునిగా చేసికొమ్మని తండ్రిగారితో చెప్పుచుండెను. కచుడు వచ్చిన వేళావిశేషము తన కూతురు దేవయాని చెప్పిన మాటతీరును గమనించి శుక్రాచార్యుడు కచుని విద్యార్థిగా అంగీకరించెను. తన గృహమునందే నివాసము ఏర్పరచి అతనికి విద్యాధ్యయనమును ప్రారంభించెను. అతడు విద్యాభ్యాసము చేయుచున్న రోజులలో 'దేవతాగణము నుండి ఈ కుమారుడు కపటముగా బ్రహ్మచారి వేషమును ధరించి తమ శుక్రాచార్యుల వద్దకు వచ్చెను. విద్యనభ్యసించుట అనే నెపముతో గురువుగారి నుండి మృతసంజీవినీ విద్యను గ్రహించి, తిరిగి దేవతలకు అట్టి విద్యను ఉపదేశించుటకొరకే ఇతడు వచ్చినాడని' రాక్షసులు గ్రహించిరి. ఎట్లైనను ఈ కచుని కపటము నెరవేరకుండా ఇతనిని సంహరింపవలయునని నిశ్చయించుకొనిరి. కొద్దికాలము గడచిన పిమ్మట ఒకనాడు కచుడు సమిధలు తెచ్చుటకై అడవికి పంపబడెను. అతనికి సాయముగా కొందరు దైత్యులు వెంట పంపబడిరి. అంతట కచుడు సమిధలు తెచ్చుటకై తన వెంట వచ్చిన దైత్యులను తీసుకొని అడవికి చేరెను. ఆ అడవిలో ఇదే ఒక మంచి అవకాశమని భావించిన రాక్షసులు ఆ కచుని సంహరించి, సమిధలను తీసుకొని తాము తిరిగి శుక్రాచార్యుల గృహమునకు చేరుకొనిరి. కొంత సమయము

గడచిన పిమ్మట శుక్రాచార్యులవారి కూతురైన దేవయాని తండ్రిని సమీపించి, నమస్కరించి "పితృదేవా! కచుడు ఎక్కడా కనిపించుటలేదు. కచుడు ఇంటికి రాకుండగా నేను భోజనము చేయను" అని మిగుల దుఃఖించుచూ పట్టుబట్టెను. అందుకు శుక్రాచార్యుడు ఎంతగానో చింతించెను. ఆతడు తన దివ్యదృష్టితో చూచి అతడు మరణించెనని గ్రహించి వెంటనే సంజీవినీ మంత్రమును జపించి తన విద్యార్థిని తిరిగి ఇంటికి రప్పించెను. ఆనాటి నుండి రాక్షసులు కచుని యందు కడు ద్వేషభావమును పూని, ఎటులైనను ఇతడిని కడతేర్చవలయునని మనసులో గట్టిగా సంకల్పించుకొనిరి. మరికొద్దిరోజులు గడచిన పిమ్మట తిరిగి కచుడు సమిధల నిమిత్తము అరణ్యమునకు వెళ్ళెను. రాక్షసులు ఆ అడవిలో అతనిని నరికి ముక్కలు ముక్కలుగా చేసి తిరిగి ఇతడు రక్షింపబడునేమోనని అనుమానించి సన్నని ముక్కలు ముక్కలుగా చేసి అన్నివైపులకు వెదజల్లి ఇంటికి తిరిగివచ్చిరి. సూర్యాస్తమయమైనను కచుడు ఇంటికి రానందులకు దేవయాని మిగుల దుఃఖించెను. తిరిగి తండ్రిని సమీపించి "కచుడు కనిపించుట లేదేమని, తండ్రిని ప్రశ్నించెను. కచుడు నా ప్రాణసఖుడు. అస్తమయమైనను అతడు ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదు. అతడు కనబడనిదే నేను భోజనము చేయను. అతని ముఖమును నాకు చూపవలసినది. అతడు కనిపించని యెడల నేను విషమును మ్రింగెదను" అని మిక్కిలి శోకింపసాగెను. కూతురుపైన గల మమకారముతో శుక్రాచార్యుడు తన జ్ఞానదృష్టితో చూచి అతడు ముక్కలు ముక్కలుగా చేయబడి నలువైపుల పారవేయబడినటుల గ్రహించెను. తిరిగి సంజీవినీ విద్యను పఠించి మరణించిన కచుని బ్రతికించెను. దేవయాని మిగుల సంతసించి తండ్రిని ఆలింగనమొనర్చుకొనెను. దైత్యులు మరల ఇట్లాలోచించిరి. మనము 'ఏమి చేసినను ఇతడు చనిపోవుట లేదు. తన కూతురుపైన గల ప్రేమతో గురువుగారు ఇతనిని రక్షించుచుండెను. దానికి మనము మరొక పన్నాగమును యోచించవలెను' అని ఆ రాక్షసులందరు మిక్కిలి విచారించి ఒక నిర్ణయమునకు వచ్చిరి. ఆనాడు ఏకాదశి తిథి. ఒక సమయమును చూచి కచుని బయటకు తీసుకొనివెళ్ళి దైత్యులందరు కలిసి అతనిని సంహరించిరి. (31-53)

అనంతరము కట్టెలలో ఉంచి, కాల్చి బూడిద చేసి, ఆ బూడిదను పానకములో కలిపి త్రాగుటకై శుక్రాచార్యుల వారి చేతికి అందించిరి. ఆ పానీయమును శుక్రాచార్యులవారు త్రాగివేసిరి. దేవయాని మరల కచుడు ఎంతకూ రానందులకై దుఃఖపడసాగెను. కుమార్తెయందుగల మమకారముతో శుక్రుడు కచుని కొరకై ఎంత వెదికనను ఎచ్చటను కనిపించుటలేదు. అంతట ఏమై ఉండవచ్చునని శుక్రాచార్యుల వారు తన జ్ఞానదృష్టితో బాగుగా విచారించెను. అంతట అతడు తన పొట్టలోనే గలడని గ్రహించి, **కుమార్తెతో ఇట్లు చెప్పెను.** "అమ్మా! కచుడు నా పొట్టలోనే ఉన్నాడు. అతనిని బయటకు తీయుట అసాధ్యము. ఒకవేళ అతనిని బ్రతికించినచో, నేనే మరణింపవలసి వచ్చును. ఇక నేనేమి

చేయుదును" అని అతడు మదనపడసాగెను. **అంతట తన తండ్రితో దేవయాని ఇట్లు పలికెను**– "తండ్రీ! మీరే అందరిని బ్రతికించుచుండగా మీకు మరణము ఎట్లు సంభవము? అది సాధ్యమైనది కాదు కదా! నాకు మిగుల ఆశ్చర్యము కలుగుచున్నది" అని పలుకగా శుక్రుడు దేవయానితో సంజీవినీ మంత్రము నాకు తప్ప మరెవ్వరికినీ తెలియదు. ఒకవేళ నేను మరణించినచో, నన్ను జీవింపచేయువారు ఎవరు? ఇట్టి మహామంత్రము ఇతరులకు పనికివచ్చును. కాని, నాకై నేనెట్లు బ్రతికించుకొనగలను. ఈ మంత్రమును మరెవ్వరికినీ చెప్పకూడదు. ముగ్గురికి చెప్పబడినచో దానియొక్క సామర్థ్యము నశించిపోవును. కచునికొరకు నా ప్రాణములు పోవుట తథ్యమని" శుక్రాచార్యులు అనిరి. అంతట కూతురైన దేవయాని అతని మాటలు చెవికెక్కించుకొనకుండా తండ్రి పాదములను గట్టిగా పట్టుకొని, చేతులు జోడించి, **దయనీయముగా ఇట్లు పలికెను** – "తండ్రీ! నాకు మీ వద్ద గల సంజీవినీ మంత్రమును ఉపదేశింపుడు. నేను వెంటనే మిమ్ములను బ్రతికించగలను" అని కోరెను. అందుకు శుక్రుడు కూతురితో ఇట్లనెను – **స్త్రీలకు మంత్రమును చెప్పకూడదు అని శాస్త్రములు నుడువుచున్నవి. దానితో అపరిమితమైన దోషములు వాటిల్లగలవని శాస్త్రవచనము. ఈ మంత్రము ఒకవేళ షట్కర్ణగోచరమైనచో దానిమహిమ నశించిపోవును. కావున, నేను నీకు ఈ మంత్రమును ఉపదేశించలేను. పైగా స్త్రీలకు ప్రధానమంత్రము పతిభక్తియే. వారు మంత్రములను జపించరాదు. ఒకవేళ చెప్పినచో అట్టి దోషము నాకు పట్టుకొనును. మంత్రముయొక్క శక్తి నశించిపోవును"** అని చెప్పగా తండ్రి మాటలను విన్న **దేవయాని తిరిగి ఇట్లనెను** – "నీ మంత్రము నీ వద్దనే ఉంచుకొని హాయిగా జపించుకొనుచు నీవుండుము. నేను నా ప్రాణములను వదలివేసెదను" అని పలికి మిగుల దుఃఖమునకు లోనై ఆమె మూర్ఛనొందెను. శుక్రునకు తన కూతురంటే మెండైన ప్రీతి. వెంటనే, ఆమెను లేపి ఆలింగనము చేసికొని రోదించెను. పుత్రిక యందలి వ్యామోహముతో, దేవయానిని దగ్గరకు తీసికొని, జరుగవలసినదేదో, జరిగి తీరునని గట్టిగా నిశ్చయించుకొని, ఆమెకు మూడుమార్లు సంజీవినీ మంత్రమును ఉపదేశించెను. శుక్రాచార్యుని పొట్టలో ఉన్న కచుడు సయితము ఆ మంత్రమును విని వెంటనే జపించెను. శుక్రాచార్యులవారి మంత్ర ప్రభావముచే కచుడు పునరుజ్జీవితుడై, శుక్రుని పొట్టను చీల్చుకొని బయటకు రాగా, దేవయాని సంజీవినీ మంత్రప్రభావముచే తన తండ్రిని బ్రతికించెను. బయటకు వచ్చిన కచుడు లోలోపలే మూడు పర్యాయములు తిరిగి ఆ మంత్రమును పఠించి, 'కార్యమును సాధించి నేను కృతకృత్యుడనైతినని' అంతరంగములో ఎంతగానో సంతసించెను. **అనంతరము కచుడు జీవితుడై గురువుగారికి సాష్టాంగవందనము ఆచరించి ఇట్లనెను** – "గురుదేవా! నేను ఇచట ఉండినచో మీ రాక్షసులు నన్ను చంపివేయుచున్నారు. ఇకముందు నన్ను వారు ఎంతమాత్రము జీవింపనీయరు. కావున, నేను సెలవు తీసుకొని వెళ్ళెదను. నాకు అనుమతిని ప్రసాదింపుడని"

ప్రార్థించెను. మీ దయవలన నేను కొంత విద్యను నేర్చుకొనగలిగితిని. నా మనసులో గల కోరికలన్నియునూ మీ కృపతో నెరవేరినవి. కావున, వెంటనే ఈ ప్రదేశమును వదలిపెట్టి మా స్వదేశమునకు వెళ్ళుటకై నాకు అనుమతిని ప్రసాదింపుమని" ఆతని చరణాబ్జములను గట్టిగా పట్టుకొని దీనముగా వేడుకొనెను. (54-76)

అంతట శుక్రాచార్యులు మిగుల హర్షముతో అతనికి అనుమతిని ప్రసాదించెను. కాని, దేవయాని తన కొంగు చాచి, "నీవు నాకు భర్తవు కమ్మని" అతనిని అర్థించెను. దైత్యులందరు కలిసి నిన్ను మాటిమాటికి చంపివేయుచుండిరి. అప్పుడు నేను మా తండ్రిగారిని ఒప్పించి పట్టుదలతో తిరిగి నీ ప్రాణములను రక్షించితిని. నా తండ్రి వద్ద నీవు విద్యను అభ్యసించినందులకు బదులుగా నన్ను నీవు తప్పక వరించవలసినద"ని వేడుకొనెను. **అందుకు కచుడు దేవయానితో ఇట్లనెను** - "ఔను, దేవయానీ! నీవు నన్ను బ్రతికించిన మాట నిజమే. కావున, ఇప్పుడు నీవు నాకు తల్లితో సమానురాలవు. ఇక నీ తండ్రి నాకు గురువు. కావున, గురుపుత్రిక నాకు సోదరియే అగును. అట్టి నిన్ను నేను వరించినచో, నాకు మిగుల దోషము వాటిల్లును. నీ కోరికను నెరవేర్చలేని అసహాయస్థితిలో ఉన్న నన్ను క్షమింపవలసినద"ని చెప్పి దేవయాని కోరికను నిరాకరించెను. **అంతట దేవయాని ఆగ్రహించి, కచునితో ఇట్లనెను** - "నీవు కపటముగా విద్యను అభ్యసించితివి. అంతేకాదు, నా ఆశను నిరాశ చేసితివి. కావున, నీవు నేర్చిన మంత్రము వ్యర్థమగుగాక!" అని శపించెను. **వెంటనే కచుడు ఖేదపడి పలికెను**- "దేవయానీ! నీకు బ్రాహ్మణుడు భర్తగా లభింపడు గాక లభింపడు. బ్రాహ్మణేతరుడే నీ భర్త యగును. నీ తండ్రి నీ యందలి వ్యామోహముచే శాస్త్రవిరుద్ధముగా, స్త్రీ అయినప్పటికినీ నీకు మహామంత్రమును ఉపదేశించెను. కావున, ఇకమీదట ఆతని మంత్రము నిరుపయోగము కాగలదు" అని అతడు ప్రతిశాపమిచ్చి, వెంటనే స్వర్గలోకమునకు వెడలిపోయెను. జరిగిన సంఘటనను ఆకసమునుండి చూచిన దేవతలందరు మిగుల సంతసించిరి. ఆనాటి నుండి మొదలుకొని శుక్రుని మంత్రము నిష్ఫలమైనందున, రాక్షసులందరు పరాభవమును పొందిరి. శుక్రుని యొక్క సంజీవినీ మహామంత్రము అయోగ్యమై, అది పనిచేయకపోవుటవలన నాటినుండి స్త్రీలకు మంత్రము ఉపదేశించకూడదని నిశ్చయింపబడినది" అని శ్రీనృసింహసరస్వతీ స్వామివారు ఆ పతివ్రతకు వివరించి చెప్పిరి. **"స్త్రీలు పతిసేవ చేయుచూ, గురువు లేదా పతియొక్క ఆజ్ఞతో మాత్రమే వ్రతోపవాసమును చేయవలెను. కాని, స్త్రీలు మంత్రోపదేశమును తీసుకొనకూడదు"** అని గురుమూర్తి చెప్పెను. **అంతట ఆమె గురుమూర్తిని ఉద్దేశించి వినయముగా ఇట్లు పలికెను**- "గురుదేవా! ఏదేని ఒక వ్రతమును మాకు చెప్పిన యెడల ఆ వ్రతమును మేము ఆచరించెదము. మాకు తగిన, యోగ్యమైన ఏదేని వ్రతమును ఉపదేశింపుము. సమస్త విశ్వమును తరింపచేయగల సమర్థులు, మీరు

తప్ప మేము వేరొకరిని ఎరుగమైతిమి. మీరే మమ్ములను తరింపచేయగలవారు. మీ చరణసేవయే మా వ్రతము. మీ చరణయుగళమునందు దృఢమైన భక్తి మాలో నిలిచి యుండునట్లుగా మమ్ములను అనుగ్రహించుము. మా యందు కృప చూపుము" అని ఆమె స్వామివారి చరణాబ్జములను పట్టుకొని ప్రార్థించెను. **అందులకు శ్రీగురుడు కరుణించి ఆమెతో ఇట్లు పలికెను-** "కుమారీ! నీ సౌభాగ్యమును శాశ్వతము చేయగల, నీ పతికి రాజ్యమును ప్రాప్తింపచేయగల ఒక వ్రతమును మీకు చెప్పెదను" అని పలికెను. వెంటనే ఆ దంపతులు స్వామివారికి నమస్కరించి "శ్రీ గురునాథా! మీ ఆజ్ఞ మాకు శిరోధార్యము. మీరు చెప్పిన మాటప్రకారముగా నడచుకొనెదము. గుర్వాజ్ఞను పాటించనివారు ఘోరమైన రౌరవాది నరకములలో పడిపోవుదురని శాస్త్రవచనము గలదు. తప్పక మీ మాటలే మమ్ములను తరింపచేయగలవు" అని స్వామివారికి ఆ దంపతులు పదేపదే వందనము చేయుచూ, ప్రార్థించిరి. అందులకు భక్తవత్సలుడైన శ్రీగురునాథులు సమస్త విశ్వమును తరింపచేయుటకు సామర్థ్యము గలిగిన ఒక అద్భుతమైన వ్రతమును గూర్చి ఆ దంపతులకు ఇట్లు వివరించెను. (77-94)

సిద్ధముని ఇట్లనెను-"నామధారకా! శ్రీగురునాథుడు ఆ దంపతుల యెడల ప్రీతి వహించి చెప్పుచుండగా, వారు కూడా అంతే శ్రద్ధగా శ్రీగురుమూర్తి ఉపదేశమును వినుచుండిరి". శ్రీగురుమూర్తి ఆ దంపతులతో తాను చెప్పబోవు వ్రతము యొక్క ఇతిహాసమును గూర్చి ఈవిధముగా వివరింపసాగిరి.

పూర్వము శౌనకాది ఋషీశ్వరులు ఒక ఉత్తమమైన వ్రతమును గూర్చి చెప్పుమని సూతుని ప్రశ్నించిరి. **అందుకు సూతుడు ఇట్లు చెప్పెను-** "ఋషీశ్వరులారా! స్త్రీలు, పురుషులు అందరూ ఆచరింపదగిన ఒక ఉత్తమమైన వ్రతమును గూర్చి చెప్పెదను. అట్టి వ్రతవిషయమును అవధరింపుడు. నిత్యానందుడు, శాంతుడు, నిర్వికల్పుడు, నిరామయుడు, పరబ్రహ్మము అయిన ఈశ్వరుని అర్చించినచో, వెంటనే సకలాభీష్టములు నెరవేరును. సకాములు, నిష్కాములు, ఇతరులు మరెవరైననూ సరే, పరిపూర్ణమైన భక్తితో ఈశ్వరుని పూజించిన యెడల సులభముగా ఆ పరమేశ్వరుడు ప్రసన్నుడగును. శివారాధనము చేయువారు ఇహపరసౌఖ్యములను పొందగలరు. ఈ అగాధమైన సంసారసాగరములో మునిగితేలుచున్న జనులందరూ ఏదో ఒక సమయమున శ్రీగురుభక్తులై శివవ్రతమును ఆచరించినచో, వారు వెంటనే ఈ భవసాగరము యొక్క ఆవలితీరమునకు సులభముగా చేరుకొందురు, అంతేగాక, స్వర్గమునకు లేదా, మోక్షమునకు అధికారులయ్యెదరని వేదములు, శాస్త్రములు స్పష్టముగా ఘోషించుచున్నవి. అన్ని వ్రతములలోకెల్ల సోమవారవ్రతము మిక్కిలి శ్రేష్ఠమైనది. అట్టి సోమవారవ్రతము ద్వారా పరమేశ్వరుని పరమప్రీతితో ఆరాధించిన యెడల సమస్త మనోభీష్టములు వెంటనే నెరవేరగలవు. సోమవారము నాడు ఇంద్రియనిగ్రహమును కలిగి

దినమంతయూ ఉపవాసమును ఆచరించి, నక్తభోజనముతో ఈ వ్రతమును ఆచరింపవలయును. ఈ వ్రతమును వేదోక్తముగా గాని, పురాణోక్తముగా గాని విధివిధానముగా ఈశ్వరుని పూజింపవలెను. ఈ సోమవార వ్రతమును గృహస్థులు, బ్రహ్మచారులు, సువాసినీ స్త్రీలు, కన్యకలు అందరునూ ఆచరింపవచ్చును. స్కందపురాణాంతర్గతమైన, పురాతనమైన ఈ వ్రతమును గూర్చిన ఒక కథను మీకు చెప్పుచున్నాను. ఇది అపూర్వమైన ఆఖ్యానము. ఋషులందరూ సమాహితమనస్కులై వినగలరని శౌనకాది మహర్షులకు సూతుడు ఈ వ్రతమును గూర్చిన కథను చెప్పెనని శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణ దంపతులకు వివరించుచుండెను. ఈ కథను శ్రద్ధగా శ్రవణము చేయువారు పునీతులయ్యెదరు. కావున, కడు భక్తితో వినవలసినది. (95-106□)

పూర్వకాలమున ఆర్యావర్తము అనగా భరతభూమియందు ఒక రాజు ఉండెను. ఆతనిపేరు చిత్రవర్మ. అతడు మిక్కిలి ధర్మాత్ముడు. ఆ రాజు మిక్కిలి శ్రద్ధతో ధర్మమార్గమును అనుసరించుచూ, అధర్మవర్తనులను శిక్షించుచుండెడివాడు. సమస్తపుణ్యకర్మలను ఆచరించుచుండెను. మహాపరాక్రమమును కలిగి చుట్టూరా గల శత్రురాజులనందరను జయించెను. సుఖముగా తన రాజ్యమును పరిపాలించుచున్న ఆతడు అత్యంత శౌర్యవంతుడు. ఆ రాజునకు సంతానము లేనందున సంతానార్థియై, తన ధర్మపత్నితో కలిసి మిక్కిలి భక్తిశ్రద్ధలతో శివారాధనమొనర్చెను. కొంతకాలము శివారాధన చేయగా ఈశ్వరానుగ్రహము వలన ఆ రాజదంపతులకు ఒక చక్కని కుమార్తె కలిగెను. ఆమె అతిలోకసుందరి. ఉత్తమలక్షణములు గలది. సౌందర్యవంతమైన దేహకాంతిని గలిగి, సూర్యకిరణములు కూడా వెలవెలబోవునట్టి అత్యంత అందాల రాశి. సాక్షాత్తూ ఆమె పార్వతీదేవివలె శోభిల్లుచుండెను. ఈశ్వర ప్రసాదము వలన అట్టి కుమార్తె లభించినందులకు ఆ రాజదంపతులు మిగుల సంబరపడిరి.

అనంతరము బ్రాహ్మణులను, జ్యోతిష్యులను పిలిపించి తన కుమార్తె యొక్క జాతక ఫలమును చెప్పవలసినదని రాజగు చిత్రవర్మ వారిని కోరెను. అప్పుడా జ్యోతిష్కులు నవజాతశిశువుయొక్క జన్మలగ్నమును బాగుగా విచారించిరి. **పిమ్మట ఆమె జాతకమును గూర్చి ఇట్లు చెప్పిరి-** “రాజా! ఈమె సర్వ సులక్షణసంపన్నమైన పార్వతివలె సుమంగళిగా ఉండును. దమయంతివంటి రూపలావణ్యముతో శోభిల్లును. చంద్రునితో సమానమైన ప్రకాశమును కలిగియుండును. ఈమెకు ‘సీమంతిని’ అని పేరు. భాగీరథితో సమానమైన కీర్తిని వహించి, లక్ష్మీదేవి వంటి సుగుణాలరాశియై, వేదమాతయగు సరస్వతీదేవికి గల జ్ఞానముతో తేజరిల్లి, జానకీదేవితో సమానమైన పాతివ్రత్యమును కలిగియుండును. సూర్యుని వంటి కాంతితో, చంద్రుని వంటి ప్రశాంతచిత్తముతో ఈమె తన భర్తతో కలిసి పదివేల సంవత్సరముల పాటు రాజ్యమొనర్చి

అఖండమైన ఖ్యాతిని గడించునని" వారు చెప్పిరి. ఈవిధముగ ఆమె జాతకమును వ్రాసి రాజుగారి చేతికి అందించిరి. అందులకు రాజు మిగుల సంతసించి, బ్రాహ్మణులను, జ్యోతిష్కులను గొప్పగా సత్కరించి అనేకదానములను అర్పించెను. ఇంతలో ఆ సభలోగల ఒక బ్రాహ్మణుడు లేచి, **నిర్భయముగ ఇట్లు పలికెను**– "రాజా! నేనొకమాటను చెప్పెదను. మీరు ధైర్యము వహించి వినవలసినది. ఈ బాలికయొక్క జాతకమును అత్యంత సూక్ష్మముగా విమర్శించి చూచితిని. ఈమెకు పదునాలుగేండ్ల ప్రాయమున వైధవ్యము సంప్రాప్తింపగలదని" చెప్పెను. ఆ మాటలను వినిన రాజు మిక్కిలి దుఃఖాక్రాంతుడయ్యెను. వెంటనే మూర్ఛిల్లెను. పరిపరివిధములుగ లోలోన దుఃఖించెను. తనను తాను సమాధానపరచుకొని, అంతయూ ఈశ్వరాధీనమే కదా! అని ఆ రాజు తన మనసును కుదుటపరచుకొనెను. క్రమముగా ఆ బాలికకు ఏడేండ్ల ప్రాయము ప్రాప్తించెను. తలిదండ్రులు ఆమెకు వివాహము చేయవలయునని ఆలోచించుచూ ఒక బ్రాహ్మణుడు చెప్పిన జాతకమును గూర్చి లోలోన విచారించుచూ, ఏమియూ తోచక దుఃఖించుచుండిరి. వారి మనసులు వికలము చెందుచుండెను. ఆ రాజకుమార్తె ఒకరోజున రాజప్రాంగణములో ఆడుకొనుచుండెను. తనతోపాటు ఆటలో పాలుపంచుకొనుచున్న తన చెలికత్తెలద్వారా తన తల్లిదండ్రుల దుఃఖమునకు కారణము తెలుసుకొని తనకు పదునాల్గవ యేట వైధవ్యము ప్రాప్తించునను మాట తెలిసి ఆమెయూ మిగుల దుఃఖించెను.

ఇట్లుండగా ఒకరోజున యాజ్ఞవల్క్యుని ధర్మపత్ని యగు మైత్రేయి వారి ఇంటికి వచ్చెను. ఆ మహాత్మురాలు ఇంటిలోనికి అడుగుపెట్టిన వెంటనే ఈ అమ్మాయి ఎదురేగి ఆమె చరణములను తాకి, ఆమెకు సాష్టాంగవందనమును ఆచరించెను. (106□-124)

అనంతరము రెండు చేతులను జోడించి వినయపూర్వకముగా, "అమ్మా! నన్ను కాపాడుము" అని దీనముగా అడిగెను. "తల్లీ! నాకు సుదీర్ఘమైన సౌమంగళ్యము సిద్ధించునట్లుగా, వైధవ్యము రాకుండునట్టి ఏదేని ఉపాయమును చెప్పి దయతో నన్ను ఉద్ధరింపవలసినదని" ఆమెను శరణు పొంది ప్రార్థించెను. ఆ రాజకుమార్తె మాటలను విని, **మిక్కిలి ప్రేమభావముతో మైత్రేయి ఇట్లు చెప్పెను**– "అమ్మా! నీవు ఈశ్వరుని శరణు వేడుము. నీ సౌభాగ్యము శాశ్వతమగును" అని పలికెను. **వెంటనే ఆ రాజకుమార్తె ఇట్లు ప్రశ్నించెను**– "అది ఎట్లుండును? దాని విధానమేమి? అందుకు నేనేమి చేయవలెను? మీరు నాకు తల్లి వంటి వారు. కావున, అందుకు తగిన పూర్తి వివరములను దయతో నాకు వివరించవలసినదని" ప్రార్థించెను. **అందులకు మైత్రేయి రాజకుమారితో ఇట్లు చెప్పెను** – "***అన్ని వ్రతములకంటె ఉత్తమమైన ఒక వ్రతము గలదు. దానిపేరు సోమవార వ్రతము. సోమవారమునాడు ఉపవాసము చేసి పరమశివుని పూజింపవలెను. చక్కని నియమముతో, తలస్నానము చేసి, శుభ్రవస్త్రములను ధరించవలెను. నిర్మలమైన మనసుతో, శుద్ధమైన భక్తిభావముతో గౌరీరమణుని పూజించవలెను.***

అభిషేకించవలెను. శివుని అభిషేకించుటవలన పాపము క్షయమగును. పీఠమును పూజించుటవలన సామ్రాజ్యము లభించును. గంధము, అక్షతలు, పుష్పమాలికలు అర్పించుటవలన స్థిరమైన సౌభాగ్యము లభించును. ధూపదానముచే సౌగంధ్యమును, దీపదానముచే కాంతిని, నైవేద్యము అర్పించుటచే సమస్త భోగములను పొందెదవు. తాంబూలమును అర్పించుటచే లక్ష్మీదేవి స్థిరముగా ఉండును. నమస్కారముతో చతుర్విధ పురుషార్థములు, ఈశ్వర మంత్ర జపముచే అష్టైశ్వర్యములు ప్రాప్తించును. హోమము చేయుట వలన భాండాగారములు నిండుకొనియుండును. స్తోత్రము చేయుట వలన సమృద్ధమైన ఐశ్వర్యము లభించును. బ్రాహ్మణ భోజనము వలన సర్వదేవతల అనుగ్రహము సిద్ధించును. అమ్మాయి! ఇట్టి సోమవారవ్రతమును నీవు చేయుము. నీ భయము నివర్తించును. సమస్త క్లేశములు తొలగిపోవును. గౌరీరమణుని పూజించుటవలన సమస్త దురితములు పరిహరింపబడగలవని" సీమంతినితో మైత్రేయి చెప్పెను. అది వినిన వెంటనే సీమంతిని అట్టి సోమవారవ్రతమును తప్పక ఆచరింపవలయునని నిశ్చయించుకొనెను. వెనువెంటనే వచ్చిన సోమవారము నాడు ఆ రాజకుమార్తె మిక్కిలి శ్రద్ధాభక్తులతో సోమవారవ్రతమును ఆచరించెను. ఈ వ్రతానుష్ఠానము వలన ఆమెయొక్క పురాకృతమైన పాపరాశి నశించిపోవును. కనుక, కూతురునకు వివాహయోగ్యమైన వయస్సు వచ్చినదని తండ్రియైన చిత్రవర్మ రాజుగారు 'మనసులో చింతించి దైవముమీద భారము మోపి ఆమె భవితవ్యము ఎట్లుండునో, అట్లే జరిగితీరునని మనసులో కృతనిశ్చయుడయ్యెను. మంత్రులను పిలిచి తమ కూతురుకు తగిన వరుని కొరకై దేశవిదేశములయందు అన్వేషించుమని" కోరెను. సీమంతినికి తగిన వరుని గూర్చి ఆ మంత్రులు దేశవిదేశములందు తిరిగి తిరిగి వెదకగా నలదమయంతుల వంశమునకు చెందిన ఇంద్రసేనమహారాజు కుమారుడైన చంద్రాంగదుడు అను రాజకుమారుడు లభించెను. చంద్రప్రభతో సమానమైన తేజస్సును కలిగి శోభిల్లుచున్న చంద్రాంగదుడనే చక్కని వరునితో తమ కూతురగు సీమంతినికి ఆ రాజదంపతులు వివాహము నిశ్చయించిరి. (125-140)

ఒక శుభముహూర్తమున తన కూతురైన సీమంతినిని రాజకుమారుడగు చంద్రాంగదున కిచ్చి సమధికోత్సాహముతో చిత్రవర్మ మహారాజు అంగరంగవైభవముగా వివాహమొనర్చెను. ఇట్టి వివాహమునకు భూమండలమునందు గల రాజులందరిని ఆహ్వానించిరి. తన అల్లుని ఐశ్వర్యమునకు తగినట్లుగా రాజుగారు వివాహ మహోత్సవమును జరిపించిరి. ఇట్టి వివాహ మహోత్సవమును చూడవచ్చిన రాజులను, విద్వాంసులను, బ్రాహ్మణులను, యథావిధిగా సత్కరించిరి. అందరును మిగుల సంతోషముతో తమతమ గృహములకు వెళ్లిరి. చంద్రాంగదుడు మాత్రము భార్యయందలి అనురాగముతో కొంతకాలము మామగారి ఇంటనే యుండి సర్వసౌఖ్యములను అనుభవించుచుండెను. ఆ

రాజకుమారుడు శ్వశుర గృహమునందు తన భార్యతో కలిసి ఆనందముతో, ఉల్లాసముగా కాలము గడుపుచుండెను. ఇంతలో ఒకనాడు ఆ రాజకుమారుడు కాళిందీ నదిలో జలవిహారము చేయుటకై సంకల్పించుకొని, కొంత పరివారముతో కలిసి నదీతీరమునకు చేరుకొనెను. అందరూ వినోదముగా నదిలోనికి దిగి అత్యంత హర్షోల్లాసములతో జలక్రీడలను సల్పిరి. జలక్రీడలు గావించుచూ ఆ రాజకుమారుడు ఒకసారి నదీప్రవాహమునందు ఈదుతూ, ఈదుతూ కొంతదూరము వెళ్ళి ఆకస్మికముగా ఆ నదీ జలములో మునిగిపోయెను. అది చూచిన కొందరు వెంటనే పైకి లాగుమని కేకలు వేసిరి. తీరమునందు గల కొందరు సైనికులు ఒక పెద్ద నావలో పరుగున వెళ్ళిరి. గజ ఈతగాళ్ళు నదిలో దుముకి ఎంత వెదికిననూ ఆ రాజకుమారుడు కనిపించలేదు. వెంటనే రాజభటులు వెళ్ళి జరిగిన వృత్తాంతమును రాజుగారికి తెలియజేయగా అతడు మిగుల దుఃఖాక్రాంతుడై మూర్ఛనొందెను. సీమంతినియూ తన భర్త నదిలో మునిగిపోయెనను వార్త విని మూర్ఛిల్లెను. పిమ్మట ఆమె నదీతీరమునకు పరుగెత్తుకొని వచ్చి మిగుల దుఃఖించుచూ తన ప్రాణములను విడిచిపెట్టుటకు సిద్ధమయ్యెను. రాజుగారు తమ కుమార్తెను ఎంతగానో ఓదార్చెను. ఒకవైపు రాజపత్ని శోకించుచుండెను. మరొకవైపు అమ్మాయి ఈశ్వరుని ఉద్దేశించి **ఈవిధముగా విలపింపసాగెను-** "హా! హతవిధీ! మహాదేవా! త్రిపురాంతకా! శరణాగతరక్షకా! నేను నీ శరణుజొచ్చితిని. నాకు పదునాల్గవ యేట వైధవ్యము సంప్రాప్తమగునని బ్రాహ్మణులు చెప్పగా అట్టి దుఃఖమును తొలగించుటకొరకే కదా! నేను నిన్ను శరణుపొందితిని. సోమవార వ్రతమును బహు శ్రద్ధతో ఆచరించితిని. నిన్ను నమ్మి చేసిన వ్రతము వ్యర్థమెట్లాయెను. వరదుడవని నమ్మి సేవించిన నన్ను ఎందులకు ఉపేక్షించితివి. శంకరా! నీతోపాటుగా గౌరీదేవికి చేసిన సోమవార పూజలుకూడ వ్యర్థమయ్యెను కదా! నీలకంఠా! నీవెందులకు నన్నుపేక్షించితివి. శరణాగతురాలిని రక్షించలేకపోయితివా, ప్రభూ! ఇప్పటికైననూ నన్ను రక్షించుము స్వామీ! లేనియెడల నీకు అపకీర్తి కలుగుట తథ్యము. శ్రీగురుస్మరణ చేయు నాకు అఖండసౌభాగ్యము ప్రాప్తించుటకై మహర్షి యాజ్ఞవల్క్యుని ధర్మపత్నియైన మైత్రేయి ఈ వ్రతమును ఉపదేశించెను. ఆమె మాటలు విని భవానీసమేతుడైన శివుని ఆరాధించితిని. అమ్మా! ఈ పూజ వ్యర్థమైనదని ఆ పరమాత్మకు నీవైనా చెప్పుము. నా ప్రాణనాథుడు లేక నేనిక జీవింపజాలను" అని దుఃఖించుచూ నదిలో దూకెదనని యమునానదివైపునకు పరుగెత్తెను. గంగలో పడబోవుచున్న ఆ రాజకుమార్తెను నివారించి, రాజుగారు, మంత్రులు, పరివారము, రాజుగారి భార్యలు అందరూ ఆమె చుట్టూరా చేరి దుఃఖసముద్రములో మునిగిపోయిరి. రాజుగారు అనేకమంది నావికులను పిలిపించి, గజ ఈతగాళ్ళను రావించి ఆ నదియంతయూ ఎంత శోధించిననూ రాజకుమారుని జాడ కానరాకుండెను. శోకించుచున్న తన కుమార్తె యగు సీమంతినిని ఎంతగానో ఓదార్చెను. రాజకుమారుని సేవకులు

విలపించుచుండిరి. ఈ సమాచారమును అందించుటకై వారు ఇంద్రసేనమహారాజుగారి వద్దకు వెళ్ళిరి. ఇట్టి దుర్వార్తను విన్న ఇంద్రసేన మహారాజు ఎంతగానో దుఃఖించి తన భార్య, బంధువులు, పరివారము కలిసి ఆ నదీతీరమునకు చేరెను. రాజులిద్దరూ కలిసి బాధాతప్తహృదయులైరి. 'అయ్యో! కుమారా!' అని తలపై బాదుకొనుచూ, వక్షస్థలముపై కొట్టుకొనుచుండిరి. 'హా! నాయనా!' అని శోకించుచుండిరి. రాజుగారు, వారి భార్యలు, మంత్రులు, రాజవర్గములోని వారందరూ, నగరప్రజలు సైతము మిగుల దుఃఖించుచుండిరి. 'రాజపుత్రా! నీవెక్కడికి వెళ్ళితివి' అంటూ తల్లి రోదించుచుండెను. సీమంతిని తలిదండ్రులు, అత్తమామలు అందరూ ఖిన్నులైరి. అప్పుడు సీమంతిని తండ్రిని చూచి తన హస్తముతో నెత్తిని బాదుకొనుచూ 'హా! ప్రాణేశ్వరా! ఏమైతివి. ఎచటికేగితివి' అని అంతులేని **దుఃఖసాగరములో మునిగి ఇట్లనుచుండెను–** "తండ్రీ! ఇక నేను నిశ్చయముగా జీవించను గాక జీవించను. నా భర్తతో సహగమనమొనర్చెదనని పలికెను. ఈ వైధవ్యముతో లోకమునందు జీవించుట వలన ఉపయోగమేమి? కావున, నేను నా భర్తతోపాటు సహగమనమొనర్చెదనని" గట్టిగా చెప్పెను. అచటి బ్రాహ్మణులు, విద్వాంసులు, 'భర్త శవము లేకుండా సహగమనము చేయుటకు వీలులేదు' అని చెప్పి వారించుచుండిరి. ఎంత వెదికించిననూ భర్త శవము కనబడుటలేదు కదా! కనుక, నీవు సహగమనమెట్లు ఆచరింతువని ఆక్షేపించిరి. శవము దొరికేవరకు సహగమనము చేయకుండా వేచియుండవలెనను బ్రాహ్మణుల మాటను రాజకుమార్తెకు తెలియపరచిరి. మిగుల వ్యాకులముతో దుఃఖించుచుంటివి. గాని, జరగవలసిన దానిని బ్రహ్మాదులు కూడా తప్పించుకొనలేరు కదా! అని మంత్రులు, పురోహితులు నచ్చ చెప్పుచుండిరి. జరగవలసిన దైవకార్యము జరిగిపోయినది. మనము ఎంత దుఃఖించిన ఏమి ప్రయోజనమని మంత్రి రాజును ఓదార్చెను. మన ప్రారబ్ధకర్మ ఇట్లుండగా ఎంత దుఃఖించి ఏమి ప్రయోజనము అని అనేకవిధములుగా చెప్పి రాజులిద్దరూ బయలుదేరి తమతమ రాజగృహములకు వెడలిపోయిరి. ఇంద్రసేనుడు మాత్రము పుత్రశోకమును ఏమాత్రము మరచిపోలేక దుఃఖించుచుండెను. రాచకార్యములను వదలిపెట్టి తన పుత్రుని గురించియే శోకించుచుండెను. ఇదియే అదనుగా యెంచి అతని దాయాదులు, బంధువులు అందరూ కలిసి అతని రాజ్యమును కబళించివేసిరి. అనంతరము అతని భార్యతో సహా రాజుగారిని కారాగృహములో బంధించిరి. అపరిమితమైన పుత్రశోకములో మునిగిన ఆతనికి రాజభోగములపై కోరిక నశించెను. ఇక సీమంతిని యొక్క తండ్రియగు చిత్రవర్మరాజు తన కూతురు హీనదశను చూచి మిగుల దుఃఖించుచుండెను. సీమంతిని ప్రాణత్యాగము చేయుటకే ఉద్యుక్తురాలయ్యెను. అంతట చిత్రవర్మ తన కూతురును సమీపించి ఆప్యాయముగా **ఆమె తల నిమురుతూ నెమ్మదిగా ఇట్లు చెప్పెను** – "లోకములో వైధవ్యము నింద్యమైనదే! దానిని భరించుట కష్టసాధ్యమే. కాని, ప్రాణత్యాగము చేయబూనుట మహాపాపము. అది ఆత్మహత్యా

సదృశము. అది హేయమైన పని. తల్లీ! నా మాట వినుము. నాకు పుత్రులు లేనేలేరు. నీవు మరణించినచో మేమెట్లు జీవింతుము. నిన్నే మేము పుత్రునిగా భావించి, జీవించుచుంటిమి. అయితే, నీవు వైధవ్యమును ఆచరించుటలేదని లోకులు మమ్ముల నిందించెదరు. కాని, ఒక ఏడాదిపాటు వేచి చూచెదము గాక! అంతవరకు ప్రాణత్యాగమొనర్చుటకు సిద్ధపడవద్దని" అనేకవిధములుగా బ్రతిమాలుతూ నచ్చజెప్పెను. సీమంతినియూ, తండ్రి మాటలను అంగీకరించెను. కాని, శూలపాణియగు పరమేశ్వరుడు నన్నెందులకిట్లు బాధించుచుండెనని ఆమె నిరంతరము శివుని గూర్చి **ఈవిధముగా వ్యాకులచిత్తయై చింతించుచుండెను**– "జగజ్జీవనా! లోకైక రక్షకా! శివశంకరా! నన్నెందులకు రక్షింపవైతివి. నియమనిష్ఠలతో నేనాచరించిన సోమవార వ్రతఫలము ఏమైనది. హా! దైవమా! నేనెట్లు జీవింపగలను" అని నిరంతరము, క్షణక్షణము తన భర్తను స్మరించుచు, శివుని ధ్యానించుచు పతివియోగ దుఃఖభారముతో కాలము గడుపుచుండెను. అటులే ప్రతి సోమవారము ఉపవసించి తప్పక పరమేశ్వరుని పూజించి వ్రతమును ఆచరించుచుండెను. (141–180)

ఇచట ఇట్లుండగా, నదీప్రవాహములో మునిగిపోయిన రాజకుమారుడు ప్రవాహ వేగముతో కొట్టుకొని పోవుచుండెను. ఇంతలో దైవవశమున విహారార్థముగా ఆ నదీ తీరమునకు విచ్చేసిన నాగకన్యకలు అపురూపమైన ఆతని సౌందర్యమునకు అచ్చెరువొందిరి. వారు వెంటనే అతనిని రక్షించి తమ లోకమునకు తీసికొని వెడలిరి. వారు అతనిపై అమృతజలమును చల్లగా రాజకుమారుడు మేలుకొనెను. వెంటనే అతనికి ఆ నాగకన్యలు అమృతపానము చేయించిరి. తదుపరి నాగకన్యలందరు కలిసి అతడిని తమకు రాజైన తక్షకుని వద్దకు తీసికొనిపోవుచుండిరి. అప్పుడతనికి వారు ఇంద్రలోకమును మించి ప్రకాశించుచున్న పాతాళలోకమును చూపించిరి. అత్యద్భుతముగా, చిత్రవిచిత్రముగా ఉన్న ఆ నగరమును రాజకుమారుడు అత్యాశ్చర్యముగా తిలకించుచుండెను. ఆ నాగలోకము అసంఖ్యాకమైన నవరత్నఖచితములైన గోపురములను కలిగి విద్యుల్లతలవలె మిలమిల మెరయుచుండెను. ఆ పాతాళనగర రచనా సంవిధానము ఇంద్రలోకమును తలపింపజేయుచుండెను. వజ్రములు, నీలములు, వైడూర్యములు, మాణిక్యములు, ముత్యములతో కూడిన తోరణములు వ్రేలాడుచూ అత్యంత సుందరముగ సూర్యకాంతి సమానముగ శోభిల్లుచుండెను. బంగారు ద్వారములతోడను, చంద్రకాంతశిలా భూభాగములతోడను, కనులు చెదిరిపోవునట్లుగా ప్రకాశించుచుండెను. సాటిలేని రత్నములు పొదిగిన బంగారు తలుపులను కలిగిన మహాద్వారములను దాటి రాజమందిరమునందు ప్రవేశించిరి. అది నాగలోకమున గల ఒకానొక గొప్ప విశాలమైన భవనము. ఆ గొప్ప సభాభవనములోగల సభికులందరూ సర్పములే. వారందరు అసంఖ్యాకముగా ఆసనములను అలంకరించి కూర్చొనియుండుటను చూచి రాజకుమారుడు మిగుల విస్మయము నొందుచుండెను.

సభాభవన మధ్యలో ఉన్నతమైన వేదికపై అలంకరింపబడిన సూర్యకాంతితో సమముగా భాసిల్లుచున్న ఉత్తమ సింహాసనమును సర్పరాజగు తక్షకుడు సువర్ణతమ శరీరచ్ఛాయతో తన సహస్ర ఫణములయందు నవరత్నఖచితములైన మకుటములను ధరించి కూర్చొనియుండెను. మధ్యమధ్యలో నాగరాజులు బుసలు కొడుచూ శోభాయమానముగా విరాజిల్లుచుండిరి. వేయిపడగలతో ఉన్న తక్షకుడు విద్యుల్లతలవలె తళతళలాడుచున్న పీతాంబరములను ధరించి, రత్నకుండలాలతో దశదిశలు వెలిగిపోవుచుండెను. అనేకవిధములైన అత్యద్భుతములగు ఆభరణములను ధరించిన ఎందరో నవయౌవన యువతులు అపురూపమైన అందాలరాసులగు నాగకన్యలు వేలాదిమందిగా వచ్చి తక్షకుని సేవించుచుండిరి. అట్టి మహాసభలో సింహాసనమును అధిష్ఠించియున్న రాజగు తక్షకుని చూచి రాజకుమారుడు వినయముతో అతనికి నమస్కరించెను. **అంతట రాజకుమారుని వెంటగల నాగకన్యకలను ఉద్దేశించి తక్షకుడు ఇట్లు ప్రశ్నించెను** – "ఇంతటి సులక్షణసంపన్నుడైన కుమారుని ఎచటనుండి తెచ్చితిరని" అడిగెను. **అందుకు నాగకన్యలు నుడివిరి** – "స్వామీ! మేము జలవిహారార్థముగా యమునకు వెడలితిమి. యమునానదీ ప్రవాహవేగముతో కొట్టుకొనిపోవుచున్న ఇతనిని గాంచితిమి. మూర్ఛిల్లియున్న ఈతనిని రక్షించి మీవద్దకు తీసుకొని వచ్చితిమి. వీరెవరో గాని మాకెంతమాత్రము తెలియదని" విన్నవించిరి. **అంతట తక్షకుడు రాజకుమారుని వైపు చూసి ఇట్లు ప్రశ్నించెను**– "కుమారా! నీవెవరవు? నీ పేరేమి? ఏ వంశమునకు చెందినవాడవు? నీది ఏ దేశము? నీవు ఇచటికి ఎందులకు వచ్చితివి?" అని ప్రశ్నించెను. అందుకు సమాధానముగా **రాజకుమారుడు తక్షకునితో ఇట్లు చెప్పెను**– "భూమండలమున మేము నైషధ రాజ్యాధిపతులమైన రాజులము. నలుడను పుణ్యాత్ముడు రాజుగా నుండెను. అతని కుమారుడు ఇంద్రసేనుడు. ఆతని పుత్రుడనే నేను. నా పేరు చంద్రాంగదుడని అందురు. వివాహానంతరము నేను మా శ్వశురగృహమున యుంటిని. ఒకనాడు జలక్రీడార్థముగా యమునానదికి వచ్చి ప్రారబ్ధవశమున నదిలో మునిగిపోయితిని. నదిలో కొట్టుకొనిపోవుచున్న నన్ను చూచి రక్షించిన, నాగకన్యలు మీ దగ్గరకు తీసుకొనివచ్చిరి. తద్వారా నా అదృష్టము ఫలించినది. మీ దర్శనభాగ్యమువలన నేను ధన్యుడనైతిని. పూర్వజన్మలో చేసిన పుణ్యరాశి ఫలితము వలన మీ చరణరాజీవములను చూడగలిగే భాగ్యము లభించినది. నా జీవితము ధన్యమైనది. నేను కృతార్థుడనైతినని" అని రాజకుమారుడు పలికిన వినయపూర్వకమైన వచనములను విని **తక్షకుడు మిగుల సంతసించి ఇట్లు పలికెను**– "రాజకుమారా! నీవు భయపడవలదు. నీ మనసు నిర్మలమై పవిత్రముగా గోచరించుచున్నది. మీ గృహమునందు ఏ దేవతను పూజించెదరు" అని ప్రశ్నించెను. అది విని రాజకుమారుడు మిగుల సంతోషాంతరంగుడై **వివరముగా ఇట్లు చెప్పసాగెను**– "తక్షకమహాశయా! దేవదేవుడైన సదాశివుని మేము పూజింతుము. అతని వామభాగమున ఉమాదేవి అలంకరించియుండును. వారినే మేమెల్లప్పుడూ

అర్చించుచుంటిమి. ఏ దేవదేవుడు తన మాయయందలి రజోగుణము నుండి బ్రహ్మను సృష్టించగా, అతడు అనుపమానమగు చక్కని సృష్టిరచన చేయుచుండెనో, అటులే సత్త్వగుణముతో విష్ణువును పుట్టించగా అతడు ప్రతిపాలకుడై ఈ లోకమును రక్షించి, పోషించుచుండెనో, అదేవిధముగా తమోగుణము నుండి ఏకాదశరుద్రులను సృజించిన మీదట తాను 'ప్రళయకర్త' అను నామముతో విఖ్యాతుడయ్యెనో, అట్టి పరమేశ్వరుని మేము పూజించెదము. అంతేగాక, తానే ధాత – విధాతగానూ అనగా– ఉత్పాదకులకు ఉత్పాదకుడై, ఎవరైతే ఉత్పత్తి, స్థితి, లయములకు కారకుడో, తేజస్సునకు ఎవరు తేజస్సో అట్టి పరమేశ్వరుని మేము పూజింతుము. భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశముల యందు వ్యాపించి ఎవరు పరిపూర్ణుడై యుండునో, అట్టి సదాశివుని మేము పూజించుచుందుము. సమస్త జీవులలో వ్యాపించియున్న పరిపూర్ణ చిన్మయస్వరూపుడైన నిరంజనుడగు, ఎవరి రూపమును మనము చింతన చేయలేకపోయెదమో, అట్టి ఈశ్వరుని సదా పూజించుచుందుము. ఎవరి గుణ, స్వభావ, లీలావైభవమును వర్ణించుటకు వేదమునకు కూడా అశక్యమో, ఎవరు వ్యాఘ్రచర్మమును వస్త్రముగా ధరించెదరో, తక్షకుడు, శేషుడు ఎవరికి కుండలములో, ఎవరు త్రినేత్రులో, ఎవరి తలపైన చంద్రుడు నిలిచియుండుటచే చంద్రమౌళిగా భాసించునో, అట్టి పరమేశ్వరుని మేము ఆరాధింతుము" అని రాజకుమారుడు చెప్పెను. ఆ మాటలను విని తక్షకుడు అంతులేని సంతోషమును అనుభవించి వెంటనే లేచి **రాజకుమారుని గాఢముగ ఆలింగనము చేసికొని ఇట్లనెను –** "భళా! రాజకుమారా! భళా! నీ రూపమునకు, నీ మాటలకు నేను మేరలేని ఆనందమును అనుభవించితిని. మిగుల సంతసించితిని. అంతేకాదు, రాజకుమారా! నీకు పాతాళలోక ఆధిపత్యమును ఇచ్చెదను. ఈ పాతాళలోకముననే నీవుండుము. ఇచటి అనంత భోగభాగ్యములను అనుభవించుము. మా లోకమున సర్వశ్రేష్ఠమైన, పవిత్రమైన రత్నములను నీకిచ్చెదను. ఇచట కల్పవృక్షములు గలవు. మరణభయము లేదు. పాతాళలోకము యొక్క రచన సాటిలేనిది. స్వప్నములో కూడా ఎవరూ ఎరుగనటువంటి అమృతము నీరువలె బావులలోనూ, నదులలోనూ పొంగిపొరలుచుండును. రోగపీడాదులు అనగా ఏమిటో ఎవరికీ స్వప్నములో కూడా తెలియవు. ఇచటనే ఉండి, సమస్త భోగములను అనుభవించుము. కుమారా! నీవు ఇచటనే మాతోపాటుగా నివసించుము" అని తక్షకుడు ఆప్యాయముగా పలికెను. **అంతట రాజకుమారుడు కరుణాపూరిత వచనములతో ఇట్లు విన్నవించెను–**

"మహాత్మా! తక్షకుడా! నా తండ్రికి నేను ఒక్కడనే కుమారుడను. నా భార్యకు పదునాల్గు ఏండ్ల ప్రాయము మాత్రమే. ఆమెను నూతనముగా నేను వివాహమాడితిని. ఆమెయూ నిరంతరము భక్తిశ్రద్ధలతో శివపూజ యొనర్చుచుండెను. నాకోసమై మిగుల దుఃఖించుచుండును. తలిదండ్రుల పాదపద్మములను నేను దర్శించవలయును. నా మనసు అచ్చోటనే తిరుగుచుండెను. నేను నదిలో మునిగిపోయితినని, నా

తలిదండ్రులు ఎంతయో దుఃఖించెదరు. నేను చనిపోయితినని నా భార్య తలంచును. వారెల్లరు నా గురించి ప్రాణములను వదలివేయుదురు. నేను మీ చరణాబ్జములను దర్శించితిని. నా మనసు మిగుల తృప్తి చెందినది. మీరు నా ప్రాణములను రక్షించితిరి. దయతో నాకు మా తలిదండ్రుల దర్శనమును కలిగింపచేయుమని" ప్రార్థించెను. అతని మాటలకు మిగుల సంతుష్టి చెందిన తక్షకుడు అతనికి అనేక రత్నాభరణములను కానుకగా ఇచ్చి, పుష్కలముగా అమృతమును త్రాగింపచేసి కొంత అతని భార్యకు కూడా త్రాగించుటకిచ్చెను. భూలోకమున లభింపని అపూర్వమైన వస్తువులను, కల్పవృక్ష ఫలములను, వస్త్రాభరణములను కానుకగా ఇచ్చి **ఆ రాజకుమారునితో తక్షకుడిట్లనెను** – "కుమారా! నన్ను ఎప్పుడు స్మరించెదవో, తత్క్షణమే నీ కార్యము సిద్ధింపగలదు. దానికెంతమాత్రము తిరుగుండదు" అని చెప్పి పట్టరాని సంతోషముతో మరిన్ని మేలిమి వస్త్రములను, అత్యంత వేగముతో పరుగెత్తగలిగిన మేటి గుఱ్ఱమును, మనోహరమైన వాహనములను మిగుల వాత్సల్యపూరిత ప్రీతితో ఆ రాజకుమారునకు కానుకగా ఇచ్చెను. అత్యంత హర్షోల్లాసములతో అతనిని సాగనంపెను. తక్షకునికి వినయపూర్వకముగా నమస్కరించి, అతని వద్ద సెలవు తీసికొని చంద్రాంగదుడు గుఱ్ఱమును ఎక్కి మనోవేగముతో మార్గమునందు ప్రయాణించుచుండగా అతనివెంట కొందరు నాగకుమారులు కూడా వచ్చిరి. నదీప్రవాహమునందు అతడు ఏ స్థానమునందు మునిగెనో, ఆ స్థానమునకు క్షణములో విచ్చేసి గుఱ్ఱముతో సహా నదీతీరమున నిలిచెను. (183–230)

ఆనాడు దైవవశమున సోమవారము ఘటించెను. అందుచే సీమంతిని తన వెంట చెలికత్తెలను తీసికొని వారితో పాటుగా స్నానమును చేయుటకై నదీతీరమునకు వచ్చియుండెను. **సీమంతిని తన స్నేహితురాండ్రతో ఇట్లనుచుండెను** – "ఆహా! ఎంతటి ఆశ్చర్యము. అద్భుతముగా ఒక వ్యక్తి నీటిలోనుండి పైకి వచ్చెను. అతని వెంట కొందరు నాగకుమారులుండిరి. వీడు రాక్షసవేషధారుడై యుండవచ్చును. ఇట్లు నరరూపమును ధరించి వచ్చెను. గుఱ్ఱమునెక్కి అత్యంత మనోహరముగా గోచరించుచుండెను. దివ్యవస్త్రములతో, సుగంధములను వెదజల్లుచున్న పూలహారములతో సూర్యప్రకాశమానుడై కనిపించుచున్న అతనిని చూడుడు. అతనినుండి వెదజల్లబడుచున్న సుగంధపరిమళము పది యోజనముల వరకు వ్యాపించుచుండెను. ఈ రూపము బహుశా ఇంతకు మునుపెన్నడో చూచినట్లుగా తోచుచున్నది అని మనమునందు తలపోయుచూ భయము, భయముగా, మెల్లమెల్లగా, కనులు విప్పి అతని రూపమును చూచి, ఈ రూపము తన భర్త రూపమును పోలి యున్నది అని అంటున్నప్పుడు అతని రూపము ఆమెకు మరింత స్పష్టముగా కనిపింపబడెను. అంతట రాజకుమారుడు కూడా ఆమెను చూచి ఈమె రూపము అచ్చము నా భార్యవలెనే కన్పట్టుచున్నది. కాని, మెడలో మంగళసూత్రముగాని, ముత్యాలహారము గాని కనిపించుటలేదేమి?

ఆమె ముఖమునకు పసుపుకుంకుమలు కన్పట్టుటలేదు. మిగుల చింతాక్రాంతురాలై వ్యాకులత్వముతో వాడిపోయిన, మలినరూపముతో ఉన్నప్పటికినీ ఆమె ముఖమునందు తన ప్రాణేశ్వరియొక్క పోలికలు కనిపించినవి. కాని, ఔనా? కాదా? అనే అనుమానము కలుగుచున్నది. మరల లోలోపల నిశ్చయముగా విచారించి, ఆమె రూపము స్పష్టముగ గుర్తుకు రాగానే గుఱ్ఱము మీద నుండి దిగి, నదీతీరమున కూర్చొనెను. సీమంతినిని సమీపముగా పిలిపించి మిగుల ప్రేమతో, “అమ్మాయి! నీవు ఏ వంశములో జన్మించితివి. నీ భర్త ఎవరో చెప్పుము. ఇంత చిన్న వయసులో మ్లానవదనముతో ఎందుకున్నట్లు? నీవు దుఃఖించుచున్నట్లుగా కనిపించుచుంటివి. యవ్వనమున కోమలమైన శరీరమును కలిగియు దుఃఖముతో కృశించియుంటివి. అందుకు కారణమేమి? నాకు వివరముగా చెప్పుమని” మైత్రీభావముతో రాజకుమారుడు అడిగెను. ఆ మాటలను విని సీమంతిని సిగ్గుతో తలను వంచుకొని తను మాటలాడలేక తన చెలికత్తెను వివేకముగ తన వృత్తాంతమును చెప్పుమని ఆదేశించెను. (231-242)

అంతట సీమంతిని యొక్క చెలికత్తె ఆ రాజకుమారునితో ఇట్లు చెప్పసాగెను- “ఈమె పేరు సీమంతిని. చిత్రవర్మ కుమార్తె. చంద్రాంగదుడి పట్టపురాణి. ఈమె భర్త అపురూపమైన అందగాడు. అతని పేరు చంద్రాంగదుడు. ఒకనాడు అతడు ఇక్కడనే ఈ కాళిందీ నదీప్రవాహమునందు జలక్రీడలు క్రీడించుచు మునిగిపోయెను. అందుకని ఈమె మిగుల శోకించుచున్నది. తనకు వైధవ్యము ప్రాప్తించినదని మూడు సంవత్సరముల నుండి రోదించుచున్నది. అందువలన ఈమె సౌందర్యము కరిగిపోయి శరీరము కృశించినది. ప్రతి సోమవారము ఉపవసించి వ్రతమును ఆచరించుచున్నది. ఈ రోజు సోమవారము కావున, నదీస్నాన నిమిత్తముగా ఇపుడిచటికి వచ్చియుండెను. ఇక ఈమె మామగారు పుత్ర దుఃఖముతో పరితపించుచుండగా అతని దాయాదులు రాజ్యమును అపహరించి వారిని కారాగృహములో బంధించివేసిరి. అందుకోసము ఈ సీమంతిని వారి కష్టములు కడతేరుటకై భక్తిశ్రద్ధలతో నిత్యము శూలపాణిని పూజించుచుండెను” అని ఆమె చెలికత్తెలు చెప్పిరి. **అంతట సీమంతిని రాజకుమారునితో ఇట్లనెను** – “ఇంతగా మా గురించి అడుగుచున్న మీరెవరు? మీ రూపము మన్మథుని సౌందర్యమును తలపింపచేయుచున్నది కావున, మానవరూపములో ఉన్న మీరు గంధర్వులా? దేవతలా? కిన్నరులా? లేక, సిద్ధ సాధ్యులా? మమ్ములను మీరెందుకిట్లు ప్రశ్నించుచుంటిరి. అదియునూ మీరు స్నేహపూర్వకముగా అడుగుచుంటిరి. ఇంతకుమునుపు మిమ్ములను ఎక్కడో చూచినట్లుగా స్మృతి కలుగుచున్నది కాని, గుర్తుపట్టజాలకుంటిని. నా మనము నందు మీ పట్ల ఆప్తభావము పొంగులు వారుచుండెను. నా కనులకు మీరు స్వజనులవలె గోచరించుచుంటిరి. ఇంతకు మీ పేరేమిటి? మీరెవరో చెప్పగలరని ప్రశ్నించినపుడు ఆమెకు తన భర్త రూపము జ్ఞప్తికి వచ్చెను.

వెంటనే హృదయము ఆర్ద్రత చెంది అంతులేని దుఃఖము పొంగిపోయి మేఘములు వర్షించినట్లుగా నేత్రముల నుండి కన్నీరుమున్నీరుగా మారి ఏఱులై పారుచుండెను. అంతట మాట తడబడుచుండగా, గట్టిగా రోదించుచూ నేలమీద పడిపోయి ఎంతగానో దుఃఖించుచుండెను. భార్య దుఃఖమును చూచిన రాజకుమారుడు కూడా మిగుల దుఃఖించెను. అంతేగాదు, తండ్రి సమాచారము తెలిసి తీవ్రముగ ఖేదపడి, ఇప్పుడే తాను ప్రకటము గాకుండా, తండ్రిని రక్షించిన పిమ్మటనే తనను గూర్చి ప్రకటించుకొనవలెనని అతడు లోలోపలే దృఢముగా నిశ్చయించుకొనెను. కొంత తడవునకు ధైర్యము తెచ్చుకొని తన నేత్రములనుండి కారుచున్న బాష్పాంబువులను తుడుచుకొని ఆమెను ఓదార్చుచూ, "రాజకుమారీ! దుఃఖింపవలదు. నా పేరు సిద్ధుడని" చెప్పుచూ మిగుల శోకించుచున్న సీమంతినిని రాజకుమారుడు సమీపించెను. ఆ అమ్మాయి చేతులు పట్టుకొని ప్రేమభావముతో ఇట్లు ఓదార్చెను. **ఆమెతో ఏకాంతముగ చెవిలో ఇట్లు చెప్పెను**– "నేను నీ భర్తను చూచితిని. అతడు సుఖముగ నున్నాడు. నీవు చేయుచున్న వ్రతపుణ్యఫలము వలన అతిశీఘ్రముగ నీ భర్త నీ వద్దకు చేరుకొనును. నీవు చింతింపవలదు. నేటికి మూడవ రోజున నీకు అతని దర్శనము తప్పక కలుగును. నీ భర్త నాకు ఆప్తమిత్రుడు. అతడు నాకు ప్రాణముతో సముడు. అమ్మాయీ! నా మాటలను శంకింపవలదు. సందేహమక్కరలేదు. సదాశివుని చరణాబ్జములపై ప్రమాణము చేసి చెప్పుచుంటిని" అని ఏకాంతముగ భార్యతో చెప్పి ఆమె మిగుల దుఃఖించుచుండగా "ఈ మాటను మరెవరికినీ చెప్పవద్దు" అని సీమంతినితో పలికెను. ఆమె కళ్ళవెంట ప్రవాహ వేగముతో కన్నీరు కారుచుండెను. కనులలో వందరెట్ల ప్రేమప్రవాహము పొంగిపొరలుచుండగా తప్పక ఇతడే నా భర్త అయివుండునని మనసులో తలపోయసాగెను. ముఖము సుకుమారముగ అటులే కనిపించుచుండెను. ఇతని కళ్ళు మహదానందభరితములై ఉండెను. మాటల ధ్వని సూటిగా ఉండెను. హాస్యవదనముతో మాటలాడుచుండెను. నా భర్త మాటలు అత్యంత మృదువుగా వుండెను. ఇతడునూ అటులే మాటలాడుచుండెను. నా చేయి పట్టుకొనినప్పుడు అది ఎంతో మృదువైన స్పర్శగా తోచెను. నా భర్త లక్షణములన్నియూ నాకు తెలియును. ఇతని లక్షణములన్నియూ నా ప్రాణనాథుడివే తప్ప మరొకరివి కాదు. ఇతనిని చూచుచుండగా నా మనసు ద్రవించిపోయి, కనులవెంబడి కన్నీరు ప్రవాహ వేగమై కారుచుండెను. ఆలోచించినచో అతి విచిత్రముగా తోచుచుండెను. అయ్యో! నేనెంతయో దురదృష్టవంతురాలను. ఇతడు నా భర్త ఎట్లు కాగలడు. అతడు నదిలో మునిగిపోయినాడన్నది ముమ్మాటికీ సత్యము. ఇతడు సిద్ధుడని తెలిసి కూడా నాకు తిరిగి భ్రాంతి కలుగుట ఏల? మరణించిన భర్త తిరిగి రావడమనే కథను చెవులతో ఎప్పుడునూ నేను వినియుండలేదు. బహుశా నేను కలగనుచుంటినా యేమి? నేను భ్రాంతి చెందితినా? నా మనసునకు ఏమైనది. ఈ వేషధారి ధూర్తుడా, లేక రక్కసుడా? లేదా కిన్నరుడై లేక యక్షుడై ఉండునా? నరునివలె

కపటవేషము ధరించి వచ్చెనా? ఏమిటో మరి, అంతుబట్టుటలేదాయె!" అని తనలో తాను పరిపరివిధములుగా తలపోయసాగెను. "మునిపత్ని చెప్పినట్లుగా ఇది నా వ్రతమునకు సత్ఫలమై ఉండవచ్చునా? లేక, గిరిజాపతి ప్రసన్నుడై ఉండెనా? అని అనేకవిధములుగా తనలో తాను మనసులో వితర్కించుకొనుచుండెను. తిరిగి ధైర్యమును తెచ్చుకొని మరల ఇట్లు చింతించసాగెను. నేను పార్వతీపతియైన శంకరుని పూజించుచుంటిని కదా! ఈశ్వరుని ఆరాధనము వ్యర్థమెట్లు కాగలదు? ఈశ్వరుడు ఎవరి యెడల ప్రసన్నుడగునో వారికి దుఃఖవికారములు ఎట్లు కలుగును? ఈశ్వరానుగ్రహము వలన నా భర్త బ్రతికియే యుండెనేమో?" అని సీమంతిని తనలో తాను అనేక విధములుగా ఆలోచించసాగెను. ఇట్టి పరిస్థితిలో రాజకుమారుడు అత్యంత ఆనందాంతరంగుడై గుఱ్ఱమును ఎక్కి మిగుల ప్రీతితో సీమంతిని వద్ద సెలవు తీసికొని బయలుదేరెను. (243–271)

రాజకుమారుడు గుఱ్ఱమును అధిరోహించి మనోవేగముతో తన స్వీయనగరమునకు వెళ్ళి తన వెంట వచ్చిన **వాసుకి పుత్రుడైన నాగకుమారునితో ఇట్లు చెప్పెను** – "మిత్రమా! నాగకుమారా! నీవు వెంటనే మా నగరములోనికి వెళ్ళుము. ప్రస్తుతము మా రాజ్యమును అనుభవించుచున్న శత్రురాజుతో నా మాటగా ఇట్లు చెప్పుమని తన హెచ్చరికను వివరించి చెప్పి అతనిని పంపించెను. **ఆ నాగకుమారుడు శత్రురాజును చేరి ఇట్లు నుడివెను** – "ఇంద్రసేనమహారాజుగారి కుమారుడు చంద్రాంగదుడు పాతాళలోకమునకు వెళ్ళి తక్షకునితో స్నేహమొనర్చి నాగసైన్యమును వెంట తీసుకొని వచ్చుచుండెను. కాళిందీనదిలో మునిగిపోయినాడను మాట ప్రచారములోనికి రాగానే నీవు స్వామి ద్రోహమును తలపెట్టి ఇంద్రసేనుని రాజ్యమును అపహరించితివి. మా మిత్రుడైన రాజకుమారుని మాటగా చెప్పుచుంటిని. నీకు ప్రాణములపై ఆశ ఉన్న యెడల శీఘ్రముగ అతని రాజ్యమును అతనికిచ్చి శరణుపొందుము. వెంటనే ఇంద్రసేనుని సింహాసనముపై కూర్చుండజేయుము. చంద్రాంగదునకు తక్షకుడను సర్పరాజుతో సఖ్యమేర్పడినది. అతడు మీ ఎముకలను విరిచివేయును. మిమ్ములను సంహరించుట తథ్యము. వెంటనే చంద్రాంగదుని చరణకమలములను దర్శించుటకు వెళ్ళుము. ఒకవేళ నా మాటలను పెడచెవిన పెట్టినచో, ఇప్పుడే నీ ప్రాణములను తీయుదును. తక్షకుడు ఈవిధముగా నీతో చెప్పుమని నన్నాజ్ఞాపించుట వలన నేను మీ వద్దకు వచ్చితిని" అని చెప్పెను. అందుకు వారు మిగుల భయపడి, 'మేము బుద్ధి తక్కువ పని చేసితిమి. ఇప్పుడు శరణు కోరవలసినదే. ఒకవేళ మొండితనము వహించినచో తక్షకుడు తప్పక సంహరించును. ప్రాణములను కోల్పోవలసి వచ్చును. లోకములో అపఖ్యాతి పాలగుదుము. గొప్ప హాని క్షణములో జరిగిపోవునని' తన మనసులో భావించి శత్రురాజు వెంటనే పరుగెత్తుకొనిపోయి తన భటులను ఆజ్ఞాపించి, ఇంద్రసేనుని కారాగారము నుండి విడిపించెను.

వారికి చక్కగా స్నానము చేయించి అనేకవిధముల ఆభరణములను, నూత్న అంగవస్త్రములను ధరింపచేయించి, అందరు చూచుచుండగా అతనిని సింహాసనముపై కూర్చుండబెట్టెను. "రాజా! నా వలన గొప్ప అపరాధము జరిగిపోయినది. నా ప్రాణములను రక్షించుము" అని అతని చరణములను పట్టుకొనెను. **అప్పుడు ఇంద్రసేన మహారాజుతో తక్షక పుత్రుడు హర్షముతో ఇట్లు పలికెను** - "మహారాజా!వాసుకిని కలియుటకొరకై వెళ్ళిన నీ కుమారుడు తిరిగి వచ్చెను" అని పలికెను. ఆ మాటను విన్న రాజు మిగుల సంతోషభరితుడయ్యెను. కుమారుడు గుర్తుకు వచ్చి దుఃఖముపెల్లుబికి మూర్ఛవచ్చి భార్యతో సహా నేలమీద పడిపోయెను. నాగకుమారుడు వారిని లేపి "రాజా! దుఃఖమును మరచిపోవుడు. ఇది సంతోషించవలసిన సమయము. మిమ్ములను కలియుటకొరకు మీ దర్శనము కొరకు, మీ కుమారుడు వచ్చుచున్నాడని" ఉద్వేగభరితమైన ఉల్లాసముతో సమాచారమును అందించెను. అది వినిన రాజు మేరలేని ఆనందము అనుభవించెను. మంత్రులను పిలిపించి వెంటనే నగరమును అలంకరించుమని ఆజ్ఞాపించెను. వెనువెంటనే ఇంద్రసేనుడు తన కుమారుని కలియుటకొరకై బయలుదేరెను. తన అంతఃపుర పరివారమును, మంత్రి పురోహితులను, నగరప్రజలందరూ చనిపోయెనని భావించుచున్న రాజకుమారుడు తిరిగి బ్రతికివచ్చినాడను వార్తను విని అత్యంత సంతోషభరితులై అతనిని చూడవలెనని కుతూహలముతో, అత్యంత ఉత్సాహముతో బయలుదేరిరి. ఆ సంతోషవార్త సమస్త జనులకు మేరలేని ఆనందము కలిగించెను. అందరికందరూ ఉబ్బితబ్బిబ్బయి పోవుచుండిరి. రాజు మనసునకు మేరలేని సంతోషము కలిగెను. పుత్రుని ముఖము చూడవలయుననే ఉత్కంఠతో వెంటనే బయలుదేరెను. మేళతాళములు మ్రోగుచుండగా నగరవాసులు గొప్ప సంతోషముతో, కోలాహలముతో, జయజయధ్వానములతో నగరము వెలుపలికి వచ్చి రాజకుమారుని కలిసిరి. చంద్రాంగదుడు వెంటనే తన తండ్రికి సాష్టాంగవందనమును ఆచరించెను. వేగముతో పుత్రుని లేవనెత్తి అత్యంత ప్రేమతో గాఢాలింగనము చేసికొనెను. తండ్రికి పుత్రవాత్సల్యము పెల్లుబికి కనులనుండి భాష్పధారలు కురియుచుండగా కుమారుని శిరమును అభిషేకించెను. అతని కంఠము గద్గదమైపోయి, నేత్రములనుండి అశ్రువులు ధారాప్రవాహముగా ప్రవహించుచుండెను. కొంత తడవునకు తనను తాను కుదుటపరచుకొని ఇంద్రసేనుడు పుత్రునితో, "నాయనా! నా ప్రాణములు లేచివచ్చినట్లయ్యెను. నీవు లేకపోవుటవలన నేను శవప్రాయుడనైతినని" తన దుఃఖమును వ్యక్తపరచెను. తండ్రిని కౌగిలించుకొని చంద్రాంగదుడు ఎంతయో దుఃఖించెను. అమ్మా! నా గురించి పడరాని పాట్లు పడితిరి కదా! నేను నీ పుత్రుడను కాదు. శత్రువును. మీకెట్టి సుఖమును కలిగింపలేకపోయితిని. నా సుఖముకోసమై వెళ్ళి మీకు మిగుల దుఃఖమును కలిగించితిని. కాని, నేను పాతాళలోకమునకు వెళ్ళి శేషుని వద్ద సుఖముగా యుంటిని. నా గురించి అహోరాత్రములు మిమ్ములను ఎంతగానో కష్టపెట్టితిని. పుత్రుని

మనసు రాతివలె కఠినమని మీరు భావించివుండవచ్చును. కాని, **తల్లి మనసు మాత్రము వెన్నపూస వంటిది కదా! అమ్మా! నీ పుత్రుని కోసమై ఎంత కష్టపడితివో. తలిదండ్రుల దుఃఖమును తెలియలేనివారు మూర్ఖులు. తల్లి వద్ద ఒక్క క్షణకాలము పాటు చేసిన స్తన్యపానమునకు బదులుగా ఋణము తీర్చుకొనుట సంతానమునకు అశక్యమగును. పుత్రునకు తల్లిని వదలి ఇతర దేవతా స్వరూపమును దర్శించుటలో విశేషము ఎంతమాత్రమును లేదు. అమ్మ అంటే కేవలము జగదంబయే. అట్టి జగన్మాత ఋణమును తీర్చుకొనలేక తల్లికి దుఃఖమును కలిగించిన వాడు నేరుగా యమపురమునకే వెళ్ళక తప్పదు. వారి వంశమున పుత్రులుండరు. సప్తజన్మల పర్యంతము వారందరు దారిద్ర్యబాధతో కొట్టుమిట్టాడవలసినదే!"** అని తల్లితో విన్నవించి, సోదరీ సోదరులను, స్నేహితులను, జనులందరిని ప్రధానాది నగరవాసులందరిని, మంత్రులను, అధికారులను, అందరినీ పలకరించి ఆత్మీయభావమును అందించెను. ఇట్లు గొప్ప సంరంభముతో నగరములోనికి ప్రవేశించెను. పిమ్మట రాజకుమారుడు రాజభవనములోనికి ప్రవేశించెను. తక్షకుని పుత్రుడైన నాగకుమారునకు ఇంద్రసేన మహారాజు అనేక అమూల్యమైన వస్త్రములను, ఆభరణములను కానుకగా ఇచ్చెను. చంద్రాంగదుడు తండ్రితో తక్షకుడు చేసిన ఉపకారమును, తన ప్రాణములను కాపాడిన తీరును, అపరిమితముగా తనకిచ్చిన కానుకలను, ద్రవ్యమును గూర్చి వివరముగా తండ్రికి వివరించెను. తక్షకుడిచ్చిన అమూల్యమైన వస్త్రాభరణములను తండ్రికి అందజేసి ఆతని పాదపద్మములకు నమస్కరించెను. అందులకు ఇంద్రసేనుడు ఎంతయో ఆనందించెను. పిమ్మట వచ్చిన ఆ నాగపుత్రుని చక్కగా సత్కరించి, కృతజ్ఞతలను తెలిపి వీడ్కోలు చెప్పి అతనిని సాగనంపెను.(272-307)

అనంతరము రాజు 'నా కోడలు గొప్ప అదృష్టవంతురాలు. ఆమె ధర్మమువలననే నా పుత్రుడు రక్షింపబడెను. ఆమె సౌభాగ్యము శాశ్వతమైనది. ఆమె శంకరుని ఆరాధించుటవల్లనే నా కుమారుడు తిరిగి క్షేమముగా చేరుకొనెను. అట్టి నా కోడలు అఖండసౌభాగ్యశీలి, అని సంతోషముగా ఈ విషయమునంతయూ లేఖలో వ్రాయించి, ఇంద్రసేన మహారాజు తన దూతలను, చిత్రవర్మ రాజునకు తెలియజేయుటకై పంపించెను. దూతలు వెంటనే బయలుదేరి చిత్రవర్మ పురమునకు చేరి చంద్రాంగదుడిని గురించిన శుభవార్తతో కూడిన లేఖను రాజుగారికి అందజేసిరి. అట్టి శుభవార్తను వినిన మహారాజు పట్టరాని సంతోషమును పొంది వచ్చిన దూతలకు అపారమైన వస్త్రాభరణములను కానుకగా ఇచ్చెను. ఇంద్రసేన మహారాజు భృత్యులద్వారా తన అల్లుడు చంద్రాంగదుడు క్షేమముగా నాగలోకమునుండి తిరిగి వచ్చెనన్న వార్తతో ఆనందభరితుడాయెను. బ్రాహ్మణులకు అనేక దానములను ఇచ్చెను. ఇంతలో ఇంద్రసేనమహారాజు, చంద్రాంగదుడు కూడా అచటికి చేరుకొనిరి. అత్యంత మహోత్సాహముతో సీమంతినీ చంద్రాంగదుల కలయికను గొప్ప వేడుకగా ఉత్సవమును నిర్వహించిరి. చంద్రాంగదుడు

మిక్కిలి ప్రేమతో సీమంతినిని కలిసెను. పాతాళనగరము నుండి తెచ్చిన అమూల్యమైన వస్తువులను ప్రాణేశ్వరికి కానుకగా సమర్పించెను. తక్షకుడిచ్చిన అమృతమును ఆమెచే త్రాగించి మహదానందభరితుడాయెను. రాజకుమారుడగు చంద్రాంగదుడు తన భార్యకు కల్పవృక్ష ఫలములను, అమూల్యమైన వస్తువులను, పది యోజనముల పర్యంతము కాంతిని వెదజల్లే ఆభరణములను ప్రసాదించెను. అత్యుత్సాహముతో భర్తయొక్క పునరాగమన మహోత్సవములో పాల్గొని, పిమ్మట సీమంతిని పతితో కలిసి వారి నగరమునకు బయలుదేరెను. ఆమె అదృష్టము ఇంతింతయని చెప్పనలవికానిది. తమ నగరమునకు చేరుకొనిన ఇంద్రసేనుడు తన పుత్రుడగు చంద్రాంగదునికి రాజ్యపట్టాభిషేకమొనర్చెను. చిత్రాంగదుడు సీమంతినితో కూడుకొని సమస్త సౌఖ్యములను అనుభవించుచూ పదివేల సంవత్సరముల పర్యంతము రాజ్యపరిపాలనము చేసెను. సీమంతిని భక్తిశ్రద్ధలతో ఉపవసించి సోమవారవ్రతమును ఆచరించి, గౌరీహరులను ఆరాధించెను. తద్వారా ఆమెకు గల మనోరథములన్నియూ ఈడేరినవి. దీర్ఘసౌమంగళ్యము కూడా సిద్ధించినది అని" ఇట్టి అద్భుతమైన, పవిత్రమైన, ప్రతిభావంతమైన సోమవారవ్రతమును గూర్చి శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణ దంపతులకు వివరించి చెప్పెను. (308–320)

అంతట "తల్లీ! నీవు కూడా ఈ వ్రతమును ఆచరించి అఖండమైన సౌభాగ్యమును పొందుము. నీకు అనేకమంది కుమారులు, కుమార్తెలు కలిగెదరు. నా మాట వినుమని" ఆ దంపతులతో శ్రీగురుదేవుడు చెప్పెను. **తదుపరి ఆ దంపతులు గురుదేవులతో ఇట్లనిరి–** "గురుదేవా! మీ చరణసేవయే మాకు వ్రతము. మరొక వ్రతమెందులకు. మీరు మా ప్రాణనాయకులు. మీరు తప్ప మాకు వేరెవ్వరునూ తెలియదు. మాకు మీ చరణములే శ్రేయోదాయకములని" వారి పాదపద్మములను అత్యంత ప్రీతితో పట్టుకొనిరి. **శ్రీగురుడు వారితో ఇట్లనెను** – "మీరు తప్పక సోమవారవ్రతమును అచరించుడు. నేను ఆదేశించుచుంటిని. మీరు చేయు ఆ సేవను నేనే పొందెదను" అని పలికెను. శ్రీగురుమూర్తి ఆజ్ఞను గైకొని సోమవారవ్రతమును చేయుచుండిరి. అంతట వారి తలిదండ్రులు, తమ కుమారుడు, కోడలును గూర్చిన శుభవార్తను విని అపరిమితముగ సంతోషించి, ధనమును ఖర్చుపెట్టి గాణగాపురమునకు విచ్చేసి, శ్రీగురుమూర్తిని దర్శించిరి. అనంతరము అంతులేని ఆనందముతో గురుమూర్తిని సభక్తికముగా పూజించి అనేక బ్రాహ్మణ సమారాధనములను జరిపించిరి.

అనంతరము శ్రీగురుమూర్తి ఆజ్ఞను స్వీకరించి అందరునూ కలిసి తమ స్వగ్రామమునకు హర్షోల్లాసములతో చేరుకొనిరి. అంతట గురునాథుని ఖ్యాతి సమస్త దేశవిదేశములందు వాయువువలె వ్యాపించెను. తరువాత ఆ దంపతులకు వంద సంవత్సరముల ఆయువు గలిగి నిరంతరము శ్రీగురుని నామస్మరణ చేయునట్టి ఐదుగురు పుత్రులు జన్మించిరి. ప్రతి సంవత్సరము శ్రీస్వామి వారి దర్శనార్థమై ఆ దంపతులు

భక్తిశ్రద్ధలతో గాణగాపురమునకు విచ్చేయుచుండిరి. ఇట్టి అమూల్యమగు పవిత్రమైన గురుచరిత్రమును సిద్ధముని నామధారకునకు ఎంతయో ప్రీతితో చెప్పెను. (321-331)

గంగాధరుని కుమారుడు, గురుకింకరుడగు సరస్వతి ఇట్లు విన్నవించుచుండెను– "గురుభక్తులారా! మా వంశమునకు తరతరములనుండి శ్రీనృసింహసరస్వతీ స్వామి వారే యజమానులు. వారు భక్తుల యెడల తత్కాలమున ప్రసన్నులై అనేక అభీష్టములను అనుగ్రహించుచుందురను బిరుదమును, కీర్తిని కలిగియున్నవారు. మనసులో సందేహింపవలసిన పనిలేదు. చక్కెర మధురమని చెప్పుటకు దానిని దేనితో సరిపోల్చి చెప్పెదము. ముంజేతి కంకణమునకు అద్దమెందులకు? ప్రత్యక్షముగ ఋజువును అనుభవించుచున్నప్పుడు వేరొక ప్రమాణమెందులకు? శ్రీగురుమూర్తి ఖ్యాతి ఈ భూమండలమున సమీరము వలె అత్యద్భుతముగ వ్యాపించినది. **జనులారా! మీరందరు ఏకాగ్రచిత్తముతో వినుడు. నేను ఎలుగెత్తి మీకు హితమునే చాటిచెప్పుచుంటిని. శ్రీ గురుమూర్తియగు నృసింహసరస్వతీ స్వామివారు సర్వలోక శుభంకరుడు, సర్వజనవరదాయకుడు అని తెలియవలయును. అట్టి శ్రీగురునాథుని సేవించుడు. వెనువెంటనే మీ మనోరథములు సిద్ధించును. అమృతమువంటి గురుచరిత్రమును నిరంతరము ఎవరు సేవించెదరో, వారు తప్పక పునీతులు కాగలరు. కావున, అమృతపు చలివేంద్రము వంటి 'గురుచరిత్రము' మీకోసమై నెలకొల్పబడియున్నది. దానిని సమీపించి మీరందరు తనివితీర త్రాగుడు. కామధేనువు వంటి శ్రీగురుచరిత్రమును వినుటవలన, పఠించుటవలన పతితులు పవిత్రులయ్యెదరు. భక్తుల మనోభీష్టములు తప్పక సిద్ధించును. ఎవరి చిత్తము శ్రీగురుచరణ సరోజములయందు స్థిరముగ నిలచియుండునో, వారి కార్యములన్నియూ సులభముగ నెరవేరుచుండును. శ్రీగుర్వనుగ్రహతో అనాయాసముగా వారు అక్షయపదవిని పొందగలిగెదరు"** అని గంగాధర సరస్వతి పవిత్రమైన గురుచరిత్రమును, గురులీలలను మరాఠీ భాషలో గ్రంథరూపమున శ్రోతలకు ప్రకటింపచేసెను. (332-339)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "సీమంతినీ ఆఖ్యానము" అను ముప్పది ఐదవ అధ్యాయము ॥ 35 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 339; మొత్తము సంఖ్య : 4172 + 339 = 4511 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ముప్పది ఆరవ అధ్యాయము

సదాచార సంపన్నుడగు తన భర్తచేత బలవంతముగ అతని భార్య పరాన్నమును తినిపించుట - తద్వారా దుఃఖితులైన బ్రాహ్మణ దంపతులు శ్రీగురునాథుని శరణు గోరుట - పరాన్నభుక్త పాపపరిహారమును గూర్చి ప్రశ్నించుట - సదాచారమును గూర్చి, నిత్య ధర్మ కర్మలను గూర్చి శ్రీగురునాథుడు వారికి ఉపదేశించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యోత్తముడగు నామధారకుడు సిద్ధముని పాదపద్మములకు భక్తిపూర్వకముగా వందనమును ఆచరించెను. **తదుపరి వినయపూర్వకముగా దోసిలొగ్గి ఇటుల విన్నవించెను–** "సిద్ధమునీంద్రా! మీకు జయము. జయము. నన్ను భయంకరమైన భవార్ణవమునుండి మీరే తరింపచేయుచుంటిరి. తమరు బ్రహ్మజ్ఞాన సంపన్నులు. అవిద్య యనెడు గాఢాంధకారమును రూపుమాపుటలో మీరు జ్ఞానభాస్కరునివంటి వారు. దయాసాగరులైన శ్రీగురునాథా! మాయామోహమనెడు చిమ్మచీకటిలో నిద్రించుచున్న నన్ను మిక్కిలి కృపతో జాగృతపరచితిరి. చిన్మయాత్మా! సిద్ధమునివర్యా! తిమిరమును హరించే ఆదిత్యుని వంటి మీరు నాకు సద్గురువుగా లభించితిరి. ఈ భవసాగరము నుండి దయతో నన్ను గట్టెక్కించితిరి. అందుకుగాను, తమరివలన గురుచరితామృతమును శ్రవణమొనర్చిన కొలది నాలోని తృష్ణ అంతకంతకు అత్యధికమగుచుండెను. స్వామీ! అనంతర కథాక్రమమును గూర్చి వివరింపగలరు. దివ్యగురూపదేశ జ్ఞానామృతమును నాచే ప్రాశనము చేయించి నన్ను కృతార్థుని చేయగలరని" పదే పదే ప్రార్థించెను. శిష్యుని మాటలను వినిన సిద్ధమునీశ్వరుడు మిగుల సంతసించి భయము ఎంతమాత్రము వలదని అభయదానము చేసెను. **అనంతరము నామధారకునితో ఇట్లు చెప్పుచుండెను–** "శిష్యాగ్రణీ! అనంతర కథ అత్యంత రమణీయమైనది. అందరిలో జ్ఞానోదయమును కలిగించునది. కడు జాగ్రత్తగా వినుము. శ్రీగురుమూర్తి గాణగాపురములో నివసించినపుడు ఆయన మహిమ అపారముగా విస్తరించెను. విస్తృతమైన వారి కథను, వారి మహిమా ప్రాభవమును వివరించి చెప్పవలయునన్నచో, ఒక గొప్ప గ్రంథమే కాగలదు. సాక్షాత్తుగా శ్రీహరి అవతారమైన శ్రీస్వామివారి మహిమోపేతములైన కథలను వర్ణించి చెప్పుటకు ఎవరికి సాధ్యమగును. కావున, శ్రీనృసింహసరస్వతీ స్వామివారి

యొక్క చరిత్రమును సంగ్రహముగా నీకు వినిపించుచుంటిని. అట్టి మహిమాన్వితమైన శ్రీగురుచరిత్రమును ఏకాగ్రచిత్తముతో వినుము. అట్లు వినువారికి తప్పక జ్ఞానము సిద్ధించును. (1-10)

శ్రీ గురుమూర్తికి నివాసస్థానమైన గాణగాపుర క్షేత్రమున వైదిక నిష్ఠాగరిష్ఠుడైన ఒక బ్రాహ్మణుడు ఉండెను. అతడు గొప్ప వైరాగ్యవంతుడైనప్పటికినీ స్వధర్మమును మిగుల నిష్ఠతో, శ్రద్ధతో అనుష్ఠించుచుండెను. అతడు ఏనాడూ పరాన్నమును తిని ఎరుగడు. పరద్రవ్యమును కాంక్షించువాడు కాదు. అసత్యమును ఆడుట అతనికి అసలే గిట్టదు. మిథ్యావాదము చేయుట, పరనిందలు పలుకుట, అపశబ్దములను ఉచ్చరించుట, అతిశయముతో మాటలాడుట అతనికి ఎంతమాత్రము తెలియదు. ప్రతినిత్యము అపక్వభిక్షను యాచించి తన కడుపు నింపుకొనువాడు. ఇంతటి పవిత్రమైన ఆ బ్రాహ్మణునకు ఒక కోపిష్ఠియైన భార్య ఉండెను. అతడు యాయవారవృత్తితో జీవనము గడుపుచున్నప్పటికినీ ప్రతినిత్యము అతిథి అభ్యాగతులకు భోజనము పెట్టకుండా తాను భుజించువాడు కాదు. చక్కని సమన్వయభావముతో సంసారమును నడుపుకొనెడివాడు. ఆ గ్రామమునందు ప్రతిదినము అనేక మృష్టాన్నములతో కూడిన సహస్రబ్రాహ్మణ సమారాధనములు జరుగుచుండెను. అంతేగాక, శ్రాద్ధాదిక భోజనములను పెట్టుటకై అచటికి ఎందరో వచ్చుచుండెడివారు. ఇట్టి సమారాధనమునకు ఆ గ్రామమునందుగల బ్రాహ్మణ స్త్రీ పురుషులందరు మిక్కిలి సంతోషముతో వెళ్ళి భుజించుచుండెడివారు. భోజనమునకు వెళ్ళినవారు తిరిగి వచ్చిన పిమ్మట వారు భుజించిన పక్వాన్నములను గూర్చి, పరస్పరము వాటి రుచులను గూర్చి అనేకవిధములుగా వర్ణించుచూ ముచ్చటించుకొనుచుండెడివారు. అయితే, ఈ బీదబ్రాహ్మణుడు మాత్రము భార్యతో సహా తమ ఇంటియందే భుజించుచుండెడివాడు. అతడు ఏనాడూ సమారాధనలకు వెళ్లువాడు కాదు. కాని, సమారాధనలో భుజించి వచ్చిన వారలు ఆనాటి పక్వాన్నములను గురించి గొప్పలు చెప్పుచుండగా ఈ పేద బ్రాహ్మణ స్త్రీ వారి మాటలను విని అనేకవిధములుగా దుఃఖించుచు తాను కూడా ఆ సమారాధనలకు పోవలయునని ఆకాంక్ష కలిగి తనలో తాను వగచి ఇట్లు తలపోయుచుండెడిది. "హా! పరమేశ్వరా! శ్రీహరీ! నేనెంతటి దురదృష్టవంతురాలను. ఇరుగుపొరుగువారు చెప్పెడి పక్వాన్నములను స్వప్నమునందైనను భుజించి ఎరుగను కదా! దరిద్రుడైన భర్తను పెండ్లాడి సర్వదా కష్టములనే అనుభవించుచుంటిని. కనీసము కమ్మటి భోజనమునకు కూడా నోచుకొననైతిని. అందరూ స్వేచ్ఛగా సమారాధనలకు వెళ్ళి కమ్మని పిండివంటలను భుజించుచుండిరి. నా భర్తకు పరాన్నమన్నచో, సుతరామూ ఇష్టమే లేదు కదా! 'హే! నారాయణా! పూర్వజన్మలో చేసిన హీనకర్మలవల్ల ఇట్టి భర్త లభించియుండవచ్చును. ఇతడెప్పటికీ కటిక దారిద్ర్యబాధలోనే వుండెను కదా! ఇరుగుపొరుగు బ్రాహ్మణ స్త్రీలందరు నిత్యము కమ్మని పరాన్నభోజనమును చేసెదరు.

వారందరూ గతజన్మలో ఎంతటి పుణ్యము చేసియుందురో కదా! నా భర్త దురదృష్టవంతుడు. ఆతడెప్పుడూ పరాన్నమునకు ఇష్టపడడు కదా! శ్రీహరీ! నారాయణా! నేనేమి చేయుదును" అని తన మనసులో ఎల్లప్పుడు చింతించుచుండెడిది. (11-21)

ఇట్లుండగా, ఒకరోజున పరగ్రామమునకు చెందిన ఒకానొక గొప్ప ధనికుడైన బ్రాహ్మణుడు ఆ గాణగాపురమునందు పితృపక్షమున పితృదేవతల ప్రీతిగా మహాలయశ్రాద్ధమును ఆచరించుటకై వచ్చెను. ఆ గ్రామములోగల బ్రాహ్మణులను విధియుక్తముగా నిమంత్రించి వారి భార్యలను కూడా ఆహ్వానించెను. అంతేగాక, రకరకములైన పక్వాన్నములతో పితృదేవతల ప్రీతిగా సహస్ర బ్రాహ్మణ సమారాధన చేయ సంకల్పించి గ్రామములోని బ్రాహ్మణదంపతుల నందరినీ ఆహ్వానించెను. ఇట్టి ఆహ్వానమును గురించి వినిన **ఈ పేదబ్రాహ్మణుని భార్య భర్త వద్దకు వచ్చి ఇట్లనెను** - "ప్రాణేశ్వరా! ఎవరో ఒక బ్రాహ్మణుడు అనేకవిధముల పక్వాన్నములతో, సమారాధనమును చేయుటకు ఆహ్వానించుచుండెను. అచట ధరించుటకు వస్త్రములు, అపారమైన ద్రవ్యము-దక్షిణలు కూడా ఇచ్చెదరట. కావున, మీరు కూడా అచటకు వచ్చుటకై అంగీకరించుడు. లేదా, నేను వెళ్ళుటకైనను నాకు అనుమతిని ప్రసాదించుడు. అపూర్వమైన కమ్మని పిండివంటలను తినవలయునని ఎంతోకాలము నుండి నాలో బలీయమైన కోరిక నాటుకొని యుండెను" అని ప్రార్థించెను. భార్య మాటలు వినిన ఆ బ్రాహ్మణుడు "నీవు హాయిగా వెళ్ళి భోజనము చేసిరావచ్చును. కాని, నాకు మాత్రము అది సాధ్యపడదు" అని చెప్పెను. తనకు అనుజ్ఞ లభించినందున ఆమె వెంటనే బయలుదేరి సమారాధన జరిపెడు బ్రాహ్మణుని వద్దకు వెళ్ళి 'భోజనసమయమునకు నేను రావచ్చునా?' అని అడిగెను. **అప్పుడా బ్రాహ్మణుడు ఇట్లనెను**- "అమ్మా! మేము దంపతులుగా వచ్చినవారికే భోజనము పెట్టెదము. దంపతిపూజ చేయుదుము. కావున, నీ భర్తను కూడా వెంట తీసుకొని నీవు రాగలవని" కడు వినయముతో చెప్పెను. అంతట ఆమె ఖిన్నురాలై తనలో ఇట్లు తలపోయుచుండెను. "అయ్యో! దైవమా! ఇప్పుడేమి చేయుదును. నా భర్త స్వప్నమందైనను పరాన్నమును స్వీకరింపడు కదా! ఇక నా గతి ఏమిటి? కనీసము ఈనాడైనా నాకు పక్వాన్నము ఎట్లు లభించగలదు. నేను ఎందుకు ఇంతటి దురదృష్టవంతురాలనైతిని" అని బాగుగా విచారించెను. ఇంతలో ఆమెకు గురుమూర్తి గుర్తుకు వచ్చెను. వెంటనే శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి వద్దకు వెళ్ళి వారికి వందనము చేసి, చేతులు జోడించి **వారిని ఇట్లు వినయముతో వేడుకొనెను**- "స్వామీ! నేనేమి చేయుదును. నా భర్త పరాన్నము తినడట. కమ్మటి భోజనమనగా, ఏమిటో, ఎట్లుండునో, నేనెప్పుడూ ఎరుగనైతిని. ఈ దినమున మన గ్రామములో వివిధ పక్వాన్నములతో గొప్ప సమారాధన జరుగుచున్నది. ఆ సమారాధన నిర్వాహకులు దంపతులకు మాత్రమే భోజనము పెట్టెదరట. మా శ్రీవారు నాకు అనుమతినిచ్చిరి. కాని, భర్త లేకుండా నీకొక్కరికి భోజనము

పెట్టమని వారనుచుండిరి. అందువలన, స్వామీ! ఈ ఒక్కటి మాత్రము నా యెడల దయయుంచి కృప చేయుము. నా భర్త నా మాటను వినిపించుకొనుటలేదు. ప్రభూ! నా భర్తతోపాటుగా సమారాధనకు వెళ్ళినచో, అచట ఉత్తమ అన్న వస్త్రములేగాక, మంచి దక్షిణలు కూడా ఇచ్చెదరట. నాయందు దయదలంచి నా భర్త నాతోపాటు ఈ రోజు సమారాధనకు వెళ్ళునట్లుగా తాము నచ్చచెప్పగలరు. తద్వారా నన్ననుగ్రహింపవలసినది" అని మిగుల దీనముగా ప్రార్థించినది.(22-35)

అంతట శ్రీ గురుమూర్తి ఆమె మాటలను విని, నవ్వుతూ 'సరే'నని పలికి వెంటనే ఆ బ్రాహ్మణుని పిలిపించి **అతనితో ఇట్లు చెప్పెను** - "నాయనా! బ్రాహ్మణోత్తమా! నేను అనుమతించితిని. కావున, నీవు భోజనమునకై ఆ సమారాధనకు వెళ్ళవలసినది" అని చెప్పెను. వెంటనే ఆ బ్రాహ్మణుడు గురుమూర్తియందు అమితమైన భక్తిని, దృఢమైన విశ్వాసమును గలిగినవాడు కావున, గురువాక్యమును ఉల్లంఘించుటకు ఇష్టపడక, **ఆతడు వెంటనే సరేనని అంగీకరించెను**- "స్వామీ! పరాన్నము భుజించకూడదని నాకు దృఢనియమము ఉన్నది కాని, గురువాక్యమును పాటించనివాడు భయంకరమైన రౌరవాది నరకములందు పడిపోవును. కావున, మీ ఆదేశమును శిరసావహించి నేను ఆమె వెంట వెళ్ళెదను" అని పలికెను. **అంతట శ్రీగురుడు ఇట్లనెను**- "బ్రాహ్మణోత్తమా! నీ భార్య మృష్టాన్నమును భుజింపవలెనని ఉబలాటపడుచున్నది. ఆమె అంతరంగములోని కోరికను నీవు తీర్చవలయును. ఇంటి ఇల్లాలి మనసును దుఃఖపెట్టకూడదు కదా!" అని గురుమూర్తి పలికెను. ఆ బ్రాహ్మణ స్త్రీ మహదానందభరితురాలయ్యెను. శ్రీగురునికి నమస్కరించి ఆ దంపతులు భోజనమునకై సమారాధన ప్రదేశమునకు వెళ్ళిరి. బ్రాహ్మణ దంపతులందరిని వరుసలుగా కూర్చుండజేసి తమ పితృనామములను ఉచ్చరించి ఆ బ్రాహ్మణుడు సంకల్పించిన మీదట, అచట కూర్చొనియున్న బ్రాహ్మణ దంపతులందరికీ భోజనపదార్థములను వడ్డించిరి. అనంతరము సమారాధన చేయు విప్రుడు దంపతులందరికీ చేతులెత్తి నమస్కరించెను. భోజనము చేయుటను ప్రారంభించుడని ప్రార్థించెను. కూర్చొనియున్న బ్రాహ్మణ దంపతులందరు భోజనము చేయుట ప్రారంభించగా, ఈ బ్రాహ్మణ స్త్రీకి తన పంక్తిలో, ఎదురు పంక్తిలో శ్వానములు, సూకరములు అనగా కుక్కలు, పందులు కలిసి అన్నమును భుజించుచున్నట్లుగా ఒక విపరీత దృశ్యము కనిపించెను. ఆమెకు కడు అసహ్యాభావము కలిగి తన భర్తతోను, ఇతరులతోను మీరు శ్వానసూకరముల ఇంట ఎట్లు భుజించుచుండెదరని ఆక్షేపించెను. అప్పుడు ఆ విప్రులు అన్నమును త్యజించి అచటినుండి లేచి వెళ్ళిపోయిరి. ఆవిధముగా నాటి భోజనమును నిరాకరించి తన భర్తతోపాటుగా కలిసి తిరిగి ఇంటికి చేరిన ఆ స్త్రీ మిగుల చింతించుచూ తన భర్తతో తనకు కనిపించిన విపరీత దృశ్యమును గూర్చి వింతగా చెప్పెను. **అంతట ఆ వైదిక నిష్ఠుడైన బ్రాహ్మణుడు తన స్త్రీతో ఇట్లనెను**- "ఓసీ! నీ వల్లనే కదా! నేడు మనకీ దురదృష్టము

దాపురించినది. అందుకే నేను శ్వానసూకరముల ఎంగిలితో కూడిన పరాన్నమును భుజింపవలసి వచ్చినదని" పలికెను. **శ్రోతలారా! కదు శ్రద్ధగా ఆలకించుడు అని సిద్ధముని చెప్పుచుండెను.**

ఆవిధముగా కోపించిన ఆ బ్రాహ్మణుడు తన భార్యతో కలిసి శ్రీగురుమూర్తి వద్దకు చేరుకొని, సభక్తికముగా నమస్కరించి వారికెదురుగా కూర్చుండెను. **అప్పుడు శ్రీగురుమూర్తి ఆమెతో ఇట్లనెను** – "తల్లీ! పరాన్నములో ఎంతటి సుఖమున్నది. ఎల్లప్పుడు నీ భర్తను దూషించుచుంటివి కదా! ఈనాటికి నీ కోరిక నెరవేరినదా!". ఆ మాటలను వినిన విప్రస్త్రీ భోరున విలపించుచూ గురుమూర్తి చరణములపై తన శిరమును ఉంచి, చేతులను జోడించి, అత్యంత దీనముగా "స్వామీ! నన్ను క్షమించుము. నా అపరాధమును మన్నించుము. నేను మహామందమతిని. అన్యాయముగా నా బలీయమైన కోరిక వలన నేను పరాన్నమును భుజించుటకు గాను నా భర్తను తీసుకొని వెళ్ళుటకై అనవసరమైన దోషవాక్కులు పలికితిని. వారి నియమనిష్ఠను ఉల్లంఘింపజేసితిని. గురుదేవా! నా తప్పుకు తగిన శిక్షను విధించుము. నన్ను క్షమించుము" అని పదేపదే విలపించుచు వేడుకొనెను. ఆ బ్రాహ్మణుడు కూడా చింతించుచు, "స్వామీ ఏమి చేయుదును. నాకు వ్రత భంగమైనది. అనేకదోషములు ఆవరించినవి. పరాన్నమును ముట్టవద్దని కృతనిశ్చయముతో యుంటిని. ఒక వ్రతముగా అనుష్ఠింపుచుంటిని. కాని, నా భార్యవలన నేడు నా వ్రతమునకు భంగము వాటిల్లినది. దోషమును మూటగట్టుకొంటిని. ఈమె నాకు శత్రువుగా మారినది" అని మిక్కిలి పరితపించుచూ తన అంతరంగమును విప్పి చెప్పెను. (36–52)

అతని మాటలను వినిన శ్రీగురుడు చిరునవ్వు నవ్వి, "ఏది ఏమైనను నీ భార్య కోరిక నెరవేరినది. ఇప్పుడు ఆమె మనసు తృప్తి చెందినది. ఇక మీదట, ఆమె పరాన్నమును ఆశింపదు. నీ ఆజ్ఞను జవదాటదు. కనుక, నీకు దోషము లేదు. నీ వ్రతము భంగపడలేదు. దానిని గూర్చి ఎక్కువగా చింతపడవలదు. నీకు మరొక విశేషమును కూడా తెలియజేసెదను. దేనితో సహజమైన ధర్మము సంభవించును. అనగా **ఎవరి ఇంటిలోనైనా దేవకార్యముల యందు గాని, పితృకార్యములయందు గాని అభావపక్షము సంభవించినపుడు పరాన్నమని శంకింపక భోజనమునకు వెళ్ళవలయును. అట్టి సమయమున నిరాకరించి నీవచటికి వెళ్ళనిచో, అచటి దేవ పితృ కార్యము భంగపడిపోవును. తత్ఫలితంగా నీకు అపరిమితమైన దోషములు వాటిల్లును. బాగుగా విచారించి ధర్మమును ఆచరింపవలయును" అని గురుమూర్తి చెప్పెను. వారి మాటలను వినిన ఆ బ్రాహ్మణుడు వెంటనే శ్రీవారికి సాష్టాంగవందనమును చేసి, చేతులు జోడించి పలికెను–** "స్వామీ! గురుమూర్తీ! నాదొక విన్నపమును ఆలింపుడు. "అయ్యా! ఇక ఎవరి ఇంటియందు భోజనము చేయవచ్చును. ఎవరి ఇంటిలో చేయకూడదు. ఒకవేళ వెళ్ళినచో ఏవిధమైన

దోషములు వాటిల్లును. విశేషించి వివరింపవలసినదని" ప్రార్థించెను. **ధర్మమును గూర్చి జిజ్ఞాసతో ప్రశ్నించిన ఆ బ్రాహ్మణుని మాటలకు మిగుల సంతసించి శ్రీగురుమూర్తి ఈవిధముగ చెప్పసాగెను–** "బ్రాహ్మణోత్తమా! వినుము. ఎవరి ఇంట భోజనము చేయవచ్చునని అడిగితివి. ముందుగా అతి ముఖ్యమైన మాటను వినుము. గురుగృహమున, శిష్యుల ఇండ్లలో నిస్సంశయముగా భోజనము చేయవచ్చును. వైదికాది విద్వజ్జనుల గృహములలో, మేనమామగారి ఇంటిలో, తన మామగారి ఇంటిలో, సహోదరులు, సాధుజనులు మొదలగువారి గృహములలో భుజించినందున దోషము లేదు. ఒకవేళ బ్రాహ్మణుడు లభింపక, కర్మలోపము జరుగుచున్నపుడు వారి ఇంట భోజనము చేయవచ్చును. మరునాడు గాయత్రీ జపమును విశేషముగ చేసినచో, అట్టి దోషము శాంతించును" అని చెప్పగా, ఆ బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తితో, "గురుదేవా! నా విన్నపమును వినుడు. ఎవరి ఇంట భుజించకూడదో, ఏది నిషిద్ధాన్నమో, దానిని గూర్చి కూడా వివరించి చెప్పగలరని" కోరెను. **అప్పుడు శ్రీగురుడు ఇట్లు చెప్పుచుండెను–** "అన్నమును తినకూడని ప్రదేశములను గూర్చి నీవు ప్రశ్నించితివి. ఇట్టి విషయమును గూర్చి స్మృతిచంద్రికలో విస్తృతముగా వర్ణింపబడియున్నది. దానినే ఇప్పుడు నీకు వివరించి చెప్పెదను" శ్రద్ధగా వినుము. (53-64)

"తలిదండ్రులను భక్తితో సేవించకుండా వారిచేతనే సేవ చేయించుకొనుట మహాపాపము. అట్టివారి ఇండ్లలో భోజనము చేయకూడదు. అటులే ధనలోభులైన వారి ఇండ్లలో, భార్యాబిడ్డలను కష్టపెట్టి బ్రాహ్మణులకు ధర్మము చేయువారి ఇండ్లలో భోజనము చేయుట నిషిద్ధము. అట్టివారి ఇంటిలో భుజించుటవలన మహాదోషము వాటిల్లును. ఇక గర్విష్ఠుల ఇండ్లలో, చిత్రకారుని ఇంటియందు, శస్త్రధారులైనవారి ఇండ్లలో, బ్రాహ్మణులై యుండి మల్లయుద్ధము యొనర్చువారి ఇండ్లలో భోజనము చేయుట పనికిరాదు. సంగీత వాయిద్యములతో జీవించువారి ఇంట బ్రాహ్మణులు భోజనము చేయకూడదు. బహిష్కరింపబడిన వారి ఇండ్లలో, యాచకవృత్తితో కడుపు నింపుకొనువారి ఇండ్లలో, నిరంతరము ఆత్మస్తుతి, పరనింద చేయువారి ఇండ్లలో భోజనము చేయకూడదు. సంఘభోజనము పనికిరాదు. అందరూ కలిసి ఒకే కంచములో తినువారి ఇండ్లలో, వైశ్వదేవము చేయనివారి ఇండ్లలో భోజనము చేయవలదు. గురువై యుండి, శిష్యుల యోగ్యతను విచారించకుండా, అందరికీ మంత్రోపదేశమును చేయుచూ, మరొకప్రక్క తాను అవినీతితో వ్యవహరించువాని ఇంటిలో భోజనము చేయకూడదు. క్రోధపూరితులైన వారి ఇండ్లలోను, భార్యను వదలివేసినవాని ఇంటను భుజించరాదు. తామసులు, క్రూరులు, ధనమదాంధులు, లోభులు, దయలేనివారు, వ్యభిచారులు, దాంభికులు, దురాచారులు అయిన వారింట భుజించకూడదు. కొడుకును, భర్తను వదలిపెట్టి, విడిగా నివసించే బ్రాహ్మణి ఇంటిలో సాధుజనులు భోజనము చేయకూడదు. అట్లు చేసినచో గొప్ప దోషభాక్కులయ్యెదరు. భార్యాలోలురైన వారి ఇంటను,

కంసాలిపని చేసే బ్రాహ్మణుల ఇండ్లలోను, భిన్నభిన్న జాతులవారికి పౌరోహిత్యమును చేయువారి ఇండ్లలోను భుజించకూడదు. దుష్టుడైన రాజసేవకుని ఇంటిలో, ఇనుము పనిచేసే (కమ్మరి) వారి ఇంటిలో, బట్టలు కుట్టి వ్యాపారము చేయువారి ఇండ్లలో, బట్టలు ఉతికే (చాకలి) వారి ఇంటిలో, రంగులు అద్దే వారి ఇంటిలో బ్రాహ్మణులు దానమును పుచ్చుకోకూడదు. మద్యమును సిద్ధము చేయువారి ఇండ్లలో, ఎక్కువగా భిక్షను యాచించి దాచిపెట్టుకొనే వారి ఇంటిలో, వేశ్యలతోపాటు భార్యను కూడా పెట్టుకొని ఒకే ఇంటిలో నివసించేవారి వద్దనూ విప్రులు దానమును స్వీకరింపకూడదు. రోగి ఇంటను, చోరవిద్యతో జీవించువారి ఇంటను, ద్వారపాలకుల ఇండ్లలోను, కుమ్మరివారి ఇండ్లలోనూ భోజనము తినుట మహాదోషము. అతిథులు లోనికి రాకుండా ద్వారమున రక్షకభటులు ఉండువారి ఇంటను భుజించకూడదు. శూద్రులవద్ద ద్రవ్యమును పుచ్చుకొని విద్య చెప్పే బ్రాహ్మణుల ఇండ్లలోను లేదా, శూద్రులవద్ద ద్రవ్యమును పుచ్చుకొని వారి ఇంట వేదపారాయణమొనర్చు బ్రాహ్మణుని ఇంటను, గుఱ్ఱములను విక్రయించు బ్రాహ్మణుల ఇండ్లలోనూ భుజించకూడదు. భగవత్కీర్తనము శూన్యమైన వారి ఇంటిలో, జూదమాడువారు ఇంటిలో, అశ్లీల వచనములు పల్కువారి ఇంటిలో, స్నానము చేయకుండా భుజించువారి ఇంటిలో భోజనము చేయకూడదు. సంధ్యావందనము చేయనివారి ఇండ్లలో, దానము చేయుట ఎరుగనివారి ఇంటిలో, శ్రాద్ధాది పితృకర్మలను త్యజించినవారి గృహములో భుజించకూడదు. ద్రవ్యమును తీసుకొని, కపట జపము చేయువారి ఇంటిలో, పూర్వాచారములను వదలిపెట్టినవారి ఇంటిలో, విశ్వాసఘాతకుల ఇంటిలో, ఎవరికైనా అప్పును ఇచ్చి ఊడిగము చేయించుకొనువారి ఇంటిలో, వడ్డీలకు తిప్పి డబ్బు పోగు చేసుకొనువారి ఇంటికి వెళ్ళకూడదు, అచట భోజనము చేయకూడదు. అవినీతిపరుల, పక్షపాతబుద్ధిని కలిగి స్వధర్మమును వదలిపెట్టిన దురాచారపరాయణుల ఇండ్లలో భుజించకూడదు. బ్రాహ్మణోత్తములను, సాధువులను, గురువులను ద్వేషించువారి ఇంట భుజించరాదు. కులదైవమును, తలిదండ్రులను వదలిపెట్టి దూరముగా వెళ్ళినవారి ఇండ్లలో, తమ గురువును నిందించేవారి ఇంటిలో భుజించకూడదు. గోహత్య, బ్రాహ్మణహత్య, స్త్రీ హత్య చేసినవారి ఇంట భుజించకూడదు. అది మహాదోషము. ఆశాబద్ధులై మరెవరికో దానము ఇచ్చుటను చూచి, అట్టి దానమును ఇవ్వకుండా ఆపుదల చేసినవాడి ఇంటిలో భుజించకూడదు. బ్రాహ్మణులకు నమస్కరించకుండా, అన్ని జాతులవారికి శరణుజొచ్చినవారే చండాలురు. అట్టివారి ఇంట అన్నము తినకూడదు. తన కూతురు, అల్లుండ్రను, మిగుల క్రోధముతో ఎల్లప్పుడు దూషించుచుండెడివారి ఇంటిలో, పుత్రసంతానము లేనివారి ఇంటిలో భోజనము చేయకూడదు. గృహస్థ ధర్మమును స్వీకరించి పంచమహాయజ్ఞములను చేయని బ్రాహ్మణుని పేరు **'పరపాక నివృత్తుడు'** అని అందురు. అట్టివారి ఇండ్లలో భుజింపకూడదు. తాను పంచమహాయజ్ఞములను ఆచరించి, ఇతరుల ఇండ్లలో భోజనము చేయు వ్యక్తిని

'**పరపాకరతుడు**' అను పేరుతో పిలిచెదరు. అట్టివారి ఇండ్లలో కూడ భుజింపకూడదు. తాను గృహస్థ ధర్మములో వుంటూ దానధర్మములను ఏమాత్రము చేయని వ్యక్తిని '**అపచుడు**' అని అందురు. అట్టివారి ఇంటిలో భుజించరాదు. ఇంటిలోని అన్నమును దూషించి, పరుల అన్నమును అపరిమితముగా ప్రశంసించుచూ భుజించువారి ఇంటిలో అన్నము తినిన యెడల అంధులై, అల్పాయుష్కులై ఉండెదరు. వంట బ్రాహ్మణుల ఇండ్లలో భోజనము చేయకూడదు. ఒకవేళ తినినచో వారు బధిరులు, అంగహీనులయ్యెదరు. వారికి స్మరణశక్తి తగ్గి, బుద్ధిమాంద్యము ఏర్పడి, శారీరక బలము, మానసిక ధైర్యము నశించిపోవును. తాను పరుల ఇండ్లలో ఉంటూ, పరాన్నమును భుజించుచు జీవించునట్టి బ్రాహ్మణునకు లభించెడు పుణ్యమంతయును ఆ గృహము యొక్క యజమానికే చెందును. అట్టి భోజనమును స్పృశించినంతటనే ఆ గృహ యజమాని యొక్క పాపములు, వారి యింట భుజించినవారిని వెంటనే పట్టుకొనును. అందుచే పరాన్నమును భుజించుట, పరగృహమునందు నివసించుట నిషేధింపబడినది. కావున, అట్టి ఆహారమును, నివాసమును తప్పక విసర్జింపవలెను. భూదానము, సువర్ణదానము, గుఱ్ఱము, ఏనుగు, గోవు, రత్నము మొదలగు దానములను స్వీకరించుటవలన హెచ్చు దోషము లేదు. కాని, పరాన్నముద్వారా బ్రాహ్మణునకు అపరిమితమైన పాపములు చుట్టుకొనును. కావున, పరాన్నమును వర్జింపవలెను. అటులే, పరస్త్రీ సాంగత్యము నరకహేతువు గాన, దానిని కూడా త్యజింపవలయును. అమావాస్య నాడు పరాన్నము భుజించినచో, మాసము రోజులపాటు సంపాదించిన పుణ్యరాశి నశించిపోవును. అటులే శూద్రసమారాధనకు పోకూడదు. పిలవకుండగనే ఇతరుల ఇంటికి భోజనమునకై వెళ్ళుట, సంధ్యాసమయములో వెళ్ళుట, అట్టి సమయమున పరాయి ఇంటిలో ఉండుట మహాదోషము. సంతానము కలుగు పర్యంతము తమ కుమార్తె ఇంట భుజించకూడదు. అట్టి కుమార్తెకు పుత్రసంతానము కలిగిన యెడల యథేచ్ఛగా వారి ఇంటిలో భోజనము చేయవచ్చును. సూర్య, చంద్ర గ్రహణ సమయములలో భోజనము చేయకూడదు. జాతాశౌచము గాని, మృతాశౌచముగాని ఉన్న ఇండ్లలో భోజనార్థముగా వెళ్ళకూడదు. ఎవరైతే చక్కగా వైదిక ఆచారములను సక్రమముగా రక్షించి కాపాడుచుందురో, వారికి దైన్యము ఉండదు. సదాచారము గల బ్రాహ్మణునకు దేవతలందరు స్వాధీనమై యుండెదరు. వారు అష్టమహాసిద్ధులను పొందెదరు. వైదిక సదాచారమును చక్కగా ఆచరించు బ్రాహ్మణుల ఇంటిలో కామధేనువు కొలువుదీరి యుండును. బ్రాహ్మణులు మదించి హెచ్చుమీరిన మదముతో ఆచారములను, స్వధర్మకర్మలను త్యజించినందున వారికి దారిద్ర్యము వాటిల్లును" అని ఆ బ్రాహ్మణునకు గురుమూర్తి ఉపదేశించెను. (65-105)

అంతట ఆ బ్రాహ్మణుడు గురుమూర్తితో ఇట్లనెను - "గురునాథా! కృపాసాగరా! త్రిమూర్త్యాత్మక అవతార స్వరూపమే మీరు. కనుక, భక్తజనులకు ఆధారము మీరే కదా! కావున స్వామీ! నా విన్నపమును మన్నించి బ్రాహ్మణుల ఆచారధర్మములు ఎట్లుండునో, వాటిని గూర్చి

వివరముగా తెలియజేయవలసినదని" వినయపూర్వకముగా ప్రార్థించెను. **అప్పుడు శ్రీగురునాథుడు ఆ బ్రాహ్మణునితో ఇట్లు చెప్పుచుండెను-** "బ్రాహ్మణోత్తమా! పూర్వము నైమిశారణ్యములో మహర్షులందరు కలిసి సత్రయాగ మొనర్చుచుండిరి. అప్పుడొకమారు పరాశరమహర్షి అచటకు వచ్చెను. శౌనకాది మహర్షులందరూ వారికి ఎదురేగి, స్వాగత వచనములతో వారిని తోడ్కొని వచ్చిరి. ఉచితాసనము పై కూర్చుండజేసిరి. అర్ఘ్యపాద్యాదులతో వారిని పూజించిరి. **అనంతరము ఆ శౌనకాది మహర్షులందరు పరాశరమహర్షికి నమస్కరించి పలికిరి-** "మహర్షీ! తాము దయతో బ్రాహ్మణ ఆచారధర్మములను నిరూపించి చెప్పగలరు. ఇప్పుడు పాటింపబడుచున్న ఆచారములను గురించి అప్పుడప్పుడు మా మనసులలో ఏదో ఒక సంశయము ఉత్పన్నమగుచుండెను. బ్రహ్మర్షీ! మీరు మహోన్నతులు. మాకు మీ ఉపదేశము అనివార్యమై యున్నది. గురుముఖతః మంత్రమును లేదా, ఉపదేశ వాక్యములను గ్రహింపవలెనుగాని, స్వయముగా ఆ మంత్రములను, ఉపదేశవాక్యములను గ్రహింపగూడదని శాస్త్రవచనము కదా! అట్లు చేయుట అపవిత్రమైన పని. మీరు పవిత్రమూర్తులైన గురుస్వరూపులు. కావున, మాకు బ్రాహ్మణుల సదాచారములను గూర్చి వివరింపవలసినదని వారు ప్రార్థించిరి.

అంతట పరాశరమహర్షి ఋషులందరిని ఉద్దేశించి, వేటివలన అప్రయత్నముగ సిద్ధి ప్రాప్తించునో, అట్టి ఆచారములను గూర్చి వివరించి చెప్పెను. ఆనాడు పరాశరమహర్షి నైమిశారణ్యమునందు శౌనకాది మహర్షులందరకూ ఏ సదాచారములను గూర్చి వివరించి చెప్పెనో, వాటినే ఇప్పుడు నేను నీకు వివరించి చెప్పుచుంటిని అని **శ్రీగురునాథుడు బ్రాహ్మణుల సదాచారధర్మములను వివరించి చెప్పసాగెను.** (106-113)

సదాచారమును పాటించుటవలన సహజముగనే స్వర్గసౌఖ్యము సిద్ధించును.[1] బ్రహ్మముహూర్తమున లేచి ముందుగా గురువును ధ్యానింపవలెను. అనంతరము బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను స్మరించి ధ్యానింపవలెను. పిమ్మట, సనక సనందన సనాతన సనత్కుమారులను తదుపరి, సూర్యాది నవగ్రహములను స్మరింపవలెను. నారద తుంబురులను, సిద్ధ యోగులను, సప్తసముద్రములను, సప్తపర్వతములను స్మరించవలెను. సప్త ఋషులను, సప్త ద్వీపములను, సప్త భువనములను స్మరింపవలెను. అప్పుడు ప్రాతఃస్మరణకు సంబంధించిన శ్లోకములను పఠింపవలెను. అనంతరము భూమాతకు నమస్కరించి శయ్యమీది నుండి లేచి మూత్రవిసర్జనము మొదలగు దేహబాధలను తీర్చుకొని ఆచమనము చేయవలెను. ఆచమనము వలన మనిషి శుద్ధుడగును. ఇట్టి ఆచమనమును ఏయే సమయములలో చేయవలెనో, మీకు వివరించి

---

[1] గీతాప్రెస్సు వారి 'నిత్యకర్మ-పూజాప్రకాశిక' (కోడ్ నెం.1921 అను గ్రంథములో ప్రాతఃకాల కృత్యములను, నిత్యకర్మలను అన్నింటిని గూర్చి శాస్త్రీయ విధానముగా అనేక విశేషాంశములు వివరింపబడినవని పాఠకులు గమనింపగలరు.

చెప్పెదను వినుడు. స్నానమునకు, భోజనమునకు ముందు వెనకల ఆచమనము చేయవలెను. అటులే నిద్రించుటకు ముందు, మేల్కొనిన పిమ్మట రెండు పర్యాయములు ఆచమనము చేయవలెను. ఆవలింత వచ్చినపుడు, తుమ్మినపుడు, లఘుశంకకు వెళ్ళినపుడు, రెండేసి సార్లు ఆచమనము చేయవలెను. అధోవాయువు శబ్దము వెలువడినపుడు, ఏదేని చెడు పదార్థమును తన దృష్టితో చూచిన వెంటనే రెండు పర్యాయములు ఆచమనము చేయవలెను. తద్వారా శుచి లభించును. ఒకవేళ సమీపమున జలము లేని యెడల నిశ్చయముగా శ్రోత్రాచమనమును ఆచరింపవలెను. అనగా రెండు చెవులను, కళ్ళను స్పృశించుటతో పవిత్రులమయ్యెదము. ఏలయన, బ్రాహ్మణుని కుడి చెవియందు ఏడుగురు దేవతలు అదృశ్యులై ఉండెదరు. కావున, అట్టి శ్రోత్ర స్పర్శ వలన ఆచమన ఫలము లభించును. (114-124)

శ్లో॥ అగ్నిరాపశ్చ వేదాశ్చ వరుణార్కేందు వాయవః । విప్రస్య దక్షిణే కర్ణే నిత్యం తిష్ఠంతి దేవతాః ॥ (125)

అనగా - అగ్ని, జలము, వేదములు, వరుణుడు, సూర్యుడు, చంద్రుడు, వాయువు అను దేవతలు విప్రునియొక్క కుడి చెవిలో నిత్యము నిలిచియుందురు. (126)

లఘుశంకను తీర్చుకొని, ఆచమనము చేసి, పరిశుద్ధమైన మనసుతో, మానసిక స్నానమును చేసి, శుభ్రమైన ఆసనమునందు కూర్చొని అరుణోదయము అగు వరకు, గాయత్రీ జపము గాకుండా, ఇతరములైన శాస్త్రోక్త మంత్రములను మానసికముగ జపించవలెను. అరుణోదయమైన వెంటనే మలవిసర్జనార్థము బహిర్భూమికి వెళ్ళవలయును. అప్పుడు యజ్ఞోపవీతమును కుడిచెవికి తగిలించుకొని నైఋతి దిశకు వెళ్ళి, ధోవతి కొంగును లేదా పైనగల పంచను తలమీద ధరించి, తల వంచుకొని మలవిసర్జనము చేయవలెను. దినమునందు ఉత్తరముఖముగను, రాత్రివేళలో దక్షిణముఖముగను కూర్చొని మలవిసర్జనము చేయవలెను. అప్పుడు మౌనముగా ఉండవలెను. అటూ, ఇటూ ప్రక్కలవైపు చూడకూడదు. సూర్య, చంద్ర నక్షత్రములను, నదీ ఆకాశాదులను, స్త్రీలను, లోకులను, ఎవరిని కూడా చూడకూడదు. ఏ బ్రాహ్మణుడు నిలబడి లఘుశంకను విసర్జించునో, అట్టి వాడికి అతని దేహముపైన ఎన్ని వెంట్రుకలుండునో, అన్ని రోజుల పర్యంతము అతడు ఘోరనరకములో పడియుండును. ధోవతి కట్టుకొని యున్న యెడల గోచిని తీయకుండా లఘుశంకను విసర్జించినచో, అతడు యమలోకమునందు నరకమును అనుభవించును. ఒకవేళ నీరు లభించకుండా శౌచము అనగా శుద్ధి చేసుకోవలసిన అవసరము ఏర్పడినచో, గంగను స్మరించి మట్టితో శుద్ధి చేసుకొనవలెను. బహిర్భూమిలో కూర్చొనవలసిన ప్రదేశము ఎట్లుండవలయునో, వివరించి చెప్పెదను. ఋషీశ్వరులారా! అందరును శ్రద్ధగా వినవలయును అని **పరాశర ఋషీశ్వరుడు చెప్పుచుండెను.** నేలమీద కూర్చొనకూడదు. గడ్డిమీద కూర్చొనవలెను. పచ్చని ఆకులను

దూరముగా పెట్టి, ఎండు ఆకులపైన కూర్చొనవలెను. మలవిసర్జనము చేసిన తర్వాత లింగమును పట్టుకొని నీటిపాత్ర వద్దకు వెళ్ళి పరిశుద్ధము చేసుకొనవలెను. ఒకవేళ మట్టితో శుభ్రము చేసుకొనుటకై పుట్టయందలి, ఎలుక కలుగులోని మట్టిని, నదిలోని మట్టిని తీసుకొని రాకూడదు. జనులు నడిచే త్రోవలోగల మట్టిని లేదా, వృక్షముల క్రింద గల మట్టిని, దేవాలయ, క్షేత్ర, తీర్థముల, పరిసరములయందలి మట్టిని వదలివేయవలెను. అయితే బావులు, చెరువులు, కుంటలు మొదలైనవాటిలోని మట్టిని, అడవిలో గల జలాశయమునందలి మట్టిని తీసుకొనవలెను. తటాకాదులనుండి మట్టిని తెచ్చినచో, ఎంతయో పుణ్యము లభించును. చేతిలో నీటిని తీసుకొని, దానిని చిలకరించి, శుభ్రము చేసుకొనుటకై మట్టిని తీసుకొనవలెను. ఉసిరికాయ ప్రమాణముగా మట్టితో ఉండలు చేయవలెను. లింగస్థానమువద్ద ఒకటి, అపానద్వారమునందు ఐదు,ఒక్కొక్క చేతికి ఇరవై ఉండలు చొప్పున పెట్టవలెను. ఒక్కొక్క పాదమునందు ఏడేసి మట్టి ఉండలను పెట్టవలెను. సమయాసమయములను గురించి మరింత వివరముగా చెప్పెదను. మట్టితో శుభ్రము చేసుకొను పద్ధతిలో లఘుశంకకు ఒక్కమారు శుభ్రము చేయవలెను. బహిర్భూమికి వెళ్ళిన మీదట దానికి రెట్టింపుగా, మైథునమైన పిదప మూడు రెట్లు అధికముగ మట్టితో శుభ్రపరచుకొనవలెను. మృత్తికతో శుద్ధి చేసినంతసేపు మౌనముగా వుండవలెను. ఎటువైపునకు చూడకూడదు. ఇట్టి నియమమును పాటించవలెను. ఇక గృహస్థులకు ఎంత చెప్పబడినదో, దానికి రెట్టింపుగా బ్రహ్మచారులు చేయవలెను. వానప్రస్థులు అందుకు మూడురెట్లు అధికముగ ఆచరింపవలెను. ఇక యతులు, సన్న్యాసులు అందులకు నాలుగు రెట్లు అధికముగా ఆచరింపవలెను. ఇందులో ఎవరునూ ఎక్కువ, తక్కువ చేయకూడదు. దినమునందు ఈవిధంగా ఆచరించవలెను. రాత్రివేళలో ఇందులోని సగమును ఆచరింపవలెను. సంకటగ్రస్త సమయములందు అందులో సగము, ఏదేని దారిలో వెళుచున్నప్పుడు అందులో సగమైనను ఆచరింపవచ్చును. ఉపనయన సంస్కారము పూర్తియైన బ్రాహ్మణులకు కూడా ఇదియే ఆచారము. నాలుగు వర్ణముల వారికి శౌచవిధిలో ఇట్టి విధానమే ఉపదేశించ బడినది.(127-148)

శుభ్రము చేసిన పిమ్మట జలమును నోటిలోనికి తీసికొని బాగుగా పుక్కిలించి ఉమ్మివేయవలెను. బ్రాహ్మణులు ఎనిమిది పర్యాయములు, క్షత్రియులు ఆరు సార్లు, వైశ్యులు నాలుగు సార్లు, శూద్రులు రెండు సార్లు ఈవిధంగా పుక్కిలించవలెను అని పరాశరమహర్షి చెప్పుచుండెను. ఎనిమిది మార్లు బాగుగా పుక్కిలించి ఉమ్మి వేసిన మీదట మూడుసార్లు ఆచమనము చేసి పరిశుభ్రముగా ఉన్న ప్రదేశమునందు కూర్చొని కులదైవమును స్మరించవలెను. ఆచమనము మౌనముగ చేయవలెను. నామమును ఉచ్చరించకుండా ఇరువది స్థానములను తాకవలెను. తిరిగి ఆచమనము చేయవలెను. అట్టి పద్ధతిని గూర్చి చెప్పెదను. విప్రుల కుడి అరచేతిలో గొప్పనైన ఐదు తీర్థములు గలవు. వాటిని

స్మృతిగ్రంథములయందు చెప్పబడిన తీరును అనుసరించి ఇప్పుడు వివరించెదను. అరచేతికి, బొటనవ్రేలునకు మొదట్లో బ్రహ్మతీర్థముండును. అరచేతి మధ్యభాగములో అగ్నితీర్థముండును. ఇక అంగుష్ఠము అనగా బొటనవ్రేలు, తర్జనీ అనగా చూపుడువ్రేలు ఈ రెండింటి మూలముయొక్క మధ్యభాగమున పితృతీర్థముండును. ఇక నాలుగువ్రేళ్ళ అగ్రభాగమున దేవతీర్థముండును. కనిష్ఠిక అనగా చిటికెన వ్రేలునకు అరచేతికి మధ్యభాగమున ఋషి తీర్థముండును.(149-155)



దేవతలకు, ఋషులకు, పితరులకు నిర్దేశింపబడిన ఆయా తీర్థస్థానముల ద్వారా తర్పణమును విడువవలెను.(1) అయితే విద్వజ్జనులందరు బ్రహ్మతీర్థము ద్వారానే ఆచమనము చేయవలెను. అందుకుగాను, 'కేశవ, నారాయణ, మాధవ' అని బ్రహ్మతీర్థముతో మూడుమార్లు ఆచమనము చేయవలెను. గోవింద అనే నామమును ఉచ్చరించి దేవతీర్థము ద్వారా ఉదకమును వదలిపెట్టవలెను. తదుపరి 'విష్ణు', 'మధుసూదన' అని రెండు చేతులు కడుగుకొని 'త్రివిక్రమ', 'వామన' అని చెక్కిళ్ళను స్పృశించి, క్రింది పెదవిపై అరచేతినిపెట్టి 'శ్రీధర' అను నామమును స్మరింపవలెను. తిరిగి హస్తస్పర్శతో 'హృషీకేశ' అని, పాదస్పర్శచే 'పద్మనాభ' అని, కుడిచేతి ఐదు వ్రేళ్ళతో శిరస్థానమును స్పృశించి, 'దామోదర' అని ఉచ్చరింపవలెను. నాలుగువ్రేళ్ళ వెనుక భాగముతో 'సంకర్షణ' మంత్రముతో చేతిని ముడిచి నాసికాగ్రమును తాకవలెను. తదుపరి 'వాసుదేవ-ప్రద్యుమ్న' అను నామములను ఉచ్చరించి అంగుష్ఠ-అనామికలతో ముక్కుపుటములను స్పృశింపవలెను. ఇక 'అనిరుద్ధ', 'పురుషోత్తమ' ఈ నామములతో అంగుష్ఠ, అనామికలను కలిపి నేత్రములను స్పృశించాలి. 'అధోక్షజ', 'నారసింహ' అను నామములను చెప్పి అంగుష్ఠ, కనిష్ఠ వ్రేళ్ళను కలిపి చెవులను స్పృశించాలి. 'అచ్యుత' నామముతో ఐదు వ్రేళ్ళను కలిపి నాభిని స్పృశించాలి. 'జనార్దన' అను నామమును చెప్పి అరచేతితో హృదయమును స్పర్శించాలి. అటులే 'ఉపేంద్ర' అంటూ ఐదు వ్రేళ్ళతో శిరస్సును తాకాలి. 'హరయే నమః', 'శ్రీకృష్ణాయ నమః' అంటూ భుజములను ఐదు వ్రేళ్ళతో విధిపూర్వకముగా స్పర్శింపవలెను. ఇదేవిధముగ సంధ్యాకాలమునందు మరొకమారు చేయవలెను. అట్లు చేయలేని సమయములలో లేదా, కష్టసమయములలో చేయవలసిన మరొక పద్ధతిని తెలియజెప్పెదను వినుడు. (156-163)

బ్రహ్మతీర్థముతో కేశవ, నారాయణ, మాధవ అను నామములను చెప్పి మూడుమార్లు జలమును త్రాగవలెను. గోవింద నామమును చెప్పి చేతిని కడుగుకొని ముఖమును స్పృశించి మంత్రమును ఉచ్చరింపవలెను. సంధ్యావిధి దీనికి వ్యతిరిక్తముగా ఉండును. మరొక పద్ధతి

---

1. తర్పణవిధానమును గూర్చి వివరముగా 'నిత్యకర్మ - పూజాప్రకాశిక' గ్రంథము పుటసంఖ్య (278)లో వివరముగా చూడవచ్చును.

చెప్పెదను. దేవతీర్థముతో జలమును తీసుకొని, గోవింద నామమును చెప్పి, కండ్లను, చెవులను స్పృశింపవలెను. శూద్రాదులను తాకితే బ్రాహ్మణుడు ఆచమనము చేయవలెను. వర్షపునీటిలో తడిసి వచ్చినపుడు రెండు సార్లు ఆచమనము చేయుటచే పునీతులయ్యెదరు. స్నానము, భోజనము చేసిన పిమ్మట తప్పనిసరిగా రెండు పర్యాయములు ఆచమనము చేయవలెను. ఫలాహారమును తినునపుడు లేదా నీరు త్రాగుచున్నపుడు, తిరుగుతూ, తిరుగుతూ స్మశానము వద్దకు వచ్చినపుడు రెండేసి పర్యాయములు ఆచమనము చేసినచో శుద్ధులయ్యెదరు. మరొకపద్ధతి కూడా ఉన్నది. ఆచమనమును మౌనముగా చేయవలెను. సమీపమున జలము లేని యెడల కుడి చెవిని తాకవలెను. దీనిని శ్రోత్రాచమనమని అందురు. నాయనా! ఈ రీతిగా ఆచమన విధానమును కడు భక్తిశ్రద్ధలతో ఆచరించువారి గృహమున దారిద్ర్యబాధ ఉండనే ఉండదని శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునితో ఆచమనమును గూర్చి వివరించి చెప్పెను. (164-170)

ఇక ఇప్పుడు దంతధావనమును గూర్చిన పద్ధతిని వివరించెదను వినుము. తిథులలో ప్రతిపద, షష్ఠి ఈ రెండింటిని సమస్త పర్వదివసములయందు త్యజింపవలెను. నవమి, ద్వాదశి తిథులందు, శని, ఆది, మంగళవారములందు, శ్రాద్ధ కాలమునందు, వివాహ దివసమందును దంతధావనము చేయకూడదు. దంతధావనము చేయుటకు తుమ్మ, కానుగ, చంద్ర, మేడి, జిల్లేడు, మఱ్ఱి, ఉత్తరేణి, క్షీరబలా-కలివెచెట్లు మొదలైనవి పుణ్యవృక్షములు. కాని, త్రాటి, ఒకరకమైన ఖర్జూర, మొగలి, ముండ్లు కలిగివుండే చెట్ల కొమ్మలు, ఖర్జూరము, కొబ్బరి కొమ్మలతో దంతధావనము చేసిన యెడల చండాల యోనిలో జన్మించెదరు. బ్రాహ్మణులు పన్నెండు అంగుళములు, క్షత్రియులు తొమ్మిది అంగుళములు, వైశ్యులు, శూద్రులు ఆరు అంగుళముల పొడవైన పుల్లలను తీసికొని దంతధావనమొనర్చుకొనవలెను. దంతధావన పుల్లను త్రుంచుతూ **'ఆయుః ప్రజా'** అను మంత్రమును పఠించవలెను. ఈవిధముగ దంతధావనము చేసి వాడిన పుల్లను నైఋతి దిక్కునకు పారవేయవలెను. పన్నెండు పర్యాయములు బాగుగా జలముతో పుక్కిలించి రెండుసార్లు ఆచమనము చేయవలెను. తదనంతరము ప్రాతఃస్నానము చేసినచో సమస్త సాధనలు పరిపూర్ణములగును. ప్రాతఃస్నానము చేయుటవలన తేజస్సు, బలము, ఆయువు వృద్ధి చెందును. దుఃస్వప్నములు నశించిపోయి, బుద్ధి చురుకుగా మారును. దేవతలందరు వశవర్తులగుదురు. దారిద్ర్యము, చింత, శోకము హరించిపోయి సౌభాగ్యము, సుఖము, పుష్టి, హర్షము పెరుగును. నిత్యము చేసిన యెడల పాపములు నశించిపోవును. కనుక, ప్రాతఃస్నానమును అందరూ అత్యంత హర్షముతో ఆచరింపవలెను. గృహస్థులు, వానప్రస్థులు ప్రాతఃకాలములోను, మధ్యాహ్నవేళలోను విధిగా చేయవలెను. యతులు, తాపసులు, సన్యాసులు మూడుపూటల స్నానము చేయవలెను. బ్రహ్మచారులు విధిపూర్వకముగా ఒక పర్యాయము స్నానము చేయవలెను.

ఒకవేళ ఏదేని కష్టము కలుగుటవలన అట్లు చేయుటకు అశక్యమైనచో, పవిత్రమైన నీరు లభించకపోయినచో అప్పుడు చేయవలసిన స్నానవిధిని వివరించెదను వినుడు. (171-182)

అగ్ని స్నానము, భస్మస్నానము లేదా, వాయుస్నానము, మంత్రస్నానము అను వీటిని **'ఆపోహిష్ఠాది'** మంత్రములతో విధిపూర్వకముగ చేయవలెను.(1) పుష్కలమైన భక్తిభావము కలిగివున్నవారికి గురు, దేవత దర్శనమాత్రముచేతనే తీర్థస్నాన ఫలము లభించి తీరును. లేదా, తలిదండ్రుల దర్శనము చేసి వారి చరణతీర్థమును భక్తితో స్వీకరించి, దేహముపై చల్లుకొనిన యెడల తీర్థస్నాన ఫలము లభించునని చెప్పుటలో సందేహము లేదు. లేదా, వర్షములో తడిసి, గాలిలో నిలబడుటవలన లేదా గోధూళిలో కూర్చొనుటవలన స్నానఫలము లభించును. చండాలుని స్పృశించినపుడు జలస్నానముతో శుచిత్వము కలుగును. శూద్రుడి స్పర్శ కలిగినపుడు గౌణస్నానమును చేయుటద్వారా శుచి యగుదురు. తమ దేహము దృఢముగా ఉండినచో, ముఖ్యముగ నీటితోడనే స్నానము చేయవలెను. సంకట సమయములలో గౌణస్నానము చేయవచ్చును. ప్రాతఃస్నానము చేయుటకు చల్లని నీరు ఉత్తమమని చెప్పబడినది. శరీరము చల్లటినీరును తట్టుకొనలేకపోయినచో వేడినీటితోనైనను స్నానము చేయవలెను. సహజముగనే పవిత్రమైన నీటికి పైన అగ్నితో సంపర్కము ఏర్పడినచో ఆ నీరు పవిత్రమగును. అది గృహస్థులకు ఎంతో విలువైనది. వేడినీటితో స్నానము చేయునపుడు అందులో చల్లటి జలమును కలుపవలెను. మధ్యలో ఆచమనము చేయవలెను. అక్కడ సంకల్పము అక్కరలేదు. ఇంటిలో స్నానము చేయునపుడు అఘమర్షణ తర్పణము ఉండదు. తమ చేతులతో వస్త్రమును పిండకూడదు. పుత్రోత్సాహమునందు, సంక్రమణ సమయంలో, శ్రాద్ధ కాలాదులలో, సూతకపు రోజులలో, పౌర్ణమి, అమావాస్య పర్వములయందు వేడినీటితో స్నానము చేయుట పనికిరాదు. స్నానము చేయునపుడు జుట్టు ముడి వేసికొని, దర్భలను చేతిలో ధరించి, సూర్యనారాయణునకు అభిముఖముగా నిలబడి చేయు స్నానము మౌనస్నానమనబడును. ఇది ఎంతయో ముఖ్యమైనది. **ఆపోహిష్ఠేతి** – అనే మంత్రముతో మూడుమార్లుగాయత్రి చదివి, అట్టి మంత్రముతో స్నానోదకమును బ్రాహ్మణులు అభిమంత్రించవలెను. మొదట చల్లని నీరు తీసికొని అనంతరము వేడినీటిని కలిపి గృహస్థాశ్రమములో గల పురుషులు ప్రతినిత్యము స్నానము చేయవచ్చును. తాను ఆచమనము చేసి, **'దేవస్యత్వా'**– అను మంత్రమును జపించి, ఉతికిన శుభ్రవస్త్రములను ధరించి, మరికొన్ని మంత్రములను చదువవలెను.(2) **'అవధూత'**

---

1. స్నానవిధులను గూర్చి "నిత్యకర్మ-పూజాప్రకాశిక" లోని స్నానప్రకరణమును చూడగలరు.
2. వస్త్రధారణవిధిని గూర్చి "నిత్యకర్మ-పూజాప్రకాశిక" లోని పుటసంఖ్య (95-99) లో చూడవచ్చును.

మంత్రమును పఠింపుచూ వేగముగా వస్త్రమును విదిలించి, కట్టుకొనుటకు సిద్ధము చేసికొనవలెను. **'ఉదుత్యం'** అనే మంత్రమును జపిస్తూ, సూర్యునకు ఆ వస్త్రమును చూపింపవలెను. **'అవహంతీ వితన్'**- అను మంత్రముతో పవిత్రమైన శుభ్రవస్త్రమును ధరించవలెను. రెండుమార్లు ఆచమనము చేసి, వస్త్రములను పిండుకొని ఆచమనము చేయవలెను. ఇప్పుడు మంత్రస్నానము చేయుట గురించి చెప్పెదను. ఈ పద్ధతిలో **'ఆపోహిష్ఠాది'** మంత్రములతో తన శరీరముపైన జలమును చల్లుకొనవలెను.(183-200)

'ఆపోహిష్ఠాది' మంత్రముతో జలమును తీసికొని, ముందుగా పాదములయందు, తలపైన, హృదయ స్థానమునందు ప్రోక్షించుకొనవలెను. తదుపరి తలమీద, హృదయమునందు, పాదములయందు చల్లుకొనవలెను. ఆ తరువాత తిరిగి హృదయమునందు, పాదములయందు, శిరముపైన జలమును చల్లుకొనవలెను. ఇది మంత్రస్నాన విధానము. అట్లు స్నానము పూర్తిచేసిన మీదట ఆచమనము చేసి, భక్తితో మానసికస్నాన విధానమును ఆచరింపవలెను. అప్పుడు చతుర్భుజములను కలిగి, వివిధ అలంకారములతో శోభిల్లుచున్న నారాయణమూర్తిని భక్తిభావముతో ధ్యానింపవలెను. ఇదియే మానసికస్నానము అనబడును. ఇక ఉదకమును తీసికొని **'అపవిత్రః పవిత్రోవా'** అనే మంత్రమును చెప్పుచు పుండరీకాక్షుని స్మరించుచూ శరీరముపై ఆ జలమును ప్రోక్షించుకొనుటవలన స్నానము చేసిన ఫలము లభించును. నదీతీరమునందు ఉండి, నది వద్దకు వెళ్ళి గంగలో స్నానము చేయుటకు అశక్తులైనవారలు నదీతీరమును, గంగను స్మరించి తడివస్త్రముతో దేహమును తుడుచుకొనుటవలన స్నానఫలము లభించును. **ఇక మంగళ అభ్యంగన స్నానవిధానము చెప్పెదను.** జ్వరము వచ్చినపుడు, ఆదివారము నాడు అభ్యంగన స్నానము చేయకూడదు. సోమవారము చేసినచో తేజోహీనమగును. మంగళవారమైనచో మృత్యువు సంభవించును. బుధవారమునాడు చేసినచో ఐశ్వర్యము లభించును. గురువారము చేసిన యెడల ధనహాని కలుగును. అభ్యంగన స్నానము శుక్రవారము నాడు చేసినచో పుత్రఘాతము జరుగును. శనివారము చేయుటచే సమస్తసంపదలు ప్రాప్తించును. ఇక నదీస్నానము చేయునపుడు ప్రవాహమునకు అభిముఖముగా నిలబడి స్నానము చేయవలెను. ఇంటియందు స్నానము చేయునపుడు ప్రాతఃకాలమున పూర్వాభిముఖముగను, సాయంకాలము పశ్చిమాభిముఖముగను స్నానము చేయవలెను. నదీస్నానము చేయునపుడు అఘమర్షణము చేయవలెను. **'నమోఽగ్నయేఽప్సుమతే'** - అను మంత్రముతో నదికి నమస్కరింపవలెను. **'యదపాంక్రూరం'** - అను మంత్రముతో రెండు చేతులతో నీటిని కదుపుతూ అత్యంత హర్షముతో మూడు మార్లు తీసికొని **'ఇమం మే గంగే'**- అని జపింపవలెను. **'ఋతం చ సత్యం చ'** - అను మంత్రమును జపించుచూ నదిలో స్నానము చేయవలెను. ప్రసిద్ధమైన నదీస్నాన విధిని బ్రాహ్మణులందరూ ఆచరింపవలెను. రోదనము, వమనము, వికారము, మైథునము, దుస్స్వప్నము ఇవి తటస్థించినపుడు శుద్ధికొరకు తప్పనిసరిగా స్నానము చేయవలెను. (201-213)

ఇక వస్త్రధారణమును గూర్చి చెప్పెదను. ఋషీశ్వరులారా! వినుడు. గృహస్థులు కాషాయవస్త్రమునుగాని, తడిబట్టలుగాని ధరించకూడదు. రక్తవస్త్రమును, జీర్ణవస్త్రమును, శుభ్రపరచని వస్త్రమును ధరించి పైన ఉత్తరీయము లేకుండా ఒక్క ధోవతినే ధరించి, చేసిన జపము యొక్క పుణ్యఫలమును రాక్షసులు తీసికొందురు. కావున, అట్లు చేయకూడదు. బ్రాహ్మణులు తెల్లని వస్త్రమును ధరించుటయే ముఖ్యము. పైన ధరించిన ఉత్తరీయ వస్త్రమునకు హస్తము బయటకు ఉండవలెను. వస్త్రముతో చేతిని చుట్టకూడదు. ఉత్తర వస్త్రము అనగా ఉపవస్త్రమే అని గ్రహింపవలెను. వస్త్రధారణ పిమ్మట విభూతిని ధరింపవలెను. మంత్రవిధానముతో విభూతిని అనగా త్రిపుండ్రమును ధరింపుము. ఒకవేళ పరిశుభ్రమైన భస్మము లభించనిచో గోపీచందనమును ధరింపవలెను. అన్నింటికల్లా ద్వారకలోని మృత్తికయే శ్రేష్ఠమైనది. ద్వారక మృత్తిక లభించనియెడల గంగాతీరమునందలి మట్టిని స్వీకరింపవచ్చును. ఊర్ధ్వపుండ్రమునకు గంగాతీరమునందలి మట్టిని స్వీకరింపవచ్చును. ఊర్ధ్వపుండ్రమును పెట్టుకొనువారికి విష్ణుసాయుజ్యము లభించును. సంతత ఆరోగ్యము, శారీరక బలము కావలయునని కోరుకొనువారు ఊర్ధ్వపుండ్రమును బొటనవ్రేలితో ధారణ చేయవలెను. దీర్ఘాయుష్యమును కోరుకొనువారు మధ్యవ్రేలితో ధరింపవలెను. అన్నమును కోరుకొనువారలు అనామికతో, ముక్తిని వాంఛించువారు చూపుడువ్రేలితో ధరింపవలెను. గోళ్ళతో ధారణ చేయువారికి మహాపాతకములు సిద్ధించును. పది వ్రేళ్ళతో పొడవుగా ధరించుట ఉత్తమము. నవ, అష్ట, అంగుళీయకములతో ధరించుట మధ్యమము. ఐదు, ఆరు, ఏడు వ్రేళ్ళతో శూర్పాకారముగా పెట్టుకొనవలెను. నాలుగు, మూడు, రెండు వ్రేళ్ళతో పెట్టుకొనుట అధమ పక్షము. విష్ణునామమును ఉచ్చరింపుచూ ద్వాదశ నామాలను ధరించుట మంచిది. ఎట్లనగా, 'కేశవ' అని ఫాలభాగము మీద, 'నారాయణ' అంటూ నాభివద్ద, 'మాధవ' అని హృదయముపైన కమలపుష్ప ఆకారమువలె ధరింపవలెను. 'గోవింద' అంటూ కంఠమున, 'విష్ణు' అని నాభికి కుడివైపున, 'మధుసూదన' అంటూ కుడిభుజమున, 'త్రివిక్రమ' అంటూ కుడి చెవిక్రింద, మెడకు పైన, 'వామన' అంటూ నాభికి ఎడమవైపున, 'శ్రీధర' అంటూ ఎడమ బాహువునకు, 'హృషీకేశ' అంటూ ఎడమ చెవి క్రింద, 'పద్మనాభ' అంటూ పశ్చిమం వైపు అనగా వీపుపైన కటిభాగమున ధరింపవలెను. 'దామోదర' అంటూ జుట్టు ముడి ఎచట వ్రేలాడునో, అచట అనగా మెడమీద ధరింపవలెను. ఊర్ధ్వపుండ్ర పద్ధతిలో గోపీచందనమును పెట్టుకొనుటచే సమస్తపాపములు తొలగిపోవును. ద్వారక నుండి తెచ్చిన భస్మమును త్రిపుండ్రములుగా ధరించుటవలన హరిహరులు సంతోషించెదరు. తద్ద్వారా భుక్తి, ముక్తి లభించును. వివాహాది శుభకార్యములు జరిగిన రోజున, దైవపూజాదికముల యందు, శ్రాద్ధదినములయందు, సూతక సమయములయందు, అభ్యంగనము తరువాత గోపీచందనమును విసర్జింపవలెను. (213-229)

బ్రహ్మ యజ్ఞాంగ తర్పణాదులలో ధరించే దర్భలు పదివిధములుగా ఉండును. వారి పేర్లు వరుసగా దూర్వారము, ఉశీరము అంటే వట్టి వ్రేళ్ళు, దర్భలు, 'కసయీ' అనే పేరుగల గరిక, 'సకుద' అనే గరిక, 'గోధూమ, వ్రీహి' అనగా వరి తృణాలు, మౌంజీష అనగా మొల తృణాలు, 'నాగరమోథ', 'భద్రముస్త' అని పదిరకాల దర్భలు చాలా ముఖ్యమైనవి.⁽¹⁾ దర్భ లభింపనప్పుడు గరికను దర్భకు ప్రతినిధిగా ఉపయోగింపవచ్చును.

సంవత్సరమునకు కావలసిన దర్భను శ్రావణమాసము మరియు భాద్రపద మాసము యొక్క అమావాస్య నాడు సంగ్రహించి సంవత్సరము పాటు వాడుకొనవచ్చును. బ్రాహ్మణులు నాలుగు దర్భలు, క్షత్రియులు మూడు, వైశ్యులు రెండు, శూద్రులు ఒక దర్భను ధరింపవలెను. ఈ దర్భలయొక్క గొప్పతనము సాటిలేనిది. ఇవి గొప్ప మహిమ గలవి. ఈ దర్భయొక్క అగ్రస్థానమున బ్రహ్మయు, మూలమున రుద్రుడు, మధ్యలో విష్ణువు ఉండును. కావున, దర్భ పవిత్రమును ధరించి పితృకార్యములను ఆచరింపవలెను. ఇట్టి దర్భ పవిత్రము యొక్క ముడి నాలుగు వ్రేళ్ళకు పై భాగములో ఉండునట్లుగా, రెండు వ్రేళ్ళకు ముడి క్రింది భాగమున ఉండునట్లుగా బ్రాహ్మణులు ధరింపవలెను. దీని మహిమ అత్యంత శ్రేష్ఠమైనది. విష్ణుమూర్తి చక్రమును ధరించి దైత్యులను పరాభవించును. ఈశ్వరుడు త్రిశూలమును ధరించి రాక్షసాంతకుడయ్యెను. ఇంద్రుడు వజ్రాయుధమును పట్టి దైత్యులను ఓడించెను. ఇదేవిధముగ బ్రాహ్మణులు దర్భను ధరించి పాపములను, దురితములను తరిమివేయుదురు. పర్వతములపైన గల తృణములు అగ్నిస్పర్శతో దగ్ధమైపోయినట్లుగా దర్భ స్పర్శతో పాపరాశి దగ్ధమైపోవును. బ్రహ్మయజ్ఞము జపించునపుడు కుశద్వయముతో ముడివేయకూడదు. భోజన సమయమునందు బ్రాహ్మణులు వ్రేళ్ళకు దర్భలను చుట్టుకొనవలెను. భక్తితో ధరింపవలెను. దర్భలతో బ్రహ్మయజ్ఞము తప్ప ఇతర కర్మలను ఆచరించునపుడు తప్పక ముడివేయవలెను. అప్పుడు అగ్నిని స్పర్శించిన దూదివలె పాపములు కాలిపోవును. పవిత్రము నందు జానెడు పొడుగు కలిగిన రెండు దర్భలు ఉండవలెను. నిత్యకర్మకు రెండు దర్భలుండాలి. జపహోమాది దానములయందు, వేదాధ్యయనము చేయునపుడు, పితృకర్మలను ఆచరించునపుడు, బంగారము, వెండి ముద్రికలు గలిగిన పవిత్రమును ధరింపవలెను. అయిననూ దర్భలు లేకుండా చేయకూడదు. దేవ, పితృ కర్మలయందు, బంగారముతో కూడిన వెండి ముద్రికను ధరింపవలెను. చూపుడు వ్రేలునకు వెండి ముద్రిక, అనామికకు బంగరు ముద్రికను ధరింపవలెను. ఖడ్గమృగము యొక్క కొమ్ముతో చేసిన ముద్రికను చిటికెనవ్రేలునకు ధరింపవలెను. తల్లిదండ్రులు జీవించియున్న వారలు - జీవత్పితరులు చూపుడు వ్రేలునకు వెండి పవిత్రమును ధరించుట,

---

[1] శ్లో॥ కుశాః కాశాయవా దూర్వా ఉశీరాశ్చ సకుందకాః । గోధూమా వ్రీహయో ముంజా దశదర్భాస్సబల్వజాః ॥ (ధర్మసింధు-2వ పరిచ్ఛేదము) అనగా - కుశ, రెల్లు, యవతృణము, దూర్వ, వట్టివేళ్ళు, కుందకములు, గోధూమతృణము, వరిచొప్ప, ముంజగడ్డి, ఉలపతృణము (మొదవగడ్డి) ఇవి పది దర్భలు అనబడును.

పాదుకలు ధరించుట, యోగపట్టాను చుట్టుకొనుట, గయాశ్రాద్ధమును జరుపుట మొదలగు కృత్యములు చేయకూడదు. చేతికి నవరత్నముద్రిక ధరించువారికి పాపములు అంటవు లేదా, ఏదో ఒక రత్నము కలిగిన ముద్రికను చేతికి ధరించిన బ్రాహ్మణులకు అది పవిత్రమే యగును.(230-246)

ఇక ప్రతినిత్యము ప్రాతఃమధ్యాహ్న సాయంకాలములయందు సంధ్యావందనము చేయవలెను. ఋషీశ్వరులారా! ఇప్పుడు ప్రాతఃసంధ్యా విధానమును చెప్పెదను వినుడు. ఉదయము నక్షత్రములు ఉండగనే ప్రాతఃసంధ్యను ప్రారంభించి సూర్యోదయమున అర్ఘ్యమును ఈయవలెను. సూర్యోదయమైనప్పుడు జపము చేయుచూ నిలబడి ఉండవలెను. ఈ మాటలు చెప్పిన వెంటనే శౌనకాది ఋషులందరూ కలిసి సంధ్య చేయవలసిన పద్ధతిని గూర్చి విస్తృతముగా వివరించి చెప్పుడని పరాశరమహర్షిని వేడుకొనిరని సరస్వతీ గంగాధరుడు చెప్పుచుండెను. **అప్పుడు శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునితో పరాశరస్మృతిలో వివరింపబడిన సంధ్యావందన విధిని చెప్పుచుంటిని శ్రద్ధగా వినుమని కోరెను.** గాయత్రీ మంత్రమును జపించినపుడు జుట్టుముడి వేసికొని చక్కగా దర్భాసనముపై కూర్చొని చిత్తమును స్థిరముగా నిలుపుకొనియుండవలెను. బ్రహ్మతీర్థముతో మూడుమార్లు ఆచమనము చేసి విష్ణునామమును స్మరించి ప్రాణాయామమును వివరముగ న్యాసపూర్వకముగా చేయవలెను. ప్రణవస్థానమున పరబ్రహ్మ ఋషి, గాయత్రీ ఛందస్సు, అగ్నిదేవతతో ప్రాణాయామే వినియోగః అని చెప్పాలి. 'ఓం అం – నాభిని, ఉం – హృదయమును, మం– శిరమును స్పృశించాలి. వ్యాహృతిలో ఏడు స్థానములు విడివిడిగా దేవఋషి చెప్పెను. వ్యాహృతిలో వేర్వేరు దేవతల సప్తస్థానములను వారి పేర్లను వివరించి చెప్పెదను శ్రద్ధగా వినుడు అని ప్రజాపతి ఋషి పలికెను. అగ్ని, వాయువు, సూర్యుడు, బృహస్పతి, వరుణుడు, ఇంద్రుడు, విశ్వేదేవతలు సప్తవ్యాహృతులలోగల సప్తదేవతలు అని తెలియవలెను. ఇక సప్తఛందస్సుల పేర్లు- గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతీ, పంక్తి, త్రిష్టుప్, జగతీ అనేవి ఏడు ఛందస్సుల పేర్లు. వీటితో ప్రాణాయామమును వినియోగించవలెను. ఓం భూః – పాదన్యాసము, భువః – మోకాళ్లు, సువః – కటి విశేషము, మహః – నాభి, జనః – హృదయము, తపః – కంఠము వీటిని స్పృశించాలి. సత్యం – భ్రువ – భ్రుకుటి – లలాటమును, గాయత్ర్యా గాయత్రీ ఛందః అని చెప్పాలి. సవితా దేవతా, విశ్వామిత్ర ఋషిః అనే చిహ్నములను ప్రాణాయామమునందు వినియోగించాలి. ఓం భూః – హృదయాయ నమః, ఓం భువః – శిరసే స్వాహా, ఓం సువః – శిఖాయై వషట్, ఓం తత్సవితుర్వరేణ్యం – కవచాయ హుమ్, ఓం భర్గోదేవస్య ధీమహి – నేత్రత్రయాయ వౌషట్, ధియో యో నః ప్రచోదయాత్ – అస్త్రాయ ఫట్, ఓం భూర్భువస్సువః – ఇతి దిగ్బంధః అని షడంగన్యాసమును చేయవలెను. బ్రహ్మ, అగ్ని, వాయువు, సూర్యుడు అను దేవతల నామములతో

ప్రాణాయామమును చేయవలెను. ప్రాణాయామే వినియోగః అని ఓం ఆపో - అని చెప్పి స్తనమును స్పృశించి, జ్యోతిః - అని నేత్రములను స్పృశింపవలెను. రసో - అంటూ నాలుకను, అమృతం- అంటూ లలాటమును, 'బ్రహ్మ భూర్భువస్సువరోమ్' అని చెప్పుచూ మూడు పర్యాయములు ప్రాణాయామమును చేయవలెను. త్రిపదా గాయత్రిని జపించేవారికి సర్వము సిద్ధించును. ఈ గాయత్రికి అధిదేవత బ్రహ్మ, అగ్ని, వాయువు, సూర్యుడు వీరిలో ఋషి బ్రహ్మ ప్రఖ్యాతి నొందినవాడు. ఇప్పుడు సప్తలోకన్యాసమును గూర్చి చెప్పెదను. (247-265)

పాదమునందు భూర్లోకమును న్యసింపవలెను. ఇటులే జానువునందు భువర్లోకమును, గుహ్యమునందు స్వ-సువర్లోకమును, నాభియందు మహర్లోకమును, హృదయమునందు జనోలోకమును, గ్రీవమునందు తపోలోకమును, లలాటము, భ్రుకుటి యందు సత్యలోకమును న్యాసము చేయవలెను. సత్యలోకమునే శిరస్థానముగ గమనింపవలెను. ఇక గాయత్రీ ప్రార్థనము చేసి విధివిధానముగ ప్రాణాయామమును పూర్తిచేసి బ్రహ్మచారులు, గృహస్థులు ఐదు వ్రేళ్ళతో పరమేష్ఠిని పట్టుకొనవలెను. ఇక వానప్రస్థులు, సన్న్యాసులు అనామిక, కనిష్ఠక అంగుష్ఠములను అంగులీయములతో ఓంకారాదులతో కుడి ముక్కుపుటము నుండి వాయువును పూరించవలెను. ఎడమ ముక్కుపుటము నుండి గాలిని వదలవలెను. ఇటులే మూడుసార్లు ప్రాణాయామమును చేయవలెను. ఇదేవిధముగ త్రికాలసంధ్యావందనములో ఆచరింపవలెను. ఇక మార్జనము గూర్చి చెప్పెదను. స్మృతిచంద్రికలో వివరింపబడిన విధానమును గూర్చి నేను చెప్పుచుంటిని. అందరునూ ఆలకింపుడు. (266-271)

ఆపోహిష్ఠేతి సూక్తస్య, సింధు ద్వీప ఋషిః, గాయత్రీ ఛందః, ఆపో దేవతా, మార్జనే వినియోగః అని చెప్పాలి. **'ఆపోహిష్ఠా'** అనే మంత్రమును చెప్పి, పవిత్రమైన దర్భలతో మార్జనము చేసి **'యస్యక్షయాయ'** అనే మంత్రముతో పాదములపై ప్రోక్షించుకొనవలెను. **'ఆపోజనయథా'** అను మంత్రముతో శిరస్సుమీద చల్లుకొనవలెను. **'సూర్యశ్చేతి'** అను మంత్రముతో జలప్రాశనము చేయవలెను. రెండు పర్యాయములు ఆచమనము చేసి **'దధిక్రావుణ్ణో'** అను మంత్రమును జపించి, మూడుమార్లు మార్జనము చేసికొనవలెను. **హిరణ్యవర్ణా** అను సూక్తముతో మార్జనము చేయవలెను. **'ద్రుపదాదివేతి'** అను మంత్రముతో ఉదకమును వాసన చూసి ఎడమవైపునకు పారవేయవలెను. ఋషీశ్వరులారా! మార్జనము చేయవలసిన పద్ధతులు చెప్పెదను వినుడు. ఎడమచేతితో పాత్రను ధరించి, కుడిచేతితో మార్జనము చేయుట విశేషము. రాగి, బంగారము, వెండి, లేక చెక్కపాత్రలు పవిత్రములు. అవి లభించనపుడు ఎడమచేతిలో ఉదకమును తీసికొనవచ్చును. రెండు ముఖములు గల మట్టిపాత్రలు అనగా కొమ్ము కలిగిన చెంబు, పగిలిన పాత్రలు, అపవిత్రమైనవి గనుక, వాటిని వాడకూడదు. దేవ,

పితృకార్యములకు వాటిని వాడకూడదు. ఇక మార్జన చేసుకొనవలసిన సంఖ్యను చెప్పెదను. శిరసునందు ఎనిమిది పర్యాయములు, పాదములయందు తొమ్మిది, యస్యక్షయాయ అని భూమియందు మార్జనము చేయవలెను. (272-280)

'ఆపఃపునంతు' అను మంత్రముతో మధ్యాహ్న సంధ్యలో జలప్రాశనము చేయవలెను. **'అగ్నిశ్చేతి'** అను మంత్రముతో సాయం సంధ్యాకాలమున ప్రాశన చేయవలెను. ప్రాశన చేసిన పిమ్మట రెండు పర్యాయములు ఆచమనము చేయవలెను. ఉదకమును ఆఘ్రాణించి వదలివేయవలెను. ఒకసారి మాత్రమే ఆచమనము చేయవలెను. అర్ఘ్యము నీయవలసిన పద్ధతి చెప్పెదను వినుడు. దోసిట్లో నీటిని తీసుకొని గో శృంగములంత ఎత్తునకు ఎత్తి అర్ఘ్యమును వదలవలెను. అప్పుడు రెండు చేతులు తగలకుండ ఉండవలెను. చూపుడువ్రేలు, బొటనవ్రేలు ఒకదానికొకటి తగలకుండ జాగ్రత్త పడవలెను. గాయత్రి మంత్రమును జపించి సాయంకాలం, ఉదయం, మధ్యాహ్నం మూడుమార్లు అర్ఘ్యప్రదానము చేయవలెను. **'హగ్ం సశ్శుచిః'** అను మంత్రముతో మధ్యాహ్నము అర్ఘ్యము నీయవలెను. ఉదయం, మధ్యాహ్నం నిలబడి అర్ఘ్యము నిచ్చుట మంచిది. సాయంకాలం కూర్చొని అర్ఘ్యమునీయవలెను. అనంతరం మూడుమార్లు ఆచమనము చేయవలెను. **'అసావాదిత్య'** మంత్రముతో ప్రదక్షిణము చేయవలెను. అర్ఘ్యము నిచ్చుటకు ఒక ముఖ్యకారణము కలదు. దానిని వివరించి చెప్పెదను వినుడు. మందేహులు అనే పేరుగల దారుణమైన రాక్షసులు ముప్పది కోట్ల మంది ఉండేవారు. వారు ప్రతినిత్యము సూర్యునితో యుద్ధము చేయుటకై తలపడెదరు. సూర్యునకు అపజయము కలుగునేమోనని దేవతలకు భయము కలిగెను. సంధ్యాకాలమందు అర్ఘ్యమీయనిచో సూర్యుని గమనమునకు ఆటంకము ఏర్పడెను. సూర్యోదయము కాని యెడల స్వాహాకారములు, స్వధాకారములు లోపించును. అందుకే దేవతలకు, పితరులకు ఉపవాసములే దిక్కగును. సృష్టిలో ఉత్పత్తి నిలచిపోవును అని దేవతలందరూ కలిసి ఒక ఉపాయమును ఆలోచించిరి. త్రికాల సంధ్యావందనమునందు అర్ఘ్యప్రదానము చేయుటవలన, అట్టి జలము వజ్రాయుధములై వెళ్ళి దైత్యులను ప్రతిఘటించును. ఆవిధముగ ప్రతినిత్యము వారిని పరాభవించుటకు ఈ అర్ఘ్యప్రదాన జలములు ఉపయోగపడును. బ్రాహ్మణ కులములోని దైత్యులను వధించినచో దోషము కలుగును. బ్రాహ్మణులకు దైత్యులను వధించినచో దోషము వాటిల్లును. కావున, అర్ఘ్యమిచ్చిన పిదప 'అసావాదిత్యో బ్రహ్మ' అని తన చుట్టూరా ప్రదక్షిణము చేయుచూ ఉదకమును పోయుటవలన రాక్షస సంహారము ఒనర్చిన పాపము నశించును. బ్రహ్మహత్యా పాపము భూప్రదక్షిణముతో నశించిపోవును. నాలుగడుగులు తన చుట్టూరా తిరుగుటవలన భూప్రదక్షిణము చేసిన పుణ్యరాశి లభించును. అందుకే సంధ్యావందనము చేయవలసిన ప్రదేశము, దాని ఫలమును గూర్చి చెప్పెదను వినుడు. ప్రతినిత్యము తమ గృహమునందే సంధ్యావందనము చేయుటవలన ఒక ఫలితము మాత్రమే

లభించును. అదియే ఊరి బయట చేసినచో పదిరెట్లు ఫలము లభించును. నదీతీరమునందు చేసినచో నూరురెట్లు లభించును. పుష్కర తీర్థమునందు చేసినచో సహస్రఫలము. గంగాది నదీతీరములయందు చేసినచో కోటి ఫలము లభించును. సంధ్యావందనము చేయుటవలన ఊరిబయట చేసిన సురాపానపాపము, పగటిపూట చేసిన మైథునపాపము, అసత్యభాషణాది పాపములు వెంటనే దగ్ధమైపోవును. (281–295)

ఇక జపము చేయవలసిన స్థాన విశేషములను వివరించెదను కడు జాగ్రత్తగా వినుమని గురుమూర్తి బ్రాహ్మణునితో చెప్పసాగెను. గృహమునందు జపము చేయుటవలన ఒకే ఒక్క గుణిత ఫలము లభించును. బయట చేసినచో దానికి రెట్టింపు ఫలము లభించును. నదీతీరమున చేసినచో త్రిగుణిత ఫలము లభించును. గోశాలయందు, తులసీ బృందావనము నందు జపము చేసినచో దశగుణితమున కంటే ఎక్కువ ఫలము లభించును. అగ్నిహోత్రాది ప్రదేశములయందు చేసినచో శతగుణాధికమైన ఫలితము లభించును. తీర్థములందు, దేవతా సన్నిధానమునందు చేసినచో సహస్రగుణిత ఫలము లభించును. శ్రీహరి సన్నిధిలో చేసినచో, శతకోటి గుణిత ఫలము. శంకరుని సమీపమున చేసినచో అనంత ఫలము లభించును. (296–299)

ఉపయోగించెడి వివిధ ఆసనముల యొక్క విధి నిషేధములు, వాటివలన కలిగే పాపపుణ్యములను గూర్చి చెప్పబడుచుండెను – విరిగిన పీటమీద కూర్చొని జపము చేసినచో అపరిమితమైన దుఃఖము కలుగును. గరిక ఆసనమువలన అదృష్టము నశించి యశస్సు మటుమాయమగును. ఆకులను ఆసనముగా చేసికొనినచో చిత్తభ్రంశము కలుగును. వెదురు చాపవలన దారిద్ర్యము లభించును. పాషాణము అనగా రాతి ఆసనమును ఉపయోగించినచో వ్యాధులు సంభవించును. భస్మాసనము మీద కూర్చుండినచో వ్యాధులు నశించును. కంబళిమీద కూర్చొనినచో సుఖము లభించును. కృష్ణాజినము నందు కూర్చుండినచో జ్ఞానసిద్ధి కలుగును. వ్యాఘ్రచర్మమైనచో మోక్షము లభించును. దర్భాసనమైన యెడల వశీకరణము సిద్ధించును. అంతేగాక, సర్వరోగములు మటుమాయమై పాపములన్ని పారిపోవును. ఇంకను ఆయువు, ప్రజ్ఞయు వృద్ధి నొందును. **'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ'** అనే పవిత్ర మంత్రమును జపించుచూ గాయత్రి స్వరూపమును ధ్యానము చేయవలెను. తద్వారా పాపములన్నియు హరించిపోవును. గాయత్రి స్వరూపము వర్ణించుటకు నిత్యనూతనమైనది. ఆమె రక్తవర్ణమును కలిగి, ఎరుపు వస్త్రములనే ధరించి హంసవాహనముపై అలరారుచుండును. అకారమునకు చతుర్భుజుడు, చతుర్ముఖుడైన బ్రహ్మ అధిదేవతగ నుండును. నాలుగు ముఖములు, నాలుగు భుజములను కలిగియుండును. కమండలమును, రుద్రాక్ష మాలను, దండమును ధరించియుండును. ఋగ్వేద సమాగమమునందు 'అగ్నిహోత్ర ఫలమావాహయామి' అని, అప్పుడు 'ఆయాతు వరదాదేవీ' 'ఓజోఽసి' అని చెప్పాలి. అట్టి మంత్రములతో

ఋషులు, దేవతలు, గాయత్రీ సమతుల్యమని ప్రసిద్ధి కలదు. ప్రాతఃకాల సంధ్యాసమయములో చేయు విధానమును మీకు వివరింతును. **"విశ్వేదేవా – ఋషయః। గాయత్రీ దేవతా గాయత్రీ ఛందః। గాయత్ర్యావాహనే వినియోగః"** అని ప్రాతఃసంధ్యలో చెప్పాలి. **సావిత్రీ – దేవతా సావిత్రీ – ఛందః, సావిత్ర్యావాహనే వినియోగః ॥** అని మధ్యాహ్న సంధ్యలో చెప్పాలి. **సరస్వతీ – దేవతా। సరస్వతీ – ఛందః। సరస్వత్యావాహనే వినియోగః"** అని సాయం సంధ్యలో చెప్పవలెను. ఇక ప్రాతఃసంధ్యలో గాయత్రీ ధ్యానము గురించి వివరించెదను. **'అభిభూరోం'** గాయత్రిని బాలరూపిణిగా గమనించుము. అకారాది బ్రహ్మదైవత చిహ్నామునంతయూ వివరంగా చెప్పెదను. రక్తమువంటి ఎరుపు వన్నె గల శరీరముతో, రక్తవసనము ధరించి హంసవాహనమును అధిరోహించి యుండును. చతుర్బాహువులను, చతుర్ముఖములను కలిగి కమండలమును, అక్షసూత్రమును, దండమును ధరించి ఋగ్వేదసహితముగా వున్న గాయత్రిని ధ్యానించుటవలన అగ్నిహోత్ర ఫలము లభించును. ఇట్టి బాలగాయత్రిని ధ్యానము చేయునపుడు (అకారాది) అక్షర జ్ఞానమును జపించవలెను. దీనిని నిశ్చలచిత్తముతో చేయవలెను అని శ్రీగురుదు బ్రాహ్మణునితో చెప్పెను. **'ఓంకారం – శిఖామావాహయామి', ఛంద ఋషీనావాహయామి, శ్రియమావాహయామి, బలమావాహయామి'** అని ప్రాతఃకాలమునందు ఉత్తమ సమయమునందు సంధ్యను ఆచరింపవలెను. మధ్యాహ్న కాలమున **'అభిభూరోం'** అని యౌవనదశలోగల సావిత్రిని ధ్యానింపవలెను. ఆమె దేహకాంతి శ్వేతముగా నుండును. శ్వేతవస్త్రములను ధరించును. వృషభ వాహనమును అధిరోహించి యుండును. ఉకారమునకు రుద్రగణము దైవతము. పంచముఖములను కలిగియుండును. చక్కని వరద అభయహస్తములతో రుద్రాక్షమాలతో త్రిశూలమును ధరించి యజుర్వేదసహితముగా సావిత్రిని ధ్యానించిన యెడల అగ్నిష్టోమ ఫలము లభించును. **ఓంకారం శిఖామావాహయామి, ఛందఋషీ నావాహయామి, శ్రియమావాహయామి, హ్రియమావాహయామి.**

ఇక సాయంసంధ్యా ధ్యానం. **'అభిభూరోం'** అని వృద్ధదశను గలిగిన సరస్వతిని సాయంసంధ్యలో ధ్యానించవలెను. నల్లని మేనుఛాయను గలిగి, నలుపురంగు వస్త్రములను ధరించి గరుడవాహనమును అధిష్ఠించియుండును. మకారానికి అధిదేవత విష్ణువు. చతుర్భుజములలో శంఖచక్ర గదాపద్మములను కలిగి సామవేదమును ధరించియుండును. సాయంసంధ్యా సమయంలో వృద్ధ సరస్వతిని ధ్యానం చేయుట వలన వాజపేయ యజ్ఞఫలము లభించును. **ఓంకారం శిఖామావాహయామి, ఛందఋషీ నావాహయామి, శ్రియ మావాహయామి, బలమావాహయామి.** గాయత్ర్యా గాయత్రీ ఛందః, ప్రణవస్య అంతర్యామి ఋషిః, పరమాత్మ దేవతా, పంచశీర్షోపనయనే వినియోగః ॥ ఉదాత్త స్వరిత స్వరః శుక్లవర్ణః, జ్యోతిస్వరూపం. సర్వదేవమయం జగత్స్వరూపం అకార–ఉకార–మకారాణాం. అగ్ని, వాయు, సూర్యాఋషయః, గాయత్రీ,

త్రిష్టుప్ జగతీ, ఛందాంసి, బ్రహ్మ విష్ణు మహేశ్వరా దేవతాః, ఋగ్యజుస్సామాని స్వరూపాణి, ఆహవనీయాగ్ని గార్హపత్య – దక్షిణాగ్ని ఉపస్థానాని । పృథివ్యంతరిక్షం ద్యౌస్తత్వాని, ఉదాత్త అనుదాత్త స్వరిత – స్వరాః. పీత విద్యుత కృష్ణవర్ణీ, ప్రాతర్మధ్యాహ్న తృతీయ సవనీ, విశ్వ తైజస ప్రాజ్ఞస్వరూపిణీ, జాగృతి స్వప్న, సుషుప్త్యవస్థా అనగా పీతము, విద్యుత్, కృష్ణము అను వర్ణములలో ఉండునట్టి విశ్వ, తైజస, ప్రాజ్ఞస్వరూపిణి యగు త్రిపదా గాయత్రిని జాగ్రత్, స్వప్న, సుషుప్తి అను మూడు అవస్థలలో మూడు విధములుగా ధ్యానింపవలెనని చెప్పెను. (300–333)

ఇక ఇప్పుడు జపవిధానము వివరింపబడును. మమ ఉపాత్త దురితక్షయ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం జపే వినియోగః । ఓం 'అం'– నాభౌ । ఉం – హృదయే । మం – కంఠే । ఓం 'భూః' – అనే అక్షర మంత్రానికి గాయత్రి ఛందస్సు, అగ్నిదేవత, విశ్వామిత్రుడు ఋషి, షడ్జస్వరం శ్వేతవర్ణంతో కూడియుండును. పాదములను స్పృశించి మంత్రమును ఉచ్చరించి ప్రాణాయామం వినియోగించి రెండవ వ్యాహృతిని చెప్పవలెను. ఓం 'భువః' అక్షర మంత్రానికి ఉష్ణిక అనే పేరుగల ఛందస్సు, వాయువు దేవత, భృగువుఋషి, నల్లని వర్ణముతో ఉండెడి ఋషభస్వరమును తెలిసి ధ్యానించునపుడు మోకాళ్లలో న్యాసము చేయవలెను. ప్రాణాయామే వినియోగః అంటూ భక్తితో న్యాసమును చేయవలెను. ఓం సువః – అంటూ వ్యాహృతిని భక్తితో ధ్యానింపవలెను. సువః అను వ్యాహృతి మంత్రమునకు అనుష్టుప్ ఛందస్సు. సవితా దేవత. ఋషి భరద్వాజుడు. గాంధార స్వరముతో, పీతవర్ణముతో ఇది యుండును. కటిని స్పర్శించి మంత్రముతో ప్రాణాయామే వినియోగః– అంటూ తృతీయవ్యాహృతి మంత్రము జపించవలెను. ఓం మహః – అను మంత్రమునకు బృహతీ ఛందస్సు, దీనికి దేవత బృహస్పతి, ఋషి వసిష్ఠుడు. మధ్యమ స్వరం. పిషంగ వర్ణముతో ధ్యానింపవలెను. పిమ్మట ప్రాణాయామే వినియోగః– అంటూ నాభిని స్పృశింపవలెను. ఓం జనః – అను మంత్రమునకు పంక్తి ఛందస్సు. వరుణుడు దేవత, గౌతమ ఋషి, పంచమ స్వరం, నీలివర్ణ రూపమును ధ్యానించి హృదయస్థానమునందు న్యాసముచేసి ప్రాణాయామే వినియోగః అని చెప్పాలి. ఇక ఓం తపః– అను మంత్రన్యాసమునకు త్రిష్టుప్ ఛందస్సు, ఇంద్రుడు దేవత, ఋషి కశ్యపుడు, ధైవతం స్వరం. వర్ణము లోహితం అనగా రాగివర్ణము. కంఠస్థానమును స్పృశించి ప్రాణాయామమును వినియోగించి న్యాసమును చేయవలెను. ఓం సత్యం– అనే మంత్రమునకు జగతీ ఛందస్సు. దేవత విశ్వేదేవుడు. ఋషి అంగీరసుడు. స్వరము నిషాదము. బంగారము వంటి పచ్చని రంగు. స్పృశించవలసిన స్థానం భ్రువర్లలాటం (నొసలు మధ్యభాగం). ప్రాణాయామమును వినియోగించి భక్తితో న్యాసమును చేయవలెను. ఇంతగా న్యాసమును చేసి హస్తమును శిరఃస్థానమున ఉంచి, విధివిధానముగా ధ్యానింపవలెను. శిరఃస్థానమును స్పృశించి, అనుష్టుప్

ఛందస్సును, ప్రజాపతి ఋషి పేరును ఉచ్చరింపవలెను. ఇందుకు దేవత పరమాత్మయే. ప్రాణాయామమును వినియోగించి గాయత్రిని ధ్యానింపవలెను. అనంతరము 'ఓం ఆపోజ్యోతి' – అను మంత్రమును సభక్తికముగా ఉచ్చరింపవలెను. **'ఓం ఆపోజ్యోతి రసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోమ్'**– అని ఈ ప్రకారముగా శిరఃస్థానమునందు అంగన్యాసము చేయవలెను. (334-353)

గాయత్రీ మంత్రమునందు ఇరువది నాల్గు అక్షరములుండును. అందులోని ప్రతి ఒక అక్షరమును గూర్చి చెప్పెదను. **ఏకాగ్రచిత్తులై వినవలసినదని పరాశర మహర్షి ఋషిగణమును కోరెను.** త్రిపదా గాయత్రికి ఋషి విశ్వామిత్రుడు. ఛందస్సు దైవీగాయత్రి. ఇక వర్ణమును, దేవతను గూర్చి తదుపరి చెప్పెదను. **"ఓం తత్సవితుర్వరేణియం, భర్గోదేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్"**(1) – అని త్రిపదా గాయత్రి మంత్రమునందు ఇరువది నాల్గు అక్షరములుండును. ఇందుకు వేర్వేరుగా గల న్యాసమును విస్తరించి చెప్పెదను, ఆలకింపుడు–

'తత్' – అను వర్ణాక్షర మంత్రానికి ఋషి – విశ్వామిత్రుడు. అగ్ని దేవత. గాయత్రి ఛందస్సు అని చెప్పాలి. రూపము బంగారు చంపక పుష్పము యొక్క రంగును కలిగియుండును. దీనిని ధ్యానము చేయుటవలన పాపము నశించును. పాదాంగుష్ఠమునందు న్యాసము చేయవలెను.

'స' – అను వర్ణాక్షర మంత్రమునకు విశ్వామిత్రుడు ఋషి, వాయువు దేవత.దైవీగాయత్రి ఛందస్సు. అతసీ పుష్పం అనగా నల్లని అవిసె పువ్వు వంటి నీలిరంగు రూపమును కలిగియుండును. అట్టి రూపమును ధ్యానించుటచే ఉపపాతకములన్నియు నశించిపోవును. గుల్ఫము నందు అనగా చీలమండలమునందు న్యాసము చేయవలెను.

'వి' – అను వర్ణాక్షరమునకు ఋషి విశ్వామిత్రుడు. సూర్యుడు దేవత. దైవీ గాయత్రి ఛందస్సు. జంఘస్థానమునందు న్యాసము చేయవలెను. జంఘము అనగా పిక్కలు. సౌమ్యమైన కపిల పింగళ వర్ణమును కలిగియుండే దీనిని ధ్యానించుటవలన మహాపాపములు దహింపబడును.

'తు' – అనే వర్ణాక్షరమునకు ఋషి విశ్వామిత్రుడు. విద్యుత్ దేవత. దైవీ గాయత్రి ఛందస్సు. జానుస్థానము వద్ద న్యాసము చేయవలెను.

---

1. 1. మా యొక్క బుద్ధి వృత్తులను ప్రేరేపించు అంతర్యామియగు ఏ దివ్యతేజస్సు గలదో, అట్టి తేజస్సును మేము ధ్యానించెదము అని గాయత్రీ మంత్ర ప్రభావము పేర్కొనబడినది.

2. పరబ్రహ్మ స్వరూపము పరిపూర్ణమైనది. అది సచ్చిదానంద స్వరూపము, స్వయంజ్యోతి స్వరూపము. సృష్టి స్థితి లయకారకము, అత్యంత శ్రేష్ఠమైనది. అజ్ఞాన - చీకట్లను రూపుమాపునది. అట్టి దివ్యతేజస్సు మా బుద్ధులను (సన్మార్గమున) ప్రేరేపించుగాక! ఆ పరబ్రహ్మ తేజస్సును మేము ధ్యానించెదము అని గాయత్రీ మంత్రము యొక్క తాత్పర్యముగా వివరింపబడినది.

ఇంద్రనీల విద్యుత్ వర్ణమును కలిగియుండును. దీనిని ధ్యానించుటచే క్షయ వంటి మహారోగములు నశించును.

'ర్వ' - అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. యముడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఊరువుల యందు న్యాసము చేయవలెను. అగ్ని వంటి ప్రకాశముతో సౌమ్యస్వరూపమును కలిగియుండును. దీనిని ధ్యానించుటచే భ్రూణహత్యా పాపము నశించును.

'రే' - అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. వరుణుడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. శుద్ధస్ఫటిక సంకాశమును కలిగిన దీనిని గుహ్యస్థానమునందు న్యసింపవలెను. దీనివలన అగమ్యాగమనదోషములు నశించును. అనగా వ్యభిచారాది దోషములు నశించును. 'రే' వర్ణస్థానము ఉత్తమమైనదిగా తెలియవలెను.

'ణి' - అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు, బృహస్పతి దేవత. దైవీగాయత్రి ఛందస్సు. 'ణి'కారమును వృషణస్థానమునందు న్యాసము చేయవలెను. విద్యుత్ ప్రకాశవంతమును కలిగి, బార్హస్పత్య నామముతో కలిగిన దీనిని ధ్యానించుటచే అభక్ష్యభక్షణ పాపము క్షాళనమగును.

'యం' - అను అక్షరమంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. పర్జన్యుడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. 'యం' అక్షరమును కటిస్థానమునందు న్యాసము చేయవలెను. ఇది తారకవర్ణమును కూడుకొని యుండును. దీని ధ్యానముచే దేహ (ఆత్మ) హత్యాపాపము నశించును.

'భ' - అను అక్షరమంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. దేవత ఇంద్రుడు. దైవీగాయత్రి ఛందస్సు. 'భ'కారమును నాభియందు న్యాసము చేయవలెను. నల్లని మేఘవర్ణమును కలిగిన దీనిని ధ్యానించుటవలన గురుహత్యా పాపము నశించును.

'ర్గో' - అను వర్ణాక్షరమునకు ఋషి విశ్వామిత్రుడు. గంధర్వుడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. దీనిని ఉదరస్థానము నందు న్యాసము చేయవలెను. రక్తవర్ణముతో కూడుకొనిన ఈ వర్ణమును ధ్యానించుటవలన గోహత్యా పాపము నశించిపోవును.

'దే'- అను వర్ణాక్షర మంత్రమునకు విశ్వామిత్రుడు ఋషి.పూషా దేవత. దైవీగాయత్రి ఛందస్సు. 'దే' కారమును వక్షస్థలము యొక్క స్తనముల వద్ద న్యాసము చేయవలెను. దీనిని ధ్యానించుటవలన స్త్రీ హత్యా పాపము నశించును.

'వ' - అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. రుద్రుడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'వ' కారమును హృదయస్థానమునందు న్యాసము చేయవలెను. ఇది శుక్లవర్ణములో నుండును. దీనిని ధ్యానించుటవలన వాక్కువలన కలిగే పాపము నశించును.

'స్వ' - అను వర్ణాక్షర మంత్రమునకు విశ్వామిత్రుడు ఋషి. త్వష్ట దేవత. దైవీ గాయత్రి ఛందస్సు. దీనిని కంఠమునందు న్యాసము చేయవలెను. చక్కని బంగారువర్ణ రూపంలో వుండే దీని ధ్యానము వలన మానకౌటిల్య పాపము అనగా మోసపూరితమైన కొలతలు, తూకముల వలన కలిగే పాపములు నశించిపోవును.

'ధీ' - అను నామవర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. వసువు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ మంత్రమును దంతములయందు న్యాసము చేయవలెను. తెల్లని కలువరంగును కలిగిన దీనిని ధ్యానించుటవలన పితృహత్యా పాపము నశించిపోవును. తరువాత

'మ' - అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. మరుద్దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'మ'కారమును తాలు (దౌడ) స్థానమునందు న్యాసము చేయవలెను. పద్మరాగ తేజస్సును కలిగిన మరుద్దేవతతో కూడిన దీనిని ధ్యానించుటవలన సకలజన్మల పాపములు నశించిపోవును.

'హి' - అను మంత్ర వర్ణమునకు ఋషి విశ్వామిత్రుడు. సోముడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. 'హి'కారమును నాసికయందు న్యాసము చేయవలెను. శంఖ వర్ణమును కలిగి వుండే దీనికి సోముడు అధిదేవత. కావున, దీని ధ్యానమువలన సకలపాపములు హరించును.

'ధి'- అను వర్ణాక్షరమునకు ఋషి విశ్వామిత్రుడు. అంగిరసుడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. 'ధి'కారమును నేత్రస్థానమునందు న్యాసము చేయవలెను. పాండుర (తెల్లని) వర్ణముతో భాసించే ఈ మంత్రాక్షరమునకు అంగిరసుడు దేవతగా కలిగియున్న ఈ 'ధి'-కారమును ధ్యానించుటవలన పాణిగ్రహణ పాపములు నశించిపోవును. ఇక

'యో' - అను వర్ణాక్షరమునకు ఋషి విశ్వామిత్రుడు. విశ్వేదేవుడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. దీనిని భృకుటి మధ్యమునందు న్యాసము చేయవలెను. రక్త గౌర వర్ణముతో కూడియుండును. దీనిని ధ్యానించుటవలన ప్రాణి వధచే కలుగు పాపములు నశించిపోవును. ఇక

'యో' - అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. అశ్వినీ దేవతలు. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'యో'కారమును లలాట స్థానమునందు న్యాసము చేయవలెను. దీని రూపము రుక్మాభ (రుక్మము = ఉమ్మెత్తపుష్ప) వర్ణమును కలిగియుండును. దీనిని భక్తిపూర్వకముగా ధ్యానము చేయుటవలన సమస్త పాపములు నశించిపోవును.

'న' - అను వర్ణాక్షరమునకు ఋషి విశ్వామిత్రుడు. ప్రజాపతి దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'న'కారమును ప్రాఙ్ముఖమునందు న్యసింపవలెను. ఉదయించుచున్న బాలారుణ కాంతితో వెలుగొందెడి ప్రజాపతి అధిదేవతను కలిగిన దీనిని ధ్యానించుటవలన

విరించి పదవిని పొందెదరు.

'ప్ర' - అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. సమస్తదేవతలు దీనికి దేవతలే. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'ప్ర'కారాక్షరమును దక్షిణభాగమునందు న్యసింపవలెను. ఇంద్రనీలవర్ణ రూపముతో వెలుగొందెడి దీనిని ధ్యానించుటవలన సమస్త దేవతలకు మించిన దైవపదవిని పొందెదరు.

'చో'- అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు, రుద్రుడు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'చో'కార వర్ణము కుంకుమరూప వర్ణమును పోలియుండును. శిరస్సునకు పశ్చిమభాగమున న్యసింపవలెను. దీనిని ధ్యానించుటవలన కైలాసపదవిని పొందెదరు.

'ద'- అను అక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. బ్రహ్మ దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ మంత్రమును శిరస్సునకు ఉత్తరభాగమున న్యసింపవలెను. చక్కని శుక్లవర్ణ రూపమును కలిగిన దీనిని ధ్యానించుటచే బ్రహ్మపదవిని పొందగలరు.

'యా'- అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. విష్ణువు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'యా'కారమును మూర్ధమున అనగా- మస్తకమున న్యాసము చేయవలెను. సువర్ణ వర్ణముతో వెలిగిపోయెడి దీనిని ధ్యానించుటచే విష్ణుపదమునందు శాశ్వతనివాసము లభించును. ఇక

'త్'- అను వర్ణాక్షర మంత్రమునకు ఋషి విశ్వామిత్రుడు. విష్ణువు దేవత. దైవీగాయత్రి ఛందస్సు. ఈ 'త'కారమును శిఖా స్థానమునందు న్యాసము చేయవలెను. దీనిని ధ్యానించుటవలన నిరుపమానమైన విష్ణులోకమునందు విష్ణురూపమునే ధరించి శాశ్వత వైకుంఠవాసము లభించును.

ఈవిధముగ ఇరువదినాల్గు అక్షర మంత్రములను గూర్చి తెలిసికొని, విధిపూర్వకముగా న్యాసము చేయవలెను అని శ్రీగురుమూర్తి ఆ విప్రోత్తమునకు వివరించెను. (354-407□)

అనంతరము హస్తమును శిరస్సుపై ఉంచుకొని మరొక న్యాసమును ఆచరింపవలెను. శిరఃస్థాన న్యాసమునకు అనుష్టుప్ ఛందస్సు. ప్రజాపతి ఋషి, పరమాత్మ దేవత అని తెలియవలెను. 'ప్రాణాయామే వినియోగః' అని చెప్పి **'ఓం ఆపో...'** అంటూ వక్షస్థలమును స్పృశింపవలెను. ఇటులే **జ్యోతిః-** అని నేత్రములను, **'రసో'** - అని నాలుకను స్పృశించవలెను. **'అమృతే'** - అని లలాటమును, **'బ్రహ్మభూర్భువస్సువరోం'**- అని మస్తకమును స్పృశించి న్యాసమును చేయవలెను. ఇట్టి న్యాసము చేసి *గాయత్రిని* మూడు పర్యాయములు

జపించి, వ్యాపక (సర్వాంగ) న్యాసమును చేసి తిరిగి చేతులను ముమ్మార్లు శుద్ధి చేసుకోవలెను. 'ఓం భూర్భువస్సువః' అను విన్యాసముతో గాయత్రి పది పాదములకు, పది వ్రేళ్ళతో న్యాసమును చేయవలెను. బొటనవ్రేలి మూలమును పట్టుకొని చిటికెనవ్రేలు చివరను స్పృశించి, రెండు చేతుల న్యాసముతో పది పాదముల న్యాసము చేయవలెను. ఇరవై నాల్గు మంత్రాక్షరములను చూపుడువేలు మూలారంభము నుండి చిటికెనవ్రేలు చివర వరకు అంగుళీయన్యాసము చేయవలెను. ద్వాదశాక్షరములను ఒక్కొక్క హస్తముతో సునిశితముగా వ్యాపకన్యాసము చేసిన పిమ్మట కరన్యాస-అంగన్యాసమును చేయవలెను.

ఓం భూః - హిరణ్యగర్భాత్మనే - అంగుష్ఠాభ్యాం నమః । ఓం భువః - ప్రజాపత్యాత్మనే - తర్జనీభ్యాం నమః । ఓం స్వః- సూర్యాత్మనే- మధ్యమాభ్యాం నమః । ఓం మహః - బ్రహ్మాత్మనే - అనామికాభ్యాం నమః । ఓం జనః- విష్ణ్వాత్మనే - కనిష్ఠికాభ్యాం నమః । ఓం తపః - రుద్రాత్మనే- కరతలకరపృష్ఠాభ్యాం నమః । ఓం సత్యం - సర్వాత్మనే - అస్త్రాయఫట్ । ఓం తత్సవితుః - అంగుష్ఠాభ్యాం నమః । వరేణ్యం- తర్జనీభ్యాం నమః । భర్గోదేవస్య - మధ్యమాభ్యాం నమః । ధీమహి - అనామికాభ్యాం నమః । ధియో యో నః - కనిష్ఠికాభ్యాం నమః । ప్రచోదయాత్- కరతలకరపృష్ఠాభ్యాం నమః ॥ అని ఈవిధముగ రెండు చేతుల వ్రేళ్ళయందు న్యాసమును చేయవలెను. ఇప్పుడు షడంగన్యాసము చెప్పబడును.

ఓం భూః - హిరణ్యాత్మనే - హృదయాయ నమః । ఓం భువః - ప్రజాపత్యాత్మనే - శిరసే స్వాహా । ఓం స్వః - సూర్యాత్మనే - శిఖాయై వషట్ । ఓం మహః - బ్రహ్మాత్మనే - కవచాయ హుమ్ । ఓం జనః - విష్ణ్వాత్మనే - నేత్రత్రయాయ వౌషట్ । ఓం తపః - రుద్రాత్మనే - అస్త్రాయఫట్ । ఓం సత్యం - సర్వాత్మనే - దిగ్బంధః । ఓం తత్సవితుః - హృదయాయ నమః । ఓం వరేణ్యం - శిరసే స్వాహా । ఓం భర్గోదేవస్య- శిఖాయై వషట్ । ఓం ధీమహి - కవచాయ హుమ్ । ఓం ధియో యో నః - నేత్రత్రయాయ వౌషట్ । ఓం ప్రచోదయాత్ - అస్త్రాయఫట్ ॥ అని ఈవిధముగ షడంగన్యాసము చేసి, పది స్థానములలో దశాంగన్యాసము చేయవలెను. దాని క్రమపద్ధతిని, వాటి పేర్లు ఇప్పుడు వివరింపబడును. కావున ఏకాగ్రచిత్తముతో అవధరింపుము. (407□-424)

పాదములు, జానువులు, కటిస్థానము, నాభి, హృదయము, కంఠదేశము, అంగిటి (తాలువు), నేత్రములు, లలాటము, శిరస్సు ఈ పది స్థానములను స్పృశించాలి. గాయత్రీ మంత్రము పది పాదములకు పది స్థానములలో అంగన్యాసము చేయాలి. తత్, సవితుః, వరేణీయం, భర్గో, దేవస్య- ఇవి ఐదు స్థానములు. ధీమహి, ధియో, యో, నః, ప్రచోదయాత్ - ఇవి ఐదు స్థానములు. వెరసి పది స్థానములు. వీటితో

అంగన్యాసము చేయాలి. ఇక ఇరువది నాలుగు అక్షరములను పాదాంగుష్ఠమునుండి మొదలుకొని శిఖా స్థానము వరకు న్యాసము చేయవలెను. తం - అంగుష్ఠాభ్యాం నమః, త్సం - గుల్ఫయోర్నమః, విం - జంఘయోర్నమః, తుం - జానుభ్యాం నమః, ర్వం - ఊరుభ్యాం నమః, రేం - గుహ్యాయ నమః, ణిం - వృషణాయ నమః, యం - కట్యై నమః, భం - నాభ్యై నమః, ర్గోం - ఉదరాయ నమః, దేం - స్తనాభ్యాం నమః, వం - హృదయాయ నమః, స్యం - కంఠాయ నమః, ధీం - దంతేభ్యో నమః, మం - తాలవే నమః, హిం - నాసికాయై నమః, ధిం - నేత్రాభ్యాం నమః, యోం- భ్రువోర్మధ్యాయ నమః, యోం - లలాటాయ నమః, నః - ప్రాఙ్ముఖాయ నమః, ప్రం - దక్షిణ ముఖాయ నమః, చోం - పశ్చిమ ముఖాయ నమః, దం- ఉత్తర ముఖాయ నమః, యాం - మూర్ధ్నే నమః, తం - శిఖాయై నమః. ఈవిధముగ న్యాసము చేసి తిరిగి పాదాంగుష్ఠమునుండి మొదలుకొని కటి వరకు ఊర్ధ్వన్యాసము చేయాలి. (425-436)

'త' కారానికి పాదాంగుష్ఠ స్థానాన్ని, 'త్స' కారానికి గుల్ఫస్థానాన్ని, 'వి' కారముతో జంఘములను స్పృశించాలి. ఇదేవిధముగ 'తు' అని జానువులు, 'ర్వ' అని తొడలు, 'రే' కారంతో గుహ్యమును, 'ణి' కారంతో వృషణములను, 'య' కారంతో కటిస్థానమును స్పృశించాలి. ఇక శిఖనుండి నాభి పర్యంతము అధోన్యాసం చేయాలి. 'తం' నమః - శిఖాం విన్యస్య, 'యాం' నమః - మూర్ధ్నివిన్యస్య, 'దం' నమః - ఉత్తర ముఖాయ విన్యస్య, 'చోం' నమః - పశ్చిమ ముఖాయ విన్యస్య, 'ప్రం' నమః - దక్షిణ ముఖాయ విన్యస్య, 'నం' నమః - ప్రాఙ్ముఖాయ విన్యస్య, 'యోం' నమః - లలాటే విన్యస్య, 'యోం' నమః - భ్రువోర్మధ్యే విన్యస్య, 'ధిం' నమః - నేత్రత్రయే, 'హిం' నమః - నాసికాయాం, 'మం' నమః - తాలౌ, 'ధీం' నమః - దంతేషు, 'స్యం నమః - కంఠే, 'వం' నమః - హృదయే, 'దేం' నమః - 'స్తనయోః', 'ర్గోం' నమః - ఉదరే, 'భం' నమః - నాభౌ విన్యస్య॥ అని ఈవిధముగ న్యాసమును చేయాలి. ఇక ప్రణవాది నమోఽంత న్యాసం అంటే ఓంకారమును చెప్పి చివర నమః అని చెప్పి న్యాసమును చేయాలి. అ-కారంతో నాభి, ఉ-కారంతో హృదయం, మ-కారంతో ముఖం, 'స'కారంతో లలాటం, 'మ'కారంతో శిరస్సును తాకి హస్త ముద్రతో నమస్కరించాలి.

ఇప్పుడు గాయత్రీ మంత్రమును జపించుటకు ముందు ఇరువదినాలుగు ముద్రల విధానము చెప్పబడును. 'సుముఖం, సంపుటం, వితతం, విస్తృతం, ద్విముఖం, త్రిముఖం, చతుర్ముఖం, పంచముఖం, షణ్ముఖం, అధోముఖం, వ్యాపకాంజలికం, శకటం, యమపాశం, గ్రథితం, సన్ముఖోన్ముఖం, ప్రలంబం, ముష్టికం, మత్స్యం, కూర్మం, వరాహం, సింహాక్రాంతం, మహాక్రాంతం, ముద్గరం, పల్లవం. ఇవి

ఇరవైనాల్గు ముద్రలు. ఈ ముద్రలు తెలియకుండా గాయత్రీ మంత్రమును జపించుట నిష్ఫలమే యగును. కావున, ముద్రాపూర్వకంగా గాయత్రీ మంత్రమును అనుష్ఠించవలెను.[1] ఈ ముద్రలను గోప్యముగ చేయవలెను. శిష్యులు, గురువు, గురుపుత్రులు లేదా, తండ్రి చూచినచో దోషము లేదు. ఈవిధముగా న్యాసము పూర్తిచేసి ముమ్మారు ప్రాణాయామ మొనర్చిన పిమ్మట, గాయత్రీ మంత్రజపమును గూర్చి **సమస్త పాపక్షయార్థం** అంటూ **'అష్టోత్తరశత జపం కరిష్యే'** అని సంకల్పించాలి. గాయత్రి ప్రథమ పాదానికి ఋగ్వేద ఋషి. 'భూమి' తత్త్వం, బ్రహ్మ దేవత, గాయత్రీ ఛందస్సు. ద్వితీయపాదమునకు యజుర్వేద ఋషి, ఋక్సామ – తత్త్వం, రుద్రుడు – దేవత, త్రిష్టుప్ – ఛందస్సు. గాయత్రి తృతీయ పాదానికి సామవేద ఋషి, ప్రాణాపానవ్యాన, సమాన తత్త్వం. విష్ణువు దేవత. జగతీ ఛందస్సు. సమస్త పాపక్షయార్థే జపే వినియోగః' ॥ అని చెప్పాలి. అనంతరము గాయత్రీ ధ్యానమును చేయవలెను. అందుకుగాను ఈ దిగువ శ్లోకమును అత్యంత భక్తిశ్రద్ధలతో పఠించుచూ, గాయత్రీ మాతయొక్క స్వరూపమును ధ్యానింపవలెను.(437–457)

శ్లో॥ **ముక్తావిద్రుమహేమనీలధవళ చ్ఛాయైర్ముఖైస్త్రీక్షణైర్యుక్తామిందు కళానిబద్ధ ముకుటాం తత్త్వార్థ వర్ణాత్మికామ్ ।**
గాయత్రీం వరదాభయాంకుశకశాం శూలం కపాలం గుణం శంఖం చక్ర మథార వింద యుగళం హస్తైర్వహంతీం భజే ॥ (458)

ఈవిధముగ గాయత్రీమాతను ధ్యానము చేసి, నాసికాగ్రమునందు దృష్టిని నిలిపి జపము చేయవలెను. జపానంతరము షడంగన్యాసముతో జపమును ముగించవలెను. చేసిన జపమును తిరిగి గాయత్రీమాతకే సమర్పించవలెను. గాయత్రీ మంత్రమునందు నామమంత్రము అత్యంత విశిష్టమైనది. రెండక్షరాలతో పాపము హరించును. 'మన్' – కారమంటే మనసు, 'త్ర' కార మంటే ప్రాణం. మన్త్రమనగా మనసును, ప్రాణమును ఏకము చేయునదని భావము. కావున, ఏకచిత్తంతో మంత్రమును జపింపవలెను. జపమనగా 'జ'–కారం జన్మలను విచ్ఛేదం చేయును. 'ప'–కారం జన్మజన్మల పాపాలను దూరము చేయును. కావున 'జపం' అనే రెండక్షరములు చాలా ముఖ్యమైనవి.[2] నాలుగు వేదములకు మూలము గాయత్రీ మంత్రము. అందుచే గాయత్రి మంత్రమును జపించినచో వేదపఠన ఫలము లభించును. ఈవిధముగా

---

1. ముద్రలను గూర్చిన చిత్రపటములతో కూడిన వివరాలను గీతాప్రెస్సువారు ప్రచురించిన "సంధ్యోపాసనవిధి' లేక "నిత్యకర్మ-పూజాప్రకాశిక" అను గ్రంథములలో చూడవచ్చును.
2. **జకారో జన్మవిచ్ఛేదః - పకారః పాపనాశనః । జన్మచ్ఛేదకరో యస్మాత్ జపమిత్య భిధీయతే ॥**
జ - అనగా జన్మరాహిత్యం, ప - అనగా పాపనాశనం. జపము అనగా పాపములను నశింపచేసి జన్మరాహిత్యమును అనుగ్రహించునది అని తాత్పర్యము. కావున, జపము చేయునప్పుడు మంత్రమునందు మనస్సును నిల్పి, మంత్రభావమును మధ్య, మధ్యలో ధ్యానపూర్వకంగా చింతించవలెను. దానివలన భావపుష్టితో జపపుష్టి కలుగును. తద్వారా మంత్రసిద్ధి కలిగి సంపూర్ణ జపఫలితము తప్పక లభించును.

గాయత్రీ మంత్రమును జపించని మానవులజన్మ వ్యర్థము. వారు సూకరములతో సమానులు. ఇక ఎవరైతే జపించెదరో వారు నిశ్చయముగా కోరిన ఫలములను తప్పక పొందెదరు. ఈ గాయత్రీ మంత్రమును నీటిలో కూర్చొని చేయకూడదు. అట్లు చేసిన యెడల ప్రజ్ఞాహీనులయ్యెదరు. **ఎందుకనగా బ్రాహ్మణుని ముఖమునందు మూడు అగ్నులు ఉండును. ఒకటి ఆహవనీయాగ్ని, రెండు గార్హపత్యాగ్ని, మూడవది దక్షిణాగ్ని. అగ్ని ఉదకముతో సంయోగం చెందినప్పుడు, అగ్నియొక్క తేజస్సు నశించును. అందువలన నీటిలో కూర్చొని మంత్రమును జపించకూడదు.** సుఖాసనమును ఏర్పరచుకొని, దానిపై కూర్చొని ప్రాతఃకాలమునందు నాభిస్థానమును స్పృశించి జపసంఖ్యను లెక్కింపవలెను. అటులే మధ్యాహ్న సమయమున హృదయస్థానమును స్పృశించి, సాయంకాలము ముఖస్థానమును స్పృశించి గాయత్రీ మంత్ర జపమును జపింపవలెను. అనగా జపసంఖ్యను లెక్కించుటకు జపమాలను చేతిలో ధరించి, అది వస్త్రముతో కప్పి జపించవలెను. ఈ జపమాలను మధ్యాహ్న సమయంలో హృదయస్థానము వద్ద పట్టుకొని జపించాలి. సాయంకాలము ముఖమును స్పృశించి జపించాలి. ఉదయము నిలబడి, మధ్యాహ్న కూర్చొని లేదా నిశ్చలంగా నిలబడి, సాయంకాలము కూర్చొనియే గాయత్రిని జపించవలెను. నిర్మలమైన మనసుతో ఎదురుగాగల ఏదేని ఒక వృక్షమును చూస్తూ, లేదా నాసికాగ్రమునందు దృష్టిని నిల్పి జపింపవలెను. ప్రతినిత్యము బ్రహ్మచారులు, గృహస్థులు నియమముగా అష్టోత్తర శత సంఖ్యతో జపించాలి. ఇక వానప్రస్థులు, యతీశ్వరులు వేయిసార్లు జపించాలి. ఒకవేళ ఏదేని సంకటపరిస్థితి ఏర్పడినచో, ఇరవై ఎనిమిది సార్లు తప్పక జపించవలెను. అదికూడా సాధ్యపడనిచో పదిమార్లు జపింపవలెను. మానసికముగా జపము చేయుట ఉత్తమం. అప్పుడు అర్థమును ఆలోచిస్తూ, అర్థముయందు దృష్టిని నిలిపి మానసికముగా జపమును చేయుట ఉత్తమోత్తమం. పెదవులను కదిలిస్తూ, ఉపాంశువుగా జపించుట మధ్యమం. అక్షరములను ఉచ్చరింపుచూ ఇతరులు వినే విధముగ చేయు వాచిక జపము అధమము. గాయత్రీ మంత్రమందుగల మూడు పాదములను విరామము లేకుండా ఒకేసారి చెప్పకూడదు. **'తత్సవితుర్వరేణ్యం, భర్గోదేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్'** అని త్రిపదా గాయత్రిలోని మూడు పాదములను వేరుగా చేసి ఏ పాదమునకు ఆ పాదమును స్పష్టముగా, విరామము తీసుకొనుచూ మిగుల హర్షోల్లాసములతో మంత్రజపము చేయవలెను. దీనివలన బ్రహ్మహత్యాది మహాపాతకములన్నియు సమసిపోయి అనంతపుణ్యరాశి లభించును. ఒకవేళ మూడు పాదములను ఏకమొత్తంగా చెప్పినచో మహాపాతకములు లభించి, ఘోరనరకమును అనుభవింపవలసి వచ్చును. (459-475)

ఇక వ్రేళ్ళపైన జపమును లెక్కించుట పుణ్యవంతమైనది. వ్రేళ్ళ కణుపులమీద లెక్కించుటవలన పదిరెట్ల పుణ్యము అధికముగా లభించును. శంఖమణితో లెక్కించిన వందరెట్లు అధిక పుణ్యము. పగడాల మాలతో వెయ్యిరెట్లు అధిక పుణ్యము లభించును. స్ఫటికమాలతో పదివేల

రెట్ల పుణ్యఫలం. ముత్యాల మాలతో లక్షరెట్ల అధిక పుణ్యము. పద్మాక్ష మాలతో పదిలక్షల రెట్లు అధికమైన పుణ్యము లభించును. బంగారు పూసల మాలతో కోటిరెట్లు అధిక పుణ్యము, కుశరుద్రాక్షలతో అనంతఫలము లభించును. **జపమాలను అతి గోప్యముగా పట్టుకొని జపము చేయవలెను. జపము చేయునపుడు మేరువు అనగా కొలికిపూసను దాటకూడదు. మేరువును చేరుకొన్న వెంటనే మాలను తిరగేసి జపింపవలెను. మేరువును దాటినచో పాపము లభించును.** ప్రమాదవశాత్తుగ మేరువును దాటినచో, వెంటనే ముమ్మారు ప్రాణాయామము చేయుటచే పాపము నివారింపబడును. గాయత్రీ జపమును మూడు పాదములను అనగా త్రిపదా గాయత్రిని పదకొండు పర్యాయములు ప్రతినిత్యము జపించుట వలన సమస్త పాపములు సర్వనాశనమైపోవును. నూట ఎనిమిది మార్లు జపించినచో ఘోరాతిఘోరమైన పాతకములు సమసిపోవును. వేయిమార్లు నిష్ఠతో జపించిన యెడల ఉపపాతకములన్నియు నశించిపోవును. మహాపాతకాది దోషములు నశించిపోవుటకు కోటిమార్లు జపింపవలెను. అప్పుడు కోరిన మనోభీష్టములన్నియు తత్క్షణమే నెరవేరగలవు. ఇతరులనుండి ద్రవ్యమును ఆశించి జపము చేసినచో అనంతదోషములు లభించును. నిశ్చయముగా అట్టివారలు చండాలయోనిలో జన్మించుదురు. జపమును ఏకాగ్రచిత్తముతో చేయవలెను. వెనుకకు, ముందునకు చూడకూడదు. ఇతరులతోగాని, శూద్రాది జాతులతో గాని మాట్లాడకూడదు. తన దేహమును గోళ్ళతో గోకుకొనకూడదు. తెలియకుండా అట్లు జరిగినచో శ్రోత్రాచమనము చేయుటచే దోషము తొలగును. చండాలురపై దృష్టి పడినచో రెండు మార్లు ఆచమించుటచే శుద్ధి కలుగును. పతితులతో సంభాషించుట తటస్థించిన యెడల వెంటనే స్నానము చేయవలెను. కావున, సాధ్యమగునంతవరకు మౌనముగా ఉండి జపము చేయుటయే ఉత్తమోత్తమము. తప్పనిసరియై మాటలాడవలసి వచ్చినచో **'తద్విష్ణోః'** అనే మంత్రమును జపించవలెను. తద్వారా దోషము నశించిపోవును. జపించునపుడు నిద్రగాని, అపానవాయువు గాని, ఆవలింత గాని, క్రోధభావము గాని కలిగినచో, భయంకరమైన పాపములు ఘటించును. తెలియక ఇట్టి పరిస్థితి ప్రాప్తించినచో శ్రోత్రాచమనము చేయవలెను. లేదా అగ్నిని, సూర్యుని, ధేనువును, దర్శనము చేసి విష్ణుమంత్రమును జపించవలెను. ఇట్టి విధిపూర్వకముగా జపించినచో, మనోభీష్టములన్నియు సులభముగ నెరవేరునని, ఋషివర్యులందరు ముక్తకంఠముతో ప్రకటించినారని శౌనకాది మునీశ్వరులకు పరాశరమహర్షి వివరించుచుండెను. ఇట్లు మంత్రజపము ఒనర్చిన పిమ్మట సూర్యునకు ఉపస్థానము చెప్పవలెను. (476-491)

ప్రాతఃకాలమునందు **'మిత్రస్య'**, మధ్యాహ్నము నందు **'ఉదుత్యం'**, సాయంకాలమందు **'ఇమం మే వరుణ'** అను మంత్రమును చెప్పి ఉపస్థానమును పూర్తి చేయాలి. వంశాచారమును అనుసరించి పెద్దలు ఉపదేశించిన విధముగ చివరగా గోత్ర ప్రవరలను చెప్పి భక్తితో నమస్కరింపవలెను. నాలుగు దిక్కులకు నమస్కరించి, ప్రదక్షిణము చేసి, గోత్రప్రవరను చెప్పి నమస్కరింపవలెను. సంధ్యావందనము

పూర్తియైన పిమ్మట అగ్నియందు హోమము (ఔపాసనము) ను చేయవలెను. ఇప్పుడు మీకు సాయం ప్రాతరౌపాసనమును గూర్చి వివరించెదనని శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునితో నుడివెను.(492-495)

బ్రహ్మచారులు అగ్నికార్యమును, గృహస్థులు ఔపాసనమును సాయంకాలము, ప్రాతఃకాలము రెండు పర్యాయములు చేయవలెను. హోమమును లోతైన పాత్రలలోగాని, నేలమీదగాని చేయకూడదు. నేలపైన, నీటితో అలికి స్థండిలమును పరచి, దానిపై అగ్నిని స్థాపించి హోమము చేయవచ్చును. లేదా హోమకుండమును స్థాపించి అందులోనే ప్రతినిత్యము ఔపాసనము చేయవలెను. హోమమునకై అగ్నిని ప్రజ్వలింపచేయుటకు, చేతులను, ఆకులను, చేటలను వాడకూడదు. నోటితో ఊదకూడదు. చేట వలన దరిద్రము, నోటివలన ఆయుఃక్షీణము, చేతుల వలన మృత్యువు సంభవించును. కనుక, పొడవైన గొట్టముతోగాని, విసనకఱ్ఱతోగాని, గాలిని వీచి అగ్నిని ప్రజ్వలింపచేయవలెను. జ్వాల పుట్టినచోటనే ఆహుతిని సమర్పింపవలెను. సమిధలను స్వయంగా బ్రాహ్మణుడే సమకూర్చుకొనవలెను. సమిధలు, పూలు, దూర్వలు శూద్రులు తేకూడదు. వారిచే తెప్పించకూడదు. హోమద్రవ్యములలో వడ్లు, నీవారములు, తండులములు, గోధుమలు, యవలు, జొన్నలు ఇవి ముఖ్యమైనవి. వీటికి నేతిని చేర్చి హోమము చేయవలెను. నేయి లేనియెడల నువ్వులు హోమమునకు పవిత్రమైనవే. కావున, నువ్వులనూనె కూడా వాడవచ్చును. ఔపాసనము చేసిన పిమ్మట బ్రహ్మయజ్ఞాంగ తర్పణమును చేయవలసి యుండును. కావున, బ్రహ్మయజ్ఞాంగ తర్పణ విధానమును గూర్చి వివరించెదనని శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునితో పలికెను. ముఖ్యంగా ఉదయము, మధ్యాహ్నము స్నానసంధ్యాది జపములను పూర్తిచేసి ఔపాసనాదికములను ముగించిన పిమ్మటనే బ్రహ్మయజ్ఞమును ఆచరించవలెను. (496-507)

బ్రహ్మయజ్ఞాంగ తర్పణము జలసమీప స్థానమునందు చేయవలెను. మూడుమార్లు ప్రాణాయామము చేసి, **'విద్యుదసి'** అను మంత్రమును జపింపవలెను. కుడిచేతితో దూర్వములను తీసికొని తూర్పు లేదా ఉత్తరము వైపు, ఎడమమోకాలుమీద కుడిపాదమును పెట్టి కూర్చొనవలెను. రెండు చేతులను కలిపి కుడి తొడమీద నుంచవలెను. ముమ్మారు ప్రణవమును ఉచ్చరింపవలెను. **'ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం'**తో త్రిపదా గాయత్రిని ఉచ్చరించి పదిమార్లు జపించవలెను. ప్రతినిత్యము స్వాధ్యాయమునకు తమతమ శక్త్యానుసారము, తమ శాఖా సంబంధమైన వేదముతో ప్రారంభించి వేదమును పఠింపవలెను. లేదా, రోజుకు ఒక ఋచను లేదా, ఒక శ్లోకమును పఠింపవలెను. తదుపరి **'నమో బ్రహ్మణే'** అను మంత్రమును ముమ్మారు పఠింపవలెను. **'వృష్టిరసి'** అనే మంత్రమును జపించి ఉదకమును తాకవలెను. అనంతరము తర్పణమును వదలవలెను. (508-514)

బ్రహ్మయజ్ఞమునకు దర్భలుచాలా ముఖ్యమైనవి. దానితో వసువు, రుద్రుడు, ఆదిత్యులు, సమస్త దేవతలు, పితరులు తృప్తి చెందెదరు. ఏనాడైనా ఇది జరగనిచో, రాత్రివేళ గాయత్రీ జపమును చేయవలెను. తద్దోష పరిహారార్థం అని గాయత్రీ జపమును చేయవలెను. తద్వారా వేదపఠన ఫలము లభించును. కుశాగ్రములతో దేవతర్పణమును, మూలాగ్రముతో పితృతర్పణమును, మధ్యస్థానముతో ఋషి తర్పణమును చేయవలెను. తద్వారా వారందరునూ తృప్తి చెందెదరు. తర్పణమును పాత్రలో చేయకూడదు. నేలపై దర్భలను పరచి ఉదకముతో తర్పణమును విడువవలెను. అది భక్తిపురస్సరముగా, విధియుక్తముగా తర్పణము చేయవలెను. చేతిలో తిలలు తీసుకొని తర్పణము విడువవలెను. ఇంటిలో తర్పణము చేయునపుడు తిలలు వాడకూడదు. ఉదకముతో మాత్రమే చేయవలెను. దేవతలకు తెల్ల నువ్వులను, ఋషిజనులకు ధూమ్రవర్ణములో గల నువ్వులను, పితృదేవతలకు నల్లని తిలలను వాడవలెను. దేవతలకు తర్పణము చేయునపుడు యజ్ఞోపవీతమును సవ్యముగను, ఋషులకొరకు కంఠమాలగను, పితరులకు అపసవ్యముగను ధరించి తర్పణమును విడువవలెను. దేవతలకు ఒకమారు, ఋషులకు రెండు మార్లు, పితరులకు మూడేసి మార్లు తర్పణము చేయవలెను. స్త్రీలకు ఒక పర్యాయమే కాని, మాతా - పితామహి, ప్రపితామహి అను ఈ ముగ్గరికి మూడేసిమార్లు తర్పణం చేయాలి. మిగిలిన స్త్రీలకు ఒక పర్యాయమే తర్పణం విడవాలి. సవతి తల్లికి, గురుపత్నికి రెండేసి పర్యాయములు తర్పణము చేయాలి. దేవ, బ్రహ్మ, ఋషీశ్వరులకు ఇచ్చే తర్పణమునందు అక్షతలు ముఖ్యమైనవి. పితరులకు కృష్ణ తిలలు - నల్ల నువ్వులు వాడవలెను. అందువలన అనంతపుణ్యము లభించును. ఆదిత్యునకు శుక్రవారము నాడు, మఖా నక్షత్రముతో కూడిన ప్రతిపద తిథినాడు తర్పణము చేయవలెను. షష్టి, నవమి, ఏకాదశి తిథులయందు తిలతర్పణము చేయకూడదు. లేదా వివాహము, ఉపనయనము, జన్మనక్షత్రముతో కూడిన పుట్టినరోజున, తమ ఇంటిలో శుభకార్యములు జరుగు సందర్భములలోను తిలతర్పణములను విడువకూడదు. తిలతర్పణము చేయకుండా కేవలము ఉదకముతో తర్పణము చేయవచ్చును. చేతికి బంగారు పవిత్రము ధరింపవలెను. లేదా, దర్భతో చేసిన పవిత్రము వాడుకొనవచ్చును. పాదములు కడగకుండా మంగళ స్నానము చేయుట, తిలలు లేకుండా తర్పణము విడచుట, దక్షిణ లేకుండా శ్రాద్ధములు చేయుట నిష్ఫలము అని ఎరుగవలెను. నిషిద్ధమైన రోజులలో తర్పణము చేయకూడదు. దీపావళికి ముందు చతుర్దశి తిథిన యమతర్పణము చేయవలెను. అంగారక కృష్ణ చతుర్దశినాడు యమునిపేరు మీదుగా యజ్ఞోపవీతమును సవ్యముగా ధరించి విధిపూర్వకముగా తర్పణము చేయవలెను. తిలలు తీసికొని ఒక్కొక్క దోసిలి ఉదకముతో యముని పేరును ఉచ్చరించి భక్తితో మూడుపర్యాయములు తర్పణము విడువవలెను. యమునియొక్క పేర్లు పదునాలుగు గలవు. వాటిలో వరుసగా యముడు, ధర్మరాజు, మృత్యువు, అంతకుడు, వైవస్వతుడు, కాలుడు, సర్వభూతక్షయుడు, ఔదుంబరుడు, దధ్నుడు, నీలుడు, పరమేష్ఠి, వృకోదరుడు, చిత్రుడు,

చిత్రగుప్తుడు[1] అని ఈ నామములకు అంతమున 'నమః' అని చేర్చి పేరును చెప్పి 'తర్పయామి' అనే మాటతో తర్పణమును చేయవలెను.[2] దీనివలన సమస్తపాతకములు నశించిపోవును. రోగములు, వ్యాధులు పీడింపవు. అపమృత్యువు దరికిరాదు. శనైశ్చరాది మహాపీడలు తొలగిపోవును. మాఘమాసము నందు శుక్లపక్షమున అష్టమి తిథినాడు భీష్ముని నామముతో తర్పణము చేయవలెను. దానిని భీష్మతర్పణమందురు.[3] తద్వారా ఏడాదిపొడవునా చేసిన పాపములు పరిహరింపబడును. ఆవిధముగ తర్పణమును విడచి చివరగా కర్మసాక్షియగు సూర్యనారాయణుని పేరిట విద్వజ్జనులందరు మూడు మార్లు సూర్యునకు అర్ఘ్యమును ఈయవలయును. (515-540)

ఇట్టి సదాచారములను ఎవరైతే పెద్దల వద్ద విపులముగా విధివిధానముగా తెలిసికొని అనుష్ఠించెదరో, వారు ఋణత్రయము నుండి ముక్తులై ఇహపరసౌఖ్యములను పొందగలరు అని పరాశరమహర్షి నైమిశారణ్యమున శౌనకాది ఋషులందరకు వివరించి చెప్పెనని గాణగాపురమునందు శ్రీగురునృసింహ సరస్వతి స్వామివారు పరాన్నమును ఎరుగని వైదికనిష్ఠాగరిష్ఠుడగు బ్రాహ్మణునకు నిత్య ధర్మకర్మల మార్గమును తెలియజెప్పెనని సిద్ధుడు నామధారకునితో వివరించి చెప్పెను. దానినే సరస్వతీ గంగాధరుడు లోకమునకు గ్రంథరూపమున ప్రకటించి చెప్పెను. ఇట్టి సదాచారమును పాటించినవారికి సర్వాభీష్టములు నెరవేరును అని ఉపసంహారముగా సరస్వతీ గంగాధరుడు మరొక్కమారు పలికెను. (541-542)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు "అహ్నిక నిరూపణము" అను ముప్పది ఆరవ అధ్యాయము ॥ 36 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 542; మొత్తము సంఖ్య : 4511 + 542 = 5053 ఓవీలు)

---

[1] శ్లో॥ యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయ చ । వైవస్వతాయ కాలాయ సర్వభూతక్షయాయ చ ॥
ఔదుంబరాయ దధ్నాయ నీలాయ పరమేష్ఠినే । వృకోదరాయ చిత్రాయ చిత్రగుప్తాయ తే నమః ॥

[2] దక్షిణాభిముఖముగా కూర్చొని, యజ్ఞోపవీతమును సవ్యంగా ధరించి దేవతీర్థము ద్వారా యముని గూర్చి తిలతర్పణము విడువాలి. తండ్రి జీవించియున్నవారు కూడా సవ్యంగా, దేవతీర్థముద్వారా యవలతోగాని, లేదా కేవలం ఉదకముతోగాని యమతర్పణం చేయాలి. 1. యమాయ నమః - యమం తర్పయామి 2. ధర్మరాజాయ నమః- ధర్మ రాజానం తర్పయామి 3. మృత్యవే నమః - మృత్యుం తర్పయామి 4. అంతకాయ నమః - అంతకం తర్పయామి 5. వైవస్వతాయ నమః - వైవస్వతం తర్పయామి 6. కాలాయ నమః- కాలం తర్పయామి 7. సర్వభూత క్షయాయనమః - సర్వభూతక్షయం తర్పయామి 8. ఔదుంబరాయ నమః - ఔదుంబరం తర్పయామి 9. దధ్నాయ నమః - దధ్నం తర్పయామి 10. నీలాయ నమః - నీలం తర్పయామి 11. పరమేష్ఠినే నమః - పరమేష్ఠినం తర్పయామి. 12. వృకోదరాయ నమః - వృకోదరం తర్పయామి. 13. చిత్రాయ నమః - చిత్రం తర్పయామి 14. చిత్రగుప్తాయ నమః - చిత్రగుప్తం తర్పయామి ॥ (గీతాప్రెస్ వారి నిత్యకర్మపూజా ప్రకాశిక- పుటసంఖ్య 299లో చూడుము.)

[3] భీష్మతర్పణమును గూర్చిన పూర్తి విధానమును గీతాప్రెస్‌వారి నిత్యకర్మ పూజాప్రకాశిక పుటసంఖ్య (300-301)లో వివరంగా చూడవచ్చును.

శ్రీ గురు చరిత్ర

ముప్పది ఏడవ అధ్యాయము

గాణగాపురము నందలి ఒక నైష్ఠిక బ్రాహ్మణుని విన్నపమును మన్నించి, అతడు కోరిన వైదిక సదాచార ధర్మకర్మలను
గూర్చి శ్రీగురుమూర్తి సవిస్తరముగ ఉపదేశించుట - సదాచారసంపన్నులయిన ఆ బ్రాహ్మణదంపతులను
శ్రీస్వామివారు ఆశీర్వదించి అనుగ్రహించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

"స్వామీ! ప్రస్తుత కథాక్రమమునందు ఆ తదుపరి ఏమి జరిగెను. శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణునితో ఇంకనూ ఏమేమి విశేషములను వివరించి చెప్పెను. దయతో తమరు నాకు వినిపింపగలరని" నామధారకుడు సిద్ధమునీంద్రుని వేడుకొనెను. **అంతట సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పదొడగెను**– "నామధారకా! వినుము. సాక్షాత్తూ శ్రీమన్నారాయణ అవతార స్వరూపుడైన శ్రీగురుమూర్తి సదాచారమును గూర్చి విస్తరించి చెప్పెను. త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన శ్రీగురునాథుడు ఒక పతితునకు జ్ఞానమును ప్రసాదించి అతనితో వేదమునే చెప్పించెను కదా! భక్తజనులకు కల్పతరువైన ఆ మహానుభావుడు శ్రీ గురుమూర్తి, సత్యనిష్ఠుడైన ఆ బ్రాహ్మణుడు ప్రశ్నించిన దానికి ప్రత్యుత్తరముగ సదాచారమును గూర్చి మరిన్ని విశేషములను విస్తరించి చెప్పసాగెను". (1-4)

బ్రాహ్మణోత్తమా! ఒక గృహస్థుడు తనకు అవసరమైన వస్తువులను సంగ్రహించి గృహమునందు జాగ్రత్తగా రక్షించుకొనవలెను. వానిలో **'అగ్నిమంథన కాష్ఠము'** అనగా అరణి కఱ్ఱలు, మంచి శ్రీగంధపు చెక్కలు, చందనము, దివ్యమైన మణులు లేదా రత్నములు, నెయ్యి, నువ్వులు, కృష్ణాజినము, ఛాగవస్త్రము అనగా గొర్రె ఉన్నితో చేసిన గొంగడి మరియు కృష్ణమార్జాలము అనగా నల్లని పిల్లి మొదలగునవి ఇంటియందు ఉండుటవలన ఎట్టి దురితములు బాధించకుండును. ఇవన్నియు పవిత్రమైనవి. ఇంకనూ శుకపక్షి అనగా చిలుక. సారస పక్షి అనగా బెగ్గురుపిట్ట వీటిని కూడా ఇంటిలో పోషించుకొనవలెను. దానితోపాటు గృహస్థునకు గోపోషణము అతి ముఖ్యమైనది. తమ ఇంటిలో గోవు ఉండుటవలన సమస్త పాపములు సమసిపోవును. గృహస్థు ప్రతిదినము దేవపూజ యొనర్పవలెను. ప్రాతఃకాలముననే అనగా సూర్యోదయమునకు

పూర్వమే నిదురనుండి మేల్కొనవలెను. ఇంటిని చక్కగా ఊడ్చి తడిగుడ్డతో శుభ్రమొనర్చవలెను. దేవగృహమును ఆవుపేడతో అలికి, రంగవల్లులతో అలంకరించి సుశోభితము చేయవలెను. బంగారము, వెండి, ఇత్తడి లేదా మట్టిపాత్రలను దైవపూజకు ఉపయోగింపవలెను. వాటిని స్వయముగా శుద్ధియొనర్చవలయును. కంచు పాత్రలు పనికిరావు. కన్యలు, కొత్త పెళ్ళికూతురు, శూద్రజాతికి చెందిన స్త్రీలు పూజాపాత్రలను శుద్ధి చేయకూడదు. వస్త్రమును ఎడమచేతితో పట్టుకొని అలుకకూడదు. తడిగుడ్డను తీసికొని నైఋతి మూలనుండియే ప్రారంభింపవలెను. ఈ పని రాత్రివేళ చేయకూడదు. తప్పనిసరయినచో భస్మముతో శుద్ధి చేయవలెను. చక్కగా శుభ్రపరచుకొన్న దేవగృహమునందు సుఖాసనమునందు కూర్చొని దేవపూజను చేయవలెను. సంధ్యోపాసన వలెనే బ్రాహ్మణుడు నిత్యము దైవపూజను కూడా తప్పనిసరిగా చేసి తీరవలెను. త్రికాలములయందు దైవపూజను చేయవలెను. కుదరని పక్షమున ప్రాతఃకాలమునందు భక్తిశ్రద్ధలతో, అత్యంత సంతోషాంతరంగుడై దేవపూజను చేయవలెను. సాయంకాలము భక్తితో మంత్రమును ఉచ్చరించి పుష్పములను సమర్పింపవలెను. మానవజన్మను పొంది దైవపూజను చేయనివారు శీఘ్రముగ యమపురమునకు వెళ్ళి శాశ్వతముగా నరకబాధలను అనుభవించెదరు. బ్రాహ్మణ కులమున జన్మించి, సంతోషాంతరంగుడై దేవపూజను చేయనివాడు, వైశ్వదేవమును చేయనివాడు నరకయాతనలు అనుభవించును. (5-17)

దైవపూజకు ఆరువిధముల పద్ధతులు ఉన్నవి. అందులో మొదటిది ఉదకమును నారాయణ స్వరూపముగా భావించి దానితో చక్కగా పూజించుటవలన జగన్నాథుడు తృప్తి చెందును. రెండవ పద్ధతిలో అగ్నిపూజ మిగుల శ్రేష్ఠమైనది. దానికంటే మానసికపూజ మరింత విశేషము అని గ్రహింపవలెను. సూర్యుని పూజించుటవలన నారాయణుడు సంతుష్టుడగును. స్థండిల పూజ అనగా హోమహవనాదులకు స్థండిలమును సిద్ధపరచి దానియందు ప్రతిమను పెట్టి పూజించుట మరొక పద్ధతి. కాని, ఇది సామాన్య పక్షమునకు తెలియదు. ఇక ప్రతిమను పెట్టి పూజించుట అల్పమైనది. జ్ఞానులైన బుద్ధిమంతులు, శక్తిగలవారు, యజ్ఞమును ఆచరించువారు, యజ్ఞపురుషుని ఆరాధించుట శ్రేష్ఠము. బ్రాహ్మణులు గోపూజను ఆచరించుట అత్యంత విశిష్టమైనది. మనస్ఫూర్తిగా గురుపూజను చేసినయెడల త్రిమూర్తులు మహదానందభరితులై అనుగ్రహింతురు. సమస్త శ్రుతులు గురువును త్రిమూర్తులని పేర్కొనుచున్నవి. వారిద్వారా సమస్త అభీష్టములను, చతుర్విధ పురుషార్థములను పొందవచ్చును. అయితే, కలి ప్రవేశించినందున మానవులు తమ అంతఃకరణమును స్థిరముగ, శుద్ధముగ ఉంచుకొనకపోవుటచే శారంగధరుడగు విష్ణువే లోకులనందరిని ఉద్ధరించుటకొరకై అవతరించెను. ఆ హృషీకేశుడు చక్రాంకితమైన సాలగ్రామమును ప్రకాశింపచేసి, లోకమునందు దానిని ప్రకటము చేసెను. అట్టి సాలగ్రామమును సాక్షాత్తుగ విష్ణుస్వరూపముగ భావించి, కడు భక్తిభావముతో సాలగ్రామపూజ యొనర్చి,

అర్ఘ్య తీర్థమును స్వీకరించుటవలన సమస్త పాపములు నశించిపోవును. కలియుగ ప్రభావమువలన భక్తివిశ్వాసములు సడలిపోయి జనులు దేవపూజను మానుకొని అథోగతి పాలగుచుండిరి. కావున, శ్రీగురుమూర్తిని ఆశ్రయించి, వారివలన పూజావిధానమును తెలిసికొని గురువు ఉపదేశించిన విధముగా దేవతారాధన చేయవలెను. గురువుయందలి లక్ష్యము వలెనే కర్రతో, రాతితో చెక్కబడిన విగ్రహములు ప్రత్యక్ష దేవతామూర్తులై మనకు చక్కని ఫలములను ప్రసాదించెదరు. శూద్రులు, బ్రాహ్మణ స్త్రీలు, వేదమంత్రములను ఉచ్చరించకూడదు. కావున, వారు గురువుద్వారా పురాణోక్త ప్రకారముగ పూజను తెలిసికొని దేవపూజను చేయవచ్చును. ముందుగా శుభ్రమైన మడి వస్త్రమును ధరించవలెను. తదుపరి దీపమును వెలిగించవలెను. పిమ్మట సుఖమైన ఆసనమునందు కూర్చొని ముమ్మారు ప్రాణాయామము చేసి **'యేభ్యోమాతా'** అని పరమాత్మను జాగృతము చేయవలెను. అనగా- ఎదురుగా నున్న ప్రతిమయందుగల లేదా, హృదయమునందుగల దేవకళను జాగృతపరచవలయునని అభిప్రాయము. పంద్రెండుమార్లు ప్రణవమంత్రమును ఉచ్చరించి, ఉదకముతో శరీరమును ప్రోక్షించుకొనవలెను. తదుపరి ప్రాణాయామము చేసి, సంకల్పము చెప్పుకొని న్యాసమును పూర్తి చేయవలెను.

అనంతరము కలశ పూజను, శంఖ పూజను సభక్తికముగ పూర్తిచేయవలెను. కలశమును దేవుని కుడిభాగమునందు ఉంచవలెను. దైవముపై ముందు రోజు పెట్టిన పుష్పములు, తులసిదళములు మొదలైన నిర్మాల్యములను భక్తిశ్రద్ధలతో నెమ్మదిగా తొలగించి వినయముగ నమస్కరించి, నైఋతి దిశవైపు పడవేయవలెను. శ్రీగురుమూర్తిని మనమునందు స్మరించి, మనోవాక్కాయ కర్మలతో విధిగా పీఠపూజ యొనర్పవలెను. నాలుగు ద్వారములను పూజించి, దిశలను అర్చించి, పీఠపూజను పూర్తి చేయవలెను. (18-34)

తదుపరి శాస్త్రోక్తరీతిగా షోడశోపచారములతో పురుషసూక్త విధానముగ దైవమును పూజింపవలెను. **'శాంతాకారం భుజగశయనం'** అనే శ్లోకము పఠించి, చక్కగా ధ్యానించి మంత్రోక్తముగ ఆవాహనము చేయవలెను. **'సహస్రశీర్షా'** అను మంత్రముతో ఆవాహనము చేసి, **'పురుష ఏవేదం'**తో ఆసనమును సిద్ధపరచి, భగవంతుని కూర్చుండజేసి, **'ఏతావానస్య'** అను మంత్రముతో స్వాగతించిన దైవమునకు పాద్యమును సమర్పింపవలెను. **'త్రిపాదూర్ధ్వ'** అను మంత్రముతో అర్ఘ్యమును, **'తస్మాద్విరాడజాయత'** అను మంత్రముతో ఆచమనమును, **'యత్పురుషేణేతి'** అను మంత్రముతో అభిషేకమును చేయవలెను. ఇచట పంచామృతములతో, నారికేళ జలముతో సిద్ధపరచుకొన్న నిర్మలమైన, పవిత్రమైన జలముతో శ్రీ స్వామివారికి అభిషేకము చేయవలెను. ఇందుకుగాను, పురుషసూక్తాది పంచసూక్తములను, నమకచమకములను పఠింపుచూ అభిషేకింపవలెను. అనంతరము స్వామిని శుభ్రమైన, మెత్తటి వస్త్రముతో తడి లేకుండగా నెమ్మదిగా అద్ది సుఖాసనమునందు

కూర్చుండచేయవలెను. తదుపరి **'తం యజ్ఞం'** అను మంత్రముతో వస్త్రమును, **'తస్మాద్యజ్ఞాత్'** అను మంత్రముతో యజ్ఞోపవీతమును, **'తస్మాద్యజ్ఞాత్సర్వహుతః'** అను మంత్రముతో గంధాక్షతలను, **'తస్మాదశ్వా'** అను మంత్రముతో పుష్పములను సమర్పింపవలెను. స్వంతముగా నాటి పోషించిన మొక్కలనుండి గ్రహించిన పుష్పములతో పూజించుట శ్రేష్ఠమైన పద్ధతి. అడవిలో లభించే పూలను సమర్పించుట మధ్యమ పద్ధతి. ధనమును వెచ్చించి తెచ్చిన పుష్పములతో పూజించుట సామాన్యమైన పద్ధతి. పుష్పములలో తెల్లనివి శ్రేష్ఠమైనవి. ఎరుపు రంగు కలిగినవి మధ్యమము. పచ్చనివి అధమము. నల్లనివి చిత్రవిచిత్రమైన రంగులు కలిగినవి అధమాధమములు. పాచిపువ్వులను సమర్పింపకూడదు. చిరిగిపోయినవి, పురుగులు పట్టినవి, నేలమీద రాలినవి వాడకూడదు. ద్రవ్యము పాచి కాదు. బిల్వపత్రములు, తులసీదళములు, సహస్రదళ కమలములు ఎల్లప్పుడూ దైవమునకు అర్పింపదగినవి అని గుర్తించవలెను. శతపత్రములు, పొగడలు, సంపెంగలు, ఎర్ర కలువలు, పున్నాగములు, మల్లెలు, సన్నజాజులు, గన్నేరు, తెల్లకలువ మొదలగు పుష్పములతో అర్చింపవలెను. విష్ణుపూజకు ఉమ్మెత్త, జిల్లేడు, ఎరుపు పుష్పములను వాడకూడదు. గోగు, కొండగోగు, వావిలి, కానుగు, మునగ, వెలగ, ఉసిరి పత్రములు, గుమ్మడిపూలు మున్నగువాటితో విష్ణువును పూజింపకూడదు. జిల్లేడు పుష్పములను విష్ణువుకు సమర్పించుటవలన ముప్పు వాటిల్లును. ఉమ్మెత్తపువ్వుల వలన ప్రజ్ఞ నశించును, కాంచన (కోవిదార) పూలవలన దారిద్ర్యము పట్టుకొనును. గిరికర్ణిక (కొండగోగు) వలన కులక్షయమగును. కంటకారి (ముండ్ల) పుష్పములవలన శోకము లభించును. కుంద[1] పుష్పముల వలన దుఃఖము, శాల్మలీ[2] పుష్పములతో రోగము కలుగును కనుక, వివేకవంతులైనవారు శాస్త్రీయముగా చెప్పబడిన సరియగు పుష్పములతోడనే విష్ణువును పూజింపవలెను. ఇక, శంకరుని పూజలో వెలగ, కేతకి, శశాంక పుష్పములను, నల్లని నీలిపుష్పములను వర్జింపవలెను. నల్లనివి, పచ్చనివి, కరంజములు (కానుగు), ధాతకి (ఆరెపూవు), వేప, పంచక, పొగడ, దానిమ్మ, కేతకి (మొగలి), మాధవీపుష్పములతో పూజింపకూడదు. మామిడి, సన్నజాజి, విరజాజి, కుంద, అడవిమొల్ల, జాజి ఎరుపు పుష్పములను త్యజింపవలెను. ఈ పుష్పములతో ఈశ్వరార్చన చేయుటవలన దోషము కలుగును. ఈశ్వరుని పూజించుటకు తెల్లని పుష్పములు అత్యంత శ్రేష్ఠములు. (34-56)

గణేశుని పూజించుటకు తులసిని వాడకూడదు. కాని, దూర్వము అనగా గరిక శ్రేష్ఠమైనది. దుర్గాదేవి వంటి శక్తిదేవతల అర్చనకు దూర్వమును వాడకూడదు. శాస్త్రవిధిని అనుసరించి పుష్పములను సేకరించి పూజించినచో శీఘ్రముగ తగు ఫలితము సిద్ధించును.[3]

---

1. మొల్ల, గన్నేరు; 2. బూరుగు

3. పుష్పసంపాదనమును గూర్చి "నిత్యకర్మ - పూజాప్రకాశిక" లోని పూజాప్రకరణములో పుష్పార్చనము (820 పుట)లో మరిన్ని విశేషములు చూడవచ్చును.

'యత్పురుషం' అను మంత్రముతో సుగంధ పరిమళ ధూపమును, **'బ్రాహ్మణోస్య'** అను మంత్రముతో ఏకారతి లేదా దీపమును చూపవలెను. **'చంద్రమా మనసో'** అను మంత్రముతో నైవేద్యమును సమర్పింపవలెను. **'నాభ్యాఆసీ'** అను మంత్రముతో తాంబూలమును సమర్పింపవలెను. **'సప్తాస్యాసన్'** అను మంత్రముతో సువర్ణ పుష్పయుక్తమైన నీరాజనమును, **'వేదాహమేతం'** అను మంత్రంతో పుష్పాంజలిని అర్పించవలెను. **'ధాతాపురస్తాత్'** అను మంత్రముతో నమస్కారమును చేయవలెను. నమస్కారము చేయునపుడు మరీ ఎదురుగా నిలబడిగాని, దైవమునకు వెనుకవైపు నుండి గాని, గర్భగృహములో నిలిచి గాని, నమస్కరింపకూడదు. దైవమునకు అపసవ్యముగా అనగా ఎడమవైపు నుండి ప్రదక్షిణము ప్రారంభించి, నమస్కరింపవలెను. గురువు, తల్లి, తండ్రి, బయటకు వెళ్ళి వచ్చుచున్నప్పుడు వారికి ఎదురుగా వెళ్ళి నమస్కరింపవలెను. ఉత్తమ బ్రాహ్మణుడు కనిపించిన వెంటనే ఎదురుగా వెళ్ళి నమస్కరింపవలెను. బ్రాహ్మణ సభలో దేవతార్చనలోవలె ఒకేసారి సమష్టిగా నమస్కరింపవలెను. తల్లికి, తండ్రికి, గురువునకు రెండు చేతులతో చెవులను స్పృశించి అనన్యభావముతో వినయపూర్వకముగా వారి కుడిపాదమును తమ కుడిచేతితో, ఎడమపాదమును ఎడమచేతితో స్పృశించి వందనమును ఆచరింపవలెను.(1) తల్లి, తండ్రి, గురువు, సంరక్షకుడు, భయహర్త అనగా ప్రాణదాత, అన్నదాత, పురోహితుడు, పురోహితుని భార్య వీరందరు గురుస్థానముగా, గురుతుల్యులు అని నిశ్చయముగా భావించి, నమస్కరించవలెను. జ్యేష్ఠభ్రాత లేదా తండ్రి సోదరుడు (చిన్నాయన), సవతి తల్లి, వయసులో తనకంటే పెద్దవారైన అప్పలు, మిత్రులు, ఇష్టులు అయిన వారందరికి నమస్కరింపవలెను. తమకంటే వయసులో చిన్నవారైన వారికి నమస్కరించకూడదు. అగ్ని, సమిధలు, పుష్పములు, దర్భలు చేత ధరించినవారికి, అక్షతలు, కలశము, చేతిలో గలవారికి నమస్కరించుటవలన ఉభయులకూ దోషమే వాటిల్లును. జపము, హోమము చేయుచున్నప్పుడు, దూరమునుండి బ్రాహ్మణులు వచ్చుటను గమనించినపుడు, స్నానము చేయునపుడు నమస్కరింపకూడదు. పరుగెత్తే విప్రునకు, అపరిచిత వ్యక్తికి, ధనగర్వితునకు, క్రోధోద్రిక్తునకు, మంగళస్నానము చేయువానికి నమస్కరించుటవలన దోషము కలుగును. బ్రాహ్మణునకు ఒకచేతితో నమస్కరింపకూడదు. శవమునకు, మూర్ఖులకు నమస్కరించకూడదు. గీత, వాద్య, నృత్యములతో దైవమును సంతుష్టపరచవలెను. పూజానంతరము సనకాది మహర్షులను అర్చించవలెను. సూతకము వచ్చినవారు ప్రార్థన మాత్రమే

---

1. వ్యత్యస్త పాణినాకార్యం పాదయోర్గ్రహణం గురోః। సవ్యేన సవ్య స్ప్రష్టవ్యో దక్షిణేన చ దక్షిణః॥ తమ రెండు చేతులను వ్యత్యస్తముగా నుంచి అనగా కుడిచేతితో కుడిపాదమును, ఎడమచేతితో ఎడమ పాదమును తాకవలెను. అప్పుడు కుడిచేతిని పైన ఉంచి, దాని క్రింద ఎడమచేతిని ఉండునట్లుగా జాగ్రత్త పడవలెను. ఈవిధంగా శ్రీగురుచరణములను స్పృశించి వందనము చేయవలయును. (మనుస్మృతి 2/72.)

చేయవలెను. దైవపూజను ముగించి, పీఠముపై చేతులను పెట్టి అత్యంత హర్షముతో ఉత్తరపూజను చేసి ఉద్వాసన పలకవలెను. ఈవిధముగ ద్విజులందరు నిత్యము దేవపూజను భక్తిశ్రద్ధలతో ఆచరింపవలెను.(57-78)

అన్నసంస్కారము కొరకై వైశ్వదేవమును చేయవలెను. అగ్నిపూజ చేసి అన్నమును, అగ్నికుండమునకు చూపి, నేతితో కలిపి ఐదుభాగములుగా చేయవలెను. ఒక భాగమునందలి ఆరు ఆహుతులను తీసికొని, రెండవది బలిహరణములో వేసి, మూడవదానిని నాలుగు ముద్దలుగా అతిథి లేదా ఆవుకు వేసి, నాల్గవ భాగముతో పితృయజ్ఞము చేయవలెను. ఐదవది మనుష్య యజ్ఞము. ఇట్లు సమంత్రకముగ వైశ్వదేవమును చేయవలెను. అన్నము లేనిరోజున బియ్యముతో చేయవలెను. వైశ్వదేవ సమయమున తన ఇంటికి అతిథి వచ్చిన యెడల అతడు చోరుడైనా, చండాలుడైనా లెక్కింపకుండా మనస్ఫూర్తిగా దైవభావముతో, విష్ణుభావముతో అతనిని పూజించి, భోజనమును పెట్టవలెను. అట్టివాని నామ, గోత్రములను ప్రశ్నింపకూడదు. తలిదండ్రులకు ఘాతుకము చేసిన పాపులు, కుక్కలు, చండాలురు ఎవరైననూ సరే, వైశ్వదేవము చేయుచున్న సమయమున తమ ఇంటికి అతిథిగా వచ్చినవారిని కాదనకుండా దైవము పంపిన స్వరూపముగా, విష్ణుస్వరూపముగా భావించి, ప్రేమతో భోజనమును పెట్టవలెను. ఎవరి ఇంటియందు వచ్చిన అతిథి నిరాకరింపబడి, విముఖులై వెళ్ళిపోయెదరో, వారిని పితృదేవతలు శపించెదరు. అట్టి గృహమునకు పదహారు సంవత్సరములపాటు పితృదేవతలు రారు. ఒకవేళ తాము పరదేశము వెళ్ళినచో ఔషధము, పెరుగు, పాలు, కందమూలములు, ఫలములతో దేవయజ్ఞమును చేయవలెను. అన్నము లేకుండా అగ్రదానము చేయకూడదు. అన్నము లేని పంచమహాయజ్ఞము చేసిన యెడల ప్రాయశ్చిత్తముగా బ్రాహ్మణుడు చాంద్రాయణమును ఆచరింపవలెను. తమ ఇంటియందు వైశ్వదేవము చేయకముందే, ఒకవేళ ఎవరైననూ భిక్షకు వచ్చిన యెడల అట్టి వారలకు మాధూకరమును ఇవ్వవలెను. అట్టివారికి వైశ్వదేవము చేసిన పుణ్యము సిద్ధించును. పాపములు తొలగిపోవును. బలిహరణమును సమర్పించి వెంటనే దానిని తీసివేసినచో, ప్రాయశ్చిత్తముగ చాంద్రాయణమును ఆచరింపవలెను. కావున, తాము తీయకుండా వేరొకరిచేతితో తీయించవలెను. బలిహరణము లేకుండా ఒకవేళ భోజనము చేసినచో, ఏడుమార్లు ప్రాణాయామము చేసిన యెడల దానివలన సంక్రమించెడు పాపము తొలగిపోవునని శ్రీగురుమూర్తి బ్రాహ్మణునకు వివరించుచుండెను. (79-91)

గృహస్థుడు ఒకవేళ నిత్యశ్రాద్ధమును వదలిపెట్టిననూ దైవపూజ చేసిన పిమ్మట గోవును పూజించి నిత్యము విశేషముగా గోగ్రాసమును సమర్పించుచుండవలెను. బ్రహ్మచారులు స్వధాకార పిండదానము, అగ్నౌకరణము చేయకూడదు. అట్లే తాంబూల దాన దక్షిణలను వర్జింపవలెను. ఇక గృహస్థుడు వైశ్వదేవము ముగించిన పిమ్మట ద్వారమునందు నిలబడి అతిథులకోసమై నిరీక్షింపవలెను. అతిథి వచ్చిన యెడల భక్తితో

పూజింపవలెను. సూర్యుడు అస్తమించిన పిమ్మట అతిథి వచ్చిన యెడల అతనిని నిరాకరింపకూడదు. ఇంటికి వచ్చిన అతిథి తృప్తినొందిన యెడల బ్రహ్మ, ఇంద్ర, వరుణ, వాయు, కుబేర, వహ్ని, అర్యమాదిదేవతలు సాక్షాత్తు సదాశివుడు మిగుల సంతృప్తి చెందెదరు. ఏకాగ్రచిత్తముతో చేసిన అతిథిపూజకు సమస్తదేవతలు సంతృప్తి చెందెదరు. **'వర్ణానాం బ్రాహ్మణో గురుః'** అను శాస్త్రవచనము అనుసరించి వచ్చిన అతిథిని గురుభావముతో పూజింపవలెను. అతిథియొక్క పాదములు కడిగినచో పితృదేవతలు తృప్తిచెందెదరు. అన్నదానము వలన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు తృప్తినొందెదరు. యతీశ్వరులు, బ్రహ్మచారులు భిక్షార్థముగా వచ్చినవారికి ఇచ్చే భిక్ష మేరువుతో సమానమగును. వారికిచ్చే జలము సముద్రముతో సమానమగునని శాస్త్రవచనము. ఇంటికి వచ్చిన అతిథిని వదలిపెట్టి తాము భోజనము చేయువారు శ్వానయోనిలో జన్మించెదరు. అనంతరము గాడిదగా పుట్టెదరు. కావున, వచ్చిన అతిథులను ముందుగా పూజించి వారికి భోజనమును పెట్టిన పిమ్మటనే తాము భుజింపవలెను. అంతేకాక, వచ్చిన అతిథికి ఒక విధమైన భోజనమును పెట్టి, తాను మరొకవిధమైన ఆహారమును స్వీకరించినచో పంక్తిభేదము వలన మహాదోషము వాటిల్లును. గృహస్థులు సాయంకాలము, ఉదయకాలము సంతోషముతో, పవిత్రభావముతో భగవన్నామ స్మరణపూర్వకముగా భోజనము చేసి చేతులను శుభ్రపరచుకొని, పాదములను కడుగుకొనవలెను. తడిపాదములతోనే ఉండవలెను. తడి ఐదు స్థానములయందు ఉండవలెనని శాస్త్ర వచనము. రెండు కాళ్ళు, రెండు చేతులు, ముఖము తడిగా యుండినచో, అతడు శతాయుష్మంతుడగును. భోజన సమయమునందు తమ ఇంటిలో తూర్పువైపునకు తిరిగి, రెండు పాదములను సమానముగా కలిపి, మౌనమును పాటించి, ఏకాగ్రచిత్తముతో కూర్చొనవలెను. (92-106)

చతురస్రముగా మండలమును చేసి పైన భస్మమును చల్లవలెను. ఇట్టి మండలమును బ్రాహ్మణుడు చతురస్రముగా, క్షత్రియులు త్రికోణముగా, వైశ్యులు వర్తులాకారముగా చేయవలెను. శూద్రుడు అర్ధచంద్రాకార మండలమును చేయవలెను. దానిపైన సురవరులగు ఆదిత్యుడు, వసువు, రుద్ర, బ్రహ్మలను మరియు పితామహాది దేవతలను ఆవాహనము చేయవలయును. కావున, మండలము లేకుండా భోజనము చేయకూడదు. ఒకవేళ మండలము చేయకుండా భోజనము చేసిన యెడల పిశాచములు, అసురులు, రాక్షసులు అన్నరసమును యెత్తుకొనిపోయెదరు. తూర్పుముఖముగా కూర్చొని భుజించుట ఉత్తమము. పశ్చిమాభిముఖముగా కూర్చొనుట మధ్యమము. పితృకార్యములయందు ఉత్తరాభిముఖుడై కూర్చొనవలెను. ఎల్లప్పుడూ దక్షిణాభిముఖముగా కూర్చొనవలెను. బంగారము, వెండి, రాగి, కాంస్య పాత్రలయందుగాని, పద్మపత్రముల యందు గాని, పలాశ పత్రముల యందు గాని భుజించుట శ్రేష్ఠము. గృహస్థులు రాగిపాత్రను

వర్జింపవలెను. యతులు బంగారము, వెండి, రాగి, ముత్యపు చిప్పలు, శంఖము, స్ఫటిక, రాతి పాత్రలను వాడకూడదు. వారు అరటి, తామర, మోదుగ ఆకు విస్తళ్ళలో భుజించినచో, చాంద్రాయణవ్రతమును ఆచరించవలెను. మఱ్ఱి, అశ్వత్థ, పొట్ల, కదంబ, కోవిదార పత్రములలో భుజించినచో వెంటనే చాంద్రాయణ వ్రతమును ఆచరింపవలెను. తామ్ర, మట్టి, లోహ పాత్రలలో భుజించినగాని, పత్తి ఆకులు లేదా వస్త్రము మీద భోజనము చేసినచో నరకమునకు వెళ్ళెదరు. కాంస్యపాత్రలో భోజనము చేయుటవలన యశస్సు, బలము, ప్రజ్ఞ, ఆయువు అధికముగా పెరుగును. గృహస్థులకు కంచుపాత్ర ముఖ్యమైనది. అది ఐదు శేర్ల బరువు ఉండవలెను. కంచుపాత్రలో భోజనము, తాంబూలము, అభ్యంగనము గృహస్థులకు ముఖ్యమైనది. యతులు, బ్రహ్మచారులు, వితంతువులు వీటిని వర్జింపవలెను. ఆముదపు ఆకుల విస్తరిలో తినుట కుక్కచర్మము కన్నా హీనమైనది. అది నిషిద్ధం. ఇతరులు తిన్న విస్తరిలోగాని, పాత్రలోగాని తినుట అంతకంటే మరింత నిషిద్ధము, నీచము అని గ్రహింపవలెను. విరిగిన కంచుపాత్రలో భోజనము చేయుట మహాదోషము. సంధ్యాకాలమునందు భోజనము చేయుటవలన మహాపాతకములు చుట్టుకొనును. (107-121)

శూద్రులు భుజింపగా మిగిలిన దానిని బ్రాహ్మణులు తినకూడదు. సమీపమున పతితులు ఉండి చూచుచుండగా భోజనము చేయుట పనికిరాదు. శ్రాద్ధ దినమున తమ పిల్లలతో కలిసి ఏకపాత్రలో భుజించకూడదు. బ్రాహ్మణులు తమ ఆసనమును తామే వేసుకొనకూడదు. తన చేతితో తానే అభ్యంగన మొనర్చుకొనకూడదు. భోజనకాలమున తన మండలమును తానే చేయకూడదు. అట్లు చేయుటచే పుత్రఘాతకమగును. అన్నము వడ్డించినపుడు నమస్కరింపవలెను. అన్నమును వడ్డించునపుడు విస్తరిలో ముందుగా నేతిని వేయవలెను. ప్రాణాహుతులు తీసుకొనే సమయములో స్వహస్తములతో నేయిని వేసుకొనకూడదు. అన్నమును దూషింపక నమస్కరించి భుజింపవలెను. చేతిలో ఉదకమును తీసుకొని వ్యాహృతీ మంత్రముతో సంప్రోక్షించి అన్నమును పవిత్రమొనర్పవలెను. అటులే ప్రక్కన ఉదకమును చల్లి చిత్రగుప్తునకు నమస్కరించి బలి సమర్పించిన పిమ్మట, ఎడమచేతితో దానిని తీసివేసి చేతిని కడుగుకొని, పాత్రను దృఢముగా పట్టుకొనవలెను. ఎడమచేతి బొటనవ్రేలు, చూపుడువ్రేలు, మధ్యవ్రేలితో పాత్రను పట్టుకొని కుడిచేతితో ఆపోశనమునిచ్చి ఇతరులచేతిలో వేయవలెను. ఆపోశన ఉదకము వదలివేసి వేరే నీరు తీసుకొనినచో, శ్వానమూత్రము తీసుకొన్నట్లుగా అగును. బ్రాహ్మణులు ఆపోశన చేసిన వారికి ఇతరులు నమస్కరించుటచే మహాదోషము వాటిల్లును. వారి నుండి ఆశీర్వచనమును పొందకూడదు. అట్లు చేసినచో ఉభయులకూ మహాదోషము సంప్రాప్తమగును. మౌనముగా ఉండి ఎట్టి శబ్దములను ఉచ్చరించకుండా మంత్రపూర్వకముగా ఆపోశనమునిచ్చి ప్రాణాహుతులను స్వీకరింపవలెను. ఆపోశన

లేకుండ భోజనము చేసినచో కలిగే పాపమును నశింపచేయుట కొరకు అష్టోత్తరశత సంఖ్య గాయత్రీ మంత్రమును జపింపవలెను. ప్రాణాగ్నిహోత్రము చేయుటవలన సమస్త పాపములు దగ్ధమైపోవును. ముందుగా అన్నమును స్పృశించి, గీతాశ్లోక మంత్రమును స్పష్టముగా పఠింపవలెను. (122-136)

శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః । ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ [1]అనే ఈ శ్లోకమును పఠించి **'అన్నం బ్రహ్మా రసో విష్ణుః భోక్తాదేవో గిరిజారమణః'**[2] అని భావించి **'అగ్నిరస్మి'** అను మంత్రమును చెప్పవలెను. (137-138)

అనంతరము చూపుడు వ్రేలు, మధ్య వ్రేలు, బొటన వ్రేలు పట్టుకొని ఐదు ఆహుతులను సమంత్రకముగా స్వీకరింపవలెను. చూపుడు వ్రేలు, మధ్యవ్రేలు, బొటన వ్రేలితో ఆహుతిని స్వీకరించి **'ప్రాణాయస్వాహా'** అని చెప్పి ప్రాణాహుతిని వేసుకొనవలెను. తరువాత మధ్యమ, అనామిక, బొటనవ్రేలితో **'అపానాయస్వాహా'** అని, అనామిక, చిటికెనవ్రేలు, బొటనవ్రేలితో **'వ్యానాయ స్వాహా'** అని, బొటనవ్రేలు, చూపుడు వ్రేలు, చిటికెన వ్రేలుతో **'ఉదానాయ స్వాహా'** అని, ఐదు వ్రేళ్లతో సమానముగా **'సమానాయ స్వాహా'** అని చెప్పి ప్రాణాహుతులను వేసుకొనవలెను. అప్పుడు అన్నము దంతములకు తాకకుండా జాగ్రత్తపడవలెను. నాలుకతో వెంటనే మ్రింగి మౌనమును వహించవలెను. భోజన సమయమునందు, స్నాన సమయమునందు, హోమము చేయు సమయమునందు మౌనమును వహించని యెడల లక్ష్మీదేవి వెంటనే తమ ఇంటినుండి వెళ్ళిపోవును. అట్టివారికి అపమృత్యువు సమీపించును. ఒకవేళ పూర్తి భోజన సమయము మౌనము వహించుటకు అశక్యమైనచో, ప్రాణాహుతులు వేసుకొనేంతవరకైననూ మౌనము వహించవలెను. తండ్రి జీవించియున్నవారు, జ్యేష్ఠభ్రాత జీవించియున్నవారు తప్పక మౌనమును పాటించవలెను. శ్రాద్ధాన్నమును భుజించునప్పుడు మౌనముగా ఉండవలెను. పంచప్రాణాహుతులను స్వీకరించునప్పుడు అందరూ మౌనమును పాటించవలెను. భోజనము చేయుటకు ముందుగా మధురపదార్థములు స్వీకరింపవలెను. తరువాత ద్రవాన్నమును తినవలెను. అనంతరం కఠినాన్నమును స్వీకరింపవలెను. భోజనానంతరము అనగా చివరగా పలుచని పదార్థములు భుజింపవలెను. ఒక ఆవు నీటిని త్రాగునంత సమయములోగా శీఘ్రముగ భోజనము చేయవలెను. శీఘ్రభోజనము వలన సౌఖ్యము సిద్ధించును. సన్న్యాసులు, మునీశ్వరులు, ఎనిమిది గ్రాసములు అనగా

---

1. శ్రీభగవానుడు ఇట్లు నుడివెను - ప్రాణాపానములతోగూడిన వైశ్వానరాగ్ని స్వరూపమును ధరించి సమస్త ప్రాణులయొక్క దేహములయందు నేనే యుందును. శరీరధారులు భుజించే నాలుగు విధాలైన ఆహారపదార్థములను వైశ్వానరాగ్నిరూపముతో నేనే చక్కగా జీర్ణింపచేయుదును అని శ్లోకతాత్పర్యము. (గీత. 15/14)
2. **అన్నం బ్రహ్మా రసో విష్ణుః భోక్తాదేవో మహేశ్వరః । ఏవం ధ్యాత్వా తు యో భుంక్తే సోఽన్నదోషైర్నలిప్యతే ॥** అనగా అన్నం బ్రహ్మస్వరూపం. అందలి రుచి విష్ణు స్వరూపం. ఇక భుజించేవాడు మహేశ్వరుడు అని ఈ రీతిగా ఎవరైతే ధ్యానించి భుజించెదరో, వారికి ఎటువంటి అన్నదోషములు అంటనే అంటవు.

ఎనిమిది ముద్దలు ఆహారమును తీసుకొనవలెను. వానప్రస్థాశ్రమము నందుగల పురుషులు పదహారు గ్రాసములు అనగా ముద్దలు, గృహస్థులు ముప్పది రెండు గ్రాసములు తీసుకొనవచ్చును. బ్రహ్మచారులకు పరిమితిలేదు. తమ నోటిలో ఎంత పట్టునో అంతే ముద్దను స్వీకరింపవలెను. సగము ముద్దను మ్రింగి, సగము పాత్రలో పెట్టిన యెడల చాంద్రాయణ వ్రతమును ఆచరింపవలెను. అది ఉచ్ఛిష్ట భోజనమగును. ఒక గ్రాసములో కొంత తిని మధ్యలో జలమును త్రాగి తిరిగి భక్షించుటవలన ఉచ్ఛిష్టభోజనమందురు. అట్లు చేయుట కూడ పనికిరాదు. భోజనమునందు పాయసము, నేయి పారవేయకూడదు. ఆప్తులతో, బంధువులతో కలిసి ఒకే పాత్రలో భుజింపకూడదు. ఉపనయనము గాని పుత్రులతో, పెళ్ళికాని కుమార్తెలతో ఏకపాత్రలో తినుటవలన దోషము లేదు. అన్నమును వదలివేయకూడదు. నేతిని, పాయసమును అసలే పారవేయకూడదు. చివరగా అన్నము ఒక గ్రాసము మాత్రము వదలి వేయవలెను. (139–156)

భోజనము పూర్తి చేయువరకు ఎడమచేతితో పాత్రను పట్టుకొనవలెను. పొరపాటున దానిని వదలివేసినచో ఆహారమును వదలిపెట్టవలెను. కావున, విద్వజ్జనులు పాత్రను వదలకూడదు. తలకు వస్త్రమును చుట్టుకొనిగాని, దక్షిణమునకు ఎదురుగాగాని, ఎడమ పాదముమీద గాని చేయి వేసి భోజనము చేసినచో, అట్టి ఆహారమును రాక్షసులు తీసుకొనిపోయెదరు. నేలమీద ఎడమచేతిని పెట్టి భోజనము చేయువారికి రోగము కలుగును. ఐదు వ్రేళ్ళను సమముగా పెట్టి భోజనము చేయవలెను. అశ్వమును, గజమును ఎక్కినపుడు, స్మశానమునందు, దేవాలయమునందు, పడుకొనుచోట భోజనము చేయకూడదు. తడిబట్టలు ధరించి, తడి జుట్టుతో, చేతిలో పళ్లెము పట్టుకొని, నిలబడి భోజనము చేయుట నిషిద్ధము. భోజనము చేయు చేతిని మోకాలి బయటకు పెట్టి భోజనము చేయుట మహాదోషమగును. యజ్ఞోపవీతమును ఎడమ భుజముమీద, కుడిచేతి క్రిందుగా వేసుకొని భోజనము చేయవలెను. భోజనము చేయునపుడు తమకెదురుగా పాదరక్షలు ఉండకూడదు. ఒక ముద్దను, నీటిని, దుంపలను, పండ్లను, చెరకును తిని శేషమును పాత్రలో పెట్టినచో అది ఉచ్ఛిష్టమగును. స్నానము చేయకుండా భోజనము చేసినచో, హోమము లేకుండా భోజనము చేసినచో అది అన్నమనబడదు. పురుగులే యగును. ఆకులమీద గాని, రాత్రి పూట దీపము లేకుండగా గాని భోజనము చేయువారికి మహాదోషము లభించుటయేగాక, పురుగులను తిన్నంతటి పాపము చుట్టుకొనును. ఆహారమును స్వీకరించునపుడు దీపము ఆరిపోయినచో, సూర్యుని స్మరించుచూ పాత్రను పట్టుకొని కూర్చొనవలెను. మరల దీపము వెలిగిన పిమ్మటనే భోజనము చేయవలెను. తన పాత్రలో ఎంత అన్నము కలదో, అంత మాత్రమే దానిని విడిచిపెట్టకుండా పూర్తిగా తినవలెను. భోజనము చేయుచూ కేశములను స్పృశింపకూడదు. ఇతరమైన కథలు చెప్పుట మహాదోషము. ఆకాశమును చూడకూడదు. చీకటిలో

భోజనము పనికిరాదు. భార్యకు శేషము మిగిలించకుండా తిన్నచో అత్యంత దోషము లభించును. భర్త శేషమును భుజించని యెడల భార్యకు మహాపాతకములు సంభవించును. దేవుడు లేని దేవాలయమునందు, దేవతాస్థానము లేని గృహము నందు, నీటి సమీపమునందు, సంధ్యా సమయమునందు, భోజనము చేయకూడదు. రాతిపైన పాత్రను పెట్టుకొని భోజనము చేయుట నిషిద్ధము. ఆహారమును వడ్డించుచున్న స్త్రీల ముఖము చూడకూడదు. సహభోజనము పనికిరాదు. అది ఉచ్ఛిష్టభోజనమే యగును. కులస్త్రీలతో కలిసి భోజనము చేయవచ్చును. అది దోషరహితమని యెరుగుము. ఇతరులు త్రాగగా పాత్రలో మిగిలిన నీటిని స్వీకరింపకూడదు. ఒకవేళ తప్పనిసరియగుచో, కొంత జలమును పారబోసి శేషమును త్రాగవచ్చును. వస్త్రోదకమును త్రాగిన యెడల అంతులేని దోషము అంటుకొనును. వారు శ్వానయోనిలో జన్మింతురు. అంత్యమున వారికి నరకమే గతియగును. నీరు త్రాగునప్పుడు గాని, పాయసము మొదలగు ద్రవపదార్థములను తీసుకొనునపుడు గాని, ఆపోశనార్థము ఉదకమును తీసుకొనునపుడు గాని, శబ్దము అయినచో, అది సురాపానముతో సమానమగును. లోతైన నీటిలోనికి దిగి నోటితో నీరు త్రాగినచో లేదా నిలబడి నీరు త్రాగినచో అది సురాపానము చేసినట్లగును. జ్ఞానులైనవారు రెండు చేతులను జోడించి దోసిలిని పట్టి, నీటిని తీసుకోకూడదు. ఒకచేత మాత్రమే నీటిని గ్రహింపవలెను. అందుకు ఎడమచేతిని వదలిపెట్టవలెను. సభలో ఆసనమునందు కూర్చొనిగాని, తన పరుపుమీద కూర్చొనిగాని నీరు త్రాగుట మహాదోషము. (157–180)

విరిగిన పాత్రతో వడ్డింపకూడదు. వేరొక జాతివారిని, రజస్వలయైన స్త్రీలను, చండాలురను, శ్వానములను చూచుచూ భుజింపకూడదు. వీరిని చూచిననూ లేక, వారి మాటలను చెవులతో విన్ననూ అన్నమును వదలివేయవలెను. ఒకవేళ తినినచో మహాదోషము సంభవించును. కలహధ్వని, దంపుడు శబ్దము, విసురుడు శబ్దములను వింటూ భుజింపకూడదు. స్పష్టంగానైనా, అస్పష్టంగానైనా అపశబ్దములు వినబడినచో అన్నమును వదలిపెట్టవలెను. అపరిచితుల పంక్తిలో భోజనము చేయరాదు. ఒకవేళ అట్లు కూర్చొనవలసి వచ్చినచో, మన విస్తరికి, వారి విస్తరికి మధ్యన చుట్టూరా నీరు లేదా, భస్మరేఖతో గీతను గీయవలెను. నల్లని వస్త్రము ధరించి భుజించినచో, అపారమైన దోషము కలుగును. గోచీ పెట్టుకోకుండా స్త్రీలు ఆహారమును వడ్డించినచో అది ఉచ్ఛిష్టముతో సమానము. ఇవన్నింటినీ బాగుగా ఆలోచించి విద్వజ్జనులు చక్కని భోజనమును చేయవలెను. **'వికిరిదవిలోహిత'** అంటూ భుక్తశేష అన్నమును అభిమంత్రించాలి. **'వికిరిదే'** అనే మంత్రాన్ని పఠించి. అఘోర – ఋషి, రుద్ర – దేవతా, అనుష్టుప్ – ఛందస్సుతో **'అన్నాభిమంత్రణే వినియోగః'**, చేతిలోకి శేష అన్నమును తీసుకొని యముని పేరుతో బలిని సమర్పించి అప్పుడు ఉత్తరాపోశనము తీసికోవాలి. భుజించిన పాత్రలో మిగిలిన ఎంగిలి పదార్థమును అంతా చేతిలోకి తీసుకొని **'రౌరవే**

పుణ్యనిలయే' అను మంత్రమును జపించి దానిని పాత్రల ప్రక్కన పెట్టవలెను. చేతులు కడుగుకొనుటకు వెళ్ళి నోటినిండుగా నీరు తీసుకొని, బాగుగా పుక్కిలించి ఉమ్మి వేయవలెను. తదుపరి చేతులు కడుగుకొనవలెను. పుక్కిలించకుండా చేతులు కడుగుకొనుట దోషము. ముఖ శుద్ధి, దంతశుద్ధి, హస్తశుద్ధి ఇవన్నీ భోజనానంతరము చేయవలసిన పనులు. ముఖశుద్ధి, దంతశుద్ధి కొరకు మధ్యవ్రేలును ఉపయోగించాలి. చూపుడు వ్రేలితో ముఖశుద్ధి పనికిరాదు. ఒకవేళ అట్లు చేసినచో, రౌరవాది నరకము ప్రాప్తించును. చక్కగా చేతులు కడుగుకొని దంతశోధన చేసిన తరువాత చేతిలోని పవిత్రమును వదలివేసి నైఋతిదిశవైపు పడవేయాలి. అనంతరం **'అంగుష్ఠమాత్ర పురుష'** అను మంత్రమును చెప్పాలి. (1) చేతులు కడిగిన పిమ్మట తడి అరచేతులను గట్టిగా రాపిడిచేసి రెండు కళ్ళకు అద్దుకోవాలి.(2) ఒకవేళ 'అంగుష్ఠమాత్ర పురుష' అను మంత్రము చెప్పనిచో నేత్రరోగము ప్రాప్తించును. హస్తోదకము వలన ఆరోగ్యము చేకూరును. రెండు పర్యాయములు ఆచమించి, **'అయంగౌః'** అను మంత్రమును చెప్పి, **'ధృపదాది వేన్ముముచా'** అని ఉచ్చరించి **'ప్రాణానాం గ్రంధిరసి'** అని చెప్పాలి. ఆవిధంగా భోజనము చేసిన ప్రదేశమువద్దకు వెళ్ళి కూర్చొని మంత్రమును జపిస్తూ రెండుమార్లు ఆచమనము చేయవలెను. ఆ తరువాత అగస్త్యులవారిని, కుంభకర్ణుని, బడబాగ్నిని, వృకోదరుని, శనైశ్చరుని, **'ఇల్వల - వాతాపి వర్జీర్యతాం'** అంటూ జపించుచు నాభిని స్పృశించాలి. పొట్టమీద ఎడమచేతితో నెమ్మదిగా నిమిరిన యెడల అన్నము సులభముగా జీర్ణమగును.(3) సోదరులు గలవారు చేతులను వస్త్రములతో తుడుచుకోకుండా అగ్నికి చేతిని చూపించాలి. అనంతరం గురువును, ఇష్టదేవతను, కులదేవతను స్మరింపవలెను. ఈవిధముగ ద్విజోత్తములు విధిపూర్వకంగా భుజింపవలెను. ఇట్లు భోజనవిధానమును గూర్చి గురుదేవులు చెప్పగా విని విప్రోత్తముడు మిగుల సంతసించెను. **పిమ్మట ఆ బ్రాహ్మణుడు గురుమూర్తితో ఇట్లనెను–** "మహానుభావా! తాము దయతో భోజనము చేయు విధానమును చక్కగా వివరించి చెప్పితిరి. అయితే, ఈ భోజన విషయములో విధినిషేధాలను గూర్చి కూడా చెప్పవలసినదని" ప్రార్థించెను. **అందుకు గురుమూర్తి మిగుల సంతసించి ఆ బ్రాహ్మణునితో ఇట్లు చెప్పుచుండెను** - (181-203)

---

1. **అంగుష్ఠమాత్రః పురుషో అంగుష్ఠం చ సమాశ్రితః । ఈశః సర్వస్య జగతః ప్రభుః ప్రీణాతు విశ్వభుక్ ॥**
2. తడి చేతులతో కళ్ళను తుడుచుకొనునప్పుడు పఠించవలసిన శ్లోక మంత్రము -

   శ్లో॥ శర్యాతిం చ సుకన్యాం చ చ్యవనం శక్రమశ్వినౌ । భోజనాంతే స్మరేన్నిత్యం తస్య చక్షుర్న నశ్యతి ॥
3. భోజనము చేసిన తర్వాత పొట్టను నిమురుతూ పఠించవలసిన శ్లోక మంత్రము -

శ్లో॥ **అగస్త్యం కుంభకర్ణం చ శనిం చ బడబానలమ్ । ఆహార పరిణామార్థం సంస్మరామి వృకోదరమ్ ॥**
అగ్నిరగ్నిర్ బడబానలశ్చ భుక్తం మయాన్నం జరయంత్వశేషమ్ । సుఖం మమైతత్ పరిణామసంభవం యచ్ఛంత్వరోగం మమచాస్తు దేహః ॥

‘బ్రాహ్మణోత్తమా! వినుము. దైవమునకు నివేదింపబడని అన్నము, వైశ్వదేవము చేయబడని అన్నము, గణాన్నము, (సాముదాయిక అన్నము), భుజింప కూడదు. ఉప్పు అధికముగా కలిసిన పదార్థములను, బహుమిశ్రితాన్నమును భుజింపకూడదు. వెల్లుల్లి, గాజర, ముల్లంగి, కందమూలాలు, ఉల్లిగడ్డలు, వంకాయలు, బూడిదగుమ్మడి, కుక్కగొడుగులు తినగూడదు. ఆవు, గొర్రె, బర్రె, మేక- ఇవి ప్రసవించినప్పుడు పదిరాత్రుల పర్యంతము వాటి పాలను త్రాగకూడదు. వర్షపు వరదల నూతన జలమును కూడా మూడు రాత్రులు త్రాగకుండా వదలిపెట్టాలి. పాడ్యమి రోజున బూడిదగుమ్మడి, వంకాయ, పొట్లకాయ, ముల్లంగి, బిల్వఫలము, ఉసిరి తినకూడదు. స్వర్గమోక్షముల యందు కోరిక గలవారు అష్టమినాడు ఔదుంబర ఫలాలు అనగా మేడిపండ్లు తినకూడదు. ఉసిరికాయను రాత్రిపూట, ఆదివారము, సప్తమి రోజులలో త్యజించాలి. శుక్రవారము నాడు బిల్వఫలమును తినకూడదు. శనివారము శమీఫలము(1) పనికిరాదు. ఒకవేళ భుజించినచో లక్ష్మీదేవి బహుదూరముగా వెళ్ళిపోవును. రాత్రికి ఉసిరిక భుజించినచో బుద్ధి మందగించును. వీర్యమును నాశనము చేయును. కావున, రాత్రికి ఉసిరిక ఫలమును వర్జించాలి. నఖములు అనగా గోర్లు, వెంట్రుకలు అన్నములో కనబడినచో భుజింపకూడదు. పిల్లి, కాకి, గ్రద్ధ, కోడి మొదలగునవి స్పృశించిన అన్నమును వదలిపెట్టాలి. దానిని తినకూడదు. (204-211)

అన్నము ప్రక్కన ఉచ్ఛిష్టము ఉన్నచో లేక, ఆవు, ఎలుక ముఖస్పర్శ అయినచో అట్టి అన్నమును వదలిపెట్టవలెను. ఒకచేతితో వడ్డించిన అన్నమును, చల్లారిన అన్నమును, పాచిపోయిన అన్నమును తినకూడదు. వదలిపెట్టవలెను. నూనె, నేయితో కలిపిన పాచి అన్నము అపవిత్రము. నూనెలో, నేతిలో వేయించినచో అవి పాచిపోవును. కాని, అట్టి ఆహారమును తీసుకొనుట మహాదోషము. విప్రులచే విక్రయించబడిన నేతిని, పాలను కొనుట వలన మహాదోషము వాటిల్లును. ప్రత్యక్షముగ అగ్నిమీద ఉడకబెట్టిన పదార్థమును తినకూడదు. మినపగారెలు, పేలపిండి, నూనెలో వేయించిన కందమూలాలు, యవల పరమాన్నము, బెల్లముతో చేసిన అన్నము ఎన్నటికీ పాచిపోదు. అట్లే పాచిపోని అన్నమునకు దోషము వుండదు. కాని, మైలపడినచో అది మహాదోషమగును. కనుక, వాటిని పవిత్రస్థానమునందు ఉంచవలెను. నువ్వులు కలిపిన భక్ష్యములను రాత్రివేళ తినకూడదు. తినినచో మహాదోషము వాటిల్లును. భోజనానంతరము తాంబూలమును ఆకు, వక్క, సున్నము బ్రాహ్మణులకు ఇవ్వకుండా తాము తినకూడదు. ఒక వక్క (క్రముకము)ను దానమిచ్చుటవలన సుఖమును, ఆరోగ్యమును ప్రసాదించును.

---

[1] శమీ అంటే జమ్మిచెట్టు - 'శమీసక్తుఫలా - సక్తువత్స్వాదూని ఫలాన్యస్య సక్తుఫలా' - అనగా సక్తువు అంటే సత్తుపిండివలె స్వాదువైన ఫలముగలది జమ్మిచెట్టు. (అమరకోశము - ద్వి.కాం. వనౌషధివర్గము - శ్లో.52)

రెండు వక్కలు ఇచ్చినచో నిష్ఫలము, అయోగ్యము. మూడు ఇచ్చినచో మహద్భాగ్యము. నాలుగు ఇచ్చినయెడల దుఃఖము కలుగును. ఐదు వక్కలు ఇచ్చినచో ఆయువు, మిగుల బుద్ధి లభించును. ఆరు వక్కలను ఈయకూడదు. అట్లు ఇచ్చినచో మరణము ప్రాప్తించును. తమలపాకు తొడిమను తుంచకపోయినచో వ్యాధులు కలుగును. అగ్రభాగమును తీసుకొనుటచే గొప్ప పాపము లభించును. చిరిగిన పాత ఆకులను తింటే ఆయువు క్షీణమగును. తమలపాకు యొక్క పై భాగము తినినచో బుద్ధి నశించును. రెండు ఆకులను తినినచో మహాదోషము వాటిల్లును. ఐశ్వర్యము నశించును. ఇది ఋషి సమ్మతమైనమాట. ఆకులు లేకుండా వట్టి క్రముకమును అనగా వక్కను తినినచో దుఃఖము కలుగును. ఏడుజన్మల వరకు దారిద్ర్యము, దుఃఖము లభించును. చివరకు అజ్ఞానులయ్యెదరు. యతీశ్వరులు, బ్రహ్మచారులు, రజస్వల స్త్రీలు, వితంతువులు, తాంబూలము తినినచో, మాంసము తినినట్లే యగును. దాని రసము సురాపానముతో సమానము. తాంబూలము స్వీకరించిన పిమ్మట బ్రాహ్మణులు సాయంసంధ్యకు సిద్ధము కావలెను. సూర్యుడు అర్ధమండలమునందు మిగిలియున్నపుడు అర్ఘ్యమునీయవలెను. అపుడు కూర్చొని మూడు పర్యాయములు అర్ఘ్యమునీయవలెను. సూర్యాస్తమానమైన తదుపరి సంధ్య చేయుటవలన వచ్చే కాలాతిక్రమణ దోష పరిహరణార్థమై ఒక అర్ఘ్యమును ఎక్కువగా అనగా మొత్తము నాలుగు అర్ఘ్యములనీయవలెను. గాయత్రీ మంత్రమును జపించి **'ఇమం మే వరుణ'** అని చెప్పవలెను. గోత్రప్రవరను చెప్పుకొని అనంతరం ఔపాసన చేయవలెను. రాత్రి భోజనము ముఖ్యంగా పాలను కలిపి తీసుకొనవలెను. రాత్రి భోజనము చేయునపుడు **'ఋతం త్వా సత్యేన పరిషించామి'** అను మంత్రమును ఉచ్చరింపవలెను. ఇంతకుముందు చెప్పిన విధముగనే భోజనము స్వీకరించవలెను. భోజనమైన పిమ్మట ఒక ప్రహరము అనగా గంటకాలము వేదాభ్యాసము చేసి అప్పుడు శయనమందిరమునకు వెళ్ళవలెను. (212-231)

ఇక శయనింపవలసిన పద్ధతులు– పడుకొనుటకు వాడుకొనవలసిన మంచము పవిత్రమైనదై ఉండవలెను. శాస్త్రప్రకారము నిర్మింపబడి, శుభముహూర్తమున అల్లబడిన మంచముమీదనే శయనింపవలెను. అందుకు ధనిష్ఠ, భరణి, మృగశిర నక్షత్రములు పనికిరానివి. మూడుకాళ్ళ మంచముగాని, విరిగిన మంచముగాని పనికిరాదు. మేడి, రాగి, మర్రి, నేరేడు చెట్ల కర్రలతో మంచము తయారుచేయించుట పనికిరాదు. మరణించిన ఏనుగు దంతమును వాడకూడదు. విరిగిన కట్టెలను వదలిపెట్టాలి. మంచము సరైనదిగా, చక్కగా ఉండవలెను. ఆదివారమునాడు తయారుచేసినచో అత్యంత లాభము కలుగును. సోమవారము మహాసుఖప్రదము. మంగళవారము చేయకూడదు. ఒకవేళ మంగళవారము నాడు తయారుచేసినచో దుఃఖము కలుగును. బుధవారమునాడు చేసినచో, మహాపీడ కలుగును. గురువారము నాడు మంచమును అల్లినచో

శయనించువారికి ఎక్కువమంది పుత్రులు కలిగెదరు. శుక్రవారము నాడు తయారుచేయుట అత్యంత విశేషప్రదము. శనివారము నాడు చేసినచో మృత్యువు ప్రాప్తించును. స్వగృహమున శిరస్సును తూర్పువైపుకు పెట్టి పడుకొనవలెను. అటులే, అత్తగారింటిలో దక్షిణదిశకు తలను పెట్టి, ప్రయాణములో వున్నప్పుడు పశ్చిమదిశవైపు శిరమును ఉంచి శయనింపవలెను. ఉత్తరదిక్కునకు శిరమును పెట్టి ఎప్పుడు కూడా శయనించకూడదు. పడుకొనుటకు ముందు శిరసు వద్ద మంగళద్రవ్యములను చేర్చిన పూర్ణకుంభమును తలవైపున పెట్టవలెను. నిద్రించుటకు పూర్వము రాత్రి సూక్తమును పఠించుచు విష్ణుస్మరణ చేయుచు అగస్త్యుని, మాధవుని, ముచికుందుని, ఆస్తికుని, కపిలమహాఋషిని స్మరించి(1) సర్పములను స్తుతించి(2) నిద్రింపవలెను. (232-241)

శయనమునకు నిషిద్ధ ప్రదేశములను గూర్చి వినుడు. పాడుబడిన దేవాలయములయందు, శ్మశానములయందు నిద్రింపకూడదు. ఒకే చెట్టుగల చోటున నాలుగు వీధులు కలిసిన కూడలిలో, శివాలయమునందు, తలిదండ్రులు నిద్రించుచోటున, పాము పుట్టకు సమీపమున, తటాకములు, నదీతీరములు, ఇసుక తిన్నెలు, అఘోరమైన ప్రదేశములయందు నిద్రింపకూడదు. ధాన్యముమీద, పాడుబడిన ఇంటిలో నిద్రించకూడదు. పెద్దలు, గురుజనులు నేలపైన నిద్రించియున్న యెడల వారి ప్రక్కనగాని, వారి ముందు భాగమున గాని, మంచము మీద గానీ శయనించుట పనికిరాదు. అట్లు చేయుట మహాపాపము. తడిబట్టలతోగాని, నగ్నముగ గాని, శిరోవేష్టనముతో గాని, నిరాకాశమునందుగాని, దీపము ఉండగా గాని శయనింపకూడదు. అటులే పూర్వరాత్రిగాని, అపరరాత్రి (రాత్రి చివరి భాగము అనగా బ్రహ్మ ముహూర్తమునందు) గాని నిద్రించకూడదు. రజస్వలయైన నాలుగవరోజున స్త్రీ సంపర్కము పనికిరాదు. నీలిరంగు వస్త్రమును ధరించి భార్యను సంగమించినచో, చండాలుర వంటి పుత్రులు జన్మించెదరు. కావున, తెల్లని వస్త్రమును ధరించుట ఉత్తమము. రజస్వలగాని స్త్రీ – భార్యతో సంగమించకూడదు. అది మహాపాపము. భార్యయొక్క ఋతుకాలము నందు భర్త పరగ్రామమునకు వెళ్ళకూడదు. ఒకవేళ వెళ్ళినచో అతనికి భ్రూణహత్యా పాతకము చుట్టుకొనును. వృద్ధ స్త్రీలకు లేదా వంధ్యలకు, అటులే నష్టసంతాన వతులకు అనగా సంతానము కలిగి కోల్పోయిన వారికి, బహు కన్యాసంతానముగల స్త్రీలకు ఋతుదోషము ఉండదు. ఇక రజస్వల యైన నాలుగవరోజున తన భార్యతో కలిసిన యెడల అల్పాయుష్యము

---

1. అగస్తిర్మాధవశ్చైవ ముచికుందో మహాబలః । కపిలో మునిరాస్తీకః పంచైతే సుఖశాయినః ॥
2. సర్పాపసర్ప భద్రం తే దూరం గచ్ఛ మహావిష । జన్మేజయస్య యజ్ఞాంతే ఆస్తీకవచనం స్మర ।
ఆస్తీక వచనం శ్రుత్వా యః సర్పో న నివర్తతే । శతధా భిద్యతే మూర్ధ్ని శింశవృక్షఫలం యథా ॥ కావున, నిదురించేముందు పడకపైన కూర్చొని పై శ్లోక మంత్రములను పఠించి, "ఆస్తీకాయ నమః" అని మూడుమార్లు పలికి నిద్రించవలయును.

కలిగినవారు జన్మింతురు. ఐదవ రోజున సంగమించినచో కుమార్తెలు, ఆరవరోజున కుమారులు జన్మింతురు. విషమ దివసములయందు కలిసినచో స్త్రీ సంతానము, సమదినమైనచో పురుష సంతానము కలుగును. ఋతుకాలమునకు పదవ రోజు చంద్రబలము కలిగియుండవలెను. మూల, మఖ, రేవతి మొదలగు నిషిద్ధ నక్షత్రములయందు స్త్రీ సాంగత్యము పనికిరాదు. ఇట్టి సమయమున భార్యాభర్తలలో ఎవరికి కూడా క్రోధము ఉండకూడదు. మనసు ప్రఫుల్లమై అత్యంత సంతోషాంతరంగులై యుండవలెను. ఏలననగా, ఋతుకాలమునందు స్త్రీ పురుషులు మానసికముగా సత్త్వరజస్తమోగుణములలో ఏ గుణాధిక్యమును కలవారై ఉందురో, వారికి తదనురూపమైన సంతతియే సంప్రాప్తమగును.(242-257)

ఈవిధముగా పరాశరమహర్షి బ్రాహ్మణుల సదాచారములను వివరించి చెప్పగా శౌనకాది ఋషీశ్వరులందరు శ్రద్ధగా శ్రవణము చేసిరి. అట్టి ఆచారధర్మములనే నేను ఇప్పుడు నీకు తెలియజేయుచుంటినని శ్రీగురునాథుడు ఆ బ్రాహ్మణునితో నుడివెను. నాయనా! బ్రాహ్మణుల ఆచారములు ఈవిధముగా వుండును. ఇట్టి సదాచారసంపద కలిగిన ఇండ్లలో దైన్యమునకు తావుండదు. అట్టివారలు దేవతలకు కూడా వందనీయులే యగుదురు. వారి గృహమునకు స్వయముగా కామధేనువు నడచివచ్చును. లక్ష్మీదేవి వారి గృహమునందు శాశ్వతముగా నివసించియుండును. అట్టి కుటుంబము నందు పుత్ర, పౌత్రాభివృద్ధి కలుగును. వారందరునూ శతాయుష్మంతులుగా జీవించెదరు. వారికెటువంటి దోషమూ వుండదు. వారు కలికాలమునకు ఎంతమాత్రము భయపడరు. వారందరు బ్రహ్మజ్ఞానులే అయ్యెదరు. కాలమృత్యువే తప్పిపోయినపుడు ఇక, అపమృత్యువు ఎట్లు సంభవించును. కావున, వైదిక సదాచార ధర్మములను అందరును ఆచరించుచుండవలెను. (258-262)

శ్రీగురునాథుడు తెలియజెప్పిన సదాచారసంపత్తిని విని ఆ బ్రాహ్మణుడు మహదానందభరితుడయ్యెను. పిమ్మట అతడు శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి శ్రీ చరణసరోజములను పట్టుకొని సాష్టాంగముగా వందనమును ఆచరించెను. **వినయముతో అంజలి ఘటించి ఇట్లనెను-** "కరుణాపయోనిధీ! ఆశ్రితజనరక్షకా! శ్రీగురునాథా! అత్యంత నిర్హేతుకమైన కృపతో, అవ్యాజమైన ప్రేమతో ఈ దీనులను ఉద్ధరించుటకై సాటిలేని విధముగ అనేక విషయములను మీరు ఉపదేశించితిరి. భక్తజనులను ఉద్ధరించుటకై హృషీకేశుడే గాణగాపురమున అవతరించెను. తద్వారా, అజ్ఞాన అంధకారము అస్తమించి దివ్యమైన జ్ఞానజ్యోతి ప్రకాశించుచున్నది" అని ఆ బ్రాహ్మణుడు అనేక విధములుగా భక్తిభావముతో శ్రీగురుమూర్తిని స్తుతించి మరల మరల వారి దివ్యచరణాబ్జములను పట్టుకొని వందనమును సమర్పించెను. **అందులకు శ్రీగురుమూర్తి మిగుల సంతసించి ఆ బ్రాహ్మణునితో ఇట్లు పలికెను-** విప్రోత్తమా! అనేక ఆచారలక్షణములను మీకు తెలిపియుంటిని. ఇక

మీదట నీవు భిక్షాటనము చేయవద్దు. నేను చెప్పిన విధముగ ఆచారధర్మములను ఆచరింపుచూ, సుఖముగా జీవించుడు. మీ అంతరంగమున ఏయే కోరికలు గలవో, అవన్నియునూ తప్పక నెరవేరగలవు. పుత్రపౌత్రాభివృద్ధి నొందెదరు. ఇక మనసులో ఎట్టి సందేహమును కలిగియుండవలసిన పనిలేదు" అని అభయదానము చేయుచూ మహదాశీర్వాదమును అందించెను. ఆవిధముగ గురుమూర్తి నుండి వరమును పొంది ఆ బ్రాహ్మణ దంపతులు సంతోషాంతరంగులై గురుమూర్తి ఆజ్ఞను పొంది తమ గృహమునకు వెళ్ళిరి. అనంతరము గురూపదేశమును అనుసరించి సదాచారములను పాటించి, సమస్త మనోభీష్టములను పొందిరి" అని ఈవిధముగ సిద్ధుడు నామధారకునితో ఈ కథనంతయునూ వివరించిన మీదట, చివరగా ఇట్టి పవిత్రమైన, ప్రభావాన్వితమైన శ్రీగురుచరిత్రను విన్నవారందరికీ, పఠించిన వారందరికీ పరిపూర్ణమైన జ్ఞానము లభించును. మూఢులు కూడా బ్రహ్మజ్ఞాను లయ్యెదరని సిద్ధమునీంద్రుడు నుడివెను. "అజ్ఞాన తిమిరాంధకారమును పారద్రోలుటకు ఈ కథ జ్ఞానజ్యోతిస్వరూపమై వెలుగొందును. దీనివలన సమస్త మనోభీష్టములు సిద్ధించును" అని గంగాధరనందనుడైన సరస్వతి శ్రీగురుచరిత్రమును విస్తరించి లోకమునకు ప్రకటింప చేసెను. (263-271)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున కర్మకాండమునందు
"కర్మమార్గనిరూపణము" అను ముప్పది ఏడవ అధ్యాయము ॥ 37 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 271; మొత్తము సంఖ్య : 5053 + 271 = 5324 ఓవీలు)

॥ కర్మకాండము సమాప్తము ॥

-::: (సప్తాహపారాయణ క్రమము (5) ఐదవరోజు విరామము) :::-

॥ సర్వం శ్రీ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహ సరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

॥ హరయే నమః ॥

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

భక్తికాండము

ముప్పది ఎనిమిదవ అధ్యాయము

గాణగాపురములో నిత్యసమారాధనలు జరుగుట - భాస్కరుడను ఒక నిరుపేద బ్రాహ్మణుడు మహాసమారాధనము జరుపుట- శ్రీగురుమహిమ వలన మూడుశేర్ల అన్నము నాలుగువేల మందికి సరిపోవుట - శ్రీగురుకృపా ప్రభావమునకు విస్మితులైన జనులు శ్రీగురుమూర్తికి జేజేలు పలుకుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునీంద్రుని పాదపద్మములకు భక్తిపూర్వకముగ నమస్కరించెను. **వినయముగా రెండు చేతులు జోడించి ఇట్లు పలికెను-** "మహాత్మా! శ్రీగురుచరిత్రమునందు ఆ తరువాత ఘటించిన అద్భుత ఘట్టమును వినవలయునని నా మనసు అత్యధికముగ తహతహలాడుచుండెను. అవ్యాజమైన ప్రేమతో మీరు శ్రవణము చేయించుచున్న మహామహిమాన్వితములైన శ్రీగురుమూర్తి లీలలు వినిన కొలది నాలోని శ్రవణాపేక్ష అంతకంతకు మిక్కుటమగుచుండెను. ఎంతకూ తనివితీరుటలేదు. కావున, తాము దయతో నాయందనుగ్రహించి మరి గ్రుక్కెడు గురుచరితామృతమును కర్ణపుటములకు త్రావించి నా చిత్తమును సంతృప్తిపరచగలరని" ప్రార్థించెను. **అంతట నామధారకుని మాటలకు కడు ప్రసన్నత నొందిన సిద్ధమునీంద్రుడు ఇట్లనెను-**

"నామధారకా! నీవు ఈవిధముగ ప్రశ్నించుచుండుటవలన నేను మహదానందభరితుడనగుచున్నాను. నీ నిమిత్తముగ శ్రీగురుచరిత్రమును స్మరించుకొను మహద్భాగ్యము నాకు ఘటించినది. నీ పరిప్రశ్నవలన గురుచరిత్రము గుర్తుకు వచ్చుటచే నేను మహత్తరమైన లబ్ధిని పొందుచుంటిని. గాణగాపురములో శ్రీగురుమూర్తి నివసించుచున్నపుడు మరొక అత్యద్భుతమైన, అతి విచిత్రమైన సంఘటన సంభవించెను. దానిని వివరించి చెప్పుచుంటిని. సావధానముగా వినుము". (1-4)

గాణగాపురమునందు గురుమూర్తి నివసించుచున్న మఠమునకు నిత్యము అనేకమంది భక్తులు విచ్చేయుచుండిరి. ఆ భక్తులు తమ వెంట కొంత ద్రవ్యమును తీసికొనివచ్చి శ్రీగురుమూర్తికి సమర్పించెడివారు. కాని, శ్రీగురునాథులు ఆ ద్రవ్యమును తాము స్వీకరింపకుండ దానితో చక్కని సమారాధనము చేయుమని వారికే చెప్పుచుండెడివారు. గుర్వాజ్ఞను పురస్కరించుకొని ఆ భక్తులు తమ ద్రవ్యముతో కమ్మని భోజనపదార్థములను సిద్ధపరచి, గ్రామములోని బ్రాహ్మణులను ఆహ్వానించి మృష్టాన్నముతో సమారాధనము చేయుచుండెడివారు. ఈవిధముగ ఆ గ్రామమునందు భక్తజనులచేత ప్రతిదినము బ్రాహ్మణ సమారాధనలు ప్రతినిత్యము బహు చక్కగా జరుగుచుండెను. ఇక సమారాధనము జరగని దినమంటూ ఏ ఒక్క దినము కూడా మిగిలి ఉండెడిది కాదు. (5-6)

ఇట్లుండగా ఒకనాడు కాశ్యపస గోత్రమునందు జన్మించిన ఒక నిరుపేద బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తి మఠమునకు విచ్చేసెను. అతని పేరు 'భాస్కరుడు'. ఆయన శ్రీగురుమూర్తిని దర్శించుకొని వారికి భిక్ష చేయవలయునను సంకల్పముతో అచటికి వచ్చెను. సత్సంకల్పముతో వచ్చిన భాస్కరుడను ఆ బ్రాహ్మణుడు శ్రీస్వామివారికి అత్యంత భక్తిశ్రద్ధలతో శిరస్సాష్టాంగవందనమును ఆచరించి వినయపూర్వకముగ శ్రీవారిని అనేకవిధముల స్తుతించెను. అయితే ఈ పేదబ్రాహ్మణుడు తన శక్త్యనుసారముగా ముగ్గురు వ్యక్తులకు సరిపడునట్టి బియ్యము, గోధుమపిండి, పప్పు, ఉప్పు మున్నగు ఆహార పదార్థములను ఒక గుడ్డలో మూట కట్టుకొని తీసికొనివచ్చెను. ఆ పదార్థములచే శ్రీస్వామివారికి భిక్షను ఈయవలయునని స్వచ్ఛమైన సంకల్పముతో స్వామివారికి నమస్కరించి వారి సమీపమున కూర్చొని యుండెను. తన కోరికను వెల్లడించుటకు, చేతులు జోడించుచున్న సమయమున భిక్షకు వేళ అయ్యెను. ఆనాటి సమారాధనకై అంతకుపూర్వమే ఏర్పాటు గావింపబడిన ప్రదేశమునకు గురుమూర్తి సపరివారముగా వెళ్ళెను. ఈ బ్రాహ్మణుడు కూడా గురుమూర్తి పిలుపుతో వారి వెంటనే వెళ్ళి, భోజనమును చేసి సుఖముగా ఆ రాత్రికి నిద్రించెను. ఇక ప్రతినిత్యము నిరాటంకముగా సమారాధనలు జరుగుచునేయుండెను. నూతనముగా వచ్చిన ఈ బీదబ్రాహ్మణునకు ఎంతకూ అవకాశము చిక్కకుండెను. ప్రతిదినము గురుమూర్తితోపాటుగా అందరితో కలిసి భుజించుచూ తిరిగి వచ్చి మఠముననే రాత్రికి వస్త్రములో మూట కట్టిన స్వయంపాకమును తలక్రింద పెట్టుకొని నిద్రించుచుండెను. ఈవిధముగ మఠమునందు నివసించుచున్న ఆ పేదబ్రాహ్మణుని చూచి ఇతర బ్రాహ్మణులందరు అతనిని పరిహాసమొనర్చుచుండిరి. అతనిని చూసి నవ్వుతూ 'ఆహా! ఈ మహానుభావుడు సమారాధన చేయవలయుననే సంకల్పముతో సామగ్రిని మూటగట్టుకొని తెచ్చెను. కాని, నిత్యము తానే మహాభక్తిగా సమారాధనలో పాల్గొని కమ్మగా భుజించుచుండెను. ఒక్క వ్యక్తికి కూడా సరిపోని పదార్థములను వెంట తెచ్చి మనలనందరిని చూచి భయపడి

చెప్పలేక మూటను నెత్తిక్రింద పెట్టుకొని కాలము గడుపుచుండెను కదా! ఒక మనిషికి కూడా సరిపడని ఈ పదార్థములతో అటు గురుమూర్తికి, ఇటు శిష్యులమైన మనందరికి సమారాధన ఎట్లు జరుపగలడు? సమారాధన చేయుదునని చెప్పుటకు ఇతనికి సిగ్గు కల్గుటలేదా? నిర్లజ్జగా మనతోపాటు కలసి కమ్మగా భోజనము చేయుచూ కాలము గడుపుచుండెను'. "ఓయీ! స్వయంపాకమునకు తెచ్చిన పదార్థములను మాకు ఇచ్చివేసి నీవు భిక్ష చేయుము" అని అతడిని అవమానించుచుండిరి. కాని, పాపము నిరుపేదయైన ఆ బ్రాహ్మణుడు గురుమూర్తియందు దృఢమైన భక్తివిశ్వాసములను కలిగి మిగిలిన బ్రాహ్మణులు మాటలాడే ఎగసక్కెపు మాటలను, దూషణ వాక్యములను విని మౌనము వహించెడివాడు. వారితో ఒక్క మాటైన మారు పలికెడివాడు కాదు. ఈవిధముగ ఆ బ్రాహ్మణుడు అచట మూడు మాసముల కాలము గడిపెను.(7–18)

ఒకనాడు బ్రాహ్మణులందరు కలిసి ఆ పేద బ్రాహ్మణుని పరిహాసములాడు వాక్యములను శ్రీగురుమూర్తి వినుట తటస్థించెను. **నిర్హేతుక కృపామూర్తి యగు శ్రీగురుమూర్తి వెంటనే భాస్కరుడను ఆ పేద బ్రాహ్మణుని పిలిపించి పలికెను–** "నాయనా! రేపు నీవు నాకు భిక్షను ఈయవలసినది. నీవు తెచ్చిన పదార్థములతో త్వరగా స్వయంపాక మొనర్చుము" అని సెలవిచ్చెను. శ్రీగురుమూర్తి యొక్క ప్రేమపూర్వకమైన మాటలను విని ఆ బ్రాహ్మణుడు అంతులేని ఆనందమునకు లోనై వెంటనే శ్రీవారి శ్రీచరణాబ్జములపై తన శిరమును ఉంచి సాష్టాంగవందనమును ఆచరించెను. మరునాడు గుర్వాజ్ఞ ప్రకారముగ ఆ బీదబ్రాహ్మణుడు రెండు శేర్ల నెయ్యిని తెచ్చి అందుకు తోడ్పడే రెండు శాకములను తెచ్చెను. స్నానము చేసి, శుచిర్భూతుడై పవిత్రమైన ప్రేమభావముతో మహిమాన్వితమైన శ్రీగురునాథుని స్మరణతో వంట చేయసాగెను. బ్రాహ్మణులందరు కలిసికట్టుగా శ్రీగురుమూర్తి వద్దకు విచ్చేసి ఇట్లు పలికిరి– "గురుదేవా! ఈనాడు మేము మా ఇండ్లలోనే భోజనము చేసెదము. నిత్యము సమారాధనలకు అలవాటు పడిన మేము హాయిగా మృష్టాన్నములను భుజించి సౌఖ్యమును పొందుచుంటిమి. కాని, ఈ బ్రాహ్మణుడు ఎచటినుండి వచ్చి పడెనో, ఈనాడు మాకు మృష్టాన్నము మృగ్యమైపోయెను గదా!" అని వారందరూ వాపోయి విన్నవించిరి. **అంతట శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణుల నుద్దేశించి ఇట్లనెను–** "మీరు మీ ఇండ్లకు పోవలదు. వెంటనే మీరు స్నానములకు వెళ్ళి నిత్యకృత్యములను పూర్తిచేసికొని తిరిగిరాగలరు. నేడు మీరందరు మన మఠమునందే భోజనము చేయవలయును" అని పలికెను. అందుకు 'సరేనని', తలలూపిన ఆ బ్రాహ్మణులు తమలోతాము 'బహుశా మఠములో మరింత సామగ్రి సిద్ధముగా ఉన్నది కాబోలు, దానితో శ్రీగురుమూర్తి వంట చేయించుదురేమో, అందులకే మనలను ఈవిధముగ ఆజ్ఞాపించుచుండిరి' అని ఊహించుకొనిరి. వెంటనే వారందరు స్నానమునకై నదీతీరమునకు వెళ్ళిరి. (8–28)

అనంతరము వంట పూర్తిచేసిన ఆ బ్రాహ్మణుడు గురువు వద్దకు వెళ్ళి నమస్కరించి వంట పూర్తయినదని విన్నవించెను. **అందుకు గురుమూర్తి ఇట్లనెను** – "నాయనా! నీవు వెంటనే వెళ్ళి బ్రాహ్మణులను భోజనమునకు రమ్మని ఆహ్వానించుమని 'ఈ పేద బ్రాహ్మణుని పంపించిరి'. 'సరేనని' ఆ బ్రాహ్మణుడు గంగకు వెళ్ళి బ్రాహ్మణుల ఎదుట నిలిచి, చేతులు జోడించి, "బ్రాహ్మణోత్తములారా! స్వామివారు భోజనమునకై మిమ్ములను రమ్మనుచుండిరి. త్వరగా రావలసినద"ని ఆహ్వానించెను. వారందరు ఈ పేద బ్రాహ్మణుని వైపు చూచి నవ్వుచూ, హేళనగా "మా అందరికి సరిపడు ఆహారము ఇంత తొందరగా సిద్ధము కాదు. కావున, మేము రావడము లేదు. నీవు త్వరగా వెళ్ళి శ్రీగురుమూర్తికి భిక్ష ఇచ్చి నీవు కమ్మగా భోజనము చేయుము. మిగిలినదానిని రాత్రికి నీవే భోజనము చేయుము. మేము రాలేమని" నిరాదరణపూర్వకముగా పలికిరి. వెంటనే ఆ బ్రాహ్మణుడు పరుగుపరుగున గురుమూర్తి వద్దకేతెంచి, "స్వామీ! వారు రావడము లేదు. సాయంకాలమగుచున్నది. తమరు ముందుగా భిక్షను స్వీకరింపుడు" అని ప్రార్థించెను. **అంతట శ్రీగురుమూర్తి అతనితో ఇట్లు పలికెను** – "నేను బ్రాహ్మణులందరితో కలిసి సహపంక్తిగా భిక్షను స్వీకరించెదను కాని, వారిని వదలిపెట్టి నేను భిక్షను స్వీకరించను. ఇది ఈనాటి నియమము. అంతేకాదు, బ్రాహ్మణులు నాకు అత్యంత ప్రియమైనవారు. వారిని వదలి నేను భిక్ష చేయను. బ్రాహ్మణులందరితో పాటుగ నీవు మాకు భోజనమును వడ్డించుము. ఒకవేళ నా మాట నీకు అంగీకారము కానిచో, నేను వేరొకచోట భిక్షకు వెళ్ళెదను" అని పలికెను. అంతట ఆ బ్రాహ్మణుడు మిగుల భీతిల్లి, అత్యంత భక్తిభావముతో చేతులు జోడించి, "స్వామీ! మీ ఆజ్ఞ ప్రకారమే నడచుకొందును. మీ మాటను శిరసా వహించి బ్రాహ్మణులతోపాటుగా మీకు భోజనము వడ్డింతును. ఇదంతయు మీ కృపావైభవమే" అని పలికెను. తన మనసులో 'శ్రీగురుడు అవతార పురుషుడు. వారి మాటల ప్రభావము ఏవిధముగ ఉండునో నావంటి సామాన్యుడు ఊహింపలేడు. వారు తమ వాక్యములను ఎట్లు నిజము చేసి నిరూపించెదరో తెలియదు కదా!' అని భావించెను. అప్పుడు వెంటనే తిరిగి చేతులు జోడించుకొని వినయముగా "గురుదేవా! నేను ఇప్పుడే వెళ్ళి బ్రాహ్మణులను భోజనమునకు రావలసినదని కోరితిని. బ్రతిమాలితిని. కాని, వారు నా పిలుపునకు రామని చెప్పి నన్ను ఎగతాళి చేయుచుండిరి. నేనేమి చేయుదును స్వామీ!" అని అత్యంత బాధాతప్త హృదయముతో మనవి చేసెను. అతని కనులవెంబడి బాష్పములు కారుచుండెను. అతని భావమును గమనించిన శ్రీగురునాథుడు వెంటనే తనవద్ద గల వేరొక శిష్యుని పిలిచి నీవు వెంటనే వెళ్ళి బ్రాహ్మణులను భోజనము చేయుటకు రమ్మని నా మాటగా చెప్పి తీసుకొనిరమ్మని ఆదేశించెను. ఆ శిష్యుడు వెళ్ళి బ్రాహ్మణులకు చెప్పగా గుర్వాజ్ఞకు వెరసి బ్రాహ్మణులందరూ కలిసి మఠమునకు చేరుకొనిరి. **అంతట శ్రీగురుమూర్తి నుడివెను** – "బ్రాహ్మణోత్తములారా! మీకు

ఈనాడు ఈ నిరుపేద బ్రాహ్మణుడే సమారాధన చేయును. కావున, మీరందరూ సకుటుంబముగా విచ్చేయవలయునని చెప్పి, ఆ పేద బ్రాహ్మణుని స్వయముగా అచటగల వారందరినీ నేను చెప్పిన విధముగా ఆహ్వానింపుమని ఆదేశించెను. వెంటనే ఆ పేదబ్రాహ్మణుడు చేతులు జోడించి వినయభావముతో అందరితో అటులనే చెప్పెను. చాలామంది బ్రాహ్మణులు "అయ్యో! ఈ దరిద్రబ్రాహ్మణునకు మతి లేదా? ఇంతమందికి ఎట్లు సమారాధన చేయగలడు. ఇంకనూ సకుటుంబముగా రమ్మని చెప్పుచుండెను. చెప్పుటకు వీడు సంకోచపడకుండా, ఎంతమాత్రమూ సిగ్గుపడకుండా ఎట్లు చెప్పుచుండెను" అని అనుచుండిరి. ఇంతలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు వారందరినీ చూసి, "అయ్యో! పాపం అతని తప్పేమున్నది. గురువుగారు ఆదేశించిన రీతిగా అతడు నడచుకొనుచుండెను. కావున, ఈ పేద బ్రాహ్మణుని ఎంతమాత్రము నిందింపవలదని" వారందరికి నచ్చజెప్పెను. అంతట బ్రాహ్మణులందరూ పంక్తులు, పంక్తులుగా తీర్చి కూర్చుండిరి. విస్తళ్ళు వేసిరి. బ్రాహ్మణుడు ఉన్నతాసనమున గురుమూర్తిని కూర్చుండజేసి కడు భక్తిశ్రద్ధలతో, షోడశోపచారపూజను చేసెను, త్రికరణశుద్ధిగా మంగళహారతులు సమర్పించుకొనెను. శ్రీవారి పాదపద్మములయందు తన శిరమును ఉంచి, సాష్టాంగవందనము ఆచరించి, దయతో తనను అనుగ్రహింపుమని గురుమూర్తిని లోలోపలే వేడుకొని నమస్కరించెను. ఆ తరువాత శ్రీగురుదేవులు మిగుల సంతసించి ఆ బ్రాహ్మణునితో "నాయనా! నీవు చేసిన స్వయంపాకమును తెచ్చి నా సమక్షమున ఉంచుము" అని చెప్పెను. అతడు వెంటనే గుర్వాజ్ఞ ప్రకారముగా తాను వండి పెట్టిన వంటకాలను అన్నింటినీ తెచ్చి గురుమూర్తి సమీపమున క్రమముగా అమర్చిపెట్టెను. అప్పుడా బ్రాహ్మణునకు గురుమూర్తి తన శాటీ వస్త్రమునిచ్చి ఆ పాత్రలమీద కప్పి వుంచమని ఆజ్ఞాపించెను. అదేవిధముగా అతడు ఆ వంటకాల పాత్రలపై గురుమూర్తి ఇచ్చిన వస్త్రమును కప్పెను. (29–49)

తదుపరి శ్రీగురునాథుడు తన కమండలములోని ఉదకమును తీసుకొని ఆ వంటకాలపై అభిమంత్రించి ప్రోక్షించెను. **అనంతరము ఆ బ్రాహ్మణునితో ఇట్లు చెప్పెను–** "నాయనా! పదార్థములమీద కప్పిన వస్త్రమును తీసివేయకుండా, అందులోనికి నీవు తొంగి చూడకుండా, ఆ పాత్రలలోగల పదార్థములను తీసి అందరికి వడ్డింపుమని ఆదేశించెను. జరుగుతున్న దానినంతటిని పంక్తులుదీరి కూర్చున్న బ్రాహ్మణోత్తములందరు అత్యంత ఆశ్చర్యచకితులై ఏమి జరుగునో అని ఆతృతతో చూడసాగిరి. ఇంతలో కొందరు బ్రాహ్మణులను ఉద్దేశించి ఈ బ్రాహ్మణుడు ఒంటరిగా ఉన్నందున ఇతనికి సహకారముగా మీరు కూడా లేచి వడ్డించగలరని శ్రీవారు ఆదేశించిరి. ఒక పాత్రలో గల నేతిని వేరొక పాత్రలోనికి కొద్దికొద్దిగా తీసికొని త్వరగా వడ్డించుమని" శ్రీగురుమూర్తి ఆజ్ఞాపించెను. ఇంతలో బారులు తీరి కూర్చున్న బ్రాహ్మణులకు, ఆ పంక్తుల మధ్యన కూర్చున్న గురుమూర్తికి ఆహారపదార్థముల వడ్డన ప్రారంభమాయెను. *(50–54)*

బ్రాహ్మణులందరు మిగుల విస్మయమునొందుచుండిరి. నేడు ఏమి వింత జరుగునోయని కౌతుకముతో ప్రతీక్షించుచుండిరి. గురుమూర్తి అనుగ్రహమువలన వండిన భోజనపదార్థములన్నియును వడ్డించిన కొలది ఆయా పాత్రలలో తిరిగి నిండిపోవుచుండెను. అన్నము వండిన పాత్ర నుండి వేరొక పాత్రలోనికి అన్నమును తీసికొని వడ్డించిన కొలది ఆ పాత్ర తిరిగి నిండిపోవుచుండెను. నేతి పాత్రలోని నెయ్యిని కూడా వేరొక పాత్రలోకి తీసుకొని వడ్డించిన కొలది శ్రీగురుకృపాప్రభావమువలన తిరిగి ఆ పాత్ర ఎప్పటివలెనే నిండుకొనుచుండెను. గురునాథుడు కూడా బ్రాహ్మణ సహపంక్తిలో కూర్చొని భిక్షకు ఉపక్రమించి వడ్డన పూర్తియైన వెంటనే అందరికి భోజనమును ప్రారంభించుటకు అనుమతిని ప్రసాదించిరి. ఆ బ్రాహ్మణుడు భక్ష్యములను, కమ్మని పరమాన్నమును రకరకాల కూరలు, పచ్చళ్ళు, చక్కెర, పెరుగు, ఉప్పు, రకరకములైన మధురపదార్థములు, లడ్డూలు ఇవన్నింటినీ వడ్డించెను. అందరు భోజనమునకు ఉపక్రమించి వారు తినుచుండగా **భాస్కరుడను ఈ పేద బ్రాహ్మణుడు వినయముగా చేతులు జోడించి సమారాధనలో కూర్చొనియున్న బ్రాహ్మణులనందరిని ఉద్దేశించి ఇట్లనెను** - "అయ్యా! బ్రాహ్మణోత్తములారా! నేడు క్షుధాక్రాంతులై మీరందరూ అలసిపోయితిరి. అకాలమైనందులకు దొడ్డమనసుతో నన్ను క్షమించుడు. మీకు కావలసిన పదార్థములను అడిగి వడ్డించుకొని కడుపునిండుగా భుజింపుడు. ఎంతమాత్రము సంశయింపకూడదు" అని వినయముగ ప్రార్థించుచుండెను. కావలసిన దానికంటే మించి ఘృతమును, శాకములను, పప్పును, పరమాన్నమును, పెరుగును మొదలైన పదార్థములను విస్తారముగా వడ్డించుచుండగా బ్రాహ్మణులందరు తృప్తిగా భుజింపుచూ "నాయనా! మా చేతిలో నేతి ఉండగనే మరింతగా వడ్డించుచుంటివి. మేము కుత్తుకలవరకు భుజించితిమి" అని బ్రాహ్మణులందరు తృప్తిగా పలికిరి. అనంతరము భోజనముతో తృప్తిచెందిన బ్రాహ్మణులందరు లేచి జరిగిన అద్భుతమునకు లోలోన అత్యంత ఆశ్చర్యము నొందుచుండిరి. హస్తపాద ప్రక్షాళనమొనర్చిన పిమ్మట ఆ బ్రాహ్మణుడు వారందరికి తాంబూలములను అందించెను. పిమ్మట ఆ బ్రాహ్మణుడు వారు భుజించిన ఎంగిలి విస్తరాకులను తీసిపారవేసెను. ఇంతలో భోజనము ముగించి లేచిన బ్రాహ్మణులందరిని ఉద్దేశించి శ్రీగురునాథుడు "బ్రాహ్మణులారా! మీ ఇండ్లలోగల భార్యాబిడ్డలనందరిని ఇచట భోజనము చేయుటకు పంపగలరు" అని కోరెను. ఆ నగరమునందుగల బ్రాహ్మణకుటుంబసభ్యులందరునూ వచ్చి హాయిగా కూర్చొని పంచభక్ష్య పరమాన్నములను భుజించి తృప్తిగా వెళ్ళిపోయిరి. అనంతరం ఆ గ్రామమునందలి శూద్రాది ప్రజలందరిని సమారాధనకు రమ్మని స్వామి పిలిపించెను. వచ్చిన వారందరికిని మృష్టాన్నమును వడ్డించిరి. అందరునూ తృప్తిగా భుజించి వెళ్ళిరి. (55-63)

ఆ తరువాత మన గ్రామములో నేటి సమారాధనకు రాకుండా ఇంకా ఎవరెవరు మిగిలియుండిరని తన శిష్యులను, బ్రాహ్మణులను శ్రీగురుమూర్తి ప్రశ్నించెను. అప్పుడు వారు 'అయ్యా! అంత్యజులు మిగిలియున్నారని' చెప్పిరి. వెంటనే వారందరిని పిలిపించి అన్నమును వడ్డించుమని గురునాథులు ఆదేశించిరి. వర్తమానము తెలిసిన అంత్యజులందరు ఆనందముతో పరుగెత్తుకొని వచ్చి బారులు తీరి కూర్చొని తృప్తిగా, కమ్మని భోజన పదార్థములను భుజించిరి. వారందరు భుజించి వెళ్ళిన పిదప నేటి సమారాధనకు రాకుండా ఈ గ్రామంలో ప్రాణిమాత్రులెవరునూ ఆకలితో మిగిలిపోకూడదు. కనుక, నేటి సమారాధన భోజనమునకు రాకుండా ఇంకెవరైనా మిగిలియున్నచో వారందరూ వెంటనే ఇచటికి విచ్చేసి భోజనము చేయుటకు రావలసినదని గ్రామములో శ్రీగురునాథులు చాటింపు చేయించుమని ఆదేశించిరి. వెంటనే గాణగాపుర గ్రామమంతటా తిరిగి "శ్రీ గురువుగారి మఠమునందు జరిగే నేటి సమారాధనలో పాల్గొనని వారెవరైనా సరే! వెంటనే కమ్మని భోజనము చేయుటకు రావలసినదహో!!" యని దండోరా ద్వారా ప్రకటించిరి. ఇక ప్రాణిమాత్రులు ఎవరునూ ఉపవాసముతో లేరు. అందరూ భుజించిరని తెలిసిన పిమ్మట శ్రీగురునాథులు నిరుపేద బ్రాహ్మణుడైన భాస్కరుని పిలిచి, "నాయనా! ఇక నీవు భోజనము చేయుము" అని చెప్పెను. శ్రీగురునాథుని అనుమతి పొందిన ఆ భాస్కరుడు చివరగా భోజనము చేసెను. అనంతరం తిరిగి భోజనపదార్థములను చూడగా మొట్టమొదట తాను ఎంత సిద్ధము చేసెనో, అన్ని పదార్థములు అటులనే నిండి యుండెను. **వెంటనే ఈవిషయమును గురుమూర్తితో విన్నవించగా వారతనితో ఇట్లనిరి** - "నాయనా! మిగిలిన భోజన పదార్థములన్నింటిని తీసికొని వెళ్ళి, గంగలోగల జలచరములకు సమర్పించుము".(63-70)

అనంతరము ఆనాటి సమారాధనకు విచ్చేసిన జనసంఖ్యను గూర్చి లెక్కించగా రమారమి నాలుగువేల మంది భుజించినట్లుగా లెక్క తేలిపోయెను. జనులందరు మిగుల విస్మయమును పొందిరి. వెంటనే గురునాథుని మహిమా ప్రాభవమునకు పారవశ్యమునొందిన బ్రాహ్మణులు, శిష్యులు, గ్రామప్రజలు అందరికందరూ కలిసి శ్రీనృసింహసరస్వతీ స్వామినుద్దేశించి మిన్నుముట్టునట్లుగా "గురునాథునకు జేజేలు" పలికిరి. వేలాది వందనములు సమర్పించిరి. ఆనాడు జరిగిన అద్భుతమైన గురుమహిమా సంఘటనము దశదిశలకు వ్యాపించి శ్రీగురునాథుని కీర్తి మరింతగా జగద్విఖ్యాతి నొందెను. అంతా ముగిసినమీదట శ్రీగురుమూర్తి ఆ బ్రాహ్మణుని పిలిచి అతని యెడల అత్యంత ప్రసన్నులై పలికిరి- "నాయనా! నేటితో నీ దారిద్ర్యము తొలగిపోయినది. నీవు పుత్రపౌత్రాభివృద్ధిని పొందగలవు" అని అభయదానముతో ఆశీర్వదించిరి. అది చూచిన అచటి వారందరు "ఆహా! ఏమి ఆశ్చర్యము! స్వల్పపరిమాణము కలిగిన ఆహారము నాలుగువేల మందికి ఎట్లు వడ్డించిరి? ఇంతమంది

కడుపారగా భుజించుటకు ఈ కొద్ది పరిమాణముగల ఆహారము ఎట్లు సరిపడెను? ఇది విచారించుటకు అతి చోద్యముగా ఉన్నది. మన ఊహాకందుటలేదు. ఇది కేవలము గురుమూర్తి మహిమా ప్రభావమే అని" చెప్పుకొనుచుండిరి. మరికొందరు "వారు అవతారపురుషులు కావున శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి అపారమైన మహిమ వలన ఇంతటి అత్యద్భుతమును నేడు మనము చూడగలిగితిమి" అనిరి. మరికొందరేమో "పూర్వము ఒక అపూర్వము జరిగినదని పెద్దలు చెప్పగా వినుచుంటిమి. భారతములో దూర్వాసులవారు పాండవులను పరాభవించుటకై తలంచి ఐదువందల మంది ఋషీశ్వరులతో కలిసి వచ్చెను. ఇంతలో ద్రౌపదీదేవి ప్రార్థనవలన తన భక్తులను కాపాడు నిమిత్తమై శ్రీకృష్ణపరమాత్ముడు ద్వారకనుండి పరుగెత్తుకొని వచ్చి నిండుకొనియున్న పాత్రలో అన్నమును పరిపూర్ణము చేసి పాండవులను రక్షించిన ఉదంతమును ఒకటి వినియుంటిమి. అట్టి అద్భుతమైన సంఘటనమును నేడు మనము, మన కనులార గాంచితిమి. మానవమాత్రుడుగా మన కంటికి కనిపించే దండధారియైన ఈ సన్న్యాసి ముమ్మాటికీ త్రిమూర్తుల అవతారమే కాని, వేరు కాదు. అపారమైన వీరి మహిమను మనము ఎరుగమైతిమి" అని జనులందరు అనుకొనుచుండిరి. (71-77)

ఈయనను మానవుడు అన్నవారు అధోగతి పాలగుదురు. గురుమూర్తిని వర్ణించుటకు హద్దులు లేవు. కేవలము పరబ్రహ్మస్వరూపులే. సాక్షాత్తూ ఈశ్వరుడే కాని యెడల, మూడు శేర్ల బియ్యముతో వండిన అన్నపాత్ర అక్షయముగా ఎట్లు మారును? ఇంతటి స్వల్పమాత్రమైన అన్నమును నాలుగువేలమందికి ఎట్లు వడ్డించిరి. వారు ఏవిధముగ తృప్తిగా భుజింపగలిగిరి. ఇది మన ఊహకు అందని అద్భుతము. వారి మహిమను వర్ణించుటకు మన సామాన్యమైన బుద్ధి అందుకోలేదు. అంతేకాదు, మనమందరము చూచుచుండగా ఒక ప్రేతమును బ్రతికించిరి. ఆకులు లేని ఎండు కొమ్మను చిగురింపజేసి పూవులను పూయించిరి, 'కుమసి' అనే గ్రామములో గల త్రివిక్రమభారతీ స్వామికి విశ్వరూప ప్రదర్శనమును దర్శింప చేయించిరి. అదే గ్రామములో గల ఒక గొడ్డు బర్రెనుండి సమృద్ధిగా పాలను పితికించిరి. నిరక్షర కుక్షియైన ఒక చండాలుని అభిమంత్రించి వాని నోటినుండి వేదములను పలికించిరి. ఇంకనూ ఒక కుష్ఠువ్యాధి గ్రస్తుడైన విప్రుడు వచ్చుట, అతడు కేవలము గురుదర్శనమాత్రము చేతనే వ్యాధి నిర్మూలనమై పవిత్రమైన శరీరముతో కనిపించిన సంఘటనమును మనము కనులనిండుగా తిలకించితిమి గదా! సాలెవాడైన ఒక భక్తునకు శ్రీశైల పర్వతమును చూపించిరి. తన భక్తుని తృటికాలములో కాశీ, గయ, ప్రయాగలకు తీసుకొని వెళ్ళిరి. ఈ గురునాథుని దర్శించినంతమాత్రముననే భక్తుల సమస్త మనోభీష్టములు నెరవేరుచుండెను కదా! ఇంకనూ వీరి ఘనతరమైన చరిత్ర ఎంతయో గలదు. అది చెప్పినచో ఒకనాటికి తీరునది కాదు. భూమిమీదగల సమస్త దేవతలందరిని ఒకచోట కలిపినప్పటికినీ వీరి సామర్థ్యము

ముందర వారందరి సామర్థ్యము ఏపాటిదగును? సమస్త దేవతలను ఆరాధించిననూ మనోభీష్టములు ఆలస్యముగా నెరవేరును. కాని, శ్రీగురునాథుని కేవల దర్శనమాత్రము చేతనే జనులందరి మనోరథములన్నియును వెనువెంటనే నెరవేరుచుండెను" అని భక్తజనులందరూ గురుమూర్తియొక్క మహిమాన్వితములైన అనేక లీలలను స్మరించుకొనుచుండిరి. ఒకరితో ఒకరు ముచ్చటించుకొనుచుండిరి. ఆవిధముగా శ్రీగురునాథుని మహిమను కీర్తించుచుండిరి. మానసికముగా స్తుతించుచుండిరి. వందనములను సమర్పించుచుండిరి. మహిమాన్వితములైన శ్రీగురులీలలను విని వారి దర్శనార్థమై దినదినమునకు భక్తజనులు అసంఖ్యాకముగా వచ్చుచుండిరి. అత్యద్భుతమైన శ్రీగురుచరిత్ర వినిన విప్రజనులందరు సాటిలేని అపూర్వము జరిగినదని వేనోళ్ల పొగడుచుండిరి" అని సిద్ధముని నామధారకునితో చెప్పుచుండెను. శ్రీగురుచరిత్రము అత్యద్భుతమైనది. అందుకే శ్రీగురునాథునకు లెక్కకు అందని విధముగా కోట్లకొలది జనులు శిష్యులైరి. (78–88)

వివిధ రాష్ట్రముల నుండి భక్తులు ఏతెంచి శ్రీగురుని సేవించుచుండిరి. ఎవరైతే నిర్మల మనస్కులై అత్యంత భక్తిశ్రద్ధలతో గురుమూర్తిని భజించెదరో, వారి యెడల శ్రీగురునాథుడు తప్పక ప్రసన్నులు కాగలరు. అట్టివారందరూ సమస్త అభీష్టములను సులభముగా పొందగలరని సిద్ధముని నామధారకునితో పలికిన సంవాదమును అనుసరించి గంగాధరనందనుడైన సరస్వతి నమస్కరించి వినయముతో "భక్తజనులారా! మీరందరు శ్రీగురుమూర్తిని భజించి, సేవించి తరించుడు" అని చెప్పుచూ లోకమునకు పరమకథాకల్పద్రుమమగు శ్రీ గురుచరిత్రమును గ్రంథరూపముగా ప్రకటించెను. (89–90)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము
నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున భక్తికాండమునందు "అన్నపూర్తిక ద్విజ చతుస్సహస్రభోజనము" అను
ముప్పది ఎనిమిదవ అధ్యాయము ॥ 38 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 90; మొత్తము సంఖ్య 5324+90 = 5414 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ముప్పది తొమ్మిదవ అధ్యాయము

శ్రీగురుకృపా ప్రభావమున ఒక వృద్ధవంధ్యురాలు సంతానవతి యగుట - అశ్వత్థవృక్షము యొక్క మహిమాను వర్ణనము - అశ్వత్థ పూజా-ప్రదక్షిణ వ్రత విధానము - తత్ఫలము వివరింపబడుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీ పాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని తమ శిష్యుడైన నామధారకునితో ఇట్లు చెప్పుచుండెను- నామధారకా! ఆ తరువాత ఒక అపూర్వమైన లీల సంభవించినది. శ్రీగురునాథుని యొక్క అనుగ్రహ విశేషముచేత అరువది యేండ్ల వయస్సు కలిగిన ఒక వంధ్యురాలికి సంతానము కలిగినది. అట్టి విస్మయావహమైన గురుకృపా మహిమను వివరించుచున్నాను. సావధానముగా వినుము. శ్రీగురునృసింహ సరస్వతీ స్వామివారు నివసించుచున్న గాణగాపురము నందు ఒక బ్రాహ్మణుడు ఉండెను. అతడు ఆపస్తంబశాఖకు చెందిన శౌనకగోత్రమునందు ఉద్భవించెను. అతని పేరు 'సోమనాథుడు'. ఆయనకు 'గంగ' అను పేరు గల పతివ్రతాశిరోమణియగు భార్య యుండెను. ఆమె వైదికధర్మశాస్త్రములను అనుసరించి తన జీవనము గడుపుచుండెను. నిరంతరము ఆమె తన భర్తను అత్యంత భక్తిశ్రద్ధలతో సేవించుచుండెను. ఆమెకు అరవై ఏండ్ల ప్రాయము నిండెను. కాని, ఆమెకు సంతానము కలుగలేదు. అందువలన ఆ గ్రామములోని వారందరు ఆమెను గొడ్రాలుగా భావించుచుండిరి. ఆమె ప్రతిదినము శ్రీగురుమూర్తి దర్శనమునకై క్రమము తప్పకుండా నియమముతో మఠమునకు వచ్చుచుండెను. గురుమూర్తిని దర్శించి భక్తిభావముతో వారికి నీరాజనమునిచ్చి పూజించెడిది. ఈవిధముగా చాలా కాలము గడిచినది. (1-6)

ఒకనాడు ఆ బ్రాహ్మణ స్త్రీ గురునాథుని పూజించి నీరాజనమునిచ్చి, నమస్కరించెను. అందుకు మిక్కిలి సంతుష్టాంతరంగులైన **శ్రీగురుమూర్తి ఆమెను చూచి మందహాసము చేయుచూ ఇట్లు ప్రశ్నించెను-** "అమ్మా! నీవు ప్రతిదినము నా దర్శనార్థముగా వచ్చి హారతినిచ్చి నన్ను సేవించిపోవుచుంటివి. నీ మనసులోగల కోరిక ఏమిటో చెప్పుము. తల్లీ! ఆ నారాయణుడు, గౌరీరమణుడు అగు గురువు యొక్క అనుగ్రహప్రసాదము వలన నీ కోరిక నెరవేరగలదు" అనెను. శ్రీగురునాథుని మాటలను విని గంగయను ఆమె సాష్టాంగవందనము చేసి

వినయముగా చేతులు జోడించి ఇట్లు పలికెను- "స్వామీ! మహాత్మా! **'అపుత్రస్య లోకోనాస్తి' (అపుత్రస్య గతిర్నాస్తి)** సంతానము లేనివారికి ఇహలోకప్రాప్తి గాని, పరలోకప్రాప్తి గాని లేదని శాస్త్రములు చెప్పుచున్నవి కదా! పుత్రులు కలుగని స్త్రీల ముఖమును చూడకూడదని కూడా అందురు. మహానుభావా! అట్టివారలు పాపరూపులు, మహాదోషులు ఔతారని అంటూ ఉంటారు. ఏ స్త్రీ కడుపు పండదో, ఆమె జన్మ వ్యర్థమే కదా! ఉభయ వంశముల యందు గల నలుబది రెండు తరములకు చెందిన పితృదేవతలు పుత్రసంతానమునకై ఎదురుచూచుచుండెదరు. మన వంశములో ఏ ఒక్క సాధ్వియైనను ఒక పుత్రుని ప్రసాదించినచో, తద్వారా మాకు హితము కలిగి అతడు మమ్ములనందరినీ ఉద్ధరించగలడని పితృదేవతలు తలంచుచుండెదరు అని లోకము భావించుచుండును కదా! అంతేగాక, పుత్రసంతానము లేని వంశమునందలి పితృదేవతలకు కూడా అధోగతియే కదా! ఇంకనూ పుత్రుడు లేని గృహము ఘోరమైన అరణ్యమే యగును. అదొక అపవిత్రస్థానముగా తలంపబడును. నా మనోవేదనను గూర్చి నేనేమని వెల్లడించగలను. స్వామీ! నిత్యము నేను స్నానమునకై గంగకు పోయి వచ్చుచుండెదను. అట్టి సమయమున నాతోటి స్త్రీలు తమ పిల్లలను ఎత్తుకొని ప్రీతితో ముద్దాడుచూ వచ్చిపోవుచుండుటను చూచి, నాకు మిగుల అవమానమగుచున్నది. తోటి స్త్రీలందరూ ఇంటి ముంగిట తమ పిల్లలను మిగుల సంతోషముతో ఆడించుచుండెదరు. అట్టి అదృష్టము నా ముఖమున వ్రాసిపెట్టి లేనట్లున్నది. నేను మిక్కిలి దురదృష్టవంతురాలను. ఈ సంసారమునందు వ్యర్థముగా జన్మించితిని. దుఃఖముతో నా గుండె కరిగిపోవుచుండెను. చంకనెత్తుకొనుటకు పిల్లలు లేరు. మగపిల్లలుగాని, ఆడపిల్లలుగాని ఏ ఒక్కరూ కలుగలేదు. ఈవిధముగా వగచి వగచి ఇప్పటికి అరువదియేండ్లు పూర్తియై వృద్ధాప్యదశకు చేరుకొంటిని. ఇక ఈ జన్మలో సంతానము కలుగుటన్నది గుండు సున్నాయే! కనీసం వచ్చే జన్మలోనైనా నాకు సంతానము కలుగునట్లుగా వరమును అనుగ్రహింపవలసినది. మేము పుత్రవంతులము కావలయుననే నా మనోవాసనను పూర్ణమగునట్లుగా తాము దయతో వరమును ప్రసాదింపగలరని, తద్వారా నా మనోరథము సిద్ధించునట్లుగా కృప చూపగలరని" వినయపూర్వకముగా దీనభావముతో వేడుకొనెను. **అంతట శ్రీగురుమూర్తి చిరునవ్వులు చిందించుచూ ఇట్లు పలికెను-** "అమ్మా! రాబోవు జన్మ సంగతి ఎవరికి తెలియును. నీకప్పుడు ఇప్పటి గుర్తు ఎట్లుండును? ఇప్పటి సంగతిని గూర్చి రాబోవు జన్మలో లభించుటకై కోరుకొనుట ఎందులకు? నిత్యమూ మాకు భక్తిభావముతో హారతినిచ్చుచుంటివి. తద్వారా మమ్ములను సంతోషింపజేసితివి. కావున, నీకు మరోజన్మలో కాదు గదా! ఈ జన్మలోనే నీకు ఒక కుమారుడు, ఒక కుమార్తె తప్పక కలుగుదురు. నా మాటను నమ్మవలసినది. ఇది ముమ్మాటికీ నిశ్చయము" అని చెప్పిరి.(7-23)

శ్రీగురునాథుని అవ్యాజమైన, ప్రేమపూర్వకమగు మాటలను విని, మేరలేని ఆనందముతో అంతరంగము ఉరకలు వేయుచుండగా, అత్యంత శ్రద్ధతో వెంటనే ఆమె తన కొంగు ముడి వేసుకొనెను. **అంజలి ఘటించి అత్యంత వినయభావముతో శిరమును వంచి ఇట్లు పలికెను-**

"స్వామీ! కృపాసింధూ! నా మనవినాలింపుము. ఇప్పటికి నా వయస్సు అరవై ఏండ్లు. బహిష్టుకాలము కూడా దాటిపోయినది. ఇక సంతానము కలుగుటెట్లు? సంతానమునకై అనేకవ్రతములు చేసితిని. అనేక తీర్థములను పర్యటించితిని. ఎందరో దేవతలను ఆరాధించితిని. మీ వంటి పెద్దలు అశ్వత్థ ప్రదక్షిణము చేయుమని చెప్పగా అనేక సంవత్సరముల నుండి ఇప్పటివరకు కూడా నిత్యమూ అశ్వత్థమును సేవించి, ప్రదక్షిణములను కూడా చేయుచుంటిని. అనేక కష్టములను అనుభవించితిని. అయినప్పటికినీ అశ్వత్థ ప్రదక్షిణము వలన సంతానప్రాప్తి కలుగునని మిగుల ఆశపడితిని. కాని, నా ఆశ అడియాసగా మిగిలిపోయెను. ఈ జన్మలో సంతానము లేకపోయిననూ రాబోవు జన్మలోనైనా సంతానము కలుగునను ఆశతో అశ్వత్థమునకు సేవ చేయుచునే యున్నాను. కానీ, ఇప్పుడు మీరు నా యెడల మిగుల ప్రసన్నులై ఈ జన్మలోనే సంతానము కలుగునని అద్భుతమైన వరమును ప్రసాదించుచుంటిరి. స్వామీ! నరహరి యతీంద్రా! మీ యెడల, మీ మాటలయెడల నాకు సంపూర్ణ విశ్వాసము కలదు. ఎట్టి పరిస్థితిలోనైననూ తమరి పలుకులు వ్యర్థములు కావు. కాబోవు. ఇది నా మనోనిశ్చయము. గురుదేవా! నన్ను మీరు ఎగతాళి చేయవద్దు సుమా! మీ మాటయందుగల నమ్మికతో మీ నోట విన్న వెంటనే నా కొంగును ముడివేసికొంటిని. ఇప్పుడు గట్టిగా మరొకమారు కొంగుముడి వేసుకొనుచున్నాను. నేను రాబోవు జన్మలో నా మనోరథము ఈడేరవలయునని అశ్వత్థవృక్షమును సేవించుచుండగా, ఈ జన్మలోనే నాకు సంతానము కలుగునని ఒక కుమారుడు, ఒక కుమార్తె తప్పక కలుగుదురని ఇప్పుడే మీరు వరమునొసంగితిరి. నేనెంతయో ప్రయాసపడి చాలాకాలమునుండి అశ్వత్థసేవ చేసితిని. నేను మూర్ఖురాలను. మూర్ఖముతో ఇంతవరకు అశ్వత్థసేవను, ప్రదక్షిణములను గావించితిని. చెట్టు ఏమి ఫలము ఇవ్వగలదు" అని ఆమె పలుకుచుండగా – ఆమె మాటలకు అడ్డు తగిలి శ్రీగురుమూర్తి నవ్వి, **ఆమెతో ఇట్లు చెప్పుచుండెను** – "అమ్మా! అశ్వత్థవృక్షము మహామహిమ గలది. అశ్వత్థసేవ చేయుటవలన అనంతపుణ్యరాశి లభించును. అది వ్యర్థముగా పోదు. అనంతమైన పుణ్యమును ప్రసాదించే అశ్వత్థవృక్షమును నిందించవద్దు. మమ్ములను పూజించినట్లుగనే నీవు అశ్వత్థమును కూడా సేవించుచుండుము. నీకు తప్పక పుత్ర సంతానము కలుగును. భీమరథీనది పరుగెత్తుకొనివచ్చి అమరజా నదీ ప్రవాహమునందు కలగలిసిపోయిన ఈ సంగమస్థానమున ఉభయనదీ ప్రవాహములు నిరంతరము ప్రవహించుచుండును. అచటికి వెళ్ళి స్నానాదులను ముగించుకొని అచటనే అనుష్ఠానమును పూర్తి చేసికొని అశ్వత్థవృక్షమునకు భక్తితో పూజించి, ప్రదక్షిణములను గావించుచుండుము. నిత్యమూ మేము కూడా అక్కడే ఉన్నటువంటి అశ్వత్థవృక్షము వద్దకు అనుష్ఠానమును పూర్తిచేసుకొనుటకై వెళ్ళుచుండెదము. కావున, నీవు మాతోపాటుగా ఆ అశ్వత్థవృక్షమును ఏకాగ్రచిత్తముతో సేవించుచుండుము. తద్వారా నీకు శీఘ్రముగ సంతానము లభింపగలదు. ఈ సందర్భమున నీకు అశ్వత్థవృక్షము యొక్క మాహాత్మ్యమును పరిపూర్ణముగా చెప్పెదను. కడు జాగ్రత్తగా వినుము.(24-39)

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

అశ్వత్థమనగా నారాయణుడే. నేనక్కడే నివసించుచుండెదను అని చెప్పుచున్న గురుని మాటలను విని **ఆమె ఇట్లనెను** - "స్వామీ! అశ్వత్థవృక్ష మహిమను పూర్తిగా నాకు సెలవీయగలరు. దాని గొప్పతనమెట్టిదో, నా మనస్సు స్థిరపడునట్లుగా నాకు తెలియజెప్పగలరు. గుర్వాజ్ఞప్రకారముగా నేను తప్పక భక్తితో అశ్వత్థమును సేవించెదను" అని అనెను. **అంతట గురుడు ఆమెతో ఇట్లు చెప్పుచుండెను**- "అమ్మా! నీవు అశ్వత్థవృక్షమును నిందించుచుంటివి. అది అపారమైన మహిమను కలిగి యుండునది. సమస్త దేవతలు అచ్చోటనే నివసించెదరు. ఇప్పుడు మీకు అశ్వత్థవృక్ష మహిమను వివరించుచుంటిని అని **మరల గురుదేవుడు ఇట్లు చెప్పసాగెను**- "అశ్వత్థవృక్షము యొక్క మహిమ బ్రహ్మాండపురాణమునందు విస్తారముగ వర్ణింపబడినది. బ్రహ్మకుమారుడైన నారదముని నిత్యము మూడు లోకములను పర్యటించుచుండెను. ఒకమారు బ్రహ్మదేవుని అనుమతితో ఆయన భూమండలములోని ఋషుల ఆశ్రమాలను దర్శించుటకు వచ్చెను. నారదుని గాంచిన వారందరూ ఆయనకు ఎదురేగి అర్ఘ్యపాద్యాదులనిచ్చి షోడశోపచారములతో పూజించిరి. **పిమ్మట ఇట్లు పలికిరి** – "నారదమునీంద్రా! మాదొక విన్నపము. అశ్వత్థవృక్షము యొక్క మహిమ ఎంత గొప్పదో మాకు వివరించి చెప్పగలరని అభ్యర్థించిరి. (39–46)

అంతట ఋషుల మాటలను విని నారదమహర్షి ఇట్లు చెప్పనారంభించెను – మహర్షులారా! వివిధ లోకములను పర్యటించుచు నేను ఒకనాడు బ్రహ్మలోకమునకు చేరితిని. పితామహుడయిన బ్రహ్మదేవునకు నమస్కరించి వారిని నేనిట్లు ప్రశ్నించితిని – "పితామహా! అశ్వత్థవృక్షము విష్ణుస్వరూపమని భావించి, దాని మహిమ అపారమైనదని అందరు చెప్పుకొనుచు ఆ వృక్షమును కడు భక్తిశ్రద్ధలతో ఆరాధించుచుండెదరు. కావున, స్వామీ! అశ్వత్థవృక్షము ఏవిధముగ సేవనీయమైనది? దానినెట్లు సేవించవలయును? దాని మాహాత్మ్యమును గూర్చి సవిస్తరముగ నాకు సెలవీయగలరని ప్రార్థించితిని. అందుకు బ్రహ్మదేవుడిట్లు చెప్పెను – **అశ్వత్థవృక్ష మూలమున బ్రహ్మయు, మధ్యన విష్ణుమూర్తియు, ఇక అగ్రభాగమున రుద్రుడును నివసించెదరు.**[1] **దక్షిణ దిశలోగల శాఖలలో శూలపాణియను పరమశివుడు, పశ్చిమ శాఖలలో నిర్గుణుడయిన విష్ణుమూర్తి, ఉత్తరదిశలోగల శాఖలలో నేను అనగా బ్రహ్మ నివసించి ఉండెదము. తూర్పు శాఖలయందు ఇంద్రాదిదేవతలు ఉందురు. మిగిలిన అన్ని శాఖలయందు ఇతర దేవతలందరు అహర్నిశలు నివసించెదరు. గోవులు, బ్రాహ్మణులు, సమస్త ఋషులు, వేదములు, యజ్ఞములు మూలమునందలి వేర్లలో, అంకురములలో నిరంతరము నివసించెదరు. సమస్త నదీతీర్థములు, లవణాది సప్తసాగరములు తూర్పువైపు గల శాఖలయందు ఉండును. మూలమున అకారము, మధ్యభాగమగు కాండమున ఉకారము, పుష్పఫలములయందు మకారము ఈ రీతిగా అశ్వత్థవృక్షమును 'ఓం'కారము – ప్రణవస్వరూపముగా భావింపవలెను. అశ్వత్థ ముఖము ఆగ్నేయ దిశగా ఉండును. త్రిమూర్తులు**

---

[1] శ్లో॥ మూలతో బ్రహ్మరూపాయ మధ్యతో విష్ణురూపిణే । అగ్రతః శివరూపాయ పిప్పలాయ నమోఽస్తు తే ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

ఉండుచోట, ఏకాదశ రుద్రులు, అష్టవసువులు మొదలైన దేవతాగణములు ఉండును. దీనిని భూలోకకల్పవృక్షము అని తెలుసుకొనవలెను. అతులితమైన మహిమలు గలిగిన అశ్వత్థనారాయణుని వర్ణించగల శక్తి ఎవరికుండును అని నారదుడు ఋషీశ్వరులతో పలికెను. త్రిమూర్తులే స్వయముగా ఏ వృక్షము వద్ద నివసించెదరో అట్టి దాని మహిమను ఎవరు ఎంతని చెప్పగలరు. అట్టి వృక్షమును పూజించుటవలన సిద్ధించనిది అంటూ ఇంకేదైనా మిగిలి ఉండగలదా? అనగా సర్వమునూ సిద్ధించును అని తాత్పర్యము. **ఈ మాట విని ఋషులందరూ నారదునితో తిరిగి ఇట్లు ప్రశ్నించిరి–** "మహర్షీ! అశ్వత్థమును పూజింపవలసిన పద్ధతి ఎట్లుండును? ఏవిధముగా పూజించవలెనో, సేవించవలెనో, ఇట్టి విషయమును గూర్చి మేమొకమారు అథర్వణుని ప్రశ్నించినపుడు అతడు అశ్వత్థసేవ చేయవలసిన ఒక పద్ధతిని గూర్చి తెలియజెప్పెను. కానీ, నారదమునీంద్రా! నీవు బ్రహ్మర్షివి. సమస్త ధర్మములు తెలిసినవాడివి. కావున అట్టి విధానమును పూర్తిగా మాకు వివరించవలసినది" అని వారు ప్రార్థించిరి. (47–61)

అంతట నారదుడు ఆ మునీశ్వరులతో ఇట్లు పలికెను – ఈ వ్రతవిధానమును గూర్చి నాతో బ్రహ్మ చెప్పిన మాటలనే తిరిగి మీకిప్పుడు వినిపించెదను. శ్రద్ధగా వినుడు అని చెప్పనారంభించెను. "చైత్రము, ఆషాఢము, పౌష్యము అను మాసములయందు గురువు, శుక్రుడు, అస్తమించిన మూఢమలయందును తారాబలము, చంద్రబలము లేని దినమున ఈ వ్రతమును ప్రారంభింపకూడదు. అన్నివిధముల అనుకూలమగు ఒక శుభముహూర్తమును ముందుగా నిర్ధారణ చేసుకొనిన మీదట అశ్వత్థపూజను, ప్రదక్షిణములను ప్రారంభింపవలెను. ఆ రోజున శుచిర్భూతులై ఉపవాసముతో పూజాదుల కార్యక్రమమును ప్రారంభింపవలెను. ఆదివారము, మంగళవారము, శుక్రవారము, సంక్రాంతి దినములలో, రిక్తతిథులు, సంధ్యవేళ, శుక్లపక్ష చతుర్థి, నవమి, చతుర్దశి తిథులయందు, పర్వదినములయందు, సూర్యచంద్ర గ్రహణములయందు, అపరాహ్ణకాలమునందు, దుర్దినాది వైధృతి యోగములయందు ఈ అశ్వత్థవృక్షమును స్పృశించకూడదు. ఈ వ్రతమును ప్రారంభించుటకు ముందు ద్యూతకర్మ, అసత్యసంభాషణము, పరనింద, ఆత్మస్తుతి, వితండవాదములను వర్జింపవలెను. ఉదయమునుండి మౌనముగా వుండి అత్యంత హర్షోల్లాసములతో దీనిని ప్రారంభింపవలెను. ధరించియున్న వస్త్రములతో సహా చక్కగా స్నానమొనర్చి శుద్ధమైన, నిర్మలమైన వస్త్రమును ధరించి అశ్వత్థవృక్షము క్రింద గోమయముతో అలకవలెను. అనంతరము స్వస్తికాది శంఖపద్మముల రంగవల్లులను వేసి పంచరంగుల చూర్ణములతో పద్మములను నింపి శోభాయమానముగా మండలమును తీర్చిదిద్దవలెను. తిరిగి స్నానము చేసి, తెల్లని వస్త్రములను ధరించి, రెండు కలశములను తెచ్చి రంగవల్లుల యందుగల పద్మములపై ఆ రెండు కలశములను పెట్టి వానిలో గంగ,

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

యమునలను ఆహ్వానింపవలెను. అనంతరము కలశపూజ, పుణ్యాహవాచనము, శాస్త్రవిధిపూర్వకముగా చేసి, తనయొక్క మనోభీష్టమును సంకల్పమునందు చేర్చి, పూజను ప్రారంభింపవలెను. (62-71)

అనంతరము కలశమును తీసికొని ఏడు పర్యాయములు అశ్వత్థవృక్షమునకు స్నానము చేయించవలెను. తిరిగి స్నానము చేసి అశ్వత్థపూజను ప్రారంభింపవలెను. ఈ పూజను పురుషసూక్తయుక్తమైన షోడశోపచారములతో చేయవలెను. అశ్వత్థమునకు పురుషసూక్తమును పఠింపుచూ స్నానము చేయింపవలెను. తదుపరి షోడశోపచారపూజను పూర్తిచేయవలెను. అశ్వత్థవృక్షమును అష్టభుజములతో కూడుకొనిన విష్ణుమూర్తి స్వరూపముగా భావించి, ధ్యానించవలెను. అప్పుడా మూర్తి యొక్క అష్టభుజములయందు శంఖము, చక్రము, వరదహస్తము, అభయముద్ర, ఖడ్గము, డాలు, ధనుస్సు, బాణములు ధరించియున్న అశ్వత్థనారాయణ మూర్తిని ధ్యానింపవలెను. పీతాంబరము ధరించి నిరంతరము లక్ష్మీదేవి సమేతుడైన ఆ మూర్తిని ధ్యానించుచూ అశ్వత్థవృక్షమును పూజించవలెను. త్రిమూర్తులకు నెలవైన ఆ వృక్షము శివశక్తులు లేకుండా ఉండదు. కనుక, వారినికూడా ఆవాహనము చేసి షోడశోపచారపూజ చేయవలెను. వస్త్రముతో లేదా, దారముతో ఆ వృక్షమును చుట్టూరా చుట్టి తిరిగి తమ మనోభీష్టమగు సంకల్పము చెప్పి నెమ్మదిగ ప్రదక్షిణము చేయవలెను. త్రికరణములు అనగా మనస్సు, వాక్కు, కర్మలు అనే ఈ మూడింటితో భక్తిపూర్వకముగా హర్షోల్లాసములతో పురుషసూక్తమును పఠింపుచూ ప్రదక్షిణములు చేయవలెను. లేదా విష్ణుసహస్రనామమును పఠింపుచూ ప్రదక్షిణము చేయవలెను. ప్రదక్షిణమును మౌనముగా చేసిన యెడల అనంతఫలము లభించును. ఒక గర్భవతియైన స్త్రీ నిండైన నీటికుండను ఎత్తుకొని ఎంతటి మందగతిగా నడచుచుండునో, అదేవిధముగా నెమ్మదిగా అడుగులు వేయుచూ ధ్యానముద్రతో ప్రదక్షిణమును చేయవలెను. అట్లు చేయుటవలన తాము వేసే ఒక్కొక్క అడుగునకు అశ్వమేధయాగము చేసినంతటి పుణ్యము లభించును. ఒక్కొక్క ప్రదక్షిణమునకు ముందు, మధ్యలో, చివరగా నమస్కరింపవలెను. ఇట్లు చేయుటవలన బ్రహ్మహత్యాది పాపములు నశించిపోవును. రెండు లక్షల ప్రదక్షిణములను చేసినచో బ్రహ్మహత్యాపాపము తొలగిపోవును. అశ్వత్థ ప్రదక్షిణములవలన సమస్తపాపములు నశించిపోవును. అనేకవిధముల వ్యాధులు, లెక్కలేనన్ని దోషములు, మనము చేసే ప్రదక్షిణలవలన పరిహరించబడును. వేయిసార్లు ప్రదక్షిణలు చేసినచో, జన్మజరామృత్యువులు రాకుండ పోవును. సంసారభయము నశించును. గ్రహదోషములు బాధింపవు. పుత్రసంతానము కోరుకొనువారు దృఢమైన విశ్వాసముతో, దీక్షతో, అశ్వత్థవృక్షమునకు పూజాప్రదక్షిణములను చేసినచో, వారికి సంతానము కలుగుటయే గాక, సమస్త పాపములు, గ్రహదోషములు, సంసారభయము నశించిపోయి చతుర్విధపురుషార్థములు లభించును. సమస్తమనోభీష్టములు నెరవేరును. ఋషీశ్వరులారా! ఇందులో ఎట్టి అనుమానమునకు తావులేదు. శనివారము నాడు వృక్షమును పట్టుకొని మృత్యుంజయ మంత్రమును

జపించినచో, వారు అకాలమృత్యువును జయించెదరు. అశ్వత్థమును ప్రార్థించువారికి అపమృత్యుబాధ వుండదు. వారు నిశ్చయముగ పూర్ణాయుష్మంతులయ్యెదరు. శనిబాధలు వారిని పీడింపజాలవు. శనిబాధలు కలిగినవారు ఈ దిగువ శ్లోకమును పఠించుచూ అశ్వత్థమును ప్రార్థింపవలెను. (72-91)

శ్లో॥ కోణస్థః పింగళో బభ్రుః కృష్ణో రౌద్రాంతకో యమః । శౌరిః శనైశ్చరో మందః పిప్పలాదేన సంస్తుతః ॥

అను శని శ్లోకమంత్రమును పఠింపుచూ దృఢవిశ్వాసముతో అశ్వత్థసేవ చేయుటవలన తప్పనిసరిగా పుత్రలాభము కలుగును. అంతక, యమ, మహారౌద్రీ, మందః, శనైశ్చరః, శౌరిః - అను నామములను జపించుటవలన శని పీడ ఉండదు. ఈవిధముగ మనసును బాగుగా దృఢపరచుకొని అశ్వత్థమును సేవించుటవలన కోరిన కోరిక నెరవేరును. పుత్రులను కోరువారికి పుత్రులు కలిగెదరు. అమావాస్య, గురువారము రోజున అశ్వత్థ వృక్షముయొక్క నీడలో నీటితో స్నానము చేయుటవలన నరుల బ్రహ్మహత్యా పాపము నశించును. అశ్వత్థవృక్షము క్రింద ఒక బ్రాహ్మణునకు అన్నము పెట్టినచో, కోటి బ్రాహ్మణులకు భోజనము పెట్టిన ఫలము లభించును. దాని క్రింద కూర్చొని ఏ మంత్రము జపించిననూ సరే, మరుక్షణమే వేదపఠనము చేసినదానికంటే హెచ్చు గుణిత ఫలము లభించును. మానవులు ఒక అశ్వత్థము వృక్షమును భక్తితో నాటినచో, నలుబది రెండు తరములకు చెందిన పితృదేవతలు ఉద్ధరింపబడి స్వర్గలోకమున నిలకడగా నివసించెదరు. ఇట్టి అశ్వత్థవృక్షమును ఛేదించుట మహాపాపము. ఒకవేళ ఎవరేని ఛేదించినయెడల వారు తమ పితరులతో సహా నరకలోకమునకే వెళ్లుట తథ్యము. అశ్వత్థము క్రింద కూర్చొని హెూమము చేయుటచే మహాయజ్ఞముగా మారును. దానివలన అక్షయ సుకృతములు సమకూరును. పుత్రులు కావాలనెడి కోరిక సునాయాసముగ నెరవేరును" అని అశ్వత్థమహిమను బ్రహ్మదేవుడు నారదునితో చెప్పెను. దానినే నారదుడు ప్రస్తుతము సమస్త ఋషీశ్వరుల మండలమునకు వివరించెను. **ఇంకనూ నారదుడు ఇట్లు చెప్పుచుండెను-** "అశ్వత్థమునకు చేయబడిన ప్రదక్షిణములో పదవ భాగము శాస్త్రోక్తముగా హవనము చేయవలెను. ఎంత సంఖ్య హవనము చేయుదుమో, అందలి పదవ భాగము లెక్కించి బ్రాహ్మణ భోజనము పెట్టవలెను. బ్రహ్మచారులు హవిష్యాన్నమును స్వీకరించి నియమముగా ఈ ప్రదక్షిణములను చేయవలెను. ఈ విధముగ ఆచరించి ఉద్యాపనము చేయవలెను. దీనికోసమై తమ శక్త్యానుసారము బంగారముతో అశ్వత్థవృక్షమును చేయించి బ్రాహ్మణునకు దానమీయవలెను. అంతేగాక, దూడతో కూడిన ఒక తెల్లని ఆవును, మరియు ఆ వృక్షము క్రింద ఒక నువ్వుల రాశిని పోసి దానిపై తెల్లని వస్త్రమును కప్పి నిరుపేదయగు ఒక బ్రాహ్మణునకు దానమీయవలెను. ఈవిధముగా ఆచరించుటవలన సమస్త అభీష్టములను పొందెదరు" అని అశ్వత్థమును పూజించి, ప్రదక్షిణములు చేయు విధివిధానము అంతయూ నారదులవారు ఋషులకు వివరించి చెప్పిరి. అంతట ఆ ఋషులందరును భక్తితో

సమీపమునగల అశ్వత్థ వృక్షమునకు ప్రదక్షిణములను చేసిరని నారదమహర్షి ఋషులకు చెప్పిన వృత్తాంతమును శ్రీగురుమూర్తి ఈ వంధ్యురాలితో చెప్పెను. **తిరిగి ఇట్లు పలికెను** – “అమ్మా! అశ్వత్థమహిమ అనంతమైనది. భక్తిభావము కలిగి ఆచరించువారలకు శాస్త్రోక్తఫలము తప్పక లభించును. నీవు ఎట్టి సందేహమును తలంపక నేను చెప్పిన విధముగా ఈ వ్రతమును ఆచరించుము. నాకు నివాసస్థానమైన సంగమమునకు వెళ్ళి అచటగల అశ్వత్థవృక్షమునకు పూజాప్రదక్షిణములు గావించినచో, తప్పక నీ మనోరథము సిద్ధించును. త్వరలో నీకొక పుత్రుడు, ఒక పుత్రికయు కలుగగలరని చెప్పగా ఆమెయూ గురుమూర్తి మహిమ తెలిసినదగుటచే శ్రీగురువాక్యమును శిరసా వహించినది. అనంతరము ఆమె గురునాథునకు వినయపూర్వకముగా నమస్కరించెను. తిరిగి చేతులు జోడించి భక్తిభావముతో ఇట్లు విన్నవించెను.(92-110)

“స్వామీ! నేను అరవై ఏండ్లు నిండిన గొడ్రాలును. నా కడుపున సంతానమెట్లు కలుగునో తెలియదు. మీరు వరమును ప్రసాదించుటచే నేను తప్పక మీ మాటలను అంగీకరించుచుంటిని. గురువాక్యమనగా కామధేనువని వేదపురాణములు చెప్పుచుండును. స్వామీ! ఇందులో నాకెంతమాత్రమూ అనుమానములేదు. దృఢముగ విశ్వసించితిని. మీ మాటప్రకారముగా అశ్వత్థమును సేవించెదను” అని వారి చరణములపై శిరమునుంచి నమస్కరించి స్వామివారి అనుజ్ఞ గైకొని సంగమస్థలమునకు వెళ్ళెను. సంగమమునకు వెళ్ళి అచటగల షట్కుల తీర్థమునందు స్నానము చేసి అశ్వత్థమును సేవించెను. శ్రీగురుమూర్తి ఆదేశించిన ప్రకారముగా సంగమమునగల అశ్వత్థ వృక్షమునకు మిగుల శ్రద్ధాభక్తులతో పూజాప్రదక్షిణములను ప్రారంభించెను. ప్రారంభించిన నాటినుండి మూడవ దినమున రాత్రికి ఆమెకు ఒక స్వప్నము కలిగెను. ఆ స్వప్నమునందు ఒక విప్రుడు వచ్చి, “అమ్మా! నీ కోరిక నెరవేరినది. నేనొక మాట చెప్పెదను. నీవు అటులనే చేయవలెను అని నమ్మకముగా పలికి నీవు రేపు గురుమూర్తి వద్దకు వెళ్ళి వారికి ఏడు ప్రదక్షిణములనొనర్పుము. భక్తిగా నమస్కరింపుము. అప్పుడు స్వామివారు, నీకు ఏమి ఇచ్చెదరో దానిని భక్తిగా స్వీకరించి భుజించుము. నా మాటయందు నిశ్చయమును కలిగి నీవు గురుసన్నిధిని చేరుకొనుము” అని చెప్పెను. అంతలో ఆమెకు మెళకువ కలిగెను. వెంటనే తన మనసులో శ్రీగురుమూర్తిని స్మరించుకొని ఈ అశ్వత్థము కల్పవృక్షమే అని దృఢముగా భావించెను. నాలుగవ రోజు అశ్వత్థమునకు సేవచేసి గాణగాపురమున మఠములో నున్న గురుమూర్తిని సమీపించెను. వెంటనే వారికి ఏడు ప్రదక్షిణములను పూర్తిచేసి సభక్తికముగా నమస్కరించెను. శ్రీగురుమూర్తి ప్రసన్నులై మందహాసమును చేయుచూ ఆమెకు రెండు ఫలములను ఇచ్చెను. “తల్లీ! వీటిని నీవు భుజించుము. తప్పక నీకు సంతానము కలుగునని చెప్పెను. నీవు విధియుక్తముగా పారణ చేసి అనంతరము ఈ ఫలములను భుజింపుము. ఇంతకుముందు నేను చెప్పినవిధముగా బ్రాహ్మణులకు దానము పూర్తిచేయుము. తప్పక నీ కోరిక సఫలమగును. నీకొక కూతురును, కుమారుని ప్రసాదించితిని. ఇక సంతోషముగా వెళ్ళిరమ్ము” అని అభయమునిచ్చెను. గురుమూర్తి చెప్పిన విధముగా ఆమె

వ్రతమును పూర్తిచేసి దానములనిచ్చి పారణ అనంతరము స్వామివారు ఒసగిన ఫలములను భుజించెను. నాటి సాయంకాలమే ఆమెకు రజోదర్శనమయ్యెను. మూడు దినములపాటు మౌనముగా ఉంటూ కాల్చని మట్టిపాత్రలో భోజనము చేసి, తెల్లని వస్త్రము ధరించి ఇతరులనెవరినీ చూడకుండా సద్భావముతో మూడు రాత్రులు గడిపి నాలుగవ రోజున సుస్నాతయై భర్తతో కలిసి శ్రీగురుని దర్శనమునకై వెళ్ళెను. ఇరువురు దంపతులు భక్తిశ్రద్ధలతో శ్రీగురుమూర్తిని పూజించి, హారతినిచ్చి నమస్కరించిరి. అంతట శ్రీగురునాథుడు మిగుల సంతసించి 'అమ్మా! నీవు తప్పక సంతానవతివి అగుదువు' అని పలికిరి. మరల దంపతులిరువురూ స్వామివారికి నమస్కరించి సెలవు గైకొని ఇంటికి వచ్చిరి. ఐదవరోజున శుద్ధిస్నానమొనర్చి భర్తవలన ఆమె గర్భవతి ఆయెను. గర్భము దినదినాభివృద్ధి నొందుచుండెను. 'ఇదేమి విచిత్రము' అని గ్రామములోని వారందరూ విస్మయము నొందిరి. గురుమహిమ ఎంత గొప్పదో కదా! ఈ గొడ్రాలునకు గర్భము ఎట్లు కలిగెను? అని అందరూ చోద్యముగా ముచ్చటించుకొనుచుండిరి. ఆమె భర్త సోమనాథుడు అంతులేని ఆనందముతో పరవశించిపోయెను. ఏడవమాసము పూర్తయిన పిమ్మట ఆమె ఒడిని నింపి శ్రీగురునివద్దకు వెళ్ళి భక్తిశ్రద్ధలతో హారతులిచ్చి నమస్కరించెను. అక్షయవాయనదానముల నిప్పించెను. ఎనిమిదవ మాసమున ఆమెకు సీమంతము చేయించి గుర్వాజ్ఞతో గ్రామములోని పుణ్య స్త్రీలందరికీ వాయనములనిప్పించెను. జుట్టు నెరసిన వృద్ధాప్యమున ఒక గొడ్రాలికి గర్భధారణయా? ఎంత ప్రీతితో వాయనములనిచ్చుచుండిరి. ఎంతటి అదృష్టము, ఇదేమి వింత? అని అచటికి చేరిన స్త్రీపురుషులందరూ విస్మయముతో ముచ్చటించుకొనుచుండిరి. కొందరు అది శ్రీగురుమహిమ, వారి ప్రసాదప్రభావము, శ్రీనృసింహమూర్తి భక్తవరదుడు. కడు భక్తితో ఆయనను సేవించుటవలన చతుర్విధ పురుషార్థములు అత్యంత సులభముగా లభించి తీరును. ఆ త్రిమూర్తులే నృసింహ సరస్వతి రూపమున మానవ వేషముతో అవతరించిరి. భక్తజనులకు వరప్రదుడై మనోరంజకముగా భూలోకమున అవతరించిరి" అని పలువిధములుగా శ్రీగురునాథుని స్తోత్రము చేయుచుండిరి. ఆమె అత్యంత ఉల్లాసభరితురాలై నిరంతరము గురుస్మరణ చేయుచూ వచ్చిన స్త్రీలందరికీ వాయనదానములను ఇచ్చి, అనంతరము గురుమూర్తికి నమస్కరించి ఆశీస్సులను పొందెను. భక్తవత్సలుడు అత్యంత ప్రసన్నుడై ఆమెను ఆశీర్వదించెను. **ఆ విప్రవనిత కడు ముదముతో రెండు చేతులను జోడించి గురుమూర్తిని ఇటుల స్తుతింపసాగెను**– "పరమపురుషా! మీకు జయము. జయము. మీరే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. పరుసవేది వంటి మీ పలుకులు నా దేహమును సువర్ణమయముగా నొనర్చెను. సమస్త విశ్వమును తరింపచేయుటకే మీరు భూలోకమున అవతరించితిరి. స్వామీ! సాక్షాత్తూ మీరు త్రిమూర్తులే. కానీ వేరొకటి కాదు. మిమ్ములను స్తుతించుట నా నాలుకకు అసాధ్యమైన పని. కృపాసింధూ! దయామయా! అపారమైన మీ మహిమకు సాటియైనది వేరొకటి

లేనేలేదు. దేవదేవా! గురుదేవా! పాహిమాం, పాహిమామ్" అని అనన్యమైన భక్తిభావముతో స్తుతించి శ్రీగురుచరణారవిందములకు వందనము చేసెను. తదుపరి వారినుండి సెలవుగైకొని తన ఇంటికి చేరుకొనెను. (111-143)

నవమాసములు నిండిన ఒక శుభలగ్నమున ఆమె ఒక కన్యకను ప్రసవించెను. జ్యోతిష్కులు ఆమె జాతకమును పరిశీలించి "ఈ స్త్రీకి జన్మించిన నవజాత శిశువు మనసు నిర్మలమైనది. మీ కూతురునకు ఎనిమిది మంది పుత్రులు కలిగెదరు. ఈమె పుత్రపౌత్రులతో, సుఖసంతోషములతో దీర్ఘాయుష్యమును కలిగి విలసిల్లునని" చెప్పిరి. సోమనాథుడు మిగుల ఆనందపరవశుడై అనేక దానధర్మములనాచరించెను. పదిరోజులు గడిచిన పిమ్మట శుద్ధస్నానమును పూర్తిచేసికొని నవజాత శిశువును తీసుకొని గురుదర్శనార్థమై వెళ్ళిరి. పాపను సభక్తికముగా శ్రీగురుచరణముల ముందు పరుండబెట్టిరి. అనన్యమైన భక్తిభావముతో దంపతులిద్దరూ సాష్టాంగవందనమును ఆచరించిరి. అంతట, 'అమ్మా! పుత్రవతీ! లేవమ్మా!' అని ఆప్యాయముగా శ్రీగురునాథుడు ఆశ్వాసనమునిచ్చి అనేకవిధములుగా ప్రేమభావముతో ఆమెను సంతోషపెట్టెను. ఆమె లేచి చేతులు జోడించి, శ్రీగురుమూర్తితో "భక్తవరదా! మా కడుపున బంగారు పంట పండెను. స్వామీ! మీ కరుణను, మీ కృపాప్రభావమును ఏమని వర్ణింపగలను. నేను అశక్తను. మా ఇంటికి సరస్వతి వచ్చెను. కానీ, నా కడుపున పుత్రులు కలుగలేదు. మీరు మీ మాటను నిలబెట్టుకొనవలెను" అని ప్రార్థించెను. అంతట శ్రీగురుడు చిరునవ్వు నవ్వి ప్రసన్నవదనముతో "అమ్మా! ఎంతమాత్రము సందేహము వలదు. తప్పక నీకు పుత్రుడు కలుగును" అని ఆశీర్వదించెను. ఆ పాపను ప్రీతితో తన ఒడిలోకి తీసుకొని అచటివారందరు వినుచుండగా ఆ పాపయొక్క లక్షణములను **శ్రీగురునాథులు ఇట్లు వివరించెను.** (144-152)

"ఈమె బహుసంతానవతియగును. శతాయుష్మంతురాలగును. సౌభాగ్యవతిగా ఉండి తన పుత్రపౌత్రులనందరినీ తన కళ్ళతో దర్శించును. ఆనందమయ జీవితమును గడుపును. ఈమె భర్త మహాజ్ఞాని. అతడు చతుర్వేదములను తెలిసిన పండితుడై యుండును. అష్టైశ్వర్యములతో తులతూగుచూ ఈ లోకమునందు అఖండమైన కీర్తిని పొందెదరు. ఈమె గొప్ప పతివ్రతగా, పుణ్యశీలియై, ధర్మపత్నియై కడు కీర్తివంతురాలగును. అందరికీ ఈమె వందనీయురాలగును. దక్షిణ దేశమునందలి మహారాజు ఈమెను దర్శించుటకై వచ్చును" అని ఆ నవజాత శిశువుయొక్క జాతకమును, ఉజ్జ్వలమైన భవిష్యత్తును శ్రీగురునాథులు తెలియజెప్పి నీకు ఒక పుత్రుడు తప్పక కలుగునని శ్రీగురునాథులు తిరిగి వచించెను. స్వామి మాటలను విన్న పిదప తిరిగి ఆ విప్రవనిత "స్వామీ! తప్పక నాకొక పుత్రుని ప్రసాదించవలెనని" మరల కోరెను. **అంతట గురుడు ఆమెతో ఇట్లనెను** - "అమ్మా! నీకు ఎటువంటి పుత్రుడు కావలెను. యోగ్యుడై, ముప్పదియేండ్ల ప్రాయము కలిగినవాడు కావలెనా? మూర్ఖుడై

దీర్ఘాయుష్మంతునిగా ఉండువాడు కావలెనా?" అని ప్రశ్నించెను. అంతట గురునాథుల మాటలు విని ఆ విప్ర స్త్రీ, "స్వామీ! నాకు యోగ్యుడైన పుత్రుడే కావలయును. అతనికి ఐదుగురుపుత్రులు కలుగవలెనని వేడుకొనెను". భక్తవత్సలుడైన శ్రీగురుమూర్తి, 'తథాస్తు! శుభమస్తు!!' అని వరమును ప్రసాదించెను. మహదానందభరితులైన ఆ దంపతులు కడు సంతసముతో ఇంటికి వెళ్ళిపోయిరి. (153-160)

అనంతరము ఆమెకొక పుత్రుడు కలిగెను. అతనికి ఆ తలిదండ్రులు 'నరసింహ' అని నామకరణము చేసిరి. అతడు గొప్ప వేదశాస్త్రమర్మజ్ఞుడై మిక్కిలి కీర్తిని పొందెను. అతనికి ఐదుగురు పుత్రులు కలిగిరి. వారి కూతురు సరస్వతి గురుమూర్తి చెప్పిన విధముగా కడు కీర్తిప్రతిష్ఠలను సంపాదించి మహదానందముతో జీవించెను. ఆమె భర్త గొప్ప యజ్ఞమును చేసి దీక్షితుడనే పేరుతో ప్రఖ్యాతి నొందెను. అతనికి అఖండ కీర్తి లభించి జగద్విఖ్యాతి నొందెను" అని **సిద్ధుడు నామధారకునితో ఇట్లు పలికెను** - "నామధారకా! అరవై ఏండ్లు నిండిన ఒక గొడ్రాలికి సంతానము కలిగెను గదా! ఆహా! శ్రీగురుకృప ఎంతటి మహామహిమాన్వితమై యుండునో గ్రహించుము" అని సిద్ధముని నుడివెను.

వారి సంవాదము ననుసరించి - "నమ్మి సేవించినవారికి గురుమూర్తి ఒక కల్పతరువగును. గురుకృపకు పాత్రులైనవారు సమస్త అభీష్టములను పొందగలరు. అనన్యమైన భక్తిభావముతో, దృఢమైన చిత్తముతో, అంకితభావముతో శ్రీగురుమూర్తి యెడల భక్తిని కలిగియుండవలెను. అటులే, శ్రీగురుమూర్తిని పూజించవలెను. సమస్త అభీష్టములు నెరవేరును. ఏకాగ్రచిత్తముతో శ్రీగురునాథుని భక్తిగా పూజించినవారికి దైన్యము ఎట్లుండగలదు. కోరినవారికి కోరినవాటిని, కోరనివారికి సమస్తమును ప్రసాదించెడు కామధేనువు వంటిది గురుభక్తి" అని గంగాధర సరస్వతి గురుచరిత్రమును విస్తరించి మనకు తెలియచెప్పెను. (161-168)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు
శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "వృద్ధవంధ్యా సంతానప్రాప్తి" అను ముప్పది తొమ్మిదవ అధ్యాయము ॥ 39 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 168; మొత్తము సంఖ్య - 5414+168 = 5582 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

నలుబదియవ అధ్యాయము

శ్రీ గురు కృపాప్రభావమున ఎండిన మేడికట్టె చిగురించుట - నరహరి యను విప్రుని కుష్ఠువ్యాధి నివారణమగుట - అతడు శ్రీగురుమూర్తిని స్తుతించుట - శ్రీనృసింహ సరస్వతీ అష్టకము - శబరుని గురుభక్తి కథానిక

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధమునీశ్వరుడు నామధారకునితో నుడివెను- "నాయనా! మరొక అద్భుతమైన శ్రీగురులీలను వర్ణించుచున్నాను. ఒక ఎండిపోయిన మేడికట్టెను శ్రీగురుమూర్తి చిగురింపచేసిన అపురూపమైన కథను నీకు వినిపించెదను. చిత్రమైన ఈ కథను శ్రద్ధగా వినుము" అని సిద్ధముని **ఇట్లు చెప్పసాగెను** – "శ్రీగురునృసింహ సరస్వతీ స్వామివారు గాణగాపురములో నివసించినపుడు ఒకనాడు కుష్ఠువ్యాధి సంక్రమించిన ఒక బ్రాహ్మణుడు అచటికేతెంచెను. అతడు ఆపస్తంబశాఖీయుడు. గార్గ్యస గోత్రమునందు జన్మించినవాడు. అతని శుభనామము 'నరహరి'. జన్మాంతర పాపవిశేషము వలన అతడు కుష్ఠురోగముతో బాధపడుచుండెను. అట్టి నరహరి అను ఆ బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తిని దర్శించి వారి దివ్యపాదపద్మములకు భక్తిపూర్వకముగా శిరస్సాష్టాంగవందనమును ఆచరించి, లేచి నిలబడి వినయపూర్వకముగా దోసిలొగ్గి, అనేకవిధములుగా స్తోత్రము చేయుచూ తనను అనుగ్రహించుమని వేడుకొనుచూ తన బాధను ఈరీతిగా విన్నవించుకొనెను. (1-3)

"శ్రీగురుమూర్తీ! మీకు జయము. జయము. భక్తవత్సలా! పరంజ్యోతి! పరమపురుషా! జగద్గురూ! అఖండమైన మీ ఖ్యాతిని విని మీ దర్శనార్థమై మీ చరణసన్నిధిని చేరితిని. నేను ఈ జగత్తునందు బ్రాహ్మణుడనై వ్యర్థముగా జన్మించితిని. నా జన్మ ఒక బండరాయివలె మోడువారినది. స్వామీ! నేనొక కుష్ఠువ్యాధిగ్రస్తుడనై ఉండుటచే బ్రాహ్మణులతోపాటు లోకులందరూ నన్ను నిందించుచుండిరి. ఉదయమున లేచినప్పటినుండి ఎవరునూ నా ముఖమును చూచుటకు ఇష్టపడరు. యజుర్వేద అధ్యయనమును చేసితిని. కాని, వీడు అంగహీనుడని నిందించుచూ నన్నెవ్వరునూ భోజనమునకైననూ పిలువకుండిరి. దానితో నాకు మిక్కుటమైన దుఃఖము, అంతులేని బాధ కలుగుచుండెను. ఘోరుమని ఎంత విలపించిననూ ఈశ్వరుని కృప నాపై లేశమంతయు కలుగకుండెను. గత జన్మలో నేనెంతటి ఘోరమైన పాపములను

చేసియుంటినో, తత్ఫలితముగా భయంకరమైన, జుగుప్సాకరమైన ఈ వ్యాధిని అనుభవించుచుంటిని. స్వామీ! ఇక నేను సహింపలేను. నా ఓరిమి నశించినది. ఇప్పటికి ఇక ఈ జన్మ చాలును. అనేక వ్రతములను ఆచరించితిని. అసంఖ్యాకముగా తీర్థములకు వెళ్ళి స్నానాదికముల నొనర్చితిని. అనేక దేవతలను ఆరాధించితిని. కానీ, ఈ దిక్కుమాలిన వ్యాధి ఎంతమాత్రమూ ఉపశమింపదాయెను. మహాత్మ! జగద్గురూ! అద్భుతమైన మీ కృపాప్రభావమును, అఖండమైన మీ కీర్తిని లోకులద్వారా విని ఇప్పుడు మీ శరణు గోరి మీ చరణ సన్నిధిని చేరుకొంటిని. నిర్హేతుకమైన కృపామూర్తులు, అవ్యాజప్రేమపూరితులైన గురునాథా! నాపై కృపావృష్టిని కురిపింపుము. దివ్యమైన మీ అనుగ్రహము నాకు తప్పక లభింపగలదను గట్టి నమ్మికతో మీ పాదములచెంతకు చేరితిని. ఒకవేళ మీ కృప నా యందు ఎంతమాత్రమునూ ప్రసరింపనియెడల, ఇక ఈ ప్రాణములను త్యజించివేయుటకే నిశ్చయించుకొంటిని. నేడు మీ దర్శనము, ఒక ఇనుపముక్కకు పరుసవేదితో ఏర్పడిన కలయికవలె నాకు తోచుచుండెను" అని నరహరి అను ఆ బ్రాహ్మణుడు ఏకాగ్రచిత్తముతో అనన్యమైన భక్తిభావముతో పదేపదే నమస్కరించుచూ అనేకవిధములుగా వేడుకొనుచూ, గురుమూర్తి యొక్క కృపను యాచించెను. శిష్యోత్తమా! నామధారకా! శ్రద్ధగా వినుము. ఆ బ్రాహ్మణుని కరుణార్ద్రపూరితమైన వచనములను విని దైన్యపూరితమైన ఆతని భావమునకు వివశుడై, **భక్తవత్సలుడైన శ్రీగురుమూర్తి ప్రసన్నవదనులై మందహాసవదనముతో ఆ బ్రాహ్మణుని చూచి ఇట్లు పలికెను.** (4-13)

"బ్రాహ్మణుడా! నీవు నీ పూర్వజన్మలో అనేక దోషములను చేసితివి. అందుకే నీకు ఈ కుష్ఠురోగము సంప్రాప్తమైనది. తద్వారా ఈ జన్మలో మిగుల దుఃఖించుచుంటివి. అయినప్పటికినీ, ఇప్పుడు నేను చెప్పినట్లుగా చేయుము. తత్ఫలితముగా నీ తాపము తొలగిపోవును. భయంకరమైన ఈ వ్యాధి ఉపశమించి పోవును. వెంటనే నీకు దివ్యదేహము లభింపగలదు" అని స్వామివారు చెప్పుచుండెను. ఇంతలో ఒకడు నాలుగు సంవత్సరముల నుండి ఎండిపోయిన ఒక మేడికట్టెను కాల్చివేయుటకై అటువైపుగా తీసికొనివచ్చెను. **అది చూసిన శ్రీగురుమూర్తి ఆ విప్రునితో ఇట్లనెను** – "ఓయీ! బ్రాహ్మణోత్తమా! ఏకాగ్రచిత్తుడవై ఆ ఎండిపోయిన మేడికట్టెను అతనివద్దనుండి అడిగి తీసికొనుము. నేను చెప్పెడి వాక్యమునందు దృఢమైన విశ్వాసమును కలిగి ఆ ఎండిన మేడి కట్టెను తీసికొని సంగమమునకు వెళ్ళి ఆ సంగమేశ్వరునకు తూర్పువైపున గల భీమానదీ తీరమున గుంతను తీసి నాటుము. అనంతరము, నీవు సంగమమునకు వెళ్ళి స్నానము చేసి వెంటనే అశ్వత్థవృక్షమువద్దకు వెళ్ళి దానిని పూజించుము. తిరిగి మరల స్నానము చేసి రెండు చేతులలో రెండు కలశములను ధరించి, వాటినిండా నదీజలమును తెచ్చి నీవు నాటిన ఎండిపోయిన ఈ మేడికట్టెకు దినమునకు మూడుమార్లు భక్తిశ్రద్ధలతో మనస్ఫూర్తిగా స్నానము చేయించుచుండుము. ఏనాడు

ఈ కట్టె సజీవమై చిగురించునో, ఆనాడే నీ పాపములు, నీ దోషములు అన్నియునూ హరించిపోయినట్లుగా భావించుము. వెంటనే, నీకు దివ్యమైన దేహము సిద్ధించును" అని గురునాథుడు ఆ బ్రాహ్మణుని ఆదేశించెను. గురువాజ్ఞను గైకొని వెంటనే ఆ బ్రాహ్మణుడు పరుగెత్తుకొని వెళ్ళెను. ఆ మేడికట్టెను ప్రేమతో అడిగి భక్తితో తీసికొని తలపైన పెట్టుకొని భీమానదీ తీరమునకు చేరెను. గురుమూర్తి సూచనమేరకు ఆ ద్విజోత్తముడు సంగమేశ్వరుని కెదురుగా ఆ ఎండిన మేడికట్టెను పాతెను. తదుపరి శ్రీస్వామివారు వివరించిన విధముగా దృఢమైన విశ్వాసముతో అతడు ఆచరించుచుండెను.(14-24)

ఈవిధముగా అతడు ఉపవాసవ్రతమును పూని నదీజలమును తెచ్చి ప్రతినిత్యము త్రికాలములయందు శుష్కమైన ఆ కాష్ఠమును దృఢచిత్తముతో సేవించుచుండగా ఏడురోజులు గడిచెను. అది చూసి జనులందరూ వింతగా నవ్వుకొనుచు **ఆ విప్రుని పిలిచి ఇట్లు అనుచుండిరి-** "ఓ బ్రాహ్మణుడా! నీకేమైన పిచ్చి పట్టినదా యేమి? ఎండిన కట్టెను ఎందుకు నాటితివి. ఎంతో శ్రమతో దినమునకు మూడుమార్లు జలముతో తడుపుచుంటివి. కొన్నేండ్ల నుండి ఎండిపోయిన కట్టె చిగురించునా? ఇదేమి చోద్యము. ఆ మాటను గురుమూర్తి ఎట్లు చెప్పెను. నీవెట్లు నమ్మితివి. లోకమున ఎక్కడైననూ ఎండిన కట్టె అంకురించుటను గూర్చి మనము చూచియుంటిమా? లేక, వినియుంటిమా? అయితే, శ్రీగురుమూర్తి! కృపాసింధువు! భక్తజనులపాలిట కల్పతరువు. వరదమూర్తి. ఆయన కృప తత్క్షణమే ఫలించును. వారు అందరి మీదను కృపావృష్టిని వర్షింపచేసిరి. కాని, నీ పాపమునకు నిష్కృతి లేనట్లున్నది. అందుకే శ్రీగురుడు నీకొక ఎండుకట్టెనిచ్చి ఇట్లు తడుపుచుండుమని ఆజ్ఞాపించెను. వ్యర్థముగా ఏల శ్రమించెదవు?" అని వారందరూ అతనిని ఇట్లు హేళనగా పరిహసించుచుండిరి. **వారి మాటలను విని ఆ బ్రాహ్మణుడు చేతులెత్తి నమస్కరించి ఇట్లనెను -** "అయ్యా! గురువాక్యము నాకు శిరోధార్యము. నా పాలిట కామధేనువు. గురువాజ్ఞయే నాకు తపస్సు. అది అసత్యమెట్లగును? శ్రీగురునాథులు సత్యసంకల్పులు. వారి మాటలు ఏనాటికి మిథ్య కావని నాకు దృఢమైన విశ్వాసము గలదు. గుర్వనుగ్రహముచేత ఈ ఎండుకట్టె తప్పక చిగురించి వృక్షమై తీరును.అని నేను నిశ్చయముగా నమ్మియుంటిని. నా ప్రాణములనొడ్డి అయినా సరే, శ్రీ గురువాజ్ఞను శిరసావహించెదను" అని ఆ బ్రాహ్మణుడు వారితో పలికి వారివైపు చూడకుండా భక్తిపూర్వకముగా ఎండిపోయిన ఆ మేడికట్టెకు సేవ చేయసాగెను. (25-33)

ఒకనాడు శిష్యులందరూ కలిసి శ్రీగురుమూర్తి వద్దకు చేరి ఇట్లు పలికిరి - "స్వామీ! మీరు ఆ బ్రాహ్మణుని ఎండుకట్టెను సేవించుమని ఆజ్ఞాపించితిరి. అతడు ఏడు దినములనుండి ఉపవసించి ఆ ఎండుకట్టెను సేవించుచుండెను. ఏకాగ్రచిత్తముతో అతడు అత్యంత నిష్ఠాగరిష్ఠుడై

గురువాజ్ఞను పాటించుచుండెను. మూర్ఖుడవై ఈ ఎండు కట్టెను ఎందుకు వృథగా సేవించుచుంటివని మేము అతనికి ఎన్నియో విధములుగా నచ్చజెప్పి చూచితిమి. అందుకు సమాధానముగా ఆ బ్రాహ్మణుడు మాతో "అయ్యలారా! ఈ కట్టెపై నాకు ప్రీతిలేదు. కేవలము గురువాజ్ఞకు మాత్రమే నేను బద్ధుడనై ఈ వ్రతమును ఆచరించుచుంటిని. వారు తప్పక తన మాటను నిలబెట్టుకొని ఏదో ఒకనాటికి నిజము చేసి నిరూపింపగలరనే దృఢమైన విశ్వాసముతో నేను ఇట్లు చేయుచుంటిని. కానీ, ఇది మూర్ఖత్వముతో కూడిన పని మాత్రము కాదు సుమా!" అని ఆతడు మాతో పలికెను. అంతేకాదు, దృఢమైన దీక్షతో ఉపవసించి మంచినీళ్ళు కూడా ముట్టకుండా అతడు ఆ ఎండుకట్టెను సేవించుచుండెను స్వామీ!" అని శిష్యులందరూ కలిసి శ్రీగురుమూర్తికి విన్నవించిరి. **అంతట శ్రీగురుడు వారితో ఇట్లనెను** – "మనసునందు ఎట్టి భావము దృఢపడియుండునో అది అట్లే జరిగితీరును. మన మనోభావమును అనుసరించియే కార్యసిద్ధి కలుగుచుండును. శిష్యునకు గురువాక్యమే శిరోధార్యము. అది ఎప్పటికీ కఠినమని తోచదు. గురువాక్యము నమ్మినవాడికి నష్టము ఎన్నడునూ కలుగదు. అతని అంతఃకరణమందు ఎట్టి భక్తి యుండునో అట్లే యగును. ఇట్టి విషయమును గూర్చి స్కందపురాణాంతర్గతమైన ఒక కథ కలదు. దానిని సూతుడు శౌనకాది ఋషీశ్వరులకు చెప్పిన విధమును మీకు ఇప్పుడు వివరించి చెప్పెదను. **సావధానముగా వినుడు**– ఒకనాడు శౌనకాది మునీశ్వరులందరూ సూతుని ఇట్లు ప్రశ్నించిరి. "సూతమునీ! గురుభక్తిని ఆచరించవలసిన తీరును సవిస్తరముగా మాకు వివరించి చెప్పగలరు". వారికి సూతుడు సవిస్తరముగా గురుభక్తిని గురించి వివరించుచూ ఆతడు చెప్పిన కథనే నేనిప్పుడు మీకు చెప్పుచుంటిని. (34–42)

సూతుడు శౌనకాది ఋషీశ్వరులతో ఇట్లు నుడివెను – జననమరణరూపమైన ఈ సంసారసాగరము నుండి తరింపచేయుటకు గురుభక్తిని మించిన వేరొక సాధనము లేనేలేదు. గురువు యోగ్యుడా? అయోగ్యుడా? అని ఎంతమాత్రము విచారించకూడదు. అతడు జ్ఞానియైనను, అజ్ఞానియైనను ఎంతమాత్రము దానిని పట్టించుకొనకుండా గురువు త్రిమూర్త్యాత్మక స్వరూపుడని దృఢముగా నిశ్చయమును కలిగి, గురువునే ధ్యానించుచూ భక్తిశ్రద్ధలతో గురువును సేవించవలెను. గురువును పరబ్రహ్మస్వరూపునిగా నిశ్చయించుకొని ఎవడైతే ఏకాగ్రచిత్తముతో సేవించునో, అట్టివానికి సర్వధర్మఫలములు సిద్ధించును. గురువును మానవుడని, పొరపాటున కూడా అనకూడదు, వినకూడదు, భావించకూడదు. నమ్మిన గురువును, ఆతని ప్రవర్తనను గూర్చి ఎంతమాత్రమూ ఆలోచించకూడదు. కేవలము ఆయనను ఈశ్వరస్వరూపముగనే భావించవలెను. ఎవరైతే గురువుయొక్క గుణదోషములను విచారించకుండా, గురువే పరబ్రహ్మము, గురువే సర్వస్వము అని దృఢముగా విశ్వసించి, భజించెదరో, వారి యెడల ఈశ్వరుడు తప్పక ప్రసన్నుడగును. (43–47)

శ్లో॥ మంత్రే తీర్థే ద్విజే దేవే దైవజ్ఞే భేషజే గురౌ । యాదృశీ భావనా యస్య సిద్ధిర్భవతి తాదృశీ ॥ (48)

అనగా - మంత్రము, తీర్థము, బ్రాహ్మణుడు, దైవము, దైవజ్ఞుడు అనగా జ్యోతిష్కుడు, ఔషధము, గురువు అను వీటియందు ఎవరు, ఎట్టి భావన చేయుదురో, వారికి అట్టి భావనయే సిద్ధించును. ఇట్టి విషయము నిర్ధారింపబడుటకుగాను పూర్వము జరిగిన ఒక అపూర్వమైన కథను మీకిప్పుడు చెప్పుచుంటినని శౌనకుడు ఋషీశ్వరులకు చెప్పెను. (48-50)

పూర్వకాలమున పాంచాల దేశమునందు సింహకేతువు అను రాజు ఉండెను. అతనికి ఒక పుత్రుడు గలడు. ఆ పుత్రుని పేరు ధనంజయుడు. రాజపుత్రుడగు ధనంజయుడు ఒకనాడు వేట నిమిత్తమై మానవసంచారము లేని ఒక దట్టమైన అరణ్యమునందు ప్రవేశించెను. దారి తప్పి తిరిగి తిరిగి మిక్కిలి దాహపీడితుడై త్రాగుటకు జలము కోసమై వెదకుచూ, వెదకుచూ ఒక మార్గము గుండా వెళ్లుచుండెను. ఆ రాజపుత్రుని వెంట భిల్లజాతికి చెందిన ఒక సేవకుడు కూడా ఉండెను. అతడు కూడా దాహముతో తిరిగి తిరిగి ఎంతో అలసిపోయెను. డస్సిపోయిన ఆ భిల్లుడు అరణ్యములో తిరుగుచుండగా ఊహించని విధముగా అతడు ఒక శిథిలమైన శివాలయమును దర్శించెను. అచట క్రింద పడి పగిలిపోయిన ఒక లింగమును ఆ భిల్లవాడు చూచి ఆనందముతో లేవనెత్తి, చేతిలో పట్టుకొని 'ఆహా! ఈ లింగము ఎంత బాగున్నది' అని అనుకొనెను. చేతిలో ధరించిన ఆ లింగమును భిల్లజాతికి చెందిన ఆ శబరుడు మిగుల ఆనందముతో చూడసాగెను. ఇంతలో రాజపుత్రుడు అతనిని సమీపించెను. "ఏమిటి? విరిగిన లింగమును పట్టుకొని ఏమి చేసెదవు? లింగాకారములో అనేక రాళ్లు భూమిమీద లభించుచుండును" అని ఆ రాజకుమారుడు అనెను. **వెంటనే శబరుడు ఇట్లనెను** - "రాజకుమారా! నిత్యమూ లింగపూజ చేయవలయునని నా మనసులో ఎప్పటినుండియో ఉబలాటముగా ఉండెను. ఇంతలో ఇది కన్పించినది. వెంటనే దీనిని నా చేతిలోనికి తీసుకొంటిని" అనెను. అతని మాటలు విని రాజపుత్రుడు నవ్వుతూ, "ఈ లింగము బాగున్నమాట నిజమే! అయితే, దానిని దృఢమైన చిత్తముతో పూజించవలెనని" పలికెను. **వెంటనే ఆ శబరుడు రాజకుమారునకు నమస్కరించి ఇట్లు నుడివెను** - "రాజపుత్రా! దీనిని ఎట్లు పూజించవలెనో నాకు చెప్పగలరు. నేనొక భిల్లజాతివాడిని. నాకు పూజించు విధము ఎంతమాత్రమునూ తెలియదు. కావున, ఇప్పుడు మీరే నాకు గురువులు. ఆ పూజా విధమును గూర్చి మీరు వివరించగలరు. మిమ్ములనే గురువుగా భావించి, ఈ లింగమును కడు భక్తితో పూజించెదను" అని వినయముతో ప్రార్థించెను. (51-61)

అంతట రాజపుత్రుడు తన దూతయైన ఆ శబరుని చూచి ఇట్లు చెప్పెను - "ఈ పాషాణ లింగమును ఇంటికి తీసికొనివెళ్లుము. చక్కగా స్నానము చేసి పవిత్రుడవై ఒక శుభ్రవస్త్రమును ధరించి, పత్రపుష్పాలను సమర్పించి పూజ చేయుము. నీ భార్యతో కలిసి మీరిరువురూ ఈ

లింగమే ప్రత్యక్షమైన శివస్వరూపము. ఇదియే శివుడు అను నిశ్చయాత్మకమైన భావముతో, మనఃపూర్వకముగా పూజ చేయగలరు. ఈ శివపూజ కోసమై రకరకాల జాతులకు చెందిన పుష్పములను తెచ్చి చక్కగా అలంకరించి, పూజించవలెను. ధూపదీపాదులను సమర్పించి ఆయనకు భస్మమును నివేదించవలెను. అందుకుగాను, నీవు ప్రతిదినము స్మశానములో వుండే నూతన చితాభస్మమును తీసికొనివచ్చి నైవేద్యముగా సమర్పించి మనస్ఫూర్తిగా ఆ ప్రసాదమును స్వీకరించి భక్షించవలెను. ఇంకనూ మీరు ఏయే పదార్థములను భుజించుచుండెదరో, వాటినన్నింటినీ స్వామికి నైవేద్యముగా సమర్పింపవలెను. వాటినే ప్రసాదముగా మీరు స్వీకరింపవలెను. ఈశ్వరపూజా విధానము ఇట్లుండును" అని ఆ రాజకుమారుడు తన సేవకుడైన భిల్లజాతికి చెందిన శబరునకు చక్కగా వివరించి చెప్పెను. ఈవిధముగా ఆ రాజకుమారుడు ఈ శబరునకు గురువయ్యెను. అటులనే ఆ శబరుడు తన మనమునందు రాజకుమారునే గురువుగా విశ్వసించెను. (62-67)

రాజకుమారుని మాటలను విని మిగుల సంతసించి, ఆ శబరుడు అత్యంత హర్షోల్లాసములతో ఆ లింగమును తన ఇంటికి తీసుకొనివెళ్ళెను. 'ఈశ్వరుని దయతో ఈ లింగము నాకు లభించినది. ఇది మనయెడల ప్రసన్నమైనదని ప్రీతితో విషయమునంతయూ తన భార్యకు వివరించి చెప్పెను'. నాటినుండి అతడు గురువు చెప్పిన విధముగా నిశ్చలమనస్కుడై ఆ లింగమును పూజించి, అత్యంత ప్రీతితో చితాభస్మమును తెచ్చి నైవేద్యముగా సమర్పించెడివాడు. ఈవిధముగ కొంతకాలము ఆ శబరుడు తన భార్యతో కలిసి లింగపూజను చేయుచుండెను. ఒకనాడు ఆ నగరములో అతనికి చితాభస్మము లభింపలేదు. చుట్టుప్రక్కలగల అనేక గ్రామములను తిరిగి తిరిగి వెదకి చూచినప్పటికినీ, చుట్టుప్రక్కలగల గ్రామములయందు గల ఏ శ్మశానమునందు కూడా తాత్కాలికమైన చితాభస్మము అతనికి లభింపలేదు. ఏడు గ్రామములను చుట్టి వచ్చి, వట్టి చేతులతో ఆ శబరుడు నిరాశతో ఇంటికి తిరిగివచ్చెను. అతనిలో మిగుల దుఃఖము పెల్లుబుకుచుండెను. కడు చింత రగులుచుండెను. "స్వామీ! మహాదేవా! ఇప్పుడు నేనేమి చేయుదును. నాకీనాడు చితాభస్మము లభింపలేదు. లింగపూజ ఆగిపోయినది. ఎన్ని చోట్ల తిరిగినప్పటికినీ నాకు చితాభస్మము దొరకలేదు కదా! గురువాజ్ఞ ప్రకారము చితాభస్మమునే నివేదించవలెను. లేనియెడల నేటి ఈ శివపూజ వ్యర్థమైపోవును. **గుర్వాజ్ఞను పాటించనివారు రౌరవ నరకములో పడిపోవుదురు. వారి పాపములు ఏనాటికీ తొలగిపోవు. వారెల్లప్పుడూ దారిద్ర్యబాధలోనే మునిగియుందురు. వారి జీవితము అధోగతి పాలగును. చక్కగా గురుభక్తిని ఆచరించెడివారు ఈ భవార్ణవమునుండి తరించిపోవుదురు అని సమస్త వేదపురాణ శాస్త్రములు ఘోషించుచున్నవి.** కనుక, "శబరీ! వినుము. నేడు నా ప్రాణములను వదలివేయుదును. ఇక నేను బ్రతికి ప్రయోజనము లేదు" అని భర్త పలికెను. **భర్త మాటలను విని అతని భార్యయగు శబరి నవ్వి ఇట్లనెను–** "స్వామీ! మీరెందులకు చింతించుచుంటిరి.

మీకు లభించని చితాభస్మమును నేను ఇచ్చెదను. నన్ను ఈ ఇంటిలో పెట్టి అతి శీఘ్రముగా నిప్పంటించుము. ఇంటిలో పుష్కలముగ కట్టెలు గలవు. వెంటనే నా శరీరము దహనమైపోవును. అట్టి భస్మమునే నీవు ఈశ్వరునకు నివేదన చేయుము. వ్రతభంగము చేయవలదు" అని మహదానందభరితురాలై చెప్పుచూ, ఏనాడో ఒకనాడు ఈ దేహము నశించిపోవలసినదే కదా! ఈ కారణముగా ఈశ్వరుని కొరకై నా దేహమును నేను సమర్పించెదనని" పలికెను. భార్య మాటలను వినిన శబరుడు కడు దుఃఖముతో ఖిన్నుడాయెను. "ప్రాణేశ్వరీ! నీ ప్రాణములను నేనెట్లు తీయుదును. ఇంకనూ నీవు తారుణ్యావస్థలోనే ఉంటివి. నీ రూపము రతీదేవివలె శోభిల్లుచుండెను. నీకింతవరకు సంతానము కలుగకుండెను. నీవు సంసార సుఖమును అనుభవింపలేదు కదా! నీ మనసు తృప్తి చెందలేదు. నీ తలిదండ్రులు మా కూతురును ప్రాణప్రదముగ రక్షించుమని నాకప్పగించిరి. సూర్యచంద్రుల సాక్షిగా నేను నిన్ను పెండ్లాడితిని. ప్రాణరక్షణ చేయుదునని ప్రతిజ్ఞ బూని, నా ఇంటికి నిన్ను తెచ్చుకొంటిని. ఇప్పుడు నిన్ను దహనము చేయుటవలన నాకు లెక్కకు అందరాని పాపములు చుట్టుకొనును. పైగా స్త్రీ హత్య మహాపాపము కదా! నేనెట్లు చేయుదును. నీవు నా ప్రాణేశ్వరివి. చూస్తూ చూస్తూ నిన్నెట్లు చంపగలను. శంకరుడు ఎట్లు తృప్తి చెందును. పుణ్యమునకు వెళ్ళి పాపము కొనితెచ్చుకొనినట్లగును. నీ తలిదండ్రులు దుఃఖించెదరు. లోకము నన్ను స్త్రీ హంతకుడని దూషించును. ఈ దేహము కోసమే భక్తితో నేను అనేక వ్రతములు చేసితిని. దానిని నా చేతులతో నేనెట్లు దహనము చేయగలను. నాకు మహాపాపము చుట్టుకొనును" అని పలికెను. (68-89)

భర్త మాటలను విని ఆ స్త్రీ ఇట్లనెను - **"స్వామీ! మీకింతటి జ్ఞానము ఎట్లబ్బెను. ఇంతటి మిథ్యామోహముతో మాట్లాడుచుంటివి ఏమి? ఈ శరీరము స్వప్నప్రాయమని, గంగమీది నురుగువలె అది ఎన్నటికీ స్థిరముగా ఉండదని, క్షణములో నశించిపోవునని, అటులే ఈ శరీరము కూడా క్షణభంగురమని పెద్దలు చెప్పుచుందురు కదా! పుట్టిన ప్రతి ప్రాణికి మరణము తప్పదని కూడా అందురు కదా! కావున నన్ను మీరు వేరుగా చూడవలదు. నా తలిదండ్రులు మీకు నన్నెప్పుడైతే దానముగ ఇచ్చిరో, అప్పుడే నేను మీ అర్ధాంగినైతిని. ఇక మనలో మనకు భేదమనేది ఎక్కడున్నట్లు? మీ ధర్మమే నా ధర్మము. మనసులో విచారించి చూడుము. నేను నీ దేహమునందలి అర్ధ శరీరమును. నన్ను దహనము చేయుటవలన దోషమేమిటి? నేలమీద జన్మించినవన్నీ నశించిపోవలసినవే. ఇట్లు చేయుటవలన నా దేహము సాఫల్యము నొందును. నేను నేరుగా ఈశ్వరునే పొందెదను. ఇందులో ఎంతమాత్రము దోషములేదు. మీరెంతమాత్రము శంకింపవలదు. సందేహము వదలి నన్ను దగ్ధమొనర్చి, సంతోషముతో శివపూజ పూర్తి చేయుము. నాకై నేనుగా కడు ప్రీతితో చెప్పుచుంటిని"** అని ఆమె అనేకవిధములుగా భర్తకు

నచ్చచెప్పి బ్రతిమిలాడెను. భర్త ఎన్నివిధములుగా వలదని నిషేధించినప్పటికినీ ఆమె ఆతని మాటలను చెవికెక్కనీయకుండా నా దేహమును, ఈశ్వరార్పణమొనర్చెదను. మీరెంతమాత్రము సంశయింపవలదని భర్తకు ధైర్యమును చెప్పి వెంటనే తమ గృహమునందు ప్రవేశించి, ద్వారమును బిగించుకొని, "స్వామీ! ఇక ఇప్పుడు ఇంటికి నిప్పంటించుడు" అని పలికెను. అతడునూ ధైర్యముతో పరమేశ్వరుని స్మరింపుచూ గృహమునకు అగ్నిని అంటించెను. వెంటనే అగ్ని జ్వాలలు భయంకరముగ పైకెగసి క్షణకాలములో గృహముతో సహా అతని భార్యకూడా దగ్ధమైపోయెను.(90-97)

అంతట ఆ శబరుడు తన భార్యయొక్క చితాభస్మమును తీసికొని నిశ్చలమైన భక్తిభావముతో శివపూజ యొనర్చెను. శివపూజ పూర్తియైనందులకు అత్యంత ఆనందభరితుడై భక్తిభావముతో పారవశ్యమును చెంది మహదానందములో మునిగిపోయిన అతనికి తన భార్య దగ్ధమయ్యెనను సంగతి కూడా గుర్తు లేదు. నిత్యమూ పూజ పూర్తిచేసిన పిమ్మట ప్రసాదమును స్వీకరించుటకై తన భార్యను పిలచు అలవాటు గలదు. అదే ప్రకారముగ ఆనాడు కూడా "శబరీ! పూజ పూర్తియైనది. ప్రసాదము స్వీకరించుటకొరకు త్వరగా రమ్ము" అని పిలిచెను. అందుకు కృపాసాగరుడైన భోళాశంకరుడు మిగుల ప్రసన్నుడాయెను. భర్త పిలుపునందుకొని అతని భార్యయు ఈశ్వరానుగ్రహమువలన మామూలు రూపముతో ఎప్పటివలెనే వచ్చి ప్రసాదమును స్వీకరించి తిరిగి ఇంటిలోనికి వెళ్ళెను. ఏదో గుర్తుకు వచ్చి శబరుడు వెనుకకు మరలి చూచి ఆశ్చర్యపడి, "అయ్యో! భార్యతోపాటుగా దగ్ధమొనర్చిన ఇల్లు ఎప్పటివలెనే వున్నదేమిటి?" అని దిగ్భ్రాంతికి లోనయ్యెను. వెంటనే భార్యను పిలిచి నీతోపాటుగ ఇంటిని కూడా నేను నిప్పంటించి కాల్చివేసితిని కదా! తిరిగి నీవెట్లు రాగలిగితివి? అని విస్మయావహముతో ప్రశ్నించెను. **అంతట తన భర్తతో ఆ శబరి ఇట్లు పలికెను**– "ప్రాణనాథా! మీరు నిప్పు అంటించుటవరకే నాకు గుర్తుండెను. ఆ సమయమున నాకు గాఢనిద్ర పట్టినది. అనంతరము ఏమి జరిగినదో నాకెంతమాత్రమూ తెలియదు. మీ పిలుపును విని తిరిగి నేను లేచి వచ్చితిని" అని చెప్పెను. "ఓహో! ఇది కేవలము పరమేశ్వరుని పరీక్షయే. ఆహా! మన యెడల శంకరుడు ప్రసన్నుడాయెను కదా!" అని భక్తిభావముతో పరవశత్వమునొందుచున్న ఆ శబర దంపతులముందు సాక్షాత్తూ కైలాసనాథుడు నిజస్వరూపముతో సాక్షాత్కరించి, వారికెదురుగా నిలిచెను. ఎంతమాత్రము ఆలస్యము చేయకుండా తృటిలో ఎగిరి గంతేసి ఆ భార్యాభర్తలిద్దరూ పరమేశ్వరుని దివ్యచరణారవిందములను పట్టుకొని సాష్టాంగ వందనము చేసిరి. తిరిగి చేజారిపోవునేమోనను భయముతో గట్టిగా వారి పాదపద్మములను పట్టుకొనిరి. వారి మూఢభక్తికి ప్రసన్నుడైన పరమేశ్వరుడు, "నాయనా! భక్తాగ్రణీ! ఏదేని వరము కోరుకొనుము" అని పలికెను. కానీ, ఆ శబరి నోటివెంట ఒక్క పలుకైనను రాకుండెను. **ఇంతలో ఈశ్వరుడే**

వారితో ఇట్లనెను - "మీ భక్తిని పరీక్షించుటకొరకే నేను ఇట్లు చేసితిని. ఇదంతయూ నా కల్పనయే తప్ప వేరుకాదు. మీ భక్తికి నేను పరవశించిపోయితిని. మీ దంపతులలో ఒకరిని మించిన మరొకరి భక్తిని గూర్చి చెప్పుటకు మాటలు చాలవు. కావున, ఈ లోకమునందు సమస్త సుఖములను అనుభవించి గొప్ప రాజ్యమును పొంది, తరువాత కల్పకోటి సంవత్సరములు మీరు కైలాసవాసము చేయుదురుగాక!" అని వారలకు వరమునిచ్చి, అనుగ్రహించి అదృశ్యుడాయెను. "ఋషీశ్వరులారా! గురుచరణములయందు ఎవరికి దృఢమైన విశ్వాసముండునో, వారు తప్పక సత్ఫలితములను పొందగలరని, సూతులవారు శౌనకాది ఋషీశ్వరులకు ఈవిధముగా చెప్పెనని" తన **శిష్యులకు గురుమూర్తి చెప్పెను. తిరిగి ఇట్లనెను** - "చూడుడు. ఆ బ్రాహ్మణుడు త్రికరణశుద్ధిగా దృఢవిశ్వాసముతో ఎండుకట్టెను సేవించుచున్నాడు. అతని భావమునకనుసరించియే ఫలము లభించును. ఇది ముమ్మాటికీ నిజమని" గురునాథుడు పలికెను. (98-113)

మరునాడు దయాపయోనిధియగు శ్రీగురునాథులు తాము కూడా అనుష్ఠానము చేయు నిమిత్తముగా సంగమస్థానమునకు వెళ్ళెను. అచట ఎండుకట్టెను సేవించుచున్న బ్రాహ్మణుని, అతని అంతఃకరణమును పరిశీలించి చూచెను. వారి మనసు అత్యంత ప్రసన్నమాయెను. వెంటనే ఆ బ్రాహ్మణుని సమీపించి అతని దృఢమైన నిష్ఠకు, ఆతని శుద్ధమైన మనోభావమునకు, మిగుల ప్రసన్నులై తన చేతిలోని కమండలములోగల ఉదకమును ఎత్తి ఆ బ్రాహ్మణుడు నాటిన ఎండుకట్టె మీద ప్రోక్షించెను. అంతే! క్షణములో ఎండిపోయిన ఆ మేడికట్టె చిగురించి, వెంట వెంటనే పెరిగి పెద్దదై, ఔదుంబర వృక్షరాజమై విరాజిల్లుచూ అందరి కనులముందు కన్పట్టెను. చింతామణి స్పర్శతో ఇనుము బంగారముగ మారినట్లు, శ్రీగురునాథుల దివ్యమైన కమండలములోని అమృతజలమును స్పర్శించిన తోడనే ఎండుకట్టె వృక్షమైనది. ఏ క్షణమున ఆ ఎండుకట్టె ఔదుంబర వృక్షముగ రూపుదాల్చెనో, అప్పుడే, తత్క్షణమే ఆ బ్రాహ్మణుని కుష్ఠురోగము సమసిపోయెను. అతని దేహము దివ్యదేహముగ మారి, బంగారు వర్ణముతో మెరయసాగెను. అందులకు నరహరియను ఆ బ్రాహ్మణుడు మేరలేని సంతోషభరితుడై గురుమూర్తియొక్క కృపాప్రభావమునకు తన్మయుడై, శ్రీగురుచరణ సరోజములకు సాష్టాంగ వందనము చేసెను. అనంతరము లేచి నిలబడి సభక్తికముగ చేతులను జోడించి, ఈ విధముగా మహాస్తోత్రమును చేసెను.(113-119)

1. **ఇందుకోటితేజ కరుణసింధు భక్తవత్సలం । నందనాత్రిసూను దత్త ఇందిరాక్ష శ్రీగురుమ్ ॥**
గంధమాల్య అక్షతాది బృంద దేవవందితం । వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥ 120

2. (1)మాయపాశ అంధకార ఛాయదూరభాస్కరం। అయతాక్ష పాహి శ్రియావల్లభేశ నాయకమ్ ॥
సేవ్యభక్తవృందవరద భూయ భూయ నమామ్యహం। వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥ 121

3. (2)చిత్తజాది వర్గషట్క మత్తవారణాంకుశం। (3)తత్త్వసార శోభితాత్మ దత్త శ్రియావల్లభమ్ ॥
ఉత్తమావతార భూత-కర్తృ భక్తవత్సలం। వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥ 122

4. వ్యోమరాపవాయుతేజ భూమికర్తృమీశ్వరం। కామక్రోధమోహరహిత సోమసూర్యలోచనమ్।
కామితార్థదాతృభక్త కామధేను శ్రీగురుం। వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥ 123

5. పుండరీక-ఆయతాక్ష కుండలేందుతేజసం। చండదురితఖండనార్థ దండధారి శ్రీగురుమ్।
మండలీక మౌళి మార్తాండభాసితాననం। వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥ 124

6. వేదశాస్త్రస్తుత్యపాద ఆదిమూర్తి శ్రీగురుం। నాద బిందు కళాతీత కల్పపాదసేవ్యయమ్।
సేవ్యభక్తవృందవరద భూయ భూయ నమామ్యహం। వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥ 125

7. అష్టయోగతత్త్వనిష్ఠ తుష్ట జ్ఞానవారిధిం। కృష్ణవేణితీరవాస - పంచనదీ - సంగమమ్।
కష్టదైన్యదూర భక్త(4) - తుష్టకామ్యదాయకం। వందయామి నారసింహ - సరస్వతీశ పాహి మామ్ ॥ 126

8. నారసింహ సరస్వతీశ - నామ అష్టమౌక్తికం। హారకృత శారదేన గంగాధర - ఆత్మజమ్।
ధారణీక - దేవదీక్ష గురుమూర్తి తోషితం। పరమాత్మానంద శ్రియా పుత్ర పౌత్ర దాయకమ్ ॥ 127

9. నారసింహసరస్వతీయ అష్టకం చ యః పఠేత్। ఘోరసంసారసింధు తారణాఖ్య సాధనమ్ ॥
సారజ్ఞాన దీర్ఘ ఆయురారోగ్యాది సంపదమ్। చారువర్గకామ్యలాభ వారంవారం యజ్జపేత్ ॥(5) 128

---

1. పాఠాంతరములు - 1. మోహ 2. జాత 3. సత్త్వ

ముఖ్యగమనిక : పై స్తోత్రమునందలి 120 నుండి 128 వరకు గల మూలశ్లోకములను వరుసగా చదువుకొనుటకు వీలుగా చేర్చనైనది. తిరిగి అదే వరుస సంఖ్యతో పఠితల సౌకర్యార్థమై సరళమైన తెలుగు తాత్పర్యములు కూడా పొందుపరచనైనదని గమనింపగలరు.

4. పాఠాంతరములు - భక్తి;

5. "దత్త సంప్రదాయంలో ఈ స్తోత్రమును "మహాస్తోత్రము"గా చెప్పుట పరిపాటి. ఇది అమోఘమైన స్తోత్రము. గాణగాపూర్, వాడి మున్నగు దత్తక్షేత్రములయందు పల్లకీ ప్రదక్షిణ సేవలో దీనినే గానము చేయుదురు. ఈ స్తోత్రమునందలి భాషా, వ్యాకరణ దోషములపట్ల దృష్టి సారించకుండా "ఆర్షప్రయోగము"గా భావించవలెను. "భావగ్రాహీ జనార్దనః" అని కదా శాస్త్రవాక్యం. భక్తుని శుద్ధభావమును మాత్రమే స్వీకరించి భగవంతుడు ఆనందించి, అనుగ్రహించునను శాస్త్రవాక్యమును గమనించగలరని పఠితలకు ప్రత్యేక విజ్ఞప్తి.

భక్తనరహరి చేసిన శ్రీగురుస్తోత్రమునకు తాత్పర్యములు : శ్రీగురుమూర్తీ! కోటిచంద్రుల సమమైన కాంతిపుంజముతో వెలుగొందుచుందువు. కరుణాసముద్రుడవు. భక్తవత్సలుడవు. అత్రినందనుడవు. అత్రి అనసూయలతో 'మయా అహం దత్తః' – నన్ను నేను సమర్పించుకొంటినని పలికి వారికి దత్తకుమారుడవైతివి. నల్ల కలువలవలె సోయగమును చిందించే కన్నులు గలవాడవు. దేవతల సమూహముచేత గంధ, పుష్ప, అక్షతాదులచే పూజింపబడి వారిచే వందనములందు కొనుచుందువు. అట్టి నరసింహ సరస్వతీస్వామీ! నీకు నేను వందనములు అర్పించెదను. నన్ను రక్షింపుము. (120)

మాయాపాశములనెడు చిమ్మచీకట్లను పారద్రోలునట్టి భాస్కరమూర్తివి. విశాలములైన లోకములనేలు దొరవు. నిన్ను సేవించెడు భక్తజన బృందమునకు కోరిన వరమును ప్రసాదించెదవు. అట్టి నీకు మాటి, మాటికి ప్రణమిల్లెదను. శ్రీనరసింహ సరస్వతీస్వామీ! నన్ను (సంసారభయము నుండి) కాపాడుము. నీకు నతులర్పించెదను. (121)

స్వామీ! నరసింహసరస్వతీ! బాగుగా బలిసి పిచ్చెక్కిన మదపుటేనుగులవంటి కామ–క్రోధ–లోభ–మోహ– మద–మత్సరములనెడు ఆరుగురు శత్రువులు నా చిత్తమునందు నిలచి నన్ను చిత్తు చేయుచున్నవాటి మదమును అణగద్రొక్కునట్టి అంకుశము వంటివాడవు. ఉపనిషత్తులు అందించే తత్త్వజ్ఞానమును ప్రకాశింపజేయు ఆత్మస్వరూపుడవైన దత్తాత్రేయుడవు. శ్రియావల్లభుడవు నీవే. ప్రాణికోటికి సృష్టికర్తవైన ఉత్తమ అవతారస్వరూపుడవు. భక్తవత్సలుడవునీవే. అట్టి నీకు అనేక వందనములు సమర్పించెదను. నన్ను రక్షింపుము. (122)

ఆకాశము, జలము, వాయువు, తేజస్సు, భూమి – అను పంచభూతములను సృష్టించిన ఈశ్వరుడవు నీవే. కామ, క్రోధ, మోహ రహితుడవు. సూర్యచంద్రులనే నేత్రములుగా కలిగియున్న వాడవు. భక్తుల కోర్కెలను తీర్చునట్టి కామధేనువు వంటి వాడవు. శ్రీగురుదేవా! నరసింహసరస్వతీ స్వామీ! నీకు అనేక ప్రణతులొనర్చెదను. నన్ను (భవభయమునుండి) కాపాడుము. (123)

స్వామీ! తెల్లతామరరేకులవంటి విశాలములైన కనుదోయిగలవాడవు. నీవు ధరించిన కర్ణకుండలములు నిండు జాబిల్లివలె చల్లని కాంతులతో తళుకులీనుచుండెను. చండ ప్రచండములైన మా పాపములను ఖండించివేయుటకై దండధారివై వెలుగొందుచుంటివి. శ్రీగురుదేవా! (మస్తకమునందు) వర్తులాకారముగ శోభిల్లెడు జటాజూటమును ధరించియుంటివి. నీ ముఖబింబము సూర్యబింబమువలె తేజరిల్లుచుండెను. శ్రీనృసింహ సరస్వతీ! నన్ను గాపాడుము. నీకు వందనములు.(124)

ఎవరి పాదములను సమస్త వేదశాస్త్రములు స్తుతించుచుండునో, అట్టి ఆదిమూర్తివి నీవే సుమా! శ్రీగురూత్తమా! నాదబిందు కళాతీతమగు నిరాకారుడవు. (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు అతీతమైన బ్రహ్మారంధ్రమున నివసించువాడవు). కల్పసూత్రములతో కూడిన వేదవేదాంగములు

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

నీ చరణ సరోజములనే సేవించుచుందును. నిరంతరము నిన్ను సేవించు నిజభక్తబృందమునకు కోరిన వరాలను ప్రసాదించెదవు. భక్తవరదుడవగు శ్రీనారసింహ సరస్వతీశా! నీకు మాటిమాటికి నమస్కరించెదను. నన్ను రక్షింపుము. (125)

అష్టాంగయోగ సంపన్నుడవు. నిత్యతృప్తుడవు. జ్ఞానసాగరుడవు. కృష్ణా, వేణీ అను పంచగంగల సంగమస్థానమందు (నృసింహవాడిలో) నివసించుచుండెదవు. నిన్ను సేవించువారల భక్తికి సంప్రీతుడవై వారి కష్టాలను, దైన్యాలను దూరమొనర్చెదవు. కాదు లేదనకుండా భక్తుల మనోరథములను ఈడేర్చుచుందువు. శ్రీనరసింహ సరస్వతీస్వామీ! నన్ను రక్షింపుము. నీకు నమస్కరింతును. (126)

"నరసింహ సరస్వతి" అను నీ పావనమైన నామమునందలి అష్టాక్షరములకు, అష్టవిధ ముత్యములవంటి శ్లోకములతో గూడిన హారమును గంగాధరపుత్రుడు 'సరస్వతి'యనువాడు అల్లిక జేసి సమర్పించెను. ఎవరైతే దీనిని నిత్యము ప్రేమతో పఠించి, దైవస్వరూపుడగు శ్రీగురుమూర్తిని సంతుష్టపరచెదరో, అట్టివారి యెడల సంప్రీతుడైన పరమాత్ముడు వారికి జ్ఞానమును, పుత్రపౌత్రాదులను, సకల సంపదలను ప్రసాదించి ఆనందపరచును. (127)

శ్రీ నరసింహసరస్వతీ స్వామి వారి అష్టకమును ఎవరు పఠింతురో, వారికి భయంకరమైన సంసారసాగరమును సులభముగా దాటిపోవుటకు ఇది చక్కని సాధనముగా సహకరించును. అంతేగాక, మాటిమాటికి దీనిని జపించువారికి ఆత్మజ్ఞానము, సుదీర్ఘమైన ఆయుష్యము, ఆరోగ్యము, ఐశ్వర్యములతో పాటుగా చతుర్విధ పురుషార్థ ఫలములు కూడా లభించును. (128)

శ్రీగురుమూర్తి కృపాప్రభావమునకు పరవశించిపోయిన నరహరి అను ఆ బ్రాహ్మణుడు ఈవిధముగా స్తోత్రము చేసి పదే పదే నమస్కరించుచుండెను. భగవంతుడగు శ్రీహరి నాపై అనంతకృపావృష్టిని కురిపించెనని అత్యంత మురిపెముతో మాటిమాటికీ గురునాథుని చరణారవిందములకు కోటికోటి వందనములను సమర్పించుచుండెను. అంతట శ్రీస్వామివారు అతని స్తోత్రమును విని మిగుల ప్రీతినొంది, **అతనియెడల మిక్కిలి ప్రసన్నుడై ఇట్లనెను-** "నాయనా! నీవు జ్ఞానరాశివి కమ్ము" అని ఆశీర్వదించెను. అచట చేరినవారందరూ అత్యధిక విస్మయమునొంది, నోటమాటలు పెగలక శ్రీగురునాథుని పాదపద్మములకు నమస్కరించి, భక్తిభావముతో అనేకవిధములుగా వారిని స్తుతించిరి. అనంతరము తమ శిష్యులందరితో కలిసి ఇతర బ్రాహ్మణులను వెంటతీసుకొని శ్రీగురునాథులు తమ నివాసప్రదేశమైన మఠమునకు బయలుదేరిరి. దారిలో గాణగాపుర గ్రామమునకు చెందిన స్త్రీలు, పురుషులు, శ్రీగురుమహిమకు ముగ్ధులై మహదానందమును అనుభవించుచూ, ఆరతి పళ్లెములను సిద్ధముచేసికొని, వీధిలో నిలబడి దారిపొడవునా శ్రీగురునాథునకు మంగళ హారతులనెత్తుచూ జయజయధ్వానములు పలుకుచూ వారి వెంట మఠము వరకు వెళ్ళిరి. మఠమును చేరిన పిమ్మట ఆ రోజున అందరికి గొప్ప సమారాధన జరిగెను. (129-133)

మఠములోనికి ప్రవేశించిన అనంతరము నరహరియను ఆ బ్రాహ్మణుడు గురుమూర్తిని ఉన్నతాసనమునందు కూర్చుండజేసి, షోడశోపచారములతో, అత్యంత భక్తిభావముతో పూజించెను. అనంతరము బ్రాహ్మణులందరకూ అఖండ సమారాధనమును గావించెను. గురుమూర్తి అతని అఖండమైన గురుభక్తికి కడు ముదమునొంది అతనిని తన శిష్యులందరిలో ముఖ్యునిగా స్వీకరించెను. ఆ దినము మొదలుకొని నరహరి యను పేరు గలిగిన అతనికి **'యోగేశ్వరుడు'** అని స్వయముగా గురునాథుడే నామకరణమొనర్చెను. అనంతరము ఆ విప్రుని యెడల అనుగ్రహపూర్వకమైన కృపాదృష్టిని ప్రసరింపజేయుచూ, "నాయనా! నీవు పుత్రపుత్రికా సంతానముతో, అఖండమైన ధనసంపదతో, గో ధనముతో సమస్త సుఖసౌఖ్యములను అనుభవించెదవు. శిష్యులందరిలోనూ నీవే మాకు గొప్ప భక్తుడవు. నీ వంశములోని వారందరూ వేదశాస్త్ర సంపన్నులయ్యెదరు. ఇక నీవు ఏమాత్రమూ చింతించవలదు. వెంటనే నీవు వెళ్ళి నీ కుటుంబమును తీసికొని గాణగాపురమునకే వచ్చి ఇచటనే మీరు నివసించుడు. అనంతరము నీకు ముగ్గురు పుత్రులు కలిగెదరు. అందులో ఒకడు 'యోగి' అను పేరుతో మిగుల ప్రఖ్యాతి నొందును. అతడు నన్నెంతగానో సేవించును. మీ వంశమునకు చెందినవారందరూ మా భక్తులుగా కీర్తిగాంచెదరు" అని ఆ బ్రాహ్మణునకు 'విద్యాసరస్వతీ' మంత్రమును ఉపదేశించి, ఆశీర్వదించెను. "నామధారకా! శ్రీగురునాథుడు చెప్పినట్లుగనే యోగేశ్వరుడనే పేరు పెట్టబడిన ఆ బ్రాహ్మణుని జీవితము చక్కగా సాగిపోయినదని" సిద్ధముని చెప్పి ఈ కథకు స్వస్తి పలికెను.

అనంతరము సరస్వతీగంగాధరుడు ఇట్లు చెప్పుచుండెను- "అద్భుతమైన ఈ గురుకథను ఎవరు శ్రద్ధగా విందురో, పఠింతురో వారికి సమస్త వ్యాధులు నివారణమగును. వారు సకల సౌఖ్యములను అనుభవింపగలరు. సంసార సాగరపు ఆవలితీరమును చేరుటకు ఈ కథను నిశ్చలమైన మనసుతో వినవలయును అని" చెప్పిన సరస్వతీ గంగాధరుడు గ్రంథరూపమున శ్రీగురుచరిత్రమును మనకు ప్రసాదించెను. (134-141)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ - నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "శుష్కకాష్ఠ సంజీవనము" అను నలుబదియవ అధ్యాయము ॥ 40 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 141; మొత్తము సంఖ్య 5582 + 141 = 5723 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

నలుబది ఒకటవ అధ్యాయము

శ్రీగురుదేవులు సాయందేవుని సేవను స్వీకరించుట - అతని గురుభక్తిని పరీక్షించుట - కాశీయాత్రా క్రమమును గూర్చి వివరించుట - త్వష్ట పుత్రునకు వరప్రాప్తి - శ్రీస్వామివారు సాయందేవుని ప్రియశిష్యునిగా స్వీకరించుట - సాయందేవుడు గురువుగారిని స్తుతించుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీ పాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యోత్తముడైన నామధారకుడు గురువుగారి సముఖమున నిలువబడి అత్యంత భక్తితో చేతులు జోడించి, సాష్టాంగవందనమును ఆచరించెను, **లేచి నిలువబడి వినయపూర్వకముగా శిరసు వంచి, దోసిలొగ్గి ఇట్లు సన్నుతించెను–** "సిద్ధమునీశ్వరా! మీకు జయము. జయము. మీ అనుగ్రహమువలన శ్రీగురుచరిత్రమును చక్కగా శ్రవణము చేయుచున్నాను. సందర్భానుసారముగా తాము అనేక ధర్మములను విస్తరించి చెప్పుచుండగా వాటిని శ్రవణము చేసి, నేను ధన్యుడనైతిని. గురుస్మరణము అనే సుధారసమును మెండైన ప్రేమతో నాకు ప్రాశనము చేయించుచుంటిరి. తద్వారా నాలో మహాజ్ఞానమును ప్రకాశింపచేసితిరి. దానితో నేను కృతకృత్యుడనైతిని. స్వామీ! నాదొక చిన్న విన్నపము. దయతో ఆలింపుము. మా వంశమునకు చెందిన పూర్వీకులు శ్రీగురుమూర్తిని ఏవిధముగా సేవించి యుండిరి. శ్రీగురు సన్నిధానమున నివసించి, వారేవిధముగా గొప్ప జ్ఞానమును సిద్ధింపచేసికొనిరి. వారు ఏరీతిగా గురుమూర్తికి సన్నిహితమైన శిష్యులు కాగలిగిరి. ఈవిధముగా మా పూర్వీకులను గూర్చిన వృత్తాంతమును వినవలయునని నాకు మిక్కిలి ఆశగా నున్నది. తాము దయతో అట్టి వృత్తాంతమును వినిపింపగలరని" ప్రార్థించెను. **శిష్యుని ప్రార్థన విని సిద్ధముని అత్యంత ముగ్ధుడై పలికెను–** "శిష్యా! నామధారకా! మీ పూర్వజులను గూర్చిన వృత్తాంతమును చెప్పుచున్నాను. సావధానచిత్తముతో ఆకర్ణింపుము. నాయనా! ఇంతకుముందే (పదమూడవ అధ్యాయమునందు) వాసర గ్రామములో ఉన్నట్టి మీ పూర్వీకుడైన 'సాయందేవుడు' అను బ్రాహ్మణుడు శ్రీగురుమూర్తిని దర్శించి తమ గృహమునకు ఆహ్వానించి వారిని చక్కగా ఆరాధించి, వారికి భిక్ష చేసిన సంగతిని వివరముగా నీకు చెప్పియుంటిని.(1–8)

అనంతరము, శ్రీగురుమూర్తి దక్షిణదిశనుండి గాణగాపురమునకు విచ్చేసి, అచట మఠమునందు ప్రవేశించి నివసించుచున్న సంగతిని, స్థానికముగా జరిగినటువంటి గురుమూర్తి మహిమను, అది దినదినాభివృద్ధి నొందిన వృత్తాంతమును కూడా నీకు నేను వివరించితిని. అయితే, శ్రీగురునాథుడైన శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి అఖండమైన ఖ్యాతి దశదిశలకు విస్తృతముగా వ్యాపించుచుండెను. అట్టి గురుమూర్తి మహిమను విని దూరదేశముల నుండి వారి దర్శనార్థముగా అసంఖ్యాకముగా భక్తజనులు వచ్చి వారి అనుగ్రహమును పొంది తమ తమ మనోరథములను ఈడేర్చుకొని పోవుచుండెడివారు. ఇట్టి విషయమును శ్రీగురునాథుని సందర్శించి వచ్చిన వారి నోట గురుదేవుని మహిమను, అపారమైన ఆయన కృపను గూర్చి మీ వంశ పెద్దయైన సాయందేవుడు వినుట తటస్థించెను. అతి త్వరలో శ్రీగురుమూర్తిని దర్శింపవలెనని అతడు మిక్కుటమైన ఆనందోత్సాహములతో గాణగాపురమునకు పయనమయ్యెను. మాటిమాటికి గురుమహిమను, గురులీలలను మనసులో మననము చేసికొనుటచే, అంతులేని ఆనందము ఆతని అంతరాంతరములలో పొంగిపొరలుచుండెను. కడు భక్తిభావముతో హర్షపులకాంకిత గాత్రుడగుచు కనులవెంబడి బాష్పకణములు కారుచుండగా, చేతులెత్తి స్వామిని కీర్తింపుచూ గాణగాపురమునకు నడక సాగించుచుండెను. దూరమునుండి గాణగాపురము యొక్క ఛాయలు కనిపించిన తత్క్షణము నుండే మాటిమాటికి సాష్టాంగవందనమును చేయుచూ శ్రీగురుమూర్తిని స్మరించుచూ గాణగాపురమును చేరుకొనెను. (9–14)

సాయందేవుడు శ్రీవారి మఠమును చేరుకొనుసరికి, విశాలమైన ఆ భవనములో ఎదురుగా శ్రీగురునాథుడు మందస్మితవదనారవిందుడై కూర్చొనియుండెను. శ్రీగురునాథుని దర్శించిన వెంటనే తాను నిలుచున్న చోటునుండే సాష్టాంగవందనము చేసి మిక్కుటమైన భక్తిభావము పొంగిపొరలుచుండగా, మేను పులకరించుచుండగా చేతులు జోడించుకొని, శిరమును వంచి అత్యంత వినయభావముతో శ్రీ గురుమూర్తి చరణసన్నిధికి చేరుకొనెను. వెంటనే వారి పాదములయందు శిరమునుంచి సాష్టాంగవందనము చేసి భక్తిభావముతో అటూ ఇటూ పడి దొర్లుతూ తన శిరోజములతో వారి పాదములను తుడిచెను. "స్వామీ! ఈనాటికి నా జన్మ ధన్యమైనది. ఇప్పటికిగాని మీ దర్శనభాగ్యము నాకు అబ్బలేకుండెను కదా!" అని అనుచూ లేచి నిలబడి, వినయపూర్వకముగా చేతులు జోడించి, **శిరమును వంచి ఈవిధముగా గురుమూర్తిని స్తుతింపసాగెను–** "మహానుభావా! గురుమూర్తీ! మీకు జయము. జయము. మీరు త్రిమూర్తి స్వరూపులు. మీ దర్శనభాగ్యముతో నేడు నా జన్మము ధన్యమైనది. మా పితృదేవతలు కృతార్థులైరి. నేనొనర్చిన కోట్లాది జన్మల పాపము నశించిపోయెను. గురునాథా! శ్రీనృసింహసరస్వతీ స్వామీ! పరమాత్మా! ఓ స్వయంజ్యోతి స్వరూపా! భక్తవత్సలా! విశ్వపతీ! పాహిమాం. మీ దివ్యమైన శ్రీచరణ సరోజములను వర్ణించుటకు

నేనెంతటివాడను. ప్రభూ! అపారమైన మీ మహిమను నేను ఎంతని వర్ణించగలను స్వామీ! అశక్తుడను. అజ్ఞానిని. మీ చరణములు దివ్యమహిమాన్వితములు. కోట్లాది తీర్థములకు నెలవులు. వాటినే **'చరణం పవిత్రం వితతం పురాణం'** అని వేదములు పదేపదే వర్ణించుచుండెను. సాక్షాత్తుగా నేడు త్రిమూర్తుల అవతార స్వరూపము నాకు సాక్షాత్కారమొసగెను. మీరే త్రిమూర్తులని నా అంతరంగము నిరంతరము సాక్ష్యము నిచ్చుచుండెను. ఒకచేతిలో దండము, మరొకచేతిలో దివ్యామృతజలముతో నిండిన కమండలము ధరించి మనుష్యరూపముతో అల్పజ్ఞులమైన మా కంటికి కనబడుచుంటిరేగాని, మీరు కేవలము బ్రహ్మ స్వరూపులే సుమా! మీ కమండలమునందలి ఉదకమును ప్రోక్షించిన చాలును. మరణించిన వారు లేచి కూర్చొనుచుండిరి. శరణాగతులను రక్షించుటకొరకే మీ హస్తమున దండమును ధరించితిరి. ఆ దండమే కోదండమై మీ దరిజేరిన భక్తుల సమస్త దురితములను దునుమాడుచుండెను. దారిద్ర్యమును తృటిలో నివారించుచుండెను. భక్తవరదా! మీ వలన భక్తజనులు చతుర్విధ పురుషార్థములను పొందుచుండిరి. స్వామీ! కంఠమున రుద్రాక్షమాలను ధరించి, భస్మధారణముతో వ్యాఘ్రచర్మాసనమునందు కూర్చొని చంద్రునివంటి నయనములతో, అమృతమయదృష్టిని ప్రసరింపజేయుచు, సూర్యుని వంటి నేత్రములతో తీక్షదృష్టిని కలిగియుండెడి రుద్రస్వరూపులు మీరే సుమా! అంతేకాదు, శ్రీనృసింహజగద్గురూ! పీతాంబరమును ధరించి ధగధగ మెరిసిపోవుచున్నట్టి ఎవరి దివ్యపాదకమలములయందు సమస్త తీర్థములు నెలకొనియుండునో, భక్తజనుల కోర్కెలను నిర్హేతుకమైన కృపతో ఎవరు నెరవేర్చుచుందురో అట్టి విష్ణుస్వరూపులు కూడా మీరే! అందువల్లనే ఒక వంధ్యకు సంతానమును ప్రసాదించితిరి. ఎండిపోయిన మేడికట్టెను వృక్షముగా మార్చితిరి. గొడ్డుబోయిన బర్రెనుండి పాలను పితికించితిరి. అన్నపూర్ణమ్మ మీలోనే కొలువుదీరియున్నట్లు ఉన్నది. నిరుపేద బ్రాహ్మణునకు అన్నపూర్ణను ప్రత్యక్షము చేయించితిరి. త్రివిక్రమభారతికి విశ్వరూప సందర్శనము చేయించి 'నేనే విష్ణుమూర్తిని' అని నిరూపించితిరి. ఒక పతితుని చేత వేదములను పఠింపజేసితిరి. వేయేల, ప్రభూ! భక్తులను తరింపజేయుటకు దివినుండి భువికి ఏతెంచిన అవతార పురుషులే మీరు" అని ఆ సాయందేవుడు అనేకవిధములుగా గురుమహిమలను గుర్తు చేసుకొనుచూ ప్రశంసాపూర్వకముగా స్తోత్రము చేసి మరల మరల నమస్కరించుచుండగా ఆతని శరీరమునందు గగుర్పాటు కలుగుచుండెను. మేను హర్షపులకాంకితమగుచుండెను. నేత్రములనుండి ఆనందాశ్రువులు ప్రవహించుచుండెను. నిలువబడియుండలేక శరీరము పట్టు తప్పుచుండెను. కంఠము రుద్ధమాయెను. అట్టి పరిస్థితిలో వెంటనే అంజలి ఘటించి ఆనందబాష్పములు కారుచుండగా శ్రీగురునాథుని దివ్యపాదారవిందముల యందు శిరమునుంచి సాష్టాంగవందనము చేసెను. వెంటనే గురుమూర్తి ఆతనిని లేవనెత్తి, శిరమున తన దివ్యహస్తమును ఉంచి 'నీవే మాకు పరమభక్తుడవంటూ' ఆశ్వాసించిరి. **అనంతరము**

ఇట్లు పలికిరి – "సాయందేవా! నీవు ఉత్తమ భక్తుడవు. నీవు చేసిన సంస్తుతి వలన నేనెంతయో తృప్తి చెందితిని. వంశపరంపరగా మీరు నాకు భక్తులై నా దాస్యమొనర్చగలరని నీకు వరమును ప్రసాదించుచున్నాను" అని పలికెను. అంతేకాదు, తిరిగి మిక్కిలి ప్రసన్నుడైన గురుమూర్తి చిరునవ్వు చిందించుచూ ఆతని మస్తకముపై తన హస్తమునుంచి పరిపూర్ణముగా అనుగ్రహించి, "నాయనా! నీవు వెంటనే సంగమమునకు వెళ్ళి, చక్కగా స్నానమొనర్చి, అచటగల అశ్వత్థవృక్షమునకు పూజచేసి తిరిగి మఠమునకు శీఘ్రముగా రావలయును. నీ సహపంక్తిన కూర్చొని నేను ఈనాడు భిక్ష చేయుదును" అని చెప్పెను. కడు ప్రీతికరమైన గురుని వాక్యములను విని ఆనందపరవశుడైన సాయందేవుడు శ్రీగురునాథుని అనుజ్ఞను పొంది వెంటనే సంగమమునకు వెళ్ళి, చక్కగా స్నానము చేసి, అశ్వత్థ నారాయణుని పూజించి, తిరిగి మఠమునకు చేరుకొనెను. (15–37)

ఆతడు వచ్చువరకు భోజనము సిద్ధమాయెను. ఈ లోపున సాయందేవుడు శ్రీగురునాథుని ఉన్నతాసనమున కూర్చుండజేసి షోడశోపచారములతో వారిని ఆరాధించెను. పిమ్మట అతనిని తన సమీపమున కూర్చుండబెట్టుకొని, శ్రీగురునాథులు భిక్ష చేసిరి. మఠమునందు అనేకమంది శిష్యులుండగా అందరికంటెను అత్యంత ప్రీతిపాత్రమైన స్థానమును, భక్తవత్సలుడైన గురుమూర్తి సాయందేవుడను విప్రునకు అనుగ్రహించి, మిగుల ప్రేమతో శ్రీగురునాథుడు అతడిని తన ప్రక్కన కూర్చుండబెట్టుకొని భోజనమును పూర్తిచేసిరి. భోజనానంతరము తమ శిష్యులందరితో సంతోషంగా మఠములో కూర్చొని వుండగా, అప్పుడు సాయందేవుడు అను బ్రాహ్మణుని పిలిచి తన సమీపమున కూర్చుండపెట్టుకొని కడు ప్రీతితో అతనిని గూర్చి ఈవిధముగా ప్రశ్నించిరి. (38–40)

"బ్రాహ్మణోత్తమా! నీవు ఎక్కడినుండి వచ్చితివి. నీ నివాసము ఎక్కడ? మీ గ్రామము పేరేమిటి? మీ దారాపుత్రాదులందరూ కుశలమేనా? మీ జీవనయాత్ర ఎట్లు సాగుచుండెను" అని అతని క్షేమసమాచారములను గూర్చి అడిగెను. అంతట సాయందేవుడు వినయముతో చేతులు జోడించి, గురునాథుడు ప్రశ్నించిన దానికి ప్రత్యుత్తరముగా ఇట్లు చెప్పసాగెను – "స్వామీ! నా భార్యాబిడ్డలు, సోదరులు, అందరూ మీ కృపవలన క్షేమముగా ఉన్నారు. మేము ఉత్తర కంచి అను గ్రామములో నివసించుచున్నాము. కృపాసింధూ! దేవదేవా! మీ కృపావిశేషముచే మేమందరమూ హాయిగా జీవించుచున్నాము. కాని, సంతానముతో, బంధుజనులతో సంసారయాతన కొనసాగుచున్నది. అయితే నాకు శ్రీగురుశుశ్రూష చేయవలెనని మిక్కుటమైన కోరిక గలదు. శ్రీవారి శ్రీచరణముల వద్దనే నివసింపవలయునని నాలో నేను నిశ్చయించుకొంటిని. స్వామీ! కృపతో నా కోరికను మన్నించి తమ శ్రీచరణ సన్నిధానమున నివసించుటకు దయతో అనుమతింపగలరని" ప్రార్థించెను. **సాయందేవుని మాటలను విని శ్రీగురుమూర్తి నవ్వి ఇట్లనెను** – "మమ్ములను సేవించుట కడు ప్రయాసతో కూడిన పని. మేము ఒకేచోట నివసించువారము

కాదు. ఎప్పుడు, ఎక్కడ ఉండెదమో మరెవరికీ తెలియదు. ఒకమారు అడవిలో, మరొకమారు నగరములో వుండెదము. మాతోబాటుగా ఉండుట అత్యంత కష్టదాయకమైన పని. మీవంటి గృహస్థులు మా వెంట ఉండజాలరు. అన్నింటినీ సహించుకొని ఉండగలుగుట క్లిష్టతరమైన కార్యము. కావున, హాయిగా నీవు మీ ఇంటిలోనే నివసించుచూ, గృహస్థధర్మమును నిర్వహించుటయే ఉత్తమము" అని నచ్చ పలికిరి. అంతట **ఆ సాయందేవుడు వినయపూర్వకముగా స్వామితో ఇట్లనెను** – "మహాత్మా! నా ప్రార్థనను అంగీకరించుము. గురుసేవవల్లనే గదా సంసారసాగరము నుండి తరించగలిగే ఉపాయము లభింపగలదు. గురుశుశ్రూష చేయువారు మాత్రమే సులభముగా ఆవలితీరమును చేరుకొందురు. ఇక, వారికి అది కష్టదాయకమెట్లగును? వారు ఎల్లప్పుడు సుఖముగా ఉండెదరు. గురువనుగ్రహము వలన చతుర్విధ పురుషార్థములు సిద్ధింపగలవు. దృఢమైన గురుభక్తి కలిగియున్నవారికి యమపురమునకు వెళ్ళవలసిన పని వుండదు. కావున, గురువును అత్యంత భక్తితో సేవించుటయే ముఖ్యమైన కార్యమని నేను నిశ్చయించుకొంటినని" పదేపదే ప్రార్థించెను. **అందులకు గురుమూర్తి మిగుల సంతోషించి ఆతని మనోభావమును గుర్తించి పలికెను** – "సరే; మంచిది నాయనా! నీ మనసులో భక్తిని దృఢముగా నిలుపుకొని నీవు నిశ్చయించుకొన్న కార్యమునే నిర్వహించుము" అని సెలవిచ్చిరి. నాటినుండి సాయందేవుడు శుద్ధభక్తితో అనుక్షణము గురుమూర్తిని అన్నివిధముల సేవించుచుండెను. ఈ విధముగా మూడు మాసముల కాలము గడిచిపోయెను. "శిష్యా! నామధారకా! అనంతరము జరిగిన ఉదంతమును వినుము" అని **సిద్ధముని ఇట్లు చెప్పుచుండెను.**(41–54)

ఒకనాడు శ్రీగురుడు సంగమానికి వెళ్ళదలచి శిష్యులందరినీ వారించి, ఒక్క సాయందేవుని మాత్రమే వెంట తీసుకొని సంగమమునకు వెళ్ళిరి. ఆ రోజున ఈ శిష్యుని పరీక్షింపదలచినందున ఇతర శిష్యులను ఎవరినీ అనుమతించకుండా కేవలము ఒక్క సాయందేవుని మాత్రమే వెంట తీసికొని సంగమస్థలమునకు వెళ్ళినారు. అచట స్వామివారికి స్వస్థానమైన అశ్వత్థ వృక్షము క్రింద కూర్చొని శిష్యుడైన సాయందేవునితో పగటివేళ ఇష్టాగోష్ఠిగా కాలక్షేపము చేయుచుండిరి. ఇంతలో సూర్యాస్తమయ సమయము కాజొచ్చెను. అంతట శ్రీగురుమూర్తి సాయందేవుని అంతఃకరణము యొక్క తీరుతెన్నులను పరీక్షించవలెనని సంకల్పించెను. ఇంతలో హఠాత్తుగా విపరీతమైన గాలి విజృంభించెను. దానితో వృక్షములు ఊగిపోవుచుండెను. కొన్ని చెట్లు పడిపోవుచుండెను. ఇంతలో చీకటి పడసాగెను. నల్లని దట్టమైన మేఘముల సమూహముతో ఆకాశము నిండుకొనెను. భయంకరమైన ఉరుములు, మెరుపులతో వర్షము ఆరంభమాయెను. రానురాను వర్షము పెరిగిపోయి ముసలాధారగా కురియుచుండెను. గాలి తాకిడివలన గురుమూర్తికి బాధ కలుగుచుండెనని యెంచిన సాయందేవుడు తనపై గల వస్త్రమును తీసి శ్రీగురుమూర్తికి

కప్పి సేవించుచుండెను. తాను స్వయముగా గాలిని, వర్షమును సహింపుచూ దృఢచిత్తముతో వారిని కాపాడుచుండెను. ఇంతలో హెూరుమని వర్షము పెరగసాగెను. తన వస్త్రములను తీసి స్వామివారిపై కప్పి, సాధ్యమైనంతవరకు గురునాథునకు బాధ కలుగకుండా మిగుల కష్టమును తాను సహించుచూ వారిని కాపాడుచుండెను. సుమారుగా రెండు, మూడు గంటలపాటు ధారాపాతముగ వర్షము కురియుచునే యుండెను. ఇంతలో నెమ్మదిగా వర్షపుధారలు తగ్గి హెూరుమని జోరుగా చలిగాలి వీవసాగెను. **అప్పుడు గురుమూర్తి శిష్యుని చూచి ఇట్లనెను–** "నాయనా! నాకు చలిబాధ మిక్కుటముగా నున్నది. వెంటనే మఠమునకు వెళ్ళి చలి కాచుకొనుటకు అగ్నిని తీసికొని రమ్ము" అని ఆదేశించెను. వెంటనే సాయందేవుడు గురువాజ్ఞను స్వీకరించి దృఢమైన మనోనిశ్చయమును కలిగి నిప్పును తెచ్చుటకై బయలుదేరెను. వెళ్ళుచున్న శిష్యుని చూచి శ్రీగురుడు ఒకమారు నవ్వి, "నాయనా! నీవు వెళ్ళుచున్నప్పుడు అటు ఇటు ప్రక్కలకు చూడకుండా నేరుగా త్రోవను మాత్రమే చూచుచూ వెళ్ళుమని" హెచ్చరించి చెప్పెను. అతడును గురువాజ్ఞను అనుసరించియే సంగమమునుండి గాణగాపురమునకు బయలుదేరెను. దట్టమైన చీకటి దాపురించెను. ఒకవైపు ఉరుములు, మెరుపులు, సన్నగా వర్షము కురియుచుండెను. మరొకవైపు కంటికి ఎంతమాత్రము కనిపించని చిమ్మచీకటిలో సాయందేవుడు నడక సాగించుచుండెను. అప్పుడప్పుడు ఆకసమున మెరుపులు మెరిసినప్పుడు కలిగెడు వెలుతురును ఆధారముగా చేసికొని, దారిని దృష్టియందుంచుకొని నెమ్మదిగా నడక సాగించుచుండెను. వర్షము వలన దారి బురదమయమయ్యెను. అడుగడుగునకు కాలు జారిపోవుచుండెను. ఎంతమాత్రమూ నిరుత్సాహపడకుండా, అనుక్షణము గురుస్మరణ మొనర్చుచూ, ధైర్యముతో ముందుకు వెళ్ళుచుండెను. ఈవిధముగా ఆ సాయందేవుడు అతి ప్రయత్నముమీద ఎట్టకేలకు గ్రామమును చేరుకొని మఠమువద్దకు వెళ్ళెను. గట్టిగా కేకలు వేసి, గాఢనిద్రలోనున్న ద్వారపాలకులను లేపెను. వారితో జరిగిన వృత్తాంతమంతయూ వివరించి, గురుమూర్తి కొరకు వెంటనే నిప్పును అందించమని కోరెను. వారునూ కొన్ని కట్టెలను ప్రోగుచేసి, నిప్పును అంటించి, అగ్నిని తయారుచేసిరి. అంతట సాయందేవుడు ఆ ఆ అగ్నిని ఒక కుండలో తీసుకొని బయలుదేరెను. (55–70)

కంటికి కనిపించని అంధకారబంధురమైన ఆ త్రోవగుండా అప్పుడప్పుడూ మెరుపులు మెరయుచున్న వెలుగులో దారిని వెతుక్కుంటూ, తిరిగి సంగమస్థలమునకు వెళ్ళుచుండెను. అట్లు వెళ్ళుచుండగా అతని మనసులో అకస్మాత్తుగా ఒక ఆలోచన మెదలసాగెను. "నాయనా! నీవు వెళ్ళుచున్నప్పుడు ఇరుప్రక్కలవైపు చూడవద్దని గురుమూర్తి చెప్పియుండిరి గదా! అది ఏమై వుండవచ్చునని, దాని రహస్యమేమిటో తెలియపలెనను ఆసక్తి కలిగెను. నెమ్మదిగా తన కుడివైపునకు చూడగా, ఒక అద్భుతమైన గొప్ప సర్పము తన వెంట వచ్చుట కనిపించెను.

ఒక్కసారిగా ఉలిక్కిపడి ఉత్తరదిశవైపు చూడగా అటువైపు నుండి కూడా ఒక మహోద్భుతమైన, ఐదు పడగలను విప్పి అత్యంత తేజోవంతమైన ఘట సర్పము వచ్చుచుండుటను గాంచెను. రెండువైపుల గల గొప్ప సర్పములను చూచి, భయభ్రాంతుడై సాయందేవుడు వెంటనే పరుగెత్తసాగెను. ఆ అడవిలో దారితప్పిపోవుచున్న అతనితో పాటుగా ఆ రెండు సర్పములు కూడా అతనిని వెన్నంటి పరుగెత్తుకొని వచ్చుచుండెను. అదిచూచి అతడు మరింతగా భయపడి ముచ్చెమటలు పట్టి బిక్కుబిక్కుమనుచూ పరుగెత్తసాగెను. అతడు ఎంత త్వరగా పరుగెత్తినను వెనుదిరగకుండా, అతనిని విడిచిపెట్టకుండా, ఆ సర్పములు రెండూ అతని వెన్నంటియే పరువెత్తుకొని రాసాగెను. అయినప్పటికినీ, గురుస్మరణము విడువకుండా దృఢమైన చిత్తముతో గురువు యందు నిశ్చయమును కలిగి గురునామమును స్మరిస్తూ, అత్యంత వేగముగా నడచి సంగమస్థలము వద్దకు చేరబోవుచుండెను. ఇంతలో దూరమునుండియే సూర్యునితో సమానమైన దీపజ్యోతుల కాంతులు గోచరింపసాగెను. గురుమూర్తి అత్యంత తేజోమూర్తియై ఆ దీపకాంతిలో కన్పట్టసాగెను. అనేకమంది బ్రాహ్మణోత్తములు వారికిరువైపులా నిలబడి వేదపాఠమును వల్లించుచుండిరి. స్పష్టముగా అతని చెవులకు వేదధ్వని వినిపింపసాగెను. అత్యంత ఆశ్చర్యముతో ముందుకు నడచి సాయందేవుడు అశ్వత్థ వృక్షము వద్దకు సమీపింపగా, కేవలము ఆ అశ్వత్థ వృక్షము క్రింద గురుమూర్తి ఒక్కరే కన్పట్టిరి. అంతకుముందు తన కంటికి కనిపించిన దృశ్యమంతయూ అదృశ్యమాయెను. కొన్ని క్షణాలలో అంధకారబంధురమంతయూ విడిపోయి, నిండుపున్నమి నాటి చంద్రుడు చల్లని పండు వెన్నెలల వెలుతురును కురిపించుచూ నేత్రపర్వముగా గోచరించెను. తాను తెచ్చిన అగ్నిని మరింతగా జ్వలింపచేసినపుడు గొప్పగా ప్రకాశము ఏర్పడెను. ఇంతలో తన వెంట వచ్చిన ఉభయ సర్పములు వచ్చి శ్రీగురుమూర్తికి వందనము చేసి, వారి అనుమతిని గైకొని పాతాళలోకమునకు వెళ్ళిపోయెను. ఇదంతయూ ఆ సాయందేవుడు సావధానముగా నిరుత్తరుడై చేతులు కట్టుకొని తిలకించుచుండెను. అంతట శ్రీగురుడు నవ్వుచూ, “నాయనా! ఏల భయపడితివి. నిన్ను రక్షించుటకొరకే మేము ఈ రెండు సర్పములను పిలిపించితిమి. ఇప్పుడు నీవేమీ భయపడవలసిన పనిలేదు. మాకు సేవచేయుట అతి కఠినమైన పనియని, మేము ముందే నీకు తెలియపరచితిమి. కనుక, ఇప్పుడైననూ ఒకమారు పునరాలోచించుకొని గురుసేవను చేయుటకు అంగీకరించే ప్రయత్నమును పరిశీలించుము. గురుభక్తి చాలా క్లిష్టతరమైనది. అయినప్పటికినీ దృఢమైన నిష్ఠతో, నిశ్చల భక్తిని కలిగి సేవించినచో, అట్టి శిష్యునకు ఈ కలికాలభయము వుండనే వుండదు” అని గురుమూర్తి చెప్పుచూ ఆ సర్పములను నీ కొరకే పాతాళలోకమునుండి పిలిపించి నీకు సహాయముగా పంపించితిని. తిరిగి అవి తమ లోకమునకు వెళ్ళిపోయినవి. నీవు భయపడవలసిన పనిలేదు” అని అతనికి అనుగ్రహపూర్వకముగా ఓదార్చి చెప్పెను. (71-83)

అంతట సాయందేవుడు ఆలస్యము చేయకుండా వెంటనే **శ్రీగురు చరణకమలములను పట్టుకొని సాష్టాంగ వందనము చేసి పలికెను**- "స్వామీ! నా యందు దయజూపుడు. నాకు స్థిరమగు గురుభక్తి కలుగునట్లుగా అనుగ్రహించుము. దృఢమగు గురుభక్తిని సాధించుటకు సాధ్యమైన చక్కని సాధనమును తమరు నాకు అనుగ్రహింపవలసినది" అని ప్రార్థించెను. **అంతట శ్రీగురునాథులు సాయందేవుని అనుగ్రహించి నుడివెను** - "నాయనా! ఇక రాత్రి సమయము అంత ఎక్కువగా లేదు. కాని, బ్రాహ్మీముహూర్తము సమీపించువరకు గురుభక్తిని గూర్చిన ఒక చక్కని కథను నీకు చెప్పెదను. శ్రద్ధగా వినుమని చెప్పనారంభించెను. (84-86)

పూర్వము ఒకనాటి సమయమున రమ్యమైన కైలాసశిఖరమునందు పార్వతీపరమేశ్వరులు హాయిగా ఏకాంతవాసము చేయుచుండిరి. అంతట పార్వతీదేవి పరమేశ్వరుని చూచి, "స్వామీ! గురుభక్తి ఎట్లుండును? దానిని గురించిన విశేషములను దయతో నాకు వినిపించగలరని" కోరెను. **అంతట శంకరుడు గిరిజాదేవితో ఇట్లు చెప్పసాగెను** - "గురుభక్తి చాలా గొప్పనైనది. గురుభక్తితో సమస్తమూ సాధ్యము కాగలదు. ముందుగా శివుడే గురువు అని గ్రహించుము. అట్టి దృఢమైన అధ్యవసాయముతోడనే గురువును సేవింపవలెను. గురువుయందు భక్తిని కలిగియుండవలెను. ఇట్టి విషయమును నిరూపించగలిగిన ఒక ఆఖ్యానమును నీకు వివరించి చెప్పెదను. నిశ్చలమనస్కురాలవై వినుము. గిరిజా! అనేకమైన జపములు, తపములు, యజ్ఞములు అవిలంబముగా ఎంతకాలము చేసినప్పటికినీ, అనుష్ఠించినప్పటికినీ, అందుకు కొంత ఆలస్యముగనే ఫలము లభించును. కానీ, గురుభక్తి వలన తత్కాలమునందే ఫలము లభించును. అనేకవిధముల తపస్సులు, అనుష్ఠానములు, యజ్ఞములు, మహాదానాదులను చేయుటలో కొన్ని విఘ్నములు ఏర్పడే అవకాశము ఉండియుండును. ఒక్కొక్క పర్యాయము అవి పూర్తి సాధ్యములుగా నెరవేరుట కూడా దుర్లభములు అగుచుండును. కాని, గురుభక్తి చేయువారికి కఠినమైన యజ్ఞదాన తపస్సులు చేసిన ఫలమంతయునూ వెంటనే సిద్ధించును. గురుగృహమునందు నివసించుచూ, నిశ్చలమైన, నిర్మలమైన భావముతో శ్రీగురుమూర్తిని ఆశ్రయించి, ఆరాధించినవారికి అత్యంత సులభముగా, అప్రయత్నముగా, అంతులేని ఫలము లభించును. ఇందుకు ఒక విచిత్రమైన దృష్టాంతమును వివరించెదను వినుము. (87-95)

సృష్ట్యాదియందు బ్రహ్మయొక్క అవతారముగా త్వష్టబ్రహ్మ (త్వష్ట ప్రజాపతి) వ్యక్తమయ్యెను. అతనికి ఒక పుత్రుడు కలిగెను. అతడు అత్యంత రూపలావణ్యసంపన్నుడు. సమస్త కార్యములను నెరవేర్చుటలో ఆ కుమారుడు అత్యంత కుశలుడు, తెలివైనవాడు. ఇంతలో అతడు ఉపనయనమునకు యోగ్యుడాయెను. ఆ త్వష్టబ్రహ్మ తన కుమారునకు ఉపనయనమును పూర్తిచేసి విద్యాధ్యయనము కొరకై గురుకులవాసమునకు

★ దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా ★

★ దత్త గురో దత్త గురో దత్తాత్రేయ అవధూత గురో ★

పంపెను. ఆ బ్రహ్మచారి గురువుగారి గృహమునందు ఉంటూ విద్యాధ్యయనము చేయుచూ అనేకవిధములుగా అత్యంత భక్తిశ్రద్ధలతో గురుశుశ్రూష చేయుచుండెను. ఒకనాడు గొప్ప వర్షము వచ్చి గురువుగారి కుటీరమంతయూ శిథిలమైపోయెను. అంతట గురువు తన శిష్యుని పిలిచి మా కుటీరము ప్రతియేటా శిథిలమగుచుండెను. కావున, నీవు ఒక గృహమునకు తగిన ఉపకరణములను ప్రోగుచేసి నాకొక దృఢమైన గృహమును నిర్మించి ఈయవలెను. ఆ గృహము ఏనాటికీ శిథిలము కాకూడదు. సుస్థిరమై యుండవలెను. అది కంటికి కడు రమ్యముగా, మనోహరముగా కనిపించుచుండవలెను. అందులో మా కుటుంబమునకు సరిపోవు సమస్త వస్తువులు ఉండవలెను. అట్టి గృహమును వెంటనే నీవు నిర్మించవలెను" అని గురువు ఆజ్ఞాపించెను. అప్పుడు గురుపత్ని ముందుకువచ్చి కడు ప్రీతితో శిష్యుని వైపు చూచి, "నాయనా! నాకు కుట్టులేనిది, అల్లిక లేనిదగు ఒక రవికను తెచ్చిపెట్టుము. అది విచిత్రమైన రంగులతో, చూడ మనోహరముగా ఉండవలెను. నా శరీరమునకు చక్కగా సరిపోవలెను. అట్టి రవికను ఒకటి తెచ్చిపెట్టుమని" కోరెను. ఇంతలో గురుపుత్రుడు ఈ బ్రహ్మచారిని సమీపించి "సోదరా! నేను నిన్నొకటి అడిగెదను. అది నాకు తెచ్చి ఈయవలెను. నా పాదములకు సరిపోవునట్టి పాదుకలను తెచ్చిపెట్టుము. అవి నీటిమీద కూడా నడచుటకు వీలుగా ఉండవలెను. వాటికి బురద అంటకూడదు. అవి పాదములకు పెద్దవి కాకుండ సరిసమానముగ ఉండవలెను. వాటిని ధరించి నేనెచటికి వెళ్ళవలెనని సంకల్పించెదనో, క్షణములో నేనచటికి చేరుకొనవలెను. అట్టి మహిమాన్వితమైన పాదుకలను తెచ్చి ఈయమని" అతడు కోరుకొనెను.

ఇంతలో గురువుగారి పుత్రిక కూడా ముందుకు వచ్చి, అతనిముందు నిలిచి ఇట్లు పలికెను– "నాకు కూడా ఒక విచిత్ర వస్తువు కావలయును. నేను ఆడుకొనుటకు ఒకే ఏనుగు దంతముతో తయారుచేసిన బొమ్మరిల్లును తెచ్చిపెట్టుము. అది ఒంటి స్తంభముతో ఉండవలెను. ఆ బొమ్మరిల్లు దృఢముగను, ఎప్పుడునూ చెడిపోకుండగను, ఎల్లప్పుడు నిత్యనూతనముగా ఉండవలెను. నేనెచటికి వెళ్ళిననూ అది అచటనే ఉండవలెను. అన్ని వసతులతో కూడుకొని యుండవలెను. ఆ బొమ్మరింటిలో పీటలు, దీపమును ఉంచెడు బల్ల కూడా ఉండవలెను. అటులే వంట చేయుటకు ఒక పాత్రకూడా కావలెను. ఆ పాత్ర నాకు వంట చేయుటను నేర్పించవలెను. ఎంత వండిననూ అది మసి కాక ఉండవలెను. పాత్రను ముట్టుకొనుటకు వేడిగా ఉండకూడదు. అట్టి వంటపాత్రను తెచ్చి యిమ్మని కోరెను. అంతేకాక, నాకు రెండు కర్ణాభరణములను కూడా తెచ్చి యిమ్మని" ప్రత్యేకముగా గురుకన్యక కోరెను. కోరినవాటిని అన్నింటినీ తాను శ్రద్ధగా విని అందులకు అంగీకరించి, గుర్వాజ్ఞను స్వీకరించి ఆ శిష్యుడు వెంటనే బయలుదేరి నడచి, నడచి ఒక మహా అరణ్యములో ప్రవేశించెను. దారిలో

ఈవిధముగ తనలో తాను తలపోయసాగెను. 'నేను బాలబ్రహ్మచారిని. ఏమియూ చేతకానివాడను. ఇట్టి వస్తువుల గురించి నాకెంతమాత్రమూ తెలియనే తెలియ కదా! ఇంతింత గొప్పనైన పనులను నేనెట్లు సాధింపగలను? నాకెవరు ఆధారముగా నిలిచెదరు. నేనెట్లు చేయగలుగుదును. విస్తరిని కూడా కుట్టడము తెలియనివాడికి ఇంత గొప్ప కార్యమును సాధించుటకు ఎట్లు సాధ్యమగును? వారు చెప్పిన పనిని నేను వినకుండా నిరాకరించినచో, వారు తప్పక నన్ను శపించెదరను భయముతో తెచ్చెదనని అంగీకరించి గురువు వద్ద సెలవు తీసికొని బయలుదేరి వచ్చితిని. ఇప్పుడు నేనేమి చేయుదును. నాకెవరు దిక్కు. ఒకవేళ పనిపూర్తి చేయనియెడల గురువు నన్ను తప్పక దూషించును. ఇక నాకు గతి ఏమిటి?' అని పరిపరివిధముల చింతించిన మీదట ధైర్యమును కూడగట్టుకొని ఒకసారి శ్రీగురుచరణములను స్మరించుచూ ధ్యానించెను. ఇప్పుడు నేనెవరిని శరణు కోరవలెను. నేను అశక్తుడనై యుండికూడా ఎందుకు అంగీకరించితిని. కాని, 'గురువాక్యము నాకు శిరోధార్యము కదా! ఏది ఏమైననూ కృపానిధియగు గురువు తప్ప నా ప్రాణములను మరెవరు కాపాడగలరు. ఒకవేళ గురువాజ్ఞను నేను పూర్తి చేయని యెడల నా ప్రాణములను వదలిపెట్టెదను. తప్పక నేను గురువాజ్ఞను శిరసా వహించి తీరవలెను. గురుకృపవలన ఇది సాధ్యమగును, అని ఆ బాలబ్రహ్మచారి తనలో తాను దృఢముగ నిశ్చయించుకొని ప్రాణములను త్యజించియైనను గురువుగారి కోరికను నెరవేర్చెదను గాక!' అని నిశ్చయించుకొనెను. దృఢమైన విశ్వాసముతో గురువును స్మరించుచూ, దట్టమైన అరణ్యములో అనేకవిధములుగా చింతించుచూ ఎంతోదూరము నడచి శ్రమచెంది అలసిపోయెను. (95-122)

అయిననూ, నిరుత్సాహపడకుండా ముందుకు సాగుచుండెను. ఇంతలో అతనికి ఒక అవధూత ఎదురయ్యెను. ఆ బ్రహ్మచారిని చూసి అతనివద్దకు వచ్చి, "నాయనా! నీవు ఎవడవు? ఎవరి కుమారుడవు? ఎచటికి వెళ్ళుచుంటివి? నీ ముఖము చింతాక్రాంతమై మలినముగ కన్పట్టుచుండెను. ఏదియో భారమైన విచారమునకు గురియైనట్లుగా నాకు తోచుచున్నది. కావున, నీ మనోవ్యాకులమునకు కారణమైన వృత్తాంతమును నాకు వివరించి చెప్పుము" అనెను. అంతట ఆ బ్రహ్మచారి తనకెదురైన ఆ అవధూతకు వందనమాచరించి, **చేతులు జోడించి పలికెను**– "స్వామీ! చింతాసాగరమునందు మునిగిపోవుచున్న నన్ను దయతో తాము తరింపచేయుడు. నన్ను రక్షించుడు. గొప్ప శోకసముద్రములో నేను మునిగిపోయితిని. మీ దర్శనమాత్రముచే నా కష్టము కడతేరగలదను విశ్వాసము కలుగుచుండెను. దూడకోసము వెళ్ళే ఆవువలె మీరు నాకు గొప్ప నిధివలె లభించితిరి. అత్యంత దుఃఖపీడితయైన నా మనస్సు, మీ దర్శనభాగ్యముతో వెంటనే శాంతించెను. చకోరపక్షివలె మీ దర్శనమాత్రముచేతనే నా మనసునకు మిగుల ఆహ్లాదము లభించెను. స్వామీ! కృపాసింధూ! పరమపురుషా! నేను గత జన్మలో చేసిన పుణ్యము

ఏదైన మిగిలియున్నచో దానికి ఫలితముగా నిధానమైనట్టి మీ దర్శనభాగ్యమే నేడు నాకు లభింపగలిగెను. కాకులు దూరని ఈ కారడవిలో నాకు మీ దర్శనము లభించుట ఎంతో విచిత్రముగా తోచుచుండెను. మీ పేరేమిటో సెలవీయగలరు. తమరు ఎచటినుండి ఇటుగా వచ్చుచుంటిరి. బహుశః మీరు ఈశ్వరుడే అయ్యుండవచ్చును! మా గురుదేవుడే నాపై కృప చూపియుండవచ్చును. అందుకే మీ వంటి మహానుభావుల దర్శనభాగ్యము ఈ దట్టమైన అడవిలో సంభవించెను. మిమ్ములను దర్శించుటచే నా అంతఃకరణము నిర్మలమై, నిశ్చలమాయెను. మీరు దయామయులు. భక్తవత్సలురు అన్నది సత్యమని నాకు తోచుచున్నది. నేను మీ బాలకుడను. మీ దాసుడను. మీ చరణదాసుడను" అనుచు ఆయన పాదములను పట్టుకొనెను. వినయముతో వందనము చేయుచున్న ఆ బాలబ్రహ్మచారిని లేపి, ఆ తాపసి అత్యంత సంతోషాంతరంగుడై దగ్గరగా ఆలింగనము చేసుకొని అతనికి మిగుల ధైర్యమునిచ్చెను. అనంతరము తనకెదురుగా కూర్చుండజేసుకొని జరిగిన వృత్తాంతమును గూర్చి ప్రశ్నించెను. వెంటనే ఆ బాలకుడు గురువు చెప్పిన వస్తువులనన్నింటిని తెలియజెప్పి అవి ఏవిధముగా తనకు లభించునో, తెలియక చింతించుచున్న ఆ బాలబ్రహ్మచారి తన విషయమును సమస్తమును వివరించి చెప్పెను. **పిమ్మట ఇట్లనెను** – "నేనా పసివాడను. పైగా బ్రహ్మచారిని. నా వలన కాని పనిని నేను అంగీకరించితిని. కాదనినచో గురు శాపమునకు గురియగుదునను భయముతో అంగీకరించితిని. వాటికోసమై ఈ అడవిలో జొచ్చి, గమ్యము తెలియక చేయవలసిన పని తోచక, మిగుల వ్యాకులడనై చింతాసాగరములో మునిగిపోయితిని. స్వామీ! ఇక మీరే నాకు దిక్కు. నన్ను కృతార్థుని చేయుడు" అని పరిపరివిధముల వేడుకొనెను. (123-134)

అప్పుడా అవధూత అతనికి అభయమునిచ్చి ఇట్లు పలికెను– "నాయనా! మిగుల హితకరమైన ఒక విషయమును నీకు ఎరిగించెదను వినుము. తద్వారా నీ కార్యము సులభముగా సాధింపబడును. మహానిధి వంటి కాశీపురమును చేరి విశ్వనాథుని సేవించుటవలన సమస్త అభీష్టములు సిద్ధించును. ఏబదికోట్ల యోజనముల విస్తారముగా నున్న ప్రదేశమునందు కాశీపట్టణము నెలకొనియున్నది. ముఖ్యముగా అచట బ్రహ్మ, విష్ణువులే వరములను పొందిరి. సృష్టిని రచించుటకు బ్రహ్మదేవుడు వరమును పొందెను. సమస్త సృష్టిని పోషించగల వరమును విష్ణుమూర్తి పొందియుండెను. కాశీపురము వంటి మహాస్థానమునకు నీవు వెళ్ళినచో, నీ మనోభీష్టములన్నియూ తప్పక నెరవేరును. ఎంతమాత్రమూ సందేహింపవలసిన పనిలేదు. ఈశ్వరుడు దయామయుడు. నీవు త్వరగా వెళ్ళుము. నీవు కోరిన విద్యలన్నియు నీకు లభించగలవు. నీవు విశ్వకర్మవయ్యెదవు. చతుర్విధ పురుషార్థములు నీ వెంట పడి వచ్చును. ఇంతకుమించి సాధింపవలసినదేముండునో నాకు తెలియజెప్పుము. విశ్వనాథుని లీలలు కడు విచిత్రములు. ఉపమన్యువు అను పేరుగల బాలుడు ఆరాధించగా అతనికి క్షీరసాగరమునే

అనుగ్రహించెను. దాని పేరు కాశీపట్టణము. సమస్త ధర్మములకు నెలవైనది. సకలజీవ జంతువులకు అది మోక్షస్థానము. అట్టి స్థానమునందు నివసించువారిని కంటితో చూచిన చాలును. సమస్త దోషములు పలాయనము చిత్తగించును. కాశీక్షేత్రమహిమను వర్ణించుటకెవరి తరమగును. అట్టి మహానిధివంటి కాశీస్థానముండగా నీవెందులకు చింతించెదవు. అచట లభించెడి పుణ్యారాశిని గూర్చి వర్ణించుట నా జిహ్వాకు తరముకాని పని. నీవెంతమాత్రమూ సందేహింపవలసిన పనిలేదు. దానికి **'ఆనందకాననము'** అను సార్థకనామధేయము గలదు. ఇంతటి పవిత్రక్షేత్రమునందు కాలినడకన ఎవరు తిరిగెదరో, వారి ఒక్కొక్క అడుగునకు అశ్వమేధయాగము చేసిన ఫలము లభించును. ధర్మము, అర్థము, కామము, మోక్షము – అను నాల్గింటిలో, దేనిని గూర్చి నీ మనస్సు ఏమేమి కాంక్షించునో, అవన్నియునూ అచటికి చేరిన వెంటనే ఫలించి నీకు ప్రత్యక్ష అనుభావమునకు రాగలవు. కావున, ఎంతమాత్రమూ శంకింపక అచటికి నీవు చేరుకొనుము. నీవు కోరిన కోరికలన్నియూ సులభముగా నీకు సిద్ధింపగలవని" ఆ మహానుభావుడు చెప్పెను. **అంతట ఆ బాలబ్రహ్మచారి తనకెదురుగా నున్న అవధూతకు సాష్టాంగవందనము చేసి ఇట్లనెను–** "మహానుభావా! నేను మీ బాలుడను. మీ దాసుడను. మీరు చెప్పిన ఆ కాశీపురము ఎక్కడున్నది? నేనా అడవిలో నివసించువాడను. అది ఆనందకాననమని అంటిరి. అది భూలోకమున కలదా? స్వర్గలోకముననా? లేక, పాతాళలోకముననా? అది ఎక్కడ కలదో నాకు వివరించి చెప్పుము. స్వామీ! నా యందు దయయుంచి ఆ కాశీనగరము ఎక్కడున్నదో, అచటికి చేరుకొనుటకెట్లు సాధ్యమో? దానికి ఉపాయమేమిటో? నాకు వివరించి తెలియజెప్పగలరు. మీతోపాటుగా నన్ను తీసికొనివెళ్ళమని అడగవచ్చునా స్వామీ! పసిప్రాయములోగల నన్ను అనుగ్రహించుము. నన్ను రక్షించుము" అని పదేపదే అమాయకముగ ప్రార్థించుచూ, ఆయన చరణములను పట్టుకొని వేడుకొనెను. (135-153)

అంతట ఆ బాలుని కనికరించిన ఆ అవధూత ఇట్లనెను – "నాయనా! భయము వీడుము. నేను నిన్ను కాశికి గొంపోవుదును. నీవలన నాకు కూడా కాశీయాత్ర చేసిన గొప్ప లాభము చేకూరగలదు. అంతకుమించిన మరొక లాభముండునా? కాశీవాసము చేయని మానవజన్మ వృథా. నీ కారణముగ నాకు కాశీపుర దర్శనము లభించును" అని మిగుల హర్షముతో పలికి, "త్వరగా వెళ్ళుదము పదమని" అనెను. ఆవిధముగ ఆ అవధూత, ఈ బాలబ్రహ్మచారిని తనవెంట తీసుకొని మనోవేగముతో సాగుతూ కాశీపట్టణమునకు చేరుకొనెను. "బాలుడా! మనము విశ్వనాథుని సన్నిధికి చేరితిమి. ఇక నీవు యాత్రను కొనసాగించుము" అని మునీశ్వరుడు పలికెను. **అందుకు బ్రహ్మచారి ఇట్లనెను–** "స్వామీ! నేనా పసిబాలుడను. మీ శరణాగతుడను. ఈ యాత్ర ఎట్లుండునో? దాని విధమేమిటో? నాకెంతమాత్రము తెలియదుకదా! దయతో

తాము వివరించి తెల్పగలరని" ప్రార్థించెను. **దయామయుడగు అవధూత ఆ బాలునితో నుడివెను** – "వత్సా! కాశీపట్టణమునందు చేయవలసిన అంతర్గృహ యాత్రను గూర్చిన విధమును నీకు తెలియజేయుదును. నీవు భక్తిపూర్వకముగా, నియమనిష్ఠలతో కాశీయాత్రను పూర్తిచేయవలెను. కావున, ముందుగా కాశీ అంతర్యాత్రా విధానమును నీకు తెలియజెప్పుచున్నాను. శ్రద్ధగా వినుము" అని **ఆ అవధూత ఈవిధముగా చెప్పసాగెను.**(135–160)

మొట్టమొదట మణికర్ణికయందు నియమముగా స్నానము చేయవలెను. తదుపరి ఐదు స్థానములలో గల పంచవినాయకుల వద్దకు వెళ్ళి నమస్కరింపవలెను. పిమ్మట మహాద్వారమును చేరుకొని విశ్వనాథుని దర్శనము చేయవలెను. తిరిగి గంగాతీరమునకు వచ్చి మణికర్ణికలో స్నానమొనర్పవలెను. మణికర్ణికేశ్వరుని, కంబలాశ్వతరుడు అనగా కంబల మరియు అశ్వతరుడు అను ఇరువురు నాగదేవతలను చక్కగా పూజించి, వాసుకేశ్వరుని పూజింపవలెను. అనంతరము, పర్వతేశ్వరుని పూజించి, తదుపరి, గంగాకేశవులను పూజింపవలెను. పిమ్మట లలితాదేవిని పూజించి, అచటినుండి వెళ్ళి జరాసంధేశ్వరుని భక్తితో పూజింపవలెను. తదుపరి అచటనే గల సోమనాథుని, శూలటంకేశ్వరుని, వారాహేశ్వరుని పూజించి, అచటనే గల బ్రహ్మేశ్వరుని పూజింపవలెను. అగస్త్యేశ్వరుడు, కశ్యపేశ్వరుడు, హరికేశ–వనేశ్వరుడు, వైద్యనాథుడు, ధృవేశ్వరుడు, గోకర్ణేశ్వరుడు, హాటకేశ్వరుడు, హస్థిక్షేప తటాకతీరమునందుగల కీకసేశ్వరుని పూజింపవలెను. అనంతరము భారభూతేశ్వరుని భక్తితో పూజించి, చిత్రగుప్తేశ్వరుని, చిత్రఘంటాదేవిని పూజింపవలెను. బాలకా! పశుపతేశ్వరుని, పితామహేశ్వరుని పూజింపవలెను. కలశేశ్వరునకు వందనము చేసి అటుమీదట నిశ్చలచిత్తముతో చంద్రేశ్వరునకు నమస్కరించి, వీరేశ్వరుని పూజింపవలెను. అటుపిమ్మట, విద్యేశ్వరుని, అగ్నీశ్వరుని, నాగేశ్వరుని, హరిశ్చంద్రేశ్వరుని సభక్తికముగా పూజింపవలెను. చింతామణి వినాయకుడు, సేనావినాయకుడు, వసిష్ఠ వామదేవులను పూజింపవలెను. ఆ తదుపరి త్రిసంధ్యేశ్వర లింగమును, విశాలాక్షిని, ధర్మేశ్వరుని పూజింపవలెను. విశ్వబాహువును పూజించి, అనంతరము ఆశావినాయకుని, వృద్ధాదిత్యుని మనస్ఫూర్తిగా పూజింపవలెను. చతుర్వక్త్రేశ్వరుడను లింగమును, బ్రాహ్మీశ్వరుని, క్రమముగా పూజింపవలెను. మనోప్రకామేశ్వరుని, ఈశానేశ్వరుని, చండిని, చండేశ్వరుని, భక్తితో పూజింపవలెను. అనంతరము, భవానీశంకరులను, ఢుంఢిరాజును, రాజరాజేశ్వరుని, లాంగలీశ్వరుని చక్కగా పూజింపవలెను. ఆ తదుపరి నకులేశ్వరుని భక్తితో పూజించి పరాన్నేశ్వరుని, పరద్రవ్యేశ్వరుని, ప్రతిగ్రహేశ్వరుని పూజించవలెను. నిష్కళంకేశ్వర లింగమును, మార్కండేయేశ్వరుని, అప్సరేశ్వరుని పూజించవలెను. గంగేశ్వరుని పూజించి జ్ఞానవాపిలో స్నానమాడి జ్ఞానేశ్వరుని అర్చించి, మహేశ్వరుని, జ్ఞానేశ్వరుని అర్చించిన మీదట

నందికేశ్వరుని దర్శించి పూజింపవలెను. తారకేశ్వర లింగమును, మహాకాళేశ్వరుని, దండపాణిని పూజించి నమస్కరింపవలెను. వత్సా! మహేశ్వరుని పూజించిన మీదట మోక్షేశ్వరుని ధ్యానించి, వీరభద్రేశ్వరుని మనస్ఫూర్తిగా అర్చింపవలెను. అవిముక్తేశ్వరుని వద్దకు నీవు అత్యంత హర్షోల్లాసములతో వెడలి, భక్తిపూర్వకముగా పూజించి, మోదాది పంచవినాయకులను అనగా మోద, ప్రమోద, దుర్ముఖ, సుముఖ, గణనాయకులను పంచవినాయకులను పూజింపవలెను. ఆనందభైరవుని పూజించి తిరిగి మహాద్వారమునకు వెళ్ళి ఆనందభైరవుని పూజించి, మహద్వారమున ప్రవేశించి ముక్తిమండపము లోపల గల మన్మథారి యగు విశ్వనాథుని దర్శించవలెను. ఈవిధముగ అంతర్గృహ యాత్రను చేసి, ముక్తి మండపమునందు నిలిచి ఈ శ్లోకమంత్రమును పఠింపవలెను. (161-186)

శ్లో॥ అంతర్గృహస్య యాత్రేయం యథావద్యా మయా కృతా । న్యూనాతిరిక్తయా శంభుః ప్రీయతామనయా విభుః ॥ (187)

అను మంత్రమును జపించి, విశ్వనాథునకు వందనమాచరించి అచటినుండి బయలుదేరి దక్షిణమానస యాత్రకు వెడలవలెను. నేరుగా ఉత్తరవాహినియగు మణికర్ణికవద్దకు వెళ్ళి, అచట స్నానమును ఆచరించి విశ్వనాథుని పూజించి, ఈ దక్షిణమానస యాత్రను సంకల్పింపవలెను. అచటినుండి మిగుల హర్షముతో మోదాది పంచవినాయకులవద్దకు చేరుకొని, వారిని సభక్తికముగా పూజించి, ఢుంఢిరాజు అను పేరుగల గణపతిని పూజింపవలెను. అటుపిమ్మట భవానీశంకరులను పూజించి, దండపాణికి నమస్కరించి విశాలాక్షిని నీవు చక్కని భక్తిభావముతో పూజింపుము. ధర్మకూపమునందు స్నానమొనర్చి శ్రాద్ధాది విధులను నిర్వహింపవలెను. ధర్మేశ్వరుని పూజించి, అనంతరము గంగాకేశవుని పూజింపవలెను. లలితాదేవిని పూజించి జరాసంధేశ్వరునకు నమస్కరించి, అనంతరము సోమనాథుని ఆరాధించి వారాహేశ్వరుని భక్తితో అర్చింపవలెను. పిదప దశాశ్వమేథ తీర్థమునకు చేరుకొని అచట స్నానమును ఆచరించి, శ్రాద్ధవిధులను పూర్తి చేసుకొని, ప్రయాగ తీర్థమునందు స్నానము చేసి శ్రాద్ధాది కర్మలను నిర్వహింపవలెను. ప్రయాగేశ్వరుని, దశాశ్వమేథ-ఈశ్వరుని, శీతలేశ్వరుని కడు శ్రద్ధగా పూజింపవలెను. (187-195)

ఓయీ! బాలబ్రహ్మచారీ! వినుము. మనోభావమును గుర్తించి సకలమనోభీష్టములను అనుగ్రహించే సర్వేశ్వరియగు బందీదేవిని అర్చించిన మీదట భక్తిపూర్వకముగా ఢుంఢిరాజును పూజింపవలెను. తిలభాండేశ్వరుని దర్శించి, అతనిని పూజించి రేవాకుండము నందు స్నానమొనర్చి మానససరోవరములో మునగవలెను. అచట శ్రాద్ధాది పితృతర్పణములను చేయవలెను. అనంతరము అచటగల మానసేశ్వరుని పూజించి మనోరథములను పొందవలెను. కేదారకుండమునందు స్నానమొనర్చి అచట తర్పణాదులను విడిచి కేదారేశ్వరుని దర్శించి, ఆయనను

పూజించిన మీదట గౌరీకుండమునందు స్నానమొనర్పవలెను. పిమ్మట వృద్ధకేదారేశ్వరుని, హనుమంతేశ్వరుని, రామేశ్వరుని, చక్కగా పూజించిన మీదట కృమికుండమునందు శ్రాద్ధమొనర్పవలెను. సిద్ధేశ్వరునకు నమస్కరించి స్వప్నకుండము నందు స్నానమొనర్చి, స్వప్నేశ్వరుని పూజించి సంగమమునందు స్నానము చేయవలెను. సంగమేశ్వరుని పూజించి, లోలార్క కూపమునందు స్నానమాడి శ్రాద్ధాదికర్మలను పూర్తి చేసినమీదట ఈశ్వరుని గూర్చి గతిప్రదీపమును వెలిగింపవలెను. ఆ తర్వాత అర్కవినాయకుని, పారాశరేశ్వరుని చక్కగా పూజించి, సన్నిహత్యకుండము నందు స్నానమొనర్పవలెను. బాలకా! కురుక్షేత్రకుండమునందు స్నానమొనర్చి అచట సువర్ణాది దానములను ఈయవలెను. అమృతకుండమునందు స్నానమొనర్చి దుర్గా, వినాయకులను పూజించి, మనస్ఫూర్తిగా దుర్గాదేవికి విశేషపూజను చేయవలెను. అనంతరము చతుష్షష్టి యోగినులను నిశ్చలచిత్తముతో పూజించిన పిమ్మట కుక్కుటుడను పేరుగల ద్విజునకు వందనము చేయవలెను. అనంతరం ఈ శ్లోకమంత్రమును పఠింపవలెను.(195-206)

శ్లో॥ వారాణస్యాం దక్షిణేఽంగే 'కుక్కుటో' నామ వై ద్విజః । తస్య స్మరణమాత్రేణ దుస్స్వప్నః సుస్వప్నో భవేత్ ॥ (207)(1)

అనంతరము, ఒక మాసము పర్యంతము ఉపవాసదీక్షను బూని గోయీబాయి మందిరమునకు వెళ్ళి ఆమెను దర్శించవలెను. మందిరముయొక్క ద్వారమును మూసివేసి ఆమెకు మూడు మొట్టికాయలను సమర్పింపవలెను. ఆ తదుపరి, రేణుకాదేవిని పూజించి, శంఖోద్ధార కుండమునందు స్నానమొనర్చి శంఖవిష్ణువును పూజింపవలెను. పిమ్మట, కామాక్షి కుండమునందు స్నానమును ఆచరించి, కామాక్షీదేవిని పూజింపవలెను. అయోధ్యా కుండమునందు స్నానమాడి సీతారాములను పూజింపవలెను. అనంతరము, లవకుశ కుండములందు స్నానము చేసి లవకుశులను పూజించి, లక్ష్మీకుండములో స్నానము చేసి శ్రీలక్ష్మీనారాయణులను సభక్తికముగా పూజింపవలెను. వత్సా! ఆ తరువాత సూర్యకుండమునందు స్నానము చేసి శ్రాద్ధకర్మలను ఆచరించవలెను. అటుమీదట సాంబాదిత్యులను పూజింపవలెను. అంతట మరికొంత ముందునకు వెళ్ళి అత్యంత శ్రేష్ఠమైనట్టి వైద్యనాథ కుండమును దర్శించి, అందులో స్నానము చేసి వైద్యనాథుని నిశ్చలచిత్తముతో పూజింపవలెను. గోదావరి కుండమునందు పవిత్రస్నానమొనర్చి గౌతమేశ్వర లింగమును పూజింపవలెను. (208-214)

"ఓయీ! బ్రహ్మచారీ! అనంతరము అగస్త్యకుండమునందు స్నానము చేసి అగస్త్యేశ్వరుని మనస్ఫూర్తిగా పూజించి ఆయనకు వందనమును సమర్పింపవలెను. తదుపరి, శుక్రకూపమునందు స్నానమాడి శుక్రేశ్వరుని అర్చించి అన్నపూర్ణమ్మను భక్తిపూర్వకముగా ఆరాధింపవలెను.

---

1. దక్షిణ వారాణసిలో 'కుక్కుటము' అను పేరుగల పక్షియుండెను. దానిని స్మరించినంతలోనే దుస్స్వప్నము, సుస్వప్నముగ మారిపోవును. (ద్విజః అంటే ఇక్కడ బ్రాహ్మణుడని కాదు, పక్షి అని అర్థము చెప్పుకొనవలెను.)

ఆ పిమ్మట ధుంఢిరాజును పూజించి జ్ఞానవాపిలో స్నానమాడి జ్ఞానేశ్వరుని ఆరాధించిన పిమ్మట దండపాణిని దర్శింపవలెను. అనంతరము ఆనందభైరవునకు వందనము సమర్పించి మహాద్వారమునకు సాష్టాంగవందనమును సమర్పించి విశ్వనాథుని స్మరించుచూ, ఆలయము లోనికి వెళ్ళి భక్తిశ్రద్ధలతో విశ్వనాథుని అర్చింపవలెను. నాయనా! బ్రహ్మచారీ! ఈవిధముగ దక్షిణమానస యాత్రను పూర్తిచేయవలెను. ఇది అత్యంత విశిష్టమైనది. దీనిని భక్తిప్రపత్తులతో పూర్తిచేయవలెనని" ఆ అవధూత బాలబ్రహ్మచారికి చెప్పెను. **తిరిగి ఆ అవధూత ఇట్లు చెప్పుచుండెను.**(215-219)

"వత్సా! చిరంజీవీ! దక్షిణమానసయాత్రను గురించి చెప్పిన పిమ్మట ఉత్తరమానస యాత్రను గూర్చి వివరించెదను సావధానముగా వినుము. నేరుగా పంచగంగకు వెళ్ళి సభక్తికముగా అందులో స్నానము చేయుటవలన కోటిజన్మల పాపము నశించునని శాస్త్రపురాణములు ఉద్ఘోషించుచున్నవి. సుప్రసిద్ధములైన ఈ పంచగంగల పేర్లను చెప్పెదను వినుము. కిరణా, ధూతపాపా, పుణ్యసరస్వతి, గంగా, యమున అను ఈ ఐదింటిని **'పంచగంగలు'** అని అందురు. కృతయుగమునందు వీటిని 'ధర్మనదుల'ని పిలిచేవారు. త్రేతాయుగమునందు 'ధూతపాపా' అని పిలిచేవారు. ద్వాపరయుగమునందు వీటికి 'బిందుతీర్థమ'ని పేరుండెను. కలియుగమునందు వీటినే **'పంచగంగ'** లని పిలుచుచుండిరి. మాఘమాసమందు ప్రయాగరాజమును దర్శించి అచట స్నానము చేయుటవలన ఎంతటి ఫలము లభించునో, పంచగంగల యందు స్నానమాడుట వలన అంతకంటే కోటిరెట్లు హెచ్చు పుణ్యము లభించును. (220-226)

అట్టి పుణ్యప్రదమైన పంచనదులలో భక్తిప్రపత్తులతో స్నానము చేసి నిశ్చలచిత్తమును కలిగి, బిందుమాధవుని మరియు కేశవుని అర్చింపవలెను. గోపాలకృష్ణుని పూజించిన మీదట, నృసింహ భువనమునకు వెళ్ళి మంగళగౌరికి వందనమాచరించి గభస్తేశ్వరుని పూజించవలెను. మయూఖాదిత్యుని పూజించి అత్యంత హర్షోల్లాసములతో, భక్తిప్రపత్తులతో విశ్వేశ్వర దర్శనమునకు వెళ్ళవలెను. అచటినుండి ముక్తిమండపమును చేరుకొనవలెను. అచట విధిపూర్వకముగా ఉత్తరమానసయాత్ర చేయుదునని సంకల్పించి, అట్టి యాత్రకై బయలుదేరవలెను. అచటినుండి నేరుగా వెళ్ళి ఆదిత్యుని పూజించి, ఆమోదకేశ్వరుని, పాపభక్షేశ్వరుని, నవగ్రహములను పూజించిన మీదట కాలభైరవుని ధ్యానించి చక్కగా ఆయనను ఆరాధించవలెను. తదుపరి క్షేత్రపాలకులను పూజించి, ఆ మీదట కాలకూపమునందు స్నానము చేయవలెను. అచటినుండి కాళేశ్వరుని పూజించి హంసతీర్థమునందు స్నానము చేసి శ్రాద్ధాది పితృకర్మలను ఆచరింపవలెను. అనంతరము కృత్తివాసేశ్వరుని పూజించి అచటినుండి శంఖవాపికి చేరుకొని అందులో స్నానము చేసి, మూడుమార్లు ఆచమనము చేసిన మీదట రత్నేశ్వరుని పూజించి,

సతీశ్వరుని, దక్షిణేశ్వరుని అర్చింపవలెను. అనంతరము చతుర్వక్త్రేశ్వరుని పూజించిన మీదట వృద్ధకాలకూపమునకు వెళ్ళి అచట స్నానము చేయవలెను. (227-236)

బాలుడా! అనంతరము కాళేశ్వరుని పూజించి మరియు అపమృత్యేశ్వరుని ధ్యానించి పూజింపవలెను. మందాకిని యందు స్నానము చేసి మధ్యమేశ్వరుని పూజించవలెను. అనంతరం జంబుకేశ్వరుని పూజింపవలెను. భక్తితో వక్రతుండుని పూజించి దండఖాతకూపమునందు స్నానము చేసి శ్రాద్ధాదులను, పితృకర్మలను చేయవలెను. పిమ్మట భూతభైరవుని, జైగేశ్వరుని పూజించి జైగేశ్వరుని గుహకు నమస్కరించి సభక్తికంగా ముందుకు వెళ్ళి, ఘంటాకుండమునందు స్నానము చేసి, వ్యాఘ్రేశ్వరునకు నమస్కరించి కందుకేశ్వరుని పూజింపవలెను. జ్యేష్ఠవాపిలో స్నానముచేసి జ్యేష్ఠేశ్వరుని పూజింపవలెను. అనంతరం సప్తసాగరమునందు స్నానము చేసి శ్రద్ధగా వాల్మీకేశ్వరుని పూజింపవలెను. భీమలోటాకు వెళ్ళి భీమేశ్వరుని పూజింపవలెను. మాతృ పితృ కుండమునకు చేరుకొని విధిపూర్వకముగా శ్రాద్ధాది క్రియలను ముగించిన పిమ్మట పిశాచవిమోచన పూజకొరకై ముందుకు వెళ్ళవలెను. అచట కపర్దికేశ్వరుని భక్తితో పూజించి కర్కోటకవాపిలో స్నానము చేయవలెను. కర్కోటకేశ్వరుని పూజించిన పిమ్మట, ఈశ్వర గంగలో స్నానము ముగించి దానాదులను చేయవలెను. పిమ్మట అగ్నీశ్వరుని పూజించి చక్రకుండములో సభక్తికముగా స్నానము చేసి శ్రాద్ధాది కర్మలను పూర్తిచేయవలెను. ఉత్తరార్కుని పూజించి మత్స్యోదరలో స్నానము చేసి ఓంకారేశ్వరుని పూజించిన పిమ్మట కపిలేశ్వరుని ఆరాధింపవలెను. ఋణమోచన తీర్థమునందు శ్రాద్ధమును ఆచరించిన మీదట పాపమోచన తీర్థమునందు స్నానము చేసి శ్రాద్ధాదికాదులను పూర్తిచేయవలెను. కపాలమోచన తీర్థమునందు స్నానముచేసి శ్రాద్ధాది తర్పణములను ఆచరింపవలెను. కులస్తంభానికి వెళ్ళి భక్తితో పూజింపవలెను. అటులే, వైతరణీ తీర్థమునందు స్నానముచేసి అచట శ్రాద్ధాదులను ఆచరించవలెను. విధివిధానముగా అచట గోదానము చేయుటవలన అనంతమైన పుణ్యము లభించును. (237-251)

అనంతరము కపిలధారకు వెళ్ళి స్నానము చేసి శ్రాద్ధాదిక్రియలను పూర్తిచేయవలెను. అచట దూడతో కూడిన ఒక మంచి గోవును సద్బ్రాహ్మణునకు దానము ఈయవలెను. అచటినుండి ముందునకు వెళ్ళి వృషభధ్వజుని పూజించి జ్వాలా నృసింహునకు వందనము చేసి వరుణ సంగమమునకు చేరుకొనవలెను. అచట స్నాన శ్రాద్ధాదులను పూర్తిచేసి కేశవాదిత్యులను పూజింపవలెను. ఆదికేశవునకు వందనమొనర్చిన పిమ్మట ముందునకు వెళ్ళి శ్రేష్ఠమైన ప్రహ్లాద తీర్థమునందు స్నానమాడి, అత్యంత భక్తిప్రపత్తులతో ప్రహ్లాదేశ్వరుని ఆరాధించవలెను. పిలిపిలా తీర్థము చాలా శ్రేష్ఠమైనది. అందులో స్నానమాడి త్రిలోచనేశ్వరుని పూజించి, అసంఖ్యాతేశ్వరుని ఆరాధింపవలెను. ఆ మీదట మహాదేవుని,

నర్మదేశ్వరుని పూజింపవలెను. తదుపరి గంగ, యమున, సరస్వతీశ్వరులు అను పేర్లను కలిగిన త్రివిధ లింగములను సభక్తికముగా పూజించిన పిమ్మట కామతీర్థమును దర్శించవలెను. కామతీర్థమునందు స్నానము చేసి కామేశ్వరుని పూజించి గోప్రతార తీర్థమును చేరుకొని, అందులో స్నానము చేసి తిరిగి పంచగంగకు వెళ్ళి మరల పంచగంగయందు స్నానమును పూర్తిచేయవలెను. అచటినుండి మణికర్ణికకు చేరుకొని అందులో పవిత్రస్నానమొనర్చి జలశాయిని పూజించిన మీదట, హనుమంతునకు వందనమాచరించి మోదాది పంచవినాయకులకు వందనమాచరించవలెను. అనంతరము అన్నపూర్ణాదేవిని, ఢుంఢిరాజును పూజించి జ్ఞానవాపిలో స్నానమొనర్చి జ్ఞానేశ్వరుని పూజింపవలెను. తిరిగి దండపాణిని పూజించి మోక్షలక్ష్మీవిలాసినిని, పంచపాండవులను, ద్రౌపది, ద్రుపద వినాయకులను చక్కగా పూజింపవలెను. అనంతరము ఆనందభైరవుని, అవిముక్తేశ్వరుని అత్యంత భక్తిప్రపత్తులతో పూజించిన పిమ్మట కాశీనాథుడగు శ్రీవిశ్వనాథుని సముఖమునకు చేరుకొనవలెను.(252-263)

శ్లో॥ ఉత్తర మానసయాత్రేయం యథావద్యా మయా కృతా । న్యూనాతిరిక్తయా శంభుః ప్రీయతామనయా విభుః ॥ (264)

పై శ్లోకమంత్రమును జపించుచూ కాశీవిశ్వనాథునకు సాష్టాంగవందనము చేయవలెను. అనంతరం విశ్వనాథుని సన్నిధానమున ఆతనికి ఎదురుగా నిలబడి చేతులు జోడించి, "స్వామీ! ఇప్పుడు నేను పంచక్రోశ యాత్రకు బయలుదేరుచుంటిని. నిరాటంకముగా ఈ యాత్రను ఫలవంతము చేయుమని" సంకల్పపూర్వకముగా ప్రార్థింపవలెను. అనంతరం బయలుదేరి స్వర్ణధార భువనమునందలి గంగాకేశవులను దర్శించి, హరిశ్చంద్ర మండపమును చేరుకొనవలెను. స్వర్గద్వారమని ప్రసిద్ధినొందిన మణికర్ణిక అత్యంత విస్తీర్ణము కలిగినది. అచటికి వెళ్ళి విధియుక్తముగా సంకల్పము చెప్పవలెను. హవిష్యాన్నమును శుచిగా సిద్ధము చేసుకొని వెంట వుంచుకొనవలెను. ప్రాతఃకాలమున గంగాస్నానమును చేయవలెను. అచటినుండి ఢుంఢిరాజును ప్రార్థించి పునర్దర్శనమును కలిగింపుమని వినయపూర్వకముగా ప్రార్థింపవలెను. గంగామాతకు నమస్కరించి, నేరుగా విశ్వనాథుని భువనమునకు చేరుకొనవలెను. అచటినుండి బయలుదేరి భవానీ శంకరులను ప్రీతితో పూజింపవలెను. తదుపరి ముక్తిమండపమును చేరుకొని ఢుంఢిరాజునకు నమస్కరించి సభక్తికముగా అతనిని పూజించి, తిరిగి మహాద్వారమునకు విచ్చేసి విశ్వేశ్వరుని పూజింపవలెను. అనంతరము మోదాది పంచవిఘ్నేశ్వరులకు, దండపాణికి నమస్కరింపవలెను. ఆ తరువాత ఆనందభైరవుని పూజించి మణికర్ణికకు చేరుకొనవలెను. మణికర్ణేశ్వరుని పూజించి సిద్ధివినాయకుని ఆరాధింపవలెను. గంగాకేశవులను, లలితాదేవిని, జరాసంధేశ్వరుని, దాలభ్యేశ్వరుని ధ్యానించి చక్కగా అర్చింపవలెను. తదుపరి సోమనాథుడు, శూలటంకేశ్వరుడు, వారాహేశ్వరుడు,

దశాశ్వమేధేశ్వరుడు అను లింగములను పూజించి బందీదేవికి వందనము చేసి, సర్వేశ్వరుని దర్శించుకొని, కేదారేశ్వరుని, హనుమంతేశ్వరుని పూజింపవలెను. అనంతరం సంగమేశ్వరుడు, లోలార్కుడు, అర్కవినాయకుడు అను ఈ ముప్పురిని పూజించి, దుర్గాకుండమునకు చేరుకొని, అందులో స్నానమాడి, దుర్గాదేవి, దుర్గావినాయకుని చక్కగా, ధ్యానపూర్వకంగా సభక్తిపూర్వకంగా పూజించి పునర్దర్శనమీయుమని వారిని వేడుకొనవలెను. బాలబ్రహ్మచారీ! శ్రద్ధగా వినుచుండుము. ఆ తరువాత కర్దమకూపమునందు స్నానము చేసి, సోమనాథుని, విరూపాక్ష లింగమును పూజింపవలెను. అనంతరం నీలకంఠుని, కర్దమేశ్వరుని భక్తిశ్రద్ధలతో పూజించి పునర్దర్శనమీయుమని వేడుకొని, అచటినుండి త్వరగా నాగనాథుని పూజకు బయలుదేరవలెను. అనంతరం చాముండిని, మోక్షేశ్వరుని, కారుణ్యేశ్వరుని, వీరభద్రుని పూజలు చేసి, ద్వితీయ దుర్గ అయిన వికటాఖ్య, దుర్గాదేవిని మనస్ఫూర్తిగా పూజింపవలెను. తదుపరి ఉన్మత్త భైరవుని, కాలకూట దేవతను, విమలాదుర్గను, మహాదేవుని, నందికేశ్వరుని, భృంగేశ్వరుని, విశేషముగా అర్చింపవలెను. ఘనప్రియను, విరూపాక్షుని, యజ్ఞేశ్వరుని, విమలేశ్వరుని, జ్ఞానేశ్వరుని, అమృతేశ్వరుని, గంధర్వ సాగరుని, భీమచండీ శక్తిని, చండీ వినాయకులను, రవిరక్తాక్ష గంధర్వుని మనస్ఫూర్తిగా పూజింపవలెను. తదుపరి నరకార్ణవ తారకుడు, భీమచండిని పూజించి, పునర్దర్శనప్రాప్తిని కలిగించుమని విన్నవించుకొనవలెను. తదుపరి, ఏకపాదవినాయకునితో పాటుగా భైరవుని పూజింపవలెను. పిమ్మట భూతనాథుడు, సోమనాథుడు, కాలనాథుడు, కపర్దేశ్వరుడు అను లింగస్వరూపములను చక్కగా ఆరాధింపవలెను. నాగేశ్వరుడు, కామేశ్వరుడు, గణేశ్వరుడు, వీరభద్రేశ్వరుడు, చతుర్ముఖ వినాయకులను పూజింపవలెను. దేహళీ వినాయకుని, షోడశ వినాయకుని, ఉద్దండ గణేశుని ప్రీతితో పూజింపవలెను. ఉత్కళేశ్వర లింగమును, ఏకాదశ రుద్రులను, రుద్రాణిని పూజింపవలెను. అచటినుండి తపోభూమిని చేరి భక్తితో పూజించాలి. అచటనే రామేశ్వరుని, సోమనాథుని పూజించాలి. భరతేశ్వరుడు, లక్ష్మణేశ్వరుడు, శత్రుఘ్నేశ్వరుడు, ద్యావా భూమీశ్వరులను చక్కగా అర్చింపవలెను. నహుషేశ్వరుడు, రామేశ్వరుడు అను వీరిని పూజించి పునర్దర్శనము కలిగింపుమని ప్రార్థింపవలెను. వరుణానదిపైన గల అసంఖ్యాతమను పేరుతో ప్రసిద్ధినొందిన తీర్థమునకు నమస్కరించి, అసంఖ్యాత లింగమును అర్చింపవలెను. తదుపరి, దేవసంఘేశ్వరుని, పాశపాణి వినాయకుని పూజింపవలెను.(265-300)

అనంతరం యూప సరోవరము చేరుకొని, అందులో స్నానమాచరించి, పృథ్వీశ్వరునకు నమస్కరించవలెను. పిమ్మట కపిలధారలో స్నానము చేయవలెను. అచటనే వృషభధ్వజుడు, జ్వాలా నరసింహుడు అను వీరికి సాష్టాంగవందనము ఆచరించి, వారిని పూజించి, అనంతరం వరుణాసంగమమునందు స్నానము చేసి శ్రాద్ధాది కర్మలను పూర్తిచేయవలెను. సంగమేశ్వరుని పూజించిన పిమ్మట, ఆదికేశవుని

పూజింపవలెను. అనంతరము ఖర్వ వినాయకుని పూజింపవలెను. ప్రహ్లాదేశ్వరుని పూజించి, కపిలతీర్థమునందు స్నానమొనర్చి త్రిలోచనేశ్వరుని పూజింపవలెను. ఆ తదుపరి ప్రహ్లాదేశ్వరుని చక్కగా పూజించిన మీదట కపిలతీర్థమునందు స్నానమొనర్చి త్రిలోచనేశ్వరుని సభక్తికముగా పూజింపవలెను.

ఆ తరువాత పంచగంగా తీరమునందుగల మహాదేవుని, బిందుమాధవుని భక్తిపూర్వకంగా అర్చించి, అచ్చోటనే మంగళగౌరిని పూజించి, గభస్తేశ్వరుడు, వశిష్టేశ్వరుడు, వామదేశ్వరుడు, పర్వతేశ్వరుడు అనువారిని పూజించవలెను. తదుపరి మహేశ్వరుని పూజించి, సిద్ధివినాయకుని, సప్తావర్ణ వినాయకుని అర్చింపవలెను. పిమ్మట మణికర్ణికకు వెళ్ళి పవిత్రమైన స్నానమును పూర్తిచేసి, విశ్వేశ్వరుని స్మరించిన మీదట మహాదేవుని పూజింపవలెను. తిరిగి ముక్తిమండపమునకు చేరుకొని, విష్ణువునకు నమస్కరించి, దండపాణికి నమస్కరించి ధుంఢిరాజును అర్చింపవలెను. అచటనే ఆనందభైరవుని, ఆదికేశవుని, మోదాది పంచ వినాయకులను నిశ్చలచిత్తంతో అర్చింపవలెను. తిరిగి విశ్వేశ్వరుని ఆరాధించి, మోక్షలక్ష్మీ విలాసిని ముందుకు వెళ్ళి నమస్కరించి, ఈ శ్లోకమంత్రమును పఠింపవలెను. (301-311)

శ్లో॥ జయ విశ్వేశ విశ్వాత్మన్ కాశీనాథ జగత్పతే । త్వత్ప్రసాదాన్మహాదేవ కృతా క్షేత్ర ప్రదక్షిణా ॥ (312)
శ్లో॥ అనేక జన్మ పాపాని కృతాని మమ శంకర । గతాని పంచక్రోశాత్మ - లింగస్యాస్య ప్రదక్షిణాత్ ॥ (313)

అనగా - విశ్వేశ్వరా! విశ్వాత్మా! కాశీనాథా! జగత్పతీ! మీకు జయము, జయము. మహాదేవా! మీ అనుగ్రహము వలన నేను ఈ క్షేత్ర ప్రదక్షిణమును పూర్తి చేసితిని. శంభో! శంకరా! ఈ పంచక్రోశాత్మక లింగముల ప్రదక్షిణము చేత అనేక జన్మలలో నా చేత చేయబడిన అనేకానేక పాపము లన్నియును నశించిపోయెను. (312-313)

అను ఈ శ్లోకమంత్రమును పఠించి, నేరుగా ముక్తిమండపమును చేరుకొని, శివధ్యానము చేసిన మీదట అష్టవిధస్థానములకు వందన మాచరింపవలెను. మొదట ముక్తిమండమునకు నమస్కరించి, శృంగార మండపము, ఐశ్వర్యమండపము, జ్ఞానమండపము, మోక్షలక్ష్మీ విలాసస్థానమునందు గల సుముక్త మండపమునకు వందనమాచరించి, ఆనందమండపమును చేరుకొనవలెను. అచట వైరాగ్యమండపమునకు సభక్తికముగా చేరుకొనవలెను. వత్సా! ఈవిధముగ నీవు యాత్రను పూర్తి చేయవలెను. ఇందుకు మరియొక పద్ధతికూడా చెప్పబడియున్నది. గురుభక్త బాలకా! దానిని కూడా తెలియజెప్పెదను. ముందుగా ప్రతినిత్యము చేయు '**నిత్య యాత్ర**'ను గూర్చి చెప్పెదను వినుము. *(314-318)*

చక్రపుష్కరిణిలో సచైలస్నానమును పూర్తి చేసి, దేవపితరులకు తర్పణములను వదలి బ్రాహ్మణులను పూజింపవలెను. అనంతరం ద్రుపదాదిత్యేశ్వరుని పూజించి, ఆయనకు నమస్కరించిన పిమ్మట ద్రుపదేశ్వరుడను పేరుగల శ్రీవిష్ణుమూర్తిని ఆరాధింపవలెను. అంతట దండపాణికి నమస్కరించి మహేశ్వరుని తదుపరి ఢుండిరాజును అర్చింపవలెను. జ్ఞానవాపిలో స్నానమాడి నందికేశ్వరుని, తారకేశ్వరుని, మహాకాళేశ్వరుని పూజించిన మీదట విశేషించి దండపాణిని పూజింపవలెను. విశ్వేశ్వరుని నిత్య యాత్ర కొరకై శుక్లపక్షము నందలి పాడ్యమి తిథియందు, మత్స్యోదరీ తీర్థమునందు స్నానము చేసి ఓంకారేశ్వర లింగమును పూజింపవలెను. తర్వాత విదియ లేక తదియ తిథులయందు యాత్రకు వెళ్ళి త్రిలోచన మహాదేవుడను ఉభయలింగములను పూజింపవలెను. చతుర్థి తిథియందు కృత్తివాస లింగమును దర్శింపవలెను. పంచమి తిథినాడు రత్నేశ్వరుని పూజించి, షష్ఠి రోజున చంద్రేశ్వరుని పూజింపవలెను. సప్తమినాడు కేదారేశ్వర లింగమును, అష్టమినాడు ధర్మేశ్వర లింగమును, నవమినాడు వీరేశ్వర లింగమును దర్శించి పూజించవలెను. ఇది మహా పుణ్యప్రదమైనది. దశమినాడు కామేశ్వర లింగమును, ఏకాదశి తిథియందు విశ్వకర్మేశ్వర లింగమును, ద్వాదశి తిథినాడు మణికర్ణికేశ్వర లింగమును, త్రయోదశి తిథినాడు ప్రదోషకాలమునందు అవిముక్తేశ్వరుని, చతుర్దశి తిథియందు విశ్వేశ్వరుని పూజింపవలెను. కాశీవాసము చేయువారలు ఈవిధముగా యాత్రను చేయవలెను. లేనియెడల అనేక విఘ్నములు ఎదురగుచుండును. ఇది శుక్లపక్షమునందు చేయవలసిన యాత్రా విధానము. **ఇక కృష్ణపక్షమునందు చేయవలసిన యాత్రా వివరములను ఇప్పుడు వివరించి చెప్పెదను. చిరంజీవీ! నిశ్చలచిత్తముతో వినుము.** చతుర్దశి నుండి ప్రతినిత్యము యాత్రను చేయవలెను. వరుణానదిలో స్నానము చేసి శైలేశ్వరుని దర్శించుకొన్న పిమ్మట సంగమ తీర్థమునందు స్నానము చేసి సంగమేశ్వరుని ఆరాధించవలెను. తదుపరి స్వలీన తీర్థమునందు స్నానమాడి స్వలీనేశ్వరుని పూజించి, మరునాడు మందాకినిలో స్నానమొనర్చి మధ్యమేశ్వరుని పూజింపవలెను. తిరిగి మణికర్ణికయందు స్నానమాడి ఈశానేశ్వరుని పూజించి, హిరణ్యగర్భ, హిరణ్యగర్భేశ్వర ఉభయ లింగములను పూజింపవలెను. అటుపిమ్మట ధర్మకూపమునందు స్నానమాచరించి గోప్రేక్షేశ్వరుని పూజించవలెను. సప్తమినాడు కపిలధారా తీర్థమునందు స్నానమొనర్చి వృషభధ్వజ లింగమును అర్చింపవలెను. ఉపశాంతకూపమునందు స్నానమాడి ఉపశాంతేశ్వరుని పూజింపవలెను. తదుపరి పంచచూడ దోహాలో స్నానమాడి శివుని ధ్యానించి, జ్యేష్ఠేశ్వర లింగమును పూజింపవలెను. కూప చతుస్సముద్రము నందు స్నానము చేసి సముద్రేశ్వరుని పూజింపవలెను. శుక్రేశ్వరునకు ఎదురుగా గల కూపమునందు స్నానము చేసి ఆయనను పూజింపవలెను. దండఖాత తీర్థమునందు స్నానమాడి ఉల్లాసముతో వ్యాఘ్రేశ్వరుని పూజింపవలెను. శౌనకేశ్వర తీర్థమునందు స్నానము ముగించి, అదే

తీర్థముయొక్క పేరుతోగల లింగమును అర్చింపవలెను. జంబుక తీర్థమునందు పవిత్రముగా స్నానమొనర్చి చతుర్దశ లింగమైన జంబుకేశ్వరుని పూజింపవలెను.

శుక్లపక్షమునందుగానీ, కృష్ణపక్షమునందు గానీ అష్టమి తిథి చాలా విశిష్టమైనది. ఆ రోజున లింగమును అర్చించుటవలన ఒక గొప్ప పుణ్యకార్యము చేసినట్లగును. తదుపరి దక్షేశ్వరుడు, పార్వతీశ్వరుడు, పశుపతీశ్వరుడు, గంగేశ్వరుడు, నర్మదేశ్వరుడు, గభస్తీశ్వరుడు, సతీశ్వరుడు, మధ్యమేశ్వరుడు, తారకేశ్వరుడు అను నవలింగములను పూజించుట అత్యంత శ్రేష్ఠమైన పుణ్యకార్యముగా విశ్వసించుము. నిత్యయాత్రలో ముఖ్యంగా మరొక ఏకాదశ లింగమున్నది. 'ఆఘ్నీద్రేష' అనే ఈ యాత్రను నీవు చేయవలెను. ఊర్వశీశ్వరుడు, నకులేశ్వరుడు, ఆషాఢేశ్వరుడు, భారభూతేశ్వరుడు, లాంగలీశ్వరుడు అను లింగములను చక్కగా పూజింపవలెను. తదుపరి త్రిపురాంతకుడు, మనఃప్రకామేశ్వరుడు, ప్రీతికేశ్వరుడు, మదాలసేశ్వరుడు, తిలపర్ణేశ్వరుడు అను వారిని చక్కగా పూజింపవలెను. (319–352)

అనంతరము శక్తియాత్రను పూర్తిచేయవలెను. కుమారా! తద్విధానమును వినుము. శుక్లపక్షమునందలి తృతీయ తిథినాడు ఎనిమిది యాత్రలను చేయవలెను. గోప్రేక్ష తీర్థమును దర్శించి, అందు స్నానమాడి ముఖనిర్మాలికను సభక్తికముగా పూజింపవలెను. తదుపరి జ్యేష్ఠవాపిలో స్నానమొనర్చి జ్యేష్ఠగౌరిని, జ్ఞానవాపిలో స్నానమాడి శృంగార గౌరి, సౌభాగ్యగౌరి అను ఉభయ దేవతలను పూజింపవలెను. అనంతరం విశాలగంగలో స్నానమొనర్చి విశాలగౌరిని, లలితా తీర్థమునందు స్నానమొనర్చి లలితాదేవిని, భవానీ తీర్థమునందు స్నానమొనర్చి భవానీదేవిని, బిందు తీర్థమునందు స్నానమొనర్చి మంగళగౌరిని అను ఈ శక్తిదేవతలను పూజించిన పిమ్మట లక్ష్మీదేవిని పూజింపవలెను. చతుర్థీ తిథినాడు సర్వగణేశుని చక్కగా పూజించి, బ్రాహ్మణోత్తములకు మోదకములను దానముగా ఇవ్వాలి. తద్వారా తీర్థవాసులకు విఘ్నములు కలుగకుండును. మంగళవారము, ఆదివారము, భైరవయాత్రను చేయవచ్చును.(1) షష్ఠి తిథినాడు ఆయనను పూజింపవలెను. ఆదివారము సప్తమి తిథియందు రవిదేవుని యాత్రను చేయవలెను.(2) అష్టమి, నవమి తిథులలో చండీయాత్రను పూర్తి చేయవలెను.(3)

---

1. అష్టభైరవులు అని ముఖ్యంగా భైరవులు ఎనమండుగురు గలరు. 1. రుద్ర భైరవుడు 2. చండ భైరవుడు 3. అసితాంగ భైరవుడు 5. కపాల భైరవుడు 5. క్రోధ భైరవుడు 6. ఉన్మత్త భైరవుడు 7. సంహార భైరవుడు 8. భీషణ భైరవుడు. వీరికి అధిపతిగా కాలభైరవుడు ఉండును. ఇతడే కాశీపురమునకు కాపలాదారుడు అంటారు.
2. రవి అనగా సూర్యుడు. ఇతడే ఆదిత్యుడు. కాశీక్షేత్రమునందు ద్వాదశాదిత్యులు గలరు. 1. లోలార్కుడు 2. ఉత్తరార్కుడు 3. సాంబాదిత్యుడు 5. ద్రౌపదాదిత్యుడు 5. మయూఖాదిత్యుడు 6. ఖఖోల్కాదిత్యుడు 7. అరుణాదిత్యుడు 8. వృద్ధాదిత్యుడు 9. కేశవాదిత్యుడు 10. విమలాదిత్యుడు 11. గాంగాదిత్యుడు 12. యమాదిత్యుడు అని ఈ పన్నెండుగురి పేర్లు.
3. చండీ అనగా దుర్గామాత – వీరు తొమ్మండుగురు. 1. శైలపుత్రి 2. బ్రహ్మచారిణి 3. చంద్రఘంటా 4. కూష్మాండా 5. స్కందమాత 6. కాత్యాయనీ 7. కాళరాత్రి 8. మహాగౌరి 9. సిద్ధిదాత్రి

ఈవిధముగ ప్రతినిత్యము అంతర్గృహ యాత్రలను చేయవలెను. దీనిని గూర్చి మరింత విపులముగా కాశీఖండమునందు వివరింపబడియున్నది. ఈ రీతిగా పవిత్రమైన విశ్వేశ్వరయాత్రను నీవు పూర్తి చేయవలెను. నీ పేరట సోమసూత్ర లింగమును ప్రతిష్ఠింపవలెను" అని ఆ అవధూత ఈ బాలబ్రహ్మచారికి కాశీయాత్రను గూర్చి విస్తరించి విధిపూర్వకముగా తెలియజెప్పెను. **పిమ్మట ఇట్లు పలికెను** – "నాయనా! నీవు ఈవిధముగ కాశీయాత్రను పూర్తిచేసినచో నీ మనోభీష్టము తప్పక నెరవేరును. నీయందు పరిపూర్ణమైన గురుకృప కలదు. తద్వారా విశ్వనాథుడు నీ యెడల ప్రసన్నుడు కాగలడు. కావున, నీ మనమునందు దృఢమైన విశ్వాసమును కలిగి నిరంతరము గురుస్మరణ చేయుచూ, నేను చెప్పినటుల కాశీయాత్రను పూర్తిచేయుము. తత్ఫలితముగా నీ మనోరథము ఈడేరును" అని చెప్పి ఆ బాలబ్రహ్మచారిని ఆశీర్వదించి తత్‌క్షణమే ఆ అవధూత యోగి అంతర్ధానమొందెను.

ఇదంతయూ గమనించిన ఆ బాలబ్రహ్మచారి మిగుల ఆనందమును పొంది 'నిజమునకు ఈయనయే నా గురువు లేదా, ఈశ్వరుడే అయి వుండవచ్చును. ఆహా! శ్రీగురునాథుడు నాపైన ఎంతటి కృపావృష్టిని కురిపించెనో కదా! నేను భావించిన కార్యము నిరాటంకముగా, నిశ్చయముగా గురుకృపచేత సాధింపబడెనని తన అంతరంగములో దృఢముగా భావించెను. ఆరాధించక ముందే నాకు ఈశ్వరుని సమాగమము సంఘటించెను. గురుకృపను పొందినవారు సమస్త అభీష్టములను పొందగలరు అని చెప్పడంలో ఎంతమాత్రమూ సందేహము లేదు' అని ఆ బాలబ్రహ్మచారి తనలోతాను తలపోయసాగెను. ఇతర దేవతాగణమునకు ఏదేని సమర్పించినప్పటికినీ వారు భక్తుల మనోభీష్టములను నెరవేర్పజాలరు. కాని, ఈశ్వరుడు దయాళువు, అమాయకచక్రవర్తి అని అందురుగదా! అందుకే కాబోలు! గురుకృపా ప్రభావము వలన నాకు దయతో విశ్వేశ్వరుని దర్శనభాగ్యమే అబ్బెను. యజ్ఞము, దానము, తపస్సుల వంటి ఎట్టి శ్రమ లేకుండగనే గురుదేవుని కృపవలన నేను విశ్వేశ్వరుని చూడగలిగితిని' అని తనలోతాను తలపోయుచూ మిగుల ఆనందభరితుడై గురుస్మరణ చేయుచూ ఆ బాలబ్రహ్మచారి వేగముగా వెళ్ళి అవధూతయోగి చెప్పినట్లుగా అత్యంత భక్తిపూర్వకముగా విధివిధానముగా కాశీయాత్రను పూర్తిచేసెను. (353-371)

అనంతరము కాశీవిశ్వనాథుని దర్శించి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించుచుండగా సాక్షాత్తుగ పరమశివుడే ప్రసన్నుడై నిజస్వరూపముతో ఆ బాలబ్రహ్మచారికి ఎదురుగా ప్రత్యక్షమాయెను. అంతట ప్రసన్నుడైన పరమేశ్వరుడు "నీకు కావలసిన వరమును కోరుకో నాయనా! ఇప్పుడే ఇచ్చివేయుదును" అని పలికెను. అంతట 'త్వష్ట' అనే బ్రహ్మదేవుని కుమారుని పేరు కలిగిన ఆ బాలబ్రహ్మచారి తన

వృత్తాంతమునంతయూ పరమేశ్వరునకు విన్నవించెను. తన గురువు, గురుపత్ని, వారి కుమారుడు, కుమార్తెలు అడిగిన అభీష్టములను గూర్చిన విషయమంతయూ విశ్వనాథునకు నివేదించెను. పరమేశ్వరుడు మిగుల సంతసించి, **అతడు కోరిన వరమును ప్రసాదించి పలికెను**- "వత్సా! నీవు సమస్త విద్యలలో ఆరితేరి, అత్యంత నిష్ణాతుడవు కాగలవు. చక్కని గురుభక్తిని చేసితివి. దానితో నేను మిగుల సంతృప్తిని పొందితిని. కావున, నీకు సమస్త విద్యలు సంప్రాప్తమగును. విశ్వకర్మవు అయ్యెదవు. చతుర్విధ పురుషార్థములు అప్రయత్నముగా నీకు సిద్ధించును. ఈ సృష్టిలో నీవొక సమర్థునిగా పేరు గాంచెదవు" అని దివ్యమైన వరమును అనుగ్రహించెను. అట్టి అనేక వరములు లభించినందులకు 'త్వష్ట' మిగుల ఆనందించి తన పేరిట ఒక లింగమును అచ్చోటనే ప్రతిష్ఠించెను. అనంతరము, అక్కడినుండి తిరుగు ప్రయాణమునకు బయలుదేరెను. సాక్షాత్తుగా విశ్వనాథుడే ప్రసన్నుడైనప్పుడు ఇక అతనికెట్టి కొరత ఉండగలదు. కావున, గురుగృహమునందు వారి కుటుంబసభ్యులందరు కోరిన వస్తువులనన్నింటినీ సిద్ధము చేసికొని, వెంటనే అతి శీఘ్రముగా ఆ బాలబ్రహ్మచారి గురుసముఖమునకు చేరుకొనెను. తెచ్చిన వస్తువుల నన్నింటినీ శ్రీగురునాథుని ముందు సమర్పించి, ఆతని పాదపద్మములను పట్టుకొని సాష్టాంగవందనమును ఆచరించెను. అనంతరము గురుపత్నికి, గురుపుత్రునకు, గురుపుత్రికకు కూడా నమస్కరించెను. మిగుల ఉల్లాసభరితుడైన శ్రీగురునాథుడు అత్యంత హర్షపులకాంకితగాత్రుడై తన శిష్యుని లేవనెత్తి గాఢమైన ఆలింగనము చేసికొని **ఇట్లు నుడివెను** - "శిష్యోత్తమా! వత్సా! జ్ఞానరాశీ! నీ భక్తికి నేను సంప్రీతుడనైతిని. నాయనా! వినుము. సమస్త విద్యలలో నీవు సమర్థుడవయ్యెదవు. జీవితకాలమంతయూ అష్టైశ్వర్యములతో తులతూగుచుండెదవు. త్రిమూర్తులు నీకు వశమై యుండెదరు. నీవు మాకొరకై ఉత్తమ గృహమును నిర్మించి ఇచ్చితివి. అనేక విచిత్ర వస్తువులను తెచ్చి సమర్పించితివి. కావున, నీవు చిరంజీవిగా వెలుగొందెదవు. సృష్టిలో సూర్యచంద్రులు నిలిచియున్నంతకాలము నీ పేరు ప్రసిద్ధముగా నిలిచియుండును. నీ యొక్క గురుభక్తినిగూర్చి, నీ సామర్థ్యమును, అఖండమైన నీ కీర్తిని గూర్చి స్వర్గ, మర్త్య, పాతాళములను త్రివిధ లోకములయందు వ్యాపించిపోవును. సృష్టినే రచింపగలవు. పదునాలుగు విద్యలు, అరువది నాలుగు కళలు నీకు వశమై యుండును. అష్టసిద్ధులు, నవనిధులు, నీకు కరతలామలకములై యుండగలవు. ఇప్పటినుండి నీకు ఎప్పుడు కూడా కష్టముగాని, దుఃఖముగాని ఎంతమాత్రమూ ఘటియింపబోదు" అని గొప్ప వరమును ప్రసాదించెను. అత్యద్భుతమైన గుర్వనుగ్రహమును పొందిన ఆ శిష్యుడు మహాజ్ఞానియై వెళ్ళిపోయెను" అని ఈవిధముగా కైలాసమునందు పరమేశ్వరుడు పార్వతీదేవితో చెప్పెను. **భవసాగరమును సులభముగా దాటింపగల సమర్థుడు ఒక్క గురువు మాత్రమే. అట్టి గురుమూర్తికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అధీనమై యుందురు. అందుచేతనే**

త్రిమూర్తులే గురుస్వరూపము, గురుస్వరూపమే త్రిమూర్త్యాత్మకము అని వేద, శాస్త్ర పురాణములు గట్టిగా ఉద్ఘోషించుచున్నవి. (372-390)

శ్లో॥ యస్య దేవే పరాభక్తిః యథా దేవే తథా గురౌ । తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశం తే మహాత్మనః ॥ (391)

దైవమునందు ఎంతటి దృఢమైన భక్తినిష్ఠను కలిగియుందురో, అంతటి భక్తినిష్ఠను గురువుయందు కూడా కలిగియుండి, దేవుడే గురువు-గురువే దేవుడు అను శ్రేష్ఠమైన భక్తినిష్ఠను కలిగియుండువారికి వేదశాస్త్రముల జ్ఞానవిజ్ఞానము అనాయాసముగనే సిద్ధింపగలదు అని పరమేశ్వరుడు పార్వతీదేవితో విస్తరించి చక్కగా చెప్పెను" అని శ్రీగురుమూర్తియగు నృసింహ సరస్వతి స్వామివారు సాయందేవునికి వివరించి చెప్పెను.

ఈవిధమైన ఇష్టాగోష్టితో కాశీయాత్రను గూర్చి వర్ణించుచూ గురుభక్తి మహిమను గూర్చి వివరించి చెప్పుచుండగా రాత్రి సమయము గడిచిపోయి సూర్యోదయమయ్యెను. **చింత అనెడి చిమ్మచీకటిలో చిక్కుకొని దుఃఖపడుచున్న వ్యక్తిని పరమజ్యోతి వంటి గురుకృపయే రక్షించును గదా!** అని నిశ్చయమును చెందిన సాయందేవుడు సూర్యోదయమును గాంచి సంతోషభరితుడయ్యెను. వెంటనే శ్రీ స్వామివారి పాదపద్మములకు **శిరసాష్టాంగముగా వందనమునాచరించి ఇట్లనెను** – "స్వామీ! గురుమూర్తీ! ఇంతవరకు సవిస్తరముగా నాకు శ్రవణము చేయించిన కథ అత్యంత అపూర్వమని చెప్పక తప్పదు. అయితే, కృపానిధీ! నాదొక మనవి. గురుభక్తి యందు నా బుద్ధి నిరంతరము నిశ్చయాత్మకమై ఉండునట్లుగా అనుగ్రహించుమని సవినయముగా ప్రార్థించుచున్నాడను. నాకంతయూ అద్భుతము, ఆశ్చర్యముగా తోచుచున్నది. స్వామీ! మీరు కాశీయాత్ర విధానమును గూర్చి విస్తరించి చెప్పుచుండగా ఒకవైపు నేను వినుచుంటిని. మరొకవైపు ఆ కాశీపురమును ప్రత్యక్షముగ చూచుచూ, మిమ్ములను కూడా అచ్చట నేను దర్శించుచుంటిని. అంతేకాదు, "గురుదేవా! మీతోపాటు నేను కూడా ఉంటిని. యాత్ర యొక్క క్రమమును మీరు ఏయేవిధముగా చెప్పుచుంటిరో, ఆయా తీర్థ క్షేత్ర స్థలముల నన్నింటిని గూర్చి ఒకవైపు వినిపించుచూనే, మరొకవైపు వాటిని ప్రత్యక్షముగా దర్శింపజేయించిన మీ యోగమాయా శక్తిని నేనేమని పొగడగలను. అల్పజ్ఞుడను. అశక్తుడను. నాపై ప్రసరింపజేసిన అవ్యాజమైన ప్రేమకు, నిర్హేతుకమైన కృపకు బదులుగా నేనేమి ఇవ్వగలను" అని అంటూ నేను అత్యంత విస్మయమును చెంది, ప్రస్తుతము జాగ్రత్తగా ఉంటినా, స్వప్నమును గాంచుచుంటినా లేక, సుషుప్తిలో ఉంటినా నా కెంతమాత్రమూ బోధపడుటలేదు. మహానుభావా! దాని రహస్యమును మీరే అనుగ్రహించి విప్పి చెప్పవలెను తప్ప, అల్పజ్ఞుడనైన నేను రవంతయునూ మీ మహిమను గ్రహింపజాలను" అని భక్తిభావము పొంగిపొరలుచుండగా ఆతని శరీరము పులకరించి పోవుచుండెను. ప్రేమ పరవశుడై శ్రీగురుచరణ సరోజములకు మాటిమాటికి

వందనము చేయుచూ సాయందేవుడు అత్యంత దీనభావముతో ఈవిధముగా స్తుతింపసాగెను. **అంతట సిద్ధముని నామధారకునితో ఇట్లనెను-** "నామధారకా! మీ వంశమునకు చెందిన పూర్వజుడైన సాయందేవుడను వ్యక్తి శ్రీగురునాథుని అద్భుతమైన స్తోత్రముతో ఈవిధముగా స్తుతించెను. దానిని ఇప్పుడు నీకు వినిపించెదను. **సావధాన చిత్తముతో వినవలసినదని సిద్ధముని చెప్పసాగెను** – "పరమపురుషా! పరాత్పరా! పరమహంసా! మీకు జయము. జయము. భక్తజనహృదయ నివాసా!" శ్రీనృసింహ సరస్వతీ మీకు జయమగుగాక!" అని పలికి సాయందేవుడు ఈవిధముగా శ్రీస్వామివారిని స్తోత్రము చేయసాగెను. (392–400)

శ్లో॥ ఆదౌ బ్రహ్మ త్వమేవ సర్వజగతాం, వేదాత్మమూర్తిం విభుం, పశ్చాత్ క్షోణిజదా వినాశ దితిజాం, కృత్వాఽవతారం ప్రభో! ।
హత్వాదైత్యమనేకధర్మచరితం భూత్వాఽత్మజోఽత్రేర్గృహే, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (401)
శ్లో॥ భూదేవాఖిలమానుషం విదుజనా బాధాయమానం కలిం, వేదాదుష్యమనేకవర్ణమనుజా భేదాది భూతోన్నతమ్ ।
ఛేదఃకర్మ తమాంధకారహరణం శ్రీపాదసూర్యోదయే, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (402)
శ్లో॥ ధాతస్త్వం హరి శంకర ప్రతి గురో జాతాగ్రజన్మం విభో, హేతుః సర్వవిదోజనాయ తరణం జ్యోతిస్స్వరూపం జగత్ ।
చాతుర్థాశ్రమస్థాపితం క్షితితలే పాతుస్సదా సేవ్యయం, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (403)
శ్లో॥ చరితం చిత్రమనేకకీర్తిమతులం పరిభూతభూమండలే, మూకం వాక్యం దివాంధకస్య నయనం, వంధ్యా చ పుత్రం దదౌ ।
సౌభాగ్యం విధవా చ దాయక శ్రియం దత్త్వా చ భక్తం జనం, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (404)
శ్లో॥ దురితం ఘోర దరిద్రదావతిమిరం హరణం జగజ్జ్యోతిషం, స్వర్ధేనుం సురపాదపూజితజనా కరుణాబ్ధిం భక్తార్తితః ।
నరసింహేంద్ర సరస్వతీశ్వర విభో! శరణాగతం రక్షకం, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (405)
శ్లో॥ గురుమూర్తిశ్చరణారవింద యుగళం స్మరణం కృతం నిత్యసౌ, చరితం క్షేత్రమనేక తీర్థసఫలం సరితాది భాగీరథీ ।
తురగామేధ సహస్రగోవిదుజనాః సమ్యక్ దదన్ తత్ఫలం, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (406)
శ్లో॥ నో శక్యం తవ నామమంగళస్తువం వేదాగమాగోచరం, పాదద్వం హృదయాబ్జమంతరదలం నిర్ధార మీమాంసతః ।
భూయెూ భూయః స్మరన్నమామి మనసా, శ్రీమద్గురుం పాహిమాం, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (407)

శ్లో॥ భక్తానాం తరణార్థ సర్వజగతాం దీక్షా దదన్ యోగినాం, సుక్షేత్రం పురగాణగ స్థిత ప్రభో! దత్వా చతుష్కామదమ్ ।
స్తుత్వా భక్తసరస్వతీ గురుపదం, జిత్వాద్యదోషాదికం, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥ (408)

శ్లో॥ ఏవం శ్రీగురునాథ మష్టకమిదం స్తోత్రం పఠే న్నిత్యసౌ, తేజో వర్చ బలోన్నతం శ్రియకరం ఆనందవర్ధం వపుః ।
పుత్రాపత్యమనేక సంపద శుభా దీర్ఘాయుమారోగ్యతాం, వందేఽహం నరకేసరీ సరస్వతీ శ్రీపాదయుగ్మాంబుజమ్ ॥[1] (409)

సాయందేవుడు చేసిన శ్రీగురు స్తోత్రమునకు తాత్పర్యములు : సృష్టికి పూర్వము మొట్టమొదట వేదాత్మస్వరూపులు, సర్వవ్యాపకులు అయిన బ్రహ్మ స్వరూపమున మీరొక్కరే వెలసియుంటిరి. అనంతరము భూమికి భారముగా నిలిచిన దితి సంతానమగు దైత్యులను సంహరించుటకై అవతారమును ధరించితిరి. ప్రభూ! అధర్మచరిత్రులైన దైత్యులను హతమార్చుటకై అత్రిమహర్షికి కుమారుడవై జన్మించి, వారి గృహమున దోగాడితివి. అట్టి శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి శ్రీచరణ సరోజ ద్వయమునకు నేను నమస్కరించుచున్నాను. (401)

కలియుగప్రభావమునకు లోనైన బ్రాహ్మణాది విద్వజ్జనులందరును వేదధర్మమునకు విముఖులగుచుండిరి. అజ్ఞాన అంధకారమునందు చిక్కుకొనిన మానవులందరును వేదములను దూషించుచుండిరి. తత్ఫలితముగా వేదవిహిత ధర్మ–కర్మలు నశింపసాగెను. అట్టి సమయమున అజ్ఞానమనెడు చిమ్మచీకటిని రూపుమాపుటకై ఉదయభాస్కరునివలె శ్రీపాదరూపమున అవతరించినట్టి శ్రీనరసింహ సరస్వతీ స్వామివారి శ్రీపాదపద్మయుగళమునకు ప్రణమిల్లుచున్నాను. (402)

ప్రభూ! బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల మూలస్వరూపులు మీరే. శ్రీగురుదేవా! సమస్త శాస్త్రజ్ఞాన సంపన్నులగు జనులను తరింపజేయుటకై తమరు బ్రాహ్మణ కులమున అవతరించితిరి. జ్యోతిస్వరూపులై సమస్త జగత్తును ప్రకాశింపజేయుచుంటిరి. భూతలమునందు తురీయమగు సన్న్యాసాశ్రమము లుప్తప్రాయమగుచుండెను. అట్టి తురీయాశ్రమమును తిరిగి స్థాపించు నిమిత్తముగ తామే స్వయముగ సన్న్యసించితిరి. ఇట్టివే అనేక మహత్తరములైన కార్యములను కొనసాగించిన మిమ్ములను నేను యెల్లప్పుడు సేవించెదను. మమ్ములను రక్షింపుము అని శ్రీనరసింహ సరస్వతీ స్వామి వారి శ్రీపాదపద్మ ద్వంద్వమునకు నేను వందనములర్పించుచున్నాడను. (403)

మూగవానికి మాటలను అనుగ్రహించితివి. పుట్టుగ్రుడ్డివానికి చూపు నిచ్చితివి. గొడ్రాలునకు పుత్రుని ప్రసాదించితివి. విధవకు సౌభాగ్యమును అందించితివి. భక్తజనులకు ఐశ్వర్యమును ప్రసాదించితివి. ఇంతటి అత్యద్భుతమైన మీ చరిత్రము అంతులేని అఖండమైన

---

[1] పై శ్లోకములకు అదే సంఖ్యతో వరుసగా తెలుగు తాత్పర్యములు పేర్కొనబడినవని పాఠకులు గమనింపగలరు.

ఖ్యాతిని ఆర్జించి సమస్త భూమండలమునందు చక్కగా వ్యాపింపజేసినది. ఇట్టి మహిమాన్వితులగు శ్రీనృసింహ సరస్వతీ స్వామివారి దివ్యమైన శ్రీచరణకమల యుగ్మమునకు ప్రణతులర్పించుచున్నాను. (404)

నరసింహేంద్ర సరస్వతీశ్వర ప్రభూ! నీవు ఘోరపాతకములను బాపువాడవు. బడబాగ్నివంటి దారిద్ర్యబాధను తొలగజేయుదువు. అజ్ఞానమనెడు అంధకారమును రూపుమాపి జ్ఞానజ్యోతిని వెలిగింపజేయుదువు. జగత్తును ప్రకాశింపజేయునట్టి అతులిత మహిమాన్వితులు. భక్తుల బాధలను తొలగజేయునట్టి కామధేనువులు. కరుణాసముద్రులు. శరణాగత రక్షకులు. కల్పతరువులు అయినట్టి శ్రీనరసింహ సరస్వతీస్వామివారి శ్రీపాదపద్మయుగళమునకు వందనము చేయుచున్నాను. (405)

ప్రతినిత్యము గురుమూర్తి యొక్క చరణకమల ద్వయమును స్మరించెడు జనులకు పవిత్రములైన గంగాది నదులలో స్నానమొనర్చిన ఫలము సిద్ధించును. పావన చరిత్రములను గలిగిన క్షేత్రములను దర్శించిన మహత్తరమైన పుణ్యఫలము లభించును. అంతేగాక, వేయి అశ్వమేధ యాగములను, వేలాది గోదానములను ఆచరించిన సంపూర్ణ పుణ్యఫలము లభించి తీరును. అట్టి శ్రీనరసింహ సరస్వతీ స్వామివారి శ్రీపాదపద్మ ద్వంద్వమునకు నేను నతులొనర్చెదను. (406)

నిగమాగమ శాస్త్రములకు అగమ్యము, అగోచరము అగు మంగళప్రదమైన మీ దివ్యనామమును యథార్థముగా నిశ్చయించి స్తుతించుటకు యెవరికినీ సాధ్యము గానిపని. కావున, శ్రీగురుదేవా! నా హృదయ కమల గర్భమునందు మీ పవిత్రమైన చరణయుగళమును నిలుపుకొని నిండుమనసుతో మాటి, మాటికి స్మరించెదను. అట్టి నన్ను రక్షించుచుండుమని కోరుచూ శ్రీనరసింహ సరస్వతీ స్వామివారి శ్రీచరణ సరోజ యుగళమునకు నేను కైమోడ్పులర్పించుచున్నాను. (407)

లోకమునందుగల సమస్త భక్తజనులను తరింపజేయుటకు, యోగ్యులైన వారందరికి దీక్షను ప్రసాదించుటకు గాను తాము అవతరించితిరి. ప్రభూ! మిమ్ములను సేవించెడు భక్తలోకమునకు చతుర్విధపురుషార్థ ఫలములను అనుగ్రహించు నిమిత్తముగా తమరు శ్రీక్షేత్రమగు గాణగాపురమునందు కొలువుదీరి యున్నారు. అంతేగాదు, శ్రీగురుచరణములను స్తుతించుటవలన తమ భక్తులు సరస్వతి ద్వారా వెంటనే సమస్త దోషముల నుండి దూరమయ్యెదరు. అట్టి (నరకేసరియగు) శ్రీనృసింహసరస్వతీ స్వామివారి శ్రీచరణ పంకజద్వయమునకు నేను చేమోడ్పులర్పించుచున్నాను. (408)

ఈవిధముగ శ్రీగురునాథుని అష్టక స్తోత్రమును ఎవరు నిత్యము పఠింతురో, వారికి తేజస్సు, వర్చస్సు, బలము, సంపద, ఆనందవర్ధకమగు శరీరము, పుత్రపౌత్రాభివృద్ధి, అనేక విధములైన శుభప్రదములగు సంపదలు, చక్కని ఆరోగ్యముతో కూడిన దీర్ఘాయుష్యము కూడా సిద్ధింపగలదు. అట్టి శ్రీనరసింహ సరస్వతీస్వామి వారి శ్రీపాద పంకేరుహ ద్వంద్వమునకు నేను దండములందజేయుచున్నాను. (409)

ఈవిధముగా సాయందేవుడు శ్రీగురునాథుని స్తోత్రము చేయుచూ, భక్తిపరవశుడై పదేపదే సాష్టాంగవందనములను చేయసాగెను. ఆతని దేహము పులకించిపోవుచుండెను. కంఠము రుద్ధమగుచుండెను. అత్యంత భక్తిపారవశ్య స్థితిలో మునిగిపోయిన ఆతని కనులవెంబడి ఆనందబాష్పములు జాలువారుచుండెను. “జగద్గురు దేవా! కృపాజలనిధీ! మాకు మానుషరూపముతో కనిపించుచున్నప్పటికినీ మీరు మాత్రము ముమ్మాటికీ త్రిమూర్త్యావతార స్వరూపులే. నా యందు అవ్యాజమైన ప్రేమను కురిపించి చక్కని పరమార్థమును ప్రసాదించితిరి. ప్రభూ! తద్వారా నాకు చతుర్విధ పరమ పురుషార్థములు అనాయాసముగనే సిద్ధించినవి. నాకెదురుగా వున్నది సాక్షాత్తుగా కాశీవిశ్వనాథుడే. ఆనందవనమైన కాశీపురము మీలోనే ఉన్నది. సాక్షాత్తుగా విశ్వనాథులు మీరే” అని సాయందేవుడు పలువిధములుగా శ్రీనృసింహ సరస్వతీ స్వామివారిని స్తుతించెను. సాయందేవుడు చేసిన స్తోత్రమునకు కడు ప్రసన్నత చెందిన **శ్రీగురుమూర్తి మందహాసమును చిందించుచూ సాయందేవునితో ఇట్లు పలికెను** – “నీకు కాశీపురమును చూపించితిని. తద్వారా నీ వంశమునందుగల ఇరువదియొక్క తరముల వారికి నేటి కాశీయాత్ర సందర్శన ఫలము లభించును. నీవే మా నిజభక్తుడవు. పరీక్షలో నిగ్గుతేలిన నిజమైన శిష్యుడవు నీవే నాయనా! ఇక నీవు నన్నే సేవించుచు నా వెంటనే, నేనుండు ఈ చోటుననే వుండవచ్చును. నీవు వెంటనే వెళ్ళి నీ దారాపుత్రాదులను తీసుకొని వచ్చి నా వద్దనే యుండవచ్చును. అందుకెంతమాత్రము సందేహపడవలసిన పనిలేదు. ఇకముందు మ్లేచ్ఛులకు మాత్రము నీవెప్పుడూ వందనము చేయవద్దు” అని గురునాథుడు చెప్పెను. అతడు తమ గృహమునకు వెళ్ళుటకై అనుమతించి శ్రీగురునాథుడు తన మఠమునకు వెళ్ళెను. గురుభక్తులకు నిత్యమూ లభించే మహదానందము సాయందేవునకు పరిపూర్ణముగా లభించినది. గురునాథుని వద్ద ఆజ్ఞ తీసుకొని, ఆయన తన ఇంటికి వెళ్ళి భార్యాబిడ్డలను వెంటతీసుకొని మరుసటిరోజే అనగా భాద్రపద మాసము, శుక్లపక్షము, చతుర్దశి తిథినాడు సాయందేవుడు అనన్యభావముతో శ్రీగురుదర్శనమునకై గాణగాపురమును చేరుకొనెను.(410-419)

మఠములోనికి వస్తూ వస్తూనే అతడు దీర్ఘదండ నమస్కారమును చేసి ఏకచిత్తవ్రతుడై స్వామిని శరణాగతి కోరుతూ తను, ధన, మనములను శ్రీవారి పాదపద్మములయందు సమర్పించుకొనెను. భావభక్తి నిండుకొనగా ఆతని గొంతు బొంగురుపోవుచుండెను. నాలుక

తడబడుచుండెను. తనతోపాటుగా తన భార్యాపిల్లలందరిచేత స్వామికి వందనమును చేయించెను. అనంతరము వారందరూ నిలువబడి చేతులు జోడించి, **స్వామివారిని ఇట్లు స్తుతింపసాగిరి.** "చంద్రమౌళీశ్వరా! మీకిదే మా వందనము. త్రిమూర్తి స్వరూపా! జగద్గురుదేవా! మీకు మా ప్రణామములు. హరిహర బ్రహ్మాదులకు కూడా మీ ఆద్యంతములు తెలియనేరవు. అట్టి మీ మహిమను వర్ణింపగల శక్తి అల్పజ్ఞులమైన మాకెక్కడిది ప్రభూ! కృపానిధీ! నేడు మేము ఆదిపురుషుని దర్శించి ధన్యులమైతిమి. చంద్రోదయమైన వెంటనే శీతలకిరణములనుండి స్రవించే అమృతము లభించుటవలన ఎంతటి మహదానందము కలుగునో, అంతకంటే పదిరెట్ల మహదానందము శ్రీవారి దర్శనభాగ్యమువలన మాకు కలుగుచున్నది. పూర్వజన్మలో చేసిన పాపములన్నీ శ్రీవారి దివ్యదర్శనమాత్రముచేత అవి దగ్ధమైపోయి మేము పునీతులమైతిమి. చింతామణీ స్పర్శచే ఇనుము బంగారముగా మారిపోవును. జంబూనదిలో పడిన మట్టిగడ్డ వెంటనే బంగారముగా మారిపోవును. మానససరోవరములో మునిగిన కాకి రాజహంసగా మారిపోవును కదా! అటులనే మీ దర్శనభాగ్యముతో మేము భాగ్యవంతులమై కృతార్థులమైతిమి.(420-427)

శ్లో ॥ గంగాపాపం శశీతాపం దైన్యం కల్పతరుస్తథా । పాపం తాపం చ దైన్యం చ హరేత్ శ్రీ గురు దర్శనమ్ ॥ (428)

అనగా గంగాస్నానము పాపమును నశింపచేయును. చంద్రుడు తనచల్లని కిరణములచే తాపమును హరించివేయును. కల్పవృక్షము కోరిన కోరికలను ప్రసాదించి దైన్యమును దూరము చేయును. ఈవిధముగా గంగా, చంద్రుడు, కల్పవృక్షము ఈ మూడింటికీ ఒక్కొక్క గుణము మాత్రమే చెప్పబడినది. కాని, శ్రీగురుచరణదర్శనమువలన ఒకేసారి ఈ మూడింటి ఫలము లభించును. అనగా, శ్రీగురుచరణ సందర్శన భాగ్యము వలన పాపము వెంటనే హరించును. తాపము, చింత, దుఃఖము మటుమాయమైపోవును. దారిద్ర్యమనే అరణ్యము దగ్ధమైపోవును. అంతేకాదు, చతుర్విధ పురుషార్థములు అనాయాసముగా శ్రీగురునాథుని అనుగ్రహముచేత లభించునని సకలశాస్త్రముల సారము. అట్టి మీ దర్శనభాగ్యము మాకీనాడు లభించెను" అని వారందరూ స్వామివారి దర్శనముచేత మహదానందభరితులై వివిధ సంగీతరాగములతో తాళయుక్తముగ కన్నడ భాషలో శ్రీస్వామివారిని స్తుతించే పాటలు, కీర్తనలు పాడిరి. (429-433) (సూచన: సాయందేవుని కుటుంబము కన్నడ మాతృభాషకు చెందినది. కావున శ్రీస్వామివారిని గూర్చి వారు గానం చేసిన రెండు కీర్తనలు - మరాఠీ మూలగ్రంథమునందు కన్నడ భాషలోనే పేర్కొనబడినవి. ఈ గ్రంథకర్త యగు శ్రీ గంగాధర సరస్వతిగారు కూడా వీరి వంశమునకు చెందినవారే అని గమనింపగలరు. 434,435 సంఖ్యలతో చేర్చబడిన ఆ కీర్తనల యొక్క భావానువాదము యథాతథముగా చేర్చబడినదని పాఠకులు గ్రహింపగలరు.

"ఈ భూమండలమునందలి భక్తజనుల భాగ్యనిధియై వెలసిన శ్రీనృసింహ సరస్వతి స్వామివారిని ఈ రోజు మేము దర్శించితిమి. సుఖమును ప్రసాదించే జగత్పతియొక్క చరణకమలాలను హృదయకమలములో ఆరాధించుచూ కళ్ళారా చూడగలిగితిమి. సంసారములో మునిగి తేలుతున్న భక్తజనుల కోరికలను తృటిలో నెరవేర్చి రక్షించే యోగులకు యోగియైన యోగయోగేశ్వరుడైన శ్రీనృసింహసరస్వతి స్వామివారి పాదకమలాలను మేము నేడు దర్శించితిమి. తత్త్వమస్యాది మహావాక్యలక్షితుడు, నిర్గుణ స్వరూపుడు అయి కూడా సగుణ స్వరూపమును ధరించి దండకమండలములను ధారణ చేసి, సజ్జనులయెడ ప్రసన్నుడు కాగలిగే యతిశ్రేష్ఠులైన శ్రీగురునాథుని నేడు దర్శించితిమి. భూలోకములోని అపర కైలాసముగా తలపింపచేయు గాణగాపుర క్షేత్ర వాసులగు హరిభక్తులకు స్వామిగా, సర్వస్వముగా నిత్యము దర్శనమిచ్చి మహనీయ కృపతో వారికి వరాలజల్లును ప్రసాదించి, ఎల్లప్పుడూ భక్తజనుల పాలిట కల్పతరువై భాసిల్లుచున్న శ్రీగురునాథుని చరణసరోజములను నేడు దర్శించగలిగితిమి. ఆహా! నేడు దర్శించగలిగితిమి". (434)

"యతిశ్రేష్ఠుల సమూహమునందు చంద్రునివలె శోభించుచుండెడు శ్రీ స్వామిని మేము దర్శించితిమి. తత్త్వోపదేశమే ప్రధానముగా గలిగిన ఉపనిషత్తుల సారసర్వస్వమైన తత్త్వమువంటి చరిత్రకు సాకారమైన మూర్తిమంతమగు పరబ్రహ్మ అని ఎవరిని అందురో, అట్టి మహనీయమూర్తిని మేము దర్శించితిమి. శేషతల్పమున నిదురించి, శ్రేష్ఠవేషమును ధరించి, శరణాగతత్రాణ బిరుదును ధరించిన సార్థక నామధేయుడగు మహనీయుని మేము ఈనాడు గాంచితిమి. ఎవరి కృపాకటాక్షము ఏనాటికీ వృథా కాకుండగా సుగంధ పరిమళాలతో కూడుకొని గంభీరంగా తరంగాయితమయ్యే ఆనందసాగర స్వరూపమే అయిన యోగేంద్రుడు, యోగయోగేంద్రుడు, గోపీజనవల్లభుడు, సాక్షాత్ మన్మథ మన్మథ స్వరూపుడు అయిన శ్రీకృష్ణపరమాత్మనే మేము నేడు దర్శించగలిగితిమి. సమస్త వేదమంత్రములకు మూలమైన, సర్వతంత్ర స్వతంత్రమైన, అంతులేని తేజస్సును విరజిమ్మే స్వరూపము అయిన యతిసార్వభౌముని మేము ఈ రోజు చూడగలిగితిమి. గజేంద్రునకు మోక్షమును అనుగ్రహించిన నరసింహ - సరస్వతి అనే స్త్రీ పురుష వాచకము అనగా ప్రకృతిపురుషుల, శివశక్తుల ఉభయసూచకమగు నామమును ధరించిన గురుశ్రేష్ఠమూర్తిని మేము ఈ రోజున గాంచితిమి". (435)

ఈవిధముగా శ్రీగురుదేవదత్తుని అనేకవిధములుగా, మిగుల హర్షాతిరేకముతో స్తోత్రము చేయుచుండగా కదు సంప్రీతుడైన శ్రీస్వామివారు వారికి తన అభయదానమును, వరద హస్తముతో అనుగ్రహించెను. వారికి దృఢమైన ఆశ్వాసనమును అనుగ్రహించెను. తల్లికి పిల్లలమీద ఎంతటి లోభముతో పెనవేసుకొనిన ప్రేమ యుండునో, అంతటి ప్రేమభావముతో సాయందేవుని, అతని దారాపుత్రాదులను దగ్గరగా పిలిచి

తనకు అత్యంత సమీపమున కూర్చుండబెట్టుకొనెను. “నాయనా! నామధారకా! వినుము. ఆనాడు శ్రీగురుయతిరాజుగారి అంతఃకరణమున ఎంతటి అపారమైన కృప పొంగులువారినదో దానిని నేనేమని చెప్పగలను. సొంత భార్యాబిడ్డలపై ఎంతటి మిక్కుటమైన ప్రేమ యుండునో అంతకంటే మిక్కిలి ప్రేమభావమును ఆనాడు గురుదేవులు మీ పూర్వజులపై కురిపించెను. పిమ్మట దగ్గరగా కూర్చుండిన సాయందేవుని దారాపుత్రాదులను ఒక్కొక్కరిని పిలిచి కుశలసమాచారములను ప్రశ్నించి, ఇంటి విషయములను కూడా పదేపదే ప్రశ్నించి సమస్త సమాచారమును అడిగి తెలుసుకొనెను. అనంతరము సాయందేవుని భార్య లేచి స్వామికి నమస్కరించి తమ ఇరువురి పుత్రులను శ్రీవారి పాదాబ్జములపై పడుకొనబెట్టెను. వారి జ్యేష్ఠ కుమారుడైన నాగనాథునిపై అత్యధికమైన కృపాప్రభావముతో శ్రీగురునాథులు తమ హస్తమును ఆతని మస్తకముపై ఉంచి, “నాయనా! నీ జ్యేష్ఠ కుమారుడు పూర్ణాయుష్మంతుడగును. అతనికి హెచ్చు సంతానము కలుగును. ఇతడే మాకు నిజభక్తుడు కాగలడు. ధనసంపన్నుడు అగుననుటలో సందేహము లేదు. నీ భార్యకు ఇంకనూ నలుగురు పుత్రులు కలిగెదరు. వారు సమస్త సిరిసంపదలతో తులతూగెదరు. నీవు హాయిగా నిశ్చింతగా ఉండుము. ఇక నీవు మ్లేచ్ఛులకు సేవావందనము చేయరాదు. ఒకవేళ నీవు మ్లేచ్ఛుల వద్దకు వెళ్ళినచో నీ ప్రాణమునకే ముప్పు వాటిల్లగలదని హెచ్చరించిరి. అనంతరము సాయందేవుని చూసి మీరు త్వరగా సంగమమునకు వెళ్ళి స్నానము చేసి రావలసినదని” పలికిరి. (436-448)

ఆ రోజున భాద్రపద శుక్ల చతుర్దశి అనంతపద్మనాభస్వామి వ్రతము జరుపుకొను దినమైనందున గాణగాపుర ప్రజలు, భక్తులు అందరూ శ్రీగురుమూర్తినే అనంతునిగా భావించి ఆయనకు దివ్యమైన ఉపచారములతో పూజలు చేసిరి. పుత్రమిత్రకళత్రముతో సంగమమునకు వెళ్ళి, స్నానము చేసి, భక్తిశ్రద్ధలతో అశ్వత్థ వృక్షమును పూజించి, సాయందేవుడు తిరిగి మఠమునకు చేరుకొనెను. (449-450) **అంతట శ్రీగురునాథులు సాయందేవునితో ఇట్లు పలికెను** – “నేడు అనంతచతుర్దశి వ్రతము ఆచరింపవలసిన దినము. కావున, నీవు ఈ బ్రాహ్మణులందరితో కలిసి అనంతుని పూజించుము” అని పలికెను. వెంటనే సాయందేవుడు నమస్కరించి, “గురుదేవా! మా అనంతులు మీరే కదా! మీ చరణకమలములకే వ్రతసేవ చేయుదును” అని పలికెను. **అంతట శ్రీగురుమూర్తి నుడివెను** – “అత్యంత ప్రసిద్ధము నొందిన ఈ వ్రతమును ఇంతకుముందు కౌండిన్యుడు అను ఋషీశ్వరుడు ఆచరించియుండెను. అప్పుడా బ్రాహ్మణోత్తముడు స్వామివారికి నమస్కరించి, “స్వామీ! ఈ వ్రతమును ఇంతకుమునుపు ఎవరు చేసిరి? ఎందుకు చేసిరి? ఎట్లు చేసిరి? అట్టి అద్భుతమైన వ్రతమును గురించి, దానియొక్క ఆద్యంతములను గూర్చి మాకు సవివరముగా చెప్పవలసినదని” ప్రార్థించెను. సాయందేవుని మాటను విని శ్రీగురునాథులు మిగుల

సంతసించి శ్రీమదనంతపద్మనాభస్వామి వ్రతమును గూర్చి వివరముగా చెప్పసాగెనని సిద్ధుడు నామధారకునితో చెప్పెను. వారి ఉభయుల సంవాదమును వినుటవలన శ్రోతలందరునూ భవసాగరము నుండి నిస్సందేహముగా తరించిపోగలరు అని పలికిన సరస్వతీ గంగాధరుడు శ్రీగురుచరిత్రమును లోకమునకు ప్రకటించెను.(451-458)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున భక్తికాండమునందు “కాశీయాత్ర, త్వష్ట పుత్ర ఆఖ్యానము, సాయందేవ వరలాభము” అను నలుబది ఒకటవ అధ్యాయము ॥ 41 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 458; మొత్తము సంఖ్య 5723 + 458 = 6181 ఓవీలు)

◆ ◆ ◆

దత్తాత్రేయం ప్రపద్యే శరణమనుదినం దీనబంధుం ముకుందం,
నైర్గుణ్యే సన్నివిష్టం పథి పరమపదం బోధయంతం మునీనామ్ ।
భస్మాభ్యంగం జటాభిః సులలిత మకుటం దిక్పటం దివ్యరూపం,
సహ్యాద్రౌ నిత్యవాసం ప్రముదిత మమలం సద్గురుం చారుశీలమ్ ॥

సాధన గ్రంథమండలి - తెనాలి వారి 'శ్రీదత్తాత్రేయ కల్పః'

సంకలనం : శ్రీ పోతుకూచి శ్రీరామమూర్తి గారి గ్రంథం నుండి సేకరణ.

శ్రీ గురు చరిత్ర

నలుబది రెండవ అధ్యాయము

శ్రీగురుమూర్తి సాయందేవునకు అనంతవ్రతమాహాత్మ్యమును వివరించుట - అడవులపాలైన పాండవులకు శ్రీకృష్ణపరమాత్ముడు అనంతవ్రత విధానమును, దాని ఫలితమును గూర్చి ఉపదేశించుట - సాయందేవుడు అనంతవ్రతమును ఆచరించిన పిమ్మట శ్రీగురుసేవకు అంకితమగుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని నామధారకునితో ఈవిధముగా చెప్పుచుండెను– “నామధారకా! శ్రీగురుమూర్తి సాయందేవుడను తన ముఖ్య శిష్యునకు అనంతర కథను ఈవిధముగా చెప్పసాగెను. **శ్రీగురునాథుడిట్లు పలికెను** - “నాయనా! సాయందేవా! నీవు అనంతవ్రత మాహాత్మ్యమును గురించి అడిగితివి. ఈ వ్రతమును ఇంతకుముందెవరు ఆచరించిరి? ఎందరు ఆచరించిరి? దాని మాహాత్మ్యమేమిటి? అని ప్రశ్నించితివి. పూర్వము పాండుసుతుడు యుధిష్ఠిరుడు ఈ అనంతవ్రతమును ఆచరించి తాను పోగొట్టుకొనిన రాజ్యమును తిరిగి పొందెను. అంతేకాదు, అనాదికాలము నుండియూ అనేకానేక భక్తజనులు ఈ అనంతపద్మనాభస్వామి వ్రతమును ఆచరించి సమస్తభోగభాగ్యములను పొందిరి” అని చెప్పెను. **అంతట, సాయందేవుడు రెండు చేతులను జోడించి గురుమూర్తితో ఇట్లు పలికెను** - “స్వామీ! రాజవంశమునందు జన్మించి, సహజముగనే రాజులైన పాండుకుమారులకు తిరిగి రాజ్యము లభించుట ఏమిటి? ఈ మాట నాకు విచిత్రముగా తోచి మిమ్ము ప్రశ్నించుచుంటిని. దయతో వివరముగా సెలవీయవలసినదని” ప్రార్థించెను. (1-3)

అంతట శ్రీగురునాథుడు సాయందేవుని ప్రశ్నకు ఈవిధముగా సమాధానము చెప్పుచుండెను - ధృతరాష్ట్ర పుత్రుడైన దుర్యోధనుడు, పాండుపుత్రులైన పంచపాండవులను మాయా జూదమున ఓడించి, వారి రాజ్యమును అపహరించెను. అందుకు ఫలితముగా వారు పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చేయవలసి వచ్చెను. అప్పుడు ధర్మరాజుగారు నలుగురు సోదరులతోడను, తమ భార్యయైన ద్రౌపదితో కూడా కలిసి పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాస మొనర్చిరి. అయితే

పాండవులు అరణ్యవాసము చేయుచుండగా, అనేక కష్టములను అనుభవించిరి. ఘోరమైన అరణ్యమునందు ధర్మరాజు చింతాక్రాంతుడై తన సోదరులతోపాటు నిరంతరము శ్రీహరిని ధ్యానించుచూ అరణ్యవాసము చేయుచుండెను. రాజ్యమును వదలిపెట్టి అడవిపాలైన పాండవులను, కౌరవులు మోసపూరితమైన కుట్రలను పన్ని అనేకవిధములుగా వారికి కష్టములను కలిగించుచునేయుండిరి. ఆ సందర్భమున ఒకసారి దుర్యోధనుడు పాండవులను పరీక్షించి పరాభవమునకు గురి చేయవలెనని యోచించెను. అందుకు దుర్వాసమహర్షిగారిని ప్రార్థించి అనేకమంది శిష్యులతోపాటుగా ఆ మహర్షిని ఆతిథ్యమునకై పాండవుల వద్దకు పంపించెను. అట్టి పరీక్షా సమయమునందు పాండవులు కృష్ణపరమాత్మను అనన్యభక్తితో సేవించిన వారగుటచే హృషీకేశుడు విచ్చేసి, వారిని తన అద్భుతమైన మహిమచే రక్షించి కాపాడెను. (4-8)

పాండవులు అనేకవ్రతములను ఆచరించి, ఎన్నియో తీర్థక్షేత్రములను సేవించిరి. లెక్కకు మిక్కిలి నానావిధములైన కష్టములను అనుభవించిరి. వారి కడగండ్లను గుర్తించిన భక్తవత్సలుడైన శ్రీకృష్ణపరమాత్ముడు ఒకసారి పాండవులను చూచి, వారి బాగోగులను పరామర్శించుటకై ఏతెంచెను. కృష్ణుని రాకను గమనించి ధర్మరాజు ఎదురేగి పరమాత్మకు సాష్టాంగవందనము చేసి, తమ కుటీరములోనికి ఆహ్వానించెను. ఉచితాసనముపై శ్రీకృష్ణుని కూర్చుండజేసి తన శిరోజములతో కృష్ణుని పాదధూళిని తుడిచి, అర్ఘ్యపాద్యాదులను, గంధాక్షత పుష్పములను సమర్పించి, సభక్తికముగా కృష్ణపరమాత్మను పూజించెను. **అనంతరము ఇట్లు స్తుతించెను** –

"హృషీకేశా! భక్తవత్సలా! కృష్ణస్వామీ! మీకు జయము. జయము. అనంతా! నారాయణా! కృపాళూ! లక్ష్మీరమణా! క్షీరాబ్ధిశయనా! వాసుదేవా! మీకు జయము. జయము. పరమాత్మా! పరంజ్యోతీ! నీవే ఈ జగత్తు యొక్క సృష్టిస్థితిసంహారములను చేయుచుందువు. ప్రతియుగమునందు ధర్మసంస్థాపనార్థముగా దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించుటకై అవతరించుచుందువని వేదపురాణములు ఘోషించుచున్నవి. సమస్త విశ్వమునకు నీవే ప్రాణమై, ప్రాణికోటిని రక్షించుచుండెదవు. స్థూల, సూక్ష్మ, అణు, రేణు తృణ, కాష్టములయందు కూడా నీవే విలసిల్లుచుండెదవు. ప్రభూ! నీ మహిమను మేమేమని పొగడగలము. భూభారమును తగ్గించుటకై అప్పుడప్పుడు నీవు పుడమిపై అవతరించుచుండెదవు కదా! నీ భక్తులమైన మేము దట్టమైన ఈ అరణ్యములయందు అనంతకష్టములను అనుభవించుచుండగా నీవు ఎందులకు ఉపేక్షించుచుంటివి? మేము నీకు ప్రాణసములమని ఈ లోకమంతా నొక్కివక్కాణించుచుండెను. అప్పుడు మమ్ములను అడవిపాలు జేసి మరింతగా మమ్ములను కష్టపెట్టుటెందులకు? ఎవరిపై నీ కృపావృష్టి కురియుచుండునో, వారికి కష్టములెట్లు కలుగుచుండెను? మమ్ములను ఉపేక్షించి అరణ్యవాసము విధింపజేసితివి. స్వామీ! అనాథరక్షకుడవు, ఆశ్రితదీనజన వత్సలుడవైన నీవు తప్ప మాకు దిక్కెవరు,

ప్రభూ? మా మనసులోని మాటను మీకు గాక, మేము మరెవరితో చెప్పుకొనగలము. నీవు మమ్ములను ఉపేక్షించిన యెడల మాకు జీవితముపై ఆశ నిలచియుండునా?" అని ప్రార్థించెను. (9-23)

అంతట భీమసేనుడు ముందునకు వచ్చి కృష్ణపరమాత్మ చరణసరోజములను పట్టుకొని సాష్టాంగ వందనము నాచరించి, రెండు చేతులను జోడించి **ఇటుల పలికెను** - "స్వామీ! మమ్ములను ఉపేక్షించుట ఏల? మా జీవితమంతయు కడగండ్లపాలయ్యెను గదా!" అని పలికెను. పిమ్మట, అర్జునుడు స్వామిముందునకు ఏతెంచి ఆయన పాదపద్మములకు వందనము చేసి, 'కృపాళూ! మురారీ!' అంటూ దయనీయంగా **ఇట్లు విన్నవించెను**- "మీ కృపాదృష్టి మా యందు ఉన్నప్పటికినీ మేము ఈ అరణ్యావాసమును చేయుచుంటిమి. మాకు కలిగెడు అనేక కష్టనష్టములతో మేము నలిగిపోవుచుంటిమి. స్వామీ! మా కష్టములను తొలగించుము ప్రభూ! పాండవులన్నచో, మీకు ప్రాణసములు అనే బిరుదమును నిలబెట్టుకొనుము నారాయణా!" అని ప్రార్థించెను. అనంతరము మాద్రీదేవి యొక్క తనయులగు నకుల సహదేవులు ముందుకు వచ్చి పరమాత్మకు సాష్టాంగవందనము ఆచరించిరి. అంతట ద్రౌపదీదేవితో కలిసి పాండవులైదుగురు సామూహికముగా **శ్రీస్వామివారికి నమస్కరించి ఇట్లు పలికిరి**- "స్వామీ! నీవే మా రక్షకుడవు. మమ్ములను ఈ ఘోరాటవిలో ఉంచితివి. మా సోదరులు రాజ్యపరిపాలన చేయుచూ, రాజభోగములను అనుభవించుచుండిరి కదా! ఇక మా గతి ఇంతేనా! మేము నీ ఛత్రచ్ఛాయలో ఉన్నప్పటికినీ అపరిమితముగా కష్టములపాలైతిమి. మాకు రాజ్యప్రాప్తిగానీ, స్వస్థచిత్తముగానీ ఎట్లు లభించును? స్వామీ! హృషీకేశా! దానికేదేని ఉపాయమున్నచో, తాము సెలవీయవలసినదని" ప్రార్థించిరి.(24-31)

అంతట శ్రీకృష్ణపరమాత్మ పాండవుల యెడల మిక్కిలి దయగలవాడై ఇట్లు చెప్పుచుండెను- "పాండవ సోదరులారా! మీరిక చింతపడవలదు. మీకొక ఉత్తమమైన వ్రతమును గూర్చి చెప్పెదను. ఆ వ్రతమును మీరు ఆచరించినచో, మీ కడగండ్లు అతి శీఘ్రముగా తొలగిపోయి మీ రాజ్యము మీరు తిరిగి పొందగలరు. వ్రతములలోకెల్ల ఒక ఉత్తమ వ్రతము గలదు. దానిపేరు '**అనంతవ్రతము**'. అట్టి అనంతవ్రతమును శ్రద్ధాభక్తులతో మీరు ఆచరించిన యెడల తిరిగి మీకు మీ రాజ్యము తప్పక సిద్ధించును. అంతేకాదు, సమస్త దేశములయందు, సర్వకాలములయందు, సకల వస్తువులయందు, వ్యాపించియున్న నన్నే అనంతునిగా తెలుసుకొనుడు. కల, కాష్ఠము, ముహూర్తము, రాత్రి, పగలు, పక్షము, మాసము, సంవత్సరము, యుగము, కల్పము మున్నగువాటి అన్నింటిలో, అన్ని దేహములలో నేనే ఉన్నాను. దుష్టులైన దానవులను తొలగజేసి భూభారమును తగ్గించుటకొరకై నారాయణుడనైన నేనే వసుదేవుని గృహమున అవతరించితిని. ఎంతమాత్రము సంశయింపవలసిన పనిలేదు.

నేనే బ్రహ్మను. నేనే విష్ణువును. నేనే మహేశ్వరుడను. ఈ త్రిమూర్తుల రూపములలో నేనే యుండెదను. సూర్యుడు, చంద్రుడు, చతుర్దశ భువనములు, అష్టవసువులు, ద్వాదశ ఆదిత్యులు, ఏకాదశరుద్రులు, సప్తసముద్రములు, సప్త ఋషులు, పర్వతములు, నదీనదములు, నేలమీద గల వృక్షములు, ఆకాశమునందుగల సమస్త నక్షత్రములు, దశదిశలు, భూమండలమంతయూ నేనే. సప్త పాతాళములు, భూర్భువాది సమస్త లోకములు, అణువులు, రేణువులు, తృణములు, కాష్ఠములు, సకలమూ విశ్వాత్మనైన నేనే యని గ్రహించుము. ఇంకనూ, ఇది, అది అని చెప్పుట ఏల? ఈ సమస్తము నా స్వరూపముగా తెలిసికొనుము. ధర్మనందనా! నీవు ఎంతమాత్రము సందేహింపవలదు. 'అనంతుడు' అనగా నేనే అని నిశ్చయముగా గ్రహించుము. అట్టి అనంతుడనైన నన్ను అనంతవ్రతముద్వారా విధిపూర్వకముగా పూజించుము. తత్ఫలితముగా మీ సమస్త కష్టములు తొలగిపోయి మీకెనలేని శ్రేయస్సు లభింపగలదు" అని కృష్ణపరమాత్ముడు చెప్పెను. **వెంటనే ధర్మరాజు చేతులు జోడించి ఇట్లు ప్రశ్నించెను** – "స్వామీ! ఈ అనంతవ్రతమును ఎట్లు చేయవలయును. దాని విధానమేమి? ఎప్పుడు చేయవలెను? ఏయే దానములను ఈయవలెను? ఏ దినమున ఈ వ్రతమును నిర్వహింపవలెను? ఇంతకుపూర్వము ఈ వ్రతమును ఎవరైనా ఆచరించియుండిరా? స్వామీ! దయతో వివరముగా నాకు చెప్పవలసినదని" ప్రార్థించెను. (32-44)

అంతట శ్రీకృష్ణభగవానుడు ధర్మరాజుతో ఇట్లు చెప్పసాగెను– "ధర్మరాజా! భాద్రపదమాసమునందలి శుక్లపక్షమునందు చతుర్దశి తిథినాడు ఈ అనంతవ్రతమును ఆచరించవలెను. తద్వారా మీరు పోగొట్టుకొనిన రాజ్యమును తిరిగి తప్పక పొందెదరు. అయితే ఈ వ్రతమును పూర్వము ఎవరు ఆచరించిరి? అని ప్రశ్నించితివి కదా! అందుకు సమాధానమును చెప్పుచున్నాను. శ్రద్ధగా వినుము.

పూర్వము కృతయుగమున 'ఆసీత్పురము' అను గ్రామమునందు వసిష్ఠగోత్రమునందు ఒక బ్రాహ్మణుడు జన్మించెను. అతని పేరు 'సుమంతుడు'. అతని భార్యపేరు 'దీక్ష'. ఆమె భృగుమహర్షి కుమార్తె. ఆమె గొప్ప ఔదార్యగుణముగల మహాపతివ్రత. ఇట్టి సుమంతుడు, దీక్ష అను దంపతులకు ఒక కుమార్తె కలిగెను. ఆమె పేరు 'సుశీల'. పేరుకు తగినట్టుగా చక్కని శీలవంతురాలు. గుణవంతురాలు. ఇట్లుండగా కొంతకాలమునకు దైవవశాత్తుగా సుమంతుని భార్యయగు దీక్ష మరణించెను. అనంతరము సుమంతుని కుమార్తెయైన సుశీలయే సర్వమంగళ స్వరూపిణీయైన జగన్మాతను సదాచారముతో ప్రతినిత్యము పూజించుచుండెను. మనోవాక్కాయకర్మలతో తండ్రికి సేవలను అందించుచుండెను. పంచరంగులతో గృహమును అలంకరించుచూ తండ్రిగారి దేవపూజకు అవసరమగు పుష్పములు, ఇతర సామగ్రిని సమకూర్చుచుండెను.

ఇంటిముంగిట, గృహము లోపల పచ్చని ఆకులతో తోరణములను కట్టి స్వస్తికము, శంఖము, పద్మము వంటి వివిధములైన పంచరంగులతో కూడిన రంగవల్లులను తీర్చిదిద్దుచుండెను. (45-52)

ఇట్టి తరుణమున భార్యలేనివారికి కర్మాధికారము లేనందున సుమంతుడు పునర్వివాహము చేసుకొనవలయునని తలంచెను. అందువలన అతడు మరొక స్త్రీతో వివాహము చేసుకొనెను. ఆమె పేరు 'కర్కశ'. పేరుకు తగినట్లుగా ఆమె దుష్టస్వభావురాలు, దురాచారవంతురాలు. కూతురు తోడను, భర్తతోడను ప్రతిదినము అనేకవిధములుగా కలహించుచుండెను. కూతురుపై అనేక అభియోగములను మోపుచుండెను. వాటిని గూర్చి తన భర్తతో చెప్పుచూ సుశీలను మిక్కిలి అసూయతో చూచుచుండెను. ఇట్లుండగా, సుమంతుని కూతురైన సుశీలకు యుక్తవయస్సు వచ్చెను. సుశీలకు యోగ్యుడైన వరునికోసము సుమంతుడు తనలో తాను చింతించుచూ వెదకుచుండెను. మానసికముగ చింతించుచుండగా ఒకనాడు సుమంతుని ఆశ్రమమునకు 'కౌండిన్యుడు' అను ఋషికుమారుడు వచ్చెను. సుమంతునకు నమస్కరించి కౌండిన్యుడు "ఋషీశ్వరా! మీ కూతురైన సుశీలను నాకు ఇచ్చి వివాహము చేయుమని" కోరెను. అందుకు వెంటనే సుమంతుడు అంగీకరించి తన కుమార్తెయగు సుశీలను కౌండిన్యుడు అను ఋషికుమారునకు ఇచ్చి వివాహము ఒనర్చెను. వివాహమైన పిదప ఆషాఢమాసము, శ్రావణమాసము అను రెండు నెలలు సుశీల మరియు కౌండిన్యుడు అను నూత్న దంపతులు తమ మామగారైన సుమంతుని ఆశ్రమములోనే నివసించుచుండిరి. సవతితల్లియైన కర్కసి వారి విషయములో ఎంతమాత్రము దయాదాక్షిణ్యములు లేకుండా నిరంతరము వారితో కలహించుచూ విరోధభావముతో ప్రవర్తించుచుండెను. ఆమె స్వభావమును గ్రహించి కౌండిన్యుడు తన మామగారితో, "అయ్యా! ఇక మేము మీ వద్ద ఉండజాలము. నా భార్యతోపాటుగా మేము మా ఆశ్రమమునకు వెళ్ళిపోయెదము" అని కోరెను. అందులకు సుమంతుడు తనలోతాను ఇట్లు విచారింపసాగెను.

"అయ్యో! భగవంతుడా! ఈమె నాకు భార్యగా కాదు. నాకొక శత్రువుగా నిలచినది. ఈమెను భార్యయని భావించి ఒక శత్రువును వివాహమాడితిని. గృహిణీ వలన ఎవని ఇంట శాంతి లభించదో, వాని గృహము అరణ్యసదృశమే యగును కదా! ఆహా! దైవమా! నేను సంసారకూపములో మునిగిపోయితిని. నా మాటలు నా భార్యయైన కర్కశ ఎంతమాత్రము వినిపించుకొనదు గదా! అందువలన ఉత్తమురాలైన నా కుమార్తె నాకు దూరమైపోవుచుండెను. నేనెంతటి పాపాత్మురాలిని వివాహమాడితిని" అని పరిపరివిధములుగా సుమంతుడు

అంతరంగములో దుఃఖించుచూ పరితపించుచుండెను. మామగారి దీనావస్థను గాంచి కౌండిన్యుడు **అతనిని ఓదార్చుచూ, ఇట్లు పలికెను**– “ఋషివర్యా! తాపసులు ఇరువురూ ఒకే గృహమున ఉండుటవలన ధర్మమునకు హాని కలుగును. మీరు విచారపడవద్దు. మేమిరువురము మిగుల సంతోషముతో వేరొకచోటునకు వెళ్ళి ఆశ్రమమును నిర్మించుకొని అచట అనుష్ఠానాదులను ఆచరించెదము. అప్పుడప్పుడూ తప్పక మీ వద్దకు వచ్చుచుండెదము” అని పలికెను. **అప్పుడు సుమంతుడు కౌండిన్యునితో ఇట్లు కోరెను** – “నాయనా! మా ఆశ్రమమునకు సమీపముననే మీరొక ఆశ్రమమును ఏర్పాటు చేసుకొనవలయును. భాద్రపదమాసము ప్రవేశించినది. మరొక పన్నెండు దివసములు అనగా–ద్వాదశి వరకు మా వద్దనే ఉండి భాద్రపద శుద్ధ త్రయోదశి దివసమున మీరు ప్రయాణము చేయగలరు” అని కోరగా, కౌండిన్యుడు అందులకు అంగీకరించెను. (53–64)

ఇంతలో త్రయోదశి తిథి రానే వచ్చెను. ఆనాటి సుముహూర్తమున కౌండిన్యుడు తన భార్యయైన సుశీలను వెంట తీసుకొని పయనమయ్యెను. అప్పుడు సుమంతుడు తన భార్యయైన కర్కశను పిలిచి, సుశీల తన భర్తతో దూరదేశమునకు వెళ్ళుచున్నది. కావున, వారికి దారిబత్తెమునకై కొంత గోధుమపిండి, బియ్యము మొదలగు పదార్థములను మూటగట్టి సాగనంపెదమని చెప్పెను. భర్త చెప్పిన మాటలను విని వెంటనే ఆమె విసురుగా ఇంటిలోనికి వెళ్ళి తలుపులు గట్టిగా బిగించుకొని ద్వారమును త్రోసినను తెరవకుండా ఉండుటకై గడపవద్ద ఒక పెద్ద రాతిబండను పెట్టి లోపల కూర్చుండెను. భర్త ఎంతగా పిలిచినప్పటికినీ, తల బ్రద్దలు కొట్టుకొని రోదించినప్పటికినీ ఆమె ఉలకలేదు, పలకలేదు, తలుపులు తెరచి చూడలేదు. అప్పుడు సుమంతుడు తానే స్వయముగా పక్కదారి నుండి పాకశాలలోనికి వెళ్ళి చూడగా, అచట ఒక మట్టికుండలో కొంత గోధుమపిండి మూటకట్టి ఉండెను. దానిని తీసి తన కూతురునకు, అల్లునకు దారి బత్తెముగా ఇచ్చి వారిని సాగనంపెను. మామగారికి నమస్కరించి కౌండిన్యుడు వారి ఆశీస్సులను పొంది, కదు సంతోషముతో తన భార్యాసమేతుడై ఒక శకటమును అధిరోహించి బయలుదేరెను. మధ్యాహ్న సమయమునకు వారు ఒక నదీతీరమునకు చేరుకొనిరి. అచట శకటమును నిలిపి మాధ్యాహ్నిక అనుష్ఠానమును జరుపదలచి, శకటమును దిగి స్నానమునకై కౌండిన్యుడు నదీతీరమునకు వెళ్ళెను. కౌండిన్యుడు నదిలో స్నానమాచరించి తీరమున కూర్చొని అనుష్ఠానము చేయుచుండెను. అప్పుడు శకటములో కూర్చొనియున్న సుశీల నదీతీరమువైపు చూడగా, దూరముగా ఒక స్త్రీ సమూహము గోచరించెను. వెంటనే శకటమునుండి దిగి సుశీల నదీప్రాంతమును దర్శించుచూ వెళ్ళుచుండెను. కొంతదూరమున కొందరు సువాసినీ స్త్రీలు ఎఱ్ఱని

వస్త్రములను ధరించి వేరువేరుగా కలశములను పెట్టుకొని ఏదియో ఒక వ్రతమును జరుపుచుండుటను గాంచెను. అది చూచిన సుశీల కదు ఆశ్చర్యముతో వారిని సమీపించి, "అమ్మా! మీరు ఏ దైవమును పూజించుచుంటిరి? మీరు చేయుచున్న వ్రతము ఏమిటి?" అని ప్రశ్నించెను. అప్పుడు వారు "ఇది అనంతవ్రతము. ఈనాడు చతుర్దశి తిథి. కావున, అనంతవ్రతమును చేయుచుంటిమి. ఈ వ్రతమును ఎవరు చేయుదురో, వారు సకల అభీష్టములను పొందగలరు" అని చెప్పిరి. అంతట సుశీల వారిని ఉద్దేశించి, "అమ్మలారా! ఆ వ్రతమును చేయు విధానము ఏమిటో, దయయుంచి సాంగముగా నాకు వివరించవలసినదని" ప్రార్థించెను. అప్పుడు వారలు ఆమె పేరును తెలుసుకొని, "సుశీలా! మా సమీపమున కూర్చొనుము. నీవు కోరినట్లుగా ఆ వ్రతవిధానమును చెప్పెదము" అని **ఆమెతో వ్రతవిధానమును ఈవిధముగా చెప్పసాగిరి.** (65–76)

"సుశీలా! సావధానముగా వినుము. మేము చేయుచున్న వ్రతము పేరు అనంతవ్రతము. ఈ అనంతవ్రతమును భాద్రపదమాసమునందలి శుక్లపక్షమున వచ్చు చతుర్దశి తిథినాడు ఆచరింపవలెను. ఈ వ్రతము ద్వారా అనంతపద్మనాభస్వామిని అర్చింపవలెను. ఎఱ్ఱని పట్టుదారముతో పదునాలుగు ముడులు కలిగిన తోరమును సిద్ధపరచుకొనవలెను. నదీసమీపమునకు వెళ్ళి స్నానమొనర్చి శుచియైన వస్త్రములను ధరించి పసుపు, కుంకుమలతో అలంకరించిన రెండు కలశములను తీసుకొనవలెను. వాటిలో గంగ, యమున అను భావన గలిగి ఉదకముతో నింపవలెను. తదుపరి ఆ కలశముల యందు పంచపల్లవములను ఉంచి, షోడశోపచార విధానముగా గంగ, యమునలను పూజించవలెను. క్రింద అష్టదళ పద్మములను వేసి వాటిపై కలశములను ఉంచి వాటిపై నూతన వస్త్రములను అమర్చవలెను. కలశములకు ముందు శంఖ, పద్మములనెడి అనేకవిధములైన రంగవల్లులను పంచరంగులతో తీర్చిదిద్దవలెను. దర్భలతో చేయబడిన శేషుని కలశములపైన పెట్టి షోడశోపచారములతో పూజింపవలెను. శేషశాయియైన విష్ణువును అనంతపద్మనాభస్వామిగా ధ్యానించి పూజించవలెను. సప్తఫణములను కలిగిన శేషుని వద్ద విష్ణుమూర్తి నిరంతరము నివసించును. అందువలన అతనిని అనంతుడు అనే పేరుతో ధ్యానింపవలెను. లేత గులాబీ వర్ణము కలిగిన కళ్ళతో చతుర్భుజములను కలిగి, శంఖ, చక్ర, గదా, పద్మములను ధరించియున్న మూర్తిని శ్రీమహావిష్ణు స్వరూపముగా భావించి ధ్యానించవలెను. **'ఓం నమో భగవతే వాసుదేవాయ'** అను మూలమంత్రముతో అనంతుని, నూతనముగా చేసిన తోరములను, షోడశోపచార విధానముతో పూజింపవలెను. **'అనంతగుణరత్నాయ'** అను మంత్రముతో కలశమునకు నూతన దారమును కట్టవలెను. **'అతో దేవా'** అను మంత్రముతో కలిపి పురుషసూక్త సహితముగా షోడశోపచారవిధిగా పూజింపవలెను. **'సంసార గహ్వరేతి'** అను మంత్రముతో

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

దక్షిణ హస్తమునకు తోరమును ధరింపవలెను. **'నమస్తే వాసుదేవాయ'** అను మంత్రముతో ప్రాచీన తోరమును విసర్జింపవలెను. **'దాతా చ విష్ణుర్భగవాన్'** అని భావించి బ్రాహ్మణునకు వాయనదాన మీయవలెను. గోధుమపిండి, బెల్లము, నెయ్యి మొదలగు పదార్థములతో ఇరువదియెన్మిది అపూపములు అనగా భక్ష్యములను తయారుచేసి పాయసమును వండి వాటిలో అర్ధభాగము వాయనముగా బ్రాహ్మణునకు దానము చేయవలెను. గోక్షీరము, పాయసము, తగిన దక్షిణతాంబూలాదులతో బ్రాహ్మణునకు సగము వాయనముగా దానమిచ్చి, మిగిలిన సగము తాము భుజింపవలెను. ఈవిధముగా అనంతవ్రతమును క్రమము తప్పకుండా పదునాల్గు సంవత్సరములు ఆచరించిన పిమ్మట ఉద్యాపనము చేయవలెను. అప్పుడు పదునాలుగు కలశాలను పూజించి దానమీయవలెను. బ్రాహ్మణ సమారాధనమును ఆచరింపవలెను. ఈవిధముగా అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ అనంతవ్రతమును మరియు ఉద్యాపనమును ఎవరు ఆచరించెదరో, వారికి సమస్త అభీష్టములు శీఘ్రముగా సిద్ధించును" అని సుశీలకు ఆ స్త్రీలందరూ చెప్పి, అమ్మా! నీవు కూడా మాతోపాటుగా కలిసి ఈనాడే చతుర్దశి కావున, అనంతవ్రతమును ఆచరించుమని చెప్పి, ఆమెకు ఒక తోరమును కూడా ఇచ్చిరి. ఆమెచేత అనంతవ్రత పూజను చేయించిరి. అనంతరం ఆమె తనవెంట గోధుమపిండిలో సగము వాయనముగా ఇచ్చి, మధురవాక్కులతో వారందరి నుండి సెలవు గైకొని, వారందరికీ నమస్కరించి, తిరిగి తన భర్త అనుష్ఠానము చేసికొనుచోటునకు చేరెను. ఇంతలో అనుష్ఠానము పూర్తిచేసికొని వచ్చిన భర్తతోపాటుగా శకటమును అధిరోహించి ముందుకు సాగిరి. కొంతదూరము వెళ్ళగా వారికి అమరావతి వంటి ఒక గొప్ప నగరము ఎదురు వచ్చెను. ఆ నగరములోనికి ప్రవేశించగనే ఆ నగరవాసులందరూ వారికెదురుగా వచ్చి, వారికి స్వాగతమును పలికి, తపోనిధులైన మీరు మా నగరమునకు అధిపతులుగా ఉండవలసినదని ప్రార్థించిరి. ఆ దంపతులను మిగుల ఆదరభావముతో గొప్ప ఊరేగింపుతో పట్టణములోనికి ప్రవేశింపజేసి ఆ నగరమునకు ఆధిపత్యపదవిని కట్టబెట్టిరి. అనంతవ్రత మహిమవలన కౌండిన్యుడు, అతని భార్య అఖండ ఐశ్వర్యముతో తులతూగుచూ గొప్ప భోగభాగ్యములను అనుభవించుచుండిరి. (77-100)

ఈవిధముగా కొంతకాలము గడిచిపోయెను. ఒకనాడు కౌండిన్యుడు తన భార్యయైన సుశీలతో మిక్కిలి సంతోషముతో మాటలాడుచుండెను. అప్పుడు ఆమె చేతికి ఎఱ్ఱని దారమును కట్టియుండుటను గమనించెను. **వెంటనే తన భార్యను చూచి కౌండిన్యుడు ఇట్లు ప్రశ్నించెను** – "నీ చేతికి కట్టుకొన్నది ఏమిటి? ఈ ఎఱ్ఱని దారమును ఎందుకు ధరించితివి? నన్ను వశపరచుకొనుటకు రక్తతోరమును కట్టుకొంటివా, యేమి?"

అని ప్రశ్నించెను. అప్పుడు సుశీల తన భర్తతో "అయ్యో! స్వామీ! కాదు, కాదు. ఇది అనంతుని తోరము. మా తండ్రిగారి ఆశ్రమము నుండి మనము వచ్చుచున్నప్పుడు దారిలో నదీతీరమున ముత్తైదువ స్త్రీలందరూ వ్రతమును చేసుకొనుచుండిరి. అప్పుడు నేను కూడా వారితోపాటుగా ఈ అనంతవ్రతమును చేసితిని. అచటి ముత్తైదువ స్త్రీలే నా చేతికి ఈ అనంతుని తోరమును ధరింపచేసిరి. ఏ రోజున నేను ఈ వ్రతమును ఆచరించితినో, నాటినుండియే మనకు ఇంతటి మహద్భాగ్యము లభించినది. అనంతుని కృపవలన మనకు అష్టైశ్వర్యములు ప్రాప్తించినవి" అని పలికెను. ఆమె మాటలు విని కౌండిన్యుడు మిగుల కోపగించి, మండిపడుచూ, నీవు నన్ను వశపరచుకొనుటకే ఈ దారమును కట్టుకొంటివా అనుచూ, నన్ను మభ్యపెట్టుటకై అనంతుని మహిమ అని చెప్పుచుంటివి. కాదు, కాదు. నేనెంతయో తపస్సానర్చితిని. అట్టి తపో ప్రభావము వలన ఈ ఐశ్వర్యము ప్రాప్తించినది. కేవలము నన్ను వశీకరణము చేసికొనుటకే ఈ తోరము కట్టుకొని, అనంతుని తోరమని చెప్పుచుంటివి?" అని మిగుల కోపగించి కౌండిన్యుడు ఆమె చేతి తోరమును త్రెంపివేసి అగ్నిలో పడవేసెను. అనేకవిధముల ఆమెను తూలనాడెను. ఆ తోరము నిప్పులో పడుటను చూచి వెంటనే సుశీల తన మనసులో నొచ్చుకొనుచూ హాహాకారములొనర్చుచూ పరుగెత్తుకొని వెళ్ళి నిప్పులలోగల తోరమును తీసి, పాలలో తడిపి జాగ్రత్తపరచెను. కౌండిన్యుడు ఒనరించిన దుష్కృతమునకు ఫలముగా కొలదికాలమునకే అతని ఐశ్వర్యము నశించిపోయెను. అనంతుని దూషించిన కారణముగా కౌండిన్యుడు త్వరలోనే దరిద్రుడైపోయెను. నగరములోని వారందరూ శత్రుభావము వహించిరి. సమస్తమూ చోరులచే అపహరింపబడి దైన్యస్థితికి దిగజారెను. ఇల్లు దగ్ధమైపోయెను. కట్టుకొనుటకు రెండవ వస్త్రము కూడా మిగిలియుండలేదు. ఆకస్మికముగా ఇంతటి దైన్యస్థితికి దిగజారుటను చూచి కౌండిన్యుడు మిగుల దుఃఖాక్రాంతుడై తనలోతాను ఇట్లు తలపోయసాగెను. "నిజముగా అనంతుడు మాపై కోపగించెను. ధనమదాంధుడనై అనంతుని తోరమును అగ్నిలో పడవేసితిని. నాటినుండియే ఇంతటి దుస్థితి సంభవించెను. దురహంకారుడనై అనంతుని దూషించితిని. తద్వారా దైన్యస్థితికి దిగజారిపోయితిని. స్వామీ! ఇక నేనేమి చేయుదును" అని వగచి, వగచి ఆతడొక నిర్ణయమునకు వచ్చెను. అనంతపద్మనాభస్వామిని దర్శించు పర్యంతము అన్నపానీయములను వర్జించెదనని శపథమును పూనెను. (101-113)

వెంటనే తన భార్యతో సహా లక్ష్మీనాయకుడైన అనంతుని దర్శించుకొనుటకై బయలుదేరి, నడచి నడచి ఒక అరణ్యములోనికి చేరుకొనెను. బహు దుఃఖముతో 'అనంతా! అనంతా!' అంటూ పెద్దగా ఆక్రందించుచూ, ఆ అడవి మార్గమున పోవుచుండెను. అప్పుడు ఫలపుష్పభరితమైన

ఒక మామిడిచెట్టు అతనికి గోచరించెను. దానిని చూచి అతడు మిగుల ఆశ్చర్యమునకు లోనయ్యెను. ఆ వృక్షమునందు ఫలములు, పుష్పములు పుష్కలముగా ఉన్నప్పటికినీ ఒక్క పక్షియైనను, ఒక కీటకమైనను వాటిని ముట్టుకొనుటలేదు. అట్టి వృక్షమును చూచి 'వృక్షరాజమా! అనంతుడు నీకు తెలియునా?' అని కౌండిన్యుడు ప్రశ్నించెను. ఆ వృక్షము 'నాకు తెలియదు. నీవొకవేళ ఆయనను దర్శించినచో నాకు చెప్పగలవని' కోరెను. మరికొంతదూరము వెళ్ళగా అచట ఒక విచిత్రమైన దృశ్యము అగుపించెను. పచ్చని గడ్డి నిండుగా, సమృద్ధిగా ఉండెను. ఆ గడ్డిలో దూడతోపాటుగా ఒక గోవు కనిపించెను. ఆ గోవు తన వత్సముతోపాటు గడ్డిలో తిరుగుచుండెను. కానీ, ఒక గడ్డిపోచను కూడా అది తినకుండా, స్పృశించకుండా చూచుచుండెను. అప్పుడా కౌండిన్యుడు ఆ ఆవును చూచి "గోమాతా! నీవు అనంతుని చూచితివా! దయతో మాకు చెప్పుము" అని ప్రశ్నించెను. వెంటనే ఆ గోవు అతనితో, "నాయనా! నేను అనంతుని చూడలేదు. ఒకవేళ నీవాతనిని కలిసినచో నాకు కలిగిన దీనావస్థను చూచి ఆ మహాత్మునికి తెలియజెప్పుమని" కోరెను. అది విని బ్రాహ్మణుడు నిరాశతో మరింత ముందుకు వెళ్ళగా ఒక పెద్ద ఎద్దును చూచెను. 'నీవు అనంతుని చూచితివా?' అని అతడు ఆ ఎద్దును ప్రశ్నించెను. వెంటనే ఆ ఎద్దు అతనితో "నేను అనంతుడనగా ఎవరో ఎరుగను. నీవు ఒకవేళ చూచినచో నాకా విషయమును ఎరిగించవలసినదని" కోరెను. అచటినుండి మరికొంతదూరము పోవగా, అతనికి రెండు సరోవరములు కనబడెను. వాటిలోగల నీరు ఒకదానిలో నుండి మరియొకదానిలోనికి ప్రవహించుచుండెను. ఆ జలాశయములు తామరపుష్పములతో, చంద్రవికాసిని యగు కలువలతో నిండియుండెను. కానీ, పక్షిసంచారము ఏమాత్రము లేకుండెను. ఆ బ్రాహ్మణుడు వాటితో 'మీకు అనంతుడు తెలియునా?' అని అడుగగా అవి మాకు తెలియదని సమాధానము చెప్పెను. మరికొంత దూరము వెళ్ళగా అతనికి ఒక గాడిద, ఒక ఏనుగు, కనబడెను. వాటిని కూడా అనంతుని గూర్చి ప్రశ్నించెను. కానీ, అవి ఆ బ్రాహ్మణునితో మాటలాడలేదు. మరికొంతదూరము వెళ్ళగా నిరాశ చెంది ఆ బ్రాహ్మణుడు నేను ఎంత దూరము వెళ్ళిననూ, ఎవరిని ప్రశ్నించిననూ అనంతుని దర్శనము లభించుటలేదని మిగుల నిరాశ చెంది తన ప్రాణములను త్యజించుటకు ఉద్యుక్తుడాయెను. 'అనంతా! అనంతా!' అంటూ గట్టిగా అరచుచూ, దీనముగా దుఃఖించుచూ నేలమీద పడిపోయెను. (114-127)

ఇంతలో ఒక వృద్ధ బ్రాహ్మణ వేషధారి అతనిని సమీపించి 'లే! నాయనా! లే' అని అతనిని తట్టిలేపెను. ఒక అద్భుతమైన కరస్పర్శను పొంది ఆ బ్రాహ్మణుడు వెంటనే కళ్ళు తెరచి, "స్వామీ! శ్రీమదనంతుడు ఎక్కడున్నాడో తమరికి తెలియునా?" అని అడిగెను. వచ్చిన ఆ వృద్ధ

బ్రాహ్మణుడు ఇట్లు నుడివెను – “నాయనా! అనంతుడు ఎక్కడున్నాడని మిగుల పరితాపముతో అడుగుచుంటివి. నాతో రమ్ము. ఆ అనంతుని నేను నీకు చూపించెదను” అని కౌండిన్యుని కుడిచేతిని పట్టుకొని లేపి, తన వెంట తీసికొని వెళ్ళసాగెను. ఆ అరణ్యము గుండా కొంతదూరము వెళ్ళుసరికి ఒక అద్భుతమైన నగరము గోచరించినది. అది మహదైశ్వర్యముతో తేజరిల్లుచుండెను. ఆ నగరములోనికి వెళ్ళి ఒక అద్భుతమైన భవనమును సమీపించెను. ఆ భవనములోనికి వెళ్ళిన పిమ్మట అచట ఒక నవరత్నఖచితమైన సింహాసనము ఉండెను. దానిపై తాను కూర్చొని తన నిజస్వరూపమును దర్శింపచేసెను. అద్భుతమైన స్వామియొక్క నిజస్వరూపమును దర్శించి కౌండిన్యుడు అత్యంత ఆనందభరితుడై ఉద్వేగముతో స్వామికి సాష్టాంగవందనమొనర్చి, **ఆ అనంతుని ఈవిధముగా స్తుతింపసాగెను.** “గోవిందా! గోవిందా! నమో నమస్తే! నమో నమస్తే!! శ్రీవత్స లాంఛనా! కృపాళూ! సచ్చిదానందా! నీకు నమస్కారము. నీ స్మరణమాత్రముచేత సమస్త పాపములు నశించిపోయి, దుఃఖము, మదము వంటి సమస్త దోషములు హరించిపోవుట నిశ్చయము. నీవు వరప్రదుడవు. యజ్ఞపురుషుడవు. శ్రేష్ఠుడవు. వైకుంఠవాసా! నీకు నమస్కారములు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపమైన నీ దర్శనమాత్రము చేతనే సమస్త దోషములు హరించిపోవును. వైకుంఠవాసా! నారాయణా! లక్ష్మీనాయకా! వందనములు. ఈ జగత్తునందు సర్వత్రా వ్యాపించి రక్షించువాడవు నీవే కదా! అనంతకోటి బ్రహ్మాండనాయకా! నేను మహాపాపిని. పాపసంభవుడను. స్వామీ! నన్ను క్షమించి రక్షించుము. మిమ్ము తప్ప నేను మరొక దైవమును ఎరుగనైతిని. అందుకే మీ చరణములను ఆశ్రయించితిని. నేను మీ శరణాగతుడను. ఈ నాటికి నా జన్మము ధన్యమైనది. మీ దివ్య శ్రీ చరణసరోజములను దర్శించితిని. నేను కృతకృత్యుడనైతిని. మీ పాదపద్మములయందు నేనొక భ్రమరమునై నిరంతరము నివసించెదనుగాక!” అని అనేకవిధములుగా కౌండిన్యుడు ఆ అనంతస్వామిని ప్రార్థించెను. (128–138)

ధర్మరాజా! కౌండిన్య మహర్షి స్తుతిని విని భక్తజనచింతామణియైన అనంతుడు అత్యంత ప్రసన్నుడై, అతనికి మూడు వరములను ప్రసాదించెను. ధర్మప్రాప్తి, దారిద్ర్య నాశనము, శాశ్వత వైకుంఠ నివాసము అను త్రివిధ వరములను అనంతపద్మనాభుడు ప్రసాదించెను. వెంటనే కౌండిన్యుడు చేతులు జోడించి, **అనంతుని జూచి పలికెను**– “స్వామీ! మహానుభావా! మేము మీకై వెదకుచుండగా, నేనొక ఆశ్చర్యకరములగు దృశ్యములను గాంచితిని. ఒక మామిడివృక్షము విరగకాసినది. కానీ, ఆ చెట్టునందలి పండ్లను ఒక్క పక్షిగాని, ఏ జీవిగాని ముట్టుకొనుటలేదు. మరికొంత ముందుకు వెళ్ళిన మీదట ఒక గోవు తన వత్సముతో అపరిమితమైన పచ్చని గడ్డిలో ఉన్నప్పటికినీ ఆ గడ్డిని చూచుచుండెనే కాని, తినలేకపోవుచుండెను. అనంతరం ఒక ఎద్దును, రెండు సరోవరములను, ఒక గార్దభమును, ఒక కుంజరమును అనగా

ఏనుగును కూడా చూచితిని. అటుపిమ్మట మరికొంతదూరము వెళ్ళగా ఒక వృద్ధబ్రాహ్మణుని గాంచితిని. వారలెవరునూ మీ విషయము మాకు తెలియదని చెప్పి, అనంతరం ఒక వృద్ధబ్రాహ్మణుడు వచ్చి నా కనులకు కనబడి ఆ మహాత్ముడు నన్నిచటకు తెచ్చెను. వీటిలోని అంతరార్థము నాకెంతమాత్రము బోధపడలేదు. కృపానిధీ! జగన్నాథా! కేశవా! నాకు దారిలో గోచరించిన వారలెవరో? వారలట్లు ఎందుకుండిరో? వివరించి చెప్పవలసినదని ప్రార్థించెను. **అంతట కృపానిధియగు అనంతపద్మనాభస్వామివారు ఆ బ్రాహ్మణునితో ఇట్లు చెప్పెను-** (139-148)

"కౌండిన్యా! వినుము. నీవు చూసిన వృక్షము ఎవరనగా? పూర్వము ఒక బ్రాహ్మణుడు వేదశాస్త్రపారంగతుడై తద్వారా అతడు మహాగర్విష్ఠియై తాను నేర్చిన విద్యను ఎవరికీ బోధించకుండెను. విద్యాదానము చేయనందువలన అతడు మామిడి చెట్టు అయి అడవిలో పుట్టెను. పూర్వపాపఫలితముగా ఆ వృక్షము ఫలభరితమై ఉన్నప్పటికినీ వాటిని ఎవ్వరునూ స్పృశింపరైరి. మీరు చూచిన ఆవు, దూడ ఎవరనగా పూర్వము ఒకడు బీడు పడిన భూమి అనగా ఫలించని భూమిని బ్రాహ్మణునకు దానమిచ్చెను. అట్టి దుష్కృతముతో వాడే ఇప్పుడు ధేనువై జన్మించి, గడ్డిని తినలేక దానిని చూచుచూ ఉపవసింపవలసి వచ్చెను. మరొకడు ధనికుడై ఉండియూ, దానాదికములను చేయకపోవుటచే అట్టి పాపఫలితముగా అతడు ఎద్దుగా పుట్టి, మిగుల కష్టపడుచుండెను. ఇక రెండు సరోవరములను చూచితివి కదా! పూర్వజన్మలో వారిరువురూ అక్కాచెల్లెళ్ళు. వారు ఒకరితో ఒకరు పరస్పరముగా దానములను, వాయనములను ఇచ్చిపుచ్చుకొనెడివారు. కాని, ఇతరులెవరికి ఇచ్చెడువారు కాదు. తత్ఫలితముగా వారు సరోవరములై జన్మించిరి. ఇక క్రోధమే గాడిదయై జన్మించెను. నీ మదాంధకారమే ఆ ఏనుగు. ఇప్పుడు నీ మనసు పరిశుద్ధమై నిర్మలమాయెను. నిన్ను కలిసిన ఆ వృద్ధ బ్రాహ్మణుడను నేనే. నాయనా! నీవు దర్శించినవాటికన్నింటికినీ ముక్తి లభించినది. ఇహలోకమున సమస్త భోగభాగ్యములను అనుభవించి చివరకు నీవు సద్గతిని పొందగలవు. అంతేకాదు, నక్షత్రములలో పునర్వసు నక్షత్రమై శాశ్వతముగా నిలచిపోగలవని" అనంతుడు కౌండిన్యునకు మిగుల కృపతో వరమును ప్రసాదించెను. "ధర్మరాజా! అనంతరము ఆ కౌండిన్యుడు భార్యతోపాటుగా తిరిగి తమ నగరమునకు చేరుకొనెను. దానికి అధిపతిగా నుండి చాలాకాలము ఆ నగరమును చక్కగా పరిపాలించెను. అంత్యకాలమున నేరుగా స్వర్గలోకమును చేరెను" అని **కృష్ణపరమాత్ముడు ధర్మరాజుతో** చెప్పెను. (148-156)

అనంతరము హృషీకేశుడు ఉపదేశించిన విధముగా పాండవులందరూ కలిసి భక్తిశ్రద్ధలతో అనంతవ్రతమును ఆచరించి, అచిరకాలముననే తిరిగి తమ రాజ్యమును తాము సంపాదించుకొనగలిగిరని సాయందేవునకు **శ్రీగురునాథుడు చెప్పి ఇట్లు పలికెను.** "సాయందేవా! ఈ లోకమునందు అనేకమంది ఋషీశ్వరులు, స్త్రీపురుషులు ఈ వ్రతమును ఆచరించుచుండిరి. తద్వారా చతుర్విధ పురుషార్థములను

సంపాదించుచుండిరి. వ్రతములలో ఉత్తమమైన వ్రతము ఈ అనంతవ్రతము. నీవు కూడా కౌండిన్య గోత్రమునకు చెందినవాడవే కాన, ఈ వ్రతము మీ గోత్రమునందే ఏర్పడినందున నీవు తప్పక ఆచరింపవలసినది. ఈ అనంతవ్రతమును నీవు ఆచరించి నీ జ్యేష్ఠకుమారుని చేతికి తోరమును ధరింపజేయుము" అని గురుమూర్తి ఆదేశించెను. అందుకు మిగుల సంతసించిన సాయందేవుడు శ్రీగురువాజ్ఞను అనుసరించి అనంతవ్రతమును భక్తిశ్రద్ధలతో ఆచరించెను. అనంతరము శ్రీగురునాథుని అనేకవిధములుగా పూజించెను. గీత, నృత్య, వాద్యాదులతో నీరాజనమునిచ్చి సాయందేవుడు శ్రీగురుని అత్యంత భక్తిభావముతో ఆరాధించెను. బ్రాహ్మణసమారాధనమును చేసి శ్రీగురునాథునకు భిక్షను సమర్పించి మిగుల ఆనందించెను. అందులకు శ్రీగురుమూర్తి అత్యంత ప్రసన్నుడై సాయందేవుని అనుగ్రహించెను. ఈవిధముగా గురుని ఆరాధించి సాయందేవుడు తన కుటుంబముతో సహా స్వగ్రామమునకు వెళ్ళి తన భార్యాబిడ్డలను తమ గ్రామమునకు చేర్చెను. తిరిగి గాణగాపురమునకు వచ్చి, శ్రీగురునాథుని వద్దనే నివసించి, వారిని నిశ్చలభక్తితో సేవించుచుండెను.

"నామధారకా! మీ పూర్వపురుషుడైన సాయందేవుడు ఏవిధముగా గొప్పనైన గురుభక్తిని ప్రదర్శించెనో, అటులే గురునాథునివలన ఎటుల కృతార్థుడయ్యెనో అట్టి విధమును నీకు వివరించి చెప్పితిని. ఈవిధముగనే అనేకమంది జనులు గురుమూర్తిని ఆరాధించి కృతార్థులైరి. గురుమూర్తియగు నృసింహసరస్వతి స్వామివారిని నిశ్చలభక్తితో ఎవరు ఆరాధించెదరో, వారు తప్పక చతుర్విధ పురుషార్థములను సునాయాసముగనే పొందగలరు. శ్రీనృసింహ సరస్వతీ స్వామివారు అనగా ఒక అచ్చమైన గురువను మహానిధి వంటివారని గ్రహించుమని సిద్ధముని నామధారకునితో చెప్పిన సంవాదమును, సరస్వతీ గంగాధరుడు గురుచరిత్రగా లోకమునకు విస్తరించి ప్రకటించెను.(157-170)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "శ్రీమదనంతవ్రత మహిమాను వర్ణనము" అను నలుబది రెండవ అధ్యాయము ॥ 42 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 170; మొత్తము సంఖ్య : 6181 + 170 = 6351 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

నలుబది మూడవ అధ్యాయము

గాణగాపురమునందలి ఒక సాలెవాడు శ్రీగురునాథుని సేవించుట - అతని బంధువులందరు శ్రీశైలయాత్రకు వెళ్ళుట - సాలెవాని అచ్చమైన భక్తికి మెచ్చిన గురుమూర్తి తృటికాలములో అతనికి శ్రీశైలక్షేత్రమును దర్శింపజేయుట - అతడు శ్రీశైల మల్లికార్జునస్వామి యందు తన గురువును దర్శించి పూజించుట - సాలెభక్తుని గురుభక్తికి మెచ్చుకొని శ్రీగురుదేవులు అతనికి శివరాత్రి, శివపూజా మరియు శ్రీశైలక్షేత్రము యొక్క మాహాత్మ్యమును వివరించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునికి నమస్కరించి గురుచరిత్రమునందు అనంతరము జరిగిన కథను వివరించి చెప్పవలసినదని ప్రార్థించెను- అందుకు సిద్ధమునీశ్వరుడు ప్రసన్నవదనముతో- "వత్సా! నామధారకా వినుము. శ్రీ గురునాథుడు గాణగాపురములో నివసించు సమయమున అనేకమంది భక్తజనులు మఠమునకు వచ్చి అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీవారిని సేవించుచుండిరి. అదే గ్రామమునకు చెందిన ఒక తంతువాయి అనగా సాలెవాడు నిత్యము శ్రీస్వామివారి వద్దకు వచ్చి కడు భక్తిభావముతో నిత్యమూ సేవించుచుండెడివాడు. ప్రతిదినము మూడు జాముల కాలము తన సాంసారిక కృత్యములను నెరవేర్చుకొనిన పిమ్మట శ్రీవారి మఠమునకు వచ్చి గురుమూర్తి నివసించుచున్న మఠమును, దానికెదురుగా వున్న ప్రాంగణమును చక్కగా ఊడ్చి, శుభ్రపరచి, వారికి దూరమునుండియే నమస్కరించి వెళ్లుచుండెడివాడు. ఈవిధముగా ఎన్నియో దినములు గడచిపోయినవి. (1-4)

ఒక సమయమున శివరాత్రి సమీపించుచున్నందున అతని తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు కలిసి శ్రీశైలయాత్రకు ప్రయాణమై అతనిని కూడా తమతోపాటుగా యాత్రకు రావలసినదని కోరినారు. కాని, **ఆ సాలెవాడు వారితో ఇట్లు పలికెను** - "మీరు మూఢులు. పిచ్చివారలు. శ్రీశైలపర్వతము ఎక్కడో లేదు. నాకు ఇక్కడనే ఉన్నది. శ్రీగురుదేవుడే నా మల్లికార్జునుడు. శ్రీగురుడు నివసించు మఠమే నాకు శ్రీశైలపర్వతము. శ్రీగురుమూర్తి దివ్యచరణారవిందములను వదలిపెట్టి నేను అంతదూరము రాజాలను" అని చెప్పెను. అందరునూ అతని

వింత ధోరణిని చూసి నవ్వుకొనిరి. 'ఇతనికి బాగుగా పిచ్చి ఎక్కినట్లున్నది. మనమే పోవుదము పదండి' అని ఆతని తలిదండ్రులు, సోదరులు, బంధువులు, మిత్రులు అందరూ కలిసి శ్రీశైలయాత్రకు బయలుదేరిరి. సుమారుగా ఆ గ్రామస్థులందరునూ శ్రీశైలయాత్రకు వెళ్ళిపోయిరి. అచట మిగిలినది ఈ సాలెవాడు ఒక్కడు మాత్రమే. మరునాడు ఈ సాలెవాడు నిశ్చలమైన భక్తితో శ్రీగురుమూర్తిని సేవించుచుండెను. **అంతట శ్రీగురునాథుడు అతనిని చూచి ప్రశ్నించెను** – "నాయనా! నీవు యాత్రకువెళ్ళలేదా! మీ వారందరునూ శ్రీశైలయాత్రకు వెళ్ళినారు కదా! నీవెందులకు వెళ్ళలేదు?" **అందుకు ఆ సాలెవాడు గురుమూర్తితో ఇట్లు పలికెను** – "స్వామీ! మీ పాదములయందే సమస్త తీర్థములు కలవు. నాకు ఇతర తీర్థములతో పనిలేదు. శ్రీవారి చరణకమలముల యొక్క మహిమను గ్రహింపక శ్రీశైలములో ఏదియో విశేషము గలదని భావించి, మూర్ఖజనులందరూ వెళ్ళుచుండిరి. వారితో నాకేమి పని, ప్రభూ!" అని పలికి ఆ సాలెవాడు శ్రీవారికి నమస్కరించెను. (4-11)

అనంతరము మాఘమాసము, కృష్ణపక్షము, చతుర్దశి తిథి సమీపించి ఆనాడు శివరాత్రి పర్వదివసము సంప్రాప్తమయ్యెను. శ్రీగురుమూర్తి సంగమమునకు వెళ్ళెను. శివరాత్రి నియమముతో ఉపవసించుటవలన మాధ్యాహ్నిక సమయమున ఆ సాలెభక్తుడు కూడా స్నానమునకై సంగమమునకు వెళ్ళెను. సంగమమునందు స్నానము చేసి, శుచివస్త్రములను ధరించి శ్రీగురునాథుని సమీపించి, అనన్యమైన భక్తిభావముతో చేతులు జోడించి, నమస్కరించెను. ఆ సాలెభక్తుని చూసి చిరునవ్వును చిందించిన **శ్రీగురుమూర్తి అతనితో ఇట్లనెను** – "నాయనా! మీవారందరూ యాత్రకు వెళ్ళిరి. నీవొక్కడివే ఒంటరిగా మిగిలిపోయితివి. లేనిచో, ఈపాటికి నీవు కూడా శ్రీశైలపర్వతమును చేరుకొని అచటి చమత్కారమును దర్శించుచుండెడివాడవు కదా! దానిని నీవెప్పుడైనా చూచితివా" అని ప్రశ్నించెను. **అందుకు అతడిట్లనెను**– "స్వామీ! లేదు. లేదు. నేనెప్పుడూ వెళ్ళలేదు. దానిని దర్శించనూ లేదు. నాకు మీ చరణములవద్దనే సమస్తయాత్రలు కలవను నిశ్చయముతో ఉన్నాను" అని పలికెను. అతని నిశ్చలభక్తిభావమునకు మిగుల సంతసించి, దయామయుడైన శ్రీగురుమూర్తి అతనికి కూడా శ్రీశైలమల్లికార్జున స్వామివారి దర్శనభాగ్యమును ఘటింపజేయదలచిరి. **అత్యంత వాత్సల్యముతో అతనిని తన దగ్గరకు పిలిచి ఇట్లు పలికెను** – "నాయనా! నా సమీపమున కూర్చొనుము. నీవు గట్టిగా కళ్ళు మూసికొనుము. నా పాదుకలను దృఢముగా పట్టుకొమ్ము. నిన్ను తృటికాలములో శ్రీశైలమునకు తీసికొనివెళ్ళెదను" అని నుడివెను. అంతట అతడును గురుమూర్తి చెప్పిన విధముగా ఆచరించెను. క్షణముకూడా గడువకుండగనే తన యోగమహిమతో శ్రీగురుమూర్తి తన భక్తుని శ్రీశైలమునందలి పాతాళగంగకు చేర్చి, 'నాయనా! కళ్ళు తెరువుము' అనెను. ఒక క్షణకాలముపాటు నిద్రావస్థ

ఆవహించిన అతడు కళ్ళు తెరువుము అని స్వామివారు అనినంతనే అతడు జాగ్రదావస్థకు చేరుకొని కళ్ళు తెరిచి చూచుసరికి పర్వతము, పాతాళగంగ అతని కంటిముందర కనిపించెను. ఇది కలయా? నిజమా? అని ఆశ్చర్యమునకు లోనయ్యెను. **తదుపరి కృపామయుడగు గురునాథుడు నుడివెను–** "ఎందుకు అట్లు భ్రమతో చూచుచుంటివి. మనము శ్రీశైలమునకు చేరుకొంటిమి. నీవు వెంటనే వెళ్ళి క్షవరము చేయించుకొని, స్నానమొనర్చి, శ్రీమల్లికార్జున స్వామిని పూజించి రమ్మని" చెప్పిరి. శ్రీగురునాథుని ఆజ్ఞానుసారముగా వెంటనే అతడు వెళ్ళెను. అచట తన తలిదండ్రులు, సోదరులు, గ్రామవాసులను అందరినీ చూచెను. వారందరూ అతనిని చూచి, ఆశ్చర్యముతో నీవు మాతో ఎందుకు రాకపోయితివి? ఒంటరిగా ఇంత త్వరితముగా ఎట్లు రాగలిగితివి" అని ప్రశ్నించిరి. అందుకు ఆతడు వారిని చూచి "నేటి మధ్యాహ్నమే బయలుదేరి ఒక గడియ కాలములో మేము ఇచటికి చేరుకొంటిమి. కృపామూర్తియగు గురునాథుడు నన్ను ఇచటికి తీసుకొని వచ్చెను" అని చెప్పెను. కానీ, వారు అతని మాటలను విశ్వసింపలేకపోయిరి. వారెవరితోనూ అతడు అనవసరమైన వాదవివాదములు సలుపకుండా నేరుగా వెళ్ళి, క్షవరము చేయించుకొని, చక్కగా స్నానము చేసి, పుష్పాక్షతలను, బిల్వపత్రములను పూజకోసమై తీసుకొని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయమునందు ప్రవేశించెను. అచట అందరునూ తన గురుమూర్తిని అర్చించుచున్నట్లుగా అతనికి గోచరించుచుండెను. మల్లికార్జునుని స్థానమున శ్రీగురుమూర్తియే అతనికి సాక్షాత్కరించెను. అత్యంత విస్మయావహుడై మనస్ఫూర్తిగా తన గురురూపమున గల మల్లికార్జున స్వామిని ఆరాధించెను. లోకులందరూ పూజించుచున్నప్పుడు శ్రీగురునాథుడే ఆ పూజలను స్వీకరించుటను గమనించి ఆ సాలెవాడు తన మనసులో **'మా గురుదేవుడే శ్రీశంకరుడు. శ్రీశంకరుడే మా గురుదేవుడు'** అని నిశ్చయమును చేసికొని కావలసిన ప్రసాదమును తీసుకొని తిరిగి శ్రీగురునాథుని వద్దకు చేరుకొనెను. అంతట గురుమూర్తికి ఆ సాలె భక్తుడు నమస్కరించెను. **గురుమూర్తి అతనితో,** "నాయనా! నీవు ఎక్కడకు వెళ్ళితివి. ఏమి చూచితివి. ఇక మనము వెళ్ళుదమా? లేక ఉండెదమా?" అని అడిగెను. **అందుకు అతడిట్లు బదులు చెప్పెను–** "మహాత్మా! అచట నేనొక విచిత్రమును దర్శించితిని. ఏమి ఆశ్చర్యము. ఏమి అద్భుతము. నేను మల్లికార్జునుని పూజించవలెనని ఆలయమునందు ప్రవేశించిన వెంటనే అచట మీ రూపమునే దర్శించితిని. లోకులందరూ మిమ్ములనే పూజించుచుండిరి. ఆ మల్లికార్జునుడు నా కనులకు కనబడనేలేదు. అచట మీరే ఉంటిరి. మీరు మా సమక్షములో ఉన్నప్పటికినీ మీ మహిమను గ్రహింపజాలక మిమ్ములను మనుష్యమాత్రునిగా భావించి వ్యర్థముగా ఇంతదూరము వచ్చుచుంటిమి. లోకులందరూ వృథగా కష్టపడుచుండిరి. మీలో లేని మహిమ ఈ క్షేత్రమునందు ఏమి

గలదు స్వామీ! సర్వమూ మీ చరణములయందే కలదు. మాకు మానవమాత్రులుగా కనిపించుచున్నప్పటికినీ మీరు సాక్షాత్తూ పరమేశ్వరులే సుమా! అనంతమైన మీ మహిమను మేమెంతమాత్రమూ తెలియజాలమైతిమి. గురుదేవా! అది అత్యంత గోప్యము. ఈ జనులందరునూ మూఢులై మీ మహిమను గ్రహింపక ఇంతదూరము ప్రయాణించి, ఈ క్షేత్రమునకు ఎందుకు వచ్చుచుండిరో, నాకు బోధపడుటలేదు. ఇట్టి విచిత్రమును గురించి స్వామీ! దయతో మీరే వివరించి చెప్పగలరు" అని ప్రార్థించెను. అందుకు గురుమూర్తి అతనియెడల కడు ప్రసన్నుడై ఇట్లు వచించెను– **"భక్తుడా! వినుము. ఈశ్వరుడు సర్వత్రా పరిపూర్ణముగా వ్యాపించి యుండును. కానీ, స్థానమహిమను బట్టి విశేషముండును. శ్రీశైల పర్వతమునందు మల్లికార్జునస్వామి రూపమున ఆ పరమేశ్వరుడు నిత్య సన్నిహితుడై యున్నందున ఈ క్షేత్రము యొక్క మహిమ అపారమైనది"** అని చెప్పెను. **అందుకు ఆశ్చర్యముతో ఆ సాలెభక్తుడు స్వామితో ఇట్లు విన్నవించెను.** "గురునాథా! మీరు పూర్ణబ్రహ్మలై యుండి, స్థానమహిమను వర్ణించుచుంటిరి. దయతో ఈ క్షేత్రము యొక్క మహిమను వివరించి చెప్పవలసినదని" ప్రార్థించెను. అందుకు గురునాథుడు మిగుల సంతసించి ఆ సాలెభక్తునితో శ్రీశైల క్షేత్రమాహాత్మ్యమును గూర్చి **ఈవిధముగా చెప్పుచుండెను–** "శ్రీశైల క్షేత్రము యొక్క మాహాత్మ్యము స్కందపురాణమునందు విపులముగా పేర్కొనబడియున్నది. దానినే ఇప్పుడు నీకు చెప్పుచుంటిని శ్రద్ధగా వినుము. మాఘమాసము, కృష్ణపక్షము, చతుర్దశి తిథినాడు మహాశివరాత్రి పర్వదినము సంఘటించును. అది మహాపర్వదివసమగుటవలన ఆనాడు శ్రీశైలమల్లికార్జునుని మహిమ అపారముగా ఉండును. అందుకు సంబంధించిన పూర్వము జరిగిన ఒక కథను నీకు చెప్పుచున్నాను. సావధానముగా వినుము.(11–37)

పూర్వము కిరాతదేశమున 'విమర్శనుడు' అను రాజు ఉండెను. అతడు మహాపరాక్రమవంతుడు. శూరాగ్రేసరుడు. సమస్త శత్రురాజులను జయించి సామ్రాజ్యమును పరిపాలించుచుండెను. కానీ, అతనిలో ఒక దుష్టబుద్ధి ఉండియుండెను. అడవులలో తిరిగి అపరిమితముగా వేటాడుచుండెడివాడు. బలాఢ్యుడై ఉన్నప్పటికినీ అతడు చంచలమనస్కుడై, స్త్రీలోలుడై, నిరంతరము పరస్త్రీ సాంగత్యమును చేయుచూ, మాంసభక్షణము చేయుచుండెడివాడు. ఇంతటి దురాచారపరుడైనప్పటికినీ, ఆ రాజు అపరిమితమైన భక్తిభావముతో ప్రతినిత్యమూ శివారాధనమొనర్చుచుండెను. ఇక, మహాశివరాత్రి పర్వదివసమున అత్యంత ఆనందోత్సాహములతో గీత, నృత్య, వాద్యాదులతో సభక్తికముగా శివునకు గొప్ప పూజామహోత్సవమును నిర్వహించుచుండెడివాడు. అట్టి విమర్శనుడు అను రాజునకు సులక్షణరాలైన భార్య యుండెను. ఆమె పేరు 'కుముద్వతి'. గొప్ప సౌశీల్యవతి. గుణవంతురాలు. పతివ్రత. గొప్ప ఈశ్వరభక్తిని ఆచరించుచున్నప్పటికినీ తన భర్త నిత్యమూ

వ్యభిచరించుటను చూచి ఆమె తన మనసులో ఎంతగానో దుఃఖించుచుండెడిది. ఇట్లుండగ ఒకనాడు ప్రసన్నవదనముతో ఉండుటను గమనించెను. **వెంటనే తన భర్తను సమీపించి ఇట్లు ప్రశ్నించెను–** "ప్రాణేశ్వరా! నాదొక విన్నపము. నేను తెలియక ప్రశ్నించుచుంటిని. నా మాటలను ముందుగనే దయాభావముతో మీరు క్షమించవలయును. మీరు నిరంతరము మాంసభక్షణము చేయుచూ, పరస్త్రీ వ్యభిచారమును చేయుచూ, నిరంతరము దురాచారముతో ప్రవర్తించుచుంటిరి. కానీ, ఇట్టి మీరే అనన్యమైన భక్తిశ్రద్ధలతో పరమశివుని ఆరాధించుచుంటిరి. ఈ వింతప్రవృత్తిని చూసి నేను విస్మయమునకు లోనగుచుంటిని. స్వామీ! మీరు అన్యథా భావించక ఇందులకు కారణము తెలుసుకొనవలెనను జిజ్ఞాసతో మిమ్ములను ప్రార్థించుచున్నదానను. ఎంతమాత్రము నాపై కోపగించకుండా మీకు సమ్మతమైన యెడల అందలి రహస్యమును నాకు తెలియజెప్పగలరని" ప్రార్థించినది. **అంతట కిరాతుడు, వ్యభిచారి అయిన విమర్శనుడను ఆ రాజు తన భార్యతో ఇట్లు పలికెను–** "ప్రేయసీ! చాలా చక్కని ప్రశ్న చేసితివి. నా పూర్వజన్మ వృత్తాంతమును నీకు వివరించి చెప్పుచున్నాను. సావధానముగా వినుము. నేను పూర్వజన్మములో పంపా అను నగరమున శ్వానయోనియందు జన్మించితిని. కుక్కగా జన్మించి ఆ గ్రామములోనే తిరుగుచుంటిని. ఒకనాడు శివరాత్రి పర్వకాలము వచ్చినది. ఆ నగరమున ఒక శివాలయముండెను. ఆ నగరములోని భక్తజనులందరూ అచటికి వచ్చి శివుని పూజించుచుండెడివారు. నేను కూడా ఆనాడు తిరుగుతూ తిరుగుతూ తినుటకు ఏమైనా లభించునేమోయను ఆశతో అచటికి వెళ్ళితిని. భక్తులు అత్యుత్సాహముతో పూజలు సలుపుచుండిరి. రకరకముల వాయిద్యములు మ్రోగుచుండెను. హారతులను పట్టుకొని అందరూ ఆలయమునకు ప్రదక్షిణములు చేయుచుండిరి. నేను కూడా కౌతుకముతో అది చూడవలెనని, ఏదేని ఆహారము దొరకునని లోనికి ప్రవేశించితిని. అటూ ఇటూ తిరుగుచూ గర్భగుడిలో ప్రదక్షిణము ఒనర్చితిని. కానీ, నన్ను చూసిన జనులు కర్రలు, రాళ్ళు, తీసికొని ద్వారమును బంధించి, పరుగెత్తుకొని వచ్చి నన్ను చితకబాదిరి. నేను పారిపోవుటకు ప్రయత్నించగా 'పట్టుకొనుడు, పట్టుకొనుడు' అని గట్టిగా అరచుచూ, కర్రలతో, రాళ్ళతో కొట్టిరి. ప్రాణరక్షణకై బయటకు వెళ్ళుటకు త్రోవ లభింపక చుట్టూరా తిరుగుటవలన మూడు ప్రదక్షిణములు చేయుట తటస్థించెను. దీపముల వెలుగులో శివపూజను దర్శించే అవకాశము లభించెను. ఇంతలో జనులందరూ కలిసి తీవ్రముగా కొట్టుటవలన నేను నా ప్రాణములను కోల్పోయితిని. అనంతరము ఆలయము బయట నా శరీరమును పారవేసిరి. ప్రాణేశ్వరీ! ఆవిధముగా నాకు కళ్ళారా శివపూజను చూసే భాగ్యము కలిగి, ప్రదక్షిణము చేసిన పుణ్యము లభించెను. తత్ఫలితముగా రాజునై జన్మించితిని. ఆ రోజు శివరాత్రి అగుటవలన తినుటకు

ప్రయత్నించిననూ పదార్థమేమీ లభింపక ఉపవాసముతో ప్రాణములను వదలివేసితిని. తద్వారా, నాకు అధికమైన పుణ్యరాశి లభించెను. అంతేగాక, శివాలయమునందు వెలిగించిన దీపమాలికలలో ప్రకాశిస్తున్న శివ స్వరూపమును, నా కళ్ళారా దర్శిస్తూ నేను శివద్వారమునందే ప్రాణములను వదలివేసితిని. అందుచే అంతులేని పుణ్యరాశి లభించి నాకు అపూర్వమైన జ్ఞానము లభించెను. ఇది శివరాత్రియొక్క గొప్పతనమని తెలిసికొంటిని. ఇక నీవు, నన్ను దురాచారుడనంటివి కదా! అందుకు సమాధానమును వివరించెదను. పూర్వజన్మలో నేను శ్వానయోనియందు జన్మించితినంటిని గదా! సర్వభక్షణము దాని స్వభావము కనుక, అన్నిటిమీదా కోరిక యుండే స్వభావము కలిగియుండిన నాకు సమస్తమునూ నేను భక్షించుచుంటిని. ఇక ఒక కుక్కనై పూర్వజన్మలో నీచకృత్యములకు పాల్పడితిని కావున, ఆ వాసనను అనుసరించి ఈ జన్మలో దురాచారపరుడనై యుంటిని" అని తన భార్యతో చెప్పెను. **అందులకు ఆమె ఇట్లనెను** – "స్వామీ! మీరు సర్వజ్ఞులుగా గోచరించుచుంటిరి. మన జన్మలు పురాతనమని చెప్పితిరి. కావున, నా పూర్వజన్మవృత్తాంతమును కూడా దయతో చెప్పవలసినదని" ప్రార్థించెను. (38–65)

అంతట ఆ రాజు తన భార్యతో ఇట్లు చెప్పసాగెను – "ఓ సతీ! వినుము. నీవు పూర్వజన్మమునందు ఒక కపోతపక్షివై జన్మించితివి. కడుపు నింపుకొనుటకై ఒకనాడు నీకొక మాంసఖండము లభించెను. దానిని నీ ముక్కుతో కరచుకొని నీవు ఆకాశములో ఎగురుచుంటివి. దానిని గమనించిన ఒక డేగ నిన్ను వెంబడించెను. ప్రాణరక్షణకొరకు కీకారణ్యమున ప్రవేశించి తిరుగుచుంటివి. కానీ, ఆ డేగ నిన్ను విడువకుండా వెంటాడుచూ నీ వెనకాలనే పరుగెత్తుకొని వచ్చుచుండెను. అప్పుడు వెనుకముందులు ఆలోచించకుండా నీవు తిరిగి తిరిగి శ్రీశైలపర్వతముమీదుగా వెళ్ళితివి. ఆ డేగ తరుముతూ నీకు అతి సమీపముగా వచ్చుటచే నీవు శివాలయముయొక్క శిఖరముమీదుగా ప్రదక్షిణముగా పరిభ్రమించితివి. శ్రమచే తిరుగుటకు శక్తిలేక ఆలయశిఖరము మీదికి నీవు చేరుకొనుటను చూచి ఆ డేగ విసురుగా వచ్చి తన ముక్కుతో నిన్ను పొడిచి చంపి, తనకు చిక్కిన ఒక మాంసఖండమును ఎత్తుకొని వెళ్ళిపోయెను. అదృష్టవశాత్తుగా శివరాత్రిరోజున శిఖరప్రదక్షిణముతో మరణించినందున అంతులేని పుణ్యరాశి లభించి ఈ జన్మలో నీవు రాజపత్నివై జన్మించితివి" అని అతడు చెప్పెను. "ప్రాణనాథా! ఇప్పుడు మీరు సెలవిచ్చినట్లుగా నేను తప్పక ఈశ్వరపూజ చేసెదను. కానీ, రాజేంద్రా! నా పూర్వజన్మ వృత్తాంతమును చక్కగా వివరించితిరి. ఇకముందు రాబోవు జన్మలో మీ గురించిన, నా గురించిన భవిష్యత్తును గూర్చి వివరించి చెప్పుమని కోరగా, **ఆ రాజు తన భార్యతో ఇట్లు చెప్పసాగెను** – "రాబోవు జన్మను గూర్చి నీవు అడిగితివి గనుక, నేను సింధుదేశమునకు రాజునై జన్మించెదను. నీవు సృంజయదేశపు రాజుకు కుమార్తెవై జన్మించి, తిరిగి నాకు

పట్టపురాణివయ్యెదవు. అనంతరము మూడవజన్మలో నేను సౌరాష్ట్ర దేశాధిపతినై జన్మించెదను. అప్పుడు నీవు కళింగరాజు వంశమునందు పుత్రికవై జన్మించి నాకు భార్యవయ్యెదవు. ఆ తదుపరి నాలుగవ జన్మమునందు నేను గాంధార దేశమునకు రాజునై జన్మించెదను. నీవు మగధ రాజకుమార్తెవై జన్మించి, నన్ను వరించి నా భార్యగా అయ్యెదవు. అనంతరము, ఐదవ జన్మలో నేను అవంతీదేశాధీశ్వరుడనై జన్మించెదను. అప్పుడు నీవు దాశార్హరాజవంశమునందు జన్మించి, నన్ను పరిణయమాడెదవు. ఆ తదుపరి ఆరవ జన్మమునందు ఆనర్త దేశమునకు రాజుగా నేను జన్మించినపుడు నీవు శర్యాతికి కూతురువై, నాకు భార్యవయ్యెదవు. ఇక ఏడవ జన్మమునందు నేను పాండ్యదేశాధిపతిగా జన్మించెదను. అప్పుడు నేను అత్యంత రూపలావణ్యములతో శోభిల్లెదను. నాతో సరిసమానమైన సుందరాంగుడు ఈ జగత్తులో మరెవ్వరునూ ఉండరు. సూర్యకాంతి వంటి వదనముతో, మదనరూపమును కలిగిన సర్వగుణోపేతుడనై ఒక జ్ఞానిగా నుండిన నాకు అప్పుడు **'పద్మవర్ణుడు'** అను పేరు ఉండును. ఇక నీవేమో వైదర్భకులమునందు జన్మించెదవు. గొప్ప రూపసౌందర్యములతో చంద్రునివంటి ముఖకమలమును కలిగి బంగారుబొమ్మవలె అపురూపమైన సౌందర్యరాశివై ఉండెదవు. అప్పుడు నీకు **'వసుమతి'** అను పేరుండును. నలదమయంతులకు స్వయంవరము జరిగినట్లుగా అప్పుడు నీకు స్వయంవరము ఏర్పాటు చేయబడును. అందులో నేను పాల్గొని నిన్ను వరించెదను. అప్పుడు నేను బహుకాలము రాజ్యపాలనమొనర్చెదను. అపరిమితమైన యజ్ఞములను ఆచరించెదను. సమస్తదేశములను జయించి రాజ్యమును విస్తరించెదను. మంత్రశాస్త్రములను ఎన్నింటినో అధ్యయనము చేసెదను. దేవతలను, ద్విజులను, చక్కగా అర్చించి వారికి అనేక దానములను సమర్పించెదను. ఆనాటి బ్రాహ్మణులకు అనేక అగ్రహారములను దానముగా ఇచ్చెదను. ఈవిధముగా వృద్ధాప్యము ఆవహించిన మీదట పుత్రులకు రాజ్యమును అప్పగించి అగస్త్యమహర్షివద్దకు చేరుకొని, వారివద్ద జ్ఞానోపదేశమును పొంది మోక్షమునకు చేరుకొనగలను. దేహపాతము జరుగుతున్న తరి నాతోపాటుగా నిన్ను కూడా తీసుకొని దివ్యవిమానమును అధిరోహించి స్వర్గలోకమునకు చేరెదను. అచట అనంతసుఖములను నీవు అనుభవింతువు. శివరాత్రి వ్రతము, ఈశ్వరపూజ, శ్రీశైలమహిమ ఇవన్నింటిని వర్ణించుటకు శక్యముకానిపని. వీటివలన అనంత సుకృతఫలమును పొందవచ్చునని చెప్పెను. అనంతరము ఆతని భార్యతోపాటుగా ఆ మహారాజు శ్రీశైలయాత్రకు వెళ్ళెను. (66-89)

మహాశివరాత్రి మహిమవలన అతడు సప్తజన్మములయందు రాజ్యాధిపతిగా జన్మించి చివరకు సద్గతిని పొందెనని గురునాథుడు ఈ సాలెవాడికి చెప్పెను. **తిరిగి అతనితో ఇట్లు పలికెను** – "నాయనా! శివరాత్రి పర్వదివసము, శ్రీశైలపర్వత మహిమ సాటిలేనిది. తద్వారా ఒక

కుక్క ఏడు జన్మలపాటు రాజుగా జన్మించి చివరకు స్వర్గలోకమునకు చేరుకొనెను. నీవు గురుముఖమున శివపూజాఫలమును, శివరాత్రి మహిమను, శ్రీశైలపర్వతము యొక్క మాహాత్మ్యమును వింటివి. కావున, నీవు చక్కగా ఈశ్వరపూజను చేయుము. మన గాణగాపురమున భీమాతీరమునందు కల్లేశ్వర దేవస్థానము కలదు. ఆ కల్లేశ్వరునకు ఈ మల్లికార్జున స్వామికి ఇంచుకైననుభేదము లేదు. కావున, నీవు నిత్యము భక్తితో ఆ కల్లేశ్వరుని పూజించుచుండుము" అని చెప్పెను. **అందుకు ఆ సాలెవాడు స్వామితో ఇట్లు పలికెను** – "గురునాథా! మీరే నన్ను మాయలో త్రోయుచున్నారు. మల్లికార్జునుని పూజించుటకొరకై నేను వెళ్ళినప్పుడు ఆ లింగప్రదేశమునందు ప్రత్యక్షముగా మిమ్ములనే నేను దర్శించితిని. ఇక కల్లేశ్వరుడు, మల్లికార్జునుడు, సంగమేశ్వరుడు ఒక్కరే అని మీరు నాకు చెప్పుచుంటిరి. కానీ, అన్నిచోట్లలోనూ మీరే వ్యాపించియున్నారు. మీ చరణతీర్థములయందే సమస్తతీర్థములు కలవు. నేను మిమ్ములనే ఆరాధించెదను" అని గట్టిగా పలికెను. **అతని మాటలు విని శ్రీగురునాథుడు చిరునవ్వును చిందించి, పలికెను** – "నాయనా! తిరిగి గట్టిగా నా పాదుకలను పట్టుకొని కళ్ళు మూయుమని" చెప్పెను. తిరిగి తృటికాలములో శ్రీశైలమునుండి భీమ, అమరజా సంగమమునకు చేరుకొనిరి. (90–96)

ఇంతలో గాణగాపురములో గంగాతీరమునందు శ్రీగురుడు ఎక్కడ వెతికినను కనిపించక వారి శిష్యులందరూ అన్ని దిక్కులయందునూ గాలించుచుండిరి. కొందరు సంగమములో ఉందురనగా, మరికొందరు మేమిప్పుడే అచటినుండి వచ్చితిమి. అచట గురునాథులు లేరని పలికిరి. మరి ఎక్కడికి వెళ్ళిరో వెదికెదముగాక! అని భక్తులందరూ తికమకపడుచుండిరి. శ్రీగురునాథులు సంగమస్థలమునకు చేరుకొని, వెంటనే నేను సంగమమునకు చేరుకొంటినని శిష్యులందరికీ తెలియజెప్పి వారిని తీసుకొని రమ్మని ఆ సాలెభక్తుని మఠమునకు పంపించెను. సాలెవాడు గ్రామమునకు వచ్చిన వెంటనే గ్రామస్తులందరూ అతనిని చూసి, క్షవరము ఎందుకు చేయించుకుంటివిరా? అని అందరూ పకపక నవ్వసాగిరి. అందుకు సాలెవాడు నేను శ్రీశైలము వెళ్ళి వచ్చితినని చెప్పెను. తాను తెచ్చిన ప్రసాదమును, పుష్పములను, విభూతిని, రకరకముల పూలదండలను వారికి చూపించెను. ఈ సాలెవాడు మధ్యాహ్నము రెండు జాముల వరకూ ఇంటిలోనే ఉన్నాడు కదా! అని ఆశ్చర్యపోవుచూ ముక్కుపై వేలు వేసుకొని, కొందరు 'ఇది కలయా? నిజమా' అని అంటూ 'సత్యమును వచించుమురా' అని పలికిరి. అందుకు సమాధానముగా ఆ సాలెవాడు శ్రీగురునాథుని కృపామహిమచే "నేను వాయువేగముతో వెళ్ళితినని" పలికెను. శ్రీగురునాథులు ఇప్పుడే సంగమమునకు విచ్చేసి, నన్ను మఠమునకు పంపించి, శిష్యులందరినీ తీసికొని రమ్మని పంపెను. కావున, మీరందరూ అచటికి రావలసినదని

పలికెను. కొందరు 'బహుశా ఇది నిజమే కావచ్చునని' అనిరి. మరికొందరు మూర్ఖులు 'ఇది మిథ్య. వీడేదో డాంభికముగా పలుకుచున్నాడని' ఎగతాళి చేసిరి. ఇవేమీ పట్టించుకొనకుండా శిష్యులు మాత్రము 'ఈ సాలెవాడు గురుకృపచేత వాయువేగముతో శ్రీశైలమునకు వెళ్ళి వచ్చుట సంభవమే' అని భావించిరి. అందరునూ వెంటనే త్వరతగతిన సంగమస్థలమునకు చేరుకొనిరి. సంగమమునందు విరాజిల్లుచున్న గురునాథుని దర్శించి అందరునూ అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీస్వామివారిని పూజించిరి" అని సిద్ధముని నామధారకునితో చెప్పెను. దీనిని అసత్యమని, భ్రాంతియని భావించినవారు కుంభీపాక నరకమునకు వెళ్ళెదరు. శ్రీశైలయాత్రకు వెళ్ళిన సాలెవాని తలిదండ్రులు, బంధువులు, మిత్రులందరూ తిరిగి పదిహేనవ దినమున గ్రామమునకు చేరుకొనిరి. వచ్చిన వారందరూ మాకు శ్రీశైలమున ఈ సాలెభక్తుడు కనిపించెనని చెప్పగా గ్రామస్థులందరూ నమ్మి, బహు విస్మయమునకు లోనై గురునాథుల యొక్క మహిమ అమోఘమని జేజేలు పలికిరి" అని సిద్ధుడు నామధారకునకు చెప్పగా, అట్టి మాటలనే నేను మీ అందరికీ చెప్పుచున్నానని సరస్వతీ గంగాధరుడు అపారమైన గురుమహిమను, గురుచరితామృతముద్వారా నిరంతరము సేవించుచుండెదము గాక! అని లోకమునకు వ్యక్తపరచెను.(97-108)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "శ్రీశైల శివరాత్రి మహిమాను వర్ణనము" అను నలుబది మూడవ అధ్యాయము ॥ 43 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 108; మొత్తము సంఖ్య : 6351 + 108 = 6459 ఓవీలు)

॥ సప్తాహ పారాయణ క్రమము (6) ఆరవరోజు విరామము ॥

॥ సర్వం శ్రీ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహ సరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయ చరణారవిందార్పణమస్తు ॥

॥ అవధూత చింతన శ్రీగురుదేవదత్త ॥

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

నలుబది నాల్గవ అధ్యాయము

శ్వేతకుష్ఠవ్యాధిగ్రస్తుడగు నందియను బ్రాహ్మణుడు భవానీదేవిని పూజించుట - ఆమె ఆజ్ఞానుసారము చందలాదేవి శరణుపొందుట - కాని, ఆ దేవి గాణగాపురము నందలి గురునాథుని ఆశ్రయించుమని ఆదేశించుట - సంశయాత్ముడై అతడు శ్రీగురు సన్నిధిని చేరుకొనుట - శ్రీగురుకృపవలన అతనివ్యాధి నిర్మూలనమగుట - కవిత్వసామర్థ్యమును పొంది శ్రీగురువును గొప్పగా స్తుతించుట - చివరకు ఆతడు శ్రీవారిసేవకే అంకితమగుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునీశ్వరునకు సాష్టాంగవందనమును ఆచరించి అంజలి ఘటించి వినయముతో ఇట్లు పలికెను – “మహానుభావా! పరమపావనమైన శ్రీగురుచరిత్రమును, అద్భుతమైన శ్రీగురు లీలలను ప్రత్యక్షముగా మీ నేత్రములతో దర్శింపగలిగిన మీ మహద్భాగ్యమును గూర్చి నేను ఏమని కొనియాడగలను. గురువే పరబ్రహ్మమని పలుమార్లు చెప్పిన తమరు అట్టి పరబ్రహ్మమునే సాక్షాత్కరింపజేసికొనిన మీ భాగ్యమే భాగ్యము. అట్టి మహాత్ములైన మీరు కేవలము నన్ను తరింపచేయుటకొరకే నాకు మీ దర్శనభాగ్యమును సిద్ధింపజేసితిరి. మీ యనుగ్రహము వలన గురుచరితామృత పానమొనర్చు మహద్భాగ్యము లభించెను. తద్వారా, నా దైన్యము తొలగిపోయెను. నా దుఃఖము సమసిపోయెను. సకల అభీష్టములను పొందితిని. ఇకపైన నాకు కష్టమనునది లేనేలేదు. అచ్చమైన సుఖమును హాయిగా పొందుచుంటిని. మహానుభావా! శ్రీగురుమూర్తి సంగమమునందు ఉండిపోయిరి అని పూర్వకథలో మీరు సెలవిచ్చితిరి. అట్టి సమయమున జరిగినట్టి అద్భుతమైన, విచిత్రమైన, పవిత్రమైన గురులీలను శ్రవణము చేయించవలసినదని” ప్రార్థించెను. **అంతట సిద్ధముని నామధారకునితో ఇట్లు చెప్పసాగెను –** “వత్సా! నామధారకా! మరునాడు వేరొక కడు విచిత్రమైన లీల జరిగెను. దానిని వివరించుచున్నాను. మిక్కిలి సావధానచిత్తముతో వినుము. (1-5)

‘నంది’ అను పేరుగల ఒక బ్రాహ్మణునకు దేహమంతటా నిండుకొని సర్వాంగములయందు శ్వేతకుష్ఠ వ్యాధి సంక్రమించెను. ఆ వ్యాధి వలన అతడు మిగుల దుఃఖపడుచుండెను. వ్యాధి నివారణార్థమై నందియను ఆ బ్రాహ్మణుడు తుల్జాపురమునకు వెళ్ళి అచటగల భవానీదేవిని

ఆరాధింపసాగెను. ఒకవైపు తన దేహమును బాధించుచున్న వ్యాధితో దుఃఖపడుచూ, మరొకవైపు కఠినముగా ఉపవసించి దీక్షతో మూడు సంవత్సరముల పర్యంతము భవానీదేవిని ఆరాధించెను. అనంతరము, ఆ అమ్మవారు అతని స్వప్నమున సాక్షాత్కరించి, నీవు వెంటనే ఇచటినుండి బయలుదేరి 'చందల' అను పరమేశ్వరి వద్దకు వెళ్ళి ఆరాధించుమని ఆదేశించెను. జగన్మాత అనుమతిని గైకొని ఆ బ్రాహ్మణుడు చందలాపరమేశ్వరి కొలువుదీరియున్న చోటునకు చేరుకొనెను. ఆ చందలా పరమేశ్వరి సన్నిధానమున కఠినమైన ఉపవాసవ్రతమును పూని ఏడుమాసముల పర్యంతము మంత్రపురశ్చరణము అనుష్ఠించెను. అంతట ఆ అమ్మవారు అతని స్వప్నమునందు దర్శనమిచ్చి "నీవు వెంటనే గాణగాపురమునకు వెళ్ళుము. అచట త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన శ్రీజగద్గురువు కలడు. వారి దివ్యశ్రీచరణారవిందములను దర్శించుము. వారి కృప వలన నీ దేహము నందలి వ్యాధి నివారణమై స్వర్ణదేహముగా మారిపోవును. ఆ గురుమూర్తి అనుగ్రహము వల్లనే నీ శ్వేతకుష్ఠువ్యాధి నివర్తించునని" చెప్పెను. (6-7)

అంతట ఆ విప్రుడు శ్రీ దేవిని ఉద్దేశించి ఇట్లనెను – "అమ్మా! తుల్జాపూరు భవానీదేవి ఆదేశమును స్వీకరించి, నీవే నిజమైన దేవతవని. నీ వలన తప్పక రోగనివారణము కాగలదని యెంచి వచ్చితిని. ఏడు నెలల పాటుగా నిన్ను ఆరాధించితిని. ఇప్పుడు నీవు నా చేతిలో ఏమీ లేదనియు, ఒక మానవమాత్రుని వద్దకు వెళ్ళుమని చెప్పుచుంటివి. నీవు జగదంబవని, జగజ్జననివని అందరూ అనెదరు. చరాచరసృష్టిని పాలించెడి లోకైకమాతవను గొప్ప బిరుదము నీకే కలదని విశ్వసించితిని. అట్టి నీవే నన్ను ఒక మానవమాత్రునివద్దకు పంపించుచుంటివి కదా! అయ్యో! నా అదృష్టము ఎట్లున్నదో, కదా! నేను నీ వద్దకు వచ్చిన వెంటనే నీవు ఈ మాటను చెప్పియుండినచో, నీవద్ద దైవత్వము లేదని, నా బాధ నేనే అనుభవింతునుగదా! నాకింతటి కష్టము కలిగియుండునది కాదుకదా! నీవొక గొప్ప శ్రేష్ఠమైన దేవతవని, తద్ద్వారా నా వ్యాధి నివారణమగునని నేను వ్యర్థముగా దురాశ చెందితిని" అని అనేకవిధములుగా దుఃఖించుచూ, "అమ్మా! నిన్ను వదలి నేను మాత్రము మరొకచోటునకు వెళ్ళనుగాక వెళ్ళను. జగన్మాతా! నీ వల్లనే నా ఈ రోగము నివారింపబడవలెను. లేనియెడల, నీ పాదసన్నిధియందే ప్రాణత్యాగ మొనర్చెదనని" కఠోరమైన దీక్షను వహించి అమ్మను ఆరాధించుటను ప్రారంభించెను. మరునాడు అతనికి తిరిగి అట్టి స్వప్నమే కలిగెను. అంతేగాక, అచటి పూజారులకు కూడా గాణగాపురమునకు వెళ్ళుట గురించిన స్వప్నమే కలిగెను. ఈ విప్రుని వెంటనే గాణగాపురము వెళ్ళుటకు మీరు నచ్చచెప్పవలసినదని ఆ చందలా పరమేశ్వరి తన పూజారులను ఆదేశించెను. మరునాడు పూజారులందరూ నంది యను ఆ బ్రాహ్మణుని వద్దకు వచ్చి, "బ్రాహ్మణోత్తమా! వినుము. నిన్నటి రాత్రి మాకొక స్వప్నము కలిగినది. అమ్మ అనుమతి ప్రకారముగా నీవు

వెంటనే గాణగాపురమునకు వెళ్ళుము. ఆ దేవిని బాధించవద్దు. మా మాటను శ్రద్ధగా విని నీవు వెంటనే మర్యాదగా గాణగాపురమునకు వెళ్ళుము. లేనిచో, మేము నిన్ను కఠినముగా ఇచటినుండి బయటకు పంపవలసి వచ్చును" అని వారు హెచ్చరికగా చెప్పిరి. అప్పుడా బ్రాహ్మణుడు ఇక చేయునది లేక పారణ చేసి, అనేకవిధములుగా అమ్మవారిని పూజించి, నా తప్పును క్షమియించుమని వేడుకొని, ఆమె ఆజ్ఞ మేరకు గాణగాపురమును చేరుకొనుటకై బయలుదేరెను. (8-22)

శ్రీజగన్మాత స్మరణముతో ఆమె ఆదేశము మేరకు త్రిమూర్త్యాత్మక స్వరూపమైన జగద్గురువును స్మరించుచు నెమ్మదిగా గాణగాపురమునకు చేరుకొనెను. మఠమును సందర్శించి, అచటగల భక్తజనులతో శ్రీగురుని గూర్చి విచారించగా శ్రీగురుమూర్తి సంగమమునందు ఉన్నారని వారు చెప్పిరి. అంతేకాదు, శ్రీగురుమూర్తి నిన్నటి దినమున శివరాత్రి ఉపవాసము వహించియుండెను. పారణమునకై ఇప్పుడే మఠమునకు చేరుకొందురని చెప్పిరి. ఇంతలో ప్రత్యక్షముగా శ్రీగురునాథులు విచ్చేసిరి. అచటగల వ్యక్తులు ఈ విప్రుని జూచి "నీవు దూరముగా నిలువుము. స్వామికి ఎదురుగా వెళ్ళవద్దు" అని నివారించిరి. ఆ బ్రాహ్మణుడు లోలోన ఎంతగానో దుఃఖించుచుండెను. ఇంతలో శ్రీగురుమూర్తి విచ్చేసి మఠములోనికి ప్రవేశించెను. అచటగల శిష్యులు – "స్వామీ! తమరి దర్శనార్థమై ఒక విప్రుడు వచ్చెను. అతని దేహమంతటా తెల్లని కుష్ఠువ్యాధి సంక్రమించి యుండెను" అని తెల్పిరి. వారి మాటను వింటూనే గురునాథుడు, "ఔనౌను, మాకు ఆ సమాచారము ముందే తెలియును. సంశయాత్ముడై అతడు ఇచటికి వచ్చెను అని పలికి, ఆ విప్రుని వెంటనే నా వద్దకు తీసుకొని రమ్మని" చెప్పెను. వారు వెంటనే పరుగు, పరుగున వెళ్ళి ఆ బ్రాహ్మణుని పిలిచిరి. అతడు ప్రాంగణములోనికి ప్రవేశించి దూరమునుండియే శ్రీగురునాథుని చూచినంతలోనే మైమరచిపోయి ఒక కఱ్ఱవలె నేలపై పడిపోయి, భూమిపై దొర్లుచూ నమస్కరింపసాగెను. అనంతరము లేచి చేతులు కట్టుకొని శ్రీస్వామివారి ముందు నిలిచెను. అంతట శ్రీగురునాథుడు అతనితో, **"ఓయీ! బ్రాహ్మణుడా! దేవతలను వదలిపెట్టి మానవుని వద్దకు ఏల వచ్చితివి? సంశయాత్మునకు కార్యము సిద్ధింపగలదా?" అని పలికెను.** వారి మాటలను విన్న బ్రాహ్మణుడు తన మనోగతమును గురుమూర్తి గ్రహించినందులకు మిగుల సిగ్గుపడుచూ శిరమును వంచుకొని శ్రీగురునాథుని పాదములపై పడిపోయి, "స్వామీ! నన్ను క్షమించుడు. నా అపరాధమును మన్నించుడు. **'పాహి! మాం పాహి!!'** అంటూ సాష్టాంగపడెను. (23-31)

అంతేగాక, ఇంకనూ అతడు ఇట్లు పలుకుచుండెను- "మహానుభావా! నేను అజ్ఞానాంధకారములో మునిగియున్న మూర్ఖుడను. పరబ్రహ్మను గూర్చి తెలియనైతిని. తమరి మహిమను తెలిసికొనలేక మహాపరాధమును చేసితిని. క్షమింపుడు. ఈ అజ్ఞానిని అనుగ్రహింపుడు.

మీ దర్శనమాత్రముతోడనే నేను శుద్ధుడనైతిని. నాకు జ్ఞానము కలిగెను. కేవలము నాలోగల తమోగుణమువలన మీరు సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపులను విషయమును గ్రహించలేకపోయితిని. నేను పాపాత్ముడను. పాపకర్ముడను. మీ దర్శనభాగ్యముతో నేడు పునీతుడనైతిని. ఈ దినమే ఒక సుదినము. శ్రీనృసింహసరస్వతీ స్వామీ! తమరే భక్తజనులకు ఆధారభూతులని, శరణాగతరక్షకులని, మీ చరణములే ఆర్తులకు నిర్భయస్థానములని, కృపాసాగరా! యతిరాజా! భక్తజనబంధూ! మీ మహిమను ఎవరు గ్రహింపగలరు. మీ పాదపద్మముల దర్శనముచేత నా సమస్త పాపములు సమసిపోయినవి. నా మనోరథములు ఈడేరినవి. మీరు భక్తులపాలిటి కామధేనువులు. మానవవేషమును ధరించి అవతరించిన మీ ఆద్యంతములను ఎవరు తెలుసుకొనగలరు. మీరే త్రిమూర్తిస్వరూపులు. సగరపుత్రులద్వారా ఈ సమస్త జగత్తును పునీతము చేయుటకై ఏతెంచిన గంగాదేవి వలె తమరు భక్తజనరక్షణార్థమై సేవకవర్గమును ఉద్ధరించుటకై వచ్చిన త్రిమూర్త్యవతారమే మీరు. రాతిగా మారిన నాతియగు అహల్యాదేవికి మీ దివ్యచరణములు సోకిన వెంటనే దివ్యదేహమును ప్రసాదించినట్లుగా, స్వామీ! నా సర్వాంగములయందు సంక్రమించిన ఈ కుష్టువ్యాధిని నివర్తింపచేసి నన్ను రక్షింపుము. ఉపనయనమైన అనంతరము వివాహమైనప్పటినుండి నా ఈ దేహమునందు ఈ వ్యాధి చెలరేగినది. ఇట్టి శరీరమును స్పృశింపరాదని ఏవగింపుతో నా భార్య తమ పుట్టింటిలోనే ఉండిపోయినది. నా తలిదండ్రులు, మిగిలిన బంధువులు, మిత్రులు తుదకు గ్రామస్థులు కూడా నన్ను అసహ్యించుకొని దూరము చేయుటవలన అపరిమితమైన ఇడుములపాలైన నేను మిగుల బాధతో నిరంతరము దుఃఖించుచూ కృంగి కృశించిపోవుచుంటిని. సంసారమును వదలిపెట్టి బయలుదేరితిని. నేరుగా తుల్జాపురమునకు వెళ్ళి భవానీమాతను ఉపవాసదీక్షతో ఉపాసించితిని. కానీ, నీవు ఉత్కటమైన పాపరాశివి. ఇంతలో నీవు బాగుపడలేవు. కావున, చందలాపరమేశ్వరి సన్నిధానమునకు వెళ్ళుము. ఆమెద్వారా నీకు నివృత్తి లభించునని ఆదేశించెను. కృపామూర్తీ! అచటికి వెళ్ళి ఎంతయో కష్టపడితిని. కానీ ఫలితము లేదు కదా! ఆ తల్లి విసుగుతో నన్ను మీవద్దకు వెళ్ళుమని ఆదేశించి కఠినముగా వెడలగొట్టినది. ఈవిధముగా దేవతలే నన్ను చూసి, విసుగుపడి దూరముగా గెంటివేసినప్పుడు ఇక, మానవులు నన్ను ఎట్లు చూడగలరు. కనుక, జీవించియుండుటవలన ప్రయోజనము లేదని భావించి, మరణించుటకే నిశ్చయించుకొంటిని. కానీ, చిట్టచివరగా మీ పాదపద్మముల చెంతకు చేరుకొంటిని. ఇంతటి మహాపాపిని. అంగహీనుడనైన నేనేమి చేయగలవాడను. కుష్టువానినని ఎవ్వరూ నా ముఖమును కన్నెత్తి కూడా చూడరైరి. దూరమునుండి నన్ను చూచినంతలోనే మరింత దూరముగా వైదొలగి అసహ్యించుకొనుచూ వెళ్ళుచుండిరి. ఇంతటి హీనమైన జీవితముకన్నా మరణించుటయే మేలని భావించితిని. స్వామీ! నాదొక చిన్న విన్నపము. తాము అన్యథా భావించవద్దు. నా

దుష్కర్మకు ప్రాయశ్చిత్తము ఉన్నదా? లేదా? ఈ జన్మలో నాకు సంక్రమించిన ఈ కుష్ఠువ్యాధి నివారింపబడునా? లేదా? దయతో సెలవీయగలరు. ఈ శరీరముపైన నాకు ఆశ లేదు. జీవించవలెననెడి కోరిక అడుగంటిపోయినది. నా వ్యాధిని నివర్తింప చేయనియెడల, తమ పాదసన్నిధియందే నా ప్రాణములను వదలివేయుదును. మీరు శరణాగతరక్షకులు అని వినియుంటిని. నన్ను అనుగ్రహించెదరో, లేక, నాపై ఆగ్రహించెదరో, స్వామీ! ఇకపై మీ ఇచ్ఛయే!" అని తన మనోబాధనంతయూ స్వామిముందు వినయముతో విన్నవించుకొని ప్రార్థించెను. ఆ విప్రుడు పలికిన దయనీయమైన మాటలను విని శ్రీగురునాథుడు నవ్వి, **తనవద్దగల సోమనాథుడు అను బ్రాహ్మణుని పిలిచి ఇట్లు పలికెను–** "నాయనా! సోమనాథా! నీవు వెంటనే ఈ బ్రాహ్మణుని సంగమమునకు తీసుకొని వెళ్ళి చక్కగా సంకల్పమును చెప్పించి, షట్కూల తీర్థమునందు స్నానము చేయించుము. తదుపరి అశ్వత్థ వృక్షమునకు ప్రదక్షిణములను చేయించి, అతడు ధరించిన వస్త్రములను దూరముగా త్యజింపజేయుము. వెంటనే అతనికి ఈ నూతన వస్త్రములనిచ్చి ధరింపజేయుము. అనంతరము భోజనము కొరకై మఠమునకు తీసికొని రాగలవు" అని అతనిని ఆజ్ఞాపించెను. వెంటనే శ్రీవారి శిష్యుడైన సోమనాథుడు ఆ బ్రాహ్మణుని తనవెంట తీసుకొని సంగమమునకు వెళ్ళెను. సంగమమునందు సంకల్పపూర్వకముగా స్నానము చేయించెను. వెంటనే అతని శరీరవర్ణము మారిపోయెను. అచటినుండి వెళ్ళి అశ్వత్థవృక్షమునకు ప్రదక్షిణము చేయుచుండగనే అతని సర్వాంగములను చుట్టుకొనిన శ్వేతకుష్ఠువు నశించిపోయెను. అంతేకాదు, తత్క్షణమే అతని దేహమంతయూ బంగారువర్ణముగా మారిపోయెను. అనంతరము అతనికి నూతన వస్త్రములను ధరింపజేసి పాతవస్త్రములను దూరముగా విసరివేసెను. ఆ వస్త్రము పడిన ప్రదేశము ఒక పాడుబడిన చవిటిభూమిగా మారిపోయినది. వెంటనే సోమనాథుడు ఆ బ్రాహ్మణుని తనవెంట తీసికొని శ్రీగురుమూర్తి సాన్నిధ్యమునకు చేరుకొనినంతలోనే మఠమునందలి బ్రాహ్మణులు, శిష్యులందరూ ఆ విప్రుని చూచి అత్యంత ఆశ్చర్యచకితులైరి. (32–55)

అంతులేని ఆనందమునకు లోనైన నంది అను ఆ బ్రాహ్మణుడు పరుగున వెళ్ళి శ్రీగురునాథుని పాదపద్మములపై శిరమునుంచి సాష్టాంగవందనము చేసెను. అనంతరము అంజలించి వినయముతో అపారముగా గురునాథుని స్తోత్రము జేసెను. అత్యంత హర్షముతో నిండిపోయిన ఆతని హృదయము భక్తిభావముతో పొంగిపొరలిపోయెను. ఆతని శరీరము పులకరించుచుండెను. గురుభక్తిలో పరవశుడైపోయి స్వామి పాదుకలమీద పడి అటూ ఇటూ దొర్లుతూ ఆనందవిహ్వలుడు కాసాగెను. ఆ దృశ్యమును చూచిన బ్రాహ్మణులు, శిష్యులు మున్నగు వారందరు నివ్వెరపడుచుండిరి. **వెంటనే గురునాథుడు అపారమైన కరుణాపూరితదృష్టితో చూచి ఇట్లనెను–** *"ఓయీ! బ్రాహ్మణుడా!*

నీ కోరిక నెరవేరినదా? నీ సర్వాంగములు ఎట్లుండెనో, ఇపుడెట్లు మారినవో ఒకమారు స్పృశించి అవలోకించుము" అని చెప్పగా అతడు తన దేహమునంతయూ పరిశీలించి చూచిన మీదట, "స్వామీ! మోకాలి వెనుక భాగమున స్వల్పాంశముగ శ్వేతకుష్ఠ కనబడుచుండెను" అని పలికిన ఆ విప్రుడు మిగుల దుఃఖాక్రాంతుడై "స్వామీ! మీ కృపాదృష్టి కలిగినప్పటికినీ మరికొంత శేషించియుండెను. ఇప్పుడేమి చేయుదును పరమాత్మా! పరిపూర్ణమైన కృపను నాపై ప్రసారము చేయుమని" మరల మరల ప్రార్థించుచు సాష్టాంగవందనమును చేసెను. **అందుకు శ్రీగురునాథులు అతనితో ఇట్లు పలికెను** – "ఒక మానవమాత్రుడు ఏమి చేయగలడులే అని నీవు సంశయాత్ముడవై వచ్చితివి. కావున, నీ వ్యాధి అంతమాత్రము శేషించియుండెను. దాని నివారణమునకు మరొక ఉపాయము గలదు. అది ఏమన, నీవు నన్ను కవిత్వముతో చక్కగా స్తుతించుము. అప్పుడు నిశ్శేషముగా నీ వ్యాధి నశించిపోగలదని" పలికిరి. **అంతట నందియను ఆ బ్రాహ్మణుడు చేతులు జోడించి స్వామితో ఇట్లు పలికెను** – "మహాత్మా! నేను మందమతిని. నాకు వ్రాయుటగాని, చదువుటగాని ఎంతమాత్రము తెలియదు. మిగుల అజ్ఞానినైన నేను కవిత్వముతో మిమ్ములనెట్లు స్తుతింపగలను స్వామీ! కవిత్వమనగా ఏమిటో నాకు తెలియనే తెలియదు. కావ్యపరిజ్ఞానము సుంతైనను లేదు. స్వామీ! అతి విచిత్రమైన ఆజ్ఞను ప్రకటించితిరి" అని శ్రీవారి చరణసరోజములను ఆశ్రయించెను. వెంటనే గురునాథులు ఆ బ్రాహ్మణునితో నీ నోటిని తెరచి నాలుకను బయటకు చాచుమని చెప్పిరి. చాచిన అతని నాలుకపై మంత్రించిన విభూతిని చల్లిన తత్క్షణమే ఆ బ్రాహ్మణునకు జ్ఞానోదయమై అద్భుతమైన కవిత్వముతో అఖండముగా **శ్రీగురుమూర్తిని ఈవిధముగ స్తుతింపసాగెను.** (56–64)

"స్వామీ! మాయచే ఆవరింపబడిన సంసారమునందు మునిగి మీ చరణములను విస్మరించితిని. అనేక యోనులయందు జన్మించితిని. కనీసము మిమ్ములను మానసికముగనైననూ నేనెప్పుడూ తలపనైనా తలపలేదు. ఈ జననమరణ సాగరమునందు మునిగి ఇప్పటికి ఎనుబది నాలుగు (84) లక్షల యోనులలో జన్మించితిని. మందమతినైన నాకు మీ నామము కూడా గుర్తుకు రాలేకపోయెను. ఏనాడూ మీ నామమును స్మరించనైతిని. స్వేదజ, అండజ, ఉద్భిజ, స్థావర జంగమములు, పశుయోనులు తదితర యోనులన్నింటిలో జన్మించిన మాకు జ్ఞానమెట్లు కలుగును. సమస్త యోనులలోకెల్లా మానవజన్మమే విశేషమైనది కదా! అందులో శూద్రాది అనేక జాతులు ఉండును. ఏ జన్మను ఎత్తినప్పటికినీ మిమ్ములను గురించి ఏమని తెలుసుకోగలము. జన్మలన్నింటిలోనూ విశేషమైనది బ్రాహ్మణజన్మ. అట్టి బ్రాహ్మణుడనై జన్మించియూ తగిన గురువు లభింపకపోవుటచే మూర్ఖుడనై సంచరించితిని. గురుసేవను ఎరుగనైతిని. గురుప్రభావమును గ్రహింపనైతిని. గురుదేవా! జననీజనకుల శుక్లశోణిత సంబంధము వలన బీజరూపమును దాల్చి ఐదురోజుల వరకు మూసలో పెట్టి కరగబెట్టిన బంగారమువలె, నీటిమీద ఒక

బుడగవలె యేర్పడును. పదునైదు దివసములవరకు అది స్థిరముగా నుండి నిర్ధారణగా నిలుచును. అందులో స్థూలపంచమహాభూతములు చేరలేదు. లేదా, ఇంద్రియములు కూడా అప్పటికి ఉద్భవింపలేదు కదా! అట్టివానికి ఇదంతయూ ఎట్లు తెలియును? (65-72)

అనంతరము ఒక మాసములోగా పిండముగా మారితిని. రెండవ మాసమునందు శిరము, పాదములు, మూడవమాసమున సమస్త అవయవములు అనగా నవద్వారములు అంటే రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కురంధ్రములు, మలమూత్ర ద్వారములు వెరసి మొత్తము తొమ్మిది అవయవములు తయారైనవి. అంతట పంచమహాభూతములు తయారై ప్రాణము ప్రవేశించెను. అప్పుడు నాకు స్మరణమనునది ఎట్లుండును? ఐదవ మాసమున చర్మము, రోమములు, ఆరవ మాసమున శ్వాసోచ్ఛ్వాసలు, ఏడవ మాసమున చెవులు, నాలుక, మేధ, మజ్జ తయారగును. స్వామీ! ఆవిధముగా మాతృగర్భమునందు నవమాసములు రుధిర, మలమూత్రాదుల మధ్య నానాబాధలను అనుభవించితిని. కాలు, చేతులనైననూ కదలించగా రాక, అమ్మ పొట్టలో అనేక కష్టములపాలైతిని. తల్లి తినే ఉప్పుకారముల తీక్షతకు గురియై అనేకవిధములుగా దొర్లుతూ అపారమైన సంకటములను అనుభవించితిని. తల్లి మనసుకు తినవలెనని రుచి కలిగిన పదార్థములను ఆమె తినిన వెంటనే, నాకు అంతులేని దుఃఖము కలుగుచుండెడిది. ఈవిధముగా మాతృగర్భమున తొమ్మిది నెలలపాటు పడిన బాధ ఎంతవారికినీ చెప్పశక్యము కాదు. అప్పుడైననూ నిన్ను స్మరించలేకపోయితిని. కానీ, యోని ద్వారా బయటకు వచ్చి జన్మించిన పిమ్మట, మాయావరణముతో చుట్టబడి నేను మీ స్వరూపమును పూర్తిగా మరచితిని. నాటినుండి మీ చరణములను స్మరించలేకపోయితిని. పుట్టిన వెంటనే నా లలాటముపై నాయొక్క ఆయువు పరిమితి వ్రాసిపెట్టబడెను. అందులో సగభాగము రాత్రి నిద్రక్రిందనే వ్యర్థమగుచున్నది. ఇక మిగిలిన ఆయువులో మూడు భాగములు. అవి బాల్యము, యౌవనము, వృద్ధాప్యములుగా మారినవి. (73-81)

పసితనములో నన్ను ఊయలలో పరుండబెట్టినపుడు మలమూత్రాదులలో దొర్లుతూ మిగుల కష్టపడితిని. దోమలు, ఈగలనైననూ కదిలించలేని బాల్యదశలో కుమిలిపోయితిని. నాటి పసితనపు దుఃఖము గుర్తుకు వచ్చినపుడు నాకు అపరిమితమైన బాధ కలుగుచుండెను. గురునాథా! ఏమని చెప్పమందువు. బాల్యమునందు జీవుడు పడే బాధలు వర్ణనాతీతములు. అజ్ఞానతిమిరములో చిక్కుకొని ప్రక్కలో మలమూత్రాదులను విసర్జించి వాటిలోనే దొర్లుతూ ఒక్కొక్కప్పుడు తన మలమును తానే తింటూ, జీవుడు బాధపడుచుండును. బాలుడు ఆకలితో ఏడ్చుచుండగా అజీర్తి కలిగి, కడుపు నొప్పితో బాధపడుచున్నాడని తలచి తల్లి ఔషధమును పోయును. లేదా, స్తన్యపానమును చేయించును. అపరిమితమైన ఆకలి వేసినప్పుడు కడుపునొప్పి అని నోటిలో వేలు పెట్టి బలవంతముగా ఔషధమును పోయును. ఆకలితో

పీడించబడుతూ, దుఃఖించుచున్న సమయమున ఊయలలో వేసి జోలపాటలు పాడుతూ నిద్రపుచ్చే ప్రయత్నము చేయుచుండును. ఆకలితో, కడుపునొప్పితో ఏడ్చుచుండగా నోటిలో మందులు పోసి లేదా, ఏ దృష్టిదోషమో తగిలినదని మంత్రపుతాడునో, విభూతినో ఏదో ఒకటి మా అమ్మ నాకు పెట్టుచుండెడిది. కానీ, నా ఆకలిని మాత్రము అమ్మ గ్రహించునది కాదు. బలవంతముగా ఊయలలో పడుకోబెట్టినపుడు ప్రక్కలో ఉన్న తేలు తన కొండితో వీపుపై కుట్టగా విపరీతముగ ఏడ్చువాడను. తేలు విషయము తెలియక ఊయలను వేగముగా ఊపుతూ 'పడుకో నాయనా! ఊరుకో' అంటూ ఊపుచుండునది. లేదా ఊయలలో నుండి తీసి స్తన్యపానము చేయించి, మళ్ళీ ఊయలలో వేసినప్పుడు తిరిగి ఆ తేలు కుట్టుచుండెడిది. నాకు ప్రాణము పోయినంతటి బాధ కలుగుచుండెడిది. నా తల్లి పులుపు, కారములను తినుచున్నప్పుడు తద్వారా సిద్ధమైన స్తన్యపానము వలన నా కడుపులో మంట, బాధ కలిగి విపరీతముగా ఏడ్చుచుండెడివాడను. మధురముగా ఉండవలసిన క్షీరములు పుల్లగా మారుటచే దగ్గు ప్రారంభమగుచుండెను. నా కళ్ళు కుంకుమతో, లవణముతో, క్షారములతో నిండిపోయినప్పుడు ఎరుపుబారుటచే కండ్లకలక వచ్చినదని భావించి అనేకవిధములైన ఔషధములను వేయుటవలన నా కళ్ళకు విపరీతమైన బాధ కలుగుచుండెడిది. కానీ, బాలుడు మాత్రము స్వాభిప్రాయమును చెప్పలేక కడు బాధలను అనుభవించుచుండును. బాల్యమునందు ఇట్టి కష్టములనెన్నియో అనుభవించితిని. భయంకరమైన సంకటములనుండి గట్టెక్కి పసితనమునుండి పెరిగిపెద్దగా అగుచున్నప్పుడు మరెన్నియో కష్టములను అనుభవించితిని. ఈ రీతిగా పంద్రెండు వత్సరములు గడచిపోయెను. ఇక మీ చరణకమలముల స్మరణము నాకెట్లు లభించును. దేవా! పూర్వజన్మము గుర్తుకు రాక అనేక కష్టములను అనుభవించితిని. (82-95)

నా జీవితమునందు అప్పటికి ఇక రెండు భాగములు మిగిలియుండెను. యౌవనము వచ్చుటతోడనే శరీరమునందు మన్మథుడు ప్రవేశించుటవలన దీపమును చూచి పరుగెత్తే మిడతవలె ఉన్మత్తుడనై తిరుగాడసాగితిని. నాకు తల్లి, తండ్రి, గురువు ఎవ్వరూ గుర్తుకురారైరి. అందరినీ నేను నిందించువాడను. కులమును గూర్చి పట్టించుకొనలేదు. పరస్త్రీ చింతన చేయుచుండువాడను. బ్రాహ్మణులను నిందించి, వృద్ధులను అనవసరముగా ఎగతాళి చేయువాడను. యౌవన మదముతో మత్తెక్కిన నాకు మీ పాదపద్మములు గుర్తుకు రాలేదు. ఎరను చూచి ఆశపడి తినవలయునను కోరికచేత చేప తన ప్రాణములను పోగొట్టుకొనునట్లుగా, మన్మథబాణములతో ఉక్కిరిబిక్కిరియై ఇంద్రియములకు వశవర్తుడనైతిని. నానాజాతులకు చెందిన స్త్రీలను భోగించితిని. పెద్దలు చెప్పెడి బోధలను పెడచెవిన పెట్టుచుంటిని. పరద్రవ్యమును అపహరించితిని. సాధుసత్పురుషులను నిందించితిని. మదనబాణమునకు చిక్కువడిన నేను మదోన్మత్తుడనై మంచి మాటలను నా చెవులతో

వినలేకపోయితిని. మీ చరణములను పట్టుకొనలేకపోయితిని. ఇంతలో యౌవనము గడిచి వృద్ధాప్యము రానే వచ్చెను. శ్వాసోచ్ఛ్వాసలు కఫముతో నిండిపోయి దగ్గు వచ్చుచుండెను. భార్యాబిడ్డలకు నాపై రోత కలిగి విసుగు పుట్టెను. ఇంద్రియ పాటవము తగ్గెను. శరీరమునందు కంపమేర్పడెను. కేశములు తెల్లబడిపోయెను. పళ్ళు ఊడిపోయెను. చెవుడు వచ్చి దృష్టి నిలువక ముక్కు స్రవింపసాగెను. ఈవిధముగ అనేక రోగములతో కడు కష్టములపాలై లోలోన దుఃఖించుచూ నా బాధను నేనే దిగమ్రింగుచుంటిని. కాని, ఏనాడైననూ మీ సేవ చేయకుంటిని. స్వామీ! శ్రీగురునాథా! దేవదేవా! నన్ను ఈ సంసారసాగరమునుండి గట్టెక్కించుము ప్రభూ! మందమతినైన నేను మీ చరణకమలములను గుర్తించలేకపోయితిని. కేవలము మీరు నారాయణస్వరూపులే సుమా! అట్టి మీరే గురుమూర్తిగా భూతలమునందు అవతరించితిరి. సమస్త విశ్వమును తరింపజేయగల సమర్థులు మీరే! మానవవేషమున మీ త్రిమూర్తి స్వరూపమును మరుగుపరచితిరి. నేటికి మీ అనుగ్రహమువలన నా కళ్ళు తెరువబడినవి. గురునాథా! మీరు పరబ్రహ్మస్వరూపులే సుమా! కనులుండి కానలేని కబోదులెవ్వరూ మిమ్ములనెంతమాత్రము తెలుసుకొనలేరు. ప్రభూ! నేను మీకు దాసానుదాసుడను. భయంకరమైన ఈ సంసారసాగరము నుండి తరింపజేయుము. విశ్వపాలకుడవు. త్రిమూర్తిస్వరూపుడవు. నేను మీ కింకరుడను. నన్ను రక్షించుము. దేవా! ఉద్ధరించుము" అని అద్భుతమైన కవిత్వముతో నంది యను ఆ బ్రాహ్మణుడు శ్రీగురునాథుని అనేకవిధములుగా స్తోత్రము చేసెను.

ఇదంతయూ గమనించుచున్న జనులకు అతి విచిత్రముగా కన్పట్టసాగెను. వారిని ఉద్దేశించి నంది అను బ్రాహ్మణుడు ఇట్లు పలికెను-(96-109) **"ఓ జనులారా! మీరందరు నా మాటలను విందురుగాక! శ్రీగురుడు సాక్షాత్తూ పరబ్రహ్మయే. నేనెన్నియో పాపములను చేసితిని. కాని, శ్రీవారి దర్శనముతో అవన్నియునూ నశించిపోయెను. మీరందరూ గుర్వనుగ్రహమునకు పాత్రులైతిరి. అగ్ని స్పర్శచే క్షణములో దగ్ధమైపోయెడి గడ్డికుప్పవలె, గురుకృపను పొందినవారి పాపములు దగ్ధమైపోవును. గురుమహిమ అపారము, అనిర్వచనీయము. 'చరణం పవిత్రం వితతం పురాణం' అని శ్రీగురు చరణములను గురించి సమస్త వేదశాస్త్రములు ఘోషించుచున్నవి. శ్రీగురుచరణ సరోజములను సేవించవలెను. గురువు తప్ప మరొక దైవము లేనేలేదు. 'దేవుడే గురుదేవుడు'. లలాటముపైన బ్రహ్మదేవుడు రచించిన దుష్టాక్షరములు సైతము శ్రీగురుచరణములు తగిలిన వెంటనే అవి పూర్తిగా తుడుచుకొనిపోయి, శుభాక్షరములుగా మారగలవు. మన సమీపమునగల గొప్పనైన కృపానిధిని ఈ జనులందరునూ ఎందులకో గుర్తుపట్టుటలేదు. జనులారా! నా మాటను వినుడు. నృసింహ సరస్వతీ స్వామివారు కామధేనువు, కల్పవృక్షము వంటివారు. అందరూ ఆయనను భజించుడు, సేవించుడు. తద్వారా సమస్త సౌఖ్యములు, సకల జ్ఞానసంపదను పొంది తుదకు**

పరమపదమును చేరుకొందురు. ఇందులో ఇసుమంతయూ సందేహము అక్కరలేదు. ఎల్లరకునూ సుఖము ప్రాప్తించును. నా మాటలు చిరసత్యములు, ముమ్మాటికీ సత్యములు".(110-115)

ఈవిధంగా నంది చేసిన స్తోత్రమునకు శ్రీగురుమూర్తి మిగుల సంతోషించిరి. వెంటనే ఆతనిని నేటినుండి **'కవీశ్వరుడు'** అని పిలువుమని భక్తులను ఆజ్ఞాపించిరి. అంతేగాదు, నిశ్చయముగా నేను ఇతనికి **'కవి బసవరస'** అను నామ బిరుదమును ప్రసాదించుచుంటిని. కృపామూర్తియైన గురునాథుడు ఈవిధముగా జనులతో చెప్పుచుండగనే గురుభక్తితో పరవశించిపోయిన నందియను బ్రాహ్మణుడు శ్రీస్వామి వారి పాదపద్మయుగళమును పట్టుకొని సాష్టాంగవందనము చేసెను.

అంతట ఆతని మోకాటి వెనుకవైపు మిగిలియున్న శ్వేతకుష్ఠము వెంటనే నశించిపోయెను. అందులకు అతడు అంతులేని ఆనందమును పొందెను. నందియను ఆ విప్రుడు స్వామి చెంతనే నివసించి గురుశుశ్రూష చేయుచూ అచటనే ఉండిపోయెను" అని సిద్ధుడు నామధారకునితో ఈ నందియను బ్రాహ్మణుడే శ్రీగురునాథుడు పెట్టిన **'బసవరస'** అనగా "కవి బసవేశ్వరుడు" అను పేరుతో ప్రసిద్ధినొంది గురునాథునియొక్క కథలను, భజనలను మున్నగువాటిని రచించుచూ, నిరంతరము స్వామిని స్తుతించుచూ, గురుశుశ్రూషలో ముందువరుసలో నిలచి శ్రీగురునాథుని చరణసన్నిధిలోనే తన పూర్తి జీవితమును గడిపెను. (116-118)

మిగుల సంతోషాంతరంగుడైన నామధారకుడు సిద్ధమునితో పలికెను- "స్వామీ! నరహరి అను నామము గల రెండవ కవి గురునాథునకు శిష్యుడెట్లయ్యెను? ఆతడొక కవీశ్వరునిగా, భక్తునిగా ఎట్లు ప్రసిద్ధుడాయెను? అట్టి కథను సవివరముగా కృపతో నాకు సెలవీయగలరని కోరెను. గురుచరిత్రమును వినవలయునను మిక్కుటమైన కోరికతో ఉన్నాను ప్రభూ! నన్ను మన్నించి, నా కోరికను నెరవేర్చుమని" ప్రార్థించెను. తరువాతి కథ అత్యంత మనోహరముగా ఉండునని గురునామ స్మరణము కామధేనువుగా మారి సకలాభీష్టములు నెరవేర్చునని మహిమాన్వితమైన గురుచరిత్రను సరస్వతీ గంగాధరుడు గ్రంథస్థము చేసి మనకు అందించెను. (118-122)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "ద్విజ కుష్ఠనివారణము" అను నలుబది నాల్గవ అధ్యాయము ॥ 44 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 122; మొత్తము సంఖ్య : 6459 + 122 = 6581 ఓవీలు)

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

శ్రీ గురు చరిత్ర

నలుబది ఐదవ అధ్యాయము

నరహరి యను కవీశ్వరుడు తాను నిత్యము పూజించే కల్లేశ్వరుని యందు శ్రీగురుమూర్తిని దర్శించుట - గురుప్రభావమును గుర్తించిన నరహరి, గురునాథుని శరణుగోరి స్తుతించుట - శ్రీస్వామివారు ప్రసన్నులై నరహరిని తమ శిష్యునిగా స్వీకరించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునీశ్వరునకు నమస్కరించి ఇట్లనెను - “స్వామీ! వెనుకటి అధ్యాయమునందు గురుమూర్తి యొక్క అనుగ్రహము వలన ‘నంది’ యను బ్రాహ్మణుడు గొప్ప కవీశ్వరుడై స్వామివారికి శిష్యుడైనట్లుగా మీరు చెప్పియుంటిరి. అదేవిధముగా ఈ నంది వంటి మరియొక నరహరి యను కవీశ్వరుడు కూడా శ్రీగురుమూర్తి వద్ద యున్నట్లుగా నేను వినియుంటిని. వారెవరు? వారు గురుమూర్తికి ఏవిధముగ శిష్యులైనారు. అట్టి చరిత్రమును నా యందు దయయుంచి పూర్తిగా వినిపింపవలసినదని” ప్రార్థించెను. **శిష్యుని ప్రార్థనకు సంతసించిన సిద్ధమునీశ్వరుడు ఇట్లు పలికెను** - “నామధారకా! వినుము. నీవు కోరిన విధముగా శ్రీగురునాథుని వద్ద శిష్యునిగా చేరిన మరియొక కవీశ్వరుని గూర్చిన కథను ఇప్పుడు నీకు వివరించి చెప్పెదను. అత్యంత మధురముగా నుండెడి గురుచరితామృతమును కౌతుకముతో వినుటవలన మిగుల ఆశ్చర్యముతోపాటు జగద్గురువు యెడల కడు భక్తిభావము దృఢపడుచుండును. నేను చెప్పబోవు కథను సావధానముగా వినుము. శ్రీగురుమూర్తి గాణగాపురములో నివసించియున్నప్పుడు వారి అపారమైన ఖ్యాతి జగద్విఖ్యాతి నొందెను. నిత్యము వారి దర్శనార్థముగా దూరదూరదేశముల నుండి ఎందరెందరో భక్తజనులు వచ్చుచుండెడివారు. అందులో శ్రీవారికి శిష్యులైనవారు, భక్తులైనవారు ఎందరో కలరు. అట్టివారిలో నంది యను బ్రాహ్మణుడు గురుమూర్తి అనుగ్రహము వలన గొప్ప కవీశ్వరుడయ్యెనను కీర్తి అన్ని దేశములకు వ్యాపించెను. అతడు శ్రీగురునాథుని వర్ణించుచూ అపరిమితమైన కవిత్వమును చెప్పెను. అమృతోపమానమైన ఆతని కవిత్వమును లోకులందరూ భక్తిభావముతో నేర్చుకొని, పఠించుటవలన అతడు అన్ని దేశములలోనూ విఖ్యాతుడయ్యెను. *(1-5)*

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

ఇట్లుండగా ఒకనాడు హిప్పరగి అను గ్రామనివాసియగు ఒక భక్తుడు శ్రీవారి దర్శనార్థముగా గాణగాపురమునకు విచ్చేసెను. స్వామివారికి నమస్కరించి తమ గ్రామములో ఒక శుభకార్యము నిర్వహింప దలంచి, అందు నిమిత్తముగా గురుమూర్తిని తమ గ్రామమునకు విచ్చేయవలసినదని అనేకవిధములుగా ప్రార్థించెను. అందుకు గురునాథుడు అంగీకరించెను. వెంటనే ఆ భక్తుడు శ్రీస్వామి వారిని తమ గ్రామమునకు తీసుకొని వెళ్ళెను. ఆ భక్తుడు తమ గ్రామమునందు శ్రీగురునాథుని ఒక ఉత్తమమైన ఆసనమున కూర్చుండజేసి, షోడశోపచారములతో పూజించి గొప్ప మహోత్సవమును నిర్వహించెను. గ్రామ ప్రజలందరూ స్వామివారిని దర్శించుకొని, వారి అనుగ్రహమును పొంది కృతార్థులగుచుండిరి. అదే గ్రామమున కల్లేశ్వరుడను పేరుగల శివాలయము ఉండెను. అది అత్యంత జాగృతస్థానముగా ప్రసిద్ధినొందెను. అక్కడ కవీశ్వరుడైన ఒక ద్విజవరుడు ప్రతినిత్యము ఆ కల్లేశ్వరుని పూజించుచుండెడివాడు. అతనిపేరు 'నరహరి'. ఆతడొక గొప్ప మహాకవి. ఈశ్వరుని పూజించిన పిమ్మట నిత్యమూ ఆ కల్లేశ్వరుని వర్ణించుచూ రోజుకొక ఐదు కొత్త పద్యములను రచించి ఈశ్వరుని స్తుతించుచుండెడివాడు. కల్లేశ్వరుని తప్ప ఇతర దేవతలనెవరినీ అతడు స్మరింపకుండెను. కాని, నిశ్చలమైన చిత్తముతో, అనన్యమైన భక్తిభావముతో కల్లేశ్వరుని ఆరాధించుచుండెడివాడు. అయితే, ఆ గ్రామమునకు చెందిన కొందరు జనులు మరియు బ్రాహ్మణులు కలిసి నరహరి అను కవీశ్వరుని వద్దకు వెళ్ళిరి. "కవీశ్వరా! మన గ్రామమునకు గురుమూర్తి వచ్చియున్నారు. నీవు ఒక గొప్ప కవీశ్వరుడవు కదా! గురుమూర్తికి కవిత్వమన్న మిక్కిలి ప్రీతి. కావున, నీవు గురునాథుని గూర్చి వర్ణించుచూ ఏవేని కొన్ని పద్యములను రచించి వారిని స్తుతింపవలయునని" కోరిరి. **నరహరి యను ఆ కవీశ్వరుడు వారితో ఇట్లు పలికెను** – "నా నాలుకను మన గ్రామమునందు వెలసిన కల్లేశ్వరునకే అంకితమిచ్చితిని. ఆ కల్లేశ్వరుని తప్ప ఇతర దేవతలనెవరినీ నేను స్తుతింపను. ఇక మానవమాత్రుని గూర్చి నేను ఎట్లు స్తుతింపగలను? కావున, మీరు కోరిన విధముగా నేనాపనిని చేయలేనని" నిస్సంకోచముగ చెప్పెను. (6-12)

అనంతరము ఆనాడు నిత్యపూజ నిమిత్తముగా కల్లేశ్వరుని ఆలయమునకు వెళ్ళి అతడు శివపూజను పూర్తిచేసెను. పూజ పూర్తియైన పిమ్మట శివుని గూర్చి ప్రతినిత్యము కొత్తగా ఐదు పద్యములతో స్వామిని స్తుతించు అభ్యాసము గలవాడు. కాని, ఆనాటి పూజ పూర్తియగుచుండగనే అతనికి విపరీతమైన, నిలుపుకొనలేనంతటి మోహనిద్ర వచ్చి ఆ శివాలయమునందే నిద్రపోయెను. దేవాలయము నందు అట్లు నిద్రించుచుండగ అతనికొక స్వప్నము కలిగెను. ఆ స్వప్నమునందు తాను పూజించుచుండగా కల్లేశ్వరుడను లింగస్థానమునందు శ్రీగురుమూర్తి కూర్చొనియుండెను.

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

ఆయన గురుమూర్తికే పూజను చేయుచుండెను. ఆశ్చర్యముతో పరికించి చూడగా, లింగము కనిపించుటలేదు. ఈశ్వరుని లింగస్థానమునందు శ్రీగురునాథుడే స్పష్టముగా దృశ్యమానమగుచుండెను. **విస్మయముతో పూజించుచున్న ఈ నరహరిని ఉద్దేశించి అప్పుడా గురుమూర్తి ఇట్లు పలికెను** – “కవీశ్వరా! మానవులపై నీకు భక్తి యుండదు కదా! మరి నన్నెందులకు పూజించుచుంటివి” అని పలికి వారు అదృశ్యులైరి. షోడశోపచారములతో, అత్యంత భక్తిశ్రద్ధలతో తాను పూజించుచున్నట్లుగా వచ్చిన స్వప్నమునందు గురునాథుడు అదృశ్యమైన వెంటనే ఆ బ్రాహ్మణుడు మేల్కాంచెను. తనలోతాను విస్మయమునకు గురియయ్యెను. “నేను నిత్యము ఆరాధించే పరమశివుడే నృసింహ సరస్వతిగా గురుమూర్తి రూపమున అవతరించి వచ్చెను కదా! నేను ఆయనను నిరసించితిని. ధిక్కరించితిని. నేనొక పెద్ద అపరాధమునకు గురియైతిని” అని మిగుల బాధపడసాగెను. వెంటనే వారిని దర్శించుకొనవలయునను సంకల్పముతో శ్రీగురునాథుని సమీపమునకు వెళ్ళెను. (13–19)

వెంటనే వారి పాదపద్మములపై పడిపోయి సాష్టాంగవందనము నాచరించెను. లేచి **అంజలి ఘటించి ఇట్లు పలికెను** – “మహాత్మా! నేను అజ్ఞానిని. నన్ను కృపతో రక్షించుము. మీ నిజస్వరూపమును తెలుసుకొనలేక మానవమాత్రునిగా భావించితిని. మహానుభావా! ప్రాపంచిక మాయలో చిక్కుకొనిన నేను మూఢుడనై మిమ్ములను గుర్తించలేకపోయితిని. మీరు సాక్షాత్తూ శివస్వరూపులే. నేను నిత్యమూ ఆరాధించే కల్లేశ్వరులు మీరే” అని ఈనాడు నాకు నిశ్చయమయ్యెను. “జగద్గురూ! కర్పూరగౌరుడగు కల్లేశ్వరులు మీరే అని నాలో స్థిరపడినది. మీ చరణసరోజములను శరణుజొచ్చితిని. సమస్త విశ్వమునకు ఆధారము మీరే. శరణాగతులకు ఆశ్రయస్థానము మీరే. మీరే జగద్గురువులు. మీ చరణసరోజములయందలి అమృతమును పానము చేయుటకై ఇకమీదట నేనొక భ్రమరము వలె సంచరించెదను. అయ్యో! సమీపమున నిధి యుండగా, అడవుల వెంటబడి కట్టెపుల్లల కొరకు తిరుగుట యెందులకు? స్వయముగ కామధేనువే గృహమునకు తరలివచ్చినపుడు ఇక మాకు దారిద్ర్యమనునది ఎట్లుండును? పూర్వము ఎందరో ఋషులు అనేక కష్టనష్టములకోర్చి వేలాది సంవత్సరముల తరబడి తపస్సు చేసినప్పటికినీ మిమ్ములను పొందలేకపోయెడివారు. ఎట్టి జపతపానుష్ఠానములను చేయలేకపోయినప్పటికీ నాకు మహానిధి వంటి మీ దివ్యదర్శనమును ప్రసాదించితిరి. నా మనోరథము ఈడేరినది. నా పూజలన్ని ఫలించినవి. నిజముగా నేడు నా కల్లేశ్వర స్వామి నా యెడల ప్రసన్నుడయ్యెను అని నా మనసునందు నిర్ధారింపబడెను. సాక్షాత్తుగా కల్లేశ్వరుడు మీరే. ఇందెంతమాత్రము సంశయము లేదు. మీ దర్శనభాగ్యము లభించుట నా పురాకృత పుణ్య విశేష ఫలము. అప్రయత్నముగ నాకు లభించినది. నేను ధన్యుడను. కృతకృత్యుడను. కృపతో నన్ను రక్షించి కాపాడవలసినదని” గురునాథుని పాదపద్మములమీద పడెను.(20–27)

దయాళుడు, కృపామూర్తి యగు గురుమూర్తి ఆతనిని లేవదీసి ఇట్లు పలికెను– “ఏమయ్యా! నీవు నిత్యమూ మమ్ము నిందించుచుందువట. మరి ఈనాడు నీకింతటి భక్తి మామీద ఎట్లు కలిగెను? ఎందులకై మా వద్దకు వచ్చితివి. మేము మానవమాత్రులమే కదా” అనెను. **ఆ నరహరి శ్రీస్వామివారి ముందు చేతులు జోడించుకొని ఇట్లనుచుండెను–** “గురుమూర్తీ! అజ్ఞానములో చిక్కువడి మిమ్ములను దూషించితిని. మనుష్యభావన చేసితిని. కాని, నేను ప్రతినిత్యము కల్లేశ్వరస్వామివారిని పూజించువాడను. అట్టి పుణ్యఫలమువల్లనే నేడు నాలో జ్ఞానోదయమై మిమ్ములను దర్శించగలిగే భాగ్యము ఘటించెను. ఈ రోజు నేను నా స్వామిని పూజించుటకై వెళ్ళినప్పుడు లింగస్థానమున మిమ్ములనే దర్శించితిని. స్వప్నావస్థలో కూడా తద్దృశ్యమునే మరల దర్శించితిని. ఇప్పుడు మీ కృపావిశేషముచేత ప్రత్యక్షముగా మీ పవిత్రమైన శ్రీచరణ సరోజములను గాంచగలిగితిని. తద్వారా నా మనస్సు నిశ్చలమైనది. నేను నిత్యము పూజించుచుండెడి కల్లేశ్వరుని స్వరూపమే మీరని నిశ్చయముగ నేడు తేలిపోయెను. స్వామీ! మీ శరణుగోరి వచ్చితిని. నన్ను మీ శిష్యవర్గములో ఒకనిగా స్వీకరించవలసినదని” పదేపదే వేడుకొనుచూ, స్వామివారిని కడు గొప్పగా స్తుతించెను. అప్పటికప్పుడే తన కవిత్వధారతో అపారమైన స్తోత్రములను గానము చేసెను. స్వప్నమునందు గాంచినట్లుగా షోడశోపచార పూజను చేసి కవిత్వమును చెప్పెను. మానసికపూజా విధానము రచించి వ్యక్తపరచెను. (28–33)

అందుకు వెంటనే శ్రీగురునాథులు మిగుల సంతసించి అతనితో ఇట్లు పలికెను – **“జనులు స్వప్నదర్శనమునే నిజమనీ, ప్రత్యక్ష దర్శనమును స్వప్నముగనూ తలంచెదరు. కానీ, మేము ప్రత్యక్షముగా వున్నప్పటికినీ స్వప్నావస్థలో మమ్ములను దర్శించి గొప్ప కవిత్వమును చెప్పి మమ్ము స్తుతించిన శ్రేష్ఠ భక్తుడీతడు” అని అందరిముందు గురునాథుడు నరహరిని ప్రస్తుతించెను.** శిష్యులందరునూ వినునట్లుగా ఆ పద్యములను గురుమూర్తి పఠించి, అందరికి వినిపించి ఆ కవీశ్వరునకు నూతన వస్త్రములను బహూకరించెను. అంతట నరహరి అను ఆ బ్రాహ్మణుడు శ్రీగురుచరణములను ఆశ్రయించి, “మహానుభావా! నేను మీకు శిష్యుడనయ్యెదను. నన్ను తమ శిష్యునిగా అంగీకరించవలసినదని” ప్రార్థించెను. **అందులకు గురుమూర్తి అతనితో ఇట్లు పలికెను –** “నాయనా! నీవు నిత్యమూ శ్రద్ధతో కల్లేశ్వరుని పూజించుచుండుము. కల్లేశ్వరుని మించిన దైవము లేదు. అయితే, నేను గాణగాపురములో వున్నప్పటికినీ అవ్యక్తస్వరూపముతో కల్లేశ్వరుని సమక్షమున కూడా నిరంతరము నివసించుచుండెదను” అని చెప్పగా ఆ విప్రుడు వెంటనే స్వామివారితో, “మహాత్మా! ప్రత్యక్షముగా కట్టెదుట కనబడుచున్న చరణములను వదలుకొని, ప్రత్యక్షమగు దైవమైన మిమ్ములను వదలిపెట్టి, ఆ కల్లేశ్వరునే ఎందుకు పూజించవలెను. అక్కడ కూడా నేను మిమ్ములనే ప్రత్యక్షముగా దర్శించితిని కదా! మీరే కల్లేశ్వర స్వామివారు. త్రిమూర్త్యవతారస్వరూపులు. ఇది ముమ్మాటికీ సత్యము. ఇక మీ

చరణకమలములను వదలిపెట్టనుగాక వదలిపెట్టను" అని స్వామితో విన్నవించుచూ, అనేకవిధములుగా తనను శిష్యునిగా స్వీకరింపుమని పదేపదే వేడుకొనెను. అనంతరము గురునాథుడు అతనియందనుగ్రహించి తన శిష్యునిగా స్వీకరించెను. పిమ్మట గురుమూర్తితోపాటుగా అతడు గాణగాపురమునకు వచ్చి గురుమూర్తిని సేవించుచుండెను. శ్రీవారిని గూర్చి నరహరియను ఈ కవీశ్వరుడు అనేక స్తోత్రములను రచించి, స్తుతించుచూ, అచటనే ఉండిపోయెను.(34-39)

నామధారకా! శ్రీ గురుమూర్తి ఆస్థానమునందు నంది, నరహరి యను ఇరువురు కవీశ్వరులు ఉండిరి. వారు ప్రతిదినము కడు భక్తితో గురుమూర్తిని వర్ణించుచూ తమ కవితా పాటవముతో అనేక స్తోత్రములను రచించి వారిని స్తుతించుచుండిరి. శ్రీగురుమూర్తి ఎవరి యెడల కడు ప్రసన్నులయ్యెదరో, వారి గృహమునందు కల్పతరువే నిలిచియున్నట్లుండును. ఇక వారు ఫలములను గూర్చి చింతింపవలసిన పనియే లేదు" అని సిద్ధముని నామధారకునితో మరియొక కవీశ్వరుని గూర్చిన చక్కని కథను రసవంతముగా నిరూపించెను. దానినే సరస్వతీ గంగాధరుడు గ్రంథరూపమున ప్రకటించెను. (40-42)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "నరహరి కవీశ్వర వరప్రాప్తి" అను నలుబది ఐదవ అధ్యాయము ॥ 45 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 42; మొత్తము 6581 + 42 = 6623 ఓవీలు)

◆ ◆ ◆

భవపాశ వినాశన యోగిపతే కమలాయత లోచన ధీరమతే ।
వరసాధక పోషక వేదనిధే పరిపాలయ సద్గురు దత్తవిభో ॥
'శ్రీదత్తస్తుతి' - శ్రీ జి.వి.ఎల్.ఎస్. విద్యాసాగర శర్మగారి "శ్రీదత్తాత్రేయ సర్వస్వము" నుండి సేకరణ)

శ్రీ గురు చరిత్ర

నలుబది ఆరవ అధ్యాయము

దీపావళి పండుగ సందర్భంగా శిష్యుల కోరికను గురుమూర్తి మన్నించుట - దీపావళినాడు ఏడుగురు శిష్యుల గృహములలో మరియు స్థానికముగా గాణగాపురమునందలి మఠమునందు వెరసి ఎనిమిదిచోట్లలో ఏకముహూర్తమున శ్రీగురుదేవులు భిక్షను స్వీకరించుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

నామధారకుడు సిద్ధమునీంద్రునకు నమస్కరించి ఇట్లు ప్రశ్నించెను - "స్వామీ! శ్రీగురుచరిత్రమునందలి ఆ తరువాత జరిగిన కథ ఎట్టిది? దానిని కృపతో నాకు వివరించి చెప్పగలరని" ప్రార్థించెను. **అంతట సిద్ధమునీంద్రుడు తమ శిష్యుని యెడల కడు ప్రసన్నుడై ఇట్లు పలికెను** - "నామధారకా! నీవు గురుచరిత్రమును మిక్కిలి ప్రేమాదరములతో శ్రవణము చేయుచుంటివి. నీవు ఎల్లప్పుడూ సిరిసంపదలతో తులతూగుచుండెదవు. అంతేకాదు, పుత్ర, పౌత్రాభివృద్ధిని పొంది జీవితకాలమంతయూ సుఖసౌఖ్యములను అనుభవించెదవు. ఇప్పుడు గురునాథుని గూర్చిన ఒక విస్మయావహమైన గురులీలను వర్ణించి చెప్పెదను. శ్రద్ధగా వినగలుగువారు తప్పక పునీతులయ్యెదరు. (1-3)

శ్రీగురుదేవులు గాణగాపురమున నివసించుచుండు కాలమున ఒక సంవత్సరము దీపావళి పండుగ సమీపించెను. శ్రీగురునాథుని శిష్యులలో ఏడుగురు శిష్యులు ఈ సందర్భముగా శ్రీగురుమూర్తిని తమ ఇండ్లకు భిక్షకు దయచేయుమని ప్రార్థించిరి. శ్రీగురునాథుని యందు ఆ ఏడుగురి శిష్యులలో ఒకరికంటే మరొకరికి అత్యధికమైన భక్తి గలదు. గురుమూర్తికి మాత్రము అందరియందును సమభావమే యుండెను. ఈ ఏడుగురు శిష్యులు ఒకరిని మించి ఒకరు అత్యంత ప్రేమాదరములతో గురునాథుని పాదపద్మములపై పడి దీపావళి పండుగనాడు తమ తమ ఇండ్లకు రమ్మని గురుమూర్తిని ప్రార్థించిరి. ఈ ఏడుగురు శిష్యులు వేర్వేరుగా ఏడు గ్రామములకు చెందినవారగుటచే **గురుమూర్తి వారితో ఇట్లు పలికిరి** - "నేను ఒక్కడను. మీరు ఏడుగురు. ఒకే దినమున ఇందరి గృహములకు నేనెట్లు రాగలను? మీరే బాగుగా ఆలోచింపుడు. మేము శిష్యాధీనులము. కావున, మీలో ఎవరింటికి రావలయునో మీలో మీరు విచారించుకొని ఒక నిర్ణయమును చెప్పినచో, వారి ఇంటికి

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

మాత్రమే మేము రాగలము. కావున, ఎవరి ఇంటికి రావలయునో, మీలో మీరే నిర్ణయించుకొని చెప్పుడని" పలికిరి. అంతట ఏడుగురు శిష్యులు ఒకచోట చేరి గురుమూర్తి మా ఇంటికే రావలయును. వారిని రమ్మని ప్రార్థించి నేను తీసుకొనిపోయెదనని ఒకరు అనగా, మీకు మాత్రమే వారు గురువయ్యెదరా? మా ఇంటికి మాత్రము ఎందుకు రాకూడదు? లేదు, లేదు నేను మా ఇంటికే తీసుకొని పోయెదనని వేరొకడు; ఈవిధముగా తమలో తాము మా ఇంటికే అనగా మా ఇంటికే తీసుకొని పోయెదమని వారు పరస్పరము కలహించుకొనుచుండిరి. (4-8)

అంతట శ్రీగురుమూర్తి వారిని వారించి "ఒకరితో ఒకరు మీరెందుకు కలహించుకొనెదరు. మీ ఏడుగురకు నేను ఒక్కడనే గురువును. దీపావళినాడు ఎవరో ఒకరి ఇంటికి మేమే వచ్చెదము" అని చెప్పిరి. అంతట గురుమూర్తి మాటలను విని **అందరూ వినయముగా చేతులు జోడించి ప్రార్థించిరి-** "స్వామీ! తాము పక్షపాతము చూపించవద్దు. అందరూ మీకు సమానమే కదా! ఇందులో ఒకడు ధనవంతుడని, నిరుపేదయని, గొప్పవాడని, చిన్నవాడని, భేదభావమును చూపవద్దు సుమా! మా అందరినీ మీరు సమానముగా చూడుడు. ఒకవేళ మీరు మాలో న్యూనాధిక్య భావమును చూపించినయెడల మేము వెంటనే ప్రాణత్యాగమొనర్చెదమని" పలికిరి. స్వామీ! శ్రీకృష్ణపరమాత్ముడు విదురుని భక్తికి పరవశుడై దుర్యోధనుని విందును నిరాకరించి, నిరుపేదయైన విదురుని గృహమునకే వెళ్ళెను. అటులే మీరు వీరెక్కువ, వారు తక్కువ అని భావింపక మా అందరిని సమానభావముతో చూడవలసినది. మేమందరము మీ దాసులమే. ఎవరినీ ఉదాసీనమునకు గురిచేయవద్దు. అయితే, మీరు ఏమని అనుజ్ఞను ప్రసాదించెదరో మేము దానికే కట్టుబడి వుండెదము" అని ఆ ఏడుగురు శిష్యులు మిగుల ప్రాధేయపడి ప్రార్థించిరి. (9-14)

అంతట శ్రీగురుమూర్తి తమ శిష్యులందరినీ చూచి "నాయనలారా! నేను మీ ఇండ్లలోనికి వచ్చెదను. మీరెంతమాత్రము చింతింపవలదు" అని పలికిరి. అందుకు ఆ ఏడుగురు శిష్యులు స్వామివారితో - "స్వామీ! తాము వచ్చెదమని అందరికీ వాగ్దానము చేసినచో మేము విశ్వసించుట ఎట్లు?" అని సందేహించుచూ పలికిరి. అప్పుడు శ్రీగురుమూర్తి తనలో ఇట్లు తలపోసెను. ఈ అజ్ఞానులకు ఎంత చెప్పిననూ గ్రహింపరైరి. కావున, ఒక గమ్మత్తును రచించాలి అని భావించి ఒక్కొక్కరినీ విడివిడిగా పిలిపించి ఏకాంతముగా వారికి చెప్పవలసిన మాటను చెప్పవలెనని నిశ్చయించుకొనిరి. అనంతరము ఏడుగురు శిష్యులలో ఒకరిని తమ సమీపమునకు పిలిచి **అతని చెవిలో నెమ్మదిగా ఇట్లు చెప్పిరి-** "నాయనా! మేము మీ ఇంటికే వచ్చెదము. కాని, ఈ సంగతి మరెవ్వరితోనూ చెప్పవద్దు. ఇక నీవు నేరుగా మీ గ్రామమునకు వెళ్ళి తగిన ఏర్పాట్లు చేసుకొనుము" అని ఈవిధముగా ఏడుగురు శిష్యులతోనూ విడివిడిగా చెప్పి వారిని పంపించివేసెను. ప్రతివాడునూ

గురుమూర్తి తమ ఇంటికే రాగలడని నిశ్చయించుకొని సంబరపడుచూ ఒకరితోనొకరు సంప్రదించుకొనకుండా తమ తమ గ్రామములకు వెళ్ళిపోయిరి. దీపావళి రోజున గురుమూర్తి తమ ఇంటికి వచ్చును కావున, వారికి భిక్షా ప్రయత్నము చేసి తమ బంధుమిత్రులను ఆహ్వానించుకొని గురుమూర్తిని పూజించుటకు గాను తగు పుష్పఫలములు మొదలగు పూజాసంభారములను ఎవరికి వారు తమ తమ ఇండ్లలో సమకూర్చుకొనసాగిరి. శిష్యులను పంపించి గురుమూర్తి మఠమునందు ప్రవేశించిరి. (15-22)

ఇంతలో ఈ సంగతి తెలిసిన గ్రామమునందుగల **భక్తులందరూ మఠమునకు వచ్చి ఇట్లనిరి–**"స్వామీ! మమ్ములందరినీ వదలిపెట్టి మీరు పండుగరోజున గ్రామాంతరమునకు వెళ్ళవద్దు. దయతో మమ్మనుగ్రహింపవలెను. దేవా! పండుగరోజున మీరు వేరొకచోటునకు వెళ్ళవద్దు" అని దీనముగా ఆర్తితో ప్రార్థించిరి. **దయామయుడగు శ్రీగురుమూర్తి వారితో ఇట్లు పలికిరి –** "భక్తులారా! మీరు చింతించవద్దు. మేము ఇచటనే ఉండెదము. ఈ విషయమును మీవరకే ఉంచుకొనుడు. ఇతరులతో చెప్పవద్దు" అని చెప్పగా భక్తజనులందరూ ముదముతో తమతమ ఇండ్లకు వెళ్ళిపోయిరి.

ఇంతలో దీపావళి పండుగ రానే వచ్చినది. ఆనాటి త్రయోదశి రాత్రి గురుసన్నిధానమున మంగళస్నానము చేయుటకు గ్రామస్థులందరూ వచ్చిరి. అపార మహిమాన్వితుడైన నారాయణుడగు జగద్గురువు స్వయముగా గాణగాపురములో కొలువుదీరి యుండి కూడా తాము ఏడు రూపములను ధరించి ఏడు గ్రామములలోగల ఏడుగురు శిష్యుల ఇండ్లకు వెళ్ళినారు. అందరి గృహములలో పూజలందుకొని, అన్నిచోట్లలో భిక్షను స్వీకరించి తమ శిష్యులను, భక్తులను అమోఘముగా అనుగ్రహించినారు. అవ్యాజమైన ప్రేమమూర్తియగు శ్రీగురుమూర్తి ఇటు గాణగాపురములోని భక్తజనులను సంతోషపెట్టి, అటు తమకు అత్యంత ప్రీతిపాత్రులైన ఏడుగురు శిష్యులను, వారి వారి ఇండ్లలోగల కుటుంబసభ్యులను, వారి బంధుమిత్రులను అందరినీ ఏకముహూర్తములో ఎనిమిది రూపములను ధరించి మిగుల సంతోషపెట్టెను. తిరిగి ఎప్పటివలెనే గాణగాపురములో ఎవరికీ అంతుపట్టకుండా ఏకరూపముతో ప్రకటమైయుండిరి. (23-27)

కార్తికమాసము, పౌర్ణమినాటి దినమున దీపారాధన చేయుటకై భక్తులందరూ శ్రీగురునాథుని దర్శించుకొనుటకు గాణగాపురమునకు విచ్చేసిరి. వచ్చిన భక్తజనులందరూ శ్రీస్వామివారికి సాష్టాంగవందనమును ఆచరించుచుండిరి.

అనంతరము ఒకరితో ఒకరు కలిసినప్పుడు దీపావళినాడు మా ఇంటికి శ్రీగురునాథుడు వచ్చెనని, మా ఇంటికి కూడా వచ్చినారని మిగుల హర్షోల్లాసములతో చెప్పుకొనసాగిరి. అందులో ఒకరు మీరు చెప్పు మాట నిజము కాదు, మా ఇంటికి వచ్చిరి అనగా, కాదు మా

ఇంటికే వచ్చినారని వేరొకరు చెప్పుచుండిరి. ఇంతలో ప్రేమాదరములతో శిష్యులందరూ శ్రీగురునాథులకు సమర్పించిన వస్త్రములన్నియూ శ్రీగురుని వద్ద వుండుటను గమనించిరి. ఇక గ్రామస్థులందరూ మీ మాట అసత్యము. మా గురుడు స్థానిక మఠమునందే ఉండిరి. మేమందరమూ గురునాథులతో కలిసి దీపావళిని ఇచ్చటనే నిర్వహించుకొంటిమని పలికిరి. ఈవిధముగా భక్తజనులందరూ విస్మయమునకు లోనైరి. ఇంతలో వారిలో వారికే గురునాథుని మహిమ బోధపడి మిగుల అబ్బురమునకు గురియగుతూ **శ్రీగురుమూర్తిని గూర్చి స్తోత్రములు చేయసాగిరి** – "స్వామీ! నిజముగా మీరు త్రిమూర్త్యాత్మక స్వరూపులే. మీ మహిమ అపారమైనది. మీరు కేవలము శ్రీహరి అవతారస్వరూపులే. మహాత్మా! వేదమూర్తీ! శ్రీగురునాథా! మీ మహిమను మేమెంతమాత్రమూ గుర్తించమైతిమి. మీరు విశ్వవ్యాపకులు. త్రిమూర్తులేకమై అవతరించిన అవతార పురుషులు మీరు. దివ్యమైన శ్రీగురుచరణములను మేమేమని వర్ణించగలము" అని వారిని అనేకవిధములుగా స్తుతించి, మహదానంద భరితులైరి. అనంతరము మిగుల ప్రీతిగా గురుమూర్తి సమక్షమున దీపారాధనలొనర్చి బ్రాహ్మణ సమారాధనము నిర్వహించిరి. (28–35)

ఈవిధముగా గురుమూర్తియొక్క అంతులేని అపారమైన మహిమ భూమండలమంతయూ వ్యాపించెను. ఇట్టి శ్రీనృసింహసరస్వతీ స్వామివారి గురుమహిమను, వారి లీలలను సిద్ధమునీంద్రుడు నామధారకునితో చక్కగా విశదీకరించి చెప్పెనని గంగాధర సరస్వతి ఈవిధముగా ప్రకటించుచున్నారు– **"శ్రీనృసింహసరస్వతీ స్వామివారి అనంత మహిమ జగద్విఖ్యాతి నొందినది. తమ సమీపమున గురుమూర్తి కల్పతరువై యుండగా జనులందరూ కళ్లున్న కబోదులుగా, చెవులున్న బధిరులుగా మారి స్వామివారిని గుర్తింపలేకుండిరి. దైన్యవృత్తితో వ్యర్థముగా క్లేశములనొందుచుండిరి. కావున, "జనులారా! వినుడు. శ్రీగురుమూర్తిని తప్పక భజింపుడు. మీ సమస్త కోరికలు వెనువెంటనే నెరవేరును. అమృతసాగరము మనవద్దనుండగా మూర్ఖులమై ఉప్పునీటిని త్రాగి కష్టపడనేల? జ్ఞానవంతులారా! భక్తితో గురువును సేవించి కృతార్థులగుడు. జ్ఞానులైన భక్తజనులందరికి శ్రీగురునామమే అమృతపానము. కావున, అట్టి శ్రీగురువును కడు భక్తితో సేవించి కృతార్థులు కాగలరు. నేను గట్టిగా చాటింపు చేసి చెప్పుచున్నాడను. శ్రీగురుమూర్తి మానవమాత్రులు కారు. వారు కేవలము త్రిమూర్తి స్వరూపులే. ఇది వేదశాస్త్రసమ్మతమైనమాట. నేను ఎలుగెత్తి ఘోషించి చెప్పుచుంటిని. గురువును ఆశ్రయించకుండా మానవులకు వేరొక గతి లేనేలేదు. గురువు తప్ప వేరు గతి లేదని వేదశాస్త్రములన్నియూ నొక్కిచెప్పుచున్నవి. ఎవరు గురుమూర్తిని మానవుడని అందురో లేక, వారిని నిందించెదరో, వారు మరుజన్మలో సూకరములై జన్మించెదరు. నేను యథార్థమును చెప్పుచుంటిని. బాగుగా విచారించి మీ సద్గతిని గూర్చి మీరు విచారించుకొనుడు.** గురువు వినా సంసారమునుండి తరింపచేయువారు వేరొకరు లేనేలేరు. నిర్జలమైన సంసారమనెడు అరణ్యమునందు అమృతమువంటి

చలివేంద్రమును ఏర్పరచినారు. దానిని మీరందరూ బాగుగా తనివితీరా సేవించుడు. తద్వారా, అమరత్వమును పొందుడు. మీ ఇచ్ఛతో స్వేచ్ఛగా ఇవన్ని మాటలను మీరే వ్రాసితిరని నన్ను మీరందరూ అందురేమో. కాని, ఇది నా మాట కాదు. ఇది కల్పితము కాదు. వేదశాస్త్రములకు సమ్మతమైన మాటనే నేను చెప్పుచుంటిని. ఇది సత్యమని మీకు తోచినప్పుడే అంగీకరించుడు. త్రిమూర్తులే శ్రీగురునృసింహ సరస్వతిగా అవతరించి గాణగాపురములో నివసించుచుండిరి. ఇప్పుడచట వారు ప్రత్యక్షముగ నున్నారు. అచటికి ఎవరెవరు వెళ్ళుచుందురో, వారి వారి మనోభీష్టములన్నియు తృటిలో నెరవేరును. ప్రత్యక్షదైవమై ఈ మఠమునందు కొలువుదీరి యున్నారు. శంకించవలసిన పనిలేదు. అనుమానించుట తగదు. నేను మీ మేలు కోరి చెప్పుచుంటిని. హితకరమైన నా మాటలను పెడచెవిన పెట్టవద్దు. మీ చిత్తమునకు అంగీకారమని తోచినచో వెంటనే మీరు బయలుదేరి గాణగాపురమును చేరుకొనుడు. త్రిమూర్తిస్వరూపుడైన శ్రీగురుమూర్తిని సేవించుడు. పూజించుడు. మనోభీష్టములను నెరవేర్చుకొనుడు. గురుసేవ ద్వారా ఉత్తమమైన పరమపదమును పొందగలరు" అని గంగాధరసరస్వతి మనకు ఎంతో దయతో శ్రీగురుమహిమను గూర్చి గురుచరిత్రమను గ్రంథముద్వారా సుస్పష్టముగా బోధించిరి. (36-47)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు
శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "అష్టస్వరూప ధారణము" అను నలుబది ఆరవ అధ్యాయము ॥ 46 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 47; మొత్తము సంఖ్య : 6623 + 47 = 6670)

◆ ◆ ◆

దత్తేతి వర్ణయుగరూపక భాసమానౌ, ద్వంద్వ ప్రభావ రహితౌ గురుతత్త్వ సత్త్వౌ ।
స్వర్గాపవర్గఫలదౌ నిజబోధరూపౌ, శ్రీదత్తనాథ చరణౌ శరణం ప్రపద్యే ॥
(శ్రీదత్తనాథ ప్రపత్తి - శ్రీ జి.వి.యల్.ఎన్. విద్యాసాగరశర్మగారి "శ్రీదత్తాత్రేయ సర్వస్వము" నుండి సేకరణ.

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

శ్రీ గురు చరిత్ర

నలుబది ఏడవ అధ్యాయము

పర్వతేశ్వరుడను శూద్రభక్తుని కథ - శూద్రునికి గల మొక్కవోని గురుభక్తిని వర్ణించుట - గురువాక్యమును శిరసావహించుటచే శూద్రుని పొలమునందు కోసివేయబడిన పైరునుండి నూరురెట్లు అధికమైన పంట పండుట - శ్రీగురుమహిమా వైభవము నిరూపింపబడుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని నామధారకునితో చెప్పుచుండెను - "నామధారకా! శ్రీగురుమూర్తి గాణగాపురములో నివసించిన సమయమున వారి మహిమా ప్రభావము అపారముగా ఈ జగత్తునందంతటను విజృంభించి వ్యాపించెను. శ్రీగురుచరిత్రము పరమపవిత్రమైనది. గాణగాపురమున ఒకసారి ఒక అపూర్వమైన కథ ఘటించినది. దానిని ఇప్పుడు నీకు వివరించి చెప్పెదను. శ్రద్ధగా వినుము.

గాణగాపురమునందు ఒక శూద్రభక్తుడు ఉండెను. అతడు వ్యవసాయము చేసుకొని జీవించుచుండెను. అతని పేరు పర్వతేశ్వరుడు. అతని గురుభక్తి అమోఘమైనది. అతని పద్ధతిని నీకిప్పుడు వివరించెదను. ఏకాగ్రచిత్తముతో వినుము. అతడు మనోవాక్కాయ కర్మలతో శ్రీగురుమూర్తియందు మిక్కిలి భక్తినిష్ఠను కలిగియుండెను. అతని వ్యవసాయభూమి గాణగాపురమునుండి సంగమమునకు వెళ్ళు దారి మధ్యలో ఉండెను. శ్రీగురునాథుడు నిత్యమూ ఉదయముననే గాణగాపురము నందలి మఠము నుండి సంగమమునకు అనుష్ఠాన నిమిత్తముగా వెళ్ళుచున్నప్పుడు మార్గమధ్యమున ఆ శూద్రుడు తన పొలములో పనిచేసికొనుచుండెడివాడు. త్రోవగుండా వెళ్ళుచున్న శ్రీ గురుమూర్తిని చూచిన వెంటనే అతడు తన పొలము పనిని వదలిపెట్టి వెంటనే పరుగుపరుగున వచ్చి, సాష్టాంగవందనము చేసి, మారుమాట లేకుండా తిరిగి తన పనికి వెళ్ళిపోయెడివాడు. అటులనే మధ్యాహ్నము స్వామివారు తిరిగి మఠమునకు చేరుకొనునపుడు కూడా నియమముతో నిరీక్షించుచూ వారు త్రోవగుండా వచ్చుచున్న సమయమున వెంటనే పరుగెత్తుకొని వెళ్ళి ఆ శూద్రభక్తుడు తిరిగి సాష్టాంగవందనమును ఆచరించువాడు. అతడు నమస్కరించినపుడు శ్రీగురుదేవులుగాని, ఈ శూద్రభక్తుడుగాని మారుమాట పలుకకుండా మౌనముగా ఉండెడివారు. దినదినమునకు అతని భక్తి ప్రవర్ధమానమగుచుండెను. ఈవిధముగా కొన్ని ఏండ్ల కాలము గడచిపోయినది. (1-7)

ఒకనాడు ఆ శూద్రభక్తుడు గురుమూర్తికి సాష్టాంగవందనము చేసి, లేచి నిలుచుండగా **మిక్కిలి ప్రసన్నవదనుడైన శ్రీగురునాథుడు అతనితో**, "ఏమిరా! నాయనా! నీవు నిత్యము పని వదలిపెట్టి పరుగెత్తుకొని వచ్చి నాకు నమస్కరించుచుంటివి. అందుకు నీవు చాలా శ్రమ చెందుచున్నట్లుగా ఉన్నది. నీ మనసులో ఏమి కోరిక గలదు. సందేహము లేక నీ కోరికను నా ముందు వెల్లడించుము" అని పలికెను. వెంటనే శూద్రుడు చేతులు జోడించి, **అత్యంత వినయముతో** "స్వామీ! నా పొలములో పైరు పంటకు వచ్చుచున్నది. అట్టి పైరు బాగుగా ఫలించునట్లు ఆశీర్వదించుము" అని ప్రార్థించెను. అందుకు శ్రీగురుమూర్తి నవ్వి, అతనితో "నీ పొలములో ఈ సంవత్సరము ఏమి పంటను పండించుచుంటివి". అనగా **అతడిట్లు పలికెను**– "మహానుభావా! జొన్నపంటను వేసితిని. ఆ చేను బాగుగా వృద్ధియగుచున్నది. మీ ధర్మమా అంటూ ప్రతీయేటా పంట బాగుగా పండుచుండెను. నేను మీకు నిత్యము నమస్కరించుటవల్లనే ఇంతటి గొప్ప ఫలము లభించుచున్నదని నా నమ్మకము. స్వామీ! మీ అనుగ్రహము వలన మా కుటుంబ సభ్యులము కడుపారగా అన్నము తిని సుఖముగా జీవించుచుంటిమి. ఈ సంవత్సరము కూడా పంట చేను బాగుగానే వృద్ధియగుచున్నది. అయితే, స్వామీ! తమరు సర్వసములు. శూద్రుడను భేదభావము లేని మహానుభావులు. కావున, మీరొకమారు మా పంటపొలము వద్దకు వచ్చి, మీ అమృతదృష్టితో చూచి వెళ్ళవలసినది. వీడు దైన్యుడని, శూద్రుడని, ఉపేక్షించవద్దు సుమా!" అని హృదయపూర్వకముగ వేడుకొనెను. అతని ప్రార్థనమును అంగీకరించి శ్రీగురుమూర్తి వెంటనే అతని పొలము వద్దకు వెళ్ళి పంటచేనును తిలకించెను. **మిగుల సంతోషించి అతనితో ఇట్లు పలికెను** – "ఓరీ! నీవు వినగలనంటే నేనొక మాటను చెప్పెదను. నా మాటయందు విశ్వాసము నుంచి, అనుష్ఠించెదవా? నేను చెప్పినట్లుగా నీవు అత్యంత భక్తిభావముతో చేసెదనని అంగీకరించినచో, ఆ మాటను నీకు ఇప్పుడే చెప్పెదనని" పలికెను. వెంటనే ఆ శూద్రభక్తుడు "స్వామీ! మీ వాక్యమే మాకు శిరోధార్యము. గురునాథా! నాలో వేరొక భావము లేనేలేదు. కావున, ఎంతమాత్రము సంశయింపక చెప్పవలసినది" అని ప్రార్థించెను. **అందుకు గురుమూర్తి అతనితో ఇట్లు చెప్పుచుండెను**– "ఇప్పుడు మేము సంగమమునకు వెళ్ళుచుంటిమి. అచ్చట స్నానము ముగించుకొని మధ్యాహ్న సమయమునకు తిరిగి వచ్చెదము. ఈ లోపల నీ పొలములోగల పంటచేనును సాంతముగా కోసి వేయుము. మరొకమాట లేదు" అని చెప్పి శ్రీగురుమూర్తి సంగమమునకు వెళ్ళిపోయెను. ఆ శూద్రభక్తుడు తన మనసులో గురు వాక్యమును వేదవాక్యముగా భావించి, వారు చెప్పినటులనే సందేహించకుండా చేసివేయుదునని గట్టిగా నిశ్చయించుకొనెను. (8–17)

అంతట ఆ పొలము యొక్క అధికారి వద్దకు వెళ్ళి, "అయ్యా! నా పంటచేనును ఈనాడే కోసివేయుదును. నాకు అనుమతినీయగలరు. క్రిందటి యేడు వలెనే మామూలుగా మీకిచ్చు ధాన్యమును నేను తప్పక తమకు సమర్పించుకొందును" అని విన్నవించుకొనెను. ఆ అధికారి

అతనితో, “ఈ సంవత్సరము నీ పైరు చాలా ఎక్కువగా పెరిగినది. ఈ యేడు మరింత ఎక్కువ ధాన్యము పండగలదు. వెనుకటి మాదిరిగా ధాన్యమును ఇచ్చుటకు నేను అంగీకరించను” అని పలికెను. అప్పుడా శూద్రుడు ఆ పొలముయొక్క అధికారిని మిగుల బ్రతిమిలాడుకొని, “అయ్యా! గత సంవత్సరమునకంటే రెట్టింపు ధాన్యమును తప్పక ఇచ్చెదను” అని చెప్పెను. ఆ గ్రామాధికారి అంగీకరించి మిక్కిలి సంతోషించి ఆ శూద్రునితో ఒప్పందపత్రమును వ్రాయించుకొనెను. అనంతరము పైరును కోసివేయుటకు అనుమతించెను.

అప్పుడా శూద్రుడు గ్రామములోని కొందరు కూలీలను వెంట తీసికొనివెళ్ళి పంటచేను కోతను ప్రారంభించెను. ఇట్టి సంగతిని విని అతని భార్యాబిడ్డలు పరుగు, పరుగున వచ్చి వారించబోగా, వారలను అతడు రాళ్ళతో కొట్టి అచటినుండి వెడలగొట్టెను. తన భర్తకు పిచ్చెక్కినదని తన కుటుంబసభ్యులతో కలిసి **అతని భార్య గ్రామాధికారి వద్దకు వెళ్ళి తన గోడును ఇట్లు చెప్పుకొనెను**– “అయ్యా! ఈ సంవత్సరము పంటచేను బాగుగా పెరిగినది. పంట పండే సమయమున మూర్ఖుడై నా భర్త పైరునంతయూ కోసివేయుచుండెను. మేమాతనిని వారించబోగా రాళ్ళతో కొట్టుచుండెను. ఆ సన్న్యాసి, మాటలను పట్టుకొని పంటచేనంతా కోసివేసెను. మాకు తిండిగింజలు కూడా కరువైపోవునేమో! మరి కొద్దిదినములలో చేతికందే ధాన్యము వ్యర్థమైపోవుచుండెను” అని దీనముగా విన్నవించుకొనెను. **అంతట ఆ అధికారి పలికెను** – “ఇప్పుడే మీ పంటను ఎందుకు కోయుచుండెను. క్రిందటి యేడు కంటే రెట్టింపు ధాన్యము నిచ్చెదనని అతడు ఇంతకుముందే ఒప్పందపత్రమును వ్రాసి ఇచ్చిపోయెను కదా!” అని అనెను. వెంటనే అతడు పైరు కోయవద్దని కబురు పంపించెను. ఎవరు ఎంత చెప్పిననూ ఆ శూద్రుడు వినిపించుకొనలేదు. ఒకవేళ ఆ అధికారికి నేను ధాన్యము ఈయలేననే భయము ఉన్నచో, పాతరలో దాచిపెట్టిన ధాన్యమును ఇచ్చెదను, భయపడవద్దని సమాధానము చెప్పెను. అధికారి మనుషులు తిరిగి వెళ్ళి, మీ మాటను మేము ఆ శూద్రునితో చెప్పితిమి. అందుకు సమాధానముగా ఆతడు చెప్పిన మాట మాకు ఆశ్చర్యముగా ఉన్నది. అదేమనగా,

ఒకవేళ మీ అధికారికి భయమనిపించినచో ఇప్పుడే మా గృహమునందు దాచిపెట్టిన ధాన్యమును ఇవ్వగలను. లేదా, అతని ఇంటిముందు నా పశువులను కట్టివేయుదును. ఒప్పంద పత్రమును కూడా వ్రాసి ఇచ్చితిని కదా! ఇక సందేహమెందులకు?’ అని చెప్పెను. “అనవసరమైన ఈ చింత మనకెందులకు? అతని పాతరలో కావలసినంత ధాన్యము ఉన్నది కదా!” అని ఆ అధికారి తన వారితో పలికెను. ఇంత జరిగినప్పటికినీ ఎవరి మాటనూ పట్టించుకొనకుండా **అతడు తన భార్యతో ఇట్లనెను** – “నీవు భయపడవద్దు. గురుమూర్తి మానవుడు కాదు సుమా! అతడు శివస్వరూపుడు. వారి మాటయే మనకు ప్రమాణము. వారిని నమ్మవలయును. మనకు నష్టమెప్పుడునూ వాటిల్లదు గాక

వాటిల్లదు" అని ధైర్యమును చెప్పెను. అతని పొలములో పెరిగిన పైరంతయూ కోసివేయబడెను. శ్రీగురునాథుడు తిరిగి వచ్చు మార్గమునందు శూద్రభక్తుడు నిలబడి స్వామివారికోసమై ఎదురుచూచుచుండెను. (18-31)

శ్రీగురుమూర్తి వచ్చుచుండుటను గాంచి, **వెంటనే ఆ భక్తుడు ఎదురుగా వెళ్ళి వారికి శిరసాష్టాంగవందనమును చేసి ఇట్లు పలికెను–** "అయ్యా! మీరు చెప్పినటుల పంటచేనునంతయునూ కోసివేసితిని. అదుగో! చూడుము స్వామీ!" అని వారికి చూపించెను. అంతట గురువుగారు శూద్రునివైపు చూచి, "ఓరీ! ఎంత పని చేసితివి? నీవెంతటి వెఱ్ఱివాడవురా? నేను ఊరకే పరిహాసమునకు పలికితిని. వ్యర్థముగా పైరునంతయూ ఎందులకు కోయించితివి" అనెను. అతడు వెంటనే, "స్వామీ! మీ నోటినుండి వచ్చిన వాక్యమే నాకు ప్రమాణము. మీ మాటలు మాకు శిరోధార్యము. మీ ఆజ్ఞయే మా పాలిట కామధేనువు" అని, భయముగాని, విచారముగాని ఎంతమాత్రమునూ లేక మిక్కిలి సంతోషవదనముతో అతడు చెప్పుచుండుటను చూచి, వాని మనోదారుఢ్యమునకు, దృఢమైన భక్తిప్రపత్తికి గురునాథుడు మిక్కిలి సంతసించి, **సంప్రీతుడై ప్రసన్నవదనముతో అతనిని చూచి, ఇట్లనెను –** "ఓరీ! చింతించకుము. నీ నిశ్చయమే నిజమగును. నీకు గొప్ప ఫలము వెంటనే లభించునుగాక" అని పలికి, శ్రీగురునాథులు మఠమునకు వెళ్ళిపోయిరి. అనంతరము శూద్రుడు తన ఇంటికిచేరుకొనెను. (32-35)

ఇంటిలోని భార్యాబిడ్డలందరూ రోదించుచుండిరి. "అయ్యో! భగవంతుడా! నోటికి అందవలసిన కూడు పాడైపోయినది" అని విలపింపసాగిరి. వారి ఇంటిలో ఆక్రందనలు మిన్నుముట్టసాగెను. ఇట్టి విషయమును స్పష్టముగా తెలియుటకై ఇరుగుపొరుగువారు, గ్రామములోని మరికొందరు ఇంటిముందు గుమికూడిరి. **శూద్రుడు వారందరినీ ఓదార్చి, ఇట్లు నుడివెను –** "మీరేమి చింతపడవలదు. హాయిగా ఉండవలసినది. **గురువాక్యమును విననివారలు, గురుమహిమను తెలియనివారలు మూర్ఖులు. వారి మాటలు కామధేనువు వంటివి. ఒక్కొక్కదానికి వెయ్యిరెట్లు అధికముగా నీకే ఫలించునని గురుమూర్తి చెప్పిరి. గురుకృపకు పాత్రుడైనవాడు ఏనాడూ నష్టపడజాలదు. నాకు అట్టి దృఢమైన నమ్మకము కలదు. మనకు ఎటువంటి హాని వాటిల్లదు. ఆయనను మీరు నరుడని భావించుచుంటిరి. కానీ, వారు ఖచ్చితముగ ఈశ్వరుడే. వారు మనకట్లు చెప్పుటలో ఏదో ఒక దేవరహస్యము దాగియుండును. దానిని మనము గ్రహించజాలమైతిమి. గురుకృపను పొందినవారికి దైన్యమనునది ఎట్లుండును? మనకు నిధి దొరికినది. శ్రీగురుసన్నిధి దొరికినది**" అని శూద్రుడు నిశ్చయాత్మకముగా పలికి, తన ఇంటిముందు గుమిగూడిన ఇరుగుపొరుగువారిని, గ్రామస్థులను మీమీ ఇండ్లకు వెళ్ళుడు, సుఖముగా ఉండుడని సమాధానపరచి అందరినీ పంపివేసెను. తన భార్యాపుత్రులను అనేకవిధములుగా ఓదార్చి, మిగుల సంతోషముతో, ఆప్తులతోడను, బంధువులతోడను ఇదేవిధముగా చెప్పి సమాధానపరచెను. అందరునూ మౌనము వహించిరి. (36-42)

ఇట్లుండగా ఎనిమిది రోజులు గడిచిపోయినవి. ఒకనాడు అకస్మాత్తుగా ఉధృతమైన గాలివాన వచ్చి, ఈదురుగాలులు వీచి గ్రామములోని పంటలన్నియూ పాడైపోయెను. అకాలమున మూలా నక్షత్రమునందు, వర్షాలు కురిసి, ఆ ప్రాంతములోని పంటలన్నియూ పూర్తిగా ధ్వంసమైపోయినవి. దుష్కాలము దాపురించి గ్రామములోని ఏ పొలమునందు కూడా పంటచేను అంటూ లేకుండా పూర్తిగా పాడై పోయినవి. కానీ, విచిత్రమేమనగా, శూద్రుని పొలములో అంతకుముందే కోసివేయబడినందున అతని పంటచేను పాడు కాలేదు. పైగా వర్షానంతరము అతని జొన్నచేను మొదళ్లనుండి అనేక అంకురములు ఉద్భవించినవి. ఒక్కొక్క మొదలునుండి పదకొండేసి చొప్పున అంకురములు పుట్టుకొని వచ్చినవి. పంటచేను దృఢముగా పెరిగి, అత్యధిక ఫలవంతమైనది. అతని పొలమంతయూ పైరుతో క్రిక్కిరిసి నేత్రానందముగ ఉండెను. అప్పుడా శూద్రుని భార్య తమ పొలమును చూడవచ్చి, పైరు సమృద్ధిగా పెరిగియున్నందులకు మిగుల సంతోషించి క్షేత్రదేవతను పూజించెను. మహదానందభరితురాలైన అతని భార్య, తన భర్త చరణములను పట్టుకొని, నమస్కరించి, కనులనుండి కన్నీరు కారుచుండగా, **చేతులు జోడించి ఇట్లనెను**– "స్వామీ! నన్ను క్షమించుము" అని కరుణార్ద్రపూరితమైన మాటలతో ప్రార్థించెను. అజ్ఞానబురదలో కూరుకొనిపోయిన నేను నీ వాస్తవిక స్థితిని ఎంతమాత్రమూ గ్రహింపజాలనైతిని. శ్రీగురుడేమిటి? ఆయన ఎంతటివాడు? అని అన్యాయముగ నిందించితిని. ప్రాణేశ్వరా! నన్ను క్షమించుము" అని తన భర్తను అనేకవిధములుగా వేడుకొనెను. చేసిన తప్పిదమునకు క్షమాపణము కోరెను. తన క్షేత్రమునందు క్షేత్రదేవతతో పాటుగా పాండవులను పూజించి(1) శ్రీగురుమూర్తి దర్శనమునకై వెళ్ళవలయునని భార్యాభర్తలిరువురూ నిశ్చయించుకొనిరి. (42–49)

పూజాసామగ్రిని సిద్ధపరచుకొని, శ్రీగురునాథుని పూజించుటకై వారివద్దకు వెళ్ళగానే స్వామివారు వారిని చూచి "ఏమిటి విశేషము" అని ప్రశ్నించిరి. "శివమునీ! మీకు జయము. జయము" అంటూ **వారిరువురూ వారిని స్తోత్రము చేయసాగిరి**– "గురుదేవా! మీరే మా కులదైవము. మీరు కామధేనువు వంటివారు. మీ వచనామృతము మాకు చింతామణి వంటిది. దాని మహిమతో మా కోరికలు నెరవేరినవి. మీరే మాకు శరణ్యము. మీ శరణుజొచ్చితిమి. భక్తవత్సలుడను బిరుదము మీకు కలదని వింటిమి. అది మా విషయమున ప్రత్యక్షముగా నిరూపించితిరి. నేడు మేము దానిననుభవించి అఖండమైన ఆనందమును పొందుచుంటిమి" అని స్తోత్రము చేయుచూ, వారి దివ్యమైన పాదపద్మములను స్పృశించి సాష్టాంగవందనము చేసిరి. కడు భక్తితో ఆ శూద్ర స్త్రీ రకరకముల హారతులను సిద్ధపరచి, స్వామివారికి నీరాజనసేవను

---

1. పాండవులు అశ్వమేధయాగమును నిర్వహించినప్పుడు శ్రీకృష్ణుడు వారికొక వరమును ప్రసాదించెను. అదేమనగా - "ఏ రైతు తమ పొలమునందు పాండవులను పూజించునో, అతని పంట అత్యధికముగా ఫలించును". ఆనాటి నుండి రైతులు పొలములోని పంటకుప్పల, పంటచేనులవద్ద పంచపాండవులను స్థాపించి పూజించుట ప్రారంభమైనది. ఈ సంప్రదాయము ఇప్పటికీ చాలా చోట్లలో ఆచరింపబడుచున్నది. (కథాకల్పతరువు నుండి గ్రహింపబడినది).

సమర్పించెను. వారి భక్తిప్రపత్తులకు గురుమూర్తి కడు సంప్రీతుడై, "నాయనా! ఇక మీ ఇంటిలో అఖండలక్ష్మి తాండవించగలదు" అని అభయపూర్వకముగ ఆశీర్వదించెను. ఆ శూద్రుడు గురువాజ్ఞను గైకొని భార్యతోపాటుగా తిరిగి తన నివాసమునకు చేరుకొనెను. కొంతకాలమునకు జొన్నపైరు పంటకు వచ్చి, ప్రతి సంవత్సరమునకంటే వందశాతము అధికముగా ఫలించెను. అప్పుడా శూద్రుడు, తన క్షేత్రము యొక్క అధికారి వద్దకు వెళ్ళి, "అయ్యా! అందరి పైర్లు ఈ యేడు నష్టమైపోయెను గదా! కానీ, మా పొలమునందు గడచిన సంవత్సరమునకంటె వందరెట్లు ఎక్కువగా పంట పండెను. నేను మీకు వెనుకటికంటె రెట్టింపు ధాన్యమునిచ్చెదనని ఒప్పందపత్రమును వ్రాసి ఇచ్చితిని. మీకునూ ఈ యేడు అధికముగ నష్టము వాటిల్లినది. కావున, నాకు పండిన పంటలో సగభాగము మీకు ఇచ్చెదను. మీరేమాత్రము సందేహింపవద్దు. నేను మిగుల సంతోషముతో సగభాగమిచ్చుటకు సిద్ధపడితిని" అని చెప్పెను. (50–59□)

అందులకు ఆ అధికారి నుడివెను– "అధర్మము కూడదు కదా! ధర్మమునకు హాని కలిగించుట నేరమగును. నీపై గల అపరిమితమైన గురుకృపవలన నీకు లభించిన లాభమును నీవే అనుభవించుము. మాకు ఈయవలసినంత మాత్రమే ఇచ్చిన చాలును" అని చెప్పగా శూద్రుడు సంతోషించి అధికారికి ఇవ్వవలసిన ధాన్యమునిచ్చెను. మిగిలిన ధాన్యములో చాలా భాగము బ్రాహ్మణులకు, సాధువులకు, పంట నష్టపోయిన తన తోటివారలకు పంచిపెట్టెను. అందరునూ శూద్రుని ఔదార్యమునకు మెచ్చుకొని, సంతసించిరి. ఆ శూద్రుడు, అతని భార్యాబిడ్డలు నిరంతరము గురుస్మరణ చేయుచూ సుఖసంతోషములతో తమ జీవనమును గడిపిరి. (59□–61)

కావున, "నామధారకా! శ్రీగురుచరిత్ర యొక్క మహిమ ఎంత గొప్పదో చూడుము . ఎవరైతే దృఢమైన భక్తితో గురువును ఆరాధించెదరో, వారి గృహమునందు దైన్యము ఉండనే ఉండదు" అని ఈ కథను సిద్ధముని నామధారకునకు చెప్పిన విధముగా, సరస్వతీ గంగాధరుడు మనకందరకు తెలియజేయుచూ– "శ్రీగురుమూర్తిని కడు భక్తిభావముతో సేవించినవారికి సర్వాభీష్టములు నెరవేరును. వారి గృహమున లక్ష్మీదేవి అఖండముగ తాండవించును" అని నిశ్చయముగా ప్రకటించెను. (62–63)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ–నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున భక్తికాండమునందు "శూద్రవరప్రదానము" అను నలుబది ఏడవ అధ్యాయము ॥ 47 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 63; మొత్తము సంఖ్య : 6670 + 63 = 6733 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

నలుబది ఎనిమిదవ అధ్యాయము

శ్రీగురుమూర్తి తమ శిష్యులకు గాణగాపురమునందలి భీమా అమరజా సంగమ తీర్థ మాహాత్మ్యమును వివరించి చెప్పుట - శ్రీస్వామివారి పూర్వాశ్రమ సోదరియగు రత్నాబాయికి సోకిన శ్వేతకుష్ఠు వ్యాధిని నివర్తింపజేయుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యోత్తముడైన నామధారకుడు సిద్ధమునీశ్వరుని పాదపద్మములకు శిరస్సాష్టాంగవందనము చేసెను. **పిమ్మట అంజలి ఘటించి కదు భక్తిభావముతో ఇట్లు విన్నవించెను** - "గురుదేవా! త్రిమూర్తులే మాయామానుషవేషమును ధరించి, నృసింహసరస్వతీ స్వామియను పేరుతో ఈ లోకమున అవతరించిరి. అట్టి స్వామివారు ఈ భూమండలమునందు ఎన్నియో ప్రసిద్ధ క్షేత్రములుండగా వాటినన్నింటినీ కాదని, కేవలము గాణగాపురమునే ఏల యెంచుకొనిరి? అచ్చోటనే వారెందులకు నివసించిరి? ఈ క్షేత్రము యొక్క మహిమను పూర్తిగా వర్ణించి చెప్పగలరని" ప్రార్థించెను. శిష్యుని మాటలకు సిద్ధముని మిక్కిలి సంతోషభరితుడై ఇట్లు చెప్పుచుండెను. **శ్రోతలందరూ ప్రశాంతచిత్తముతో వినగలరు**- "వత్సా! నామధారకా! వినుము. (1-5)

గురుమూర్తి గాణగాపురమునందు నివసించుచున్న సమయమున ఒకమారు ఆశ్వయుజమాసమునందు కృష్ణపక్షమున చతుర్దశి తిథినాడు దీపావళి పర్వము సంప్రాప్తమయ్యెను. **అప్పుడు గురునాథులు తమ శిష్యులందరినీ పిలిపించి ఇట్లు నుడివిరి** - "ఈనాడు త్రిస్థలిలో అనగా కాశీ, గయ, ప్రయాగలయందు స్నానము చేయుటకు వెళ్ళవలయును. కావున, మీరందరూ తమ తమ పుత్ర, పుత్రికా, పౌత్ర, కళత్ర, మిత్ర బంధు సమేతముగా వెళ్ళుటకై బయలుదేరగలరని" ఆదేశించిరి. అప్పుడా శిష్యులందరు గురుమూర్తితో "అయ్యా! తమ ఆజ్ఞ ప్రకారముగా శీఘ్రముగా ప్రయాణసన్నాహములు చేసెదము" అని చెప్పిరి. **అందులకు శ్రీ గురుమూర్తి నవ్వుచూ వారితో తిరిగి ఇట్లనిరి** - "నాయనలారా! నా మాట వినుడు. కాశీ, గయ, ప్రయాగలకై అంతదూరము వెళ్ళవలసిన పనిలేదు. అందుకు ప్రత్యేకముగా సిద్ధము కావలసిన పని అవసరము లేదు. ఆ దివ్యక్షేత్రములన్నియూ మన గ్రామ సమీపముననే కలవు. వాటిని నేను మీకు దర్శింపజేసెదను. మీరందరూ కలిసి నన్ను అనుసరించి

నా వెంట రాగలరు" అని చెప్పెను. అనంతరము ఆనాటి పర్వకాలమునందు శిష్యులందరినీ తమవెంట తీసికొని గురుమూర్తి భీమా, అమరజా సంగమమునకు చేరుకొనెను. మిక్కిలి హర్షోల్లాసములతో శ్రీగురుమూర్తి తమ శిష్యసమేతముగా అమరజా సంగమమునందు స్నానమొనర్చిరి. (6–9)

స్నానానంతరము శ్రీగురుమూర్తి శిష్యులతో ఇట్లు వివరించి చెప్పసాగిరి – "శిష్యోత్తములారా! వినుడు. సంగమక్షేత్రము యొక్క మహిమ అపారమైనది. అది వర్ణింపనలవికానిది. ఇచటి షట్కూలమను మధ్యప్రదేశము ప్రయాగ క్షేత్రరాజముతో సమానమైనది. ఇచట స్నానము చేయుటవలన ప్రయాగతీర్థరాజమునందు స్నానము చేసిన ఫలము లభించును. మరొక విశేషమేమనగా, ఇచట గల భీమానది మరింత మహిమ గలిగినది. ఈ సంగమమున భీమానది ఉత్తరవాహినియై ప్రవహించుచుండుటవలన దాని మహిమను వర్ణించి చెప్పుటకు ఎవరికినీ సాధ్యము కానిపని. ఇక అమరజాసంగమము మనోహరమైనది. ఈ భీమ మరియు అమరజా అను ఉభయనదులు నిశ్చయముగ గంగ, యమునలే అని గమనించగలరు. ఈ రెండునూ ఉత్తరవాహినులుగా ప్రవహించుట మరింత విశేషము. ఇచట స్నానమొనర్చుటవలన కాశీ స్నానమునకంటే శతగుణాధిక పుణ్యము లభించును. ఈ క్షేత్రమునందు అష్టతీర్థములు కలవు. వాటియొక్క మహిమను వివరించి చెప్పుచున్నాను. ఏకాగ్రచిత్తముతో వినుడు" అని శ్రీగురునాథుడు శిష్యులతో పలికెను. (10–13)

అంతట గురుమూర్తి మాటలు వినిన భక్తజనులందరూ చేతులు జోడించుకొని ఇట్లు ప్రశ్నించిరి – "స్వామీ! మహానుభావా! ఈ నదికి అమరజా అను పేరు ఎట్లు వచ్చెను? ఇది ఎచట ఉద్భవించినది?" అని ప్రశ్నించిరి. వారి ప్రశ్నకు కడు సంప్రీతుడైన గురుమూర్తి శిష్యులతో **అమరజానది ప్రభావమును గూర్చి ఇట్లు చెప్పసాగెను** – "శిష్యులారా! చాలా చక్కని మంచి ప్రశ్న నడిగితిరి. జాలంధర పురాణమునందు దీనికి సంబంధించిన ఒక కథ కలదు. దానినే మీకిప్పుడు చెప్పుచుంటిని. అట్టి కథను వినవలసినదని యిట్లు చెప్పసాగెను–

పూర్వము జాలంధరుడు అను ఒక రాక్షసుడుండెను. అతడు ఈ పృథ్విపై గల రాజులందరినీ జయించి స్వర్గలోకముపై దండెత్తెను. దేవతలందరినీ జయించెను. దేవేంద్రుని పరాభవించెను. అప్పుడు దేవతలకు, దైత్యులకు యుద్ధము జరిగెను. సురవరులెందరో మరణించిరి. ఇంద్రుడు తప్పించుకొని పారిపోయి పరమేశ్వరుని శరణుజొచ్చెను. ఇక జాలంధరుడు స్వర్గలోకమును స్వాధీనపరచుకొనెను. **ఇంద్రుడు ఈశ్వరునితో ఇట్లు చెప్పెను**– "ఈశ్వరా! వినుము. దైత్యులు దేవతలను సంహరించుచుండిరి. జాలంధరుడను రాక్షసుడు స్వర్గలోకమును ముట్టడించి మమ్ములను తరిమివేసెను. వెంటనే తగిన ప్రతీకారమొనర్చి మీ భక్తులైన మమ్ములను రక్షింపవలసినది" అని ప్రార్థించెను.

అంతేకాదు, "పరమేశ్వరా! దేవతలు దైత్యులను సంహరించినపుడు వారి రక్తపుచుక్కలు నేలపై పడుచుండెను. ఆ రక్తపు బిందువులనుండి అపరిమితమైన సంఖ్యలో రాక్షసులు పుట్టుచుండిరి. స్వర్గ, మర్త్య, పాతాళలోకములన్నియూ దైత్యులతో నిండిపోవుచుండెను. దేవతలందరూ మరణించుచుండిరి. మీ శరణుగోరి మమ్ము రక్షించుటకై నేను మీ చరణసన్నిధికి విచ్చేసితిని. దయతో మమ్ము రక్షింపుము" అని ఇంద్రుడు వేడుకొనెను, అతని మాటలను వినిన శివుడు మండిపడి అత్యంత కోపోద్రిక్తుడై దైత్యులను సంహరించుటకు బయలుదేరెను. **అంతలో ఇంద్రుడు ఈశ్వరునితో ఇట్లు పలికెను** – "స్వామీ! దైత్యులను మీరు తప్పక సంహరించెదరు. కానీ, ముందుగా మరణించిన దేవతలను బ్రతికించుటకై తాము అనుగ్రహింపవలెనని" కోరెను. అందుకు శివుడు సంతోషించి అమృతబీజములను ఉచ్చరించి సంజీవినీ ఉదకము కలిగిన పాత్రను ఇంద్రునకు ఇచ్చెను. ఈ కలశమును తీసుకొనివెళ్ళి ఇందలి ఉదకమును వారిపై ప్రోక్షించుమని చెప్పెను. అంతట ఇంద్రుడు సంతోషాంతరంగుడై ఆ సంజీవినీ ఉదకము కలిగిన కలశమును తీసికొనివెళ్ళి దేవతలపై ప్రోక్షించెను. వారందరూ నిద్రనుండి లేచిన విధముగా జీవించిరి. అయితే, ఇంద్రుడు ఈ సంజీవినీ ఉదకము కలిగిన కలశపాత్రను తీసుకొని వెళ్ళుచుండగా అనుకోకుండా కలశములోని కొన్ని బిందువులు జారి ఇచటి భూమిమీద పడిపోయెను. అట్టి బిందువులలో నుండి ఈ నది ఉద్భవించి ప్రవహింపసాగెను. అందుకే దీనికి **'అమరజా'** అను పేరు ప్రఖ్యాతినొందెను. కావున, ఈ అమరజానదిలో భక్తితో స్నానమొనర్చువారికి మహామృత్యువు యొక్క భయము వుండదు. ఇక అపమృత్యుభయమనునది ఎట్లుండును? వారు శతాయుష్మంతులయ్యెదరు. వారిని ఎట్టి రోగములూ పీడింపవు. అపస్మారాది మహారోగములు తొలగిపోవును. బ్రహ్మహత్యాది పాతకములు నశించును. **'అమృతనది'** అను పేరు ఈ నదికే గలదని గ్రహింపుము. ఇంతటి మహిమాన్వితమైన అమృతనది అను పేరుగల అమరజానది, భీమానదితో సంగమించుటవలన ఈ తీర్థము ప్రయాగలోగల త్రివేణీ సంగమముగా మారెను. ఈ సంగమమునందు కార్తిక, మాఘమాసాదులలో భక్తిశ్రద్ధలతో ఎవరు స్నానము చేయుదురో, వారికి ఇహలోకమునందు సమస్త సౌఖ్యములు లభించి, పరలోకమందు మోక్షము సిద్ధించును.(14-30)

సూర్యచంద్ర గ్రహణములయందు, సంక్రమణ, అమావాస్య మున్నగు పర్వకాలములయందు, సోమవతీ అమావాస్యయందు, పవిత్ర ఏకాదశీ తిథియందు స్నానమొనర్చుటవలన అనంతపుణ్యరాశి లభించితీరును. పర్వకాలములయందే కాక, నిత్యమూ ఇక్కడ స్నానము చేయువారు సకల పాపములనుండి విడివడి, శతాయుష్మంతులై అఖండలక్ష్మీ సంపన్నులయ్యెదరు. ఈ సంగమ స్థలముయొక్క మహిమ

అమోఘమైనది. అనంతరము ఇచట అత్యంత విశేషమైన మరొక తీర్థము కలదు. అది 'మనోరథ తీర్థము'. దానికెదురుగా అశ్వత్థము కలదు. ఈ తీర్థమునందు స్నానమొనర్చుటవలన సమస్త మనోరథములు ఈడేరును. ఇక **ఈ అశ్వత్థము కల్పవృక్షమే కాని, మరొకటి కానేరదు. ఈ అశ్వత్థము అత్యంత ప్రభావాన్వితమైనది. ఇక్కడ సంకల్పించిన కార్యములు నిశ్చయముగ ఫలించును. దీని సముఖమున నదీస్నానము చేసి, అశ్వత్థపూజ చేయవలెను. దీనిని సేవించువారల సమస్త మనోరథములు తప్పక నెరవేరును. ఈ అశ్వత్థవృక్ష మూలమునందే నేను ఎల్లప్పుడూ నివసించి యుండెదను. నా మాట నమ్ముడు. అంతేగాక, ఇచట గరుత్మంతుడు (గరుడపక్షి) మనకు దర్శనమిచ్చుచుండును.** (31-38)

ఇట్టి కారణములను అనుసరించి అశ్వత్థవృక్షము ఎంతటి మహిమగలదో గమనింపవలెను. నిజమునకు ఇది కలియుగ కల్పవృక్షమే. కావున, కల్పవృక్షమగు అశ్వత్థవృక్ష పూజ చేసిన పిమ్మట, శివదర్శనమునకై వెళ్ళవలెను. ఇక్కడ ముక్కంటి దేవరయగు శివుడు సంగమేశ్వరుడను పేరుతో ప్రసిద్ధుడయ్యెను. అట్టి సంగమేశ్వరుని దర్శించి కడు భక్తిభావముతో ఆయనను పూజించవలెను. ఈ సంగమేశ్వరుడు శ్రీశైలమల్లికార్జుననితో సమానుడని భావింపవలెను. ఆయనను పూజించిన పిమ్మట ఈశ్వరునికి ప్రదక్షిణమును ఆచరింపవలెను. దీనిని '**చండీప్రదక్షిణమ**'ని అందురు. ఆ చండీ ప్రదక్షిణ విధానమును ఇప్పుడు మీకు వివరించెదను. సావధానముగా వినుడు. ముందుగా నందికేశ్వరునకు నమస్కరించవలెను. అనంతరము చండీశ్వరుని వద్దకు వెళ్ళి ఆయనకు నమస్కరించిన పిమ్మట, నందికేశ్వరునకు నమస్కరించి, ఆతని కుడిప్రక్కనుండి ప్రదక్షిణము చేసి సోమసూత్రము వద్దకు చేరవలెను. అచట ఈశ్వరునకు నమస్కరించి తిరిగి వెంటనే నందీశ్వరునకు నమస్కరించి మరల చండీశ్వరుని వద్దకు వెళ్ళి ఆయనకు నమస్కరించి, మరల సోమసూత్రమువద్దకు వెళ్ళి నమస్కరింపవలెను. ఈవిధముగా చేయుటచే ఒక ప్రదక్షిణము పూర్తియగును. ఈ రీతిగా మూడుమార్లు ప్రదక్షిణము చేసిన వారికి గొప్ప పుణ్యము సిద్ధించును. శివప్రదక్షిణమును పూర్తిచేసిన పిమ్మట, నందీశ్వరుని వద్దకు వెళ్ళి వామహస్తముతో నంది వృషణములను స్పృశించి కుడిచేతి తర్జనీ అంగుష్ఠములను అనగా చూపుడు మరియు బొటనవ్రేలును ఆయన రెండు శృంగములపై నుంచి శృంగముల మధ్యభాగము నుండి పరమేశ్వరుని దర్శింపవలెను. ఈ ప్రకారముగా దర్శించువాడు ఇంద్రునితో సమానుడగును. అతనికి ధనధాన్యసంపదలు లభించును. అఖండలక్ష్మీ సంపన్నులై పుత్ర, పౌత్రాభివృద్ధి కలుగును.(39-45)

సంగమేశ్వరుని పూజించిన పిమ్మట '**వారణాశి తీర్థము**'నందు స్నానమొనర్చవలెను. దీనికి అరక్రోసు దూరమున నాగేశ్వరగ్రామము గలదు. ఈ వారణాశి తీర్థము ఆ గ్రామమునుండియే ఉద్భవించినది. దీనికొక ఇతిహాసము కలదు. ఇదేదో కల్పితకథ కాదు. నిజముగా జరిగిన

చరిత్ర. దానిని చెప్పెదను వినుడు. భారద్వాజస గోత్రోద్భవుడగు ఒక బ్రాహ్మణుడుండెను. అతడు గొప్ప ఈశ్వరభక్తుడు. కొంతకాలమునకు ఆ బ్రాహ్మణుడు వైరాగ్యసంపన్నుడై సర్వసంగపరిత్యాగము చేసి ఈశ్వరుని గూర్చి తపస్సు చేసెను. అతని తపస్సునకు మెచ్చి సదాశివుడు ప్రత్యక్షమయ్యెను. నాటినుండి అతనియెడల ప్రసన్నుడైన పరమేశ్వరుడు ఎల్లప్పుడూ ఆతని దృష్టికి గోచరమగుచుండెడివాడు. అప్పుడా విప్రుడు అఖండ ఆనందభరితుడై అవ్యక్తమైన అనుభూతికి లోనై పరవశుడై లోకమున సంచరించుచుండెడివాడు. లోకమునకు ఆ బ్రాహ్మణుడు మహావిరాగిగా ఒక పిచ్చివానివలె గోచరించెడివాడు. జనులు ఆతనిని పిచ్చివానిగా తలంచి మిగుల నిందించెడివారు. అజ్ఞానులు, బ్రహ్మవేత్తయొక్క మహిమను ఎంతమాత్రమూ తెలిసికొనజాలరు కదా! అందుకే అతనిని ఉన్మత్తునిగా గ్రహించుట సహజము. అతనికి ఇద్దరు సోదరులుండిరి. వారిలో ఒకని పేరు ఈశ్వరుడు, రెండవవాని పేరు పాండురంగేశ్వరుడు. ఒకమారు విరాగియైన ఈ బ్రాహ్మణుడు సంభారములను మూటగట్టుకొని తన సోదరులతో కాశీకి వెళ్ళుచూ, ముందుగా ఈ సంగమమునకు చేరుకొనిరి. తన వెంట తెచ్చిన సంభారములను ఒక ప్రక్కన ఉంచి, సంగమమున స్నానము చేసి తీరముననే కూర్చొనియుండెను. **ఆ బ్రహ్మజ్ఞానియగు బ్రాహ్మణుడు సోదరులతో పలికెను** – ఇక మనము కాశీకి వెళ్ళవలసిన పనిలేదు. విశ్వేశ్వరుడు ఇచటనే ఉన్నాడు. కావలసినచో మీకు వెంటనే వారిని దర్శింపజేసెదను. అనగా వారి సోదరులతోపాటు అచట చేరిన జనులందరూ విస్తుపోయిరి. జనులందరూ మిగుల కష్టపడి కాశీకి వెళ్ళుచున్నారు. కాశీవిశ్వనాథుడు ఇచటనే దర్శనమిచ్చుచుండగా అనవసరమైన శ్రమ పడుట ఎందులకు? అని అతడు అత్యంత హర్షోల్లాసములతో ప్రకటించెను. అనంతరము ఆ బ్రాహ్మణుడు సంగమమునందు స్నానము చేసి, ధ్యానస్థుడు కాగానే వారి ముందుకు విశ్వనాథుడుప్రత్యక్షముగా వచ్చి నిలిచెను. (46–56)

వెంటనే ఆ బ్రహ్మజ్ఞాని ఇట్లు పలికెను – "స్వామీ! ఇచట మాకు శాశ్వతమైన కాశీ ఏర్పడవలెను. నిరంతరము ఇచటనే మాకు విశ్వేశ్వరుని దర్శనము లభింపవలెను. అట్టి వరమును ప్రసాదించుమని" వైరాగ్యసంపన్నుడైన బ్రహ్మజ్ఞానియగు ఆ బ్రాహ్మణుడు మహాదేవుని పాదపద్మములను పట్టుకొని ప్రార్థించెను. అమాయకచక్రవర్తియగు పరమేశ్వరుడు ఆతని ఔన్నత్యమునకు ప్రసన్నుడై అత్యంత ప్రీతితో వెంటనే వరమును ప్రసాదించెను. తత్క్షణమే అచట మణికర్ణికా కుండము ఏర్పడి కాశీక్షేత్రము దర్శనమిచ్చెను. అట్టి కుండమునుండి కాశీవిశ్వనాథునిమూర్తి బయటకు వచ్చి దర్శనమిచ్చుచుండెను. అది నదికి ఉత్తరదిశగా ఉద్భవించెను. ఆ కుండములోనుండి భాగీరథివలె నీరు ఉద్భవించి ప్రవహింపసాగెను. అంతేకాదు, కాశీలోగల చిహ్నములన్నియునూ అచట ఉన్నవారందరికీ ప్రత్యక్షముగా కనిపింపసాగెను. భీమానది

సంగమమునందు అత్యంత ఉత్తమోత్తమమైన కాశీతీర్థము ఏర్పడెను. అప్పుడాతని సోదరులు అతనిని మహాజ్ఞానిగా, మనస్ఫూర్తిగా ఒక బ్రహ్మవేత్తగా గుర్తించి అతడు చెప్పిన మాటలను పాటించిరి. **అంతట ఆ బ్రాహ్మణుడు తన సోదరులతో ఇట్లు చెప్పెను** – "ఇకనుండి మన వంశములోని వారెవ్వరునూ కాశీకి వెళ్ళవలసిన పనిలేదు. దీనినే కాశీగా భావింపవలెను. నన్ను మీరందరూ పిచ్చివాడని పలుకుచుంటిరి. కానీ, ఆ విశ్వనాథుడు నన్ను 'గోసావి' అని పిలిచెను. మీ సోదరులిరువురూ ఆరాధ్యులయ్యెదరు. కావున, మీరిరువురూ ఇచటనుండి నేరుగా పండరీపురమునకు వెళ్ళి అచటి పాండురంగస్వామిని నిరంతరము పూజింపుడు. తద్వారా, మీరు ఆరాధ్యులను పేరుతో ప్రసిద్ధులయ్యెదరు. ప్రతి సంవత్సరము కాశీయాత్రకోసమై మీరు గాణగాపురమునకే విచ్చేయుడు. ఈ గాణగాపురమే మనకు కాశీక్షేత్రము. ఇది విశేషమైన తీర్థముగా మీరు విశ్వసింపుడని" తన సోదరులతో ఆ బ్రాహ్మణుడు చెప్పెను అని శ్రీగురునాథుడు తన శిష్యులతో, ఇతర భక్తులతో ఈ కథను వివరించెను, ఈవిధముగా సంగమస్థలమునందు కాశీతీర్థము ప్రకటమైనది. కావున, దీనిని ప్రత్యక్షమైన కాశీయని విశ్వసింపవలెను. సంశయింపవలదు" అని గురునాథుడు స్పష్టముగా తెలిపెను. గురుమూర్తి మాటలను విని అచట చేరిన ద్విజులు, శిష్యులు, ఇతర జనులు సైతము వెంటనే స్నానములను ముగించుకొని దానాదులను పూర్తిచేసి గురుని దర్శనార్థమై తిరిగి వచ్చిరని సిద్ధుడు నామధారకునితో చెప్పుచుండెను. నిప్పురవ్వ సోకినంతనే ఎండుగడ్డి కాలిపోయినట్లుగా స్నానమాత్రమువల్లనే సమస్తపాపములు నశింపచేసెడి పాపవినాశతీర్థమును అత్యంత కృపామూర్తియైన, శ్రీగురునాథుడు వారందరికీ సంగమస్థలమునందే దర్శింపచేసెను.(57–68)

గురునాథుడు శిష్యసమేతముగా పాపవినాశన తీర్థమునకు వచ్చుచుండగా వారియొక్క పూర్వాశ్రమ సోదరియగు రత్నాబాయి అనునామె అనేక పూర్వజన్మ పాపములతో కఠినమైన ప్రారబ్ధమును అనుభవించుచూ గురుమూర్తియొక్క మహిమను విని వారి దర్శనముద్వారా తాను పాపవిముక్తిని పొందవలెనని తలంచి వారికెదురుగా వచ్చి నమస్కరించెను. "నీవు నా పూర్వాశ్రమమునందలి సోదరివే. కానీ, నీ యందు గొప్ప గొప్ప దోషములున్నవి. వాటినన్నింటినీ గుర్తుకు తెచ్చుకొమ్మని" గురుమూర్తి పలికిరి. వారి మాటలను విని వెంటనే **ఆయన పాదములమీద పడి** "స్వామీ! నేను అజ్ఞానురాలను. మూఢురాలిని. మీరు విశ్వవ్యాపకులు. జగదాత్మ స్వరూపులు. జ్ఞానజ్యోతి స్వరూపులు. నేను పూర్వజన్మలో ఏమి పాపము ఆచరించితినో, అది ఎట్లు తొలగిపోవునో, దయతో వివరముగా చెప్పవలసినదని" ప్రార్థించెను. **అంతట శ్రీగురుమూర్తి ఆమెతో ఇట్లు చెప్పుచుండెను** – పూర్వజన్మలో నీవు, తెలియక ఐదు పిల్లులను చంపివేసితివి. అప్పుడు మీ ఇంటిలో ఒక పిల్లి గర్భిణియై ఉండెను.

ఒకనాడది నీళ్ల కాగులో ప్రసవించెను. ఆ కాగులో దానికి ఐదు పిల్లికూనలు కలిగెను. ఒకనాడు నీవు చీకటిలో తెలియక ఆ పాత్రలోనికి చూడకుండా అందులో నీరు పోసి పొయ్యిమీద పెట్టి నీళ్ళను కాచితివి. అందువలన ఆ పిల్లికూనలు మరణించెను. అట్టి మరికొన్ని దోషములు కూడా నీయందు కలవు. అట్టి పూర్వజన్మ దోషముయొక్క ప్రభావమువలన నీకు శ్వేతకుష్ఠువ్యాధి ప్రాప్తించినది" అని గురునాథుడు చెప్పెను. స్వామివారి మాటలను విని ఆమె మిగుల దుఃఖించుచూ **వెంటనే శ్రీగురుమూర్తి చరణసరోజములను పట్టుకొని నమస్కరించి ఇట్లనెను**- "శ్రీగురుమూర్తీ! నేను పరమపాపిని. తమరు కృపచూపి నన్ను రక్షించవలసినది. తమ దర్శనభాగ్యముచే నా పాపము నశించునని నమ్మి మీ చెంతకు చేరితిని. సమస్తపాపరాశి వారణాశి తీర్థమందు స్నానము చేయుటవలన తొలగిపోవును. కానీ, అంతదూరము వెళ్ళకుండా మీ పాదదర్శనము చేసినంతలోనే మహాపాపములు పటాపంచలగును నమ్మికతో నేను మీ శ్రీచరణముల దర్శనమునకై వచ్చితిని" అని ఆమె దుఃఖించుచూ, కరుణాపూరిత వచనములను పలుకుచూ ప్రార్థించెను. (69-77)

అంతట శ్రీగురునాథుడు ఆమెతో ఇట్లనెను - "ఒకవేళ నీ రోగము ఇప్పుడు నశించినచో, తిరిగి ముందుజన్మలో అనుభవింపవలసి వచ్చును. అందుకు సిద్ధమేనా? నీవు విచారించి చెప్పుమనెను". **ఆ రత్నాబాయి ఇట్లు పలికెను** - "స్వామీ! ఎన్నియో జన్మలనెత్తి విసిగిపోయితిని. మీ దర్శనము కలిగిన పిమ్మట ఇక నాకు మరల జన్మమెక్కడిది? ఇది చివరిజన్మగా ముక్తి లభించుటకొరకే మీ దర్శనభాగ్యమునకై నేను వచ్చితిని. అందుకే మీ దర్శనము నాకు లభించినది. ఇక్కడికిక జన్మలు చాలును. ఈ జన్మలోనే సమస్త పాపరాశిని అనుభవించెదను. తిరిగి నాకు జన్మ లేకుండా చేయుడని", స్వామి చరణములపై పడి ప్రార్థించినది. కరుణామయుడైన గురుమూర్తి ఆమె ఆర్తికి కరిగిపోయి, **కృపతో ఆమెను చూసి, ఇట్లు నుడివెను** - "అమ్మా! నీవు వెంటనే పాపవినాశ తీర్థమునకు వెళ్ళి స్నానము చేయుము. అక్కడి స్నానమాత్రముచేత నీ కుష్ఠురోగము నివారణమగును. అచట నిత్యమూ స్నానము చేయుము. తద్వారా ఏడేడుజన్మల పాపము సమసిపోవును. ఇది నిశ్చయము. శంకించవలదు" అని చెప్పిరి. **అంతట సిద్ధమునీశ్వరుడు నామధారకునితో వచించెను** - "నామధారకా! నేను స్వయముగా నా కళ్ళారా చూచితిని. స్వామివారి పూర్వాశ్రమ సోదరియగు రత్నాబాయి మూడురాత్రులు పాపవినాశన తీర్థమందు స్నానము చేసిన పిమ్మట, ఆమె కుష్ఠువ్యాధి పూర్తిగా నశించిపోయినది. అట్టి ప్రఖ్యాతమైన, ప్రసిద్ధమైన, మహిమాన్వితమైన తీర్థమది. దానిపేరే **'పాపవినాశని'**. అచట స్నానము చేసిన భక్తులందరకూ సప్తజన్మల పాపములు పటాపంచలైపోవుట తథ్యము. అట్టి పావనమైన తీర్థమహిమను గాంచి రత్నాబాయి

మిక్కిలి సంతసించి, ఆ తీర్థసన్నిధిలోనే ఒక చిన్న మఠమును నిర్మించుకొని అచటనే నివసించినది. తన జీవితకాల మంతయునూ అచటనే గడిపినది" అని **సిద్ధముని నామధారకునితో చెప్పుచుండెను.** (78-85)

అనంతరము శ్రీగురుమూర్తి తన వెంటగల వారందరికీ 'కోటి తీర్థము'ను చూపించెను. అచట స్నానమాత్రముతోనే పాపములు పటాపంచలగును. జంబూద్వీపములో ఎన్ని తీర్థములు గలవో అవన్నియునూ ఈ కోటి తీర్థమునందు కలవని, దీనికి అపరిమితమైన మహిమ గలదని గురుమూర్తి వారికి వివరించి చెప్పెను. సూర్యచంద్ర గ్రహణములయందు, సంక్రాంతి పర్వదివసములయందు, అమావాస్య, పౌర్ణిమ, ప్రతిపద తిథులయందు ఈ కోటి తీర్థమందు స్నానము చేయవలెను. దీని తీరమున గోదానము చేసినచో కోటి గుణిత గోవుల దానము చేసిన ఫలము లభించును. ఈ తీర్థమునందు ఏ ఒక్క దానము చేసిననూ దానికి కోటి గుణిత దానములుచేసిన ఫలము లభింపగలదు. కావున, ఈ కోటితీర్థమునందు తమతమ శక్త్యనుసారముగా దానములు చేయవలెను" అని చెప్పెను. పిమ్మట గురునాథుడు వారందరినీ తీసుకొని 'రుద్రపాద తీర్థము' వద్దకు చేరెను. ఇది గయాతీర్థముతో సమానమైన ఫలము ఇవ్వగలదని చెప్పెను. ఇచటి కథ వినోదాత్మకముగా ఉండుననిరి. గయలో చేయవలసిన కృత్యములన్నియునూ ఇచట చేయవచ్చునని పలికిరి. రుద్రపాదతీర్థస్నానముతో కోటి జన్మముల పాపములు నశించిపోవును. అనంతరము 'చక్రతీర్థము'నకు వచ్చిరి. అచటగల కేశవుని దేవాలయమును చూపించిరి. చక్రతీర్థమునందు స్నానమొనర్చి, కేశవదేవుని దర్శించినవారికి మహత్తరమైన జ్ఞానము లభించునని అత్యధికమైన పుణ్యాలపంట పండగలదని వివరించి చెప్పిరి. ద్వారకతో సమానమైన ఈ తీర్థమునందు అస్థికలు నిమజ్జనము చేసినవారు చక్రాంకితులయ్యెదరు. ఇచట స్నానము చేసిన పిమ్మట కేశవదేవుని చరణములు పూజించుటచే, ద్వారకలో చేసిన దానికంటే నాలుగురెట్ల అధిక పుణ్యము లభించునని వివరించి చెప్పిరి. శ్రీగురునాథుని మాటలు విని అందరూ చక్రతీర్థమందు స్నానదానముల నొనర్చిరి. ఆ తర్వాత మన్మథతీర్థమునకు వెళ్ళిరి. గ్రామమునకు తూర్పువైపున కల్లేశ్వరుడు గలడు. అది గోకర్ణక్షేత్రముతో సమానమైనదని చెప్పెను. 'మన్మథతీర్థము'నందు స్నానమొనర్చి కల్లేశ్వరుని పూజించుటవలన తమ తమ వంశములకు చెందిన వారు పుత్రపౌత్రాభివృద్ధిని పొంది అష్టైశ్వర్యములతో తులతూగుచుండెదరు. శ్రావణమాసమునందు స్వామికి అఖండ అభిషేకములు చేయవలెను. కార్తిక మాసమందు దీపారాధన చేయవలెను. తద్వారా అనంతపుణ్యరాశి లభించును" అని శ్రీగురునాథుడు అష్టతీర్థ మహిమలను విస్తరించి భక్తులందరికీ చెప్పగా, అందరూ అత్యంత ఆనందోల్లాసములను అనుభవించిరి. (86-100)

భక్తులందరునూ సంగమస్థానమున గల ఈ తీర్థమహిమలు మనకెంతమాత్రమూ తెలియవుగదా! స్వామి కృపతో నిరూపించుటవలన మనమీనాడు పునీతులమైతిమి. సమీపమున మహత్తరమైన తీర్థములుండగా యాత్రలకై దూరదేశమునకు వెళ్ళుటెందులకు? స్నానమాత్రముతో మనమందరము పవిత్రులమయ్యెదము గాక! అని అందరూ గురునాథుని స్మరణతో స్నానదానాదికములను ముగించుకొనిరి. అష్టతీర్థములను గురించి శిష్యులకు, బ్రాహ్మణులకు, ఇతర భక్తులందరికీ విస్తరించి తెలియజేసిన పిమ్మట శ్రీగురునాథుడు మఠమునకు తిరిగి వచ్చిరి. మహదానందము వెల్లివిరియగా మఠమునందు భక్తులందరూ కలిసి సమారాధనము చేసిరి" అని సిద్ధుడు నామధారకునితో తీర్థమహిమను గూర్చి శ్రీగురుడు మాకీవిధముగా చెప్పెను. దానినే తిరిగి నీకు నేను చెప్పితినని సిద్ధుడు పలికెను. ఆ గురుశిష్యుల సంవాదమును అనుసరించి గాణగాపురము యొక్క క్షేత్రమును, అచటి తీర్థములయొక్క మహిమను గ్రహించి, క్షేత్రదర్శనమును, తీర్థస్నానదానాదికములను మీరందరూ భక్తితో ఆచరించి సంసారసాగరమునుండి తరింపవలసినదని సరస్వతీ గంగాధరుడు మనకు ఈ అధ్యాయమునందు చక్కగా వ్యక్తపరచెను.(101-105)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు
శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున భక్తికాండమునందు
"అమరజా సంగమము, గంధర్వపురమునందలి తీర్థమహిమా నిరూపణము" అను నలుబది ఎనిమిదవ అధ్యాయము ॥ 48 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 105; మొత్తము సంఖ్య : 6733 + 105 = 6838 ఓవీలు)

◆ ◆ ◆

నమామి గురుమూర్తిం తం తాపత్రయ హారం హరిమ్ ।
ఆనందమయ మాత్మానం నవభక్త్యా సుఖప్రదమ్ ॥

(శ్రీవాసుదేవానంద సరస్వతీ ప్రణీతం ఔదుంబర పాదుకా స్తోత్రమ్ - శ్లో - 7.)

శ్రీ గురు చరిత్ర

నలుబది తొమ్మిదవ అధ్యాయము

గుర్వనుగ్రహమును పొందుట యెట్లు? అని నామధారకుడు సిద్ధమునీశ్వరుని ప్రార్థించుట - అందుకు సమాధానముగా సిద్ధముని "పార్వతీ పరమేశ్వరుల సంవాదాత్మకమైన శ్రీగురుగీత"ను నామధారకునకు వినిపించుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యరత్నమగు నామధారకుడు, సిద్ధమునీశ్వరుని పాదపంకజముల యందు తన శిరమునుంచి చక్కగా సాష్టాంగవందనము చేసెను. **అనంతరము వినయభావముతో శిరము వంచి అంజలి ఘటించి ఇట్లు విన్నవించెను** - "సిద్ధమునీంద్రా! మీకు జయము, జయము. తమరు రాజయోగులు, బ్రహ్మజ్ఞానులు, కృపాసాగరులు. శ్రీగురుమూర్తీ! తమరు ఇంతవరకు శ్రీగురుచరిత్రమును నాకు కళ్ళకు కట్టినట్లుగా దర్శింపజేసితిరి. కర్ణపేయముగ శ్రవణము చేయించితిరి. స్వామీ! సమస్త ధర్మములను వినిపించితిరి. తద్వారా, నా కర్మలన్నియునూ నిశ్శేషముగా తొలగిపోయినవి. అపారమైన మీ కృపచే శ్రేష్ఠమైన శ్రీగురుతత్త్వసారము నాకు బోధపడినది. (1-3)

శ్లో॥ అనాది ఘోర సంసారధ్వాంత ధ్వంసైక హేతవే । నమః శ్రీనాథవైద్యాయ, భవౌషధ విధాయినే ॥

అనగా అనాదియైన, భయంకరమైన ఈ సంసారరూపమగు అంధకారమును నశింపచేయుటకు ముఖ్యకారకుడు, సమర్థుడు శ్రీగురుదేవుడొక్కడే. భవౌషధమును ప్రసాదించి (అజ్ఞాన) అంధకార పూరితమైన సంసారమునుండి తరింపజేయగల వైద్యరాజగు శ్రీగురునాథునకు కైమోడ్పు లర్పింతును.

అనాదియైన సంసారసాగరమునకు ఆదిగానీ, అంతముగానీ లేనేలేదు. అత్యంత భయంకరమగు దుష్టమైన వాసనలకు బద్ధులమై యుండుటచే సంసార సాగరమును దాటలేక పోవుచున్నాము. కావున, వెంటనే గురుమూర్తి చెంతకు చేరి అత్యంత భక్తితో మనస్ఫూర్తిగా

❖ **ముఖ్య గమనిక :** పాఠకుల సౌలభ్యము కొరకు **"గురుగీతా - మూలము"** ప్రత్యేకంగా పరిశిష్టమునందు (644)వ పేజీలో చేర్చబడినది చూడగలరు. ఇచటి తాత్పర్యముల చివర ఆయా శ్లోకసంఖ్యలు కూడా చేర్చబడినవని గమనింపగలరు.

ఆయన శరణు గోరవలయును. "స్వామీ! శ్రీగురుదేవా! ఈ భవార్ణవమునుండి తరింపజేయుటకు తగిన ఔషధమును కృపతో అనుగ్రహింపుమ"ని ప్రార్థింపవలయును. అంతట గుర్వనుగ్రహము లభించును. కావున, గురుభక్తి కామధేనువు వంటిదని గుర్తించుము. భవభయము అను సుదీర్ఘ రోగమును నివారింపగల దివ్యౌషధమును శ్రీగురుదేవులు మాత్రమే అనుగ్రహింపగలరు. వెంటనే శ్రీగురుకృప యనెడు తారకము లభించి, అపార సంసార సాగరమును నిర్భయముగ తరించిపోయెదము. ఈ రీతిగా వేదవేదాంగాది సమస్త శాస్త్రములు సిద్ధాంతీకరించి నిశ్చయముగా ప్రకటించుచున్నవి. యుగయుగములనుండి ఈ సంసార సముద్రము నందు మునుగుచు, తేలుచు తచ్చాడుచున్న బుద్ధిమంతులందరు శాస్త్రవచనములను గమనింపవలయును. ఇట్టి శాస్త్ర సారమును గ్రహించిన వసిష్ఠుడు, శుకుడు మున్నగు మునీశ్వరాదులు మరియు గొప్ప గొప్ప విద్వజ్జనులు మాత్రమే దీనిని ఆచరించి, ఆదర్శమూర్తులుగా ఈ లోకమున నిలిచియున్నారు (4-7)

కావున, సద్గురు మార్గమును ఆచరించిన వారికి ముక్తి లభించుట తథ్యము. పార్వతీపరమేశ్వరుల సంవాదమునందు ఇట్టి విషయమును గూర్చి వర్ణింపబడిన కథలు కోకొల్లలుగా గలవు. అవన్నియును పవిత్రములు. నిర్మలములు. అంతేగాదు! అవి అత్యంత వినోదాత్మకములై యుండును. కావున, "స్వామీ! లోకమునందుగల జనులు దేనివలన సులభముగా ఉద్ధరింపబడెదరు" అని పార్వతీదేవి ప్రశ్నించినపుడు పరమేశ్వరుడు చెప్పిన సమాధానమును సవిస్తరముగ సెలవీయగలరని" ప్రార్థించెను. (8-9)

శిష్యుని పరిప్రశ్నను విని మిగుల సంతోషించిన సిద్ధముని యిట్లు నుడివెను - "కుమారా! గురుసేవా తత్పరుడవైన నీవు ధన్యుడవు. నీ జీవితము ధన్యమైనది. దేనితో మోహము ఉడిగిపోవునో, అట్టి అనాదియైన కథను గూర్చి ఇప్పుడు నీవు అడిగితివి. సూర్యుడు ఉదయించి, చీకటిని పారద్రోలి లోకమునకు వెలుగును ప్రసాదించును. అటులే, ఈ కథ అజ్ఞానమును తొలగించి విజ్ఞానమును ప్రసాదించి మనస్సును దృఢపరచగలదు. "నాయనా! గురుభక్తుడా! నీవు ఒక ఉత్తమ ప్రశ్నను అడిగితివి. కులదీపకా! అందుకు తగు సమాధానము స్కాందపురాణమునందలి ఉత్తర ఖండమునందు పార్వతీపరమేశ్వర సంవాదరూపమున **"గురుగీత"** అను పేరిట చెప్పబడినది. పూర్వము ఒకనాడు కైలాసపర్వతమునందు హాయిగా కూర్చొనియున్న త్రిపురారిని గాంచి, హిమశైలనందిని యగు పార్వతీదేవి సమస్తలోకములను ఉద్ధరించు నిమిత్తముగ ఒకానొక ఉత్తమప్రశ్న అడిగినది. ఇప్పుడు దానినే నీకు వివరించెదను. నిశ్చలచిత్తముతో వినుము" అని **సిద్ధముని యిట్లు చెప్పసాగెను**- (10-13)

శ్రీ గురుగీతా ప్రారంభము

శౌనకాది మునీశ్వరులతో సూతుడిట్లు నుడివెను – రమణీయమైన కైలాస శిఖరమునందు ఒకనాడు భక్తి సంధాన నాయకుడగు పరమేశ్వరుణ్ణి పార్వతీదేవి అలవోకగా తిలకించెను. **భక్తిపూర్వకముగా ప్రణమిల్లి యిట్లు ప్రశ్నించెను–** “దేవదేవేశ్వరా! పరాత్పరా! జగద్గురు! సదాశివ! మహాదేవ! మీకు వందనములు. దయతో నాకు గురుదీక్షను ప్రసాదింపుము. స్వామీ! దేహధారియైన జీవుడు బ్రహ్మస్వరూపుడు యెట్లగును? అందుకుగల మార్గమేది? దేవా! నా యందు అనుగ్రహించి తగిన సమాధానమును తెలియజేయుము. మీ దివ్యమైన పాదద్వంద్వమునకు నమోవాకములు. (1–3) **అందుకు ఈశ్వరుడిట్లు పలికెను** – “దేవీ! నీవు నేను ఒకటే సుమా! నీవు నా స్వరూపమే. లోకోపకారమును గూర్చి చక్కగా ప్రశ్నించితివి. ఇంతకుముందు ఈవిధముగ నన్ను యెవ్వరునూ ప్రశ్నింపలేదు. కావున, నాకు నీ యందుగల అతిశయించిన ప్రేమతో నీకు ఈ విషయమును గూర్చి చక్కగా వివరించెదను. మూడు లోకముల యందు కడు దుర్లభమైన రహస్యమును చెప్పెదను. శ్రద్ధగా వినుము. “పార్వతీ! గురువే బ్రహ్మము, పరబ్రహ్మము కూడా గురువే. అంతకు మిక్కిలి వేరొకటి లేనేలేదు. ఇది సత్యము. ఇది ముమ్మాటికి సత్యము. (4–5) వేదములు, శాస్త్రములు, పురాణములు, ఇతిహాసములు, మంత్ర, యంత్ర, తంత్రాది విద్యలు, స్మృతులు, అభిచార విద్యలు, శైవ, శాక్త ఆగమములు ఇంకనూ ఇతరములగు అనేకానేక విద్యలన్నియునూ, వివిధ శబ్దజాలమును ప్రయోగించి జీవుల చిత్తములను మిక్కుటమగు భ్రాంతికి గురిచేయుచున్నవి. పెడత్రోవలు పట్టించుచున్నవి. కావున, గురుతత్త్వము తెలియకుండా చేయునట్టి యజ్ఞములు, వ్రతములు, తపములు, దానములు, జపములు, తీర్థయాత్రలు మున్నగు సాధనములు అన్నియునూ వ్యర్థములే. అవి మూర్ఖప్రయత్నములే యగును. (6–8) గురువుయందే తమ బుద్ధిని చక్కగా నిలుపవలెను. ఇతరముల యందు పనికిరాదు. ఇది ముమ్మాటికి సత్యము అని గ్రహింపుము. తత్ప్రాప్తికొరకై ప్రయత్నించుటయే మానవుల ముఖ్యకర్తవ్యము. (9) జగత్తును పాలించే మాయ మిక్కిలి గూఢమైనది. అదియే విద్యయని గుర్తెరుగుము. అజ్ఞానము వలన దేహము సంభవించినది. ఇట్టి అజ్ఞానము వల్లనే జీవశబ్దము యేర్పడినది. ఈ అవిద్యను, అజ్ఞానమును అస్తమింపజేయగల స్వప్రకాశమునే గురుశబ్దముతో చెప్పుదురు. (10) శ్రీగురుమూర్తియొక్క పాదసంసేవనము వలన సమస్త పాపములు నిర్మూలనములగును. సేవించువారల అంతఃకరణము శుద్ధియగును. వారు పవిత్రాత్ములయ్యెదరు. అనంతరము గురుకృపవలన దేహి అనగా జీవుడు బ్రహ్మస్వరూపుడే యగును. అట్టి కృపను పొందుటకు తగిన ఉపాయమును నీకు బోధించెదను. (11) శ్రీగురు పాదపద్మములను స్మరణ పూర్వకముగ అభిషేకింపవలెను. పిమ్మట అభిషేకజలమును తమ శిరమునందు ధరించినవారికి సమస్త తీర్థములయందు స్నానము

నాచరించిన పుణ్యఫలము లభించును. (12) గురుపాదోదకము పాపపంకిలమును శోషింపజేయును. జ్ఞానజ్యోతిని వెలిగించును. సంసారసాగరమును చక్కగా దాటించును. (13) సమూలముగ అజ్ఞానము నశింపవలెనన్నచో, జన్మజన్మలకు కారణములగు కర్మలు నివారింపబడవలెనన్నచో, జ్ఞానము, వైరాగ్యము సిద్ధింపవలెనన్నచో, గురు చరణతీర్థమును సేవింపవలెను. (14) గురుచరణోదకమునే పానీయముగా త్రాగవలెను. గురువు ఉచ్ఛిష్టమునే భోజనముగా భుజింపవలెను. నిరంతరము గురుమూర్తినే ధ్యానింపవలెను. అహర్నిశములు గురుమంత్రమునే జపింపవలెను. (15) శ్రీగురుసన్నిధానమే కాశీక్షేత్రము, గురుచరణోదకమే జాహ్నవీ తోయము (గంగాజలము), సాక్షాత్తుగా విశ్వనాథుడే గురువు. అట్టి గురువే తారకుడగు పరబ్రహ్మము అను నిశ్చయమును కలిగియుండవలెను. (16) గురుపాదోదకమే గయాతీర్థము. గురుచరణచిహ్నములు ముద్రితమైన ప్రదేశము విష్ణుపాదాంకితమైన గయాక్షేత్రము. గురువే అక్షయమగు వటవృక్షము. తీర్థరాజమగు ప్రయాగక్షేత్రము కూడా ఆయనయే. అట్టి గురుమూర్తికి అనేక నమస్కారములు.(17) నిత్య నిరంతరము గురుమూర్తినే స్మరింపవలెను. గురునామమునే జపింపవలయును. గుర్వాజ్ఞనే పాటించవలెను. గురువును ఎప్పుడు కూడా అన్యముగా అనగా వేరుగా భావింపకూడదు.(18)

గురుముఖమునందు నిలిచియున్న శబ్దబ్రహ్మము ఆయన అనుగ్రహము వలననే మనకు లభింపగలదు. కనుక, కులస్త్రీ తన భర్తను స్మరించినట్లుగా, శిష్యుడు నిరంతరము తన గురువును ధ్యానించుచుండవలయును. (19) తమ ఆశ్రమమును, జాతిని, కీర్తిని, బలమును, ఐహిక సుఖసమృద్ధిని, ఐశ్వర్యమును మొదలగువాటి నన్నింటినీ పరిత్యజించి, గురువుయందు అన్యభావన లేకుండా గురువునే ఆశ్రయించవలయును.(20) అన్యచింతల నన్నింటినీ వదలిపెట్టి అనన్యభావంతో నన్నే అనగా – గురువునే చింతన చేయుటవలన అత్యంత సులభముగా పరమపదము లభించును. అందువలన అన్నివిధములుగ ప్రయత్నించి గురువును ఆరాధింపవలయును.(21) 'విద్య' అనునది గురుముఖమునందే యుండును. అది గురుభక్తి ద్వారా గురుముఖతః లభించును. అట్టి విద్యయే అచ్ఛమైన విద్య అనబడును. ఈ మాటను ముల్లోకముల యందుగల దేవతలు, అసురులు, పన్నగులు మున్నగువారందరి ద్వారా స్పష్టముగా వక్కాణింపబడినది. (22) 'గు' అను అక్షరమునకు అర్థము అంధకారము (అజ్ఞానము) అనియు, 'రు' అను అక్షరమునకు అర్థముగా వెలుతురు (జ్ఞానము) అనియు చెప్పబడినది. అజ్ఞానమనెడు అంధకారమును రూపుమాపునట్టి పరబ్రహ్మయే గురువు అని చెప్పుటలో రవంత సందేహములేదు. (23) మొదటి అక్షరమగు 'గు'కారము మాయవలన జనించే గుణములను సూచించును. రెండవది యగు 'రు'కారము మాయవలన కలుగునట్టి భ్రమలను భ్రష్టపరచునట్టి బ్రహ్మను తెలియజేయును. (24) కావున, గురుపదము అత్యంత శ్రేష్ఠమైనది. అది దేవతలకు కూడా దుర్లభమైనది. హాహాహూహూ

గణములకు చెందిన గంధర్వులు కూడా గురుపదమునే అత్యధికముగ గౌరవింతురు. పూజింతురు. (25) యేలనన, వారందరికి కూడా గురుతత్త్వమునకు మించిన మరియొక శ్రేష్ఠమైన తత్త్వము లేనేలేదు. అందువలన సాధకులైన వారలు గురుప్రీతికొరకై ఆసనమునుగానీ, శయ్యనుగానీ, వస్త్రమునుగానీ, ఆభరణమునుగానీ, వాహనమునుగానీ సమర్పింపవలెను. (26) అంతేకాదు, గురువును చక్కగా ఆరాధించి తన జీవితమునే నివేదింపవలెను, అనగా శిష్యుడు తన జీవిత సర్వస్వమును గురువునకే సమర్పింపవలెను. (27) యెల్లప్పుడు మనోవాక్కాయకర్మల ద్వారా గురువును సేవింపవలెను. గురుసన్నిధికి చేరినప్పుడు చుట్టూరా ఎవరున్నారని చూడకుండా సిగ్గు విడిచి సాగిలపడి గురువునకు దీర్ఘదండ ప్రణామము చేయవలయును. (28) శరీరమును, ఇంద్రియములను, తుదకు ప్రాణములను సైతము సద్గురువునకు సమర్పింపవలయును. గురువు కొరకు తన భార్యాపిల్లలే కాదు, తన సర్వస్వమును సమర్పింపవలెను. అనగా – శరీర ఇంద్రియాదుల యందలి అభిమానమును వీడి శ్రీగురుదేవులకు తను, మన, ధనములను సమర్పించవలెను. (అనగా – భార్యాబిడ్డలను కూడా సద్గురుడు తెల్పిన పరతత్త్వమార్గమునందే ప్రవర్తింపజేయవలెను. సకల సంరక్షకుడగు గురుదేవునే శరణుపొందవలెను అని భావము.) (29) ఓ దేవీ! ఈ శరీరము అనేక క్రిమికీటకాదులచే, దుర్గంధపూరితమగు మలమూత్రాదులచే నిండియున్నది. శ్లేష్మము, రక్తము, చర్మము, మాంసములచేత కప్పబడి కఫ, పిత్తాదులకు నిలయమైనది. కావున, దీనియందు ఎంతమాత్రము అభిమానముంచదగదు. (30) సంసారమనెడు వృక్షమును అధిరోహించి నరకమనెడు సాగరమునందు పడిపోవుచున్న జనులందరిని ఒక్క గురువుమాత్రమే ఉద్ధరించగలడు. అట్టి శ్రీగురుమూర్తికి నమస్కారములు. (31) గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. ప్రత్యక్షమైన పరబ్రహ్మము కూడా గురువే. అట్టి శ్రీగురుమూర్తికి వందనములు. (32) సకలలోకములకు కారణభూతుడు. సంసార సాగరమునకు సేతువు. సమస్త విద్యలకు పుట్టుక(వు) అగు శంభుమూర్తి శ్రీగురుమూర్తికి నమోవాకములు (33) అజ్ఞానమనెడు అంధకారముతో అంధత్వము అలుముకొనినవాని కళ్ళకు, జ్ఞానమనెడు కంటికలికమును పెట్టి గ్రుడ్డితనమును రూపుమాపి జ్ఞాననేత్రములను తెరిపించెడు శ్రీగురుదేవులకు నమస్సులు. (34) నీవే తండ్రివి, నీవే తల్లివి, నీవే నా బంధువు, తుదకు, పరదేవతవు కూడా నీవేనయ్యా! ఈ సంసారమోహములో చిక్కుకొనియున్న నన్ను గట్టి హెచ్చరికతో మేల్కొల్పునట్టి శ్రీగురుదేవా! నీ పాదపద్మములకు ప్రణామములు. (35) ఎవరి సత్యం వలన ఈ జగత్తు నిలిచియున్నదో, జ్ఞానస్వరూపుడయిన, ఎవరి ప్రకాశం వలన ఈ లోకము దృష్టి గోచరమగుచున్నదో, ఎవరి ఆనందం వలన ఈ జగత్తంతా హాయిగా, సుఖమయంగా కన్పట్టుచున్నదో, అట్టి పరమానంద స్వరూపుడైన శ్రీగురుమూర్తికి కైమోడ్పులు. (36) ఎవరి అస్తిత్వమువలన కనిపించే ఈ సృష్టిమొత్తము ప్రతిష్ఠింపబడి నిలిచియున్నదో, ఎవరి తేజస్సుచే సూర్యరూపమున ప్రకాశించుచున్నదో,

ఎవరి ప్రేమశక్తివలన పుత్రకళత్రాదులు ప్రియము గొల్పుచుండిరో అట్టి శ్రీగురుమూర్తికి వందనములు. (37) ఈ జగత్తు ఎవరివలన చైతన్యవంతమగుచున్నదో, ఎవరినైతే చిత్తము గ్రహింపలేదో, ఎవరైతే జాగ్రత్, స్వప్న, సుషుప్త్యాదులనెడు త్రివిధావస్థలయందు సాక్షీభూతులుగ నుండెదరో, అట్టి గురువునకు నమస్కృతులు. (38) ఎవరి జ్ఞానమువలన ఈ సమస్త విశ్వము వేరువేరుగా భిన్నభిన్న రూపములతో గోచరించకుండా సర్వము ఏకమైన బ్రహ్మ (తత్త్వముగ) రూపమున భాసించునో, అట్టి సద్రూపము, ఏకరూపము గలిగిన శ్రీ గురువునకు నమస్కరించెదను. (39)

నేను బ్రహ్మజ్ఞానమును యెరుగుదును. నాకు బ్రహ్మము యెవరో తెలియును అని చెప్పెడువారికి ఏమీ తెలియదని మనము గ్రహింపవలెను. అయితే నాకేమీ తెలియదు, బ్రహ్మజ్ఞానము తెలియదు, బ్రహ్మమును కూడా నేను యెరుగను అని ఎవరు చెప్పుదురో, నిజమునకు వారికే బ్రహ్మజ్ఞానమును గూర్చిగాని, బ్రహ్మమును గూర్చిగాని పూర్తిగా తెలియును అని గ్రహింపవలెను. అనన్యభావరూపమునందు అనగా తనలో తానే నిలిచియుండే శ్రీగురుమూర్తికి ప్రణతులర్పించెదను. (40)

ఎవరి కారణరూపము వలన కార్యరూపము ప్రకటమగునో, అట్టి కార్యకారణరూపమైన శ్రీగురువునకు ప్రణమిల్లుదును. (41) ఈ సమస్త జగత్తు నానావిధరూపములతో కనబడుచుండును. కాని, నిజమునకు ఉన్నదంతయు ఒకే వస్తువు. దానికంటే భిన్నమైనది వేరొకటి లేనేలేదు. అనగా ఏది కూడా తనంతట తానుగా ఈ జగత్తునందు విడిగా నిలిచియుండదు. అన్నింటికీ ఆధారభూతమై కార్యకారణరూపమైన జగత్కారణుడగు శ్రీగురుమూర్తికి వందనమాచరించెదను. (42) ఎవరి పాదపద్మములద్వంద్వము రాగద్వేషాది ద్వంద్వముల తాపములను నివారించునో, అటులే సమస్త సంకటములనుండి రక్షించునో, అట్టి శ్రీగురుచరణకమలములకు ప్రణమిల్లుదును. (43) సాక్షాత్తు పరమశివుడే ఆగ్రహించిననూ, గురుదేవుడు మనలను రక్షించును. కాని, ఆ గురువే ఆగ్రహించినచో? ఆ శివుడు కూడా రక్షింపలేడు. అప్పుడు మనకు రక్షకుడే కరువగును. కావున, అన్నివిధములుగా ప్రయత్నించి శ్రీగురుపాదములనే శరణుగోరవలయును. (44) వాక్కునకు, మనస్సునకు, చిత్తము లేదా ఇంద్రియములకు కూడా గోచరించనిది, అతీతమైనది, శివశక్త్యాత్మకమైన పరతత్త్వమే శ్రీగురుపాదద్వంద్వము. అందులో ఒకటి తెల్లని వర్ణముతో కూడిన శివతత్త్వము, రెండవది ఎరుపు వర్ణముతో కూడిన శక్తితత్త్వము. ఈవిధముగా శివ-శక్తుల ఉభయతత్త్వాత్మకమైన శ్రీగురుమూర్తి యొక్క పరమశ్రేష్ఠమగు శ్రీగురుపాదద్వయమునకు సాష్టాంగ వందనములు. (45) 'గురు' - శబ్దమునందలి 'గు'కారము గుణాతీతమైనది. అనగా త్రిగుణములకు అతీతమైన పరమాత్మతత్త్వమును సూచించును. ఇక, 'రు' కారము రూపరహితమైన నిర్గుణ తత్త్వమును బోధించును. ఇట్టి గుకారము, రుకారము అను రెండు అక్షరములు గుణాతీతమైన నిర్గుణమును, రూపాతీతమైన నిరాకారమును అయిన పరతత్త్వమునకు సూచకమైన ఉభయ స్థితులను ఎవరు అనుగ్రహించెదరో, ఆయనయే అచ్చమైన సద్గురువు అనబడును. (46)

ప్రియమైన పార్వతీ! గురువు అనగా మూడు కన్నులు లేని రుద్రుడుగా, నాలుగు భుజములు లేని విష్ణుమూర్తిగా, నాలుగు ముఖములు లేని బ్రహ్మగా చూడవలయునని చెప్పబడినది. (47) ఎవరి అనుగ్రహమువలన జీవులు చిత్రవిచిత్రమైన సంసారమునుండి ముక్తిని పొందగలిగెదరో, అట్టి దయాసాగరుడైన శ్రీగురుమూర్తి ముందు అంజలి ఘటించి ఆయన పరిపూర్ణమైన అనుగ్రహమును పొందుటకై ప్రార్థించవలయును (48) వివేకవంతమైన దృష్టితో చూడగలిగేవారికి శ్రీగురుమూర్తి యొక్క పరమశ్రేష్ఠమగు అమృతస్వరూపము సాక్షాత్కరించును. గ్రుడ్డివారు సూర్యోదయమును చూడలేనట్లు, దురదృష్టవంతులు గురువుయొక్క అమృతస్వరూపమును గాంచలేరు. (49) శ్రీగురునాథుని చరణకమల ద్వయము ఏ దిక్కున విరాజిల్లుచుండునో, ఆ దిశవైపు తిరిగి ప్రతిదినము అత్యంత భక్తిభావముతో నమస్కరింపవలెను. (50) దేవీ! విశ్వము యొక్క ఉత్పత్తి, ప్రళయములతో కూడిన ఈ జగన్నాటకమునకు నిత్యసాక్షి స్వరూపుడు, భగవంతుడు అయిన శ్రీగురు సార్వభౌముడు యెల్లప్పుడు మేల్కొనియుండును. కావున, తుమ్మెదలు పూలవైపు ఆకృష్టమైనట్లుగా బుధజనులు శ్రీగురుచక్రవర్తి వైపునకు ఆకృష్టులై పుష్పాంజలిని సమర్పించి ప్రణమిల్లుచుందురు. (51)

పార్వతీ! ఇక గురుమండలమును గూర్చి వివరించెదను వినుము– గురుమండలమునందు ముందుగా శ్రీనాథాది గురుత్రయము అనగా శ్రీగురువు, పరమగురువు, పరాత్పర గురువు అను ముగ్గురు గురువులుందురు. ఆ తర్వాత గణపతి, ఉడ్డీయాన, జాలంధర, మూలాధారమనెడు యోగమునకు సంబంధించిన మూడు పీఠము లుండును. తదుపరి భైరవమూర్తి, సిద్ధ సమూహము, వామదేవుడు, సనత్కుమారుడు, శుకుడు అను వటుక త్రయము, పూర్ణపదము, సిద్ధపదము అనే పదయుగము. దూతీ త్రయము అనగా శంభుకృపతో దీక్షగా రూపమును స్వీకరించిన ఇడా, పింగళా, సుషుమ్నలను ముమ్వురు దూతలు ఉందురు. ఆపైన వీరేశ్వరుడు, అష్టసిద్ధులు[1], చతుఃషష్టి అనగా అరువది నాలుగు (64) విద్యలు, నవనాథులు[2] అనంతరము బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, శివుడు, పరమశివుడు అనబడు వీరావళీ పంచకముతో కూడియుండును. అంతేగాక, ఇది శ్రేష్ఠమగు శ్రీమాలినీ మంత్రరాజముతో విరాజిల్లుచుండును. ఇట్టి శ్రేష్ఠమగు గురుమండలమును గూర్చి నమస్కరించెదను.

---

1. అష్టసిద్ధులు :**అణిమా మహిమా చైవ - గరిమా లఘిమా తథా । ప్రాప్తిః ప్రాకామ్యమీశత్వం - వశిత్వం చాష్ట సిద్ధయః ॥**
(అణిమా, మహిమా, గరిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము అనేవి అష్టసిద్ధులు అనబడును.)
2. నవనాథులు : **మత్స్యేంద్ర గోరక్ష జాలంధరాద్యాః గహనీ కానీఫా చౌరంగముఖ్యాః । భర్తరి చర్పట నాగనాథ సిద్ధాః భూమ్యాం బభూవుః నవనాథ సిద్ధాః ॥**
(మత్స్యేంద్రుడు, గోరక్షకుడు, జాలంధరుడు, గహనీ, కానీఫా, చౌరంగుడు (ఈయనకే రేవణుడు అని కూడా పేరున్నది), భర్తరి, చర్పటుడు, నాగనాథుడు - అను పేర్లతో నవనాథులుగా ప్రసిద్ధినొందిన వీరే ఈ లోకంలో నాథ సంప్రదాయమును విస్తరింపజేసినారు.

(52) భయంకరమైన రోగములను కలిగించునట్టి, కష్టసాధ్యమైన సుదీర్ఘమగు ఉచ్ఛ్వాస నిశ్వాసములతో కూడిన శతాధికములగు ప్రాణాయామమును అభ్యసించవలసిన పనిలేదు. అత్యంత వేదనాపూరితమైన, అశక్యమైన, అనేక ఇంద్రియములను నిగ్రహించవలసిన పనిలేదు. ఎప్పుడైతే తనలో శ్రీగురుమూర్తి ఉదయించునో, ఆయన కృపావాయువు ప్రసరించునో, అప్పుడే, ఆ క్షణమే బలిష్ఠమైన వాయువు తనంతట తానే శాంతించి సహజమైన సమాధిస్థితి లభింపగలదు. కావున, సహజమైన నిజస్థితిని మిక్కిలి సులభముగా లభింపజేయునట్టి ఒక్క సద్గురువును మాత్రమే అహర్నిశములు సేవింపవలెను. (53) స్వీయగురు శరీరమును చింతించుటయే అనంతమైన శివరూప చింతనమగును. అటులే స్వీయగురువు యొక్క నామమును కీర్తించుటయే అనంతమైన శివనామ సంకీర్తనమగును. (54) ఎవరి పాదధూళియందలి ఒకానొక చిన్న నలుసు మాత్రమే ఈ అపారమైన సంసార సముద్రమును సులభముగా దాటిపోవుటకు వారధిగా నిలువగలదో, అట్టి శ్రీగురునాథుని ఉపాసించెదను. (55) ఎవరి అనుగ్రహము లభించుటవలన భయంకరమైన అజ్ఞానము తొలగిపోవునో, అట్టి దేశికేంద్రునకు నమస్కరించి అభీష్టసిద్ధికై వేడుకొందును. (56) బ్రహ్మరంధ్రమునందుగల తెల్ల తామరమధ్యభాగమునందు చంద్రమండలమున శ్రీగురుపాదపద్మములు అలరారుచుండును. అట్టి శ్రీగురుచరణద్వయము సమస్త సంసారదావాగ్నిని చల్లార్చి చక్కని శీతలత్వమును ప్రసాదించుటలో సమర్థమైనది. (57) అ, క, థ మున్నగు అక్షరాలతో, మూడు రేఖలతో కూడిన పద్మము సహస్రదళ మండలము నందు ఉండును. ఇది 'హం' మరియు 'స' అనే హంసకు ప్రక్కనగల త్రికోణము యొక్క మధ్యభాగమున శ్రీగురువును స్మరించి ధ్యానింపవలెను. (58)

గురువు అనగా – దృష్టిమాత్రముచేతనే సమస్త భువనములను సృజించువాడు, పరిపూర్ణమైన పుష్టిని ప్రసాదించువాడు, సమస్త వేదదృష్టిని కలిగినవాడు, సకల ఐశ్వర్యములను తుచ్ఛములుగా తలంచువాడు, దుర్గుణములను దూరమొనర్చువాడు, తత్పదార్థమైన బ్రహ్మయందు ఏకైకదృష్టి కలిగినవాడు. పరమేష్ఠి గుణములతో నిండారినవాడు, మోక్షమార్గమునందే ముఖ్యదృష్టి కలిగినవాడు, చతుర్దశ భువనములనెడు నాటకరంగ స్థలమును నిలుపుటకు ఆధారస్తంభము వంటివాడు, కారుణ్యరస వృష్టిని కురిపించువాడు, తత్త్వముల మాలికకు సమష్టి స్వరూపుడు, సర్వకాలగణనకు నిర్మాణకర్తయైనవాడు, సచ్చిదానంద పరబ్రహ్మయందు దృష్టి గలవాడు, అట్టి శ్రీగురుమూర్తి యొక్క దివ్యమైన దృష్టి నిత్యనిరంతరము నాయందే నిలచియుండుగాక! (59–60) అగ్నిచేత పరిశుద్ధము చేయబడి, ప్రకాశవంతమైన జ్వాలలతో చుట్టబడిన దివ్యాక్షరములతో తేజరిల్లుచున్న శ్రీగురుమంత్రరాజము అహర్నిశములు మృత్యుముఖమునుండి కాపాడుచుండునుగాక! (61) ఆ గురుపదము

కదులును, కదలదు. దూరముగా ఉండును. దగ్గరగా ఉండును. అందరి అంతరంగాలలో ఉండును. అటులే బాహ్యమున కూడా ఉండును.(1) (62) అది పుట్టుక లేనిది. వృద్ధాప్యము ఉండనిది. ఆది, అంతములు లేనిది, ఏకమైనది. వికారము లేనిది. అది చిదానందస్వరూపము. అణువుకంటే సూక్ష్మమైనది. గొప్పదానికంటే గొప్పనైనది. ముందు వెనుకలు లేనిది. శాశ్వతమైనది. స్వయంప్రకాశకమైనది. నిరామయము-రోగములు లేనిది. రజోగుణరహితమైనది. పరమాకాశ స్వరూపము గలది. శాశ్వతానందమయమైనది. అవ్యయము - తరుగులేనిది. (64) శ్రుతి (వేదము), ప్రత్యక్షము, ఇతిహాసాత్మక ఉపమానము, అనుమానము అను నాలుగు ప్రమాణములకు అందనిది. ఆత్మబలముచేత తెలియదగినది. అట్టి మహత్త్వపూర్ణమైన గురువును ఎల్లప్పుడు స్మరించవలయును. (65) మహామతీ! పార్వతీ! మననము చేయదగిన కార్యమేదో, దానిని నీకు చెప్పెదను. నేను చూసిన సాధుత్వము ఇప్పుడు నీ యందు ఉన్నది. (66) ఆది, అంతములేని అఖండమైన గుండ్రని ఆకారమున ఈ చరాచరసృష్టి యావత్తునూ తనలో ఇముడ్చుకొని సర్వత్ర వ్యాపించియున్న తత్పదము ఎవరిచేత స్వయంగా దర్శింపబడెనో (ఇతరులకు దర్శింపజేయునో), అట్టి శ్రీగురుదేవులకు నమస్కారము. (67) సమస్త వేదశిరస్సుల రత్నములచేత ప్రకాశించెడు పాదకమలములు గలిగి ఉపనిషత్తులనబడు కమలములను వికసింపచేయు సూర్యుని వంటి శ్రీగురుమూర్తికి వందనములు. (68) ఎవరిని స్మరించినంత మాత్రమున బ్రహ్మజ్ఞానము లభించునో, ఎవరు లభించుటచేత సమస్తమూ లభించునో, అట్టి శ్రీగురువునకు నమస్కారము. (69) శాశ్వతము, చైతన్యము, శాంతము, ఆకాశమునకు అతీతము, నిరంజనము, నాదబిందు కళలకు అతీతము అయిన శ్రీగురువునకు ప్రణామములు. (70) స్థావరజంగమాత్మకమైన, జడచేతనాత్మకమైన ఈ సమస్త జగత్తు యెవరిచే వ్యాపింపబడి యున్నదో, అట్టి శ్రీగురువునకు నమోవాకములు. (71) జ్ఞానమనెడు శక్తిని అధిరోహించి తత్త్వముల హారములచే శోభిల్లెడువాడు, భుక్తిని, ముక్తిని ప్రసాదించువాడు అగు శ్రీగురువునకు నమస్కారములు. (72) తనయొక్క ఆత్మజ్ఞాన ప్రభావముచేత, ఆశ్రితులగు వారియొక్క అనేక జన్మలనుండి కలిగిన సమస్త కర్మరాశిని దహించివేయునట్టి శ్రీగురువునకు ప్రణామములు. (73) గురువును మించిన తత్త్వములేదు. గురువునుమించిన తపమును లేదు. జ్ఞానమునకంటే మించిన తత్త్వము లేనేలేదు. అట్టి జ్ఞానమే స్వరూపముగా సాక్షాత్కరించిన శ్రీగురుమూర్తికి వందనము. (74) నా గురునాథుడే శ్రీజగన్నాథుడు.

---

1. **తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే । తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః ॥** అనగా ఆ పరమపురుషుడు నడచును, నడవడు. అతడు చాలా దూరమున ఉండును. అటులే అతి దగ్గరగా ఉండును. అతడు ఈ జగత్తునందు అంతట లోపల పరిపూర్ణముగా ఉండును. అటులే వెలుపల కూడా నిండియుండును. అనగా సర్వవ్యాపకుడై ఉండునని భావము.

నా గురువే ముల్లోకములకు జగద్గురువు. నా ఆత్మయే సర్వభూతములలో లభించెడు ఆత్మ. అట్టి ఆత్మస్వరూపుడైన శ్రీగురుమూర్తికి ఇదే నా నమస్కారము. (75) గురువుయొక్క మూర్తియే, ఆకారమే, ధ్యానమునకు మూలము. గురుపాదములే పూజకు ముఖ్యము. గురువు చెప్పిన వాక్యములే మంత్రములకు మూలము. గురువుయొక్క దయ - అనుగ్రహము సాక్షాత్తు ముక్తికి మూలము.(76) గురువు జగత్తునకు ఆది-మొదటివాడు. ఆ గురువు అనాదిగా ఉన్నవాడు, ఆదిగురువు అనగా ఆది - మొదలు లేనివాడు. గురువే పరమదైవతము. గురువును మించిన దైవములేదు. గురువున కంటే ఉత్కృష్టమైనదీ లేదు. అట్టి గురువునకు వందనము. (77)

సప్తసముద్రముల వరకు గల సమస్త తీర్థములలో స్నానము చేసిన ఫలము. గురువు యొక్క చరణతీర్థమునందలి ఒక్క బిందువు యొక్క వెయ్యవ భాగమువలన కలుగు ఫలమునకు సాటిరాదు. అంతటి ప్రభావము కలిగినది శ్రీగురుపాదోదకము. (78) విష్ణువు కోపగించినచో గురువే కాపాడును. గురువు కోపించినచో మరెవ్వరూ కాపాడలేరు. కావున, సర్వవిధములుగా ప్రయత్నించి, ఎంతటి కష్టముచేతనైననూ శ్రీగురువునే శరణు పొందవలెను. (79) ఈ ప్రపంచ మంతయూ గురువే. బ్రహ్మ, విష్ణు, శివాత్మకుడు గురువు. గురువునకు అధికమైనది గానీ, ఉత్కృష్టమైనది గానీ వేరుగా ఏదీలేదు. కావున, గురువును చక్కగా పూజింపవలయును. (80) గురుభక్తి వలన విజ్ఞానసహితమగు జ్ఞానము లభించును. గురువునకన్న అధికమైనది లేదు. గురుమార్గానుసారుల చేత గురువు ధ్యానింపదగినవాడు. సేవింపదగిన వాడు (81) శ్రుతి అన్నింటికంటే మిన్నయైన దానిని గూర్చి నేతి, నేతి (ఇది కాదు, ఇది కాదు) అని చెప్పుచున్నదికదా! కావున, సమస్తమునకంటె అతిశయించిన శ్రీగురుమూర్తినే మనస్సుతో, వాక్కుతో నిత్యము ఆరాధింపవలయును. (82) శ్రీగురుదేవుల కృపాప్రసాదము చేతనే బ్రహ్మ, విష్ణు, సదాశివులు కూడా సృష్టి, స్థితి, లయ కార్యములను నిర్వహించుటలో సమర్థులగుదురు. అట్టి గురుసేవ వలన కైవల్యము లభించును. (83) దేవతలు, కిన్నరులు, గంధర్వులు, పితరులు, యక్షులు, చారణులు, మునులు మున్నగువారందరు కూడా గురుశుశ్రూషావిధిని గూర్చి ఎంతమాత్రమును తెలియరైరి. ఎందుకనగా, వారందరును తపస్సుచేత, విద్యచేత, గొప్ప బలగర్వితులై గురుసేవకు విముఖులై యుందురు. అహంకారముతో కూడిన వారగుటచే కూపమునందలి నీటిని పైకి తీయుటకై ఉపయోగింపబడు ఘటీయంత్రము నందలి ఘటములవలె ఘోరమైన సంసారకూపమున మునుగుచు, తేలుచు జననమరణ చక్రమున పరిభ్రమించుచుందురు. అంతేగాదు, శ్రీగురుసేవా పరాఙ్ముఖులయిన వారందరు యేనాటికినీ ముక్తిని పొందజాలరు. (84-86) మహాదేవీ! అందరికి అన్నివిధముల ఆనందమును కలిగించునట్టి, సమస్త సౌఖ్యములను ప్రసాదించునట్టి, భుక్తి - ముక్తులను అనగా భోగ-మోక్షములను అనుగ్రహించునట్టి శ్రీగురుధ్యానమును గూర్చి

వివరించెదను వినుము. (87) శ్రీమత్ – పరబ్రహ్మ గురువునే స్మరించుచున్నాను. పరబ్రహ్మస్వరూపుడగు గురువును గూర్చియే చెప్పుచున్నాను అనగా స్తుతించుచున్నాను. ఆ గురువునకే నమస్కరించుచున్నాను. ఆయననే సేవించుచున్నాను. ఈ ప్రకారముగా పరబ్రహ్మ స్వరూపుడగు శ్రీగురుమూర్తి యొక్కస్మరణము, స్తుతి, భజనము – సేవ, నమస్కారము వీటి రూపముతో కూడిన ధ్యానమును త్రికరణశుద్ధిగా చేయవలయునని తెల్పబడినది. (88) బ్రహ్మానందస్వరూపుడు. పరమసుఖమును ప్రసాదించువాడు, కేవలస్వరూపుడు (భేదములేనివాడు), జ్ఞానమూర్తి. రాగద్వేషాది ద్వంద్వములకు అతీతుడు. ఆకాశమువలె నిర్లేపుడు. తత్త్వమసి ఇత్యాది మహావాక్యములకు లక్ష్యార్థమైనవాడు. ఒక్కడైనవాడు. నిత్యుడైనవాడు. శుద్ధమైనవాడు. కదలనివాడు (స్థిరమైనవాడు), అన్ని బుద్ధులకు సాక్షియైనవాడు. భావములన్నింటికి అతీతమైనవాడు. త్రిగుణములు లేనివాడు. అట్టి సద్గురువునకు నమస్కారము. (89) నిత్యుడు, శుద్ధుడు, భ్రాంతిరహితుడు, ఆకారము లేనివాడు, ఎట్టి మాలిన్యము లేనివాడు, నిత్యజ్ఞాన స్వరూపుడు, చిదానంద మయుడు, బ్రహ్మస్వరూపుడగు గురువునకు నమస్కరింతును. (90) (అదుగో!) హృదయకమలము యొక్క మధ్యభాగమున కేసరములతో కూడిన దుద్దునందలి సింహాసనమును అధిష్ఠించి దివ్యమైన మూర్తిగా వెలుగొందుచుండెను. అంతేకాదు, ఆయన నిండు జాబిల్లి వెన్నెల వెలుగులను విరజిమ్ముచుండెను. కోరిన వరములను ప్రసాదించెడు చిత్స్వరూపమగు పుస్తకమును అనగా – చిన్ముద్రను మరియు వరదముద్రను ధరించియుండెను. (91) ఇంకను ధవళవస్త్రములను ధరించినవాడు, శ్వేతచందనమును అలదుకొనినవాడు, తెల్లని కమ్మని పరిమళాలను గుబాళించెడు పుష్పమాలికను ధరించినవాడు, ముత్యాల హారములు వ్రేలాడుచున్నవాడు, సంతోషభరితుడు, రెండు కన్నులు గలవాడు, వామభాగమున దివ్యశక్తి సమన్వితుడై, పీఠమునందు అలరారుచున్నవాడు. చిరునవ్వులు చిందించుచున్నవాడు, దట్టమైన దయకు నిధియైనవాడు అయిన శ్రీగురుమూర్తిని ఈ రీతిగా భావన జేయుచు చక్కగా ధ్యానించవలయును.(92)

తాను ఆనందస్వరూపుడై ఇతరులకు ఆనందమును కలిగించువాడు, నిత్యప్రసన్నుడు, జ్ఞానస్వరూపుడు, ఆత్మజ్ఞాని, యోగులకు ప్రభువు. స్తుతింపదగిన వాడు. సాంసారిక రోగమును కుదుర్చెడు వైద్యుడు, అయిన శ్రీమద్గురువునకు యెల్లప్పుడు నమస్కరించెదను. (93) ఎవరియందు జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయములు, నిగ్రహ, అనుగ్రహములు అను పంచవిధములగు కృత్యములు నిరంతరము భాసిల్లుచుండునో, అట్టి గురువునకు నమస్కారము. (94) తెల్లని తామరవంటి ముఖమును కలిగి రెండు కన్నులు, రెండు బుజములతో వరదముద్రను, అభయముద్రను వహించియున్న పరమశాంత స్వరూపుడగు గురువును ఉషఃకాలమున స్మరించెదను. (95) “గురువుకంటే అధికమయినది లేదు. గురువును మించిన అతిశయములేదు. గురువు కన్న శ్రేష్ఠములేదు అని ముమ్మాటికీ విధింపబడిన శివుని శాసనము, శివశాసనము. ఇది శివుని ఆజ్ఞ.

(96) ఇదియే సమస్త మంగళములను చేకూర్చునది. ఇదియే సర్వశుభప్రదము. ఇంతకు మిక్కిలి కళ్యాణకారకమైనది వేరొకటిలేదు" అని ఈ మాటను "నేను శాసనపూర్వకముగా మూడుమార్లు పలికి ప్రకటించుచున్నాను". పార్వతీ! అని **పరమశివుడు చెప్పుచుండెను.** (97)

ఈవిధముగా నిష్ఠతో గురువును ధ్యానించవలయును. తద్వారా, ఆత్మజ్ఞానము దానంతట అదియే స్వయముగా లభించును. తత్ఫలితముగా గుర్వనుగ్రహము కలిగి నేను ముక్తుడనైతినని భావించవలయును. (98) గురువు చూపిన మార్గమును అనుసరించి మనస్సును శుద్ధము, నిర్మలమొనర్చుకొనవలయును. ఆపైన నీ మనస్సునకు నశ్వరమైనది, అశాశ్వతమైనది ఏది గోచరించిననూ, ఎంతమాత్రము తోచిననూ వెంటనే దానిని పూర్తిగా ఖండించవలయును. (99) స్వరూపమంతయును గురువే లేదా, ఆత్మయే అని తెలిసికొనదగినది (జ్ఞేయము) ఇంతియే అని మనస్సుతో దృఢనిశ్చయము (జ్ఞానము)ను కలిగి గ్రహింపవలయును. ఈవిధముగా జ్ఞానజ్ఞేయములను సమమొనర్చవలయును. అనగా - జ్ఞానరూపమయిన మనస్సును, జ్ఞేయరూపమున ఆత్మయందు లయమొనర్చవలయును. ముక్తినొందుటకు ఇంతకు మిక్కిలి మరియొక మార్గము లేనేలేదు. (100)

పార్వతీ! ఈ ప్రకారముగా వినిన మీదట, ఎవరు గురునింద చేయుదురో, వారు సూర్యచంద్రులు ఉన్నంతవరకు భయంకరమైన నరకలోకమున నివసింతురు. (101) కల్పాంతకాలమైననూ సరే, దేహమునందు ప్రాణములు నిలిచియున్నంతవరకు గురువును స్మరించుచుండవలయును. ఆ గురువు స్వేచ్ఛాచారియైననూ, ఆయనకు ఏవిధమైన గౌరవలోపము కలిగించరాదు. (102) ప్రాజ్ఞులైన, సమర్థులైన శిష్యులు గురుసమీపమున హుంకారముతో విసుగును చూపకూడదు. అనాదరముతో మాటలాడకూడదు. ఆయన సమక్షమునందు అసత్యమును ఎప్పుడూ చెప్పకూడదు. (103) 'నీవు' అని ఏకవచనమును నిర్దేశించుటగానీ, 'ఓరీ' అని హుంకారమును ప్రదర్శించుటగానీ ఎంతమాత్రము పనికిరాదు. వాదోపవాదములను చేయుట, వాదమునందు గురువును నిర్జించుట వంటి పనులను చేయకూడదు. ఒకవేళ పైన చెప్పిన కూడని పనులు చేసినవాడు, నీరులేని అడవియందు బ్రహ్మరాక్షసుడై చరించును. (104) పార్వతీ! ఒకవేళ మునులు, దేవతలు, నాగులు మున్నగు వారిచేత శిష్యుడు శపింపబడినచో, అతనిని గురువు రక్షించును. అంతేగాదు, మృత్యుభయము నుండి కూడా గురువు కాపాడును. (105) దేవతలు, మునులు మొదలగు వారందరునూ గురు శాపమునుండి తమను తాము రక్షించుకొనుటలో అసమర్థులు. వారు కూడా గురుశాపముచే నశించిపోవుదురని చెప్పుటకు సంశయింపవలసిన పని లేదు. అందుచే గురు శాపమునకు వారు భయపడుచునే యుందురు. (106) 'గురు' అను రెండక్షరములను శ్రేష్ఠమగు మంత్రముగా విశ్వసించవలెను. శ్రుతి, స్మృతివాక్యములను అనుసరించి గురువే

పరమపదస్వరూపుడు. (107) శ్రుతిస్మృతులను తెలియకుండా కేవలము గురువునే సేవించినవారు, అచ్చమైన సన్న్యాసులుగా పరిగణింపబడుదురు. ఇతరులందరు కాషాయవేషధారులు మాత్రమే అని తెలియవలెను. (108) బ్రహ్మము నిత్యమైనది. అది నిరాకారము, నిర్గుణము, ఉత్కృష్టము, భ్రాంతి రహితము, అంతా బ్రహ్మమే అని బ్రహ్మను గూర్చి గురువు తన శిష్యులకు బోధించును. ఒక దీపమే మరియొక దీపమును వెలిగించినట్లుగా, ఇట్టి గురువే తన శిష్యుని ఒక గురువుగా వెలిగింపజేయును. (109) గుర్వనుగ్రహముచేత ఆత్మారాముని దర్శింపవచ్చును. ఇట్టి గురుమార్గము వలననే ఒకరినుండి మరియొకరికి ఆత్మజ్ఞానము అందుచుండును. (110) బ్రహ్మ మొదలుకొని గడ్డిపోచవరకు అంతయూ బ్రహ్మస్వరూపమే. కావున, స్థావరజంగమాత్మకమగు జగన్మయమైన బ్రహ్మమునకు ప్రణమిల్లెదను. (111) సచ్చిదానందమయుడు, భేదరహితుడు, శాశ్వతుడు, పూర్ణుడు, నిరాకారుడు, నిర్గుణుడు, తనలోతానై ఉండునట్టి గురువునకు నిత్యము నేను వందనము చేయుదును. (112) నిత్యము ఆనందకారకమైన శుద్ధమైన స్ఫటికము వలె, నిర్మలమైన తేజస్సుతో హృదయాకాశమున వెలుగొందునట్టి పరాత్పరతరుడైన శ్రీగురువుయొక్క స్వరూపము ధ్యానింపదగినది. (113) స్ఫటికమణితో నిర్మింపబడిన ప్రతిమ యొక్క రూపము దర్పణము నందు గోచరించినట్లు, ఆత్మయందు చిదాకారమై జీవబ్రహ్మైక్యానందము సోహంభావరూపమున భాసించును. (114) హృదయము నందు బొటనవ్రేలంతటి పరిమాణముగల చిన్మయపురుషుని ధ్యానించువారికి ఏయే భావములు స్ఫురించునో, ఎట్టి అనుభవములు కలుగునో, దానిని గురించి చెప్పెదను వినుము. (115) పార్వతీ! బ్రహ్మ స్వభావము ఎట్టిదనగా? అది గోచరము కానిది. గమ్యము కానరానిది. నామము, రూపములు లేనిది. శబ్దరహితమైనది, అదియే బ్రహ్మస్వభావము అని తెలియనగును. (116) కర్పూరము, పుష్పములు మొదలగు ద్రవ్యములయందు గంధము – పరిమళము సహజము, స్వాభావికమూ ఐనట్లుగా, అటులే జలమునకు, తేజస్సునకు శీతోష్ణాది స్పర్శలు సహజమైనట్లుగా, బ్రహ్మకు శాశ్వతత్త్వము స్వాభావికము. (అనగా జీవునకు బ్రహ్మత్వము స్వాభావికమని భావము). (117) అక్కడ ఇక్కడ అని కాకుండా ఎక్కడో, తాను ఉన్నచోటనే ఉండవలెను. తాను స్వయంగా సహజమైన బ్రహ్మత్వమును పొందుటకై కీటకము భ్రమరముగా మారినట్లు నిరంతరము పరబ్రహ్మను ధ్యానించుచుండవలెను. తద్వారా సాధకుని జీవత్వము బ్రహ్మరూపమగును. (118) పై ప్రమాణముగ అనగా – భ్రమరకీటకన్యాయ ప్రకారముగా గురుధ్యానము చేసినచో, అతడు స్వయంగా బ్రహ్మస్వరూపుడు అగును. అట్టి మానవుడు పిండమధ్యే అనగా కుండలినుండి, పదమధ్యే అనగా 'హంసః' నుండి లేదా రూప, బిందువులు అనగా స్థూలసూక్ష్మములే గాక, సర్వస్థితులనుండి ముక్తుడై పోవుట తథ్యము. ఇందు సందేహమక్కరయే లేదు. (119)

సర్వము తానయిన పిమ్మట పరతత్త్వమును ఆలోకించవలయును. అన్యమైన దేదియునూలేదు. అంతా పరాత్పరతరమే. అంతా మృత్యురహితమే. (120) పరతత్త్వమును అవలోకించిన మీదట తద్దర్శనమును పొందును. వెంటనే ఆతడు సర్వసంగపరిత్యాగి యగును. అనంతరము ఏకాకియై, నిస్పృహుండు అనగా ఎట్టి కోరికలు లేనివాడై, గుర్వనుగ్రహము వలన శాంతుడై నిలచియుండును. (121) భిక్షాదికము లభించినను, లభించకపోయిననూ, స్వల్పముగ లభించినను, అధికముగ లభించిననూ నిష్కాముడై భుజించును. ఆతడు ఎల్లప్పుడు తృప్తమనస్కుడై యుండును. (122) ఎవని ఆత్మ సదా ఆనందస్వరూపమై, శాంతస్వరూపమై, సర్వత్ర వ్యాపించి, అన్నిచోట్లను విహరించుచున్నదో అనగా – తనయొక్క ఆత్మయే అందరి హృదయాలలో ఉన్నదను జ్ఞానము గలిగినవాడే, సమస్తమునూ తెలియు ఆత్మస్వరూపుడగుచున్నాడు. ఈవిధముగ సర్వత్ర వ్యాపించినది తన స్వరూపముగ తెలిసికొనుటయే సర్వజ్ఞ పదవియని, అట్టివాడే సర్వజ్ఞపదవిని అధిష్ఠించిన వాడగుచున్నాడని బ్రహ్మజ్ఞానులు పేర్కొనుచున్నారు. (123) అట్టివాడు ఎక్కడ ఉండునో, ఆ దేశము సకల పుణ్యములకు నిలయమగును. అచటగల జనులు మహాపవిత్రాత్ములుగ, దయామయులుగ ఉందురు. దేవీ! ఈవిధముగ ముక్తి మరియు జీవన్ముక్తుని లక్షణములను గూర్చి నీకు చెప్పితిని. (124) ఇంకనూ దేవీ! గురుమార్గమున లభించిన ఉపదేశము ముక్తిని ప్రసాదించునది యగును. ఇంతవరకు నీకు గురుభక్తిని గూర్చి, గురుధ్యానమును గూర్చి పూర్తిగా వివరించితిని. (125) దీనివలన కలిగెడు ప్రయోజనమును గూర్చి ఇప్పుడు నీకు చెప్పెదను. గొప్ప బుద్ధిమంతురాలవైన దేవీ! లోకోపకారకమైన ఈ విషయమును లౌకికమైనదిగా భావించకూడదు. (126) లౌకికమైన కర్మలవలన జనులు జ్ఞానహీనులై సంసారసాగరమున తచ్చాడుచుండెదరు. జ్ఞాని చేసిన సర్వకర్మలను అకర్మలుగనే భావించవలయును. (127)

ఈ గురుగీతను భక్తితో పఠించినవారు, వినువారు, వ్రాసినవారు దక్షిణతోపాటుగా పుస్తకమును దానము చేయవలయును. (128) దేవీ! నేను నీకు శుద్ధ తత్త్వమునే గురుగీతగా చెప్పితిని. సంసార రోగమును నశింపజేయుటకు దీనిని తప్పక నిత్యము జపింపవలయును. (129) ఈ గురుగీత అనునది ఒక మహామాలామంత్రరాజము. ఇతర మంత్రములు ఏవియునూ దీనియొక్క పదహారవ భాగమునకు కూడా సరితూగలేవు. (130) గురుగీతను జపించుటవలన అనంతమైన పుణ్యఫలము లభించును. ఇది సకల పాపములను నశింపజేయును. సమస్త దారిద్ర్యబాధలను తొలగించును. (131) కాలమృత్యుభయమును హరించును. సమస్త సంకటములను నశింపజేయును. యక్షులు, రాక్షసులు, భూతములు, చోరులు, వ్యాఘ్రాది క్రూరమృగములు మొదలగువాని వలన కలుగు భయమును పారద్రోలును. (132) భయంకరమైన సమస్త వ్యాధులను హరించును. దీనిని పఠించిన వ్యక్తి తన చేతితో ఇచ్చిన విభూతి వలన సర్వసిద్ధులు సిద్ధించును. అంతేగాక, స్వయముగా

నిరంతరము అనుష్ఠించినవానికి మోహన, వశీకరణాది శక్తులు హస్తగతమగును. (133) దేవీ! దర్భతోగానీ, గరికతోగానీ సిద్ధపరచిన ఆసనముపై తెల్లకంబళి వేసికొని దానిపై కూర్చుండవలయును. ఏకాగ్రమనస్కుడై గురుగీతను జపింపవలయును. (134) శాంతికొరకై తెల్లని ఆసనమున కూర్చొని జపింపవలెను. వశీకరణమునకై ఎరుపురంగు ఆసనముపై, అభిచారశుద్ధికొరకు నల్లని ఆసనముపై కూర్చుండవలెను. ధనసంపాదనకై పసుపు పచ్చని ఆసనముపై కూర్చుండవలెను. (135) ఉత్తరాభిముఖుడై జపించినచో, శాంతి లభించును. వశీకరణమునకై పూర్వాభిముఖుడై జపించవలయును. మారణమునకు దక్షిణాభిముఖుడై జపింపవలెను. ధనము కొరకు పశ్చిమాభిముఖుడై జపించవలెను. (136) దీని జపము సమస్త ప్రాణులను మోహింపజేయును. బంధములనుండి విడిపించును. దేవరాజగు ఇంద్రునకు ప్రీతిపాత్రమగును. సకలలోకములు వశమగును. (137) సమస్తలోకములను, శత్రువులను స్తంభింపచేయును. సద్గుణములను పెంపొందించును. దుష్కర్మల పాపములను ప్రక్షాళనము జేయును. సత్కర్మలను సిద్ధింపచేయును. (138) అసాధ్యములను సుసాధ్యములుగా మార్చును. నవగ్రహముల భయములను దూరమొనర్చును. దుస్స్వప్న ఫలములను శమింపజేయును. సుస్స్వప్నఫలములను ప్రసాదించును. (139) ఎల్లప్పుడు అన్నివిధములుగ శాంతిని ప్రసాదించును. గొడ్రాలునకు మంచి కుమారుడు కలుగును. దీనిని పఠించిన స్త్రీలకు వైధవ్యము కలుగదు. సదా సౌభాగ్యము లభించును. (140) ఆయువును, ఆరోగ్యమును, ఐశ్వర్యమును, పుత్రపౌత్రాభివృద్ధిని ప్రసాదించును. యే కోరిక లేని వితంతువులు దీనిని జపించిన యెడల వారికి మోక్షము లభించును. (141) దీర్ఘసుమంగళిగా నుండు కోరికతో ఏ స్త్రీయైనను ఈ గురుగీతను పఠించినచో, రాబోవు జన్మమున వైధవ్యము ఘటింపకుండా దీర్ఘకాల సౌభాగ్యము సిద్ధించును. అంతేగాక, సమస్త దుఃఖములు, భయములు, విఘ్నములు, శాపములు హరింపబడును. (142) అన్ని బాధలను పోగొట్టును. ధర్మార్థకామమోక్షములను ప్రసాదించును. ఏయే కోరికలను తలంచి జపించెదరో, ఆయా కోరికలు తప్పక నెరవేరును. (143) ఈ గురుగీత కామితార్థులకు కామధేనువు. ఊహలను ఈడేర్చుటకు కల్పతరువు. చింతితములను తీర్చుటకు చింతామణి, సర్వమంగళకారిణి.(144) మోక్షము కోరి జపించినచో, మోక్షలక్ష్మిని పొందెదరు. భోగము కోరి జపించినచో, సమస్త భోగభాగ్యములు సిద్ధించును. (145)

మహాదేవీ! శాక్తేయులు అనగా దేవీభక్తులు, సౌరులు - సూర్యోపాసకులు, గాణపత్యులు - గణపతి భక్తులు, వైష్ణవులు - విష్ణువును ఆరాధించువారలు. శైవులు - శివభక్తులు మొదలగు వారెవరైననూ, దీనిని జపించినయెడల వారందరికి సిద్ధులు ప్రాప్తించును. నా మాట సత్యము. విశ్వసించుము. ఇందు సంశయము లేదు. మహాదేవీ! కామ్యముతో, ఏదేని ఒక కోరికను సిద్ధింపచేసికొనుటకు ఈ గురుగీతను

అనుష్ఠింపవచ్చును. అందుకుగాను, అనువైన ప్రదేశములను గూర్చి వివరముగా చెప్పెదను. పార్వతీ! వినుము. సముద్రతీరమున, నది ఒడ్డున, విష్ణ్వాలయమునందు, శివాలయమునందు, దేవీ ఆలయమునందు, గోవుల కొట్టమునందు, ఏ దేవాలయమునందైనా, శ్మశానమునందు, భయంకర స్థానమునందు లేక, నిర్మలము, పవిత్రము అయిన ఏదో ఒక ప్రదేశమునందు, మఱ్ఱిచెట్టు, ఉసిరిచెట్టు, జిల్లేడు చెట్టు, మామిడిచెట్టు మూలమునందు దీనిని పఠింపవలయును. నిత్యానుష్ఠానముగా ఎట్టి కష్టమును చెందక, మౌనముగా దీక్షతో ఈ గురుగీతను జపింపవలయును. (147–150) మూర్ఖుడయినను గురుపుత్రుడు శ్రేష్ఠుడు. అతడే సేవింపదగినవాడు. అతనిని సేవించుటవలన దీక్ష, వ్రతము, తపము మున్నగు శుభకర్మలన్నియును సిద్ధించును. గురుపుత్రుని వదలిపెట్టి ఇతరులను సేవించుటవలన ఫలితము శూన్యమే యగును. (151) తత్త్వము తెలిసినవారు సాంసారిక పాపముల నివృత్తికొరకు, సంసారపాశము నుండి విడివడుటకుగాను గురుగీత యనెడు జలమునందు మునిగి స్నానము చేయవలెను. (152) ఈ గురుగీతను పఠించినవాడు సాక్షాత్తు గురువే యగును. అతడే బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడగును. అతడు నిలచిన, నివసించిన ప్రదేశములన్నియును నిస్సంశయముగ పవిత్రములగును. (153) గురుగీతా పాఠకుడు అందరిలోకెల్ల పవిత్రుడు, శుద్ధుడు అగును. అతడెక్కడ నిలచునో, అక్కడ సమస్త దేవగణములు కొలువుదీరును. ఆ ప్రదేశము ఒక తీర్థముగా, ఒక క్షేత్రముగా విరాజిల్లును. (154) గురుగీతను సదా అనుష్ఠించుటవలన జ్ఞానియైన, పరమపవిత్రుడైన ఆ వ్యక్తి కూర్చొనియున్నను, పడుకొనియున్నను, నడచుచున్నను, నిలచియున్నను, మాట్లాడుచున్నను, నిద్రించియున్నను, మేల్కొనియున్నను, గుఱ్ఱమునుగాని, ఏనుగునుగాని యెక్కియున్నను ఆతని దర్శనమాత్రముచేత మరల జన్మము కలుగదు. (155–156) సముద్రములోని జలమువలె, పాలలో పాలవలె, నేతిలో నేయివలె, పగిలిన కుండలోని ఆకాశమువలె పరమాత్మలో ఆత్మ ఉండును. (157) పరమాత్మలో ఎల్లప్పుడు లీనమై యుండు (ఆత్మ) జ్ఞాని ఎక్కడయున్నను జీవబ్రహ్మైక్యముతో రాత్రింబవళ్ళు రమించుచునే యుండును. (158)

పార్వతీ! ఇట్టి జ్ఞానియగు మనుష్యుడు గొప్పనైన నిత్యముక్తుడు కాగలడు. అయితే ఇట్టి మహాముక్తుడు పండితుడు కూడా అయినచో ప్రయత్నపూర్వకముగా భక్తిభావమును పెంపొందించుకొనును. తద్ద్వారా, అతనిలో భావభక్తి ప్రవాహము ఉప్పొంగిపోవుటచే సందేహములన్నియును పటాపంచలైపోవును. ఆ మహాత్ముని నాలుకపైన సరస్వతీదేవి నటనమాడుచుండును. తత్ఫలితముగా అతనికి భుక్తి, ముక్తులు రెండును సులభసాధ్యము లగును. (159–160) కావున, గురుగీతను పఠించుటవలన మానవులందరు సమస్త సిద్ధులను పొందెదరు. అంతేకాదు, భుక్తిముక్తులను పొందగలరని చెప్పుటకెంత మాత్రము సంశయింపవలసిన పనిలేదు. (161) పార్వతీ! నేను నీకు సమగ్రధర్మసారమును చెప్పితిని. గురుగీతకు సాటిరాగల మరియొక గ్రంథము లేదు, లేదు, లేనేలేదు. ఇది సత్యము. నా మాట ముమ్మాటికి సత్యము. (162)

ఒకే దైవము, ఒకే ధర్మము, ఒకే నియమమును కలిగియుండుటయే గొప్ప తపస్సు. గురువును మించిన ఉత్కృష్టమైన తత్త్వము మరియొకటి లేదు. (163) గురుభక్తి గలవాని కన్నతల్లి ధన్యురాలు. తండ్రి ధన్యుడు. అతని వంశము, కులము ధన్యములు. అతడు నివసించిన, నడయాడిన భూమాత ధన్యురాలు కాని, గురుభక్తి మాత్రము కడు దుర్లభము. (164) దేవీ! ఇక శరీరము, ఇంద్రియములు, ప్రాణములు, ధనము, ఆప్తులు, బంధువులు, మాతృవంశము, పితృవంశము అంతయూ గురువే సుమా! సంశయము వలదు. (165) పార్వతీ! ఇంతెందులకు, గురువును సంతోషపరచగలిగిన చాలును. గురువు తన యెడల ప్రసన్నుడయినచో, కల్పాంతకాలము వరకు గలిగెడు కోటి, కోటి జన్మలలో చేయబడిన జపము, వ్రతము, తపము మొదలగువాని వలన కలిగెడు సమస్తఫలము లభించును. (166) పార్వతీ! విద్యాబలము వలన, తపోబలము వలన గర్విష్ఠులైన వారలు, దురదృష్టవంతులగు మనుష్యులు గురువును సేవింపజాలరు. ఇది సత్యము. (167) బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, దేవర్షులు, పితృదేవతలు, కిన్నరులు, సిద్ధులు, చారణులు, యక్షులు, ఇతర మునిజనులు మున్నగువారందరిలో గురుసేవకు నోచుకొనని వారెల్లరూ మందభాగ్యులే సుమా! (168) గురుభావమే పరమతీర్థము. అట్టి గురుతీర్థమును సేవించని యెడల ఇతర తీర్థములన్నియును వ్యర్థములే. శ్రీగురుదేవుల పాదాంగుష్ఠము నందే సర్వతీర్థములు ఆశ్రయించి యుండును. (169) నీచమైన కర్మలను, నికృష్టమైన ప్రదేశములను త్యజించి, గురుగీతను జపించినచో, జయము సిద్ధించును. అనంతపుణ్యఫలము లభించును. (170) ప్రయాణమునందుకాని, యుద్ధమునందుకాని, శత్రుబాధ యందుగాని, గురుగీతను జపించినచో, జయము లభించును. ఒకవేళ మరణించినచో, ముక్తి లభించును. పితృభావముతో గురువును సేవించినవారికి అంతట, అన్ని కర్మలు సిద్ధించును. (171-172) ఈ రహస్యమును ఎవరికీ చెప్పకూడదు. పార్వతీ! నీవు నాకు చాల ప్రియమైనదానవు. కనుక, నీకు మాత్రమే చెప్పితిని. ప్రయత్నపూర్వకముగా ఈ రహస్యమును నీవు కాపాడవలయును. (173) పర్వతపుత్రీ! కార్తికేయుడు, గణేశుడు, విష్ణువు మొదలగు దేవతలకు కూడా ఈ గురుగీతను చెప్పకూడదు. ఈ మాటను మనసుతో కూడ తలంచకూడదు. మాటిమాటికి చెప్పిన సత్యమైన నా ఈ మాటను మరువకూడదు సుమా! (174) మిక్కిలి పరిపక్వమైన చిత్తము గలవారికి, శ్రద్ధాభక్తులు గలవారికి ఈ గురుగీతను తప్పక చెప్పవలయును. అట్లు చెప్పినవాడు నాకు అత్యంత ప్రియమైన వాడగును. (175) భక్తిహీనుడు, మోసగాడు, దుర్మార్గుడు, ధూర్తుడు, పాఖండుడు, నాస్తికుడు మొదలగువారికి ఈ గురుగీతను చెప్పవలయునని ఏనాడైననూ, ఎప్పుడైననూ, ఎన్నటికినీ మనసులోనైననూ తలంచకూడదు.(176)

॥ ఇది శ్రీ స్కాందపురాణమునందలి ఉత్తరఖండమున 'పార్వతీ - పరమేశ్వర' సంవాదముతో కూడిన గురుగీత సమాప్తము ॥

ఈవిధముగ స్కాందపురాణమున ఉత్తరఖండమున పార్వతీ – పరమేశ్వరుల సంవాదరూపమున వర్ణింపబడిన “గురుగీత”ను గూర్చి సిద్ధమునీంద్రుడు నామధారకునితో సవిస్తరముగ వర్ణించి చెప్పెను. **అనంతరము సిద్ధముని యిట్లు పల్కెను** – “నామధారకా! పరమేశ్వరుడు పార్వతీదేవికి బోధించిన ఈ గురుమార్గము పరంపరగా కొనసాగుచున్నది. గురుసేవ అత్యంత దుర్లభమైనది. బ్రహ్మాది దేవతలందరును శ్రీగురుపరంపరాగత మార్గమును సమాదరించెదరు. ఎవరైతే అంతర్నిష్ఠతో తురీయమునకు ఆవలివైపునగల ఉన్మనీదశకు చేరుకొనెదరో, వారే అందరిలోకెల్ల శ్రేష్ఠులుగా పరిగణింపబడెదరు. (14–15)

గురుసేవ ద్వారా అనంతసుఖము లభించును. దుఃఖములన్నియును సమసిపోవును. అట్టి మానవులే ఈ ధరిత్రిపై ధన్యులుగా శ్లాఘింపబడెదరు. వసిష్ఠుడు, వాల్మీకి, జనకుడు మున్నగు వారందరు గురుసేవలో కృతార్థులై అఖండకీర్తిని ఆర్జించిరి. చతురులు, వివేకవంతులు అగు మీరు శ్రీగురుమూర్తిని భజింపుడు, సేవింపుడు. అత్యంత భక్తిశ్రద్ధలతో సద్గురువును పూజించినవారికి తప్పక సద్గతులు లభించును. కావున, అనన్యచిత్తముతో శ్రీగురుమూర్తిని శరణు కోరవలయును. సద్గురువు సంతుష్టుడైనచో, త్రిమూర్తులు సైతము సంతృప్తి నొందెదరు. పరంపరాగతముగా వచ్చుచున్న ఈ గురుమార్గము వేదశాస్త్రములకు సమ్మతమైనది. పూర్వము గడచిపోయిన యుగములందు మానవదేహమునకు ఆయువు అత్యధికముగ ఉండెను. ఆనాటి మనుష్యులు ఎంతయో శ్రమకోర్చి పుష్కలముగా తపస్సు చేసెడివారు. అటు తరువాతనే వారికి మోక్షము లభించుచుండెను.(16–20)

ప్రస్తుతము కలిప్రభావము ప్రబలమయ్యెను. వేదమార్గము అంతయును లుప్తప్రాయమయ్యెను. జనులు జ్ఞానహీనులైరి. పశుప్రాయులైరి. మూఢులుగా మారిపోయిరి. నేటి కలికాల మహిమ వలన జ్ఞానులు కూడా మూఢచిత్తులయిరి. మాయాపాశ పరివేష్టితులగుటచే కనులున్న కబోదులుగా, చెవులున్న చెవిటివారుగా మారుచుండిరి. కావున, మీవంటి విద్వజ్జనులు స్థిరమనస్కులై ‘గురుభావము’ను కలిగియుండవలెను. తద్వారా, గుర్వనుగ్రహము లభించి మీ సాంసారిక సంకెళ్ళు విడివడిపోవును. (21–23)

ఎవరికి గురుప్రసాదము లభించునో, వారికి ముందుగా కామ, క్రోధ, మదములు దూరమైపోవును. అనంతరము కైవల్యపదము ప్రాప్తించును. అది చ్యుతి లేనిదగు అచ్యుత పదవిగా చేజిక్కును. ఈ కారణముగనే సాధుజనులను సముద్ధరించుటకొరకై శ్రీమన్నారాయణమూర్తియే స్వయముగా కలియుగమునందు శ్రీగురుమూర్తిగా అవతరించెను. భూభారమును హరించుటకై అవధూతేంద్రుడగు శ్రీదత్తాత్రేయులవారు మానవదేహమును ధరించి శ్రీపాదరాయలుగా జన్మించెను. అంతేకాదు, లక్ష్మీపతియగు శ్రీమన్నారాయణమూర్తి యొక్క కేవల సాత్త్వికరూపమును

స్వీకరించి శ్రీపాదశ్రీవల్లభులుగా అవతరించెను. శ్రీగురుమూర్తిగా సుప్రసిద్ధమగు స్వరూపమునవెలసి మందమతులైన వారినందరిని ఉద్ధరించెను. సద్భావభావితులగు జనులు ఎక్కడెక్కడ ఉండిరో, వారి పిలుపు లేకుండగనే భక్తవత్సలుడైన యోగిరాజగు శ్రీసద్గురుమూర్తి తమంతట తాముగా వారిని ఉద్ధరించుటకై వారి వారి గృహములకు యేగుచుండెను. తద్విరుద్ధముగ, సద్భావపరంపర లేనివారు ఎంతగా ఆహ్వానించిననూ వారి గృహములకు శ్రీగురుమూర్తి వెళ్ళెడివారు కాదు. కావున, భావభక్తిని కలిగియుండవలెను. శుష్కమైన భక్తి ఫలవంతము కానేరదు. యుక్తి యుక్తమగు ఈ కథకు ఇంతటితో స్వస్తి పలికెదముగాక! సద్భావమును కలిగి సద్గురు భజన చేయవలయును. ఎవరికి గురువుయొక్క సంపూర్ణ అనుగ్రహము లభించునో, వారికి శివానుగ్రహము తప్పక లభించును. అంతేగాదు, అది ఆశ్రితుల మోహపాశములను తునాతునకలుగ చేసి, వారిని శాశ్వతమగు పరమపదమునకు చేర్చును. (24-30)

"సంసారము అనగా అపారమైన సముద్రము వంటిది. అది జనన-మరణములతో కూడినది. శాశ్వతముగ దానిని దాటిపోవుటకు గాఢమైన భక్తిభావమును కలిగియుండవలెను. అప్పుడే ఆవలితీరమును సునాయాసముగ చేరగలిగెదము. కామధేనువు వంటిది గురుభక్తి. అది కోరిన కోరికలను ఈడేర్చును. కావున, ఎంతమాత్రము సందేహించకుండా దృఢమైన విశ్వాసమును కలిగి శ్రీగురుమూర్తిని శరణుగోరవలెను. శ్రీగురునాథుడు ప్రసన్నుడైనచో, యముడు కూడా బాధింపలేడు. నిప్పుకణిక తగిలితే చాలు గడ్డికుప్ప కాలి బూడిద యగునట్లుగా, గుర్వనుగ్రహముచేత సమస్త పాపరాశులు నిశ్శేషముగా నశించిపోవుట తథ్యము" అని సిద్ధముని నామధారకునకు ఉపదేశించిన దానిని శ్రీసరస్వతీ గంగాధరుడు గ్రంథరూపమున లోకమునకు ప్రకాశింపజేసెను. (31-34)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున భక్తికాండమునందు "గురుగీతా వర్ణనము" అను నలుబది తొమ్మిదవ అధ్యాయము ॥ 49 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 34; శ్లోకాలు - 176 = 210; మొత్తము 6838 + 210 = 7048 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ఏబదియవ అధ్యాయము

గుర్వనుగ్రహముచే రజకసేవకుడు మ్లేచ్ఛరాజుగా జన్మించుట - రాజు దేహమునందు రాచపుండు కలుగుట - వైద్యచికిత్సలు వ్యర్థమగుట - సత్పురుష సందర్శనమువల్లనే నీ బాధ తొలగునని రాజుగారికి ఒక యతీశ్వరుడు సూచించుట - పింగళివేశ్య - దుష్టబ్రాహ్మణుని కథ - మ్లేచ్ఛరాజు శ్రీగురు దర్శనార్థమై గాణగాపురము వెళ్ళుట- శ్రీగురుకృపతో రాజుగారి రాచపుండు మటుమాయమగుట - పూర్వజన్మ స్మృతితో గురుమూర్తిని గుర్తించి శరణుగోరుట - శ్రీగురుడు మ్లేచ్ఛరాజు నగరమును సందర్శించి వారిని ఆశీర్వదించుట - దుష్కాలము దాపురించినదని అవతారమును మరుగుపరచి గుప్తరూపమున నుండుటకై యోచించి శ్రీగురుమూర్తి శ్రీశైలయాత్రను సంకల్పించుట.

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

సిద్ధముని నామధారకునితో చెప్పుచుండెను- "నామధారకా! గురుచరిత్రము యొక్క క్రమమునందు ఇంతకుముందే గురుమూర్తి యందు అతి భక్తిగల ఒక రజకుని గూర్చిన కథను చెప్పియుంటిని. ఆ రజకుని భక్తికి ప్రసన్నుడైన శ్రీ గురుమూర్తి ఏదేని వరమును కోరుకొనుమనగా అతడొక గొప్ప రాజపదవి కావలెనని కోరుకొనెను. మరుజన్మలో తప్పక నీకు రాజపదవి లభించునని గురునాథుడు వరమును ఒసగియుండెను.(1) ఆ రజకుని అనంతర జన్మవృత్తాంతమును గూర్చిన కథను ఇప్పుడు నీకు చెప్పుచుంటిని. సావధానముగా వినుము. (1-2)

గురుమూర్తి వలన వరమును పొందిన కొంతకాలమునకు ఆ రజకుడు మరణించి విదురా నగరమును పరిపాలించుచున్న ఒక మ్లేచ్ఛరాజునకు కుమారుడై జన్మించెను. అతడు పెరిగి పెద్దవాడైన పిమ్మట కళత్ర, పుత్ర, పౌత్రాదులతో వృద్ధినొంది మహదానందభరితుడై విదురానగరమును పరిపాలించు చుండెను. అతనికి గల అశ్వ, గజ, రథ, పదాతి సైన్యమునకు పరిమితియే లేకుండెను. అపారమైన సంపదకు తగినట్లుగా అఖండమైన భోగభాగ్యములతో విలసిల్లుచుండెను. అయితే, అతడు హీనజాతియందు జన్మించినప్పటికినీ, జన్మాంతర

---

1. ఈ కథ తొమ్మిదవ అధ్యాయమునందు చెప్పబడినదని గమనింపగలరు.

సంస్కారము వలన అతని అంతఃకరణమునందు పుణ్యవాసనలు ఉండుటచే దానధర్మములను చేయుచుండెను. అన్ని మతముల, అన్ని జాతులవారిని సమభావముతో చూచుచుండెను. బ్రాహ్మణులయందు అతడు విశేషభక్తిని కలిగి యుండెను. దేవ, బ్రాహ్మణ క్షేత్రములను పరులు అపహరించకుండా, వాటికి ఎట్టి ఉపద్రవములు వాటిల్లకుండా కాపాడుచుండెను. అతని విపరీత చర్యలను చూచి ఆ మ్లేచ్ఛరాజు యొక్క పురోహితుడు ఒకనాడు రాజును సమీపించి, **అతనితో తమ జాతిధర్మమును గూర్చిన హితమును ఇట్లు బోధించుచుండెను–** "రాజా! మనము మ్లేచ్ఛజాతికి చెందినవారము. కావున, బ్రాహ్మణులను, దేవతలను నిందింపవలెను. వారిని ఎంతమాత్రము గౌరవించకూడదు. నీవు దేవ, బ్రాహ్మణులను సేవించుటచే మహాపాతకము సిద్ధించును. జాతి ధర్మమును అనుసరించి నడచుకొనుట మానవులకు యోగ్యమైన కార్యము. తద్ద్వారా, అపారమైన పుణ్యము లభించి, చక్కని సుఖముకూడా సిద్దించును. బ్రాహ్మణులు బుద్ధిహీనులు, వారి ఆచారధర్మములను ఒకసారి పరిశీలించుము. రాళ్ళను, కర్రలను, చెట్లను, పశువులను, ఆవును, అగ్నిని, సూర్యుని, తుదకు నీళ్ళను, నదులను మొదలగు వాటినన్నింటినీ దేవుడని పూజించెదరు. మూర్ఖులైన బ్రాహ్మణులు నిరాకారమును సాకారమందురు. దేవుడు నిరాకారుడే, కాని, సాకారుడెట్లగును. కావున, మ్లేచ్ఛజాతిలో పుట్టి అట్టివారిని సేవించుటవలన, గౌరవించుటవలన మనము పతితులమై అధోగతి పాలగుదుమని" యవన పురోహితుడు తమ రాజునకు హితవును బోధించెను. (3–12)

పురోహితుని ఉపదేశమును శాంతచిత్తముతో వినిన రాజు, ఆతనితో ఇట్లు పలికెను – "అయ్యా! నా మాటను కూడా వినుము. ఇంతకుముందు మీరే అణువులోను, రేణువులోను, తృణము నందును, కాష్ఠమునందును, రాళ్లలోను, రప్పలోను సర్వేశ్వరుడున్నాడని చెప్పియుంటిరి. నిజమునకు ఈశ్వరుడు లేని చోటు లేనేలేదు. ఈ సృష్టినంతటినీ ఈశ్వరుడు స్థావర జంగమముగా రచించెను. సర్వత్రా దేవుడొక్కడే ఉన్నాడు సుమా! కాని, మతములయొక్క ఆలోచనవిధానముల యందే భిన్నత్వము కన్పట్టుచున్నది. సమస్త జాతులకు చెందిన వారి ఉత్పత్తి భూమి, నీరు, నిప్పు, ఆకాశము, వాయువులను పంచభూతములనుండే జరుగుచుండును కదా! అందరికి గల ఈశ్వరుడు ఒక్కడే. కాని, తెలియని వారు మా ఈశ్వరుడు వేరు, మీ ఈశ్వరుడు వేరని కలహించుకొందురు. ఇది చిత్రమని తోచును. ఏలయన, నేల అందరికి ఒక్కటే గదా! మట్టితో తయారు చేసిన వేర్వేరు పాత్రలు ఒకే ఒక నేలయందలి మట్టితోనే చేయబడును కదా! ఒకే మట్టితో తయారుచేసిన పాత్రలకు పరస్పర భేదము ఎట్లుండదో, అటులనే పంచభూతములతో ఏర్పడిన వివిధ శరీరములలో కూడా భేదము ఉండజాలదు. ఆవులు అనేక రంగులుగా వుండును కాని, అవి ఇచ్చే పాలు తెల్లగనే వుండును కదా! వాటి పాలను వివిధ పాత్రలలో పోసి చూడగా పాత్రల భేదమేగాని,

పాలలో భేదముండునా? అటులనే బంగారము ఒక్కటే. కాని, దానితో తయారుచేయబడిన ఆభరణములు వేర్వేరుగా కన్పట్టుచుండును. కాని, అన్ని ఆభరణములలో వుండు బంగారము ఒక్కటియే కదా. అటులనే, దేహములు భిన్నభిన్నములుగా కనబడుచున్నప్పటికినీ, సర్వభూతములయందు వుండు పరమాత్మ ఒక్కడే. ఆకాశమునగల చంద్రుడు ఒక్కడే. కాని, వేరు వేరు కుండలలో అనేకములుగా గోచరించును. అందరి గృహములయందు వెలుగు దీప ప్రకాశము ఒక్కటియే. దానికి వత్తులు వేయి పెట్టి వెలిగించినప్పటికినీ, అవి అన్నియు ఒకేవిధమైన వెలుతురును ప్రసాదించును. ఒకేదారమునకు రకరకములైన మణులను గ్రుచ్చినప్పుడు అది ఒకే హారమగును, మణులు వేరు గాని, సూత్రమొక్కటే కదా!. అటులనే ఈ నేలమీద అనేక రకముల జాతులు, మతములు ఉన్నప్పటికినీ అందరికీ గల దేవుడొక్కడే అని భావించవలెను. కాని, భిన్నభావమును పెట్టుకొనరాదు. పాషాణములను దేవతలుగా పూజించెదరని నీవు మరియొక మాటను కూడా చెప్పియుంటివి. విశ్వాత్మ తానొక్కడే, అన్ని చోటులయందు పరిపూర్ణముగా భాసించుచుండును. అజ్ఞానులకు విగ్రహారాధన చేయుట, జ్ఞానులకు ఆత్మారాముని పూజించుట యోగ్యమైన పని. కాని, విగ్రహములను పూజించువారలు ఒక రాతి విగ్రహమును సిద్ధపరచి తమ అంతఃకరణమునందు, దానికి 'నారాయణ' అని పేరు పెట్టి పూజించెదరే కాని, 'ఓ రాయీ' అని పిలిచి ఎవరునూ పూజింపరు గదా!. అన్నింటిలో భగవద్భావమును భావించి పూజింతురే కాని, వస్తుప్రధానముగా పూజించుట వారియందు లేదు. అన్నిచోటులయందు పరిపూర్ణుడు అంటూనే, వారిని నీవు నిందించుచుంటివి. మన మతమును బలోపేతము చేయుటకొరకు, వారిపై మనము ద్వేషము పూనుట యెందులకు? జ్ఞానులైన వారు ఇతరులను నిందాస్తుతులను చేయకూడదు. జాతులు అనేక రకములుగ ఉన్నప్పటికినీ మనము మన పద్ధతిని పాటించవలెను. పరమాత్మ ఒక్కడే అయి వుండగా భేదమునకు తన్మూలకమైన పరస్పర ద్వేషమునకు ఇక తావెక్కడిది? కావున, నేను వారలను ద్వేషింపజాలను. ఏ జాతి వారైననూ నాకు ఒక్కటే. ఇక మీదట మీరు దయచేసి ఇటువంటి ద్వేషభావములను పురిగొల్పెడు ఉపదేశ బోధనలను నాకు చెప్పకూడదని" ఆ పురోహితుని మందలించి పంపించివైచెను. (13-27)

అనంతరము ఆ మ్లేచ్ఛరాజు ఎప్పటివలెనే పుణ్య కర్మలను ఆచరించుచూ, దేవతలందరిని సమభావముతో చూచుచూ, దేవ బ్రాహ్మణులను సత్కరించుచూ, విదురానగరమున ఉండి, రాజ్యపాలనము చేయుచుండెను. కొంతకాలమునకు ఆ మ్లేచ్ఛ రాజుయొక్క తొడపైన ఒక రాచపుండు పొడమెను. ఎందరో వైద్యులు వచ్చి ఆ వ్రణమునకు అనేక విధముల చికిత్సలు చేసిరి. ఔషధ లేపనములు చేసిరి. పట్టీలు వేసిరి. కాని, అది ఎంతకూ ఉపశమింపక పోయెను పైగా, మహా దుఃఖమును కల్గించుచుండెను. అతడు ఆ రాచపుండుతో మిగుల బాధపడుచుండెను.

ఇట్లుండగా అప్పుడు గాణగాపురములో కొలువైయున్న శ్రీగురునాథుడు సర్వజ్ఞులు గాన, తాను వరమనుగ్రహించిన రజకుడు మ్లేచ్ఛరాజై జన్మించి, తగని వ్యాధితో బాధనొందుచున్నాడనియు, అతడు తమ దర్శనార్థముగా వచ్చుననియు గుర్తించి, మేము ఇటులనే ప్రకటమై యుండుటచే, ఇకముందు ఇచటికి మ్లేచ్ఛులు కూడా వచ్చెదరు. వారి వలన బ్రాహ్మణులకు బాధలు కలుగును. అది లోకాచారమునకు విరుద్ధముగ నుండును. మా మహిమ వ్యాపించుటచే, అది చూచుటకై, దానిని గుర్తించుటకై ఇకముందు మ్లేచ్ఛులు కూడా ఇచటికి వచ్చుట సంభవించును. ఇక "మేము వ్యవహార దృష్టికి అందకుండా, బాహ్యముగ గోచరించకుండా గుప్తముగా ఉండిపోవలెను" అని గురునాథుడు తమలో తాము విచారించుకొనిరి. ఇంతలో ఈశ్వర నామ సంవత్సరమున సింహరాశిలో గురుడు ప్రవేశించు సమయము ఆసన్నమయ్యెను. గోదావరి తీర్థము శ్రేష్ఠమైనది. కనుక, ఇప్పుడు పుష్కరయాత్రకు వెళ్లుట ఉచితము అని భావించి, శ్రీస్వామివారు గోదావరి యాత్రగా ప్రయాణమై వెళ్లవలయునని సంకల్పించుకొనిరి. వెంటనే తమ శిష్యులతో గోదావరి యాత్రకై తగిన సన్నాహములను సిద్ధము చేయుడని నుడివెను. మమ్ములను తీసుకొని వెళ్లుటకు మ్లేచ్ఛరాజు వచ్చును. కావున, గోదావరి దర్శనమునకు వెళ్ళవలయునని తమ శిష్యులతో గురునాథులు చెప్పిరి. అదివిని శిష్యులు ఒకవేళ ఆ మ్లేచ్ఛరాజు ఇచటికి వచ్చిన యెడల ఎట్లు? ఏమి జరుగునో? అని తమలో తాము చర్చించుకొనిరి. అనంతరము ఏమీ కాగలదో వేచి చూచెదముగాక! మనకు అండగా గురుమూర్తియగు నృసింహసరస్వతి స్వామివారు వున్నారుగదా! వారే మనలను రక్షించెదరని తమలో తాము విచారించుకొని, అందరికందరు నిశ్చింతగా నుండిరి. (28-36)

మ్లేచ్ఛరాజునకు రాచపుండువలన కలిగే బాధ మరింతగా పెరిగిపోవుచుండెను. దినదినమునకు అది విజృంభించుచుండెను. ఎన్ని ఔషధములు వాడిననూ, ఎందరు వైద్యులు వచ్చి ఎన్ని చికిత్సలు చేసినను అతని వ్యాధి ఉపశమింపలేకుండెను. తనకు కలిగిన వ్రణముతో పెరిగిపోవుచున్న బాధను భరింపలేక, ఆ మ్లేచ్ఛరాజు పెద్దలను, సాధువులను, బ్రాహ్మణోత్తములను పిలిపించి, దీనికి తగు ఉపాయ మేమిటని వారిని ప్రశ్నించెను. **అప్పుడా విప్రులు రాజుతో ఇట్లు చెప్పిరి–** "రాజా! పూర్వజన్మలో చేసిన పాపములు వ్యాధి రూపమున పీడించును. కనుక, తీర్థయాత్రలకు వెళ్ళి దానధర్మములను చేయవలయును. తద్వారా, కొంత వ్యాధి ఉపశమించును. లేదా, అచట సత్పురుషులు నివసించుచుందురు. అట్టి సాధు సత్పురుషులను దర్శించి, పూజించవలెను. వారి అమృతమయమైన కృపాదృష్టిచేత వ్యాధి తప్పక ఉపశమింపవచ్చును. సత్పురుషుల దయాపూరిత దివ్యదృష్టివలన కోటి జన్మల పాపములు నశించిపోవును. ఇక రోగమనునది ఎట్లుండును? తప్పక వ్రణము వెంటనే నయమగును" అని పలికిరి. **విప్రుల మాటలు వినిన ఆ రాజు వారికి నమస్కరించి, ఇట్లు పలికెను –** "అయ్యా! నన్ను మీరు మ్లేచ్ఛుడని

భావించవద్దు. నేను బ్రాహ్మణులకు దాసుడను. పాపరాశివలన మ్లేచ్ఛ కులమునందు జన్మించితిని. గత జన్మలో నేను శ్రీగురుచరణ సేవను చేసితిని. మీరు చెప్పినట్లుగా మహానుభావుల దర్శనము వలన ఇంతకు పూర్వము ఎవరి వ్యాధియైననూ ఉపశమించినదా? అట్టి వృత్తాంతమేదైన ఉన్నచో, దయచేసి నాకు వినిపించగలరని" ప్రార్థించెను. (37-46)

రాజుగారి మాటలను విని బ్రాహ్మణులు తమలో తాము ఇట్లు తలంచిరి. అట్టి వృత్తాంతమును ఇచట చెప్పకూడదు. ఏకాంతస్థానములో మాత్రమే చెప్పవలెను అని భావించి **రాజుతో ఇట్లు పలికిరి.** "నీవు మ్లేచ్ఛ జాతికి చెందిన రాజువు. మేము బ్రాహ్మణ కులమునకు చెందినవారము. అందరు నిన్ను నిందించెదరు. మేము ఎట్లు చెప్పుదుము" అని పలికిరి. **బ్రాహ్మణుల మాటలు విని ఆ యవనుడు ఇట్లనెను** – "బ్రాహ్మణోత్తములారా! జాతిని గురించిన పట్టింపు నాకు లేదు. దయతో మీరు నన్ను ఉద్ధరింపవలయునని" కోరెను. అంతట ఆ విప్రులు రాజుతో ఇట్లనిరి – "రాజా! 'పాపవినాశ' తీర్థము మంచి యోగ్యమైన ప్రదేశము. మీరచటికి వినోదార్థమై వెళ్ళగలరు. ఆ ప్రదేశము పవిత్రమైనది. అచట ఒక ఏకాంత ప్రదేశము ఎంపిక చేసుకొని, మనస్ఫూర్తిగా నిశ్చలచిత్తముతో స్నానము చేయగలరు" అని బ్రాహ్మణులు చెప్పిన మాటలను విని ఆ రాజు సంతోషించెను. వెంటనే ఆ రాజు పాపవినాశ తీర్థమునకు బయలుదేరెను. పరిమితమైన పరివారమును వెంట తీసుకొని ఆ మ్లేచ్ఛరాజు పాపవినాశనమను క్షేత్రమునకు యాత్రగా వెళ్ళి, తన పరివారమును దూరముగా ఉంచి, తాను ఒంటరిగా ఒక ఏకాంత ప్రదేశమును ఎంపిక చేసుకొని పాపవినాశన తీర్థమందు స్నానము చేసెను. వెంటనే, అచటికి ఒక యతి వచ్చుట తటస్థించెను.స్నానము చేసిన రాజు ఆ యతీశ్వరుని చూసి, కడు భక్తితో నమస్కరించి, తనకు సంభవించిన వ్రణబాధను నివేదించెను. **అనంతరము కడు వినమ్రుడై వారిని ఇట్లు ప్రార్థించెను.** "స్వామీ! నా ఈ వ్రణము ఉపశమించు మార్గమును చెప్పగలరు". **వెంటనే ఆ మహానుభావుడు రాజుగారితో ఇట్లు చెప్పసాగెను**– "రాజా! నీవు సత్పురుషుల దర్శనము చేసినచో, నీకు గల ఈ వ్రణము ఉపశమింపగలదు. సత్పురుషుల సందర్శనమువలన లభించిన ఫలము నీకు స్పష్టముగా బోధపడుటకై ఇంతకుపూర్వము జరిగిన ఒక ఇతిహాసమును నీకు వివరముగా చెప్పుచుంటిని, సావధానముగా వినుమని ఆ యతీశ్వరుడు ఇట్లు చెప్పసాగెను. (47-57)

అవంతీ నగరమున పూర్వము బ్రాహ్మణ కులమునందు జన్మించిన ఒక యువకుడు ఉండెను. అతడు దుష్టసహవాసము చేత దురాచారపరుడయ్యెను. మదోన్మత్తుడై పరస్త్రీలతో రమించెడివాడు. స్నాన సంధ్యాదులవంటి నిత్యకర్మానుష్ఠానములకు పూర్తిగా స్వస్తి చెప్పెను.

రాను రాను తల్లిదండ్రులను త్యజించి, అతడు పింగళ అను పేరు గల ఒక వేశ్యతో నివసింపసాగెను. అనంతరము వేశ్యాలోలుడై రాత్రింబవళ్లు ఆమె గృహమునందే నివసించుచు, ఆమె చేతి భోజనమునే భుజించుచు, పూర్తిగా భ్రష్టుడైపోయెను. (58-61)

ఇట్లుండగా, దైవవశమున ఒకనాడు ఆ బ్రాహ్మణుడు వేశ్యా గృహమునందుండగా 'ఋషభుడు' అను పేరు గలిగిన ఒక మహాయోగి అచటికి వచ్చుట తటస్థించెను. ఆ యోగిని చూడగనే వారిరువురు లేచి, ఎదురుగా వెళ్లి, సాష్టాంగ వందనము చేసి, భక్తి భావముతో తమ ఇంటిలోనికి స్వాగతించిరి. వారిని ఒక ఉన్నతాసనముపై కూర్చుండచేసి అర్ఘ్యపాద్యాదులనిచ్చి, గంధాక్షతలతో అలంకరించి, షోడశోపచారములతో పూజించిరి. అనేక పరిమళభరితములైన పుష్పములతో, సుగంధద్రవ్యములతో ఆ మహా యోగిని సభక్తికముగ పూజించిరి. వారుభయులు ఆ మహాయోగి యొక్క చరణతీర్థమును స్వీకరించిరి. వారికి అనేక విధములైన పిండివంటలతో మృష్టాన్నభోజనమును పెట్టిరి. భోజనము చేసిన పిమ్మట ఉత్తమ శయ్యపై ఆ యోగిని ఆసీనుని చేసి, ఆయనకు తాంబూలమును కూడ ఇచ్చి, అత్యంత భక్తిభావముతో వారికి పాదసంవాహనమును కూడా చేసిరి. యోగీశ్వరుడు చక్కగా నిదురపోయెను. అంతట వారిరువురు శ్రీయోగీశ్వరునకు నమస్కరించి మరునాటి బ్రాహ్మీముహూర్తము వరకు కడు భక్తితో ఈ ఉభయులు ఆయనను సేవించిరి. సూర్యోదయమైన వెంటనే ఆ మహాయోగి వారి నుండి సెలవు తీసుకొని, తన మార్గమున తాను వెళ్ళిపోయెను. (62-70)

ఈ విధముగ దురాచారపరుడైన ఆ బ్రాహ్మణుడు పింగళి అను వేశ్య ఇంటిలోనే నివసించుచూ, కొంతకాలము గడచిన పిమ్మట, అతని శరీరమునకు యౌవనదశ గడచిపోయి, వృద్ధాప్యదశ ప్రారంభమయ్యెను. అనంతరము కొలదికాలమునకు ఆ బ్రాహ్మణుడు మరియు ఈ వేశ్య ఇరువురును మరణించిరి. మహాయోగిని సేవించిన పుణ్య విశేషమున మరియు పూర్వజన్మల కర్మలను అనుసరించి దురాచారపరుడైన ఆ బ్రాహ్మణుడు దశార్ణవ దేశాధిపతియగు వజ్రబాహు మహారాజుగారి మొదటి భార్యయైన సుమతి అను మహారాణి గర్భమున ప్రవేశించెను. వజ్రబాహుడు తన పెద్దభార్య సుమతి ప్రథమ గర్భమున పుత్రసంతానము కలుగగలదని భావించెను. కడు ముదముతో సీమంతమను పేరిట, ఆ రాజు గొప్ప మహోత్సవము నిర్వహించెను. ప్రథమ సంతానముగా తనకు పుత్రుని ప్రసాదించగలదని అతడు తన పెద్ద భార్యను కడు ప్రేమతో ఆదరించుచుండెను. అది చూసి రాజుగారి ఇతర భార్యలకు ద్వేషభావము కలిగెను. వారిలో కలిగిన ఈర్ష్యాసూయల ఫలితముగా పాము విషమును తెప్పించి అన్నములో కలిపి ఆమెకు భుజింపచేసిరి. దైవయోగమున ఆమె మరణించలేదు. కాని, ఆమె గర్భము నందలి పిండముతో సహా శరీరమంతయు విషముచే వ్యాప్తమయ్యెను. దానివలన ఆమె దేహమంతయు తీవ్రబాధకు గురియగుచుండెను. కొలది

దినములకే ఆమె శరీమునిండా విష వ్రణములు పొటమరించెను. కొంతకాలము ఎట్టులనో సహించి ఆమె కుమారుని ప్రసవించెను. జన్మించిన బాలుడు సయితము అనేక విష వ్రణములతో కూడియుండి, చూచుటకు జుగుప్సాకరముగా నుండెను. తల్లి కుమారులకు రాజు అనేక చికిత్సలు చేయించి చాలా శ్రమ పడెను కాని, చికిత్స లేవియూ ఫలించలేదు. అవన్నియు వ్యర్థమయ్యెను. ఆ భార్యాబిడ్డలు జీవచ్ఛవములుగా మారిపోయిరి. ఇక వీరి శరీరములు కుదుటపడుట సాధ్యము కాదని రాజుగారు తెలుసుకొని తానెంతయో బాధపడుచుండెను. పాపాత్ముల పాపము వారు జీవించియున్నప్పుడు గానీ, మరణించినమీదట గానీ తామే స్వయంగా అనుభవించకుండా ఆ పాపము వారిని వదలదుగాక, వదలదని నిశ్చయించుకొనెను. అంతేగాక, ఆ రాజు తన ఇతర భార్యల ఉపదేశమునకు లోబడి, వ్రణముతో బాధపడుచున్న తన పెద్ద భార్యను పుత్రునితో సహా అడవి పాలు చేయుటకు నిర్ణయించుకొనెను. **వెంటనే తన దూతలను పిలిపించి ఇట్లాజ్ఞాపించెను** – "నా మాటలను వినుడు. నా భార్యాపుత్రులను రథమునందు తీసికొనివెళ్లి, ఒక దట్టమైన అరణ్యములో వదిలి పెట్టుడు. అదికూడా మనుష్య సంచారము లేని చోటును గమనించి, వీరిని వదలిపెట్టి తిరిగి నగరమునకు రమ్మని" ఆజ్ఞాపించెను. రాజుగారి పెద్ద భార్యను, ఆమె కుమారుని తీసుకొని పోవుచుండగా ఆమె దాసదాసీ జనము మిగుల దుఃఖించిరి. నగరములోని స్త్రీలు, ఈ రాజు మహాపాపి. దురాచారిగా మారిపోయెను. తన భార్యాబిడ్డలను అడవిలో విడిచిపెట్టుటకు అతని మనసు ఎట్లు అంగీకరించుచున్నదో కదా! అని మిగుల బాధపడిరి. దూతలు తల్లీబిడ్డలను రథములో కూర్చుండబెట్టి ఒక గొప్ప మహా అరణ్యము లోనికి తీసుకువెళ్ళి, మానవసంచారములేని చోట రాజుగారి ఆజ్ఞానుసారముగా వదలిపెట్టి, తిరిగి రాజ్యమునకు చేరుకొనిరి. అది విని రాజు సంతోషించి, ఈ విషయమును తన ఇతర భార్యలకు తెలియజెప్పెను. తల్లీబిడ్డలు, అడవిపాలగుటచే పీడ విరగడయ్యెనని వారందరూ మిగుల సంతోషించిరి. (71–100)

ఇక మహారణ్యములో విడిచిపెట్టబడిన తల్లీబిడ్డలిరువురు తమ శరీరమున కలిగిన వ్రణములచేత పీడింపబడుచూ, అన్నపానాదులు లేక అలమటించుచు తీవ్రముగా దుఃఖపడుచుండిరి. ఆమె ముందే రాజపత్ని. అత్యంత సుకుమారి. దాని మీద వ్యాధి బాధ. ఎదురుగా మరింత గొప్పగా బాధపడుచున్న కన్న కుమారుడు. భయంకరమైన చిట్టడవి. పెద్ద పెద్ద ముండ్లు, రాళ్ళు, చీకటిమయమైన అరణ్యము. బిడ్డను చంకలో వేసుకొని నెమ్మది నెమ్మదిగా అడుగులు వేయుచూ, తన దుష్ట ప్రారబ్దమును తలచుకొనుచూ, ఈశ్వరుని స్మరించుకొనుచు ముందుకు వెళ్ళసాగెను. ఇంతలో క్రూరమృగముల అరుపులు, సింహాలు, పెద్దపులులు, ఘోరమైన సర్పములు అటూ ఇటూ తిరుగాడుచుండుట కనిపించెను. అయ్యో! ఆ ఎదురుగా వచ్చుచున్న సింహము ప్రక్కకు ఎందుకు తొలగిపోవుచుండెను. నన్ను ఎందుకు చంపుట లేదు. ఇక ఈ

సంసారపు బాధ చాలును. నేను ఒక మహాపాపిని. ఇక బ్రతికి ఏమి సాధింపగలను. అయ్యో! ఏ సింహమో, ఏ పెద్దపులియో వచ్చి నోట కరచుకొని కడుపు నింపుకొనినచో సుఖముగా నుండును కదా! అని మిగుల దుఃఖించుచుండెను. తన దుష్ట ప్రారబ్ధమునకు మిగుల కలతనొందుచూ, క్రూరమృగములను, భయంకర సర్పములను చూచి భయచకిత యగుచూ, నెమ్మది నెమ్మదిగా అడుగులు వేయుచు ఆ అడవిలో ముందుకు సాగుచుండెను. ఈ విధముగా అతి కష్టముతో అంతఃపురమునందు తిరుగాడిన ఆ మహారాణి విష్రవణములతో మిగుల బాధపడుచూ రోదించుచున్న కుమారుని చంకన ఎత్తుకొని ముందు ముందుకు సాగుచుండగా అకస్మాత్తుగా ఒక కాలి బాట కనిపించెను. ఆ కాలిబాట ప్రక్కన కొన్ని పశువులు మేత మేయుటను గమనించెను. నెమ్మదిగా ఆ కాలిబాట వెంట ముందుకు వెళ్లుసరికి పశువుల కాపరులు కనిపించిరి. వెంటనే వారిని సమీపించి కరుణాపూరితమైన మాటలతో, తన బిడ్డకు త్రాగించుటకై కొన్ని మంచినీళ్లు ఇవ్వమని ప్రార్థించినది. అంతట ఆ పశువుల కాపరులు అమెను చూసి "అమ్మా! ఇచటికి సమీపముననే ఒక గ్రామము కలదు. అచటికి వెళ్లుము. అక్కడ నీకు కావలసినంత మంచినీరు, మంచి భోజనము కూడా లభించును. అంతేగాదు ఈ త్రోవ గుండా నెమ్మదిగా వెళ్లినచో నీవు అచటికి చేరుకొనెదవు" అని సమాధానము చెప్పి పంపిరి. అప్పుడు ఆ రాజపత్ని పశువుల కాపరులు చూపిన త్రోవగుండా నడచుచూ ఆ సమీప గ్రామమునకు చేరుకొనెను. (101-112)

ఆమె గ్రామమునందు ప్రవేశించగనే అనేకమంది స్త్రీ, పురుషుల సంచారము కనిపించెను. అది చూసి ఆమె తృప్తిపడినది. ప్రజలందరూ కడు సంతోషముతో కనిపించుచుండిరి. ఇక్కడి రాజు ఎవరో కాని, ఉత్తముడై ఉండవచ్చునని భావించినది. ఇంతలో ఒక స్త్రీని సమీపించి, "అమ్మా! మీరందరు కడు సంతోషముతో కనిపించుచుంటిరి. ఇక్కడి రాజు ఎవరు? ఆ పరిపాలకుని పేరేమి?" అని ప్రశ్నించెను. అప్పుడా స్త్రీ ఈ మహారాణితో, "అమ్మా! ఇక్కడి రాజు మహాధనవంతుడు, పుణ్యవంతుడైన ఒక వైశ్యుడు. అతని పేరు పద్మాకరుడు. నేరుగా వెళ్లుము. నీవు వారి మందిరమునకు చేరగలవు. అతడు తప్పక నిన్ను రక్షింపగలడు" అని చెప్పెను. ఇంతలో ఆ వైశ్యుని ఇంట పనిచేయు ఒక దాసి ఎదురుగా వచ్చి విషయమును తెలుసుకొని ఆ తల్లీబిడ్డలను తీసుకొని రాజమందిరమునకు చేర్చెను. గ్రామాధిపతియైన ఆ వైశ్యుడు ఆమెను చూచి, తమ గృహము లోపలికి స్వాగతించి, ఆమె పూర్వ వృత్తాంతమును అడిగి తెలుసుకొని, ఆమె యెడల మిగుల కనికరించి, తన ఇంటనే వుండుమని ఒక ప్రత్యేకమైన వసతిని కల్పించెను. ఇక ఆ రాజపత్ని ఆ వైశ్యుని గృహమునందే నివసింపసాగినది. కాని, ఆమె శరీరమునందు విష్రవణములు తగ్గక, వ్యాధి ప్రకోపించి మిగుల బాధపడుచుండెను. ఇంతలో ఆమె కుమారుని శారీరిక వ్యాధి మిక్కిలి ప్రకోపించి

మరణించుట తటస్థించెను. ఆ క్షణములో ఆమె తన కుమారుని మీదపడి మిగుల దుఃఖించుచు మూర్ఛిల్లెను. తదుపరి తాను కూడా ప్రాణత్యాగము చేయుటకు ఉద్యమించెను. ఆ వైశ్యరాజు భార్య ఆమెను ఎంతగానో ఓదార్చెను. ఎంత చెప్పినను ఆమె దుఃఖము ఉపశమింపలేదు. ఆ రాజపత్ని అనేక విధముల దుఃఖించుచు, తన పూర్వాపరములను గుర్తుకు తెచ్చుకొనుచూ, "నాయనా! నా గోపాల కృష్ణా! ఎక్కడికి వెళ్లితివి తండ్రీ! రాజ కులమునందు పూర్ణచంద్రునివలె జన్మించిన నీవు, నాకు కదు అనందమును ప్రసాదించితివి. అట్టి నీవు నన్ను వదలిపెట్టి పరలోకమునకు వెళ్లుట న్యాయమా? తల్లిదండ్రులను, భర్తను, సోదరులను, సర్వమును వదలిపెట్టి అడవులపాలైన నన్ను నీవు తప్పక రక్షించెదవను నమ్మకముతో జీవించుచుంటిని. అట్టి నన్ను అనాథను చేసి వదలిపోవుట న్యాయమా? తండ్రీ! ఇక ఇప్పుడు నన్ను ఎవరు రక్షించెదరు? ఇక నాకు దిక్కెవ్వరు? కనుక నా ప్రాణములను వదలి వేయుటయే ఉత్తమము" అని ఆ రాజపత్ని అపరిమితముగా రోదించుచూ, తాను కూడా ప్రాణత్యాగము చేయుటకు సిద్ధపడెను. అది చూచిన నగరవాసులు ఎంతగానో దుఃఖించుచుండిరి. **అన్ని దుఃఖములకన్న పుత్రదుఃఖము బడబాగ్ని వంటిది. అది తల్లిదండ్రులను సజీవముగ దహించివైచి భస్మము చేయుననుట అతిశయోక్తి కాబోదు.** (113-130)

ఇంతలో దైవవశమున మహాజ్ఞానియైన ఋషభయోగి అచటికి చేరుకొనెను. పూర్వజన్మలో ఆమె తనకు చేసిన ఉపకారమునకు ప్రత్యుపకారమును అందించవలెనను కృతనిశ్చయముతో ఆ మహాయోగి అచటికి వచ్చుట తటస్థించెను. ఆ యోగిని చూచిన వైశ్యరాజు ఎదురేగి వందనము చేసి, అర్ఘ్యపాద్యాదులను ఇచ్చి, తగిన పూజోపచారములు సలిపి, ఉన్నతాసనమున కూర్చుండబెట్టి నమస్కరించెను. అంతట ఆ యోగీశ్వరుడు "రాజా! గొంతెత్తి మిగుల దుఃఖించుచున్న ఆ స్త్రీ మూర్తి ఎవరు?" అని అడిగెను. ఆ యోగికి ఈ వైశ్యుడు ఆమె గురించిన వృత్తాంతమునంతయు తెలియజెప్పెను. **దయామూర్తియైన యోగీశ్వరుడు ఆమె సమీపమునకు చేరి ఇట్లు చెప్పసాగెను-** "అమ్మా! ఎందులకు ఇంతగా దుఃఖించెదవు. మూర్ఖముతో నీవు దుఃఖించుచుంటివి. మరణమును ఎవరునూ తప్పింపజాలరు. ఈ భూమిమీద జన్మించి మరణించకుండా వున్నదెవరో చెప్పుము. తల్లీ! దేహము నశ్వరమైనది. నీటిపై కనిపించు బుడగ వంటిది. అది అప్పుడే గోచరించి మరుక్షణములో మటుమాయమైపోవును గదా! భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశము అను పంచభూతములతో కూడినదే ఈ శరీరము. అట్టి పంచభూతముల కలయికతో ఏర్పడిన శరీరము తిరిగి పంచభూతములలో కలిసిపోవుటచే శూన్యమగును. దానిని గూర్చి దుఃఖించుటకు వీలు లేదు. ఎందుకు వృథగా దుఃఖించుచుంటివి. తాము చేసిన పూర్వజన్మకర్మల ఫలితముగా రేతస్సునుండి జీవులు ఉత్పన్నమగుదురు. వారి వాసనలను అనుసరించి కాలనాథుడు పట్టుకొనుటచే వారు వెళ్లిపోవుదురు. మోహామునుండి మాయ జనించును. సత్వరజస్తమోగుణములు

సహజముగనే వచ్చి చేరును. అవి దేహ లక్షణములుగా మారును. మానవులు మూడు గుణముల కలయికల ద్వారా జన్మించుచుందురు. సత్త్వగుణముతో దేవభావమును, రజో గుణమువలన మనుష్యభావమును, తామస గుణముతో రాక్షసస్వభావమును కలిగి యుండెదరు. గుణములను అనుసరించి పిండము జన్మించును. కాని, అది ఎప్పటికీ స్థిరముగా నిలచివుండునది కాదు. సంసారమునందు మానవులు పూర్వకర్మలను అనుసరించి జన్మించుచుండెదరు. పూర్వజన్మలో చేసిన పాపపుణ్యములననుసరించి సుఖదుఃఖములు కలుగుచుండును. కోటి కల్పముల కాలముపాటు జీవించి యుండే దేవతలు కూడా స్థిరముగా వుండజాలరు. ఇక మానవుల సంగతేమిటి? దేహము స్థిరమైనది కాదని తెలియుటచే జ్ఞానులు జన్మించినందుకు సంతోషించరు, మరణించుటకు దుఃఖించరు. గర్భమెప్పుడు కలుగునో, అప్పుడది ఎప్పుడో ఒకప్పుడు నాశవంతమని కూడా నిశ్చయముగా తెలియవలెను. అయితే, కొంతమంది తమ తమ కర్మానుసారముగా బాల్యముననే మరణించుదురు. మరికొందరు యౌవనములో మరణించెదరు, ఇంకొందరు వార్ధక్యదశలో మరణించెదరు. అనేక జన్మలలో చేసిన పూర్వకర్మలను అనుసరించియే వాటియొక్క ఫలితములుగా ప్రస్తుత మానవ దేహమునందు సంభవించుచుండును. కేవలము వ్యామోహగ్రస్తులై తల్లి యని, తండ్రి యని, బిడ్డ యని, భార్య యని, మిత్రుడని, బంధువని భావించుచుండెదరు. ప్రారబ్ధముననుసరించి పుట్టబోయే శిశువునకు బ్రహ్మదేవుడు లలాట లేఖనము చేయును. కాలమును కాని, కర్మను కాని ఉల్లంఘించగల శక్తి ప్రాణికోటికి ఎంత మాత్రము లేదు. అట్టి అశాశ్వతమైన శరీరమును గూర్చి ఏమియూ చేయలేని, నిరంతరము పరాధీనమైయుండెడి జీవుని గూర్చి ఏల దుఃఖించెదవు. తల్లీ! నీ పూర్వ కర్మలు గాని, ముందు రాబోవు కర్మలు గానీ ఎట్లుండునో నాకేమైనా చెప్పగలవా! గత జన్మలో నీవు ఎవరికి భార్యవైతివో, ఎవరికి తల్లి వైతివో, ఎవరికి కూతురువో, ఎవరికి జన్మనిచ్చితివో, ఏమైనా చెప్పగలవా? చెప్పలేనన్న విషయము తెలిసికూడా ఇట్లు వ్యర్థముగా దుఃఖించుట ఏల? ఒకవేళ నీవు కోరుకొనునది సమంజసమే అయినచో, పరమేశ్వరుని శరణుగోరుము" అని ఆ మహాయోగి ఎంతయో వైరాగ్యమును బోధించెను. (131-151)

అంతట ఆమె ఆ ఋషీశ్వరునకు తన వృత్తాంతమును ఇట్లు నివేదించెను. "స్వామీ! నేను ఒక మహారాజు భార్యనై యుండి, ఇప్పుడు ఇట్టి దుస్థితిలో ఉంటిని. నా దుర్గతిని మీరు ఒకసారి విచారింపుడు. అటు తల్లిదండ్రులను, ఇటు భర్తను, రాజపరివారమును, బంధువులను అందరిని వదిలి ఈ అడవిలోనికి చేరితిని. నా పుత్రుడు నాకు ప్రాణసముడు. అతడు నన్నుద్ధరించగలడని నమ్మితిని. అతని మీద నాకెంతో నమ్మకమున్నది. కాని, నా ఆశ అడియాసయే అయినది. నాకీ గతి పట్టినది. నా కుమారుడు పోయిన నేను, బ్రతికియుండి ప్రయోజనమేమి!

స్వామీ! నేను రక్షించబడుటలో కలుగు సుఖమేమిటి? కావున, దయతో నాకు మరణమును ప్రసాదించుము. నేను మరణించెదను. ఇక జీవించి యుండుటవలన ఎంతమాత్రము ప్రయోజనము లేదని విలపించుచు" ఆ మహాయోగి చరణములను ఆశ్రయించెను. (152-154)

ఆమె యొక్క కఠోరమైన నిశ్చయమును చూసి ఆ మహాయోగి యొక్క అంతఃకరణమునుండి నిర్హేతుకమైన కృప జాలువారెను. పూర్వజన్మలో ఆమె తనకు చేసిన ఉపకారమును తలచుకొని, ఆ మహాయోగి ప్రసన్నుడాయెను. ఉపకారమునకు ప్రత్యుపకారమును చేయదలంచిన ఆ సాధుపురుషుడు వెంటనే, తన వద్దగల భస్మమును తీసి శవము యొక్క నుదుటిమీద ధరింపజేసెను. కొంత భస్మమును ఆ బాలుని నోటిలో వేయగా, అంతట ఆ బాలుడు నిద్రనుండి మేల్కొనిన వానివలె లేచి కూర్చుండెను. ఆతని శరీరమంతయు బంగారు వర్ణముగ మారిపోయెను. పిదప ఆ బాలుడు లేచి మిక్కిలి ఆశ్చర్యముతో, ఆ మహాయోగికి సాష్టాంగముగ వందనము చేసెను. అనంతరము ఋషభయోగి మరికొంత భస్మమును తీసికొని రాజపత్ని మీద ప్రోక్షించగా ఆమెకు గల దుర్భరమైన వ్యాధి క్షణములో సమసిపోయి, సువర్ణచ్ఛాయగల దేహముగ మారిపోయయెను. వెంటనే తల్లి కుమారు లిరువురు లేచి ఆ మహాయోగికి సభక్తికముగ సాష్టాంగ వందనమును చేసిరి. వారి కృపకు ముగ్ధులైపోయి, మేను పులకరించుచుండగ, కంఠము గద్గద మగుచుండగా, ఆ మహాయోగి యొక్క తేజోవంతమైన స్వరూపమును తేరిపారగా తిలకించుచుండిరి. ఆ మహాయోగి యొక్క దయాపూరితమైన దృక్కులచే వారుభయుల శరీరములు శుద్ధమైపోయి, సూర్యప్రకాశమువలె శోభింపసాగెను. అంతట ఆ యోగీశ్వరుడు వారి యెడల మరింతగా ప్రసన్నుడై వారిని చూచి, "మీ ఇరువురికి ఇకముందెన్నటికినీ వృద్ధాప్యము కలుగదు. ఎప్పుడూ తారుణ్యరూపముతో చిరంజీవులై ఉండెదరు. అమ్మా! నీ కొడుకు 'భద్రాయువు' అను పేరు గలవాడై, తండ్రికంటే అత్యధికమైన ఖ్యాతిని పొందగలడు. మీకు సర్వసౌఖ్యములు సిద్ధించును. తిరిగి మీ రాజ్యమును మీరు పొందెదరు" అని వారికి వరమును ప్రసాదించి, ఆ యోగి వెంటనే అచటినుండి వెళ్లిపోయెనని" ఆ యతీశ్వరుడు యవనరాజునకు ఈ కథను వివరించెను.(155-162)

"ఓ రాజా! సమాహిత చిత్తుడవై వినుము. సత్పురుషుల సన్నిధానము పెన్నిధానము వంటిది. కనుక, నీవు సత్పురుషుల సేవచేసిన యెడల నీ వ్రణము వెంటనే మటుమాయమై పోవును. అన్యథా చింతించవలదు. మేము చెప్పినటుల నీ భావమును ధృఢపరుచుకొనుము" అని ఆ యతీశ్వరుడు చెప్పెను. వెంటనే రాజు లేచి నిలబడి, అంజలి ఘటించి ఆ యతీశ్వరునకు వందనము నాచరించి, "మహానుభావా! అంతటి సత్పురుషుడు ఎచట కలడు" అని ప్రశ్నించెను, ఇప్పుడే మీరు పూర్తి వివరములు చెప్పవలసిన పనిలేదు. ప్రదేశమును తెలియజేసిన చాలును.

నేను వెంటనే బయలుదేరి వారి దివ్య శ్రీచరణదర్శనము చేసికొందును" అని ప్రార్థించెను. అంతట ఆ యతీశ్వరుడు – "రాజా! గాణగాపురమునందలి భీమానదీతీరమున ఒక మహాపురుషుడు కలడు. నీవు ఆయన వద్దకు వెళ్ళుము. వారి దర్శనమాత్రము చేతనే మీ వ్రణము మటుమాయమై పోవుట నిశ్చయమని" పలికెను. వారి మాటను ఆలకించి, ఆ మ్లేచ్ఛరాజు వెంటనే కృతనిశ్చయుడై, ఆ పరమపురుషుని దర్శనమునకు బయలుదేరెను. మధ్యలో మజిలీ చేయుచూ, ప్రయాణించి నెమ్మదిగా గాణగాపుర సమీపమునకు చేరుకొనెను. కొందరు గ్రామస్థులను చూసి, "ఇచట సన్న్యాసిరూపమును ధరించిన ఒక తాపసి ఉండెదరు కదా! వారు ఇప్పుడు ఎచ్చట వున్నారు" అని మ్లేచ్ఛరాజు ప్రశ్నించెను. అందుకు గ్రామ ప్రజలు భయపడిపోయి ఈ మ్లేచ్ఛరాజు ఏమి చేయునో ఏమో అని భీతికి గురియై "ఇప్పుడు వారు ఇచట లేరు" అని చెప్పిరి. ఆ గ్రామమునందలి కొందరు బ్రాహ్మణులు ఒక మ్లేచ్ఛరాజు గ్రామమునకు వచ్చుచుండుటను చూచి మిక్కిలి భయపడిరి. ఇతడు ఏమి చేయునో ఏమో అను భీతితో ఎవరునూ అతనితో మాట్లాడక మిన్నకుండిరి. ఇంతలో ఆ మ్లేచ్ఛరాజు "అయ్యా! బ్రాహ్మణోత్తములారా! వారిని నేను దర్శించుకొనుటకే వచ్చితిని. దయచేసి వారిని నాకు చూపించగలరు" అని ప్రార్థించెను. (163–171)

అంతట వారు శ్రీ గురుమూర్తి తమ అనుష్ఠానము చేసుకొనుచోటనే వుందురు. అమరజా సంగమమునందు మధ్యాహ్నము వరకు అనుష్ఠానమును పూర్తిచేసుకొని, భిక్షా సమయమునకు మఠమునకు తిరిగి వచ్చెదరు అని అచటి బ్రాహ్మణులు కొందరు చెప్పిరి. వెంటనే ఆ మ్లేచ్ఛరాజు తన పరివారము నంతయు గాణగాపురము యొక్క బయటి ప్రదేశముననే వుంచి, తాను ఒక్కడు మాత్రమే పల్లకిలో కూర్చుని అచటికి వెళ్ళెను. శ్రీ గురునాథుని కొంతదూరమునుండి చూసిన ఆ మ్లేచ్ఛరాజు పల్లకిని నిలిపి, అందునుండి దిగి కాలినడకన వారి సమీపమునకు చేరుకొనెను. కొంతదూరము నుండియే గురుమూర్తిని దర్శించి, అత్యంత భక్తిప్రపత్తులతో శిరసాష్టాంగ వందనమును ఆచరించి, చేతులు జోడించుకొని నిలువబడెను. (172–174)

ఇంతలో గురునాథుడు అతనిని చూసి ఇట్లు పలికెను – "ఓరీ! రజకా! వచ్చితివా? నీవెక్కడ నివసించుచుంటివి. నన్ను సేవించి చాలా కాలమైనది కదా! ఎంతో కాలమునకు తిరిగి కనబడితివి" అని ప్రశ్నించిరి. వారి మాటలు విని మ్లేచ్ఛునకు గురుమూర్తి కృపవలన పూర్వజన్మము స్మరణకు వచ్చెను. వెంటనే వారికి సాష్టాంగముగా వందనము చేసి, వారి పాదములపై బడి దొర్లాడెను. మనసు ద్రవించిపోగా, దేహము పులకాంకురమై, భక్తి పరవశుడై ఆనందాశ్రువులతో మిగుల రోదింపసాగెను. కంఠము గద్గదమాయెను. కొంత సమయము మౌనము వహించి, నెమ్మదిగా గతజన్మను స్మరించుకొనుచు, అంజలి ఘటించి, ఒకవైపు కనులవెంబడి అశ్రువులు జాలువారుతుండగా

సభక్తికముగా అనేక విధములుగా **గురుమూర్తిని స్తోత్రము చేసెను**– "స్వామీ! నన్నెందుకు ఉపేక్షించితిరి. నేను అనాథుడనైతిని. నన్ను మీ చరణములకు దూరమొనర్చితిరి. అంధకారబంధురమైన సంసారసాగరమందు నన్ను నెట్టివేసితిరి. నేను మదోన్మత్తుడనై రాచరికపు భోగభాగ్యములకు అలవాటుపడి మీ చరణ కమలములను విస్మరించితిని. సాంసారిక మాయాజాలములో మునిగి దుర్మతినైతిని. శ్రీచరణకమలములను సేవించలేకపోయితిని. కళ్లుండి కూడా కబోదిగా మారిపోయితిని. సమీపమున నిధానమువంటి మీరున్నప్పటికిని బుద్ధిహీనుడనై మిమ్ము గుర్తించ లేకపోయితిని. అజ్ఞానాంధకారములో తచ్చాదుతూ, మీ దివ్యశ్రీచరణసరోజములను విస్మరించితిని. ఆశ్రితభక్తజనులను తాము ఉపేక్షించరని, నాకు నిశ్చయముగా తెలియును. స్వామీ! దయాసాగరా! నన్ను అజ్ఞానసాగరములో ఏల నెట్టివేసితిరి. స్వామీ నన్నుద్ధరింపుడు. అందుకే మీ దరి చేరితిని. నాకిక ఈ జన్మ చాలును. మీ చరణధూళియందలి ఒక కణమునై పడివుందునుగాక!" అని అనేకవిధములగా, కడు భక్తి భావముతో గురుమూర్తిని ఆ మ్లేచ్ఛరాజు స్తుతించెను. **అంతట శ్రీగురునాథుడు తన శిష్యునియెడల ప్రసన్నవదనుడై చిరునవ్వును చిందించుచూ ఇట్లు పలికెను**– "భక్తుడా! తప్పక నీ కోరికను నెరవేర్చెదనుగాక!" అని పలికెను. **అంతట రాజు శ్రీ గురుమూర్తిని చూచి**, "స్వామీ! నా దేహము నందు రాచపుండు పుట్టి, నన్ను మిగుల బాధించుచున్నది. ఆ వ్రణముయొక్క బాధతో నేను మిగుల దుఃఖించుచుంటిని. కరుణాపయోనిధీ! నన్ను మీ కృపామయ దృష్టితో ఒకసారి చూడుము మహాత్మ!" అని వేడుకొనెను. **అతని మాటలు విని శ్రీగురుడు నవ్వి యిట్లు నుడివెను** – "నాయనా! నీకు కలిగిన ఆ వ్రణము ఎక్కడ ఉన్నదో నాకు చూపించమని" ప్రశ్నించిరి. ఆ రాజు వెంటనే తన తొడపైన పుట్టిన వ్రణమును చూపుటకు ప్రయత్నించగా, అతనికి ఆ వ్రణము కనిపించనే లేదు. గురునాథుని దయాదృష్టి ప్రసారము వలన అతని దేహమునందు జనించిన ఆ రాచపుండు ఎప్పుడో మటుమాయమైపోయెను. తనలో తాను విస్మయమునకు గురియై, మిగుల అబ్బురపడుచూ గురుమూర్తి మహిమా ప్రభావమునకు అచ్చెరువొందుచూ, కడు భక్తిభావముతో స్వామి దయకు కనుల వెంబడి అశ్రువులు ఏరులై పారుచుండగా, వారి దివ్యమైన శ్రీచరణకమలములపై తన శిరమునుంచి సాష్టాంగవందనము చేయుచూ, "ఆశ్రితజనరక్షకా! ఆర్తత్రాణ పరాయణా! పాహి మామ్!!" అంటూ వారి చరణములను గట్టిగా పట్టుకొనెను. "స్వామీ! మీ వరప్రసాదముచేత పరిపూర్ణమైన మీ అనుగ్రహము వలన, నేను రాజ్యమును పొందితిని. అష్టైశ్వర్యములను హాయిగా అనుభవించితిని. పుత్రపౌత్రులను కళ్లారా చూడగలిగితిని. పల్లకీలలో ఊరేగితిని. నా మనస్సు చెప్పరానంతగా తృప్తిని చెందియున్నది. కాని, స్వామి నా మనస్సులో ఒక బలమైన కోరికగలదు. దానిని దయతో మీరు తీర్చవలెను. అదేమిటనగా, నా ఐశ్వర్యమును మీరు కళ్లారా చూడవలయును. భక్తవత్సలుడనే బిరుదమును గలిగిన తాము నా కోరికను త్రోసిరాజనక

తప్పక తీర్చగలరని నమ్ముచుంటిని. అనంతరము ఈ సంసారతాపత్రయములను త్యజించి నేను మీ దివ్యశ్రీ చరణకమలములలో లీనమైపోయెదను" **అని గురుమూర్తిని ఆ మ్లేచ్ఛరాజు పదేపదే వేడుకొనెను.** అంతట శ్రీ గురుమూర్తి **అతనితో ఇట్లనెను**– "నాయనా! మేము నిరంతరము తపస్సు చేసికొనెడు సన్న్యాసులము. మీ నగరములకు రాకూడదు. అచ్చట అనేక మహాపాతకములు జరుగుచుండును. అంతేగాదు, యవనజాతిలో జన్మించిన మీరు, మీ నగరమున ప్రతినిత్యము గోవులను హత్య చేయుచుందురు. అనేక అకృత్యములు, జీవహింసలు జరుగుచుండును. కావున, నేను మీ నగరములోనికి రాకూడదు" అని పలికెను. **అంతట ఆ మ్లేచ్ఛరాజు గురుమూర్తితో ఇట్లు పలికెను** – "స్వామీ! మీరు చెప్పిన మాటలన్నియు సత్యములే. కానీ మీ దాసుడను. పూర్వజన్మలో మీ సేవజేసిన రజకుడను. మీ వరదానము వల్లనే నాకీ రాజ్యము లభించినది. తద్వారా, అనేక సుఖములను అనుభవించితిని. ప్రస్తుతము మ్లేచ్ఛజాతి వాడినను మాట మాత్రమే గొప్ప లోపము. అయినప్పటికినీ ఒక్కమారు నా పుత్రులను, పౌత్రులను, రాజ్యమును చూచి, వారిని ఆశీర్వదించి, వెంటనే తిరిగి వెళ్ళవచ్చును. నేను కూడా తమతో పాటుగ వచ్చి, తమ సేవలోనే ఉండిపోయెదను. రాజ్యసుఖమును ఎంతగానో అనుభవించితిని. ఇక మీదట ఈ రాజ్యము నాకు అక్కరయేలేదు. తమ శ్రీచరణ సేవను చేసి కృతార్థుడనయ్యెదను" అని అంటూ గురుమూర్తి పాదములమీద పడి, మిక్కిలి ప్రాధేయపడుచు, పదేపదే ప్రార్థించెను. అంతట గురుమూర్తి తమలో తాము ఇట్లు విచారించుకొనిరి. (175-197)

"నేను ఇక మీదట ఈ ప్రపంచములో ఉండకూడదు. కలియుగ ప్రభావము పెరిగిపోవుటచే ముందు ముందు నా వద్దకు మ్లేచ్ఛులు, నీచజాతివారలు కూడా వచ్చుచుండెదరు. శీఘ్రముగనే ఈ అవతారమును ఉపసంహరించి గుప్తముగ నుండిపోవుట మంచిది. సింహరాశిలో గురువు ప్రవేశించుచుండెను. గోదావరి పుష్కరములు సమీపించుచుండెను. ప్రస్తుతము ఈ మ్లేచ్ఛునితో వెళ్ళి అతని నగరమును తిలకించి, తిరిగి గౌతమీ పుష్కరమున గోదావరీ స్నానమొనర్చి, మరల సంగమమునకువచ్చి, ఈ అవతారమును గుప్తపరచెదనని, మనమునందు నిశ్చయించుకొనెను'. **పిమ్మట మ్లేచ్ఛ శిష్యునితో ఇట్లు పలికెను** – "రాజా! మీ కోరిక ప్రకారమే, మేము మీ వెంట వచ్చెదమని" తమ అంగీకారమును శ్రీస్వామివారు తెలియజేసిరి. వెంటనే శ్రీగురునాథుడు సంగమమునుండి బయలుదేరెను. ఆ మ్లేచ్ఛుడు మిగుల సంతోషించి గురుమూర్తిని తన అందమైన పల్లకియందు కూర్చుండబెట్టి, వారి పాదుకలు తాను చేతపట్టి పాదచారియై, సంగమమునుండి గాణగాపురమునకు గురుమూర్తిని తీసుకొని వచ్చుచుండగా, **గురుమూర్తి అతనితో ఇట్లనెను** – "నాయనా! నీవు రాజువు. పాదచారియై నడచుటను చూసిన లోకులు నిన్ను నిందించెదరు. అంతేగాక, మ్లేచ్ఛజాతిలో జన్మించి, బ్రాహ్మణసేవ చేయుటవలన నీ జాతివారు నిన్ను పరిహసించెదరు.

దూషించెదరు" అని గురుమూర్తి పలికెను. **అంతట రాజు ఇట్లనెను-** "స్వామీ! నేను రాజును ఏమిటి? నేను మీ రజకుడను. మీ దృష్టి సోకిన చాలును. ఇనుము బంగారమగును. అందరి దృష్టిలో నేను రాజునన్నమాట నిజమే. కాని, ముందుగా నేను మీ రజక భక్తుడనే. మీ కృపవల్లనే నా మనోరథములు ఈడేరినవి. నాకు మీ దివ్యదర్శనము లభించినదని" పలికెను. ఇంతలో గ్రామము వెలుపలగల రాజ పరివారము, అతని సైన్యమంతయు వచ్చి రాజుగారి వద్దకు చేరినవి. వెంటనే రాజు నిలబడి ఆందోలికలో ఆసీనులై యున్న గురుమూర్తికి కడు హర్షముతో తన వెంటగల బలగమును, సైన్యమును, ఐశ్వర్యమును వారికి చూపించెను. (198-206)

అంతట గురునాథుడు ఆ మ్లేచ్ఛరాజుతో పలికెను - "రాజా! దూరముగా యున్న నీ నగరమును చేరుకొనుటకు నీవు వెంటనే ఒక అశ్వమును అధిరోహించి, నా పల్లకి ముందు నడువుము. ఇది నా ఆజ్ఞ. తప్పక పాటించవలెనని" ఆదేశించెను. గుర్వాజ్ఞను పాటించి, శ్రీవారి శిష్యులందరికి తగు వాహనములను ఏర్పరచెను. శ్రీ గురుడు కలిసినందులకు, తన మాటను విని తమ నగరమునకు విచ్చేయుచున్నందులకు మహదానందభరితుడైన ఆ మ్లేచ్ఛరాజు అశ్వమును అధిరోహించి ముందుగా వెళ్లుచుండెను. వెనక స్వామివారు పల్లకిలో వచ్చుచుండిరి. వారి వెనుక శిష్యులందరు తగు వాహనములను అధిరోహించి వచ్చుచుండిరి. కొంతదూరము వెళ్లిన పిదప శ్రీ గురునాథులు ఆ మ్లేచ్ఛరాజును నిలువరించి, **కడు సంతోషాంతరంగుడై ఇట్లు నుడివెను -** "రాజా! నీ భక్తికి మేమెంతయో సంతోషించితిమి. మేము సన్యాసులము. నిరంతరము తపస్సులో వుండు వారము. నిత్యానుష్ఠానము చేసికొనవలసినవారము. కనుక, నీతో కలిసి మార్గమున పయనించుటవలన ఆయా సమయములయందు చేయవలసిన నిత్యకర్మానుష్ఠానములను చేయలేము. కావున, నీకొక మాటను తెలియజేసెదను వినుము. మేము ముందుగా వెళ్ళిపోయెదము. నీవు మా వెనకాల నెమ్మదిగా రమ్ము, తిరిగి మేము నీతో పాపవినాశన తీర్థమునందు కలిసెదము" అని గురుమూర్తి అతనికి చెప్పి అదృశ్యమయ్యెను.(207-213)

గురుమూర్తి శిష్యసమేతంగా అదృశ్యుడై గుప్తరూపముగా మిథులానగర సమీపమునగల పాపవినాశన తీర్థమువద్దకు తృటిలో చేరుకొనెను. పాపవినాశన తీర్థమునందు గురుమూర్తి స్నానమొనర్చి, అనుష్ఠానమును చేయుచుండిరి. పాపవినాశన తీర్థమునకు శ్రీగురునాథులు విచ్చేసినారను సమాచారము తెలిసి, వారిని దర్శించుటకై సమీప జనులందరు రాసాగిరి. ఇంతలో ఇట్టి సమాచారము తెలిసిన సాఖరే సాయందేవుని కుమారుడగు నాగనాథుడు అనువ్యక్తి గురుమూర్తి దర్శనార్థమై వచ్చి, వారికి సాష్టాంగముగ నమస్కరించి తమ గృహమునకు రావలసినదిగా

ప్రార్థించెను. అతని అభ్యర్థనను మన్నించుటచే నాగనాథుడు శ్రీగురుమూర్తిని వెంటనే శిష్యసమేతముగా తమ గృహమునకు తీసుకొని వెళ్ళెను. గురునాథుని ఉన్నతాసనమున కూర్చుండజేసి షోడశోపచారములతో సభక్తికముగా పూజించి, గొప్ప సమారాధనము గావించెను. అప్పటికి చాలా రాత్రి అయినందున **గురుమూర్తి నాగనాథునితో ఇట్లు పలికెను.** "నాయనా! నా కొరకు మ్లేచ్ఛరాజు పాపవినాశనము వద్దకు వచ్చుచుండును. మేము అచట అతనితో కలియుదుమని చెప్పితిమి. ఒకవేళ నేను ఇచ్చటనే యుండినచో మ్లేచ్ఛులు బ్రాహ్మణ గృహములకు వచ్చెదరు. దానితో విప్రులకు లేని ఉపద్రవము వాటిల్లును" అని చెప్పెను. వెంటనే నాగనాథుని గృహమునుండి బయలుదేరి, పాపవినాశనమునకు చేరుకొనిన శ్రీగురుదేవులు పద్మాసనాసీనుడై అనుష్ఠానమును చేయుచుండిరి. (214-220)

అచట మ్లేచ్ఛరాజు శ్రీ గురుమూర్తి శిష్యసమేతముగా తనకు కనబడనందులకు విచారపడి, కొంత ఆందోళన చెంది, నేనేమైనా పొరపాటు చేసితినా అని తనలో తాను మథనపడుచుండెను. అయితే గురుమూర్తి మహిమను తెలిసివాడు కావున, తనతో చెప్పిన విధముగా పాపవినాశన తీర్థమునకు అదృశ్యరూపముతో వెళ్ళియుందురని నిశ్చయించుకొని, వెంటనే అతి శీఘ్రముగ పరుగెత్తగల దివ్యాశ్వమును అధిరోహించి, నలుబది నాలుగు క్రోసుల దూరము ప్రయాణించి, అతి కష్టము మీద పాపవినాశనమును చేరుకొనుసరికి గురుమూర్తి శిష్యసమేతముగా అనుష్ఠానములో నుండుటను గాంచి, ఆశ్చర్యచకితుడయ్యెను. మరింత విస్మయావహుడై పరుగుపరుగున వచ్చి **శ్రీగురునాథుని చరణములను స్పృశించి, సాష్టాంగవందనము చేసెను.** "స్వామీ! మా గృహమునకు వేంచేయుడని" భక్తితో విన్నవించుకొనెను. మ్లేచ్ఛరాజు ఆదేశము మేరకు, తమ సైన్యమునకు చెందిన అధికారులు ముందుగా నగరమునకు వెళ్లి, విదురానగరమును అంగరంగ వైభవముగా అలంకరించిరి. పగడములతో, ముత్యములతో తోరణములను కట్టించిరి. మకరధ్వజములను పెట్టించిరి. ఆ నగరము గొప్ప ఉత్సవ శోభతో అలరారుచుండెను. శ్రీస్వామివారిని అత్యద్భుతముగా అలంకరించిన ఆందోళికయందు కూర్చుండజేసి, పల్లకిని తాను స్వయముగా మోయుచు ఆ రాజు పాదచారియై నగరప్రవేశము మొనర్చెను. నగరములోని వారందరూ ఆశ్చర్యముతో గురుమూర్తిని దర్శించి, ఇంటింటను శ్రీవారికి కర్పూరహారతులను సమర్పించిరి. నవరత్నాలతో వారికి దిష్టిని తీయసాగిరి. "రాజు మ్లేచ్ఛజాతికి చెందినవాడు. బ్రాహ్మణులను పూజించుచుండెను. ఇది ఏమి వింత? ఇతడు అనాచారముతో జాతి ధర్మమును వదలిపెట్టెను. మ్లేచ్ఛులు ఎవరి ముఖమును చూడకూడదో, అట్టివారి సేవను మిగుల హర్షముతో, ఇంతటి వైభవముగా నగరమునకు ఆహ్వానించి సేవించుచుండెను. ఈ రాజు దౌర్భాగ్యుడు. వీడు జాతి, మత భ్రష్టుడు"

అని నగరమునందలి మ్లేచ్ఛజనులు నిందింప సాగిరి. మరొకవైపు నగరములో గల బ్రాహ్మణులందరు మిగుల సంతోషాంతరంగులై, "రాజు బ్రాహ్మణ సేవకుడయ్యెను. ఇది రాజ్యమునకు శుభ సూచకము. సహజముగనే జ్ఞానియై, బ్రహ్మద్వేషి కాకుండగా మంచి పుణ్యాత్ముడైనవాడు రాజుగా ఉండుట రాజ్యమునకు మిగుల శ్రేయోదాయకము, కళ్యాణకారకము" అని పలుకుచుండిరి. శోభాయాత్రగా గురుమూర్తిని పల్లకిలో కూర్చుండజేసి, రాజు పాదచారియై వెళ్ళుచుండెను. నగరవాసులందరూ చూసి కదు భక్తితో నమస్కారములను చేయుచు ఎంతటి విచిత్రము అని ప్రజలు అనుకొనుచు, "బహుశః అతడు దైవమే కావచ్చును. అందుకే ఈ మ్లేచ్ఛరాజు భజించుచుండెను. కలియుగమునందు కదు విచిత్రములను చూచుచుంటిమి" అని వారందరూ పలుకుచుండిరి. వెంట వాయిద్యములు మ్రోగుచుండగా వందిమాగధులు అపారమైన జయజయ ధ్వానములు చేయుచుండగా, కదు హర్షోల్లాసములతో నిండిపోయిన రాజు శ్రీగురుమూర్తిని తీసుకొని ఉత్సవశోభతో మహాద్వారమువద్దకు చేరుకొనెను. అనేక విధములైన అపరిమిత దివ్యవస్త్రములతో ఆయనకు దిష్టి తీసి రాజు ప్రక్కకు పడవేసెను. వాటిని స్వీకరించిన భిక్షుకులు ఎంతగానో తృప్తిచెందిరి. ఇంతలో రాజమార్గమునందు మహాద్వారమునుండి రాజభవనములోనికి చేరుకొనుటకై శ్రీగురుమూర్తి పాదములు నేలకు సోకకుండునట్లుగా పవిత్రమైన దివ్యాంబరములను పరచి, వాటిమీదుగా వారిని తన భవనములోనికి తీసుకొనిపోవుచుండెను. అనేక భేరీవాయిద్యములు మ్రోగుచుండెను. ఇదంతయూ చూసి నగరమునందలి బ్రాహ్మణులు, సాధువులు "రాజు మ్లేచ్ఛుడైనను పూర్వజన్మ పుణ్యవిశేషమువలన, గురుమూర్తియందు ద్వేషభావములేక సేవించుచుండెను. ఈ రాజు ధన్యుడు. ఇట్టి కలియుగములో ఒక మ్లేచ్ఛరాజు బ్రాహ్మణులను సేవించుటను మాట ఇదివరకు మేమెన్నడు కనివిని ఎరుగమైతిమని" వారందరు పలుకుచుండిరి. (221-241)

ఇంతలో ఆ రాజు గురుమూర్తిని తమ రాజభవనములో ఎంతో అందముగా అలంకరించిన నవరత్న ఖచితమైన సింహాసనమున కూర్చుండజేసెను, భార్యా సమేతుడై అనన్యభావముతో బంగారు పళ్లెరములతో, కర్పూరహారతులను ఇచ్చి పూజించెను. ఇతర జనులందరు రాజ గృహము బయటనే నిలిచిరి. రాజభవనములోనికి ప్రవేశించుటకై తమవెంట నలుగురు శిష్యులకు మాత్రమే శ్రీగురుమూర్తి అనుమతించెను. అంతఃపురమునకు చెందిన కుల స్త్రీలను, తన పుత్రులను, పౌత్రులను, సహోదరులను పిలిచి ఆ రాజు శ్రీ గురునాథునకు పరిచయము చేయుచూ విడివిడిగా వారిచే సాష్టాంగవందనములను చేయించెను. అంతట రాజు స్వామివారిని "గురునాథా! మీ చరణదర్శనము చేసుకొనుచున్న సేవకులము, ఆశ్రితులము. ఒకమారు కృపామయదృష్టితో చూడగలరని, అత్యంత వినయముతో వారి చరణములను ప్రార్థించెను. కదు ప్రీతి

నొందిన శ్రీగురుమూర్తి వారందరిని ఆశీర్వదించి, రాజగృహ వార్తలను అడిగి తెలుసుకొనెను. **అంతట గురునాథుడు రాజుతో ఇట్లనెను –** “ఇప్పుడు నీకు తృప్తి కలిగినది కదా? ఇంకనూ ఏమైనా కోరికలు శేషించి యుండెనా? చెప్పుమని” కోరెను. అంతట రాజు స్వామివారితో “స్వామీ! నేనెంతో కాలము రాజ్యమును పరిపాలించితిని. తద్వారా శ్రీ గురుచరణములకు దూరమైతిని. ఇప్పుడు నాకు మీ చరణసేవ తప్ప ఇతరములతో పని లేదు. మీ చరణముల కడనే బ్రతికెదను” అని ప్రార్థించెను. అది విని శ్రీ గురుమూర్తి రాజుతో, నీవు నీ రాజ్యమును పుత్రులకు అప్పగించి మమ్ములను దర్శించుకొనుటకై శ్రీశైల పర్వతమునకు చేరుకొనుము. ఇక నేను వెళ్ళెదను” అని చెప్పి, అచటినుండి గురునాథుడు బయలుదేరెను. ఇంతలో రాజు చివరగా శ్రీవారి చరణములకు నమస్కరించి, “స్వామీ! నాకు నిజమైన జ్ఞానమును ప్రసాదించుమని” విన్నవించుకొనెను. అందుకు కరుణాసింధుడగు గురుమూర్తి “వత్సా! నీవు కోరిన రీతిగా నీకు జ్ఞానము లభింపగలదని” ఆశీర్వదించెను. (242–251)

గౌతమి యాత్రకై బయలుదేరిన శ్రీస్వామివారు తృటిలో అదృశ్యుడాయెను. గురునాథుడు నేరుగా గౌతమికి చేరుకొని గోదావరిలో పుష్కర స్నానమును పూర్తిచేసుకొని, అచటనుండి శిష్యసమేతముగా క్షణమాత్రమున గాణగాపురమునకు చేరుకొనెను. గాణగాపురము నందలి జనులు, శిష్యులు, భక్తులు అందరు గురుమూర్తిని సమీపించి వారికి పాదాభివందనము చేయుచూ కర్పూరహారతులనిచ్చిరి. అనంతరము గురుమూర్తి తమ శిష్యులనందరిని పిలిపించి, **వారందరిని ఉద్దేశించి ఇట్లు పలికెను–** “ధర్మమునకు గ్లాని ఏర్పడుచున్నది. మ్లేచ్ఛులు సయితము ఇచటకు వచ్చుచుండిరి. ఇక మేము శ్రీశైలయాత్రకు వెళ్ళెదము. మేము శ్రీశైలమునకు వెళ్ళినప్పటికినీ, గుప్తరూపమున ఇచటనే వుండెదము. నేను ఎచట వున్ననూ, నిజరూపమున ఇచటనే ఉండెదను. నిరంతరము నేను గాణగాపురములోనే ఉండెదను. లోకులకు శ్రీశైలయాత్రకు వెళ్ళినట్లు కనిపించిననూ, మా నిజస్థానము గాణగాపురమేనని గ్రహించుడు” అని చెప్పిరి. **ఇప్పటికీ శ్రీగురుమూర్తి గాణగాపురమునందు ప్రత్యక్షముగా వున్నారు. ఉండెదరు. నిరంతరము భక్తులకు దర్శనము ఇచ్చుచుందురు. “ఓయీ! నామధారకా! ఈ మాటను నేను అనుభవించి చెప్పుచుంటిని. ఎట్టి సందేహము లేకుండ శ్రీగురుమూర్తిని సేవించు వారలకు సమస్త మనోభీష్టములు సిద్ధించుచుందును. భక్తిహీనులకు కార్యసిద్ధి కానేరదు. గురుమూర్తిని పూజించుటలో, సేవించుటలో కష్టముగానీ, నష్టముగానీ ఎంతమాత్రమూ ఉండదు. అత్యంత భక్తిభావముతో గురుమూర్తిని శరణుగోరి వారినే భజించుము, సేవించుము, పూజించుము, తద్వారా కార్యసిద్ధిని పొందుము. లౌకిక అనుభవమునకు మాత్రమే శ్రీస్వామివారు శ్రీశైలమునకు బయలుదేరినారు”. వత్సా! ఈ కథ ఎంతయో విశిష్టమైనదని సిద్ధమునీంద్రుడు నామధారకునితో నుడివెను.** (252–262)

శ్రీ గంగాధరుని కుమారుడైన సరస్వతి ఇట్లు చెప్పుచుండెను – శ్రీ గురునాథులు ప్రత్యక్షముగా గాణగాపురములో ఉన్నట్లుగా స్వానుభవముతో నేను దర్శించితిని. శ్రీవారిని భజించుచున్న వారందరికి తమ, తమ మనోభీష్టములు తప్పక నెరవేరుచుండును. ఇందెంతమాత్రము సందేహములేదు. ఎంత మాత్రము కష్టము లేకుండా, సునాయాసముగా కోరికలు నెరవేరవలెనన్నచో శీఘ్రముగ గాణగాపురమునకు వెళ్ళుడు. అచట మీకు ఏయే ఫలములు కావలయునని కోరెదరో, వాటినన్నింటిని అతి శీఘ్రముగనే పొందగలుగుదురు. ధనధాన్యాది, పుత్రపౌత్రాది అభివృద్ధిని వెంటనే నిశ్చయముగా పొందగలరు. ఈ గురుచరిత్రమును ప్రతినిత్యము పారాయణమొనర్చిన వారలు శ్రీగురుకృపకు పాత్రులు కాగలరు. సమస్త కామ్యములు వెనువెంటనే నెరవేరగలవు. ఈ రీతిగ గంగాధర సరస్వతి సిద్ధమునీంద్రునకు నామధారకునకు మధ్య జరిగిన సంవాదమును అనుసరించి గ్రంథరూపమున సిద్ధపరచి శ్రీగురుచరిత్రమును మనకు అనుగ్రహించిరి. (263–267)

ఇది శ్రీ గంగాధర – సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "సార్వభౌమ స్ఫోటక శమనము-ఐశ్వర్యావలోకనము" అను ఏబదియవ అధ్యాయము ॥ 50 ॥

॥ జయ గురుదత్త – శ్రీ గురుదత్త ॥

(ఓవీలు – 267; మొత్తము సంఖ్య : 7048 + 267 = 7315 ఓవీలు)

◆ ◆ ◆

ఆనందమానందకరం ప్రసన్నం జ్ఞానస్వరూపం నిజబోధయుక్తమ్ ।
యోగీంద్ర మీడ్యం భవరోగవైద్యం శ్రీమద్గురుం నిత్య మహం నమామి ॥

శ్రీ గురు చరిత్ర

ఏబది ఒకటవ అధ్యాయము

కలికాలప్రభావమును గాంచి శ్రీగురుమూర్తి తమ అవతారమును ఉపసంహరించుకొనుట - నలుగురు శిష్యులతో శ్రీశైలయాత్రకు వెళ్ళుట - గాణగాపురమునందే తాము కొలువుదీరి యుందుమని చెప్పి, "నా భక్తుల యోగక్షేమములను సర్వదా నేనే వహింతునని" అభయదానము చేయుట - పుష్పాసనమును అలంకరించి శ్రీగురునాథుడు తమ నిజధామమునకేగుట - శ్రీగురుకథా మహిమానువర్ణనము

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శిష్యశ్రేష్ఠుడగు నామధారకుడు సిద్ధమునీంద్రునకు నమస్కరించి, వినయముతో శిరసు వంచి అంజలి ఘటించి నుడివెను - "స్వామీ! శ్రీ గురుమూర్తి మ్లేచ్ఛరాజు యొక్క నగరమునకు వెళ్ళి, అతని వైభవమును తిలకించి, అతనిని ఆశీర్వదించి, తిరిగి గాణగాపురమునకు చేరుకొనిరని గడిచిన కథలో తాము చెప్పియుంటిరి గదా! అనంతరము జరిగిన అమృతప్రాయమైన శ్రీగురుచరితామృతమును సవిస్తరముగా, దయతో నాకు శ్రవణము చేయించగలరని" ప్రార్థించెను. (1-2)

అంతట సిద్ధమునీశ్వరుడు వచించెను - "వత్సా! నామధారకా! సావధానముగా వినుము. అనంతరము జరిగిన కథ అత్యంత విశేషప్రదమైనది. అత్యద్భుతమైన శ్రీ గురుమూర్తి యొక్క చరితామృతమును నీకు చెప్పుచున్నాను. ఇట్టి గురుచరితామృతమును ఏకాగ్రచిత్తమును కలిగి, అత్యంత భక్తి ప్రపత్తులతో ఎవరు విందురో, వారి సమస్త పాపములు నశించిపోవును. వారు కోరిన కోరికలన్నియును శీఘ్రముగ సిద్ధించును. మ్లేచ్ఛరాజును అనుగ్రహించిన పిమ్మట శ్రీ గురుమూర్తి తిరిగి గాణగాపురమునకు చేరెను. తదుపరి వారు తమలోతాము ఇట్లు యోచించుకొనిరి. 'ఇక మేము బాహ్యముగా ప్రకటమై యుండ తగదు. శీఘ్రముగ గుప్తముగా వుండిపోవలెను. మేము అవతరించిన కారణమున కావలసిన కార్యములన్నియు పూర్తియైనవి. గురు సంప్రదాయమును స్థాపించి అనుగ్రహించవలసిన శిష్యులను అందరను

అనుగ్రహించితిమి. జగద్విఖ్యాతిని పొందితిమి. మా కీర్తి సర్వత్రా వ్యాపించినది. మ్లేచ్ఛరాజు స్వయముగా మమ్ము దర్శించుటకై వచ్చి మమ్ములను సేవించి తమ నగరమునకు కడు భక్తితో మిగుల శోభాయాత్రపూర్వకముగా తీసుకునివెళ్లి సత్కరించెను.

ఇక మ్లేచ్ఛులతో పాటుగా ఇచటికి నానారకముల జాతులకు చెందిన వారు కూడా వచ్చుచుండెదరు. కలికాల ప్రభావము దినదినము వృద్ధి యగుచున్నది. కావున, ఇంకనూ మేము ప్రకటమైయుండుట సముచితమైనది కాదు. కనుక, శ్రీశైల యాత్ర అను మిషతో ఈ అవతారమును మరుగుపరచుటకు ఉపసంహారము పలికెదము గాక!' అని నిశ్చయించుకొనిరి. **ఆ తర్వాత ముఖ్య శిష్యులను పిలిచి ఇట్లనిరి–** "నాయనా! మేము శ్రీశైల యాత్రకు బయలుదేరుచుంటిమి" అని తమ నిర్ణయమును ప్రకటించిరి. ఈ సమాచారము వెంటనే మఠములోని వారందరికి, కొన్ని క్షణములలో గాణగాపురమునందలి భక్తజనులందరకి తెలిసిపోయెను. శిష్యులు, భక్తజనులు 'శ్రీ స్వామివారు శ్రీశైల పర్వతమునకు వెళ్లుచున్నారట' అని లోలోపలే తలంచుచు పరుగెత్తుకొని వచ్చి స్వామివారికి నమస్కరించుచుండిరి. వారి వియోగమును సహింపలేక మిక్కిలి దుఃఖాక్రాంతులై, వారి చరణధూళిని శిరమున ధరించుచూ, "మహానుభావా! మీరు మమ్ములను వదలిపెట్టి పోవలదు. తాము ఇచటనే నివసింపవలసినది" అని ప్రాధేయపడుతూ అందరికందరూ ప్రార్థింపసాగిరి. "మహాత్మ! మీరు భక్తజనుల పాలిట కామధేనువులు. నిత్యము మీ దర్శనభాగ్యమును చేసికొని మేము పునీతులమగుచుంటిమి. మేము మీ బిడ్డలవంటి వారము. అజ్ఞానులము. మీరే మాకు తల్లి, తండ్రి, సర్వస్వము అని భావించుచూ, దృఢమైన విశ్వాసముతో జీవించుచున్నాము. అట్టి మమ్ములను వదలిపెట్టి దుఃఖసముద్రములో ముంచి మీరు వెళ్లకూడదు. తల్లి తన బిడ్డలను వదిలిపెట్టి దూరదేశమునకు వెడలునా, స్వామీ! మీరు మమ్ములను విడచి వెళ్లుట యుక్తమా తండ్రీ! మీరు లేక మేము ఎటుల జీవింపగలము ప్రభూ!" అని పదే పదే వేడుకొనుచుండిరి. స్వామివారిని పోవలదని, నిర్బంధపూర్వకముగా విజ్ఞాపనము చేయుచుండిరి. (3–13)

శిష్యుల, భక్తుల వినయ పూర్వకమైన విజ్ఞాపనమును విని, భక్తిపూర్వకమైన ఆవేదనమును గాంచి, చిరునవ్వును చిందించుచు యెనలేని ప్రీతిని వహించి **శ్రీ గురుమూర్తి వారితో ఓదార్పు వచనములనిట్లు పలికెను** – "మేము ఈ గాణగాపురమును వదలిపెట్టి వెళ్లడము లేదు. మీరెంత మాత్రము చింతింపవలదు. నేను ఈ గ్రామమునందే, ఈ మఠమునందే నిరంతరము దర్శనము ఇచ్చుచుండెదను. అంతేగాదు, మేము ప్రతిదినము అమరజాసంగమమునకు వెళ్లి స్నానము జేయుదుము. తిరిగి మఠమునకు జేరి గుప్తముగా ఇచ్చటనే ఉండెదము. ఎవరైతే నన్ను ఏకాంత భక్తితో భజించెదరో, వారికి మేము ప్రత్యక్షముగ దర్శనమును అనుగ్రహించెదము. లౌకికదృష్టికి మాత్రమే మేము శ్రీశైల

యాత్రకు పోవుచున్నట్లుగా భావింపుడు. మేము ప్రాతఃకాలమున కృష్ణాతీరమునకు చేరి, అచట స్నానము చేసి, నరసోబావాడి నందలి పంచనదీ సంగమమున ఔదుంబర వృక్షము క్రింద అనుష్ఠానమును చేసికొందుము. తిరిగి సంగమమునకు వచ్చి మధ్యాహ్న స్నానమును పూర్తి చేసుకొని, భీమాతీర తటమునందు గల గాణగాపురమునందలి మఠమునకు వచ్చి, భిక్షచేసి గుప్త రూపమున ఇచటనే యుండెదము. నా మాటను మీరు నమ్ముడు. నేను మీ అందరకు అభయమును ఇచ్చుచున్నాను. గాణగాపురమునందే అహర్నిశములు కొలువుదీరి యుండెదము. త్రికాలములయందు మీరు మమ్ము దర్శించవచ్చును. మా యెడల ధృడమైన భక్తి గలిగిన వారికి సమస్త మనోభీష్టములు నెరవేరును. ఇక్కడి సంగమమునందుగల అశ్వత్థవృక్షమును కల్పవృక్షముగా విశ్వసించుడు, దానిని పూజించుడు. మీ సమస్త కామనలు వెంటనే నెరవేరుచుండును. కల్పవృక్షమును పూజించి, మేము నివసించు ప్రదేశమునకు రావలయును. అచట నెలకొల్పిన నిర్గుణ పాదుకలను మనస్ఫూర్తిగా సేవింపవలెను. నిరాకార స్వరూపముతో మేము నిత్యమూ పాదుకలలో సన్నిహితమై యుందుము. ఇచట **'చింతామణి'** అను గణపతిని నిత్యము పూజించవలెను. ఆయనను పూజించుట వలన, మీరు చింతించిన సమస్త కోరికలు నిర్విఘ్నముగా నెరవేరగలవు. అష్ట తీర్థముల యందు స్నానములను చేయుడు. మీరు ప్రతి నిత్యము త్రికాలముల యందు మా నిర్గుణ పాదుకలకు పూజలను పూర్తి చేసి, మూడు పర్యాయములు హారతులు ఇచ్చుటవలన భక్తజనుల మనోభీష్టములన్నియు తప్పక నెరవేరుచుండును. నేను చెప్పిన విధముగా చక్కగా ఆచరించగల్గిన వారందరు మా ప్రీతికి పాత్రులయ్యెదరు" అని శిష్యబృందమును, భక్తజనులను వాత్సల్యపూర్వకముగా సమాధానపరచి, వెంటనే శ్రీశైల యాత్రకు శ్రీవారు బయలుదేరిరి. (14-25)

భక్తజనులందరు కొంతదూరము వారి వెంట వెళ్ళి సాగనంపిన మీదట, శ్రీవారి అనుజ్ఞను పొంది వారి అద్భుతమైన, దివ్య దర్శనమును మరొక్క మారు చేసుకొనుచు, వారి మందహాస వదనారవిందనమును మాటిమాటికి దర్శించుచూ, కరుణారసపూరితమైన దృక్కులను గ్రోలుచు, మధ్య మధ్యలో వెనుకకు మరలి మరలి చూచుచూ వారిని విడువలేక విడువలేక గుర్వాజ్ఞను శిరసా వహించి తిరిగి గ్రామమునకు చేరుకొనిరి. "అయ్యో! స్వామివారు వెళ్ళిపోవుచుండిరి గదా" అను మానసిక దిగులుతో మఠమునకు చేరుకొనిరి. వ్యధాపూరిత మనస్సులతో, బరువెక్కిన గుండెలతో, మఠములోనికి ప్రవేశించగనే అక్కడ వారందరికి శ్రీగురునాథులు దర్శనమిచ్చిరి. అందరునూ విస్మయావహులైరి. శ్రీగురునాథుని మహిమా ప్రభావమునకు ఆశ్చర్యచకితులై ఒళ్ళు జలదరించుచుండగా, భక్తిభావ ప్రవాహము అంతరంగమున పరవళ్ళు త్రొక్కుచుండగా, వివశులై పదే పదే వారి మహిమను స్తోత్రము చేయుచు మరల మరల పాదాభివందనములను చేయుచుండిరి. అచటికి

చేరిన వారిలో కొందరు శ్రీ గురుమూర్తులు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులే కాని వేరు కాదు. వారిని మానవుడు అని తలంచినవాడు నేరుగా నరకలోకమునకే వెళ్ళును సుమా! ఇది సత్యము. ఇది ముమ్మాటికి సత్యము. వారి మహిమ అపారమైనది. గురుకృపా ప్రభావమును గుర్తించుట అల్పజ్ఞులమైన మనకు సాధ్యము కాని పని. అని ఈ విధముగ ప్రకటించుచూ, “నేను ఇచటనే వుందును” అని చెప్పిన ప్రమాణ వాక్యమునకు వెంటనే భక్తులకు దృష్టాంతమును చూపించి, మాయాపూరితమైన అజ్ఞానమును పారద్రోలి, వారిలో ప్రగాఢమైన భక్తి విశ్వాసములను, తమ అనుగ్రహముచే స్వయముగా గురుమూర్తియే పాదుకొల్పెను. (26-29□)

కొద్దిమంది శిష్యులను వెంట తీసుకొని శ్రీ గురుమూర్తి శ్రీశైల పర్వతమునకు చేరుకొనిరి. అచటి పాతాళ గంగా తీరమునకు సమీపించిరి. తమ వెంటగల శిష్యులతో, “నేను వెంటనే మల్లిఖార్జునుడిలో ఐక్యమగుటకై ఆవలి తీరమునకు వెళ్లవలయును. కనుక, మీరు శీఘ్రముగ ఒక పుష్పాసనమును సిద్ధము చేయుమనిరి. దానినే అధిష్ఠించి, ఆవలికి చేరుకొని, మల్లిఖార్జునుడిలో ఐక్యమయ్యెదమని” ఆదేశించిరి. గురువుగారి ఆజ్ఞను శిరసా వహించి వారి వెంటగల శిష్యులు వెంటనే మాలతీ పుష్పములను, కమలములను, కల్హారములను, మరికొన్ని నానావిధ పుష్పములను, తెచ్చి కదలీ పత్రములతో అనగా అరటి ఆకులతో శోభావహమైన చక్కటి ఆసనమును సిద్ధపరచిరి. వెంటనే శ్రీగురుమూర్తి ఆ పుష్పాసనమును పవిత్రమైన గంగా ప్రవాహమునందు నిల్పుమని చెప్పిరి. శిష్యులు అటులనే చేసిరి. **అంతట శ్రీగురుమూర్తి తన వెంటగల శిష్యులను ఉద్దేశించి ఇట్లు పలికిరి–** “మీరందరు త్వరితగతిన గాణగాపురమునకు చేరుకొనుడు” అని చెప్పగానే శిష్యులందరు అంతులేని దుఃఖమునకు లోనయిరి. **దుఃఖితులగుచున్న శిష్యులను గూర్చి చంద్రమౌళీశ్వర స్వరూపుడైన శ్రీ గురునాథుడు వారితో పలికెను– “నాయనలారా! మీరెంత మాత్రమూ దుఃఖించవద్దు, మేము గాణగాపురములోనే, మీ సమక్షముననే ఉండెదము. నా యెడల భక్తిలేని వారికి మాత్రమే, నేను లేనట్లుగా భాసించుచుండెదను. కాని, భక్తజనులకు మేము ఎల్లప్పుడు సన్నిహితులమై యుండెదము, వారితో పాటు వారి ఇండ్లలోనే నివసించుచుండెదము. నా మాటను నిశ్చయముగా మీ చిత్తమునందు నిలుపుకొనుడు. అన్య చింతనములు చేయవద్దు. అనుమానములకు తావీయవలదు, నా మాటను సత్యముగా తలంచి విశ్వసింపుడు”** అని తన వెంట గల శిష్యులను ప్రేమపూరితమైన అమృత వాక్కులతో ఓదార్చుచూ, చల్లని చూపులతో కృపావృష్టిని గురిపించుచూ, పరిపూర్ణముగా వారిని అనుగ్రహించెను. వెంటనే శ్రీగురునాథుడు లేచి, అడుగు ముందుకు వేయగా, కట్టలు తెంచుకొని వచ్చుచున్న వియోగబాధను సహింపలేక, ప్రవాహ వేగముతో పరుగెత్తుకొని వచ్చుచున్న దుఃఖాశ్రువులను దిగమింగలేక, ఆ శిష్యులు స్వామివారి దివ్యమైన పాదపద్మములపై, తమ శిరస్సులను వుంచి సాష్టాంగవందనములను ఆచరించుచుండిరి.

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

ఆర్తులకు, అనాథలకు, ఆశ్రితులగు భక్తజనులకు, నిజాశ్రయములైన వారి పాదపద్మాలను పట్టుకొని విడిచి పెట్టలేక పదే పదే వందనములను చేయుచు, ప్రాధేయపడుచూ, గుర్వాజ్ఞను శిరసా వహించి, లేచి నిలబడి, అంజలి ఘటించి, నమస్కరించు చుండిరి. వెంటనే గురుమూర్తి వారి శిరములను వాత్సల్యభావముతో మూర్కొని అత్యంత కృపామయ దృక్కులతో వారిని చూచి, ఆశీర్వదించిరి. అంతట శ్రీ గురుమూర్తియగు శ్రీ నృసింహసరస్వతి స్వాములవారు తమ శిష్యులతో నిర్మింపబడి పాతాళగంగా ప్రవాహమున నిల్పబడిన పుష్పాసనమునందు **దేవగురువగు బృహస్పతి కన్యారాశిలోనికి ప్రవేశించిన బహుధాన్య నామ సంవత్సరము, ఉత్తరాయణము, శిశిరఋతువు, మాఘమాసము, కృష్ణపక్షము, పాడ్యమి తిథి, పుణ్యదివసమగు శుక్రవారము. కుంభరాశియందు సూర్యసంక్రమణ జరుగు శుభసమయమున శ్రీ గురుమూర్తి నిజానందముతో సుఖాసీనులైరి.** (29□-37)

అంతట శిష్యులను ఒకమారు కలయచూసిన గురుడు శిష్యులతో నుడివెను – **"మేము మా నిజధామమును చేరుకొనుటకు వెళ్లిపోవుచుంటిమి. అచటికి చేరిన వెంటనే అందుకు గుర్తుగా ప్రసాదపూర్వకముగా పుష్పములను పంపెదము. చేమంతి పుష్పములు మీ వద్దకు చేరుకొనును. ఆ పుష్పములను ప్రసాదపూర్వకముగా కదు భక్తితో వాటిని మీరు స్వీకరించి, అఖండముగా పూజించుచుండుడు. తద్వారా, మీ ఇంటిలో అఖండ లక్ష్మి తాండవించుచుండును. మీకు మరియొక విషయమును వివరించుచున్నాను. "నాకు గానము అంటే కదు ప్రీతి. కావున, మీరు నా నామమును స్మరించుచు, స్తోత్రమును చేయుచు, గొంతెత్తి గానము చేయుడు. నిత్యము ఎవరు కదు ప్రీతితో నన్ను గూర్చి గానము చేయుదురో, వారి ఇండ్లలో నిత్యము నేను నివసించుచుండెదను. వారి గృహములయందు ఎట్టి వ్యాధులుండవు. దారిద్ర్యము దరిదాపులకు రాకుండును. అఖండ లక్ష్మీ సంపన్నులై, శతాయుష్మంతులైన పుత్రపౌత్రులతో వారి కుటుంబములు వృద్ధిచెందుచుండును. ఎవరు నా చరిత్రమును నిత్యము భక్తితో పఠించెదరో, శ్రద్ధగా ఎవరు శ్రవణము చేయుదురో, వారి ఇంట లక్ష్మీదేవి సుస్థిరముగా నుండును. ఇందెంతమాత్రము నంశయింపవలసిన పని లేదు"** అని శిష్యులకు స్పష్టముగా అనుగ్రహపూర్వకమైన తమ భాషణమును వినిపించుచు శ్రీగురుమూర్తి తమ నిజరూపముతో అదృశ్యులైరి. తీరమున నిలచిన శిష్యులు బాధాతప్త హృదయములతో మిగుల చింతించుచు పుష్పాసనము వెళ్లిన వైపునకే చూచుచుండిరి. (38-44)

తదేకదృష్టితో చెప్పరాని హృదయబాధతో గంగవైపే చూచుచుండిన ఆ శిష్యుల చెంతకు నదీప్రవాహమునుండి ఒక నావికుడు వచ్చెను. **అతడు శిష్యులతో ఇట్లు పలికెను** – "నేను మీ గురుమూర్తిని ఆవలి గట్టున దర్శించితిని. వారు సన్న్యాసరూపములో వుండి ఒక చేతిలో

దండమును ధరించి యుండెను. వారిని మీ నామధేయమేమని అడుగగా, నృసింహ సరస్వతి అని చెప్పిరి. శిష్య, భక్తజన వత్సలుడగు గురునాథుడు మీతో ఇటుల చెప్పుమని నన్ను ఆదేశించిరి. నేను కర్దళీ (కదలీ) వనమునకు వెడలుచుంటిని. ఎల్లప్పుడు గాణగాపురములోనే ఉండెదను. మీరు వెంటనే గాణగాపురమునకు వెళ్లుడు. అచట నేను సదా గుప్త రూపమున ఉందునని చెప్పిరి. గురునాథుడు వెళ్ళిపోయిరని మీరు భ్రాంతితో దుఃఖించుచుంటిరి. నేను ప్రత్యక్షముగా వారిని చూచితిని. వారి చరణములకు బంగారు పాదుకలు ఉండెను. నేను మీకు ప్రసాదపుష్పములను పంపుచుంటిని. అవి మీరు స్వీకరించి, పూజింపుడు అని ఈవిధముగా నాతో చెప్పిరని", ఆ నావికుడు వారితో చెప్పెను. ఈ మాటను నావికుడు చెప్పుచుండగనే ప్రసాదము కొరకై వచ్చు పుష్పములకొరకు శిష్యులు ఎదురుచూచుచుండిరి. ఇంతలో అందమైన నాలుగు చేమంతి పుష్పములు ప్రసాదముగా, ప్రవాహవేగముతోపాటు తీరమునకు రానే వచ్చెను. శిష్యులు పులకాంకిత గాత్రులై అత్యంత హర్షోల్లాసములతో ఆ పుష్పములను వారు స్వీకరించిరి. **అంతట అత్యుత్సాహముతో నామధారకుడు సిద్ధమునితో ఇట్లనెను** - "స్వామీ! శ్రీగురునాథునికి అంతటి ప్రీతిపాత్రులైన ముఖ్య శిష్యులు ఎవరు, వారెవరు కావచ్చును. పుష్పములు లభించిన ఆ ముఖ్యశిష్యులను గురించి నాకు తెలియ చెప్పుమని" ఆత్రముగ ప్రశ్నించెను. **అంతట సిద్ధముని నామధారకునితో నుడివెను** - "నామధారకా! గాణగాపురములో నివసించుచుండినప్పుడు గురునాథునకు, అసంఖ్యాకమైన శిష్యులు ఉండిరి. వారిలో కొందరు సన్న్యాస ఆశ్రమమును స్వీకరించిరి. సన్న్యాసాశ్రమమును స్వీకరించిన వారిని తీర్థయాత్ర పేరిట పంపించెను. వారిలో కొందరి పేర్లను నీకు వివరించి చెప్పెదను వినుము.(45-56)

కృష్ణసరస్వతి, బాలసరస్వతి, ఉపేంద్ర సరస్వతి, మాధవ సరస్వతి మొదలగువారు గురుమూర్తికి సన్న్యాస శిష్యులుగా ఉండిరి. వారినే తీర్థయాత్రలకై పంపించి యుండిరి. ఇక గృహస్థ శిష్యులు అసంఖ్యాకముగా ఉండిరి. వారందరూ తమ తమ ఇండ్లలోనే వుండెదరు. అందులో ముగ్గురు మాత్రమే శ్రీస్వామివారి వెంట శ్రీశైల పర్వతమునకు చేరుకొనిరి. ఇక నాల్గవ వాడిని నేనే" అని సిద్ధముని చెప్పెను. ఇక ఆ నలుగురి పేర్లు ఏవనగా సాఖరే సాయందేవుడు, నంది, నరహరి అను ఉభయ కవీశ్వరులు మరియు నాల్గవవాడిని నేను అనగా సిద్ధముని అను నలుగురము గురుమూర్తి వెంట శ్రీశైలమునకు వచ్చియుంటిమి. ఈ నలుగురమే గురుప్రసాదముగా వచ్చిన పుష్పములను స్వీకరించి, తిరిగి గాణగాపురమునకు చేరుకొని, ఆ పుష్పములను, సదా, సర్వదా పూజించుచుంటిమి" అని తన వద్దగల పుష్పమును నామధారకునకు చూపించెను. ఆ విధముగా వారు గురుమూర్తిని, గురుమూర్తి మాహాత్మ్యమును అత్యధికముగా కొనియాడిరి. గురు మహిమను గూర్చి చెప్పవలెనన్నచో అది అపారమైనది. అందులో నా బుద్ధికి అందినంతవరకు నీకు స్వల్పాంశమును మాత్రమే చెప్పియుంటిని. (57-61)

కామధేనువువంటి శ్రీ గురుచరిత్రమును నీకు వివరముగా విస్తరించి శ్రవణము చేయించితిని. తద్వారా, నీ దారిద్ర్యము నిశ్చయముగా సమసిపోయెను. ఇట్టి మహిమాన్వితమైన శ్రీగురుచరిత్ర గ్రంథమును ఎవరు లిఖించెదరో, ఎవరు పఠించెదరో, ఎవరు శ్రవణము చేయుదురో, వారు పవిత్రులయ్యెదరు. అట్టివారికి సమస్త దుఃఖములు, దారిద్ర్యములు దరిదాపులకు రాకుండ పారిపోవును. వారందరు పుత్రపౌత్రాభివృద్ధి నొంది అఖండ లక్ష్మీసంపన్ను లయ్యెదరు. ధర్మార్థకామ మోక్షములు వారికి ప్రత్యక్షముగ సిద్ధించును. వారి వారి మాతృ, పితృ వంశములు తరించిపోవును" అని సిద్ధముని చెప్పగా, నామధారకుడు అత్యంత సంతోషభరితుడయ్యెను". సిద్ధముని నామధారకునకు చెప్పిన విధముగా, శ్రీగురుచరిత్రమును లిఖించి మనకు అందించిన పిమ్మట, గంగాధర సరస్వతి ఇట్లు చెప్పుచుండెను-

"సిద్ధముని వలన అభీష్టవరమును పొందిన నామధారకుడు లక్ష్మీసంపన్నుడై శతాయుష్మంతులైన పుత్రపౌత్రాభివృద్ధిని పొందెను. కావున, శ్రీగురుచరిత్రమును వినుట వలన సకల అభీష్టములు నెరవేరును. సకల అరిష్టములు తొలగును. భావుకులైన భక్తజనులారా! నా మాట వినుడు. గురుకథామృతముతో నింపిన ఈ కలశమును మీరందరూ స్వీకరింపుడు. ధర్మార్థకామమోక్షములగు చతుర్విధ ఫలములను అతిశీఘ్రముగ పొందుటకై, ఈ పూర్ణ కలశములోగల గురుచరితామృతమును పానము చేయుడు. ఎవరైతే సమస్త శ్రేయస్సులను పొందగలిగిన అదృష్టవంతులు గలరో, ఎవరు గురుకృపకు పాత్రులయ్యెదరో, అట్టివారికి మాత్రమే ఈ అమృతకలశమునందలి గురుచరితామృతము రుచించును. ఈ గురుచరిత్రను శ్రవణమొనర్చువారి ముఖము అఖండానందముతో కళకళలాడుచూ లక్ష్మీసంపన్నమై తులతూగుచుండును. శ్రీ గురునాథుడగు శ్రీ నృసింహసరస్వతి స్వామి వారు, వారి వంశపరంపరను, కృపామయదృష్టితో సంరక్షించుచుండును. పవిత్రమైన, దివ్యమైన, మనోహరమైన ఈ కథను శ్రవణముచేసి సమస్త అభీష్టములతో పాటు చతుర్విధ పురుషార్థ ఫలములను పొందగలరు" అను ఆకాంక్షతో గంగాధర సరస్వతి శ్రోతలకు, పఠితలకు అందరకు నమస్కరించెను. (62-71)

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతమునందలి శ్రీనృసింహ సరస్వతీ ఉపాఖ్యానమున భక్తికాండమునందు "శ్రీగురు నిజానందగమనము" అను ఏబది ఒకటవ అధ్యాయము ॥ 51 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 71; మొత్తము సంఖ్య: 7315 + 71 = 7386 ఓవీలు)

◆ ◆ ◆

శ్రీ గురు చరిత్ర

ఏబది రెండవ అధ్యాయము

శ్రీగురుచరిత్రమును వినిన నామధారకుడు సమాధిస్థితి నొందుట - సిద్ధముని స్పర్శచే తిరిగి అతడు బాహ్యస్థితికి చేరుకొనుట - అవతరణిక - సప్తాహ పారాయణ పద్ధతి - ఫలశ్రుతి వివరింపబడుట

శ్రీ గణేశాయ నమః ॥ శ్రీ సరస్వత్యై నమః ॥ శ్రీ గురుభ్యో నమః ॥ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీనృసింహసరస్వతీ - శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః - గురుర్దేవో మహేశ్వరః । గురురేవ పరంబ్రహ్మా (గురుస్సాక్షాత్ పరంబ్రహ్మా)
తస్మై శ్రీ గురవే నమః ॥ శ్రీగురుదేవ దత్తాత్రేయ చరణారవిందాభ్యాం నమః ॥

శ్రోతలు సావధానచిత్తముతో నుందురుగాక! శ్రీగురుచరిత్రము నందలి ఏబది యొకటవ అధ్యాయమును వినిన మీదట శిష్యరత్నమగు నామధారకుని మనస్సు బ్రహ్మానందమునందు నిమగ్నమయ్యెను. శ్రీ గురుచరితామృతమును సిద్ధమునీశ్వరునిచే మనసారా గ్రోలిన నామధారకుడు బ్రహ్మానంద రసాబ్ధిలో లీనమై సమాధిస్థితి నొందెను. ఆతని దేహము పులకించిపోయి, అంగములు ఘర్మజలముతో నిండిపోయెను. ఆతని రోమములు నిక్కపొడుచుకొనియుండెను. కంఠము గద్గదమాయెను. దేహము కంపించుచుండెను. నేత్రముల వెంట ప్రేమాశ్రువులు జలజల ప్రవహింపసాగెను. సమాధిసుఖము మాటలతో చెప్పరానిది. దేహము అణుమాత్రము కూడా కదలకుండా స్థంభించియుండెను. శిష్యోత్తముడగు నామధారకుని యందు అష్టసాత్త్విక భావములు పొంగులు వారుచుండెను. తన శిష్యుని స్థితిని గాంచిన సిద్ధమునీంద్రుడు అఖండమైన సుఖానుభూతికి లోనయ్యెను. "ఆహా! ఇతనికి సమాధిస్థితి లభించినది. కాని, లోకోపకారమునకై తిరిగి ఇతనిని సావధానపరచవలెను" అని సిద్ధముని భావించెను. (1-5)

"వత్సా! శిష్యోత్తమా! కుమారా! నా మాట వినుము" అంటూ తన చేతితో నామధారకుని శిరమును, శరీరమును ప్రేమభావముతో నెమ్మదిగా నిమురుతూ సంతోషాంతరంగుడై అతనిని గాఢాలింగనము చేసుకొనెను. **అంతట మహదానందభరితుడైన సిద్ధమునీంద్రుడు యిట్లు పలికెను-** "నాయనా! సావధానుడవు కమ్ము. నెమ్మదిగా కనులు తెరచి నా వైపు చూడుము" అని పలకరించెను. "చిరంజీవి! నీవు భవసాగరమును తరించితివి. కాని, సమాధిస్థితిని పొంది, ఇటులనే నీవు చేష్టలుడిగి స్థాణువుగా కూర్చొనియుండినచో, లోకమునకు

ప్రసాదింపవలసిన జ్ఞానోపదేశము నీ ఉదరమునందే నిలిచిపోవును కదా! అప్పుడు లోకులెట్లు తరించగలరు. అందువలన, అంతఃకరణమునందు భావబలముతో శ్రీగురుచరణకమలములను దృఢముగా నిలుపుకొని, బాహ్యమునకు మాత్రము శాస్త్రవిధిని అనుసరించి దేహయాత్రను జరుపుకొనుచుండవలెను. అంతేకాదు, నీవు ప్రశ్నించుటవలన మాకు అమృతవాణి స్మరణకు వచ్చెను. తత్ఫలితముగా ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికమను తాపత్రయములను నశింపజేయునట్టి సాటిలేని పవిత్రమైన గురుచరిత్రము ప్రకటమయ్యెను. నీ మూలముగ నాకు అది జ్ఞప్తికి వచ్చెను. నీవు నాకెంతయో ఉపకరించితివి. అంతులేని మేలు ఒనరించితివి. అంతకంతకు అతిశయించిన భక్తిభావముతో నీవు కూడా ఏకాగ్రచిత్తముతో వినియుంటివి. భక్తజనులను ఉద్ధరింపగలుగునట్టి మహత్తరమైన గురుచరిత్రమును నీవు మరింతగా విస్తరింపజేయవలెను" అని సిద్ధముని నామధారకునితో పదేపదే బోధింపగా మెల్ల, మెల్లగా నామధారకుడు సమాధిస్థితినుండి తేరుకొని కళ్ళు తెరచి జాగ్రద్దశకు చేరుకొనెను. (6-11)

వెంటనే, నామధారకుడు లేచి తనకెదురుగా ఆసీనుడై యున్న సిద్ధమునీశ్వరుని పాదపద్మములకు సాష్టాంగముగ వందనము నాచరించెను. **అంజలిబద్ధుడై ఇట్లు పలికెను** – "శ్రీగురురాయా! కృపతో మమ్ము తరింపచేయుము. ఈ విశ్వమునకు మీరే ఆధారభూతులు. దాటలేని ఈ భవసాగరము యొక్క ఆవలితీరమునకు సులభముగా చేర్చగల సమర్థులు మీరే" అని నామధారకుడు విన్నవించి సిద్ధముని చరణకమలములకు తిరిగి నమస్కరించెను. **మరల నామధారకుడు ఇట్లు ప్రశ్నించెను** – "స్వామీ! శ్రీగురుచరితామృతము యొక్క అవతరణికను నాకు దయతో వివరించగలరు. అమృతమును మించిన పరమామృతమైన శ్రీ గురుచరితామృతమునందు భక్తజనుల మనోవృత్తి లయించి మునకలు వేసి ఆనందవారాన్నిధిలో స్థిరమై యుండవలెను. అక్షయామృతమును పానము చేయించి నన్ను అఖండమైన ఆనందరససాగరములో ఓలలాడించితిరి. కాని, నాకింకనూ కొంత అసంతృప్తియే మిగిలియుండెను. దానిని పరిపూర్తి చేయుటకై లోకములోని అనేక ఔషధముల సారమును సంగ్రహించి "త్రైలోక్యచింతామణి రసాయనము" అనే దివ్యౌషధమును సిద్ధపరచుకొని బుద్ధిమంతులందరూ తమ వద్ద పదిలపరచుకొందురు గదా!

కావున, శ్రీగురుచరితామృత సారసర్వస్వమును **'అవతరణిక'** రూపములో సంగ్రహముగ శ్రవణము చేయించి నాకు మరింత సంతృప్తిని చేకూర్చగలరని" ప్రార్థించెను. (12-16)

శిష్యోత్తముని ప్రార్థనమును ఆలకించిన సిద్ధముని ఆనందభరితుడయ్యెను. ప్రసన్నవదనుడైన **సిద్ధముని నామధారకునితో ఇట్లు** చెప్పసాగెను– "వత్సా! ఉత్తమమైన నీ కోరిక వలన శ్రీగురుచరిత్రము ఈ లోకంలో అఖండమై, శాశ్వతమై నిలిచిపోవును. నీవు కోరిన విధముగా ఇప్పుడు

శ్రీగురుచరిత్రము నందలి మొదటి అధ్యాయము నుండి మొదలుకొని చివరిదగు ఏబదియొకటవ అధ్యాయము వరకు గల కథా సారాంశమును సంగ్రహముగ **'అవతరణిక'** అను పేరుతో వివరించెదను, సమాహితచిత్తుడవై వినవలసినది. (17-18)

మొదటి అధ్యాయము నందు మంగళాచరణము, ముఖ్య దేవతాస్మరణము, భక్తజనుల కొరకు శ్రీగురుమూర్తి దర్శనము చెప్పబడినది. ఇక రెండవ అధ్యాయము నందు బ్రహ్మోత్పత్తి, చతుర్విధ యుగములను గూర్చిన కథనము, దీపకుని గురుసేవా ప్రభావమును గూర్చి వివరింపబడినది. మూడవ అధ్యాయము నందు నామధారకుడు అమరజా సంగమమునకు చేరుకొని శ్రీగురుని ధామమునకు చేరుట, అంబరీష – దుర్వాసుల మహిమ వర్ణింపబడినది. ఇక నాల్గవ అధ్యాయము నందు త్రిమూర్తులు సతీ అనసూయను పరీక్షించుటకై వచ్చుట, కాని, వారు ఆమెకు పుత్రులుగా మారి ఆనందపూర్వకముగా ఆమె స్తన్యపానము చేయుటను గూర్చి వివరింపబడినది. ఇక ఐదవ అధ్యాయము నందు శ్రీదత్తాత్రేయ స్వాములవారు శ్రీపాద శ్రీవల్లభులను నామము ధరించి పిఠాపురము నందు స్వయముగా అవతరించుట, తీర్థయాత్రకు బయలుదేరుటను గూర్చి చెప్పబడినది. ఆరవ అధ్యాయము నందు రావణుడు శివుని ప్రాణలింగమును తీసుకొని లంకకు వెళ్ళుచుండగా విఘ్నేశ్వరుడు విఘ్నములను కలిగించి మధ్యలోనే లింగమును స్థాపింపచేయుటనుగూర్చి చెప్పబడినది. అనంతరము రాజుతో గౌతముడు చెప్పిన గోకర్ణక్షేత్ర మహిమ వర్ణింపబడినది. ఆకస్మికముగా ఒక చాండాల స్త్రీని ఉద్ధరించుటను గూర్చి ఏడవ అధ్యాయము నందు వర్ణింపబడినది. మాతాపుత్రులు ప్రాణత్యాగము చేయబోవుచుండగా వారికి గురుకథను తెలియజెప్పి శనిప్రదోష వ్రతమును చేయించి వారిని జ్ఞానులనుగా తీర్చిదిద్దిన కథనము ఎనిమిదవ అధ్యాయమున ప్రస్తావింపబడినది. ఇక తొమ్మిదవ అధ్యాయము నందు తమ సేవజేయు రజకునికి కృపామూర్తియైన గురుడు రాజుగా చేసి తిరిగి నీకు దర్శనమిచ్చెదనని పలికి, అచటనే శ్రీవారు గుప్తమైపోయిన వృత్తాంతము వివరింపబడినది. చోరులు భక్తుడైన బ్రాహ్మణుని చంపినపుడు శ్రీగురుడు స్వయముగా విచ్చేసి ఆ చోరులను వధించి బ్రాహ్మణునకు ప్రాణదానము చేసిన కథాక్రమము పదవ అధ్యాయము నందు వర్ణింపబడినది. అనంతరము కరంజాపురము నందు మాధవుడు అంబయను పేరుగల బ్రాహ్మణదంపతులకు నరసింహ సరస్వతి అవతరించుటను గూర్చి పదకొండవ అధ్యాయమునందు వర్ణింపబడినది. ఇక పంద్రెండవ అధ్యాయము నందు తన తల్లికి కుమారుడు జ్ఞానబోధ చేసి కాశీక్షేత్రమునందు సన్యాసము తీసికొని ఉత్తరదేశ యాత్రను పూర్తిచేసిన పిమ్మట, తిరిగి కరంజా నగరమునందుగల తలిదండ్రులను దర్శించుటకై గోదావరీ తీరమునకు విచ్చేసిన కథ వర్ణింపబడినది. ఇక పదమూడవ అధ్యాయము నందు ఉదరశూలతో బాధపడుచున్న బ్రాహ్మణునిపై గురుమూర్తి కృపను చూపుటను గూర్చి వర్ణింపబడినది. పదునాల్గవ అధ్యాయము నందు కృపామూర్తి యగు శ్రీగురునాథుడు సాయందేవునకు వరమునిచ్చి, క్రూరుడగు యవనుని శాసించి, శాంతింపచేసిన

పిమ్మట, సాయందేవునకు వరప్రదానము చేసిన కథను గూర్చి వివరింపబడినది. పదునైదవ అధ్యాయము నందు శ్రీగురుమూర్తి శిష్యులతో తీర్థయాత్రలను గూర్చి వర్ణించిన తీరు, వారిని యాత్రకు పంపించిన వైనముతోపాటు శ్రీగురుడు వైద్యనాథము నందు గుప్తమై పోయిన కథాక్రమము వర్ణింపబడినది. (19-33)

గురుభక్తిని గూర్చి బ్రాహ్మణునకు వివరించి, జ్ఞానశక్తిని ప్రసాదించి శ్రీగురుమూర్తి భిల్లవడిలో భువనేశ్వరీదేవి సన్నిధికి చేరుటను గూర్చి పదహారవ అధ్యాయము నందు వర్ణింపబడినది. భువనేశ్వరి సన్నిధియందు మూర్ఖబ్రాహ్మణుడు నాలుకను ఛేదించి అర్పించిన వైనముతోపాటు శ్రీగురునాథులు అతనికి విద్యను ప్రసాదించి ధన్యతను చేకూర్చిన కథాక్రమము పదునేడవ అధ్యాయము నందు వివరింపబడినది. ఇక పదునెనిమిదవ అధ్యాయము నందు ఒక దరిద్రుని ఇంట చిక్కుడుపాదును తొలగించి బంగారుబిందెను అనుగ్రహించిన శ్రీగురునాథుని కృపావైభవమును గూర్చి ప్రస్తావింపబడినది. పందొమ్మిదవ అధ్యాయము నందు ఔదుంబరమును వర్ణించి యోగినులకు వరదానమును ప్రసాదించి శ్రీగురునాథులు గాణగాపురమునకు వెళ్ళిన కథను గూర్చి వర్ణింపబడినది. ఒక స్త్రీని పీడించుచున్న బ్రహ్మపిశాచమును తరిమికొట్టి ఆమెకు ఇరువురు పుత్రులను ప్రసాదించి, వారిలో ఒకడు మరణింపగా సిద్ధుని రూపములో వచ్చి ఆమెకు జ్ఞానబోధను చేయుటను గూర్చి ఇరువదియవ అధ్యాయమున చెప్పబడినది. అదే కథను ఇరువది ఒకటవ అధ్యాయమునందు కొనసాగించుచూ ప్రేతమును ఔదుంబరము వద్దకు తెప్పించి శ్రీగురునాథులు అచటికి రాత్రిపూట వచ్చి దయతో మృత పుత్రునకు ప్రాణభిక్షను పెట్టుట గూర్చి ఇరువది ఒకటవ అధ్యాయమున వివరింపబడినది. దరిద్రుని ఇంటియందు భిక్ష చేయుటకై వెళ్ళి వారి ఇంటియందుగల గొడ్డు బఱ్ఱెను పాలను ఇచ్చునట్లుగా మార్చిన గురుప్రభావమును గురించి ఇరువది రెండవ అధ్యాయమున వివరింపబడినది. ఇక ఇరువది మూడవ అధ్యాయమునందు రాజు శ్రీగురునాథుని గాణగాపురమునకు తీసుకొని వెళ్ళినప్పుడు అచటగల రాక్షసుని ఉద్ధరించుట మరియు త్రివిక్రముడు గురునిందను చేయుటను గూర్చి చెప్పబడినది. త్రివిక్రముడు గురునాథుని దర్శించుటకై వెళ్ళగా తమ విశ్వరూపమును చూపించినపుడు ఆతడు గురుపాదపద్మములను ఆశ్రయించిన వైనమును, దయతో శ్రీగురునాథుడు వరమును ప్రసాదించుటను గూర్చి ఇరువది నాల్గవ అధ్యాయమున వర్ణింపబడినది. మ్లేచ్ఛుల ముందు వేదమును వల్లెవేయు విప్రులు వచ్చి త్రివిక్రముని బాధించుటను గూర్చి, అతడు తనతోపాటుగా ఆ విప్రులను తీసుకొని గురునాథుని వద్దకు చేరుకొనుటను గూర్చిన కథను ఇరువది ఐదవ అధ్యాయమునందు వర్ణింపబడినది. ఇక ఇరువది ఆరవ అధ్యాయము నందు వేదరచనను గూర్చి, వేదవాదమును చేయవలయుననెడు పట్టుదలను వదలిపెట్టుమని గురునాథుడు ఎంత చెప్పిననూ ఉన్మత్తులైన బ్రాహ్మణులు వినకపోవుటను గూర్చి చెప్పబడినది. తదుపరి, ఇరువది ఏడవ అధ్యాయమునందు ఒక అంత్యజుడైన వ్యక్తిని పిలిచి విప్రులతో

వేదవాదములను చేయించి, గర్వోన్మత్తులైన బ్రాహ్మణులను పరాజితులను చేసినందున శాపగ్రస్తులై బ్రహ్మరాక్షసులుగా మారుటను గూర్చి చెప్పబడినది. ఇరువది ఎనిమిదవ అధ్యాయములో ధర్మాధర్మములను గూర్చి చెప్పించిన అంత్యజునకు తిరిగి అతని పతితావస్థను ప్రసాదించి వాడిని అతని గృహమునకు పంపించుటను గూర్చి వర్ణింపబడినది. ఇరువది తొమ్మిదవ అధ్యాయమున త్రివిక్రముడు ప్రశ్నించుటచే శ్రీగురుమూర్తి భస్మమాహాత్మ్యమును గూర్చి చెప్పుట, వామదేవుడు రాక్షసుని ఉద్ధరించిన ఇతిహాసము కూడా ఈ అధ్యాయమునందే చెప్పబడినది. ముప్పదియవ అధ్యాయము నందు భర్త మరణించగా అతని భార్య మిగుల దుఃఖించిన సంగతిని, అనేకవిధముల కథలను చెప్పి శ్రీగురునాథుడు ఆమెను శాంతించమని ఓదార్చిన కథను గూర్చి వర్ణింపబడినది. ముప్పది ఒకటవ అధ్యాయములో కూడా అదే కథను కొనసాగించి జగద్గురువు పతివ్రతా ధర్మములను చక్కగా చెప్పి సహగమనము చేయవలసిన పద్ధతిని బోధించిన వైనము వివరింపబడినది . అనంతరము ముప్పది రెండవ అధ్యాయమున సతీసహగమనమునకై బయలుదేరిన ఆ స్త్రీ శ్రీగురునకు నమస్కరించినప్పుడు ఆమెను ఆశీర్వదించి ఆమె భర్తకు ప్రాణము పోసిన కథాక్రమము వర్ణింపబడినది. (34-50)

తరువాత ముప్పది మూడవ అధ్యాయమునందు రుద్రాక్ష ధారణ, కుక్కుట - మర్కటముల కథ, వేశ్యా-వైశ్యుల కథను గూర్చి రాజుతో పరాశరమునీశ్వరుడు చెప్పిన తీరు వివరింపబడినది. ముప్పది నాల్గవ అధ్యాయమునందు రుద్రాధ్యాయ మహిమను గూర్చి మరియు రాజపుత్రుని బ్రతికించినప్పుడు నారదమహర్షి రాజును కలియుటను గూర్చి చెప్పబడినది. ముప్పది ఐదవ అధ్యాయమున కచ - దేవయాని కథ, సీమంతిని చేసిన సోమవారవ్రత కథ, ముప్పది ఆరవ అధ్యాయము నందు బ్రహ్మనిష్ఠుడైన బ్రాహ్మణుని, అతని భార్య పరాన్నభోజనమునకు తీసుకొని వెళ్ళుట, అచటినుండి అసహ్యాభావముతో వచ్చి శ్రీగురుచరణములను ఆశ్రయించినప్పుడు, ఆమెకు గురునాథుడు కర్మమార్గమును తెలియజేయుటను గూర్చి వర్ణింపబడినది. ముప్పది ఏడవ అధ్యాయమున విప్రులకు అనేక బ్రహ్మకర్మలను గూర్చి చెప్పి ప్రసన్నులైన శ్రీగురునాథులు వారికి ఉత్తమ వరమును ప్రసాదించుటను గూర్చి వివరింపబడినది. ముప్పది ఎనిమిదవ అధ్యాయమున భాస్కరుడను బ్రాహ్మణుడు ముగ్గురికి సరిపడు భోజనమును వండెను. దానినే వేలాదిమంది బ్రాహ్మణులకు, గ్రామములోగల శూద్రాది జనులందరకూ భోజనము సరిపడునట్లుగా చేసిన గురునాథుని మహిమా ప్రాభవము ప్రకటింపబడినది. అరవై ఏండ్ల వంధ్యురాలగు సోమనాథుని భార్యయగు గంగకు పుత్రులను ప్రసాదించుటను గూర్చి ముప్పది తొమ్మిదవ అధ్యాయమున ప్రస్తావింపబడినది. నరహరి చేత ఎండిన కట్టెను పూజింపచేసి, అతని కుష్ఠువ్యాధిని తరిమివేసిన కథ, శిష్య వరిష్ఠుడైన శబరునికథ, నలుబదియవ అధ్యాయమున ప్రవచింపబడినది. నలుబది ఒకటవ అధ్యాయమునందు శ్రీగురునాథులు సాయందేవుని సేవను స్వీకరించుట, పార్వతీ పరమేశ్వర సంవాదము, కాశీయాత్రా నిరూపణము,

సాయందేవుడు పుత్రకళత్రాదులతో వచ్చి శ్రీగురుదేవులను స్తోత్రము చేయుట, వారికి యాత్ర చేయుటలో గల అంతరార్థమును గూర్చి వివరించి చెప్పి, వారికి వరమును అనుగ్రహించుట అను కథాక్రమము వర్ణింపబడినది. ఇక నలుబది రెండవ అధ్యాయము నందు అనంతవ్రతమును గూర్చి ధర్మరాజునకు కృష్ణపరమాత్ముడు చెప్పుట, అదే కథను సాయందేవునకు గురుమూర్తి వివరించి వారితో వ్రతమును చేయించుటను గూర్చి వర్ణింపబడినది. నలుబది మూడవ అధ్యాయమున సాలెవాడగు భక్తునకు క్షణములో శ్రీశైల పర్వతమును దర్శనము చేయించుట, అతనికి శివరాత్రియొక్క పుణ్యకథను, విమర్శన రాజును గూర్చిన కథ వచింపబడినది. నలుబది నాల్గవ అధ్యాయమున కుష్ఠువ్యాధి గ్రస్తుడైన బ్రాహ్మణుడు తుల్జాపురమునకు వచ్చినపుడు అతనిచే సంగమమునందు స్నానము చేయించి, అతని కుష్ఠువ్యాధిని నిర్మూలింపజేసి జ్ఞానమును ప్రసాదించిన వైనము వర్ణింపబడినది. నలుబది ఐదవ అధ్యాయమున కల్లేశ్వరస్వామి వెలసిన హిప్పరగి అను గ్రామమున శ్రీగురుడు కవి నరహరిని కలిసి అతనిని తన శిష్యునిగా మార్చుకొనిన తీరు చెప్పబడినది. నలుబది ఆరవ అధ్యాయమున దీపావళి పండుగ నిమిత్తముగా ఏడుగురు శిష్యులు తమ తమ గృహములకు రావలసినదని ఏకముహూర్తమునందు గురువును ఆహ్వానించినపుడు, అన్నిరూపములను ధరించి, అంతటా తానై స్థానిక మఠమునందు కూడా భక్తులకు దర్శనమును ప్రసాదించిన శ్రీగురునాథుని అతులితమైన లీలావిభూతిని గూర్చి వర్ణింపబడినది. నలుబది ఏడవ అధ్యాయమున శూద్రుని పొలమునందు జొన్నచేనును కోయించి వందరెట్లు ఎక్కువ ఫలమును ప్రసాదింపజేసి వారిని ఆనందింపజేసిన గురునాథుని కృపాప్రభావమును గూర్చి తెలియజేయబడినది. నలుబది ఎనిమిదవ అధ్యాయమున శ్రీగురుమూర్తి అమరజా సంగమ మాహాత్మ్యమును చెప్పి స్నానమును చేయించి, రత్నాబాయికి ఆమె కుష్ఠువ్యాధిని నివారింపజేసిన మహిమను గూర్చి వివరింపబడినది. (50-67)

నలుబది తొమ్మిదవ అధ్యాయమున పార్వతీపరమేశ్వరుల సంవాదాత్మకమైన, శుద్ధ మంత్రరాజమగు గురుగీతను గూర్చి నామధారకునకు సిద్ధముని వర్ణించి చెప్పెను. ఏబదియవ అధ్యాయమున మ్లేచ్ఛరాజు భక్తికి మెచ్చి అతని రాచపుండును నివారించుట, తదుపరి, అతని నగరమునకు వెళ్ళి మ్లేచ్ఛుని అనుగ్రహించుట, అనంతరము, అతనితో శ్రీశైలపర్వతము వద్ద తమను కలవవలసినదని సూచించిన కథను గూర్చి వివరింపబడినది. ఏబదియొకటవ అధ్యాయమున భూమండలమున పాప ప్రవృత్తితో నానాజాతులవారు అనేక ఉపద్రవములను కలిగించు సమయము ఆసన్నమైనది గనుక, తాను గుప్తరూపములో ఉండవలయునని శ్రీగురుమూర్తి సంకల్పించుకొనిన తీరు తెలియజేయబడినది.

గురునాథులు ఆవిధముగా నిశ్చయించుకొని, తన శిష్యులకు ఎరుకపరచి, ఈనాడే మేము శ్రీశైలయాత్రకు వెళ్ళుచుంటిమని చెప్పిరి. అది వినిన భక్తులు ఎంతయో ఉద్విగ్నులై మిగుల శోకించి మమ్ములను వదలిపెట్టి వెళ్ళకూడదని శ్రీగురుచరణములను ఆశ్రయించి

వేడుకొనిరి. ఇదంతయునూ గాంచిన శ్రీగురుమూర్తి వరదహస్తమును చూపి వారిని చక్కగా ఓదార్చి, మేము మఠములోనే యుండెదము, మా యెడల దృఢభక్తిని కలిగియుండుమని బోధించి, శ్రీగురునాథులు కదళీవనమునకు వెళ్ళిరి. ఒక నావికుని ద్వారా తన అవతార ఉపసంహారమును గూర్చిన సంగతిని చెప్పించి, తాను తమ నిజానందమునందు నిమగ్నమైరి. (68–74)

"అద్వితీయమైన శ్రీగురుచరిత్రము అనంతమైనది. పరమపవిత్రమైనది. అందులోగల ఏబది యొక్క అధ్యాయములను మాత్రమే నీ కొరకై విస్తరించి చెప్పితిని" **అని సిద్ధముని నామధారకునితో నుడివెను–** శిష్యోత్తమా! నీ కోరిక ప్రకారముగా ఇంతవరకు నీకు గురుచరిత్రయొక్క అవతరణికను వివరించితిని. లోకమునందు శ్రీగురుమూర్తి వెళ్ళినట్లుగా భావనకలుగును. కాని, శ్రీగురునాథులు ఎల్లప్పుడూ గుప్తముగా గాణగాపురము నందే నిలిచియుండెదరు. కలియుగమున అధర్మము వృద్ధి చెందుచున్నదని భావించి, శ్రీగురునాథులు గుప్తమయ్యారు. శ్రీ స్వామివారు మునుపటివలెనే ఈనాటికినీ భక్తజనులకు తమ దర్శనభాగ్యమును అనుగ్రహించుచుండిరి. ఈ అవతరణిక అను సిద్ధమాలతో చక్కగా జపించినవారికి తప్పక శ్రీగురుమూర్తి తమ దివ్యదర్శనమును ప్రసాదించెదరు. తమ భక్తులు ఎట్టి భక్తిభావముతో తనను భజించెదరో, గురునాథులు కూడా వారిని అదేభావముతో సేవించుచుందురు. నామధారకా! నీవు నాకొక ఉత్తమ శిష్యరత్నముడవు. నిండుమనసుతో నిన్ను అభినందించుచున్నాను. అవతరణికను గురించి ప్రశ్నించితివి. కావున, గురుచరితామృత సారాంశమును తిరిగి నీకు వివరించి చెప్పితిని. నాయనా! ఇంతకు పూర్వము శ్రీగురుచరిత్రమును చక్కగా శ్రవణము చేసినవారు, ఈ అవతరణికను తమ కర్ణపుటములతో శ్రవణము చేసిన యెడల, పూర్తి కథామృతము వెంటనే స్మరణకు వచ్చును. తద్వారా, వారి మనోకామనలు పరిపూర్తిగ నెరవేరును. (75–80)

కావున, ఈ అవతరణికను నీకు కథగా చెప్పితిని. దీనిని నిరంతరము స్మరించుటవలన పూర్తి గురుకథామృతము వరుసక్రమముగా జ్ఞప్తికి వచ్చుచుండును" అని సిద్ధముని తెల్పెను. వెంటనే **నామధారకుడు అతని చరణకమలములను ఆశ్రయించి, నమస్కరించి, అంజలి ఘటించి ఇట్లనెను –** "శ్రీగురుదేవా! మీ ఉపదేశబోధముతో నాకు సమస్తమూ సిద్ధించెనని విన్నవించుకొనెను. స్వామీ! మరియొక ప్రార్థనము వినుడు. శ్రీగురుచరిత్రను సప్తాహ పారాయణముగా ప్రతిదినము చదువుట ఎట్లు? గురురాజా! దానిని గూర్చి వివరించవలసినదని" ప్రశ్నించెను, **అంతట సిద్ధముని నామధారకునితో పలికెను–** "నాయనా! మంచి ప్రశ్న వేసితివి. ప్రశ్నవలన లోకమునకు మహోపకారము జరిగినది. అంతఃకరణము పవిత్రముగా ఉంచుకొని, గురుచరిత్రను ప్రతినిత్యము పఠించవచ్చును. తద్వారా, ఇహపరసౌఖ్యములు లభింపగలవు. ఇక విశేషమైన సప్తాహ పారాయణము చేయవలసిన పద్ధతిని గూర్చి వివరించెదను. (81–86)

విధియుక్తముగ శుచిర్భూతులై సప్తాహపారాయణము చేసినచో, అత్యధిక పుణ్యము లభించును. ఒక శుభ దినమును ఎంపిక చేసికొని ముందుగా స్నానసంధ్యావందనాది నిత్యకర్మలను పూర్తిచేసిన పిమ్మట, గ్రంథపారాయణము చేయు స్థలమును శుభ్రము చేసి, అలికి రంగవల్లులతో అలంకరించవలెను. అనంతరము ఒక పీఠమును అమర్చి, దానిపైన శ్రీగురుచరిత్ర గ్రంథమును ఉంచి, దేశకాలాది సంకల్పములను చెప్పిన తర్వాత, శ్రీగురుమూర్తిని మరియు గ్రంథమును యథోపచారములతో పూజించి, బ్రాహ్మణులను కూడా పూజించవలెను. ప్రారంభమునాటి నుండి ఒకే స్థానమున కూర్చొనవలెను. అనవసరమైన సంభాషణలు చేయకూడదు. మౌనముగా నుండవలెను. బ్రహ్మచర్యమును పాటింపవలెను. శోభాయమానముగా దీపమును వెలిగించి దేవ, బ్రాహ్మణులకు, పెద్దలందరకు చక్కగా నమస్కరించి, తూర్పుముఖముగా కూర్చొని పారాయణము చేయవలెను. మొదటి దినమున మొదటి (7) ఏడు అధ్యాయములను, రెండవ దినము (8) ఎనిమిది నుండి పదునెన్మిదవ (18) అధ్యాయము వరకు (11) పదకొండు అధ్యాయములను, మూడవ దినము (28) ఇరువది ఎన్మిదవ అధ్యాయము వరకు (పది అధ్యాయములను), నాల్గవ దినమున (34) ముప్పది నాల్గవ అధ్యాయము వరకు (ఆరు అధ్యాయాలను), ఐదవ రోజున (37) ముప్పది ఏడవ అధ్యాయము వరకు (మూడు అధ్యాయములను), ఆరవ రోజు (43) నలుబది మూడవ అధ్యాయము వరకు (ఆరు అధ్యాయములను) ఏడవ రోజున (51) ఏబది ఒకటవ అధ్యాయము వరకు (ఎనిమిది అధ్యాయములను) పఠించిన పిమ్మట, చివరిదగు అవతరణికయను ఏబది రెండవ అధ్యాయమును కూడా చదువవలెను. (81-92)

ప్రతినిత్యము పారాయణము పూర్తి చేసిన మీదట ఉత్తరాంగ పూజను చేసి, ఉపసంహారము చేసి శ్రీగురునకు నమస్కరించి, ఏదేని ఫలహారమును భుజింపవలెను. ఈవిధముగ ఏడు దినములు పారాయణము చేసి, సప్తాహ పారాయణ క్రమము పూర్తిచేయవలెను. రాత్రికి నేలమీదనే పడుకొనవలెను. శాస్త్రయుక్తముగ సదాచారమును పాటించి, పవిత్రముగ ఉండవలెను. సప్తాహక్రమము పూర్తియైన పిమ్మట బ్రాహ్మణులను, ముత్తైదువలను ఆహ్వానించి, వారికి భోజన తాంబూలాదులను ఇచ్చి తమ శక్త్యనుసారముగా దక్షిణను కూడా సమర్పించి, వారందరిని సంతృప్తిపరచవలెను. ఈవిధముగా భక్తిప్రపత్తులతో సప్తాహక్రమముగ అనుష్ఠానము చేసినచో, తప్పక శ్రీగురుదర్శన భాగ్యము లభించును. భూతప్రేతాది బాధలు నశించిపోవును. సుఖసౌఖ్యములు లభించితీరును" అని సిద్ధముని పలికెను. **వెంటనే నామధారకుడు సిద్ధముని అడుగుకెందామరలకు అనేక కైమోడ్పులర్పించి యిట్లు నుడివెను –** "గురునాథా! అవ్యాజమైన అనుగ్రహమును కురిపించి ఈ బాలకుని ముద్దు-ముచ్చటను తీర్చి కృతకృత్యుని చేసితిరి. గురురాజా! మీకివే నా శతాధిక వందనములు. నేను ధన్యుడనైతిని" అని

సాష్టాంగవందనమును ఆచరించి తన కృతజ్ఞతను ప్రకటించుకొనెను. అంతట శ్రీగురునాథుడు తమ శిష్యునిపై అతిశయించిన కృపావృష్టిని కురిపించెను. (93-97)

శ్రీగురుచరిత్ర రచయితయగు శ్రీగంగాధర సరస్వతి గ్రంథమునకు ఉపసంహారరూపమున ఇట్లు విన్నవించుచున్నాడు – “పుణ్యశ్రోతలారా! మీ యందరి పాదములకు వందనమొనర్చి సత్యమునే వచించుచుంటిని. నా ఈ మాటలను సావధానముగా అవధరింపుడు–

శ్రీగురుమూర్తి విశేషించి వినూత్నమగు ఒక కేళీవిలాసమును ప్రదర్శించెను. అదేమన, ఒక మాతృమూర్తి తన పసిబిడ్డచేత బుజ్జగింపుగా క్షీరపానము చేయించినట్లు, శ్రీసిద్ధమునీంద్రుడు నామధారకుడను శిష్యుని నిమిత్తముగా చేసికొని అమృతతుల్యమగు శ్రీగురుచరితామృతమును మనందరకు ప్రసాదించెను. ఈ గురుకథామృతమును మిక్కిలి శ్రద్ధాభక్తులతో నిరంతరము సేవించువారలకు సర్వార్థ సిద్ధి లభించితీరును. రత్నముల వంటి ఓవీలతో ఒక్కొక్క అధ్యాయమును సిద్ధపరచి ఒకానొక అమూల్యమగు రత్నమాలిక తీర్చిదిద్దబడినది. ఇట్టి అనర్ఘ రత్నమాలికను మానసికముగ అత్యంత ప్రేమాదరములతో తమ గళమున ధరించుటవలన సమస్త కార్యములను సునాయాసముగ సాధింపవచ్చును. సిద్ధముని మాటలు రత్నాల మూటలు. అందులో నుండి ఏబదియొక్క రత్నములను నామధారకుడు యాచించి మరియొక దివ్య భాండమున నిక్షిప్తపరచెను. దానిని భక్తకోటి కైవసము జేసి, వారిని అత్యధికముగ మురిపింపజేసెను. (98-100)

కల్పతరువగు గురుచరిత్రమును సిద్ధమునీశ్వరుడు నామధారకుని ముందుంచెను. వినయపూర్వకముగ గురువును యాచించి, శిష్యోత్తముడగు నామధారకుడు దానిని భక్తలోకమునకు అందించి మహోమహోపకారమును చేసెను. నామధారకుడను చాతకము నోరు తెరచి, సిద్ధముని యను మేఘమును చూచి దాహార్తితో ఒక్క నీటిచుక్కను ప్రసాదించుమని ప్రార్థించెను. అంతే, లోకోపకారియగు పర్జన్యము వంటి ఆ సిద్ధముని గురుచరితమనెడు అపారమైన అమృత వర్షమును కురిపించెను. తద్వారా భక్తులు, అభక్తులు ఐన జనులందరకు అయాచితముగనే అమృతపానము లభించెను. తత్ఫలితముగా, దుష్టజనుల యొక్క రాతిబండలవంటి గుండెలు కూడా మంచుగడ్డలవలె కరిగిపోయెను. (101-103)

ఓవీ॥ శ్రీగురురాయాచే ధరూఁ చరణ్ । సిద్ధమునీతేఁ కరూఁ వందన్ । నామధారకా కరూఁ నమన్ । ఐసేఁ కరీఁ నారాయణా ॥ **(104)**

అనగా నారాయణస్వరూపుడగు శ్రీ గురురాజైన సిద్ధమునీశ్వరుని శ్రీచరణ సరోజముల యందు తన శిరమునుంచి నామధారకుడు సాష్టాంగవందనము సమర్పించెను. (104)

ఓవీ॥ శ్రీగురురూపీ నారాయణా । విశ్వంభరా దీనోద్ధారణా । ఆపణ ఆపలీ దావూని ఖుణా । గురుశిష్య రూపేఁ క్రీడసీ ॥ **(105)**

అనగా - శ్రీగురుస్వరూపుడగు శ్రీమన్నారాయణుడు, విశ్వంభరుడు, దీనజనోద్ధారకుడు. అట్టి నారాయణుడే గురుశిష్య రూపమును ధరించి జగన్నాటక రంగమున బహుచక్కగా ఒకానొక అత్యద్భుతమైన క్రీడను రచించి ప్రదర్శించెను. అంతేగాదు, దయాసాగరుడగు ఆ జగత్ప్రభువు నిర్హేతుకముగ అజ్ఞానజనుల యందు అవ్యాజమైన కృపావృష్టిని కురిపించి ఈవిధముగా (అనగా గురు-శిష్య రూపమున) తమ ఉనికిని, తమ జాడను తామే ప్రకటించుకొనెను. (105)

"జై బోలో శ్రీ సద్గురునాథ భగవాన్ కీ జై!!"

ఇది శ్రీ గంగాధర - సరస్వతి విరచితమగు సిద్ధ-నామధారక సంవాదాత్మకమైన
పరమకథాకల్పతరువగు శ్రీగురుచరితామృతము నందలి శ్రీనృసింహా సరస్వతీ ఉపాఖ్యానమున
భక్తికాండమునందు "అవతరణిక" అను ఏబది రెండవ అధ్యాయము ॥ 52 ॥

॥ జయ గురుదత్త - శ్రీ గురుదత్త ॥

(ఓవీలు - 105; మొత్తము సంఖ్య : 7386 + 105 = 7491 ఓవీలు)

॥ భక్తికాండము సమాప్తము ॥

-::: (సప్తాహపారాయణ క్రమము (7) ఏడవరోజు విరామము) :::-

॥ శ్రీ గురుచరిత్ర సర్వము సంపూర్ణము ॥

॥ సర్వం శ్రీ శ్రీపాదశ్రీవల్లభ - శ్రీ నృసింహసరస్వతీ - శ్రీ గురుదత్తాత్రేయ దివ్య శ్రీ చరణారవిందార్పణమస్తు ॥

॥ హరిః ఓమ్ తత్సత్ ॥

శ్లో॥ త్వదీయం వస్తు గోవింద తుభ్యమేవ సమర్పయే । గృహాణ సుముఖో భూత్వా ప్రసీద పరమేశ్వర ॥
శ్లో॥ కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతేస్స్వభావాత్ ।
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి ॥

॥ హరి నారాయణాయేతి సమర్పయామి ॥

॥ హరయే నమః ॥

◆ ◆ ◆

పరిశిష్టము

శ్రీ గురుగీత (మూలం)

ఓం అస్య శ్రీ గురుగీతాస్తోత్ర మంత్రస్య - భగవాన్ సదాశివ ఋషిః - నానావిధాని ఛందాంసి - శ్రీగురుపరమాత్మా దేవతా - హం బీజం - సః శక్తిః - క్రోం కీలకం - శ్రీగురు ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః ॥

అథకరన్యాసాః - ఓం హం సాం సూర్యాత్మనే - అంగుష్ఠాభ్యాం నమః । ఓం హం సీం సోమాత్మనే - తర్జనీభ్యాం నమః । ఓం హం సూం నిరంజనాత్మనే- మధ్యమాభ్యాం నమః । ఓం హం సైం నిరాభాసాత్మనే - అనామికాభ్యాం నమః । ఓం హం సౌం అతనుసూక్ష్మాత్మనే - కనిష్ఠికాభ్యాం నమః । ఓం హం సః అవ్యక్తాత్మనే - కరతలకరపృష్ఠాభ్యాం నమః ॥

అథ హృదయాది న్యాసాః - ఓం హం సాం సూర్యాత్మనే - హృదయాయ నమః । ఓం హం సీం సోమాత్మనే - శిరసే స్వాహా । ఓం హం సూం నిరంజనాత్మనే- శిఖాయై వషట్ । ఓం హం సైం నిరాభాసాత్మనే - కవచాయ హుమ్ । ఓం హం సౌం అతనుసూక్ష్మాత్మనే - నేత్రత్రయాయ వౌషట్ । ఓం హం సః అవ్యక్తాత్మనే - అస్త్రాయఫట్ । ఓం బ్రహ్మ భూర్భువస్సువరోమ్ ఇతి - దిగ్బంధః ॥ మమ చతుర్విధ పురుషార్థ సిద్ధ్యర్థే శ్రీ గురుగీతా జపే వినియోగః.

అథ ధ్యానమ్

శ్లో॥ హంసాభ్యాం పరివృత్త పత్రకమలైః దివ్యైర్జగత్కారణైః । విశ్వోత్కీర్ణ మనేక దేహ నిలయైః స్వచ్ఛంద మాత్మేచ్ఛయా ।
తద్ ద్యోతం పదశాంభవంతు చరణం దీపాంకుర గ్రాహిణం । ప్రత్యక్షాక్షర విగ్రహం గురుపదం ధ్యాయే ద్విభుం శాశ్వతమ్ ॥

సూత ఉవాచ - కైలాస శిఖరే రమ్యే - భక్తి సంధాన నాయకమ్ । ప్రణమ్య పార్వతీ భక్త్యా - శంకరం పర్యపృచ్ఛత ॥ 1 ॥
శ్రీ దేవ్యువాచ - ఓం నమో దేవదేవేశ! పరాత్పర! జగద్గురో । సదాశివ! మహాదేవ! గురుదీక్షాం ప్రదేహి మే ॥ 2 ॥
కేన మార్గేణ భో! స్వామిన్! దేహీ బ్రహ్మమయో భవేత్ । త్వం కృపాం కురు మే స్వామిన్! నమామి చరణౌ తవ ॥ 3 ॥
ఈశ్వర ఉవాచ - మమ రూపాసి దేవి త్వం - త్వత్ ప్రీత్యర్థమ్ వదామ్యహమ్ । లోకోపకారకః ప్రశ్నో - న కేనాపి కృతః పురా ॥ 4 ॥
దుర్లభం త్రిషు లోకేషు - తచ్ఛృణుష్వ వదామ్యహమ్ । గురుం వినా బ్రహ్మ నాన్యత్ - సత్యం సత్యం వరాననే ॥ 5 ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

వేదశాస్త్ర పురాణాని - ఇతిహాసాదికాని చ । మంత్ర యంత్రాది విద్యాశ్చ - స్మృతిరుచ్చాటనాదికమ్ ॥ 6 ॥
శైవశాక్తాగమాదీని - అన్యాని వివిధాని చ । అపభ్రంశ కరాణీహ - జీవానాం భ్రాంత చేతసామ్ ॥ 7 ॥
యజ్ఞో వ్రతం తపో దానం - జపస్తీర్థం తథైవ చ । గురుతత్త్వమవిజ్ఞాయ - మూఢాస్తే చేరతే జనాః ॥ 8 ॥
గురుబుధ్యాత్మనో నాన్యత్ - సత్యం సత్యం న సంశయః । తల్లాభార్థం ప్రయత్నస్తు - కర్తవ్యో హి మనీషిభిః ॥ 9 ॥
గూఢవిద్యా జగన్మాయా - దేహే చాజ్ఞానసంభవా । ఉదయః స్వప్రకాశేన - గురుశబ్దేన కథ్యతే ॥ 10 ॥
సర్వపాపవిశుద్ధాత్మా - శ్రీగురోఃపాదసేవనాత్ । దేహీ బ్రహ్మ భవేద్యస్మాత్ - తత్కృపార్థం వదామి తే ॥ 11 ॥
గురుపాదాంబుజం స్మృత్వా - జలం శిరసి ధారయేత్ । సర్వతీర్థావగాహస్య - సంప్రాప్నోతి ఫలం నరః ॥ 12 ॥
శోషణం పాపపంకస్య - దీపనం జ్ఞానతేజసామ్ । గురుపాదోదకం సమ్యక్ - సంసారార్ణవతారకమ్ ॥ 13 ॥
అజ్ఞానమూలహరణం - జన్మకర్మ నివారణమ్ । జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం - గురుపాదోదకం పిబేత్ ॥ 14 ॥
గురోః పాదోదకం పీత్వా - గురోరుచ్ఛిష్ట భోజనమ్ । గురుమూర్తేః సదా ధ్యానం - గురుమంత్రం సదా జపేత్ ॥ 15 ॥
కాశీక్షేత్రం తన్నివాసో - జాహ్నవీ చరణోదకమ్ । గురుర్విశ్వేశ్వరస్సాక్షాత్ - తారకం బ్రహ్మ నిశ్చితమ్ ॥ 16 ॥
గురోః పాదోదకం యత్తు - గయాఽసౌ సోఽక్షయోవటః । తీర్థరాజః ప్రయాగశ్చ - గురుమూర్తే నమో నమః ॥ 17 ॥
గురుమూర్తిం స్మరేన్నిత్యం - గురునామ సదా జపేత్ । గురోరాజ్ఞాం ప్రకుర్వీత - గురోరన్యన్న భావయేత్ ॥ 18 ॥
గురువక్త్రస్థితం బ్రహ్మ - ప్రాప్యతే తత్ప్రసాదతః । గురోర్ధ్యానం సదా కుర్యాత్ - కులస్త్రీ స్వపతేర్యథా ॥ 19 ॥
స్వాశ్రమం చ స్వజాతిం చ - స్వకీర్తిం పుష్టివర్ధనమ్ । ఏతత్సర్వం పరిత్యజ్య - గురోరన్యన్న భావయేత్ ॥ 20 ॥
అనన్యాశ్చింతయంతో మాం సులభం పరమం పదమ్ । తస్మాత్సర్వ ప్రయత్నేన - గురోరారాధనం కురు ॥ 21 ॥
త్రైలోక్యస్ఫుటవక్తారో దేవాద్యసురపన్నగాః । గురువక్త్రస్థితావిద్యా - గురుభక్త్యా తు లభ్యతే ॥ 22 ॥
గుకార స్త్వంధ కారశ్చ - రుకార స్తేజ ఉచ్యతే । అజ్ఞానగ్రాసకం బ్రహ్మ - గురురేవ న సంశయః ॥ 23 ॥
గుకారః ప్రథమోవర్ణో - మాయాది గుణభాసకః । రుకారో ద్వితీయో బ్రహ్మ - మాయాభ్రాంతి వినాశనమ్ ॥ 24 ॥
ఏవం గురుపదం శ్రేష్ఠం - దేవానామపి దుర్లభమ్ । హాహాహూహూ గణైశ్చైవ - గంధర్వైశ్చ ప్రపూజ్యతే ॥ 25 ॥

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

ధృవం తేషాం చ సర్వేషాం - నాస్తి తత్త్వం గురోఃపరమ్ । ఆసనం శయనం వస్త్రం - భూషణం వాహనాదికమ్ ॥ 26 ॥
సాధకేన ప్రదాతవ్యం - గురు సంతోష కారకమ్ । గురోరారాధనం కార్యం - స్వజీవిత్వం నివేదయేత్ ॥ 27 ॥
కర్మణా మనసా వాచా - నిత్యమారాధయేత్ గురుమ్ । దీర్ఘదండం నమస్కృత్య - నిర్లజ్జో గురుసన్నిధౌ ॥ 28 ॥
శరీరమింద్రియం ప్రాణం - సద్గురుభ్యో నివేదయేత్ । ఆత్మదారాదికం సర్వం - సద్గురుభ్యో నివేదయేత్ ॥ 29 ॥
కృమి కీట భస్మావిష్టా - దుర్గంధ మలమూత్రకమ్ । శ్లేష్మరక్తం త్వచా మాంసం - వంచయేన్న వరాననే ॥ 30 ॥
సంసారవృక్షమారూఢాః - పతంతో నరకార్ణవే । యేన చైవోద్ధృతాః సర్వే - తస్మై శ్రీ గురవే నమః ॥ 31 ॥
గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః - గురుర్దేవో మహేశ్వరః । గురురేవ పరబ్రహ్మా - తస్మై శ్రీ గురవే నమః ॥ 32 ॥
హేతవే జగతామేవ - సంసారార్ణవ సేతవే । ప్రభవే సర్వవిద్యానాం - శంభవే గురవే నమః ॥ 33 ॥
అజ్ఞాన తిమిరాంధస్య - జ్ఞానాంజన శలాకయా । చక్షురున్మీలితం యేన - తస్మై శ్రీ గురవే నమః ॥ 34 ॥
త్వం పితా త్వం చ మే మాతా - త్వం బంధుస్త్వం చ దేవతా । సంసార ప్రతి బోధార్థం - తస్మై శ్రీ గురవే నమః ॥ 35 ॥
యత్సత్యేన జగత్సత్యం - యత్ప్రకాశేన భాతి తత్ । యదానందేన నందంతి - - తస్మై శ్రీ గురవే నమః ॥ 36 ॥
యస్య స్థిత్యా సత్యమిదం - యద్భాతి భానురూపతః । ప్రియం పుత్రాది యత్ప్రీత్యా - తస్మై శ్రీ గురవే నమః ॥ 37 ॥
యేన చేతయతే హీదం - చిత్తం చేతయతే న యమ్ । జాగ్రత్స్వప్న సుషుప్త్యాది - తస్మై శ్రీ గురవే నమః ॥ 38 ॥
యస్యజ్ఞానాదిదం విశ్వం - న దృశ్యం భిన్నభేదతః । సదేకరూప రూపాయ - తస్మై శ్రీ గురవే నమః ॥ 39 ॥
యస్యామతం తస్య మతం - మతం యస్య న వేద సః । అనన్యభావభావాయ - తస్మై శ్రీ గురవే నమః ॥ 40 ॥
యస్య కారణరూపస్య - కార్యరూపేణ భాతి యత్ । కార్యకారణ రూపాయ - తస్మై శ్రీ గురవే నమః ॥ 41 ॥
నానారూపమిదం సర్వం - న కేనాప్యస్తి భిన్నతా । కార్యకారణతా చైవ - తస్మై శ్రీ గురవే నమః ॥ 42 ॥
యదంఘ్రి కమల ద్వంద్వం - ద్వంద్వ తాపనివారకమ్ । తారకం సర్వదాఽఽపద్భ్యః - శ్రీగురుం ప్రణమామ్యహమ్ ॥ 43 ॥
శివే క్రుద్ధే గురుస్త్రాతా - గురౌ క్రుద్ధే శివో న హి । తస్మాత్సర్వ ప్రయత్నేన - శ్రీగురుం శరణం వ్రజేత్ ॥ 44 ॥
వందే గురు పదద్వంద్వం - వాఙ్మనశ్చిత్త గోచరమ్ । శ్వేతరక్త ప్రభాభిన్నం - శివశక్త్యాత్మకం పరమ్ ॥ 45 ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

గుకారం చ గుణాతీతం - రుకారం రూపవర్జితమ్ । గుణాతీతస్వరూపం చ - యో దద్యాత్స గురుః స్మృతః ॥ 46 ॥
అత్రినేత్రః సర్వసాక్షీ (శివస్సాక్షాత్) - అచతుర్బాహు రచ్యుతః । అచతుర్వదనో బ్రహ్మా - శ్రీగురుః కథితః ప్రియే ॥ 47 ॥
అయం మయాంజలిర్బద్ధో - దయాసాగర వృద్ధయే । యదనుగ్రహతో జన్తుః - చిత్ర సంసార ముక్తిభాక్ ॥ 48 ॥
శ్రీగురోః పరమం రూపం - వివేక చక్షుషోఽమృతమ్ । మందభాగ్యా న పశ్యంతి - అంధాః సూర్యోదయం యథా ॥ 49 ॥
శ్రీనాథచరణ ద్వంద్వం - యస్యాం దిశి విరాజతే । తస్యై దిశే నమస్కుర్యాత్ - భక్త్యా ప్రతిదినం ప్రియే ॥ 50 ॥
తస్యై దిశే సతత మంజలిరేష ఆర్యే - ప్రక్షిప్యతే ముఖరితో మధుపైర్బుధైశ్చ ।
జాగర్తి యత్ర భగవాన్ గురుచక్రవర్తీ - విశ్వోదయ ప్రళయనాటక నిత్యసాక్షీ ॥ 51 ॥
శ్రీనాథాది గురుత్రయం గణపతిం పీఠత్రయం భైరవం - సిద్ధౌఘం వటుకత్రయం పదయుగం దూతీత్రయం శాంభవమ్ ।
వీరేశాష్ట చతుష్షష్టి నవకం వీరావళీ పంచకమ్ । శ్రీమన్మాలిని మంత్రరాజ సహితం వందే గురోర్మండలమ్ ॥ 52 ॥
అభ్యస్తైః సకలైః సుదీర్ఘ మనిలైః వ్యాధిప్రదైః దుష్కరైః । ప్రాణాయామ శతైరనేక కరణైః దుఃఖాత్మకైః దుర్జయైః ।
యస్మిన్నభ్యుదితే వినశ్యతి బలీ వాయుః స్వయం తత్క్షణాత్ । ప్రాప్తుం తత్సహజం స్వభావ మనిశం సేవధ్వమేకం గురుమ్ ॥ 53 ॥
స్వదేశికస్యైవ శరీర చింతనం-భవేదనంతస్య శివస్య చింతనమ్ । స్వదేశికస్యైవ చ నామకీర్తనం, భవేదనంతస్య శివస్య కీర్తనమ్ ॥ 54 ॥
యత్పాద రేణుకణికా - కాపి సంసారవారిధేః । సేతుబంధాయతే నాథం - దేశికం తముపాస్మహే ॥ 55 ॥
యస్మాదనుగ్రహం లబ్ధ్వా - మహదజ్ఞాన ముత్సృజేత్ । తస్మై శ్రీ దేశికేంద్రాయ - నమశ్చాభీష్ట సిద్ధయే ॥ 56 ॥
పాదాబ్జం సర్వసంసార - దావానల వినాశకమ్ । బ్రహ్మరంధ్రే సితాంభోజ - మధ్యస్థం చంద్రమండలే ॥ 57 ॥
అకథాది త్రిరేఖాబ్జే - సహస్ర దళమండలే । హంస పార్శ్వ త్రికోణే చ - స్మరేత్తన్మధ్యగం గురుమ్ ॥ 58 ॥
సకల భువన సృష్టిః కల్పితా శేష పుష్టిః । నిఖిల నిగమదృష్టిః సంపదాం వ్యర్థదృష్టిః
అవగుణ పరిమార్ష్టిః తత్పదార్థైక దృష్టిః । భవగుణ పరమేష్టిర్ మోక్ష మార్గైక దృష్టిః ॥ 59 ॥
సకలభువన రంగస్థాపనా స్తంభయష్టిః । సకరుణ రసవృష్టిః తత్త్వమాలా సమష్టిః
సకల సమయ సృష్టిః సచ్చిదానందదృష్టిః । నివసతు మయి నిత్యం శ్రీగురోర్దివ్యదృష్టిః ॥ 60 ॥

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

అగ్నిశుద్ధ సమంతాత - జ్వాలా పరి చకాధియా । మంత్రరాజ మిమంమన్యేఽహర్నిశం పాతు మృత్యుతః ॥ 61 ॥
తదేజతి తన్నైజతి - తద్దూరే తత్సమీపకే । తదంతరస్య సర్వస్య - తదు సర్వస్య బాహ్యతః ॥ 62 ॥
అజోఽహ మజరోఽహం చ - అనాది నిధనః స్వయం । అవికారశ్చిదానంద అణీయాన్మహతో మహాన్ ॥ 63 ॥
అపూర్వాణాం పరం నిత్యం - స్వయంజ్యోతిర్నిరామయమ్ । విరజం పరమాకాశం ధృవమానంద మవ్యయమ్ ॥ 64 ॥
శృతిః ప్రత్యక్షమైతిహ్యమనుమానం చతుష్టయమ్ । యస్య చాత్మతపోవేద - దేశికం తు సదా స్మరన్ ॥ 65 ॥
మననం యద్భవం కార్యం - తద్వదామి మహామతే । సాధుత్వం చ మయా దృష్ట్వా - త్వయి తిష్ఠతి సాంప్రతమ్ ॥ 66 ॥
అఖండ మండలాకారం - వ్యాప్తం యేన చరాచరమ్ । తత్పదం దర్శితం యేన - తస్మై శ్రీ గురవే నమః ॥ 67 ॥
సర్వ శ్రుతి శిరోరత్న - విరాజిత పదాంబుజః । వేదాంతాంబుజసూర్యో యస్తస్మై శ్రీగురవే నమః ॥ 68 ॥
యస్య స్మరణ మాత్రేణ - జ్ఞానముత్పద్యతే స్వయమ్ । య ఏవ సర్వసంప్రాప్తిః - తస్మై శ్రీ గురవే నమః ॥ 69 ॥
చైతన్యం శాశ్వతం శాంతం - వ్యోమాతీతం నిరంజనమ్ । నాద బిందు కళాతీతం - తస్మై శ్రీ గురవే నమః ॥ 70 ॥
స్థావరం జంగమం చైవ - తథా చైవ చరాచరమ్ । వ్యాప్తం యేన జగత్సర్వం - తస్మై శ్రీ గురవే నమః ॥ 71 ॥
జ్ఞానశక్తి సమారూఢః - తత్త్వమాలా విభూషితః । భుక్తిముక్తి ప్రదాతా యః - తస్మై శ్రీ గురవే నమః ॥ 72 ॥
అనేక జన్మ సంప్రాప్త - సర్వకర్మ విదాహినే । స్వాత్మజ్ఞాన ప్రభావేన- తస్మై శ్రీ గురవే నమః ॥ 73 ॥
న గురోరధికం తత్త్వం - న గురోరధికం తపః । తత్త్వం జ్ఞానాత్పరం నాస్తి - తస్మై శ్రీ గురవే నమః ॥ 74 ॥
మన్నాథః శ్రీజగన్నాథో - మద్గురు స్త్రిజగద్గురుః । మమాత్మా సర్వభూతాత్మా - తస్మై శ్రీ గురవే నమః ॥ 75 ॥
ధ్యానమూలం గురోర్మూర్తిః - పూజామూలం గురోః పదమ్ । మంత్రమూలం గురోర్వాక్యం - మోక్షమూలం గురోః కృపా ॥ 76 ॥
గురురాది రనాదిశ్చ - గురుః పరమదైవతమ్ । గురోః పరతరం నాస్తి - తస్మై శ్రీ గురవే నమః ॥ 77 ॥
సప్తసాగర పర్యంత - తీర్థస్నానాదికం ఫలమ్ । గురోరంఘ్రి పయోబిందు - సహస్రాంశే న దుర్లభమ్ ॥ 78 ॥
హరౌ రుష్టే గురుస్త్రాతా - గురౌ రుష్టే న కశ్చన । తస్మాత్సర్వ ప్రయత్నేన - శ్రీగురుం శరణం వ్రజేత్ ॥ 79 ॥
గురురేవ జగత్సర్వం - బ్రహ్మ విష్ణు శివాత్మకమ్ । గురోః పరతరం నాస్తి - తస్మాత్సంపూజయేద్ గురుమ్ ॥ 80 ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

జ్ఞానం విజ్ఞాన సహితం - లభ్యతే గురుభక్తితః । గురోః పరతరం నాస్తి - ధ్యేయోఽసౌ గురుమార్గిభిః ॥ 81 ॥
యస్మాత్ పరతరం నాస్తి - నేతి నేతీతి వై శృతిః । మనసా వచసా చైవ - నిత్యమారాధయేద్ గురుమ్ ॥ 82 ॥
గురోః కృపా ప్రసాదేన - బ్రహ్మా విష్ణు సదా శివాః । సమర్థాః ప్రభవాదౌ చ - కైవల్యం గురుసేవయా ॥ 83 ॥
దేవకిన్నర గంధర్వాః - పితరో యక్షచారణాః । మునయోఽపి న జానంతి - గురుశుశ్రూషణే విధిమ్ ॥ 84 ॥
మహాహంకార గర్వేణ - తపోవిద్యా బలాన్వితాః । సంసార కుహరావర్తే - ఘటయంత్రే యథా ఘటాః ॥ 85 ॥
న ముక్తా దేవగంధర్వాః - పితరో యక్షకిన్నరాః । ఋషయ స్సర్వ సిద్ధాశ్చ - గురుసేవా పరాఙ్ముఖాః ॥ 86 ॥
ధ్యానం శృణు మహాదేవి - సర్వానంద ప్రదాయకమ్ । సర్వసౌఖ్యకరం నిత్యం - భుక్తిముక్తి విధాయకమ్ ॥ 87 ॥
శ్రీమత్ పరబ్రహ్మ గురుం స్మరామి । శ్రీమత్పరబ్రహ్మ గురుం వదామి ।
శ్రీమత్పరబ్రహ్మ గురుం నమామి - శ్రీమత్పరబ్రహ్మ గురుం భజామి । ॥ 88 ॥
బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్ । ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్ ।
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతమ్ । భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి ॥ 89 ॥
నిత్యం శుద్ధం నిరాభాసం - నిరాకారం నిరంజనమ్ । నిత్యబోధం చిదానందం - గురుం బ్రహ్మ నమామ్యహమ్ ॥ 90 ॥
హృదంబుజే కర్ణికమధ్యసంస్థే - సింహాసనే సంస్థిత దివ్యమూర్తిమ్ । ధ్యాయేత్ గురుం చంద్రకళా ప్రకాశం - చిత్పుస్తకాభీష్టవరం దధానమ్ ॥ 91 ॥
శ్వేతాంబరం శ్వేతవిలేప పుష్పం ముక్తా విభూషం ముదితం ద్వినేత్రమ్ । వామాంక పీఠస్థిత దివ్యశక్తిం-మందస్మితం సాంద్రకృపా నిధానమ్ ॥ 92 ॥
ఆనందమానందకరం ప్రసన్నం-జ్ఞానస్వరూపం నిజబోధయుక్తమ్ । యోగీంద్ర మీడ్యం భవరోగవైద్యం-శ్రీమద్గురుం నిత్యమహం నమామి ॥ 93 ॥
యస్మిన్ సృష్టిస్థితి ధ్వంస-నిగ్రహానుగ్రహాత్మకమ్ । కృత్యం పంచవిధం శశ్వద్భాసతే తం నమామ్యహమ్ ॥ 94 ॥
ప్రాతః శిరసి శుక్లాబ్జే - ద్వినేత్రం ద్విభుజం గురుమ్ । వరాభయయుతం శాంతం - స్మరేత్తన్నామ పూర్వకమ్ ॥ 95 ॥
న గురోరధికం న గురోరధికం-న గురోరధికం - న గురోరధికం । శివశాసనతః శివశాసనతః - శివశాసనతః శివశాసనతః ।।। 96 ॥
ఇదమేవ శివం త్విదమేవ శివం - త్విదమేవ శివం త్విదమేవశివమ్ । మమ శాసనతో మమ శాసనతో మమ శాసనతో మమ శాసనతః ॥ 97 ॥
ఏవం విధం గురుం ధ్యాత్వా - జ్ఞాన ముత్పద్యతే స్వయమ్ । తత్సత్ గురుప్రసాదేన - ముక్తోఽహమితి భావయేత్ ॥ 98 ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★
★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

గురుదర్శిత మార్గేణ - మనః శుద్ధిం తు కారయేత్ । అనిత్యం ఖండయేత్సర్వం - యత్కించిదాత్మగోచరమ్ ॥ 99 ॥
జ్ఞేయం సర్వస్వరూపం చ - జ్ఞానం చ మన ఉచ్యతే । జ్ఞానం జ్ఞేయసమం కుర్యాత్ - నాన్యః పంథా ద్వితీయకః ॥ 100 ॥
ఏవం శ్రుత్వా మహాదేవి! గురునిందాం కరోతి యః । స యాతి నరకం ఘోరం - యావచ్చంద్ర దివాకరౌ ॥ 101 ॥
యావత్ కల్పాంతకో దేహ - స్తావదేవ గురుం స్మరేత్ । గురులోపో న కర్తవ్యః - స్వచ్ఛందో యదివా భవేత్ ॥ 102 ॥
హుంకారేణ న వక్తవ్యం - ప్రాజ్ఞైః శిష్యైః కథంచన । గురోరగ్రే న వక్తవ్యం- అసత్యం చ కదాచన ॥ 103 ॥
గురుం 'త్వం' 'కృత్య' 'హుం' కృత్య - గురుం నిర్జిత్య వాదతః । అరణ్యే నిర్జలే దేశే - స భవేత్ బ్రహ్మరాక్షసః ॥ 104 ॥
మునిభిః పన్నగైర్వాఽపి - సురైర్వా శాపితో యది । కాలమృత్యు భయాద్వాపి - గురు రక్షతి పార్వతి ॥ 105 ॥
అశక్తా హి సురాద్యాశ్చ - అశక్తా మునయస్తథా । గురుశాపేన తే శీఘ్రం - క్షయం యాంతి న సంశయః ॥ 106 ॥
మంత్రరాజ మిదం దేవి! గురు రిత్యక్షరద్వయమ్ । స్మృతి వేదార్థ వాక్యేన - గురుః సాక్షాత్ పరం పదమ్ ॥ 107 ॥
శ్రుతి స్మృతీ అవిజ్ఞాయ - కేవలం గురుసేవకాః । తే వై సన్యాసినః ప్రోక్తా - ఇతరే వేషధారిణః ॥ 108 ॥
నిత్యం బ్రహ్మ నిరాకారం - నిర్గుణం బోధయే త్పరమ్ । సర్వం బ్రహ్మ నిరాభాసం - దీపో దీపాంతరం యథా ॥ 109 ॥
గురోః కృపా ప్రసాదేన - ఆత్మారామం నిరీక్షయేత్ । అనేన గురు మార్గేణ - స్వాత్మజ్ఞానం ప్రవర్తతే ॥ 110 ॥
ఆబ్రహ్మస్తంబ పర్యంతం - పరమాత్మ స్వరూపకమ్ । స్థావరం జంగమం చైవ - ప్రణమామి జగన్మయమ్ ॥ 111 ॥
వందేఽహం సచ్చిదానందం - భేదాతీతం సదా గురుమ్ । నిత్యం పూర్ణం నిరాకారం - నిర్గుణం స్వాత్మ సంస్థితమ్ ॥ 112 ॥
పరాత్పరతరం ధ్యేయం - నిత్యమానందకారకమ్ । హృదయాకాశ మధ్యస్థం - శుద్ధ స్ఫటిక సన్నిభమ్ ॥ 113 ॥
స్ఫటిక ప్రతిమారూపం - దృశ్యతే దర్పణే యథా - తథాత్మని చిదాకార - మానందం సోఽహమిత్యుత ॥ 114 ॥
అంగుష్ఠమాత్ర పురుషం - ధ్యాయతశ్చిన్మయం హృది । తత్ర స్ఫురతి భావో యః - శృణు తం కథయామ్యహమ్ ॥ 115 ॥
అగోచరం తథాఽగమ్యం - నామరూప వివర్జితమ్ । నిశ్శబ్దం తద్విజానీయాత్ - స్వభావం బ్రహ్మ పార్వతి! ॥ 116 ॥
యథా గంధః స్వభావేన - కర్పూర కుసుమాదిషు । శీతోష్ణాది స్వభావేన - తథా బ్రహ్మ చ శాశ్వతమ్ ॥ 117 ॥
స్వయం తథా విధో భూత్వా - స్థాతవ్యం యత్ర కుత్ర చిత్ । కీట భ్రమర వత్తత్ర - ధ్యానం భవతి తాదృశమ్ ॥ 118 ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

గురు ధ్యానం తథా కృత్వా - స్వయం బ్రహ్మమయో భవేత్ । పిండే పదే తథా రూపే - ముక్తోఽసౌనాత్ర సంశయః ॥ 119 ॥
స్వయం సర్వమయో భూత్వా - పరం తత్త్వం విలోకయేత్ । పరాత్పరతరం నాన్యత్ - సర్వమేత న్నిరాలయమ్ ॥ 120 ॥
తస్యావలోకనం ప్రాప్య - సర్వసంగవివర్జితమ్ । ఏకాకీ నిస్పృహః శాంతః - తిష్ఠాసేత్ తత్ప్రసాదతః ॥ 121 ॥
లబ్ధం వాఽథ న లబ్ధం వా - స్వల్పం వా బహుళం తథా । నిష్కామేనైవ భోక్తవ్యం - సదా సంతుష్టచేతసా ॥ 122 ॥
సర్వజ్ఞ పదమిత్యాహుః - దేహీ సర్వమయో బుధః । సదానందః సదా శాంతో - రమతే యత్రకుత్రచిత్ ॥ 123 ॥
యత్రైవ తిష్ఠతే సోఽపి - స దేశః పుణ్యభాజనమ్ । ముక్తస్య లక్షణం దేవి! - తవాగ్రే కథితం మయా ॥ 124 ॥
ఉపదేశ స్తథా దేవి - గురుమార్గేణ ముక్తిదః । గురుభక్తి స్తథా ధ్యానం - సకలం తవ కీర్తితమ్ ॥ 125 ॥
అనేన యద్భవేత్కార్యం - తద్వదామి మహామతే । లోకోపకారకం దేవి! - లౌకికం తు న భావయేత్ ॥ 126 ॥
లౌకికాత్కర్మణో యాంతి - జ్ఞానహీనా భవార్ణవమ్ । జ్ఞానీ తు భావయేత్సర్వం - కర్మ నిష్కర్మ యత్కృతమ్ ॥ 127 ॥
ఇదం తు భక్తిభావేన - పఠతే శృణుతే యది । లిఖిత్వా తత్ ప్రదాతవ్యం - దానం దక్షిణయా సహ ॥ 128 ॥
గురుగీతాత్మకం దేవి! - శుద్ధతత్త్వం మయోదితమ్ । భవవ్యాధి వినాశార్థం - స్వయమేవ జపేత్సదా ॥ 129 ॥
గురుగీతాక్షరైకం తు - మంత్రరాజమిమం జపేత్ । అన్యే చ వివిధా మంత్రాః - కలాం నార్హంతి షోడశీమ్ ॥ 130 ॥
అనంతఫలమాప్నోతి - గురుగీతా జపేన తు । సర్వపాప ప్రశమనం - సర్వదారిద్ర్య నాశనమ్ ॥ 131 ॥
కాలమృత్యుభయహరం - సర్వసంకట నాశనమ్ । యక్షరాక్షస భూతానాం - చోరవ్యాఘ్ర భయాపహమ్ ॥ 132 ॥
మహావ్యాధిహరం సర్వం - విభూతి స్సిద్ధిదం భవేత్ । అథవా మోహనం వశ్యం - స్వయమేవ జపేత్సదా ॥ 133 ॥
కుశైర్వా దూర్వయా దేవి! - ఆసనే శుభ్రకంబళే । ఉపవిశ్య తతో దేవి! - జపే దేకాగ్ర మానసః ॥ 134 ॥
ధ్యేయం శుక్లం చ శాంత్యర్థం - వశ్యే రక్తాసనం ప్రియే । అభిచారే కృష్ణవర్ణం - పీతవర్ణం ధనాగమే ॥ 135 ॥
ఉత్తరే శాంతి కామస్తు - వశ్యే పూర్వముఖో జపేత్ । దక్షిణే మారణం ప్రోక్తం - పశ్చిమే చ ధనాగమః ॥ 136 ॥
మోహనం సర్వభూతానాం - బంధమోక్షకరం భవేత్ । దేవరాజప్రియకరం - సర్వలోకవశం భవేత్ ॥ 137 ॥
సర్వేషాం స్తంభనకరం - గుణానాం చ వివర్ధనమ్ । దుష్కర్మ నాశనం చైవ - సుకర్మ సిద్ధిదం భవేత్ ॥ 138 ॥

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

అసిద్ధం సాధయేత్కార్యం - నవగ్రహ భయాపహమ్ । దుస్స్వప్న నాశనం చైవ సుస్వప్న ఫలదాయకమ్ ॥ 139 ॥
సర్వశాంతికరం నిత్యం - తథా వంధ్యా సుపుత్రదమ్ । అవైధవ్యకరం స్త్రీణాం - సౌభాగ్యదాయకం సదా ॥ 140 ॥
ఆయురారోగ్యమైశ్వర్య - పుత్రపౌత్ర ప్రవర్ధనమ్ । అకామతః స్త్రీ విధవా - జపాన్మోక్ష మవాప్నుయాత్ ॥ 141 ॥
అవైధవ్యం సకామా తు - లభతే చాన్యజన్మని । సర్వదుఃఖ భయం విఘ్నం - నాశయే చ్ఛాపహారకమ్ ॥ 142 ॥
సర్వబాధా ప్రశమనం - ధర్మార్థ కామమోక్షదమ్ । యం యం చింతయతే కామం - తం తం ప్రాప్నోతి నిశ్చితమ్ ॥ 143 ॥
కామితస్య కామధేనుః - కల్పనా కల్పపాదపః । చింతామణిః చింతితస్య - సర్వమంగళకారకమ్ ॥ 144 ॥
మోక్ష హేతుర్జప న్నిత్యం - మోక్షశ్రియమవాప్నుయాత్ । భోగకామో జపేద్యో వై - తస్య కామఫలప్రదమ్ ॥ 145 ॥
జపేచ్ఛాక్తశ్చ సౌరశ్చ - గాణపత్యశ్చ వైష్ణవః । శైవశ్చ సిద్ధిదం దేవి! సత్యం సత్యం న సంశయః ॥ 146 ॥
అథ కామ్య జపే స్థానం - కథయామి వరాననే । సాగరే వా సరిత్తీరేఽథవా హరి హరాలయే ॥ 147 ॥
శక్తి దేవాలయే గోష్ఠే - సర్వదేవాలయే శుభే । వటే చ ధాత్రీ మూలే వా - మఠే వృందావనే తథా ॥ 148 ॥
పవిత్రే నిర్మలే స్థానే - నిత్యానుష్ఠానతోఽపి వా । నిర్వేదనేన మౌనేన - జపమేతం సమాచరేత్ ॥ 149 ॥
శ్మశానే భయభూమౌ తు - వటమూలాంతికే తథా । సిద్ధ్యంతి ధౌత్తరే మూలే - చూతవృక్షస్య సన్నిధౌ ॥ 150 ॥
గురుపుత్రో వరం మూర్ఖస్తస్య సిద్ధ్యంతి నాన్యథా । శుభకర్మాణి సర్వాణి - దీక్షావ్రత తపాంసి చ ॥ 151 ॥
సంసార మలనాశార్థం - భవపాశ నివృత్తయే । గురుగీతాంభసి స్నానం - తత్త్వజ్ఞః కురుతే సదా ॥ 152 ॥
స ఏవ చ గురుః సాక్షాత్ - సదా సద్బ్రహ్మవిత్తమః । తస్య స్థానాని సర్వాణి - పవిత్రాణి న సంశయః ॥ 153 ॥
సర్వశుద్ధః పవిత్రోఽసౌ - స్వభావాద్యత్ర తిష్ఠతి । తత్ర దేవగణాస్సర్వే - క్షేత్రే పీఠే వసంతి హి ॥ 154 ॥
ఆసనస్థః శయానో వా - గచ్ఛన్ తిష్ఠన్ వదన్నపి । అశ్వారూఢో గజారూఢః - సుప్తో వా జాగ్రతోఽపి వా ॥ 155 ॥
శుచిష్మాంశ్చ సదా జ్ఞానీ - గురుగీతా జపేన తు । తస్య దర్శన మాత్రేణ - పునర్జన్మ న విద్యతే ॥ 156 ॥
సముద్రే చ యథా తోయం - క్షీరే క్షీరం ఘృతే ఘృతమ్ । భిన్నే కుంభే యథాకాశస్తథాత్మా పరమాత్మని ॥ 157 ॥
తథైవ జ్ఞానీ జీవాత్మా - పరమాత్మని లీయతే । ఐక్యేన రమతే జ్ఞానీ - యత్ర తత్ర దివానిశమ్ ॥ 158 ॥

ఏవం విధో మహాముక్తః - సర్వదా వర్తతే బుధః । తస్య సర్వ ప్రయత్నేన - భావ భక్తిం కరోతి యః ॥ 159 ॥
సర్వసందేహ రహితో - ముక్తో భవతి పార్వతి । భుక్తిముక్తి ద్వయం తస్య - జిహ్వాగ్రే చ సరస్వతీ ॥ 160 ॥
అనేన ప్రాణినః సర్వే - గురుగీతా జపేన తు । సర్వసిద్ధిం ప్రాప్నువంతి - భుక్తిం ముక్తిం న సంశయః ॥ 161 ॥
సత్యం సత్యం పునః సత్యం - ధర్మసారం మయోదితం । గురుగీతా సమం నాస్తి - సత్యం సత్యం వరాననే ॥ 162 ॥
ఏకోదేవ ఏకధర్మ - ఏకనిష్ఠా పరం తపః । గురోః పరతరం నాన్యత్ - నాస్తి తత్త్వం గురోః పరమ్ ॥ 163 ॥
మాతా ధన్యా పితా ధన్యో - ధన్యో వంశః కులం తథా । ధన్యా చ వసుధా దేవి! - గురు భక్తిస్సుదుర్లభా ॥ 164 ॥
శరీర మింద్రియం ప్రాణశ్చార్థః స్వజన బాంధవాః । మాతా పితా కులం దేవి - గురురేవ న సంశయః ॥ 165 ॥
ఆకల్పం జన్మనా కోట్యా - జపవ్రత తపఃక్రియా । తత్సర్వం సఫలం దేవి - గురు సంతోషమాత్రతః ॥ 166 ॥
విద్యా తపో బలేనైవ - మందభాగ్యాశ్చ యే నరాః । గురుసేవాం న కుర్వంతి - సత్యం సత్యం వరాననే ॥ 167 ॥
బ్రహ్మా విష్ణు మహేశాశ్చ - దేవర్షి పితృకిన్నరాః । సిద్ధచారణ యక్షాశ్చ - అన్యేఽపి మునయో జనాః ॥ 168 ॥
గురుభావః పరం తీర్థమన్యతీర్థం నిరర్థకమ్ । సర్వతీర్థాశ్రయం దేవి - పాదాంగుష్ఠం చ వర్తతే ॥ 169 ॥
జపేన జయమాప్నోతి - చానంత ఫల మాప్నుయాత్ । హీనకర్మ త్యజన్ సర్వం - స్థానాని చాధమానిచ ॥ 170 ॥
ఉగ్రధ్యానం కుక్కుటస్థం - హీనకర్మ ఫలప్రదం । గురుగీతాం ప్రయాణే వా - సంగ్రామే రిపు సంకటే ॥ 171 ॥
జపతే జయమాప్నోతి - మరణే ముక్తిదాయకమ్ । సర్వకర్మ చ సర్వత్ర - గురుపుత్రస్య సిద్ధ్యతి ॥ 172 ॥
ఇదం రహస్యం నో వాచ్యం - తవాగ్రే కథితం మయా । సుగోప్యం చ ప్రయత్నేన - మమ త్వం చ ప్రియాత్వితి ॥ 173 ॥
స్వామిముఖ్య గణేశాది - విష్ణ్వాదీనాం చ పార్వతి । మనసాపి న వక్తవ్యం - సత్యం సత్యం వదామ్యహమ్ ॥ 174 ॥
అతీవ పక్వ చిత్తాయ - శ్రద్ధా భక్తియుతాయ చ । ప్రవక్తవ్యమిదం దేవి - మమాత్మాఽసి సదాప్రియే ॥ 175 ॥
అభక్తే వంచకే ధూర్తే - పాఖండే నాస్తికే నరే । మనసాపి న వక్తవ్యా - గురుగీతా కదాచన ॥ 176 ॥

॥ ఇతి శ్రీ స్కాందపురాణే ఉత్తరఖండే ఉమామహేశ్వర సంవాదే శ్రీ గురుగీతా సమాప్తా ॥

◆ ◆ ◆

అవధూతోపాఖ్యానము

శ్రీకృష్ణభగవానుడు, తనకు అనన్యభక్తుడు, ప్రియమైన భక్తుడు అయిన ఉద్ధవునితో ఇట్లు నుడివెను – "ఉద్ధవా! కలియుగమునందలి జనులలో పెక్కుమంది అధర్మపరులగుదురు. కనుక నీవు, నీ స్వజనులయెడ, భార్యాపుత్రాదులయెడ, బంధుమిత్రుల యెడ ఆసక్తిని పూర్తిగా వీడుము. నీ మనస్సును నా యందే లగ్నము చేయుము. సమదృష్టి కలిగి ఈ భూమండలమున స్వేచ్ఛగా మసలుకొనుము. మనోవాక్కులచేతనో, చక్షుశ్రవణాది ఇంద్రియములచేతనో గ్రహింపబడు ఈ జగత్తంతయును నశ్వరమని తెలియుము. ఇది స్వప్నమువలె మనఃకల్పితము. కనుక, ఇదంతయునూ మాయ, మిథ్య అని ఎరుంగుము. చరాచరాత్మకమైన ఈ జగత్తు అంతయునూ నా స్వరూపమే. అయినప్పటికినీ సంయమనము లేని అనగా చంచల స్వభావము కలిగిన మానవులకు ఇది నానారూపములలో గోచరించును. అట్టి భ్రమ వలన వారికి గుణదోషముల అనగా సుఖదుఃఖముల దృష్టి ఏర్పడును. ఈ భేదదృష్టి యంతయునూ అతని మనఃకల్పితమే. కాని, సత్యము కాదు. అట్టివారికొరకై కర్మ అనగా శాస్త్రవిహితకర్మ. (అనగా– శాస్త్రమునందు చెప్పబడినది – శాస్త్రమును అనుసరించి చేయునది – శాస్త్రవిహిత కర్మ) శాస్త్రనిషిద్ధమైన కర్మ. (అనగా– శాస్త్ర ప్రకారంగా చేయకూడనిది – శాస్త్ర నిషిద్ధ కర్మ) విహితకర్మలను ఉల్లంఘించే వికర్మ (అనగా – శాస్త్రమును అనుసరించి చేయవలసిన, మేలు కలిగించు కర్మలను చేయకుండా ఎగవేయునది – వికర్మ) అనునవి ప్రతిపాదింపబడినవి. కావున, ఉద్ధవా! మహాత్మా! నీవు ఇంద్రియములను, చిత్తమును వశపరచుకొని, ఈ సంపూర్ణ విశ్వమును నీ ఆత్మయందే చూడుము. ఆత్మను సర్వేశ్వరుడనైన నా యందు దర్శింపుము. 'సకల దేహములలోనున్న ఆత్మ నీ ఆత్మస్వరూపమే' అని భావింపుము. ఇట్టి ఆత్మానుభవము నందు ఆనందమగ్నుడవై జ్ఞాన, విజ్ఞాన సంపన్నుడవు కమ్ము. అప్పుడు ఇక ఎట్టి విఘ్నములు ఏర్పడిననూ నీవెంత మాత్రమూ కలత చెందవు. గుణదోషములు అను రెండింటి నుండి పూర్తిగా అతీతుడవు కమ్ము. పసిబాలునకు గుణబుద్ధి యుండదు. అటులే దోషబుద్ధి కూడా వుండదు. గుణబుద్ధితో అతడు విహితకర్మలను చేయడు. దోషబుద్ధితో అతడు నిషిద్ధకర్మల నుండి నివృత్తుడునూ కాదు. అతడు ఒక పరమహంసవలె వుండును. అట్లే నీవునూ, ప్రయత్నపూర్వకముగా గుణదోషములకు అతీతుడవగుము. జ్ఞాన, విజ్ఞాన సంపన్నుడైన ఒక యోగి సకల ప్రాణులయందును సుహృద్భావము కలిగియుండును. అతడు సర్వదా ప్రశాంతచిత్తుడై యుండును. పరమాత్మ తత్త్వమును దృఢముగా అనుభవించుచూ దృశ్యమునంతయునూ నా స్వరూపముగనే భావించును. అట్టివాడు ఈ జననమరణ చక్రములో పరిభ్రమింపడుగాక! పరిభ్రమింపడు.

అందుకు ఉద్ధవుడు ఇట్లనెను– "పరమాత్మా! యోగయోగేశ్వరా! నీవు యోగములకు గుప్తనిధివి. యోగస్వరూపుడవు. యోగశాస్త్రమునకు జన్మస్థానమైనవాడవు. నా పరమశ్రేయస్సు కొరకై సన్న్యాసరూప త్యాగమును ఉపదేశించితివి. ఓ అనంతా! విషయసుఖలోలురైన వారికి కోరికలను త్యజించుట చాలా కష్టమైనపని. సర్వాత్ముడవైన నీయందు భక్తిలేనివారికి ఆ త్యాగము మరింకనూ కష్టమేయని నేను తలంతును. ప్రభూ! నేను–నాది అను సుడిగుండములో చిక్కి నేను గిలగిలలాడుచున్నాను. నీ మాయా ప్రభావమున నా బుద్ధి నా పరివారము నందును, నా స్వజనులయందును

నిమగ్నమై యున్నది. అందువలన అజ్ఞానవశమున అహంకార, మమకారములలో చిక్కుకొనియున్నట్టి నాకు **'సర్వం పరిత్యజ్య'** అను త్యాగధర్మమును ఉపదేశించితివి. మంచిదే. కాని, ఆ త్యాగధర్మమును నేను సులభముగా నెరవేర్చగలిగెడు విధానమును కూడా నీ భృత్యుడనైన నాకు నెమ్మదిగా శాసించి ఉపదేశింపుము. సర్వేశ్వరా! నీవు సత్యస్వరూపుడవు. స్వయంప్రకాశస్వరూపుడవు. సకలప్రాణులలో అంతరాత్మవై యుండి వెలుగులను ప్రసాదించుచుండు వాడవు. కనుక, ఆత్మతత్త్వమును గూర్చి బోధించుటకు నీవు తప్ప దేవతలలో కూడా వేరెవ్వరునూ సమర్థులుగా నాకనిపించుటలేదు. కర్మాధీనదేహధారులైన బ్రహ్మాది దేవతలందరునూ నీ మాయచే మోహితులై బాహ్యదృష్టిని కలిగియున్నారు. దేవా! అందువలన నలువైపులనుండి వ్యాపించిన దుఃఖముల తాపముచే నేను తపించిపోవుచున్నాను. తద్వారా విరక్తి చెందిన నేను నిన్ను శరణుగోరుచున్నాను. నీవు దోషరహితుడవు. దేశకాలాది అవధులకు అతీతుడవు. సర్వజ్ఞుడవు. సర్వశక్తిమంతుడవు. అప్రతిహతమగు వైకుంఠలోక నివాసుడవు. నరులకు నిత్య సఖుడవు. నారాయణుడవు. కనుక, నీవు దయతో నాకు శ్రేయోమార్గమును ఉపదేశించి నన్నుద్ధరింపుము" అని ఉద్ధవుడు ప్రార్థించెను. **అందుకు శ్రీకృష్ణభగవానుడు ఇట్లు పలికెను –**

"ఉద్ధవా! లోకమున ఆత్మానాత్మవిచక్షణ చేయుటయందు కుశలురై, నైపుణ్యము గలవారై కొద్దిమంది మానవులు సుశిక్షితమైన మనస్సు ద్వారా విషయవాసనలనుండి తమను తామే ఉద్ధరించుకొందురు. మానవుడు మాత్రమే తన జీవితకాలములో ప్రత్యక్ష, అనుమాన, ప్రమాణముల ద్వారా జగత్తుయొక్క అనిత్యత్వమును దర్శించాలి. తద్వారా వైరాగ్యము లభించి తన శ్రేయస్సును తప్పక పొందగలడు. కావున, పురుషుడు తనకు తానే గురువు. మనుష్య యోనియొక్క గొప్పతనమేమనగా సాంఖ్యశాస్త్రము నందును, యోగశాస్త్రమునందును కోవిదులు, జితేంద్రియులు అయిన మానవులు సర్వశక్తిమంతుడైన పరమాత్మునిగా నన్ను ప్రత్యక్షరూపమున దర్శింతురు. అట్లే వారు సర్వవ్యాపకుడైన విరాట్పురుషునిగా నిరాకారరూపములో కూడా నన్ను సాక్షాత్కరింపజేసికొందురు. ఒక పాదము, రెండు పాదములు, మూడు పాదములు, నాలుగు పాదములు, బహుపాదములు, పాదములు లేనివి యగు అనేకవిధముల ప్రాణులను నేను సృష్టించితిని. కానీ, వాటిలో **అన్నింటికంటెను పురుషార్థసాధకమగు రెండు పాదములుగల మానవ శరీరమే నాకు మిగుల ప్రియమైనది. ఈ మానవజన్మయందు ప్రజ్ఞావంతులైనవారలు, బుద్ధి మొదలగు వాటిద్వారా తెలియబడునట్టి హేతువులతో, గుణములతో, చిహ్నములతో గ్రహించుటకు వీలుకానట్టి పరమాత్ముడనగు నన్ను అనుమానాది ప్రమాణములద్వారా వివేచించుకొని సాక్షాత్కరింప జేసికొందురు.** ఇట్టి విషయమును గూర్చి కొందరు మహాత్ములు, ప్రాచీనమైన ఒక ఇతిహాసమును తెలుపుచుందురు. ఇది అమిత తేజోమూర్తియైన, అత్యంత ప్రభావశాలియైన, దత్తాత్రేయునకును, యదుమహారాజునకు మధ్య జరిగిన సంవాదరూపమున ఉన్నది. దానినే నీకు వివరించెదను శ్రద్ధగా అవధరింపుము.

ధర్మవేత్తయైన యదుమహారాజు ఒకసారి తరుణ వయస్కుడైన ఒక బ్రాహ్మణ అవధూత నిర్భయముగా తిరుగుచుండుటను గాంచెను. వెంటనే

అతడు ఆయన పాదములకు వందనము చేసి, **ఇట్లు ప్రశ్నించెను** - "ఓ బ్రాహ్మణోత్తమా! నీవు ఎటువంటి కర్మలను ఆచరించుటలేదు. అయిననూ నీకు ఆత్మానాత్మ వివేకమును గూర్చిన ఇంత గొప్ప బుద్ధికౌశల్యము ఎట్లు లభించినది? తద్వారా ఎంతో గొప్ప విద్వాంసుడవైనప్పటికినీ ఈ లోకములో నీవు ఒక బాలునివలె ఎట్లు మసలుచుంటివి. ఈ లోకంలో మనుషులంతా ఆయుష్షును, యశస్సును, అనేక సంపదలను, నిరంతర సుఖమును, పొందగోరి ధర్మార్థ కామములయందును, తత్త్వజిజ్ఞాసయందును ప్రవృత్తులగుచుందురు. కానీ, నీవు సమర్థుడవు. మహాజ్ఞానివి. దక్షుడవు. స్ఫురద్రూపివి. మధురభాషివి. అయిననూ, నీవు ఏ పనినీ చేయవు. దేనినీ కోరవు. ఒక జడుడు, ఉన్మత్తుడు అయిన అవధూతవలె ఆత్మానాందమును పొందుచున్నావు. గొప్పనైన శక్తి కలిగియుండి కూడా మీరు ఎందుకింత నిర్లిప్తంగా ఉన్నారు. జనులు కామక్రోధలోభములనెడి దావానలములో బడి మగ్గుచుందురు. కానీ, వారా అగ్నినుండి ఏవిధముగను బయటపడజాలరు. నీవేమో ముక్తుడవు. ఆ అగ్నియొక్క సెగ ఇంచుకంత కూడా నీకు తాకినట్లుగా కనిపించుటలేదు. గంగాజలములలోనున్న ఏనుగును దావానలము దరిజేరదు కదా! పైగా ఆ ఏనుగు చల్లదనము అనుభవించుచుండును. అదేవిధముగా ముక్తుడవైన నీపై కామలోభము లనెడి సాంసారిక తాపములు ఎట్టిప్రభావమును చూపజాలకున్నవి. మహాత్మా! నీకు ఈ సాంసారిక విషయములలో దేనియందునూ ఆసక్తి లేకున్నది. శబ్దాది విషయస్పర్శలు లేకుండా కేవలము ఎట్టి అనుబంధములు లేని దేహమునందు ఉన్నట్లుగా ఉన్నావు. అనిర్వచనీయమైన నీవు నీ ఆత్మానందమునకు గల కారణమేమి? దయతో తెలుపవలసినది" అని యదుమహారాజు ఆ బ్రహ్మవేత్తను ప్రార్థించెను.

అప్పుడు బ్రహ్మవేత్తయగు దత్తాత్రేయ భగవానుడు మందహాసముతో ఇట్లు వచించెను- "ఓ యదుమహారాజా! నేను బుద్ధిపూర్వకముగా పెక్కుమంది గురువులను ఆశ్రయించితిని. వారివలన నేను గొప్ప జ్ఞానోపదేశమును పొందితిని. తత్ఫలితముగా ముక్తుడనై హాయిగా ఇట్లు సంచరించుచున్నాను. నాకు 24 మంది గురువులు కలరు. వారిలోని సుగుణాలను ఆమోదించి, స్వీకరించి, నేను జ్ఞానమును పొందితిని. అట్టి విషయములనన్నింటిని సమగ్రముగా నీకు తెలిపెదను వినుము. మహారాజా! 1. భూమి, 2.వాయువు, 3. ఆకాశము, 4. జలము, 5. అగ్ని, 6. చంద్రుడు, 7.సూర్యుడు, 8. కపోతము, 9. అజగరము- కొండచిలువ, 10. సముద్రము, 11. మిడుత, 12. తేనెటీగ, 13. ఏనుగు, 14. తేనెను పట్టువాడు, 15. హరిణము, 16.మీనము, 17. పింగళ అను పేరు గల ఒక వేశ్య, 18. కురరము అను ఒక పక్షి, 19. శిశువు, 20. కన్య, 21. బాణములను తయారుచేయువాడు- కమ్మరి, 22. సర్పము, 23. సాలెపురుగు, 24. భ్రమరము అను ఈ ఇరువది నాలుగింటిని నేను గురువులుగా ఆశ్రయించితిని. వాటి ఆచరణలను బాగుగా గమనించి, తదనుసారముగా నేను గొప్ప జ్ఞానమును పొందితిని. నహుషుని మనుమడవైన ఓ యదుమహారాజా! మహాపురుషా! వీటినుండి నేను పొందిన స్ఫూర్తిని గ్రహించిన జ్ఞానమును ఒక్కొక్కటిగా వివరించి విపులముగా నీకు తెలిపెదను సావధానచిత్తుడవై ఆకర్ణింపుము.

నా మొదటి గురువు భూమి. త్రవ్వటము, తన్నటము, మలమూత్ర విసర్జన చేయడము మొదలైన బాధలు ఎన్ని కలిగినప్పటికినీ కిమ్మనకుండా సహిష్ణువై ఓర్చుకోవటమనే గొప్ప గుణమును భూమిని చూచి నేను నేర్చుకొంటిని. అదేమిటనగా – “విధివశమున ఇతరప్రాణులు తనను ఆక్రమించి బాధించిననూ ధీరుడైన యోగి కూడా ఆ బాధను విధివిలాసముగా భావించి సహిష్ణువై తన మార్గమునుండి ఎంతమాత్రము చలింపకూడదని **చక్కని క్షమాగుణమును కలిగియుండవలయునని నేను భూమినుండి గ్రహించితిని.** అదేవిధముగా పర్వతములు తమపై అనేక వృక్షములను, తృణములను, సెలయేళ్ళను భరించుచూ వాటిద్వారా అది పరహితమునకే, ఇతరులకు ఉపకరించుటకే పాటుపడుచుండును. ఈవిధముగా పర్వతములను, వృక్షములను, సెలయేళ్ళను చూచి పరోపకార లక్షణమును సాధకుడు అలవరచుకొనవలెనని గ్రహించితిని.

రెండవది వాయువు. వాయువు అనేక ప్రదేశములయందు ప్రసరించుచుండును. కానీ, అది వేటిపైననూ ఆసక్తిని కలిగియుండదు. శీతోష్ణాది నానావిధములైన గుణాలుగల పదార్థములపై, విషయములపై అది ప్రయాణించినప్పటికినీ, వాటి గుణదోషములయందు అది ఆసక్తము గాకుండా వుండును. అట్లే, యోగి కూడా ఇంద్రియముల ద్వారా వేర్వేరు విషయములను అనుభవించుచున్నప్పటికినీ వాటి గుణదోషముల యందు అనగా ఇష్టాయిష్టములయందు ఆసక్తిని కలిగియుండరాదు అని నేను గ్రహించితిని. మననశీలుడైన సాధకుడు తన జీవనయాత్రకు తగిన ఆహారమును మాత్రమే తీసుకొని సంతుష్టిని పొందవలెను. ఎందుకనగా, జ్ఞానానికి దేహము, దేహానికి ప్రాణము, ప్రాణానికి ఆహారము కావలసివుండును. కావున, జీవనయాత్రకు తగిన ఆహారమును మాత్రమే తీసుకొని సంతృప్తిని చెందవలెను. కానీ, ఇంద్రియప్రీతికొరకు ఆరాటపడవద్దు.ప్రాణములు నిలుచుటకే ఆహారము అవసరము. అట్టి ఆహారము వలన జ్ఞానశక్తి నశించదు. వాగింద్రియము అనగా నాలుక, మనసు చంచలము గాకుండును. వాయువు తనతో సుగంధమును, దుర్గంధమును మోసికొనిపోవును. కానీ, వాటితో లిప్తము గాకుండా వుండును. అట్లే ఆత్మజ్ఞాని పార్థివ శరీరమునందు ఉండునంతవరకు శరీరపరమైన వ్యాధులను, బాధలను, ఆకలిదప్పులను మున్నగువాటిని వహింపవలసి వచ్చును. కానీ, **తాను శరీరము కాదనియు, ఆత్మరూపుడనై ద్రష్టగా ఉండే తనకు ఈ శరీరముతో గానీ, దాని గుణములతో గానీ, ఎట్టి సంబంధమూ లేదనియు, నిర్లిప్తుడై ఉండవలయునని, గాలిని చూచి నేను గ్రహించితిని.**

మూడవది ఆకాశము. స్థావరజంగమాత్మకములు అన్నియూ వేర్వేరు రూపములలో ప్రతీతములగుచున్ననూ వాస్తవముగా వాటిలో ఒక్కటే ఆకాశము అపరిచ్ఛిన్న రూపములో వ్యాప్తమై ఉండును. ఘటాదులందంతటా తాను ఉన్నప్పటికినీ ఆకాశము వాటిని అంటుకోకుండా వాటితో వేరు కాకుండా వెలుపల, బయట కలగలసినట్లుగా కన్పట్టుచుండును. అట్లే, బ్రహ్మతత్త్వము చరాచరాత్మకములైన సకలభూతములయందు సంపూర్ణముగా వ్యాపించి వున్నది. ఆకాశమువలె అది అవ్యవచ్ఛేదము, అసంగము. వాయువు యొక్క ప్రేరణతో అగ్ని జ్వలించును. వర్షము కురియుచుండును. అన్నము, ధాన్యము ఇత్యాది పంటలు పండును. నశించును. వాయువువల్లనే

మేఘములు ఆకాశమునందు వచ్చి పోవుచుండును. ఉరుములు, మెరుపులు కన్పట్టుచుండును. ఇవన్నీ తనలో జరుగుచున్నప్పటికినీ ఆకాశము దేనితో లిప్తము గాకుండా వుండును. **ఇదేవిధముగా మననశీలుడైన సాధకుడు కాలముచే నిర్మింపబడిన గుణములు, ద్రవ్యములు వచ్చిననూ, పోయిననూ ఆకాశమువలె వాటితో ఎట్టి సంబంధము లేకుండా వుండవలెను అను జ్ఞానమును నేను ఆకాశముద్వారా నేర్చుకొంటిని.**

ఇక నాలుగవది జలము. జలము సహజముగా స్వచ్ఛమైనది. నిర్మలమైనది. మధురమైనది. మానవులను పవిత్రమొనర్చు తీర్థరూపమైనది. ఇతరమైన వాటిని అది పరిశుద్ధము చేయును. **అట్లే ఒక ముని స్వాభావికముగా నిర్మలభావములను కలిగి, రాగద్వేషరహితుడై అందరియెడ స్నేహభావము కలిగి తన దృష్టిద్వారా, తన స్పర్శద్వారా, మధురాలాపముల ద్వారా ఇతరులను పవిత్రమొనర్చువాడై యుండవలెను.**

ఐదవది అగ్ని. అగ్ని మహాతేజస్సును కలిగియుండును. ఇంధనాలవలన అగ్ని వెలుగుచుండును. ఇతరులెవ్వరూ స్పృశించుటకు వీలు గాకుండా వుండును. సర్వభక్షకుడై యుండి కూడా అపవిత్రముగాకుండును. తనయందు సమర్పింపబడే ఆహుతులను స్వీకరించే అగ్ని వాటి గుణదోషములతో అంటకుండా వుండును. అట్లే ఒక యోగి అగ్నివలె తేజస్వియై తపశ్శక్తిచేత తేజరిల్లు చుండవలెను. ఇతరులచే జయింప శక్యము గానివాడై యుండవలెను. ఎట్టి సంగ్రహమునకు పాల్పడకుండా భిక్షామాత్రము స్వీకరించి తృప్తి చెందుచుండవలెను. జితేంద్రియుడై, నిత్యనిరంతరము అధ్యాత్మ చింతనలో మునిగియుండవలెను. మునియైనవాడు తనకు లభించిన ఆహారమును స్వీకరించుటవలన అతనికి ఎట్టి దోషము అంటదు. అగ్ని ఒకచో దాగియుండును. మరియొకచో ప్రకటమగును. శ్రేయఃకాములు అగ్నిని ఉపాసించుచుండెదరు. వారి కొరకు అగ్ని ప్రకటమగును. హెూమము చేయువారి హవిస్సును భుజించును. దాతల భూతభవిష్యత్తులలోగల పాపములన్నింటిని అగ్ని దహింపజేయును. అట్లే సాధుపురుషుడు అగ్నివంటివాడు. అతడు తన మహత్త్వమును ఒకచోట గుప్తముగా నుంచును. వేరొకచోట బహిర్గతమొనర్చును. శ్రేయస్సును కోరువారు అతనిని సేవించెదరు. తనను సేవించువారల పూర్వాపర పాపములను నశింపచేసి వారికి శుభములను చేకూర్చుచుండును. పరమాత్మ తన మాయాప్రభావము చేత చిదచిదాత్మకమైన జగత్తునందు ప్రవేశించి, ఆయా స్వరూపములలో అనగా దేవమనుష్యాది రూపములలో ప్రతీతమగుచుండును. **అట్లే అగ్నియు వివిధరూపములలో యున్న ఇంధనములయందు ప్రవేశించి ఆయా రూపములలో ప్రకటితమగుచుండును. దాని సహజరూపములు అవి ఎవ్వియును కావు. అగ్ని ఒక్కటే అయి వున్నట్లుగా పరమాత్మ అంతటా ఒక్కడే ఉన్నాడు. అగ్నియొక్క జ్వాలలు అగ్నినుండి ఉద్భవించును. తిరిగి అగ్నిలోనే సమసిపోవును.** ఇట్లే కాలము యొక్క తీవ్రమైన ప్రవాహ వేగమున నిత్యనిరంతరము ప్రాణులు పుట్టును, నశించును. కాలప్రవాహమున ప్రతిక్షణము ప్రాణులు మృత్యుముఖము నందు ప్రవేశించుచుండుట కనిపించకున్నది.

ఆరవది చంద్రుడు. కాలవేగ ప్రభావముచేత చంద్రునియొక్క కళలు పెరుగుచున్నట్లునూ, తరుగుచున్నట్లుగను ద్యోతకమగుచుండును. వృద్ధి క్షయములు కళలకే గాని, చంద్రునికి లేవు కదా! అట్లే పుట్టినది మొదలుకొని

మరణించువరకును దేహమునకు బాల్య, యౌవన, కౌమారాది అవస్థలు, షడ్వికారములు అనగా ఉండుట, పుట్టుట, తిరుగుట, మార్పు చెందుట, క్షీణించుట, నశించుట ఇవన్నియు కాలప్రభావము వలన ఏర్పడుచుండును. కానీ, ఆత్మలో ఎట్టి మార్పులూ వుండవు. కావున, సకల ప్రాణులకు వృద్ధిక్షయములు సహజములనియూ గ్రహించి, ధీరుడు వాటికి చలింపడని చంద్రునివలన గ్రహింపవలెను. **మార్పులన్నియు దేహమునకు చెందినవే** కాని, **ఆత్మకెంతమాత్రము చెందినవి కావని చంద్రుని చూచి నేను గ్రహించితిని.**

ఏడవది సూర్యుడు. సూర్యుడు తన కిరణములద్వారా జలములను గ్రహించును. సమయానుకూలముగా లోకకళ్యాణమునకై వర్షించుచుండును. గ్రహించుట యందును, వర్షించుటయందును లోకసాక్షియగు ఆ సూర్యనారాయణునకు ఎటువంటి ఆసక్తి వుండదు. అట్లే యోగి సమయానుసారముగా ఇంద్రియములద్వారా విషయములను గ్రహించును మరియు విడిచిపెట్టును. కానీ, ఎప్పుడు కూడా అతడు ఆసక్తితో వాటియందు తగుల్కొనడు. సూర్యుడు ఒక్కడే. అయిననూ వేర్వేరు జలపాత్రలలో, జలాశయాలలో అనేక రూపాలలో వేర్వేరుగా కనపడుచుండును. అట్లే ఆత్మ ఒక్కటే అయినప్పటికినీ స్థూలబుద్ధులకు ఉపాధి భేదములను అనుసరించి ఆత్మలు వేరువేరుగా తోచుచుండును. ఆత్మయొక్క వాస్తవ స్థితి వారికి బోధపడదు. కానీ, **సూర్యునియొక్క దృష్టాంతము ద్వారా ఆత్మయొక్క అఖండత్వము బోధపడునని నేను** గమనించి గ్రహించితిని.

ఎనిమిదవది కపోతము అంటే పావురము. యదుమహారాజా! ఎవ్వరియెడలను అతి ప్రేమ, మిక్కుటమైన ఆసక్తి కలిగియుండరాదు. ప్రేమాసక్తులవలన పురుషుడు కపోతమువలె దైన్యావస్థకు గురియై లేని బాధలకు గురి కావలసి వచ్చును. ఇందుకుగాను, పావురముల జంటయొక్క ఒక కథను నీకు వివరిస్తాను వినుము. మహారాజా! ఒకానొక అడవిలో ఒక పావురము ఒక చెట్టుపై గూడు కట్టుకొని మరియొక పెంటి పావురముతో కొన్ని సంవత్సరములపాటు హాయిగా నివసించుచుండెను. ఆ పావురముల జంట శరీరములు వేరుగానున్ననూ హృదయములు ఒక్కటిగా, పరస్పర గాఢానురాగములతో సుఖముగా కాపురము చేయుచుండెడివి. వాటిమధ్యగల ప్రేమానురాగములు దినదినాభివృద్ధి చెందుచుండెను. మగపావురము ఆడపావురముపైగల అంతులేని ప్రేమతో అది కోరినదానినెల్ల ఎంత శ్రమపడియైనను తెచ్చి, యిచ్చి దానిని తృప్తిపరచుచుండెడిది. ఇక దాని భార్యయైన పెంటి పావురము కూడా ఆ మగపావురముపై మిగుల ప్రేమ కలిగి, దానికి చక్కని దాంపత్యసుఖములను కూర్చుచుండెడిది. వాటి అన్యోన్య ప్రేమలు నిరుపమానములు. కాలక్రమమున ఆ కపోతమిథునమునకు సంతానము కలిగెను. మిక్కిలి పుత్రవాత్సల్యముతో ఆ పావురముల జంట తమ పిల్లలను పెంచి పోషించుచుండెడిది. విష్ణు మాయాప్రభావమున ఆ రెండు పావురముల యొక్క హృదయములలో పెనవేసికొనియున్న ప్రేమాతిశయములు, వ్యామోహములు సాటిలేనివి. అవి తమ పసికందుల పోషణలో మునిగి ఆ పారవశ్యమున ఈ లోకమునే మరచిపోవుచుండెను. ఒకనాడు మేతకోసమై ఆ పావురముల జంట ఆహారమును తెచ్చుటకై అడవికెళ్ళెను. కుటుంబ భారము పెరుగుటవలన ఆహారపదార్థములను ఎక్కువగా

సమకూర్చుకొనవలసియుండెను. అందువలన అవి ఆ అడవిలో నలువైపుల ఎక్కువకాలము తిరుగసాగెను. అట్టి సమయమున ఒక బోయవాడు అదే అడవిలో తిరుగుచూ అనుకోకుండా ఈ పక్షులగూటి సమీపమునకు చేరెను. అప్పుడా గూటికి సమీపమున పక్షి పిల్లలు తిరుగుచుండుటను చూచి, ఆ బోయవాడు వలను పన్నెను. పాపం ఆ పావురాల పిల్లలకు వలను గూర్చి తెలియక అందులో చిక్కుకొనెను. పావురముల జంట తిరిగి తిరిగి ఆహారమును సంపాదించుకొని తమ గూటి కడకు చేరుకొనెను. అంతట ఆడుపావురము వలలో చిక్కుకొనియున్న తమ పిల్లలను చూచి మిగుల దుఃఖించెను. వలలో పడి గోడుగోడున విలపించుచున్న తన పిల్లల దురవస్థను గాంచి తట్టుకొనలేక అది పరితపించుచూ వాటి కడకు చేరుకొనెను. భగవంతుని మాయా ప్రభావము వలన తన పిల్లలపై అంతులేని మమకారముగల ఆ ఆడుపావురము యొక్క చిత్తము తన పిల్లల దురవస్థ కారణముగా మిగుల దైన్యస్థితికి లోనయ్యెను. వలలో బంధింపబడియున్న పిల్లలకు ఏవిధముగను తోడ్పడజాలక దిక్కుతోచనిదై తాను కూడా స్వయముగా ఆ వలలో చిక్కుకొనెను. అంతట మగ పావురము తన ప్రాణములకంటె మిన్నగా చూచుకొనుచున్న తన పిల్లలు, ప్రాణతుల్యయైన తన భార్యయును, వలలో చిక్కుపడియుండుటను చూచి భరింపలేక, మిగుల దుఃఖముతో విలపింపసాగెను. అప్పటి దాని పరిస్థితి ఎంతయో జాలిగొలుపునదిగా ఉండెను. అప్పుడు ఆ కపోతము ఇట్లు తలపోయసాగెను. నా దౌర్భాగ్యమును చూడుడు. నేను మిగుల దురదృష్టవంతుడను. నేను చేయవలసిన పనులు ఏమియూ పూర్తికాలేదు. పిల్లలను పెంచి పెద్దచేయదలచుకొనిన నా కోర్కెలు ఎంతమాత్రమూ నెరవేరలేదు. అంతేకాదు, ధర్మార్థ కామములకు మూలమైన గృహస్థాశ్రమము పూర్తిగా దెబ్బతినినది. వేయేల నా ఆశలన్నియూ అడుగంటిపోయినవి. నన్ను దైవముగా భావించెడి నా భార్య నాకు అన్నివిధములుగా తగినట్టిది. అట్టి అనుకూలవతియైన భార్య దొరకుట నా అదృష్టము. ఆమె లేని ఈ గూడు నాకు శూన్యము. నన్ను ఒంటరివానిని చేసి అన్నెము పున్నెము ఎరుగని ఈ పిల్లలతో తాను స్వర్గమునకు వెళ్లుచున్నది. భార్యను, పిల్లలను పోగొట్టుకొని బోసిపోయిన ఈ గూటిలో దిక్కులేనివాడనై నేను బ్రతికి ఏమి లాభము? భార్యావియోగమునకు గురి అయిన నా జీవితము మిగుల దుఃఖమయము, వ్యర్థము అని ఈవిధముగా చింతించిన పిమ్మట ఆ కపోతము వలలో చిక్కుకొని, చేష్టలుడిగి మృత్యుముఖమున నున్న తమ పిల్లలను చూచి దైన్యమునకు లోనై, అజ్ఞానముతో తాను కూడా ఆ వలలో ప్రవేశించెను. అంతట, క్రూరాత్ముడైన ఆ కిరాతుడు కపోతముల జంటను, వాటి పిల్లలను తీసికొని తాను వచ్చిన పని పూర్తియైనదని భావించి మిగుల సంతసముతో తన ఇంటికి చేరుకొనెను. విషయసుఖలోలుడైన కుటుంబ యజమాని చంచల మనస్కుడై తన కుటుంబపోషణకై ద్వంద్వములలో తలమున్కలగుచు దీనుడై కడకు కపోతమువలె సకుటుంబముగా నశించును అని ఈ కపోత మిథునము యొక్క దశను చూచి నేను గ్రహించితిని. **కావున, ముక్తి సాధనమైన మానవ జన్మను పొందియు, పావురముల జంటవలె సాంసారిక వ్యామోహములో చిక్కుకొనినవాడు శ్రేయోమార్గము నుండి పతనమగుట తథ్యమని భావింపవలెను.** అట్టివానిని విద్వాంసులు 'ఆరూఢచ్యుతుడు' అని అందురు. శ్రేయోమార్గములను కోరుకొనువాడు సాంసారిక

వ్యామోహములో చిక్కుకొనరాదని ఈ కపోత వృత్తాంతము లోకమునకు పరోక్షముగా చక్కని హితవు పలుకుచున్నదని నేను గ్రహించితిని.

తొమ్మిదవది అజగరము. అనగా కొండచిలువ. కొండచిలువ ఆహారము కొరకు తాను ఎక్కడికీ వెళ్ళకుండా తన దగ్గరకు వచ్చిన జంతువులను భక్షిస్తూ, తానున్నచోటనే పడివుండుటను గమనించితిని. ఆహారము పెక్కు దినముల వరకు దొరకకపోయిననూ దానికై ఎట్టి ప్రయత్నమూ చేయక అజగరమువలె నిరాహారముగా ఉండవలెను. ప్రారబ్ధానుసారముగా లభించిన ఆహారముతో సంతుష్టినొందవలెను. కావున, యోగియైన వాడు అజగరమువలె అప్రయత్నముగ లభించినదానిని అనుభవించి ఉదాసీనుడై యుండవలెనని నేను గ్రహించితిని. శరీరమునందు మనోబలము, ఇంద్రియబలము, దేహబలము ఉన్నప్పటికీ ఇంద్రియములు కార్యసాధక శక్తి కలవైనప్పటికినీ యోగియైనవాడు నిశ్చేష్టుడై యుండవలెను. నిద్రారహితుడైనను అజగరమువలె నిద్రించుచున్నట్లు ఉండవలెను. **సాధకుడు ఇంద్రియసుఖములకై ఆరాటపడక అజగరమువలె ప్రాప్తించిన దానితో తృప్తిపడియుండవలెను.**

పదవది సముద్రము. తానెంత లోతును కలిగియున్నదో, ఆ సంగతిని బయటకు మరెవ్వరికీ తెలియనీయదు. తనలో ఎక్కడ జలచరములున్నవో వాటిని కనిపించనీయదు. దాని తీరములు ఎక్కడో మనకు తెలియనీయదు, తెలియదు. దానిని ఎవరునూ దాటలేరు. దానియొక్క ఆవలితీరమునకు ఎవ్వరునూ చేరుకొనలేరు. సముద్రములోనికి వర్షాకాలమున నదీప్రవాహములు ఎన్ని వచ్చి చేరినప్పటికినీ అది తన చెలియలికట్టను అనగా తన హద్దును ఎంతమాత్రమూ దాటదు. గ్రీష్మకాలమునందు శుష్కింపదు. అట్లే, మునియైనవాడు సంపదలు సమృద్ధిగా లభించినప్పుడు పొంగిపోడు. లభింపనప్పుడు కృంగిపోడు. అతడు విషయవాంఛారహితుడై తన మనస్సును భగవత్పరము గావించును. అంతేకాదు, **ముని సముద్రమువలె బయటికి ప్రసన్నుడుగాను, లోపలికి గంభీరుడుగాను ఉండవలెను. అతడు ఇట్టివాడు అని లోకులకు బోధపడరాదు. మిగుల ప్రతిభాశాలియై యుండవలెను. అపారమైన శక్తి సామర్థ్యములు కలిగియుండవలెను. కామక్రోధాదులచే చలింపకూడదు. సముద్రమువలె ప్రశాంతముగా ఉండవలెను. ఈవిధమైన చక్కని నీతిని సముద్రము నుండి నేను గ్రహించితిని.**

పదకొండవది మిడుత. అగ్ని జ్వాల రూపమునకు ఆకర్షితమై అది ఏదో ఫలమని భ్రాంతిపడి, దానిని అనుభవించవలెనను ఆశతో మిడుత అమాంతముగా ఎగిరి, ఆ మంటలలో పడి భస్మమైపోవును. ఈవిధముగనే ఇంద్రియసుఖలోలుడైన వ్యక్తి భగవన్మాయా ప్రభావమున స్త్రీ రూపమునకు ఆసక్తుడై, ఆ వ్యామోహంలో పడి, అంధకారమైన నరకకూపమున పడిపోవును. కామినీకాంచనములు, వస్త్రాభరణములు మొదలగు క్షణికమైన పదార్థములచే ఆకర్షింపబడి, మూర్ఖత్వముచే వాటిని పొందవలెను అను ఆసక్తితో వివేకమును కోల్పోయి, మిడుతవలె నశించును. **ఐహికములైన క్షణికావేశములు పతనహేతువులు అని నేను మిడుతను చూచి గ్రహించితిని.**

పంద్రెండవది మధుకరము (తుమ్మెద). మరొకటి తేనెటీగ. తుమ్మెద ఒక్కొక్క పుష్పము దగ్గరకు వెళ్ళి, ఓర్పుగా, నేర్పుగా కొద్దికొద్దిగా దానిలోని మకరందమును ఆస్వాదించుచూ, తాను జీవించుచుండును. అట్లే మునియైనవాడు ఒక్కొక్క గృహమున మాధుకర వృత్తిననుసరించి కొంచెము

కొంచెముగా భిక్షగా ఆహారమును స్వీకరించి, తన దేహమును పోషించుకొనుటకు మాత్రమే ఆహారమును స్వీకరింపవలెను. ఈవిధమును పాటించినచో అతని దేహయాత్ర చక్కగా కొనసాగును. ఆహారప్రదానము చేయునట్టి గృహస్థునకు ఎట్టి బాధయూ కలుగదు. తుమ్మెద పుష్పములు చిన్నవైనను, పెద్దవైనను వాటిలోని సారమును మాత్రమే గ్రహించును. **ఆవిధముగనే ముని శాస్త్రములన్నింటి నుండి సారమును మాత్రమే గ్రహింపవలెను అని మధుకరమును చూచి ఒక గొప్ప నీతిని గ్రహించితిని.**

దీనికి చెందినదే మరియొకటి తేనెటీగ. ఎంతో కష్టపడి తిరిగి తిరిగి పూలనుండి తేనెను గ్రహించి, జాగ్రత్తగా తెచ్చి తేనెటీగలు తమ అరలలో తేనెను భద్రపరచుచుండును. అవి ఎంతో కష్టపడి సంగ్రహించినటువంటి తేనెను ఎవరో జనులు వచ్చి వాటిని చంపి తీసికొనిపోవుటను చూచితిని. తద్వారా లోభగుణముతో తేనెను కూడబెట్టుటవల్లనే అవి నాశనమైనవని గ్రహించితిని. కావున, యోగియైనవాడు భిక్షాటనకు వెళ్లినపుడు తేనెటీగవలె సాయంకాలము కొరకుగాని, మరునాటికి గాని మిగుల్చుకొను ఉద్దేశ్యంతో భిక్షాన్నమును సమకూర్చుకొనుటకు యత్నము చేయకూడదు. తన చేతినిండుగా గాని, అంటే తన కరము (అరచేయి) నిండునంతవరకు లేదా ఉదరము నిండునంతవరకే భిక్షను స్వీకరించవలెను. అట్లుగాక, **తేనెటీగవలె అవసరమునకు మించి సంగ్రహించినచో, తేనెతో సహా తేనెటీగ నశించునట్లుగా అతడు తన ఆహారమును కోల్పోవును.** తాను కూడా ఆపదల పాలగును అని నేను తేనెటీగను చూచి నేర్చుకొంటిని.

పదమూడవది ఏనుగు. ఏనుగును బంధించటానికి వేటగాండ్రు అడవిలో ఒక పెద్ద గొయ్యిని త్రవ్వి అది కనిపించకుండా దానిపై సన్నని కర్రలు పరచి, మట్టిపోసి దానిమీద ఒక ఆడ ఏనుగు బొమ్మను పెట్టెదరు. అంతట మగ ఏనుగు, ఆడ ఏనుగు యొక్క సుఖస్పర్శకై ఆరాటపడుచూ దానివద్దకు చేరుకొనును. బొమ్మను చూచి, అది నిజమైన ఆడ ఏనుగు అనే భ్రాంతికి లోనై, వేగముగా చేరుకొనవలెనని, తమకంతో పరుగెత్తుకొనిపోయి ఆ గుంటలో పడిపోవును. అటులే యోగియైనవాడు కర్రతో చేయబడిన స్త్రీ మూర్తియైనను పాదముతో సయితము స్పృశించరాదు. అట్లు స్పృశించినచో అతడు ఆడ ఏనుగు సాంగత్యము వలన మగ ఏనుగువలె వ్యామోహములో చిక్కుకొనును. తద్వారా భ్రష్టుడైపోవును. **స్త్రీ వాంఛ అనే గొయ్యిలో పడరాదని ఈ ఏనుగు వృత్తాంతమును చూచి, నేను గ్రహించితిని.**

పధ్నాలుగు తేనెను సేకరించువాడు. తేనెటీగలు ఎంతయో శ్రమపడి కూడబెట్టిన తేనెను, సేకరించువాడు అనుభవించునట్లు పరమలోభియైనవాడు తాను నానా కష్టాలు పడి కూడబెట్టిన ధనమును తాను అనుభవింపడు. ఇతరులకు దానము చేయడు. అట్టి లోభియొక్క ధనమును ఇతరులే అనుభవింతురు. అనేక దినములు ఎంతయో ప్రయాసపడి తేనెటీగలు తేనెను సమకూర్చుకొనును. కానీ, తేనెను సేకరించువాడు తేనెటీగల యొక్క కష్టార్జితమును అవి అనుభవింపక ముందే తాను భుజించివేయును. అట్లే సుఖజీవనమును కాంక్షించు గృహస్థులు తాము అనుభవించుటకై ధనమును మిక్కిలి కష్టపడి సంపాదించెదరు. వారి గృహములలోని అన్నపానాదులను వారు అనుభవింపక ముందే ఇతరులెవ్వరో భుక్తము చేయుదురు. **దీనిని బట్టి చూడగా స్వార్థము కొరకై సంపాదించుకొనిన వస్తువులు తమకు దక్కవు.**

కావున, మానవుడు పరార్థదృష్టి కలిగి అనగా అంతయూ భగవంతునిదే అను భావముతో దానిని సద్వినియోగము చేయవలెను. అప్పుడాతని జీవితము సార్థకము అగును అని తేనె సేకరించువానిని చూచి గమనించితిని.

పదిహేనవది హరిణము (జింక). వేటగాడు పాడే సంగీతమును విని హరిణము సమ్మోహితమై వానికి చిక్కుపడుతుంది. తుదకు అది తన ప్రాణములనే కోల్పోతుంది. అందువలన వనవాసియగు సన్యాసి విషయభోగములకు సంబంధించిన గీతములను వినరాదు. దైవమునకు సంబంధించిన గీతములను, సంభాషణములను వినవలెనే గాని, గ్రామ్య శృంగారముల గీతములకు చెవి యొగ్గినచో అతడు భ్రష్టుడగును.

యదుమహారాజా! హరిణి యొక్క గర్భము నుండి జన్మించిన విభాండకుని సుతుడగు ఋష్యశృంగుడు తరుణీమణుల యొక్క విషయభోగములకు సంబంధించిన గొప్ప నృత్యములను చూచుచూ, మృదంగాది వాద్యములతో కూడిన గీతములను వినుచూ వారికి వశుడై వారి చేతిలో ఆటబొమ్మగా మారిపోయెను. కావున, గ్రామ్య శృంగార గీతముల దుష్ప్రభావము ఎంతవరకు దారితీయునో నీవు ఎరిగినదే కదా! కావున, **హరిణమువలె గ్రామ్య శృంగార గీతములకు చెవియొగ్గకూడదు అని జింకను చూచి నేను గ్రహించితిని.**

పదహారవది చేప (మీనము). గాలమునకు గ్రుచ్చబడిన ఎరకు ఆశపడిన చేప ఆహారమునకై ఆశపడి ఆ గాలమునకు చిక్కుకొని తుదకు తన ప్రాణములనే పోగొట్టుకొనును. అట్లే, అంతులేని జిహ్వా చాపల్యము గల మానవుడు రోగములపాలై మృత్యుముఖమున జొచ్చును. కనుక, రసనేంద్రియమును జయించుట మిక్కిలి కష్టము. **రసనేంద్రియమును జయింపనంతవరకు మానవుడు జితేంద్రియుడు కాజాలడు.** రసనేంద్రియమును జయించినచో అన్ని ఇంద్రియములు అతనికి వశమైనట్లే అని చేపను చూచి నేనీ జ్ఞానమును నేర్చితిని.

పదిహేడవది పింగళ అను వేశ్య. పూర్వకాలమున విదేహనగరము అనగా మిథిలానగరము నందు పింగళ అను వేశ్య వుండెను. ఆమె నుండి కూడా నేను కొంత నీతిని నేర్చుకొంటిని. అట్టి విషయమును నీకు వినిపించెదను ఆలకింపుడు. ఒకరోజు పింగళ చక్కగా అలంకరించుకొని ఒకనాటి రాత్రి తన శయనమందిరమునకు ఒక కాముకుని తీసుకొనిపోవదలచినదై తన ఇంటి ముఖద్వారము నందు వేచియుండెను. ధనమునందు పేరాశ కలిగిన ఆ పింగళ తన ఇంటి ముందరి త్రోవలో వచ్చిపోవుచున్న ప్రతీ పురుషుని చూచుచూ, వయ్యారముగా నిలబడి వారు నా వద్దకే వస్తున్నారని ఆశపడుచూ ఎదురుచూచుచుండెను. అంతేకాదు, దారిగుండా వెళ్ళుచున్న ప్రతి పురుషుని చూచి తానిట్లు తలపోయుచుండెను. ఇతడు ధనవంతుడు కావచ్చును. ఈ సుందరుడు సమృద్ధిగా శుల్కమునిచ్చి నాతో రమించుటకే వచ్చుచుండవచ్చు. ఇతడు ధనికుడే కావచ్చును, నన్ను పొందుటకే వచ్చుచుండవచ్చు. ఇతడు సమృద్ధిగా ధనము నీయగలిగి వుండవచ్చు అని ఆమె భావించుకొనుచుండగనే అందరునూ తమ దారిన తాము వెళ్ళిపోవుచుండిరి. క్షణక్షణము పెల్లుబుకుచున్న పేరాశతో ఆ పింగళ నిద్రను మాని ద్వారము వద్దనే విటునికొరకు ఎదురుతెన్నులు చూచుచూ నిలబడియుండెను. కానీ, వారెవ్వరూ ఆమె వద్దకు రాలేదు. ఫలితము లభించకపోవుటతో ఏమియూ

తోచక ఆమె మాటిమాటికీ ఇంటిలోనికి వెళ్ళుచూ తిరిగి గుమ్మము వద్దకు వచ్చుచుండెను. ఇంతలో అర్ధరాత్రి గడిచిపోయెను. ఎంతకునూ ఆమెలో ధనాశ చావకుండెను. ఎదురుచూచి, ఎదురుచూచి నోరు ఎండిపోవుచుండెను. ముఖము వాడిపోవుచుండెను. అనుక్షణము ఆమెలో దైన్యము ఆవరించుచుండెను. ఆ స్థితిలో ఆమెలో ఒక గొప్ప వైరాగ్యము ఆవిర్భవించెను. ఎంతయో చింతాగ్రస్తురాలయ్యెను. చివరకు వైరాగ్యముతో పాటు ఇవన్నియూ కలిసి ఆమె శ్రేయస్సునకే గొప్ప కారణములయ్యెను. ఇంతలో వ్యక్తియొక్క ఆశాపాశములను త్రుంచివేయుటకు వైరాగ్యమే, విరక్తియే ఒక గొప్ప ఖడ్గమనుచు ఒక గీతమును ఆలపించెను. అజ్ఞానియైన వ్యక్తినుండి మమకారములు తొలగిపోనట్లుగా విరక్తి అనగా వైరాగ్యము కలుగనిదే దేహబంధములు లేదా ఆశాపాశములు వీడిపోలేవని ఆ పింగళ అను వేశ్య పాడిన పాటలో, సారాంశము. నేను ఇంద్రియ సుఖములకు బానిసనైతిని. అంతులేని మోహములో మునిగి తుచ్ఛుడైన పురుషునితో విషయసుఖములను కోరుకొనుచుంటిని. నేనెంతటి మూర్ఖురాలను. ఇది చాలా విచారకరమైన విషయము. పరమానంద స్వరూపుడు, సుఖప్రదాతయూ అయిన పురుషోత్తముడు నా హృదయమునందే స్థిరముగా నిలచియున్నాడు. అతడు లక్ష్మీపతి యగుటవలన ధనమును కొల్లలుగా ఈయగలడు కదా! అంతేగాక, చతుర్విధ పురుషార్థములను కూడా ఈయగలడు. అట్టి ప్రభువును విడిచిపెట్టి ఒక తుచ్ఛునికై ఆశపడుచుంటిని. అతడు నా మనోరథమును తీర్చుటకు అసమర్థుడు. నేను నింద్యమైన వేశ్యావృత్తిని అవలంబించి, నా దేహమును, మనస్సును వృధాగా క్లేశములపాలు జేసికొంటిని. స్త్రీలోలులురు, లోభులు అగు గౌరవహీనులకు ఈ శరీరమును అమ్ముకొని ధనమును, రతిసుఖమును కోరుకొంటిని. నేనెంతటి మూర్ఖురాలను. వెదురుకర్రలతో కూడి వాసముపై, స్తంభములపై నిలచియున్న గృహమువలె ఈ శరీరము ఎముకలతో నిర్మింపబడి యున్నది. చర్మముతో, రోమ నఖములతో ఇది కప్పబడియున్నది. నశ్వరమైనది. నవద్వారములతో ఒప్పుచున్నది. మలమూత్రములతో నిండియున్నది. హేయమైన ఇట్టి శరీరమును నేను తప్ప మరియొక ఏ స్త్రీ అయిననూ కోరుకొనునా, సేవించునా? జీవన్ముక్తులకు నిలయమైనది ఈ విదేహనగరము. ఈ నగరములోని వారందరిలోనూ నేనే పరమ మూర్ఖురాలను, దుష్టురాలను. ఆత్మానందప్రదాతయు, శాశ్వతుడైన పరమాత్మను కాదని ఇతర పురుషులను వాంఛించుచున్నది నేను ఒక్కతెనే. సకలప్రాణులయందును అంతర్యామియై వెలుగొందుచుండుటవలన ఆ పరమాత్ముడు ఎల్లరకునూ మిగుల ప్రియతముడు. హితైషి, ప్రభువు. కనుక, ఆ పరమపురుషునకు నా ఆత్మను సమర్పించి అనగా ఆత్మార్పణ గావించి, ఆ స్వామిని వశపరచుకొందును. లక్ష్మీదేవివలె ఆయనతో కూడి పరమానందమును పొందెదను. విషయభోగములు అశాశ్వతములు, వాటిని కలిగించువారలు మానవులైనను, దేవతలైననూ కాలగర్భంలో కలిసిపోయెడివారే. వారిని సేవించెడి భార్యలకు వారు ఏమాత్రము సుఖములను పంచి ఇవ్వగలిగిరి. వాస్తవముగా ఎవ్వరునూ సుఖభోగముల వలన తృప్తిని పొందజాలరు అని ఈవిధముగా ఆ పింగళి అను వేశ్య తనలో తాను తలపోయుచుండెను. పూర్వజన్మలో నేను తప్పక ఏదో ఒక పుణ్యకార్యమును చేసికొనియే యుండవచ్చును. అందువల్లనే సర్వేశ్వరుడైన శ్రీమహావిష్ణువు నా యెడల ప్రసన్నుడయ్యెను. నా దురాశ ఫలితముగనే

ఈ వైరాగ్యము కలిగిననూ ఇది వాస్తవముగా నాకు సుఖావహమే అయినది. నిజముగా నేను దురదృష్టవంతురాలనే అయినచో నా ఈ క్లేశములవలన నాకు వైరాగ్యము కలిగియుండెడిది కాదు. వైరాగ్యము కలుగుటవల్లనే మానవులు సంసారబంధములను ఛేదించుకొని పరమశాంతిని పొందగలరు. భగవదనుగ్రహంతో నాకు ఈ వైరాగ్యము కలిగినది. ఆ స్వామి చేసిన ఉపకారమును సాదరముగా స్వీకరించుచున్నాను. అందువలన విషయసుఖములయందలి దురాశలను పరిత్యజించి ఆ సర్వేశ్వరుని త్రికరణశుద్ధిగా శరణుజొచ్చుచున్నాను అని ఆ పింగళ యను వేశ్య ఇట్లు నిశ్చయించుకొనినదై, విటులను సంతృప్తిపరచు ధనమును సంపాదింపవలెనను దురాశను పూర్తిగా విడచిపెట్టి ప్రశాంతచిత్త యయ్యెను. పిమ్మట ఆమె ఎట్టి చీకూ, చింతా లేకుండా కంటినిండా నిదురపోయెను. కావున, సకలవిషయములనుండి విరక్తుడై ఈ జగత్తంతయునూ కాలసర్పముచే గ్రసింపబడుచుండునని ఎఱింగినవాడు, అప్రమత్తుడై, మిగుల జాగరూకుడై తనను రక్షించువాడు పరమాత్ముడు మాత్రమే అని గ్రహింపవలెను. పింగళ అను వేశ్య పరపురుషులపై ఆశను వదలుకొనుటతో హాయిగా నిదురింపగలిగెను. **ఆశయే పరమదుఃఖము. వైరాగ్యమే పరమ సుఖము. (ఆశా హి పరమం దుఃఖం నైరాశ్యం పరమం సుఖం). ఇదియే పింగళ వృత్తాంతము వలన గ్రహింపదగిన చక్కని నీతి.**

పద్దెనిమిదవది కురరము అను పక్షి. (లకుముకి పిట్ట) ఒక కురరము అను పక్షి ఒక మాంసపు ముక్కను తన నోటకరచుకొని పోవుచుండెను. అప్పుడా మాంసమును ఆశించునట్టి బలమైన కొన్ని పక్షులు ఆ మాంసపు ముక్క కొరకు ఈ కురర పక్షిపై విరుచుకొనిపడి హింసింపసాగెను. అంతట ఆ పక్షి తన నోటిలోని మాంసపు ముక్కను వదలివేసి తనను తాను రక్షించుకొని హాయిగా వుండెను. కనుక, వస్తు సంగ్రహము ఆపదలకు మూలము అని తెలియవలెను. సహజముగా మానవులు తమకు ఇష్టమైన వస్తువులను సమకూర్చుకొనుటకు మిగుల ఆరాటపడుచుందురు. కానీ, అది వారికి దుఃఖహేతువే యగును. అకించనుడైన (నిష్కామ్యుడగు) విద్వాంసుడు అనంతసుఖమును పొందును. **శ్రేయస్సును కోరువాడు దేనినీ పరిగ్రహింపరాదు అని ఈ కురర పక్షియొక్క దృష్టాంతము వలన గ్రహింపవలెను.**

పంతొమ్మిదవది శిశువు. ఒక శిశువు ఏమాత్రమూ చీకూ, చింత లేకుండా తనలో తాను క్రీడించుచూ ఆనందించుచుండును. ఆ శిశువునకు ఎటువంటి కోరికలు వుండవు. మానావమానముల జోలియే పట్టదు. ఎటువంటి బంధములు లేవు. ఏ దుఃఖమునకు లోనుగాదు. ఎటువంటి మాయామర్మములెరుగని శిశువులు లేక, గుణాతీతులు అయినవారు మాత్రమే చింతారహితులై హాయిగా వుందురు. ఆ రెండు కోవలకు చెందినవారు మాత్రమే పరమానందమును పొందుచుందురు. కనుక, **యోగికూడా శిశువువలె ఉండవలెనని పసిబాలురను చూచి నేను గ్రహించితిని.**

ఇరువదియవది కన్య. ఒక ఊరిలో గల ఒక గృహస్థు ఇంటిలో యుక్తవయస్కురాలైన కన్య యుండెను. ఆ కన్యను వరించుటకై పెండ్లిచూపుల కొరకు వరుడు, అతని బంధువులు ఆమె ఇంటికి వచ్చిరి. అప్పుడు ఇంటిలోగల పెద్దలు అనగా తల్లిదండ్రులు మొదలగువారు బయటికి వెళ్ళియుండిరి. కనుక, ఆమెయే వారికి అతిథి సత్కారములు

చేసెను. రాజా! వచ్చిన అతిథులకు ఆహారమును సిద్ధపరచుటకై ఆమె ఇంటిలోపల ధాన్యమును ఒంటరిగా దంచసాగెను. అప్పుడు ఆమె చేతికి గల గాజులు ఘల్లు ఘల్లుమని పెద్దగా ధ్వని చేయసాగెను. అంతట బుద్ధిశాలిని అయిన ఆ కన్య స్వయముగా ధాన్యమును దంచుట అవమానముగా భావించి మిగుల సిగ్గుపడెను. అందువలన ఆమె తన చేతులకుగల గాజులను ఒక్కొక్కటిగా పగులగొట్టెను. ఒక్కొక్క చేతియందు రెండేసి గాజులు మాత్రమే మిగిలియుండెను. పిమ్మట ఆమె ధాన్యము దంచుటకు మొదలిడగా, ఆ రెండు గాజులునూ ఘల్లుఘల్లుమని ధ్వనింపసాగెను.

అంతట ఆ కన్య తన చేతులయందలి మరొక్క గాజును పగులగొట్టెను. అప్పుడు ఒక్కో చేతికి ఒక్కో గాజు మాత్రమే మిగిలియుండెను. పిమ్మట ఆమె ధాన్యము దంచుచుండిననూ ఎట్టి ధ్వనియూ రాకుండెను. యదుమహారాజా! అట్టి సమయమున నేను జనుల తీరుతెన్నులను పరిశీలించుటకై అటూ ఇటూ సంచరించుచూ అచటికి చేరుకొంటిని. ఆ కన్య యొక్క వృత్తాంతమునుండి నేను గ్రహించిన విషయమేమనగా, సమస్య ఏర్పడినపుడు సమయస్ఫూర్తితో దానినుండి బయటపడవలెను. పెక్కుమంది కూడినచోట కలహము తప్పక జరిగితీరును. ఇద్దరున్నచో వ్యర్థ ప్రసంగములు చోటు చేసుకొనును. **అందువలన ఆ కన్య యొక్క చేతి గాజువలె ఒక్కరే సంచరించుట ఉత్తమము. యోగియైనవాడు ఒక్కడే ఒంటరిగా – ఏకాంతముగా ఉండుట ఉత్తమమని నేను గ్రహించితిని.**

ఇరవై ఒకటవ గురువు బాణాకారుడు అనగా కమ్మరివాడు. నేనొక బాణమును సిద్ధపరచువానిని గమనించితిని. బాణములను తయారు చేయునపుడు అతడు తన పనియందే మనసును లగ్నము చేసి వుండుటవలన ఆ ప్రక్కనుండి ఒకరాజు తన సైన్యముతో వెళ్లుచుండిననూ అతడు గమనింపలేదు. **సాధకుడు ఏకాగ్రచిత్తుడై కార్యమునందు నిమగ్నుడై యుండవలెనని ఈ బాణాకారుని వృత్తాంతమువలన మనకు బోధపడుచున్నది.**

ఇరువది రెండవది సర్పము. జనుల సవ్వడికి భయపడి సర్పము వాళ్ళకు దూరముగా నివాసముండును. ఎప్పుడూ అది ఒకేచోట వుండదు. తానెక్కడ వుంటున్నదీ మరెవ్వరికీ తెలియకుండా నిశ్శబ్దంగా, రహస్యంగా వుండును. అశాశ్వతమైన ఈ శరీరముకొరకు శాశ్వతమైన ఒక నిలయము ఏర్పాటుచేసుకొనుట ఎందుకని, చీమలు పెట్టిన పుట్టలలో చేరి సర్పము హాయిగా నివసించును. అట్లే మునీశ్వరుడు ఒంటరిగా ఏకాంతముగనే జీవింపవలెను. తన చుట్టూరా ఎట్టి గుంపునూ చేర్చుకొనకూడదు. తన నివాసస్థానముపై మమకారము లేకుండా జాగరూకుడై యుండవలెను. నిర్జన ప్రదేశములోగల గుహలో నివసింపవలెను. తన యొక్క ఆచార వ్యవహారముల ద్వారా తన ఉనికిని మరెవ్వరికినీ తెలియనీయకుండా వుండవలెను. మితభాషియై యుండవలెను. అనిత్యమైన ఈ శరీరము కొరకు శ్రమపడి గొప్ప గొప్ప గృహముల నిర్మాణము చేయుట వ్యర్థమని తలంచవలెను. కనుక, **యోగియైనవాడు సర్పమును గమనించి శాశ్వత నివాసమేర్పరచుకొనకుండా జనులకు దూరముగా నివసించవలెనని నేను గ్రహించితిని.**

ఇరువది మూడవది సాలెపురుగు. సాలెపురుగు తననుండి వెలువడిన దారము ద్వారా గూడును అల్లుకొని అందులోనే విహరించుచుండును.

తరువాత దానినే మ్రింగివేయును. అట్లే పరమేశ్వరుడు కూడా ఈ జగత్తును తననుండియే ఉత్పన్నము చేయును. జీవుల రూపములో ఈ జగత్తునందు విహరించుచుండును. పిమ్మట దానిని తనలోనే సాలెపురుగు వలె లయమొనర్చుకొనును. ఇట్టి జ్ఞానము సాలెపురుగు చర్యను చూచి నేను గ్రహించితిని.

ఇరువది నాలుగవది భ్రమరము. భ్రమరము ఒక పురుగును తీసుకొని వచ్చి ఒక గోడ రంధ్రములో వుంచి, దాని చుట్టూరా తిరుగుచూ ఝుంకారము చేయుచుండును. ఆ భ్రమరమునకు భయపడి ఈ కీటకము సర్వదా ఆ భ్రమరమునే ధ్యానించుచుండును. తత్ఫ్రభావమున ఆ కీటకము తన పూర్వ శరీరమును త్యజింపకయే ఆ భ్రమరము యొక్క రూపమును పొందును. అట్లే మానవులు కూడా భయముచేతగాని, స్నేహముచేతగాని, ద్వేషముచేతగాని, తమ తమ మనస్సులను దేనియందు లగ్నము చేయుదురో, నిరంతరము దేనిని ఏ రూపమును, భావమును ధ్యానము చేయుదురో, అట్టి భావమునే వారు పొందెదరు. **నిరంతరము ధ్యానము చేయుటవలన కీటకానికే ఇతర రూపము లభించినప్పుడు తదేకమైన గానము వలన మానవులకు దేహాంతరమున సారూప్యముక్తి కలుగుచుండుననుటలో ఎంతమాత్రము సందేహము లేదని భ్రమరము వలన నేను నేర్చుకొంటిని.** మానవుడు ఎల్లప్పుడూ పరమాత్మను భక్తితో చింతించుచున్నచో, అతడు క్రమముగా ఆ పరమాత్మ రూపమునే పొందును అని భ్రమరము నుండి ఈ స్ఫూర్తిని పొందితిని.

యదుమహారాజా! ఈవిధముగా ఈ ఇరువదినాలుగు మంది గురువుల నుండి అద్భుతమైన ఉపదేశములను పొందితిని. నేను ఈ దేహముద్వారా పొందిన ఉపదేశములను తెలిపెదను వినుము. ఈ దేహమును నేను గురువుగా భావింతును. దీనివలననే నాకు విరక్తి, వైరాగ్యము సిద్ధించినది. వాస్తవముగా ఇది పరిణామశీలమైనది. జన్మమరణములు కలది. ఎల్లప్పుడూ ఈ దేహమువలన దుఃఖములే ప్రాప్తించుచుండును. కానీ, దీనివలన ఒక చక్కని ప్రయోజనము కూడా కలదు. ఈ దేహము ద్వారానే నేను పరమాత్మను ధ్యానింపగలను. ఏదో ఒకనాడు ఈ దేహము కుక్కలకు, నక్కలకును ఆహారమగును. కనుక, ఇది నాది కాదు అను భావముతో దీనిపై ఆసక్తిని వదలిపెట్టి చరించవలెను. మానవుడు తన ఐహిక సుఖములకొరకై భార్యాపుత్రులను, సంపదలను, పశువులను, సేవకులను, ఇండ్లను, వాకిండ్లను బంధుమిత్రులను సమకూర్చుకొనుచూ వారిని పోషించుచుండును. అందుకొరకై పెక్కు శ్రమలకోర్చుచూ బ్రతికియున్నంత వరకూ కష్టములపాలగును. అంతేగాక, వృక్షము మరల వృక్షముగా పుట్టుటకై బీజనిర్మాణము చేసికొని నశించునట్లు, మానవుడు జన్మాంతరమునకై కర్మరూప బీజమును సిద్ధపరచుకొని తనువును చాలించును. ఈవిధముగా దేహము నశించిననూ అతడు జననమరణ చక్రములో పరిభ్రమించుచూ దుఃఖముల పాలగుచునే యుండును.

కావున, పరమాత్మ తన అచింత్య శక్తియైన మాయద్వారా వృక్షములను, సరీసృపములను, పశువులను, పక్షులను, కోరలచే బాధించెడి క్రూరమృగములను, మత్స్యాది జలజంతువులను సృష్టించెను. అయిననూ ఆ పరమాత్మకు తృప్తి కలుగకుండెను. అంతట బ్రహ్మసాక్షాత్కారమును పొందుటకు యోగ్యమైన బుద్ధిబలముగల మనుష్యుని కూడా సృజించి

సంతోషపడెను. అందువలన మానవుడు ఇంద్రియములకు వశవర్తుడు కాక సాత్త్విక జీవిత సాధనములద్వారా దైవసాక్షాత్కారము కొరకు ప్రయత్నింపవలెను. మానవ శరీరము అత్యంత దుర్లభమైనది. పెక్కు జన్మల అనంతరము అనంతమైన భగవంతునికృపవలన ఈ మానవ దేహము ప్రాప్తించెను. ఇది పరమపురుషార్థమైన మోక్షమును పొందుటకు సాధనము. అయిననూ, ఇది అనిత్యము. **కావున జ్ఞానియైనవాడు అమూల్యమైన ఈ మానవ జన్మ లభించినందులకు, ఈ శరీరమును మృత్యువు కబళించక ముందే భగవత్ప్రాప్తి రూపమైన తన శ్రేయస్సు కొరకు పాటుపడవలెను. విషయసుఖములు ఇతర ప్రాణులకునూ సహజములు. మానవుడు తన అమూల్యమైన జీవితమును వాటికొరకై వృధా చేయరాదు.**

యదుమహారాజా! ఈవిధముగా పెక్కుమంది గురువుల నుండి ఉపదేశమును పొందినమీదట నాలో గొప్ప వైరాగ్యము ఏర్పడినది. అంతఃకరణమునందు విజ్ఞానము అంకురించినది. బంధములు తొలగిపోయినవి. దేహాత్మాభిమాన రహితుడనై స్వేచ్ఛగా సంచరించుచున్నాను. రాజా! సద్గురువు నుండి పొందిన జ్ఞానము పూర్ణముగా బోధపడదు. అది స్థిరముగా వుండదు. అది పూర్తిగా బోధపడుటకుగాను, గురువునుండి తాను విన్న జ్ఞానమును నిరంతరము చక్కగా చింతనము, మననము చేయుచుండవలయును.

శ్రోతవ్యో మంతవ్యో నిధిధ్యాసితవ్యః - అని ఇందుకొరకే ఒక విధివాక్యము చెప్పబడినది. రెండవదిలేని ఒకే ఒక అద్వితీయమైన బ్రహ్మతత్త్వమును గూర్చి పెక్కుమంది ఋషులు పలురీతులుగా వర్ణించియున్నారు. కనుక నీవు స్వయముగా చింతన చేసి ఒక నిర్ణయమునకు రానియెడల బ్రహ్మయొక్క నిజస్వరూపమును తెలిసికొనుట మిగుల దుర్లభమగును అని దత్తాత్రేయ భగవానుడు యదుమహారాజుగారికి తన ఉపదేశమును విశదముగా వివరించి చెప్పెను.

అంతట శ్రీకృష్ణభగవానుడు తిరిగి ఉద్ధవునితో ఇట్లు పలికెను - "ప్రియమైన ఉద్ధవా! అపారజ్ఞానసంపన్నుడైన అవధూతయగు దత్తాత్రేయుడు ఈవిధముగా ఉపదేశించెను. యదుమహారాజు ఆయనను పలువిధములుగా పూజించి ప్రణమిల్లెను". అంతట దత్తాత్రేయుడు ప్రసన్నుడై ఆ మహారాజును వీడ్కొని యథేచ్ఛగా వెళ్ళిపోయెను. యదుమహారాజు మా వంశమువారిలో అత్యంత ప్రాచీనుడు. అవధూత ఉపదేశమును విన్న పిదప సర్వసంగపరిత్యాగియై ఆతడు సమదర్శి అయ్యెను. శీతోష్ణసుఖదుఃఖాది ద్వంద్వములకు అతీతుడై సకలప్రాణుల లోనూ భగవంతుని దర్శించి ముక్తుడయ్యెను.

|| హరయే నమః ||

ఇది శ్రీవేదవ్యాసమహర్షిచే రచింపబడిన శ్రీమద్భాగవత మహాపురాణము నందలి ఏకాదశ స్కంధమునగల 7వ, 8వ, 9వ అను మూడు అధ్యాయములలో వివరింపబడిన అవధూతోపాఖ్యానము ఇందులో సంగ్రహముగా పేర్కొనబడినది.

**|| శ్రీ మద్భాగవతమహాపురాణమునందలి
అవధూతోపాఖ్యానము సంపూర్ణము ||**

◆ ◆ ◆

దత్తాత్రేయోపనిషత్తు

(అథర్వణ వేద అంతర్గతము)

శ్లో ॥ దత్తాత్రేయ (యా) బ్రహ్మావిద్యా సంవేద్యానంద విగ్రహమ్ ।
త్రిపా న్నారాయణాకారం దత్తాత్రేయ ముపాస్మహే ॥

(శ్రీ దత్తాత్రేయస్వామి అధిష్ఠాన దేవతగా ఉన్న బ్రహ్మ విద్యను బాగుగా తెలిసికొని, బ్రహ్మావిష్ణు శివాత్మక నారాయణ స్వరూపుడైన శ్రీదత్తాత్రేయుని ధ్యానించుచున్నాను.)

అథ శాంతి మంత్రమ్

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః
భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః । స్థిరైరంగైస్తుష్టువాగ్ం
సస్తనూభిః వ్యశేమ దేవహితం యదాయుః ॥
స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః । స్వస్తినఃపూషా విశ్వవేదాః ।
స్వస్తిన స్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తినో బృహస్పతిర్ దధాతు ॥
ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః ॥

(శాంతి మంత్ర భావము)

ఓ దేవతలారా! మేము ఎల్లప్పుడు మా చెవులతో భగవత్సంబంధమైన, శుభప్రదమైన మంచి మాటలనే విందుముగాక! మేము మా కళ్ళతో మంగళకరమైన, శుభప్రదమైన వాటినే చూచెదము గాక! చక్కని దృఢమైన అవయములతో మా జీవితకాల పర్యంతము ఆరోగ్యవంతమైన దేహమును కలిగి మీ దివ్యమైన సోత్రములను గానము చేయుచూ, నిరంతరం ఆరాధ్య దైవమగు భగవత్సేవకై జీవించెదము గాక!

సర్వత్ర వ్యాపించియున్న చక్కని కీర్తిమంతుడగు ఇంద్రుడు మాకు మేలును చేకూర్చును గాక! సర్వజ్ఞుడైన సూర్యుడు మాకు శుభములను ప్రసాదించునుగాక! అరిష్టములను నశింపచేసి ఆపదల నుండి కాపాడే చక్ర సదృశమగు శక్తిమంతుడైన గరుత్మంతుడు శుభముల నొసగునుగాక! దేవ గురువు (బుద్ధికి స్వామి) ఐన బృహస్పతి మాకు సకల శుభాలను అనుగ్రహించుగాక!

మా అందరికి ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికములు అనెడు త్రివిధతాపముల నుండి సంపూర్ణమైన శాంతి లభించునుగాక!!

అథ దత్తాత్రేయోపనిషత్

ప్రథమ ఖండః

హరిః ఓమ్ ॥ సత్యక్షేత్రే బ్రహ్మా నారాయణం
మహాసామ్రాజ్యం కిం తారకం తన్నో బ్రూహీత్యువాచ ।
భగవన్నిత్యుక్తః సత్యానంద చిదాత్మకం సాత్త్వికం
మామకం ధామోపాస్వేత్యాహ । సదా దత్తోఽహ మస్మీతి
ప్రీత్యే తత్సంవదంతి యే నతే సంసారిణో భవంతి ।
నారాయణేనైవం వివక్షితో బ్రహ్మా విశ్వరూపధరం
విష్ణుం నారాయణం దత్తాత్రేయం ధ్యాత్వా సద్వదతి ।
దమితి హంసః । దామితి దీర్ఘం । తద్బీజం
నామ బీజస్థమ్ । దామిత్యే కాక్షరం భవతి ।
తదే తత్తారకం భవతి । తదేవోపాసితవ్యం
విజ్ఞేయం గర్భాది తారణమ్ । గాయత్రీ ఛందః ।

సదాశివ ఋషిః । దత్తాత్రేయో దేవతా ।
వటబీజస్థ మివ దత్తబీజస్థం సర్వం జగత్ ।
ఏత దేవైకాక్షరం వ్యాఖ్యాతమ్ ॥

వ్యాఖ్యాస్యే షడక్షరమ్ । ఓమితి ప్రథమం ।

శ్రీమితి ద్వితీయం । హ్రీమితి తృతీయం । క్లీమతి చతుర్థం । గ్లౌమితి పంచమం । ద్రామితి షష్ఠం । షడక్షరో౽యం భవతి । సర్వ సంపద్వృద్ధికరో భవతి । యోగానుభవో భవతి । గాయత్రీ ఛ్ఛందః । సదాశివ ఋషిః । దత్తాత్రేయో దేవతా । ద్రమిత్యుక్త్వా – ద్రామిత్యుక్త్వా వా దత్తాత్రేయాయ నమ ఇత్యష్టాక్షరః ॥ దత్తాత్రేయా యేతి సత్యానంద చిదాత్మకమ్ । నమ ఇతి పూర్ణానందక విగ్రహమ్ । గాయత్రీ ఛందః । సదాశివ ఋషిః । దత్తాత్రేయో దేవతా । దత్తాత్రేయా యేతి కీలకమ్ । తదేవ బీజం । నమః శక్తిర్భవతి । ఓమితి ప్రథమమ్ । ఆమితి ద్వితీయమ్ । హ్రీమితి తృతీయమ్ । క్రోమితి చతుర్థమ్ । ఏహీతి తథైవ వదేత్, దత్తాత్రేయేతి స్వాహేతి మంత్ర రాజో౽యం ద్వాదశాక్షరః ॥ జగతీ ఛందః । సదాశివ ఋషిః । దత్తాత్రేయో దేవతా । ఓమితి బీజం । స్వాహేతి శక్తిః । సంబుద్ధిరితి కీలకం । ద్రమితి హృదయే । హ్రీం క్లీమితి శీర్షే । ఏహీతి శిఖాయామ్ । దత్తేతి కవచే । ఆత్రేయేతి చక్షుషి । స్వాహేత్యస్త్రే । తన్మయో భవతి । య ఏవం వేద ॥

షోడశాక్షరం వ్యాఖ్యాస్యే । ప్రాణం దేయమ్ । మానం దేయమ్ । చక్షుర్దేయమ్ । శ్రోత్రం దేయమ్ । షడ్దశ శిరశ్ఛినత్తి షోడశాక్షర మంత్రో నదేయో భవతి । అతి సేవా పర భక్త గుణ పచ్ఛిష్యాయ వదేత్ । ఓమితి ప్రథమం భవతి । ఐమితి ద్వితీయమ్ । క్రోమితి తృతీయమ్ । క్లీమితి చతుర్థమ్ । క్లూమితి పంచమమ్ । హ్రామితి షష్ఠమ్ । హ్రీమితి సప్తమమ్ । హ్రూమిత్యష్టమమ్ । సౌరితి నవమమ్ । దత్తాత్రేయాయేతి చతుర్దశమ్ । స్వాహేతి షోడశమ్ । గాయత్రీ ఛందః । సదాశివ ఋషిః । దత్తాత్రేయో దేవతా । ఓం బీజమ్ । స్వాహా శక్తిః । చతుర్థ్యంతం కీలకమ్ । ఓమితి హృదయే । క్లాం, క్లీం, క్లూమితి శిఖాయామ్ । సౌరితి కవచే । చతుర్థ్యంతం చక్షుషి । స్వాహేత్యస్త్రే । యో నిత్యమధీయానః సచ్చిదానంద సుఖీ మోక్షీ భవతి । సౌరిత్యం తే శ్రీ వైష్ణవ ఇత్యుచ్యతే । తజ్జాపీ విష్ణురూపీ భవతి ॥

అనుష్టుమ్ ఛందో వ్యాఖ్యాస్యే । సర్వత్ర సంబుద్ధిరిమా నీత్యుచ్యంతే । దత్తాత్రేయ హరే కృష్ణ ఉన్మత్తానంద దాయక । దిగంబరమునే బాల పిశాచ జ్ఞానసాగర ॥ అనుష్టుప్ ఛందః । సదాశివ ఋషిః । దత్తాత్రేయో దేవతా। దత్తాత్రేయేతి హృదయే । హరేకృష్ణేతి శీర్షే। ఉన్మత్తానందేతి శిఖాయామ్ । దాయక మున ఇతి కవచే। దిగంబరేతి చక్షుషి। పిశాచ జ్ఞానసాగరేత్యస్త్రే । అనుష్టుభో౽యం మయా౽ధీతః । ఆబ్రహ్మ జన్మదోషాశ్చ ప్రణశ్యంతి । సర్వోపకారీ మోక్షీ భవతి । య ఏవం వేద । ఇత్యుపనిషత్ ॥ ఇతి ప్రథమ ఖండః ॥

అథ ద్వితీయ ఖండః

ఓమితి వ్యాహరేత్। ఓం నమో భగవతే దత్తాత్రేయాయ । స్మరణమాత్ర సంతుష్టాయ । మహాభయ నివారణాయ । మహాజ్ఞాన ప్రదాయ । చిదానందాత్మనే। బాలోన్మత్త పిశాచ వేషాయేతి। మహాయోగినే అవధూతా యేతి । అనసూయానంద వర్ధనాయాత్రి పుత్రాయేతి । సర్వకామ ఫలప్రదాయ । ఓమితి వ్యాహరేత్ । భవబంధ మోచనాయేతి । ఆమితి వ్యాహరేత్ । అసాధ్య సాధనాయేతి । హ్రీమితి వ్యాహరేత్ । సకల విభూతి దాయేతి । క్రోమితి వ్యాహరేత్ । సాధ్యాకర్షణాయేతి । ఐమితి వ్యాహరేత్ ,

వాక్య ప్రదాయేతి । క్లీమితి వ్యాహరేత్ । జగత్ వశీకరణాయేతి । సౌరితి వ్యాహరేత్ । సర్వ మనఃక్షోభణాయేతి । శ్రీమితి వ్యాహరేత్ । మహా సంపత్ప్రదాయేతి । గ్లౌమితి వ్యాహరేత్ । భూమండలాదిపత్య ప్రదాయేతి । ద్రామితి వ్యాహరేత్ చిరంజీవినే । వషడితి వ్యాహరేత్ । వశీకురు వశీకురు । వౌషడితి వ్యాహరేత్ । అకర్షయాకర్షయ । హుమితి వ్యాహరేత్ । విద్వేషయ విద్వేషయ । ఫడితి వ్యాహరేత్ । ఉచ్చాట యోచ్చాటయ । ఠఠేతి వ్యాహరేత్ । స్తంభయ స్తంభయ । ఖఖేతి వ్యాహరేత్ । మారయ మారయ । నమః సంపన్నాయ నమః సంపన్నాయ స్వాహా । పోషయ పోషయ । పరమంత్ర పరయంత్ర పరతంత్రాశ్ఛింది ఛింది । గ్రహాన్నివారయ నివారయ । వ్యాధీన్ వినాశయ వినాశయ । దుఃఖం హారయ హారయ । దారిద్ర్యం విద్రావయ విద్రావయ । దేహం పోషయ పోషయ । చిత్తం తోషయ తోషయ । సర్వమంత్ర సర్వయంత్ర, సర్వతంత్ర సర్వపల్లవ స్వరూపాయేతి ఓం నమశ్శివాయేత్యుపనిషత్ ॥ ఇతి ద్వితీయ ఖండః ॥

అథ తృతీయ ఖండః

య ఏవం వేద । అనుష్టుప్ ఛందః । సదాశివ ఋషిః । దత్తాత్రేయో దేవతా । ఓమితి బీజమ్ । స్వాహేతి శక్తిః । ద్రామితి కీలకమ్ । అష్టమూర్త్యష్ట మంత్రా భవంతి । యో నిత్యమధీతే వాయ్వగ్ని సోమాదిత్య బ్రహ్మ విష్ణు రుద్రైః పూతో భవతి । గాయత్ర్యా శ్శత సహస్రం జప్తో భవతి । మహారుద్ర శత సహస్రజాపీ భవతి । ప్రణవాయుతకోటి జప్తో భవతి శత పూర్వాన్ శతాపరాన్ పునాతి । స పంక్తి పావనో భవతి । బ్రహ్మహత్యాది పాతకై ర్ముక్తో భవతి । గోహత్యాది పాతకై ర్ముక్తో భవతి । తులా పురుషాది దానైః ప్రపాపానతః పూతో భవతి । అశేష పాపాన్ ముక్తో భవతి । అభక్ష్య భక్షణ పాపైర్ముక్తో భవతి । సర్వ మంత్ర యోగ పారీణో భవతి । స ఏవ బ్రాహ్మణో భవతి । తస్మాచ్ఛిష్యం భక్తం ప్రతిగృహ్ణీయాత్ । సోఽనంత ఫలమశ్నుతే । సజీవన్ముక్తో భవతీత్యాహ భగవన్నారాయణో బ్రహ్మాణ మిత్యుపనిషత్ ॥

ఓం భద్రం కర్ణేభిః……………దధాతు ॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

॥ ఇతి దత్తాత్రేయోపనిషత్ ॥

దత్తాత్రేయోపనిషత్తు

(ప్రథమ ఖండము యొక్క భావము)

తా॥ సత్యలోక నివాసుడగు బ్రహ్మదేవుడు ఒకనాడు శ్రీమన్నారాయణుని (పరబ్రహ్మ తత్త్వమును) దర్శించి "సంసార తారకమైన మోక్ష సామ్రాజ్యము ఏది?" చెప్పుమని అడిగెను. అందుకు **శ్రీమన్నారాయణుడు ఇట్లు నుడివెను-** "సత్యానంద చిదాత్మకమైన సాత్త్వికమైన లక్షణములు గల నా అవతారమును ఉపాసింపుము. ఎవరైతే నన్నే దత్తుడని గ్రహించి నిరంతరము ప్రేమతో ఉచ్ఛరించెదరో, వారు సంసార బాధితులు కారు." అంతట బ్రహ్మ విశ్వరూపధరుడు, సర్వత్ర వ్యాపించియున్నవాడగు శ్రీమన్నారాయణుని (నిర్గుణ జ్ఞానరూపము) వ్యక్తరూపమును అయిన దత్తాత్రేయుని ధ్యానించెను. **తదుపరి బ్రహ్మ ఇట్లు పలికెను-** 'దం' అను హంస (ఇది దత్తమంత్రములకు ప్రాణము వంటిది), దీర్ఘముతో కూడిన 'దాం' అను అక్షరము దత్త నామబీజము. 'దాం' అను ఇదియే ఏకాక్షర మంత్రము. ఇదే తారక మంత్రము. ఈ మంత్రమునే ఉపాసించవలెను. ఇక గర్భ తారణము అనగా దీని అర్థమును మన అనుభవములోనికి తెచ్చుకొనవలెను.

ఈ **"దం"** లేక **"దాం"** అను ఏకాక్షర మంత్రమునకు ఛందస్సు గాయత్రి, ఋషి సదాశివుడు, దేవత దత్తాత్రేయుడు అని గ్రహించవలెను. మర్రి విత్తనము నందు ఒక మర్రిచెట్టు సూక్ష్మరూపమున ఎట్లు ఇమిడి యుండునో, అట్లే దత్తబీజము నందు ఈ సమస్త విశ్వము ఇమిడియున్నది. ఇదియే ఏకాక్షర మంత్ర వ్యాఖ్యానము.

ఇక షడక్షర మంత్ర వ్యాఖ్యానము. ఇందులో ఆరు అక్షరములుండును. వాటిలో మొదటిది 'ఓం', రెండవది 'శ్రీం', మూడవది 'హ్రీం', నాల్గవది 'క్లీం', ఐదవది ' గ్లౌం', ఆరవది 'ద్రాం', అనగా 'ఓం శ్రీం హ్రీం క్లీం గ్లౌం ద్రాం' అను ఆరు అక్షరాలతో ఈ మంత్రము కూడియుండును. ఈ మంత్రోపాసనము సమస్త సంపదలను వృద్ధి చేయును. యోగానుభవమును ప్రసాదించును. ఈ మంత్రమునకు సదాశివుడు ఋషి, దత్తాత్రేయుడు దేవత. గాయత్రీ ఛందస్సు. 'ద్రం' అనిగానీ, 'ద్రాం' అనిగానీ చేర్చి దత్తాత్రేయాయ నమః (ద్రం **లేక** ద్రాం **దత్తాత్రేయాయ నమః**) అనేది అష్టాక్షరీ మంత్రము అగును. దీనిని మరొక విధంగా "ద్రం **లేక** ద్రాం **దత్తాత్రేయాయ సత్యానంద చిదాత్మకం పూర్ణానందైక విగ్రహాం నమః** " అని కూడా ఉపాసించవచ్చును. ఈ మంత్రానికి సదాశివుడు ఋషి, దత్తాత్రేయుడు దేవత. 'ద్రం' లేక 'ద్రాం' అనునది బీజం. నమః – అనేది శక్తి, దత్తాత్రేయాయ అనేది కీలకం. "ఓం **అం** హ్రీం క్రోం ఏహి **దత్తాత్రేయాయ స్వాహా**" అనేది ద్వాదశాక్షర మూల మంత్రం. ఇది దత్తమంత్రము లన్నింటిలో కెల్ల శ్రేష్ఠమైనది. ఈ మంత్రమునకు సదాశివుడు ఋషి, దత్తాత్రేయుడు దేవత. జగతీ ఛందస్సు. ఓం బీజము, స్వాహా శక్తి, దత్తాత్రేయ అనేది కీలకము. ఇక న్యాసము – 'ద్రం' అని హృదయము నందు, "**హ్రీం క్లీం**" అని శిరస్సునందు, "**ఏహి**" అని శిఖ యందు, "**దత్త**" అని కవచమునందు, "**అత్రేయ**" అని నేత్రములందు, "**స్వాహా**" అని అస్త్రము నందు తాకవలెను. ఈ విధంగా కరన్యాసము, హృదయాదిన్యాసమును చేయవలెను. ఇట్లు చేసినవాడు తన్మయుడై దత్తాత్రేయుడంతటివాడు అగును. ఇక దత్తుడి షోడశాక్షరీ మంత్రమును గురించి వ్యాఖ్యానించెదను. మన యొక్క ప్రాణమును గానీ, మానమును గానీ, నేత్రములను గానీ, చెవులను గానీ, ఎవరికైననూ ఈయవచ్చును. అయితే, పదహారుసార్లు శిరస్సును ఖండించిననూ ఈ షోడశాక్షరీ మహా మంత్రమును ఎవరికీ ఈయరాదు. ఉత్తముడు, గుణవంతుడు అయిన శిష్యునికి మాత్రమే ఈ మంత్రాన్ని ఉపదేశించవలెను. ఈ మంత్రంలో "**ఓం ఐం క్లాం క్లీం క్లూం హాం హ్రూం సౌః దత్తాత్రేయాయ స్వాహా**" అను పదహారు బీజములున్నవి. దీనికి ఋషి సదాశివుడు , దేవత దత్తాత్రేయుడు, ఛందస్సు గాయత్రీ. ఓం బీజము, స్వాహా శక్తి, దత్తాత్రేయుడు అనేది కీలకముగా తెలియాలి.

ఇక దీని హృదయాదిన్యాసములు ఇట్లుండును. 'ఓం' అని హృదయమును, '**క్లాం క్లీం క్లూం**' అని శిఖను తాకాలి. '**సౌః**' అని కవచమును, '**దత్తాత్రేయాయ**' అని నేత్రములను స్పృశించవలెను. '**స్వాహా**' అనేది అస్త్రము. ఈ మంత్రమును జపించిన వానికి సచ్చిదానంద సుఖము కలిగి మోక్షము లభించును. ఇదిగాక, మరొక విధమైన మంత్రము గలదు. అది వింశత్యాక్షరీ– ఇరవై అక్షరాలుగల మంత్రము, అదే మన షోడశాక్షరీ మంత్రములో '**సౌః**' అను దాని తర్వాత "**శ్రీ విష్ణవే**" అను నాల్గు అక్షరాలు చేర్చి జపించవచ్చును. అది శ్రీవైష్ణవం అనబడుతుంది.

"ఓం ఐం క్లాం క్లీం క్లూం హ్రాం హ్రీం హ్రూం సౌః శ్రీవిష్ణవే దత్తాత్రేయాయ స్వాహా" అని జపించిన వారు విష్ణు రూపమునే పొందెదరు.

ఇక **"దత్తాత్రేయ హరే కృష్ణ ఉన్మత్తానందదాయక, దిగంబరమునే బాల పిశాచ జ్ఞానసాగర"** అనేది అనుష్టుప్ మంత్రము. దీనిని వ్యాఖ్యానించుచున్నాడు – ఇందలి సంబోధనలను సర్వత్ర చక్కగా ఉచ్చరింప వచ్చును. ఇది మిక్కిలి రహస్యమైన మంత్రము. దీనికి సదాశివుడు ఋషి, దత్తాత్రేయుడు దేవత. అనుష్టుప్ ఛందస్సు. **"దత్తాత్రేయ"** అని హృదయమును **'హరేకృష్ణ'** అని శిరమును తాకవలెను. **"ఉన్మత్తానందా"** అని శిఖను తాకాలి. **"దాయకమునే"** అని కవచమును, **'దిగంబర'** అని కన్నులను తాకాలి. **'పిశాచ జ్ఞానసాగర'** అని అస్త్రము మీద న్యాసం చేయాలి. ఇది దత్తుడి అనుష్టుప్ మంత్రము. ఇది నాచే అనగా బ్రహ్మచేత ఉపాసించబడు చున్నది. దీనిని శ్రద్ధగా జపించినవారికి పుట్టిననాటి నుండి చేసిన పాపములన్నీ నశించిపోవును. అతడు అందరికీ ఉపకారమొనర్చి చివరకు మోక్షమును పొందును.

(ఇది ప్రథమ ఖండము యొక్క భావము సమాప్తము)

(ద్వితీయ ఖండము యొక్క భావము)

ఈ ద్వితీయ ఖండంలో దత్తాత్రేయ మాలా మంత్రము యొక్క భావము చెప్పబడుచున్నది. ఓంకార పూర్వకమైన దత్తాత్రేయ భగవానుడు స్మరణ మాత్రము చేతనే సంతుష్టాంతరంగుడగును. మహాజ్ఞానప్రదుడు. మహా మహా భయములను నివారించువాడు. చిదానందాత్ముడు. బాల, ఉన్మత్త, పిశాచ వేషాలలో ఉండేవాడు. మహాయోగి, అవధూత, అనసూయానంద వర్ధనుడు. అత్రిమహర్షి కుమారుడు. సమస్త కామఫలప్రదుడు అయిన దత్తునికి నమస్కారం. **'ఓం'** అని చెప్పి భవబంధ విమోచనుడికి, **'ఆం'** అని అసాధ్య సాధకుడికి, **'హ్రీం'** అని సమస్త విభూతి పరుడికి, **'క్రోం'** అని సాధ్యాకర్షణుడికి, **'ఐం'** అని వాణీ ప్రదాతకు, **'క్లీం'** అని జగత్తును వశీకరించువాడికి, **'సౌః'** అని సకల మనోక్షోభలను దూరం చేయువాడికి, **'శ్రీం'** అని మహదైశ్వర్య ప్రదాతకు **'హ్రాం'** అని చిరంజీవికి. **'వషట్'** అని వశము చేయుమని, **'వౌషట్'** అని ఆకర్షించుమని, **'హుంమ్మని'** విద్వేషించుమని, **'ఫట్'** అని ఉచ్చాటన చేయుమని, **'ఠఠ'** యని స్తంభన చేయుమని, **'ఖఖ'** అని మారణచేయు సంపన్నునకు నమస్కారము. **'స్వాహా'** పోషించుము. పరమంత్రాలను, పరయంత్రాలను, పరతంత్రాలను ఛేదించుము. గ్రహాలను నివారించుము. వ్యాధులను నశింపచేయుము. బాధలను హరించుము. దరిద్రాన్ని తొలగించుము. దేహాన్ని పోషించుము. చిత్తానికి సంతోషాన్ని కలిగించుము. సర్వమంత్ర, సకలయంత్ర, సమస్త తంత్రముల పల్లవ స్వరూపుడయిన శివుడికి (మంగళమూర్తికి, సుఖప్రదాతకు) నమస్కారము. (ఇది సమస్త కోరికలు తీర్చే మాలా మంత్రము)

ఇందులో ఒక రహస్యం దాగి వుంది. పైన చెప్పబడిన మంత్రానికి ఎప్పుడెప్పుడు ఏమేమి చేర్చి జపించవలెనో, అందుకు సంబంధించిన బీజ పల్లవములను గూర్చి ఇందులో పేర్కొనబడినది.

సమస్త మనోకామనలు సిద్ధించటానికి, ముఖ్యంగా మోక్షప్రాప్తికి "ఓం" చేర్చాలి. అసాధ్యాలను సుసాధ్యం చేయడానికి **'ఆం'**ను, సకల

భాగ్యాల కోసం 'హ్రీం'ను, అసాధ్యాలను ఆకర్షించుటకు 'క్రోం'ను, వాక్సిద్ధికి "ఐం"ను, జన వశీకరణకు **"క్లీం"** సమస్త మనోబాధలు తొలగుటకు **"సౌః"**ను మహదైశ్వర్యానికి **'శ్రీం'** భూమండలాధిపత్యాన్ని సాధించుటకు **"గ్లౌం"**, చిరంజీవి అగుటకు **"ద్రాం"**ను, వశీకరణకు **"వషట్"** స్తంభింప చేయుటకు **"ఠఠ"** మారణానికి **"ఖఖ"** సకల సుఖాలకు, సంపదలకు **"నమః"** ఉపయోగింప బడునని తెలుపబడినది.

ఫలశ్రుతి : ఈ మాలా మంత్రమును ఉపాసించుట వలన పరమంత్రాలు, పరయంత్రాలు, పరతంత్రాలు ఛేదించబడును. దుష్టగ్రహ పీడలు విరగడైపోవును. వ్యాధులు నశించును. దుఃఖాలు తొలగును. దరిద్రము నశించును. దేహమునందు శక్తి, బలము వృద్ధి నొందును. చిత్తమునకు సంతసము కలుగును. ఈ రీతిగా సకల కార్యములను ఫలప్రదము చేయునట్టి సర్వమంత్ర, యంత్ర, తంత్ర, పల్లవముల స్వరూపుడయిన శ్రీ శివునికి అనగా మంగళమూర్తికి, సుఖప్రదాతకు నమస్కారము అని ఈ ఉపనిషత్తు తెలుపుచున్నది.

(ఇది ద్వితీయ ఖండము యొక్క భావము ముగిసినది)

(తృతీయ ఖండము యొక్క భావము)

ఈ మాలా మంత్రమునకు సదాశివుడే ఋషి, దత్తాత్రేయుడు దేవత, అనుష్టుప్ ఛందస్సు, ఓం బీజము, స్వాహా శక్తి, ద్రాం కీలకము. ఈ ఎనిమిది మంత్రములు అనగా ఏకాక్షరి, షడక్షరి, అష్టాక్షరి, ద్వాదశాక్షరి, షోడశాక్షరి, వింశత్యక్షరి, అనుష్టుప్ మంత్రము మరియు మాలా మంత్రము అనునవి అష్టవిధ స్వరూపములు. వీటిని నిత్యము జపించు వారిని వాయువు, అగ్ని, సోముడు, సూర్యుడు, బ్రహ్మ, విష్ణువు, రుద్రులు పవిత్రులను చేసి కాపాడుదురు. ఈ మాలా మంత్రమును జపించుట వలన నూరువేలు (లక్ష) సార్లు గాయత్రి మంత్రమును జపించిన ఫలము లభించును. లక్షమార్లు మహారుద్రమును జపించిన ఫలము సిద్ధించును. పదివేల కోట్లు ప్రణవ జపము చేసిన ఫలితము లభించును. దీనిని అనుష్ఠించినవాడు తనకు పూర్వము వంద తరాల వారిని అట్లే, తన తరువాత వంద తరముల వారిని పవిత్రము చేయును. అతడు కూర్చున్న సహపంక్తి యందలి వారందరు పవిత్రులయ్యెదరు. గోహత్య, బ్రహ్మహత్యాది పాపముల నుండి అతడు విముక్తుడగును. తులా పురుష దానము స్వీకరించిన దోషములు తొలగిపోవును. తినకూడనివి తినుట వలన గలిగే పాపాల నుండి విముక్తి లభించును. సమస్త మంత్ర యోగముల పారీణుడైపోవును. నిజమైన బ్రాహ్మణత్వము అనగా బ్రహ్మజ్ఞానము లభించును. కావున ఈ మంత్రమును ఉత్తముడు, భక్తుడైన శిష్యునికే ఉపదేశించవలెను. తద్వారా అనంత ఫలము లభించును. దీనిని ఉపాసించినవాడు జీవన్ముక్తుడగును. ఈ ప్రకారంగా భగవంతుడగు శ్రీమన్నారాయణుని వలన దత్తాత్రేయ మంత్రోపాసన వలన కలిగే ఫలితాలను గూర్చి బ్రహ్మదేవుడు ప్రబోధించెను.

(ఇది తృతీయ ఖండము యొక్క భావము ముగిసినది)

॥ ఇంతటితో దత్తాత్రేయోపనిషత్తు యొక్క భావము ముగిసినది ॥

◆ ◆ ◆

అవధూతోపనిషత్తు

(కృష్ణ యజుర్వేదమునకు చెందినది)

గౌణముఖ్యావధూతాలి హృదయాంబుజ వర్తియత్ ।
తత్రైపదం బ్రహ్మతత్వం స్వమాత్రమవశిష్యతే ॥

శాంతి మంత్రము

ఓం సహ నావవతు । సహ నౌ భునక్తు ।
సహ వీర్యం కరవావహై । తేజస్వి నావధీతమస్తు ।
మా విద్విషావహై ॥

॥ ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

భావం : (గురు శిష్యులమగు) మమ్ములను ఆ పరమాత్మ అన్ని విధముల రక్షించుగాక! మాకు తగిన పోషణ చేయుగాక! మేము ఇరువురము తగిన చక్కని బలమును, వీర్యమును, శక్తిని పొందెదము గాక! మేము చదివిన విద్య తేజోవంతమగును గాక ! మేము ఒకరికొకరము ఎటువంటి ద్వేషభావము లేకుండా స్నేహభావంతో కలసి మెలసి జీవించెదముగాక! ఓ పరమాత్మా! అన్ని రకముల తాపములు నశించి మాకు శాంతి లభించునుగాక!

హరిః ఓమ్ ॥ అథ హ సాంకృతిర్భగవంత
మవధూతం దత్తాత్రేయం పరిసమేత్య పప్రచ్ఛ
భగవన్ కోఽవధూతః తస్య కా స్థితిః కిం లక్ష్మ
కిం సంసరణ మితి । తం హోవాచ భగవాన్
దత్తాత్రేయః పరమకారుణికః ॥

అక్షరత్వా ద్వరేణ్యత్వా ద్ధూత సంసార బంధనాత్ ।
తత్త్వమస్యాది లక్ష్యత్వా దవధూత ఇతీర్యతే ॥
యో విలంఘ్యా శ్రమాన్వ ర్ణా నాత్మన్యేవ స్థిత స్సదా ।
అతి వర్ణాశ్రమీ యోగీ అవధూత స్స కథ్యతే ॥ (1)

తస్య శిరఃప్రియః కృత్వామోదో దక్షిణపక్షకః । ప్రమోద ఉత్తరః పక్ష ఆనందో గోష్పదాయతే ॥ గోపాల సదృశం శీర్షే నాపి మధ్యేన చాప్యధః । బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠేతి పుచ్ఛాకారేణ కారయేత్ ॥ ఏవం చతుష్పథం కృత్వా తే యాంతి పరమాం గతిమ్ । న కర్మణా న ప్రజయా న ధనేన త్యాగేనైకే అమృతత్త్వ మానశుః ॥ స్వైరం స్వైర విహరణం తత్సంసరణమ్ । సాంబరావా దిగంబరావా న తేషాం ధర్మాధర్మౌ న మేధ్యామేధ్యౌ । సదా సాంగ్రహణ్యేష్ట్యా ఽశ్వమేధ మంతర్యాగం యజతే । స మహామఖో మహాయాగః । కృత్స్న మేతచ్చిత్రం కర్మ । స్వైరం న విగాయే తన్మహా వ్రతమ్ । న స మూఢ వల్లిప్యతే ॥ యథారవి ః సర్వరసాన్ ప్రభుంక్తే హుతాశన శ్చాపి హి సర్వభక్షః । తథైవ యోగీ విషయాన్ భుంక్తే న లిప్యతే పుణ్యపాపైశ్చ శుద్ధః ॥

ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠం సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్ । తద్వత్ కామాయం ప్రవిశంతి సర్వే స శాంతి మాప్నోతి న కామకామీ ॥ న నిరోధో న చోత్పత్తి ర్న చ బద్ధో న చ సాధకః । న ముముక్షు ర్నవై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥ (2)

ఐహికాముష్మిక వ్రాత సిద్ధ్యై ముక్తేశ్చ సిద్ధయే । బహుకృత్యం పురాస్యాన్మే తత్సర్వ మధునా కృతమ్ ॥ తదేవ కృతకృత్యత్వం ప్రతియోగి పురస్సరమ్ । అనుసందధ దేవాయమేవం తృప్యతి నిత్యశః ॥ దుఃఖినోఽజ్ఞాః సంసరంతు

కామం పుత్రాద్యపేక్షయా । పరమానంద పూర్ణోఽహం సంసరామి కిమిచ్ఛయా ॥ అనుతిష్ఠంతు కర్మాణి పరలోక ధియా పరే (పరలోకయియాసవః) । సర్వలోకాత్మకః కస్మాదనుతిష్ఠామి కిం కథమ్ ॥ వ్యాచక్షతాం తే శాస్త్రాణి వేదానధ్యాపయంతువా । యేఽత్రాధికారిణో మే తు నాధికారోఽక్రియత్వతః ॥ నిద్రా భిక్షే స్నాన శౌచే నేచ్ఛామి న కరోమి చ । దృష్టారశ్చేత్కల్పయంతు కిం మే స్యా దన్య కల్పనాత్ ॥ గుంజా పుంజాది దహ్యేత నాన్యారోపిత వహ్నినా । నాన్యారోపిత సంసార ధర్మా నైవ మహం భజే ॥ శృణ్వం త్వజ్ఞాతతత్త్వా స్తే జానన్కస్మా చ్ఛృణోమ్యహమ్ । మన్యంతాం సంశయాపన్నా న మన్యేఽహ మసంశయః ॥ విపర్యస్తో నిదిధ్యాసే కిం ధ్యాన మవిపర్యయే ॥ (3)

దేహాత్మత్వ విపర్యాసం న కదాచిత్ భజామ్యహమ్ । అహం మనుష్య ॥ ఇత్యాది వ్యవహారో వినాప్యముమ్ ॥ విపర్యాసం చిరాభ్యస్త వాసనా తోఽపకల్పతే ॥ ఆరబ్ధ కర్మాణి క్షీణే వ్యవహారో నివర్తతే । కర్మక్షయే త్వసౌ నైవ శామ్యే ధ్యాన సహస్రతః ॥ విరళత్వం వ్యవహృతే రిష్టం చే ద్ధ్యాన మస్తు తే । బాధికర్మ వ్యవహృతిం పశ్యన్ ధ్యాయామ్యహం కుతః ॥ విక్షేపో నాస్తి యస్మాన్మే న సమాధి స్తతో మమ । విక్షేపో వా సమాధిర్వా మనసః స్యా ద్వికారిణః । నిత్యానుభవ రూపస్య కో మేఽత్రానుభవః పృథక్ ॥ కృతం కృత్యం ప్రాపణీయం ప్రాప్తమిత్యేవ నిత్యశః । వ్యవహారో లౌకికో వా శాస్త్రీయో వాఽన్యథాఽపివా । మమాకర్తు రలేపస్య యథాఽరబ్ధం ప్రవర్తతామ్ ॥ అథవా కృత కృత్యేఽఽపి లోకానుగ్రహ కామ్యయా । శాస్త్రీయే ణైవ మార్గేణ వర్తేఽహం మమ కా క్షతిః ॥ దేవార్చన స్నాన శౌచ భిక్షాదౌ వర్తతాం వపుః । తారం జపతు వాక్తద్వ త్పఠత్వా మ్నాయ మస్తకమ్ ॥ విష్ణుం ధ్యాయతు ధీర్యద్వా బ్రహ్మానందే విలీయతామ్ । సాక్ష్యహం కించి దప్యత్ర న కుర్వే నాపి కారయే ॥

కృత కృత్యతయా తృప్తః ప్రాప్త ప్రాప్యతయా పునః ॥ (4)

తృప్యన్నేవం స్వ మనసా మన్యతేఽసౌ నిరంతరమ్ ।

ధన్యోఽహం ధన్యోఽహం నిత్యం స్వాత్మాన మంజసావేద్మి । ధన్యోఽహం ధన్యోఽహం బ్రహ్మానందో విభాతి మే స్పష్టమ్ ॥ ధన్యోఽహం ధన్యోఽహం దుఃఖం సాంసారికం న వీక్షేఽద్య । ధన్యోఽహం ధన్యోఽహం స్వస్యాజ్ఞానం పలాయితం క్వాపి । ధన్యోఽహం, ధన్యోఽహం కర్తవ్యం మే న విద్యతే కించిత్ । ధన్యోఽహం ధన్యోఽహం ప్రాప్తవ్యం సర్వమద్య సంపన్నమ్ । ధన్యోఽహం ధన్యోఽహం తృప్తే ర్మే కోపమా భవే ల్లోకే ॥ ధన్యోఽహం ధన్యోఽహం ధన్యో ధన్యః పునః పునర్ధన్యః ॥ అహో పుణ్య మహోపుణ్యం ఫలితం ఫలితం దృఢమ్ । అస్య పుణ్యస్య సంపత్తేరహో వయ మహో వయమ్ ॥ అహో జ్ఞాన మహో జ్ఞాన మహో సుఖ మహో సుఖమ్ । అహో శాస్త్ర మహో శాస్త్ర మహో గురు రహో గురుః ॥ ఇతి య ఇద మధీతే సోఽపి కృత కృత్యో భవతి । సురాపానా త్పూతో భవతి । స్వర్ణస్తేయాత్పూతో భవతి । బ్రహ్మహత్యాత్పూతో భవతి । కృత్యాకృత్యాత్పూతో భవతి । ఏవం విదిత్వా స్వేచ్ఛాచారపరో భూయాదోం సత్యమిత్యుపనిషత్ ॥(5)

॥ ఓం సహనావ వత్వితి శాంతిః ॥

॥ ఇత్యవధూతోపనిషత్ ॥

అవధూతోపనిషత్తు భావము

(ఈ ఉపనిషత్తును దత్తాత్రేయ స్వామివారు సాంకృతియను ఋషీశ్వరునికి ఉపదేశించెను. ఇందులో 'అవధూత' అనగా ఎవరో? అతని స్థితి ఎట్టిదో? అవధూతను గుర్తించుటకు చిహ్నాము లేవియో? అతడు ఎట్లు వ్యవహరించుచుండునో? మున్నగు విషయాలను గూర్చి శ్రీ దత్తదేవుడు స్వయముగా ఈ ఉపనిషత్తులో వివరించెను.)

ఒకనాడు అవధూతయగు శ్రీ గురుదత్తాత్రేయుల వారి వద్దకు సాంకృతియను మహర్షి విచ్చేసెను. ఆ మహర్షి శ్రీ దత్తగురువును సమీపించి వినయముగా నమస్కరించి ఇట్లు ప్రశ్నించెను. "భగవాన్ ! అవధూత అంటే ఎవరు? అతని స్థితి ఎట్లుండును? ఆతనిని గుర్తించుటకు గల చిహ్నాములు ఏవి? ఆతడెట్లు ప్రవర్తించును?

అంతట పరమ కరుణాంతరంగుడైన దత్తాత్రేయ భగవానుడు, సాంకృతి ముని ప్రశ్నలకు ఈ విధముగా చక్కని సమాధానములను వివరించెను-

(ముందుగా 'అవధూత' అను మాటలోగల నాలుగు అక్షరములను ఈ రీతిగా వ్యాఖ్యానించెను.)

అ = అనగా - అక్షరుడు - నాశనము లేనివాడు
వ = అనగా - వరేణ్యుడు - బ్రహ్మవేత్తలలో మిక్కిలి శ్రేష్ఠుడు
ధూ = (ధూత అనగా విదలించుకొనిన, తిరస్కరించిన అని అర్థము) సంసార సంకెళ్ళను విదలించుకొనిన వాడు లేదా, తిరస్కరించిన వాడు.
త = అనగా - తత్త్వమస్యాది మహావాక్యములకు లక్ష్యమైనవాడు అని అర్థము.

అవధూత అనువాడు శాశ్వతుడై, అత్యంత శ్రేష్ఠుడై, సంసార బంధనములు లేనివాడై, తత్త్వమస్యాది మహావాక్యములకు లక్ష్యమైనవాడుగా ఉండును.

ఎవడయితే, ఆశ్రమ ధర్మములను, వర్ణ ధర్మములను అతిక్రమించి స్వాత్మలోనే అనగా తనలో తానై ఉన్నట్టి అనగా నిరంతరము పరబ్రహ్మము నందే లయమొంది ఉండువాడు **'అవధూత'** అనబడును. ఆ విధముగా వున్నట్టి అవధూత **'అతివర్ణాశ్రమీ'** లేదా **'అత్యాశ్రమీ'** యోగి అని పిలువబడును. (1)

అవధూత ఒక గోవు వంటివాడని చెప్పి అందుకు గల లక్షణములను వివరించుచున్నాడు. బ్రహ్మైక్యానుభూతియే అతనికి శిరస్సువలె అత్యంత ప్రియమైనది. మోదము అనగా ఇష్టవస్తువును దర్శించుటచే కలిగే భావము అతనికి కుడి భాగముగా ఉండును. ఇష్టమైన వస్తువు లభించుట వలన కలిగెడు భావము అగు ప్రమోదము అతనికి ఎడమభాగమైయుండును. అనగా మోద, ప్రమోదములు అవధూతకు కుడి, ఎడమలుగా ఉండునని తాత్పర్యము. ఇక ఆనందము గోవు పాదము వంటిదగును. గోవాలం (ఆవుతోక) వలె మధ్యన కాకుండా, క్రిందుగా గాకుండా శీర్షంగా బ్రహ్మ పుచ్ఛపై ప్రతిష్ఠింపబడియుండును.

(పై వాక్యముల రహస్యమేమనగా - మోదము, ప్రమోదము, ఆనందములు - అనే వీటిలో మోదము కర్మ యోగము ద్వారా, ప్రమోదము భక్తియోగము ద్వారా, ఆనందము జ్ఞాన యోగము ద్వారా లభించునని అభిప్రాయం. పై మూడింటికి ఆధారము రాజయోగము అనగా అమనస్క యోగము - మనసులేనిది రాజయోగము. ఆ స్థితిలో తలపులు, ఆలోచనలు

ఏవీ ఉండవు. అదియే సమాధిస్థితి. ఈ విధంగా కర్మ, భక్తి, జ్ఞాన, రాజయోగము లెచ్చట కలిగియున్నవో, అదియే చతుష్పథము. ఇది పుచ్ఛాకారంగా బ్రహ్మభావముతో నిండి ప్రతిష్ఠితమై యుండును. ఈ యోగము వలన పరమగతి ప్రాప్తించును.

అమృతత్వము అనగా మోక్షము. అది కర్మవలన గానీ, సంతానము వలనగానీ, ధన సంపద వలన గానీ లభింపదు. అది కేవలము త్యాగము వలననే లభించును. యోగయుక్తుడై ఆచరింపబడిన సమస్త కర్మ భక్తి జ్ఞానముల త్యాగమే నిజమైన త్యాగము. దానివల్లనే మోక్షము లభించును, కాని, వేరే దేనిచేత అది లభించదు.

అవధూత ఒకరి అదుపులో ఉండడు. అతడు స్వేచ్ఛగా, యథేచ్ఛగా విహరించుచుండును. వస్త్రములు ధరించిననూ, ధరించకపోయిననూ అతనికి ఏకరీతిగనే ఉండును. అవధూతకు ధర్మాధర్మములు లేవు. పవిత్రతా పవిత్రములు కూడా ఉండవు. కర్మవాసనలు అతనికి అంటవు. అతడు ఎల్లప్పుడు సాంగ్రహణ్య ఇష్టి నుండి అశ్వమేధము వరకు అంతర్యాగము చేయుచుండును. అదియే మహా యజ్ఞము. అదియే మహాయోగము. ఇదంతయూ ఒక విచిత్రమైన కర్మ. యథేచ్ఛగా విహరించుచూ దేనిలో మునగకుండా ఉండటమే అతనికి ఒక మహా వ్రతముగా ఉండును. కావున, ఆతడు బుద్ధిహీనుని వలె, ఒక మూఢునివలె దేనినీ అంటుకొనడు. ఎట్లనగా–సూర్యుడు గగనతలంలో ఉంటూ సకల రసములను చక్కగా భక్షించి కూడా దేనికీ అంటకుండా ఉండును. అగ్నిదేవుడు సర్వభక్షకుడై యుండి కూడా దేనికీ అంటకుండా ఉండును. అవధూత కూడా సమస్త విషయాలను అనుభవించుచూ, అతడు దేనితో అంటకుండా ఉండును. తద్వారా అతనికి పుణ్యపాపములు ఉండవు. అతడు ఎల్లప్పుడు నిర్లిప్తుడై వుండును. కావున, అతడు నిత్యపరిశుద్ధుడు అనబడును.

అన్ని దిక్కుల నుండి ఎడతెగకుండా పొంగి ప్రవహించుచూ వచ్చి చేరిన నదులన్నీ పరిపూర్ణమై, నిశ్చలముగా నున్నట్టి, గంభీరముగానున్నట్టి సముద్రమును ఏమాత్రము చలింపచేయకుండానే అందులో లీనమైపోవును. అటులనే సమస్త భోగములునూ అవధూతయగు వానియందు ఎట్టి వికారములను కలిగింపకయే అవి అతనిలో లీనమైపోవును. అట్టి యోగ పురుషుడే ఎల్లప్పుడు పరమశాంతిని అనుభవించును. కాని, భోగేచ్ఛను కలిగి సమస్త కోరికలను వాంఛించువాడు ఎప్పుడూ శాంతిని పొందజాలడు. అవధూతయైనవాడు దేని చేతనూ నిరోధింపబడడు. అనగా అతనికి నిరోధము లేదు. పుట్టుకలేదు. బంధనమూలేదు. అతడు సాధకుడు కాడు. ఏలననగా– అతడు ఎల్లప్పుడు ముక్తుడే కనుక, కొత్తగా ఇప్పుడు ముక్తుడు కావలసిన అవసరం అతనికి లేదు. ఇదియే పరమార్థము (2)

ఐహిక, ఆముష్మిక ఫలములు సిద్ధించుట కొరకు, ముక్తిని పొందుట కొరకు నాకు పురాకృత కర్మ ఎంతో ఉన్నది. ఆ కర్మ అంతయునూ ఈ జన్మలో చేయబడినది. చేయవలసిన పని చేసి యుండుట అదే. ఈ విధమైన భావంతో అజ్ఞానం కలిగిన వారు దుఃఖవంతులై, పుత్రాది సంతానాపేక్షతో సంసారంలో పడి మునుగుదురుగాక! పరమానందముతో పరిపూర్ణుడనై యున్న నేను ఇక ఏ కోరికతో సంసారంలో మునిగెదను? అనగా నా కెటువంటి కోరికాలేదు. సాంసారిక వాంఛ అసలేలేదు. లోకములో కొందరు స్వర్గభోగమును కోరి కర్మలను అనుష్ఠించెదరు. సర్వ లోకాత్మకుడనై నేను దేనిని, ఎందుకు అనుష్ఠించెదను.

ఈ లోకములో కార్యములను చేయుటకు అధికారము గలవారు శాస్త్రములను వ్యాఖ్యానించెదరు. మరికొందరు వేదములను చదివించెదరు. కాని, నేను అక్రియుడను. కావున, నాకు ఆ అధికారము లేదు. నేను నిద్రనుగానీ, భిక్షనుగానీ, స్నానమును గానీ, శౌచమును గానీ, కోరుకొనువాడను కాను. వాటిని ఆచరించువాడను కూడా కాను. ద్రష్టలైన వారలు వాటినన్నింటినీ నాయందు కల్పించెదరు. అప్పుడిక అన్యకల్పనలు నాకెందులకు? అన్యారోపితముగాని అగ్ని వలన గురువింద గింజల వంటివి దహింపబడుగాక! కాని, అన్యారోపితములైన సంసార ధర్మాలను నేను ఎందుకు సేవించెదను. తత్త్వము తెలియని వారందరు దానిని గురించి వినెదరు కాని, తత్త్వము తెలిసిన నేను ఎందుకు వినెదను? సంశయములు గలవారే మననము చేయుచుందురు. సంశయమే లేని, నిశ్చయాత్మకుడనైన నేనెందులకు మననము చేయుదును. నిధి ధ్యాస ఉన్నప్పుడే విపర్యాసము– వ్యత్యాసము కలుగుతుంది. విపర్యయమే - వ్యత్యాసమే లేనప్పుడు ఇక ధ్యానమెట్లుండును? (3)

దేహము - ఆత్మత్వమును గూర్చిన వ్యత్యాసమును అనగా సందేహమును నేను ఎప్పుడూ పొందను. ఇది లేకుండా నేను మనుష్యుడను అను మున్నగు వ్యవహారాలు ఎంతోకాలం అభ్యసించిన వాసన వలన విపర్యాసం అనేది కల్పించబడదు. ప్రారబ్ధకర్మ క్షయించిపోయిన వెంటనే ఈ వ్యవహారం మరలును. అది వేలాది పర్యాయములు ధ్యానించినప్పటికినీ తొలిగిపోదు. కర్మ పూర్తిగా క్షీణించిన పిమ్మటనే అది నశించును. వ్యవహారముల మీద కాంక్ష తక్కువగా ఉన్న నీకు ధ్యానం సిద్ధించుగాక! వ్యవహారమనునది కర్మను బాధించుచుండుటను గమనించి కూడా నేనెందుకు ధ్యానించవలెను? నాకు ఎంతమాత్రము మనోవిక్షేపమే లేదు. కావున, సమాధి లేదు. నిజమునకు విక్షేపమైనా, సమాధియైనా వికారములతో కూడిన మనస్సునకే కాని, నిత్యానుభవరూపుడనైన నాకు ఇక్కడ వేరే అనుభవమంటూ ఏముండును? చేయువలసినది, చేయబడినది, పొందదగినది, పొందబడినది అంటూ వ్యత్యాసాలు లేకుండా ఇవన్నీ నిత్యం జరిగిపోవునవే. వ్యావహారికంగానైనా, లౌకికంగానైనా, శాస్త్రీయంగానైనా, మరి ఇంకేవిధంగానైనా సరే! ఏ వ్యవహారం చేయని, ఎట్టి లోపము లేని నాకు ప్రారబ్ధము అనేది ఎట్లు ప్రవర్తిల్లును? లేక, నేను కృతకృత్యుడనై యున్నప్పటికీ లోకానుగ్రహమును, లోక కళ్యాణమును కోరి, శాస్త్రీయమైన మార్గమున ప్రవర్తించెదను. తద్వారా నాకు కలిగే కొరత ఏదీ లేదు, ఎటువంటి బాధయూలేదు. స్నాన, శౌచ, దేవతార్చన, భిక్షాటన మున్నగు వాటిలో శరీరము ప్రవర్తించుగాక! వాక్కు తారకమును జపించునుగాక! ఉపనిషత్తులను పఠించునుగాక! బుద్ధి విష్ణువును ధ్యానించునుగాక! లేదా, నిశ్చలమై బ్రహ్మానందమునందే లీనమైయుండును గాక! అన్నింటికినీ సాక్షి మాత్రుడను. ఇక నేను ఏమీ చేయను. చేయించను. ప్రాప్త, అప్రాప్తముల వలన నేను సంతృప్తుడను. అంతేకాదు, నేను నిత్య తృప్తుడను. పూర్ణకాముడను. (4)

ఈ విధముగా నేను తృప్తిని పొందుతూ మనసుతో నిరంతరం మననం చేయుచుందును. నేనెంతయో ధన్యుడను. నా ఆత్మను తెలిసికొన్న ధన్యుడను. బ్రహ్మానందం నాకు స్పష్టంగా భాసించుచున్నది. ఇప్పుడిక నాకు సాంసారిక దుఃఖము గోచరించుట లేదు. నాలోని అజ్ఞానం ఎక్కడికో పలాయనము చిత్తగించినది. అందుకే నేను ధన్యుడను. కించిన్మాత్రమైన

కర్తవ్యమంటూ నాకేదీలేదు కనుక, నేను ధన్యుడను. పొందదగినదంతా పొందియున్న నేను కృతకృత్యుడను. ఈ లోకము నందు నేను పొందిన తృప్తికి పోలికయే లేదు. కావుననే నేను ధన్యుడను, చాలా, చాలా ధన్యుడను. అన్ని విధముల కృతకృత్యుడను. ఆహా! పుణ్యఫలం ఫలించినది. బాగుగా ఫలించినది. ఇదంతా నా పుణ్యసంపదయే. ఆహా! అంతులేనిది అది. ఆహా! ఏమని చెప్పుదును. ఆహా! ఏమి జ్ఞానము! ఏమి శాస్త్రము! ఆహా! ఏమి గురువు! ఓహో! ఎంతటి గురువు. ఏమని చెప్పుదును.

ఈ ఉపనిషత్తును అధ్యయనము చేసినవాడు, కృతకృత్యుడగును. సురాపానము, (మద్యపానము) సువర్ణస్తేయము (బంగారము దొంగిలించుట), బ్రహ్మ హత్య మొదలగు చేయకూడని పాపములు చేసిన వాటినుండి విముక్తుడైపోవును. చేసిన పాపాల నుండి, చేయకూడని పాపముల నుండి విడివడి పవిత్రుడగును.

ఈ విధముగా చక్కగా గ్రహించి, ఎవరైతే స్వేచ్ఛతో కూడిన ఆచారపరులయ్యెదరో, వారే అవధూతగా మారెదరు. వారు ధన్యులు, ఇది సత్యము. ఈ ఉపనిషత్తు సత్యము. (5)

॥ ఇది అవధూతోపనిషత్తు యొక్క భావ వివరణము సమాప్తము ॥

॥ ఓమ్ తత్సత్ ॥

(దత్తాత్రేయ మరియు అవధూతోపనిషత్తుల భావమును వివరించుటకు తోడ్పడిన గ్రంథములు 1. ఉపనిషద్దర్శనం - తాత్పర్య సరళీకరణము - డా. జయంతి చక్రవర్తి గారు మరియు 2. శ్రీ దత్తాత్రేయ సర్వస్వము - రచన, సేకరణ- శ్రీ జి.వి.ఎల్.ఎన్. విద్యాసాగర శర్మగారు. ఈ ఉభయపండితులకు ధన్యవాద పూర్వకముగా వందనములు)

శ్రీశ్రీశ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామివారిచే పేర్కొనబడిన

శ్రీ దత్తాత్రేయ షోడశ అవతారములు

1. శ్రీ యోగిరాజు :

శ్లో॥ అద్వయానందరూపాయ యోగమాయాధరాయ చ ।
యోగిరాజాయ దేవాయ శ్రీ దత్తాయ నమో నమః ॥

2. శ్రీ అత్రి వరదుడు :

శ్లో॥ మాలాకమండలురధః కరపద్మయుగ్మే
మధ్యస్థ పాణీయుగళే డమరు త్రిశూలే ।
యస్యస్థ ఊర్ధ్వకరయోః శుభ శంఖచక్రే
వందే త మత్రివరదం భుజషట్కయుక్తమ్ ॥

3. శ్రీదత్తాత్రేయుడు

శ్లో॥ దత్తాత్రేయం శివంశాంతం ఇంద్రనీలనిభం ప్రభుం
ఆత్మమాయారతం దేవం అవధూతం దిగంబరమ్ ।
భస్మోద్ధూళిత సర్వాంగం జటాజూటధరం విభుం
చతుర్బాహుం ముదారాంగం దత్తాత్రేయం నమామ్యహమ్ ॥

4. శ్రీకాలాగ్ని శమనుడు :

శ్లో॥ జ్ఞానానందైక దీప్తాయ కాలాగ్నిశమనాయ చ ।
భక్తారిష్ట వినాశాయ నమోఽస్తు పరమాత్మనే ॥

5. శ్రీయోగిజనవల్లభుడు :

శ్లో॥ యోగవిజ్ఞనాథాయ భక్తానందకరాయ చ ।
దత్తాత్రేయాయ దేవాయ తేజోరూపాయ తే నమః ॥

6. శ్రీ లీలావిశ్వంభరుడు

శ్లో॥ పూర్ణబ్రహ్మ స్వరూపాయ లీలావిశ్వంభరాయ చ
దత్తాత్రేయాయ దేవాయ నమోఽస్తు సర్వసాక్షిణే ॥

7. శ్రీసిద్ధరాజు :

శ్లో॥ సర్వసిద్ధాంత సిద్ధాయ దేవాయ పరమాత్మనే ।
సిద్ధరాజాయ సిద్ధాయ మంత్రదాత్రే నమో నమః ॥

8. శ్రీ జ్ఞానసాగరుడు :

శ్లో॥ సర్వత్రాఽజ్ఞాననాశాయ జ్ఞానదీపాయ చాత్మనే ।
సచ్చిదానందబోధాయ శ్రీదత్తాత్రేయ నమో నమః ॥

9. శ్రీ విశ్వంభరావధూత :

శ్లో॥ విశ్వంభరాయ దేవాయ భక్తప్రియకరాయ చ ।
భక్తప్రియాయ దేవాయ నామప్రియాయ తే నమః ॥

10. శ్రీ అవధూత - మాయాముక్తావధూత(1) :

శ్లో॥ మాయాముక్తాయ శుద్ధాయ మాయాగుణ హరాయతే ।
శుద్ధబుద్ధాత్మరూపాయ నమోఽస్తు పరమాత్మనే ॥

11. శ్రీమాయాయుక్తావధూత(1) :

శ్లో॥ స్వమాయా గుణగుప్తాయ ముక్తాయ పరమాత్మనే ।
సర్వత్రాఽజ్ఞాననాశాయ దేవదేవాయ తే నమః ॥

12. శ్రీ ఆదిగురువు :

శ్లో॥ చిదాత్మజ్ఞానరూపాయ గురవే బ్రహ్మరూపిణే ।
దత్తాత్రేయాయ దేవాయ నమోఽస్తు పరమాత్మనే ॥

13. శ్రీ శివరూపుడు :

శ్లో॥ సంసారదుఃఖనాశాయ హితాయ పరమాత్మనే ।
దత్తాత్రేయాయ దేవాయ నమోఽస్తు పరమాత్మనే ॥

14. శ్రీ దేవదేవుడు :

శ్లో॥ సర్వాపరాధ నాశాయ సర్వపాప హరాయ చ ।
దత్తాత్రేయాయ దేవాయ నమోఽస్తు పరమాత్మనే ॥

15. శ్రీదిగంబరుడు :

శ్లో॥ దుఃఖదుర్గతి నాశాయ దత్తాయ పరమాత్మనే ।
దిగంబరాయ శాంతాయ నమోఽస్తు బుద్ధిసాక్షిణే ॥

16. శ్రీకృష్ణ శ్యామకమలనయనుడు :

శ్లో॥ అఖండాద్వైత రూపాయ నిర్గుణాయ గుణాత్మనే ।
కృష్ణాయ పద్మనేత్రాయ నమోఽస్తు పరమాత్మనే ॥

◆ ◆ ◆

---

1. 10వ, 11వ దత్తావతారాల పేర్లను గూర్చి ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి గురుచరిత్ర గ్రంథంలో 10వది మాయాయుక్తావధూతగా, 11వది మాయాముక్తావధూతగా పేర్కొనబడినది. అయితే శ్రీ జివియల్ఎన్ విద్యాసాగరశర్మగారి "శ్రీదత్తాత్రేయ సర్వస్వము" నందు 10వది "శ్రీఅవధూత" అని మాత్రమే పేర్కొని క్రింద పాదసూచికలో- "బ్రహ్మానంద సరస్వతీస్వామి శిష్యులద్వారా లభించిన లిఖిత ప్రతిలో ఇది "మాయాముక్తావధూత" అని ఉన్నది. అదే సరియైన నామము అని పేర్కొనబడినది. కావున 11వది మాయాయుక్తావధూతగా చెప్పబడినది.

విశేష కార్యసిద్ధికై పఠించవలసిన శ్రీగురుచరిత్ర అధ్యాయములు - వాటి ఫలశ్రుతి

శ్రీగురుచరిత్ర పూర్తి గ్రంథ పారాయణము చేయుట అందరికి తెలిసినదే. అయితే, ఇందలి ఒక్కొక్క అధ్యాయమును దీక్షగా పారాయణము చేయుటవలన దాని యొక్క ప్రత్యేక ఫలమును కూడా పొందవచ్చును. ఇట్టి విశేషములను గూర్చి ఇంతకుముందు ఎందరో మహాత్ములు చెప్పియున్నారు. అయితే, మా వంశ ఋషీశ్వరులు, తెలంగాణలోగల సిద్ధిపేట జిల్లా, కొండపాక మం. అంకిరెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులగు **బ్రహ్మశ్రీ మడునూరి నారాయణగారు**, తెలంగాణలోగల సిద్ధిపేట జిల్లా - మరుకూకు మం. భావానందపురము గ్రామ సరిహద్దులోగల శ్రీ పాండురంగాశ్రమమును స్థాపించిన **శ్రీశ్రీశ్రీ యతివర భావానంద భారతీ భగవత్పాదుల**వారి కరకమల సంజాతులగు వారి యొక్క సన్యాసనామము శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ జయరామానంద భారతీ (సరస్వతీ) స్వామివారు. వీరు 1958-59 మరియు 1962-65 మధ్యకాలములో మానస సరోవరము- కైలాస పర్వతమును, చార్‌ధామ్ యాత్రను, ద్వాదశ జ్యోతిర్లింగములను, అష్టాదశ శక్తిపీఠములను ఒక్కరే పాదయాత్రగా పర్యటించి దర్శించినారు. ఆ సందర్భంలో వారు ఎందరో సిద్ధులు, సాధువులు, అవధూతలు, అవతార పురుషులు మొదలగు వారెందరినో దర్శించి, ముచ్చటించి, వారి అనుగ్రహములను పొందియున్నారు. వారు స్వయంగా శ్రీగురుచరిత్ర మరాఠీ మూల గ్రంథమును వందల పారాయణములను చేసారు. అయితే, వారి పర్యటనలో కాశీ పట్టణంలో ధర్మసమ్రాట్ పరమ పూజ్యశ్రీ కరపాత్రీస్వామివారి సంపూర్ణ అభిమానాన్ని చూరగొన్నారు. సజ్జన్‌ఘడ్‌లోగల పూజ్య శ్రీ శ్రీధర స్వామి వారిని వారు స్వయంగా దర్శించడమే గాకుండా, వారితో ముచ్చటించి వారి దివ్యానుగ్రహమునకు పాత్రులయ్యారు. శ్రీశ్రీధర స్వామివారు స్వయంగా తమ చేత వ్రాసి వీరికి అందించిన అనేక ధర్మసందేహాల సమాధాన పత్రము ఇప్పటికీ మా వద్ద పదిలపరచబడియున్నది.

వీరేగాక, మరికొందరు దత్తోపాసకులు, దత్తస్వరూపులైన మహాత్ములు చెప్పిన అధ్యాయాల వారిగా పారాయణ ఫలితములను శ్రీ జయరామానంద స్వామివారు ఒక పుస్తకములో వ్రాసిపెట్టియున్నారు. అట్టి అధ్యాయాలవారి ఫలశ్రుతినే ఇచట పొందుపరచనైనది. వారు వదలిపెట్టిన అధ్యాయాల ఫలశ్రుతిని తెలంగాణ - సికింద్రాబాద్‌లోగల మల్కాజిగిరికి చెందిన శ్రీశ్రీశ్రీ బోధానందేంద్ర సరస్వతీ స్వాములవారు చెప్పిన వాటిని సంగ్రహించి ఇందులో చేర్చనైనది. శ్రీదత్తాత్రేయ స్వామి కృపతో ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు ఐన వివిధ భక్తులు తమ తమ మనోభీష్టములను నెరవేర్చుకొనుటకు ఇదెంతయో ఉపకరించగలదని మా విశ్వాసము. శేషము భగవత్కృప.

॥ శ్రీ గురు దత్త శ్శరణం మమ ॥

శ్రీ గురుచరిత్ర అధ్యాయాల వారిగా ఫలశ్రుతి

అధ్యా.సం.	లభించు ఫలితము
1.	సద్గురువు లభించును
2.	గుర్వనుగ్రహ ప్రాప్తి.
3.	ఆపదలనుండి రక్షణ - భయ నివారణ
4.	ఉత్తమ పుత్ర సంతాన ప్రాప్తి

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

5.	కీర్తిమంతుడు, లోకవంద్యుడగు కుమారుడు కలుగును.
6.	పరమేశ్వరుని అనుగ్రహము లభించును.
7.	బ్రహ్మరాక్షస, దుష్టగ్రహ పిశాచాదుల పీడలు నివారణమగును. గతజన్మల వాసనలు, పాపములు నశించిపోవును. ఈశ్వరానుగ్రహము లభించును.
8.	తల్లిదండ్రుల ద్వారా చేయబడిన దోషములు హరింపబడును. శత్రుబాధ నివారణమగును. పరమేశ్వరానుగ్రహము కలుగును.
9.	శ్రీ గురుకృపా ప్రభావముచేత జీవితంలో ఉత్తమస్థితి లభించును.
10.	గొప్ప సంకటములు, ఉపద్రవములు తొలగిపోవును.
11.	సత్సంతాన ప్రాప్తి, విద్యాభివృద్ధి, జాతక జన్మ – నామ నక్షత్రాదుల దోషములు నివారింపబడును.
12.	జ్ఞాన, వైరాగ్యములు లభించును
13.	ఉదర సంబంధమగు వ్యాధులు మటుమాయమగును. చక్కని ఆరోగ్యము లభించును.
14.	ప్రాణాపాయ సంకటములు, ఆపదలు అన్నియూ నివారణమగును.
15.	సమస్త తీర్థయాత్రా ఫలము సిద్ధించును.
16.	పెద్దలను ధిక్కరించిన దోషము పరిహరింపబడును. సద్గుర్వనుగ్రహము లభించును, ఉత్తమ విద్య ప్రాప్తించును.
17.	గొప్ప విద్య లభించును. మందబుద్ధి నశించును.
18.	దారిద్ర్యబాధ నశించును. లక్ష్మీకటాక్షము లభించును.
19.	గురుభక్తి లభించును. కాశీ, గయా, ప్రయాగ యాత్రా ఫలము లభించును.

20-21.	(ఈ రెండు అధ్యాయములను ఏకముగా పఠింపవలెను. మధ్యలో ఆపగూడదు). సంతానము లేనివారికి, సంతానము నిలువని వారికి దీర్ఘాయుష్మంతులైన పుత్రసంతానము లభించును. అపమృత్యువు తొలగి పోవును. భయంకరమైన వ్యాధులు సమసిపోవును.
22.	దీనత్వము, కటిక దారిద్ర్యబాధ కూడా తొలగిపోవును.
23.	భూత, ప్రేత, పిశాచాదుల వంటి గ్రహబాధలు నశించును. గృహవాస్తు దోషములు నివారింపబడును. మానసికశాంతి లభించును.
24.	విపరీతభావనలు తొలగిపోయి గుర్వనుగ్రహము లభించును. తద్వారా దత్తదర్శనము ప్రాప్తించును.
25,26, 27.	ఈ మూడు అధ్యాయములు కలిపి ఏకంగా పఠించవలెను. తద్వారా దురహంకారముతో కూడిన దుర్భావనలు అంతరించును. మానసిక అలజడులు తగ్గిపోయి మానసిక ప్రశాంతత చేకూరును. సద్బుద్ధి, సద్గతి లభించును.
28.	కర్మవిపాక జ్ఞానము కలుగును. గత జన్మల దుష్కర్మలు క్షయమగును. నిత్యకర్మానుష్ఠాన సత్ఫలము లభించును.
29.	బ్రహ్మరాక్షస పిశాచాదులవంటి పీడలు విరగడైపోవును. పరమేశ్వరానుగ్రహము లభించును.
30,31, 32.	దీర్ఘవ్యాధులు నివారింపబడును. మృత్యుంజయత్వము సిద్ధించును. స్త్రీలకు సుదీర్ఘ సౌభాగ్యము లభించును. సత్సంతాన ప్రాప్తి (ఈ మూడు అధ్యాయాలు ఏకంగా ఒకేసారి పారాయణము చేయవలెను.)

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

33.	నీచ జన్మనుండి ఉత్తమ జన్మ లభించును. భగవదనుగ్రహము ప్రాప్తించును.
34.	అపమృత్యువు తొలగిపోవును. అపాయములు దూరమగును. దుష్టనక్షత్ర ప్రభావము తొలగిపోవును. ఆరోగ్యము లభించును.
35.	పరమేశ్వర అనుగ్రహము లభించును. అఖండ సౌభాగ్య, సుమంగళీత్వము సిద్ధించును.
36,37.	ఉత్తమ జ్ఞానము సిద్ధించును. (ఈ రెండు అధ్యాయాలను కలిపి చదువవలెను.)
38.	ధనధాన్యములు సమృద్ధిగా లభించును. ఉదారగుణము లభించును.
39.	సంతానము లేనివారికి సంతానము కలుగును.
40.	కుష్ఠువ్యాధి బాధ నివారింపబడును. ఈశ్వరభక్తి దృఢపడును. నరహరి అను బ్రాహ్మణుడు చేసిన శ్రీనృసింహ సరస్వతీ స్తోత్ర పారాయణము వలన విద్వత్తు లభించి కవిత్వము సిద్ధించును.
41.	కాశీయాత్రా ఫలము లభించును. గురువుయందు దృఢమైన భక్తి సిద్ధించును. సాయందేవుడు చేసిన శ్రీగురుస్తుతిని పఠించుటవలన ఉన్నత స్థితి లభించును.
42.	అనంతుడైన శ్రీకృష్ణభగవానుని అనుగ్రహము ప్రాప్తించును. సకల పాపములు హరించును. శాంతి చేకూరును.
43.	శ్రీశైలక్షేత్ర యాత్రా ఫలము సిద్ధించును.
44.	గురుతత్త్వము బోధపడును. శ్వేతకుష్ఠు, వివిధ చర్మరోగములు హరించును. గురుని అనుగ్రహము వలన మానసిక దోషములు నశించి, చిత్తశాంతి చేకూరును.
45.	గురు స్వరూపస్థితి తెలియును. గురుభక్తి ఇనుమడించును. సమస్త మనోరథములు ఈడేరును.
46.	కోరిన కోర్కెలన్నియును నెరవేరును. గురుమాహాత్మ్యము అవగతమగును.
47.	వ్యవసాయము వృద్ధి నొందును. ధనధాన్యములు సమృద్ధి చెందును
48.	సకల తీర్థ సందర్శన ఫలము సిద్ధించును. సమస్త పాపములు నశించును.
49.	గురు మాహాత్మ్యము, గురుతత్త్వము బోధపడును. శ్రీగురుకృపవలన సంసారము నుండి తరించి మోక్షపదమును పొందెదరు.
50.	క్రిమి సంబంధమైన వ్రణములు, క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు నశించును. పూర్వజన్మ జ్ఞానము లభించును. అమోఘమైన శ్రీగుర్వనుగ్రహము లభించును.
51.	అఖండమైన గురుకృప లభించును. శాంతిసౌఖ్యములు చేకూరును.
52.	శ్రీగురుచరిత్ర పూర్తి గ్రంథ పారాయణము చేసినట్టి శ్రేష్ఠమైన ఫలము లభించును.

శ్లో॥ దత్తాత్రేయం శివం శాంతం సచ్చిదానందమద్వయమ్ ।
ఆత్మరూపం పరం దివ్యం అవధూతముపాస్మహే ॥

॥ జయగురుదత్త – శ్రీగురుదత్త ॥

◆ ◆ ◆

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూతగురో ★

దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా

॥ ఓం నమో భగవతే దత్తాత్రేయాయ ॥

॥ శ్రీపాదశ్రీవల్లభ శ్రీనృసింహసరస్వతీ శ్రీగురుదత్తాత్రేయాయ నమః ॥

శ్రీ దత్తాత్రేయ ప్రాతః స్మరణ స్తోత్రమ్

శ్లో॥ ప్రాతఃస్మరామి కరుణా వరుణాలయం తం
శ్రీదత్త మార్త వరదం వరదండహస్తమ్ ।
సంతం నిజార్తి శమనం దమనం వినీత
స్వాంతర్గతాఖిలమలం విమలం ప్రశాంతమ్ ॥ 1

శ్లో॥ ప్రాతర్భజామి భజదిష్టవరప్రదం తం
దత్తం ప్రసాదసదనం వరహీరదం కమ్ ।
కాంతం ముదాత్రితనయం భవమోక్షహేతుం
సేతుం వృషస్య పరమం జగదాదిహేతుమ్ ॥ 2

శ్లో॥ ప్రాతర్నమామి ప్రయతోఽనసూయా
పుత్రం స్వమిత్రం యమితోఽనసూయాః ।
భూయాంస ఆప్తాప్తమిహార్తబంధుం
కారుణ్యసింధుం ప్రణమామి భక్త్యా ॥ 3

శ్లో॥ లోకత్రయగురోర్యస్తు శ్లోకత్రయ మిదం పఠేత్ ।
శ్రీదత్తాత్రేయ దేవస్య తస్య సంసారభీః కుతః ॥ 4

ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీవాసుదేవానంద సరస్వతీ
విరచితం శ్రీదత్తాత్రేయ ప్రాతఃస్మరణ స్తోత్రమ్ ॥

◆ ◆ ◆

శ్రీ దత్తస్తవ స్తోత్రమ్

నమస్తే భగవన్ దేవ దత్తాత్రేయ జగత్ప్రభో ।
సర్వబాధాప్రశమనం కురుశాంతిం ప్రయచ్ఛ మే ॥ 1
అనసూయాసుత శ్రీశః జనపాతకనాశన ।
దిగంబర నమో నిత్యం తుభ్యం మే వరదో భవ ॥ 2
భూతప్రేత పిశాచాద్యా యస్య స్మరణమాత్రతః ।
దూరాదేవ పలాయంతే దత్తాత్రేయం నమామి తమ్ ॥ 3
యన్నామస్మరణాద్దైన్యం పాపం తాపశ్చ నశ్యతి ।
భీతిగ్రహార్తి దుఃస్వప్నం దత్తాత్రేయం నమామి తమ్ ॥ 4
దద్రుస్ఫోటకకుష్ఠాది మహామారీ విషూచికా ।
నశ్యం త్యన్యేఽపి రోగాశ్చ దత్తాత్రేయం నమామి తమ్ ॥ 5
సంగజా దేశకాలోత్థా అపి సాంక్రామికా గదాః ।
శామ్యంతి యత్స్మరణతో దత్తాత్రేయం నమామి తమ్ ॥ 6
సర్ప వృశ్చిక దష్టానాం విషార్తానాం శరీరిణామ్ ।
యన్నామ శాంతిదం శీఘ్రం దత్తాత్రేయం నమామి తమ్ ॥ 7
త్రివిధోత్పాత శమనం వివిధారిష్టనాశనమ్ ।
యన్నామ క్రూరభీతిఘ్నం దత్తాత్రేయం నమామి తమ్ ॥ 8
వైర్యాదికృతమంత్రాదిప్రయోగా యస్య కీర్తనాత్ ।
నశ్యంతి దేవబాధాశ్చ దత్తాత్రేయం నమామి తమ్ ॥ 9
యచ్ఛిష్య స్మరణాత్ సద్యో గతనష్టాది లభ్యతే ।
య ఈశః సర్వతః త్రాతా దత్తాత్రేయం నమామి తమ్ ॥ 10
జయలాభ యశఃకామ దాతుర్దత్తస్య యః స్తవమ్ ।
భోగమోక్ష ప్రదస్యేమం పఠేత్ దత్తప్రియో భవేత్ ॥ 11

॥ ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీవాసుదేవానంద సరస్వతీ విరచితం శ్రీదత్త స్తవ స్తోత్రమ్ ॥

◆ ◆ ◆

దత్త గురో దత్త గురో దత్తాత్రేయ అవధూత గురో

శ్రీ దత్తాత్రేయ కవచమ్

(ఈ కవచమును శ్రద్ధతో నిత్యము పఠించువారిని
దత్తాత్రేయులవారు రక్షించి కాపాడెదరు.)

శ్రీపాదః పాతు మే పాదౌ ఊరూ సిద్ధాసనస్థితః ।
పాయా ద్దిగంబరో గుహ్యాం నృహరిః పాతు మే కటిం ॥

నాభిం పాతు జగత్ స్రష్టా ఉదరం పాతు దలోదరః ।
కృపాళుః పాతు హృదయం షడ్భుజః పాతు మే భుజౌ ॥

స్రక్కుండీ శూల దమరు శంఖ చక్రధరః కరాన్
పాతు కంఠం కంబుకంఠం సుముఖః పాతు మే ముఖమ్ ॥

జిహ్వాం మే వేదవాక్పాతు నేత్రం మే పాతు దివ్యదృక్ ।
నాసికాం పాతు గంధాత్మా పాతు పుణ్యశ్రవాః శ్రుతీ ॥

లలాటం పాతు హంసాత్మా శిరః పాతు జటాధరః ।
కర్మేంద్రియాణి పాత్వీశః పాతు జ్ఞానేంద్రియాణ్యజః ॥

సర్వాంతరోంతః కరణం ప్రాణాన్మే పాతు యోగిరాట్ ।
ఉపరిష్టా దధస్తాచ్చ పృష్ఠతః పార్శ్వతోఽగ్రతః ॥

అంతర్బహిశ్చ మాం నిత్యం నానారూపధరోఽవతు ।
వర్జితం కవచేనాస్యాత్ స్థానం మే దివ్యదర్శనః ॥

రాజతః శత్రుతో హింసాత్ దుష్ప్రయోగాదితో ఘ్నతః ।
అధివ్యాధి భయార్తిభ్యో దత్తాత్రేయ స్సదాఽవతు ॥

ధనధాన్య గృహక్షేత్ర స్త్రీ పుత్ర పశుకింకరాన్ ।
జ్ఞాతీం శ్చ పాతు మే నిత్యం అనసూయానంద వర్ధనః ॥

బాలోన్మత్త పిశాచాభో ద్యునిట్ సంధిషు పాతు మాం ।
భూతభౌతిక మృత్యుభ్యో హరిః పాతు దిగంబరః ॥

యోఽపి తద్దత్త కవచం సన్నహ్యేత్ భక్తిభావితః ।
సర్వానర్థవినిర్ముక్తో గ్రహపీడా వివర్జితః ॥

భూతప్రేత పిశాచాద్యైః దేవై రప్యపరాజితః ।
భుక్త్వాఽత్ర దివ్యాన్భోగాన్ సః దేహాంతే తత్పదం వ్రజేత్ ॥

॥ ఇతి శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీవాసుదేవానంద సరస్వతీ
స్వామి సద్గురు విరచితం దత్తకవచం సంపూర్ణం ॥

◆ ◆ ◆

జయలాభాదికర శ్రీ దత్తాత్రేయ స్తవమ్

దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్తవత్సలం
ప్రపన్నార్తి హారం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 1 ॥

దీనబంధుం కృపాసింధుం సర్వకారణ కారణం
సర్వ రక్షాకరం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 2 ॥

శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణం
నారాయణం విభుం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 3 ॥

సర్వానర్థహారం దేవం సర్వ మంగళ మంగళం
సర్వక్లేశ హారం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 4 ॥

శోషణం పాప పంకస్య దీపనం జ్ఞానతేజసః
తాప ప్రశమనం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 5 ॥

సర్వరోగ ప్రశమనం సర్వపీడా నివారణం
ఆపదుద్ధరణం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 6 ॥

బ్రహ్మణ్యం ధర్మ తత్త్వజ్ఞం భక్త కీర్తి వివర్ధనం
భక్తాభీష్టప్రదం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 7 ॥

జన్మసంసార బంధఘ్నం స్వరూపానంద దాయకం
నిశ్శ్రేయస ప్రదం వందే స్మర్తృగామీ సమాఽవతు ॥ 8 ॥

జయలాభ యశః కామ దాతుర్దత్తస్య యః స్తవం
భోగమోక్ష ప్రదస్యేమం ప్రపఠేత్ సకృతీ భవేత్ ॥ 9 ॥

॥ ఇతి శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి విరచితం జయలాభాదికర శ్రీదత్తాత్రేయ స్తవమ్ సంపూర్ణమ్ ॥

◆ ◆ ◆

శ్రీదత్తాత్రేయ ఉత్తర మాలా

అస్యశ్రీ మాలామహామంత్రస్య సదాశివ ఋషిః । అనుష్టుప్ఛందః । శ్రీదత్తాత్రేయో దేవతా । ఓమితి బీజం । స్వాహేతి శక్తిః । ద్రామితి కీలకం । జపే వినియోగః ॥ ద్రామిత్యాదిన్యాసః ॥

కాశీ కోల్లా మాహూరీ సహ్యకేషు,
స్నాత్వా జప్త్వా ప్రాశ్యతే చాన్వహం యః ।
దత్తాత్రేయ స్తత్ క్షణాత్ స్మర్తృగామీ
త్యాగీ భోగీ దివ్యయోగీ దయాళుః ॥

ఓం నమో భగవతే దత్తాత్రేయాయ, స్మరణమాత్ర సంతుష్టాయ, మహాభయనివారణాయ, మహాజ్ఞానప్రదాయ, సచ్చిదానందాత్మనే, బాలోన్మత్త పిశాచ వేషాయ, మహాయోగినే అవధూతాయ, అనసూయానంద వర్ధనాయ, అత్రిపుత్రాయ, సర్వకామఫలప్రదాయ, ఓం భవబంధ విమోచనాయ, ఆం అసాధ్యసాధనాయ, హ్రీం సర్వవిభూతిదాయ, క్రౌం అసాధ్యాకర్షణాయ, ఐం వాక్ప్రదాయ, క్లీం జగత్ వశీకరణాయ, సౌః సర్వ మనః క్షోభణాయ, శ్రీం మహాసంపత్ప్రదాయ, గ్లౌం భూమండలాధిపత్యప్రదాయ, ద్రాం చిరంజీవినే, వషట్ వశీకురు వశీకురు, వౌషట్ ఆకర్ష యాకర్షయ, హాం విద్వేషయ విద్వేషయ, ఫట్ ఉచ్చాట యోచ్చాటయ, ఠః ఠః స్తంభయ స్తంభయ, ఖేం ఖేం మారయ మారయ, నమః సంపన్నాయ సంపన్నాయ స్వాహా, పోషయ పోషయ, పరమంత్ర పరయంత్ర పరతంత్రాణి ఛింది ఛింది, గ్రహాన్ నివారయ నివారయ, వ్యాధీన్ వినాశయ వినాశయ, దుఃఖం హరయ హరయ, దారిద్ర్యం విద్రావయ విద్రావయ, దేహం పోషయ పోషయ, చిత్తం తోషయ తోషయ, సర్వమంత్రస్వరూపాయ సర్వయంత్ర స్వరూపాయ । సర్వతంత్ర స్వరూపాయ, సర్వపల్లవ స్వరూపాయ, ఓం నమో మహాసిద్ధాయ స్వాహా ॥

◆ ◆ ◆

శ్రీ దత్త దశనామ స్తోత్రమ్

దత్తాత్రేయో హరిః కృష్ణః ఉన్మత్తానందదాయకః
మునిః దిగంబరో బాలః పిశాచో జ్ఞానసాగరః ॥

ఏతాని దశనామాని సర్వకాలే సదా పఠేత్
భూతాఽపస్మార కుష్ఠాది తాపజ్వర నివారణం ॥

◆ ◆ ◆

★ దిగంబరా దిగంబరా శ్రీపాదవల్లభ దిగంబరా ★

శ్రీ దత్తాత్రేయ ద్వాదశనామ స్తోత్రమ్

ప్రథమంతు మహాయోగీ ద్వితీయం ప్రభురీశ్వరః
తృతీయం తు త్రిమూర్తిశ్చ చతుర్థం జ్ఞానసాగరః ॥
పంచమం జ్ఞానవిజ్ఞానః షష్ఠంతు సర్వమంగళః
సప్తమం పుండరీకాక్షో హ్యష్టమం దేవవల్లభః ॥
నవమం దేవదేవేశో దశమం నందనాయకః
ఏకాదశం మహారుద్రో ద్వాదశం కరుణాకరః ॥
ఏవం ద్వాదశనామాని దత్తాత్రేయ మహామునేః
కీర్తయన్ పురుషో లోకే సర్వపాపైః ప్రముచ్యతే ॥

ఫలశ్రుతిః

మంత్రరాజ మిదం ఖ్యాతం దత్తాత్రేయ మహామునేః ।
సర్వపాపహరం శ్రేష్ఠం సర్వకామప్రదం శుభం ॥
క్షయాపస్మార కుష్ఠాది తాపజ్వరనివారణం ।
రాజద్వారే భయే ఘోరే సంగ్రామేషు జలాంతరే ॥
గిరౌ గుహాంతరేఽరణ్యే వ్యాఘ్రచోరభయం న హి ।
ఆవర్తనసహస్రేషు లభతే వాంఛితం ఫలం ॥
త్రికాలం యః పఠేన్నిత్యం మోక్షసిద్ధి మవాప్నుయాత్ ।
దత్తాత్రేయః సదారక్షేత్ ఋషి స్సత్యం న సంశయః ॥
విద్యార్థీ లభతే విద్యాం రోగీ రోగాత్ ప్రముచ్యతే ।
అపుత్రీ లభతే పుత్రం ధనార్థీ లభతే ధనం ॥
అభార్యో లభతే భార్యాం సుఖార్థీ లభతే సుఖం ।
ముచ్యతే సర్వపాపేభ్య స్సర్వదా విజయీభవేత్ ॥

ఇతి శ్రీ వేదవ్యాస విరచితం
శ్రీ దత్తాత్రేయ ద్వాదశనామ స్తోత్రం సంపూర్ణం ॥

చిత్త స్థిరీకరణ శ్రీ దత్తాత్రేయ స్తోత్రమ్

అనసూయాత్రి సంభూత దత్తాత్రేయ మహామతే ।
సర్వదేవాధిదేవ త్వం మమచిత్తం స్థిరీకురు ॥

శరణాగతదీనార్త తారకాఖిలకారక ।
సర్వచాలకదేవ త్వం మమచిత్తం స్థిరీకురు ॥

సర్వమంగళ మాంగళ్య సర్వాధివ్యాధి భేషజ ।
సర్వసంకట హారిన్ త్వం మమచిత్తం స్థిరీకురు ॥

స్మర్తృగామీ స్వభక్తానాం కామదో రిపునాశనః ।
భుక్తిముక్తి ప్రదః స త్వం మమచిత్తం స్థిరీకురు ॥

సర్వపాపక్షయకరః తాపదైన్య నివారణః ।
యోఽభీష్టదః ప్రభుః స త్వం మమచిత్తం స్థిరీకురు ॥

య ఏతత్ ప్రయతః శ్లోకపంచకం ప్రపఠేత్ సుధీః ।
స్థిరచిత్తః స భగవత్ కృపాపాత్రం భవిష్యతి ॥

॥ ఇతి శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ వాసుదేవానంద
సరస్వతీ విరచితం చిత్త స్థిరీకరణ శ్రీదత్తస్తోత్రం సంపూర్ణమ్ ॥

◆ ◆ ◆

★ దత్తగురో దత్తగురో దత్తాత్రేయ అవధూత గురో ★

गीताप्रेस गोरखपुर

GITA PRESS, GORAKHPUR [SINCE 1923]

Gita Press, Gorakhpur—273005
Ph. (0551) 2334721, 2331250, 2331251